# Jagityāla Zillā Jānapada kathalu - Pariśīlana

(A Thesis submitted to the University of Hyderabad in partial fulfillment of the Degree of Doctor of Philosophy in Telugu)

**Researcher**
**MADISHETTI ABHISHEK**
**15HTPH01**

**Supervisor**
**Dr. D. VIJAYA KUMARI**

**Department of Telugu**
**School of Humanities**
**University of Hyderabad**
**Hyderabad - 500 046**
**Telangana, India**
**December - 2020**

# జగిత్యాల జిల్లా జానపద కథలు – పరిశీలన

(పిహెచ్. డి. పట్టాకోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం)


పరిశోధన

**మాడిశెట్టి అభిషేక్**

పర్యవేక్షణ

**డా. డి. విజయ కుమారి**

**తెలుగు శాఖ**

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500 046

తెలంగాణ, భారతదేశం


డిసెంబరు – 2020

# DECLARATION

I, **Madishetti Abhishek,** hereby declare that this Thesis entitled ***"Jagityāla Zillā Jānapada kathalu - Pariśīlana"*** Submitted by me under the guidance and supervision of **Dr. D.Vijaya Kumari** is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodganga/ INFLIBNET

Date: **MADISHETTI ABHISHEK**

Place: Hyderabad Regd. No.15TPH01

# CERTIFICATE

This is to certify the Thesis entitled ***"Jagityāla Zillā Jānapada kathalu - Pariśīlana"*** submitted by **Mr. Madishetti Abhishek,** bearing **Regd. no. 15HTPH01** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

1. "**saavukari kodalu jaanapada kathalo stree chaathuryam"** (ISBN NO: 978-93-87540-42-2), Pg. no: 251-259, November 2018. "Vyasa Deepika (Essays)". edited by P. Usharani Published by Roshan Publications, Visakahapatanam.
2. "**konni jaanapada kathalu - vishlesana"** (ISBN NO: 978-82-930-476-5-1), Pg.no: 408-411, December, 2017. "Short Stories in Dravidian Languages" edited by Dr. P. Sivaraji. Published by Uro Publications, Jabarpettai, Tamilnadu.

**B. Presented in the following conferences:**

1 . **"jagityala zilla jaanapada kathalu - hasyam"** (National Seminar), by The Department of Telugu and English, MVN, JS & RVR College Of Arts & Science Malikipuram, East. Godavari, AP. On 12th- 13th August, 2017.
2. **"jaanapada kathalu – samajika prayojanam"** (National Seminar), by peta Srinivasulu reddy, Jaanapada Saahitya Parishathu, Rajarajeswara Arts Academy and Sri Venkateswara University, Dept of Telugu, Tirupati. On 17th – 18th December 2018.

Further, the Student has passed the following courses towards fulfillment of coursework requirement for Ph.D./was exempted from doing coursework (recommended by Doctoral Committee) on the basis of the following courses passed during his M. Phil., program and the M.Phil, degree was awarded.

| Course Code | Name | Credits | pass/fail |
|---|---|---|---|
| 1. TL700 | Research Methodology | 4.00 | PASS (A) |
| 2. TL701 | History of Telugu Research | 4.00 | PASS (A) |
| 3. TL702 | Studies in Specialized Area | 4.00 | PASS (A) |
| 4. TL703 | Broad Field | 4.00 | PASS ($A^+$) |
| 5. TL780 | Dissertation | 16.00 | PASS (A) |

| Dr. D. VIJAYA KUMARI | Prof. G. ARUNA KUMARI | Prof. S. SARATHJYOTHSNA RANI |
|---|---|---|
| **Research Supervisor** | **Head, Telugu** | **Dean, Humanities** |

# కృతజ్ఞతలు

కనకున్న కన్నకొడుకులాగా తన కొడుకులతో సమానంగా చూసుకొని పెంచి పెద్ద చేసిన మా అమ్మమ్మ, తాతయ్యలు రాపర్తి శాంతమ్మ, క్రీ.శే. నర్సయ్య గార్లకు మా కుటుంబ ఆర్థిక జీవనగతి గడ్డుగా సాగుతున్న తరుణంలో నాన్న బాధ్యతను తన మీదేసుకొని, ఊపిరి పీల్చుకోని కష్టాల నడుమ మమ్మల్ని ఏ లోటు రాకుండా పెంచి పెద్ద చేసిన మా అమ్మ గుండమ్మకు, నిరంతరం నా బాగోగులను పట్టించుకుంటూ నా వెన్నంటే ఉండి ఆర్థికంగా ఏ లోటు వచ్చినా మేము ఉన్నామంటూ కష్టపడే తత్త్వాన్ని నేర్పిన మా మామయ్యలు రాపర్తి రమేష్, సతీష్, రాము, లక్ష్మణ్‌లకు, ఎల్లప్పుడూ నా శ్రేయస్సులను ఆశిస్తూ అభి అంటూ అప్యాయతల మధ్య ముంచెత్తే మా కుటుంబ సభ్యులు నాన్న మల్లేశం, అక్క అనూష, తమ్ముడు సాయి, బావ ఓదెలు సురేష్‌కు, కోడలు అశ్వితలకు, అల్లుళ్ల ధార్మిక్, నిహన్ష్ లకు, ఇంకా నా అభ్యున్నతిని, అభివృద్ధిని ఆశించే మిగిలిన మా కుటుంబ సభ్యులందరికీ పేరు పేరున నా శతకోటి వందనాలు....

జానపద సాహిత్య పాఠాలు చెప్పి, జానపద సాహిత్య పరిశోధన వైపు నన్ను మళ్లించడమే కాకుండా నేను ఎంచుకున్న పరిశోధనాంశాన్ని సహృదయంతో మన్నించి పర్యవేక్షణ బాధ్యతలు స్వీకరించిన మాతృసమానురాలు, అమృత హృదయులు డా. డి. విజయ కుమారి గారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు,

ఎల్లప్పుడూ నన్ను ఆప్యాయంగా పలుకరించే సౌజన్య మూర్తులు, తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య గడ్డ అరుణ కుమారి గారికి, ఏ గురువు చూపని స్నేహభావాన్ని చూపి నిత్యం మా అభ్యున్నతిని ఆశించే ఆత్మీయ గురువులు డా. బాణాల భుజంగరెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు,

ముందుగా నాకు పరిశోధన అవకాశం కల్పించిన హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగుశాఖకు నా ధన్యవాదాలు. నా పరిశోధనకు, అకాడమిక్ పనులకు తమ వంతు సహాయం అందించిన భవానీ శంకర్, రాంబాబు, బాలాజీ, మధు, రాజశేఖర్ గార్లకు

నాకు నా పరిశోధనకు సహకరించిన మానవీయ శాస్త్రాల విభాగ అధ్యక్షురాలు ఆచార్య శరత్ జోత్స్న రాణి గారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, ఆచార్య ఆర్. వి. ఆర్ కృష్ణశాస్త్రి గారికి, ఆచార్య పిల్లలమర్రి రాములు గారికి, ఆచార్య గోనా నాయక్ గారికి, ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి, ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు గారికి, డా. పమ్మి పవన్ కుమార్ గారికి, డా. డి . విజయలక్ష్మి గారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు,

వృత్తి పని చేసుకుంటూ మిడి మిడి చదువులు చదువుతున్న నాలాంటి పేద విద్యార్థులెందరినో విశ్వవిద్యాలయ స్థాయికి చేరుకోవడానికి అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రేరణనిచ్చిన మా మాజీ డిగ్రీ ప్రిన్సిపల్, ఆత్మీయ గురువులు డా. జైకిషన్ గారికి, వారి మిత్రులు కుర్రా జితేంద్రబాబు గారికి; నా పట్ల నా చదువు పట్ల స్వంత అన్నల్లాగా బాధ్యతను తీసుకుని సమయానికి తగిన విధంగా సలహాలను అందిస్తూ మార్గదర్శకులైన కల్యాడపు రమేష్, జక్కుల రాయమల్లు, మెరుగు రాంచందర్, గరిగె రాజేష్, దివిటి శ్రీధర్, గండ్ర మహేష్, కిష్టయ్య అన్నలకు; విశ్వవిద్యాలయాల్లో తొలుత అడుగుపెట్టినప్పుడు చేదోడు వాదోడుగా ఉన్న సంతోష్, తిరుపతిలకు; ఇంకా జూనియర్ మిత్రులకు గట్ల వెంకటస్వామి, సంద రాము, జనార్దన్, కల్యాడపు శ్రవణ్, తుడుం మోహన్‌లకు

పరిశోధనాంశాన్ని తెలిపి, వస్తు సేకరణ సంబంధమైన భయాన్ని వ్యక్తీకరించినపుడు వెన్ను తట్టి జానపద కథకుల వివరాలను తెలిపిన జానపద పరిశోధానుభవం కలిగిన వారు తాటికాయల భోజన్నకు, కళాశాల విద్యార్థులకు కథలను సేకరించేలా చేసి వారిలో పరిశోధనా స్ఫూర్తిని నింపి, వారు సేకరించిన కథలను నాకు పంపి సహకరించిన జానపద పరిశోధకులు గొల్లపెల్లి అశోక్ అన్నకు, నా పరిశోధనా గ్రంథాన్ని ఎంతో ఒర్పుతో చదివి తన పరిశోధనానుభవంతో వివేచించి మంచి సలహాలను ఇచ్చిన బూర్ల చంద్రశేఖరు అన్నకు, ఆలాగే పరిశోధనలో సమయానికి తగిన విధంగా సూచనలను అందించిన తన్నీరు సురేష్, గుంపుల ప్రభాకర్ అన్నయ్యలకు; శ్రీలత, స్రవంతి, శరణ్య అక్కలకు

కథలు సేకరించడంలోనే కాకుండా స్వయంగా కథలు చెప్పిన జానపద కథకుడు కైరం రమణ గారికి, అతని సహాయంతో కథలను అందించిన మిగతా జానపద కథకులకు నా ధన్యవాదాలు.

కథలు సేకరించడంలోనూ, సేకరించిన కథలను స్వయంగా రికార్డు చేసి వాట్సప్‌లో పంపిన చెల్లెలు రాపర్తి రాణి, కాశెట్టి సింధూజ, పులి శారదలకు; జానపద కథల సేకరణకు బయలుదేరినప్పుడు కథకుల వివరాలు తెలుసుకోవడంలో సహాయం అందించిన నా చిరకాల మిత్రులు భోగ మల్లేశ్, చిట్టన్నోజు కిరణ్, భోగ మహేష్, అంజి ఇంకా ఇతర మిత్రులకు; తమ్ముళ్లు మాడిశెట్టి నవీన్, సాయి కుమార్, సాయికృష్ణలకు,

నా పరిశోధనా గ్రంథాన్ని ఎంతో ఓర్పుతో చదివి, సమయానికి తగిన సలహాలు, సూచనలను అందించిన ధారవత్ సంతోష్ అన్నకు, అరుణ అక్కకు, శ్రీకాంత్ అన్నకు; అలాగే నా క్లాస్‌మేట్స్ చందు, శ్రీధర్, గురజాడ, ప్రవీణ్, సునీల్ రెడ్డి, కంటం కృష్ణలకు,

పరిశోధనా రంగంలోనే కాకుండా జీవితంలో అన్ని రంగాల్లో నన్ను ప్రోత్సహించి, ఎల్లప్పుడూ నా శ్రేయస్సునే కోరుకుని ఎంతో ప్రేమాప్యాయతలను పంచి పెట్టిన మా అత్తమామలు ఐనాల సావిత్రి పిచ్చయ్యలకు, అక్క కృష్ణవేణి బావ భరత్‌లకు,

ఇంకా నా ఈ పరిశోధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన సీనియర్ జూనియర్ మిత్రులందరికీ కృతజ్ఞత **అభి** వందనాలు...

అందరికీ మించి ఎల్లవేళలా నా తోడుండి, నా కష్టసుఖాలను సమానంగా పంచుకుంటూ, నిత్యం నాలో ధైర్యాన్ని నింపుతూ నా పరిశోధనకు అన్ని విధాలా సహకరించిన నా జీవిత భాగస్వామి, అర్ధాంగి, సహచారిణి మాడిశెట్టి భార్గవికి, నా ప్రేమ ప్రపంచమైన చిరంజీవి మాడిశెట్టి రుద్రాన్ష్‌కీ నా శుభాశీస్సులు..

# ముందుమాట

జానపద సాహిత్యం ఎంతో విశాలమైంది, విస్తృతమైంది. అందులో జానపద కథ వచన శాఖకి చెందిన విశిష్టమైన విభాగం. చిన్న పెద్ద ముసలి ముతక ఇలా అందరిని అలరింపజేసే సార్వజనీన సమ్మతమైన ప్రక్రియ. మానవుని మనుగడ నుంచి నేటి వరకు సాగిన సామాజిక పరిణామానలంతటిని తనలో నింపుకుని మరల తరచి చూసుకునే విధంగా ఉంటుంది ఈ ప్రక్రియ. ఒక తరం నుంచి మరొక తరానికి మధ్య వారధిగా నిలుస్తూ వచ్చిన మౌఖిక సాహిత్యాన్ని అధ్యయనం చేయడానికి అవకాశం వచ్చినందునకు సంతోషిస్తున్నాను. చిన్నప్పటి నుంచి కథల మీద ఉన్న ఆసక్తి కొంత, ఎం.ఎ లో డా. డి. విజయకుమారి గారి జానపద సాహిత్య పాఠాల బోధన ప్రభావం మరికొంత ఈ పరిశోధనాంశాన్ని ఎన్నుకోవడానికి ప్రధాన కారణాలయ్యాయి. నా బాల్యంలో మా ఇంటి సమీపంలో చిట్టన్నోజు అమ్మాయక్క అనే జానపద కథకురాలు చెప్పిన కథలు అవి నాడు అలరించిన తీరు నాపై విశేష ప్రభావం చూపాయి. కాలక్షేపానికి చెప్పిన కథలు కొన్ని అయితే, మాలో బుద్ధిని, నీతిని పెంపొందించడానికి చెప్పిన కథలు మరికొన్ని. అలాంటి కథలను కూడా సేకరించి అధ్యయనం చేయవచ్చన్న అభిప్రాయాన్ని డా. డి. విజయకుమారి మేడం గారి జానపద సాహిత్య పాఠాలు తెలియజేసాయి. ఆ జానపద పాఠాలే నా ఈ పరిశోధనకు నాంది. అలాగే గురు సమానులు, జానపద సాహిత్య పరిశోధకుడు తాటికాయల భోజన్న ప్రోద్బలం కూడా నా పరిశోధన ఎన్నికకు ఊతమిచ్చింది. నా స్వస్థలం జగిత్యాల జిల్లా కాబట్టి కొత్తగా ఆవిర్భవించిన జిల్లా అయిన జగిత్యాల జిల్లా జానపద కథలను సేకరించి అధ్యయనం చేయాలన్న ఆశ నాలో కలిగింది. అందుకే 'జగిత్యాల జిల్లా జానపద కథలు – పరిశీలన' అనే అంశాన్ని పిహెచ్.డి పట్టా కోసం ఎంచుకున్నాను.

జానపద కథలను సేకరించడానికి బయలుదేరినప్పుడు నాకు జానపద కథలు చెప్పే వారు ఒక్కరు కనిపించలేదు. ప్రపంచీకరణ, టెలివిజన్, మొబైల్ ఫోన్లు, సినిమాలు, సీరియల్స్ ఇలా అనేకానేక అవాంతరాల వల్ల నానాటికి అంతరించి పోతూ, అడుగంటుకుంటున్న జానపద సాహిత్యాన్ని ప్రోత్సహించేవారు, ఆదరించేవారు లేరు. కాబట్టి నా పరిశోధనకు సంబంధించిన సమాచారాన్ని

సేకరించడానికి వెళ్లినప్పుడు మొదట్లో కొన్ని ఇక్కట్లు తప్పలేదు. జానపద కథల కోసం ముందుగా చారిత్రక స్థలమైన వెల్గటూరుకి వెళ్లాను. అక్కడ జానపద కథలు చెప్పే వారు ఉన్నప్పటికి కథలు చెప్పడానికి ఒక్కరు కూడా ముందుకు రాలేదు. అలాగే స్తంభంపెల్లి, నేరెల్ల, నాగారాం, కమలాపూర్, రామయ్యపల్లె ఇలా మా ఊరి సమీప గ్రామాల్లో ఒక్క కథ కూడా లభించలేదు. కొద్ది రోజుల తరువాత మా బంధువులు, స్నేహితుల సహాయంతో వారికున్న పరిచయాల ద్వారా జానపద కథలు సేకరించ గలిగాను. నా జానపద కథల అన్వేషణలో నాకు దొరికిన జానపద సాహిత్య మణిపూస కైరం రమణ గారు. వారి సహకారంతో చాలా వరకు జానపద కథలను సేకరించగలిగాను. పల్లెల్లో నానాటికీ అంతరించిపోతున్న జానపద కథలను, సామెతలను, జాతీయాలను ఒడిసిపట్టుకుని ప్రత్యేక ఆసక్తితో ప్రవృత్తిగా చేసుకుని వివిధ అంతర్జాల మాధ్యమాల్లో పంచుకుంటున్నారు. ఈ పరిశోధనకు అలాంటి వారు దొరకడం నా అదృష్టం. జానపద కథలకు సంబంధించిన వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధకులు పలు పరిశోధన గ్రంథాలు సమర్పించారు. నా ఈ పరిశోధనకు ఆ పూర్వ పరిశోధన గ్రంథాలు ఎంతగానో ఉపయోగపడి మార్గనిర్దేశం చేశాయి. ఆయా పరిశోధకులందరికి నా ప్రత్యేక ధన్యవాదాలు. తెలుగు జానపద సాహిత్యంలో కథకు సంబంధించిన బృహత్ గ్రంథ రూపకల్పనకు ఇలాంటి పరిశోధనలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆశిస్తున్నాను.

## పరిశోధన నేపథ్యం

జానపద సాహిత్యానికి ఎంతో పూర్వవైభవం ఉంది. జానపదం అనగానే పల్లెలు, పల్లె వాతావరణం. జానపదులు అనగానే ఆ పల్లె వాతావరణంలో నివసించే ప్రజలు అని అర్థం. జానపద సాహిత్యం ఒక సమూహానికి సంబంధించిన అమూల్యమైన ధనరాశిగా చెప్పవచ్చు. జానపద సాహిత్యం ఎప్పటికీ తరగని సంపద. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి, ఒక సమూహం నుండి మరొక సమూహానికి, ఒకరి నోటి నుండి మరొకరి నోటికి నిరంతరం సాగే ప్రవాహిని జానపద సాహిత్యం. అలాంటి జానపద సాహిత్యం మానవుని నేటి అత్యాధునిక సాంకేతికాభివృద్ధి, ఆధునికీకరణ వల్ల అంతరించిపోవడం జరుగుతుంది. కాబట్టి నేటి యువ పరిశోధకులపై అపూర్వమైన జానపద విజ్ఞాన

బాండగారాన్ని పరిరక్షించే బాధ్యత ఉంది. జానపద విజ్ఞానం పరిధి విస్తృతమైనది. జానపద విజ్ఞానమనేది గేయాలు, గేయకథలు, పురాగాథలు, స్థలపురాణాలు, కులపురాణాలు, కథలు, సామెతలు, పొడుపుకథలు, కళారూపాలు, ఆచారాలు, జాతరలు, ఉత్సవాలు, పండుగలు, దేవతలు, ఆటపాటలు, ఆరోగ్య జాగ్రత్తలు, వంటలు, అలంకరణలు, ఆభరణాలు, నిల్వ చేసుకునే పద్ధతుల లాంటి బహుముఖ రూపాలలో కనిపిస్తాయి. వీటిలో జానపద కథలకు ప్రముఖ స్థానం, ప్రత్యేకతలు ఉన్నాయి. మానవుడు సంఘ జీవన విధానాన్ని ప్రారంభించిన దశ నుండే కథలను చెప్పుకోవడం మొదలు పెట్టి ఉంటారని భావిస్తారు. మానవుడి ఉనికి ప్రారంభం నుండి నేటి సమాజం వరకు జరిగిన పరిణామక్రమంలో తమ జీవనశైలిలో జరిగిన సంఘటనలను సాహిత్యకీకరించడం జరుగుతూనే ఉంది. అది మౌఖికంగానైనా, లిఖితంగానైనా సాహిత్య సృజన చేయబడుతుంది. అలా నేటి కాలానికి అంతరించిపోవడానికి సిద్ధంగా ఉన్న జానపద సాహిత్యాన్ని రికార్డు చేయడం లక్ష్యం కావాలి. ఆ ఉద్దేశ్యంతోనే నాకున్న పరిశోధన అవకాశాన్ని వినియోగించుకొని జానపద సాహిత్యంలో భాగమైన జానపద కథలను సేకరించి, అధ్యయనం చేయాలని జగిత్యాల జిల్లా జానపద కథలను పరిశోధనాంశంగా తీసుకున్నాను.

## పరిశోధన పరిధి

తెలంగాణ ప్రభుత్వం 11 అక్టోబర్ 2016లో పరిపాలనా సౌలభ్యం కొరకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 10 జిల్లాలను విభజించి 33 జిల్లాలుగా ఏర్పరిచారు. వాటిలో జగిత్యాల జిల్లా ఒకటి. జగిత్యాల జిల్లాకు చారిత్రకంగా, రాజకీయంగా ఒక విశిష్ట స్థానముంది. నేను జగిత్యాల జిల్లా స్థిర నివాసి కావడం వల్ల నా పి. హెచ్‌డి కాలపరిమితి దృష్ట్యా "జగిత్యాల జిల్లా జానపద కథలు – పరిశీలన" అనే అంశాన్ని ఎన్నుకున్నాను. జగిత్యాల జిల్లాలో క్షేత్ర పర్యటన ద్వారా జనపదాల్లో మౌఖిక రూపంలో ఉన్న జానపద కథలను సేకరించి అధ్యయనం చేయడం నా పరిశోధనాంశ పరిధి.

## పరిశోధన ఆవశ్యకత

జానపద కథలు ప్రాచీన కాలంలో నుండి మౌఖిక ప్రసారంలో ఒకరి నుండి మరొకరికి అందించబడ్డాయి. కథల్ని చెప్పింది పూర్వీకులు. కథల్ని చెప్పడం, వినడం మనకు చాలాకాలంగా వచ్చిన అలవాటు. పిల్లల్ని మొదలుకొని యువకులు, వృద్ధులు, స్త్రీలు, చదువుకున్నవారు, చదువుకోలేని వారు ఇలా ఆయా వయస్సు వారి మనోభావాలకు అనుగుణంగా కథలు చెప్పబడి మనలో అనాది కాలం నుండి నేటికి మౌఖిక రూపంలో నిలదొక్కుకున్నాయి. కానీ నేటి ఆధునిక సమాజం పాశ్చాత్య సంస్కృతి వైపు అడుగులు వేస్తుంది. పాశ్చాత్య సంస్కృతి, సంప్రదాయాలను వీపరితమైన ఆపేక్ష, వ్యామోహంతో పెంచి పోషిస్తారు. ఈనాటి పిల్లలు మన పూర్వీకుల్లా తాతలనూ, అమ్మమ్మలనూ పీడిస్తూ కథలను చెప్పమని కోరడం అరుదుగా కనిపిస్తుంది. ఇప్పుడంతా కంప్యూటర్ యుగం, డిజిటల్ కాలం అంటూ పొద్దస్తమానం ట్యాబ్‌ల్లో, మొబైల్ ఫోన్లల్లో కాలాయాపనం చేస్తూ మన సాహిత్య, సంస్కృతులపై అనాసక్తి పెంచుకుంటున్నారు. కాబట్టి కనుమరుగైపోతునన్న మన జానపద సాహిత్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది. అలా పరిరక్షించిన జానపద సాహిత్యాన్ని కాలపరిణామానికి దీటుగా అందరికీ అందుబాటులో ఉండే విధంగా సమాచారాన్ని అంతర్జాలంలో నిక్షిప్తం చేసి ఉండాలి.

మన పూర్వ సంస్కృతి, సంప్రదాయాలను, జానపద విజ్ఞానభాండగారాన్ని తరువాతి తరాలకు అందించాల్సిన అవశ్యకత ఏంతైనా ఉంది. ఆ దిశగా క్షేత్రస్థాయిలో జానపద సాహిత్య పరిశోధనలు జరగాలి. జానపద సాహిత్య పరిపుష్టికి, పూర్వపరిశోధకులు చేసిన కృషికి ప్రస్తుత ఈ పరిశోధన కొనసాగింపు మాత్రమే. జానపద సాహిత్యంలో మౌఖికంగా ఉన్న జానపద కథల పరిశీలన చేయడానికి ఈ పరిశోధన ఆకరంగా ఉపయోగపడుతుంది. మొత్తానికి ఇలాంటి పరిశోధనలు తెలుగు జానపద సాహిత్యంలో జానపద కథకు సంబంధించిన బృహత్ గ్రంథ రూపకల్పనలో ఎంతగానో ఉపయోగపడతాయని ఆశిస్తున్నాను.

# పూర్వపరిశోధనలు

తెలుగు నాట ప్రచారంలో ఉన్న జానపద కథా సాహిత్యానికి సంబంధించి కొంత మంది పరిశోధకులు తమ తమ అభిరుచులకు అనుగుణంగా, తమదైన శైలిలో విశేషంగా కృషి చేసారు. ప్రస్తుతం కూడా పలు పరిశోధనలు జరుగుతున్నాయి. తమకు లభించిన సమాచారం ప్రకారం మౌఖిక రూపంలో ఉన్న జానపద కథలను రికార్డు చేసి భద్రపరచడమే కాకుండా అధ్యయనం కూడా చేశారు. తెలుగు జానపద కథల మీద జరిగిన ముఖ్యమైన పరిశోధన గ్రంథాలు కింది విధంగా ఉన్నాయి.

1. సుమతి, కె. ***"తెలుగు జానపద కథలు"*** హైదరాబాదు: డా. బి. ఆర్. అంబేద్కర్ కళాశాల (పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం – ఉస్మానియా విశ్వవిద్యాలయం) 1980.
2. బాలస్వామి, బుక్కా. ***"మహబూబ్‌నగర్ జిల్లా జానపద కథలు"*** హైదరాబాదు: తెలుగు పరిశోధన ప్రచురణలు (పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం–ఉస్మానియా విశ్వవిద్యాలయం) 1987.
3. పెద్దిరెడ్డి, సి. ***"అనంతరపురం జిల్లా జానపద కథలు"*** (పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం–మైసూరు విశ్వవిద్యాలయం) 1988.
4. నరసమాంబ, కె.వి.ఎస్.ఎల్. ***"తూర్పు గోదావరి జిల్లా జానపద కథలు"*** (పిహెచ్. డి. సిద్ధాంత వ్యాసం–తెలుగు విశ్వవిద్యాలయం) 1989.
5. శ్రీదేవి, వి. ***"వరంగల్ జిల్లా జానపద కథలు – సాంఘిక జీవనం"*** (యం. ఫిల్ పరిశోధన వ్యాసం – కాకతీయ విశ్వవిద్యాలయం) 1991.
6. పద్మారావు. టి. ***"పట్టణ జనపద కథలు – అధ్యయనం"*** (పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం–ఉస్మానియా విశ్వవిద్యాలయం) 1992.
7. మునస్వామి ఆచారి, ఎ. ***"చిత్తూరు జిల్లా జానపద కథల పరిశీలనం"*** (పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం – శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం) 1995.
8. సత్యనారాయణ, కె.వి. ***"నెల్లూరు జిల్లా జానపద కథలు – ఒక పరిశీలన"*** (పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం–శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం) 1998.

9. మోహన్, జి.యన్. ***"తెలుగులో ధార్మిక, సాంస్కృతిక జానపద కథలు"*** శ్రీనివాస పబ్లికేషన్స్ (యం. ఫిల్ పరిశోధన వ్యాసం – బెంగుళూరు విశ్వవిద్యాలయం) 2000.

10. భోజన్న. తాటికాయల. ***"ధర్మపురి మండల జానపద కథలు – సామాజిక పరిశీలన"*** (యం. ఫిల్ పరిశోధన వ్యాసం – హైదరాబాదు విశ్వవిద్యాలయం) 2012.

11. సంతోష్, ధారవత్. ***"తొర్రూరు మండల జానపద కథలు – పరిశీలన"*** (యం. ఫిల్ పరిశోధన వ్యాసం – హైదరాబాదు విశ్వవిద్యాలయం) 2014.

పై పూర్వ పరిశోధనలు వివిధ విశ్వవిద్యాలయాల్లో జరిగాయి. ఇంకా కూడా జానపద కథల మీద పరిశోధనలు జరుగుతున్నాయి. నా పరిశోధన గ్రంథ రచనకు పూనుకున్నప్పుడు పూర్వ పరిశోధనలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. అందుకే పూర్వపరిశోధనల పట్టికను ఇక్కడ పొందుపరిచాను. ఈ పరిశోధన గ్రంథంలో నేను సేకరించిన జానపద కథలను మాత్రమే పరిశీలించాను.

## అధ్యాయాల విభజన

పరిశోధన సౌలభ్యం కోసం సేకరించిన జానపద కథల సమాచారాన్ని సంగణీకరించాను. పర్యవేక్షకుల సూచనలు పాటిస్తూ, ఆ సంగణీకరించిన సమాచారాన్ని, ఆయా విశేషాలను వివిధ అధ్యాయాలలో వివరించాను.  ఈ పరిశోధన ప్రణాళిక క్రమంలో పూర్వ పరిశోధనలు ఎంతగానో తోడ్పడ్డాయి.

### మొదటి అధ్యాయం: జగిత్యాల జిల్లా చరిత్ర – పరిచయం

నూతనంగా ఆవిర్భావించిన జగిత్యాల జిల్లా గురించి తెలుసుకోవడం అవసరమని భావించి ఈ అధ్యాయంలో జగిత్యాల జిల్లా పరిచయం. భౌగోళికాంశాలు, జిల్లా నామకరణం, జిల్లా ఏర్పాటు, అడవులు, పర్వతాలు, ఖనిజ సంపద, నదులు, పరిశ్రమలు, జనాభా, ప్రాంతీయ ప్రాచీన చరిత్ర, ఆధునిక చరిత్ర, భారత స్వాతంత్ర్య సమరంలో జగిత్యాల జిల్లా పాత్ర, రైతుల జైత్రయాత్ర, పర్యాటక ప్రదేశాలు, సాహిత్యసేవ మొదలైన అంశాలను స్థూలంగా వివరించాను.

## రెండవ అధ్యాయం: జగిత్యాల జిల్లా జానపద కథలు – వర్గీకరణ

జానపద కథాసాహిత్యము గురించి పరిచయం చేస్తూ, జానపద కథకు పూర్వ పరిశోధకులు తెలిపిన నిర్వచనాలు, లక్షణాలు, వర్గీకరణ పద్ధతులను చర్చించాను. వారి వర్గీకరణ పద్ధతుల ఆధారంగా నాకు లభించిన కథలను వర్గీకరణ చేసి, జగిత్యాల జిల్లా జానపద కథల వర్గీకరణ పటాన్ని పొందుపరిచాను. నేను సేకరించిన జానపద కథలను ముఖ్యంగా సరళ, సంక్లిష్ట కథలుగా వర్గీకరించి, ఆయా కథల్లో వస్తు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ఉపశీర్షికలతో విభజించాను. సరళ కథలు అనే విభాగంలో నీతి కథలు, మనుష్య, జంతు కథలు, హాస్య కథలు, యుక్తి కథలు, అదృష్ట, దురదృష్టానికి సంబంధించిన కథలు, రాజనీతి కథలు, తట్టు కథలు మొదలైన కథలను పొందుపరిచి, విశ్లేషించాను. సంక్లిష్ట కథలు అనే విభాగంలో అద్భుత కథలు, మత, ఆధ్యాత్మిక కథలు, చారిత్రక, పౌరాణిక కథలు, మానవ సంబంధాల కథలు, స్త్రీల కథలు మహాభారత కథలు మొదలైన జానపద కథలను యధాతథంగా పొందుపరిచి, విశేషాంశాలను గురించి విశ్లేషించాను.

## మూడవ అధ్యాయం: జగిత్యాల జిల్లా జానపద కథలు – స్త్రీ, కుటుంబ జీవనచిత్రణ

ఈ అధ్యాయంలో జానపద కథల్లో కనిపించిన కుటుంబాల్లో గల మానవీయ సంబంధాల గురించి చర్చించాను. కుటుంబ వ్యవస్థలో కనిపించే ప్రధాన లక్షణాలు, భారతీయ కుటుంబ వ్యవస్థలో జానపదుల కుటుంబాలు నేటి పరిస్థితి, జగిత్యాల జిల్లా జానపద కథల్లో కుటుంబ జీవనం, తల్లిదండ్రుల గొప్పతనం, సోదరసోదరిమణుల అనుబంధం, భార్య భర్తల ప్రేమ, అత్త కోడల మధ్య పోరు, తోడి కోడళ్లు మధ్య వైరం మొదలైన అంశాలు జానపద కుటుంబ కథల్లో ఏవిధంగా చిత్రించబడ్డాయో విశ్లేషించాను. ముఖ్యంగా జానపద కథల్లో స్త్రీ తల్లిగా, చెల్లిగా, ఆలిగా, సవతిగా, వేశ్యగా మొదలైన పాత్రల్లో స్త్రీ చిత్రణ గురించి చర్చించాను.

## నాల్గవ అధ్యాయం: జగిత్యాల జిల్లా జానపద కథలు – సాంఘిక, సాంస్కృతికాంశాలు

ఈ అధ్యాయంలో వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ, పశుపోషణ, కులాలు–కులవృత్తులు, వర్తక వ్యాపారాలు, పరిపాలనా వ్యవస్థ, రవాణా సౌకర్యాలు, సాంఘిక దురాచారాలు, పేదరికం, వలస

మొదలయిన సాంఘికాంశాలను; మతం దేవతారాధన, గ్రామీణ దేవతలు, పండుగలు, వివాహం, ఆహారపు అలవాట్లు, ఆచారాలు నమ్మకాలు, విందు వినోదాలు మొదలయిన సాంస్కృతికాంశాలను సోదాహరణంగా విశ్లేషించాను.

## ఐదవ అధ్యాయం: జగిత్యాల జిల్లా జానపద కథలు – కథా నిర్మాణం

జానపద కథలకు ఒక సక్రమమైన నిర్మాణం ఉంటుందని, ఆ నిర్మాణ అధ్యయన అవశ్యకతను తెలుపుతూ జానపద కథానిర్మాణం, కథానిర్మాణ ప్రయోజనాలు, కథానిర్మాణ విశ్లేషణ పద్ధతులు, ఆ పద్ధతులను జగిత్యాల జిల్లా జానపద కథలకు అన్వయిస్తూ కథానిర్మాణ విశ్లేషణ చేసాను. ప్రాప్ ప్రతిపాదించిన నిర్మాణ విశ్లేషణా పద్ధతి, లెవిస్ట్రాస్ కథానిర్మాణ సూత్రం, అలన్ డెండస్ వివరించిన కథానిర్మాణ పద్ధతి, క్లాడ్ బ్రూమండ్ నైతిక నమూనా మొదలైన పాశ్చాత్యుల కథానిర్మాణ సిద్ధాంతాలను వివరిస్తూ, జగిత్యాల జిల్లా జానపద కథలకు ఆ సిద్ధాంతాలు ఎంతవరకూ సరిపోతాయోనన్న ప్రయత్నాన్ని చేసాను. కథానిర్మాణాల్లో ప్రధాన అంగాలైన కథాప్రారంభ, ముగింపుల స్థితులను ఉదాహరణాలతో చర్చించాను. అంతేగాకుండా స్థిత్ థాంప్సన్ రూపొందించిన జానపద కథా మూలాంశాల సూచిక ఆధారంగా జగిత్యాల జానపద కథలకు మూలాంశాల సూచి సంఖ్యను ఇచ్చాను. ఆ మూలాంశాలను పాత్ర, వస్తువు, సంఘటనలకు సంబంధించిన మూలాంశాలుగా విభజన చేసి రూపొందించడం జరిగింది.

## ఆరవ అధ్యాయం: జగిత్యాల జిల్లా జానపద కథలు – భాషావిశేషాలు

నేను సేకరించిన జానపద కథలో మాండలిక పదాలు, అన్యదేశ్యాలు, ధ్వని మార్పులు, వర్ణ మార్పులు, వర్ణాలు లోపించిన రూపాలు, 'ఒల్లు' తో ఏర్పడిన పదాలు, జంట పదాలు, ఊత పదాలు, తెలంగాణ బహువచన క్రియరూపాలు, పద బంధాలు, నూతన పద కల్పనలు, జాతీయాలు, పలుకుబళ్లు, సామెతలు, జానపదుల తిట్లు మొదలైన భాషా విశేషాలు ఏవిధంగా ఉన్నాయో పరిశీలించాను.

# అనుబంధాలు

జానపద కథాసేకరణలో భాగంగా నేను జానపద కథకులతో దిగిన ఛాయాచిత్రాలను అనుబంధం – 1 లో పొందుపరిచాను.

నా పరిశోధనలో లభించిన జానపద కథల సమాచారాన్ని, జానపద కథలను అందించిన జానపద కథకుల వివరాలను పట్టిక రూపంలో అనుబంధం – 2 లో జోడించాను.

# విషయసూచిక


**కృతజ్ఞతలు** I — III

**ముందుమాట** IV – XII

**1. జగిత్యాల జిల్లా చరిత్ర — పరిచయం** **1 – 30**

1.0 పరిచయం 1

1.1. జగిత్యాల జిల్లా భౌగోళికాంశాలు — నైసర్గిక స్వరూప స్వభావాలు 1

1.1.1 జగిత్యాల జిల్లా నామకరణం 2

1.1.2 జగిత్యాల జిల్లా ఏర్పాటు 3

1.1.3 అడవులు–పర్వతాలు 4

1.1.4 ఖనిజ సంపద 4

1.1.5 నదులు 5

1.1.6 ప్రాజెక్టులు — సాగునీటి సదుపాయం 5

1.1.7 పంటలు 7

1.1.8 పరిశ్రమలు 7

1.1.9 జనాభా 8

1.2 జగిత్యాల జిల్లా చరిత్ర 8

1.2.1 జగిత్యాల జిల్లా ప్రాంతీయ ప్రాచీన చరిత్ర 9

1.2.1.1 శాతావాహనులు 10

1.2.1.2 బాదామి చాళుక్యులు 11

1.2.1.3 వేములవాడ చాళుక్యులు 11

1.2.1.4 పొలవాస రాజులు 12

1.2.1.5 కాకతీయులు 13

1.2.2 జగిత్యాల జిల్లా — ఆధునిక చరిత్ర 14

1.2.2.1 బహమనీ సుల్తానులు 14

1.2.2.2 కుతుబ్‌షాహిలు 14
1.2.2.3 అసఫ్‌జాహిలు 15
1.3 భారత స్వాతంత్ర్య సమరంలో – జగిత్యాల జిల్లా పాత్ర 16
1.4 జగిత్యాల జిల్లా – రైతుల జైత్రయాత్ర 17
1.5 చారిత్రక స్థలాలు – పర్యాటక ప్రదేశాలు 19
1.5.1 ధర్మపురి 19
1.5.2 కోరుట్ల 20
1.5.3 పొలాస 21
1.5.4 నంది మేడారం 22
1.5.5 రాయికల్ 22
1.5.6 కోటిలింగాల 23
1.5.7 కొండగట్టు 23
1.5.8 జగిత్యాల 24
1.6 జగిత్యాల జిల్లా సాహిత్య సేవ 25
1.7 జగిత్యాల జిల్లా సాంఘిక పరిస్థితులు 27
1.8 జగిత్యాల జిల్లా సాంస్కృతిక విషయాలు 29
1.8.1 పండుగలు, వేడుకలు, జాతరలు 29
**2. జగిత్యాల జిల్లా జానపద కథలు – వర్గీకరణ 31 – 274**
2.0 జానపద కథాసాహిత్యం – పరిచయం 31
2.1 జానపద కథ – నిర్వచనాలు 32
2.2. జానపద కథ – లక్షణాలు 34
2.3 జానపద కథలు – వర్గీకరణ 38
**2.4 సరళ కథలు 43**
**2.4.1 నీతి కథలు 43**

2.4.1.1 కానుగ పట్నం 43

2.4.1.2 కాటి మీదికెక్కిన కోడలు 49

2.4.1.3 దైవానుగ్రహం 52

2.4.1.4 గుమ్మడి మర్రి కథ 55

2.4.1.5 గుడ్డి, కుంటి వాడి కథ 56

2.4.1.6 మనిషి ఆయుష్షు 58

2.4.1.7 గాండ్ల బుచ్చమ్మ 59

2.4.1.8 ముసలమ్మ కథ 61

**2.4.2 మనుష్య, జంతువులకు సంబంధించిన కథలు 62**

2.4.2.1 తల్లి కొడుకు, కోతి కోడలు 62

2.4.2.2 బంగారెంటుక బాలుడు 67

2.4.2.3 నేను మల్లన్నను పోతున్న 72

**2.4.3 హాస్య కథలు 73**

2.4.3.1 రేచీకటి అల్లుడు 73

2.4.3.2 పెద్దపులి – గిద్దపులి 76

2.4.3.3 కోతి కథ 80

2.4.3.4 పిసకొడుకు 83

2.4.3.5 దారి మరిచిన ద్వారక 86

2.4.3.6 అత్తిచ్చిన అప్ప 89

2.4.3.7 రాజు పతాని లగ్గం సోకు 91

**2.4.4 యుక్తి కథలు 93**

2.4.4.1 చాకలి పుల్లక్క పాతివ్రత్యం 93

2.4.4.2 శివసత్తె అవతారమెత్తిన భార్య 98
2.4.4.3 పైసకు గుడిసెన్నర పెండ్లాం 103
2.4.4.4 ఒక గుండుకు రెండు గుండ్లు 108
2.4.4.5 లింగం కట్టుకున్న నక్క 112
**2.4.5 రాజనీతి కథలు 114**
2.4.5.1 గొల్ల బోయని రాజనీతి 114
2.4.5.2 బ్రాహ్మణుడి వరాలు 119
2.4.5.3 అమరిక రాజు కథ 121
2.4.5.4 చెప్పుకున్న విలువ రాజుకు లేదు 123
**2.4.6 అదృష్ట, దురదృష్టానికి సంబంధించిన కథలు 125**
2.4.6.1 లక్ష్మీదేవి కటాక్షం 125
2.4.6.2 భోగసాని లంగతనం 128
2.4.6.3 చంద్రహాసుడు కథ 132
**2.4.7 సమస్యాత్మక, తట్టు కథలు 134**
2.4.7.1 సావుకారి కోడలి చతురత 134
2.4.7.2 చెల్లెలు దిద్దిన కాపురం 139
**2.5 సంక్లిష్ట కథలు 143**
**2.5.1 అద్భుత కథలు 143**
2.5.1.1 రాణి పగడాల పేరు 143
2.5.1.2 ఇరవై అయిదు రోజుల బాలుడు 147
2.5.1.3 అక్కెమ్మ కథ 152
2.5.1.4 ఐదు మల్లె పూవ్వుల కథ 156

2.5.1.5 గారడి పిల్లవాడు 163
2.5.1.6 సోమనాల బావి 169
2.5.1.7 బ్రాహ్మణుడి ఇంటి దూలం 175
**2.5.2 మత, ఆధ్యాత్మిక కథలు 179**
2.5.2.1 చిరుతొండ రాజు కథ 179
2.5.2.2 హరిదాసు కథ 189
2.5.2.3 రామా రామా అంటే రోమా రోమా పాపాలు పోతాయి 191
2.5.2.4 లచ్చిందేవి ఆచారం 193
2.5.2.5 పోశవ్వ మొక్కు కథ 195
**2.5.3 చారిత్రక, పౌరాణిక కథలు 198**
2.5.3.1 సత్యవతి కథ 198
2.5.3.2 సత్యహరిశ్చంద్రుడి కథ 203
2.5.3.3 రామదాసు కథ 211
2.5.3.4 కనకతార కథ 214
**2.5.4 మానవ సంబంధాల కథలు 216**
2.5.4.1 మునుపటి సంబంధం 216
2.5.4.2 కొడుకులున్న తండ్రికి వచ్చిన గతి 219
2.5.4.3 అత్త కాలవిషం 225
2.5.4.4 తల్లి కూతుళ్ల అనుబంధం 227
2.5.4.5 బూడిదగిరి పట్నం 230
2.5.4.6 అన్న చెల్లెలి కథ 234
2.5.4.7 అన్నదమ్ముల కథ 242

2.5.4.8 సవతి తల్లి తీరు 246

2.5.4.9 మూడు వస్తువుల ఆస్తి 248

2.5.4.10 బూరెప్ప కథ 251

**2.5.5 స్త్రీల కథలు 255**

2.5.5.1 అత్తని నమ్మని కోడలు, కోడల్ని నమ్మని అత్త 255

2.5.5.2 తోడి కోడల్ల 'అత్యాశ' 259

2.5.5.3 అత్త కోడలు వంకాయ 263

2.5.5.4 అక్కెమ్మల కథ 267

**2.5.6 మహాభారతానికి సంబంధించిన కథలు 269**

2.5.6.1 పంచపాండవుల కథ 269

2.5.6.2 పాండవుల కథ 272

**3. జగిత్యాల జిల్లా జానపద కథలు – స్త్రీ, కుటుంబ జీవనచిత్రణ 275 – 312**

3. 0 పరిచయం 275

3.1 కుటుంబం పదం – నిర్వచనం 276

3.2 కుటుంబ వ్యవస్థలో ప్రధాన లక్షణాలు 277

3.3 భారతీయ కుటుంబ వ్యవస్థ – జానపదుల కుటుంబాలు నేటి పరిస్థితి 279

3.4 జగిత్యాల జిల్లా జానపద కథలు – కుటుంబ జీవనం 282

3.4.1 తల్లి 282

3.4.1.1 తల్లి – కొడుకు 282

3.4.1.2 తల్లి – కూతురు 286

3.4.2 తండ్రి 287

3.4.2.1 తండ్రి – కొడుకు 287

3.4.2.2 తండ్రి – కూతురు 288
3.4.3 సోదరసోదరిమణుల అనుబంధం 291
3.4.4 వదిన 294
3.4.5 అత్త – కోడలు 295
3.4.6 అత్త – అల్లుడు 297
3.4.7 భార్యాభర్తల ప్రేమ 298
3.4.8 తోడి కోడల్లు 302
3.4.9 సవతులు 304
3.4.10 మామ – అల్లుడు 305
3.4.11 బావ – మరిదులు 306
3.5 జానపద కథల్లో – స్త్రీ చిత్రణ 307
**4. జగిత్యాల జిల్లా జానపద కథలు – సాంఘిక, సాంస్కృతికాంశాలు 313 – 366**
**4.1 సాంఘిక అంశాలు 313**
4.1.1 ఆర్థికవ్యవస్థ 313
4.1.2 వ్యవసాయం 314
4.1.3 పశుపోషణ – పాడి సంపద 315
4.1.4 కులాలు – కులవృత్తులు 317
4.1.4.1 బ్రాహ్మణులు 317
4.1.4.2 వైశ్యులు 319
4.1.4.3 వెలమలు 321
4.1.4.4 కంసాలి 322
4.1.4.5 కుమ్మరి 323

4.1.4.6 చాకలి 324
4.1.4.7 కాపు 326
4.1.4.8 రెడ్డి 327
4.1.4.9 యాదవులు 327
4.1.4.10 మాదిగ 328
4.1.4.11 మంగలి 330
4.1.4.12 పెరక 331
4.1.4.13 కటికలు 332
4.1.4.14 భోగపు స్త్రీ (వేశ్య) 333
4.1.4.15 పూటకూళ్లు 334
4.1.5 వర్తక వ్యాపారం 335
4.1.6 పరిపాలనా వ్యవస్థ 336
4.1.6.1 రాజు 336
4.1.6.2 మంత్రి 338
4.1.6.3 దొంగతనం 339
4.1.6.4 న్యాయస్థానం – శిక్ష 340
4.1.6.5 పన్నులు 342
4.1.7 సాంఘిక దురాచారాలు 343
4.1.7.1 బహు భార్యత్వం 345
4.1.7.2 బాల్య వివాహాలు 346
4.1.8 రవాణా సౌకర్యాలు 346
4.1.9 పేదరికం 347

4.1.10 వలస 348

**4.2 సాంస్కృతికాంశాలు 349**

4.2.1 మతం దేవతారాధన 349

4.2.2 గ్రామీణ దేవతలు 351

4.2.3 పండుగలు 353

4.2.4 వివాహం 354

4.2.5 సంతానం 356

4.2.6 ఆహారపు అలవాట్లు 357

4.2.7 విద్యా – వైద్యం 359

4.2.8 ఆచారాలు నమ్మకాలు 361

4.2.9 వినోదాలు 365

**5. జగిత్యాల జిల్లా జానపద కథలు – కథా నిర్మాణం 367 – 412**

5. 0 జానపద కథానిర్మాణం – పరిచయం 367

5.1 జానపద కథానిర్మాణం – ప్రయోజనాలు 368

5.2. జానపద కథానిర్మాణ పద్ధతులు 370

5.3. జగిత్యాల జిల్లా జానపద కథలు – కథా నిర్మాణ విశ్లేషణ 371

5.3.1 ప్రాప్ ప్రతిపాదించిన నిర్మాణ విశ్లేషణా పద్ధతి 372

5.3.2 లెవిస్ట్రాస్ కథానిర్మాణ సూత్రం 378

5.3.3 అలన్ డెండస్ వివరించిన కథానిర్మాణ పద్ధతి 380

5.3.4 క్లాడ్ బ్రూమండ్ నైతిక నమూనా 386

5.3.5 ఫ్రేటేగ్ ఇతివృత్త ఆధార నమూనా 388

5. 4 జానపద కథలు – కథాప్రారంభం 393

5. 5 జానపద కథలు – కథాముగింపు 396

5. 6 జానపద కథ – మూలాంశాలు 399

5. 6. 1 పాత్రకు సంబంధించిన మూలాంశాలు 402

5. 6. 2 వస్తువుకు సంబంధించిన మూలాంశాలు 407

5. 6. 3 సంఘటనకు సంబంధించిన మూలాంశాలు 408

**6. జగిత్యాల జిల్లా జానపద కథలు – భాషావిశేషాలు 413 – 444**

6.0 పరిచయం 413

6.1 మాండలిక పదాలు 414

6.2 అన్యదేశ్యాలు 421

6.2.1 ఆంగ్ల పదాలు 423

6.2.2 ఆంగ్ల పదాలు అజంతాలుగా మారడం 423

6.3 మిశ్రమ పదాలు 424

6.4 కాలానికి, కొలతలకు సంబంధించిన పదాలు 424

6.5 ధ్వని మార్పులు 425

6.5.0 వర్ణ సమీకరణం 425

6.5.1 పర వర్ణ సమీకరణం 425

6.5.2 పూర్వ వర్ణ సమీకరణం 426

6.5.3 వర్ణాగమం / వర్ణాధిక్యం 426

6.5.4 వర్ణలోపం / వర్ణనాశనం 426

6.5.5 లోపదీర్ఘత 427

6.5.6 స్వరలోపం 427

6.5.7 స్వర భక్తి 428

6.5.8 వర్ణవ్యత్యయం 428

6.6 వర్ణ మార్పులు 428

6.6.1 చ>స, చ>జ గా మారడం 428

6.6.2 క>గ, గ>క లుగా మారడం 429

6.6.3 చ>శ, శ>స, ష>స గా మారడం 429

6.6.4 ద>గ మారిన రూపాలు 429

6.6.5 ప>బ గా మారడం 429

6.7 పదాది 'వ' లోపించడం 429

6.7.1 పద మధ్య 'వ' లోపించిన రూపాలు 430

6.7.2 కొన్ని సందర్భాలలో 'ప' స్థానంలో 'వ' చేరడం 430

6.8 క, ష ల సంయుక్త రూపమైన క్ష స్థానంలో క, చలు కలిసిన 'క్చ' అని రావడం 431

6.9 మహాప్రాణాలు – అల్పప్రాణాలుగా మారడం 431

6. 10 రేఫ లోపించిన పదాలు 432

6.11 పదాది 'అ' స్థానంలో 'గ' వచ్చి చేరే రూపాలు 432

6.12 శబ్ద పల్లవం 433

6.13 హ లోపించిన రూపాలు 433

6.14 పూర్ణానుస్వరం రావడం 433

6.15 రెండర్థాలు కలిగిన పదాలు 433

6.16 నిందార్థ ప్రయోగాలు 434

6.17 సంయుక్త పదాలకు ద్విత్వాన్ని చేర్చడం 434

6.18 సంఖ్యా వాచకాలు 434

6.19 కాడ, పొన్న, పొంటి, సుంది, కాంగ పదాలను దగ్గర, వద్ద, నుండి, తర్వాత అనే అర్థంలో వాడటం 435
6.20 సర్వనామాలు 435
6.21 'ఒల్లు' తో ఏర్పడిన పదాలు 436
6.22 సంధులు 436
6.23 జంట పదాలు, ఊత పదాలు 437
6.24 ధ్వన్యనుకరణ పదాలు 437
6.25 తెలంగాణ బహువచన క్రియరూపాలు 438
6.26 పునరుక్తులు 438
6.27 పద బంధాలు, నూతన పద కల్పనలు 439
6.28 జాతీయాలు, నానుడులు, పలుకుబళ్లు 440
6.29 సామెతలు 443
6.30 జానపదుల తిట్లు 443
**ముగింపు 444 – 465**
**ఉపయుక్త గ్రంథ సూచి 466 – 471**
**అనుబంధం – 1 472 – 477**
**అనుబంధం – 2 478 – 482**
**పుస్తకాల్లో ముద్రితమైన పరిశోధన పత్రాల నకళ్లు 483 – 493**
**జాతీయ సదస్సులో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువపత్రాల నకళ్లు 494 – 495**

# 1. జగిత్యాల జిల్లా చరిత్ర – పరిచయం

## 1.0 పరిచయం

ప్రజల ఆకాంక్ష మేరకు పాత సొబగులతో కొత్త జిల్లాగా జగిత్యాల జిల్లా ఆవిర్భవించింది. ఎన్నో పోరాటాలు, ఎందరో త్యాగాలతో ఘనమైన చరిత్ర కల్గిన జిల్లాగా జగిత్యాల విరాజిల్లుతుంది. ఒక ప్రాంత మౌఖిక సాహిత్యం అధ్యయనం చేయాలంటే ఆ ప్రాంత భౌగోళికాంశాలు తెలుసుకోవడం అవసరం. ఎందుకంటే మౌఖిక సాహిత్యాన్ని తరతరాలుగా సంప్రదాయంగా మోసుకొస్తున్న ఆ జానపదుల జీవన విధానం ఆ ప్రాంత భౌగోళికాంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ పరిశోధన గ్రంథంలో సంప్రదాయ మౌఖిక కథలను అందించిన కథకులు జగిత్యాల జిల్లాకి చెందిన వారే. కాబట్టి జగిత్యాల జానపద కథలను అధ్యయనం చేయబోయే ముందు జగిత్యాల జిల్లా ప్రాచీన చరిత్ర, ఆధునిక చరిత్ర, గత వైభవ చరిత్ర, అస్తిత్వ ఉద్యమాలు, కవులు, కళాకారులు, రచయితలు, చారిత్రక వారసత్వ సంపదలుగా ఉన్న విశేషాలను తెలుసుకోవడం సముచితంగా ఉంటుందని భావిస్తున్నాను. అందువల్ల ఈ అధ్యాయంలో జగిత్యాల జిల్లా ప్రాంత విశిష్టతను, చారిత్రకాంశాలను, సాంస్కృతికాంశాలను స్థూలంగా పరిచయం చేస్తాను.

## 1.1 జగిత్యాల జిల్లా భౌగోళికాంశాలు – నైసర్గిక స్వరూప స్వభావాలు

ఉత్తర తెలంగాణలో నూతన జిల్లాగా ఆవిర్భావించిన వాటిలో జగిత్యాల జిల్లా ఒకటి. ఈ జిల్లా 18.8$^{o}$ ఉత్తర అక్షాంశాల నుండి 78.93$^{o}$ తూర్పు రేఖాంశాల మధ్య భాగంలో ఉంది. కొత్తగా అవతరించిన జగిత్యాల జిల్లా దాదాపు 7 జిల్లాలతో ఎల్లలు కలిగి ఉంది. ఉత్తరాన ఆదిలాబాదు, ఈశాన్యంలో మంచిర్యాల, తూర్పు, ఆగ్నేయంలో పెద్దపల్లి, దక్షిణ, నైరుతిలో సిరిసిల్ల, వాయువ్యంలో నిర్మల్, పశ్చిమాన నిజామాబాదు జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి. అంతేగాకుండా 2,419 చ.కి.మీ (934sq.mi) చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో ఉత్తరాన సహజ సిద్ధమైన గోదావరి సరిహద్దుగా, దక్కన్ అటవీ ప్రాంతాలు, రాఖీ గుట్టలు, జిల్లా చుట్టూ సంపూర్ణ ఆయకట్టు కలిగి సస్యశ్యామలమైన

జిల్లాగా ప్రసిద్ధిగాంచింది. 18 మండలాలు, 327 గ్రామపంచాయితీలు, 5 మున్సిపాలిటీలు, రెండు రెవెన్యూ డివిజన్లు, 2011 లెక్కల ప్రకారం 9,85,417 జనాభాతో 11 అక్టోబర్ 2016న జగిత్యాల కొత్త జిల్లాగా అవతరించింది.

జిల్లాలో వాతావరణం సమశీతోష్ణస్థితిగా ఉంటుంది. నైరుతి రుతుపవనాలు వచ్చినప్పుడు తప్ప మిగతా కాలాల్లో పొడిగా, వేడిగా ఉంటుంది. సంవత్సరంలో నవంబరు నుండి ఫిబ్రవరి వరకు చలికాలం, మార్చి నుండి జూన్ వరకు వేసవికాలం, జూలై నుండి అక్టోబర్ వరకు వర్షాకాలంగా విభజిస్తారు. అత్యధిక ఉష్ణోగ్రత మే, జూన్ నెలలో, అత్యల్ప ఉష్ణోగ్రత డిసెంబర్, జనవరి నెలల్లో ఉంటుంది.

కరీంనగర్ డివిజన్‌లో వెల్గటూర్ మండలం జగిత్యాల జిల్లాలో కలువగా, జగిత్యాల పట్టణ, గ్రామీణ మండలాలు, ధర్మపురి నుంచి బుగ్గారం, సారంగాపూర్ నుంచి బీర్‌పూర్ కేంద్రంగా మండలాలుగా ఏర్పడ్డాయి. మొత్తం మీద జగిత్యాల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్ల క్రింద 18 మండలాలున్నాయి.

జగిత్యాల రెవెన్యూ డివిజన్ మండలాలు : జగిత్యాల, జగిత్యాల రూరల్, రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్, ధర్మపురి, బుగ్గారం, పెగడపల్లి, గొల్లపల్లి, మాల్యాల, కొడిమ్యాల, వెల్గటూర్

మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్ మండలాలు: కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మేడిపల్లి, కథలాపూర్ మొదలైన మండలాలున్నాయి.

### 1.1.1 జగిత్యాల జిల్లా నామకరణం

జగిత్యాల జిల్లాకు ఆ పేరు ఎలా వచ్చిందో ప్రధానంగా రెండు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. క్రీ. శ. 1110 నుండి క్రీ. శ. 1116 వరకు పొలాస రాజధానిగా పరిపాలించిన జగ్గదేవుడు తన పరిపాలనా కాలంలో 21 యుద్ధాలు చేసి పరిసర ప్రాంతాల్లో పలు నూతన గ్రామాల్ని స్థాపించాడు. పొలాసకు దక్షిణాన 6 కి.మీ దూరంలో జగ్గదేవుడు అతని పేరిట జగ్గదేవాలయం నిర్మించి ఉంటాడని, అదే జగిత్యాలగా స్థిరపడిందని చరిత్రకారుల అభిప్రాయం. మరొక కథన ప్రకారం “ఎల్గందల్ కోటకు

అధిపతిగా ఉన్న ముబారిజుల్‌ముల్ జఫరుద్దౌలా మీర్జా ఇబ్రహీం ఖాన్ ధంసా క్రీ. శ. 1747లో జగిత్యాలలో నక్షత్రకారంలో ఒక సువిశాలమైన, పటిష్టమైన కోటను ఫ్రెంచ్ ఇంజనీర్లయిన జాక్, తాల్ అనే ఇరువురి సాంకేతిక సహకారంతో నిర్మించాడు. ఆ ఇద్దరి ఇంజనీర్ల పేరు మీదుగా జాక్ తాల్ అని పిలువబడే క్రమంలో జగ్త్యాల్, జక్‌తాల, జగితాల, జగిత్యాలగా మారిందని చరిత్రకారులు చెబుతారు"[1].

## 1.1.2 జగిత్యాల జిల్లా ఏర్పాటు

జగిత్యాలకు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. 1978లో జరిగిన జగిత్యాల జైత్రయాత్ర విప్లవోద్యమంలో జరిగిన ఓ వీర చారిత్రక ఘట్టం. జగిత్యాల ఉమ్మడి జిల్లాలో మరో అతిపెద్ద పట్టణంగా, వాణిజ్య కూడలిగా ప్రసిద్ధి. ఈ పట్టణాన్ని జిల్లాగా చేయాలని 20 సంవత్సరాల క్రితం నుంచే డిమాండ్ ఉంది. ఎట్టకేలకు 2016లో 18 మండలాలతో కూడి జగిత్యాల జిల్లాగా ఆవిర్భవించింది. జగిత్యాల జిల్లా ఏర్పాటుకు ముందు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1897 నుండి ఒక తాలుకాగా ఉండేది. జగిత్యాల జిల్లా ఒకనాడు ఎలగందుల సర్కారు పాలన అంతర్భాగంలో పరగణాగా ఉండేది. 1984 లో తాలుకాలు, మండలాలుగా ఏర్పడే మండలాలవ్యవస్థ వచ్చింది. అనంతరం కరీంనగర్ జిల్లాలో రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా గుర్తింపు పొందింది. "నేడు కరీంనగర్ ప్రాంతాన్ని పూర్వం సబ్బినాడు అని వ్యవహరించేవారు. 1905 వరంగల్ జిల్లా నుండి పర్కాల తాలుకాను జిల్లాలో కలిపి, లక్షేటిపేట మరియు చెన్నూరు తాలుకాలను ఆదిలాబాదు జిల్లాలో, సిద్దిపేట తాలుకాను మెదక్ జిల్లాలో చేర్చి జిల్లాను 7 తాలుకాలలో పునర్వ్యవస్థీకరణ కరీంనగర్ జిల్లాగా నామకరణం చేశారు"[2]. ఆ తరువాత జూన్ 2 వ తేదిన 2014 ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడ్డాక కూడా జగిత్యాల ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉండేది. తెలంగాణ ప్రభుత్వం చేసిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ చట్టంలో భాగంగా 11 వ తేది

[1]https://en.wikipedia.org/wiki/Jagtial

2. చరిత్ర – కరీంనగర్ చరిత్ర, 4వ తేదిన ఫిబ్రవరి 2014 (వారపత్రిక)

అక్టోబరు మాసంలో 2016 సంవత్సరంలో విజయదశమి (దసరా) పండుగ రోజున కరీంనగర్ నాలుగు జిల్లాలుగా విడిపోయింది. అందులో జగిత్యాల జిల్లా ఒకటి. జిల్లాగా ఏర్పడ్డాక కొత్తగా కలెక్టరు కార్యాలయం, పోలీస్ స్టేషన్లు ఏర్పడ్డాయి. జగిత్యాల జిల్లా తొలి కలెక్టర్‌గా శరత్‌కుమార్, ఎస్, పి అనంత శర్మ ఇంకా యం. ఎల్. ఏ టి. జీవన్ రెడ్డి, యం. పి కె. కవిత మొదలైన వారు ఆయా పదవుల స్థానంలో నియమించబడ్డారు.

## 1.1.3 అడవులు–పర్వతాలు

జిల్లాలో అడవుల విస్తీర్ణం 554.91 చ.కి.మీ. ఇది జిల్లా విస్తీర్ణంలో 22.94%. ఇక్కడి అడవులు దక్షిణ చిత్తడి 'డెసిడస్' కోవకు చెందినవి. ఈ అడవుల వల్ల మంచికలప, టేకు లభిస్తుంది. ఏప్రిల్, మే మాసాలలో చిన్న, పెద్ద తేడా లేకుండా గ్రామీణులు అడవుల్లో తునికి ఆకును తెంపి అమ్మడం విశేషం. ఆ తునికాకు బీడి తయారిలో ఉపయోగిస్తారు. ఇక పర్వతాల విషయానికొస్తే మెట్‌పల్లి తాలుకాలోని గుర్రపల్లి వద్ద ప్రారంభమైన ఒక పర్వతశ్రేణి ఈశాన్యదిశ జగిత్యాల మీదుగా వేములకుర్తి వరకు విస్తరించి ఉంది. ఈ పర్వత శ్రేణి శనిగరం నుండి ప్రారంభమవుతుంది. అక్కడక్కడ చిన్న చిన్న కొండలు, గుట్టలున్నాయి. గర్రెపల్లి నుండి జగిత్యాల వరకూ, ధర్మపురి మండలం దగ్గర స్తంభంపెల్లి గుట్టలున్నాయి. ఈ గుట్టల్లల్లో చిన్న చిన్న గుహలున్నట్లు చరిత్రకారులు గుర్తించారు. వాటిలో మునుల గుట్ట ప్రసిద్ధమైంది. ఇక మిగిలినది పీఠభూమి.

## 1.1.4 ఖనిజ సంపద

జగిత్యాల జిల్లాలో వివిధ రకాల ఖనిజాలు ఉన్నాయి. ముఖ్యంగా సిమెంటుకు ఉపయోగపడే సున్నపురాళ్లు, బలపపు రాళ్లు, ఇనుపరాతి లోహం ఇతర ఖనిజాలు లభిస్తాయి. "జగిత్యాల ప్రాంతంలో 35% నుండి 40% ఇనుప ఖనిజము గల మాగ్నటైట్, క్వార్జ్ రాయి ఎక్కువగా దొరుకుతుంది. ముడి ఇనుము సేకరింపబడి జగిత్యాలకు సమీపంలోగల రంగపేట. కోనాపురంలో కరిగించబడేది. ఇబ్రహింపట్నంలో కూడా ఇనుము కరిగించి శుభ్రపరచే కేంద్రాలుండేవి."[3] ఈ ఇనుము నిల్వలు

[3]రమణయ్య, జైశెట్టి. 2003. కరీంనగర్ జిల్లా చరిత్ర, సంస్కృతి. జగిత్యాల: జైశెట్టి ప్రచురణ. పేజి సంఖ్య – 5

కోరుట్ల, వెంకటాపూర్, అంబరిపేట, పెద్ద గుట్ట ప్రాంతాల్లో ఈ నిల్వలు ఉన్నట్లు కనుగొన్నారు. ఈ జిల్లాలో సిమెంట్ తయారీకి అనువుగా ఉండే సున్నపురాతి నిల్వలు ఎక్కువగా లభిస్తాయి. "నేరెళ్ల అడవుల్లోనూ 1,530 లక్షల టన్నులు లభ్యమవుతుందని అంచనా. ఇక్కడ దొరికే సున్నపురాళ్లలో కాల్షియం కార్బోనేట్, మెగ్నీషియం కార్బోనేట్ నలభై శాతం ఉంటుంది."[4]

## 1.1.5 నదులు

ఈ జిల్లాకు ఉత్తరాన గోదావరి నది ప్రవహిస్తుంది. మహారాష్ట్రలోని పశ్చిమ కనుమలలో నాసిక్ సమీపంలో గల త్రయంబకం వద్ద జన్మించిన ఈ నది ఆదిలాబాదు జిల్లాలోని బాసర వద్ద మన రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. "వాయువ్య దిశలో ఉన్న మల్లాపూర్ మండలం వేంపల్లి వెంకట్రావు పేట వద్ద గోదావరినది జగిత్యాల జిల్లాలో ప్రవేశించి అక్కడి నుంచి రాయికల్, ధర్మపురి, వెల్గటూర్ మండలాల మీదుగా ప్రవహించి పెద్దపల్లి జిల్లాలో అడుగిడుతుంది. దాదాపుగా ఉత్తర, తూర్పు సరిహద్దుల్లో ప్రవహిస్తుంది. ఇక సారంగాపూర్, బీర్‌పూర్, బోర్నవెల్లి, జగన్నాథ్‌పూర్‌లోని దట్టమైన అటవీ ప్రాంతాలు, రాఖీగుట్టలు ప్రత్యేకంగా ఉన్నాయి"[5]. జగిత్యాల జిల్లాలో సుమారుగా 45 కిలోమీటర్ల పాటు గోదావరి నది ప్రయాణం చేస్తూ ఉంటుంది. ఈ నదికి ఉపనది ఐన మానేరు కరీంనగర్ జిల్లాలో ప్రవహిస్తుంది.

## 1.1.6 ప్రాజెక్టులు– సాగునీటి సదుపాయం

ఉత్తర తెలంగాణ మిగతా జిల్లాలతో పాటు ఈ జిల్లాకు కూడా యస్.ఆర్.యస్.పి (శ్రీ రాం సాగర్ ప్రాజెక్టు) నీటి కాలువ ద్వారా వచ్చే నీటితో భూములు సస్యశ్యామలంగా మారి వ్యవసాయం సాగవుతుంది. జగిత్యాల జిల్లా దాదాపు అన్ని మండలాలకు SRSP సాగునీటి వసతి ఉండటం వరమనే చెప్పాలి. 35 యేళ్ల క్రితం మెట్ట ప్రాంతంగా పరిమితమై, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుతో సస్యశ్యామలమైంది. వాటితో పాటు సహజసిద్ధంగా ఉన్న చెరువులు, కుంటలు, బావులు మొదలైన వాటి

[4] కాటం రమేష్, సిహెచ్ ఆచార్య. కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమర చరిత్ర. పుట సంఖ్య – 8

[5] నమస్తే తెలంగాణ – పత్రిక, 11 అక్టోబర్ 2016 నాటి 'ఏడు జిల్లాలతో ఎల్లలు కలిగిన' వ్యాసం.

నుండి వచ్చే నీటితో పంటలు పండిస్తున్నారు. "9 వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో ఏర్పాటైన కాకతీయ కాలువ, 23 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మితమైన వరద కాలువ జిల్లాకు వరద నీరు నిలుస్తుంది. జిల్లాలో దాదాపు 1100 చెరువులు, కుంటలు, 57,900 బావులు, 3 వేల బోరు బావులున్నాయి. ఇబ్రహీంపట్నం మండలంలో గంగనాల ప్రాజెక్టులు, కథలాపూర్‌లో రాళ్లవాగు ప్రాజెక్టులు, సారంగాపూర్‌లోని రోళ్లవాగు ప్రాజెక్టులు సేద్యానికి ఉపయోగపడతాయి."[6]

SRSP శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి కెనాల్ మానేరు డ్యాం వరకు ఉంది. జిల్లాలోని కొన్ని మండలాలకు ఆ కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు ముందు గోదావరి, వరదకాలువల నీరు నిల్వ అయి అక్కడున్న వెల్గటూరు, ధర్మపురి, బీర్పూరు మండల గ్రామాలకు పుష్కలంగా నీరు అందుతుంది. నాగులపేట సైఫాన్: కోరుట్ల మండలంలోని నాగులపేట గుండా శ్రీరాంసాగర్ ప్రధాన కాలువ గుండా వెళ్తుంది. ఆ ఊరి చివర ఆకస్మాత్తుగా ఈ కాలువ మాయం అయి ఆ తర్వాత కొంత దూరం తర్వాత మళ్లీ ప్రత్యక్షం అవుతుంది. అదొక అపురూప సొరంగం అని చెప్పవచ్చు. అదే సైఫాన్. దీనిని ఇంజనీర్ రామకృష్ణ అధ్వర్యంలో నిర్మించారు. ఇదొక వింత. ప్రపంచంలో చాలా అరుదైన సైఫాన్. "ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమునకు ప్రతీక. ఈ సైఫాను ద్వారా సెకనుకు 8200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. నీటి పారుదల విషయంలో జగిత్యాల (net sown area - 80.61 per cent) తెలంగాణలోనే రెండవ స్థానంలో ఉంది. మొదటి స్థానంలో (83.48 per cent) మేడ్చల్ జిల్లా ఉంది. 2 భారీ ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ పథకంకు సంబంధించిన 1197 చిన్న తరహా సాగునీటి జలాశయాలు, ఫెజ్–1 ద్వారా 199, ఫెజ్– 2 ద్వారా 218 చెరువులను దశల వారీగా తెలంగాణ ప్రభుత్వం పునరుద్ధరణ చేస్తున్నాయి. మిషన్ భగీరథ  పథకం ద్వారా 482 జనవాసాలకు 1331 కి.మీ మేర పైప్‌లైను అమరుస్తున్నారు."[7]

---

[6]నమస్తే తెలంగాణ – పత్రిక, 11 అక్టోబర్ 2016 నాటి 'ఏడు జిల్లాలతో ఎల్లలు కలిగిన' వ్యాసం.

[7]జగిత్యాల జిల్లా సమాచారం, మన జిల్లా – మన ప్రణాళిక, ప్రణాళిక సంఘం, తెలంగాణ శాఖ–2017

## 1.1.7 పంటలు

ఈ జిల్లాలో రైతులు ప్రధానంగా వర్షాల మీద ఆధారపడి పంటలు పండిస్తున్నారు. 1,74,277 హెక్టార్ల భూమి వ్యవసాయానికి ఉపయోగపడుతుంది. వరి, మొక్కజొన్న లాంటి ఆహార పంటలతో పాటు చెరకు, సోయా, పసుపు, పత్తి, మిరప లాంటి వాణిజ్య పంటలు పండిస్తారు. ఉద్యాన పంటలు కూడా విరివిగా పండిస్తున్నారు. జగిత్యాల ప్రాంతంలో ఎక్కువ శాతం మామిడి తోటలున్నాయి. ఇక్కడ నుంచి మామిడి పండ్లు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా వాణిజ్య పంటలు మోజులో రైతులు చిరుధాన్యాలను విస్మరిస్తున్నారు. కానీ జగిత్యాల ప్రాంతంలో ఇప్పటికి జొన్న, సజ్జ, రాగి, నువ్వులు, ఆవాలు పండిస్తున్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమల కొరత ఉన్నందున ఈ ప్రాంత ప్రజలకు సరైన ఉద్యోగ, ఉపాధిలేక పట్టణాలకు, ముఖ్యంగా ఎక్కువ శాతం విదేశాలకు వలస వెళుతున్నారు.

## 1.1.8 పరిశ్రమలు

జగిత్యాల జిల్లాలో పరిశ్రమలు చాలా తక్కువగా ఉన్నాయి. చెరకు ఆధారంగా నడుస్తున్న ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ మూలనపడింది. నిజాం కాలంలో స్థాపించబడిన కోరుట్ల కాగితపు పరిశ్రమ నిజాం అనంతరమే మూత పడింది. మల్లాపూర్ మండలంలో నిజాం కాలంలో నిర్మించిన చక్కెర కర్మాగారం రైతులకు సేవలందిస్తుంది. ఈ జిల్లాలో ప్రముఖ కుటీర పరిశ్రమ బీడి పరిశ్రమ. బీడిలను చుట్టడం ద్వారా స్త్రీలు ఉపాధిని పొందుతున్నారు. దాదాపుగా 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 79,694 మంది ఈ జిల్లాలో బీడి కార్మికులున్నారు. జిల్లాలో ఉన్న ప్రధాన సమస్యల్లో వలస ప్రధానమైంది. ఇంత సుసంపన్నంగా ఉన్న జిల్లా నుండి ముంబాయి, దుబాయ్, మిగత అరబ్ దేశాలకు వలస వెళ్లే మధ్య తరగతి కుటుంబాలు ఇక్కడ ఎక్కువగా కనిపిస్తాయి. గల్ఫ్‌కు వెళ్లిన వారి కుటుంబాల్లో స్త్రీలు బీడి కార్మికులుగా కొందరు, రైతు కూలీలుగా మరికొందరు పనిచేస్తున్నారు. స్వస్థలంలో ఉపాధిలేక ఎడారి దేశాల్లో వలస కూలీలుగా మారి ఎంతో కష్టపడుతూ దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని పరిశ్రమలు నెలకొల్పవల్సిన అవసరం ఏంతైనా ఉంది.

దాని వల్ల ఉపాధిలేని వారికి, నిరుద్యోగులకు, యువకులకు ఆసరాగా నిల్చినట్లు అవుతుంది. “ఈ ప్రాంతంలో పుడ్ బెస్డ్ ఇండస్ట్రీస్‌కి మంచి అవకాశముంది. రైస్ మిల్లులు, వరి ఊక ఆధారంగా నూనె మరలు, బియ్యంతో బేకరీలు, నూకలతో కోళ్ల, పశువులు దాణా తయారీ పరిశ్రమలకు అవకాశముంది. మొక్కజొన్న పెద్ద ఎత్తున సాగవుతున్నందున దాణా తయారీ పరిశ్రమలు నెలకొల్పవచ్చు”[8].

## 1.1.9 జనాభా

“2011 గణాంకాల ప్రకారం జగిత్యాల తాలుకాలోని 9,85,417 (లక్షల్లో) జనాభా కలదు. జిల్లాలో గ్రామీణ జనాభా 77.54%, పట్టణ జనాభా 22.46%. జన సాంద్రత 407 చ.కి.మీ. రాష్ట్ర జనాభాలో 14వ స్థానంలో ఉంది. జనసాంద్రతలో 6వ స్థానంలో ఉంది. జిల్లాల వారిగా జిల్లా అభివృద్ధి సూచికలో 0.38 పాయింట్లతో 21 వ స్థానంలో ఉంది.”[9] “పురుషుల సంఖ్య 4,845,079, మహిళా సంఖ్య 5,01,338. లింగ నిష్పత్తి 1,036 (1000 మంది) అక్షరాస్యత విషయంలో 60.26%, దానిలో పురుషుల అక్షరాస్యత 70.60%, స్త్రీల అక్షరాస్యత 50.38%, ఇక గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత 55.77%, పట్టణ ప్రాంతాల్లో అక్షరాస్యత 50.38%. షెడ్యూల్ కులాల జనాభా 16.70%, షెడ్యూల్ గిరిజన జనాభా 2.37%[10].” తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక టి.ఆర్.యస్ ప్రభుత్వం కొత్తగా చేయించిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం 10,19,045 (లక్షల్లో) జనాభా కలదు. “షెడ్యూల్ కులాల జనాభా 17.54%, షెడ్యూల్ గిరిజన జనాభా 3.05%, వెనుకబడిన కులాల జనాభా 67.05%.”[11]

## 1.2 జగిత్యాల జిల్లా చరిత్ర

జగిత్యాల జిల్లా చరిత్ర ఉమ్మడి కరీంనగర్ జిల్లా చరిత్రలో భాగమే. జగిత్యాల జిల్లా చరిత్ర తెలుసుకోవడమంటే కరీంనగర్ జిల్లా చరిత్రనే ప్రధాన ఆధారంగా నిలుస్తుంది. ఈ జిల్లాకు కరీంనగర్‌లో విశిష్ట స్థానం ఉంది. జగిత్యాల అనగానే జగిత్యాల జైత్రయాత్రలు, రైతు ఉద్యమాలు, నాటి

---

8. చరిత్ర – కరీంనగర్ చరిత్ర, 4వ తేదిన ఫిబ్రవరి 2014 (వారపత్రిక).

9. Socio economic outlook 2017, planning department, govt of telangana.

10. Statistical Year Book – 2017, Govt of Telangana, Hyderabad.

11. జగిత్యాల జిల్లా సమాచారం, మన జిల్లా – మన ప్రణాళిక, ప్రణాళిక సంఘం, తెలంగాణ శాఖ–2017

కాలపు జీవితాల పోరాటాలు, సమరయోధుల జీవితాలు మనకు కానవస్తాయి. ఈ జిల్లాలో ఉన్న శిలాశాసనాలు, కోటలు, శిల్ప సౌందర్యం, దేవాలయాలు, ఆనాటి సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబించే నేటి సంస్కృతి ఆధారంగా ఈ జిల్లా చరిత్ర కొంత ఊహించి, కొంత నిర్ధారించి అంచనా వేయవలసి ఉంటుంది.

### 1.2.1 జగిత్యాల జిల్లా ప్రాంతీయ ప్రాచీన చరిత్ర

జగిత్యాల జిల్లా ప్రాంతీయ చరిత్ర అంటే పూర్వం అంధక రాజ్యంలో భాగమై శాతావాహనులు నుండి అసఫ్‌జాహిల వరకు ఈ జిల్లాను పరిపాలించిన రాజవంశాల ఆధారంగా ఈ జిల్లా చరిత్రను తెలుసుకోగలం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, పూర్వంలో ఉన్న ఆంధ్ర శబ్దానికి తారతమ్యం ఉంది. అంధక రాజ్యం నుంచి ఆంధ్ర శబ్దం జాతి వాచకమైంది. ప్రాచీన కాలంలో తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్ర జాతి అనే అర్థంలో వాడారు. తెలంగాణ పదం 'తెలివాహ' అనే పదం నుంచి వచ్చిందని సంగనభట్ల నర్సయ్య గారి అభిప్రాయం. హైదరాబాదు సమీపంలో తెల్లాపూరులో దొరికిన శాసనంలో ఉన్న తెలగన పదం వాడుకలో ఉండి తెలంగాణ అయిందని పలువురు చరిత్రకారుల ఆభిప్రాయం.

భారతదేశములో సువిశాల సామ్రాజ్యమును స్థాపించిన ప్రప్రథమ చక్రవర్తి మౌర్య చంద్రగుప్తుడే. మౌర్యుల తరువాత గోదావరి లోయలో ఆంధ్రుల రాజ్యాలు ఏర్పడ్డాయి. శాతావాహనులు మొదటగా పరిపాలించారని కాకుండా ఆంధ్రులు రాజ్యపాలన చేశారని తవ్వకాల్లో లభించిన ఆధారాలను బట్టి జెశెట్టి రమణయ్య గారు ఈ విధంగా తెలిపారు. "కోటిలింగాల్లో జరిపిన తవ్వకాల్లో శాతావాహనుల కన్న పూర్వీకులైన సమగోప, గోభద, కంపయ, నారన మొదలగు వారి నాణెములు లభ్యమైనవి. ఆ కోటిలింగాల ప్రాంతం జగిత్యాల జిల్లాకు సమీపంగా ఉంది. కోటిలింగాలలో మొట్టమొదటి పేరు చెక్కబడిన నాణెములు గోభదునివి. ఎందుకంటే క్రీ.పూ రెండవ శతాబ్దపు ప్రథమార్థ భాగపు బ్రాహ్మీలిపి లక్షణములున్నవి. సామగోపుడు అతని పూర్వీకులు కోటిలింగాలను రాజధానిగా చేసుకొని గోదావరిలోయ ప్రాంతమును పాలించిరి. సామగోపుని పాలనలో శాతావాహనుడు అతని సేనానిగా

పనిచేసి అదునుచూచి అతన్ని పదవీచ్యుతుడిని కావించి, అధికారాన్ని చేజిక్కించుకొని ఉంటాడు."[12] సామగోపుని అనంతరమే శాతావాహనుడు అధికారంలోకి వచ్చాడు అనటానికి లభ్యమైన సామగోపుని కొన్ని నాణేలు, కొన్ని శాతావాహనుల పేర్లు గల నాణేలు ఆధారాలుగా నిలిచాయి. అంతేగాకుండా శాతావాహనుడు సామగోపుని నుండి రాజ్యాధికారం తీసుకుని పరిపాలించడానికి నాణాల మీద ఉన్న సామగోపుని ముద్ర ఒకవైపు, శాతావాహనుని ముద్ర మరోవైపు ఉండటం గమనించదగ్గ విషయం.

### 1.2.1.1 శాతావాహనులు

మౌర్య సామ్రాజ్య శిథిలాలపై వెలసిన రాజ్యాలలో శాతావాహనుల సామ్రాజ్యం ఒకటి. వీరి పరిపాలనలో దక్షిణాపథ చరిత్రలో నూతన శకం మొదలైంది. పురాణాల ఆధారంగా 30 మంది శాతావాహన రాజులు క్రీ.పూ 230 నుండి క్రీ.శ 220 వరకు దాదాపు 450 సంవత్సరాలు పాలించారు. మొదట వీరి రాజధాని పైఠాన్ (ప్రతిష్ఠానపురం) లేదా ధరణికోట (ధాన్యకటకం) అని భావించారు. కాని కోటిలింగాలలో బయటపడిన ఆధారాల వలన పై భావనలు చెల్లాచెదురయ్యాయి. "సిముకుడు మొదట రాజు కాదని సాతావాహనుడని కొత్తగా వెలుగుచూచిన ఆధారాలు తెలియజేస్తున్నాయి. యస్.జె మంగళం తెలిపిన విషయాలను జైశెట్టి రమణయ్య తన గ్రంధంలో తెలియజేశారు."[13] శాతావాహనుని తర్వాత ఈ రాజ్యాన్ని మొదటి శాతకర్ణి నాగవంశపు రాకుమారి నాగానికని పెండ్లి చేసుకొని రెండు అశ్వమేధయాగాలు, ఒక రాజసూయ యాగం, 18 ఇతర యాగాలు నిర్వహించి తన ప్రాబల్యాన్ని చాటుకొన్నాడు. శాతావాహనులలో మూడవవాడు గొప్పరాజు సిముకుడు. ఇతను తండ్రి నుండి సువిశాల సామ్రాజ్యం పొందాడు. ఇతడు కాణ్వుడిని, అంత మంచి వారి ఆధిపత్య రాజ్యాలను చేజిక్కించుకున్నాడు. ఆ తరువాత పడమరవైపున ఉన్న రాజ్యాల వరకు రాజ్యవిస్తరణ చేసి పైఠాన్‌ను రాజధానిగా చేసుకున్నాడు. ఆ తరువాత గౌతమి బాలశ్రీ తన పుత్రుడైన గౌతమి పుత్ర శాతకర్ణి విజయాలను నాసిక్ శాసనంలో వేయించి లోకానికి తెలియజేసింది. ఇతను ఎన్నో యుద్దాలు చేసి

[12]రమణయ్య, జైశెట్టి. 2003. కరీంనగర్ జిల్లా చరిత్ర, సంస్కృతి. జగిత్యాల: జైశెట్టి ప్రచురణ. పేజి సంఖ్య – 33.

[13] రమణయ్య, జైశెట్టి. 2003. కరీంనగర్ జిల్లా చరిత్ర, సంస్కృతి. జగిత్యాల: జైశెట్టి ప్రచురణ. పేజి సంఖ్య – 34.

శాతావాహన రాజ్యాన్ని విస్తరించాడు. తూర్పున ఉన్న ధాన్యకటకాన్ని రాజధానిగా చేసుకొని, సువిశాల రాజ్యాన్ని పరిపాలించాడు. ఆ తరువాత వచ్చిన మలి శాతావాహనులు కూడా ధరణికోట కేంద్రంగా తమ పరిపాలనను సాగించారు.

### 1.2.1.2 బాదామి చాళుక్యులు

బాదామి చాళుక్యులు కర్ణాటకలోని బాదామి (వాతాపి)ని రాజధానిగా చేసుకొని సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించారు. క్రీ.శ. 543లో అధికారములోకి వచ్చి రెండు శతాబ్దాలు పాలించారు. క్రీ.శ. 753లో రాష్ట్రకూట దంతిదుర్గుడు వీరిని ఓడించి అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. తెలంగాణ అంతా బాదామి చాళుక్యుల ఏలుబడిలో ఉండేది. బాదామి చాళుక్యులు చక్కటి దేవాలయాలు నిర్మాణం గావించారు. క్రీ.శ. 5 శతాబ్దపు ఐహోలు నందు లఢఖ్ కాన్ దేవాలయం బాదామి చాళుక్యుల తొలి నిర్మాణంగా భావించబడుతుంది. "కరీంనగర్ ప్రాంతాన్ని విభిన్న చాళుక్య రాజ వంశములైన అనగా బాదామి చాళుక్యులు, వేములవాడ చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు వరుసగా 7వ శతాబ్దం నుండి 12 శతాబ్దపు ప్రథమార్థ భాగము వరకు పాలించడం వల్ల చాళుక్యుల కళారీతి, నిర్మాణ కౌశల్య ప్రభావము ఈ ప్రాంతపు దేవాలయముల నిర్మాణంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కరీంనగర్ జిల్లాలోని వాల్గొండ, రాయికల్, ధర్మపురి మొదలైన చోట్ల దేవాలయాల శిఖరాలు చాపరేఖాకృతిని కలిగి చాళుక్యుల కళారీతికి అవి సన్నిహితంగా ఉంటాయి. కరీంనగర్ జిల్లాలో అనేక గణేశ విగ్రహాలు సహజమైన ఏనుగుతలను పోలి కిరీటాలు లేకుండా రెండు చేతులతో చెక్కబడ్డాయి. ఇలాంటి విగ్రహాలు ధర్మపురి, పొట్లపల్లి జగిత్యాలలోని గాంధీనగర్, నూకపెల్లి మొదలైన చోట్ల ఉన్నాయి"[14]

### 1.2.1.3 వేములవాడ చాళుక్యులు

జైశెట్టి రమణయ్య గారు జైశెట్టి రాజయ్య జగిత్యాల కవిగారు వేములవాడ రాజరాజేశ్వర శతకమును రాశాడని తన గ్రంథంలో ప్రస్తావిస్తూ వేములవాడ పద చర్చ చేశారు. "వేములవాడను

[14]Stella kramrisch(art of india), 2003. కరీంనగర్ జిల్లా చరిత్ర, సంస్కృతి. జగిత్యాల: జైశెట్టి ప్రచురణ. పేజి సంఖ్య - 44.

'లేంబులవాడ' అనే వారు శాసనాల్లో లేంబులవాటిక, లేంబులవాడే, లేంబులవాడ అని పేర్కోనబడింది. ఇటివలి ఉచ్ఛారణలో క్రమంగా ఇది లేములవాడ నుండి ఏములవాడ, ఏండాల, వేములవాడగా మారింది. వేములవాడ చాళుక్యులు సపాదలక్ష ప్రాంతాన్ని పాలించిన రాజవంశీయులు. నేటి నిజామాబాదు జిల్లా కరీంనగర్ జిల్లా ప్రాంతాలే ఆనాటి సపాద లక్ష దేశము. సపాద లక్షదేశము అనగా 'లక్ష పాతిక వేల సువర్ణముల ఆదాయం వచ్చు భూమి' అని అర్థం.''[15] వేములవాడ చాళుక్యులు జైన, శైవ మతాలను ఆదరించి అనేక దేవాలయాలు నిర్మించారు. వేములవాడ చాళుక్యల కాలంలో కన్నడ భాషకు స్వర్ణయుగం. ఈ వంశములోని గొప్ప వీరుడైన రెండవ అరికేసరి కన్నడ ఆదికవి పంప మహాకవిని ఆదరించి, గౌరవించి, ధర్మపురి అగ్రహారాన్ని ఇచ్చాడు. వేములవాడ చాళుక్యులు కరీంనగర్‌లోని కురిక్యాలలో జినవల్లభుడు వేయించిన కంద పద్య శాసనం (క్రీ. శ. 946) కలదు. జగిత్యాల సమీపంలో ఆ శాసనం ఉండటం, ధర్మపురి అగ్రహారాన్ని రెండవ అరికేసరికి ఇవ్వడాన్ని బట్టి జగిత్యాల చాళుక్యులు పాలనలో ఉండేదని అర్థమవుతుంది.

### 1.2.1.4 పొలవాస రాజులు

జగిత్యాల జిల్లాలో జగిత్యాల పట్టణానికి 6 కి.మీ దూరంలో జగిత్యాల, ధర్మపురి ప్రధాన రహదారిలో ఉన్న పొలాస గ్రామమే ఆనాటి పొలవాస పట్టణం. పొలవాస నుండి గోదావరిని ఆనుకొని, వరంగల్ జిల్లాలోని నర్సంపేట వ్యాపించి, ఉన్న రాజ్యాన్ని పొలవాస రాజులు పాలించారు. వరంగల్ జిల్లా నర్సంపేట తాలుకాలోని క్రీ.శ 1122 నాటిదైన గోవిందాపురం శాసనం పొలవాస రాజుల వంశావళిని తెలియజేస్తుంది. పొలవాస రాజులు మాధవ చక్రవర్తి, దుర్గరాజు మొదటి మేడరాజు(క్రీ.శ 1080 – 1110), మొదటి జగ్గదేవుడు, రెండవ మేడరాజు, గుండరాజు మొదలైన వారు (క్రీ.శ 1075–1160) వరకు ఈ ప్రాంతాన్ని పాలించారని శాసనాల వల్ల తెలుస్తుంది. మొదటి జగ్గదేవుడు గురించి నర్సంపేట తాలుకాలోని మేడపల్లి గ్రామంలో వేయబడిన జగ్గదేవుని కాలపు క్రీ.శ 1112 శిలాశాసనం తెలుపుతుంది. ఆ రోజులలో రాజులు యుద్ధాలు చేసిన తరువాత తాము పొందిన

[15]రమణయ్య, జైశెట్టి. 2003. కరీంనగర్ జిల్లా చరిత్ర, సంస్కృతి. జగిత్యాల: జైశెట్టి ప్రచురణ. పేజి సంఖ్య – 44

విజయాలకు సూచకంగా కొత్త ఊర్లు స్థాపించేవారు. మొదటి జగ్గదేవుడు 21 యుద్ధములు చేసి తాను సాధించిన విజయాలకు సూచకంగా పొలవాసకు దక్షిణాన తన పేరిట నొక ఊరు జగ్గదేవుడు స్థాపించిన జగ్గదేవాలయమే కాలక్రమేణ జగదాలయముగా నేడు జగిత్యాలగా మారింది.

### 1.2.1.5 కాకతీయులు

వరంగల్లు రాజధానిగా చేసుకొని పరిపాలించిన కాకతీయులు తెలంగాణ ప్రాంతాన్ని, ఆంధ్ర ఉత్తర భాగాన్ని పాలించారు. కరీంనగర్ ఆనుకొని ఉన్న ప్రస్తుత జగిత్యాల జిల్లా ఆనాటి కాలంలో వీరి సుపరిపాలనలో భాగమై విరాజిల్లి ఉంటుంది. దానికి సాక్ష్యాలే వారు నిర్మించిన శైవ మత ఆలయాలు జగిత్యాలలో కూడా కనిపిస్తాయి. కాకతీయుల పాలకుల్లో ఒకడయిన రెండవ ప్రోలరాజు కుమారుడు రుద్రదేవుడు పొలవాస రెండవ మేడరాజు, నగనూరు దొమ్మరాజు కళ్యాణి నుండి పంపబడిన సేనాని మైలిగిదేవునితో కూడి ముగ్గురి మిత్ర కూటమిని ఓడించారు. పొలవాస పట్టణం ధ్వంసం చేసి అక్కడ సంపదంత దోచుకుంటాడు. పొలవాస రాజ్యం క్రీ. శ. 1159లో శాశ్వతంగా కాకతీయ రాజ్యంలో విలీనమయింది.

“క్రీ. శ 1613 ఏప్రిల్ 15 వ తేదిన వేయించిన వెలమల శాసనం మోటుపల్లి మండలం వెల్గొండ గ్రామంలో ఉన్నది. ఈ శాసనంలో ఇనుగంటి మరియు జువ్వాడి వెలమ వంశస్థుల ప్రసక్తి కలదు. వీరి రెండవ శాసనం ధర్మపురి బ్రహ్మపుష్కరిణి మధ్య నున్న మంటప స్తంభముపై క్రీ.శ 1644లో చెక్కబడి  ఉంది. శాలివాహన శక 1566 పార్థివ, వైశాఖ శుద్ధ త్రయోదశి సోమవారం రోజున ఈ శాసనం జూపల్లి ధర్మరాయుడు బ్రహ్మపుష్కరిణి చుట్టూ సోపానములు కట్టించి, పుష్కరిణి మధ్యలో వేదిక నిర్మాణం గావించగ దానిపై చింతల నరుసాబోయిని కుమారుడు తిర్మలయ్య భోగ మంటపం కట్టించి పుష్కరిణి చుట్టూ ప్రాకారం పిట్టగొడ నిర్మించెనని తెలుపుచున్నది.”[16] నేటికిని జగిత్యాల మండలంలోని చల్‌గల్, ధర్మపురి మండలంలో జువ్వాడి వంశస్థులున్నారు.

[16]రమణయ్య, జైశెట్టి. 2003. కరీంనగర్ జిల్లా చరిత్ర, సంస్కృతి. జగిత్యాల: జైశెట్టి ప్రచురణ. పేజి సంఖ్య – 94

## 1.2.2 జగిత్యాల జిల్లా – ఆధునిక చరిత్ర

### 1.2.2.1 బహమనీ సుల్తానులు

బహమనీ సుల్తానుల్లో ఒకడైన మహ్మద్ షా ప్రధానమంత్రి. గొప్ప పరిపాలనాదక్షుడు. బహమనీ రాజ్యాన్ని బెరారు, దౌలత్‌బాదు, గుల్బర్గా, తెలంగాణ 4 తరఫ్‌లను ఎనిమిది తరఫ్‌లగా విభజించాడు. ఈ విభజనలో తెలంగాణలో ఓరుగల్లు, రాజమహేంద్రవరం అను రెండు తరఫ్‌లుగా రూపొందింది. రాజమహేంద్రవరముకు నిజాం ఉల్ ముల్క్ మాలిక్ హసన్ భైరి సర్ లష్కరేగా, అజీమ్ ఖాన్ ఓరుగల్లునకు సర్ లష్కర్‌గా నియమింపబడినారు. ఒక్కొక్క తరఫ్ కొన్ని సర్కారులుగా, ఒక్కొక్క సర్కారు కొన్ని పరగణాలుగా, ఒక్కొక్క ఫరగణా కొన్ని గ్రామాలుగా విభజింపబడ్డాయి. ఓరుగల్లు తరఫ్‌నందు కరీంనగర్ జిల్లాలోని ఎల్గందల్, మొలంగూర్ సర్కారులుగా ఉండేవి. ఈ సర్కారులు ఫరగణాలుగా విభజింపబడ్డాయి. ఆనాటి ఫరగణాలో పొలాస కూడా ఒకటి. క్రీ. శ1347 – 1480 వరకు బహమనీ సుల్తానులు తెలంగాణ ప్రాంతాన్ని పాలించారు. జగిత్యాల జిల్లాలోని పొలాస ఫర్గణా కేంద్రంగా ఉండి ఈ జిల్లా ప్రాంతమంత వారి పాలనలో ఉండేదని తెలుస్తుంది. "అబుల్ హసన్ తానీషా గారి మంత్రుల్లో ఒకరైన మాదన్న క్రీ. శ 1676 లో ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ ఉత్సవములకు మరియు నిత్యపూజలకై అక్కడి బ్రాహ్మణులకు భూమిని దానం చేశారు. ప్రభుత్వ ముద్రతో కూడిన పత్రాలు ఇప్పటికి సంగనభట్ల నరహరి వారసుల వద్ద భద్రంగా నున్నవి"[17]

### 1.2.2.2 కుతుబ్‌షాహిలు

షాజహన్ చక్రవర్తిగా ఉన్నప్పుడే కరీంనగర్ జిల్లాలోని రామగిర్ దుర్గమును గోలకొండ అబ్దుల్లా కుతుబ్‌షా తన రెండవ కూతురును, అప్పటి దక్కన్ రాజ ప్రతినిధి ఔరంగజేబు కుమారుడైన మహమ్మద్ కిచ్చి క్రీ.శ 1656లో వివాహం చేస్తారు. ఆ సందర్భములో మొగలులకు వరకట్నం క్రింద రామగిరి దుర్గాన్ని ఇచ్చారు. అప్పటి రామగిరి దుర్గము జగిత్యాల జిల్లాకు తూర్పు ప్రాంతంలో ఉంది. మొగలులు హిందు దేవాలయాలపై చేసిన దాడికి గుర్తులుగా నేడు ధర్మపురి దేవాలయాల్లో ఖండించి పడవేసిన

[17] రమణయ్య, జైశెట్టి. 2003. కరీంనగర్ జిల్లా చరిత్ర, సంస్కృతి. జగిత్యాల: జైశెట్టి ప్రచురణ. పేజి సంఖ్య – 122

విగ్రహాలు కనిపిస్తాయి. "ఔరంగజేబు పాలనలో రుస్తుమే దిల్ ఖాన్ క్రీ.శ. 1687-1701 మధ్య కాలంలో హైదరాబాదు సుబేదారుగా ఉన్నారు. అతడు క్రీ.శ. 1693 ధర్మపురిలో ప్రాచీన నృసింహ దేవాలయాన్ని మసీదుగా మార్చి అబుల్ హసన్ ఫారస్‌ను మౌజన్ గా నియమించి మసీదు నిర్వహణకై 75 ఎకరాలు ఇచ్చాడు. వాటికి సంబంధించిన ఆధారాలు యస్. నరహరి వద్ద ఉన్నట్లు తెలుస్తుంది. మసీదు మార్చడానికి ముందు అది త్రికూటాలయం, అధిష్టానముపై నాలుగు పత్రములతో కూడిన కమలములు వరుసగా కనిపించేవి."[18] యం నరసింహచార్య గారి మాటలను జైశెట్టి రమణయ్య తన గ్రంథంలో తెలిపారు. ఈ విధంగా దేవాలయాలపై దాడులు, రామగిర్ కోట దుర్గము ఆక్రమణతో మొగలు చక్రవర్తులు పాలన ఈ జిల్లా వ్యాప్తంగా సాగిందని తెలుస్తుంది. క్రీ.శ. 1724 అసఫ్‌జాహి పాలన ఆరంభం వరకు మొగలు రాజుల పాలనలో ఉండేది.

### 1.2.2.3 అసఫ్‌జాహిలు

అసఫ్‌జాహిలు హైదరాబాదు రాష్ట్రాన్ని క్రీ.శ. 1724 నుండి క్రీ.శ. 1948 వరకు దాదాపు 225 సంవత్సరాలు సుదీర్ఘంగా 7 గురు నవాబులు పాలించారు. అసఫ్‌జాహి వంశస్థాపకుడు మీర్‌ఖమ్రుద్దీన్. ఇతనికే నిజాం ఉల్ ముల్క్ అని బిరుదు. వీరు మధ్య ఆసియాలోని సమర్ఖంద్ సమీపం నుండి వచ్చి భారతదేశంలో మొగలుల కొలువులో సామంతులుగా స్థిరపడ్డారు. నిజాం ఉల్ ముల్క్, నిజాం అలీఖాన్, సికందర్ జా, నాసిరుద్దౌలా, అఫ్జలుద్దౌలా, మీర్ మహబూబ్ అలీఖాన్, మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ మొదలైన అసఫ్‌జాహి పాలకులు హైదరాబాదు రాష్ట్రంలో ఉన్న తెలంగాణ ప్రాంతాన్నంతటిని పాలించిన రాజులు. వీరి పాలనలో సాలార్‌జంగ్ సంస్కరణలు చెప్పుకోదగ్గవి. హైదరాబాదు నగరంలో చార్మినారు, హుస్సేన్ సాగర్, భాగ్యనగర్, సికందర్‌బాదు, చౌమహల్ ప్యాలెస్, ఫలక్‌నుమా ప్యాలెస్ మొదలైన చారిత్రక కట్టడాలను నిర్మాణం చేసారు. సువిశాల సామ్రాజ్యాన్ని సుసంపన్న రాజ్యంగా చేసుకొని పాలించారు. కానీ చివరి రాజైన ఉస్మాన్ అలీఖాన్ కాలంలో ఈ ప్రాంతం స్థానిక అధికారులైన రజాకార్లు, జమీందారులు, భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, పటేల్ ఇలా అందరు ప్రజలను

[18]రమణయ్య, జైశెట్టి. 2003. కరీంనగర్ జిల్లా చరిత్ర, సంస్కృతి. జగిత్యాల: జైశెట్టి ప్రచురణ. పేజి సంఖ్య – 122

ఎన్నో విధాలుగా పీడించి, అక్రమంగా అన్ని విధాలా దోచుకున్నారు. వారి భూస్వామ్య దౌర్జన్యానికి చిహ్నాలుగా నేటికి జగిత్యాల జిల్లా రాజారం, దొంతాపూర్ లాంటి గ్రామాల్లో శిథిలంగా పడివున్న గడులు, కోటలు, ప్రాకారాలు కనిపిస్తాయి.

## 1.3 భారత స్వాతంత్ర్య సమరంలో – జగిత్యాల జిల్లా పాత్ర

భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ, నెహ్రూ, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ లాంటి మహనీయుల స్ఫూర్తి పొందిన వారు ఈ జిల్లాలో ఉన్నారు. భారత స్వాతంత్రోద్యమంలో గ్రంథాలయోధ్యమంలో కీలకపాత్ర వహించింది. గ్రంథాలయాలు ప్రారంభమయ్యాక ఎందరో మహనీయులు దాని ప్రేరణతో బ్రిటిషు వారి నుండి స్వాతంత్ర్యం సాధించుకునేందుకు సిద్ధమయినారు. యావత్తు భారతదేశాన్ని ప్రభావితం చేసిన గ్రంథాలయోద్యమం తెలంగాణ ప్రాంత ప్రజలను కూడా ప్రభావితం చేసింది. నాడు మనిషిలో విజ్ఞానం నింపి స్వాతంత్ర్య సమరయోధునిగా తీర్చి దిద్దినవి గ్రంథాలయాలు. ఎంతోమంది ఈ గ్రంథాలయాల ద్వారా చదువుకొని, సమరానికి సుశిక్షితులై అటు బ్రిటిషు సామ్రాజ్య దాస్య శృంఖలాల నుండి బయటపడటానికి మరియు ఇటు నిజాం సామ్రాజ్య కబంధ హస్తాల నుండి విముక్తి పొందడానికి స్వాతంత్ర సమరయోధులుగా సిద్ధమైనారు. ఇది ఒక వైపు గాంధీ గారి నాయకత్వంలో జరిగిన సత్యాగ్రహ సంగ్రామానికి దోహదకారి అయితే మరొక వైపు ఈ సంస్థానములో జమలాపురం కేశవరావు, స్వామీ రామానంద తీర్థ నాయకత్వంలో జరిగిన హైదరాబాదు విమోచన ఉద్యమానికి తోడ్పడింది. యావత్తు భారతదేశంతో పాటు కరీంనగర్ ప్రాంత మండలాలు కూడా గ్రంథాలయో ద్యమాన్ని, దాని ప్రాముఖ్యతను అవసరాన్ని గుర్తించాయి. “జగిత్యాలలో ఆంధ్ర గ్రంథాలయం అను పేర శ్రీ కోసం శివరాజంగుప్తా స్థాపించారు. ఆనాడు శివరాజం గుప్తా గారు ఇంటికి 10పైసాల వంతున ప్రోగుచేసుకొని పుస్తకాలను, వార్తపత్రికలను తెప్పించి పఠనాశక్తిని పెంచారు. అదేవిధంగా శతావధాని కృష్ణమాచార్యులు ఫలితంగా కోరుట్ల గ్రామంలో సంస్కృత ఆంధ్ర ప్రచారిణి గ్రంథాలయం స్థాపించబడుతుంది. ఆచార్యుల వారు ఇంటింటా కొంత బియ్యం పోగు చేసి వాటిని అమ్మి వచ్చిన డబ్బులతో పుస్తకాలు కొని పాఠకులకు అందించేవారు.

రాజారెడ్డి, కోనపాదల నరసింహులు, మాధవరెడ్డి, కొండపల్లి అచ్యుతరావు, జగన్నాధం, పోగుల రాజరత్నం, రాగుల చంద్రయ్య, వై. ఆనందరావు, కర్తె మల్లయ్య మొదలైనవారు ఈ జిల్లాకు చెందినవారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నవారు"[19]. ఈ విధంగా ఎందరో మహనీయులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అంతేగాకుండా నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకించి, నిజాం పోలీసులను ఎదిరించి వారి జీవితాలను పణంగా పెట్టి అరెస్టు అయినవారున్నారు.

## 1.4 జగిత్యాల జిల్లా – రైతుల జైత్రయాత్ర

జగిత్యాల జైత్రయాత్ర రైతు కూలీల భారీ బహిరంగ సభ జరిగి 40 యేళ్లు గడిచింది. తెలంగాణ ఉద్యమానికి ఎంతో స్పూర్తినిచ్చిన ఉద్యమమిది. 1967లో ఆరంభమైన నక్సల్స్ బరి ఉద్యమం 1969 వరకు కొనసాగింది. 1969 నుంచి 1971 వరకు ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటంగా బలమైన అస్తిత్వాన్ని ప్రకటించుకుంది. ఈ వీరోచిత పోరాట ప్రభావం తెలంగాణ కవులు, రచయితలు, మేధావులు, విప్లవకారుల మీద పడింది. దోపిడికి ఆస్కారం లేని నూతన సమ సమాజాన్ని ప్రతిపాదిస్తూ సాహిత్య సృజన కొనసాగింది. పౌర హక్కుల సంఘాలు, విప్లవ రచయిత సంఘం, జన నాట్య మండలి వామపక్ష విప్లవ భావాలను ప్రజాసాహిత్యం, ప్రజా కళారూపాల్లో ప్రచారం చేశాయి. ఈ క్రమంలోనే 'భారత విప్లవోద్యమానికి జవజీవాలు పోసిన విద్యార్థుల్లారా గ్రామాలకు తరలండి' అని విప్లవోద్యమ నాయకత్వం పిలుపునిచ్చింది. జగిత్యాలలోని SKNR కళాశాల గ్రౌండ్‌లో 1978 సెప్టెంబరు 9 నాడు రైతుల మహసభను ఏర్పాటు చేశారు. ఆ సభల తరువాత ప్రజాసంఘాల ఏర్పాటు ప్రభావం పార్టీ శక్తిని అంచనావేయాలన్న ఉద్దేశ్యంతో రైతుకూలీ శక్తి ప్రదర్శన నిర్వహించాలని ముప్పాళ్ల లక్ష్మణ్ రావు, మల్లోజు కోటేశ్వర్, శీలం నరేష్, కైరి గంగరాం, నారదాసు లక్ష్మణ్ రావు, అంగ ఓదెలు, పోశాలు, నల్లా ఆదిరెడ్డి, మల్లా రాజిరెడ్డి, సాహు, కల్లూరి నారాయణలు, అల్లం నారాయణ, పోరెడ్డి వెంకటరెడ్డి మొదలైనవారు పాల్గొని తమ ప్రసంగాలతో ప్రజల్ని ఉత్తేజపరిచారు.

---

[19]సిహెచ్ ఆచార్య, కాటం రమేష్, కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమర చరిత్ర. పుట సంఖ్య. మే, 2000.

180 గ్రామాల నుంచి సుమారు 80 వేల మంది రైతు కూలీలు ఎవరికి వారే స్వచ్ఛందంగా, జన జాతరై సభకు తరలివచ్చారు. "జగిత్యాల జైత్రయాత్ర తర్వాతనే కొండపల్లి సీతారామయ్య నేతృత్వంలోని పీపుల్స్ వార్‌గా అవతరించింది. వారి ఉద్యమ విస్తృతికి జైత్రయాత్ర ప్రయోగశాలగా మారి దేశంలో 17 రాష్ట్రాలలో ఉద్యమ వ్యాప్తికి దోహదపడింది. రహదారులు, వాహన సౌకర్యాలు అరకొరగా ఉన్న దశలో పట్టణాలకు కొంతమేరకు పరిమితమైన ప్రచార సాధనమున్న దండెపల్లి, జన్నారం, లక్షెటిపేట, ఖానాపూర్ ప్రాంతాలతో పాటు జిల్లా వాసులంతా (కరీంనగర్ జిల్లా మొత్తం) దాదాపు 3.50 లక్షల మంది జగిత్యాల జైత్రయాత్రలో పాల్గొన్నారు. వెట్టి చాకిరి నిర్మూలించాలి. కూలీరెట్లు పెంచాలి. దున్నేవాడికే భూమి అంటూ తదితర డిమాండ్లతో నగరవీధుల గుండా భారీ ఊరేగింపు, బహిరంగ సభ జరిగింది"[20]. ఈ సభకు సుబ్బారెడ్డి గారు అధ్యక్షత వహించగా, గద్దరు గజ్జెకట్టి పాటలతో రైతులను, ప్రజలను చైతన్యపరిచారు. భారతీయ విప్లవోద్యమ చరిత్రలో అద్వితీయమైన చారిత్రక ఘట్టంగా నిలిచిపోయింది.

"సద్దిమూట కట్టుకొని, గొంగడి భుజాన వేసుకొని చేతిలో గుత్పకర్రలతో యుద్ధానికి తరలిన కదనోత్సాహంతో కదిలివచ్చారు. ఎటూ చూసినా జనజాతరై కిక్కిరిసిన జగిత్యాల సముద్రంలా ఉప్పొంగి వీధుల్లోకి ప్రవహించినట్లు అలలు అలలుగా జనం. లాంగ్ మార్చ్ చేసే ఎర్ర సైన్యం కవాతులా సాగిన పల్లె ప్రజల మట్టి పాదాలు, పాద ముద్రల ఆనవాళ్లు. నింగినంటిన నినాదాల హోరు. వేదికపై గద్దర్ మొదలైన జన నాట్య మండలి కళాకారుల పాటల తూటాలు. అది మామూలు సభ కాదు. దశాబ్దాల ఆకాంక్షల సంకెళ్లలో బంధించిన జన బాహుళ్యం. ఒక్కసారి కట్టలు తెంచుకున్న కడలి ప్రవహమై కదిలిన హోరు"[21]. విప్లవోద్యమానికి మద్దతూ తెలుపుతూ వచ్చిన జనం చూసిన తెల్లవారున వార్తల్లో అనేక క్యాప్షన్లతో ప్రచురించాయి. అందులో ఒక క్యాప్షనే జగిత్యాల జైత్రయాత్ర. అప్పటి రైతుల ఉద్యమ సభను చూసిన కరీంనగర్, ఆదిలాబాదు భూస్వాములు ఏకమై అప్పటి ముఖ్యమంత్రి

[20]జనం సాక్షి – జగిత్యాల జైత్రయాత్రకు నేటితో 35 యేళ్లు, 9 సెప్టెంబరు 2012. (Telugu daily news portal – cover page)

[21]నమస్తే తెలంగాణ – విప్లవ పాఠశాల జగిత్యాల జైత్రయాత్ర (సంపాదకీయ వ్యాసం), 9 అక్టోబరు 2014.

చెన్నారెడ్డికి మొర పెట్టుకోగా జగిత్యాల, సిరిసిల్లను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి, పోలీసులకు విశేష అధికారాలిచ్చి తీవ్ర నిర్బంధాన్ని విధించారు. పల్లె ప్రాంతాల్లోని శ్రామికులు, కర్షకులు, బడుగు బలహీన వర్గాల వారు అణచివేతకు, దోపిడికి గురవుతున్నవారికి ప్రశ్నించే దమ్ము, ధైర్యాన్ని ఈ జైత్రయాత్ర ప్రసాదించిందంటే జగిత్యాల జైత్రయాత్ర ప్రభావం ఏ మేరకు ఉందనేది మనం అర్థం చేసుకోవాలి. ఈ జైత్రయాత్ర తరువాత ఈ ప్రాంతంలో అంటరాని తనం తగ్గింది. భూస్వాముల ఆగడాలకు అడ్డుకట్ట పడింది. పాలేర్ల జీతాలు పెరిగి కొంత స్వేచ్ఛ దొరికింది. పౌరహక్కుల, మానవ హక్కుల సంఘాలెన్నో పురుడు పోసుకున్నాయి. ప్రజల జీవితాల్లో ఊహించని మార్పులన్ని చోటుచేసుకున్నాయి.

## 1.5 చారిత్రక స్థలములు – పర్యాటక ప్రదేశాలు

### 1.5.1 ధర్మపురి

తెలంగాణలో ఒక ప్రముఖ పుణ్యక్షేత్రం. తీర్థరాజం. జగిత్యాల నుండి 30 కి.మీ దూరంలో పవిత్రమైన గోదావరి నది తీరమందున ధర్మపురి కలదు. ఇక్కడ గోదావరి నది ఉత్తరము నుండి దక్షిణ దిశకు ప్రవహించుట విశేషం. పవిత్ర స్నానం ఆచరించడానికి బ్రహ్మగుండం, యమగుండం, సత్యవతీ గుండం, చక్రతీర్థం, గొల్ల మడుగు, బ్రహ్మపుష్కరిణి (కోనేరు) మొదలైన నీటి గుండాలున్నాయి. ప్రాచీన ప్రాశస్త్యము, చారిత్రక విశేషాలను, పూర్వ వైభవాలను తెలిపే దేవాలయాలు అనేకం కనిపిస్తాయి. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి, యోగ లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ రామలింగేశ్వరాలయం, శ్రీ గోపాల కృష్ణ స్వామి, శ్రీ సంతోషిమాత, శ్రీ సద్గురు స్వామి మొదలైన దేవాలయాలే కాకుండా చిన్న చిన్న ఆలయాలతో వీధికొక దేవాలయం కలదు. శ్రీ మహవిష్ణువు అవతారమైన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ప్రసిద్దిగాంచటం వల్ల గొప్ప హైందవ క్షేత్రంగా విరాజిల్లినది. "శక సంవత్సరం క్రీ.శ 928 కి సంబంధించిన ధర్మపురి క్షేత్ర మహత్మ్యము అను

స్థలపురాణం ఈ ప్రాంత విశిష్టతను తెలియజేస్తుంది. ఇది 105 అధ్యాయాలు, 3500 సంస్కృత శ్లోకాలతో కూడుకొనిన తాళపత్రగ్రంథం"[22]

"వేములవాడ పాలకులందరిలో అతి శ్రేష్ఠుడైన రాజు రెండవ అరికేసరి క్రీ.శ 930-955 తన ఆస్థాన కన్నడ కవి పంప రచించిన విక్రమార్జున విజయమును, మహాభారత రచనకు సంతోషించి ధర్మపురమును అతని అగ్రహారముగా ఇచ్చెనని జినవల్లభుడు బొమ్మల గుట్టపై నున్న సువిశాల సమతల సిద్ధశిలపై వేయించిన కురిక్యాల శాసనం(క్రీ.శ 945) వల్ల తెలుస్తుంది. సాహిత్యగ్రంథాలైన ఏకామ్రనాధుని ప్రతాప చరిత్ర, కొఱవి గోపరాజు సింహసన ద్వాత్రింశికలో, పోతన నారాయణ శతకం, చరిగొండ ధర్మన్న చిత్రభారతం, శేషప్ప కవి త్రిశతి శతకాల్లో మొదలైన గ్రంథాలందు ధర్మపురి ప్రసక్తి కలదు."[23] 1956లో కొరిడె సదాశివ శాస్త్రి, 1979లో యం. శ్యాం సుందరశాస్త్రి ప్రచురించిన ధర్మపురి క్షేత్ర మహాత్మ్య గ్రంథాలు కూడా ధర్మపురి గురించి వివరాలను తెలియజేస్తాయి. పూర్వ కాలంలో ధర్మవర్మ అనే మహారాజు నృసింహుడిని గూర్చి తపస్సు చేస్తుండగా, అతని తపస్సుకి మెచ్చి లక్ష్మీ సమేతుడై యోగ నారసింహుడుగా ఈ క్షేత్ర మందు అవతరించాడని ప్రతీతి. ధర్మపురి క్షేత్రం, పితృకర్మలకు, కుజదోష నివారణకు ప్రసిద్ధం. కుజదోషమున్నవారు ఈ క్షేత్రమందు స్వామి వారికి కళ్యాణం చేయించిన వారి కుజదోష నివారణ జరిగి తొందరగా వివాహం జరుగుతుందని ప్రజల విశ్వాసం. ప్రాచీన కాలం నుంచి వైదిక విద్యలకు, జ్యోతిశ్శాస్త్రానికి ప్రముఖ స్థలంగా పేరొందింది. నేటికి సంప్రదాయం వేదవిద్యలకు నెలవై ఉన్నది. ఆనాది నుండి వేల సంఖ్యలో భక్తులు పవిత్రగోదావరి స్నానాలు ఆచరిస్తూ ఈ దివ్యక్షేత్రాన్ని సందర్శిస్తున్నారు. 12 సంవత్సరాలకొకసారి వచ్చే గోదావరి పుష్కర స్నానమాచరించడానికి సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కూడా భక్తులు విశేషంగా వస్తారు.

[22]రమణయ్య, జైశెట్టి. 2003. కరీంనగర్ జిల్లా చరిత్ర, సంస్కృతి. జగిత్యాల: జైశెట్టి ప్రచురణ. పేజి సంఖ్య – 205

[23]రమణయ్య, జైశెట్టి. 2003. కరీంనగర్ జిల్లా చరిత్ర, సంస్కృతి. జగిత్యాల: జైశెట్టి ప్రచురణ. పేజి సంఖ్య – 207

## 1.5.2 కోరుట్ల

జగిత్యాల నుండి 27 కి.మీ దూరంలో నిజామాబాదు పోవు రహదారిపై కోరుట్ల పట్టణం ఉంది. కోరుట్లలో ఉన్న పాత కోట, ఎత్తైన మట్టిగోడలు, కోట ద్వారాలు, కోట చుట్టు ఉన్న కందకాలు, రాతి ఇటుకతో కట్టిన బురుజులు సందర్శకుల దృష్టినాకర్షిస్తాయి. కోరుట్లలో ఉన్న రట్ట మార్తాండ జినాలయం కూడా వేములవాడ చాళుక్య ప్రభువు కాలంలో నిర్మించారు. ఈ గుడి పేరు మహాదేవాలయంగా వ్యవహరింపబడుతుంది. 10,12 శతాబ్దములలో కొరవట్టు జైనుల కేంద్రమగుటచే ఈ పట్టణమునకు కొరవట్టుల, దాని నుండి కోరుట్ల అను నామం వచ్చి ఉంటుంది. కొరవట్టుల పదమే కోరుట్లగా మారిందని చరిత్రకారుల అభిప్రాయం. ఇప్పుడున్న మహాదేవాలయం బయట ఉన్న జైనుల విగ్రహాలు, సప్త మాతృకల శకలము, సూర్యుడు మొదలైన చరిత్ర తెలిపే అవశేషాలు. కోరుట్ల వాగు ఒడ్డు మీదున్న షిరిడి సాయిబాబా దేవాలయం జనప్రియమైన దేవాలయంగా నిత్యం భక్తకోటితో కిటకిటలాడుతుంది. ఒక దశాబ్దం కింద కోరుట్ల కాగిత పరిశ్రమకు సుప్రసిద్ధమైంది. నిజాం కాలంలో హైదరాబాదు, సిద్దిపేట, వరంగల్, నాందేడ్, షోలాపూర్ తదితర ప్రాంతాలకు కావలసిన కాగితాన్నంత ఈ పరిశ్రమ అందించేది. ఇప్పుడు ఈ పరిశ్రమ మూలనపడింది. ఇక్కడ స్త్రీలు బీడిలు చేసే కుటీర పరిశ్రమ ప్రసిద్ధం. కోరుట్లకు దగ్గరున్న నాగులపేట సైఫాన్, పైడిమడుగు మర్రిచెట్టు, మల్లాపూర్ వాల్గొండ దేవాలయాలు రమణీయమైన ప్రకృతి శోభలతో అలరారుచున్న ప్రదేశాలు.

## 1.5.3 పొలాస

జగిత్యాలకు 6 కి.మీ దూరంలో పొలాస గ్రామం కలదు. ధర్మపురి పోయే జాతీయ రహదారిపై నున్న ఈ పొలాస గ్రామం ఒకప్పుడు పొలవాస రాజులు పాలించిన పొలవాస రాజ్యానికి రాజధానిగా ఉండేది. పొలవాస రాజులు రాష్ట్రకూట సేనానుల సంతతివారు. పొలాస పంచాయితీ కార్యాలయం దగ్గర ఉన్న శిలాస్తంభముపై ఒక శాసనము. అలాగే 49 పంక్తులతో కన్నడ శిలాశాసనము పులస్తేశ్వర దేవాలయం ప్రాంగణంలో నిలిచి ఉంది. ఈ శాసనము పూర్వం పొలాస పులస్త్యాశ్రమ పట్టణంగా ఉండి దానములు స్వీకరించినదిగా శాసనాల వల్ల తెలుస్తుంది. పొలాస గ్రామంలో శిథిలయాలు, అనేక

శిల్పాలు ఉన్నాయి. పొలాస చెరువుకు ఉత్తరాన పొలంలో పులస్తేశ్వరాలయం తూర్పు ముఖం కలిగి ఉంది. ఆ ప్రాంతంలో ఉన్న పురాతన విగ్రహాలు, వేణుగోపాలస్వామి దేవాలయం, ఎల్లమ్మ గుడి, భైరవుడు, జైన విగ్రహాలు మొదలైనవి త్రవ్వకాల్లో బయల్పడి నాటి చారిత్రక విషయాలెన్నో తెలుపుతాయి. నాగిని దేవతలు, సప్త మాతృకలు శిలాఫలకాలు ఉన్నాయి. పొలాస చెరువు కట్టపై గణపతి విగ్రహం, అన్నపూర్ణ దేవి, జైన ప్రతిమ శిథిలమైన పూర్వదేవాలయానికి సంబంధించిన ప్రతిమలు చాళుక్య రీతిలో ఉన్నాయి.

## 1.5.4 నంది మేడారం

జగిత్యాల జిల్లా ధర్మారం మండలానికి దగ్గరగా నంది మేడారం అనే గ్రామం ఉంది. రెండు గుట్టచోరులను కలుపుతూ నిర్మించిన పెద్ద చెరువు కట్ట వెనుక భాగంలో కాకతీయ కళారీతులలో చెక్కబడిన ఒక బృహత్ నంది విగ్రహం ఉండటం వల్ల ఈ గ్రామానికి నంది మేడారం అనే పేరు వచ్చింది. పొలవాస దేశాన్ని పాలించిన రెండవ మేడరాజు 1175లో త్రికూటాలయం నిర్మించాడు. ఈ గ్రామంలో అమరేశ్వర్, నంది ముందున్న దేవాలయం, బృహత్ నంది, నాగకన్య విగ్రహాలున్నాయి. కాకతీయ కళారీతులు ఉట్టిపడే విధంగా బృహత్ నంది విగ్రహం శిలాపీఠంపై మలచబడింది.

## 1.5.5 రాయికల్

జగిత్యాలకు 20 కి.మీ దూరంలో రాయికల్ మండలం ఉంటుంది. రాయికల్ చెరువుకి తూర్పు భాగంలో గల గుడికోటలో చాళుక్య శిల్ప కళారీతులతో నిర్మింపబడిన త్రికూటలాయం ఉంది. అది 11 వ శతాబ్దానికి చెందింది. దీనిని ఇప్పుడు పంచముఖ కేశవనాథ దేవాలయంగా పిలుస్తున్నారు. ఒక అముద్రిత శాసనం వల్ల రవికంటి లేదా రాయికంటి పూర్వనామం అని తెలుస్తుంది. ఈ గ్రామంలో వృద్ధులు ఇప్పటికి రవికంటి లేదా రాయికంటి అని పిలుస్తారు. రవికంటి అనగా సూర్యుని కన్ను అని అర్థం.

## 1.5.6 కోటిలింగాల

ధర్మపురి గ్రామం నుండి 10 కి.మీ దూరాన వెల్గటూరు మండలంలో కోటిలింగాల గ్రామం గోదావరి ఒడ్డున కలదు. కోటిలింగాల అంటే వాస్తవానికి కోటి సంఖ్యలో లింగాలు ఉండవు. ఇక్కడ తవ్వకాల్లో శాతావాహనుల కోట బయట పడింది. ఈ కోటలో కోటీశ్వర, సిద్దేశ్వర లింగములు గల శివాలయాలు ఉన్నాయి. మొదట ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన శాతావాహనుల తొలి రాజధాని కోటిలింగాల జగిత్యాల జిల్లాలోనే ఉంది. ఇది చారిత్రకంగా నాగరికత కలిగిన ప్రాచీన ప్రదేశం. ఇక్కడ సిముకుని నాణాలను బట్టి కోటిలింగాల శాతావాహనుల బలిష్టమైన దుర్గమని తెలుస్తుంది. జైన మునులు నివసించిన మునులుగుట్ట ఇచ్చటికి సమీపంలోనే ఉంది. మూడు దశాబ్దాలక్రితం జరిపిన తవ్వకాల్లో అనేక ప్రాచీన చారిత్రక అవశేషాలు బయటపడ్డాయి. "రాయపట్నం నుండి కరీంనగర్ పోవు దారిలో ఎడమవైపున ఒక గుట్టపై చిన్న బౌద్ధస్థూపముండేది. గోదావరికి 3 కి.మీ దూరంలో స్తంభంపెల్లి గ్రామమున గల పాశిగాం గ్రామంలో ఈ స్తూపం ఉండేది. 1999 డిసెంబర్ చివరలో ఇర్కన్ సంస్థ కాంట్రాక్టర్లు రోడ్ వెడల్పు కార్యక్రమంలో ప్రోక్లేన్లతో ఈ గుట్టమట్టిని తీయగా ఇక్కడి స్థూపం సంపూర్ణంగా శిథిలమైంది. క్రీ.పూ 2 వ శతాబ్దం నుండి కాపాడుకొనిన ఈ స్థూపం 2200 సంవత్సరాల తరువాత ఒక్కసారి నేలమట్టం కావడం విచారకరం"[24].

## 1.5.7 కొండగట్టు

జగిత్యాల పట్టణానికి 15 కి.మీ దూరంలో ముత్యంపేట దగ్గర ఈ క్షేత్రం ఉంది. ఈ ప్రదేశంలో ప్రకృతి సిద్ధమైన చాలా కొండలు, లోయలు, సేలయేరులు ఉంటాయి. ఈ గుడిలో 40 రోజుల పాటు పూజ చేస్తే సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. పూర్వ రామరావణ యుద్ధం జరిగే సందర్భంలో లక్ష్మణుడు మూర్ఛనొందగా సంజీవని తెచ్చేందుకు హనుమ బయలుదేరతాడు. అతడు సంజీవని తెచ్చేటపుడు ముత్యంపేట అనే ఈ మార్గమున కొంత భాగం విరిగిపడిందని, ఆ భాగామే కొండగట్టుగా ప్రజలు నమ్ముతారు. 300 సంవత్సరాల క్రితం సింగం

---

[24]జైశెట్టి రమణయ్య, కరీంనగర్ జిల్లా చరిత్ర, సంస్కృతి. జెశెట్టి ప్రచురణ. జగిత్యాల. 2003. పేజి సంఖ్య – 30.

సంజీవుడు అనే పశువుల కాపరి ఆంజనేయ విగ్రహం చూసి చిన్న దేవాలయాన్ని నిర్మించాడని మరో కథనం కూడ ప్రచారంలో ఉంది. ప్రస్తుతం ఉన్న ఆలయం 160 సంవత్సరాల క్రితం కొడిమ్యాలకు చెందిన క్రిష్ణారావు అనే దేశ్‌ముఖ్ కట్టించాడు. ఇక్కడ శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీదేవి విగ్రహాలు గర్భాలయంలో ఉన్నాయి. శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహం శోభాయమానంగా ప్రకాశిస్తుంది. ఉత్తర తెలంగాణ నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు విరివిగా వచ్చి ఈ క్షేత్రాన్ని సందర్శిస్తారు.

### 1.5.8 జగిత్యాల

జగిత్యాల అనే పట్టణం నూతన జిల్లాగా ఏర్పడింది. దాదాపు ఆరు దశాబ్దాల నుండి మున్సిపల్ కౌన్సిల్‌చే పాలించబడుతున్న జిల్లాల్లోని అతిపెద్ద పట్టణం. తెలంగాణలోని కరీంనగర్‌లో తాలుకా కేంద్రంగా పేరొందిన పట్టణం. జగిత్యాలను జగ్గదేవుడు పరిపాలించడం వల్ల జగిత్యాల అని, ఫ్రెంచ్ ఇంజనీర్లయిన జాక్, తాల్ చే జగిత్యాలను నిర్మించడం వల్ల వారి పేరు మీదుగా జగిత్యాల వచ్చిందని ఇలా రెండు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. జగిత్యాల కోటను రాతిసున్నంతో నక్షత్రపు ఆకారంలో పటిష్టంగా కట్టారు. ఇది విశాలమైన మైదానంలో కట్టబడిన స్థలదుర్గం. ఈ కోట చుట్టూ కందకం ఉంది. ఇప్పటికి కందకం లేదా అగడ్త నీటితో నిండి ఉంటుంది. 250 సంవత్సరాలు గడిచినను చెక్కు చెదరలేదు. కర్రతో చేయబడిన ప్రవేశద్వారం నేడు అదృశ్యమైంది. ప్రవేశద్వారానికి వెనుక ఎడమవైపు కందకంలోనికి  వెళ్ళడానికి మెట్లతో గూడిన ఏకైక మార్గం ఉంది. ఈ కోట బురుజులలో దాదాపు రెండు మీటర్ల పొడవు గల తోపులు ఉన్నాయి. ఈ ఫిరంగులపై మహ్మద్ ఖాసిమ్ పేరుంది. కోట ప్రక్కనే జగిత్యాలలో అతిపెద్ద మసీదు ఎప్పుడు జనంతో కిటకిటలాడుతుంది. కోట నిర్మాణం కండ్లంపెల్లి చెరువు పక్కనే జరిగింది. కనుక కందకములలో మరియు కోటలోని కోనేరులో నీరెప్పుడు ఎండిపోదు. కోటలోపల మందుగుండు సామాగ్రికై నిర్మించిన గదులున్నాయి. 1930 వరకు జగిత్యాల రెవెన్యూ కార్యాలయం కోటలోనే ఉండేవి. ఇక్కడ ఒక ఖిల్లాదారు, 210 సిపాయిలుండేవారు. జగిత్యాలలోని శివవీధి శివాలయం 1930లో, గుట్ట రాజేశ్వరాలయం 1940 ప్రాంతంలో నిర్మింపబడినట్లు

తెలుస్తుంది. జగిత్యాల, పాత జగిత్యాల గ్రామం పురాణిపేట నుండి జగిత్యాలఖిల్లా వరకు వ్యాపించి ఉండేవి. ఇప్పుడున్న విద్యానగర్, జంబిగద్దె, వాణినగర్, ధరూర్ క్యాంప్, బాలాజినగర్, కృష్ణానగర్, అరవింద్ నగర్ మొదలైనవి జగిత్యాల పట్టణంలోని కొత్తగా విస్తరించిన ప్రాంతాలైన కొత్త జగిత్యాలగా వ్యవహరిస్తున్నారు. జగిత్యాల నగరం చుట్టూ నాలుగు వైపులా నాలుగు చెరువులున్నాయి. వాటిని కండ్లపల్లి, మోతె, ముప్పారపు అనే చెరువులను వ్యవసాయానికి, ధర్మసముద్రం అనే చెరువును త్రాగునీటికి ఉపయోగిస్తున్నారు. క్లాక్ టవర్‌ను 7వ నిజాం ఉస్మాన్ అలీ ఖాన్ 1937లో జగిత్యాల నగర నడిబొడ్డున కమాన్ వద్ద నిర్మించారు. తన పరిపాలనా రజోత్సవాలను రాజ్యమంతటా జరిపించి ఆ సందర్భంలో ధర్మజలపతిరావు జగిత్యాల నడిబొడ్డున ఎత్తయిన క్లాక్ టవర్ (పెద్ద గడియారం)ను నిర్మించాడు. అది చూసి మెచ్చుకొని నిజాం రాజు ఆ క్లాక్ టవర్ వెండి నమునాను చేయించి జ్ఞాపికగా ధర్మజలపతిరావుకు బహుకరించాడు. ఆ గడియారం జర్మనీ నుంచి తెప్పించింది. అది ఇప్పుడు పాడైపోయి ప్రైవేట్ సంస్థల ఆధీనంలో ఉంది. "అది పనిచేసినప్పుడు గంట గంటకు మోగి ఎంతో మంది చదువురాని వారికి సమయాన్ని తెలియజేసిందని స్థానికులు చెప్తారు. అప్పటి ప్రజలను కలరా వ్యాధి నుండి కోలుకున్న సందర్భం పురస్కరించుకొని నిర్మించినట్లు చెపుతారు"[25]

## 1.6 జగిత్యాల జిల్లా సాహిత్య సేవ

18వ శతాబ్దానికి చెందిన కాకుత్సం శేషప్ప కవి ధర్మపురి వాస్తవ్యులు. పదబంధాలతో, లోకోక్తులతో చక్కని పద్యాలు చెప్పగల దిట్ట. ఈయన 'నరసింహ శతకం', 'నరహరి శతకం', 'ధర్మపురి రామాయణం', 'శ్రీ నృకేసరి శతకం' మొదలైన రచనలు చేసి ప్రపంచ ఖ్యాతి పొందాడు. 19 వ శతాబ్దానికి చెందిన రామసింహకవి ఆశుకవిగా ప్రసిద్ధి చెందాడు. 'విశ్వకర్మ శతకం', 'దుష్ట ప్రపంచ వర్ణన', 'కలియుగ వర్ణాశ్రమ ధర్మాలు', 'భజనకీర్తనలు' మొదలైనవి వీరి రచనలు. 'మరణం నా చివరి చరణ కాదు' అని తెలిపిన అలిశెట్టి ప్రభాకర్ జగిత్యాల్లో పుట్టిన కవి. కవి మాత్రమే కాదు గొప్ప చిత్రకారుడు. 21 ఏండ్ల వయస్సులో 'ఎర్ర పావురాలు' కవిత్వంతో సాహిత్యంలో అడుగుపెట్టి 1979లో

[25]రాజేందర్, ఉపాధ్యాయుడి ఇంటర్వ్యూ –Studio N news Documentry.

'మంటల జెండాలు', 1981లో 'చురక', 1982లో హైదరాబాదు చేరుకొని 'రక్తరేఖ', 'సంక్షోభగీతం', 'సిటిలైఫ్' మొదలైన సంపుటాలను వెలువరించారు. సామాజిక తత్త్వవేత్తగా, కథారచయితగా, నవలా రచయితగా బి.యస్ రాములు సుప్రసిద్ధులు. నవలలు, కథలు ఎన్నో రాశారు. 'బతుకుపోరు', 'గతితార్కికభౌతికవాదం', 'కథలబడి', 'కథాసాహిత్య అలంకారశాస్త్రం', 'దర్శనభూమిక' అనే గ్రంథాలను వెలువరించారు. అలాగే 'అమ్మ', 'యుద్ధం', 'సిటీ', 'బురదలో జాబిల్లి', 'నాన్న', 'నాతిచరామి', 'ఊరు విభిన్న కథాసంపుటాలు', 'అత్తారింటికి దారేది', 'నల్ల సముద్రం', 'బేబి ఓ బేబి' లాంటి నవలలు రాసిన కె.వి నరేందర్ జగిత్యాల వారే. వలస కవీత్వంలో జీవితానుభవాలను రంగరిస్తున్న కవి సంగవేని రవీంద్ర. 'అన్వేషణ', 'వర్లీ నానీలు', 'లోలోన' లాంటి కవితా సంపుటాలు వెలువరించారు. కె.వి నరేందర్, సంగవేని రవీంద్ర సంయుక్తంగా 'తెలంగాణ గడీలు' అనే పుస్తకాన్ని కూడా వెలువరించారు. 'నేను రుద్రవీణని' జగిత్యాల శీర్షికన జగిత్యాల జైత్రయాత్ర నేపథ్యంతో వచ్చిన పుస్తకం వీరు ఇరువురు రాసిన దీర్ఘకవిత. కోరుట్ల పట్టణానికి చెందిన అందె వెంకటరాజం 'నవోదయం', 'మణిమంజూష', 'కళా తపస్విని' అనే పద్య కావ్యాలను రాశారు. 'భారతరాణి' నాటిక సంపుటిని, 'నింబగిరి శతకం', 'ఈశ్వర శతకం' అనే శతకాలను కూడా రాశారు. ఇంకా ఎనుగంటి గోపాలు 'గోపాలం కథలు', 'నాలుగు పుటలు' కథాసంపుటాలు వెలువరించారు. పులి గోవర్ధన్ 'జెకముక' అనే కవితాసంపుటి తీసుకొచ్చారు. చరిత్ర పరిశోధకుడు జైశెట్టి రమణయ్య చరిత్ర సంపదకై లోతైన పరిశోధన చేసిన చరిత్రకారుడు జగిత్యాల వాస్తవ్యులే కావడం అదృష్టం. ఈయన రాసిన 'టెంపుల్స్ ఆఫ్ సౌతిండియా', 'ది చాళుక్యాస్ అండ్ కాకతీయ టెంపుల్స్ ఏ స్టడీ' అనే రెండు గ్రంథాలు జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతి పొందినవి. 'కరీంనగర్ జిల్లా చరిత్ర – సంస్కృతి' అనే పుస్తకంతో పాటు అనేక చారిత్రక వ్యాసాలు రాశారు. జగిత్యాల చరిత్ర, సంస్కృతి తెలుసుకోవడానికి వచ్చిన జగిత్యాల 'జంగల్ మహల్', 'జగిత్యాల పల్లె', 'నేను రుద్రవీణని' అనే మూడు పుస్తకాలు జగిత్యాల జైత్రయాత్ర దొరల కాలంలో ఉన్న వెట్టిచాకిరిని, ప్రాంత వెనుకబాటు తనాన్ని గురించి తెలిపే గ్రంథాలు.

## 1.7 జగిత్యాల జిల్లా సాంఘిక పరిస్థితులు

నిజాం పాలనలో ప్రజలను ఎన్నో విధాలుగా దోచుకొని వారి అక్రమాలకు, ఆగడాలకు అంతులేకుండా ఉండేదని అనడటానికి వారు నిర్మించుకొన్న పెద్ద పెద్ద గడులే నిదర్శనం. భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఆనాటి ప్రజలు చేసిన పోరాటాలకు గాయబడిన నేటి గడులే నాటి సామాజిక జీవన విధానాన్ని ప్రతిబింబిస్తాయి. ఐలాపురం, రాయికల్, ఇటిక్యాల, చల్‌గల్, రాజారం, నేరెల్ల మొదలైన శిథిలమైన గడులు ఈ జిల్లాలో కనిపిస్తాయి. నిజాం కాలంలో సంస్థానాలు, జాగీర్దారులు, మక్తేదారులు, ఇనాందారులు, వతందారులు, దేశ్‌ముఖ్, పటేలు అగ్రహారీకులు అను పేర్లతో భూస్వాములు పెత్తందారులు ప్రజలను దోచుకుని పీల్చి పిప్పి చేశారు. నిజాం సర్కారుకు తొత్తులుగా ఉండి స్థానిక ప్రజల దగ్గర అనేక రకాలుగా అక్రమ పన్నులు వసూలు చేయడం, దౌర్జన్యం చేసి అక్రమంగా ఆస్తులు రాయించుకోవడం, వందల ఎకరాల భూములను సొంతం చేసుకోవడం ఇలా రైతులను, నిమ్నవర్గాల వారిని హింసించేవారు. దొరల కాన్నుంచి మాలిపటేల్ దాకా చదువురాని అమాయక ప్రజలను నానారకాలుగా ఇబ్బందికి గురిచేశారు. ముఖ్యంగా వెట్టిచాకిరి, దోపిడి, సర్వత్రా బానిస విధానం, అన్ని వృత్తుల వర్గాల వారిని బానిసలుగా మార్చి వారితో స్వంత పనులను సైతం చేయించుకునేవారు.

'బగేలా' పన్ను పద్ధతి వల్ల అప్పు తీసుకున్న వ్యక్తి, తన కుటుంబం మొత్తం అప్పు తీర్చేంతవరకు దొరకే సేవ చేయాలి. రైతులకు పంటలు పండక, పండిన పంటల డబ్బు దొర అక్రమ వడ్డీ కింద చెల్లించలేక ఆకలితో పస్తులుండి గడిపిన రోజులు ఉన్నాయి. వారి జీవనానికి ఉపాధిలేక, పిల్లల పోషణ కష్టమై జొన్న అంబలి తాగి, మక్కలు, రవ్వతో చేసిన గడ్క తిని గడ్డు కాలాన్ని వెల్లదీసారు. అంతేగాకుండా దొర ఎడ్లబండి ముందు వెనుకాల చాకలి, మంగలులు పరుగెత్తడం, దొరల వ్యవసాయ పనులన్ని పూర్తయ్యే వరకు ఏ రైతు కూడా తన పొలంలో నాట్లు వేసుకోడానికి వీలులేని పరిస్థితి. చిన్న పిల్లలతో, స్త్రీలతో కూడా బలవంతంగా తమ ఇంటి పనులను ఉచితంగా చేయించుకునేవారు. నాట్లు, కలుపులు, కోతలు, ఇళ్లు శుభ్రపరచడం, కలాపి చల్లడం, గిన్నెలు తోమడం, పిండి విసరడం, పాలు

పితకడం, అడవిలో గడ్డిమోపు కట్టతేవడం, స్నానాలు చేయించడం అన్ని పనులను బలవంతంగా చేయించుకోవడమే కాక యవ్వనంలో ఉన్న స్త్రీలను బలత్కరించడం, పిల్లలను చదువుకోనివ్వకపోవడం ఇలా అనేక బాధలను నాడు ఈ ప్రాంత ప్రజలు చవిచూసారు. 1946–51 వచ్చిన తెలంగాణ సాయుధ పోరాటం వల్ల కమ్యూనిస్టుల భయానికి దొరలందరు తమ గడులను వదిలిపెట్టి పట్టణాలకు పారిపోయారు. తెలంగాణ సాయుధ సమరంలో యావత్తుతో పాటు ఈ జిల్లా వాసులు కూడా పాల్గొని పోరాడారు. భారతప్రభుత్వం 1948 లో చేసిన పోలీసుచర్య ఫలితంగా నిజాం ప్రభుత్వం కూలిపోయి తెలంగాణ భారతదేశ యూనియన్‌లో కలిసింది. ఆ తరువాత ఇక్కడ సామాజిక పరిస్థితులు కొంత ఉపశమించిన తరువాత పాలకులు కూడా ఈ ప్రాంత జిల్లా అభివృద్ధి విస్మరించటం వల్ల అనేక మంది ప్రజలు వారి జీవనాన్ని కొనసాగించడానికి వలసనే ఉపాధిగా ఎంచుకున్న కుటుంబాలు ఇప్పటికి ఎక్కువగా కనిపిస్తాయి. ఆ తరువాత పాలించిన ఆంధ్ర వలసవాదుల పాలనలో కూడా ఉద్యోగ, ఉపాధిలకు గండిపడింది. పరిశ్రమలు లేకపోవడం, ఉద్యోగవకాశాలు తక్కువగా ఉండటం, తమకన్నా విద్య, ఉపాధి రంగాల్లో ముందువారితో పోటీని ఎదుర్కోలేకపోవడం వల్ల నిరుద్యోగిత పెరిగి ప్రజలు వలసబాటను ఎంచుకున్నారు. ముంబాయి, పూనే, భీవండి మొదలైన నగరాలకు వలసవెళ్లి సంపాదించిన ఆదాయం తమ ఇళ్లకు పంపించేవారు. ఇంటికి దూరంగా ఉండి వాళ్లు కష్టపడుతుంటే, ఇక్కడ స్త్రీలు కుటీర పరిశ్రమలైన బీడి కార్మికులుగా మారి ఇంటి దగ్గరనే ఒంటరి జీవితాలను గడుపుతున్నారు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల కొద్ది కొద్దిగా వృత్తుల జీవితాల్లో కూడా విషాదమార్పు చోటుచేసుకుంది. ప్రపంచీకరణ ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేసి దేశ, విదేశ వలసబాట పట్టేలా చేసింది. అందరికి సదావకాశాలు దొరకక అరబ్బ్ దేశాల్లో గల్ఫ్ బాధితుల్లో ఎక్కువగా ఈ జిల్లా వాసులే నిత్యం వార్తల్లో తారసపడతుంటారు. నేటి యువకులు కూడా ఎంతో మంది ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్‌నే జీవనాధారంగా మార్చుకున్నవారు లేకపోలేదు. కాల పరిణామానికి దీటుగా ఈ జిల్లా వాసులు కూడా నేడు అభివృద్ధి దిశగా పరుగులీడుస్తున్నారు.

## 1.8 జగిత్యాల జిల్లా సాంస్కృతికాంశాలు

### 1.8.1 పండుగలు, వేడుకలు, జాతరలు

ఒక జాతి సాంస్కృతికాంశాలు తెలుసుకోవడానికి ఆ జాతి ఆచార సంప్రదాయాలు, సంస్కృతి, విశ్వాసాలు, పండుగలు మొదలైన సామూహికంగా చేసుకునే ఉత్సవాలు, జాతరలు ప్రధానపాత్ర వహిస్తాయి. అన్ని జిల్లాల మాదిరి ఈ జిల్లాలో కూడా అన్ని మతాల వారు ఉన్నందున ఆయా మతానికి సంబంధించిన పండుగలు ఆయా మతస్థులు ఘనంగా చేసుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో హైందవ సంస్కృతిని ప్రతిబింబించే పండుగలకు తక్కువ ప్రాధాన్యం ఇస్తూ, గ్రామీణ దేవతల ఉత్సవాలు, జాతరలను మాత్రమే ఆర్భాటంగా సామూహికంగా సంస్కృతికి అద్దం పట్టేలా చేసుకుంటారు. కొన్ని కొన్ని గ్రామాల్లో గ్రామీణ దేవతలను పూజించే సందర్భంలో కొన్ని కులాల వారు ప్రత్యేకంగా పూజించటం కూడా ఆనవాయితీగా వస్తుంది. హిందువుల పండుగలైన ఉగాది, శ్రీరామనవమి, దసరా, దీపావళి, సంక్రాంతి, హోలీ మొదలైన వాటిని ఘనంగా జరుపుకుంటారు. ఇక ముస్లిం మతానికి చెందిన వారు రంజాన్, బక్రిద్, మొహరం పండుగలను, క్రైస్తవ మతానికి చెందిన క్రిస్మమస్ పండుగను బాగా జరుపుకుంటారు. హిందువులు, ముస్లింలు కలిసి చేసుకునే మొహర్రం పండుగను ప్రత్యేకతను సంతరించుకుంటుంది. ఇక గ్రామీణ ప్రాంతాలవారు చేసుకునే పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, మంకాలమ్మ మొదలైన గ్రామీణ దేవతలను పల్లె సంస్కృతి ప్రత్యేకతను తెలిపే విధంగా చేస్తారు. గ్రామీణ దేవతలు లేని పల్లె అంటూ దాదాపుగా ఉండదు. జానపదులు గ్రామీణ దేవతలను పూజించి బోనాలు ఎత్తుకోవడం, నైవేద్యాలు సమర్పించడం చేస్తారు. అంతేగాకుండా వేడుకలను జరుపుకునే సందర్భంలో తమకున్న వారసత్వ కళాప్రదర్శనలను చూపించి గ్రామక్షేమాన్ని కోరుతూ ఆదరిస్తారు. కొన్ని గ్రామాల్లో గుట్టలమీద వెలసిన దేవతలకు, దివ్యక్షేత్రాలకు జాతరలను వైభవోపేతంగా చేస్తారు. అలాంటి జాతరల్లో ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జాతర, దుబ్బ రాజేశ్వర స్వామి జాతర, స్తంభంపెల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి జాతర, కొండగట్టు అంజన్న జాతర, పెగడపల్లి శ్రీ రాముని జాతర, బీర్‌పూర్ జాతర మొదలైనవి కనిపిస్తాయి. ఇటీవల ప్రపంచం

మొత్తం తెలిసిన బహు ప్రజాదరణ పొందిన పండుగ, జాతర, వేడుకల కలబోత బతుకమ్మ పండుగ. స్త్రీలందరు ప్రత్యేకంగా కలిసి ఆడే ఆట, పాట సమ్మేళనాల సంస్కృతి కళారూపం బతుకమ్మ. ఇది తెలంగాణలో మాత్రమే చేసుకునే పండుగ. బతుకమ్మ పండుగకు మూలమైన కథలో సత్యవతి తన పతియైన ధర్మాంగదుడితో ధర్మపురి గోదావరిలో స్నానమాచరించి మనిషి రూపాన్ని పొందాడనే కథ ప్రజల్లో ప్రచారంలో ఉంది. బతుకమ్మ పుట్టుక గురించి తెలిపే కథ సత్యవతి కథ. అది వాస్తవంగా జరిగి ఉంటుందని ఇక్కడ జానపదుల నమ్మకం. ఈ పండుగను దసరాకు తొమ్మిది రోజుల ముందు నుంచి చాలా ఆనందోత్సాహలతో చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా జరుపుకుంటారు.

## జగిత్యాల జిల్లా పటం



# 2. జగిత్యాల జిల్లా జానపద కథలు – వర్గీకరణ

## 2.0 జానపద కథాసాహిత్యం – పరిచయం

జానపద కథాసాహిత్యం తరతరాల నుంచి మౌఖిక సంప్రదాయంగా వ్యాప్తి నొందిన సజీవ సాహిత్యం. మానవుని ఆవిర్భావం నుంచి జానపద సాహిత్యం కేవలం మౌఖిక ప్రసారం ఆధారంగానే నేటికి నిలిచిపోయి తన ప్రాధాన్యతను సంతరించుకుంది. మనకు ఆనాది నుండి నేటి వరకు అనేక రకాల కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. శ్రామిక జీవులైన జానపదులు నిజ జీవితంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటూ జీవితాన్ని సాగిస్తారు. కష్టాసుఖాలను అనుభవిస్తారు. తమ జీవితాల్లోని సుఖదు:ఖాలను కొన్నింటిని నెమరవేసుకుని తమ కథాకథన కౌశలంతో తోటివారితో గొప్పగా చెప్పుకొని ఉంటారు. అలా చెప్పుకున్న విషయాలే తరువాత కథలుగా రూపొంది ఉంటాయి. వాటిపై శ్రోతలు కూడ ఆసక్తి చూపారు. పిల్లల్నీ, స్త్రీలని మరింత ఆకర్షించేవి ఈ కథలు. పగలంతా కష్టం చేసి వచ్చిన పల్లె ప్రజలు సాయంత్రం, రాత్రి వేళల్లో తమ మనుమరాళ్లను, మనమళ్ళను అక్కున చేర్చుకుని కథలు చెప్తుంటారు. ఆ కథలు పిల్లలపై విశేష ప్రభావం చూపి వారు ఎదిగేక్రమంలో బుద్దిని, సత్ప్రవర్తనను, మనోవికాసాన్ని కల్గిస్తాయి. సాధారణంగా తాత లేదా అమ్మమ్మ, నానమ్మలు కథలు చెప్తుంటే పిల్లలు ఊకోడుతూ అలాగే నిద్రలోకి జారుకుంటారు. అందుకే వీటికి ఊకుమ్మడి కథలని పేరు. ఈ కథలు చిన్న పిల్లలనే కాదు పెద్ద వారిని సైతం ఆకర్షిస్తాయి. పిల్లలకు చెప్పే కథల్లో నీతిని ఎక్కువగా బోధించేవి ఉంటాయి. పెద్దవారికి, చుట్టుప్రక్కల వారికి చెప్పే కథలు మాత్రమే అద్భుత కథాకథనంతో చిత్ర విచిత్ర కథలుగా రూపొందుతాయి. సమాజాన్ని సక్రమంగా ఉంచే ప్రయత్నంలో నాటి సామాజిక అవసరాన్ని ఉద్దేశించి కొన్ని అద్భుత, అవాస్తవిక కల్పనలతో కూడిన కథలు ఆవిర్భవించి వుంటాయి. ప్రాచీన సమాజంలో పిల్లలను, పెద్దలను అప్రమత్తం చేసి వారి జీవన ఎదుగుదలకు సోపానాలుగా ఎంతో ఉపకరించి ఉంటాయి. అంతేకాకుండా ఒక్కొక్కప్పుడు సాధ్యంకాని సన్నివేశాలను, కలలను, స్వప్నాలను గురించి ఆలోచించి తాను చేయలేనివి కథల్లో కల్పించి అద్భుత కథలను కథాకథనం చేసి ఉంటారు.

అలా కథలు ఒకరి నోటి నుండి మరొకరి నోటికి చేరి, మౌఖిక ప్రసారం ద్వారా తరతరాలుగా నిలదొక్కుకున్నాయి. ఈ కథలో ఆ ప్రాంత విశిష్టతలు, ప్రజల కోరికలు, ఆప్యాయతలు, సామాజిక జీవితాలు, సాంస్కృతిక కార్యకలాపాల ప్రస్తావనలు కనిపిస్తాయి. కథల్లో కులాలకు, ప్రాంతాలకు, మతాలకు, స్థలాలకు సంబంధించిన కథలు తరచుగా కనిపిస్తాయి. కొన్ని జానపద కథల్లో కథ మధ్యలో గేయాలు కూడ పాడుకొని కథాకథనం చేస్తుంటారు. అలాంటివి మరింత ఆసక్తిని రేకెత్తిస్తాయి. జానపద కథల్లో సంప్రదాయాలు, పురాణవ్యక్తుల ప్రాశస్త్యం, మరణానంతర జీవనం, ప్రతి నాయకులు, కథానాయకుల బలం, బహుభార్యత్వం మొదలైన విషయాలను ప్రత్యేకంగా అద్భుత కథలో ఎక్కువగా కనిపిస్తుంటాయి.

జానపద సాహిత్యంలో జానపద కథ విశ్వవ్యాప్తంగా ప్రసిద్దినొందిన ప్రక్రియ. కథకుడికి ఉన్న సామాజిక దృష్టి, శ్రోత, సామాజిక అవసరం ఆధారంగా కథలో మార్పులు జరుగుతాయి. నేటికి మౌఖిక సాహిత్యం ఎన్నో మార్పులను తనలో ఇముడ్చుకుని అవి కొద్ది మార్పులతో ఇంకా స్థిరంగా ఉన్నాయంటే అవి వారి జీవితాలలో ఎంత మమేకమయ్యాయో తెలుస్తుంది. పాత్రలు, కథాస్థలాలు మారతాయి. కాని కథాంగాలైన కథాంశాలు, మాదిరులు మారకపోవచ్చు. అదే జానపద కథకున్న విశిష్టమైన మరో లక్షణం. తాను విన్న కథను మార్పులు చేసిన కథకుడు మూల కథను మాత్రం యధాతథంగా ఉంచుతాడు. మౌఖిక సాహిత్య కల్పనలు, పున:కల్పనలు ఎన్ని జరిగినా శ్రోతల సమక్షంలోనే జరిగి, వారి ఆసక్తిని, ఆనందాన్ని రెట్టింపు చేస్తాయి. ప్రజల జీవన స్థితిగతులు, సంస్కృతి సంప్రదాయాలు, సామాజిక పరిస్థితులు తెలుసుకోవడానికి జానపద కథల అధ్యయనం ఎంతో ఉపకరిస్తుంది.

## 2.1 జానపద కథ – నిర్వచనాలు

జానపద కథను కథకుడు కథాకథనం చేస్తుంటే శ్రోతలు వింటుంటారు. జానపదులు చెప్పుకునేవి జానపద కథలు. ఇవి రెండు రకాలుంటాయి. గేయరూపంలో, వచనరూపంలో ఉంటాయి.

గేయరూపంలో కథలను కథాగేయాలు, గేయకథలని పిలుస్తారు. వచన రూపంలో ఉన్నవాటిని వచన కథ, జానపద కథ అని వ్యవహరిస్తారు. జానపద కథ గద్యకథన విభాగానికి చెందింది. వచన సంబంధమైంది. జానపద కథలనే కాకమ్మ కథలని, పిట్ట కథలని, పేదరాశి పెద్దమ్మ కథలని రకరకాలుగా పిలుస్తుంటారు. జానపద కథకు పలువురు పరిశోధకులు ఇచ్చిన నిర్వచనాలు క్రింది విధంగా ఉన్నాయి.

"The traditional prose tale–the story which has been handed down from generation to generation either in writing or by word of mouth. Such tales are of course, only one of the many kinds of story material, for, in addition histories, novels, dramas, and short stories."[26] కథలను ఒక తరం నుండి మరొ తరానికి వ్రాతపూర్వకంగా లేదా నోటి మాట ద్వారా అందించిన సాంప్రదాయిక గద్య అని స్టిత్ థాంప్సన్ నిర్వచించారు.

"యదార్థ వృత్తాంతం చెప్పినా, కల్పిత విషయం చెప్పినా, వాస్తవికంగా ఉండేదయినా, అవాస్తవికంగానూ, అభూత కల్పనలతోనూ నిండినదైనా, వ్యక్తుల చుట్టూ అల్లినా, సంఘటనలను ఘటించినా, యావత్ప్రపంచానికి సంబంధించినా, నిర్థిష్ట కాలానికే సంబంధించినా, గేయంలా పాడినా, వచనంలా వచించినా అన్నింటి స్థూలంగా మనం వాడే పదం కథ"[27]

"మానవుని బుద్ధి వికాసం చెంది ఊహించే శక్తి, ఆలోచించే శక్తి ప్రారంభమైనప్పటి నుండి తన చుట్టూ ఉన్న ప్రకృతిలోని వింతలను, సృష్టిలోని వైచిత్రిని గూర్చి వివేచించుట మొదలుపెట్టి ఉంటాడు.

[26] Thompson, stith. The folktale. The Dryden press. New work. 1946. P-4

[27]దక్షిణామూర్తి, పోరంకి. కథానిక స్వరూప స్వభావాలు. హైదరాబాదు:నవోదయ బుక్ హౌస్. 2009. పుట-14

ఆ వివేచనా శక్తియే, కల్పనా శక్తియే జానపద కథలు ఆవిర్భవించటానికి నాంది అయిందని చెప్పవచ్చు."[28]

"నివేదించు, ప్రకటించు, ప్రదర్శించు, భావించు, వరించు, వ్యాఖ్యానించు మొదలైన అర్థాలున్న కథ్ మూల ధాతూపపన్నం కథ. కథ్యతేయితి కథా. కథ అంటే వృత్తాంతం. కొన్ని సత్యాంశాలతో కూడుకొన్న కల్పిత కథనం. గేయ రూపకంగా కాక కథన రూపకంగా ఉన్న వచనం. జానపద కవిత్వంతో కూడుకుని సత్యాంశాలతో మేళవించిన, కథన రూపకంగా ఉన్న కల్పిత కథ"[29]

"సత్యం అసత్యం లేక ఈ రెండు కలిసి వచనంలో వెలసిన కథలను కట్టుకథలంటున్నాము. వీటిలో కల్పనాశక్తి కనిపిస్తూ వుంటుంది. మధ్య మధ్య ఉత్సాహమో, విషయ ప్రాశస్త్యమో కల పాటలున్న కట్టుకథలూ ఉన్నాయి. ప్రయోజనం గల భావాలు, సంతోషంగా కాలక్షేపం చేసే లక్షణం కట్టుకథలలో కనిపిస్తాయి ఎవ్వరో ఒకరి మనస్సులో తోచి, తరతరాలుగా చెప్పబడుతూ పామరుల్ని అలరిస్తున్నాయి. వీటిని 'కర్ణ పరంపర కథలు' అని వ్యవహరిస్తున్నారు"[30].

పై నిర్వచనాల బట్టి ఒక వ్యక్తి గురించి గాని, స్థలం గురించి గాని, సంఘటన గురించి గానీ జానపదుడు తన కల్పనా శక్తితో కల్పించి, అల్లిన వచన రూపమే జానపద కథ అని అర్థమవుతుంది.

## 2.2. జానపద కథ – లక్షణాలు

జానపద కథలకు లక్షణాలను తెలిపిన వారు చాలామంది ఉన్నారు. వారిలో ఆక్సెల్ ఓల్రిక్ (Axel olrik) చెప్పిన లక్షణాలను జానపద పరిశోధకులు ప్రామాణికంగా ఉటంకించారు. ఆక్సెల్ ఓల్రిక్ ది 'స్టడీ ఆఫ్ ఫోక్ లోర్' అను గ్రంథంలో 'ఎపిక్ లాక్ ఆఫ్ ఫోక్ నేరెటివ్' అనే వ్యాసంలో క్రింది జానపద కథాలక్షణాలను వివరించారు.

---

[28] బాలస్వామి, బుక్కా. మహబూబ్‌నగర్ జిల్లా జానపద కథలు. హైదరాబాదు: తెలుగు పరిశోధన ప్రచురణలు. 1987. పుట -70

[29] మోహన్. జి.యస్. తెలుగు ధార్మిక, సాంస్కృతిక జానపద కథలు. బెంగుళూరు: శ్రీనివాస పబ్లికేషన్స్. 2000. పుట – 4

[30] రాధాకృష్ణ శర్మ, చల్లా. 1999. తమిళదేశ జానపద కథలు. ఢిల్లీ: సాహిత్య అకాదమీ. పు: 9

1. "కథలు ముఖ్యమైన క్రియతో ప్రారంభం కావు. ఉన్నట్టుండి ముగిసిపోవు.
2. కథలలో పునరావృత్తి సామాన్యంగా అన్ని చోట్ల కనిపిస్తుంది. అది కథకు నిండుదనాన్ని ఇస్తుంది. ఈ పునరావృత్తి ఒక్కొక్కసారి మూడు సార్లు ఉండవచ్చు.
3. మామూలుగా ఒక్కొసారి ఇద్దరు వ్యక్తులు మాత్రం ఒక దృశ్యంలో కనిపిస్తారు. ఇంకా ఎక్కువగా ఉన్నా ఇద్దరు మాత్రం క్రియాశీలురై ఉంటారు.
4. విభిన్న పాత్రల కలయిక కనిపిస్తుంది. ఉదాహరణకు నాయకుడు, ప్రతినాయకుడు శిష్టుడు – దుష్టుడు
5. ఒకే రకమైన పాత్రలు రెండూ ఉంటే వాళ్ళు చిన్నవాళ్ళుగా కాని లేక అశక్తులుగా కాని చిత్రింపబడతారు. ఒకవేళ శక్తి గలవాళ్ళు అయితే విరోధులయ్యే అవకాశం ఉంది.
6. దుర్బలులుగా ఉండేవారు మంచివాళ్ళుగా ఉంటారు. సోదరులలో చిన్నవాళ్లు మాములుగా జయం సాధిస్తారు.
7. పాత్ర చిత్రణ సరళంగా ఉంటుంది. కథలకు వేరుగా సంబంధించినవి మాత్రం చిత్రితమవుతాయి. పాత్రలకు, కథలకు అతీతమైనవేవి కనిపించవు.
8. కథా వస్తువు సరళంగా ఉంటుంది. ఏక కాలంలో ఒక్కకథనే వివరించాలి. రెండుగాని, అంతకంటే ఎక్కువగాని కథలు ఏకకాలంలో చెప్పవలసివస్తే అప్పుడు అది సాహిత్య కథను పోలుతుంది.
9. మామూలుగా అన్ని సరళంగా ఉంటాయి. వైవిధ్యపూర్ణంగా చేయాలనే ప్రయత్నం కన్పించదు.

పై లక్షణాల వల్ల సమగ్ర స్వరూపం గోచరిస్తుందని చెప్పడానికి వీలు లేదు. మొత్తం మీద కథలలో మనకు కనిపించే విషయాలను కొన్ని విభాగాలుగా చేసుకొని వివరణాత్మకంగా వాటి లక్షణాలను పరిశీలించవచ్చని ఆర్వీ. యస్. సుందరం గారి అభిప్రాయం."[31]

[31]సుందరం. ఆర్వీ. యస్.2004. ఆంధ్రుల జానపద విజ్ఞానం. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. పే - 146

తెలుగు జానపద కథలకు కూడ పై లక్షణాలే వర్తిస్తాయి. ఈ కథల లక్షణాలకు అదనంగా మరికొన్ని లక్షణాలను జి. యస్. మోహన్ గారు కింది విధంగా తెలిపారు.

1. "తెలుగు జానపద కథల్లో మానవులే కాకుండా దేవతలు, రాక్షసులు, దెయ్యాలు, కిన్నెరులు మొదలైన పాత్రలు కనిపిస్తాయి.
2. నాయకుడికి  జంతువుల సహాయం లభిస్తుంది.
3. సన్నివేశాలు స్వర్గమర్త్య పాతాళాలలో జరుగుతాయి.
4. మంత్రదండాలు, ఉంగరాలు, భూతద్దాలు మొదలైన వస్తువులు కథలలో కనిపిస్తాయి.
5. దుష్టశిక్షణ, శిష్టరక్షణ ప్రధానోద్దేశంగా ఉంటుంది.
6. సాధారణంగా కథలన్నీ సుఖాంతాలుగా ఉంటాయి.
7. 'అనగనగా ఒక ఊళ్ళో', 'ఒకనొక కాలంలో', 'పూర్వ కాలంలో', 'ఒక ఊళ్ళో', 'అనగనగా ఒక రాజు' అన్న మాటల్తో ప్రారంభమై కథ కంచికి మనమింటికి, వాళ్ళు సుఖంగా కాలం గడిపారు అన్న మాటల్తో ముగుస్తాయి.
8. పెళ్ళి చివరి సన్నివేశంగా పెక్కు జానపద కథల్లో కనిపిస్తుంది."[32]

జానపద కథలలో అద్భుత కథలు ఎక్కువగా ఉంటాయి. జానపద కథపై ఆసక్తి పెంచడానికి అద్భుతాంశాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ కథల్లో మంత్ర తంత్రాలు, రాక్షసులు, భూతాలు, పిశాచాలు, గంధర్వులు, యక్షులు మొదలైన అతిమానుష శక్తులు ఉండి కథలను మలుపుతిప్పడానికి సహకరిస్తాయి. దుర్గా భగవత్ గారు 'యాన్ ఔట్ లైన్ ఆఫ్ ఇండియన్ ఫోక్ లోర్' అనే గ్రంథంలో అతిమానుష శక్తుల సాధారణ లక్షణాలు కింది విధంగా ఉంటాయని తెలిపారు.

1. అతిమానుష శక్తులు ఇంద్రజాలిక శక్తులను కలిగి ఉంటారు.
2. వాళ్లు గాలిలో ఎగురుతారు.

---

[32]మోహన్. జి.యస్. 2000. తెలుగు ధార్మిక, సాంస్కృతిక జానపద కథలు. బెంగుళూరు: శ్రీనివాస పబ్లికేషన్స్. పే-11.

3. వాళ్ళు అదృశ్యులు కాగలరు, రూపాన్ని మార్చుకొగలరు.
4. చిత్రకళ, సంగీత నృత్యాదులలో ఆరితేరిన  వారుగా ఉంటారు.
5. మనుష్యులతో లైంగిక సంబంధాన్ని ఏర్పరచుకొంటారు.
6. వీళ్ళకూ, మనుష్యులకూ జనించిన సంతానం మానవులే అవుతారు.
7. కొన్ని సందర్భాలలో కిన్నరులు మినహా మిగిలిన వాళ్ళెవ్వరికీ రెక్కలు ఉండవు. విద్యాధరులు, గంధర్వులు తాము మెడలో ధరించే మాయాహారాల ప్రభావం వల్ల గాలిలో ఎగరగలరు.
8. వాళ్లు పగటిపూట కంటే రాత్రి సమయాల్లోనే సంచరించడానికి ఇష్టపడతారు.
9. మానవ నాయికా నాయకుల అదృష్టానికి కాని వీరు సహాయకులుగా ఉంటారు.”[33]

జగిత్యాల జిల్లా జానపద కథల్లో కన్పించిన సాధారణ లక్షణాలు క్రింది విధంగా ఉన్నాయి.

1. కథ కులాల ప్రస్తావనతో ప్రారంభమవడం.
2. అతిమానుష ఇంద్రజాల శక్తుల ప్రయోగాలు, అసాధారణ సంఘటనలు చిత్రించబడ్డాయి
3. నాయకుడికి, నాయికకు దేవతల సహాయం అందుతుంది. నాయికకు శీల పరీక్ష ఎదురైతే భూమి, ఆకాశాలు నిజాలు చెప్పడం.
4. దైవ భక్తి ఎక్కువ కలిగి ఉండి, విధిరాతను నమ్ముకుంటారు.
5. దీపాలు ఒక చోట చేరి, నిగూఢ రహస్యాలను నాయిక లేదా సహాయపాత్రకు చెప్పడం
6. కథలన్ని సుఖాంతంగా ఉండి, పెళ్లి కార్యక్రమంతో కథ ముగుస్తుంది.
7. తప్పు చేసిన నిందితులకు పంచాయితీలో నిలదీసి తగిన శిక్షలను విధించడం.
8. అత్త కోడళ్లలో అత్త శత్రువుగా, అన్న చెల్లెల మధ్య వదినె శత్రువుగా చిత్రించడటం.
9. నాయకుడికి జంతు సహాయం లభించడం.

[33] మోహన్. జి.యస్.1984. జానపద కథలు. సికింద్రాబాదు: యువభారతి. పే.15,16

10. అన్నదమ్ములు. అక్కచెల్లెల మధ్యలో చిన్నవాళ్లు తెలివైనవారుగా చిత్రించబడటం

11. కథల్లో పునరావృత్త కథన శైలి చాలా చోట్ల కనిపిస్తుంది.

12. రాక్షసపుండుతో బాధపడుతున్న వారికి నాయిక లేదా నాయకుడు వెళ్ళి ఆకు పసరుతో వైద్యం చేయడం.

## 2.3 జానపద కథలు – వర్గీకరణ

జానపద విజ్ఞానాన్ని స్థూలంగా విభజించిన వారిలో రిచర్డ్ ఎం. డార్సన్, ఆర్. ఎస్ బాగ్స్ ముఖ్యులు. డార్సన్ (Folklore And Folk life) జానపద విజ్ఞానాన్ని మౌఖిక జానపద విజ్ఞానం, సాంఘిక జానపద ఆచారాలు, వస్తు సంస్కృతి, జానపద కళలు అని నాలుగు భాగాలుగా విభజించారు. అందులో మౌఖిక జానపద విజ్ఞానంలో జానపద కథల గురించి ప్రస్తావించారు. ఆ తరువాత ఆర్. ఎస్ బాగ్స్ (A Standard Dictionary of Folklore: Mythology and Legends) జానపద విజ్ఞానాన్ని వివరంగా విభజించినవాడు. ఇది గ్రంథాలయాల్లో పుస్తక విభజన వంటిది. జానపద విజ్ఞానంలోని ప్రధాన శాఖలను ఇంగ్లీషులోని పెద్దక్షరాలతో సూచించాడు. వాటిని గణాలని(groups) అన్నాడు. జానపద గేయ కథల్లోనూ గద్యకథల వస్తువుల లక్షణాలు కన్పించడం వల్ల గద్యకథనాలనే ప్రత్యేక విభాగంగా గుర్తించాడు. ఇతను గద్యకథనాల (Prose narratives) ప్రధాన విభాగం B 600 గణం నుండి జానపద కథలను చేర్చాడు.

"స్టిత్ థాంప్సన్ వాక్సంప్రదాయంలో ప్రచారంలో ఉన్న గద్యకథల్ని జానపద కథలుగా పేర్కొనడం వల్ల పురాణాలు, ఐతిహ్యాలు కూడా జానపద కథావ్యాప్తికి చేరుతాయి."[34] అందువల్ల గద్యకథనాలని మూడు భాగాలుగా విభజించారు. అవి పురాణం, ఐతిహ్యం, కథ. వీటిలో విశ్వసృష్టికి సంబంధించిన విషయాలు పురాణాలుగా చెప్పబడతాయి. ఐతిహ్యాలు నిర్దిష్టమైన వ్యక్తులు, స్థలాలు,

[34] మోహన్. జి.యస్.1984. జానపద కథలు. సికింద్రాబాదు: యువభారతి. పుట.19

వస్తువులు సంబంధించిన విషయాలను మనం నమ్మేలాగా చేస్తాయి. ఇక కథలు చిన్న పెద్ద తేడా లేకుండా అందర్ని అలరింపజేయడానికి, మానసిక ఉల్లాసాన్ని నింపడానికి ఉద్భవించాయి.

"వుండ్జ్ అనే జర్మన్ పండితుడు కథలని 7 విధాలుగా వింగడించాడు. అవి 1. పౌరాణిక నీతి కథలు, 2. శుద్ధ కిన్నెర కథలు, 3. జైవిక కథలు, నీతి కథలు, 4. శుద్ధ జంతువుల కథలు, 5. వంశ సంబంధ కథలు, 6. తమాషా కథలు, 7. నీతి కథలు. 'ఫోక్‌లోర్ అండ్ పోక్ లైఫ్' అన్న గ్రంథంలో లిండా దే కథలను సంకీర్ణ కథలు, సరళ కథలు అని వింగడించాడు. సంకీర్ణ కథలు మళ్ళీ మూడు విధాలు. 1. మార్షన్ లేదా మ్యాజిక్ టేల్, 2. ధార్మిక కథలు, 3. కాల్పనిక కథలు. సరళ కథలు మళ్ళీ మూడు విధాలు అవి 1. ప్రాణి కథలు, 2. వినోద కథలు, 3. లాక్షణిక కథలు"[35]

"ఎడ్విన్ సిడ్ని హార్టు ల్యాండ్ 'ది సైన్స్ ఆఫ్ ఫేయిరీ టేల్స్' అనే గ్రంథంలో జానపద కథను సాంప్రదాయికంగా వచ్చిన వ్యక్తీకరణగా అభివర్ణించాడు. ఇలాంటి కథలను ఆయన సాగా, మార్షెన్ అని రెండు విధాలుగా విభజించారు. సాగా నిర్దిష్ట స్థలానికి, మానవాతీత శక్తులకు సంబంధించినవి, మార్షెన్ వినోద కథలకు, జానపద కథలకు సంబంధించినవి"[36].

"Vonder leyan అనే జానపద విద్వాంసుడు కూడా సాగా, మార్షెన్ అని రెండు విధాలుగా విభజించాడు. అతని ఉద్దేశ్యంలో సాగా అంటే సరళమైనదని, మార్షెన్ అంటే సంకీర్ణమైంది. స్తిత్ థాంప్సన్ కూడా మొత్తం జానపద కథలను సంకీర్ణ కథలు, సరళ కథలు అని రెండు ప్రధాన భాగాలుగా విభజించారని తెలిపి కె. సుమతి తన సిద్ధాంత గ్రంథంలో తాము సేకరించిన కథలని సరళ, సంకీర్ణ కథలుగా విభజించి, ఉపవిభాగాల పట్టికను పొందుపరిచారు[37].

---

[35] మోహన్, జి. యస్.2001. జానపద విజ్ఞానాధ్యయనం. కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం. పుట: 83

[36] పైదే

[37] సుమతి, కె.1980. తెలుగు జానపద కథలు. హైదరాబాదు: డా బి ఆర్ అంబేద్కరు కళాశాలు. పుట: 43

"డా ఆర్వీస్ సుందరం గారు ఆంధ్రుల జానపద విజ్ఞానం అనే గ్రంథంలో తెలుగు జానపద కథల్ని ఐదు విభాగాలుగా విభజించాడు. అవి 1. అద్భుత కథలు 2. వినోద కథలు 3. ప్రాణి కథలు 4. నీతి కథలు, 5. సమస్యాత్మక కథలు"[38]

జానపద కథలు సేకరించిన తరువాత పరిశోధనా దృష్ట్యా వర్గీకరణ, విశ్లేషణ ప్రాధాన్యతను ఉద్దేశించి జగిత్యాల జిల్లాలో సేకరించిన జానపద కథలను వర్గీకరించి, విశ్లేషణ చేసాను. జానపద కథల్లో వస్తువు ఆధారంగా వైవిధ్యాన్ని గుర్తించటం మనకున్న శాస్త్రీయ పద్ధతి. ఆ పద్ధతి ఆధారంగానే సామీప్య వస్తువుతో నిర్మింపబడ్డ జానపద కథలను ఒక్కొ వర్గీకరణలో చేర్చాను. అలాగే ఆయా కథల్లో ఉన్న వస్తు వైవిధ్యతనూ, విశేషాంశాలను విశ్లేషించాను. ఆయా కథల్లో ప్రతిఫలించిన ఆ ప్రాంత విశేషాలు, ప్రజల జీవన విధానాలు, సంస్కృతి సంప్రదాయాలు, ఆచారాలు, నమ్మకాలు, వేడుకలు, వినోదాలు మొదలైన తదితర అంశాలను తరచి చూడటానికి ఈ కథలు ఎంతగానో ఉపకరిస్తాయి.

ప్రాచీన జన జీవన స్థితిగతులు, జీవన విధానాలు ఇంకా ఈ ప్రాంత వాసుల జీవితాలతో పెనవేసుకొని ఉండటం ఆశ్చర్యకరమైన విషయం. నానాటికి అంతరించిపోతున్న ఆనాటి జానపద విజ్ఞానాన్ని అర్థం చేసుకోవడానికి నేను సేకరించిన ఈ కథలే కాదు మరెన్నో కథలు ప్రజల నోట సాంప్రదాయక పద్ధతిలో ప్రాచుర్యంలో ఉన్నాయి. పై వర్గీకరణాల్లో వస్తు ప్రాధాన్యాన్ని బట్టి చేసిన కథావర్గీకరణలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కాబట్టి నేను సేకరించిన కథలను కూడా వస్తు ప్రాధాన్యత ఆధారంగా వర్గీకరించి విశ్లేషించాను. జానపద కథకులు చెప్పిన మౌఖిక కథను యధాతదంగా రాసి, ఆ కథలో విశేషాంశాలను జోడిస్తూ విశ్లేషణ చేసాను. అలాగే కె. సుమతిగారి వర్గీకరణ విధానాన్ని అనుసరించి నేను సేకరించిన జానపద కథలను సరళ, సంకీర్ణ కథలుగా విభజించాను. వాటిలో ఉపవిభాగాలు కూడా ఉన్నాయి. నేను సేకరించిన కథలు వాటి వస్తు ప్రాధాన్యత బట్టి చేసిన విభజనను సమగ్ర అవగాహనకై కింది పట్టికలో పొందుపరిచాను.

[38] సుందరం. ఆర్వీ.యస్.2004. ఆంధ్రుల జానపద విజ్ఞానం. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం. పుట:153

## జానపద కథ

### సరళ కథలు

### సంకీర్ణ కథలు

#### నీతి కథలు

1. కానుగ పట్నం
2. కాటి మీదికెక్కిన కోడలు
3. దైవానుగ్రహం
4. గుమ్మడి మర్రి కథ
5. గుడ్డికుంటి వాడి కథ
6. మనిషి ఆయుష్షు
7. గాండ్ల బుచ్చమ్మ
8. ముసలమ్మ కథ

#### మనుష్య, జంతు కథలు

1. తల్లి, కొడుకు, కోతి, కోడలు
2. బంగారెంటుక బాలుడు
3. నేను మల్లన్న పోతున్న

#### హాస్య కథలు

1. రేచీకటి అల్లుడు
2. పెద్దపులి–గిద్దపులి
3. కోతి కథ
4. పిస కొడుకు
5. దారి మరిచిన ద్వారక
6. అత్తిచ్చిన అప్ప
7. రాజు పతాని లగ్గం సోకు

#### యుక్తి కథలు

1. చాకలి పుల్లక్క పాతివ్రత్యం
2. శివసత్తె అవతారమెత్తిన భార్య
3. పైసకు గుడిసెన్నర పెండ్లాం
4. ఒక గుండుకు రెండు గుండ్లు
5. లింగం కట్టుకున్న నక్క

#### రాజనీతి కథలు

1. గొల్ల బోయని రాజనీతి
2. బ్రాహ్మణుడి వరాలు
3. అమరికా రాజు కథ

#### అదృష్ట, దురదృష్ట కథలు

1. లక్ష్మీ దేవి కటాక్షం
2. భోగసాని లంగతనం
3. చంద్రహాసుడు కథ

#### సమస్యాత్మక కథలు

1. సావుకారి కోడలి చతురత
2. చెల్లెలు దిద్దిన కాపురం

4. చెప్పుకున్న విలువ రాజుకు లేదు

## సంకీర్ణ కథలు

### అద్భుత కథలు

1. రాణి పగడాల పేరు
2. ఇరవై అయిదు రోజుల బాలుడు
3. అక్కెమ్మ కథ
4. ఐదు మల్లె పూవ్వుల కథ
5. గారడి పిల్లవాడు
6. సోమనాల భావి
7. బ్రాహ్మణుడి ఇంటి దూలం

### మత కథలు

1. చిరుతొండ రాజు కథ
2. రామ కథ
3. హరిదాసు కథ
4. పోశవ్వ మొక్కు కథ
5. లచ్చిందేవి ఆచారం

### చారిత్రక, పౌరాణిక కథలు

1. సత్యవతి కథ
2. సత్యహరిశ్చంద్ర కథ
3. రామదాసు కథ
4. కనకతార కథ

### మానవ సంబంధాల కథలు

1. మునుపటి సంబంధం
2. కొడుకులున్న తండ్రికి వచ్చిన గతి
3. అత్త కాల విషం
4. తల్లి కూతుళ్ల అనుబంధం

### స్త్రీల కథలు

1. తోడి కోడళ్ల అత్యాశ
2. అత్త కోడలు వంకాయ
3. రాజి కథ
4. అక్కెమ్మల కథ

### మహాభారత కథలు

1. పంచపాండవుల కథ
2. పాండవుల కథ

5. బూడిదగిరి పట్నం
6. అన్న చెల్లెలి ప్రేమ కథ
7. అన్నదమ్ముల కథ
8. సవతి తల్లి తీరు కథ
9. మూడు వస్తువుల ఆస్తి
10. బూరెప్ప కథ

# 2.4 సరళ కథలు

## 2.4.1 నీతికథలు

### 2.4.1.1 కానుగ పట్నం

జాడి రాజన్న, ఆరపల్లి గ్రామం, ధర్మపురి మండలం.

ఒక కోమటయ్య రాజు. అయితే ఈ కోమటయినా భార్య అందంగ ఉంది. రాజు భార్య నల్లగ అంత మంచిగ లేదు. రాజుకు కోమటయినా భార్యని నేను ఆక్రమించుకోవాలి అనే కోరిక వెలమయినా దగ్గరుంది. వెలమయినా కోమటోయినా ఇగ నువ్వ్ నా ఇంటికి రా..! నువ్వ్ అల్మరాలు, బీరువాలు ఏదాని మీద చేయి ఏత్తవో అది నీకిత్త అని చెప్పి రాజు అన్నడు. కోమటోళ్లకు డబ్బు మీద పిచ్చి బాగా. బంగారం మీద, వెండి మీద అయింత అతడేం చేసిండు. రాజు గారింట్లకు పోయేవరకు ఇంత ఎత్తు మీద సందుగుంది. దాని నిండ డబ్బులున్నయ్. వెండి, బంగారం అన్ని మంచిగున్నయ్. ఇండ్ల అన్ని రకాలున్నయి కోమటయినే. దీని మీద చేయి ఎయ్యి. అది నీదే అన్నడు. బాగా డబ్బులున్నది చూసి సందుగ మీద చేయి ఏసిండు. సెలవిచ్చిండు. బలిమిటికి ఆ సందుగ లేపి పట్టుకపోయి ఆళ్ల ఇంట్ల ఏసిండు. సందుగల సామాను చూసుకొని సంతోషపడ్డాడు. భార్యతో అన్నాడు. ఇగ భార్య పిచ్చి ముండ కొడుకా! నేను మంచిగున్న, ఆని భార్య పొట్టిగుంది కర్రెగుంది. ఐతే ఆని భార్యని వదిలిచ్చుకొని నా మీద చేయి చేసి నను తీస్కపోతడు. నీకు తెలవదు ఆగపోనివి నువ్వ్. అయ్యో నేను గిట్ల అనుకోలే అంటడు.

భార్యభర్తలు విచారణల పడ్డరు. రేపు పొద్దునత్తడు. నువ్వ్ ఇక్కడుంటే నా భార్యవి ఆని భార్యవైతవ్. ఇగ ఎట్లనే భార్యభార్తలిద్దరు అనుకున్నరు. ఏం లేదు కానుగపట్నం ఉన్నది. కానుగ పట్నంల కానుగ రాజున్నడు. ఆయన దగ్గరికి పోతే ఏం చెప్తడో అని అనుకున్నరు. ఒక గుర్రం ఎక్కి

రాత్రి రాత్రికే ఎల్లిపోయిర్రు. నడిబజారుల గుర్రం మీద కూసుండగ. ఏదైనా వ్యాపారం చేద్దామని ఈనే గుర్రాన్ని అమ్ముతా అని అంటడు. అక్కడే ఉన్న పెద్ద కటికోడు ఏం చేసిండు అచ్చిండు ఎంత గుర్రం ధరెంతనోయ్? నువ్వు కొంటావా? ఆ! నేను కొంటా. అయితే 3 వేలు ఇయ్యవయ్యా సరే 3 వేలు అయిన పెడతనన్నడు. అయింత 3 వేలు తీసిండు తీస్కపోయి అయింత కోమటయ్య చేతుల పెట్టిండు. ఆ గుర్రాన్ని కోమటోని భార్యని గుంజుకు పోతుండు. అయ్యో! గట్ల ఈడు భార్యని గుర్రాన్ని తీస్కపోవట్టే అని ఏడుతుండు. ఏందోయ్ గుర్రాన్ని కోన్నవ్ గని భార్యని పట్టుకపోతున్నవ్ అంటే రూపాలు ఇచ్చినా గుర్రం, ఆడిది నాదే అనుకుంట పట్టుకొని పెయిండు. నా భార్య ఏయ్..! అని ఏడుతుండు. అదే రోడ్డున కానుగ పట్నం రాజత్తండు. ఈనని చూసి ఎందుకు ఏడుతున్నవ్ అంటే అయ్యా నాది పలానా ఊరు నాకు రాజుకు శెర్తు పడితే వాడచ్చి నా భార్య మీద చేయిపడితే ఆని పాలైతదని నేను రాత్రికి రాత్రే యిడికి అచ్చిన ఇక్కడ గూడ పెద్ద కటికోడు. నేను గుర్రాన్ని అమ్ముత అంటే 3 వేలు చేతిల పెట్టి భార్యను, గుర్రాన్ని తీస్కపెయిండు. నాకు ఇదే కట్టకాలం ఉన్నది. నాకు నా భార్య కావాలని రెండు కాళ్లు పట్టుకున్నడు. రాజు బిడ్డ ఆడోవడు పెద్ద కటికోడు సరే నువ్వ్ ఏం పికరు పెట్టుకోకు. రేపు పొద్దుగాల్ల మాత్రం నీ భార్యని నీకు తీస్కచ్చేది నాది అన్నడు. సక్కగ రాజు గారింటికి తీస్కపోయిండు. తీస్కపోయి మంచిగ తిండి పెట్టిండు. కానుగ పట్నం రాజు పొద్దికే కటికోని దగ్గరికి పోయిండు. పెద్ద కటికి అన్నడు. అయ్యా! నీ దండం పెడత గీ రాత్రి అచ్చిర్రు. నీతో పని పడ్డదే ఏంటిది దొర? అన్నవోల్లే ఏం లేదు రేపు పొద్దు పొడిసేవరకు నీ తలకాయ కావాలి అన్నడు. వీడు అనుకున్నడు మేక తలకాయ అనుకున్నడు పెద్ద కటికోడు. మ్యాటరు నీ తలకాయ కావాలని సరే అన్నడు ఇంటికచ్చిండు రాజు. పొద్దువరకల్లా నీ భార్య అత్తది అని తృప్తిగా పండ వెట్టిండు. పొద్దుపొడిసేవరకు ఈనే పెయిండు. నీ తలకాయ ఇయ్యాలే? అయ్యా! నీ బాంచెన్ తెత్త గిప్పుడేం కోసిన ఇత్త అని మేక తలకాయ పట్టుకొని ఇత్తుండు. గట్లగాదు రా నీ తలకాయ కావాలన్న మేక తలకాయ కావాలని అన్లే..! ఇత్తవా..? నీ తలకాయ నరకపోదునా.. అని జంబి పట్టిండు. అయ్యా! నీ బాంచెన్ నా తలకాయ నరికితే నా భార్యపిల్లలు ఎట్ల బతుకుతరు. లంజకొడుకా! ఎవడో గరీబోడు అచ్చి గుర్రాన్ని అమ్ముతానంటే గుర్రానికి, భార్యకి ఒకే ధర పెడతావా అప్పుడు. అసోంటి తెలివి ఎవ్వలికి లేదా లంజకొడుకా! నీ తలకాయ పట్టుకపోతా లేకపోతే ఆయినా భార్యని విడిచిపెట్టు. అన్నంక నా తప్పిదమయింది. ఆయన భార్యని అప్పజెప్పిండు. ఓయ్.. కోమటి ఏడికి వోయిన కట్టమే నువ్వ్ ఉన్నన్ని రోజులు ఈడనే ఉండు. ఈ ఊరు పేరు కానుగపట్నం అన్నడు.

కోమటోడు ఏం చేసిండు మూడు నాలుగు రోజులున్నడు. ఇగ రాజు కచ్చీరుని ఏలుతుండు. కోమటోనికి ఊర్ల తిరగంది నచ్చదని చెప్పి ఏయ్ గిట్ల వడి వోయి సూసెత్తనని ఒక వాడకు పోయిండు. అక్కడ ఒకడు ఒక కన్నోడు ఒకడేమో దొంగరాత రాసేటోడు. ఆట్ల ఏ ఊరు మీది మాది ధర్మపురయ్య మేం కిరాణషాపు అమ్ముకుంటరు గద. అన్నవోలే ఒకడు అడుగుడు, ఇంకోడు ఏమో దొంగరాత రాసుడు. ఏమని రాసిండు నీ పేరేమో వీరయ్య తండ్రి బాలయ్య మీ తండ్రి మాత్రం మేం మీ ఇంటికి నూనె తీర్చకుంటే బోడి ఎల్తి నూనె మేం పోయమ్మంటే పోయకపోతే మీ అయ్య నా కన్ను ఊడ పీక్కపోయిండు. ఇగో సూడని గుడ్డికన్ను సూపిచ్చుడు. నీ బాంచెన్ మా అయ్య గిడికేడ అచ్చె? బోడి ఎల్తె నూనె ఎప్పుడు తీస్కకునే గీని కన్ను ఎందుకు ఊడ పీకే? లే...! చూడు దొంగరాత చూపింద్రు. ఆవును నిజమే! నీ కన్ను ఇయ్యి మీ నూనె మీకు పోత్తమని ఒకడు దొరకబడతుండు. ఒకడు కన్ను ఇగ్గవట్టే. నీ బాంచెన్ నన్ను ఇగ్గకని ఈడంటడు. లే.. లే.. ఇగ్గుకుంటం అని అంటడు. ఇట్ల ఆడు అటే బందీ అయిండు. రాజు ఇంటికచ్చే అమ్మా ఉన్నడా? కోమటి అంటే అయ్యా అద్దనగ ముండకొడుకు గీడికె పోయిండు. మరెం ఏం జరిగెనో ఇద్వరకు రాలే పొద్దునే పోయిండు. నీ కోమటోని కడుపుగాల నాకు పొద్దుదాంక శ్రమ ఉందంటే ఈడికచ్చినంక ఇదొక శమ పెట్టె అని చెప్పి మెల్లగ బండి ఏసుకొని అటు పాయే. ఏందో గీ లోల్లి ఏందోయ్ అని అడిగే వరకు అయ్యా ఆ కాలంల ఈళ్ల నాన్న నా కన్ను తీస్కండు. ఇప్పుడు ఆ నూనె పోసి కన్ను అడుగుతున్నా చెప్పిండు. అవునా! ఇప్పుడయితే ఈయనను ఇడిసిపెట్టుర్రు. అయితే పొద్దునే కన్ను ఇత్తడో లేకపోతే, నూనె వొత్తడో అని చెప్పి మెల్లగ షావుకారిని తీస్కచ్చిండు. తెల్లారే. రాజు తీస్కపోయిండు. అయితే నూనె వోత్తర? మీరు కోమటొనికి కన్ను తీస్కుంటరా? అని అన్న వోల్లే బోడి నూనె అన్నవ్ కదా బోడెల్ల నూనె అన్నంక మీరు మాత్రం తీస్కచ్చి అండ్లపోయిర్రి. ఎన్ని పడతదో ఎన్ని పీతలు పడతదో తీస్కచ్చినంక అది నిండినంక మీకు మాత్రం నూనె పోపిత్త వజన్ చేసినంక. సరె! నూనె అత్తదని లారీ లారీ కొద్ది నూనె తీసినంక ఇంకిపోతుంది. ఎన్ని లారీలు పోసిన అది నిండుతలేదు. ఆ రోజు బోడిల్ల పోసినంక అంటవ్ ఈ రోజు ఎందుకు నిండదు. నింపితి పోత్తవ్. అయ్యా నీ బాంచెన్ మా కద్దు గని ఆ నూనె పోయకున్న మంచిదే గని చల్ లంజకొడుకా! ఆనాడు ఎట్ల పోసినవ్ ఈ రోజు ఎట్ల పోయావ్.. ? నింపు... అయ్యా నీ బాంచెన్! మాకు అద్దుగని ఆ నూనె పోయకున్న మంచిదేగని అంటే చల్ ఆనాడు ఎట్ల పోసినవ్ యినాడు ఎట్లా పోయావ్? నీ కన్ను గుంజుకుంటడని ఇదంతా తప్పే అని ఒంటి కన్నొన్ని కన్ను నేను తీసుకుంటనని

చెప్పి బెదిరిస్తాడు. అయ్యా! నీ బాంచెను ఈ కన్ను ఇస్తే నేను గుడ్డోనైత ఈ కన్ను ఇయ్య. ఆ నూనె వోయ మాకు ఆళ్ళకు చెల్లు. చెప్పి అయింత దండం పెట్టి వెల్లగొట్టిర్రు. కోమటయినా తీస్కచ్చి భార్యకు అప్పజెప్పిండు. మల్ల ఇట్లనే నడుత్తది. నడుత్తది. ఇగ రాజు సందుగ మీద చేయి వేసే గద రాజు ఈని ఇంట్ల వేయాలి గద! ఈ ముచ్చట కానుగుపట్నం రాజుకి చెప్పిర్రు. మా ఊళ్లే కూడ ఒక తర్కుపట్కం ఉంది. దీన్ని తెంపాలి. ఎంటిదోయ్ ఇగో నా ఇల్లు ఇటుంది. రాజు గారి ఇల్లు అటుంది. అయితే అతని భార్య నల్లగ ఉంటది. నా భార్య తెల్లగ మంచిగుంది. నా భార్య మీద అతను కన్ను ఏసిండు. రాజు ఏమన్నడు గదా మా యింట్లకచ్చి నువ్వేమన్న చేయి ఎయి అది ఇత్త అన్నడు. నేను పోయే రూపాల సందుగ మీద చేయి వేసి రూపాల సందుగ తీస్కచ్చిన. అది ఇయాళ మాత్రం ఈ రోజు మరి నా ఇంటికి అత్తనన్నడు. పిస కొడుకా గిట్ల చేసిర్రా! సరే నేను అత్తప అని కారు తీసుకొని ధర్మపురి పట్టణానికి ఇంటికచ్చిర్రు. రాజు ఆశ పడుతడు. ఎప్పుడు చేయి వేసి కోమటోని భార్య తెచ్చుకుందామనుకుంటడు. కోమటయినా ఈ బిల్డింగ్ మీదే గదా ఈ తంతెలు పలగగొట్టాలని వాడు తంతెలుంటే ఏకంగా నీ భార్య దాని మీద చేయి ఏత్తడు. వాడు చేయి ఏసింది. వాడు పట్టుకుని పోవాలని. అయింత ఉప్పరోళ్లను పిలిపిచ్చి కూలగొట్టిండు తంతెల్ని. కోమటోని భార్య అందగత్తె లాగా తయారుచేసి మంచిగ బంగ్ల మీద ఉంచిండు. కానుగపట్నం రాజు ఇరిగిపోయిన నిచ్చెన తెచ్చి ఈన్నుంచి ఆడికి ఏసిండు. ఈడికి ఎక్కాలి వాడు తంతెల మీది కెల్లి అయితే డైరక్ట్ ముడుతడు. రాజు ఏం చేసిండు. మంచిగ తయారైండు అచ్చి చూసేసరికి తంతెలు ఆడ ఉన్న నిచ్చెన మీద చేయి వేసిండు. కానుగ పట్నం రాజచ్చిండు. ఏమయ్యా! ఆనాడు కోమటైనా అచ్చి సందుగ తీస్కపెయిండు. మరి నువ్వ్ దేని మీద చేయి ఏసినవ్ నిచ్చెన మీద నిచ్చెన తీస్కపో అన్నడు. నిచ్చెన మీద వేసినవ్ నిచ్చెన నీదే పట్కోని పో..! ఇగ ఈ రాజు చిన్నగ ముఖం చేసుకొని వెళ్లిపోయిండు. ఇద్దరిని పిలిపిచ్చి ఒగని భార్య కావాలంటే ఏది రాదు. మీరిద్దరు ఒక ఊరోళ్లు అన్నదమ్ముల తీర కలిసి ఉండాలి బిడ్డా! ఆయన భార్య మీది నువ్వ్, నీ భార్య మీద ఆయన మనసు పెట్టద్దు. మీరు అన్నదమ్ముల లెక్క కలిసి ఉండాలని చెప్పి కానుగపట్నం రాజు కారు ఎక్కిపెయిండు.

### కానుగ పట్నం రాజు – కథా విశ్లేషణ

తనకున్న దాంతో సంతోషంగా ఉండక ఇతరుల దాని మీద ఆశపడేవారికి కనువిప్పు కలిగించే కథ ఇది. వస్తువైనా, సంపదైనా, భార్యైనా ఏదైనా ఇతరులకు ఉన్న దాన్ని చూసి ఓర్వలేని వారికి, అర్రులు చాచి ఆశపడే వారికి తగిన శిక్ష పడుతుందని నిర్ధారిస్తుంది ఈ కథ. బహుశా కానుగ పట్నం

అనే నగరం పూర్వం ఉండేది కావచ్చు. ఆ నగరానికి రాజు పూర్వం ఉండేవాడు కావచ్చు. ప్రజల సమస్యలను పరిష్కరించుటలో, రాజ్య పాలనను సుభిక్షంగా సాగించటంలో, సమ న్యాయం అందించటంలో మంచి రాజుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించి ఉంటాడు. అలాంటి రాజు దగ్గరికెళితే ఎలాంటి క్లిష్టతర సమస్యనైనా స్వల్ప కాలంలో తీర్చి, ప్రజల ఇబ్బందిని వెంటనే తీర్చేవాడు కావచ్చు. అందుకే ఈ కథలో ఏదో ఒక సమస్యలో ఇరుక్కున్న కోమటయినను, అతని భార్యను పదే పదే కానుగ పట్నం రాజు రక్షిస్తాడు. మోసం చేయాలనుకున్న మోసగాళ్లకు వాళ్ల మార్గంలోనే వెళ్లి తగిన బుద్ధి చెప్తాడు. మొదట కోమటి భార్య ఇంటి ప్రక్కన ఉన్న వెలమవ్యక్తి దుర్బుద్ధి గ్రహిస్తుంది. తన భర్త అమాయకత్వానికి తాను బలైపోతున్నాను అనుకుని కానుగ పట్నం రాజుని ఆశ్రయించడం తప్ప వేరే మార్గం లేదని బయలుదేరుతుంది. కానుగ పట్నం చేరేలోపు మరొక చిక్కు వచ్చి పడుతుంది.

కానుగ పట్నంలో ఏదో ఒక వ్యాపారం చేసుకోని బతుకాలని కోమటి దంపతులు వెళితే డబ్బు అవసరం పడుతుంది. ఆ డబ్బు కోసం తన దగ్గర ఉన్న గుర్రాన్ని కటికవాడికి అమ్ముతాడు. కటికవాడు ఇదే అదునుగా గుర్రం మీద ఉన్న ఇతని భార్య మీద ఆశపడి గుర్రాన్ని, అతని భార్యని లాక్కెళతాడు. ఏం చేయాలో దిక్కు తెలియని సమయంలో ఏడ్చుకుంటూ కుర్చుంటాడు. అదే సమయంలో అటు వైపుగా వచ్చిన కానుగ పట్నం రాజు అతనికి ఎదురైన సమస్యను తెలుసుకొని కటికవాడితో తలకాయ కావాలని అడుగుతాడు. రాజు తలకాయ అడిగితే కటికవాడి దగ్గర ఉండే మేక, గొర్రె తలకాయనో అనుకుని సరేనయ్యా! రేపు ఉదయాన ఇస్తానని చెప్తాడు. రాజు ఉదయాన వచ్చి తలకాయ అడిగితే మేక, గొర్రె తలకాయ ఇస్తాడు. నాకు నీ తలకాయ కావాలని రాజు మొండికేసి నిన్ను నరికి నీ తలకాయ తీసుకెళతానని బెదిరిస్తాడు. కటికవాడు విషయం అర్థం చేసుకొని రాజుకు క్షమాపణలు చెప్పి కోమటాయన భార్యని అతనికి ఇస్తాడు.

తెలివితక్కువ కోమటాయన అక్కడితో ఆగకుండా ఆ ఊరులో ఒక షాపుకు వెళతాడు. వాళ్లు దొంగ లెక్కలు కట్టి కోమటాయనను మోసం చేయాలనుకుంటారు. కోమటాయన తండ్రి అప్పు తీసుకున్నట్లు దొంగలెక్కలు చెప్పి నానా ఇబ్బందులు పెడతారు. కానుగపట్నం రాజుకు విషయం తెలిసి అక్కడికి చేరుకొని వాళ్ల బూటకాన్ని బయటపెట్టి కోమటాయనను రక్షిస్తాడు. కోమటాయనకు, అతని భార్య కానుగ పట్నం రాజు మీద నమ్మకం కలుగుతుంది. ఈ రాజు మా ఇంటి ప్రక్కన వెలమాయనతో ఉన్న చిక్కుముడిని తీర్చగలడని జరిగిన విషయమంతా చెబుతారు. కోమటాయన వెలమాయన ఇంట్లో

సంపద మీద చేయి వేసి సంచి తెచ్చుకున్నాడు. కోమటాయన భార్య మీద కన్నేసినా వెలమరాజు ఎప్పుడెప్పుడు కోమటాయన భార్యమీద చేయి వేసి తెచ్చుకోవాలని ఆరాటపడుతుంటాడు. వెలమాయన దుర్బుద్ధిని గ్రహించిన రాజు కోమటాయనకు, అతని భార్యకు వెలమాయన నుంచి తప్పించుకునే సలహా ఒకటిస్తాడు. కోమటి భార్య మీద చేయి వేసి తీసుకెళ్దామని ఎదురుచూస్తున్న వెలమాయన ఆశ నిరాశగా మిగిలిపోతుంది. కోమటాయన తీసివేసిన తన ఇంటి మెట్లు చూసుకోకుండానే వెలమ రాజు పక్కన ఉన్న నిచ్చెనను ముందు పట్టుకుంటాడు. దాంతో పథకం ప్రకారం అతని చేతులు నిచ్చెన మీద పడగానే కానుగ పట్నం రాజు వచ్చి ఆ నిచ్చెనను తీసుకెళ్లమని పూరమాయిస్తాడు. పరుల సొమ్ముకు ఆశపడటం తప్పని హితవు చెప్పి వెళ్లిపోతాడు.

1. తాడిని తన్నేవాడు ఒకడుంటే, వాడి తలదాన్నేవాడు మరొకడుంటాడని అనే నానుడి వ్యవహారంలో ఉంది. అతని భార్య మీద ఆశతో అమాయకుడైన కోమటిని మోసం చేయాలనుకున్న వెలమ రాజు ఆలోచనలను తిప్పికొట్టి తలదన్నేవాడిగా వ్యవహరించినవాడు కానుగ పట్నం రాజు.

2. లోకంలో మంచి వారు, చెడ్డవారు, తెలివైనవారు, తెలివి తక్కువవారు, మహానుభావులు, మూర్ఖులు ఇలా వివిధ లక్షణాలతో కూడిన మనుషులు నివసిస్తూ ఉంటారు. కాబట్టి మనం అనునిత్యం వారితో సమయస్ఫూర్తిగా వ్యవహరించకపోతే జరిగే దుష్పరిణామాలకు మనమే బాధ్యులం అవుతాం. చెడ్డవారితో, మోసపూరిత ఆలోచనలున్న వెలమ రాజు పాత్రలాంటి వారితో స్నేహం ఎన్నటికైనా మంచిది కాదని తెలుస్తుంది.

3. మన వెన్నంటి ఉంటూ వెన్నుపోటు పొడిచేవ్యక్తులు ఏ సందర్భంలోనైన ఎప్పుడైనా రావచ్చు. కాబట్టి నిత్యం మన జాగ్రత్తలో మనం ఉంటూ అప్రమత్తమవ్వాల్సి ఉంటుందని, ఈ కథలోని మూడు సంఘటనల ద్వారా  గ్రహించవచ్చు.

4. పూర్వం రాజు అంటే  నియంత, నిరంకుశ పరిపాలకుడు అని భావిస్తాం. కాని ఆనాటి రాజుల్లో కూడా ప్రజా సమస్యలను అర్థం చేసుకొని, పరిష్కరించే రాజులు లేకపోలేదని ఈ కథ లోని రాజు పాత్ర ద్వారా తెలుస్తుంది.

5. పరాయి వాళ్ల సొమ్ము మీద ఆశతో గానీ, పర స్త్రీ మీద వ్యామోహంతో గానీ ఉన్న వారి నుంచి తెలివిగా తప్పించుకునే మార్గాన్ని అన్వేషించే దిశగా ఈ కథలో రాజు పాత్ర చిత్రీకరించబడింది. ఈ కథ

విన్న శ్రోతలకు కష్టకాలంలో సానుకూలమైన ఆలోచనను కల్గి ఉంటే, ఆ కష్టాలను ఎదుర్కొవచ్చన్న నీతి బోధిస్తుంది.

## 2.4.1.2 కాటి మీదికెక్కిన కోడలు

చంగళి సుగుణ, రాయికల్ మండలం.

ఒక గ్రామంలో తల్లి, కొడుకు, కోడలు ఉంటరు. ఆళ్లు ఎవ్వరికి దానం చేసేవారు కాదు. ఆమె పొద్దున మూడు రొట్టెలు, రాత్రి మూడు రొట్టెలు చేసేది. ఆ పొద్దున మూడు జొన్న రొట్టెలు, పొద్దికి మూడు జొన్న రొట్టెలు తిని వీళ్లు పడుకునేవారు. తలా ఒకరికి రొట్టె వచ్చేది. అయితే బిక్షకులు ఎంతో మంది వస్తుంటరు. ఏవ్వళ్లకు ఒకరికి కూడా బిక్షం వేసేవాళ్లు కాదు. ఈళ్లు ఆగ్రామంలో అందరు ఎంతో కొంత తోచిన సహాయం చేసేవారు. కాని ఈ ఇంటివాళ్లు మాత్రం చేస్తలేరు. అది శంకరునికి తెలిసింది. శంకరుడు మరి ఎందుకు ఆళ్లు బిక్ష వేయడం లేదు. అని చెప్పి ఆయన ఒక ముసలి వేశంలో వస్తడు. ఒక జంగం వేశంలో వస్తడు. హరిదాసు వేశంలో వస్తడు. పిల్లగాని వేశంలో వస్తడు. ఎన్నో వేశాలు వేసుకోని అచ్చినప్పటికి కూడా వీళ్లు దానం చేసేవారు కాదు. ఒక రోజు ముసలి అవతారంలో పంకు పంకు అవతారంలో అచ్చిండు. అచ్చి ఆ బిక్షాటన చేస్తుండు. చేస్తే, ఆమె కోడలు రొట్టె తింటుంది. పాపం వణుకుతుండు ముసలాయన. ఆ.....! ఇద్దం అని చెప్పి సగం రొట్టె తీసి ఆ ముసలాయనకు భగవంతుడి రూపంలో ఉన్న ఈ శంకరునికి ఇస్తది. ఇచ్చేసరికి అత్త చూత్తది. 'అబ్బో నా ఇల్లు మునిగింది. పోయి అగో రొట్టెలు దానం చేత్తుంది. దీన్ని ఏం లేదు. ఇగ కాల పెట్టుడే మన ఇల్లు ఆగదిరా? కొడుకా...! అగో ఇగ దానానికి ఎగబడ్డది. సగం తిన్న రొట్టె ముసలోనికి వేసింది. అని చెప్పి కొడుకు చెప్తది. కొడుకా..! నువ్వు మనింటి పక్కన ఉన్న గంగిరెడ్డి కచ్రం, మన కచ్రం రెండు కచ్రాలు తీసుకుపో.. తీసుకుపోయి ఒకలుని తోలుకుపోయి. కట్టెలు తీసుకచ్చి స్మశాన వాటికలో వేయి వేసి దీన్ని ఇయ్యాళ కాలవెట్టుడే కాల వెట్టకపోతే కొడుకా...! అన్నంక మంచిది అమ్మా అని చెప్పి కొడుకు బయలుదేరిండు అడవికి. కట్టెలు తీసుకచ్చింఁడు. రెండ్రు కచ్రాలు కట్టెలు తీస్కచ్చింఁడు. స్మశాన వాటికలో ఏసిండు మంచిగ. ఏసి అమ్మా ఏసచ్చిన అంటే మరీ నడువుర్రి కోడల్ని తోలుకపోదాం. అని నడువే నువ్వు అని చెప్పి తీస్కపోదాం.. నిన్ను కాలవెట్టుడే కోడల్ని అని చెప్పి కోడల్నిని తోలుకోని తెల్ల బట్ట తీసుకొని గ్యాస్ నూనె తీసుకోని కొడుకు, కోడలు ఈళ్లు బయలుదేరింఁడు ఇగ. బయలుదేరినంక మంచిగ కాదు పేరించుంఁడు. దాండ్ల పండుమని చెప్పి కోడలుని పండవెట్టి తెల్లబట్ట గప్పి, గ్యాస్ నూనె

పోసిళ్లు. ముట్టిత్తమనేసరికి ఆ... అగ్గిపెట్టె లేదు. దేవుడు మైమరిపించిండు శంకరుడు. అయ్యో! అగ్గి పెట్టె లేదు కొడుక. నువ్వు వోయి తీసుకరాపో అని చెప్పి ఆ...! ఈమె తోలేసింది. కొడుకును తోలేసినంక కొడుకు ఊర్లకచ్చిండు. అగ్గిపెట్టె కొనుకొని అచ్చేసరికి ఈమె చూసి చూసి కొద్ది దూరాన వోయి ఒక చెట్టుకాడ కూసున్నది. కూసునేసరికి ఒక ముసలి ఇదే భగవంతుని రూపంలో ముసలాయనచ్చి అమ్మా నువ్వు కాటి మీదికెల్లి లేవు. ఒక కట్టె వెడదామని ఇడంటే తే...! అని ఒక కట్టి పెట్టేసి ఆ మీదికెల్లి తెల్లబట్ట కప్పి ఆమెను దూరం పొమ్మని చెప్పింది. ఆయన వచ్చి ఈ తల్లి ఇద్దరు అదే కట్టెను చూసే ఇదే మనిషి కావచ్చు అని అగ్గిపుల్ల గీకి వెట్టి వెళ్లిపోయిండ్లు. వెళ్లిపోయిన తరువాత ఈమె ఏడుస్తుంది. మరి నేను ఎక్కడికి ఎళ్లాలి రాత్రి అయింది. ఇంటికోతే నను తిడుతరు. మరీ నేను ఏడికిపోవలని చెప్పి మరీ? నేను ఏమన్న పని చేసుకోని బతుకుతా ఎక్కడికి పోత అని లేదమ్మా నువ్వు ఎక్కడికి వెళ్ళకు. నువ్వు మీ ఇంటికే పో. నేను వాళ్ళకు మైమరిపిస్త. నీకెందుకు బాధ అని చెప్పి ముసలాయన చెప్తడు. ఈమెను పోమ్మంటడు. పోమ్మనంక ఈమె రాత్రి పదిన్నర పదకొండు గంటల ప్రాంతమున అత్తమ్మ.. అత్తమ్మ.. తలుపు తీయు... బావ.. బావ.. తలుపు తీయు అంటే ఈల్లు అగో! ఇది లక్ష్మీని కాలవెట్టేత్తే లక్ష్మీ అచ్చింది రా.. ఎట్లరా..? అని చెప్పి చెప్పి అత్త అంటది. అవ్.. బావా బావా అంటుంది. గదనే అమ్మ ఎట్ల అని చెప్పి ఆళిద్దరూ దయ్యమై అచ్చింది రా..! అని చెప్పి, ఎట్ల అని చెప్పి ఆళ్లు ఇంట్లనే భయపడుతుర్రు. ఆడ కట్టోళ్లు అందరు లేసిర్రు. ఏమైంది ఏమైంది ఈమె రాత్రి పిలుత్తుంది. ఆళ్లు లేత్తలేరు. ఏమైంది ఏం బుట్టందే? మీకు లేవుళ్లి. మీ కోడలు అచ్చింది. తలుపు తీయుర్రి అంటే అది లేదు లేదు అది దయ్యమై అచ్చింది. అది దయ్యం కాదు లక్ష్మీ అయి అచ్చింది. మేమందరం మనుషులం కాదా! దయ్యం కాదే అని వీళ్లు అంటారు. ఇగ తలుపులు ఆళ్లు తీస్తరు. తీసిన తరువాత దేవుడు వాళ్లను మైమరిపించి ఆ సంతానం అయితది. మంచిగ కొడుకు పుడుతడు. మంచిగ ఆమె తనకు తోచిన దానం కొంచెమైన ఆ బిక్షకులకు దానం చేసేది. ఇంటివాళ్ళందరు కూడా దానం చేత్తరు. అంటే ఆ సగం రొట్టె భగవంతుడికి వేయడం వల్ల కాపాడిండు.

## కాటిమీదికెక్కిన కోడలు – కథావిశ్లేషణ

ఈ కథలో తల్లి, కొడుకు, కోడలు అనే పేరు లేని మూడు పాత్రలున్నాయి. వీరి కుటుంబంలో రోజుకు సరిపడేంత పొద్దున 3 చపాతీలను, రాత్రి 3 చపాతీలను మాత్రమే చేసుకునే వారు. వారి గుమ్మం ముందుకు వచ్చినవారికి ఎలాంటి బిక్షం వేయకుండా తిప్పి పంపించేవారు. పిసినారులుగా

వ్యవహరించి ఆ ఊరిలో అందరి చేత వీళ్లు పిసినారులుగా పిలవబడేవారు. భిక్షకులకు, సన్యాసులకు, ముష్టివాళ్ళకు ఎవ్వరికి కూడా చిల్లిగవ్వ, ఇంత సద్దెన్నం కూడా దానం చేసేవారు కాదు. కొద్ది రోజుల తర్వాత ఇదంతా గమనించిన ఈశ్వరుడు వీరిని పరీక్షించి చూద్దామని వీరింటి ముందు వివిధ రూపాల్లో భిక్షాటనకు వస్తాడు. చివరిగా పండు ముసలి రూపంలో వచ్చిన శివునికి అత్త, కొడుకు నిరాకరించినా కోడలు మాత్రమూ కొంత జాలితో తాను తింటున్న రొట్టెలో సగం ముక్కను ఇచ్చింది. దాంతో దానధర్మాలు చేయడం వారి ఇంట వంటలేని అత్త, కోడలు మీద విరుచుకు పడి ఏలాగైనా కోడలుని కాటి మీదకెక్కించైన చంపేయాలని నిశ్చయించుకుంటుంది. కొడుకును కాటికి సిద్ధం చేయమని పురమాయించింది. తల్లి మాటను విని కొడుకు స్మశానంలో కాటిని సిద్ధం చేస్తాడు. కాటి మీద పడుకొమ్మని చెప్పగా కోడలు కాటి మీద పడుకుంది. కాటిని అంటించడానికి సిద్ధమైనా కొడుకు అగ్గిపెట్టె మరిచిపోతాడు. అత్త అగ్గిపెట్టెను తీసుకు రమ్మని కొడుక్కు చెప్పి, తాను ఒక చెట్టు దగ్గర కూర్చుంటుంది. ఇంతలో కోడల్ని కాపాడటానికి శివుడు అదే ముసలి వేషంలో వచ్చి కాటిమీద ఉన్న కోడలిని లేవమని చెప్పి ఆమెకు బదులుగా ఒక దుడ్డుకర్రను పెట్టి గుడ్డను కప్పి వెళ్తారు. తరువాత కొడుకు వచ్చి కాటి మీద కప్పి ఉన్న గుడ్డను చూసి లోపల తన భార్య ఉందేమోనని భ్రమతో నిప్పు అంటించి ఇంటికి వెళ్తాడు. ముసలి వేషంలో వచ్చిన శివుడు కోడల్కి నచ్చ చెప్పి అత్తకు, భర్తకు జరిగిందంతా మరిచిపోయేలా చేస్తానని చెప్పి ఇంటికి పంపిస్తాడు. చచ్చిందనుకున్న తన భార్య తిరిగి ఇంటికి వచ్చి తలుపులు కొడుతుంది. వాళ్లు చనిపోయిన భార్య ఎలా వస్తుందనుకొని తన ఆత్మ దెయ్యంగా వచ్చిందేమోనని అత్త, భర్త భయపడి తలుపులు తీయడానికి వెనుకముందు చేస్తారు. వీధి చుట్టుప్రక్కల వారు తను దెయ్యం కాదని మీ కోడలే అని చెప్పిన తరువాత తలుపులు తీసి చూస్తారు. వాళ్లు గతాన్ని మరిచిపోయి సంతోషంగా జీవిస్తారు. కొద్ది రోజుల్లోనే కోడలు తాను తింటున్న సగం రొట్టె ఆకలితో ఉన్న ముసలివానికి ఇచ్చింది. ఆ ధానధర్మాల పుణ్యమని వారికి సంతానం కల్గి, అప్పటి నుంచి సంతోషంగా దానధర్మాలు చేయడం ప్రారంభిస్తారు.

1. కాటిమీదికెక్కిన కోడలు కథ దానధర్మాలకున్న ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను వివరిస్తుంది. అన్ని దానాల కన్న అన్నదానం గొప్పది అనే నానుడి కలదు. ఈ కథలో శివుడు పండు ముసలివాడి వేషంలో వచ్చినప్పుడు కోడలు పాత్ర చేసిన దానం వల్లనే ఆమె తన ప్రాణాలను కాపాడుకోగలిగింది.

2. ఆడవారికి మాతృత్వాన్ని మించిన భాగ్యం లేదని అంటారు. ఈ కథలో లక్ష్మీదేవి పేరున్న కోడలు పాత్రలో ఆమె చేసిన దానం ఫలితంగా సంతానాన్ని కలిగి భర్తతో సంతోషంగా ఉంటుంది. ఆమె దానధర్మాలు చేయని అత్త, భర్త మనస్సులను మార్చి మానవత్వాన్ని, దానగుణాన్ని పెంపొందిస్తుంది. వారికి దానధర్మాల విలువని తెలియజేస్తుంది. ఈ కథ వింటున్న శ్రోతలకు కూడా తమకు తోచినంతలో సహాయం చేయాలనే ఆశ పుడుతుంది.

3. తాను మాత్రమే బతికితే చాలునని ప్రక్కవారు ఎలా బతికితే నాకెందుకు అనుకునే నేటి సమాజానికి దానధర్మం విలువను తెలియజేసి, ఇతరుల్లో సామాజిక స్పృహను కలిగించే కథగా రూపొందింది. ఇతరులకు చేసిన సహాయం ఏదో ఒక రూపంలో మనకు తిరిగివస్తుందనే నీతిని అందజేస్తుంది ఈ కథ. ముఖ్యంగా ఆపదలో ఉన్నవారికి, ఆకలితో అలమటించే వారికి మనకు తోచినంతలో ఎంతో కొంత దానం చేయాలి అనే భావన మనలో కల్గుతుంది.

4. జానపద కథల్లో అద్భుతాలకు, విచిత్రాలకు తావెక్కువ. కాబట్టి ఈ కథల్లో శంకరుడు రావడం వీరిని పరీక్షించడం, కోడలిని రక్షించడం ఇవన్ని కల్పితాలే అయిన కథాగమనాన్ని మలుపు తిప్పడంలో ప్రధానపాత్ర పోషించాయి. భిక్షాటన చేయడం శంకరుడి చెస్తాడని చెబుతారు. కాబట్టి కథాకల్పనలో ఎన్నో దేవతలున్న మన హిందు వ్యవస్థలో శంకరుడి పాత్ర కథలో చిత్రించడం సముచితంగా ఉంది.

### 2.4.1.3 దైవానుగ్రహం

చిట్టన్నోజు అమ్మాయక్క, గణేష్ పల్లె గ్రామం, ధర్మపురి మండలం

అనగ అనగ ఒక రాజు. ఒక రాజుకు నలుగురు బిడ్డలు. నలుగురు బిడ్డలయితే ఈ రాజు అడుగుతడు కద బిడ్డలను అడుగుతడు. బిడ్డ.. బిడ్డ.. నీవేవరీ భాగ్యనివి అని చెప్పి అడుగుతడు. నీ భాగ్యనికే అని చెప్పి చెప్తది పెద్ద బిడ్డ. పెద్ద బిడ్డని అడిగితే అట్ల చెప్పే మల్ల రెండో బిడ్డనడిగితే అట్లనే చెప్తది నీ భాగ్యనికే అని. మూడో బిడ్డను అడుగుతడు. అట్లే నీ భాగ్యనికే అని అంటది. నాలుగో బిడ్డ చిన్న బిడ్డను అడిగితే నువ్వేవరి భాగ్యానికి పుట్టినవే అంటే నా భాగ్యానికి నేనే పుట్టిన అని చిన్న బిడ్డంటది. నా భాగ్యానికి నేనే పుట్టిన అని చెప్పె..! ఆ.. అక్కలందరమో నా భాగ్యానికి పుట్టిన వంటే నువ్వు నీ భాగ్యానికి పుట్టిన అంటవ? సరే నువ్వు సుఖ పడు అని తండ్రి అంటడు. సరే అయిన మంచిదే నా సుఖాన్ని నేనే బతుకత అని చిన్న బిడ్డ అంటది. అన్నవోల్లే ఈ ముగ్గురి బిడ్డలకు మంచిగ ఉన్నోళ్లకు ఇచ్చి పెండ్లి జేత్తడు. పెండ్లి జేసినోల్లే ఈ చిన్న బిడ్డను ఏం జేత్తడు గద! కుష్టు రోగమైన ఉంటడు.

కుష్టువానికి చిన్న బిడ్డను ఇత్తడు. ఇచ్చినోల్లే సరే ఈ బాబుని నీకే ఇచ్చిండు అన్నవోల్లే సరే నేను మాత్రం కాదన అని చెప్పి అంటది. అన్నవోల్లే అయింత ఆయనకు ఇచ్చి పెండ్లి జేత్తడు. పెళ్లి చేసిన అయింత ఒక చెట్టు కింద ఆళ్లు బతుకుతరు ఇద్దరు. అయ్యో! ఇడంటడు కద! నువ్వు నరుని చేసుకుంటివి. నువ్వు రాజు పెద్ద కుల బిడ్డవు. నన్ను బిచ్చపోన్ని చేసుకుంటివి అని చెప్పి వీడంటడు. నాతో ఏం సుఖ పడతవ్? ఇది అంటది కద. సుఖమైన, కట్టమైన నీతోనే ఉంటా అని చెప్పి అంటది. ఇగ ఉండంగ ఉండంగ ఏంజేత్తది. ఈ కష్ట పడుకుంట ఉండుడు ఏంది? అని చెప్పి నేను గంగలవడి సత్తా ఉంటే ఏం లాభం లేదు. నలుగురైన నన్నె అంటుర్రు. ఇట్ల కష్టపడుడు ఏందని చెప్పి గంగలవడి సత్తా అని చెప్పి ఆ మొగన్ని ఇట్ల పట్టుకుంటది. ఇట్ల పట్టుకుని గంగల దూకుటానికి పోతది. గంగల దూకుతది. దూకినోల్లే కతం సావన్న? మంచిగ పదహారేళ్ల పిల్లగాడు అయితడు. పదహారేళ్ల పిల్లగాడు అయినోళ్లే అయింత వీన్ని తోలుకుంటది. మల్ల ఇక్కడ చెట్టు కిందికి అత్తది. అచ్చినోల్లే మల్ల ఇట్లనే ఇంత మంచిగ తోలుకోని ఉండేవరకు ఎవరు ఏమంటారో ఏం కథనో. ఇది ఎవల్నో పట్టుకొని అచ్చింది. దీనికి రోగపోన్నిచ్చి పెళ్లి చేసిరి. ఇంత మంచోన్ని ఎవల్నో పట్టుకొని అచ్చింది. ఏం కథ అని నలుగురైన అంటరు. ఏట్ల ఏంజేసుడు అని అనుకుంటది. అనుకుని ఒకాడికి వోతది. ఒక చెట్టు కిందికివోయి అక్కడ శంకరుడనూ, పార్వతి ఉంటరు. శంకరుడు, పార్వతీ ఉన్నవోల్లే అయినను అడుగుతది. మరి సామీ గిట్ల అయింది. గిట్ల గంగల వడవోయిన పోతే కుష్ఠ రోగపోడు కాలు, ఏల్లు లేనోడినిచ్చి లగ్గం జేత్తే నేను గంగలవద్ద ఆయన ఎత్తుకొని గంగలవడితే పదహారు ఏళ్ల పిలగాడు అయిండు. అని చెప్పి నన్ను ఎవరు ఎన్ని తరకలు అంటరో అని చెప్పి అడిగినోల్లే ఆకాశవాణి, భూదేవి మేం పలుకుతం అని చెప్పి శంకరుడు అంటడు. అన్న వోల్లే ఏంజేత్తది గద. ఒకరింట్ల పెళ్లయిద్ది. పెళ్ళయినోల్లే బోజనానికి వోతది. అక్కడ ఆల్ల అక్క, చెల్లెలు, తల్లిదండ్రి వాళ్లత్తరు. వీళ్లు పోతరు. పోయేవరకల్లా ఏంజేత్తరు. తల్లిదండ్రి, అక్కచెల్లెలు వీళ్లనుకుంటరు చూసినవ? రోగపోడే నాయే దీని భర్త గదిగాన్ని ఇడిసిపెట్టి ఏవన్నో పట్టుకొని అచ్చింది. అని చెప్పి రకరకాలుగా తిడతరు. దీన్ని రకరకాలు తిట్టినవోల్లే అట్లయినదానికి నేనుండేమి లాభం. నేను గంగలనే పడిసత్త. మల్ల ఉండుడు ఎందుకని చెప్పి గంగలనే పడత అని పోతది. పొంగనే శంకరుడు, విష్ణుమూర్తి, బ్రహ్మదేవుడు వీళ్లందరూ ఆమె సత్యవోదన్న. రోగపోడు మంచోడు అయిండు. అట్ల మీకు ఏముండదు. అని చెప్పి అన్నవోల్లే ఈల్లు మంచిగ అయినోల్లే ఈల్ల తల్లిదండ్రులకు, అక్క చెల్లెలకు ఇగ ఏమి లేకుంట అయితది. ఏం తిందామంటే తిండికి లేకుంట

అయితరు. అయ్యో! ఆమెనేమో గట్ల జెత్తివి. నీకు తిందామంటే తిండికి లేకపాయె అని. ఇగ ఈమె ధనికురాలైందిగ, ఇగ మస్తున్నది. మంచిగయింది. అయినోల్లే ఇక్కడికి అచ్చి అందరుండి, అయ్యో! మీ అమ్మ, నాన్న అందరు కష్టపడుతున్రు. మీ అక్క, బావలు కష్టపడుతుల్లు మరి మీ దగ్గరికత్తే నీవ్వు పెడతవ. రానియి... వాళ్లత్తే నేం పెడత. నేనైతే రమ్మన అని చెప్పి అంటది. అక్కచెల్లెళ్లతో నాకు పనిలేదు. ఇగ అక్క, చెల్లెలు రారు కని తల్లిదండ్రులు ఇద్దరు అచ్చి ఈమె దగ్గరనే ఉంటరు. తల్లిదండ్రులిద్దరిని మంచిగ సాదుకుంటది.

## దైవానుగ్రహం – కథావిశ్లేషణ

అసత్యం పలుకనివారు, నిజాయితీతో జీవించేవారికి ఆ భగవంతుడే తోడుంటాడని నిరూపించే కథ. ఒక తండ్రి తన మాటను ధిక్కరించినందుకుగానూ నాల్గవ బిడ్డకు ఒక కుష్టు రోగం ఉన్న వ్యక్తిని ఇచ్చి వివాహం చేస్తాడు. దైవానుగ్రహం వల్ల ఆ కుష్టువాడు పదహారేళ్ల కుర్రాడుగా మారతాడు. తన చెల్లెలి దీనపరిస్థితి తెలుసుకోకుండా అక్కలు చెల్లెలిపై అపనిందలు వేస్తారు. ఆ అపనిందలు భరించి దైవాన్ని ప్రార్థించగా, దేవుడు ప్రత్యక్షమయి ఏ తప్పు చేయలేదని చెప్తాడు. అంతేగాదు ఆమె కన్న అన్ని విధాలుగా మంచిగా బతుకుతున్నా అక్కచెల్లెళ్లకు ఐశ్వర్యాలను తొలగించి, నిజాయితీతో జీవిస్తూ చెల్లెలికి అష్టైశ్వర్యాలను సిద్ధింపజేస్తాడు. సత్యం, నిజాయితీతో జీవించే వారికి నిత్యం దైవానుగ్రహం ఉంటుందని ఈ కథ వల్ల తెలుస్తుంది. తప్పు, ఒప్పులు తెలియకుండా పరాయివారిని నిందించడం మంచిది కాదన్న నీతి బోధపడుతుంది.

1. ఈ కథలో రాజు నాల్గవ కూతురు సత్యాన్ని వీడనాడదు. అందుకే వారి తండ్రి అడిగిన సమాధానానికి తన పుణ్యానికే తాను పుట్టానని తెలుపుతుంది. ఆమె చెప్పిన మాట నచ్చక తండ్రి అక్కచెల్లెళ్ళకు బాగా డబ్బులున్న వారితో పెండ్లి చేసాడు. చిన్న బిడ్డకు మాత్రం కుష్టి రోగం ఉన్న వ్యక్తితో పెళ్లి చేసి అతనితోనే జీవితాన్ని గడపమని ఆదేశిస్తాడు. తండ్రి చెప్పిన మాటకి కట్టుబడి అతనితో జీవితం సాగిస్తుందే తప్ప తన భర్తను దూరం చేసుకోదు.
2. ఆమె పేదరికాన్ని, భర్త నిస్సహాయతను చూసి తట్టుకోలేక గంగలో (గోదావరి) పడి చావడానికి సిద్ధమవుతుంది. మరొకసారి తన అక్కలు, తల్లిదండ్రులు దూషించిన మాటలకి కూడా గంగలో పడి చావడానికి పోతుంది. నిజాన్ని తెలియజేయడానికి భగవంతుడు భూమి, ఆకాశం చేత పలికించడం, భర్తతో గంగలో దూకగానే కుష్టివాడు పదహారేళ్ల వయస్సున్న కుర్రవాడుగా మారడం ఇవన్నీ

సంఘటనలు సత్యవతి కథను పోలి ఉన్నట్లు అనిపిస్తుంది. కథ ప్రారంభం వైవిధ్యంతో ఉండి, ముగింపు మాత్రం సత్యవతి కథను పోలి ఉంటుంది.

3. నిజాయితీతో, సత్యాన్ని వీడనాడని వారికి దైవం ఎల్లప్పుడు అండగా ఉంటాడని ఈ కథలో చెల్లిలి పాత్ర ద్వారా వ్యక్తమవుతుంది. ఎంతటివారైనా దైవం మీద భరోసా నుంచి తమ పని తాము చేసుకుంటూ పోవడమే ఉత్తమమన్న విషయాన్ని విశదీకరిస్తుంది.

## 2.4.1.4 గుమ్మడి మర్రి కథ

కైరం రమణ, బతికెన పల్లి గ్రామం, రాయికల్ మండలం.

ఒక వ్యక్తి దారిలో నడుచుకుంటూ నడుచుకుంటూ పోతున్నడు. నడుచుకుంటూ పోయేసరికి ఒక గుమ్మడి తీగకు గుమ్మడి పండ్లు కనబడ్డాయి. గుమ్మడి పండ్లు కనబడితే అవి చూసి ఆయన గీ తీగ పారుతున్నది. గీ... భగవంతుడు అనే వాడున్నడా? భగవంతుడు గీ గుమ్మడికాయలను గింత పెద్ద కాయలను గీ తీగలకు పెడతడా? భగవంతుడున్నడు.. భగవంతుడున్నడు.. అని అందరంటుర్రు. అసలు ఉన్నడ? లేడ? అని సంశయించుకుంట అనుకుంట ఆలోచించుకుంట పోతుండు. పోయేసరికి పోయిపోయి ఒకదిక్కు ఎండ కొడుతుంది. మంచిగ మర్రి చెట్టు కింద పడుకుందమని చెప్పి మర్రి చెట్టుకింద వోయి పడుకుంటడు. పడుకోని పైకి ఆలోచిస్తూ నేను ఒకవేళ దేవుడిని అనుకొని ఉంటే నేను భగవంతుని అయితే ఆ మర్రి కాయలను తీసుకోనిపోయి గుమ్మడి కాయలకు పెడుదును. ఆ గుమ్మడి కాయలు తీస్కచ్చి దీనికి పెడుదును. యింత పెద్ద చెట్టు మర్రి చెట్టు ఆ కాయలు దీనికి ఉంటే ఎంతో అందంగా మంచిగ ఉంటయి. ఈ మర్రి కాయలు తీస్కోనిపోయి దానికి పెడితే బాగుంటది. ఈ ఆలోచన మంచిదిగని భగవంతుడు ఈ గుమ్మడి కాయలనేమో దీనికి పెట్టాలి. ఈ కాయలు దానికి పెట్టాలి గని. ఇది తప్పు అని చెప్పి ఆయన అనుకుంటడు. ఆని ఆలోచిస్తున్నడు. ఆలోచించగనే ఒక మర్రి పండు మీదకెంచి అచ్చి ఈనే మీద పడతది. అబ్బో! అని చెప్పి దెబ్బ తాకుతది. గీ.. నేను అనుకున్న కరక్టే భగవంతుడున్నడు. లేడు అనుకున్న గని భగవంతుడు నిజంగనే ఉన్నడు. మరి ఇంత పెద్ద చెట్టుకు చిన్న కాయలు పెట్టిండు. ఒక వేళ పెద్దకాయలు పెట్టినట్లయితే దీని కిందికి ఎన్నో పశువులు, ఎంతోమంది నీడ కోసం అత్తరు. పడుకుంటరు. మరీ మీద పడితే చచ్చిపోతరు గద! వాస్తవమే భగవంతుడు నిజంగ ఉన్నడు. నాదే తప్పు అని చెప్పి ఆయన తప్పు ఆయనే తెలుసుకుంటడు.

## గుమ్మడి మఱ్ఱి – కథావిశ్లేషణ

ఈ కథ వింటుంటే విచిత్రంగా అనిపిస్తుంది. కాస్త చమత్కారం, కాస్త హాస్యం కలగలిసినట్టు ఉంటుంది. మనుషులు సహజంగా నేను దేవుడినైతే, నాకే అధికారమున్నట్లయితే నేను అది చేసి చూపిస్తాను. ఇది చూసి చూపుతాను మాటలు అనడం గమనిస్తూనే ఉంటాం. మనిషే దేవుడైతే ఏం చేసి చూపుతానో అనే అహంకారం మొదట్లో చూపించి, తరువాత మనిషిని సృష్టించిన దేవుడికి ఎంత లౌఖ్యం ఉండి ఉంటుందో తెలిపే కథ ఇది. ఒక బాటసారి దారి పొడుగునా వెళుతూ వెళుతూ ఒక గుమ్మడి తీగకున్న పెద్ద గుమ్మడి కాయలను చూసి ఆశ్చర్యపోతాడు. చిన్న కాండం ఉన్న తీగకు అంత పెద్ద కాయలను ఎందుకు కాసేలాగా దేవుడు సృష్టించాడో అని మొదట్లో అనుమానిస్తాడు. కాని తీర మఱ్ఱిచెట్టు దగ్గరికి వెళ్ళేసరికి అతనికి కలిగిన అనుభవానికి, అతడు ఆలోచించిన తీరులో మార్పు వస్తుంది. భగవంతుడి సృష్టి తత్త్వాన్ని గ్రహిస్తాడు.

సమస్తాన్ని సృష్టించిన దేవుడికి ఈ లోకంలో ఏది ఎంత వరకు ఉండాలో అంత వరకే సృష్టించాడని జానపదులు నమ్ముతారు. ఆ బాటసారి మఱ్ఱిచెట్టు కాయ తల మీద పడినప్పుడు అసలు విషయాన్ని అర్థం చేసుకుంటాడు. ఈ కథలో మఱ్ఱిచెట్టు మీద నుంచి కాయ పడినప్పుడు అతని ఆలోచన విధానంలో ఒక్కసారి మార్పు వస్తుంది. దేవుడు సృష్టించిన లోకంలో లోపం లేదని తన ఆలోచన తీరులోనే లోపం ఉందని నిజాన్ని తెలుసుకుంటాడు. ఈ కథలో హాస్యం కన్నా చమత్కారమే ఎక్కువ అని చెప్పాలి. కథానిర్మాణంలో ముందు మనిషి అజ్ఞానిగా ఆలోచించి దేవుడి మీద నిందవేస్తాడు. తరువాత అందరికి విశ్రాంతినిచ్చే మఱ్ఱిచెట్టుకి పెద్ద కాయలుంటే ఎంతటి ప్రమాదం జరిగి ఉండేదో గ్రహించి తన తప్పు తెలుసుకుంటాడు. మాటి మాటికి దేవుడిని దూషించే మనుషుల స్వభావాన్ని, మనిషి అహంకారాన్ని బహిర్గతం చేస్తూ, దేన్నైనా లోతుగా ఆలోచించి అసలైన నిజాన్ని తెలుసుకోవాలన్న విషయాన్ని బోధపరుస్తుంది. ఇలాంటి కథలు చిన్న పిల్లలపై ప్రభావాన్ని చూపుతూ వారిలో తార్కిక ఆలోచనను పెంపొందిస్తాయి.

## 2.4.1.5 గుడ్డి, కుంటివాడి కథ

కైరం రమణ, బతికెన పల్లి గ్రామం, రాయికల్ మండలం.

ఒక గ్రుడ్డి వాడు ఒక ఊరి నుంచి ఇంకో ఊరికి సంచారం చేస్తూ ఉంటడు. సంచారం చేసే వరకు పొద్దు పోవుచున్నది. ఇగ పలాన ఊరికి పోయే దారి ఇదేనా? అని చెప్పి ఒక కుంటి వాన్ని

అడిగాడు. కుంటివాడు ఏమని చెబుతుండు. అవును ఇదే దారి మరీ సాయంత్రం అవుతుంది. మరీ నేను అదే ఊరికి పోవాలి అని అంటే మరీరా.. అంటే మరీ నాకు కాళ్లు లేవు కదా నడవలేను దేక్కుంట రావాలే. నీకేమో కాళ్లున్నాయి. నాకు కాళ్లు లేవు. అననంటే మరీ నేను భుజాలమీదకి ఎక్కించుకుంటా నాకు సూపెడతావా తొందరగా అంటే ఆ వస్తా అని చెప్పి కుంటివాడిని గ్రుడ్డివాడు భుజాల మీద ఎత్తుకొని వెళుతున్నాడు. దారిలో పోతుండగా ప్రక్కన ఒక దోసకాయ చెట్టు ఉంది. దానికి దోసకాయలు కాసి ఉన్నాయి. దోసకాయలను ఈ కుంటివాడు చూస్తడు. చూసి గ్రుడ్డివానికి ఆగు ఆగాగు.. ఇక్కడ దోసకాయలున్నాయి. మనం తీసుకొచ్చుకుందాం. పట్టుకచ్చుకుందాం నీగ్గొన్ని నాకు గొన్ని. నేను తెంపుకత్త. నను అక్కడకు తీసుకెళతావా అంటే... లేదు లేదు వద్దు వద్దు...! మనం సక్కగ వెళ్లిపోదాము అని చెప్పి గ్రుడ్డివాడు అంటాడు. లేదు లేదు నీకేమన్నా పిసవట్టిందా? ఆడికి పోదామా? దోసకాయలు మస్తు ఉన్నాయి. తీస్కచ్చుకుందాం ప...! అక్కడికి తీసుకెళ్లు నేను చూపిత్తాప అంటే . వద్దు వద్దు అవి చేదు దోసకాయలు మంచి దోసకాయలైతే ఎవరైన ఉంచుతర? ఇంత మంది దారిపోన్న నడుస్తున్నరు. ఎవలొ ఒకరు తెంపుకు పోతరు కదా! ఇవి చేదు దోసకాయలున్నట్లున్నయి అని గుడ్డి వాడు అంటాడు. అది నాకు తెల్వదు. తీసుకు పో నడు.. అన్నంక అక్కడికి తీసుకుపోతడు. అక్కడికెళ్లిన తర్వాత దోసకాయలన్ని ముల్లేగట్టుకుంటడు. తిను అని ఆయనకు ఒకటిచ్చి ఈయనోకటి తింటడు. తింటే అవి చెడ చేదు. అంటే గ్రుడ్డివాడికి కళ్లు లేకున్న గాని అంత జ్ఞానాన్ని దేవుడు ప్రసాదించాడు. వీనికి కళ్లు ఉన్నప్పటికి కూడా ఈయనకు జ్ఞానం లేదు. అంటే ఎవరికి ఎంత జ్ఞానముండాలో వారికి అంత జ్ఞానం భగవంతుడు ప్రసాదిస్తాడు.

## గుడ్డి, కుంటివాడి కథ – కథావిశ్లేషణ

ఒక గుడ్డివాడు ఒక ఊరి నుండి మరొక ఊరు వెళతాడు. అతడు గుడ్డివాడు కనుక దారి తెలియక మార్గం మధ్యలో తనకెదురైనా కుంటివాడిని అడిగి దారి తెలుసుకుంటాడు. కుంటివాడు కూడా అదే మార్గంలో వెళ్ళాలి కనుక ఈ గుడ్డివాడి సహాయం కోరతాడు. ఒకరికేమో కళ్ళు కనిపించవు మరొకరికి నడవడానికి కాళ్ళు లేవు. కాబట్టి వారు వారి గమ్యాన్ని చేరుకోవటానికి పరస్పర సహకారం అవసరం. అందుకే ఒకరికొకరు సహాయం చేసుకోవాలని ఒప్పుకొని ఇద్దరు బయలుదేరతారు. వారు వెళుతున్న దారిలో రహదారి ప్రక్కన బాగా కాసిన ఒక దొసకాయల తీగ ఉంటుంది. రహదారి పొడుగునా కాసిన దొసకాయలను ఎవ్వరు కోయకుండా ఎందుకు వదిలేస్తారు. వాటిని అలా వదిలేశారు అంటే అక్కడ

ఎదో కారణం ఉందని గుడ్డివాడు గ్రహిస్తాడు. కళ్లు కనిపించకపోయిన తన బుద్ధి బలంతో ఆ చిన్న లాజిక్ పట్టుకుంటాడు. రెండు కళ్ళు ఉండి కూడా కుంటివాడు ఆ విషయాన్ని గ్రహించక దోసకాయలను కోసుకుని మూట కట్టుకుని తీసుకువెళతాడు. మూట విప్పి చూస్తే కాయలన్ని చేదుగా ఉంటాయి. అవి తినడానికి పనికి రాని కాయలను తెంపుకొని వాటి బరువుని మోసి సమయాన్ని, బలాన్ని వృధా చేసుకుంటాడు. కుంటి వాడు కంటి చూపు బాగా ఉండి కూడా దొసకాయలు చేదనే విషయాన్ని ముందే గ్రహించాడు. గుడ్డి వాడు మాత్రం కళ్లు లేకున్నా బుద్ధితో ఆ విషయాన్ని గ్రహిస్తాడు. కొన్ని సందర్భాల్లో మనిషికి బుద్ధిబలం, లౌక్యం, సమయస్ఫూర్తి ఎంతో అవసరమని ఈ కథ ద్వారా తెలుస్తుంది.

## 2.4.1.6 మనిషి ఆయుష్షు

కైరం రమణ, బతికెనపల్లిగ్రామం, రాయికల్ మండలం.

ఒక ముసలాయన ముఖం కడుక్కొని తానం చేసిండు. తానం చేసి ఇంట్లో కూర్చున్నడు. కుర్చున్న తరువాత కోడలు చాయి తాగు మామ అని చెప్పి కోడలు చాయి తీస్కచ్చి అచ్చి యిత్తది. ఇచ్చినోల్లె చాయి తాగిండు గిలాస పెట్టబోయి అట్లనే పడి చనిపోయిండు. చనిపోయిన తరువాత కొడుకచ్చిండు. అయ్యో! మా నాన్న చనిపోయిండని... ఇగ చనిపోయనంక సేసే కార్యక్రమాలు చేయాలి కద. చిప్ప కుండ కోసం బయులుదేరిండు. బయలుదేరితే భగవంతుడు ఒక రుషి అవతారంలో ఎక్కడికి పోతున్నవ్ కొడుకా! అన్నడు. ఇంగో నేను కుండకు పోతున్న చిప్పకు పోతున్న. దేవుడికి అగ్గివెట్ట దేవుడు వుత్తిగనే మానాన్నను తీస్కపాయే ముకం కడుకున్నడు చాయి తాగిండు దేవుడికగ్గిపెట్ట దేవుడు గిట్ల చేసిండు. అని తిట్టి పోతడు. పోంగ ఆగు బాబు ఆగు.. ! నువ్వ్ మీ ఇంటికి బో... మీ నాన్న బతికే ఉంటడు. చనిపోడు. మాట్లాడుతడు నువ్వ్ వో... ఆ రుషి అన్న తరువాత చూద్దాం ఆ రుషి అన్నడు కద. ఇంటికత్తడు. ఇంటికచ్చేసరికి మాట్లాడుకుంటా మంచిగనే ఉన్నడు అల్ల అయ్యా. ఆఁహ..! ఆ రుషి చెప్పింది నిజమే అని చెప్పి అనుకున్నడు. అనుకుంటే భగవంతుడు మల్లి కొద్ది రోజులకు ఈ ముసలైన ముకం కడుక్కుంటు ఉంటే పాత గోడల మధ్య ముఖం కడుకుంటే పాత గోడలయింత కూలినయి. ముసలోడు అక్కడిక్కడే సచ్చిపెయిండు. కొడుకు మళ్ళీ కుండ కోసం, చిప్ప కోసం బయలుదేరిండు. మధ్యలో ఒక ముసలి అవతారంలో భగవంతుడు ఎటు పోతున్నవ్ బాబు అంటే గిట్ల మా నాన్న చనిపోయిండు. ఆ పాత గోడలకగ్గివెట్ట గోడలు నానినయి నాని.. నాని... కూలినయి. కూలి

చనిపోయిండు. అట్లన అని చెప్పి అప్పుడేమో దేవునికి అగ్గివెట్ట అన్నవ్....! ఇప్పుడేమో గోడలకగ్గివెట్ట అన్నవ్..! కాబట్టి ఈ మనిసిని తీస్కపోయేటప్పుడు ఏదొక దాని మీద వెట్టి దేవుడు తీస్కకెళతాడు. ఎందుకంటే దేవుడు సక్రమంగా తీస్కెలితే దేవున్ని తిట్టిపోస్తరు. అయితే ఏదొకదాని మీద బెట్టి తీసుకుపోతడన్నమాట.........

## మనిషి ఆయుష్షు – కథావిశ్లేషణ

ఈ కథలో వయస్సు మళ్ళిన ముసలాయన మరణిస్తాడు. అతని కొడుకు తన తండ్రి మరణానికి ఫలాన కారణం అంటూ దూషిస్తాడు. మరీ ఏ కారణం లేకుండా దేవుడు మరణాన్ని కలిగిస్తే, ఆ దేవుడు ఎదురైనప్పుడు ఏ ప్రాణి ఊరుకోదు కదా! అందుకే కాలం నిండిన వారిని ఏదో రకంగా తీసుకెళ్లడానికి ఏదొక కారణాన్ని సృష్టిస్తాడు. అలాగే ఈ కథలో మొదట తన తండ్రికి మామూలు చావును ప్రసాదిస్తాడు ఆ దేవుడు. కాని దానికి అతని కొడుకు ఏ కారణం లేకుండా తన తండ్రిని తీసుకెళ్లిన దేవుడిని తిడతాడు. మారు వేషంలో వచ్చి ఎదురైనా దేవుడికి ఈ విషయం అర్థమవుతుంది. అంటే ఏదో ఒక కారణం పెట్టి కాలం నిండిన తన తండ్రి చావును తీసుకెళ్ళడానికి శిథిలావస్థలో ఉన్న పాత గోడలు కూలి వాటి మధ్య పడి చనిపోయే విధంగా చేశాడు. దేవుడు రెండు సార్లు ప్రత్యక్షమవుతాడు. మనుషుల స్వభావాన్ని అర్థం చేసుకొని తన మీద ఎలాంటి నిందలేకుండా చేసుకుంటాడు. మానవుని మనస్తత్వాన్ని బాగా చూపించిన కథ. దేవునికి అగ్గిపెట్ట, గోడలకు అగ్గిపెట్ట అనే పదంలో "అగ్గిపెట్ట" జన వ్యవహారంలో కూడా ఈ జాతీయాన్ని కోపంగా తిట్టే సందర్భంలో వాడతారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో ఈ పదాన్ని ఎక్కువగా వాడతారు. ఏ జీవి మరణానికి అయినా ఒక కారణం ఉంటేనే ఆ మరణానికి సార్థకత దక్కుతుందని తెలుపుతూ, మానవ నైజాన్ని వ్యక్తపరిచే విధంగా ఈ కథ రూపొందింది.

## 2.4.1.7 గాండ్ల బుచ్చమ్మ

గుర్రం పెద్దిరాజు, రాయికల్ మండలం.

అయితే పకీరు సామి మసీదులో పడుకున్నడు. మసీదులో పండుకొని పకీరు సాబు మీద కాయితం పడ్డది. కాయితం పడితే దాన్లో ఏమని ఉన్నది. గాండ్ల బుచ్చమ్మ ఈ రోజు రాత్రి సుంకరి భార్య ప్రసూతైతది. ప్రసూతైతే సుంకరి గాండ్ల బుచ్చమ్మ ఇంటికత్తరు. అచ్చేసరికి అండ్ల పెద్ద నాగ సర్పం గానువు కట్టే కాడ ఉంటది. ఆ గాండ్ల బుచ్చమ్మను కుట్టి సంపుతదని రాసి ఉంటది. ఈ ఫకీరు సాబు

చూసిండు. అబ్బ గాండ్ల బుచ్చమ్మ చనిపోతది. రాత్రి చనిపోతదట కాయితం దన్నని జేబులో పెట్టుకుంటడు. ఇగ మసీదులకెల్లి ఇంటికత్తడు. గాండ్ల బుచ్చమ్మ ఇంటికత్తడు. బుచ్చమ్మా బుచ్చమ్మా...! అన్నంక ఏంది కొడుకా! రా.. కొడుకా! ఏం లేదవ్వ. ఇట్ల చెప్తే భయపడతదని చెప్పి ఇవ్వాళ రాత్రి బాగాయింది. ఇగ నేను మసీదులకు పోను. ఇక్కన్నే ఉంట అవ్వన్నంకా పండుకో బిడ్డ మంచం తీసుకో మంచం వేసుకో దుప్పట్లు కావాల? దుప్పట్లు తీసుకో పండుకో బిడ్డ అని చెప్తది. గాండ్ల బుచ్చమ్మ ఈయనకు చెప్తది. మంచిదని చెప్పి. ఫకీరు సాబు అక్కడ అరుగు మీద పండుకుంటడు. పండుకున్నంక బుచ్చమ్మ లోపల పండుకునే. పండుకున్నంక రాత్రి ఒంటిగంట ప్రాంతంలో సుంకరి భార్య ప్రసూతైంది. ప్రసూతైందని అన్నంక నూనె కావాలని చెప్పి బుచ్చవ్వ బుచ్చవ్వ నూనె కావాలని చెప్పి సుంకరి అత్తడు. సుంకరి అచ్చిన తరువాత దా బిడ్డా... ప్రసూతైంది. ఆడద? మొగోడా? అంటే మొగోడే పుట్టిండని అన్నంకా మంచిది బిడ్డా... దా.. పోత్త దా!... అని చెప్పి పోతే ఆ పకీరు సాయెబు బుచ్చవ్వ బుచ్చవ్వ కందీలు ముట్టించుకోవాలి. చీకటి ఉంది. ఆ... ఏం గాదు బిడ్డా.. నేను మాపోత నాకు తెలుసే అనిచెప్పి అంటే ఏ లె...లె.. కందీలు ముట్టించుకుపోవాలే అని చెప్పి కందీలు ముట్టించుకొని ఈ వెనుక పకీరు సాబు పట్టుకొని పోతండు. ఇగ కట్టే పట్టుకున్నడు. పకీరు సాబు ముందు నడుత్తుండు వెనుక బుచ్చవ్వ నడుత్తుంది. ఇగ అక్కడ ఉన్నట్టుగనే కరక్ట్ పాము.. పెద్ద పాము పడిగ తీసింది. తీసినంక దాన్ని సంపేత్తడు. సంపేసి దడికి పోయి మీద వడతది. పడ్డంక ఇగ నూనె పోసి సుంకరి వాయే. తెల్లారి తెల్లారిఁ తరువాత ఇగో గిట్ల సంగతి సుంకరి భార్య. ప్రసూతైతే నూనె కోసం పోయిండట రాత్రి పకీరు సాబు రాత్రి బాగా చీకటి అయిందని చెప్పి గాండ్ల బుచ్చమ్మ ఇంటికాన్నే పడుకున్నడట. పండుకుంటే పాముని చంపిండంట. పకీరు సాబు లేకపోతే బుచ్చవ్వ చచ్చిపోతుండే అట్టిగ.. అని చెప్పి అందరు ముచ్చట పెట్టుకుంటరు. పెట్టుకొంగ ఇగ మబ్బులేన్నే నీళ్లు తీసుకోస్త అని చెప్పి మన బుచ్చవ్వ కుండ పట్టుకోని మంచినీళ్ల బాయికాడికి పోతది. మంచినీళ్ల బాయి కాడికి పోయి నీళ్లు చేదుకుంటది. చేదుకోని ఇగ వస్తుంది. వచ్చేటప్పుడు ఒక గద్ద ఈ పాముని ఎత్తుకొని పైకి వెళ్ళిపోతుంది. ఆ నీడ బుచ్చమ్మ మీద పడి బురుసులు వచ్చి చచ్చిపోతది. భగవంతుడు రాసిన రాత తప్పదు. అది ఎంత ప్రయత్నం చేసినా ఆమె ఆవుస్సు ఆడికే ఉంది.

## గాండ్ల బుచ్చమ్మ – కథావిశ్లేషణ

నుదుటి రాతను బ్రహ్మ కూడా మార్చలేడన్నట్లు ఈ కథలో గాండ్లబుచ్చమ్మ పాముకాటుతో చచ్చిపోవాలని చీటి రాసి ఉంటుంది. ఆ చీటి ద్వారా ఫకీరు సాహెబుకి తెలిసిన గాని బుచ్చమ్మను చావు నుంచి తప్పించలేడు. బుచ్చమ్మ చావు గురించి తనకు తెలిసిన చెప్పకుండా రాత్రంతా బుచ్చమ్మ ఇంట్లోనే పడుకుంటాడు. సుంకరివానికి కొడుకు పుట్టిన తరువాత వాళ్లు వెళ్లే దారిలో పాము వస్తుంది. ఆ పామును చంపి బుచ్చమ్మను కాపాడానని అనుకుంటాడు. కాని తెల్లవారు జామున నీటికోసం పోయి వస్తుండగా బుచ్చమ్మపై గద్ద ఎత్తుకొనిపోతున్న పాము నీడ పడి చనిపోయింది. తాను కాపాడానని అనుకున్న బుచ్చమ్మ ప్రాణం పోయింది. అంటే తాను చీటిలో చదివింది నిజమే అయింది. జానపదులకు నమ్మకాలు ఎక్కువ. విధిరాతను ఎవ్వరు మార్చలేరని నమ్మకాన్ని నాటి సమాజానికి ఈ కథ తెలియజేయడానికి కల్పించబడింది. మనం ఎన్ని ప్రయత్నాలు చేసినా జరిగేది జరగక మానదు అనే విషయం ప్రస్ఫూటంగా వెల్లడిచేస్తుంది ఈ కథ. జానపదులు ఎక్కువగా దైవ నిర్ణయాన్ని, విధిరాతని నమ్ముతారు. అందుకే దేవుడు రాసిన రాతని మార్చడం ఎవ్వరి తరం కాదని, ఎలా జరిగేది ఉంటే అలా జరుగుతుందనే భావనలు ప్రజల్లో మనస్సులో స్థిరంగా పాతుకున్నాయి.

## 2.4.1.8 ముసలమ్మ కథ

బత్తిని ఎల్లక్క, క్రిష్టంపేట గ్రామం, రాయికల్ మండలం.

ఒక వ్యక్తి ఒక ముసలమ్మను జొన్నరొట్టెలు చేయడానికి పొట్టకు పెట్టుకుంటూ ఉంచుకుంటడు. అంటే ఆ ముసలమ్మ ఆ వ్యక్తికి రోజు పొద్దున సాయంత్రం రొట్టెలు చేసి ఇచ్చేది. అయితే రొట్టెలు చేస్తూ ఆళ్లింట్లనే ఉంటుంది ముసలమ్మ. అయితే ఆమెకు ఒక దోస్త్ (స్నేహితుడు) ఉండేవాడు. పకీర్ సాహెబు అనే స్నేహితుడు ఉండేవాడు. అయితే ఆయనను ఈమె ప్రేమిస్తుంది. అయితే ఆయనకు రొట్టెలు పంపాలని ఈమె కోరిక. అయితే ఆయనకు కొంచెం బిక్షాటన చేస్తూ ఉండేవాడు. ఆయనకు ప్రతిరోజు ఒక రెండు రొట్టెలు పంపేది. ఏవిధంగా పంపేది. అంటే ఈయన జొన్నపిండి ఇచ్చిన దానిలో ఆ రెండు పిడకలను ఆవు పిడకలను ఆవు పెండను మంచిగ చేసి ఇచ్చి ఇండ్ల కలిపేది. ఎందుకంటే తక్కువ పడకుండ. ఈ ఎనిమిది రొట్టెలకు ఆ... లెక్క ఆయనను కరెక్ట్ చూపియాలి. అని చెప్పి ఆ రెండు పిడకలను మంచిగ కాల్చి ఆవు పెండను కాల్చి దీండ్ల కలిపేది. ఈ పకీరు సాహెబుకు రెండు రొట్టెలు అల్లాహ్ అక్బరు అనేటప్పుడే ఆ కిటికిలకెల్లి తీసి ఇచ్చేది. తీసుకపో అని చెప్పి. ఇలా కొన్ని సంవత్సరాలు

ఇలాగానే ఇస్తున్నది. రోజు రెండు జొన్న రొట్టెలు ఇచ్చేది. కొన్ని సంవత్సరాలు అయింది. ఇగ తర్వాత కొంతమంది దొంగలు ఈ వ్యక్తి ఇంట్లోపడి నగలు దోచుకెళదామని వస్తరు. వచ్చినప్పుడు రాత్రివేళలో ఈమెకు చేసిన రొట్టెల సంఖ్య ఎక్కువ అయిపోయి రాత్రి దొంగలకు ముఖం కొట్టడం జరుగుతుంది. అరె! ఎందుకు ఈ వ్యక్తి ఇంటికి దొంగతనానికి వస్తే ఈ రొట్టెలెందుకు ముఖానికి కొడుతున్నయి అని చెప్పి ఆశ్చర్యపోయిల్లు. అట్ల ఒకటవరోజు రెండవరోజు తరువాత మీ ఇంటికి మొన్న దొంగలు వచ్చిరట వస్తే ముఖానికి రొట్టెలు కొట్టినయట. అని చెప్పి ఆ వ్యక్తికి తెలిసింది. స్వంత ఇంటాయనకు తెలిసినపుడు ఆ ఇంట్లో అందరిని పిలిచిండు. మరి నేను, మేము ఏం దానము జెయ్యలె. దానమనేది ఎప్పుడు ఎవ్వరికి కూడా చేయద్దని మరీ నేను చెప్పి. ఎందుకు మరీ ఇట్ల జరిగింది. అని చెప్పి ఆళ్లు అందరిని పిలిచి. ముసలమ్మ కూడా పిలిచి అడుగుతరు. అప్పుడు ఆ ముసలమ్మ చెప్తది. అయ్యా! నేను మాత్రం రోజు రెండు రొట్టెలు పంపించేదాన్ని. అని చెప్పి ఆ ముసలమ్మ చెబుతది. అట్లనే నీ వల్లనే నాకు మరీ ఈ ధనమనేది ఉన్నది. ఈ నగలు అనేది ఉన్నది లేకపోతే దొంగలు దోచుకుపోయేవారు. కాబట్టి ఆ పకీరు సాహెబును, నిన్ను ఇద్దరిని చచ్చిపోయేంతవరకు నేనే మీకు ఆహారం పెడత అంటడు.

### ముసలమ్మ కథ – కథావిశ్లేషణ

ఈ కథలో ముగ్గురు వ్యక్తులు ఉంటారు. ఒక మసలమ్మ, ఇద్దరు ముసలివారుంటారు. ముసలాయనకి రొట్టెలు చేయడానికి ఉన్నామె, ఇంకో అతనికి సాహెబుకు రహస్యంగా రొట్టెలు పంపిస్తుంది. ఈ ఇంటి నుండి రొట్టెలు పంపడం వల్ల వారికి పుణ్యం కలిగి, వారింట్లో దొంగలు వచ్చినపుడు ముఖం కొట్టడం జరుగుతుంది. ముఖం కొట్టడమంటే ఆ రొట్టెలు తిన్న దొంగలకి కడుపు ఉబ్బి వాంతులై దొంగతనం చేయకుండానే పోతారు. అలా వారు ఏమి దోచుకొకుండా వట్టి చేతులతో తిరిగి వెళ్లిపోతారు. ఆ విధంగా రోజు రొట్టెలు సాహెబుకు పంపిన పుణ్యాన ముసలివానికి మంచి జరగడంతో సాహెబుని పిలిచి, ముసలమ్మను సాహెబుని తానే పోషిస్తానని మాట ఇస్తాడు.

## 2.4.2 మనుష్య, జంతువులకు సంబంధించిన కథలు

### 2.4.2.1 తల్లి కొడుకు, కోతి కోడలు

గుర్రం చుక్కయ్య, ఇటిక్యాల గ్రామం, రాయికల్ మండలం.

ఒక ఊరిలో తల్లి, కొడుకులు ఇద్దరుంటరు. చాలా పేదవాళ్లు. వాళ్లు పేదరికంతో జీవిస్తారు. కొడుకు చిన్నగ ఉన్నపుడే భర్త చనిపోతాడు. అయితే ఆమె కొడుకుని సాదాలని చెప్పి అక్కడ కైకిళ్లు

చేసుకుంటూ ఆ.. ఆళ్లకు, ఇళ్లకు కైకిలు చేస్తే వాళ్లు ఇన్త నూకలు, ఇన్త తౌడు బెడితే ఆ తౌడు అంబాలి కాసుకుంట బతుకుతుండ్రు. ఏం గూడ లేదు చిన్న పూరీ గుడిసె ఉండే. అయితే ఆమె ఆడ, ఈడ కైకిలు చేసుకుని చేసుకుని ఒక రూపాయి జమచేత్తది. రూపాయి జమచేసి కొడుకా కొడుకా మనమేప్పుడు గీ తౌడంబాలి తాగబడితిమి. ఆ...! మరెట్ల ఈ దుకాన్లకు వోయి కొద్దిగ సామాను తీస్కర. రూపాయిత్త గీ రూపాయి తీసుకోని రా కొడుక అని చెప్పి అంటది. అన్నంక సరే మంచిది అవ్వ తీస్కత్త అని చెప్పి గీ రూపాయి తీస్కోని పిలగాడు దుకాన్లకు పోతడు. పోంగ పోంగ గారడోడు గారడి ఆట ఆడిపిస్తుంటడు. గారడి ఆట ఆడిపిస్తుంటే అందులో కోతి గారడి ఆటలో కోతి పాత్ర ఉంటది. పోరడు చూస్తు చూస్తు సాయంత్రానికి దాక గ కోతినే చూస్తున్నడు. తల్లి అయ్యో! నా కొడుక పొద్దుగాల్లవాయే ఇంకా పొద్దెక్కవట్టే రాకపాయే అటే పాయే. ఎట్ల మరేమన్న అయింద ఏంది? అని అనుకుంట ఆమెకు బుగులు పడుతుంది. అయితే పిలగడు గారడాట అయిన తరువాత ఏమంటడు కోతి గావల? రూపాయిస్త అంటడు. అరె ఈ కోతి ఇయ్యర. నీ రూపాయి నాకెందుకురా పోద. నా కోతి గావాల్న నాకోతితోనే కదర నా బతుకు. నువ్వ్ మంచిగ ఉన్నవ్ కోతిని గావాలంటున్నవ్ రా ఎట్ల అని అంటడు గారడోడు. నాకు కోతే గావాలి లేదు. లేదు. అని పోరడు మంకువట్టి గారడోనికి రూపాయి ఇయ్యపోతడు. ఆ చూసేటోళ్లు ఏమంటురంటే అరె పొద్దుగాల్ల నుంచి పోరడు పొద్దూగూకే దాక మనతోనే ఉండే పాపం పోరన్ని చూస్తే గోస గోసోలే అనిపిత్తుంది. గీ రూపాయి వట్టుకుని రూపాయిత్తుండు. పాపం చిన్న పిలగాడు. పాపం గొసగొసోలే అనిపిత్తది. ఇయ్యి నీ.. కోతి నీకు ఆడ అడవిల దొరుకద? మత్తుగ దొరుకుతయి. కొండగట్టుకోయి ఓ కోతిని బుజాల మీదేసుకో. ఇగ కోతిని ఇచ్చి రూపాయి తీస్కుంటడు. పోరడు కోతిని బూజాల మీదేసుకుని ఇంటికత్తడు. ఇంటికచ్చేవరకల్లా కొడుక గింత సేపయే నువ్వు ఎటు పోయినవ్ కొడుకా అంటే అవ్వ నీ కోడలు తీస్కచ్చిన నీకు అంటే. నీ కోతిల మన్నువడ కోతిని వట్టుకచ్చి కోడలు అంటవేందిరా అని చెప్పి తల్లి లొల్లి పెడతది. నీకు దెలువదే కోతి మంచిదే! అని చెప్పి అన్నంక ఇగ కోతిని తీస్కచ్చి ఉంచుతడు. ఉంచినంక ఇగ తిందామంటే లేకపాయే నేను తీస్కత్త అగుర్రి అని చెప్పి కోతి పోతది. ఓ కోమటొళ్ల ఇంటికాడికి వోయి ఆడ మంచిగ బియ్యం ఇంత ఎల్లి గడ్డలు, ఉల్లిగడ్డలు, చింతపండు అంటకు పప్పులు అన్ని తీస్కచ్చి ఇంట్ల ఇత్తది. ఆళ్లు అప్పడికి అందుకుంటరు. అందుకున్న తరువాత ఒక బుట్టిగుల్లె ఇయ్యి. అత్తమ్మ ఒక బుట్టిగిల్లెయ్యి అని కోతి బుట్టిగుల్లె తీసుకుని మళ్లీ ప్రయాణం జేత్తది. చేసి అక్కడ ఒక బుట్టిగిల్లేయ్యి అని కోతి బుట్టిగుల్లే తీసుకుని మళ్లి ప్రయాణం

జేత్తది. చేసి అక్కడ మామిడి చేట్లల్ల మామిడి తోటకోయ్యి. మంచిగ మామిడిపండ్లు కాయలు అన్ని తెంపుకత్తది. కాయలేమో మగ్గేసుకోన్లి, పండ్లమో తినుర్రి అత్తమ్మ. అని చెప్పి నేను అడివి మీదికి పోత మల్ల బయలుదేరతది. బయలుదేరినంక ఆ రాత్రి తెల్లావారుజామున ఇప్పచెట్టు దగ్గర చెట్టు మీదికెక్కి కూసుంటది. కూసుండేవరకు గజ దొంగలు నలుగురు గజ దొంగలు వోయ్యి ఆగుండని దోసుకొని పంచుకుందామంటే ఆళ్లకు లెక్క కలుత్తలేదు. పడిగెలు, మెంతులు, కంటెలు, బంగారం అంత తీస్కచ్చుకున్నరు. పంచుకుందమంటే లెక్కగలకపోతే అరె ఈ ముల్లెకు ముల్లె యిక్కడనే దాద్దం. మల్ల మనం తెల్లారి అచ్చి పంచుకుందాం. అన్నంక మంచిదనుకొని ఆళ్లు అయిదు గంటల ప్రాంతంల మంచిగ వాగు ఒడ్డున ఇసుకల తవ్వి పెడుతరు. ముల్లె పేల్కల ముల్లె కట్టి పెడతరు. ఈ కోతి జూసి ఎంజేస్తది. ఈల్లు పోయింది చూసి అయింత ఆ ముల్లెలన్ని తవ్వుకుంటది. పుస్కన తవ్వి ఆ ముల్లెను తీసుకొని ఇంటికత్తది. ఇంటి కచ్చె ఇంగో అమ్మ తీసుకొండ్లి అత్తమ్మ తీసుకొండ్లి గిది తీస్కపోయి అక్కడ అమ్ముకరాపోండ్రి. అమ్ముకచ్చి మనకు గుడిసె ఉన్నది. గద మంచిగ బంగ్లా కట్టుకుందురు. అని అంటే కోతి నీవు ఇవన్ని తీస్కత్తున్నవ్. ఎక్కడికెల్లి తీస్కత్తున్నవ్. మా పానం తీత్తరు! ఇవి ఎవలియ్...! ఏయ్...! మీకు అకల్ బోకల్ ఏముందవ్ మీకు ఎవళెమన్నరు. మీ కెందుకు బాధ? ఇగ తీస్కెల్లి అని చెప్పి చెప్తది. చెప్పిన తరువాత మల్ల కోతి ఈల్లకు చెప్పి ప్రయాణం జేత్తది. ఇంట్ల ఉంటే అందరికి డౌట్ అత్తదిగని అందుకే ఎటో ప్రయాణం జేత్తది. ఇగ ఈల్లు అమ్ముకత్తరు. అమ్ముకచ్చి పైసను తీస్కచ్చుకుంటరు. తీస్కచ్చికున్న తరువాత మల్ల ఒక అడివి ప్రాంతం పోయేసరికి అక్కడ పెద్దముట ఉంటది. దొంగల ముట దాన్లొక నాయకుడుంటడు. ఆ నాయకునితోని చెప్తది. నా బిడ్డ మంచిగున్నది నాయకుడ. నా బిడ్డా ఎంతో అందంగ ఉన్నది. నా బిడ్డ నీకే యిస్త నువ్వే చేసుకో. అని అంటే అట్లన. ఇంగో ఆయన అంటడు. అర్రె మీ దొంగలు కోతి మాట నమ్ముర్ర. దాని బిడ్డను నాకిస్తదట నాయకుడు. నువ్వే గద అంటుంది. సరే నేను చేసుకుంట. మరి నీకేమి గావాలంటే నాకు యింత బంగారమియ్యి. అవుసలయిన దగ్గర మంచిగ బంగారం చేయించుకుని నా బిడ్డ మీద ఏసుకొని తీసుకొని అత్త అని చెప్పి అంటది. అట్లన మంచిది అని ఇంత బంగారం యిత్తడు. యిచ్చిన తరువాత బంగారం తీస్కపోయి ఆళ్లకు ఇత్తది. ఇదివోయి అంగట్ల అమ్ముకరార్రి అని చెప్పి ఇగయితే అక్కడ ఏమని చెబుతది. ఒక మామిడి చెట్లల్లకువోయి ఓ కొమ్మను కొట్టుకోని రాత్రి ఆ కొమ్మకు మంచిగ అండ్లనే దగ్గర బొమ్మ మంచిగ చేయించి చిలక పట్టుచీర గట్టు అత్తమ్మ అని చెప్తే, అదే ప్రకారం బొమ్మ చేయించుకుని చిలక పచ్చ

చీరగట్టి ఈ బొమ్మ మంచి పిలగాన్ని పట్టుకొమ్మంటుంది. బొమ్మను తీసుకొని అత్తది. తీసుకొని అచ్చేవరకల్లా ఈ పిలగాన్ని పోమ్మంటది. పో..! గిక్కడికెల్లి ఎల్లిపో..! ఇగ నేను చూసుకుంట ఆ బొమ్మను వట్టుకునే వరకల్లా దొంగల్లలకెల్లి వొకడు మూత్రానికి అత్తడు. అచ్చేవరకల్లా చూసేవరకల్లా అగో ఈడ కోతి ఉంది. కోతి బిడ్డుంది. ఇంతముందు చెప్పింది గద అని చెప్పి ఏమైందంటే ఇగో పట్టుకో నా బిడ్డ మాన పడుతుంది. ఎత్తుకో అని చెప్పి తీస్కచ్చి నా బిడ్డను మంచాల్ల పండపెట్టలే ఎవ్వళ్లు చూడొద్దు. ఇరవై రోజులు దాకా నా బిడ్డకేయి ఎవ్వలు చూడొద్దు అని చెప్పింది. అదే ప్రకారం ఇరవై రోజుల తర్వాతనే చూడాలట అన్నంక మంచిగ ఓ సెద్దరు గప్పుతరు. అట్లనే పండవెడతరు. పండవెట్టిన తరువాత ఇగ వాల్లు దొంగలు మేకను కోసుకుంటరు. బోజనం అందరు చేత్తరు. దీనికి బోజనం పెడితే ఆ డోప్పలో కల్లు, శిప్పల ఏమో అన్నం పెడతరు. ఇది తినలేదు. మొన్నవెడితే తినలేదు. ఇది మనిష ఏంటిది అని చెప్పి సెద్దరు తిత్తరు. సెద్దరు తీసి చూడంగనే బొమ్మ. అబ్బ! నీ కోతికగ్గివెట్ట! కోతి భలే పనిచేసింది. ఈ బొమ్మ తీసి అవతల పారేత్తరు. అవుతల పారేత్త పార్వతి పరమేశ్వరులు ఒకరోజు భూలోకానికి వద్దమని బయలుదేరుతరు. బయలుదేరుతే శంకరుడు నేను బూలోకం వోయి వస్త అంటే పార్వతమ్మ ఏమంటది నేనస్త అంటది. అరె అరె నువ్వెందుకు అస్తవ్. నేను వోయివస్త నా పని నేను చేసుకస్త బూలోకంల అంటే లేదు.. లేదు.. నేనస్త అని ఏంబడి వడతది. అరె! ఆడోల్లకు ఏ విషయం చెప్పద్దు. చెప్పితే గిట్లనే ఉంటది. ఎంబడి వడుతరు అనుకొని దా.. అని పార్వతీ పరమేశ్వరులు ఇద్దరు కలిపి అత్తరు. రాంగ అగో అగో గిక్కడ ఒక బొమ్మ ఉన్నది. ఎందుకో పడి పోయి ఉన్నది. చక్కగ శిల్పమున్నది. అగు అని చెప్పి అక్కడ అగుతది. అరె! ఎందుకు మన పని మనం చేసుకోవాలి. ఎందుకు అపుతవ్ ఇక్కడ లేదు లేదు... అలిగి అని జెప్పి పార్వతీ అజ్ఞాపిస్తది. చూసేసరికి చక్కటి బొమ్మకు పానం తెప్పియి అంటే సరే మంచిది. తెప్పిస్త అని జగిర్లపుల్ల పెట్టి తెప్పిస్తడు. అప్పుడు ఆ బొమ్మకు పానమచ్చేతది. ఎంటనే కోతి అత్తది. కోతి వచ్చి నేను మీ తల్లిని నువ్వ్ నా బిడ్డవ్ మరి నాకెవ్వరు లేరు కద. నువ్వే తల్లివి గద. నేనుగూడ అనుకుంటున్న అని చెప్పి ఈ బొమ్మకు పానం వచ్చిన బొమ్మ అంటది. అన్న తరువాత ఈమెను తీసుకొని మంచిగ ఇంటికి తీస్కపోయి మీరు ఇంట్ల ఉండుర్రి. ఇగ ఈ బంగ్ల కట్టుటానికి పుణ్యం అచ్చుటానికి అన్నింటికి పనికత్తది. అత్తమ్మ భర్త లేకపాయే ఈమె ఇల్లిద్దరు దంపతులు తీసుకచ్చిన మంచిగ కార్యక్రమాలు జేత్తరు. ఆ కాబట్టి ఇంగో మన పిలగానికి నేను తీసుకచ్చిన అన్నవ్ పని మంచిదని చెప్పి కోతి ఒక భయం పుచ్చుకున్నది. దొంగలేడ మల్ల అత్తరో ఏడ

నను దొరుకవడుతరో అనుకొని ఈ బొమ్మ పానం ఆవుస్సు పోసిర్రు గద. ఇక్కడికి వత్తె ఈల్లకు పెద్ద ముప్పు తీసుకచ్చినట్టు అయితది. ఈల్లకు దొంగల బెడద పోవాలి. అని చెప్పి అత్తమ్మ ఊరు అవతల కాటి ఉంది గద. ఆ కాటి దగ్గర కట్టెలు ఎయిర్రి. ఒక కోడిపిల్ల అండ్ల పెట్టుర్రి చెప్తది. అదే ప్రకారం ఒక మంచిగ కట్టెలు పెడుతరు. ఆ కోడిపిల్ల పెడుతరు. రాత్రి దొంగల రావడం జూత్తది. జూసి గ్యాస్ నూనె వోసి అగ్గిపెట్టె ముట్టిత్తది. నా బిడ్డ బిడ్డ అని ఏడుతది. అరే ఏమైందేందుకు ఏడుతున్నవ్ అంటే గిట్ల రాజుకు మన దొంగల నాయకునికి పెళ్లి చేస్త అనుకుంటే నా బిడ్డా దురదృష్టవశాత్తు చనిపోయింది. ఇగ కాలెత్తున్న గిట్ల సంగతి అన్నంక అరెరె అట్లన అని చెప్పి చెప్పి నే తీస్కచ్చిన గని గిట్ల పానం మంచిగలేక చనిపోయింది. అన్నంక అరెరె బంగారం ఏమయ్యేరా? అని ఒకడు అడుగుతడు. దాని బిడ్డనే సచ్చిపెయింది నీ బంగారమేంది రా? అని మనం ఈ ఊరు కాకపోతే ఇంకో ఊరు దొద్దం అని చెప్పి అనుకుంటరు. అట్ల ఆ దొంగల బెడద దాంతో తీరిపోతది.

## అత్త కొడుకు, కోతి కోడలు – కథావిశ్లేషణ

ఈ కథ ఒక ఊరిలో ఒక కోతి పేద కుటుంబాన్ని ఆర్థికంగా అదుకుంటూ, ఆ ఊరికి ఉన్న దొంగల బెడదల నుంచి రక్షిస్తుంది. కోతి గారడివాడి దగ్గర నుంచి ఆ బాలుని దగ్గరికి వచ్చాక వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అంతేగాకుండా ఆ ఊరికి నిరంతరం దొంగల బెడద ఉండేది. ఆ బెడదను ఎలాగైనా తప్పించాలని తన తెలివితో ఆ దొంగలను అటువైపు రాకుండా చేస్తుంది.

1. ఇది విచిత్ర కల్పిత కథ. మానవులు కోతితో మాట్లాడటం, కోతి వారికి అడిగింది తీసుకొచ్చివ్వడం అంత విచిత్రమైన సంభాషణలతో సాగుతుంది. ఈ కథలో ప్రధానంగా కోతి ప్రదర్శించిన తెలివితేటలు, చాకచక్యం గురించి కథాకథనం చేస్తున్నప్పుడు పిల్లలకు ఆనందం, ఆసక్తి కలుగుతాయి.

2. గారడివాళ్లకు కోతి ప్రధాన ఆదాయాన్ని అందించే జంతువు. కాబట్టి ఈ కథలో బాలుడు గారడికి రూపాయినిచ్చి మరి కోతిని తన ఇంటి తీసుకెళతాడు. కోతి వల్ల వారి జీవితాల్లో మార్పు వస్తుందని భావించి కోతిని కోడలుగా తల్లికి చెప్పి ఉంచుతాడు. ఆ పిల్లగాడు అనుకున్నట్టుగానే ఆ కోతి అడవిలో తిరిగి పండ్లు, ఫలాలను తేవడమే కాకుండా షావుకారు దగ్గరికి పోయి చింతపండు, బియ్యం, ఉల్లిపాయలు, పప్పులు, ఎల్లిపాయలు అన్ని తీసుకచ్చి వాళ్లకు ఇచ్చింది. ఆ ఊరిని దొంగలు దోచుకుని దాచి పెట్టిన ధనాన్ని కూడ తెచ్చిస్తుంది. దాని వల్ల తినడానికి తిండి లేని తల్లి, కొడుకు కొత్త యిల్లు కట్టుకుని హాయిగా జీవిస్తారు.

3. కోతి తెచ్చియిచ్చిన బంగారు మూటను దొంగలు అడుగుతారని చెప్పి అనుమానం రాకుండా వాళ్లకు దూరంగా ఉంటుంది. ఆ ఊరికి దొంగల బెడద పోవాలని పథకం వేసుకుని మరీ కాలుతున్న బొమ్మ చూపెట్టి తన కూతురని చెప్తుంది. చివరికి తన కూతురు చనిపోయినట్లు బూటకపు కథను అల్లి దొంగలకు అబద్ధం చెబుతుంది.

4. ఈ కథలో పార్వతీ, పరమేశ్వరులు రావడం ఆ బొమ్మకు ప్రాణం పోస్తారు. పార్వతి కరుణ వల్ల బొమ్మ మనిషిగా మారడం వల్ల పార్వతీ కృప ఎల్లప్పుడూ ఉంటుందని భావిస్తుంది. కనుక ఈ పాపను తల్లి, కొడుకులు వారి దగ్గరనే పెట్టుకుంటే వారికి మళ్లీ దారిద్ర్యం దరి చేరందని ఆలోచిస్తుంది. వాళ్ల పేదరికాన్ని పోగొట్టుకోవడానికి తెచ్చిన కోతి వారి జీవితాలను మార్చి వేస్తుంది.

5. గ్రామీణులు, జానపదులు, అటవీకులు విశ్వాస జంతువులను పోషించుకోవడం మనం గమనించే ఉంటాం. వారి పోషణకు అవి ఎంతో ఉపకరిస్తాయని వారి నమ్మకం. వాస్తవం కూడా. మానవుడు ప్రాచీన కాలం నుంచి కొన్ని జంతువులను మచ్చిక చేసుకుంటూ వాటినే ఎన్నో విధాలుగా ఉపయోగించుకుంటున్నాడు. వ్యవసాయానికి ఎద్దులనూ, సంచార జాతుల వారు గాడిదలనూ, గుర్రాలనూ, గారడివాళ్లు కోతులను, సర్కస్ లాంటి పెద్ద పెద్ద సంస్థలైతే ప్రదర్శనకు ఉపయోగపడే జంతువులను మచ్చిక చేసుకొని జీవనోపాధికి ఉపయోగించుకుంటారు. ఈ కథలో కూడా కోతి వారికి చేసిన సేవలు పరోక్షంగా మానవులకు, జంతువులకు ఉన్న అవినాభావ సంబంధాన్ని గుర్తు చేస్తుంటాయి. కాలక్షేపం కోసం సృష్టించిన కథే అయినా విడమర్చి చూసినట్లయితే మనకు జానపదుల ఆలోచన విధానం తేటతెల్లమవుతుంది.

## 2.4.2.1 బంగారెంటుక బాలుడు

దాయాది రాములు, కొల్వాయి, బీర్‌పూర్ మండలం.

ఒక అడవి ఉంది. ఆ అడవిల ఒక గుడ్డెనుగు, పెద్దపులి ఉన్నది. అవి రెంటికి మంచి స్నేహం ఉంది. మంచి సోపతులున్నట్టు అయితే అవి రెండు కలిసి మరి ఏంచేత్తం ఏదోక పని చేత్తం అని అనుకున్నయట. అనుకొని ఏం చేసినయి ఒక దోసకాయ తోట పెడతం. దోసకాయల విత్తులు సంపాదించి తోట పెట్టినయ్ ఇగ ఆ తోట మీద ఇద్దరికి పానమే రెండు పోయి సూసచ్చుదు ఒకరిని ఒకరు నమ్మయ్ అన్నమాట. కాపాడంగ కాపాడంగ ఒక చెట్టుకు ఒకటే దోసాకాయ కాసింది. అది నేను

తింటనోయ్ గుడ్డెనుగు, మల్ల కాసేది నువ్వు తిను అని పెద్ద పులంటది. ఆళ్లకు ఆడా వాదాలు మోపనయ్. ఎట్ల చేత్తం మనం మనకు ఒకడు పంచాయితీ చెప్పెటొల్లు కావాలి. ఎవ్వడు చెప్తడు. నిన్ను చూసినా భయపడతరు. నన్ను చూసినా భయపడతరు. మన దగ్గరికి ఎవ్వడు అత్తడు. ఎవ్వడు రారు. ఒకనాడు ఒక పోరడు కనిపించిండు. అరె పోరడా! నిన్ను ఏం అనం. నీ దుడ్డెలను ఏం అనం. మా పంచాయితీ చెప్పు అన్నరు. సరె అని మేం తోట వెట్టినా అందులో ఒకటే కాయకాసిందట. మరి నేను తింటానని నేనంటన్న మరి నేను తింట అని అది అంటంది. మరి ఏవలు తినుడు. అంటే పోరడు గుడ్డెనుగు అయితే ఏం బాగా చేయదు పెద్దపులయితే ఒకటే దునుకు దునుకి సంపుతది. అదె గుడ్డెనుగు ఏం అన్నగాని పెద్దపులి ఒయ్... పోరని ఏం అనకు అంటది. ఇప్పుడు పులి తినాలి. మరొకటి గుడ్డెనుగు తినాలి అని చెప్తడు. చెప్పినంక గుడ్డెనుగు మంట మండుతుంది. పోడ నిన్నా రా...! ఏ పోద సాటుకున్న కొరికి సంపకపోతే ఇడిసిపెట్టపో. నను తినమనవా....? నువ్వు పెద్ద మనిషివి? నీకో న్యాయం తెలుసని కోపం బాగా అత్తంది. పెద్దపులి మాత్రం జోరుదారు మెచ్చుకుంది. అరె పోరన్ని మనం ఎవలు ఏమనద్దు. నువ్వ్ గిట్టన్నా ఏమన్న అనేవ్.. నువ్వ్ పోరా అన్నంక. ఇంటికత్తడు. అడవిదాటే దాకానే పెద్దపులి రక్ష. ఇంటికచ్చినంకా గుడ్డెనుగు లేదు ఎవలురారు పోరా పో. . నేను ఇటే మర్రిపోతున్న అని ఇంటికచ్చిండు. పన్నడు. పన్నంక గుడ్డెనుగు వాని జాడ కోసం ఇంటికచ్చింది. ఇంటికచ్చి పోరడు నులక మంచంల పన్నడు. ఆళ్ల అమ్మ అటు పన్నది. గుడ్డెనుగు అచ్చి ఏర్పాటు చేసింది. అబ్బ కొడుకా! నిన్ను కొరికి సంపాలి విన్ని చంపుదామంటే మొత్తుకుంటడు. వీళ్ల అమ్మ లేత్తది. అందరు అత్తరు. నా పని జేత్తరు. ఆన్ని జంగల్ తీసుకుపోవాలి. అక్కడ సంపాలి ఈన్నీ. కడుపుల పెట్టుకొని మంచం కింద సొచ్చింది. లేసింది. లేసేవరకు మంచం కోళ్లు లేసి మంచం ఎత్తుకొని పోతుంది. జంగల్ తీసుకొని పోతుంది. పోంగ పోంగ కొద్ది సేపటికి వీనికి మెల్లగ తెలివై మంచం ఊగుతుందని చూసి నన్నేదో ఎత్తుకుపోతుంది గుడ్డెనుగు. నన్ను సంపుతదని గజ గజ వణుకుతుండు. వీనికొక ధైర్యం అచ్చింది. గుడ్డెనుగు బూరు పెద్దగ ఉంటది. ఈడు మంచల కూసొని బూరంతా మంచాల తాళ్లకు కట్టిండు. ఇగ గుడ్డెనుగు ఈన్ని నేను సంపుదేందుకు బాయిల పారెత్తనుకుంది. పోంగ ఒక బావి అచ్చింది. అచ్చినంక

అండ్ల ఏత్తనని మంచాన్ని అంచుతుంది. అంపెవరకల్లా బూరంతా మంచాన్ని కట్టె. ఆ బావి కాడ పంగ మర్రిచెట్టు కాడ తట్టుకొని ఆగిండు. గుడ్డెనుగు పోయి బావిల పడ్డది. ఇగ ఈడు మర్రి చెట్టు కొమ్మలు ఎక్కిండు. ఆ చెట్టు కింద అడవి ఆవుల పిల్లలున్నయి. ఆ పిల్లలకు మేతకు తల్లి ఆవులు పోయినయ్. రోజు పోయి అచ్చి పిల్లలకు పాలు ఇస్తున్నయి. పోరడు ఇదంతా చూసిండు. మేతకు పోయిన తల్లి ఆవులు పోరడు అచ్చేవరకల్లా దొరికిచ్చుకుండు. అక్కడున్న పెండకల ఎరువంతా తీసిండు. ఆవు పిల్లలకు మంచిగ ఆడుకోవడానికి విశాలంగా చేసిండు. పిల్లలు బాగా చూసినయ్. మన తల్లులు చూస్తే ఈ పోరన్ని పోడిసే సంపుతయ్. ఆయిన్ని పిలగాన్ని ఎట్లైన కాపాడాలనుకుంటయ్. తల్లి ఆవులురాంగనే పాలు చీకుమంటే చీకయి. ఎందుకంటే గీదంతా సాపు చేసిన పిలగాడు ఒకడున్నడు ఆన్ని మనమే సాదుకుందాం. ఆన్ని మీరేమనద్దంటే సరే మనకు మంచిగా సాపు చేత్తుండు. గదా మేం ఏం అనం అంటయి. ఒప్పుకున్నంక పాలు చికీనయి. పిల్లగాన్ని సూపెట్టినయ్. పిలగాడు గూడ పాలు చీకుడు ఎరువు సాపు తీసుడు. చెట్టెక్కి కూసుండు. ఇదే పని ఆనికి ఇగ. ఆ పాలు తాగేవరకల్లా బంగారు వర్ణంలాగా మెరుత్తుండు పోరడు. ఏమయిదంటే వానికి ఎంటుకలు పెరిగినయ్. వాని ఎంటుకల్ల ఒక ఎంటుక పోయి బాయిల పడ్డది. ఆ బాయిల చాపలున్నయ్. కొన్ని రోజులు తర్వాత అక్కడి ఎవ్వలో అచ్చి చేపలు పట్టారు. పట్టేవరకల్లా ఆని ఎంటుక తిన్న చేప ఇగ బాగా మెరుత్తంది. ఇది బాగా మెరుత్తుందని దీన్ని రాజుగారికే ఇయ్యాలని అనుకున్నరు. మనల్ని మంచిగ మెచ్చకుంటడు. అది కాక ఇది మెరుత్తంది. రాజు గారికి తీస్కపోయి గీ సొంటి చాప దొరికింది. దీన్నే మీరే తినాలని ఆ రాజు గారికి ఇచ్చారు. ఇచ్చినంక దాన్ని కోసిర్రు. దాన్లో నుంచి ఎంటుక ఎల్లింది. ఆ ఎంటుక బంగారం లెక్క మెరుత్తదట. అయ్యో! రాజా ఆని ఎంటుక బంగారం లెక్క మెరుత్తదట. ఏం ఎంటుకనోగాని సామాన్యంగా మెరుత్తలేదు ఇది. బంగారం తీరే ఉన్నది. ఇది బంగారు తీగ తరికి ఉన్నది. ఎంటుక తీరులేదు అన్ని చెప్పవరకల్లా రాజు రాణికి చూపించిండు. రాణులు కుప్పై సూసిర్రు. అండ్ల రాజు గారి బిడ్డ ఉందట. ఆమె దాన్ని చూసి నేను పెళ్లి చేసుకుంటే గీ ఎంటుకలున్నోన్నే చేసుకుంట అని అంటుంది. ఎంటుకలే గింత అందంగా ఉందంటే ఇంక వాడు ఎంత అందంగా ఉన్నడో అని నాన్న.. నాన్న.. ఆ

చాప ఎక్కడ దొరికిందో ఆ ఎంటుక ఎవల్దో అతన్ని మాత్రమే చేసుకుంటానని మొండిపట్టు పట్టింది. అరె గుల్లోడా! నువ్వ్ గా చాప ఎక్కడ పట్టక్కచ్చినవ్ అంటే అయ్యా నేను గా..! బాగా దట్టమైన అడవిల మర్రిచెట్టు కింద బావిల పట్టుకచ్చి అనేవరకల్లా ఇగ రాజు ఆయన సైన్యంతో ఆ చెట్టు చూసిండు. దాన్ని మీద ఆవు పిల్లలు పిలగాడున్నడు. ఆ పిలగాన్ని సూస్తే మహా వైభవంగా ఉన్నడు. ఆని కథ వేరే ఉన్నది. అరె నువ్వ్ మంచిగ ఉన్నవని చెప్పి కిందికి దించిర్రు. అరె రా..రా...! అంటే నేనచ్చే వాన్ని కాదు. ఆవులతో బతికేవాన్ని పొద్దుగూకినంక మా తల్లులని అడిగి అత్త. సాయంత్రం మా తల్లులు అడిగి అత్త అని చెప్తడు. ఇగ సైన్యం మర్రెత్తరు. రేపు మల్ల పోతరు. పొద్దికి ఈడు తల్లులతో మాట్లాడుకుంటాడు. మరి రాజచ్చి బిడ్డనిత్త అన్నరు. పెండ్లి చేత్తరట. మరి తీస్కపోతరట. అంటే ఏం చెప్తయంటే రాజులని, మనుషులని నమ్మేదిగాదు. మానవుడు అంటేనే నమ్మకద్రోహి ఏ జంతువు అయినా దాని లెక్క ప్రకారం చేత్తది. మనిషిని మాత్రం నమ్మేదిగాదు. అవి రెండు పిల్లనగ్రోవి మురళిలను ఇత్తయి. ఒకటి ఒక రకమైన సౌండు అస్తది. ఇంకోటి ఇంకో రకమైన సౌండు అస్తది. నీకు అన్యాయం జరిగితే ఇది పలుకు మేం అచ్చి వాన్ని పొడుత్తం. నీకు మంచి జరిగితే ఇది పలుకు మనోడు మంచిగనే ఉన్నడని అనుకుంటం. తెల్లారి ఈళ్లు అచ్చి పిల్లగాన్ని తీస్కచ్చి పెండ్లి చేత్తరు. ఈ విధంగా రాజు బిడ్డను లగ్గం చేసుకొని సంపూర్ణంగా ఉంటడు. వాళ్లకు ఆవులు అదే మనం చెప్పిన తీరు సిగ్నల్ ఆడే ఇస్తడు. ఇగ ఆవులు రావు. ఈడు మంచిగ బతుకుతడు.

## బంగారెంటుక బాలుడు – కథావిశ్లేషణ

ఒక బాలుడు తనకు ఎదురైన ప్రతి విషయాన్ని తనకనుగుణంగా మార్చుకొని సందర్భోచితంగా సమయస్ఫూర్తితో ప్రవర్తిస్తాడు. ఈ కథలో ఒక బాలుడికి, జంతువులకి మధ్య సంభాషణలు జరుగుతాయి. అడవిలో పెరిగే జంతువులతో స్నేహంగా ఉండే టార్జన్ కథను తలపిస్తుంది ఈ కథ. ముందుగా రెండు క్రూర జంతువులు గేదెలు కాస్తున్న ఈ బాలునికి దగ్గరకి వస్తాయి. ఒకటి పులి రెండోది ఎలుగుబంటి. ఆ రెండు స్నేహం చేసి ఒక దోసకాయ తోటని పెంచుతాయి. ఆ తోటలో ఒకటే దోసకాయ కాస్తుంది. అది ఏవరు తినాలని సందిగ్ధంలో ఉండగా ఈ బాలుడు ఎదురవుతాడు. ఈ బాలుడిని రెండు జంతువులు ఈ కాయని మా ఇద్దరిలో ఎవరు తింటే బాగుంటుందని అడుగుతాయి. ఆ

ఇరకాటంలో ఎటు చెప్పినా కష్టమేనని ఆలోచించి పులి అతి భయంకరమైన జంతువు కాబట్టి పులికే మద్దతిస్తాడు. అప్పట్నించి పగ పట్టిన ఎలుగుబంటి ఈ బాలుని ఇంటికి వచ్చి రాత్రి సమయంలో అడవికి తీసుకెళ్లి బావిలో పడవేద్దామనుకుంటుంది. ఆ బాలునికి స్పృహ వచ్చి నులక మంచానికున్న తాళ్లకు ఎలుగుబంటి తల భాగం పెద్ద వెంట్రుకలను కడతాడు. బాలున్ని పడవేయపోయి అదుపు తప్పి ఎలుగుబంటి బావిలో పడుతుంది. అక్కడితో ఎలుగుబంటి గండం విరగడ అయిపోయింది. ఆ బాలుడు ఇంటికెలా వెళ్లాలో దారి తెలియక ఆ బావి పక్కన ఉన్న చెట్టు ఎక్కి కూర్చుంటాడు. ఆ చెట్టు కింది అడవి ఆవు పిల్లలు ఆడుకుంటూ ఉండటం గమనిస్తాడు. ఎక్కడ కిందికి దిగితే ఆవులు వచ్చి తనని చంపుతాయోనని ఆవు పిల్లలకు సహాయం చేసి వాటి మన్నన పొందుతాడు. తల్లి ఆవులు తనను పొడవకుండా జాగ్రత్త పడతాడు. దానికోసం ఆవు పిల్లలు ఆడుకునే మైదానాన్ని శుభ్రపరుస్తాడు. ఆవు పిల్లల సహాయంతో తల్లి ఆవులను మచ్చిక చేసుకుని ఆ ఆవుల దగ్గరే పాలు తాగుతూ పెరిగి పెద్దవాడవుతాడు. కొద్ది రోజుల తర్వాత యుక్త వయస్సుకు వచ్చిన ఆ బాలుడు ఆవు పాల బలంతో మెరుపు తీగలా నవయవ్వనంగా మన్మధున్ని తలపించే రూపాన్ని పొందాడు. ఆ అడవిలోకి వచ్చి చేపలు పట్టిన జాలర్లకు చేప మాంసంలో ఆ బాలుని మెరుస్తున్న వెంట్రుక దొరుకుతుంది. ఆ విషయాన్ని రాజుకు చెప్తే రాజు తన కుటుంబ సభ్యులకు చెప్తాడు. రాజు కూతురు యువరాణికి తెలిసి ఆ యువకుణ్ని మాత్రమే వివాహం చేసుకుంటానని పట్టుపడుతుంది. ఆ రాజు భటులను, సైన్యాన్ని అడవికి పంపించి ఆ యువకుడిని రాజ్యానికి తీసుకువస్తారు. ఆ యువకుడు మాతృప్రేమతో తన తల్లి ఆవుల అనుమతితోనే ఆ యువరాణిని వివాహం చేసుకుంటాడు.

1. ఒక బాలునికి, జంతువులకి మధ్య జరిగిన కథ. మొదట బాలుడు క్రూరజంతువు నుండి తప్పించుకుంటాడు. తరువాత ఆవు పిల్లల సహాయంతో ఆడవి ఆవులను మచ్చిక చేసుకుంటాడు. ఆ ఆవుల దగ్గర పెరిగి యుక్త వయస్సు రాగానే కోరి వచ్చిన రాణిని పెళ్లి చేసుకుంటాడు. ప్రతి సందర్భంలోనూ సమయస్ఫూర్తితో మెలిగిన పాత్రగా చిత్రించబడతాడు.

2. ఈ కథలో సాధారణంగా జంతువులతో బాలుడు మాట్లాడటం జరుగుతుంది. అదంతా అవాస్తవం అయినప్పటికి పిల్లలను ప్రేరేపితం చేయడానికి జంతువుల పట్ల ఒక రకమైన ప్రేమ వాత్సల్య భావనను పెంపొందించే కథ. చిన్న పిల్లలను బాగా ప్రభావితం చేసే కథగా మలచబడింది. అంతేకాదు ఎన్ని

ఇబ్బందులు ఎదురైన తెలివితో ప్రవర్తించి, దైర్యంగా ముందుకెళ్ళాలని, ప్రతికూలతలను సానుకూలంగా మార్చుకుంటేనే జీవితమంతా సుఖమయంగా ఉంటుందనే ప్రధాన నీతిని బోధిస్తుంది ఈ కథ.

3. మానవ మచ్చిక జంతువులైన ఆవులు, గేదెలు ఎన్నో రకాలుగా ఉపయోగపడతాయి. ఆవు పాలలోఅధిక పోషక విలువలున్నాయి. గోవులను గోమాతగా కూడా పూజిస్తారు. మానవులకు ఎంతో చేదోడు వాదోడుగా ఉండే పెంపుడు జంతువులపై ఈ కథలో బాలుడు చూపిన వాత్సల్యం మధురమైనది. నిజంగా తల్లిపాలు తాగిన పసిపాప ఏవిధంగా పాల బుగ్గలతో ప్రకాశవంతంగా కనిపిస్తాడో దాన్ని ప్రతిబింబించడానికే ఆవు పాలను తాగిన బాలుడు కూడా బంగారపు వర్ణంలాగా మెరిసిపోతున్నాడని జానపద కథకుడు పోల్చి ఉంటాడు.

## 2.4.2.3 నేను మల్లన్నను పోతున్న

కైరం రమణ, బతికెనపల్లి గ్రామం, రాయికల్ మండలం.

ఒక్కాడ గుర్రం చనిపోయి ఉన్నది. గుర్రం చనిపోయి అడవిలో ఉన్నది. నక్క దాని ముడ్డి నుంచి మేసుకుంటు.... మేసుకుంటూ ఆ లోపలికి పెయింది. లోపలికి పోయేసరికి అయ్యో! బయటికి వెళ్లాలంటే వెళ్ళస్తలేదు. ఎట్ల అని చెప్పి కొంత మంది గొర్ల కాపరులున్నరు ఆడనే. గొర్లు కాస్తుంటే ఈ నక్క ఏమంటుంది. అరె...మీరు గొర్రె కాపరులారా! నేను ఇండ్ల మల్లన్నను ఉన్నను.. మీరు ఇంటికి వోయి మీరందరు ఆల్లతోని జెప్పురి. ఆ బిందేతోని నీళ్లు తీస్కచ్చి పోయరా ఈ గుర్రం ముడ్డి మీద అని జెప్పి ఈ నక్క చెబుతుంది. చెప్తే అరె.....! అట్లన అని జెప్పి ఈ గొర్ల కాపర్లందరు వొయి ఇంటికాడ అందరితో చెబుతరు. గిట్ల సంగతట గుర్రం ముడ్డిల మన అది ! మల్లన్న ఉన్నడట. బయటికి ఎల్తడట. మనం బిందెలతో నీళ్ళు తీస్కపోయి పోయాలె అని అన్నవోల్లె అందరు బిందెలతో నీళ్ళు తీస్కపోయి వచ్చి ముడ్డిమీద పోత్తరు. పోసి తరువాత మంచిగ నానుతది. అది ఎండకు ఎండి పాయే మంచిగ నానుతది.. నాని తరువాత ఈ నక్క ఏంజేత్తది. లోపలుండి మీరు కాల్లకు తాల్లు కట్టేసుకోండ్రి. కుక్కలను కాళ్లకు కట్టేసుకోండ్రి. ఆడోళ్ల శికలకు శికలు ముడేసుకోండ్రి. మగ వారు జుట్లకు జుట్లు ముడేసుకోండ్లి అని జెప్పి చెప్తది. చెప్పినంక ఈల్లు అదే ప్రకారంగ అరె మల్లన్న ఎలుతుండు రా.. కాళ్లకు కాళ్లు తాళ్లతో కట్టేసుకొండ్రి. ఆ జుట్లకు జుట్లలు ముడేసుకోండ్రి. ఆ మన ఇది కుక్కలను మన కాళ్లకు కట్టేసుకోండ్రి. అన్నట్టు అది నక్క చెప్పిన లెక్కనే ఈల్లు కట్టేసుకొని రడిగ ఉన్నరు. ఇగ ఉన్నంక నక్క

ఎం జేత్తది ఎలుతున్న... ఎలుతున్న అని చెప్పి ఇగ లరుక్కుని అండ్లకెల్లి లేసి ఉరుక్కుతది నక్క. అయింత ఈల్లు ఆశ్చెరపోతరు.

### నేను మల్లన్నను పోతున్న – కథావిశ్లేషణ

జిత్తులమారి నక్క తన తెలివితేటలతో గుర్రం పృష్టబాగం నుంచి బయటకు వస్తుంది. చనిపోయిన గుర్రం మాంసం తింటూ ఇరుక్కపోయిన నక్క ఎలా బయటికెళ్ళాలో తెలియదు. గొర్లను కాపలకాస్తున్న వారి కులదైవం అయిన మల్లన్న పేరు చెప్పుకొని చాకచక్యంగా బయటపడింది. ఇరుక్కున్న నక్కకు బయటికి రాలేక మల్లన్నదేవుని పేరు చెప్పి నీళ్లు పోయించుకుని గుర్రం చర్మం మెత్తకాగానే అందులోనుంచి బయటకు వస్తుంది. బయటకు వచ్చినంక అది నక్క అని తెలిస్తే దాన్ని బతుకనివ్వరని చెప్పి ముందుగానే వారి కుక్కలను, వారిని తాళ్లతో కట్టేసుకునేలా చేస్తుంది. అలా పథకం ప్రకారం తాను బయటకు రావడానికి, క్షేమంగా అవతలపడటానికి యాదవ కులదైవమైన మల్లన్న పేరు చెప్పుకుంటున్నది. ఎదుటివారి బలహీనతను అనువుగా తీసుకొని తన ప్రాణాలను రక్షించుకున్న తీరు ఆకట్టుకునే అంశంగా చెప్పాలి. అందుకే నక్కను జిత్తులమారిగా సూచిస్తారు. ఎవరైనా ఇలాంటి తెలివితేటలు ప్రదర్శిస్తే దాని పేరు పెట్టి నిందిస్తారు.

## 2.4.3 హాస్య కథలు

### 2.4.3.1 రేచీకటి అల్లుడు

కైరం రమణ, బతికెనపల్లిగ్రామం, రాయికల్ మండలం.

రేచీకటి అల్లుడు అయితే.. అవ్వ అవ్వ బాగా రోజులయే నా భార్యపోయి... ఆ..! తోలుకత్తనే అవ్వ చెప్పని అంటే పోర కొడుకా! అందుటానికి గుడా కట్టమైతున్నది. పోర కొడుక! తోల్కరాపో పిల్ల నెల రోజులయే అది అంటే పాయే ఎట్లరా? అని చెప్పనంటే మరి తోలుకత్తగని అది తోలుతదో? తోలేయ్యదో? అత్త అంటే. ఏ..! పోయి అయితే రాపో కొడుకా! అది తోలెత్తే తోలెయ్యనిగని లేకపోతే లేదుగని! నువ్వైతే పోయి రాపో రాదురా కొడుకా!. మంచిది అవ్వ నేపోతనే అని చెప్పి బయలుఎల్లిండు. ఎడ్డికాలం నడిచే రోజులు అప్పుడు బస్సులు ఏమి లేకపాయే పోంగ పోంగ ఈనికి రేచీకటి రాత్రి అయితే కల్లు కనబడయి. పొద్దుదాంక కనబడతయి గని. రేచీకటి అనేది ఉంటదన్నట్టు కొంతమందికి? ఈనేకు రేచీకటి ఉండే మరెట్ల... సాయంత్రం ఆరు అయితుంది. ఆరు అయ్యేసరికి పొద్దుగూకుతుంది. ఈ ఊర్లకి పోవుటానికి కొద్దిగా కల్లు రేచీకట్లయితున్నయి. కొద్దిగా కండ్లు సక్కగా కనబడతలేవు. అక్కడ

బర్లమంద పోతుంది. అగో గొల్లయిన! గొల్లైన మా అత్తగారి బర్రె ఉందా?. అంటే ఏ ఉన్నది అగో! పెద్ద కొమ్ముల బర్రె మీదేనోయి పో.. అని చెప్పి అన్నంక..! మంచిదని చెప్పి ఆ పెద్ద కొమ్ముల బర్రె దగ్గరికి పోయి ఆ తోక పట్టుకున్నడు. తోక పట్టుకోని పోతుండు. పోంగ పోంగ ఇది ఎందో తోక పట్టుకున్నక ఆ దడి పొన్న ఈ దడిపొన్న మేసుకుంట మేసుకుంట మెల్లగ మెల్లగ పొంగ అరె! నిన్న మొన్న బర్రె జల్ది అత్తుండే ఇయ్యాళ రాకపాయే అని చెప్పి బామ్మరిది ఆడికి అత్తుండు. అగో! బావ నువ్వు బర్రెను తోలుకత్తున్నవు ఎందోయి అంటే అవునోయి. నేనే తోలుకతున్న. ఈ బర్రె అటు ఇటు అత్తుంది. ఆ గొల్ల అయినను అడిగితే గా! పెద్దకొమ్ముల బర్రె మీ అత్తగారిదే అన్నడు. ఇగ నేనే తోలుకత్తున్న మన ఇంటికి అన్నవోల్లే.. దా బావ! పోదాంప అని చెప్పి పోతుల్లుగని తోకను ఇడత్తలేడు. ఆ తోక పట్టుకుంట మెల్లగ మెల్లగ ఇంట్లకు పోయిర్రు. పోయినవోల్లే అల్లుడు అచ్చిండని చెప్పి అత్త ఏంజేత్తది. మంచిగ నీళ్లు కాగవెట్టింది. ఉడుకునీళ్లు, సల్లనీళ్లు వోసింది. తానం చేయి అల్లుడు అని చెప్పి అత్త అంటే, ఒకెయ్యి బర్రెకు కుడిది నీళ్లు వోసింది. ఇగ అల్లుడు ఏంజేత్తుండు. మంచిది అని చెప్పి ఆ కుడిది పోసుకుంటడు మీదికెల్లి. ఆనికి రేచీకటి కళ్లు కనబడతలేవు. అయ్యో! అల్లుడు గా మన కుడిది నీళ్లు ఎందుకు పోసుకుంటున్నవ్ నీళ్లు గీటు పక్క ఉన్నయి. అంటే ఏయ్...! మా అంచన ఫస్ట్ మేం కుడిది చేసిన తరువాతనే మంచినీళ్లు పోసుకుంటం అత్త అని చెప్పి అన్నడు. అట్లన సరే మంచిది. అన్నంక అ మంచినీళ్లతో కొన్ని తానం చేసిండు. చేసిన తరువాత మల్ల ఇంట్లకు అద్దమంటే రేచీకటి ఎట్ల. పెండ్లం రాకపాయే అత్త రాకపాయే. అటు ఇటు చూసిండు. మెల్లగ మెల్లగ నడుద్దమని జెప్పి పెంట బొంద ఉంది. బాగా వర్షం పడి నిండింది. ఆ బొందలో పడుతడు. ఆ బొందలో పడేవరకల్లా అయ్యో! అల్లుడు గ పెంట బొందల్లల పడ్డడు. అని చెప్పనంటే ఏ అత్త ఇండ్ల జిమ్మలు బాగున్నయి. నువ్వు నీ... బొందలో పడ్డవ్ అంటవ్.... జిమ్మలు పడుతున్న. బిడ్డను రమ్మను ఇటు. అన్నంక బిడ్డ అచ్చే అచ్చినంక నీ కొంగు ఇటెయ్యి కొంచం ఎక్కుత. అయింత ఈ దరి కనబడతలేదు. అని చెప్పి అన్నంక ఆ కొంగు పట్టుకొని పైకెక్కుతడు. కొంగు పట్టుకొని ఇంట్లకు పోయేటప్పుడు ఆ కొంగునే పట్టుకొని ఇండ్లకు పోతుండు. ఏంది అల్లుడు ఆ కొంగునే పట్టుకొని ఇండ్లకు పోతుండు. ఏంది అల్లుడు ఆ కొంగు పట్టుకొని పోతున్నవ్ మా బిడ్డది అనంటే. ఏయ్..! బాగా రోజులయ్యే అత్త నువ్వు గిట్ల అంటవ్? ప్రేమ అనేది ఎట్ల ఉంటది? భార్యభర్తల ప్రేమ తెలువద గియింత తెలువద. కొంగు పట్టుకుని పోతవ అంటవ్? అని చెప్పి అన్నవోల్లే ఇంట్లకు వోయిన తరువాత కూసుంర్డి కూసుంర్డి అత్త మంచిగ అన్నం ఆరవెట్టింది. ఆరవెట్టిన అన్నం

పెట్టి అల్లుడు కూసుండు. అన్నం తిను అని చెప్పి అన్నం పెడితే. అల్లుడు ఒకేయ్యి తింటుండు. పిల్లి ఒకెయ్యి తింటుంది. ఈనికి ఏమో కండ్లు కనబడయాయే. అయ్యో! ఎట్ల పిల్లి తినవట్టే అల్లుడు పిల్లి తింటుంది. అల్లుడు పిల్లి తింటుంది అంటే చూ... చూ.... అంటుండు! ఈడు అన్నం తింటుండు. తినేసరికి అయిపోయింది. ఇగ మారన్నం ఏసుకోవాలి. మారన్నం తీస్కచ్చి అల్లుడు ఇగో మారన్నం తిను అని చెప్పి ఏద్దామనేవరకల్లా చెంప మీదకెల్లి చెడిల్లమని సంపుతడు. అయ్యో అల్లుడు ఎందుకు చంపుతివి అంటే మేం మారన్నం ఏసుకునేటప్పుడు అట్ల కొట్టినంకనే తింటమని చెప్పి అంటడు. అట్లనా మారన్నం ఏసేటప్పుడు కొడతర. తర్వాతనే తింటమని చెప్పి ఇగ ఈడు అన్నం తింటడు. తిన్నవోల్లే పడుకున్న తరువాత కొద్దిసేపటికి ఈనికి దొడ్డికత్తంది. అయ్యో ఎట్ల మరి నేను ఇప్పుడు బయటకు పోవాలంటే మల్లి రావాలంటే కట్టం. మల్లీ పోవలన్న కట్టమే. ఈ పెండ్లం లేపుతే ఇది కోపానికత్తది. ఏంజేద్దాం అని చెప్పి ఓ పక్కపోన్న బాణలుంటది. ఆ బాణాల్ల దొడ్డికి పోతడు. దొడ్డికి వోయి ఇగ తెల్లారుతది. ఇగ తెల్లారిన తరువాత ఇగ తోలెత్తవ అత్త మరి అంటే ఏ...! నేను తోలెయ్యాపో అని చెప్పి కొంచెం గొడవ అయితది. ఆ ఇట్లన అని చెప్పి ఆడకట్టోళ్లు అందరిని పిలుసుకత్తడు. పిలుసుకచ్చి ఆ బాణా తీస్కత్తడు. ఈనే దొడ్డికి వోయిన బాణా తీస్కచ్చి ఆకిట్ల ఎత్తేసి ఇగో ఆమె బిడ్డది ఉన్ను, మా యత్తది లండుతనం చూడుర్రి. గీ ఇంట్ల ఎవ్వడన్న ఏరుకుంటరా? ఇంట్లనే ఏరిగి మొత్తం ఈ కుండ అంత నింపిల్లని చెప్పి. ఆ బాణా తీస్కచ్చి ఆవుతలవడతాడు. అంటే రేచీకటి అల్లుని కత గిట్ల ఉంది.

## రేచీకటి అల్లుడు – కథావిశ్లేషణ

రేచీకటి అల్లుడు ఈ కథ పేరువినగానే హాస్యస్ఫూరకమైన కథగా మనకు అర్థమవుతుంది. కంటికి సంబంధించిన రేచీకటి వ్యాధితో ఉన్న వ్యక్తి భార్య అలిగి తన తల్లిగారింటికి పోతుంది. ఏలాగైనా తన భార్యను తిరిగి ఇంటికి తీసుకురావాలని అత్తగారింటికి వెళతాడు. అతనికి రేచీకటి ఉన్న విషయం అత్తగారికి తెలియకుండా ఉండటానికి నానా బాధలు పడతాడు. తనకున్న రేచీకటి వ్యాధి గురించి ఎక్కడో తెలుస్తుందో అందోళన పడతాడు. దాన్ని కప్పిపుచ్చడానికి తాను చేసిన తప్పులన్నింటిని సవరిస్తూ, సమర్థిస్తూ, సర్దిచెప్పుతూ వస్తాడు. ఆ సన్నివేశాలన్ని కూడా హాస్యాన్ని తెప్పించేవి.

1. సాధారణంగానే సమాజంలో ప్రతి అత్తింటివారు కూడా వారి అల్లుడు మీద గౌరవ మర్యాదలు, ఎనలేని ప్రేమ చూపిస్తుంటారు. అల్లుడు వచ్చినప్పుడు చేయాల్సిన మర్యాదలు విధిగా చేస్తారు. అలాగే ఈ కథలో కూడా అల్లుడు రేచీకటి ఉన్న విషయం తెలియక అల్లుడికి వేడి నీళ్లు పెట్టడం, అన్నం

వడ్డించడం లాంటివి చేస్తారు. తనకున్న రేచీకటి వల్ల అవన్ని గమనించుకొని అల్లుడు ఒక్కొక్క విషయంలో ఒక్కోక్క తప్పు చేసి, తన తప్పును ఒప్పుకోకుండా వేరే సమాధానాలు చెప్పి, తన తప్పేమి లేనట్లు కప్పిపుచ్చుకుంటాడు. అతడు ఆ సందర్భంలో చేసిన తప్పిదాలే శ్రోతలకు హాస్యాస్పదంగా ఉంటాయి. చిన్న పిల్లలు ఇలాంటి కథలంటే ఇష్టపడతారు. ముఖ్యంగా పెళ్లి ఈడుకి వచ్చిన ఆడవాళ్లకు తనకు కాబోయేవాడిలో ఏ లోపాలున్నాయో ముందే తెలుసుకోవాలని కుతూహలం కలుగుతుంది. ఎందుకంటే నిజజీవితంలో నవ్వులపాలు అవడాన్ని ఎవ్వరూ ఇష్టపడరు కదా!

2. రేచీకటి ఉన్నాగాని అల్లుడు పాత్ర చూపించిన సమయస్ఫూర్తి, బుద్ధికుశలత మెప్పునొందగలిగినవే. తనకు కళ్లు కనపడకపోయినా సాయంత్రవేళ సంధ్యసమయాన్ని గమనించి పశువులు ఇంటికెళ్లే సమయంగా గ్రహించి, అతని అత్తగారి బర్రె గురించి గొల్లవాని దగ్గర ఆరా తీసి ఆ బర్రె తోక పట్టుకుని ఇంటికి వెళతాడు. అంతేగాకుండా స్నానానికి వేడి నీళ్లు పోసుకోవడానికి బదులుగా కుడితి నీళ్లు పోసుకోవడం, పెంట కుప్పల్లో కాలు వేసి జిమ్మలకోసం వెతుకుతున్నాను అనడం, తాను మారన్నం వేసుకోనేటప్పుడు అత్త చెంప మీద కొట్టడం అతను చేసే చిన్న చిన్న పొరపాట్లను నుండి తప్పించుకోవడానికి తప్పుడు సమాధానాలు చెప్పి తప్పించుకున్న విధానం అతని తెలివితేటలను తేటపరుస్తుంది. దీని వల్ల లోపాలున్న వారు కూడా తెలివితో సమయస్ఫూర్తిని వ్యవహరించి ఆపదలో ఎలాగైనా తప్పించుకోవచ్చన్న విషయాన్ని రేచీకటి అల్లుడు పాత్ర నిరూపిస్తుంది.

3. యుక్తవయస్సులో ఉన్న భార్యాభర్తల వియోగమే ఈ రేచీకటి అల్లుడిని అత్తగారింటి దాకా ప్రయాణించేలా చేసింది. తాను ఎన్నో ఇబ్బందులు పడి భార్యకోసం వెళతాడు. కాని గయ్యాళి అత్త తన కూతురుని అతనికి తోడుగా పంపించపోయేసరికి, ఆమెకు ఎలాగైనా బుద్ధి చెప్పాలని అనుకుంటాడు. అందరిని పిలిచి తాను చేసిన తప్పును అత్త మీదకు నెట్టి, అందరిలో అవమానించి తాను ఇంటికి బయలుదేరుతాడు.

## 2.4.3.2 పెద్దపులి – గిద్దపులి

దాయాది రాములు, కొల్వాయి గ్రామం, బీర్‌పూర్ మండలం

ఒకాయనకు పెళ్లైంది. చిన్నతనంలో ఆ రోజుల్లల అట్లేనే చేసేవారు. అయితే ముందే పెళ్లైనా విషయం ఆయనకే తెలియదు. పొంగ పొంగ యుక్తవయస్సు పిల్లగాడు పదుసోడయ్యిండు. ఆయనకు తెలువక అమ్మా అందరు పెళ్లి చేసుకుంటుర్రు. మరి నాకు పెళ్లి చేయవానె అంటే కొడుకా నీకు పెళ్లి

ఎప్పుడో అయ్యింది. నీకు పెళ్లై సూమారు 15 సంవత్సరాలైతుంది. నీకు ఐదారేండ్ల వయసులోనే చేసినాం పెళ్లి. అంటే మరి ఏ ఊరు అమ్మా నాకు తెలువక పయే అంటే పలనా ఊరు. అని ఏదో ఊరు పక్కూరు చెప్పింది. ఆ ఊరికి ఈ ఊరికి మధ్యలో జంగల్ ఉన్నది. అడవి ఉన్నది. అమ్మా నాకు ఎట్ల తెలవాలి అంటే పలానా ఏరియా పలానా వాడకట్టు పలానా ఇల్లు జాగ అడ్రసంతా క్లీయరుగా చెప్పిందామె. సరే మంచిది అమ్మా పోతా అని చెప్పి ఆయన బయలెల్లిండు. ఆయన కొంచెం అమాయకుడు. నేను అత్తగారింటికి పోవడితి. కొంచెం సూప్ టాప్‌గా పోవాలని చెప్పి ఇప్పుడయితే సైకిలు మోటర్లు ఉంటే అప్పుడేం లేవు. అప్పుడు గుర్రాలు ఏస్కపోయేవాళ్లు. గుర్రాలు ఏస్కపోయేవాళ్లకు నేను కూడా ఒక గుర్రాన్ని ఏస్కపోవాలనుకున్నాడు రాజు.  అనుకుని అప్పుడు గుర్రాల శాల ఉండేనట. గుర్రాల శాలకి పోయిండు. గుర్రాల శాల కాపరి ఏం గావాలంటే నాకోక గుర్రం కావాలని అడిగిండు. ఆయన నీకు గుర్రం నడపత్తదా అని అడిగిండు. ఏ.. నాకు నడపచ్చు అంటడు. ఈనికి గుర్రం ఎక్కారాదు. నడపరాదు. అట్టోడే వీడు. గుర్రాన్ని ఎప్పుడు చూసినోడు కూడ గాదు. నడపత్తే ఇష్టమున్నది తీస్కపో.. పుల్లది కావాన్నో పయ్యది గావాన్నో కర్రెది గావాన్నో బొర్రది గావాన్నో తీస్కపో రకరకాలుగా ఉంటయి గదా! అన్నంక ఆ గుర్రమీది ఈ గుర్రమీద చేయి పెట్టుకుంట ఉంటడ.. దానిముడ్డి మీద చేయి పెట్టేవరకల్లా జాడిచ్చి తన్నింది. గుర్రంకగ్గిదలగ గిట్ల తన్నే ఈడు పిసోడయే పొద్దికచ్చి పెద్దపులి వేశం వేసి దీన్ని బెదిరిత్తని పెయంత రంగు పూసుకుని బుర్ర పెట్టుకుని అచ్చిండు. కొంచం మసక చీకటి అయినంక పోయి మూలకు కూసోని దాన్ని బెదిరిత్తమనుకుండు. అప్పుడే ఆ గుర్రాల శాల కొంచె అడవికి దగ్గరుంది. ఆ రోజు నిజంగానే పెద్దపులచ్చిందట. గుర్రాన్ని తినిపోతనని అచ్చి అదొక మూలకు, ఇతడొక మూలకూసుండు. అయితే ఏం జేసిండట ఆవిటికి మృగాల భాష మృగాలకి తెలుసు. గుర్రాల్ల ఒక పిల్ల గుర్రం తల్లికి పెద్ద పులచ్చిందని చెప్పిందట. పెద్దపులి లేదు గిద్ద పులి లేదు సప్పుడేంక తిను అని తల్లి గుర్రం పిల్ల గుర్రానికి చెప్పింది. ఇగ ఈ ముచ్చటంతా నిజంగా పెద్దపులి ఇన్నదట. పెద్దపులి ఇగ అగో పెద్దపులంటే నేనే ఇగ గీ గిద్ద పులంటే ఏంటిదని నాకంటే దండిది గిట్ట గాదు గదా. పెద్దపులికి అనుమానం అత్తుంది. గిద్దపులనేది ఇంకోటి ఉన్నదా? అయింత నన్ను అది తినది కదా అని భయపడతంది. జోరు మసకైంది. అంబాడుకుంటా అంబాడుకుంటా పోతుండు పెద్దపులి లెక్క ఈడు. మసక చీకటిలో పోయి గుర్రాన్ని పట్టపోయి పెద్దపులి కాలిని పట్టిడట. ఆ మూలకున్న వాస్తవంగా పెద్దపులి కాలు పట్టిండు. నన్ను నువ్వే అప్పుడు తంతవ్ అని కాలుపెట్టెవరకల్లా.

అబ్బ గిద్ద పులి రానే వచ్చింది. నన్ను పట్టనే పట్టింది. నన్ను పట్టే ధైర్యం ఎవరికి ఉంది. గిద్దపులికే ఉంది. ఇది వాస్తవంగా గుర్రం అన్నది నిజమే అని చెప్పి పెగడయించుకుంటుంది. యిడిపిచ్చుకుంటుంది. వీడు గట్టిగా పట్టిండు ఇడత్తలేడు. అది అటు తులుమాయిస్తూ ఇటు తులుమాయిస్తుంది. ఆడు గబుకున దాన్ని నెత్తిమీద కూసుంటుండు. ఇగ నన్ను బతకనీయడు అని ఒకటే పరుగు తీసిందట. ఎంత పరుగు తీసినాగని వీడు గట్టిగా దొరకవటుకుని కూసుండట. ఉరుకు ఉరుకు.. నీ కడుపుగాల! నిను గెదిమి గెదిమి కింద పడేదాక నీ మీదనే ఉంట నేను. ఉరుకు ఏపాటు ఉరుకుతవో అని పక్కలేసి గుద్దుతడట వీడు. గుర్రమనుకుని దాని ఈపుల గుద్దెది గుద్దుతడట వీడు. కాళ్లతో తంతడాట. ఎక్కడ ఆగనిత్తలేడట. జంగల్ అంత గెదిమిండు. దానికి దమ్మచ్చి ఊపిరితిత్తులు పలిగిపోయేంత వశపడతలేదు. ఇగ తెల్లారుతుంది. ఏం చేసింది పోంగ పోంగ అటు తెల్లారుతుంది. తెల్లారేవరకల్లా వీనికి మాములుగా పెద్దపులి చారలు కనిపిత్తన్నయి. దాని మీద కూసున్నోనికి అబ్బ! గిది నిజంగా పెద్దపులి నా పని జేత్తది యిది. ఎట్ల చేయాలని ఇప్పటి దాకా ఉషారున్నోడు ఇప్పుడు ఇగ మొత్తం ముదుసుకుపోయిండట. భయపడతండట. ఇగ దిగుదామంటే ఛాన్సు లేదు. బాగా ఉరుకుతుంది. కారెంత ఉరుకతదో అంత ఉరుకుతుంది. దిగుదామంటే కిందవడి సచ్చిపోతనేమో అని భయమైతుంది. పిరికిసోచ్చింది. పొంగ పొంగ జంగల్ల ఒక గుడి ఉంది. ఆ గుడి ముందుకెళ్లి ఉరుకుతుందట అది. గిదే సమయం అనుకుని ఆ గుళ్లెకి దిగి ఉరికి సొచ్చిండు. పెద్దపులి ఏమనుకుంటుంది అబ్బ బతికేరా నీ బంచన్. నను గిద్ద పులి యిడిసి పెట్టింది. ఇగ ఉరికి ఒక బండ మీది కూసుంది. బాగా దమ్ము తీత్తుదట పెయంత చెమటలచ్చినయట. ఈ విధంగా జరిగనంక దాని దగ్గరకి నక్క అచ్చిందట ఏమోయి పెద్దపులి బావ నీకెందుకోయి అవస్త నువ్వ్ రాజువి. బాగా దమ్ము తీత్తున్నవ్. నీకెమయ్యిందోయ్. అంటే నువ్వగోయి నీకేం తెలుసు మన జంగల్లకి గిద్దపులి తేలింది. అది నను ఇవరిదాంక సంపింది. ఉరికి ఉరికి సచ్చినా నేను. ఇప్పుడే దిగి గుళ్లె సొచ్చిందోయ్ నేను బతికేరా.. ! అని దమ్ము తీస్కుంటున్నా అని చెప్పింది. నక్కకు బాగా తెలుసు గిద్ద పులి లేదోయ్. దేవుడి సృష్టిలనే గిద్దపులి లేదు నువ్వెందుకు భయపడతవ్ అంటే ఇవరిదాంక నా మీద కూసందంటే నువ్వేమో లేదంటవ్ నీకేమన్నా పిసానా? అదేమో లేదనుడు ఇదేమో ఉన్నదనుడు. అటనంగ ఇటనంగ ఇగో నీకు కావాల్నంటే నేను గుడికాడికి అత్త నువ్వ్ గుడికాడికి పోయి చూసిరానంటే నేనత్తే మల్ల నా మీద ఎక్కుతంది ఇగ. నక్కకు బాగా తెలివి ఉంది. లేదని తెలుసు నేనత్త పా నాకు చూపియి అనంటది. నక్క ఆడికి పెయింది. తలుపులు గట్టిగా

పెట్టుకుండు మనోడు. తలుపులు గట్టిగా పెట్టుకుని గజగజ అనుకుంతుండు. తీసినగని తీయకుంటా గట్టిగా ఒత్తి పట్టుకుని ఉన్నడు. నక్క పోయి తలుపులు ఊపుతుంది. తలుపు ఎల్తలేదు. తలుపుకు చిన్న పొక్క రంధ్రం ఉన్నది. తలుపుగడని తోకతో తీత్త అని తోకని రంధ్రంల లోపలికి సొరగొట్టింది నక్క. ఇగ ఇదే సమయం రా అనుకుని ఈడేం జేత్తనంటే ఉరికచ్చి తోకను మట్టకు మలపోసుకుని తలుపుకు కాళ్లను తన్ని ఇగ్గి పట్టిండట. నక్క ఎక్కడ ఏగలేక మూ... మూ... అని దమ్ము తీసి మూలుగుతుంది. పెద్దపులి మెల్లగ మెల్లగ గుడికాడికి అచ్చిందట. ఏమయిందోయ్ మూలుగుతున్నవ్ అంటే. ఈ.... నువ్వే నీ పనికగ్గితలగ నువ్ గిద్దపులి అన్నవ్ గని గిద్దపులి గాదు. తోకపీకుడుగాడు ఈడని చెప్పిందట. అబ్బ నా తోక పికదిక్కని పెద్దపులి ఉరికిందట. కొంచెం సేపటికి ఇది ఇటు ఇగ్గ, ఆడు అటు ఇగ్గ నక్క తోక తెగింది. అయింత నక్క అంగల్ల నక్క పికింది. పెద్దపులి అంగల్ల పెద్దపులి పికింది. ఈ పిసోడు కొద్దిగయినంక ఎల్లిపెయిండు.

## పెద్దపులి గిద్దపులి కథ – కథావిశ్లేషణ

పెద్దపులి గిద్దపులి అనే కథలో భయం వల్ల ఎంతటి బలవంతులైనా బలహీనులుగా మారిపోయే అవకాశం ఉందని తెలుస్తుంది. ఒక వ్యక్తి తనని కాలుతో తన్నిన గుర్రాన్ని ఏలాగైనా బెదిరించాలని గుర్రాలశాలకి రాత్రి వెళ్లి కూర్చుంటాడు. అదే సమయానికి అక్కడికి ఒక పెద్ద పులి వస్తుంది. పులి చీకటిలో గుర్రాలు మాట్లాడుకున్న మాటలు విని అడవికి రాజును నేనే కదా! నా కంటే పెద్ద క్రూరమృగం నిజంగా ఉందని భ్రమ పడుతుంది. గుర్రం తనని తన్నిందని దాని మీద ప్రతీకారం తీర్చుకోవాలని అనుకుంటాడు. కాని ఈ మూర్ఖుడికి గుర్రానికి, పులికి తేడా తెలియదు. గుర్రాన్ని బెదిరించబోయి పులి మీద ఎక్కి తన శక్తినంతా పోగు చేసి పిడి గుద్దులు గుద్దుతాడు. ఆ అడవి అంత పరుగెత్తిస్తాడు. ఇక పులి విషయానికి వస్తే పెద్దపులిని మించిన గిద్దపులి ఉందని అపోహపడి మూర్ఖుడైన పిరికివాడి మీదకెక్కినప్పుడు తీవ్ర భయానికి లోనవుతుంది. అతని మీద ఎక్కింది మనిషి అని తెలియక గిద్దపులి ఎక్కడ్నుంచో వచ్చిందని భయపడుతుంది. తన బలాన్ని మరచి పిరికిపందలా అడవి మొత్తం భయపడుతూ తిరిగింది. కొద్ది సేపటికి గుర్రం మీద ఎక్కి కూర్చున్న పిరికివాడికి తాను ఎక్కింది గుర్రం కాదని పులి అని తెలిస్తుంది. ఆప్పటిదాకా పగ సాధింపులో ఉన్న పరాక్రమవంతుడికి తన సహజ గుణం బయటపడి గుడి రాగానే గుడిలోకి వెళ్లి దాక్కుంటాడు. చివరికి నక్క బావ వల్ల కథ ఒక ముగింపుకి వస్తుంది. అడవి మొత్తం ఎరిగిన జిత్తుల మారి నక్క గిద్ద పులి లేదని తెలిసి పెద్దపులితో ఎంత వాదించిన

పెద్దపులికి నమ్మకం కుదరలేదు. ఇక లాభం లేదని తలుపుకున్న రంధ్రంలో నక్క తోక పెట్టి నిజాన్ని నిర్ధారణ చేస్తుంది. గుడిలోపల ఉన్న పిరికివాడు తోక పికుడుగాడని, పిరికిసన్నాసని తెలుస్తుంది. గుడి బయటికి వస్తే ఎక్కడ పులి, నక్క కలిసి తింటాయో అని భయపడి నక్కతోక లాగి పట్టుకుని లోపలే ఉండిపోతాడు.

1. గుర్రం తన్నిందని పులి మీద ఎక్కడం, పులియే గుర్రం అనుకుని పిడిగుద్దులు గుద్దడం, పులి గుర్రం కాదని తెలిశాక గుడిలో వెళ్లి దాక్కోవడం, నక్క తోకని బిగ్గిత్త పట్టుకోని లాగడం మొదలైన సన్నివేశాలను పిల్లలకు కథాకథనం చేసేటప్పుడు హాస్యం పుట్టిస్తుంది ఈ కథ.

2. ఈ కథలో భయాన్ని మించిన శత్రువు లేదని పులి పాత్ర ద్వారా, భయం కలిగి ఉండటం వల్ల మనకున్న స్వంత శక్తియుక్తులను మరచిపోతామని మనిషి పాత్ర ద్వారా తెలుస్తుంది.

3. మనుష్య, జంతువుల మధ్య సంభాషణలు అసంగతమైనవి. అయినా ఇలాంటి కథలు కల్పించడం ద్వారా పిల్లలకు ఆనందాన్ని పంచడంతో పాటు వారిలో సృజనాత్మకత రెట్టింపు అవుతుంది. అశక్తులుగా భావించే వారు ఇలాంటి కథలు విన్నప్పుడు వారిలో మానసిక ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని నింపడానికి ఉపయోగపడతాయి.

## 2.4.3.3 కోతి కథ

ఆకుల విష్ణుమూర్తి, ఇటిక్యాల గ్రామం, రాయికల్ మండలం.

ఒక అడవిలో ఒక కోతి ఉంటది. కోతికు ముల్లుకు గుచ్చుతది. ముల్లుగుచ్చిన తరువాత కోతి, మంగలి దగ్గరకి వస్తది. తాత.. తాత.. నాకు తోకకు ముల్లు గుచ్చింది. కొద్దిగా ముల్లు తీయవంటది. సరే మంచిది తీత్తని చెప్పి తీయంగ తీయంగ ఆ ముల్లు అటే పోయేసరికి తోక తెగిపోతది. అయ్యో! రామ నాతోక తెగిపోయింది. ఎట్ల నేను అడవిలోకి పోవాలంటే నన్ను అందరు మొండి కోతి, మొండికోతి అంటారు. మరెట్ల కాబట్టి నాకు నేను గీ అడవిలకు పోలేను. నాకు కత్తన్న ఇయ్యి, గీ తోకన్న పెట్టియ్యి అంటే అయ్యో! నీకు తోక బెట్టియలేనుగని కత్తి ఇస్త తీస్కపో అని చెప్పి ఆ కత్తి ఇస్తడు. ఆ కత్తి తీస్కోని పోతూ పోతూ ఉండగా ఆ... ఆయిన పోతు పోతూ ఉన్నది కోతి. ఒక కుమ్మరి కుండల కోసం చేతి ద్వారా మట్టి తవ్వుతుండు మట్టి తవ్వితే తాతా చేతితోటి మట్టి తవ్వితే మట్టి అత్తద ఇగో నా కత్తి ఇత్త తీసుకో.. అని జెప్పి కత్తి ఇస్తది. కత్తితో దవ్వంగ దవ్వంగ కత్తి ఇరిగిపోతది. అయ్యో! నా కత్తి ఇరిగిపయో ఎట్ల ఇప్పుడు నాకు కత్తి అన్న ఇయ్యి, కుండన్న ఇయ్యి అంటది. అయ్యో! మరి నీకు కత్తి

ఇయ్యలేను గని కుండ తీసుకుపో.. ! అని చెప్పి కుండ ఇస్తడు. ఆ కుండ ఇచ్చిన తరువాత కుండ తీసుకొని పోతూ పోతూండగా ఒక తోటమాలి జామచెట్లకు నీళ్లు పోస్తుండు. జామ చెట్లకు నీళ్లు పోయ్యంగ పర్రె కుండవట్టి పోస్తుండు. ఆ పర్రె కుండలో పోస్తే తాత తాత నువ్వుగ పర్రె కుండలో పోస్తున్నంక, నేను మంచి కుండ ఇస్త పోసుకో అని చెప్పి మంచి కుండ ఇస్తది. మంచికుండ ఇచ్చిన తరువాత కుండ రెండు మూడు సార్లు పోసేసరికి కుండ ఇచ్చిపోతది. కుండ ఇచ్చిపోయినోల్లే అయ్యో! నా కుండ ఇచ్చగోట్టినవ్. నాకు కుండన్న ఇయ్యి పండన్న ఇయ్యి కుండన్న ఇయ్యి, పండన్న ఇయ్యి అంటే అయ్యో! నీకు కుండ ఇయ్యలేనుగని పండు ఇస్త పటు అని చెప్పి పండిస్తడు. ఆ పండు పట్టుకోని కోతి బజారుకెల్లి పోతది. పోంగ పోంగ ఒక ముసలమ్మ మనమరాలిని తోలుకోని పోతుంది. పోంగ పోంగ మనవరాలు ఏం జెత్తది. ఈ కోతివైపు చూసి ఆ పండును చూసి  జామ పండును చూసి అమ్మా! నాకు ఆ పండు గావాల్నే అమ్మా! నాకు గా పండు గావాల్నే అంటే అయ్యో పోరిల మన్నవడ నేను గిప్పుడు గా పండు ఏడికెల్లి తీస్కరావాలనే.. అంటే గదే పండు గావాలే? కోతి దగ్గర ఉన్న పండే గావాలె అంటే కోతి ఏమంటంది. ఇగో గీ పండు తీసుకో తిను అని చెప్పి పిల్లకిత్తది. పిల్ల తిన్న తరువాత అయ్యో మరి అమ్మ ఆ పండు తిన్నదిగ నాకు పొల్లనన్నియ్యి, నా పండన్న ఇయ్యి, పొల్లనన్న ఇయ్యి, నాకు పండన్నియ్యి అంటది. నేనిప్పుడు గీ పండు ఏడికెల్లి తీసుకురావాలె. పొల్లను తీస్కపో అని చెప్పినంక పోల్లను ఇస్తది. పొల్లనిచ్చిన తరువాత పొల్లను తీసుకోని ఆ.... పోతూ పోతూ ఉంటది. ఒకాయన గానుగు అడతడు. గానుగును ఎద్దుకు కండ్లకు కుడకలు కట్టి ఒక మనిషిని అటు కట్టి కడుతుండు. కట్టేసరికి ఆ ఎద్దును యిడుసి పెట్టు పొల్లను కట్టు తొందరగా అది అయితది. అన్నవోల్లే అయితే మంచిదని చెప్పి ఆ పొల్లకు కడతడు గానుగు. కట్టెసరికి నాలుగైదు చుట్లు తిరిగేసరికి పొల్ల సచ్చిపోతది. పొల్ల సచ్చిపోయిన తరువాత పొల్లనన్న ఇయ్యి నూనెనన్న పొయ్యి అంటే ఇగపొల్లను నేను ఏడికెల్లి తేవాలె. పొల్ల పానం పొయ్యింది గదా నూనె పోత్త పటు అన్నవోల్లే నూనె పొత్తడు. ఆ నూనె తీసుకోని బయలు ఎలుతది. బయలు ఎల్లేసరికి ఒకామె మంచిగ నీళ్లువోసి గారెలు చేత్తుంది. అమ్మా! నీళ్లతోని గారెలు చేత్తర. నేను మంచిగ నీకు నూనె యిత్త చేసుకో అన్నవోల్లే నూనె ఇత్తది. ఆ నూనెతో గారెలు జెత్తది. గారెలు చేసిన తరువాత అయ్యో! నా నూనె అయిపోయింది. మరీ గారెలన్న ఇయ్యి. నూనెన్నయ్యి. గారెలన్నయ్యి, నూనెన్నయ్యి. అంటే నీకు నేను నూనె తీస్కరాలేను. ఇగో గారెలు యిత్తున్న తీసుకో పో అని గ డబ్బల గారెలు పెట్టిత్తది. ఆ గారెలు తీసుకోని కోతి పరిగెడుతది. పరుగెత్తసరికి ఒక కాడ గారడి ఆట

ఆడిపిస్తుండు. తన కొడుకుతోడి తాడుకట్టి ఆట ఆడిపిస్తుండు. ఆట ఆడిపియ్యంగ ఆ పిల్లగాడు చూసి చూసి చూడంగ కోతి దగ్గర గారెలు చూత్తడు. నాన్న నేను ఈ తాడు మీదికెల్లి నడువలి అంటే ఆ గారెలు కావాలి కోతి దగ్గరివి అంటడు. అగో అక్కడున్నయ్. గారెలు నాకు ఒక గారెత్త నడుత్త అన్నవోల్లే ఆ గారె తీసిత్తడు. గారెప్ప తీసిచ్చినంక ఆ గారెప్ప తీసుకోని పొల్లగడు తింటడు. చూసేవాళ్లు గూడ అందరు మనిషి కోకటి తీసుకుంటరు. తినేసరికి ఈ గారడి ఆట అయిపోతది. మనిషికోక అయిదు కొత్తలు, పది కొత్తలు ఏత్తరు. ఏసిన తరువాత కోతి పంచాయితికి దిగుతది. గారడివానితోటి నాకు డోల అన్న ఇయ్యి, గారెలన్న ఇయ్యి అంటది. అన్నవోల్లే గారెలు ఇప్పుడు నేను యాడికెల్లి తీస్కరావాలె. డోలు ఇస్తపో అని చెప్పి డోలు వట్టుకోని పోతది. ఇగ పోయి అడవిలకు వోయ్యి ఓచెట్టు ఎక్కి ఇగ పాట పాడుతది.

ఏమని తోక వోయి కత్తి అచ్చే డోం డోం
కత్తివోయి కుండచ్చే డోం డోం
కుండవోయి పండచ్చే డోం డోం
పండువోయి పొల్లచ్చే డోం డోం
పొల్లవోయి నూనచ్చే డోం డోం
నూనెవోయి గారెలచ్చే డోం డోం
గారెలు వోయి డోలచ్చే డోం డోం

అని పాట పాడుతది. పాట వాడే సరికి ఆ చెట్టు మీదికెల్లి కిందికి చూస్తే నీళ్ళు ఉంటాయి. ఆ నీళ్లలా ఫోకస్ పడుతది కోతి బొమ్మది. కోతి బొమ్మ పడుతే నాలాగే ఇంకో కోతి ఉన్నదా అని చెప్పి అర్రు... అంటది. అది కూడా అర్రు అంటది. నువ్వెంత అంటే నువ్వెంత అని చెప్పి యాడికెల్లి దూకుతది. నీళ్లలో దూకి సచ్చిపోతది. సచ్చిపోవుదుతోనే ఈ కథ అయిపోయింది.

## కోతి కథ – కథావిశ్లేషణ

కోతి కథ ఇది ఒక విచిత్ర కథ అనే అనాలి. ఎందుకంటే మనుషులు, జంతువులు సంభాషించుకోవడం అనేది సహజంగా ఉండదు. కనుక ఇది విచిత్ర కల్పిత కథ. ఇలాంటివి చిన్న పిల్లలకు బాగా నచ్చుతాయి. కథ నచ్చడమే కాకుండా ఇలాంటి కథల వల్ల అసలైన కథల మీద ఇష్టాన్ని కలిగిస్తాయి. చిన్న పిల్లలకు అర్థం కాని కథలు చెప్పడం కన్న కథల మీద ఆసక్తి కలిగించే ఇటువంటివి కథలు చెప్పడం చాలా మేలు. వినోద భరితంగా, ఉల్లాసంగా, హాస్యాన్ని అందించేదిగా ఈ కథ

అందరికి అత్యంత ప్రీతిపాత్రమైనది. మనుషులు ఒక అల్లరి కోతి మాట్లాడుతూ అది చెప్పినదంతా విని చివరికి ఏదొక వస్తువును తిరిగి ఇవ్వడంతో కథ నడుస్తుంది. కథలో కోతి ఒక్కొక్క పాత్రకు వారి అవసరాన్ని గుర్తించి దాని దగ్గరున్న వస్తువులను ఇచ్చి సహాయం చేస్తుంది. అలా సహాయం చేసిందో లేదో తిరిగి దాని వస్తువులను అడుగుతూ మారం చేస్తుంది. మొదటగా కత్తి మంగలివానికి ఇచ్చి కుండ అడుగుతుంది. తరువాత కుమ్మరివానికి కత్తిచ్చి, కుండను తోటమాలికి ఇస్తుంది. జామ పండుని ముసలవ్వ మనుమరాలికి ఇస్తుంది. నీళ్లతో గారెలు చేస్తున్నామెకు నూనెనిచ్చి, ఆమె ఇచ్చిన గారెలను గారడి పిల్లవాని ఇస్తుంది. కోతి ఇలా ఆడక్కుండానే వారి అవసరాన్ని బట్టి ఒక్కొ వస్తువుని ఇస్తూ తనకు కావల్సిన వస్తువును తీసుకుంటూ వెళుతుంది. అసలే కోతి తోక తెగిన కోతి దాని ప్రవర్తనకు, పని తీరుకి పొంతన కుదరదు. డోలుని తీసుకొని డోలు కొడుతూ తాను చేసిన పనులన్నింటిని కలిపి పాట పాడుతుంది. చివరికి నీళ్లలో ఉన్న దాని ప్రతిబింబాన్ని చూసి తన శత్రువేమోనని భ్రమించి నీటిలో దూకి తన ప్రాణాలు తానే తీసుకుంటుంది. మూర్ఖుని స్వభావాన్ని చిత్రిస్తూ, హాస్యాన్ని పోషించిన ఈ కథ కాలక్రమంలో వివిధ మార్పులకు లోనయి ఉంటుంది.

## 2.4.3.4 పిసకొడుకు

కైరం లక్ష్మి, బతికెనపల్లి గ్రామం, రాయికల్ మండలం.

ఒక తల్లి, కొడుకులు ఉంటరు. ఇగ అవ్వ అవ్వ అత్తగారింటికి పోత అని చెప్పి అంటే వోయిరా కొడుకా. పోతే పోగాని అంగ్యాలు తిరుగు కొడుకా అని చెప్తది తల్లి. అంగ్యాలు తిరుగు కలోగంజో తాగిరా అత్తగారింటికాడ బాగా బిర్రువోకు అంటే ఏ...! మంచిది అని చెప్పి చెప్పి వీడు పోత ఉన్నడు. పోతవుంటూ వుండంగ ఇగ అక్కడికి రబ్బి సేను, జొన్న సేన్లు. రబ్బి సేన్లలకెల్లి అంగుకుంట లేసుకుంట పోతుండు. ఆళ్లు చూసి అరె నిన్న మొన్నే పిస్కిలు వోయినవి రబ్బులు పోయినయి. ఈడే దొంగ ఉన్నట్టుండు రా అని చెప్పి వీన్ని తీసి కట్టెత్తరు. కట్టేసేసరికి ఆ...! నువ్వేరా దొంగ అది ఇది అంటే అరె నేను ఎందుకు దొంగను. నేను మా అత్తగారింటికి వోతున్న మాయవ్వ అంగ్యాలు తిరుగుమన్నది. అంగ్యాలు తిరుగుడు అంటే మన గిట్ల అంగుకుంట, లేసుకుంట పోవుడు కావచ్చు. నేను అనుకున్న అంటే అరె పిసోడు. అంగ్యాలు తిరుగుమన్నది. కలోగంజి తాగుమన్నది. అంటున్నవ్ కదరా.. అంటే ఏది పెడితే గదే తినాలి. ఏంజేయ్యాలె ఆళ్లకు లొంగినట్టు ఉండాలి రా.. అంగ్యాలు తిరుగుడంటే. నువ్వు పిసోడివి! గిట్ల చేసినవ్! అని చెప్పి జెప్పి అరె పిసోదున్నట్టు ఇడుసుపెట్టుర్రి అన్నంక ఇడిసి పెడతరు.

ఈడు సక్కగా పోతడు. అత్తగారింటికి పోయి అగో! అల్లుడు అచ్చిండు. అని చెప్పి అత్త ఏంజేత్తది. మంచిగ కోడిని కోత్తది. గారెలు జెత్తది. మంచిగ పూరీలు జేత్తది. తిను అల్లుడంటే అని అంటే ఏ అద్దు నాకు కలో గంజో పోయ్యి, నాకు కలో గంజో పోయ్యి అని ఈడు అంటడు. అంటే అరె! నీవ్వ ఈన్ని ఈనింట్ల పినుగెల్ల గారెలు. కోన్ని ఇవన్ని తయారుచేసి ఈనికి పెడితే ఈడేమో గారెలు గావాలనడు, కోన్ని కావలనడు. ఆ.. కలోగంజి అంటడు. అని చెప్పి అన్నంక సరె ఆనికి కలోగంజి కావాల్నట. అన్నంక కలోగంజో వోత్తరు. ఆ కలోగంజో తాగుతడు. తాగి అత్తడు ఇంటికత్తడు. అవ్వ అవ్వ నేను వోయిన మా అత్త కలోగంజో పోసింది. గారెల చేసినా, పూరీలు చేసిన, కోన్ని కోసిన, తాల్పన్నము అండిన ఇగ నేను కలోగంజి అంటే కలోగంజే తాగిన. అర్రె పిసముండ కొడుకా! నువ్వు గిట్ల చేత్తవ్ రా..! నువ్వు మంచిగ గారెలు, కోన్ని మంచిగ కమ్మగ తినాలి గని, గ కలోగంజి తాగుతవురా..? ఎది వోత్తే అది తాగుమన్న గంత మంచిగ జేసిర్రి. చేసినప్పుడు తినద్ద పిసోడా. అన్నంక బాంచోతు! నేను మల్లవోత అని మల్లపోయిండు. మల్లబోయేసరికి ఆళ్ల ఇల్లు కాలిపోతుంది. ఆళ్ల ఇల్లు కాలిపోయి ఉంటే ఈడేంది. నాకు కోన్ని కోయిర్రి, గారెలు చేయిర్రి. అని ఈడు అంటుండు. నీవ్వ ఈడు పిసోడు ఉన్నడు. ఒక చెంప మీదికెల్లి ఒకటేత్తరు. ఏసి ఇటు అమ్మా నేను వోయిన ఆళ్ల ఇల్లు కాలిపోతుంది. ఇల్లు కాలిపోతే నేను గారెలు, కోడిని కావాలన్న. అరె పిసోడా ఆ ఆసం, ఈ ఆసం పీకేయ్యాలి, ఆ కమ్మలు పీకేయ్యాలి. ఈ కమ్మలు పీకేయాలి గని నువ్వు గారెలు చేయి, కోడిని కోయి అంటవ్ రా...! పిసోడా అని చెప్పి తల్లి అంటది. అంటే నే బంచోతు! మల్ల పోత అని చెప్పి మళ్ల పోతడు. మల్లపోయేసరికి ఆళ్లు మంచిగ గుడిసే కప్పుకున్నరు. కప్పుకొని ఆళ్ల పెద్ద బిడ్డకు ఒకటి మన బామ్మర్దులుంటరు గద బామ్మర్దులోల్ల బిడ్డకు అది వరపూజ పెట్టుకుందామని చెప్పి వాళ్లు కర్జూరపు పండ్లు అవి ఇవి ఆళ్లు పెట్టుకుంటుర్రు. పెట్టుకుంటే ఈడువోయి ఆ కమ్మ తీసేస్తుండు. ఈ ఆసం పికేత్తుండు. ఆ ఆసం పీకేత్తుండు. ఈ కమ్మ తీసేస్తుండు. అరె ఈన్ని ఈడు గిట్ల చేత్తుండేందిరా అని చెప్పి చెంప మీదికెల్లి చెడిల్లుమని కొడతడు. ఆడు మల్ల అత్తడు. అమ్మ అమ్మ నేను పోయ్యేవరకల్లా ఆళ్లు పోకలు, కర్జూరపు పండ్లు ఆళ్ల బిడ్డ పెండ్లట పెట్టుకుంటుర్రు. ఆ కమ్మలు ఈ కమ్మలు అన్ని పికేసిన అంటే అయ్యో! ఆ కమ్మలు ఈ కమ్మలు పికేత్తవ్ రా పిసముండకొడుకా.. ! నువ్వు ఆ బామ్మర్దిని ఇంత బుకా, ఈ బామ్మర్ది మీదింత బుకా పోయ్యాలగని గట్లే జెత్తవ్ రా. అన్నంక మంచిది నేను మల్ల వోత అని చెప్పి మల్ల అచ్చిండు ఆడు. అక్కడికెల్లి మల్లచ్చిండు. మల్లచ్చేవరకల్లా ఈళ్ల ముసల్ది సచ్చిపోయింది. ముసలిదాన్ని

ఎత్తుకపోతుర్రు. ఈడు ఈ బామ్మర్ది మీద ఇంత బుకా వోత్తుండు. ఆ బామ్మర్ది మీద ఇంత బుకా వోత్తుండు. ఆళ్లు చెంపమీదికెల్లి చెడిల్లుమని చంపిరి. నీవ్వ ఈడు బుకవోత్తుండు. ఈనికి పిస వట్టింద? అన్నంక అమ్మ అమ్మ నేను ఆడికివోయినంక ఆ బామ్మర్ది మీద యింత బుక, ఈ బామ్మర్ది మీదింత బుకవోత్తే ఆళ్ల ముసల్ది సచ్చిపోయిందట. ఆళ్లు చెడిలుమని సంపిర్రే.. అమ్మా! అంటే గట్ల ఆ బామ్మర్దిని పట్టుకోని ఏడువాలె? గట్ల చెయ్యాలిగని గిట్ల జెత్తవ్ రా...! పిస గాడిదికొడుకా..! అని చెప్పి తల్లి అంటది. బాంచోతు! నేను మల్ల వోత మల్ల పోయేవరకల్లా ఆళ్లు ఒక ఇల్లు కట్టుకున్నరు. పెద్ద బామ్మర్ది ఇంట్లకువోతే ఆ బామ్మర్దిని పట్టుకోని ఏడుతుండు. ఈ బామ్మర్దిని పట్టుకోని ఏడుతుండు. అరె గీ గాడిద కొడుకు ఏమైనగని గిట్ల జేత్తుండు ఏందిరా అని చెప్పి చెట్టుకు కట్టెయిర్రా..! అని చెప్పి చెట్టుకు కట్టేత్తరు. కట్టేసినంక ఆడు ఫస్ట్ కానుంచి అంత చెప్పుకత్తడు. గిట్ల గిట్ల సంగతి అని అంగ్యాలు తిరుగమంటే నేను జొన్న సేన్ల కెల్లి అంగ్యాలు తిరుగుతే ఆళ్లు కట్టేసిర్రు. మళ్ల మీరు కట్టేతుర్రు. మా అవ్వ గిట్ల చెప్పింది అంటే అరె పిసోడా! నువ్వు గట్ల కాదురా అసలు కథ గిదిరా...! అని చెప్పి చెప్పి ఆళ్ల అవ్వ ఆడ చెప్పినకొద్ది ఈడు ఇంట్ల ఇక్కడ రివర్స్ చేసిండు. అని చెప్పి అప్పుడు ఇడిసి పెడతరు.

## పిసకొడుకు – కథావిశ్లేషణ

ఒక అమాయకుని మనస్తత్వంతో, అతని ప్రవర్తనతో కొంత నీతిని, సందేశాన్ని అందించిన కథ 'పిసకొడుకు' కథ. కథాగమనంలో అల్లుడు పాత్ర చేసే చేష్టల వల్ల కథలో హాస్యరసం పండుతుంది. పూర్వం అత్తగారింటికి వచ్చిన అల్లుడిని అతిథి మర్యాదలను చేసి సత్కరించే ఆచారం ఉంటుంది. అలాగే ఈ కథలో కూడా అత్తగారింటికి వచ్చిన అల్లుడిని అతిథిగా భావించి బాగా చూసుకోవాలని అను కుంటారు. అమాయకుడైనా అల్లుడు వాళ్ల తల్లి చెప్పిన మాటలను సందర్భోచితంగా ప్రయోగించక నానాతంటాలు పడుతుంటాడు. అటు వెర్రివాడిలాగా అత్తగారింట్లో, అమాయకుడిగా తల్లిదగ్గర ఉంటూ స్వతంత్ర ఆలోచన లేకుండా విచిత్రమైన పనులు చేస్తుంటాడు. సందర్భానికి అనుగుణంగా నడుచుకోని అల్లుడి చర్యల వల్ల అందరిలో నవ్వులపాల అవుతాడు. తనకు తోయక ఇతరులు చెప్పింది వినక అయోమయంగా, గందరగోళంతో అమాయకమైనపాత్రగా పిసకొడుకు చిత్రించబడతాడు. సమాజంలో అందరూ తెలివైన వారుండరు. కొంతమంది బుద్ధిమాంద్యులకు సమాజంలో నడుచుకునే విధానంపై, మంచి నడత నేర్పేందుకుగాను ఇలాంటి కథలు జానపదులు కల్పించారేమోనని అనిపిస్తుంది. వారి ప్రవర్తనలో మార్పుకు, తెలివితేటలను పెంచడానికి ఇలాంటి కథలు మంచి ఉదాహరణలుగా

పనికివస్తాయి. బాల్యం నుంచి ఇలాంటి కథలు చెప్పడం వల్ల వారి ఎదుగుదల సమయంలో ఏవిధంగా పెద్దవాళ్లతో నడుచుకోవాలో అన్న విషయం కన్నా, ఏవిధంగా నడుచుకోకూడదనే విషయమే స్పష్టంగా తెలియవస్తుంది.

1. ఈ కథలో కన్నతల్లి నిత్యం తన కొడుకు చేసిన తప్పులను సవరిస్తూ, అమాయకుడైన తన కొడుకు అత్తగారింటికి పోయే సందర్భంలో నడుచుకోవాల్సిన విధానాన్ని చెప్పి పంపుతుంది. మనం పుట్టుక దగ్గరి నుంచి పెరిగి పెద్దయ్యే వరకు తల్లియే ఆది గురువు అనేది నిత్యసత్యంగా నిరూపించింది ఈ కథ.

2. ఏ సామాజిక వ్యవస్థలో ఆచారాలు, సంస్కృతి సంప్రదాయాలు, కట్టుబాట్లు అనేవి వారి జీవన విధానంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంటాయి. వాటికి అనుగుణంగా మనం మెలుగుతూ ఉండాల్సిందే. ఈ కథలో కూడా అత్తగారింటికి వెళ్లిన పిసకొడుకు వింత వ్యతిరేక చేష్టలు, వారి సంప్రదాయాలకు విరుద్ధంగా ఉండటం వల్లనే అల్లుడని చూడకుండా అతడిని చెట్టుకు కట్టేస్తారు. దీన్ని బట్టి సంస్కృతి సంప్రదాయాలపై మనకున్న విలువలు తెలుస్తాయి. వారు మొదట లోకానుభవం లేని అల్లుడి ప్రవర్తన చూసి విసుక్కుంటారు. అలా ఏమి తెలియని వెర్రిమాలోకమైన కథానాయకుడు పిసకొడుకు పాత్ర వల్ల హాస్యాన్ని కల్గిస్తూ, వినోదభరితంగా ఉండటమే కాకుండా అమాయకుల ప్రవర్తనలో మార్పుని ఆశించి రూపొందించిన కథగా చిత్రించబడింది.

## 2.4.3.5 దారి మరిచిన ద్వారక

జాడి రాజన్న, ఆరపల్లి గ్రామం, ధర్మపురి మండలం.

ఒక కాపు రైతు. రైతు కొడుక్కి చిన్నప్పుడే పెండ్లి చేసిండు. చేసినంక ఏమయ్యిందిగ ఆ పొల్లగాడు దుడ్డెలు కాసుడు. పోతండు అత్తండు. అయ్యా అవ్వ..! నాకు లగ్గం జెత్తవా? అని అడిగిండట బిడ్డా నీకు చిన్నపుడే లగ్గం చేసిన కని అత్తగారిది ఏ ఊరంటే ద్వారక. బిడ్డా పోయి తోలుకచ్చుక పోరా లగ్గం చేసిన తండ్రి అన్నడు. అయింత ఏం చేసిండు అత్తగారింటికి పోత పోయి నా భార్య తెచ్చుకుంట అనుకున్నడు. మధ్యల గంగ అడ్డం ఉంది. ఆ గంగదాటి పోవాలి. దారక దారక అనుకుంట పోతండు. పోయేడివరకు గంగ దాటాలి. మరి మునుగుతే ఈడు మరిసిపోతవ్ గనుక పోయిండు పోయిండు. అయింత గంగానది పాయలకు పోయిండు. మునిగిండు. నోట్లో నీళ్లు సొచ్చినయి. దారక దారక పోయి బుర్క బుర్క అయింది. ఆని అత్తగారి ఊరి పేరు మరిచి పోయిండు. బుర్క బుర్క అని ఒడ్డెక్కిండు. అడేం ఏం చేసిండు. పోయి బ్రామ్మడు బుర్కల మీద పెట్టుకున్నడు. ఆడేం ఏం చేసిండు కదా పాంజాల పడేటి

బురలకలన్ని లేచిపెయినయి. ఓ లంజకొడుకా! నువ్వ్ బుర్క బుర్క అనుకుంటే లేచిపెయినయి. నువ్వ్ బుర్క బుర్క అనుకుంట పోతే నా బుర్కలన్ని లేచిపెయినయి. నీ అవ్వ! ఇట్ల పోకట కుదరదు. అని చెప్పి ఆన్ని ఐదారు గుద్దిండు. అయ్యా! మరి ఏం అనుకుంట పోవాలంటే అడ్త్ తుడ్త్ అనుకుంట పో అన్నంక ఈడు ఆడ్త్ తుడ్త్ అనుకుంట పోంగ పోంగ నట్టనడివిల పిట్టలన్ని ఎగిరిపెయినయ్. పిట్టలు పట్టేటోడు ఈన్ని తిడతడు. మరి ఏం అనాలని వాన్ని అడిగితే పిట్టలోడు ఇది పడని ఇంకోటి పడని అను అంటడు. పోంగ దారిల వర్షం పడ్డది. ఆ వర్షంల బండి ఒక కచ్రంబండి దిగబడ్డది. వీడేం చేసిండు. ఇది పడని ఇంకోటి పడని అనుకుంట పోతుండు. దిగి కచ్రపోని దగ్గరికి వోయి ఇది పడని ఇంకోటి పడని అంటూ ఆడు ఇగ ఇది పడే ఇంత కష్టమైతుంది. ఇంకోటి పడని అంటవ్ రా..! అని మల్ల ఐదారు గుద్దిర్రు. వాడు అది ఎల్లని ఇంకోటి ఎల్లని అనుకుంట పో అన్నడు. వాడు చెప్పితే సరే చింతగూడ దగ్గర సచ్చిపోయిన శవం ఒకటి ఎత్తుకొని పోతుర్రు. ఈడు ఆడికి వోయి అది ఎల్లని ఇంకోటి ఎల్లని అంటుండట. వీడన్నది విని అరెయ్.. మనిషి సచ్చిపోయి వుంటే ఇంకోడు చావాలని అంటవ్ రా అని ఇట్ల అనద్దు రా అని నలుగురు దంచిర్రట. మల్ల ఏం అనాలయ్యా అంటే రామా రామా ఇసొంటి కార్యం జరుగద్దు అంటే మనిషి చచ్చిపోవద్దు అనే అర్థంల చెప్పిండు. మల్ల ఈడు ఊళ్లెకు పోతుండు. ఆ ఊళ్లె ఒక్కడే కొడుకు పెళ్లి జరుగుతుంది. ఆడికి వోయి రామా రామా ఇసొంటి కార్యం కావద్దన్నడట. వీడు అక్కడోళ్లు అందరు కలిసి బాగా కొట్టిరట. ఇట్ల దెబ్బలు తినుకుంట పోతున్నవ్ ఏం రా అని ఒక పెద్ద మనిషికి అచ్చి ఇది ఏందిరా నీకు తన్నులు తినే బుద్దేనా రా అయ్యా! బాంచెన్ ఇంటికి మా అయ్యా అమ్మలను అడిగిన అత్తగారు ఊరు గీ ఊరన్నరు. అనుకుంట అచ్చి గంగల నీళ్లల మునిగి పేరు మరిసిపోయిన ఎట్టనయ్యా నేనత్తగారింటికని బయలెల్లినా నా సంతంగా ఏమనలేదయ్య అని చెప్పి ఆ పెద్ద మనిషికంత చెప్పిండు బిడ్డా మీ అత్తగారు ఊరు పేరు ఏందిరా అంటే మరచిపోయిన మరి ఎక్కరా అంటే మల్యాల, పాలసముద్రం, రాంపూర్, తాళ్లపేట అంటే అయ్యో నాకు యాది లేదు. ఏం అని చెప్పాలి. వీడు అనుకుంట అనుకుంట మీ అత్తగారిది దారకనారా అంటే ఆ... ఆ...! దారక దారక అని సప్పట్లు కొట్టుడట. అట్లయితే దారకకు తోవ గిట్టని చెప్పిండట. అప్పుడు దారకవోయి అత్తగారింటికివోయి అత్త మామలను, బామ్మర్దులను కలిసి దావద్ చేసుకొని అచ్చి మంచిగ బతికిండట.

## దారి మరచిన ద్వారక – కథా విశ్లేషణ

ఒక మతిమరుపున్న కొడుకుకి బాల్యంలో పెళ్లి జరుగుతుంది. ఆ విషయం తల్లిదండ్రుల ద్వారా తెలుసుకొని తన భార్యను తీసుకురావడానికి అత్తగారి ఊరైన ద్వారకకి బయలుదేరతాడు. కొన్ని గ్రామాలు దాటిన తరువాత గోదావరి నది అడ్డం వస్తుంది. ఆ నది దాటుతూ వెళుతుండగా అతని మతిమరుపు వల్ల అత్తగారి ఊరి పేరు మరచిపోతాడు. నీటిలో మునుగుతూ ఉంటే బుర్క బుర్క అని వస్తుంది. అదే పదం అనుకుంటూ పోయి బూరలు అమ్మేవాడి దగ్గరికెల్లి దెబ్బలు తింటాడు. తరువాత బూరలు అమ్మేవాడు చెప్పిన ఆడ్త్ తుడ్త్ అనుకుంట పోయి మరొక చోట దెబ్బలు తింటాడు. ఇలా అతను పోయిన చోటల్లా సందర్భానికి వ్యతిరేకమైన మాటలతో అనుకరిస్తాడు. ఎక్కడ వాళ్లు చెప్పింది మరచిపోతానో అని అత్తగారింటికి చేరుకోవడం ఇబ్బంది అయితుందోనని వాళ్లు చెప్పిందల్లా గట్టిగా బయటకు మననం చేసుకుంటూ వెళతాడు. అతను వెళ్లిన ప్రతిచోట ఆయన అన్న మాటకు వ్యతిరేకమైన కార్యక్రమాలు జరుగుతుంటాయి. దాంతో అమాయకుడైన అతన్ని అందరు దెబ్బలు కొడతారు. చివరికి ఒక ముసలివాడు వచ్చి ఆ ప్రాంతంలో ఉన్న పలు గ్రామాల పేర్లు చెప్పేసరికి అతని అత్తగారి ఊరు ద్వారక అని తెలుసుకొని ద్వారకకు చేరుకుంటాడు.

1. బుద్ధి తక్కువ పనుల వల్ల, బుద్ధి మాంద్యులు పడే ఇబ్బందులను ఈ కథ చిత్రించింది. దీని వల్ల శ్రోతలు ఏ సందర్భంలో ఎలా ప్రవర్తించకూడదోనన్న హితవు బోధపడుతుంది. ముఖ్యంగా పిల్లల్లో జ్ఞాపకశక్తి కోల్పోతే జరిగే దుష్పరిణామాలేంటో అర్థమయ్యేలా చేస్తుంది ఈ కథ. కొంత హస్యాన్ని, కొంత విజ్ఞానాన్ని ప్రసాదించే ఇలాంటి జానపద కథలు మనో వికాసానికి తోడ్పడే గుళికలాంటివి.

2. ఈ కథలో ప్రస్తావించిన గ్రామాల పేర్లు గోదావరి తీరం ప్రాంతంలో ఉంటాయి. రెండు జగిత్యాల, మంచిర్యాల జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో జరిగిన సంఘటన వల్ల ఈ కథ ఆ ప్రాంతంలో కల్పించబడి ఉండవచ్చు. అంతేగాదు ఆ రెండు ప్రాంతాల్లో ప్రజలు బంధుత్వాలు కలుపుకోవడం, వివాహా సంబంధాలు ఏర్పరచుకోవడం, రాకపోకలు, ఇచ్చిపుచ్చుకోవడం లాంటి కార్యక్రమాలు విరివిగా చేసేవారు. నేటికి గోదావరి నది దాటి నిత్యం పాలు, పండ్లు, కూరగాయలు తీసుకువచ్చి అమ్మడం, ఇతర వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తూ ఉంటారు.

3. పూర్వ బాల్యవివాహాలు వీపరితంగా జరిగేవి. అందుకు నిదర్శనం ఈ కథ ఆదిలోనే నీకు చిన్నప్పుడు వివాహం అయిందని తల్లిదండ్రులు మతిమరుపున్న కొడుక్కి గుర్తుచేస్తారు. బాల్యంలో వివాహం చేసి

యుక్త వయస్సు రాగానే భార్యని అత్తగారింటికి తెచ్చుకునే సంప్రదాయం ఉంది కాబోలు చాలా కథల్లో ఇలాంటి ప్రస్తావనలు కనిపిస్తాయి.

## 2.4.3.6 అత్తిచ్చిన అప్ప

కైరం రమణ, బతికెనపల్లి గ్రామం, రాయికల్ మండలం.

ఒక ముసలమ్మ. అయింత ఆమెకు ఒక్కడే కొడుకు. ఒక్కడే కొడుకైతే చిన్నప్పుడే లగ్గమయితది. లగ్గమయినంక అయింత కొడుకు జూడకపోయేసరికి. కోడలికి రోజు చలి గంజి పోత్తది. చలి గంజి పోత్తే ఇన్నిన్ని మెతుకులు పడితే దాసిపెట్టుకుంది. దాసి పెట్టుకున్నంక అయింత ఒకనాడు అప్పలు జేత్తది. అప్పలు చేత్తే కొడుకు తింటడు. కోడలుకేమో కప్పనిత్తది. కప్పని దొరక పట్టించినంక ఇగ రోజు కప్పకు మెతుకులు తినుపెంచుకుంట ఆడుకుంటది. ఎంటుకలు ఇరపోసుకోని మా అత్త ఇచ్చిన కప్పలు కండ్లున్నయ్. నోరున్నయ్ జజ్జెనక జం జం.! తినిపించుకుంటూ ఆడుకుంటది. ఆడుకున్న అయింత అటని ఇటని పెద్ద పెరుగుతది. పెద్ద పెరినంక కొడుకా కొడుకా నీకు ఈ పిల్ల అద్దు. ఆ పోరి పొట్టిగ ఉన్నది. ఏం మంచిగలేదు. వేరే పిల్లని చేసుకత్త అంటే సరే మంచిది అవ్వ అంటడు జోరుదారు తయారయితరు. తయారయ్యి ఇగ అయింత ముసల్ది తయారయ్యి సొమ్ము సీమంతాలు అన్ని పెట్టే ఇగ పెట్టి పోతరు. పోంగ పోంగ ఒక నీడ కాడ కూసుంటరు. కూసున్నంక అవ్వ అవ్వ నేను ఇంటిక్కాడ తువ్వాల యాది మరిసిన మల్ల తెచ్చుకుంట. సరే మంచిది కొడుకంటడు. అన్నంక ఈడ కచ్చేవరకల్లా తలుపులు ఏసుకుంటది. ఎంటుకలు ఇరవోసుకుంటది. ఆ మెతుకులు తినిపించుకుంటా ఆడుకుంటది. ఆడుకొంగనే మా అత్తచ్చిన కప్పకు కండ్లున్నయ్.. కాళ్లున్నయ్..... నోరున్నది.... జజ్జెనక జం జం... అని తినిపించుకుంట ఆడుకుంటది. ఆడుకోని అయింత తలుపు పెడతది. తలుపు పెట్టినంక అయింత తలుపుతీత్తడు. ఇప్పుడు పాడిన పాట పాడంటే ఆ.. నేను పాడ ఆ.. నేను పాడ.. అంటది. ఇగ పాడుతది. ఏడుసుకుంట పాడుతది. మా అత్త ఇచ్చిన అప్పకు కండ్లున్నయ్. కాళ్ళున్నయ్.. నోరున్నయ్... జజ్జెనక జం జం.... జం జం...! ఆడుకున్న అని ఏడ్తది. ఏడకు ఏడకు.. గిట్ల సలిగంజి వోసింది. ఎన్నడన్న మెతుకులు దొరికితే దాసి పెట్టుకున్న. అప్పను చేసి కప్ప దొరక పట్టించింది. అన్నంక సరే మంచిది నువ్వు ఏడకు ఏడకు.. అన్నంక దుకాణానికి వోయి సామాను తెచ్చి ఇగ తయారయినంక ఎనుకకు పోయ్యి వెడతరు. అయింత అప్పలు జెసుకుంటరు. అప్పలు జెసుకోని ఈ కొడుకు పోతడు. కొడుకు వోయి అవ్వ అవ్వ మనింట్ల దొంగలు పడ్డరు. చుద్దాం ప.... అంటడు. అవ్వల్లో..! నా అయ్యాల్లో....! నా

ఇల్లు మునిగిపాయే అని అయింత చాతంత గుద్దుకొని అచ్చేవరకల్లా కతం ఇంటెనుక చెట్టెక్కి సుత్తడు కొడుకు. కొడుకు ఎక్కిండు గదని తల్లి కూడ ఎక్కుతది. నన్ను ఎక్కియిరో ఎక్కియిరో అని మొత్తుకుంటది. అయింత ఎక్కిత్తడు. ఎక్కంగ ఎక్కుతదిగని అయింత కొడుకు దిగి ఇంటెనుక కూసోని అప్పలు జెసుకుంట కూసుంటడు. కూసున్నంక మల్ల అయింత నావ్వో మల్ల అత్త మొత్తుకుంటది. అయింత దిగవోతది. దిగేవరకల్లా కిందవడి సచ్చిపోతది. సచ్చిపోయినంక అయింత తల్లిని పారేసి అచ్చి అయింత చేసి ఇగ పెండ్లాం, మొగుడు మంచిగ ఉంటరు.

## అత్తిచ్చిన అప్ప – కథావిశ్లేషణ

చిన్న వయస్సులో పెళ్లి జరిగిన ఒక అమాయకపు స్త్రీ కి వాళ్ల అత్త పెట్టే ఇబ్బందులను చిత్రించింది ఈ కథ. ఎదగని వయస్సులో పెళ్ళి చేసుకొని అత్త పెట్టే కష్టాలను భరిస్తూ జీవితాన్ని గడుపుతుంది. కొద్ది రోజుల తర్వాత భర్తకు తాను పడుతున్న కష్టాలను తెలియజేసి తన భర్తను మార్చుకుంటుంది. జానపదులు వివాహ విషయంలో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతాయి. కుల ఆచారాలు, మత సంబంధితాలు, మూఢవిశ్వాసాలు, నమ్మకాలు మొదలైనవి విషయాల్లో పట్టింపులు చాలా ఉంటాయి. అభంశుభం తెలియని బాలలకు వివాహం చేస్తారు. ఆ వివాహ సంబంధాల్లో కొన్ని మాత్రమే శాశ్వతంగా నిలిచి ఉంటాయి. ఈ కథలో కూడా చిన్నతనంలో వివాహం చేసుకున్న అమ్మాయి జీవితాన్ని అత్త దుర్భలంగా చేయటానికి ప్రయత్నిస్తుంది. కానీ అర్థం చేసుకునే భర్త దొరకటం వల్లనే తన జీవితం చక్కదిద్దగలగుతుంది. అత్త అరిసెప్పలు చేసుకొని కొడుక్కి పెడుతుంది. కోడలుకి మాత్రం కప్పని ఇస్తుంది. అరిసెప్పకు బదులుగా కప్పని ఇస్తే తాను ఆ కప్పతో ఆడుకుంటుంది. తన భర్త ఒంటరిగా వచ్చినప్పుడు తన బాధను పాట రూపంలో భర్తకు తెలియజేస్తుంది. అత్త కోడలు, లేదా కోడలు అత్త, ఈ ఇద్దరిలో ఎవరొ ఒకరు అధికృత ప్రదర్శిస్తారు. రెండు మనస్తత్వాలు కలిసే అత్త, కోడలు చాలా అరుదు.

జానపద కథల్లో ఎక్కువగా స్త్రీ సంబంధిత కథలు ఉంటాయి. వాటిలో అత్త, కోడళ్ల కథలే మరీ ఎక్కువ. ఏ కాలమయినా ఇంటికి అత్తదే పెత్తనం అని కూడా అంటారు. పై కథలో కూడా అత్త అమాయకురాలైన కోడల్ని నానా మాటలు అనడమే కాకుండా ఆహార, ఆరోగ్య విషయంలో చిన్న చూపు చూస్తుంది. ఎదురించే దైర్యం లేని కోడలు అన్ని బాధలని భరిస్తుంది. కొడుక్కి తెలియకుండానే బాగా చూసుకుంటున్నట్లు నటిస్తుంది. కొడుకు మాత్రం తన తల్లి తన భార్యను చూసుకోవడం లేదని

గ్రహిస్తాడు. పెళ్లి సంబంధం తెస్తానని పోతున్న సందర్భంలో దారిలో మన ఇంట్లో దొంగలు పడ్డారని చెప్పి తల్లిని చెట్టు ఎక్కిచ్చి కింద పడేలా చేస్తాడు. తర్వాత ఇంటికి వచ్చి తన భార్యను బాగా చూసుకుంటాడు. తన భార్యపై ప్రేమతో బాధ్యత కలిగిన వ్యక్తిగా ప్రవర్తిస్తాడు. అర్థం చేసుకున్న భర్తతో కలిగే ప్రయోజనమేంటో ఈ కథ వల్ల తెలుస్తుంది.

## 2.4.3.7 రాజు పతాని లగ్గం సోకు

రాజారపు రాధ, తాటిపల్లి గ్రామం, జగిత్యాల.

ఒక రాజు  ఒక పతాని అయింత రాజుకు చిన్నప్పుడే లగ్గం అయితదట. చిన్నప్పుడే లగ్గం అయితే ఎన్నడు పోరు. ఎన్నడు పోక పోయేసరికి దొడ్డెడు ఆవులు, దొడ్డెడు బర్రెలు, గొర్లు, మేకలు అన్ని బాగుంటయి. బాగుంటే ఏంజేత్తడు ఆని చేతుల కింద వున్నోడుకి లగ్గం జేయ్యాలె గదా. లగ్గం జేయ్యవయ్య. ఏ ఆగువయ్య  నాకు పెండ్లీ జేయ్యవయ్య. ఏ అగువయ్యఅని గట్లనే గడుత్తది ఏండ్ల కొద్ది. నువ్ నన్ను గిట్ల జేత్తునవ్ అని అయింత ఆవులు, మేకలు, గొర్లు అన్ని ఉంటాయి. అరేయ్ నీళ్లు వెట్టినవురా, వెట్టినయ్యా...!  మూతులు మీదికే గట్టుడు. నీళ్లు లేవ్ మేత ఏసుడు లేదు. నీళ్లు పెట్టుండు లేదు. బర్రెలకి, ఎడ్లకు. నీళ్లు వెట్టినవరా పెట్టినయ్యా. మేత ఏసినవురా ఏసినయ్యా. ఇట్ల చెప్పుడు. ఇగ ఇగ ఒక్కొక్కిటి అన్ని చచ్చిపోతున్నయి. మూతులు బిగిత కట్టినంక అవేం తింటయి. అయింత గిట్ల గడుత్తంది. గడవంగ గడవంగ అన్ని చచ్చిపోతున్నయి. గిట్లేందుకు చచ్చిపోతున్నాయి రా అంటే ఏమయ్యో నాకేం గుర్తు. అని అన్నంక అయింత ఈనికి అత్తగారింటికి వోవుడు పడతది. అత్తగారింటికి పోతడు నాకు లగ్గం జేయ్యమంటే జేత్తలేవు. ఆగువయ్యా.. ఆగువయ్యా.. అని అంటవ? నీ సంగతి జూత్త అగు అని అత్తగారింటికి వొయివంక. మంచిగ ఇగ ఎన్నడు రాని అల్లునికి మంచిగ అన్ని తీరులు చేసి పెడతరు గద! గారెలు, బూరెలు అన్ని చేసిపెట్టింది. అన్ని జేసెవరకల్లా పాలేరు పాలేరేనయే.. బయటనే కూసుంటడు ఆనికి ఏదో ఉన్నది వెడితె తింటడు లేకుంటే ఊకుంటడు. అయింత అల్లునికి మంచిగ తినవెట్టి పండవెడతరు. పండవెట్టినంక అయింత కమ్మగ తిని పండ వెడతరు. ఏది ఏమన్నగని అయింత కడుపు అయితే నిండింది. ఇగ ఆడు బయట పండే, ఈడు లోపల పండే. ఇగ కడుపంత గలగల అంటుంది. అరె ఎట్లరా పాలేరా అంటే ఏ అగువయ్యా.. మల్ల పంటడు. పన్నంక మల్ల ఏం జేత్తడు. మల్ల కొంచెం పండెవరకల్లా కడుపంత గలగల అనవట్టే ఏ అగువయ్యా... అన్న కొద్ది  ఇట్ల గడుత్తది. ఇగ ఎట్ల జేసుడు ఏం కథ అటు ఇటు అని పానం మీది కొచ్చె. ఇగ అగుతలేదు వానికి. ఇగ

ఎట్లా పోతది. ఇగ ఒక అలుకు కుండ జూసి అయింత పోతడు. అలుకు కుండ నింపె నింపినంక మల్ల నిద్రపట్టిద్దా? మల్ల పంటడు. మల్ల పండేసరికి నిద్ర పట్టది. అరె ఎట్టరా? అని అంటడు అని అనినసరికి ఏ ... అగవయ్యా అంటడు. మల్లపంటడు. మల్ల పన్నంక అరె ఎట్లరా అంటడు. మళ్లి ఏ... అగవయ్యా... ఇగ ఐతే తెల్లర్తది. నా మానం పోతది. నా మానం పోతే మరి ఎట్లా గతి అని జేప్పి ఒక చుట్టబట్ట జేత్తడు. అయింత ఇది ఎత్తుకుంటడు. అయింత నెత్తి మీద బెట్టుకొని మెల్లంగ ఏల్తడు. ఈడు ఏం జేత్తడు. అత్తను, మామను, బామ్మర్ధుల్ని అందర్ని లేపి మీ అల్లుడు ఏం ఎత్తుకుపోతుండు. మీ ఇంట్లో దొంగతనం జేసిండు. అలిగి పోతుండు అలిగి పోతుండు  అన్నొలె. అయింత మామ, అత్త, బామ్మర్దులు అల్లుడు ఎంటది అని మెప్పిత్తరు. ఇల్లు ఉరక గాల్లు ఉరక అయింత మామ గిట్ల పడతడు పట్టె వరకల్ల అయింత బుడుగ్గన మీద వడ్తది. అయింత మీద వడ్డంక అయింత తానం జేసి మన్ను జేసి జేత్తడు. అయింత నువ్వు నాకు లగ్గం జేయ్యమంటే జేయ్యావా? అయింత అన్నంక అబ్బ! గిట్ల జేసింద అని అయింత మనసులో పెట్టుకున్నడు. వానికి పెళ్లి జేత్తడు. ఎవలి కాల్లు బతుకుతారు.

## రాజు పతాని లగ్గం – కథావిశ్లేషణ

రాజు పతాని కథలో పతాని అంటే ప్రధాని అని అర్థం. రాజు, ప్రధానితో రాజ్యం గురించి, పరిపాలన గురించి, ఆర్థిక కార్యకలాపాల గురించి అడగడం, సలహాలు తీసుకోవడం చేస్తుంటారు. అందువల్లనే నిత్యం రాజుకు సలహాదారునిగా ఉండే ప్రధానికి, రాజుకి సవాసం, సాన్నిహిత్యం ఎక్కువగా ఉంటాయి. ఆ చనువు వల్ల ప్రధానికి కూడా ఏ సలహా కావాలన్న రాజు అజ్ఞ పాటించడం తప్పనిసరి అవుతుంది. అలాంటి ప్రధాని ఈ కథలో  తనకు పెళ్లి చేయమని రాజుని బ్రతిమాలాడుతూ ఉంటాడు. కాని రాజు నిర్లక్ష్యం చేసి రోజుల మీద రోజులు వాయిదా వేస్తుంటాడు. రాజు మాత్రం పెళ్లి చేసుకొని సంతోషంగా ఉంటాడు. ప్రధాని తన పెళ్లి గురించి ప్రస్థావన తెచ్చినప్పుడల్లా దాటేస్తున్నాడని, తన పరిస్థితిని అర్థం చేసుకోవడం లేదని రాజుని అతని అత్తగారింట్లోనే ఎగతాళి చేస్తాడు. దాంతో ప్రధాని రాజుకు తన బాధను అర్థమయ్యేలా చేస్తాడు.

1. జానపదులు వారి మానవ సంబంధాల, కుటుంబ సంబంధాల, వ్యక్తిగత విషయాలను గురించి మాట్లాడుకునేప్పుడు చాలా పచ్చిగా, సహజంగా వ్యక్తీకరిస్తారు. ఈ కథలో అలాంటి సంఘటనలే చోటు చేసుకున్నాయి. రాజుకు తన బాధను తెలియజేసేలా చేస్తాడు.

2. యజమాని, పాలేరులకు మధ్య స్నేహబంధం, వాత్సల్యం చేత వాళ్ల మధ్య చనువు ఉంటుంది. ఆ చనువుతోనే పాలేరు రాజుని తనకు పెండ్లి చేయమంటాడు. కాని రాజుకున్న వివిధ పనులవల్ల, ఇతర కారణాల వల్ల ఆ విషయాన్ని దాటవేస్తాడు. దీంతో ప్రధానిలో అసహన, కోపంపెరుగుతాయి.

3. రాజు ప్రధానితో కలిసి అత్తగారింటికి వెళ్లారు. అక్కడ వారు చేసిన మర్యాదలన్ని స్వీకరించి, తినుబండారాలు ఎక్కువగా తిని నానాయాతన పడుతాడు. ఇలాంటి సమస్య రాజు విషయంలో ఎదురైంది. ఇదే అదునుగా తీసుకొని ప్రధాని తన వివాహాన్ని వాయిదా వేస్తున్న రాజుని అత్తగారింట్లో అల్లరిపాలు చేస్తాడు. రాజు ప్రధాని మనసులో ఆలోచన గ్రహించి వెంటనే ప్రధానికి పెళ్లి చేస్తాడు.

## 2.4.4 యుక్తి కథలు

## 2.4.4.1 చాకలి పుల్లక్క పాతివ్రత్యం

జాడి రాజన్న, ఆరపల్లి గ్రామం, ధర్మపురి మండలం.

ఈ అరపెల్లి అసొంటి ఊళ్లే ఒక సాకలి పుల్లక్క. సాకలి రామన్న ఇద్దరు ఉండేది. వాళ్లు పోతే బట్టలు పట్టుకుని గంగకే పోవాలి. ఉతుక్కొని ఇంటికే రావాలి. మంచిగ మర్యాద కల మనుషులు. ఈ ఊళ్లే ఒక పోలీసు పటేలుండే. పోలీసు పటేలు సాకలి పుల్లక్కతోని ఒకసారి మాత్రం రతి చెందాలి అని చెప్పే వాడు. పోలీసు పటేలు అనుకున్నరు. అంటే ఎవ్వరికి ఎరకలేదు వానికెరుక. అయితే భార్యభర్తలు ఇద్దరు కలిసి పోతుర్రు. కలిసే అచ్చుడు. పటేల్కి ఒకనాడు కూడా సంధు అయితలేదు. ఏం చేసిండు గద పటేలు చాకలి రామన్న ఇంటికే అచ్చిండట. అచ్చి రామన్న రామన్న నా బిడ్డ పెల్లి పెట్టుకుంటా నువ్వ్ హైదరాబాదు పోయి బట్టలు, గంజులు, మసాలాలు లచ్చ రూపాయలు సొమ్ము కొన్క రావాలి రా. మరి నువ్వ్ అక్కడికి పోవాలని చెప్పి అన్నడు. దొర మీరు చెప్పినంక పోకపోతే ఎట్లుంటది. పైసలు ఇయి పోత అన్నడు. హైదరాబాదు పోయిండు. పోంగ పటేలు ఇళ్లు దాటంగనే డిఏపి ఏం రా రామన్న ఎటో పోతున్నవ్ ఏం కథ అని అడుగుతే అయ్యా! పోలీసు పటేలు బిడ్డది లగ్గం ఉంది. లచ్చ రూపాలిచ్చి సామాను తెమ్మడు అని చెప్పిండు. ఇంటికాడ రామన్న నీ భార్య ఒక్కతే ఉంటది ఎట్లా అంటే అయ్యా మీరు లేరా? అన్నడు సాకలి రామన్న నాక్కూడ చెప్పిండు నేను పోత అని అనుకున్నడట. ఇంకొంచెం దూరం పోంగనే సర్దారు ఇల్లు ఉన్నదట ఏం రా రామన్న ఎటో పోతున్నవ్ అంటే మా పోలీసు పటేలు బిడ్డది లగ్గం పెట్టుకున్నడు. నేను హైదరాబాదుకు సామానుకు పోతున్న అని అమీన్ సాబ్ తో చెప్పిండు. మరి నువ్వ్ పోతున్నక ఇంటికాడ అదినే ఎట్లారా పుల్లవ్వ వాడు అన్నడట అన్నవొల్లె నాకు చెప్పిండు. ఆ

సాకలైనా అటే ఉంటడు. నేను పోవాలని వాని మనసుల అనుకున్నడు. వాడు మనసుల అనుకున్నంక సార్ ఇల్లు ఎల్లంగనే ఒక సైకుదారు ఇంటికి రాంగనే ఏం రామన్న ఎటు పోతున్నవ్ అంటే మల్లగదే చెప్పిండట. ఈళ్లందరికి చెప్పి హైదరాబాదు పోతండు. పోంగ పోంగ ధర్మపురి అసోంటి ఊళ్లే గుత్త పకీరోడు ఉన్నడు. వాడు రాత్రి ఎక్కడ తిరిగినా అడుక్కొని అచ్చి చాకలి పుల్లక్క ఇంటికాడ తినుడుంటుంది. వానికి జానెడు మీసం మూరెడు గడ్డముందట. ఇంత ఆన్నే పండి తెల్లారి అడుక్కునుడు రామన్న ఏటు పోతున్నవ్ అడిగితే మల్ల గదే చెప్పి పోయిండు. నేనింటికి పోతా వాడు పోయిండు రామన్న హైదరాబాదు పోయిండు. ఇంటికి సాకలి పుల్లక్క ఈల్ల మనసుల్లన్ని కనిపెట్టిందో మన్నొ? ఎట్ల నువ్ హైదరాబాదుల ఆగిపోతే వీళ్లందరు మోసం చేస్తరని అనుకుని ఏం చేసింది గద. పొద్దుగూకంగనే మంచిగ తోటల్లకి పోయిందట. బంతిపూల తట్టెడన్ని తెచ్చిందట. ఇంట్ల పెట్టిందట. అయింత పొద్దెక్కి సుంకరోడు తలల రాముడు ఉన్నడట. ఆ రామన్న మొదలే పిలిపిచ్చుకుందట. పిలిపిచ్చుకొని బిడ్డ ఈయాళింటికి ఒక రాత్రి మాత్రం నా ఇంటికాడ ఉండాలి నువ్వ్ ఉంటే 100 రూపాయలు ఇత్త 500 రూపాయలు ఇత్త బిడ్డా! పొద్దుగూకంగనే నా ఇంటికి రా అని సాకలి పుల్లవ్వ ఇంటికి పొద్దుగూకంగనే అచ్చిండు. ఇంట్లకు పోయింది. ఒక సుట్టబొట్ట చేసి ఆ నెత్తి మీద పెట్టిందట. ఒక గణాల నిండా నూనె పోసిందట. కాడ వేసి దీపం ముట్టిచ్చిందట. రామన్న పీట వేసి కూసుండ పెట్టిందట. చీకటి బువ్వ తినే రాత్రి దాటంగ పోలీసు పటేలు సాకలి పుల్లక్క ఇంటికచ్చిండు. పుల్లమ్మ ఉన్నవా అని అడుగుతుండు. అయ్యా! దండం పెడుత గిప్పుడు ఎందుకు అచ్చిళ్లు అని అడిగింది. అమ్మా! నీకు తెలువద నేను నీ కొరకే అచ్చినా అన్నాడట. సరే నా కోసం అత్తే నీ మాట తీసేత్తనా? దొర నాకో నియమం ఉంది. నీకు గడ్డం మీసం గుండెకంత ఎంటుకలున్నయ్. ఇవి తీసుకుంటే ఇవాళ తెల్లాందాక నీ దగ్గరనే లేకపోతే నీ ఇంటికి నువ్వ్ పోవాలి. అయింత పటేలు గిప్పుడు ఏ మంగలోడు అత్తడు అన్నడు. నువ్వ్ ఒప్పుకుంటే గిప్పుడే రప్పిత్త అన్నది. అంతకముందే మంగలిని తెప్పిచ్చుకుందట. మంగలి కొందన్నని అమ్మా! మరి రమ్మనే నేను ఎంటుకలు తీసుకుంటా అని అన్నడు. మంగళోడు అచ్చి పీట ఏసిండు. అన్ని బట్టలు ఇప్పించుకొని రాజుకు మూడు రేవులు పెట్టి కొరిమిండట. ఇటు ఓటి అటు ఓటి తెగని కత్తితో గాటు పెట్టిండు. పటేలు అబ్బ! మండుతుందే మండుతుందే అంటడు. రాజా ఐదు నిమిషాలని శీతకుండోన్ని చేసింది. రాజా! ఇంట్లో మంచం వేసిన పట్టె మంచం పరుపుల లోను మెత్త జంబిఖానా అస్తరు పన్నీరు బుక్కగుల్లలు చల్లి నాలుగు కోళ్లకు నాలుగు చెమ్మలు తొడిగిచ్చిన మీరు అండ్లవోయి కూసుండాలి.

అన్నవోలె వీడు బ్రమకు పోయి అండ్ల కూసున్నడు. కూకునంక వీడు అయ్యా! గిట్ల గాదు మన వ్యవహారం చేతికచ్చింది. బంతి పూవ్వు ఇచ్చాలి రెమ్మలు ఎగుతాయి రెమ్మ రెమ్మకు కుచ్చాలి. ఇంత పొడగు దండయినంక నాలుగు గోడ సుట్టు తిరిగినంక గప్పుడు మన కలయిక లేపతే లేదు అన్నది. గీడు బంతిపూల రెక్కలన్ని గుచ్చుతుండు. పందిట్ల రాముడు దాక్కున్నడు. కావలి పెట్టుకున్న ఉన్నడు. ఆనికేయి చూపు పడ్డదట. ఆడు తలారి రాముడు ముక్కు మీదికి చెమట అచ్చిందట దీన్ని నాలుకతో ముక్కు మీద చెమటని అద్దుకుంటుండటా అయితే వీనికి పానం జల్లుమన్నది. పుల్లవ్వ గదేంటిదే అది మా ఇంటి దేవర. నన్నెం ఏమన్న అంటదా. నన్నెమన్న అంటే నిన్ను అంటది. నన్ను ఏమనకపోతే నిన్ను ఏమనది. ఈ మాట ఇట్లుండగా డిఏపి అచ్చిండట. పుల్లక్క పుల్లక్క అని అంటుండట. అయ్యో! నా ఇజ్జత్తు పోతది. ఆళ్లు ఎవలె అంటే డిఏపి అన్నది. మరి నన్నెట్ల దాత్తవే అంటే తలుపు తీసింది. ఈడ కూర్చో ఆయన పోయేదాక కుండల పక్కన ఇంటెనుక బాదుకు కూసుండ పెట్టింది. అమ్మా! నీ దగ్గరికే వచ్చిన నా గతి ఏందంటే అయ్యా నీకు గడ్డం మీసం ఉంది. అంత కొరిగినంక తానం చేస్తే మాత్రం నువ్వ్ రావాలె అన్నవోల్లె మంగలయిన ఉన్నడు అని మొత్తం కొరిగి పిచ్చి పటేలు తీరుగనే ఇంటెనుక దాసి పెట్టింది. మల్ల అమీన్ సాబ్, సర్దారు, సైకుదారు నలుగురు అట్లనే అచ్చిర్రు. ఆళ్లందరి ఇంటెనుక కుండల్ల కూసుండపెట్టింది. తెల్లగా శీతకుండోలే చేసి కూకునంక ఏమయిందంటే అక్కడ ఇంటెనుక దర్వాజ బందిచ్చింది. ఇంటి ముందర దర్వాజ బంజేసింది. మల్ల మంచిగ మంచల్ల పన్నది. గుత్తపకీరుడు అచ్చిండు. అమ్మా! నేనచ్చిన అన్నడు. అయ్యా! నేను చూసినపుడు నీకు మీసం ఉండే, గడ్డం ఉండే ఇప్పుడు ఇంటెనుక మాత్రం దొడ్డి కిటికి దగ్గర గడ్డం పెట్టు మూరెడు కొలుచుకుంటే నువ్వ్ ఇంట్లకత్తవ్. తక్కువత్తే నేను ఇంట్లకు రానియ్య అని చెప్పింది. అయింత అన్నవోల్లె సాకలిదాన్ని ప్రేమల పడి కిటిక్కాడ గడ్డం పెట్టిండు. పెట్టినొల్లే ఏం చేసింది. రౌతు బొట్టు తీసుకచ్చింది. కొలిచినట్లు కొలిచి ఈ గడ్డానికి గట్టిగ కట్టింది. ఇగ కొలుచుకో అని గట్టిగా కిటికికే కట్టింది. అయింత మంచిగ పన్నది. ఏమాయే! పుల్లవ్వ కొలుచుకున్నావా? పుల్లవా ఇడు లోపలకత్తని వీడు అది సప్పుడు చేయక పండుకుంది. వీడు గుంజి గుంజి బలిమిటికి గుంజుతే గడ్డం మందం కేల్క కేల ఊసింది. మండింది. ఊసిపోయింది. నీ సాకలి నీవ్వని దెంగుతే నీ అక్కను దెంగితే నను గింత గోస దెంగితివి. నీ పంచల కుండలన్ని పలగ గొడతనని గడ కొయ్య పట్టి ఆ కుండలన్ని మీదికెల్లి దెబ్బలు గొడుతుండు. వీళ్లు ఏం జేసిర్రు. నలుగురున్నరట. అరె నీయక్క ఈడోవడు కొడుతుండని చెప్పి ఎవ్వల్ల అంగల్ల వాడు లేచి ఉరుక

తలిగిత్రు. వీడు అబ్బ సాకలి దయ్యాలు చిన్నగ లేవు ఇవ్వెక్కడివి అని చెప్పి గుత్త పకీరొాడు ఈడోకేయి ఊరుకుతుండు. ఊడు పందిట్ల తలాల రాముడు నెత్తి మీద కాగడ వెట్టుకుని ఈళ్లెమనుక ఉరుకుతుండు. అచ్చి నీయవ్వ! గందుకే అన్నది సాకలిది. నన్నేమన్న అంటే నిన్నేమన్న అంటదని. ఆ దయ్యం కుడా మన లగ్గం జెత్తది అని చెప్పి ఎవల అంగల్ల వాడే ఉరుకుతుండు. కంపలవడి చెట్లవడి మొట్లు వడి పోతే అన్ని కాళ్లు కొట్టుకుపోతున్నయ్. చేతులు కొట్టుకుపోతున్నయ్ అంగడంగడయి ఎవ్వలింటికి ఆడు పోయిండు. సాకలి పుల్లవ్వ గట్ల చేసింది. ఇజ్జతికి ఎవ్వలింట్లల్ల ఆళ్లింటికి పోయి ఎక్కడోడు అక్కడ ఉన్నడు. సాకలి రామన్న తెల్లారెవరకల్లా తిరిగచ్చిండు. ఇగో భర్తకు అన్ని చెప్పింది. నువ్వ్ ఇంట్లకెళ్లి పోతే పటేలు, అమీన్ సాబ్, సైకిదారు, పకీరొాడు అచ్చిత్రు. ఆళ్లు బట్టలు అక్కడ పెట్టిన 3 రేవులు కొరిగిచ్చిన. సున్నం బొట్లు పెట్టిన. అయింత సైకిదారు అత్తె వానికి గట్లనే చేసిన ఈళ్లందరికి ఇజ్జత్ తీసి తలాల రాముడు దేవుడి లెక్క నిలబడ్డోల్లె వాడు లేసినోళ్లె ఎక్కడోళ్లు అక్కడ పోయిత్రు. అయ్యా! నా పుణ్యం గిట్లుందని భర్తకి చెప్పింది. అమ్మా! నీ అసొంటి పతివ్రతలు ఎవ్వరులేరు. ఆ..! నువ్వే మంచిదానివి అని చెప్పి భర్తను మెచ్చుకొని మంచిగ మల్ల ఎప్పటొల్లె చేసుకొని బతికింత్రు.

## చాకలి పుల్లక్క పాతివ్రత్యం – కథావిశ్లేషణ

ఒక ఊరిలో నలుగురు ఉన్నతాధికారులు ఒక నిమ్న వర్గానికి చెందిన వివాహితని లొంగదీసుకోవడానికి ప్రయత్నిస్తే, వారి నుంచి ఆమె తప్పించుకున్న వైనం ఈ కథలో ప్రధానంగా చిత్రించబడింది. ఒక గ్రామంలో చాకలి పుల్లక్క అనే స్త్రీ తన భర్తతో కలిసి వారి చాకలి వృత్తి పని చేసుకుంటు హాయిగా జీవనం సాగిస్తారు. చాకలి పుల్లక్క అందమైన స్త్రీ. అందుకే కాబోలు ఆమె మీద అధికారులంతా ఆశపడి ఉంటారు. కాని ముందే ఆ అధికారుల వక్ర బుద్ధిని గ్రహించిన చాకలి పుల్లక్క వాళ్ల ఎత్తులకు పై ఎత్తులు వేసి వారి బారి నుండి తన శీలాన్ని కాపాడుకుంటుంది. ఆ ఊరి పోలీసు పటేలు చాకలి పుల్లక్క మీద కన్ను వేశాడు. ఎప్పుడు అవకాశం దొరుకుతుందా? అని పుల్లక్కని చేజిక్కుంచుకోవాలని తహ తహలాడుతాడు. ఒక రోజు పుల్లక్క భర్త రామన్నను పథకం వేసి హైదరాబాదు పోయి తన బిడ్డ పెళ్లికి సామాగ్రి తేవాలని పంపిస్తాడు పోలీసు అధికారి. అది అసలే భూస్వాముల కాలం కాబట్టి తప్పలేదు. అతను చెప్పింది వినకపోతే ఏదైనా మనసులో పెట్టుకుని కక్ష్య సాధింపు చర్య చేపడతాడని బెదిరిపోతాడు. తప్పని పరిస్థితుల్లో రామన్న హైదరాబాదు పోతాడు. రామన్న హైదరాబాదు పోయేటప్పుడు తనకి ఎదురైన పోలీసు అధికారులకు, రెవెన్యూ అధికారులకు

ఫలానా విషయం మీద హైదరాబాదు పోతున్న తన భార్య ఒంటరిగా ఉందని నేను వచ్చేవరకూ కాస్త కనిపెట్టుకుని ఉండమని కోరతాడు. కాని తన భార్య అందం మీద అధికారులకి చెడు భావన ఉందని గ్రహించలేడు. రామన్న అటుపోయింది గమనించి ఒక్కొక్కరుగా పోలీసు పటేలు, అమీన్ సాబూ, సర్దారు, సైకిదారు ఇలా అధికారులంతా రాత్రి సమయాల్లో పుల్లక్క గుమ్మం ముందుకువచ్చి పిలుస్తారు. ఉన్నత అధికారులమనే జులుంతో, తాము అడిగితే కాదనదనే అహంకారంతో పుల్లక్క ఇంటికి చేరి తనని అనుభవించడానికి వచ్చానని చెపుతారు. వాళ్ల మనసులో చెడ్డ ఆలోచనలకు మద్ధతిస్తూనే చాలా చాక్యచక్యంగా ఒక్కొక్కరిని తన ఇంటి వెనుక గుడిసెలో కుండల్లో దాచుకునేలా చేస్తుంది. రామన్న లేని సమయం చూసి తప్పుడు ఆలోచనలతో ముందే వస్తారని గ్రహించిన పుల్లక్క తన ఇంటి దైవమని బుకాయించి చెప్పడానికి తలాల రాముడికి వేషం వేసి గుడిసెలో ఉంచుతుంది. తలాల రాముడిని ముఖాన్ని కవరు చేసి నెత్తి మీద దీపం పెడుతుంది. అధికారులు ఒక్కొక్కరుగా వచ్చినప్పుడు వాళ్లకు గడ్డాలు, మీసాలున్నాయని కారణం చెప్తూ వాటిని తీసుకుంటేనే తమ కోరిక నెరవేరుతుందని ప్రలోభ పెడుతుంది. పుల్లక్క మాటలు విని ప్రతి అధికారి తనతో ప్రేమగా మాట్లాడేసరికి పూర్తిగా పుల్లక్కని నమ్మి వేసుకున్న బట్టలన్ని విప్పుతారు. ముందుగా మంగళివాడిని పిలిపించే పెడుతుంది పుల్లక్క. ఆ మంగళివాడు అందరి మీసాలు, గడ్డలు, గుండు తీసి మొండి కత్తెరతో గాట్లు పెడతాడు. ఆ మంటలకు తట్టుకోలేని సందర్భంలో అధికారుల్లో ఒక్కొక్కరు పుల్లక్క అంటూ గుమ్మం నుంచి శబ్దాలు వినిపిస్తాయి. మూడో వ్యక్తికి తెలిస్తే ఊరంతా తెలిసి అధికారుల గౌరవం, మర్యాదలు దెబ్బ తింటాయని ఒకరికి తెలియకుండా ఇంకొకరు వచ్చి కుండలో దాక్కుంటారు. చివరగా గుత్త పకీరువాడు వచ్చి పుల్లక్క అని పిలుస్తాడు. అతని మీసాలు, గడ్డలు ఎక్కువగానే ఉంటాయి. వాటిని కొలిచే గుత్త పకీరువాడా కాదా అన్నది అనుమానం ఉందని చెప్పి కిటికి దగ్గరికి రమ్మంటుంది. అక్కడికి రాగానే పొడవాటి గడ్డాన్ని కిటికి ఇనుప సువ్వలకు కట్టి పడుకుంటుంది. కొద్ది సేపటికి గుత్త పకీరువాడు లాగితే చర్మంతో సహ గడ్డం ఊడిపోయి కోపంతో కర్ర తీసుకుని కుండల మీద కొడతాడు. అప్పటికి కుండలో తలదాచుకున్న అధికారులంతా ఒక్కసారిగా లేచి ఇదంతా చాకలి దేవర దయ్యాల పని కావచ్చునని, భయపడుతూ తమ తమ ఇళ్లకు పరుగులు తీస్తారు. వాళ్లని ఇంకా భయభ్రాంతులు చేయడానికి వాళ్ల వెనుక తలారి రాముడు కూడా పరిగెడతాడు. ఈ విధంగా తమ భర్త లేని సమయంలో తప్పుడు ఆలోచనలతో వచ్చిన అధికారులకు మూడు చెరువులు నీళ్లు తాగిచ్చి ముచ్చెమటలు పట్టిస్తుంది. మరుసటి రోజు

హైదరాబాదు నుంచి తిరిగిన వచ్చిన భర్త రామన్నకు జరిగిందంతా విన్నవిస్తుంది. తనను పాడుచేయడానికి వచ్చిన వారికి తగిన శిక్ష పడేలా చేసానని తన పాతివ్రత్యతను అనుమానించకుండా ఉండటానికి నిదర్శనంగా తలారి రాముడు ప్రత్యక్ష సాక్షిగా, ఆ అధికారుల బట్టలు, వెంట్రుకలు పరోక్ష సాక్ష్యమని చెప్పి బాధపడుతుంది. ఆమె చేసిన పనికి చాకలి రామన్న మెచ్చుకుని వాళ్ల వృత్తి పని చేసుకుంటూ ఆనందంగా బతుకుతారు.

ఈ కథల్లో సాకలి పుల్లక్క పాత్ర స్త్రీలకు ఎంతో స్ఫూర్తిదాయకమైనది. సమాజంలో నిత్యం స్త్రీల పై జరుగుతున్న అణచివేతలు, దాడులు, హత్యలు, మానభంగాలు, హింసలు గమనిస్తూనే ఉంటాము. అలాంటి సంఘటనలు నేటికి జరుగుతూనే ఉన్నాయి. మన సామాజిక వ్యవస్థలు, మతాలు, కులాలు, కట్టుబాట్లు, ఆచారాలు స్త్రీలను అబలగానే చూపించాయి. దానితో మనం సృష్టించుకున్న సామాజిక రుగ్మతల వల్ల స్త్రీలు ఆశక్తులుగా, హీనులుగా మిగిలిపోయారు. పురుషులు గొప్పవారనే భావననే సమాజంలో నాటుకుపోయింది. కాని ఆధునిక కాలంలో స్త్రీలు ఉన్నత విద్యా బుద్ధులు నేర్చి, గగన తలంలో విహరించే స్థాయి దాకా ఎదిగారంటే దీన్ని బట్టి తరతరాలుగా వాళ్లు ఎంత సహనశీలురో, త్యాగమూర్తులో మనం అర్థం చేసుకోవచ్చు. ప్రజల్లో ఎంత అవగాహన కల్గించే కథలున్నా నేటికి వార్తాల్లో నిత్యం ఏదో ఒక సంఘటన స్త్రీలపై జరిగిన అఘాయిత్యాల గురించి వినిపిస్తున్నాయి. అలాంటి చెడు సంఘటనలు దరిచేరకుండా, దరిచేరిన వాటిని స్త్రీలు ఎదుర్కునేందుకు తక్షణ ఉపాయాన్ని ఆలోచింపజేసే కథ.

## 2.4.4.2 శివసత్తె అవతారమెత్తిన భార్య

అనుగుల రాజు, లక్ష్మీపూరు గ్రామం, జగిత్యాల

జగిత్యాల పక్కన ఒక ఊరు లక్ష్మీపూర్. ఆ ఊర్లో కూతురు అయితే ఇంత ఇంత అక్కడిక్కడి పెద్ద వాళ్ల చేతుల పెట్టి పదహారేళ్లు బాలిక చేసిండు.16 ఏళ్ల బాలికల చేసినంక లగ్గం చేస్తంటే సరె! నీ ఇష్టం అన్న. మా నాన్న నాకు మంచి అబ్బాయిని చూసి లగ్గం చేసిండు. అబ్బాయి మంచోడు ఆనికి భూమి, జాగ ఏం లేకుండె మా నాన్న ఏం చేసిండు అల్లుడా భూమి జాగలేదు గద. నాకు భూమి ఎక్కువ ఉంది. భూమిలో నుంచి కొంత భాగం రెండు ఎకరాలు నీకు ఇస్తున్న ఎడ్లు, నాగలి ఇత్తన్న. వ్యవసాయం చేసుకొని బతుకు అల్లుడా అని చెప్పిండు మావయ్య. నా భర్త పొద్దున లేత్తండు. తిన్నంక మంచిగ ఎడ్లు కట్టుకొని వేరే కాడికత్తుండు. వారం రోజులు మా ఆయన పోయచ్చినంక ఏమండి ఏమండి పొలం

కాడికి పోయి వస్తున్నవ్ గద. ఇన్ని రోజుల నుంచి పొయి ఏ పాటి దున్నినవు అన్న. దున్నుడు ఎక్కడిది పెండ్లామా దున్నుతే ఎడ్లు నడుస్తలేవు ఎండకు. నేను ఏం చేయలో తెలుస్తలేదు. నీకు తెలుస్తే నాకు ఉపదేశం ఇయ్యి అడిగిండు. అయ్యో! పిసబిత్తిరి.. వారం రోజులు అయితుందగని నాకొక రోజన్న చెప్పినవా నేను అడిగేదాకా భార్య అన్నది. ఒక సలహ ఇచ్చింది. ఏమండి ఎండకిపోతే ఎడ్లు నడుత్తలేవు. పొద్దున రేవు నాలుగు గంటలకు వోతే పొలంకాడికి పెయినంక ఆరు గంటల వరకు నాగలి కడితే మంచిగ ఎడ్లు దున్నుతయే నడిపిత్తె ఎడ్లు నడుత్తయ్. సరె అన్నడు. దుకాన్లకు పోయి అద్దకిలో బెండకాయలు తీస్కచ్చి అటు నుంచి గుడికి పెయిండు. గుడంటే వైన్స్ కి మా ఆయన పోయినది. వైన్స్ గుడికి పోయి రెండు బీర్లు, ఒక కోటరు తీస్కోని అచ్చి అన్నంల పెట్టమన్నడు. ఇద్దరు కూసున్నంక బీరు పెట్టితే నేను కోపానికి అచ్చి అవురా మొగుడా ఆడోళ్లు బీరు తాగుతారా? అన్న. ఆడోళ్లు తాగినప్పుడు నుంచే 60 ఉండే 120 రూపాలయ్యింది. అని మా ఆయన అన్నడు. సరే నేను బీరు తాగిన మా ఆయన మూడు పెగ్గులు ఏస్తే నేను ఆరు పెగ్గులు ఏసిన. మా ఆయనకు కోటరు ఏసినంక మీటరు తిరిగి ఇనుప మంచం ఏసుకొని పన్నడు. రేపు నేను నాలుగింటికి పోదాం అనుకుంటే పన్నడు. నేను తిని పడుకుందా మనేవరకల్లా ఊళ్లె కెల్లి ఒగ్గు సప్పుడు అయితుంది. అదెక్కడ్నో ఒగ్గు డోలు సప్పుడు ఇగ కథ చెప్తే ఒగ్గు డోలు కొడతరు. కాబట్టి మన మా ఊర్ల కథ చెప్తరు గద నాకు కథంటే బాగా ఇష్టం ఎప్పుడు ఏడ కథ చెప్పిన కథ సూసేదాన్ని మా ఆయన పండుకున్నడు గద. నేను సూసత్త అని వాడకట్టోల్లతో నేను పోయిన. పర్వతాల బృందం వోలు కథ చెప్తుర్రు. కథ మంచిగ నడువంగ టైం 12 అయింది నాలుగిటికి మా ఆయన పోతడని అట్లే కూసున్న మూడిటి వరకు బంజేసిర్రు. మా ఆయన లేత్తడు. కొత్తగ లగ్గం అయ్యే మా ఆయన లేసేవరకు నేను కనబడకపోతే ఎట్లంటే కల్లి వెల్లి కంపనీ అంటే అపనిందలు మోపుతడని బాగా ఆలోచించుకుంది. జప్పన వేసి ఇంటికి పోయింది. సరుకు బురుకు సంధుల ఉరుకు మా వొళ్లు అత్తె మందిలకి ఉరుకురు అన్నట్టు ఇంటికచ్చింది. పోంగ ఎట్ల పన్నోడు అట్లే పన్నడు. నేను పన్న. మా ఆయన మెల్లగ లేసి పోలం కాడికి పోయిండు. నేను కూడా లేసివరకు నాలుగైంది. నాలుగిటికి ఆకిలి ముగ్గులు పెడితె ఇంకాసేపు ఆగుత అని మెల్లగ రెస్ట్ తీసుకుంట అని ఒరిగింది. అటే నిద్ర పట్టింది. ఎట్లంటే మంచిగ పండుకున్న అటీటు అనే వరకు పావు దక్క ఎనిమిదిటికి లేసిన. నేను లేసేవరకు ఇంటి ముందు ఇరుగునా సవతులు పొరుగునా సవుతులు ఆడ కట్టకు అందరు గంపలు పట్టుకుని పొలం కాడికి పోతుర్రు. అయ్యో! నేను పోకపోతే మా ఆయన కోపానికి రాడ అందరు

పోయిన్రు నేను పోకుంట ఎట్ల అని ఆళ్ల ఆకిట్ల ఇంత, ఈళ్లాకిట్ల ఇంత నలుగురి ఆకిట్లకు ఊడిసిన పది అయింది. వంట చేయలే ఏం చేయాలే? పోయ్యి ముట్టించి చేసేవరకల్లా లేటయితది. ఒక గంప తీసుకొని బియ్యం పెట్టిన బెండకాయలు, అల్లం ,ఉల్లి మసలా అన్ని తీర్ల పెట్టుకొని నేను అడవిలకి పోత అక్కడ కట్టెలు ఉంటయ్ బండలు పెట్టి పొయ్యి రడి చేసి అందుత అనుకుంది. అక్కడనేమో నా మొగుడు నా పెళ్లాం అత్తదని సూత్తుండు. మా ఆయనకు నేను కనబడ్డ. ఆయనకు మస్తు కోపమచ్చింది. రా.. బుజ్జి రా.. నీకు బజ్జిలు పంచాలి. నాకు బగ్గ భయం అయింది. దేవుడా! భగవంత నా మొగుడు ఇవాళ ఒకనాడు కొడతడు కావచ్చు ఆయన కొడితే దెబ్బలు పడ్డననుకో ఆయనకు కొట్టుడు అలవాటైతది. నాకు పడుడు అలవాటైతది. ఆడోళ్లకు ఇగురమన్న గట్టిగ ఉండాలి ఈపన్న గట్టిగ ఉండాలట ఈపు గట్టిగ ఉండుడంటే మొగుడు కొడత కొడత అంటే కొట్టురా కొట్టురా అని వీపు సూపిత్తే ఒకటి కొట్టేకాడ నాలుగు గుద్దుతడు. అట్ల ఇగురం ఉన్న ఆడోళ్లయితే కొట్టకుంట. ఏమండి! నేను కొడితే బతుకుతునా? అని చెయ్యి ఎత్తి దండం పెడితే అక్కడి భర్త ఆగిపోతడు. మా ఆయన కట్టె పట్టుకొని ఉరికత్తండు ఇంగ నా దగ్గర కొంగు ఉంది. అది నెత్తిమీద కెల్లి ఏసిన దేవుడచ్చినట్టు చేస్తున్న ఏ.. ఏ.. వారి బిడ్డ వారి..! నువ్వు ఎవ్వలు అనుకొని కట్టె లేపినవ్ రా? వారి సామి సామి వారి బిడ్డా! నేను ఎములవాడ రాజలింగన్ని కుడికన్ను మెల్ల గుడ్డి రాజ లింగన్ని. సామి! నువ్వని తెలువదు బాంచెన్..! బిడ్డా అని దేవుడు వేశం ఏసింది. మా ఆయన కట్టె పట్కచ్చినోడు కట్టె కింద ఏసి కాళ్ల కింద కూసున్నడు మొక్కుతుండు. మా ఆయనకు డౌట్ అచ్చింది. దేవుడచ్చినొల్లు జప్పన చెప్పరు. ఆడి ఈడికి తూలతారని సామి.. సామి... నా పెళ్లాన్ని ఈ కాడికెల్లి నేను ముట్ట నా అన్నం నాకె దాని అన్నం దానికే అని దాని రూం దానికే నా రూం నాకె అని భర్త ముట్ట పట్ట అన్నడు. మా ఆయన ముట్టపట్ట అంటే కొత్తగ లగ్గమయ్యే పోరడు పుట్టడు. సంసారం ఆగం అయితదని మల్ల కొంగు ఏసి అబ్బ అబ్బ.. వారి.. బిడ్డా నువ్వ్ ముట్ట పట్ట అంటే సంసారం ఆగం కాదా వారి.. బిడ్డా! నా వారం నాడు నా దినం నాడు కాపాడితే చాలురా వారి నా వారం ఆదివారం పన్నెండు నుంచి సోమవారం రాత్రి పన్నెండు దాకా కాపాడు రా వారి మిగతా రోజులు ముట్టచ్చు పట్టచ్చు రా. సరే బాంచెన్ అన్నడు మా ఆయన మంచిగ నమ్మిండుగని మల్ల ఒక అనుమానం అచ్చింది. మరి నిజంగ దేవునివైతే నా పెండ్లాం ఇంటికాడికెల్లి రాంగ గంపల ఎత్తుకొని అచ్చింది. గంపల అన్నం అండింది. బెండకాయ కూర తెచ్చింది. నువ్వ్ సత్యవంతురాలైతే దేవుడివైతే అన్నం మాయం చెయ్యి బియ్యం చేయి సామి. కూరని మాయం చేసి

బెండకాయలు చేయి మా ఆయన అన్నడు. నాకు సంబురమేనాయే మల్ల కొంగు ఏసి వారి బిడ్డా! పది వేలు పది వేలు సామి ఒక ఐదు వేలు తీసుకో..! వారి బిడ్డా దెబ్బలు పడకు రా అట్ల గాదురా నను కట్టేసి బారెలు ఆడుతున్నవా వారి నీ పెండ్లాం ఇంటికాడికెల్లి రాంగ గంప ఎత్తుకొని అచ్చింది. గంప మీద లుంగి తీసి చూడు రా బిడ్డా..! అయినంక లుంగి లేపి సూత్తడు గంపని. గంపల బియ్యం ఉంటయి. ఆ బియ్యాన్ని నేను అన్నం చేయమంటే నేను ఏ గంగలకి పోవాలి. చేయరాదు. నాది ఉత్త దేవుడేనాయే? గప్పుడు మా ఆయనకు మంచిగ బతిమాలాడి కూసుండ పెట్టుకొని అన్నం తినిపిచ్చుకొని పన్నెండింటికి తీస్కచ్చినా..

## శివసత్తె అవతారమెత్తిన భార్య – కథావిశ్లేషణ

ఒక స్త్రీ తన భర్త కోపాన్ని తగ్గించడానికి పూనకం వచ్చినట్లు నటిస్తుంది. శివసత్తె అవతారమెత్తి పూనకంతో తనను తాను తెలివిగా కాపాడుకుంటుంది. ఈ కథంతా కూడా ఒక స్త్రీ ప్రథమ పురుష కథనంతో తన జీవితంలో జరిగిన సంఘటనను తానే చెప్తునట్లు అనిపిస్తుంది. భార్య భర్తల మధ్య గొడవలు సహజం. కొన్ని సరదాగా సర్దుకుపోయే గొడవలుంటాయి అలాంటి గొడవే ఈ కథావస్తువుకు కారణమై ఉంటుంది. చిన్న చిన్న కారణాలు చెప్పి చిలిపిగా భర్తతో మసులుకోనే విధానాన్ని తెలియజేస్తుంది. నిత్యం కష్టసుఖాలను అనుభవించే జానపదులు జీవితాల్లో భార్య భర్తల మధ్య జరిగే ఇలాంటి చిన్న చిన్న సంఘటనలు ఎంతో ఆనందాన్ని, ఉత్సహాన్ని రేకెత్తిస్తాయి. అంతేగాకుండా భార్యభర్తలు మధ్య ప్రేమానురాగ బంధాన్ని బలోపేతం చేస్తాయి. ఈ కథలో ఇద్దరు మధ్యతరగతికి చెందిన భార్యభర్తలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. అందున కొత్తగా వివాహమైన జంట. చిన్న చిన్న సరదాలు, ముచ్చటలు తీరాలి. కాబట్టి అక్కడ చిలిపితనం చిగురుటాకులాగా పూస్తుంది. భర్త పొలం దున్నటానికి వెళ్లినప్పుడు ఎడ్లు సరిగ్గా దున్నటం లేదని చెప్పి భార్యతో చెప్పి విచారిస్తాడు. భర్తలో కష్టసుఖాల్లో పాలు పంచుకునే బాధ్యత భార్యకు కూడా ఉందనుకుని నన్ను అడిగితే నేను సలహానిస్తానని చెప్తుంది. ఉదయం నాలుగు గంటలకు పొలం దగ్గరికి వెళ్లి పొలాన్ని దున్నితే ఎడ్లు సహకరిస్తాయని భార్య చెప్తుంది. సరే భార్య చెప్పినట్లు మరుసటి రోజున అలాగే చెద్దామనుకుని మార్కెటుకి వెళ్లి కూరగాయలు తీసుకొని ఇంటికి వస్తాడు. అతడు చేసే కాయకష్టానికి రోజు మద్యం పుచ్చుకోవడం రోజు వారి అలవాటే. ఆ రోజు మద్యం తెచ్చుకున్నాడు భార్యకు కూడా తెచ్చాడు. ఉత్తర తెలంగాణ కొన్ని ప్రాంతాల్లో స్త్రీలు కూడా మద్యం పుచ్చుకోవడం మాములే అన్న

విషయాన్ని ఇక్కడ గ్రహించాలి. ఇంటికి చేరుకుని భార్యభర్తలు మద్యం తాగి, భోజనం చేస్తారు. భర్తకు మత్తు బాగా ఎక్కి పడుకుంటాడు. భార్యకు కథలంటే చాలా ఇష్టం. ఊరి మధ్యలో కచ్చీరు కాడ పర్వతాలు చెప్తున్న ఒగ్గుకథ వినటానికి వెళ్లి అలస్యంగా ఇంటికి వచ్చి పడుకుంటుంది. తెల్లావారు జామున భర్త ఎద్దులను తీసుకొని పొలానికి వెళతాడు. భార్య మాత్రం రాత్రి నిద్రలేమి కారణంతో ఉదయం తొమ్మిది గంటల దాకా పడుకుంటుంది. ఇరుగుపొరుగు స్త్రీలు ఉదయాన లేచి ఇంటి కార్యక్రమాలన్ని చేసుకుంటారు. తను మాత్రం అలస్యంగా నిద్రలేచి భర్తకు భోజనం తీసుకెళ్లకపోతే భర్త ఊరుకోడని దిగాలు పడుతుంది. వ్యవసాయం చేసి వారికి ఉదయాన తొమ్మిది గంటలలోపు భోజనం చేయడం అలవాటు. కాబట్టి భర్తకు తొమ్మిది దాటిన భోజనం తీసుకొని రాలేదని భార్య మీద చాలా కోపం వస్తుంది. ఇక భార్య వంట చేస్తే ఇంకెంతా అలస్యమవుతుందని బియ్యం, పచ్చి కూరగాయలు తీసుకుని పొలం దగ్గరి వంట చేద్దామని పొలం గట్ల మీద నడుచుకుంటూ వస్తుంది. భార్య రాకని చూసి భర్త కోపంతో ఊగిపోతాడు. ఇక లాభం లేదని ఏదొక మార్గం ఆలోచించకపోతే భర్తతో దెబ్బలు తప్పవని భార్య పూనకం వచ్చినట్లు ఒకేసారి అరుస్తుంది. ఎక్కడ అనుమానం రాకుండా ఇంటి ఇలవేల్పు అయిన శ్రీ రాజ రాజేశ్వర స్వామి పేరును మనసులో తలచుకుని నేను వేములవాడ రాజన్నను నన్ను కొట్టాడానికి వస్తున్నవా బిడ్డా? అని దేవుడు పూనినట్లు భార్య బుకాయిస్తుంది. అయ్యో! రాజన్న నా దేవుడు భార్య మీద పూనినాడు అనుకోని క్షమించమని కోరుతూ ప్రార్థిస్తాడు. ఇదే సమయం అనుకొని భార్య ఆవేశంగా ఉన్న భర్తని శాంతపరచి తెలివిగా తన తప్పుని కప్పివేస్తుంది. ఎప్పుడు దేవుడి పూనకం రాని తన భార్యకు ఇప్పుడు ఎలా వచ్చిందని అనుమానంతో భర్త తన భార్య వండి తెచ్చినవన్నీ తిరిగి మాములు స్థితికి తేవాలని కోరతాడు. భర్త మాటలు విన్న భార్యకు అమితమైన సంతోషం కలుగుతుంది. సరేనని చెప్పి ఇంకా వంట చేయని బియ్యాన్ని, కూరగాయలు చూపించి మాయ చేసినట్లు ప్రగల్భాలు పలుకుతుంది. భర్త నిజమైన దేవుడేనని నిర్ధారణకు వచ్చేలోపు మరల ఈ కూరగాయలను, బియ్యం వండిన రూపంలోకి మార్చాలంటే కష్టమేనని గ్రహిస్తుంది. తాను నిజమైన దేవుడు కాదని తెలుస్తుందని వెంటనే తన భార్య రూపంలోకి మారినట్లు నటిస్తుంది. ఈ విధంగా తీవ్ర ఆకలి ఆగ్రహంతో ఉన్న భర్త కోపాన్ని తగ్గించడానికి దేవుడి పేరుతో సరైన ఉపాయాన్ని పన్నింది. ఒక్క దెబ్బ కూడా పడకుండా తెలివిగా తప్పించుకుంటుంది.

1. ప్రతి కుటుంబంలో సహజంగానే ఆడవారి కన్నా మగవారికి ఆవేశం, కోపం ఎక్కువ. ఈ కథలో కూడా భర్తకు పొలానికి అలస్యంగా వచ్చిన భార్య మీద కోపం వస్తుంది. భార్య భర్తల మధ్య జరిగిన సంఘటనలో భర్తను నిలువరించడానికి భార్య ఎంతో తెలివిని ప్రదర్శిస్తూ, సమయస్ఫూర్తితో తప్పించుకుంటుంది.

2. ఉత్తర తెలంగాణ ప్రజలు ముఖ్యంగా కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో విందుల వినోదాల పేరిట చాలా ఖర్చు చేస్తారు. ప్రాచీన గ్రామీణ సంస్కృతిని ఇంకా నిలుపుకుని ఉన్న ప్రాంతాలు కాబట్టి ప్రతి పండుగని అందరు కలిసిమెలిసి సామూహిక సాంస్కృతిక సందడిగా జరుపుకుంటారు. అయితే ఇక్కడ కొందరు స్త్రీలు కూడా మద్యపానం చేయడమనే విశిష్ట సంస్కృతి ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఇది తప్పుగా భావింపబడవచ్చు గాని ఇక్కడ మాత్రం సర్వ సాధారణంగానే పరిగణిస్తారు. నేడు స్త్రీలు ముఖ్యంగా నగరాల్లో నివసించే యువత పబ్బుల పార్టీల పేరిట తాగడం కూడా తరచూ వార్తల్లో తారసపడుతుంది.

3. జగిత్యాల జిల్లా పక్కన ఉన్న వేములవాడ రాజన్న సిరిసిల్లలో శ్రీ రాజ రాజేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయం ఎంతో పేరు ప్రఖ్యాతి గాంచిన ఆలయంగా ప్రసిద్ధి. చారిత్రక ప్రాధాన్యత కూడా సంతరించిన పురాతన ఆలయం. నిత్యం లక్షలాది భక్తులతో కిట కిట లాడుతూ దక్షిణ కాశీగా పేరొందింది. ఈ కథలో కూడా వేములవాడ రాజన్న దేవుని ప్రస్తావన పేరుతో భర్త నుండి భార్య దెబ్బలు తినకుండా కాపాడుకోగలుగుతుంది. దాదాపు ఉత్తర తెలంగాణ అంతటా ఎంతో ప్రతిష్ట గల దేవాలయంగా పేరొందిన ఆలయం. ఆ దేవాలయం దేవుడు గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది భక్తుల్లో పూని ప్రజల భావితర విషయాలను చెప్తాడని ప్రతీతి. అందుకే ఈ కథలో కూడా దేవుడితో బేరాలు ఆడుతూ సంభాషించుకోవడం కనిపిస్తుంది.

## 2.4.4.3 పైసకు గుడిసెన్నర పెండ్లాం

దీకొండ పర్వతాలు, ఆత్మకూరు గ్రామం, గొల్లపల్లి మండలం.

అయ్య అవ్వ గర్భన ఒక కొడుకు. అమ్మా మరి కొడుకు పుట్టిండని చెప్పి కొడుకుని మంచిగ పెద్ద చేసింది. వాళ్లకు తిందామంటే తిండికి లేదు. మరి అమ్మా కొడుకు పెరిగిండు ఇంత సదువు సాత్రం నేర్చుకుంటూ అమ్మా నాకు లగ్గం చెయ్యంటే బిడ్డ నీకు లగ్గం చేత్తగని బిడ్డ చేతులు ఐదు పైసలు లేవు. పెళ్లి ఎట్లయితది బిడ్డ. అమ్మా సరే నువ్వు బాధపడకు. ఒక పైసకే ఇయ్యి పైసకే గుడిసెనర పెండ్లాన్ని చేసుకుంటా నువ్వు ఏం బాధపడకు నీకు నగలన్ని అని తీర్ల నేను తెత్త. ఇన్ని రోజులు నన్ను సాదినవ్

ఇప్పుడు నేను సొత్త. తల్లి ఏం చేత్తది. ఇంట్లో మొత్తం తిరిగి సూసేవరకల్లా మూడు ఏండ్లు నాటి ముద్ద పైస దొరికిద్ది ఆ ముద్ద పైస తీసి కొడుకు చేతిల పెడతడు. ఆ పైస పట్టుకుంటడు. పోంగ పోంగ ఒక లక్ష్మీపురం అనే ఊరు కల్తది. ఒక కోమటవ్వ దగ్గరికి పోయి నా కొంచెం అంబలి పోయి. నేను కొత్తని అంటడు. కోమటోళ్లకు కొత్త ఇత్త అంటడు కొత్త అంటే కోమట్లకు ఆశే. సరే బిడ్డా కూసుండని చెప్పి కూసుండ పెడితే అంబలి తీస్కచ్చి పోసి ఆయన మా ఇంటికాడ నయితే అంబలి పోసి ఇంత గడ్కపొట్టు ఏసి నాకింత తొక్కు ఏత్తది. కొంచెం తొక్కు ఉంటే ఎయ్యవా? అమ్మా అని పిలగాడు అంటడు. ఇదేం చేత్తది. తొక్కు కొరకు ఈమె ఇంట్లకు పోతది. ఈనె ఆటు మూటు అంబలి తాగి చేయి కడుక్కొని అయింత సప్పుడేంక బయటకు ఎల్తడు. కొడుక కొత్త ఇత్తన్నవ్ అంబలి తాగినవ్ గద బిడ్డ. కొత్త ఇస్త నని చెప్పిన అంటే ఏయ్ కోమటిదానా నేను కొత్తోన్ని అన్నగని కొత్త ఇత్తనని చెప్పలే అంటడు. లొల్లి పెడతడు. ఆడ పది మంది గుమ్మిగూడతరు. అమ్మ ఏం జరిగిందంటే నాకు కొత్త ఇత్తనన్నడు. అంబలి పోయివనొల్లె పోసిన అంబలి తాగి సప్పుడేక పోతండు అని చెప్పి మాట్లాడంగానే మందిల కెల్లి బయట పడతడు. పోంగ పోంగ మల్ల ఒక ఊరు తిరుమల పురం అనే ఊరు కల్తది. ఆకలి బాగా అయితుందని సూసేవరకల్లా సంక్రాంతి పండుగ సకినాలు చేసుకుంటరు. ఎండకు ఉల్లరా పోసిర్రు. సకినాల మంచం కాడ కూసుండపెట్టి వాళ్లమ్మ తానం చేత్తుంది. ఈ పిల్లగాడు మంచం కాడ కూసోని సకినప్ప తింటడు. అప్ప తింటున్నవ్ అంటే వాళ్ల తల్లి నా పేరు అవ్వ సకినాలు తినచ్చ అంటే తినచ్చు బిడ్డా నీ పేరు ఏంది అంటే నా పేరు పాత ఒల్లెకం. బాత్రూంల ఉన్న తల్లికి ఒల్లెకం అంటడు. అమ్మా అమ్మా ఒల్లెకం అచ్చిండు. అమ్మా అని మంచం మీద కూసోన్న పిల్ల అంటే బాత్రూం పోయిన తల్లి ఒల్లెకం అంటే ఉత్తమాటనే ఉత్తగనే కావచ్చు ఆళ్ల తల్లి అనుకున్నది. పోరి నేనత్తున్న నేనచ్చినంక చెంప మీదకే నాలుగు పెడత అమ్మా అంటది ఒల్లెకం అంటవ్. ఇప్పుడే రెండు బుర్రల నీళ్లు పోసుకున్న నేనత్తున పోరి నువ్వట్ల మాట్లాడకు తల్లి బాత్రూంల ఉండి అంటది. ఈ సకినాల కాడ కూసున్నడు రెండు తిన్నడు. తల్లి బిడ్డలు మాట్లాడుకోంగ నాలుగు మడతల పట్టి సకినాలు తీస్కొని జబ్బకు ఏసుకొని తొవ్వెంట పోతుండు. మమ్మీ ఒల్లెకం మమ్మీ ఒల్లెకం అని అర్రుతుంది. ఒంటి నిండా బట్ట కట్టుకుని అచ్చేవరకల్లా ఒల్లెకం పోతుండు ఏందే పోరి. ఎవడో అచ్చిండు తెలువదు. దొంగోడు అచ్చి సకినాలు కొంట పోతుండు. అంటవా అమ్మా అంటివి. ఒల్లెకం అంటివి. ఒల్లెకం అంటే ఉత్తదే కద! పోరి.. నాలుగు దవడ మీద అందుకుంది. సకినాలు జబ్బ వేసుకొని రోడ్డు మీద ఆడోకటి ఆడోకటి తినుకుంట పారేసుకుంట

సాకలొల్ల రేవుకాడికి పెయిండు. ఆనాడు సండే అంటే అదివారం సాకలొల్ల పిల్లగాండ్లు ఆని వెంబడి పోయిర్రు. ఆళ్ల అవ్వ బట్టలు పిండుతే ఆడ కూసున్నరు. అప్పాలు పొలగాండ్లకు ఇచ్చుకుంట నములుతుండు. ఇయ్యని పోరగాండ్లు మమ్మీ సకిన అప్పనే అని మొత్తుకుంటరు. ఈ బట్టలు పిండేటోల్లు అందరు బిడ్డ పొలగాండ్లకు మనిషికి ఒకటి ఇయ్యి అని అన్నరు. ఏయ్ నీ అవ్వ సాకలి కులం సత్తనాశం కాను. ఎప్పుడు మంది కొప్పలకు ఏడ్తరు. మీరేమన్న పండుగత్తే కంచులు పెట్టి కాల్తరు మీరు ఊరు ఊరా పడి బతికెటోల్లనాయే కంచులు నేనేమన్న కాల్సిన్న నేను ఇయ్య అంటడు. మరీ ఇవెక్కడియి బిడ్డంటే ఎవలో రాజులు మంచిగ యోధనాయోధులు సకినాలు బాగా చేసుకొని బండ్ల వేసుకొని పెద్దపెల్లికి బాడిగ పోతరట. సకినాలు అమ్ముకుంటానికి పోతరు. వాళ్లు పోంగ ఆడోకటి ఆడోకటి పడితే ఏరుకుంట పోతున్న అని మీరు పోర్రి మీక్కుడా దొరుకుతదని చెప్పి ఈ పిలగాడు అనేవరకల్లా సాకలోల్లు ఒక్కలు కూడా లేరట. అందరు పిల్లలు, తల్లులు అందరు పెయినకొద్ది మనిషికొకటి దొరుకుతుందట. అందరు పోయినంక వీడు ఏం చేసిందంటే మంచి మంచి శెద్దరులు, జాంగలు, చెడ్డీలు, చీరలు బట్టలు నచ్చినట్టు మూట కట్టిండు. నెత్తి మీద ఎత్తుకొని పోతుండు. సాకలోల్లు అచ్చేవరకల్లా బట్టల్లేవు. హైదరాబాదు నుంచి తుర్క సాహెబు గుర్రాల మీద అత్తుండు. ఆ గుర్రం ఏసుకొని రాంగ ఆయనకు లాట్రిన్ అత్తది. ఆడు మాలేకు సలాం అంటే నమస్తే అన్నడు. నేను తొవ్వ తప్పి అత్తున్న ఒక ఐదు నిమిషాలు గుర్రాన్ని పట్టుకొ. నేనిప్పుడే బాత్రూం పోయి అత్త అంటే ఏ.. అన్న సూస్త నేను నీ గుర్రాన్ని పట్టుకొని ఐదు నిమిషాలు హపెనవర్ గంట పట్టుకుంట నీకు ఏం బాధ అని చెప్పి గుర్రాన్ని ఇచ్చిండు. తుర్కయిన కట్ట దిగిపోయిండు. ఈడు గుర్రమెక్కి పోతుండు. తుర్కొడు అడిగిండు నీ పేరు ఏందని పాతప్పులు అని చెప్పిండు. గుర్రం పోవుడు చూసి ఓ పాతప్పులోడా ఆపు ఆపు మొత్తుకుంటడు. అప్పుడు ఆనకాల దినం నాట్లు ఏత్తుండు. ఈ తుర్కయినని ఏమంటుండు. ఏమి రా తుర్కయిన నీకు బుద్ది ఉందరా అంటడు. పాతప్పుల కింద గుర్రం ముట్టిపయె జనం అన్నరు. ఇగ ఈడు రాయపట్నం దాకా పోయిండు. కోమటోల్లు, సాకలోల్లు, తుర్కోడు ఎనుకనే అత్తరు. ఎట్లని చెప్పి గంగ పారతంది. గొల్లొల్ల ముసలవ్వ మనుమరాల్ని తోల్కొని ఆడికచ్చింది. మనమెట్ల పోదాం బిడ్డా అని బాధపడ్తుంది. బస్సులు, ట్రైనులు, కార్లు లేవు ఎటువోయిన కాలునడకనే పోవాలి. ముసల్దిదాన్ని చూసిండు అమ్మాయిని చూసిండు. మీరు ఎటుపోవాలంటే బిడ్డా మేం గంగదాటి పోవాలని చెప్పి అంటది. మమ్మల్ని దాటిత్తవా? అని చెప్పి అమ్మా మిమ్మల్ని దాటిత్త ఎందుకు దాటియ్య? మరి నిన్ను

మొదలు దాటిత్తగని కరువుకాలం చూడలేదు. పొల్ల భయపడ్తది మొదలు పొల్లను దాటిచ్చి తరువాత నిన్ను దాటిత్తనని చెప్పిండు. సరె బిడ్డా అనెవరకల్లా పిల్లని గుర్రం మీద కూసుండ పెట్టింది. కొడుక మరి గుర్రం మీద కూసుండ పెడతగని నీ పేరు ఏం పేరు బిడ్డ అని అడిగింది. నా పేరు దాని మొగుడా అన్నవొల్లె మరి దాని మొగుడా పొల్లయితే జాగ్రత్త అంటది. గుర్రాన్ని ఒక పీకు పీకినొల్లె గంగ దాటింది. ఈ ముసల్ది చూత్తే ఇడు ఇగ అత్తలేడు. పూలుబ్రిడ్జి కాడ ఓ దాని మొగుడా.. దాని మొగుడా.. నా మనవరాలు నాకు ఇయ్యి బిడ్డా నీ బాంచెన్ గంగకాడ ట్రాఫిక్ జామైంది. ముసలదానివి నీకేమన్న తలకాయ ఉందా? దాని మొగుడు దాన్ని ఎక్కించుకొని పోతండు. మధ్యల నీకేం రోగం పుట్టింది ముసల్దానా. ఈనె పిల్లన్ని తీస్కొని గుర్రం తీస్కొని అవ్వ గారి పట్నం అచ్చిండు. అవ్వ దగ్గరకచ్చి అవ్వ పైసకు గుడిసెన్నర పెండ్లాం దొరకదంటివి. ఇగో నువ్వు మొదలు ఇచ్చిన పైస తెచ్చిన, గుర్రం తెచ్చిన నీకు అవ్వ బట్టలు తెచ్చిన సెద్దరు తెచ్చిన ఇగో నీ కోడల్ని పట్కచ్చిన అని చెప్పి అవ్వకు ఇచ్చిండు. పైసకు గుడిసెన్నర పెండ్లాం అంటే గిదే పందెంకి పొయిండన్నట్టు.

## పైసకు గుడిసెన్నర పెండ్లాం – కథావిశ్లేషణ

యుక్త వయస్సులో ఉన్న ఓ పేద కుర్రాడు తల్లికి శపదం చేసి తనకు కావల్సిన వస్తువులను, భార్యను ఇతరుల నుంచి తెలివిగా తెచ్చుకోవడమే పైసకు గుడిసెన్నర పెండ్లాంలో కథావస్తువు. ఒక వైపు పేదరికంతో తల్లి తన కొడుకుకి యవ్వనంలో జరగాల్సిన అచ్చట ముచ్చట తీరటం లేదని కొడుకుతో బాధపడ్తుంది. దానికి కొడుకు తల్లికి ధైర్యం చెప్పి తన తెలివితో డబ్బు, బట్టలు, గుర్రం, యువతిని తెచ్చుకుంటాడు. ఈ కథలో యువకుడు ఇతరుల నుంచి అన్ని అపహరించినట్లు యువకుడి పాత్రను చిత్రించబడింది. కాని ఆ పాత్రతో నేటి కాలం తీరుని, కాలానికి అనుగుణంగా బతకడం నేర్చుకునే పద్ధతిని వ్యంగ్యంగా వ్యక్తపరిచినట్లు అనిపిస్తుంది. మొదట యువకుడు తన పేదరికాన్ని మార్చి, అమ్మకు కావల్సిన కనీస వసతులను సమకూర్చాలనే ఉద్దేశ్యంతో వేరే ప్రాంతానికి బయలుదేరతాడు. లక్ష్మీపురం ఊరి చేరి అక్కడ పూటకుల్లవారి (భోజన సత్రాలు, వసతి సౌకర్యాలు) ఇంటికి వెళతాడు. నాకు భోజనం పెట్టండి దానికయ్యే కొత్తలు (డబ్బులు) ఇస్తానని చెబుతాడు. భోజనం చేశాక డబ్బులు ఎక్కడ ఇస్తానన్నని బుకాయించి నేను ఆ ఊరికి కొత్త మాట మార్చుతాడు. కొత్త అనే పదాలు ఈ ప్రాంతంలో డబ్బులు అనే పదానికి అర్థాలుగా వాడతారు. అక్కడ నుంచి పారిపోయి సంక్రాంతి పండుగకు చకినాలు చేస్తున్న ఒక ఇంటికి వెళతాడు. ఆ ఇంట్లో తల్లి స్నానానికి వెళ్లిన సమయం చూసి

కూతురితో ముచ్చట కలిపి చకినాలన్ని మూట గట్టుకుని పరారవుతాడు. కూతురి పేరు అడిగితే ఒల్లెకం అని చెప్పి తల్లి ఒల్లెకం అంటే వట్టిగనే నా కూతురు అబద్దం చెప్తుతుందని అనుకుంటుంది. స్నానానికి వెళ్లి వచ్చిన తల్లి అమాయకురాలైన కూతురిని తిడుతుంది. ఆ చకినాల మూట పట్టుకుని తినుకుంట పోయి చాకలి రేవు కట్టకాడికి చేరతాడు. చాకలి వాళ్లు పిండే కొత్త కొత్త బట్టలు చూసి వాటిని ఎలాగైనా కాజేయాలని చెప్పి చకినాలు పిల్లలకి చూపించుకుంటూ తింటాడు. ఆ పిల్లలను కావాలని ఏడిపించి చకినాలు పంచుతున్నారని చాకలివాళ్లకు అబద్ధం చెప్పి వాళ్లను అటువైపుగా మళ్లించి అక్కడున్న బట్టలన్ని మూట కట్టుకుని పరుగెడతాడు. కొద్ది దూరం పోయిన తరువాత గుర్రం మీద ఒక ముస్లిం రాజ భటుడు గుర్రానికి కాపలా ఉంటానని చెప్తాడు. అతనికిచ్చిన మాట తప్పించి అక్కడ్నుంచి గుర్రంతో పరారైతాడు. చివరికి రాయపట్నం అనే ఊరి చివరన ఉన్న గోదావరి తీరాన్ని చేరతాడు. ఆ గోదావరి నిండా నీరు పారుతుంది. ఆ గోదావరిని దాటించడానికి ముసలవ్వ, యువతి ఇద్దరు ఎవ్వరైనా సహాయం చేయ్యక పోతారని చూస్తున్నారు. ఇంతలో ఆ యువకుడు వచ్చి ఇదే సరైన సమయం అనుకుంటాడు. ముసలవ్వతో మాట్లాడి నేను సహాయం చేస్తానని చెప్పి ముందు యువతిని దాటిస్తాడు. ఆ తరువాత ముసలవ్వని వదిలిపెట్టి ఆ యువతిని తన ఇంటికి తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. తన తల్లితో వేసిన పందెం ప్రకారం బట్టలు, గుర్రం, భార్యని సంపాదించుకుని ఇంటికి చేరతాడు. అందుకే పైసకు గుడిసెన్నర పెండ్లాం అనే శీర్షికతో ఒక పైసతో ఇంటి నుండి వెళ్లిన నిరుపేద యువకుడు తిరిగి వచ్చేటప్పటికి తల్లికి చెప్పినవన్ని తెచ్చుకొని తల్లికిచ్చిన మాటని నేరవేరుస్తాడు.

1. కాలం, యవ్వనం తిరిగిరానివి. ఎంత సంపాదించాలన్న ఏది సాధించాలన్న యుక్త వయస్సులోనే యువతతోనే సాధ్యం. తల్లిదండ్రుల మీద ఆధారపడే వయస్సు దాటాక కూడా తమ బాధ్యతలు ఎరగకుండా ఉండే యువకుల్ని ప్రేరేపితం చేసి, చైతన్యపరచడానికి ఇలాంటి కథలు కల్పించారని ఈ కథలో యువకుడి పాత్ర ద్వారా తెలుస్తుంది.

2. ఈ కథ లభించిన ప్రాంతం ఈ జిల్లా ప్రాంత వాసులు ఉన్నచోట ఉపాధి లేక వలస బాట పట్టడం సహజం. ముఖ్యంగా యువత కూలీనాలి పనికోసం విదేశీ బాట పట్టి అందరికి దూరంగా వలస వెళ్లి సంపాదించుకొని రావడం నేటికి మనకు చాలా పల్లెల్లో కనిపిస్తుంది. అందుకే ఈ కథలో కూడా యువకుడు తన ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి వివిధ ప్రాంతాలకి వలస వెళ్లి సంపాదించాడని కథలో ఆంతర్యం.

## 2.4.4.4 ఒక గుండుకు రెండు గుండ్లు

దీకొండ పర్వతాలు, ఆత్మకూరు గ్రామం, గొల్లపల్లి మండలం.

అయితే ఒక గ్రామం లోపల ఆళ్లు గొల్లోలు. ఒక కొడుకు. కొడుకుకు లగ్గం చేయాలంటే నాలుగు ఊర్లు తిరగాలి. మంచి సంబంధం కావాన్నయే అత్త మామ మల్లమ్మ కొడుకు పేరు రాజమల్లు ఓ నాలుగు ఊళ్లు తిరిగి కొడుకు లగ్గం చేసింది. తల్లి కొడుకులకు మంచి ప్రేమ ఉన్నదన్నట్టు. ఓనాడు తల్లికి నెత్తిల పెన్లు బాగా వద్దయి. కోడలా ఎట్ల బిడ్డంటే కొంచెం పేన్లు సూడు బిడ్డ అన్నవొల్లె రెండ్రోజులు చూసింది. తానం పోసింది. మూడోనాడు కోడల్కి రిస్క్ అనిపిచ్చింది. దీని ఎంటుకలు రోజు పేన్లు సూసుడయితంది. మంగలోన్ని తీస్కచ్చింది. మంగలోన్ని పట్కచ్చి మొత్తం గుండు తీయించింది. గుండు తీయించి తానం పోసిందయింత. గొర్లకాడికి వోయి కొడుకు ఇంటికచ్చేవరకల్లా సూరు కింద కూసుంది ఈల్లొవలబ్బ కొత్త సుట్టం. ఏమో ఇంట్ల ఉన్నవా అంటే ఉన్న అన్నది మరి మా అవ్వ ఎటుపెయిందట సుట్టలు ఎందుకచ్చిర్రు మీ అవ్వ రోజు పేన్లు ఎంతకని సూడాలని రోజు పేన్లు సూడుమంటది తానం పోయివంటది. రెక్కలు ఒత్తుమంటది. మీ అవ్వకు గుండు తీసిన. మావ్వకు గుండు ఎందుకు తీసినవ్? అంటే అవ్వగారింటికి పోతది. పెద్ద మనుషులు ఏమంటర్రు పంచాయితీ చెప్పుమంటే ఓ రోజు బీరు అంటు, ఓ రోజు కోటర్లు అంటరు. ఈయాళ చెప్తమంటరు. రేపంటరు. ఇంటికాడ ఏమి తాగానోడు కూడా ఆడపెయినంక బీరంటడు. మరెట్ల మరి ఆళ్లకు పెట్టాలి. ఇదంతా రాశికనం ఏంది అన్నడు. సరే అయితమాయే తియ్.. ఎట్లుంటే అట్ల జరుగుతది. మరి మీ అవ్వ గారింటికి పోక బాగా రోజులయ్యే పొబుద్దైతుంది. పోయత్తంటే పోయిరా ఏం నేను కూడా అనుకుంటున్న ఇద్దరు పోదామంటే ఇద్దరం ఏం చేత్తం. ఇంటి కాడ మేక పిల్లలు, గొర్రె పిల్లలున్నయి. మేకలు ఇంత ఆకులు తెచ్చిపెట్టు. నేను ఇయ్యాళ పోయత్త అన్నడు. సరే పోయి రాపో అన్నవొల్లె అయింత ఏం చేసిండు మల్లయ్య. ఆళ్ల అవ్వ గారింటికి పోయిండు. ఆనికి ఆకిలి ఊడిసే అత్త ఉరికచ్చి అల్లుడా! ఇప్పుడే అత్తున్నవా అంటే ఆ...! ఇప్పుడే అత్తున్న మరి మా బిడ్డ మంచింగ ఉందంటే నేను ఏం చెప్పాలి అత్తమ్మ ఈడికి పదిహేను రోజులయ్యే మీ బిడ్డ అన్నంల చేయి తీత్తలేదు. జారుతలేదు. బొమ్మడంగ రోగం అచ్చింది. అచ్చిన జ్వరం జారుతలేదు. హస్పిటల్ పోక పోయినవా? అంటే పోయిన భూంరెడ్డి హస్పిటల్ పోయిన ప్రతి హస్పిటల్ పోయిన టెంపుల్ల సూయించిన గంగల రంగపేట అయ్య గారి దగ్గర సూయించిన ఎవ్వరితో సూయించిన ఏ అయిద్యుని దగ్గర పోయినగని ఆ పోల్ల జరం జారుతలే. తల్లి గిట్ట బతికుంటే తల్లి

గుండు తీసుకుంటే మూడు రేవుల గుండు తీసుకొని నాలుగు డప్పుల సప్పుడొకటి బిడ్డింటికి అత్తే మూడు తొవ్వల కాడ బిడ్డ సప్పుడు ఇంటే అప్పుడు రోగం పోద్దట. నేను ఏం చేయ్యాలి. చెప్పుదామంటే దైర్యమత్తలేదు అని చెప్పి ఈనే ఏడ్తడు. బిడ్డ నీ బాంచెన్! నా బిడ్డ కన్న ఎక్కువనే నా ఆస్తి పోనీ నా పాస్తి పోనీ ఎంటుకలు పాడుగాను మల్ల రావా నీ బాంచెన్! బిడ్డా! అని చెప్పి మంగలోన్ని తీస్కచ్చుకుని మూడు రేవుల గుండు తీసుకుంది. సున్న బొట్లు పూసుకుంది. ఊదుబొట్లు పొడుసుకుంది. నేనత్త ప...! బిడ్డ ప...! సప్పుడు ఇన్నవొల్లె రోగం పోతదని చెప్పిండ? తయారైంది ఈడు ఇంటికచ్చిండు. ఎమాయేనే మావ్వ మంచిగుంద అని అంటే నేను ఏం చెప్పాలే మా అవ్వ మంచిగుందని ఎట్ల చెప్పాలి. తిరగరాని రాజ్యం తిరుగుతుందట పోని దవాఖానా లేదు. ఒకవేళ తల్లికి బిడ్డుంటే బిడ్డకి మూడు రేవుల గుండు తీస్కోని మూడు తొవ్వల ఊరు బందుకాడకచ్చి డప్పు సప్పుడు ఇంటే అవ్వ రోగం మగ్గుతుదట. నేను నీకు ఏమని చెప్పాలే. లగ్గం చేసుకుంటి నిన్ను గుండు తీసుకొని చెప్పి నేనత్తద అని చెప్పి ఈనే బాధ పడుతుండు. వావ్వ! నీ బాంచెన్ నీకు ఎట్లు రోగం అచ్చెన అని చెప్పి బొచ్చెంత గుద్దుకుంట నా ఎంటుకలు పోని నావ్వ కన్న ఎక్కువన తీస్కరాపో మంగలోని కొడుకు శేఖర్ గని పట్కరా పో నా గుండు తీసుకుంట అనేవరకల్లా సరే అని చెప్పి మంగలోన్ని తీస్కచ్చి గుండు తీసిండు. నాలుగు దప్పుల సప్పుడు తెచ్చిండు. అక్కడికెల్లి గాడిద మీద అత్తుంది. ఈమె ఇక్కడ కర్రె గాడిద ఎక్కి జె జజ్జెనక జ్జె జ్జె....జం జం... అనుకుంట కొట్టుకుంట ఊరు బందుకచ్చిరు. తల్లిని బిడ్డ బిడ్డని తల్లి చూసిరు. అవ్వ నీ రోగం మగ్గిందని చెప్పి పిల్ల ఎడ్తతంది. బిడ్డ నీ రోగం మగ్గింద అని చెప్పి అవ్వ ఏడ్తంది. ఈళ్లిందరు గుండ్లు మంచిగ సప్పుడుతో అచ్చేవరకల్లా ఊళ్లే ఉన్న మంది మొత్తం మంది ఊళ్లే ఇది జాతరన. తల్లి గుండు పిల్ల గుండు ఇదేంది మల్లయ్య అని చెప్పి అడిగితే అయ్యా! నేను ఏం చెప్పాలి. పది నిమిషాలు అగుర్రి అన్నడు. ఈ మూలకు కూసున్న అవ్వ గుండు తీసుకున్న అవ్వ తీస్కచ్చిండు. అయ్యా! మా అవ్వ కొంచెం పేన్లు సూడమంటే కోపమచ్చి మా అవ్వకు గుండు తీయించింది. కోపమచ్చి దెబ్బ కోడితే అవ్వగారింటికి పోతే అట్ల కర్సు అయితదని చెప్పి నా అవ్వకి ఒక గుండు తీపిత్తే తల్లి బిడ్డలిద్దరికి గుండ్లు తీపిచ్చిన నా తప్పు ఉంటే సెప్పుర్రి అని అడిగిండు. అంటే మొదలు కోడల్ది తప్పు గుండు తీసినందుకు. ఆ పొల్లది తప్పు ఆనాటి నుంచి అత్త మంచిళ్లు ఇచ్చి కూకున్న కాడ తానం పోతంది. ఒక గుండుకు రెండు గుండ్లు చేసిండు.

## ఒక గుండుకు రెండు గుండ్లు – కథావిశ్లేషణ

ఒక కొడుకు తన తల్లికి జరిగిన అవమానాన్ని తట్టుకోలేక దానికి కారణమైన తన భార్యకు తగిన శిక్ష పడేలా చేయడమే ఈ కథలో ప్రధాన వస్తువు. జానపద కథల్లో సాధారణంగా అత్త, కోడళ్ల మధ్య కథలు అనేకంగా ఉంటాయి. అదే కోవకు చెందిన కథే అయిన ఈ కథలో కొడుకు పాత్ర ద్వారా కోడలికి శిక్ష పడేలా చేస్తాడు. ఒక తల్లి యుక్త వయస్సుకి వచ్చిన కొడుకుకి వివాహం చేస్తుంది. అతన్ని వివాహం చేసుకున్న ఆ స్త్రీ మొదట్లో అత్తని బాగా చూసుకుంటుంది. కొద్ది రోజుల తర్వాత అత్తను చూసుకోవడం భారంగా భావిస్తుంది. రోజు అత్తకు సేవల చేయడమేంటని చిరాకు పడుతుంది. అత్త తలలో పేన్లు చూసి పెట్టమని అడిగితే కోడలు ఏకంగా మంగలివాన్ని పిలిపించి వెంట్రుకలన్ని కత్తిరించి గుండు చేయిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న కొడుకు తన భార్యని నేరుగా ఏమనకుండా ఎలాగైనా నా తల్లికి జరిగిన అవమానం, నీకు నీ తల్లికి జరిగాలని మనసులో పెట్టుకుంటాడు. మరుసటి రోజున నేను మీ అమ్మ గారింటికి వెళ్లివస్తానని చెప్తాడు. భర్త తల్లి గారింటికి పోతున్నడంటే సంతోషంగా సాగనంపుతుంది ఆ ఇంటి కోడలు. ప్రతీకారంతో ఉన్న భర్త అత్తగారింటికి వెళ్లి అత్తతో మీ కూతురు ఆరోగ్యం బాగా లేదని అబద్ధం చెప్తాడు. మీ కూతురు ఆరోగ్యం బాగుండాలంటే ఆమె తల్లైన మీరు గుండు తీయించుకుని నాలుగు బజారులు ఉన్న కూడలి వద్దకు డప్పు చప్పుడుతో వచ్చి పిలవాలని చెప్తాడు. అప్పుడే మీ కూతురు తిరిగి కోలుకుంటుందని చెప్పి ఇంటికి చేరతాడు. తన కన్న తల్లిదండ్రుల బాగోగులు ఎలా ఉన్నాయని భార్య భర్తని అడిగితే అక్కడ చెప్పిన విషయమే మార్చి చెప్తాడు. నువ్వు గుండు తీయించుకుని కూడలి వద్ద కెల్లి మీ అమ్మని కలవాలని చెప్తాడు. తల్లి, కూతురు వాళ్ల మీద వాళ్లకున్న ప్రేమతో గుండ్లు తీయించుకుని సున్నపుబొట్లు పూసుకుని కూడలి వద్దకు వస్తారు. ఆ కూడలి గ్రామ ప్రంచాయితీల్లో తీర్పు చెప్పె కచ్చీరు లాంటిది. అక్కడికి వచ్చిన తల్లి కూతుర్లని చూసి జనాలంతా నవ్వుకుంటారు. తల్లి కోసం బిడ్డ, బిడ్డ కోసం తల్లి గుండు చేయించుకున్నట్టూ వాళ్లకు తెలియదు. ఇదే అదునుగా భర్త అక్కడికి వచ్చి నా తల్లి గుండుకు కారణం నా భార్య. అందుకే నేను అబద్ధం చెప్పి వాళ్లకు వాళ్లు గుండు చేయించుకునేలా చేసానని ఆ గ్రామ పెద్దలకు చెప్తాడు. మీరే న్యాయం చెప్పండి మీ తీర్పు నేను ఆహ్వానిస్తానని తన భార్య చేసినా తప్పుని నలుగురికి చెప్పి శిక్ష వేయిస్తాడు. తన తల్లికి ఒక గుండు తీపించిన భార్యకు అదే బాధను రుచి చూపిండానికి భార్యకు, అత్తకు గుండు కొట్టించాడు. కన్న తల్లిపై తనకున్న ప్రేమను చాటిచూపాడు.

1. స్త్రీలు సాధారణంగా వివాహం జరిగిన తరువాత అత్త గారింటి వైపు చుట్టరికానికన్న కూడా తల్లిగారింటి చుట్టరికానికే ఎక్కువ విలువ యిస్తారు. అందుకే జానపద కథల్లో అత్త, కోడలు మధ్య జరిగిన సంఘటనల్లో ఎక్కువగా తల్లిగారింటి వైపు వాళ్లపై ఎక్కువగా ప్రేమ ఒలకబోసి అత్తగారింటి బంధువులతో మాత్రమే అంటి అంటినట్టుగా ఉండటం జరుగుతుంది. కన్నవారిపై ప్రీతి ఉండటం తప్పుగాదు కాని అది ఇతరులను ఇబ్బంది కలిగించేటట్టు ఉండటమే బంధుత్వంలో విబేధాలకు కారణమవుతాయి.

2. భార్య చూపే ప్రేమ, మోజులో పడి తల్లిదండ్రులను హీనంగా చూసే కొడుకులు లేకపోలేదు. అలాంటి వారిపై తల్లిదండ్రుల మీద ప్రేమను కలిగించి వాస్తవాలను తెలుసుకునే దిశగా ఈ కథలో రాజమల్లు పాత్ర చిత్రించబడింది.

3. ఈ కథలో  జానపదులకు మూఢ విశ్వాసాలు, ఆచారాల మీద నమ్మకాలెక్కువ. అనారోగ్యంతో బాధపడేవారిని ముందు ఈ ఆసుపత్రికి తీసుకెళ్లకుండా దొంగ బాబాలను, స్వాములను నమ్ముకుంటూ కాలాన్ని హరిస్తూ రోగికి అసలైన వైద్యం అందకుండా చేసే వారున్నారు. దేవతలు పూనడం, దేవుడు రావడం, శివసత్తెలుగా మారడం, తాయిత్తులు కట్టించుకోవడం, పసుపు మింగడం ఇలాంటి పలు రకాలు నమ్మకాలు ఈ ప్రాంతంలో నేటికి విశేష వ్యాప్తిలో ఉన్నాయి.  ఈ కథలో కూడా అనారోగ్యం బారిన పడ్డప్పుడు గుండ్లు కొట్టించుకుంటే తగ్గుతుందని నమ్ముతారు.

4. పూర్వం గ్రామాల్లో ఏదైనా తప్పు చేసిన వ్యక్తిని కచ్చీరులో నిలబెట్టి తీర్పు చెప్పడం. నిందితుడికి శిక్షని విధించిడం. అమలు చేయడం అనేవి ఉండేవి. కొన్ని సంఘటనలకు కుల సంఘాల్లో తీర్పు చెప్పడం. న్యాయం కోసం వారి వారి కులసంఘాలను ఆశ్రయించడం. పెద్దల మనుషుల తప్పుకు తగ్గ శిక్షలు వేసేవారు. ఆ తరువాత వారికి ఆ రోజు మద్యం, భోజనం కార్యక్రమాల ఖర్చులను నిందితుడు, న్యాయం కోసం ఆశ్రయించినవారు కలిసి సమానంగా సమకూర్చుకోవాలి. ఈ కథలో కూడా రాజమల్లు పెద్దలు న్యాయం నిర్ణయిస్తారో లేదో అనే మాట అటుంచి కార్యక్రమ నిర్వహణ ఖర్చుకు భయపడి భార్యను, అత్తను కచ్చీరుకే వచ్చేటట్టు పథకం వేస్తాడు.

## 2.4.4.5 లింగం కట్టుకున్న నక్క

దీకొండ పర్వాతాలు, ఆత్మకూరు గ్రామం, గొల్లపల్లి మండలం.

శంకరుడు ఎండికొండ కైలాసన శంకరుడు. శంకరుడు ఓం నమ:శివాయ అని పదిసార్లు జపిస్తే ఎంత పాపిష్టి వాళ్లకైనా శంకరుడు ప్రత్యక్షమైతడు. అయింత పరమాత్మ కథ ఇట్లుండంగా అడవిల ఒక నక్క. ఈ నక్క ప్రతిరోజు నక్క కులం తోక తీసి పొక్కల పెట్టింది. ఓ ఎండ్రికాయ కొండ్లతో పట్టంగనే పట్టుకొని గుంజుకొని తింటంది. నక్క అట్ల చేసేవరకల్లా మీదికెల్లి శంకరుడు పోతండు. నాకొక ఎద్దైనా వరం కావాలని చెప్పి ఈ శంకరుడు గురించి నక్క ఏం చేత్తంది గదంటే ఓం నమ శివాయ ఓం నమ శివాయ అని చెప్పి జపించు కుంటంది. ఉండంగ శంకరుడు తిరిగెల్లా లోకం తిరిగి పరగాల్ల తానం చేసి మల్ల తిరిగత్తండు. తిరిగిరాంగ కూడ నక్క శివుని ఆజ్ఞ జోలి తీత్తంది. శివుని మతంలో ఉన్నది. శంకరుడు స్వయంగా పార్వతి శంకరులు అచ్చి నక్క మహరాజా నీకేం కావాలి బిడ్డ అంటే అయ్యా నేను నీ భక్తిల ఉంట నాకు లింగం కట్టు నాకొక లింగ కట్టు. నేనెప్పట్టికి నీ భక్తిలనే ఉంట. లేదు బిడ్డ నక్క రాజా నువ్వ్ తెల్లారిన, పొద్దికిన నీసు, కౌసు తింటవ్. నీకు లింగం పనికి రాదు బిడ్డ. లేదయ్య నాకు పనికత్తది. నేనప్పడికి ఓం నమ శివాయంట నీ ధ్యాసలనే ఉంట. నీ భక్తిలనే ఉంట నాకు లింగం కట్టాలి నువ్వు అంటది. సరే బిడ్డ నా భక్తిల ఉంట అన్నవ్ నను యాజ్జేసినవ్ అని చెప్పి కడ్త అని నక్కకు లింగం కట్టిండు. కట్టి శంకరుడు ఎనుకకు మర్రిండు. గంట అయింది రెండు గంటలయింది. ఒకరోజు రెండు రోజులు గడిసే ఎక్కడలేని ఆకలైతుంది. నక్క మెడకు లింగం ఉండే నేను నీసు కౌసు ముట్టరాదయే. నక్క ఏమనుకుంది. శంకరుడు సూడత్తండ. శివుడు ఈడికి సూడత్తండ. ఈ పొక్కల తోక పెట్టి అయింత బయటికి ఎండ్రికాయ గుంజుకొని కట్కమని నమల్తంది. కట్టుకున్న ఇల్లు మనకు నీడ, పెట్టుకున్న గోడ మనకు సాటుగాని శివునికి ఏం సాటు ఏం సాటులేదు. ఎంటనే శివునికి ఏర్పడ్డది. అరెరె నక్క ఎంత పని చేత్తివని చెప్పి ఎండికొండ కైలాసం నుంచి శంకరుడు అత్తుండు. శివున్ని చూసిందా నక్క ఎగబడి ఉరుకుతుంది. ఉరికి ఉరికి కందికొయ్యలకెల్లి ఉరుకుతుంది. శంకరుడు ఈనే అచ్చిండు. కందికొయ్య కంట్లే కుచ్చ నక్క కన్ను పోయింది. నక్క ఆడ్నే అగింది. ఏమే నక్క ఎంత పని చేత్తివి. అద్దంటే లింగం కట్టుకుంటనంటివి. ఎంత పని చేసినవ్ బిడ్డ. గిది పద్ధతి గాదంటే నువ్వు లింగం కట్టుకుంటివి నువ్వు కౌసు నీసు తినచ్చున అడిగిండు. నక్క ఏమంటుంది తెల్సి

ఈశ్వరా! లింగం నువ్వు గుడ్డి నక్కకు కట్టినవా? మంచి నక్కకు కట్టినవా? మంచి నక్కకు కట్టిన. సూడు నేను గుడ్డి నక్కని అప్పుడు శంకరుడిని ఓడించింది నక్క.

## లింగం కట్టుకున్న నక్క – కథావిశ్లేషణ

శివుని అనుమతి తీసుకుని శైవదీక్షకుపూనిన ఒక నక్క తన నిగ్రహన్ని కోల్పోయి మాంసాన్ని భుజిస్తుంది. ముందే నక్క తత్వాన్ని గ్రహించిన శివుడు ఎంతో నిష్ట నియమాలతో ఆచరించవల్సిన శైవదీక్ష గురించి చెప్తాడు. నక్క నువ్వు మాంసాహారివి. ఆకలికి తట్టుకోలేనిదానివి. నీతో ఈ దీక్ష పూర్తవడం అసంభవమని సెలవిస్తాడు. అయినా కూడ లెక్క చేయకుండా తన భక్తి అపారమైనదని గొప్పలు చెప్తూ శైవ దీక్ష తీసుకుంటుంది. ఇక శైవ దీక్ష తీసుకున్న నక్క రెండు మూడు రోజుల తరువాత మాంసాన్ని తినాలనిపిస్తుంది. నిత్యం మాంసాన్ని మాత్రమే అమిత ఇష్టంగా తినే నక్క ఆకులు, అలమలు తింటూ శాకాహరిగా ఉండటం సాధ్యం కాని పని. రోజు శివుడు తాను చేసి ప్రతి పని చూడగలడా అని నిర్లక్యంతో చెరువులో ఉన్న పీతలను పట్టుకుని తిన్నది. అది గమనించినా శివుడు నక్క చేసినా తప్పిదాన్ని నిలదీయడానికి బయలుదేరతాడు. అసలే జిత్తుల మారి నక్క. శివుడి నుండి ఎలా తనను తాను రక్షించుకోవాలో ఉపాయం ఆలోచిస్తుంది. శివుడికి దొరక్కుండా కొద్ది దూరం పరుగు తీసి ఒక చెరుకు గడ చేనుల పడి పరుగెడుతుంది. ఒక కన్ను దెబ్బ తాకించుకుంటుంది. నక్క పరుగెత్తి అలసిపోయి ఒక చోట ఆగిపోతుంది. శివుడు దగ్గరకి వచ్చి నక్క నా దీక్ష పూని ఆచరించడం అంతా సాధ్యమైన పనికాదని ముందే చెప్పాను. అయిన నా మాట లెక్క చేయకుండా పట్టు పట్టి మరి నా దీక్ష తీసుకున్నావు. కాని రెండు రోజులు కూడా ఆకలికి నిగ్రహించుకోలేని నువ్వు నా దీక్ష తీసుకుని తప్పు చేసావని నిలదీస్తాడు. అంతలోపే శంకరుడు నువ్వు నీ దీక్ష ఇచ్చింది ఎవ్వరికి మంచి కన్ను ఉన్న నక్కకి ఇప్పుడు నేను గుడ్డి నక్కని. నన్ను ఎలా నిలదీస్తావని దబాయిస్తుంది. నక్క తెలివికి ఆశ్చర్య పోయిన శివుడు నా నుంచి తప్పించుకుని నన్నే ఓడించావని నిశ్చేష్టుడవుతాడు.

1. క్రూర జంతువులు అన్నింటిలో నక్క చాలా తెలివైనది. జిత్తుల మారి నక్క అనే పేరు కూడ రూఢిలో ఉంది. అలాంటి నక్కతో పందెం వేసిన శివుడు సైతం ఈ కథలో ఓడిపోవాల్సి వచ్చింది. మనం చేసిన తప్పులకు కూడా కారణం చెప్తూ ఏవిధంగా తప్పించుకోవచ్చునని విషయాన్ని నక్క శివుడికి వేసిన ప్రశ్న ద్వారా అర్థం చేసుకోవచ్చు.

2. ఒక కార్యాన్ని పూనినప్పుడు మంచి కార్యదక్షతతో, నిగ్రహంతో ఆ కార్యాన్ని సమర్థవంతంగా పూర్తి చేయగలగాలి. అంతేగాని మనకు సాధ్యం కాని, శక్తికి మించిన కార్యాలను మొదలుపెట్టకూడదు. ఒక వేళ మొదలుపెట్టినా అసంపూర్తిగా వదిలిపెట్టకూడదు. అలా చేసినప్పుడు మన మీద ఇతరులు ఉంచుకున్న నమ్మకాన్ని కోల్పోతామనే విషయం కూడా ఈ కథ ద్వారా తెలుస్తుంది. ఈ కథలో కూడా నక్క పాత్ర తనతో కాని పనికి పూనుకుని, చివరికి శంకరుడి నమ్మకాన్ని కోల్పోతుంది. శక్తియుక్తులకు మించిన కార్యాన్ని మొదలుపెట్టకపోవడమే ఉత్తమం అనే విషయం బోధపడుతుంది.

## 2.4.5 రాజనీతి కథలు

### 2.4.5.1 గొల్ల బోయని రాజనీతి

పెంట గంగరాం, బుద్దేశ్‌పల్లి గ్రామం, ధర్మపురి మండలం.

పూర్వ కాలంలో ఒక పట్టణ రాజుగా ఉన్నట్టువంటి రాజు. రోజు మన ఊరిలోకి దొంగలు ఎవరు వస్తుర్రు. మరి రోజు దండిగ వచ్చి దొంగలున్నరు జాగ్రత్తని దండోరా వేయాలని సమస్య వేసుకుంటా చెప్పుకుంటనే చెప్పినోల్లే మంత్రివర్యులు వోయి హరిజన కులానికి మన ఊరికి దొంగలు రాకుంట మెలుకువతో ఉండి కాపాడుకోవాలని మేం కూడా మా రక్షకభటులు అందరం సహకరిస్తం. మీరు కూడి మాకు సహకరించాలని చెప్పి ఆ మంత్రి చెప్పినోల్లే ఆ ఊరిలో మనిషికి కొంచెం సేపు పండుకోవడం కొంచెం సేపు లేవడం ఈ రకంగా దొంగలు రాకపోవడం మొత్తం జరిగే అదే తరుణంలో సమయాన్ని బట్టి ఈ యొక్క బ్రాహ్మణుడు హరిదాసుగా దొంగలు బందు అయిపోయినా నెల రోజులు రాజు దగ్గరికి వోయి రాజా రాజా ప్రణమిల్ల అడుగుతున్న నాకెమెన్న సంభావన ఇప్పించరా అడిగిండు నోటినిండారా రాజా అన్నడు. హరిదాసు నీకు సంభావన ఇయ్యకా? ననూ సంతోష పెట్టవా? నన్ను సంతోష పెడితే పెట్టకున్న ఇస్త సంతోష పెట్టడం నీ ధర్మం గదంటే అవును సామి! రాజా బరాబరి... పూర్వంలో ఉన్న శాసనంలో రాసిందో, రాయనిదో గాని అప్పుడు హరిదాసు

జలే జలే గంగాజలే
భలే భలే బంధుభలే
జాగ్రత్త జాగ్రత్త రాజా

దీనర్థం నాకు తెలువదు గదంటే. మరి హరిదాసు చెప్పుమని రాజంటే అయ్యా ఈ ప్రపంచంలో సర్వం కొట్టుకుని జలం గంగ గోదావరిలో వస్తుంది. గనుక ఆ గంగాజలం శ్రేష్ఠం. అన్ని దేవుళ్లకు వర్తిస్తది.

అందరికి సమ్మతమే. గనుక ఆ జలాన్ని మించిన జలం లేదు అని అర్థం. మరీ భలే భలే బంధుభలే అంటే అయ్యా! చుట్టూ పక్కవాళ్లు అందరు మనకు వేరే రాజు దండెత్తిన్నపుడు మన ఊరు వాళ్లు చుట్టాలకు బంధువులకు అందరు మనకు ఐక్యమవంగ అంటే బలం బలం బంధుబలం చుట్టాలు అందరు ఉన్నప్పుడు మన రాజ్యంలో ఉన్న సైన్యం గూడా కరక్టే ఉన్నపుడు ఇతర రాజ్యం మీద దండెత్తి మనం యుద్ధం చేసి గెలిసే అవకాశం ఉంది. గనుక జాగ్రత్త జాగ్రత్త అంటే ఆలోచించి ఆలోచించి రా అయ్యా రాజా! అని చెప్పి అన్నవోల్లె అప్పుడు ఒక బంగారు పతకం తీసి హరిదాసు మేడలో వేస్తాడు. హరిదాసు రాజభవనంలో సొచ్చేటప్పుడు ఒక గొల్ల బోయడు గొర్లని మేపుకుంట చేరిండు. పొంగ వట్టి మేడతో పోయిండు. రాంగ బంగారు బిళ్లని ఏసుకొని ఏల్లే వరకు ఈ గొల్ల బోయడు మల్ల చూసిండు. చూసి ఓ హరిదాస హరిదాస మరి పోంగ అట్టి మేడతోటి పోతివి. రాంగ ఇదేందో మెరుత్తుంది. పతకం పెద్దదే బంగారం తరకనే ఇదేంటి దొంగతనంగా గిట్ట తెచ్చుకున్నవా? నీకెవలు ఇచ్చిర్రు. ఎందుకు ఇచ్చిర్రు. అని చెప్పంటే ఓ గొల్ల బోయడా! నేను ఏం చెప్పాలి నీకు. నాకు రాజు ఇచ్చిండు. ఎందుకిచ్చిండు నాకు చెప్పేదాకా అర్థం అయితలేదని గొల్ల బోయడు మంకు పట్టి అడిగితే అప్పుడు ఈ హరిదాసు ఏమనుకున్నడంటే ఈ  గొల్లబోయని తిక్క కాకపోతే కొట్టిన కొడతడు. ఇగ బాహ్మణుడు పిరికిగాకపోతే ఎట్లుంటది అట్లే ఉంటది. ఓ బోయడా! శ్రద్ధగ విను గిట్ల సాత్రమన్న జల జల గంగజలే బలే బలే బంధుబలే అంటే అయ్యా దానికర్థం తెలియక ఈ గొల్లబోయడు కూడ అడిగితే ఇదే ప్రకారంగ రాజుకు చెప్పినట్టే చెప్పిండు. మరే నువ్వన్నట్టుగ నేనొకటి అంట. రాజు దగ్గరికి తీస్కపో అని చెప్తే హరిదాసు అంటడు. నేనిప్పుడే లోపలికొయి మీదికి రావాడితి మల్ల నేను అస్తే నడుస్తదా అంటే నను లోపలికి పోనిస్తరా ద్వారపాలకులు నీవుంటే నన్ను లోపలికి అనుమతిస్తరు. నువ్వుండు పదాని చెప్పి అన్నాడు. తప్పదు బగవంత! అని చెప్పి ఈని గొర్లు ఇక్కడనే పోతున్నయ్. మేసుకుంట పోతున్నయ్ ఆ గొల్లబోయన్న తీస్కపోయి రాజుకి చెప్తే రమ్మను అని చెప్పి పిలుస్తారు. లోపలికిపోతే రాజు హరిదాసుని నిను సంతోషపెడితి మల్లచ్చినంక అంటడు. అయ్యా! నాకు కడుపు నిండింది సంతోషమే సంభావన కుశలుగా ఇచ్చిర్రు. కాని గొల్లబోయడు ఒకటి అంటడట. అయ్యా  ఆయన మాట వినుర్రి. నువ్వు వుంటేనే ద్వార పాలకులు లోపలికి పోనిత్తరని చెప్పి తమ ఆజ్ఞ మీరి తీస్కరావడం జరిగిదంటే సంతోషం గొల్లబోయడు సంతోష పెట్టడమే. నీకు తోచింది నువ్వ్ అను అన్నంక అయ్యా! ఈ హరిదాసు జలే జలే గంగ జలే అన్నడు గద. కాదు గంగాజలం మరి ఏం జలం శ్రేష్ఠం అన్నడు. జలా జలే మేఘాజలే

మేఘం లేనిది గంగాపారది అన్నడు. ఇది మంచిగనే ఉన్నది గొల్లబోయడా ఇది మంచిగనే అనిపిత్తంది. కరక్టే మరినేను బలే బలే బంధుభలే చుట్టాలు, సైనికులు బలంగా పక్కనే ఉండాలన్నాడు హరిదాసు మరి దానికి నువ్వేమంటవ్ అంటే అయ్యా బలేబలే బంధుబలే గాదు బలే బలే భుజబలే అని రెక్కలు ఇడిసి రాజు తన భుజ బలమే పదిమంది ధైర్యం, నీ సైన్యాన్ని నమ్మద్దు. నీ పొంట ఉండె నీకే వెన్నుపోటు పొడుత్తరు. గనుక నమ్మే విషయం లేదు. గనుక నీ నీడను కూడ నమ్మరాదు. అంత జాగ్రత్తగా కొద్ది ఉన్నప్పుడు రాజు పరిపాలన చేసి వేరే ఊరికి దండెత్తినప్పుడు మన యుద్ధంలో గెలిచే అవకాశముంటది గనుక. ఎవ్వలు ఎటు మంది పోతరో అన్ని కనిపెట్టుకుంట చేయడం శ్రేయస్కరం. అయ్యా నా భుజం మీది ఎక్కుదా అన్నడు గొల్లబోయడు లగున్నవాడే. నీ వల్ల చాలా సంతోషం అనిపిచ్చి చెప్పే హరిదాసు చెప్పిన దాని కన్న గొల్లబోయడు చెప్పిందే మేలున్నది గద అని హరిదాసు మెడలున్న దాన్ని తీసి బంగారు పతకం గొల్లబోయనికి ఎయమన్నట్లే గొల్లబోయనికి వేసిండు. ఇగ ఇద్దరు అవతలకెల్లి హరిదాసు కాళ్ల మీద బోయడు పడి అయ్యా స్వామి నా తప్పులని మన్నించు. నువ్వ్ అన్న దాన్ని బట్టి నేను ఆలోచించినా నాకు చదువు రాదు. ఏ బుక్కులు చదువలేదు. పరిస్థితి గిది. హారం తీసుకొర్రి అంటే అపుడు హరిదాసు అంటుండు ఓ గొల్లబోయడా! ఒకసారి మీ చేతికచ్చింది గనుక. ఒవలికి దానం చేశాక మల్ల మేం వేసుకోం. నాయనా! నువ్వే ఉంచుకో.. నీ భార్య పిల్లలకు వినియోగించుకు కర్సు పెట్టుకో అంటే లేదు లేదు.. సామీ! నా గొర్లు పెయినయ్.. నా బార్య తిడతదో ఏం జేత్తదో అయి చచ్చినయో బతికినయో చీకటైతుంది. ఇంత సేపు రాజా దర్బారులోనే ఉంటిమి. నాయి ఎటువోయిన పర్లేదు. నను మాత్రం నీ శిష్యునిగా స్వీకరించు అంటే అప్పుడు హరిదాసు కానీ మరీ శిష్యరికం చేసుకున్నంత వరకు శిష్యరికంకు గురుదక్షిణంగా మళ్లీ ఈ పతకం ఇవ్వడం జరిగింది. అట్టిగ తీసుకుంటలేదు. గనుక శిష్యుని చేసుకొని నేనిస్త అని చెప్పి మనసులో పెట్టుకొని శిష్యరికం అయినంక ఆ బంగారు పతకాన్ని తీసి హరిదాసుకి ఇచ్చిండు.

## గొల్ల బోయని రాజనీతి --కథావిశ్లేషణ

ఒక గొల్ల బోయడు తన అనుభవం ద్వారా తెలుసుకున్న రాజనీతి విషయాలను రాజుకు, బ్రాహ్మణుడుకు చెప్పడమే ఈ కథ. సాధారణంగా రాజుకు, మంత్రులకి మధ్య జరిగిన సంభాషణల్లో, రాజుకు, పండితులకి జరిగిన సంభాషణల్లో రాజనీతి పరమైన విషయాల చర్చ జరుగుతుంది. ఏదో ఒక విషయం మీద చర్చ జరిపి రాజు ఇచ్చే విలువైన బహుమతులను పొందాలని మంత్రులు, పండితులు

ఆశపడేవారు. అలాంటి కోణంలో చిత్రించబడ్డ కథ ఇది. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న అక్బర్ బీర్బల్ కథలు, కృష్ణదేవరాయలు–తెనాలి రామకృష్ణులు కథలు మొదలైన కథలు అలాంటి వాటికి ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. కానీ ఈ కథల్లో ఒక రాజుకి రాజ్య సభలో బ్రాహ్మణుడు రాజనీతి పద్యాన్ని వినిపిస్తాడు. దాన్ని సవాలు చేస్తూ ఒక గొల్లబోయడు అదే బ్రాహ్మణుడి సహాయంతో రాజు చెంత చేరి తనకు తెలిసిన రాజనీతి పద్యాన్ని చెప్తాడు. బ్రాహ్మణుడు చెప్పిన పద్యం కన్న చదువు సంధ్య లేని పామరుడిగా భావించే గొల్లబోయడు చెప్పిన పద్యం రాజనీతికి తర్కబద్ధంగా ఉండడం రాజుచేత ప్రశంసింపబడతాడు.

| **హరిదాసు** | **గొల్లబోయడు** |
|---|---|
| జలే జలే గంగాజలే | జలే జలే మేఘాజలే |
| భలే భలే బంధుభలే | భలే భలే భుజ భలే |
| జాగ్రత్త జాగ్రత్త రాజా | జాగ్రత్త రాజా |

హరిదాసు ప్రపంచంలో అన్నింటికి కన్నా విలువైనది గంగాజలం అన్నాడు. గంగాజలం అనగా గోదావరినీరు. అన్నింటిని తనలో కరిగించుకునే గుణం ఉన్న నీరు తర్వాతే ఏదైనా విలువైనదని రాజుకు విన్నవిస్తాడు. మానవులకు, జంతువులకు నీటితో అనేక అవసరాలు తీరుతాయి. కాబట్టి నీరు లేనిదే జీవకోటికి ప్రాణం లేదు. అందుకే భలే భలే గంగాజలే అన్నాడు హరిదాసు. గొల్ల బోయడు హరిదాసు చెప్పింది బాగానే ఉంది దానికి బదులుగా భలే భలే మేఘా భలే అన్నాడు. భూమి మీదికి నీరు రావాలంటే మేఘమే ఆధారం. మేఘం లేనిది వర్షం రాదు. వర్షం లేకుండా నీరు భూమిపై పారడం జరుగదు. నీటిని పుట్టించిన మేఘమే గొప్పదని హరిదాసు భావన. ఇక రెండో వాక్యం భలే భలే బంధు భలే అని హరిదాసు రాజుకు చెప్పాడు. బంధు భలే అనగా కుటుంబం, బంధువులు, చుట్టాలు, ఇరుగు పొరుగువాళ్లు. వీళ్ళంతా రాజు చెంత చేరి రాజ్య పాలనలో సహకరించాలని ఐక్యతాభావంతో మెలిగినప్పుడు రాజ్యం సుభిక్షంగా ఉంటుందని హరిదాసు ఉద్దేశ్యం. హరిదాసు చెప్పిన దానికి బదులుగా గొల్లబోయడు భలే భలే భుజ భలే అన్నాడు. భుజ భలే అంటే రాజు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని అంటాడు. రాజుకి ఎటువైపు నుండైనా శత్రువులు తయారు కావచ్చునని, ఎప్పుడూ వెన్నుపోటు పొడిచేది తెలియదంటాడు. నిత్యం నిరంతరం అప్రమత్తంగా ఉండి రాజ్యపాలన చేయాలని సూచిస్తాడు. అప్పుడే శత్రు సైన్యం తన రాజ్యం మీద దాడి చేయకుండా

కాపాడుకోవచ్చునని గొల్లబోయడు అభిప్రాయపడతాడు. ఇద్దరు చెప్పిన సూక్తులు విన్న రాజు హరిదాసు కంటే గొల్లబోయనికున్న రాజనీతి పరిజ్ఞానానికి విస్తుపోతాడు. రాజు వెంటనే అంతకుముందు హరిదాసుకు ఇచ్చిన బంగారు హరాన్ని తీసి గొల్లబోయన్ని సన్మానిస్తాడు. అక్కడి నుంచి హరిదాసు, గొల్లబోయడు వెళ్లిపోతారు. గొల్లబోయని రాజు దగ్గరికి పోయే అవకాశం కల్పించిన హరిదాసుకి ఎలాగైనా కృతజ్ఞతలు చెప్పాలని తలిచిన గొల్లబోయడు ఒక ఉపాయం చేస్తాడు. గొల్లబోయడు నేరుగా ఆ బంగారు హారాన్ని ఇస్తే హరిదాసు స్వీకరించడని తెలిసి తన దగ్గర శిష్యునిగా చేరి గురుదక్షిణగా ఆ బంగారు హారాన్ని ఇస్తాడు. గొల్లబోయని మంచి మనసుకు, తెలివితేటలకు హరిదాసు ఆశ్చర్యపోయి తన ఆశీస్సులను అందజేస్తాడు.

1. ఒక గొర్లు కాసే గొర్ల కాపరికున్న లోక జ్ఞానాన్ని, రాజనీతిని రాజుకు విన్నవించుకోవడానికి చిత్రించిన కథ. రాజు కాలంలో మంత్రులకు, సభాధిపతులకు, పండితులకు మొదలైన వారికి మాత్రమే సభా మర్యాదలను అందుకోవడం, సన్మానాలను పుచ్చుకోవడం ఉండేది. సాధారణ ప్రజలకు, సామాన్యులకు, నిమ్న వర్గాలకు చెందిన వారికి సభా ప్రవేశం ఉండేది కాదని ఈ కథ వల్ల తెలుస్తుంది. రాజుని చేరి తన అనుకున్న విషయం చెప్పడానికి గొల్లబోయడికి హరిదాసు సహాయం అవసరం పడుతుంది.

2. రాజులకు ఎటువైపు నుంచి ఏ ప్రమాదం పొంచుకొస్తుందో చెప్పలేం. సంప్రదాయంగా జానపద సాహిత్యంలో నిలదొక్కుకున్న ఈ కథ ఆనాటి రాజులను, సామంత రాజులను తమ రాజ్యాన్ని రక్షించుకోవడానికి అప్రమత్తం చేసే రాజనీతి బోధక కథగా ఉపయోగపడి ఉండొచ్చు.

3. గొల్లబోయడు ఎటువంటి చదువు సంధ్యల్లేనివాడు. రాజు సమక్షంలో హరిదాసుతో జరిగిన సంవాదచర్చలో గెలుస్తాడు. రాజు నుంచి హరిదాసు మెడలో ఉన్న బంగారు హారాన్ని బహుమానంగా పొందుతాడు. అయినప్పటికీ బంగారు హారాన్ని తాను వినియోగించుకోకుండా రాజు చెంత చేరే అవకాశాన్ని అందించిన హరిదాసు రుణాన్ని ఎలాగైనా తీర్చుకోవాలని తపిస్తాడు. దానికి హరిదాసుని గురువుగా స్వీకరించి గురుదక్షిణగా ఆ హారాన్ని ఇచ్చి గురువులపై చూపించాల్సిన గౌరవాన్ని తెలియజేస్తాడు. ఈ కథలో అన్ని విధాలా గొల్లబోయని పాత్ర స్ఫూర్తిదాయకమైందిగా చెప్పవచ్చు.

## 2.4.5.2 బ్రాహ్మణుడి వరాలు

జాడి రాజన్న, ఆరపల్లి గ్రామం, ధర్మపురి మండలం.

ఒక బ్రాహ్మణుడు ఆయన ఏం చేసిండు గదంటే కొన్ని వరాలు పట్టుకొని దేశ సంచారానికి పెయిండు. గీ వరాలు గిట్ట నా దగ్గరుంటే బయటపెయిన కాడ దొంగె ఉండోచ్చు దొరె ఉండోచ్చు. దోసుకపోతడు. ఇది మాత్రం నా వెంబడి ఉండద్దు. ఆయనకు తెలిసిన రాజు ఒకాయన ఉన్నడట. ఆ రాజు దగ్గరికి పోయిండ రాజా నేను మాత్రం దేశ సంచారం తిరిగత్త. ఈ తిరిగిచ్చేవరకు ఈ వరాలు నీ దగ్గరుండాలి. నేను మల్లచ్చేటప్పటికి నా వరాలు నాయినాకు ఇస్తే నేను పట్టుకుని పోత అని చెప్పి ఈ బ్రాహ్మణుడు అన్నడు. సరె అని చెప్పి రాజు దగ్గర వరాలు పెట్టి దేశ సంచారం పోయిండు. ఆరు నెలలో, సంవత్సరమో తిరిగి తిరిగి మళ్లీ రాజు దగ్గరికి అచ్చిండు. వరాలు తీస్కపోవాలని రాజు దగ్గరికి పోయి అయ్యా నా వరాలు ఇయ్యమని అంటడు. అన్నంక అతడు ఆ రాజు ఓయ్.. నా దగ్గర నీ వరాలు ఎక్కడియి అంటడు. లేవ్ అంటడు. ఈ బ్రాహ్మణుడు దగ్గర ఒక కత్తెర ఉంటది. నువ్వ్ తప్పు చేసిన మ్యాటర్ గిట్ట అయితే ఆ కత్తెర కత్తిరిత్తదట! తప్పు చేయకపోతే లేదట. ఈ రాజు దగ్గర ఒక కంక బొంగు కట్టె ఉందట. ఆ కట్టెకి తూపురం ఉంటది. ఆ కట్టె తూపురంల ఈ వరాలు పెట్టిండట. పెట్టి ఏం చేసిండు గద ఈ బ్రాహ్మణుడు రాజు కలిసి నా వరాలు నాకు ఇయ్యి అని బ్రాహ్మణుడు అంటుండు. ఈ కట్టె ఏం చేసిండు కట్టె ఇచ్చిండు బ్రాహ్మణుడికి. ఇగ రాజు కత్తెర వేలు పెడితే తెగుతలేదు. కర్రల వరాలు పెట్టిచ్చేవరకల్లా రాజు వేలు తెగుతలేదు. నీ వరాలు నీకు ముట్టినయ్. కత్తిరిత్తలేదు. లేకపోతే కత్తిరిత్తది. అని చెప్పి ఆ నిజమే ఈ బ్రాహ్మణుడు అచ్చి వరాలు ఇచ్చిండు. ఆయనకు ఇప్పుడు ఇచ్చినా అనేవరకల్లా కత్తెరల ఏలు వెట్టిన కత్తిరిత్తలేదు. మల్ల రాజు ఏం చేసిండు. కంకబొంగు తీసుకుంటడు మరి బ్రాహ్మణుడు నీ వరాలు నువ్వ్ తీసుకుంటే నీ ఏలు తెగుతది. తీస్కపోతది తెగదని రాజు పట్టుకున్నడు. బ్రామ్మడు కంక బొంగు పట్టుకున్న కత్తెర ఏలు తెంపలె. ఆవును నేనయితే దేశ సంచారానికి ముందు రాజుకే ఇచ్చిన నా వరాలు. నాకయితే ఏంగాదని అనుకున్నడు. ఆ రాజు బ్రాహ్మణుడు నేను దాయంగనే నాకెరుక మల్ల మాత్రం నేను తీస్కపోలే అతని దగ్గరె ఉన్నయని చెప్పి ఇతను ఏలు వెట్టినా తెగలే. ఇతడు పెట్టినా అతడు వెట్టినా వేలు తెగుతలేదు. అసలు దీని మ్యాటరు ఎక్కడున్నది అర్థమైతలేదు. అక్కడ ఒక పతాని ఉన్నడటా. అరె అరె మరీ వీడు తెచ్చి యిచ్చిండట. మరి పోని దగ్గరుటే రాజు ఏలు తెగాలి మరి రాజు ఏలు పెడతడు. తెగుతలేదు. మరి నా దగ్గరలేవని వీడు

పెడతడు. వీనిది తెగుతలేదు. ఇది ఏట్లాని పతాని విచారణ చెపడితే తెల్తలేదు. ఏయ్ ఏం రాజువయ్యా ఏం పతాని వయ్యా అది గాదు. నిజంగ దాచింది నిజమేనా అంటే నిజమే అంటవ్.. ఆనాడు నాకు వరాలు ఇచ్చిండు. నేను ఆయనకిచ్చినా అని కట్టెని బ్రామ్మనికిచ్చి ఏలు పెడుతుండట. అసలు కట్టెలనే ఉంది విషయం. ఇద్దరు పెట్టినప్పుడల్లా కట్టెను ఒకరికి ఒకరు ఇచ్చుకుంట కత్తెరల ఏలు వెడుతుర్రు. అందుకే ఏలు తెగుతలేదు. ఇగ పతాని ఇంత బాగా గమనించిండు. ఇగ ఆ కట్టెను తీసుకొని యిరిసి చూసిండట. చూసేవరక ఏంది. అండ్ల వరాలున్నయి. ఆ వరాలు ఇవి లంగతనం నీ దగ్గరుండి నువ్వ్ ఏలు పెట్టినప్పుడు కట్టె ఆనికి ఇస్తున్నవ్ అందుకే తెగుతలేదు. ఇచ్చినప్పుడు ముట్టినయ్ అంటునవ్. ఆడు మల్ల కట్టె తీసుకొని నీకిచ్చి నాకు ముట్టలేదు. అంటే ఏలు తెగుతలేదు. మ్యాటరు గిట్ల ఉందని పతాని సమకూర్చి వరాలు బ్రామ్మనికి ఇచ్చి ఎల్లగొట్టిండు.

## బ్రాహ్మణుడి వరాలు – కథావిశ్లేషణ

ఒక బ్రాహ్మణుడు దేశాటనకు వెళ్లేటప్పుడు ఒక రాజుని నమ్మి అతని దగ్గరున్న విలువైన వరాలిస్తాడు. వివిధ ప్రదేశాలు సందర్శించి తిరిగి వచ్చి రాజు దగ్గరున్న వరాలు తీసుకోవాలని అనుకుంటాడు. కాని రాజు బ్రాహ్మణుడిని ఎలాగైనా మోసం చేయాలనుకుంటాడు. రాజు నా దగ్గర బ్రాహ్మణుడి వరాలు లేవని చెప్తే బ్రాహ్మణుడి దగ్గరు ఉన్న కత్తి అబద్ధం చెప్పినవారి వేలు తెంపుతుంది. ఎలాగైనా బ్రాహ్మణుడి దగ్గరున్న కత్తికి చిక్కకుండా ఉండటానికి ఒక వెదురు కర్రలో ఆ వరాలు నింపి పెడతాడు. రాజు సభలో బ్రాహ్మణుడికి ఆ కర్రని ఇచ్చి నీ వరాలు నా దగ్గరలేవని చెప్తాడు. రాజు కర్రలో వరాలు దాచిన విషయం తెలియక, అబద్దం చెప్తే వేలు కత్తిరించిన కత్తెర కూడా కత్తిరించకపోవడం బ్రాహ్మణుణ్ణి ప్రధానిని అయోమయంలో పడవేస్తుంది. బ్రాహ్మణుడు నేను విహారయాత్రకు వెళ్లినప్పుడు రాజుకి ఇచ్చానని నిజమే చెప్తాడు. రాజు కూడా కర్రలో దాచిన వరాలను బ్రాహ్మణుడు చేతిలో పెట్టి నా దగ్గర లేవని నిజమే చెప్తున్నాడు. అబద్దం చెప్పే వారిని శిక్షించే కత్తెరది తప్పు కాదు. ప్రధాని బాగా ఆలోచించి అసలు కర్రలో ఏమున్నది తీసి చూసేసరికి కర్రలో వరాలు బయటపడతాయి. అప్పుడు రాజు దీనంతటికి కారణమని తేల్చేస్తారు.

1. జానపద కథల్లో నిజాన్ని నిర్ధారణ చేయడానికి చిక్కు సమస్యలు చేధించడానికి ఏదో ఒక సాధనం, ఆయుధం ఉంటుంది. ఈ కథలో కూడా తప్పు చేస్తే వేలు కత్తెరించి మాయ కత్తెర ఉంటుంది. కాని

దాన్ని ఉపయోగించి కూడా ఈ కథలో చిక్కు ప్రశ్న చేధించలేరు. ఆ కత్తెరకి అందనిది మరొకటి కర్ర. అందుకే ఆ కర్రని రెండుగా చీల్చి చూస్తారు.

2. సాధారణంగా రాజులు ప్రధాన మంత్రులకు ఏదో ఒక సమస్యనిచ్చి పరిష్కారం కోరడం జరుగుతుంది. ఈ కథలో కూడా బ్రాహ్మణుడి వరాలు కర్రలో ఉన్న విషయాన్ని ప్రధాన మంత్రి కనుక్కుని బ్రాహ్మణుడికి ఇచ్చి పంపిస్తాడు. అబద్ధమాడిన రాజుని సైతం పసిగట్టి బ్రాహ్మణుడి తరఫున న్యాయనిర్ణేతగా నిలబడ్డాడు.

3. ఈ కథలో ప్రధాని రాజుకి కూడ భయపడకుండ న్యాయం చెబుతాడు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే నిలదీయడం తప్పుకాదన్న నీతిని బోధిస్తుంది ఈ కథ.

## 2.4.5.3 అమరిక రాజు కథ

చిట్టన్నోజు కళావతి, తుమ్మనాల గ్రామం, ధర్మపురి.

అమరికా దేశము బిడ్డ. అమరికా దేశం. కమరసుల రాజు. ఆ కమరసుల పట్నం ఏలె అమెరికా రాజు. ఆ ఆమెరికా రాజైతే ఏం జేత్తుండు. ఇగో నాకు సంతానం లేదు. నా బామ్మర్ది నిమ్మళ్లోడు. నా బామ్మర్థికిత్త గీ పట్నం. నేను దేవుని దగ్గరికి తపస్సుకు పోతా నాకు సంతానం లేదు. నేను తపస్సుకు పోతా. నువ్వు నేను వచ్చే దాకా పతాని మంత్రివై ప్రపంచం ఏలు అని చెప్పిండు. ఎవరు? అమెరికా రాజు. నిమ్మళ్ల మంత్రి ఏంజేత్తడు ఎరికేనా? భార్యభర్తలు తపసుకు వోయింద్రు. తపసుకు వోయి అక్కడ సిరస్ మీద ఎక్కిచ్చిర్రు. 12 మంది తవుసు. ఈ అమరికా రాజు. అమరికా భార్య తపస్ పట్టింద్రు. తపసు పడితే ఈ నిమ్మళ్ళ మంత్రి ఏంజేత్తడు ఎరుకెనా? ఇగ నాకే రాజ్యం ఇచ్చిపోయిండు మా బావా అని. తాశీలు ఇగ పది ఉన్న కాడా 20 తీత్తుండు తాశీలు. 20 ఉన్న కాడ నూరు తిత్తండు తాశీలు. పంట అది పండని, పండకపోనీ. ఆఁ తర్రలు, బుర్రలు తాశీలు కట్టమంటుండు. తాశీలు దంచి వసూలు జేత్తుండు! గోతలు కొద్ది రకం కుప్పజెత్తండు. గోత్రాలు నింపిందు బిడ్డా! ఒక్క 12 యేండ్ల వరకు గోతలు నింపిందు ఈ నిమ్మళ్ల మంత్రి. నింపి శ్రీమంతుడైయిండే వరకు ఈయన తపసుకు బొయిండు కద? తపసుకు వోయి వచ్చేవరకల్లా అయ్యో! అమరికా రాజా! అమరికా! రాజా. నువ్వుండంగా రాజ్యం మీద తండ్రి మాకు మంచిగా ప్రపంచం మంచిగా నడిపినవ్.. ఈ నీ బామ్మర్ది ఉండి అయ్యా! మమ్మల్ని 50 ఇచ్చే కాడ 100ల వసులు జేత్తుండు. సిగకు తాశీలుంటద? సికకు తాశీలు. పెద్దగా సికయెవరిదన్నుంటే సికకు తాశీలు, బొర్ర పెద్దగుంటే బొర్రకు తాశీలు అన్నడట ఆ

లంజకొడుకు! అగో అట్ట జేసిండట. అట్టజేసి కొన్ని కోట్లు గోతాలు పెట్టిండట బిడ్డా. గోతాలు పెట్టె వరకు ఆ పొద్దిమీకి వచ్చింద్రు. అయ్యా! నీ బామ్మర్థి మమ్మల్ని పొల్లు పొల్లు కొట్టుకుంటా బొర్రకు తశీలున్నయి. దీనికి తశీలున్నయి అని మమ్మల్న అరిగోస పెడుతుండ్రు అని జెప్పింద్రు. చెప్పేవరకు ఏం అంటుండు. కరకర పొద్దు పొడవక ముందు నిమ్మళ్లోని తలకాయ కోత్త అంటుండు బామ్మర్థిని. తలకాయ గోత్త అన్నంగనే ఎవలు విన్నరో ఏరుకెనా వాని పెండ్లాం ఇన్నది. ఆ బామ్మర్థి పెండ్లాం ఇన్నది. బామ్మర్థి పెండ్లాం విని ఏమంటన్నది. అగో కరకర పొద్దు పొడవక ముందే నువ్వు బాగా గోతలు సంపాదించిండు అని జెప్పినోల్లే. అగో ఆ తెల్లారక ముందే నీ గొంతు కోత్త అంటుండు అని చెప్పింది. చెప్పేవరకే బిడ్డ కరకరపొద్దు పొడవక ముందే నిమ్మళ్ళని గొంతు కొయ్యలనేవరకు ఇడు ఏం జెసిండు ఎరుకెనా. ఆడి పెండ్లాం మంత్రాలదట. అది మంత్రాలదట. ఆడిదానికే మంత్రాలత్తయట. అది ఏం జేసింది. నీ తలకాయను కోత్త అన్నడు కదా! కరకరపొద్దు పొడిచేవరకు నీ బావ తలకాయ కొయ్యాలి అని చెప్పింది. చెప్పేవరకల్లా కరకరపొద్దు పొడవకముందే ఆ నిమ్మల్లోన్ని ఆ అమెరికా రాజు గొంతు కోసిండు.

## అమరిక రాజు – కథావిశ్లేషణ

కామరాసు పట్టణాన్ని పాలించే అమరికా రాజు తపస్సుకై దేశాటనకు వెళతాడు. ఆ సమయంలో అతని బామ్మర్ది ఆ పట్టణాన్ని పాలిస్తాడు. అతని పాలనలో ప్రజలు చాలా ఇబ్బందులు పడతారు. ప్రజల నుండి యదేచ్ఛగా పన్నులు వసూలు చేసేవాడు. రాజు 12 సంవత్సరాల తర్వాత తిరిగి తన రాజ్యానికి వస్తాడు. నిమ్మళ్ల రాజు పరిపాలన గురించి ప్రజల దగ్గర ఆరా తీస్తే అతడెంత నిరంకుశుడో అర్థమవుతుంది. తన పాలనలో సుభిక్షంగా ఉన్న రాజ్యాన్ని తన బావమరిది పాలనలో ప్రజల కష్టాలు చూసి చెలించిపోతాడు. ఎలాగైనా వాళ్ళను విముక్తి చేయాలని తన బామ్మర్ది నిమ్మళ్ల మంత్రిని చంపాలని అనుకుంటాడు. కాని ఈలోపు అప్రమత్తమయిన నిమ్మళ్ల మంత్రి భార్య తన భర్తకి ఈ విషయాన్ని తెలిపి రాజునే చంపించే ప్రయత్నం చేస్తుంది.

1. అమెరికా రాజు కథ అని జానపద కథ ప్రచారంలో ఉంది. బ్రిటిషు రాజు పరిపాలించిన కాలంలో కల్పించబడిందా? లేకపోతే వార్త కథనాల ప్రకారం ఎక్కడో విన్న కథను జానపద కథగా మలిచారా? అనేది తెలియదు. అజ్ఞాత కర్తృత్వం జానపద సాహిత్య లక్షణంలో ఒకటి. వాస్తవంగా జరిగిన కథనే కొద్ది పరిణామాలతో కథ రూపంగా అవతరించిందని భావించవచ్చు.

2. కామరాసు పట్టణాన్ని పాలించే అమెరికా రాజు పాలనలో రాజ్యం సుభిక్షంగానే ఉంది. కాని అతను తపస్సు చేసుకోవడానికి వెళుతూ, అతని రాజ్యాన్ని అతని బామ్మర్ది నిమ్మళ్ల మంత్రికి అప్పగిస్తాడు. అతడు రాజ్యాన్ని తనకు నచ్చినట్లు పాలిస్తాడు. ప్రజల మీద అధిక పన్నుల భారం మోపి రాజ్యంలో అశాంతి నెలకొల్పుతాడు. తహశీల్దారుకు స్వేచ్ఛ అధికారం ఇచ్చి పన్నులను రెట్టింపు చేస్తాడు. ఆడవారికి వెంట్రుక సిగ ఎక్కువున్నా, మగవారి పొట్ట ఎక్కువున్న పన్నులు వేసి వసూలు చేసేవాడు. పన్నుల పేరుతో ప్రజలను పీడించేవాడు. అతడు నిరంకుశపాలన, నియంతృత్వ పాలనలో ప్రజలు మగ్గిపోయేవారు. అతని భార్య మంత్రగత్తె అని అనుకుంటారు. అంటే ఇతరులకు చెడు చేసే ఉద్దేశ్యమున్న వ్యక్తి అని జానపదుల నమ్మకం. అందరు ఆమెకు భయపడి ఎదురించేవారు కాదు. రాజ్యాధికారం కోసం తన స్వంత అన్ననే భర్త చేత చంపించాలని ప్రయత్నిస్తుంది. రాజ్యకాంక్ష వల్ల కుటుంబాల్లో కలిగే కలహాల చిత్రణ ఈ కథలో మనకు కనిపిస్తుంది. అమరికా రాజుకున్న రాజనీతిజ్ఞత వల్లనే రాజ్యానికి పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టి తగిన చర్యలు తీసుకుంటాడు. నిమ్మళ్ల మంత్రిని తన బావమరిది అని కూడా చూడకుండా ప్రజల క్షేమం కోరి చంపేస్తాడు.

## 2.4.5.4 చెప్పుకున్న విలువ రాజుకు లేదు

కైరం రమణ, బతికెనపల్లి గ్రామం, రాయికల్ మండలం.

రాజు రాజ్యంలో ప్రజలను పరిపాలిస్తున్నాడు. ఎవరికైన గాని పెండ్లి అయితే మంగళసూత్రాలు, మట్టెలు ఉచితంగా ఇస్తున్నడు. అందరిని మంచిగా అరుసుకుంటున్నడు. అందరు మంచి బాగోగులు చూసుకుంటుండు. ఎవరింట్ల ఫంక్షన్ అయిన పోతుండు. మంచిగ అందర్ని పిల్లల లాగ అరుసుకుంటుండు. ఒక రోజు ఏమైతది రాజు దురదృష్టవశాత్తు చనిపోతడు. ఎంతో మంది రాజ్యంలోని రాజులు, అందరి ఊరివాళ్లు ఎంతో ఘనంగా దహన కార్యక్రమాలు చేయటానికి వెళతారు. మార్గ మధ్యంలో పెద్ద వర్షం పడ్డది. వర్షం పడేసరికి రాజు యొక్క శవం మీద నీళ్ళు పడ్డాయి. నీళ్లు పడుతున్నయి బాగా నీళ్లు పడుతున్నయి. వర్షమెట్ల అని చెప్పి వాళ్లు ఏం జేత్తరు. ఇగ ఈయిన రాజు వెంబడి పోయే వాళ్లు అందరు సూరుపోన్న అక్కడ ఇక్కడ చెట్ల కింద సూరుపొన్న ఉన్నరు. అంత పెద్ద వర్షం పడుతుంది. ఆ వర్షానికి ఈ ముసలోళ్లు ఏం జేస్తరు అరెరె ఇక్కడ ఒక ఇల్లు ఉంది కదా లాస్ట్. ఈ ఊరుకాడ ఇల్లు ఉంది కదా అక్కడ ఆగుదాం అని చెప్పి ఆ ఇంటి దగ్గర రాజు శవాన్ని వాన ఎలిసే వరకు ఇక్కడ ఉంచుతం అమ్మా అని అంటారు. లే...లే...! లేదు ఇక్కడ శవాన్ని ఉంచుదు బందే.

శవాన్ని ఎందుకు ఉంచుతరు. ఉ..! ఇంటి కాడ అని చెప్పి. అన్నంక అట్ల అన్నంక రాజు కార్యక్రమంలో పాల్గొన్నంక డబ్బు కొట్టే వాళ్ళు తోలు చెప్పులున్నాయి. కాబట్టి ఇవి బూడిదకు తట తట తాకుతున్నాయని చెప్పి అమ్మాయి చెప్పులు ఇక్కడ ఇడిసి మల్ల వస్తమమ్మా అని అంటే సరే అక్కడ ఇదుల్లి అని చెప్తది. అంటే చెప్పులని ఉంచుకున్నరు. రాజు శవాన్ని ఉంచుకోలేదు. చెప్పుకున్న విలువ రాజుకు లేదు. అంటే మనిషి బతుకున్నప్పుడే అన్ని నడుస్తయి. చనిపోయిన తరువాత ఏమి కూడా నడువది అని దీనర్థం.

## చెప్పుకున్న విలువ రాజుకు లేదు – కథావిశ్లేషణ

ప్రాణం ఉన్న మనిషికి, ప్రాణం లేని మనిషి శరీరానికి (శవానికి) విలువను తెలుపుతున్న కథ. రాజ్యాన్ని బాగా పరిపాలిస్తున్న ఒక రాజు ప్రాణం పోయి దహన సంస్కారానికి తీసుకోపోయే సందర్భంలో బీభత్సమైన వర్షం కురుస్తుంది. ఆ వర్షంలో శవం మీద వాన చినుకులు పడుతున్నాయని ఆ మార్గంలో చివరన ఉన్న ఒక ఇంట్లో శవాన్ని పెడదామని అనుకుంటారు. వర్షం తగ్గిన తర్వాత కార్యక్రమానికి తీసుకెళదామని అనుకుంటారు. కాని ఆ ఇంట్లో వారు శవాన్ని తీసుకుపోవడానికి సిద్ధమయితరు. వాన నీటికి బురదగా మారి తడి నేలలో చెప్పులతో శవాన్ని మోస్తూ తీసుకెళ్ళడం వారికి ఇబ్బందిగా ఉంటుంది. వారి చెప్పులను ఆమె ఇంట్లో పెట్టి వెళతారు. శవాన్ని తన ఇంట్లో పెట్టుకొనివ్వని ఆ ఇంటి వారు, దప్పుకొట్టే వారి చెప్పులను మాత్రం వారి ఇంట్లో పెట్టుకోవడానికి ఎలాంటి అభ్యంతరం తెలుపరు. ఆ విధంగా రాజు శవాన్ని వారు పెట్టుకోనివ్వలేదు కాని శవాన్ని మోస్తున్న వారి చెప్పులను మాత్రం పెట్టుకోనిచ్చారు. ఈ కథలోనే కాదు మన హిందు సంస్కృతిలో శవాన్ని ఎవరి ఇంటి ముందు కాసేపు కూడా పెట్టనివ్వరు. ప్రాణం ఉన్నంతవరకే ఆ దేహనికి విలువ. ఎంతటి గొప్పవాడైనా, మహనీయుడైనా అతనికి ప్రాణం ఉన్నప్పుడే ఇచ్చిన విలువ దేహం చాలించాక ఇవ్వరు. ఈ కథలో మరొక అంశం చెప్పుతో పోల్చడం. కాలికింద నలిగే చెప్పు ఎవ్వరైనా చాలా తక్కువ ప్రాధాన్యం ఇచ్చే వస్తువుగా చూస్తారు. అలాంటి చెప్పుకు ఇచ్చిన విలువను చనిపోయిన రాజు శరీరానికి ఇవ్వకపోవడమనేది ఆశ్చర్యం కలిగించే విషయం. దేహంలో ప్రాణము ఉన్నంత వరకే ఆ దేహనికి, ఆ దేహంలో ఉన్న మనిషికి విలువ అనేది ఈ కథ మనకు గొప్ప నీతిని తెలియజేస్తుంది.

# 2.4.6 అదృష్ట, దురదృష్టానికి సంబంధించిన కథలు

## 2.4.6.1 లక్ష్మీదేవి కటాక్షం

జాడి రాజన్న, ఆరపల్లి గ్రామం, ధర్మపురి మండలం.

ఒక  ఊరి లోపల పెరుకొల్లు. వాళ్లు ఇద్దరు అన్నదమ్ములు. బాగా గరీబులు. చెరి నాలుగు ఎకరాలంత బూమచ్చింది గాని ఈనెకు అనుకోకుండా ఆస్తి మొత్తం అమ్ముడు పోయింది. తిందామంటే తిండికి లేకుండా అయింది. మరి ఎట్లనయ్యా! ఎదన్న ఒక పని చేసుకుంట నను సాదాలని చెప్పి అంటరు గద! భార్య ఈనె ఏం చేసిందు. గుట్టకు గొడ్డలి పట్టుకొని పెయిందు. పోయి కట్టెలు కొట్టంగం ఆ కట్టె బెడసచ్చి కాలుకు తాకుద్ది. పెద్ద పుండు అయింది. అయినంక అట్లనే కట్టెల మోపు తెచ్చిందు. ఊళ్లె అమ్మిందు. భగవంత! నా కాలుకు పుండయింది నేను ఎట్ల బతకాలి. నడువత్తలే అని చెప్పి లక్ష్మీ పార్వతి శంకరున్ని ఇష్టదేవుని యాజ్జేసుకున్నడు. ఒక లక్ష్మీ దేవి సూసింది. బాపు పెరకైనే సూడు ఎంత బాధపడుతుండో పెద్ద పుండయింది అతని బాదేందే నువ్వు సూత్తలేవు పాపం అంటే సరే బిడ్డ ఆయనకు ఇంత ఎండి బంగారం పెట్టు అనేవరకల్లా లక్ష్మీదేవి స్వయంగా ప్రత్యక్షమై కిల బంగారమిత్తది. ఈ పెరకయినకు ఇచ్చినంక ఆ బంగారం పట్టుకొని కట్టెలమోపు ఎత్తుకొని ఇంటికి రాంగ ఆయనకు దొడ్డికత్తంది. దొడ్డికి పోయి కడుకుందామని చెరువుకాడికి పోయి అంగెవరకల్లా జేబుల పెట్టుకున్న కిల బంగారం చెర్ల పడ్డది. ఆ చెర్ల పడ్డంక చేప మింగుద్ది. భగవంత ఇంటికత్తె కట్టెల మోపు అమ్ముకునుడే. అయ్యో! పాయే.. పాయే.. అని భార్యంటది ఏమి పోయిందయ్యా ఏందో పోయింది. ఆయనకు మల్ల గుట్టకు పోయి కట్టెలమోపు పెట్టుకుండు బాగా బాధపడ్తండు. అరె లక్ష్మీదేవి చూసి మొన్న కిలో బంగారం ఇత్తి అమ్ముకొని ఇంత భూమి జాగ కొనుకోవచ్చు. వేపారం అన్న చేసుకోవచ్చు. ఏంది ఇట్ల బాధ పడ్తుండు. అని చెప్పి మల్లో రూపం మీద అచ్చి కిల బంగారమిత్తది. అప్పుడు దండం బెడతడు. ఇగ దొడ్డికచ్చిన దొడ్డికి పోడు. ఇంటికత్తడు. ఇంటికచ్చి దాన్ని పొయ్యిల పెడతడు. ఇంటికాడ కూసుండరు వేరెటొల్ల తోటి మాట్లాడుకుంటా ఆయన భార్య పెయింది. తిరుగుకుంట పోయేవరకల్లా ఏమయేనే..! ఇంటికి రా అని తీస్కత్తుడు. ఆయన రాకముందు పక్కింటి ముసలవ్వ అచ్చి అగ్గికత్తుంది. అగ్గిపుల్లలు లేకుండె. అగ్గి పెట్టెలు ఎక్కువ లేకుండె ఉండె. పొయ్యిల అగ్గి ఏసుకుంట అనేవరకల్లా కిల బంగారం ఎల్తది. ఈ కిల బంగారం పట్టుకుని ముసలవ్వ సప్పుడేంక ఎల్లిపోయింది. పెళ్లాం తోల్కచ్చి పోయి తోడి సూత్తడు. ఇండ్ల బంగారం పెట్టిన ఏది బంగారం నీ పిస బంగారం ఉత్త బూడిదేనయే.

బంగారం ఎక్కడిది అయ్యో! పాయే.. పాయే ఎట్ల మల్ల పనికి పోతడు. లక్ష్మీదేవి మల్ల సుత్తది. ఎందిరా బిడ్డ! అన్నం ఎక్కువయితే ఆసరా ఎక్కువైతది. నీకిత్తే కాపాడుకుంటలేవు? ఇగ నేను నీకు మల్ల కనిపియ్య ఇగో బంగారం ఇత్తున్న బిడ్డ అని ఇత్తది. ఆ బంగారం పట్టుకున్నడు. రాంగ ఆయన కట్టెల మోపు ఆడదించి జేబుల బంగారం ఉంటే పడిపోతదని చెప్పి కట్టెల మోపు మీద పెట్టి ఆయన ఒంటెల్కి పోతండు. గట్టమన్ను గద్ద అత్తది. గద్దచ్చి మామిడిపండు అనుకొని గద్ద అందుకుని పెయింది. కట్టెల మోపు మీదికెల్లి బంగారం పోయింది. ఇంటికత్తడు అయ్యో! పాయే.. పాయే.. అని చెప్పి బాగా బాధపడ్డడు. భార్యకి చెప్తడు. ఈనెకు పిసలేసినట్టుంది. ఈనె ఏం లేదు. ఏమనుకున్నపాయే అంటుండు. బంగారం అంటుండు. బంగారం పిసలేసిందో ఏదోకటి జరుగుతుందని చెప్పి ఇగ పెండ్లాం పట్టించుకోదు. ఓనాడు ఏం చేసిండు ఈనె. ఈళ్లకు చేపలు తినబుద్దయింది. తెనుగొల్లు చేపలు పడ్తరు. చేపలు కాడికి పెయిండు. అయ్యా! నేను ఏదన్న పని చేసి నీకు ఐదు పది రూపాలు ఇత్తగని నాకు ఒక చేప ఇయ్యి రా అన్నడు. ఒకటి ఏంది నీ..! రెండు కొండపో.. నీకు నచ్చిన సాప తీస్కపో అంటడు. అనేవరకల్లా నాకు నచ్చిన చేపను కుడిచేత పట్టి తీత్తడు పట్టుకొని పోయి ఆని పెళ్లానికి ఇత్తడు. పెండ్లామా! నువ్వు గిదికొయ్యి చాప కోత్తగని చింత పండులేదు. ఓ తమటలు, చింతపండు గావాలి. చింతచెట్టు ఎక్కి చింతకాయలు తెంపుకురా అని చెప్పి అంటంది. పెండ్లాం ఏం చేత్తది. చాకు వట్టి చేపను కోసింది. ఆ భర్త చెట్టు ఎక్కిండు. గడతమన్ను గద్ద ఏం చేసిందంటే బంగారం కొండపోయి గూట్లె పెట్టింది. చింతకాయలు తెంపంగ భర్త ఏమే మీదికి సూత్తన్నవా? ఇటు సూత్తన్నవా? అనే భార్య అంటంది. సూస్తున్న మీరు అనుకుంటరు. మీ ఇంటికి నేను దొంగతనానికచ్చిన మీ ఇంటికి పోయికత్తే అగ్గిల నాకు బంగారం దొరికింది. మీ బంగారం మీరు పట్రుృ అని చెప్పి బంగారం తెచ్చి ఇచ్చింది. ఆ చింత మీద బంగారం, చేపల బంగారం, మల్ల మూడు కిలోల బంగారం జమచేసి దాన్ని కరిగిచ్చి అమ్మి భూమి, జాగ కొనుకోని అప్పడికి బతుకుతుర్రు ఆళ్లు. అంటే నిరుదు బుచ్చపు బతుకు నేడు లచ్చపతి అయ్యిర్రు.

## లక్ష్మీదేవి కటాక్షం – కథావిశ్లేషణ

నిరంతరం కష్టాన్ని నమ్ముకున్న ఒక కర్షకుడికి సాక్షాత్తు లక్ష్మీ దేవి సహాయ పడటమే ఈ కథాంశం. శ్రమ నమ్ముకున్న ప్రతి ఒక్కరికి దాని వెంటే ఫలితం కూడా వస్తుందన్న సూత్రాన్ని బోధిస్తుంది ఈ కథ. ఒక రైతు అనుహ్యంగా తన యావత్తు భూమిని కోల్పోతాడు. తన కుటుంబాన్ని

ఎలా పోషించాలో అర్థం కాక ఏదో ఒక పని చేయాలని తలచి, అడవికి వెళ్లి కట్టెలను కొట్టి వాటిని అమ్మి డబ్బు సంపాదించాలని అనుకుంటాడు. కాని తాను ఒకటి తలిస్తే దైవం మరొకటి తలిచినట్లు కట్టెలు కొట్టేటప్పుడు గొడ్డలి కాలికి తగిలి గాయం ఏర్పడుతుంది. అతను గాయంతోనే మళ్లీ కట్టెలు కొట్టడానికి వెళతాడు. తన పరిస్థితికి దిగులు పడి బాధతో లక్ష్మీ దేవిని ప్రార్థిస్తాడు. అతడి బాధను చూసి లక్ష్మీ దేవి ఒక కిలో బంగారాన్ని ఇస్తుంది. దాంతో హాయిగా బతకమని దీవిస్తుంది. కానీ ఆ బంగారాన్ని చెరువు దగ్గర పొగోట్టుకుంటాడు. ఆ బంగారాన్ని చేప మింగుతుంది. అయ్యో! నా బంగారాన్ని పోగొట్టుకున్నానని భార్యతో చెప్తాడు. మళ్లీ గొడ్డలి తీసుకుని అడవికి బయలుదేరతాడు. అతని గోస చూసిన లక్ష్మీదేవి మరల కిలో బంగారాన్ని ప్రసాదిస్తుంది. ఆ కిలో బంగారాన్ని ఇంటికి తీసుకు వచ్చి భార్యకు చూపిద్దామని అనుకుంటే, అగ్గిమంట కోసం వచ్చిన ముసలమ్మ బూడిదతో పాటు తీసుకెళుతుంది. అయ్యో! ఇంటి దాకా తెచ్చిన బంగారం మళ్లీ పోయిందని భార్యకు చెబుతూ బాధపడ్తాడు. అతని భార్య భర్త మాటలు వింటూ ఇతను బంగారం లభించినట్టు భ్రమ పడతున్నాడని అనుకుంటుంది. ఇక మూడోసారి లక్ష్మీదేవి ఇతని దారిద్రాన్ని చూసి చివరిసారి అంటూ మళ్లీ కిలో బంగారం ఇస్తుంది. ఆ బంగారాన్ని కట్టెల మోపు మీద పెడితే ఒక పెద్ద గద్ద తీసుకెల్లి చింత చెట్టు మీద వదిలిపెడుతుంది. అయ్యో! లక్ష్మీదేవి నాకు మూడు సార్లు బంగారాన్ని ఇస్తే, నేను కాపాడుకోలేక పోయినందుకు బాధపడుతూ భార్యకు చెప్తాడు. భార్య ఇతని మాటలు నమ్మక భ్రమలో బతుకుతున్నాడని అనుకుంటుంది. ఏది ఎలా ఉన్న సరిగ్గా భోజనం చేసి చాలా రోజులైతుందని చెప్పి మార్కెటుకి వెళ్లి చేపలు తీసుకు రమ్మని అడుగుతుంది. అతడు చేపల వాడికి తరువాత డబ్బులు ఇస్తానని చెప్పి చేతికి అందిన చేపను తీసుకుని ఇంటికి వస్తాడు. అతని భార్య చేపల కూర చేయడానికి చింత పండు కావాలని పంపిస్తుంది. అతడు చింత చెట్టు ఎక్కి చూసేసరికి ఒక కిలో బంగారం, అతని భార్య చేపను నిలువున కోసే సరికి మరో కిలో బంగారం, కొద్ది సేపటికి ముసల్ది వచ్చి బూడిదలో పడ్డ కిలో బంగారాన్ని తీసుకచ్చి ఇస్తుంది. ఆ విధంగా లక్ష్మీదేవి అనుగ్రహంతో మూడు సార్లు పొందిన బంగారం మరల అతని చేతిలోకి వస్తుంది. ఇక వాటిని అమ్ముకుని వచ్చిన ధనంతో హాయిగా జీవితం కొనసాగిస్తారు.

1. రైతు కష్టాన్ని చూసి తట్టుకోలేని లక్ష్మీదేవి మూడు సార్లు కరుణించి బంగారాన్ని ప్రసాదిస్తుంది. మూడు సార్లు ఆ బంగారం తన చేతిలో పడ్డేట్టు పడి చేజారిపోతుంది. అయినా కూడా ఆ రైతు అధైర్య

పడకుండా తిరిగి తన పనిని తాను చేసుకుంటూ వెళతాడు. అతని కష్టపడే మనస్తత్వాన్ని లక్ష్మీదేవి మూడు సార్లు పరీక్షిస్తుంది. ఆ పరీక్షలో అదృష్టాన్ని మాత్రమే నమ్ముకొని ఉండకుండా తన శ్రమనే జీవనాధారంగా చేసుకునే బతికే ఆ రైతు కష్టానికి మూడు కిలోల బంగారాన్ని ప్రసాదిస్తుంది. అలా ఫలితాన్ని ఆశించకుండా నిరంతరం శ్రమించేవారికి ఏదో ఒక రోజు తమ శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుందని ఈ కథలో రైతు పాత్ర ద్వారా విశదం అవుతుంది.

2. పేదరికంతో బాధపడుతూ కష్టపడే వారికి ఏదో ఒక రోజు అదృష్ట దేవత వరిస్తుందని, తమ కష్టాలను మరిచిపోయే సుఖాలు చేరువవుతాయని, తాము చేయవల్సినదల్లా తమ విధి వీడకూడదనే స్ఫూర్తి నింపే ప్రేరణాత్మకమైన కథ ఇది. ఒకవేళ ఈ కథలో రైతు మొదట లభించిన బంగారంతో సంతృప్తి పడి కట్టెలు కొట్టడానికి వెళ్లకపోయి ఉంటే మూడు కిలోల బంగారం లభించేది కాదు. అలాగే అదృష్ట దేవతని మాత్రమే నమ్ముకుంటూ విశ్రమించని వారికి సత్ఫలితాలు దరి చేరవనే నీతిని కూడా బోధిస్తుంది ఈ కథ.

## 2.4.6.2 భోగసాని లంగతనం

లక్కాకుల రాజన్న, తుమ్మనాల్లె గ్రామం, ధర్మపురి మండలం.

తల్లిదండ్రికి ఒకటే కొడుకట. ఆ కొడుక్కి తల్లిదండ్రి ఏమి చెప్పిర్రు గదంటే పదిమంది ఉన్నకాడికి వోయి పని చేసుకొని బతకాలి రా బిడ్డంటే. ఈ కొడుకు ఏం చేసిండంటే పదిమందిల్నే పని చేయల్నట. నీ అవ్వ ఈ పదిమంది ఎక్కడ ఉంటరో అక్కడికి పోత అని చూస్తుండట. పోయేవరకు ఒక కాడ ఐదుగురే ఉన్నరు. ఏయ్..ట్...! గీ ఐదుగురితో పని గిట్టదు. పదిమందే ఉండాలని చెప్పింది అయింత ఆడ ఇడిసిపెట్టి ఇంకోకాడికి పోయిండట. అక్కడ పదిహేను మంది ఉన్నరట. ఏయ్...ట్....! గీ పది మంది ఉన్న కాడికి పోవాలి నేను. ఈ పదిహేను మందితో పనిచేయ్యా అని చెప్పి ఇంకోకాడికి పోయిండట. ఎక్కడికి పోయినా పది సంఖ్య కనబడతలేదు. మనుషులు ఈ పది సంఖ్య ఏనాడయితే ఉంటదొ? అనాడే ఆళ్లతోనే బతకాలి అని చెప్పి పోతే ఎక్కడ పది సంఖ్య కనబడకపోతే వాడు జంగల్ల పట్టిండు. పది ఏడ ఉంటే ఆడ బతుకుత అని పోతండట. పోంగ పోంగ జంగల్ల ఒక మామిడి చెట్టున్నది. ఆ చెట్టు కింద పది కోతులు ఉన్నయి. పది కోతులు ఆ...! గీడ పది కోతులున్నయి. ఇగ గీడనే బతకాలని చెప్పి ఆ కోతులు దగ్గరికి పోయిండు. అవి ఎగురుకుంట చెట్టు ఎక్కినయట. అరె ఇవి చెట్టు ఎక్కవట్టే అని భగవంత ఎట్ల బతుకుడు. మా అయ్యా! అవ్వనేమో పది మందిల పనిచేసుకొని

బతకాలన్నరు. మరి ఇక్కడికి అత్తేనేమో ఏడ పది మంది మనుషులు కనబడపయిరి. ఈ జంగల్లకి అత్తె మాత్రం జంగల్ల పది కోతులు కనబడే వీటిలో బతుకుతనని చెప్పి పోతే నాకు కోతులు దగ్గర అత్తలేవు. భగవంత నువ్వే దిక్కు అని ధ్యానిస్తుండు. అండ్ల భగవంతుడు ఒక కోతికి బుద్ధి పుట్టించిండు. మేం కోతులు కలిసి ఒక గోవును దానం ఇత్తం అని చెప్పి జంగల్ల ఒక లాగెను తీస్కచ్చి కోమటోయినకు ఇచ్చినయి. బిడ్డా గోవు దానాన్ని పట్టుకొని వోయి ఇంటికి కాడ మేపుకుంట అష్ట సంపద కలుగుతది. ఈడు ఎల్లిపెయిండు. ఇంటికచ్చి ఆ లాగెను మంచిగ మేత, అదొటి ఇదొటి పెట్టుకుంట మంచిగ సాదుకుంటుండు. ఏమయిందిగ ఆడు ఒకనాటికి మస్తు ధనవంతుడై పోయిండు. మల్ల కోమట్లచ్చి అయ్యా నీకు మాత్రం మేం పిల్లనిచ్చి చేత్తం. మీరు మంచిగ కలిసి బతకాలని చెప్పి ఒక ఊరు పిల్ల దొరింపు చేసి లగ్గం చేసిర్రట. రాకట పోకట మంచిగనే ఉండే ఒక కిరాణషాపు పెట్టుకుని మంచిగనే బతుకుతుర్రు. ఒకనాట రోజున అత్తగారింటికి సత్యనారాయణ నోము చేసుకుంటురట. అత్తగారింటికి అచ్చి చెప్తె ఈ లాగె ఉండే. అత్తగారింటికి వోయి వచ్చేవరకల్లా మేత, నీరు కావాలని చెప్పి ఇంట్ల కట్టేసి నీరు పెట్టిండట. తలుపులు, తాళాలు గట్టిగ ఏసిండు. అత్తగారింటికి పోయిర్రి. పోంగ మధ్యల గోదావరి అచ్చిందట. పది గంటల వరకు ఆకలైంది. ఓ నీడకాడికి వోయి ముల్లెలన్ని ఇప్పిరట. అన్నం అంత సున్నమయ్యి అప్పాలు కప్పలై ఎక్కడికక్కడ తీసిపోయినట. అన్నం సున్నం అయ్యే తెల్లగా మనం మాత్రం ఇగ మీ తల్లిగారింటికి పోవద్దు. మన ఇంటిక్కాడ ఏం కలహం జరిగిందో మనం ఇంటికే పోదామని చెప్పి భార్యభర్తలు మర్రచ్చిర్రు ఇంటికి. అచ్చేవరకల్లా కోమటోని ఇంటి పక్కపొంటి ఒక బోగ రంగసాని ఉందట. ఆ రంగసాని ఈ లాగ అచ్చినోల్లె ఈనికి అష్ట సంపద కలిగే ఈ లాగె నాక్కావాలని చెప్పి తాళాలు పలగగొట్టి తీస్కపోయింది. భార్యభర్తలు చూసి గిట్ల అయిపయేనని ఆలోచించి బోగం రంగసాని ఒక్కె ఎద్దుకు బొడ్డారంకు బెల్లం పెట్టి ఆ లాగెను చీకిచ్చుకుంటుందట. మా లాగెను తెచ్చుకునుడు ధర్మమేనా అని రంగసానిని అడుగుతడు. నా బక్కెద్దు పికిలిచ్చి పిల్లను బెట్టింది సూడు. బొడ్డారు చీకితుంద లేదా ఇది నాదే అంటది. పెద్ద లడాయి అయింది. జడ్జి దగ్గర కేసు పెట్టుకున్నంక ఆ కేసులు ఏమయ్యంటే సాని తరపున పది మంది పోయిర్రు. జడ్జి బిడ్డ ఈ పంచాయితి తెగెటట్టు లేదు. పలానా రోజు రండి అని జడ్జి అంటడు. కోమటోని భార్య పట్టుకుని జడ్జి దగ్గరకచ్చిండు. రంగసాని పది మంది గుండగాల్లను ఏసుకుని అచ్చింది. ఈ తీర్పు అర్థం ఎట్ల చెప్పాలో తెలియక ఒక దూల మూలకు మంచం వేసుకొని పన్నడట ఇంట్ల. వీళ్లచ్చినా మర్రి పోవాలి. భయానికి చెప్పరాక లోపల పన్నడు.

రంగసాని జడ్డి ఇంటికి అచ్చి జడ్జి కూతురుని అడిగింది. జరసేపు అగు అంటది. బాపు ఏటు పెయిందు అని అడిగింది. బాపు బాలంత అయిండమ్మా. బాపుకి కొడుకు పుట్టిండు. నాకు తమ్ముడు. నాకంటూ. దూరం దూరం మాక్కెల్ లముడి అంటడు. జడ్జి బిడ్డంటది. ఏంటిదమ్మా బాపు బాలెంత అయిండా? కొడుకా అంటు ముట్టు అంటరా? ఇదంతా కల్లా.. అని చెప్పి సాని అంటది. అవునమ్మా మా బాపు బాలెంత అయితడు. నీ బక్కెద్దు పికిలిచ్చి పిల్ల ఎట్ల పెట్టింది. అది మగదేనయే. నువ్వ్ లంగతనం చెత్తునవ్ తీస్కోనిపోయి రంగసాని దాని గుండగాల్లను లోపల ఏసి పొట్టు పొట్టు తన్నిపిచ్చింది. అయింత ఇవతలకు అర్థాన్ని తీసిండు. నిజమే అది నాది కాదు. కోమటయినదే అన్నంక ఆ లాగెను కోమటయినకు తీస్కచ్చి యిచ్చిందట. కోమటయినా ఆ లాగెనే తీస్కోని ఇంటికాడ కట్టెసుకొని మేపుకున్నడట. భార్యభర్తలు ఇద్దరు మంచిగ బతికిర్రట.

## భోగసాని లంగతనం – కథావిశ్లేషణ

ఒక భోగసాని తన ఇంటిప్రక్కన ఉన్న కోమటి అదృష్టానికి కారణమైన గేదె దూడను దొంగిలించి తాను ఆ దొంగతనం చేయలేదని అబద్ధం చెప్పి కప్పి పుచ్చడానికి ప్రయత్నిస్తుంది. కానీ ఆ ఊరి న్యాయవాది తెలివిగా రంగసాని చెప్పేది అబద్ధమని రుజువు చేస్తాడు. ఆ న్యాయవాది చూపిన నేర్పు వల్ల అమాయకుడైన కోమటికి న్యాయం జరుగుతుంది. అయితే ఒక ఊరిలో ఒక్కగానొక్క కొడుకైన ఒక కోమటి తన తల్లిదండ్రులు చెప్పిన మాట విని పది మంది ఉన్న చోటే పనిచేయాలని అనుకున్నాడు. కానీ పది మంది ఉన్న చోటులో ఎక్కడా పని దొరుకదు. పని దొరికిన ఈ కోమటి తల్లిదండ్రులు చెప్పిన మాటను సరిగ్గా అర్థం చేసుకోకుండా పది మంది ఉన్న చోటే చేయాలని మూర్ఖంగా ఆలోచిస్తాడు. కోమటి పదిమంది ఉన్న చోట ఎక్కడ ఉందో అని వెతుకుతూ పది కోతులు ఉన్న ఒక చెట్టు దగ్గరికి వెళతాడు. ఆ కోతుల్లో ఒక కోతి మహిమతో ఒక లేగ దూడను ఇంటికి తెచ్చుకుంటాడు. ఆ రోజు నుంచి అష్టైశ్వర్యాలు సిద్ధించి బాగా డబ్బు సంపాదిస్తాడు. మంచి సంబంధం చూసి తల్లిదండ్రులు పెళ్లి చేస్తారు. ఒక రోజు పండుగ వేళ అత్తగారింటికి వెళ్లే పని పడుతుంది. భార్యతో సహ అత్త గారింటికి వెళితే తన త్వరితగతిన ఎదుగుదలకి కారణమైన లేగదూడకి మేత పెట్టలేదు. అది చిక్కిపోతే ఎక్కడ అదృష్టం పోయి దురదృష్టం వచ్చి పడుతుందోనన్న అనుమానంతోనే అత్తగారింటికి బయలుదేరతాడు. కొద్ది దూరం పోయిన తరువాత ఆకలి తీరడానికి ముందే సిద్ధం చేసుకున్న సద్ది మూటని తెరుస్తాడు. అందులో అన్నానికి బదులుగా సున్నం ఉంటుంది. ఇంటికాడ ఏదో అనుహ్యామైన

సంఘటన జరిగిందని ఊహించి భార్యతో చెప్పి తొందరగా ఇంటికి చేరుకుంటాడు. వాళ్లిద్దరు ఇంటికి వచ్చేసరికి ఇంట్లో లేగదూడ ఉండదు. ఇంటిప్రక్కన ఉన్న భోగ రంగసాని దగ్గర లేగదూడ కట్టేసి ఉంటుంది. కోమటి భోగసాని దగ్గరికి నా లేగదూడని నాకు ఇమ్మని అడుగుతాడు. అప్పుడు నా బక్కెద్దు పికిలిచ్చి పిల్లని పెడితే పుట్టింది ఈ లేగ దూడ నాది అంటుంది. ఇక భోగసానితో మాటలతో గెలువలేనని తెలిసి ఆ ఊరి సమస్యలకు తీర్పు ఇచ్చే న్యాయవాది దగ్గరికి వెళతాడు. భోగసాని చేసిన దొంగతనం గురించి చెప్తాడు. గ్రామ పెద్దలతో పంచాయితీ పెట్టిస్తాడు. భోగసాని మాత్రం కోమటి అదృష్టానికి కారణమైన లేగదూడని మాత్రం వదలుకోకూడదని రౌడీలను, గుండాలను పట్టుకుని తీర్పు చెప్పే న్యాయవాదిని బెదిరించడానికి వెళుతుంది. భోగసాని చేష్టలను ముందే గమనించినా న్యాయవాది మాత్రం కోమటికి ఎలాగైనా న్యాయం చేయాలని ఒక వ్యూహాన్ని అల్లుతాడు. ఇంట్లోనే కూర్చోని, వచ్చిన భోగసానితో తన కూతురితో మాట్లాడిస్తాడు. మీ నాన్న లేడా అని భోగసాని అడిగితే దానికి మా నాన్న కడుపుతో ఉన్నాడు. ఈ మధ్య ప్రసవం అయి నాకు తమ్ముడు కూడా పుట్టాడని పరిహాసం ఆడుతుంది న్యాయవాది కూతురు. భోగసాని కోపం వచ్చి మగవాడు పిల్లలను కనడం ఏందని న్యాయవాది కూతురిని బెదిరిస్తుంది. అప్పుడు న్యాయవాది లోపల నుంచి వచ్చి మగవాడు పిల్లలను ఎలా కన్నాడు, అన్నదానివి నీ బక్కెద్దు పికిలించి పిల్లని ఎలా పెట్టింది చెప్పు అని నిలదీసి అడుగుతాడు. భోగసాని ముఖం చిన్నదై అసలు నిజాన్ని చెప్తుంది. న్యాయవాది పోలీసులను పిలిపించి భోగసాని దొంగతనాన్ని బయటపెట్టి రౌడీలను, గుండాలను అరెస్టు చేయిస్తాడు. సామాన్యంగా లొంగని భోగసానిని తన మార్గంలో పోయి తన చేత నిజం చెప్పిస్తాడు ఆ ఊరి న్యాయవాది.

1. అమాయకుడైన కోమటిని మోసం చేసే భోగసాని లాంటి దుష్ట మనస్తత్వం గలవారు సమాజంలో నిత్యం తారసపడుతుంటారు. వారి నుంచి మనల్ని మనం ఎలా జాగ్రత్త పరచుకుంటూ, అప్రమత్తంగా ఉండాలో ఈ కథ తెలియజేస్తుంది.

2. ప్రతి గ్రామల్లో న్యాయాన్ని అందించి తీర్పునిచ్చే గ్రామసభలుంటాయి. వాటిని పంచాయితీ అని, కచ్చీరు కాడ అని, నలుగురు ఉన్న కాడ న్యాయం జరుగుతుందని పలు రకాల పేర్లు జానపదుల వ్యవహారంలో ఉన్నాయి. అందుకే ఈ కథ ఆదిలో కోమటి తల్లిదండ్రులు పది మంది ఉన్న కాడ పని చేసుకొని బతుకు రా.. అని అంటారు. అంటే పది మంది ఉన్నచోటే అన్యాయం జరగడానికి స్థానమున్న అదే పది మందిలోనే న్యాయం కూడా జరుగుతుందని అర్థం. పది మంది లేదా అంతకన్నా ఎక్కువ

ఉన్న చోట ఒక సంఘంగా ఏర్పడుతుంది. ఆ సంఘం నిర్దేశించిన సామాజిక సూత్రాల ఆధారంగా వారి జీవన విధానం ఉంటుంది. ఆ జీవన విధానాన్ని అనుసరించి వాళ్ల అభివృద్ధి ఆధారపడుతుంది. నిరంతర అభివృద్ధిని ఆశించే సమాజంలో అన్యాయానికి తావుండదు. కాబట్టి పెద్దలు నలుగురితో కలిసి నడవాలి, నలుగురితో నారాయణ, పది మందితో పాటే మనం అనే సామెతలు నిత్యం మనకు వినిపిస్తూ ఉంటాయి.

3. హైందవ ధర్మంలో భాగంగా హిందువులు గోవులను గోమాతగా భావించి పూజలను నిర్వహిస్తూ ఉంటారు. సకల దేవతల రూపానికి చిహ్నంగా భావించి, ఎంతో ఆరాధ్యంగా పూజిస్తారు. నిత్య క్రతువులను నిర్వహిస్తారు. అందుకే ఏ ఇంటికి ముందుకి వచ్చినా ఆవునైనా దండం పెట్టుకుని కళ్లకు అద్దుకోవడం మనకు అలవాటే. అలా ఆవును పూజిస్తే సకల ఆయురారోగ్యాలతో పాటు, అష్టైశ్వరాలు సిద్ధిస్తాయని హిందువుల నమ్మకం. శాస్త్రీయంగా కూడా పరిశోధనల్లో ఆవు, గేదెల వల్ల మనకు ఎంతో ఆరోగ్యం లభిస్తుందని సైన్స్ పరిశోధకులు చెప్తారు. దానికనుగుణంగా భారతదేశంలో పలుచోట్ల గోశాలలు కూడా వెలిశాయి. మరో కోణంలో ఆలోచిస్తే కూడా మానవుడు మచ్చిక చేసుకొన్న జంతువుల్లో ఆవులు, గేదెలు ఎంతో ఉపయోగకరమైనవి. వ్యవసాయం, పాలు, చర్మం, మాంసం, ఎముకలు మొదలైన ఎన్నో రకాలుగా ఈ జంతువులు  మానవులకు ఉపయోగపడుతుంటాయి.

## 2.4.6.3 చంద్రహాసుడు కథ

ఇమ్మడి మల్లయ్య, కమునూరు గ్రామం, జగిత్యాల జిల్లా

చంద్ర రాజు ఏ దేశము మీది వెరిగించమిపుడు రాచబాల. కేరళరాజు నేనయ్యా. దుష్టమంత్ర్యా. ఒక్క కారణముగా మేము చేరి వచ్చితినయ్యా! దుష్టమంత్రి. ఏం కారణం ఏమైంది? మూల నక్షత్రాన పుడిమి జన్మించితి దుష్టమంత్రి. ఇందువలన మా తల్లి దండ్రులు వీలాటము వొందిరి దుష్టమంత్ర్యా. సరే నేను ఆయన బోయిన తర్వత ఎవరిదగ్గరైన ఉంటా. ఉండొచ్చు అవ్వా సరె. నా బాబు కేరళ రాజు. మా రాజ్యం కేరళ రాజ్యం. కేరళరాజు కుమారుడను నేనయ్యా దుష్టమంత్రి. నా పేరు చంద్రహాసుడ అంటారు. అటులైతే నీకింకా వచ్చిన భయమేమి  చంద్రహాస. నిన్ను కన్న పుత్రుని వలె పన్నుగా రక్షిత్తు చంద్రహాస. సరె ఉంటాను. ఆయన ఉంటానేసరికి ఆ దుష్టమంత్రి ఏం చేసాడంటే. ఈ యొక్క చంద్రహాసున్ని ఉంచుకోవాలంటే వాళ్ళ తల్లిదండ్రి మూల నచ్చంత్రన పుట్టిండని ఆల్ల తల్లిదండ్రి హతమై పోయిండని చెప్పిండు. మరీ నా దగ్గర ఉంటే మరీ రాజ్యానికి మంచా? చెడు అవునా? అని చెప్పి ఆ

బావనులను పిలిపించి అడిగిపించిండు. బావనులు ఏమన్నరు.. మంత్రి ఈ చంద్రహాసుడు నీ యొక్క రాజ్యానికి రాజైతడు ఇన్నవా? ఆయనను ఉంచుకుంటే నీకు లాభం లేదని చెప్పి అన్నారు. ఎట్ల ఎల్ల గొట్టాలిపుడు చంద్రహాసున్ని. సరే అని కటికెను పిలిపించి ఆన్ని చంపిత్త! ఇంకేముందని చెప్పి దుష్టమంత్రి కటికను పిలిపిత్తడు. పిలిపించి చంద్రహాసున్ని తీస్కుపో. అడవిలో కండించి రావాలి. అని చెప్పి దుష్టమంత్రి అనేసరికి ఆళ్లోచ్చారు కటికలు. అడవికి ఈ వేళ కదులు కదులు వరుసగా మేము ఎవ్వరిన్నరా దుష్టమంత్రి. ఇన్ని దినముల నుండి తనకన్న పుత్రుడి కన్న మిక్కిలి చూసినని అనెను. వినరాని తప్పేమి చేసితిని. మమ్ము చంపుటకు అడవికి పంపమన్నాడ ఏమి నేరం చేసినాను వీరసేన. ఎందు కోరకు ఆయన నను పట్టుకొమ్మన్నడు. ఈ దేశమునకు వీడు నాయకుడవుతడు వీర సేన. విప్రవర్యుడు ఇప్పుడు నాతో తెలిపిరి వీరసేన. అందు గురించి ఈ చంద్రహాసున్ని తీస్కుపోయి అక్కడ అడవిలో కండించమని చెప్పారు. లేదు అక్కడ కండించి రాపోంద్రి చంద్రహాసున్ని. అడవిలోకి పోయిన్రు. ఎట్ల కండించుడు ఆని విడిచిపెట్టిరు. విడిచిపెట్టేసరికి ఆయనొక దేశం వెళ్లాడు. ఎవలు? చంద్రహాసుడు. పొయినంక  అయ్యా ఎవరు మీరు సుందరాక్ష! మీరెవ్వరయ్యా ఎందుకొరకని ఇటు వచ్చినారయ్యా? అమ్మా మేము ఒక రాజులం. ఇటు వచ్చిన కారణం నా పేరు చంద్రహాసుడు. నాదో మాట వట్టి దొరయని పిలుత్తురు ఆ చోట. నీది పురమును నీ పేరు తెలుపు. నా వైపు నీవు అతి ప్రేమ నిలుపు. నా పేరు చందాలవతి. నాగరాజు నృపతికి నందన నందన నృపతిని వనిజాలోచన రాజునోక వార్త మీ తోడ గలదు. తేజో ముఖం మీతో తెలుపద మీకు. కన్య నీతోడ గలదె ఏమి వార్త. విన్న విద్య నేను వినకుందును ఎటులా వనజాలోచన నను పెళ్లి ఆడు. ఈ వనములందున పెళ్లి ఆడు. అమ్మా ఈ వనంలో పెళ్లి అంటవా? ఎవ్వరైనా మెచ్చుతారా? తల్లి ఉన్నారా? తండ్రి ఉన్నాడా? కులమున్నదా? బంధువులున్నారా? పెళ్లియేలానే ఈ వనమందు ? తల్లిదండ్రి విన్నను తమ కోపమందు అమ్మా! ఈ పెళ్లి చెల్లదమ్మా లేదు లేదు తల్లి దండ్రి ఎవ్వరు. లేకపోనీ నాకు పెళ్లి కావాలి. చేసుకున్నరు బలవంతంగా చంద్రహాసుడిని. మీ రాజ్యం పోకడ లేదు. మా రాజ్యాననే ఉండు. మా రాజ్యం ఎప్పుడో పొయిందని చెప్పి ఆమె చంద్రహాసుడు ఇక్కడనే ఉంటరు.

## చంద్రహాసుని కథ – కథావిశ్లేషణ

కేరళ దేశానికి చెందిన కేరళరాజు కుమారుడు చంద్రహాసుడనే రాజు మూల నక్షత్రాన జన్మిస్తాడు. మూల నక్షత్రంలో జన్మించడం రాజ్యానికి కీడని భావించి కేరళరాజు కొడుకును తన

ఆలనపాలనను చూసుకోకుండా వదిలేస్తాడు. తండ్రి ప్రేమ చూరగొనని చంద్రహాసుడు దుష్టమంత్రి పర్యవేక్షణలో పెరిగి పెద్దవాడవుతాడు. కాని చంద్రహాసుడి వల్ల వాళ్ల రాజ్యానికి ఎక్కడ కీడు జరుగుతుందనేమోనని బ్రాహ్మణులకు చంద్రహాసుడి జన్మ నక్షత్రం గురించి తెలియజేస్తాడు. అప్పుడు ఆ బ్రాహ్మణులు చంద్రహాసుడే మీ రాజ్యానికి రాజవుతాడని వెల్లడిస్తారు. దుష్టమంత్రి చంద్రహాసుడు రాజవ్వడం ఇష్టం లేక కటికెవాడిని పిలిపించి చంద్రహాసుడిని చంపివేయమని ఆదేశిస్తాడు. కటికలకు చంపడం ఇష్టంలేక చంద్రహాసుడిని వదిలేస్తారు. చంద్రహాసుడు వేరొక దేశం వెళ్లి అక్కడ చందాలవతి అనే రాకుమారిణి ప్రేమించి పెళ్లి చేసుకొని ఆ రాజ్యంలోనే సంతోషంగా గడుపుతారు. చంద్రహాసుడి పుట్టడం వల్ల తన రాజ్యానికి కీడని అందరు భావించి అతన్ని వదిలిపెట్టారు. కాని రాకుమారైన చందాలవతి చంద్రహాసుడిని వలచి, ప్రేమించి పెళ్లి చేసుకొని అతనితో సంతోషంగా ఉంటుంది.

## 2.4.7 సమస్యాత్మక, తట్టు కథలు

### 2.4.7.1 సావుకారి కోడలి చతురత

చిట్టన్నోజు అమ్మాయక్క, గణేష్ పల్లి, ధర్మపురి మండలం

ఒక సావుకారి. సావుకారికి ముగ్గురు కొడుకులు. ముగ్గురు కొడుకులైతే ఉండంగ ఉండంగ దీపావళి పండుగ అచ్చింది. దీపాళి పండుగత్తే అయింత గంగకోయి నీళ్లు తెచ్చుకోవాలి. గంగకు నీళ్లు తెచ్చుకోటానికి ముగ్గురు యారాలు వోతరు. ముగ్గురు యారాలు వోతే అక్క నేనత్త ఆగుర్రె అని చిన్న కోడలంటది. చిన్న కోడలంటే నువురా.. తర్వాత నేనచ్చేదాకా అగుర్రి అంటే ఈ పెద్దోళ్లు ఏం జేత్తరు. మేం నడుత్తం. మీరు రార్రి అని చెప్పి ఇద్దరు బిందెలు పట్టుకొని పోతరు. పోయేవరకల్లా ఈ చిన్న కోడలు ఎనకయితది. కొంచెం ఎనుకయ్యేవరకల్లా ఏంది గద! దొర కచ్చీరు ముందటకేంచి పోవుడు. దొర దగ్గరకెల్లి దొర ఆడ కూసుంటడు.కచ్చీరు ముందటికెల్లి ఇట్ల గంగకువోవుడు.

అయితే ఆ దొర ఏం జేత్తడు గద..?

చిన్న పిల్ల ఇగర అని పిలుత్తడు పోతది. పోయినొల్లే ఆమెకు ఎంటుకలు, మడిమలు తట్టి ఉంటాయి. ఎంటుకలు మడిమలకు తట్టి ఉంటే కొసకు ముడి ఎసుకుంటది. అట్లే పోతది. పోంగ పిల్ల ఇగ రారి అని పిలుత్తరు. అస్తది. అచ్చినోల్లే ఏంది? రాజంటది. అంటే నువ్వు నీ కురులు కూసుండి ముడుసుకుంటవ. నిలుసుకుంట ముడుసుకుంటవ అని అడుగుతడు.

అడిగినోల్లే ఆ రాజు గిట్ల కట్టేసుకోని కూసుంటడు కచ్చీర్ల.

రాజా! రాజా! ఆ..నువ్వే కట్టేసుకున్నవ!

ఎవ్వరైన్న కట్టిసిర్ర! అని ఈమె అంటది. సప్పుండేంక వోతది.

అయింత నీళ్లు ముంచుకుంటది. ఇంటికత్తది. ఇంటికి వొయినెల్లే ఆ రాజు ఏం జేత్తడు గద! పతాని...! సావుకారి కోడలు నన్ను గిట్ల అన్నది. రాజా రాజా నువ్వే కట్టేసుకున్నవ? ఎవరన్న కట్టేసిర్ర? అని చెప్పి అన్నది. నువ్వు పొద్దుగల్ల లేసి ఊరు సాటింపెయ్యి. అందరు ఊళ్లే ఎవ్వరిండ్ల పొగ సూరద్దు. భోజనాలు ఇక్కడికే రావాలని చెప్పె. ఊరు సాటించ్చవరకల్లా అయింత అందరు వీళ్లింటికి భోజనాలకి అత్తరు. రాజు వాళ్లింటికి అందరు అత్తరుగాని సావుకారు చిన్నకోడలు పోదు. సావుకారిట్ల అందరు అత్త, మామ, కోడల్లు పోతరు. ఈ చిన్న కోడలొక్కత్తి పోకా ఇంటికడ ఉంటది. మరీ! అత్త మామ అంటరు గద. మేం అందరం ఊరు ఊరోల్లందరు పోయినమే. నువ్వు రాకపోతివేమే. మరీ! మనకు దండుగెత్తడు? అంటే ఎందుకెత్తడు? దండుగమన ఇంట్ల పొగ ఏలుతుంద? పొగ ఏల్లద్దని చెప్పని అన్నడు. అంటే నేను తినకుంటే అయిపోయే అని చెప్పి ఈమె అంటది. ఆ రోజు ఏం తినదు. ఏం తినక ఉపవాసమే పంటది. ఉపవాసమే ఉన్నొళ్లే అట్ల అది అట్లనే వుండే. మల్ల తెల్లారే ఏం జేత్తడు గద. మల్ల రాజు కోమటమనే చిన్నకోడలు రాలేదు. మల్ల రమ్మని చెప్పి మల్ల భోజనం పెట్టాలి అని చెప్పి అచ్చేతట్టు చెయ్యాలని చెప్పి పతానికి మల్ల చెప్తడు. మల్ల మొత్తం మంది ఒక ఇంటికి ఒక మనిషి తప్పకుండ రావాలని చెప్పి మల్ల చెప్తడు. మల్లందరు అత్తరు. అందరు అచ్చినోల్లే ఈమె అచ్చి ఎనుకకత్తది ఈ పిల్ల. ఎనుకచ్చి కూసుండి ఏంజేత్తది గద. అమ్మ! అమ్మ! నువ్వు ఆమెకు అన్నం పెట్టు. పెట్టి చెంబు నిండు చెంబు ఆడవెట్టు అని ఆమెను వట్టుకొని ఈడు తల్లికి చెప్తడు. ఈ రాజు తల్లికి చెప్పినోల్లే అందరు మొత్తం తింర్డి, పాయిర్రి. ఈమెకు చీకటైతది. చీకటియ్యేదాక పట్టుకొని ఏడ్సినోల్లే నన్ను పట్టుకొని ఏడ్తున్నవేంది? శంబు అక్కడవెట్టి నన్ను పట్టుకొని ఏడుతున్నవ్ ఏంది? అని ఈమె అంటది. అంటే నా బిడ్డ గిట్లనే ఉంది. నా బిడ్డ గిట్లనే ఉండే నా బిడ్డ లాగున్నవ్ అని నేను ఏడ్సిన అని చెప్పి ఈమె అంటది. అన్నంక రాత్రయితది. రాత్రయి ఏంజేత్తది గద. ఈ రాత్రి వోకు... ఈ రాత్రి ఇక్కనే ఉండు. పొద్దుగాల్లవోయేవు అని అంటది. అన్నవోల్లే సరే గీ రాత్రి అని సప్పుడేంక ఊకుంటది. రాత్రి ఎక్కడోలక్కడ పంటరు. పన్నవోల్లే రాజు పంటడు. ఈ ముసల్ది ఏంజేత్తదిగద!

అమ్మాయి... అమ్మాయి... రాజుకు మంచీల్లుపెట్టవ? నీళ్లు పెట్టిరాపో బిడ్డ అని అంటది. అన్నవోల్లే నీళ్లు పట్టుకుంటా ఇంట్ల పెడతది. ఇట్ల పట్టి పెట్టేవరకల్లా కొంచెం లోపలికివోయి అటు

పక్కబాజు పెట్టు అని అంటది. అన్నవోల్లే లోపలికి పోతది. లోపలికి పొయినోల్లే తలుపు పెడతది. ఇవతలకు పెట్టినోల్లే కతం..! ఏట్ల? ఏంజెయ్యాలి అని అనంగ రాజు చేయి పడతడు. చేయి పట్టెవరకల్లా ఏంజేత్తది గద. ఆగు నువ్వు కొంచెం ఆగు అయిదు నిమిషాల ఆగు అని చెప్పి ఆగువనోల్లే పుస్తేలు తెంపుకుంటది. పుస్తేలు దెంపుకొని ఇగ పూసలు కుచ్చుతది. ఇటు కుచ్చిన కొద్ది ఇటు పోయేటట్టు ఇటు కుచ్చుతది. ఇగ ఈ రాజుకు నిద్ర బాగత్తది. నిద్ర బాగా రాంగనే ఏంజేత్తడు. నాకు నిద్ర బాగాత్తంది. ఒక ఆకు గట్టియే అంటడు ఈ పిల్లను. ఆకు గట్టిత్తది. మంచిగ ఎక్కతక్క జర్ద వోత్తది. ఆకు గట్టిత్తది. ఆకు గట్టెసినోల్లే అయింత తింటడు తింటడు అటే నిద్ర వోతడు. అటే నిద్రవోయినోల్లే అయింత ఇదేం జేత్తది. ఎనుకట పుంజు కూయంగ లేత్తరు గద. పుంజు కూయింగనే లేసి పని చేసుకుంటరు గద. పుంజు కూసింది. కూసినోల్లే అయింత ఈ ముసల్ది తలుపుతీత్తది. తలుపు తీసినంక అయింత ఏంజేత్తది. ఈ రాజుకు ఏంజేత్తది గద గంధం ఉంటది. గంధం తీసి ఎడమకాలుకు, బొటనవేలుకు యిక్కడ బొచ్చె మీద, ముఖానికి పెడతది. ఇగ ముసల్ది తలుపు తీయంగనే ఇగ ఇది ఈ ఇంటికి వోతది. ఇంటికి ఎప్పటి లెక్క పోతది. మంచిగ ఉంటది. ఉన్నవోల్లే ఇగ రాజు అయ్యో! ఇంక రాజు లేత్తలేడు. అరెయ్ ఏడయ్యే ఇంత టైం అయ్యే రాజు లేత్తలేడు. అని చెప్పి నైట్ నిద్ర లేదో ఏమో శానాసేపు పంటడు కావచ్చు. పండని ఏంది అని ఈమె అంటది. ఎనిమిదయితది కావచ్చు. అయింత లేత్తడు. లేసి చూసేవరకల్లా ఏంది అద్దంల చూసే వరకల్లా అక్కడక్కడ బొట్లు ఉంటయి. బొచ్చెల ఉంటది. అబ్బ! ఇది కోమటి పోల్ల! ఇంత పని చేసిందని అని చెప్పి చూసుకొని చెప్తడు. పతాని.. పతాని..! కోమటి సావుకారి కోడలు చూసినవ? గింత పని చేసిందామె? గంధం బొచ్చెల పెట్టింది. నేను దానితోటి తన్నించుకునే కాలం అచ్చిందని చెప్పి పతానికి చెప్తడు. పతానికి చెప్పినోల్లే పతాని ఏంజేత్తడు గద. మరి ఏంజేత్తం అని చెప్పి పతాని అంటడు. ఏంచేసుడు ఏంది కచ్చీరు కాడికి పిలిపిత్తం దాన్ని. కచ్చీరు కాడికి పిలిపిచ్చి మాట్లాడుదాం. కచ్చీరు కాడికి పిలిపిత్తరు. కచ్చీరు కాడికి పిలిపిచ్చినోల్లే ఈ రాజంటడు.

'గడ్క తినే నీ గాడిది, గడ్క తినకపోవడం కారణం ఏంది' అని చెప్పి రాజు సాత్రం ఏత్తడు. ఏసినోల్లే అది చెప్తది గద! ఇదంటది 'పండి పండని మామిడి పండు వుండి పండకపోవడం కారణమేంది' అని ఇదంటది. ఏసినోల్లే నాది నువ్వు చెప్పు నీదీ నేను చెప్త. అప్పుడు అన్నవోల్లే ఇది అంటది కదా. 'గడ్క తినే గాడిది ఉండి తినకపోవుడు కారణమేంది' గడ్క తినేటోన్నివి గద! నేను ఉన్న గద తెల్లాందాక ఉన్న నువ్వు గడ్క తినలే. నాది తప్పు లేదు అని ఇదంటది. అన్నవోల్లే నాదానికి అర్థం

చెప్పు అని ఇదంటది. అన్నవోల్లే పతానికి చెప్తడు. పతాని సాత్రం ఏంది నాకత్త లేదు. చెప్పు అని చెప్పి పతానికి రాజు చెప్తడు. చెప్పినోల్లే ఇది నాగ్గాడ రాదయే అంటడు. మరి ఇది ఎవ్వరు చెప్తే ఆల్లకు మాలు. కచ్చీరు కాడికి అందరిని పిలిపిత్తము. అందరిని పిలిపిత్తే నేను ఆల్లకు అయిదు ఏకరాల పొలం యిత్త ఎవ్వరు చెప్తే ఆల్లకు. ఎంతమంది అచ్చిన.. రాని దీనికర్ధం ఎవ్వలు చెప్తలేరు. మరి ఎవ్వలు చెప్పరు ఈ అర్థం. ఆమెకు ఏసిన ఆమెకే అత్తది. ఇంకోలు ఎవ్వరు చెప్పరు ఇగ. అందరు ఎవలు నాకు రాదంటే నాకు రాదు అని అన్నవోల్లే మరి నువ్వే చెప్పు. మరి నేనే ఏసి నేనే చెప్తే మల్ల రాజు ఏమంటడో? అనని చెప్పి ఏమనడు చెప్పుమనంటడు గద! అని చెప్పి ఈల్లంటరు. అన్నవోల్లే చెప్తది గద 'పండి పండని మామిడి పండు పండి పండక కారణం ఏంటంటే' నను బలిమార్తం చేసుకొని ఉంచుకున్నడు. ఉంచుకున్నగని నన్నేమి సుఖ పెట్టిండు. బిడ్డలాగా సూసుకునేటోన్ని. నన్నేమి సుఖ పెట్టలేదు. నన్నే ఎట్లయితే కరాబు చేయాలని చూసిండో నాయందు దేవుడున్నడు గనుక నేను బతికిన! అందుకొరకే యీ అర్థం చెప్పింది. ఈమెనే చెప్పింది. మళ్ల ఏసిన ఆమెనే చెప్పినోల్లే దీనికి అయిదు ఏకరాల పొలం ఇచ్చిండు. దాని ఎడమకాలుతోటే తన్నించుకున్నడు. మల్ల దీనికే అయిదెకరాల పొలం యిచ్చిండు.

## సావుకారి కోడలి చతురత – కథావిశ్లేషణ

సావుకారి కుటుంబానికి చెందిన ఒక స్త్రీ తనను అవమానించి, ఎలాగైనా లోబరచుకోవాలని చూసిన రాజుకి బుద్ధి చెప్పాలని అనుకుంటుంది. చాలా తెలివిగా రాజు వేసిన పన్నగాన్ని దీటుగా ఎదుర్కొని తప్పించుకుంటుంది. ఈ కథలో సావుకారి కోడలికి తన మీద తనకున్న మనోధైర్యం, చతురతను ప్రదర్శంచడంలో స్త్రీ అబల అన్న మాటలను అసత్యం చేస్తాయి. తెలంగాణలో రెండున్నర దశాబ్దల క్రితం సమాజంలో స్త్రీలను దొరలు తమకు ఇష్టం వచ్చినట్లు వశపరుచుకోవడం, మానభంగాలను చేసేవారు. అలాంటి సందర్భంలో స్త్రీలు తమను తాము రక్షించుకోవడానికి సందర్భోచితంగా, సమయస్ఫూర్తితో ఎలా రక్షించుకోవాలో ఉపదేశించే విధంగా ఈ కథ మనకు కనిపిస్తుంది. ఒక విధంగా జానపద కథైనప్పటికి ఆనాటి సామాజిక అవసరాన్ని తీర్చుతూ సామాజిక జీవనంలో, అసమానతలతో కొట్టుమిట్టాడుతున్న ఆడవారిలో ఆత్మస్థైర్యాన్ని నింపే కథ. సమాజంలో స్త్రీ అంటే సెక్స్ అబ్జెక్టు కాదని అలా అనుకున్న దొరలలాంటి కీచకులకు బాగా బుద్ధిచెప్పిన కథ. తెలంగాణలో దొరల అరాచకం, పెత్తనం ఎంతటి స్థాయిలో ఉండేది ఈ కథలో దొర పాత్ర బట్టి తెలుస్తుంది. ఆనాటి కాలావసరానికి ఉద్భవించిన ఈ కథ నేటి స్త్రీలలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని

అందిస్తుంది. ఈ కథ ముగింపులో సమస్యాత్మక ప్రశ్నతో, పొడుపుకథతో, చమత్కార వ్యంగ్య మాటలతో సావుకారి కోడలు చూపించిన నేర్పు ఈ కథ అద్యంతాన్ని కట్టిపడేస్తుంది. సంభాషణ చాతుర్యాన్ని చూపించే తప్పించుకోవడమే కాక, తన కుటుంబానికి ఎలాంటి మచ్చ రానివ్వకుండా పట్టుదలతో తనకన్న అన్ని విధాల బలవంతుడైన దొరను ఎదుర్కుంటుంది. సమాజంలో నాటికి, నేటికి స్త్రీలు తల్లిగా, భార్యగా, చెల్లిగా, కోడలిగా తమ జీవితాన్ని పూర్తిగా మగవాడికే అంకితం చేస్తూ ఎన్నో రకాలుగా అణచివేయబడుతుంది. ఈ కథలో దొర, షావుకారి కోడలు మధ్య పొడుపు కథలు కింది విధంగా ఉంటాయి.

**రాజు (దొర) – 'గడ్క తినే ఈ గాడిది, గడ్క తినకపోవడం కారణం ఏంది'**

సావుకారి కోడలిపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఊరంతా భోజనం పెట్టించి తన తల్లి సహాయంతో సావుకారి కోడలిని ఆ రాత్రి తన గదిలోనే పడుకునేలా చేశాడు. తనని అనుభవించడానికి వ్యూహన్ని వేసిన లాభం లేక పోయింది. ఆ మరుసటి రోజు కచ్చీరు సమావేశానికి పిలిపించి నిలదీసి అడుగతాడు. గడ్క అంటే రాగి, బియ్యంతో చేసిన అన్నం వంటకం. పూర్వం వాటిని ప్రీతిప్రాయంగా తినేవారు. గడ్కతో సావుకారి రాజసాన్ని పోల్చి తాను ఆ అందాన్ని అనుభవించలేదని దాని కారణాన్ని చెప్పాలని కచ్చీరు సమావేశంలో అందరిముందు పొడుపుకథ రూపంలో వ్యంగ్యాత్మకంగా దొర ప్రశ్నించాడు.

**సావుకారి కోడలు – 'పండి పండని మామిడి పండు వుండి పండకపోవడం కారణమేంది'**

సావుకారి కోడలు మొదట తన ప్రశ్నకు సమాధానం 'గడ్క తినే గాడిది ఉండి తినకపోవుడు కారణమేంది'అని చెప్పి తాను రాత్రంతా దొరతోనే ఉన్నానని కాని తనను అనుభవించలేని దొర అశక్తతకు కారణాన్ని ప్రశ్నించి పై పొడుపు కథ వేస్తుంది. పండి పండని మామిడిపండు అనగా దోర మామిడు పండువలే దొర యవ్వనంలో ఉన్న తనని స్వీకరించకపోయిన అసమర్థతకు కారణమేమిటి? అని ప్రశ్నించి దొర మగతనం ఉన్నవాడు కాదనే సమాధానం స్ఫురించే విధంగా ఆ కచ్చీరు సమావేశంలో పై పొడుపుకథతో దెప్పిపొడిచింది. ఆ విధంగా కచ్చీరులో తాను వేసిన ప్రశ్నకు సమాధానం ఎవ్వరికి తెలియక చివరకు తానే సమాధానం చెప్పి రాజు ముందే ప్రకటించిన అయిదు ఎకరాల పొలాన్ని బహూమానంగా గెలుచుకుంది. ఆమె వేసిన పొడుపుకథలో చమత్కారాన్ని పసిగట్టలేని రాజు చివరకి ఆడదాన్ని, నవ్వులపాలు చేద్దామనుకుని తానే నలుగురిలో నవ్వులపాలైనాడు.

నిజాం కాలంలో గ్రామాల్లో దొరలే సర్వాధికారులు. నిరంకుశులు. ఈ కథలో దొరపెత్తనం, అధికారబలం వల్ల సావుకారి కోడల్ని ఎలాగైనా లోబరచుకోవాలనుకోవడం ఇదంతా గత కొన్ని దశాబ్దాల నాటి కాలానికి సంబంధించిన కథే అని అర్థం చేసుకోవచ్చు.

## 2.4.7.2 చెల్లెలు దిద్దిన కాపురం

జాడి రాజన్న, ఆరపల్లి గ్రామం, ధర్మపురి మండలం.

రాజు అతనికొక భార్య. అయితే ఆమె ఏం చేసిందు కథంటే ఒకనాడు రాజు రాజు భార్య మంచం మీద గిట్ల కూసున్నరు. కూసున్నంక రాజా రాజా నీకొకటి మాత్రం సాత్రం ఏత్త, సాత్రం ఏత్తే దానర్థం మాత్రం చెప్పాలి. చెప్పకపోతే నువ్వ్ బతుకద్దు అన్నడు. ఏంటిది ఏం కథ నువ్వు ఏదో చెప్పు. తోత్తెనేమో చెప్త లేకపోతే లేదని చెప్పి రాజన్నడు. అన్నంక ఈమె ఏం చేసింది. గదంటే సరే ఏస్తున్న అన్నదట.

కథలన్ని వెతలయే కాపురం రెండయే
నాడు సచ్చిన కుందేలు నేడు కూరయే
సచ్చిన మొగుడు సండ్ల మీద
మనున్న మొగుడు మంచం మీద
దానర్థం ఏందో చెప్పు రాజా అని అడిగిందట

కాని ఇది చేసినా వింత ఆయనకు తెలియదు. ఏం చేసిందు చిన బోయి చిన్న కాంతుడై ఇది లేనిది కావచ్చు. నేను ఎట్ల చెప్పాలి ఏం కథ అని చెప్పి తెలువకుంటనే అయిండు. ఇట్ల అయింత ఒక కమరల మూల మంచం వేసుకొని ముసకమీద పెట్టుకొని గడ మంచం వేసుకొని గడగడ తన్ని పట్టి ఇగ నేను బతుకద్దు. దీనర్థమే అట్లున్నది అని చెప్పి ఆన్నే ఉగ్గి పట్టి పన్నడట. పన్నవ కొంతసేపటికి అయింత దీపాలు కాలుతుర్రు కదా దీపాలు ఏంచేసినయ్ కదంటే నడియామ్ రాత్రి కల్కి గంధరియల్ల బస్మన్న సొప్పకట్ట మేనియాల్ల పసిబిడ్డ పాలసీకనియాల్ల. ఆ దీపాలకు ఒక జంగల్ల ఒక దీపాల గుడుందట దీపాల గుడి ఉండె ఏమయిందిగంటే లేసి దీపాల పోయి అక్కడ మాట్లాడుకుంటయట అని దీపాలు వోయినయ్. ఈ ఇంటి దీపం పోతలేదు. వీళ్లు మలుపుతలేరు. అయింత మలుపకపోయేవరకు ఈ దీపం అట్లనే ఉండి తెల్లారుజామురే ఏసిర్రట. ఏసినోల్లె తెల్లారుజామున పూజకు పోయిందట. ఆ దీపాలన్ని కలిసి ఏమనుకుంటున్నయ్. ఏమమ్మా! ఏం కథ అని చెప్పి అయింత ఉన్న దీపాలు

అడిగేవరకు ఆ లాస్ట్ దీపం రాజు గారి దీపం కథ మొదలుపెట్టింది. పెట్టి ఏం చేసింది గదంటే నిజమే నేను అచ్చేదే గని మా రాజు భార్య మాత్రం రాజు కొక సాత్రం ఏసింది ఏసి ఏం చేసిందిగ అంటే ఏం చెప్పకపోతే బతకద్దు అన్నది. ఇగ గిట్ల సంగతి అందుకొరకే నేను రాలే మా రాజు. సత్తడో బతుకుతడో అన్ని నన్ను ఏయలేదు. నేను రాలేదు అన్నది. భార్యభర్తలు రాజుకు సాత్రం ఏసింది. రాజుకు దోయలేదు. ఇది చేసిన పని. గిట్ల జరిగిందని దీపాలకు చెప్తుంది. రాజు చెల్లె అన్న నెరివడి పాయే అన్ని అయింత పొద్దుగూకే వరకు అక్కన్నే మా అన్న సత్తడో? బతుకతడో? చూడాలి అని చెప్పి దీపాల గుళ్లె పన్నదట. ఇటు అదృశ్యమంటే చిర్రు చీకటి మర్రు మబ్బు పోదామంటే పోరాదు. అయింత దీపం మ్యాటరు అర్థం చెప్పేవరకు ఆమె యిన్నది. ఏది రాజు చెల్లె అయితే ఇది ఎట్ల మ్యాటరు. అంటే రాజు భార్య ఇంటెనుకోనికి అలవాటు ఉండే. అలవాటుంటే ఆడు ఒకనాడు ఏం చేసిండు గదంటే అనుకోకుండా దాని ఇంట్లనే చనిపోయిండు. రాజు లేని టైంల చనిపోతే అదేం చేసింది గదంటే ఆ పీనుగుని తీస్కపోయి మోదుగు చెట్టు మీద కట్టింది. కొన్ని రోజులకు పీనుగు నీరడుతది గదా. ఆ కట్లన్ని చీకిపోయిన్ని. ఆ పీనుగు నీరుకు గడ్డి మొలసిందట. ఆ గడ్డికి కుందేలు అలవాటైందట. కుందేలు అలవాటయినోల్లె ఆ పీనుగుని సూత్తన్న అటే పెయింది. అదే టైంల సుడిగాలి అచ్చింది. ఆ సుడిగాలికి పీనుగు కట్టు తెగి కుందేలు మీద పడ్డది. కుందేలు సచ్చిందట. సచ్చినొల్లె ఆ కుందేల్ని తెచ్చి కూర చేసుకుంది. రాజుకు పెట్టక అది తిన్నది. వానివి పక్క బొక్కలుంటయ్ అవి తెచ్చి అవుసొలింటికి వొయి పేరు చేయించుకొని చాతీ మీద వేసుకుందట. రాజు దగ్గర కూసుండి ఈ సాత్రం బాగా ఏసింది.

కథలన్ని వేతలై......! ఈ దీపాలు చెప్పింది విని రాజు చెల్లె యిన్నది. అన్న దగ్గరికి ఉరికచ్చింది. పిలిత్తే లేత్తలేడు అన్న మీద పడి ఏడిసింది. అదినె ఏసిన సాత్రం నేను చెప్త నీకు ఏం తొందరలేదు. చెప్పి మనసు తృప్తి చేసి, అన్నకి పెద్ద మాదిగను పిలు. నీ భార్య సంగతి! సాత్రం నేను చెప్త ప్రజలు ఇంటరు. అయింత చాటింపు వేయంగనే కచ్చీరు కాడికి అందరు అచ్చిర్రు. వదినే నీ సాత్రం ఏయి అని అడిగింది. కథలన్ని వేతలై......! వదినే అన్నవోల్లె విని కండ్ల కవురం మదనా మత్తి కానగ తిరిగినోల్లె కొన్నండ్ల అన్నవోలె మా అన్న ఉండంగ నువ్వ్ ఇంకోనికి అక్రమ సంబంధం పెట్టుకున్నవ్. ఆడు ఒకనాడు నీ ఇంట్ల సచ్చి పోతే తీస్కపోయి తూర్పు బాదుకు మోదుగు చెట్టుకు కట్టినవ్. ఆ పినుగును ఆ దాని నీరడిచి కింద గడ్డి మొలిచింది. ఆ గడ్డికి కుందేలు అలవాటయ్యింది. ఆ సుడిగాలిచ్చి పీనుగు కట్టు తెగి కుందేలు మీద పడ్డయి. నువ్వ్ ఆ టైంల అక్కడికి పోయి ఆ పీనుగు బొక్కలు తెచ్చుకొని ఆవుసలోని దగ్గర పేరు

చేపిచ్చుకున్నవ్. కుందేలిని తెచ్చి కూర చేసినవ్. మా అన్నకు పెట్టి నువ్వు తిన్నవ్ దీనర్థం మా అన్నకు ఏసినవ్. ఆయనకు తెలవక ఆయన గతి గిట్ల అయిందని చెప్పింది. చెప్పినోల్లె రాజు బొడ్డి గిట్ల చేత్తవ నన్ను. కోపానికచ్చి మంగలోన్ని పిలిపించి 3 రేవులు తల గొరిగిచ్చి బోడినామాలు పెట్టి తీస్కపోయి అయింత 3 బజారుల కాడ పాతర పెట్టి గొర్లను, బర్లను దాటిచ్చిండు.

## చెల్లెలు దిద్దిన కాపురం – కథావిశ్లేషణ

చెడు చేష్టలతో ఒక భర్తని మోసం చేయాలనుకున్న ఒక భార్య తప్పుని ఆ భర్త చెల్లెలు నిరూపించడమే ఈ కథ అంతర్యం. తనని నమ్ముకున్న భర్తని మోసం చేయడమే కాకుండా ఆ మోసాన్ని కప్పి పుచ్చి భర్తను చంపాలనుకున్న ఒక వివాహిత స్త్రీ గుట్టురట్టు చేసే కథ. చెడు నడతలకు అలవాటైన స్త్రీ రహస్యాలను మరో స్త్రీ బయటపెట్టి తన అన్న జీవితాన్ని, ప్రాణాన్ని రక్షిస్తుంది.. ఒక స్త్రీ పెళ్లి చేసుకున్న భర్తని కాదని మరొకరితో సంబంధం పెట్టుకుంటుంది. ఎప్పటికైనా తాను గతంలో చేసిన తప్పులు తెలిసిపోతాయేమోనని భర్తని చంపడానికి ఒక పొడుపు కథలాంటి కథను అల్లి దాన్ని విప్పమని భర్తకి చెపుతుంది. ఒకవేళ ఆ సమస్యను పూరించకుంటే చనిపోవాలని ఆదేశిస్తుంది. ఆ సవాలుకి ఒప్పుకున్న రాజుకి ఒక పొడుపు కథ వేసింది.

కథలన్ని వెతలయే కాపురం రెండయే
నాడు సచ్చిన కుందేలు నేడు కూరయే
సచ్చిన మొగుడు సండ్ల మీద
మనున్న మొగుడు మంచం మీద

పై పొడుపు కథ అర్థం అడుగుతుంది. ఈ పొడుపు కథ విని రాజుకి సమాధానం తెలియక విచారణలో పడతాడు. భార్యకి చేసిన ప్రమాణం ప్రకారం ఈ పొడుపు కథకి సమాధానం చెప్పకపోతే చావే శరణ్యమని దిగులుపడతాడు. ఇదిలా ఉండగా పూర్వం గ్రామాల్లో ప్రతిరోజు దేవాలయాల చుట్టూ దీపారాధన చేయడం ఆనవాయితీ. ఆ రోజు కూడా పొడుపుకథ వేసిన ఆ స్త్రీ ఇంటి నుండి వచ్చే దీపం ఆలస్యంగా వస్తుంది. ఈ కథల్లో దీపాలు ఒకదానికోకటి మాట్లాడుకోవడం అనేది జరుగుతుంది. దానర్థం దీపాలు మాట్లాడుకోవడం కన్న కూడా ఆ దీపాలు అక్కడికి తీసుకువచ్చిన అమ్మలక్కలు అంటే ఇరుగుపొరుగు స్త్రీలు వీళ్ల గురించి ఆరా తీస్తూ ముచ్చట్లు పెట్టి ఉంటారు. ఈ రాజు రాణిల కుటుంబం వ్యక్తిగత విషయాల గూర్చి నలుగురికి తెలిసి ఆ గుడికి చేరింది. ఆ రాజు గారికున్న చెల్లెలు. అదే ఊరు

వ్యక్తికిచ్చి వివాహం జరిపించి ఉండవచ్చు. ఆ నోటా ఈ నోటా రాజు అయినటువంటి తన అన్న గురించి తెలుసుకుంది. అంటే దీపాలు లేదా దీపాలు పెట్టిన చుట్టు ప్రక్కల స్త్రీలు మాటలు విని అసలు నిజాన్ని తెలుసుకుని ఉంటుంది. ఆ చెల్లెలి తన వదిన చేసిన పనుల గురించి విని తీవ్ర ఆవేశాన్ని గురవుతుంది. రక్త సంబంధం రగిలిపోయింది. తన అన్నకి జరుగుతున్న అన్యాయాన్ని, మోసాన్ని ఎదురించి వదినకు తగిన శిక్ష పడేలా చేయాలని తపించింది. వదిన రహస్యాలను తెలిసిన మరుక్షణం అన్నను చేరింది. ఆ ఊరి గ్రామ పంచాయితీకి పిలిపించి వదిన వేసిన పొడుపు కథని విప్పి ఆపదలో ఉన్న అన్నని ఆదుకుంది. ఆ పొడుపు కథని వివరంగా చూసినట్లయితే

'కథలన్ని వెతలయే కాపురం రెండయే' అంటే ఒక స్త్రీ తన కాపురాన్ని రెండు కాపురాలుగా చేసుకుని తన జీవితాన్నే పాడుచేసుకుంటుంది. సాధారణంగా నాటి సామాజిక వ్యవస్థ బహుభార్యత్వాన్ని నిరాధికారికంగా స్థిరంగా నిలుపుకున్నా బహు భర్తృత్వాన్ని మాత్రం ఒప్పుకోలేదు. అందుకే భర్త ఉండంగా ఒక స్త్రీ మరొకరితో సంబంధం పెట్టుకోవడం నేరంగా భావించేవారు. నాటికి నేటికి పెద్ద తప్పుగా భావిస్తారు.

'నాడు సచ్చిన కుందేలు నేడు కూరయే' ఈ కథలో రాజు గారి భార్య అక్రమ సంబంధం పెట్టుకున్న వ్యక్తి చనిపోతాడు. ఆ చనిపోయిన వ్యక్తి మృతదేహం దగ్గరకచ్చి చచ్చిన కుందేలు మాంసాన్ని తాను కూర చేసుకుని తింటుంది.

'సచ్చిన మొగుడు సండ్ల మీద' అక్రమ సంబంధం పెట్టుకున్న వ్యక్తి ఎముకలతో రాణి హారాన్ని చేయించుకుంటుంది. స్త్రీలు బంగారం, వెండి విలువైన ఆభరణాలు ధరించేవారు. కాని అవి లభ్యం కాని రోజుల్లో, వాటిని కొనేస్థాయిలేని వారు ఎముకలతో చేసిన ఆభరణాలను ధరించేవారని తెలుస్తుంది.

'మనున్న మొగుడు మంచం మీద' పెళ్లి చేసుకున్న భర్త మంచం మీద కూర్చొని విచారిస్తున్నాడని అర్థం. ఈ పొడుపు కథ వేస్తున్న రాణి మనువాడిన ఆ రాజు ఈ పొడుపు కథ విప్పలేక భార్య మనసులో ఎక్కడ లోకువైపుతోనని విచారణ పడుతూ ఉంటాడని ఆ స్త్రీ ముందే గ్రహించి వేస్తుంది. ఆమె పథకం ప్రకారం ఆ పొడుపు కథ విప్పలేక మరణమే శరణ్యం అనుకుంటాడని ఆ రోజుతో తన భర్తతో సహవాసం విరగడైతుందని ఊహిస్తుంది. కాని ఆ ఊరిలోనే నివాసము ఉంటున్న

రాజు చెల్లె తన అన్నకు జరుగుతున్న మోసాన్ని బహిర్గతం చేస్తుంది. వదిన గుట్టు రట్టు చేయడమే కాకుండా గ్రామపెద్దల సమక్షంలో వదిన తప్పును నిలదీసి తగిన శిక్ష పడేలా చేస్తుంది.

# 2.5 సంక్లిష్ట కథలు

## 2.5.1 అద్భుత కథలు

### 2.5.1.1 రాణి పగడాల పేరు

సోంసెట్టి పోసాని, నంబాల గ్రామం, ధర్మపురి మండలం

అనగనగా ఒక రాజు. రాజుకు ఏడుగురు కొడుకులు. ఏడుగురు కొడుకుల్లల ఆరుగురిని పెళ్లయిత్తైంది. చిన్నకొడుకు కొరకు ఓ...! ఏటు తిరిగిన చెప్పులు అరుగుతయి. ఏ రాజ్యం పోయిన పిల్లను మెచ్చడు. ఇగ ఒక రాజ్యం వోయి ఆ రాజ్యంలో మంచి పిల్ల ఉన్నది. రాజు బిడ్డ అని చెప్తరు. అన్నంక పోటో పట్టుకొని అత్తరు. పోటో పట్టుకచ్చి యిత్తే ఆ పోటో చూడడు. చిన్న కొడుకు ఆ పోటో జేబుల పెట్టుకొని అయింత అమ్మ, నాన్న నాకు పెళ్లిచేత్తరట? మరి పెండ్లి కొరకు చూడమ్మంటుర్రు. ఇగ మరి చేసుకుంట అనుకుంటున్న ఇగో పోటో చూడమని భోగపు ఆమెకు పోటో యిత్తడు. మంచల పడుకోని ఉంటడు. ఆయన ఆ పోటో చూసి అబ్బ నాకన్న అందంగా ఉంది. ఇగ ఈ రాజు ఈ అమ్మాయిని చేసుకుంటే మా  ఇంటికి రాడు. నా మీద ప్రేమ తగ్గిపోతది. అని అయింత ఆమెకు కంట్లె ఒక మచ్చ పడతది. మచ్చ వోడిసి అయ్యో! రాజా నీ భార్య గీమెను నీ భార్యగా చేసుకుంటవా? మరి అంత కళ్లకంత మచ్చ ఉంది. కండ్ల బాగా మచ్చ ఉంది. ఈ మచ్చ ఉన్న పిల్లను చేసుకుంటే నిను తిట్టర? మీరు రాజులైతిరి. అని బోగపామె అంటది. అయ్యో! మరి మా అమ్మ నాన్న ఏమో మంచిగ ఉంది. పిల్ల సక్కదనంగా ఉంది అంటురు. కొడుక పెళ్లి చేసుకో అంటరు. అని అంటే అద్దు రాజా ఇసోంటి అమ్మాయిని పెళ్ళి చేసుకోకు అన్నంక మల్ల అదే పోటో తీసుకొని పోయి జేబులో పెట్టి ఇగ తీస్కపోతడు. అమ్మ నాకు పెండ్లద్దు. ఇగ అన్న రాజులు ఏంజేత్తరు. కత్తి కటారుకు పెండ్లి జేత్తమని అయింత ఆల్ల ఊరికివోయి కత్తి కటారుకు పెండ్లి చేసుకొని అత్తరు. పెండ్లి చేసుకోనచ్చి ఇగ పిల్లను కోడల్ని ఇంటికి తీసుకొని అత్తరు. ఇగ రాజు పగలో, రాత్రో ఎప్పుడో అత్తడు పోతడు. ఒక రోజు అయింత షటర్ అల్లుకుంటా, కాలు జాపుకుంటా కూసుంటది. కూసోనోల్లే ఈ అమ్మాయి ఎవ్వరు. సక్కదనంగా ఉంది. కాలు జరుపుమన్నంక లేసి ఇంట్లకు వోతది. ఇంటికి పోయినంక మల్లొక రోజు

అట్లనే అత్తడు. అచ్చేవరకల్లా మల్ల అట్లనే కూసుంటది. కూసున్నంక ఇగ కతం చేయి పట్టి అడుగుతడు. మీరెవ్వలు, మీదే ఊరు మా యింట్ల ఎందుకు ఉంటుర్రు అని అడుగుతడు. అడిగినంక నేను గిట్ల మా నాన్న కత్తికి, కటారుకి పెండ్లి చేసి తీసుకచ్చింర్రు. నేను నీ భార్యను అని చెప్తది. చెప్పినంక అబ్బ! గింత సక్కదనం ఉంది. నా భార్య మరీ ఆ రోజు పోటో చూత్తనేమో అమ్మాయి గట్ల అనే నన్ను. అని మనసులో అనుకుంటడు. అనుకుని ఇగ అప్పటి నుండి అమ్మాయితోని మంచిగ ఉంటడు. ఉన్నంక బోగపామె రాజత్త లేదని బోగపు దాసిని తోలెత్తది. ఏం జెత్తరు రాజా! అట్ల పిడకలు అమ్ముకుంటవోయి చూత్తది. కుడకలు, పిడకలు అనుకుంట రాజోల్లో ఇంటికి వోయేసరికి మంచిగ రోజు ఈ రాణి తోటి ముచ్చట వెట్టుకుంటా రాజు అటే ఉంటడు. చూసి చెప్తది. అక్కడ ఆల్ల రాణితోనే మంచిగ ఉండు రాజు. ఇగ మనల్ని మరచిపోతుండు. ఇగ మన ఇంటికి రాడు అని అన్నది అన్నంక ఇగ బోగపామె ఏం జెత్తది. అబ్బ నేను బతకనే బతకనియ్యద్దు మనం. ఇగ ఎట్లనన్న జేసి మనం చంపాలి. అని అయింత ఒకాయన దగ్గరికి పోతది. కోయరాజు దగ్గరికి పోతది. కోయరాజు దగ్గరికి పోయి గిట్ల సంగతి నాకు ఆ రాజు గావాలె. ఆల్ల భార్యను యిడిచి నా దగ్గరికి అత్తలేడు. ఎట్లనన్న జేసి ఆమె చనిపోయే తట్టు నాకా మందు ఇయ్యాలె. అడుగుతది. అడిగినంక సరే మంచిది. ఆమె చచ్చిపోయిన గాని యిడిసిపెట్టు. పగడాల పేరుల ఆయుష్షు ఉన్నది. ఆ పగడాల పేరు తెచ్చుకొని మీ ఇంట్ల చిలక కొయ్య కేసురా ఆమె ప్రాణాలు పోతది అని చెప్తడు. చెప్పినంక అయింత ఈ పిడకలు అమ్ముకుంటవోయి అయింత ఆ పగడాల పేరు తెచ్చుకుంటది. తెచ్చుకుని అయింత చిలుక కొయ్య కేత్తది. ఏసినోల్ల ఈ రాజు భార్య చనిపోతది. అప్పటికే రాజు భార్య ప్రెగ్నెంట్. సరే మంచిదని అయింత ఇగ పానం పయే మా కోడలు కొత్త కొత్తగా పెండ్లి చేసుకున్నది. సంవత్సరం గూడ కాకపాయే ఇగ అత్త మామ పాపం బాగా బాధపడతరు. ఈయన ఏంజెత్తరు. గింత సక్కదనం భార్యను నేనసలే కాలెపెట్టుకోను. అని అయింత ఇంట్ల ఊడలమర్రి ఉంటది. ఆ ఊడలమర్రికి తుంగపు ఉయ్యలల పెట్టుకుంటడు భార్యను. పెట్టుకొని అయింత అండ్లనే ఉంచుతడు. రోజు ఆమెను చూసుకుంట అత్తడు. రోజు ఉయ్యాల కాడికి పోవుకుంట అత్తడు. అయితే పేరు పొద్దాంత ఏసుకుంటది యెదల. నైట్ అయిందంటే పేరు తీసుకొని చిలక కొయ్యలకేత్తది. ఉదయం అంత దయ్యమయ్యితుంది. నైటంత మనిషయితుంది. అట్లనే ఉంటది. తుంగపు ఉయ్యాల. అయినోల్లే నైటు ఇగ రోజు మంచిగ కాంగనే రాజు పోతుండు ఆమె తోటి. రోజులు కాంగ ఆమెకు పొద్దులు పడతయ్యి ఆమెకు. ఇగ పొద్దులు వడి కొడుకు పుడుతడు. కొడుకు పుట్టినోల్లే ఎట్ల మా కొడుకు

ఎట్ల యింటికి రావాలె ఏం కథ అని నా భార్య గిట్లయ్యింది ఏందని రాజు బాగా బాధపడతడు. బాధపడి ఆల్ల దాసిల్ల తోని చెప్తడు. అయింత దాసినొల్లువోయి ఈమెను తోలుకచ్చుకుంటడు. తోలుకచ్చుకొని అమ్మా గిట్ల విషయం జరిగిందని చెప్తడు. అయ్యో! గిట్ల చేసింద. మన కోడలుకి మన కెట్ల రావాలని అంటే ఏం లేదు పగడాల పేరు ఆల్ల బుట్ల చిలుక కొయ్యకుంటది. మన దాసిలను తోలాలి. మారు వేశంలో తోలి ఆ పగడాల పేరు మల్ల మన అమ్మాయి మెడ లేత్తె మన కోడల్కి పడతది. అని అయింత ఒకాయన చెప్తడు సామిజీ. చెప్పినంక యిల్లు వోతరు. పోయి పిడకలు అమ్ముకుంట పోతే ఆ చిలుక కొయ్యల దగ్గర ఒక మనిషి కావలి ఉంటుంది ముసలమ్మ. ఎట్ల దొరుకాలి? అని మనకు ఆ పగడాల పేరు అని దొరికితే మనకు మంచిగ ఎట్ల దొరుకుతుందని రోజు పిడకలు ఓ నాడు, సుట్టలు ఓ నాడు, కట్టెలు ఓ నాడు అమ్ముతది. రోజుకో తీరు అమ్ముకుంట పోతు(ర)గని ఆ ముసలమ్మ ఆన్నుంచి జరుగత లేదు. అయితే ఆ ముసలమ్మకు ఏం తింటది యిష్టమైంది. తినేది తెలుసుకో(రి. తెలుసుకోని ఆకిట్లనే ఉండు(రి. ఒకరు లోపలికి పోం(డి తెం(డి అని అయింత దొర చెప్తడు. చెప్పినంక ఆమెకు ఇష్టమైంది. బాగా కల్లట. కల్లు తాగుతదట అన్నంక ఒక బింకి కల్లు పట్టుకోని పోతరు. కల్లమ్మా... కల్లమ్మా.. అన్నవోల్లే ఇగో కల్లు అచ్చింది. నేను కల్లు కొనుకుంట నాకు కల్లంటే బాగా యిష్టం అని అయింత. ఆ ముసలమ్మ గప్పుడు ముసలమ్మ యిటు అచ్చినంక అయింత ఒక మనిషివోయి ఒక బుట్టను పట్టుకొని ఆ బుట్టల పగడాల పేరు తీసుకొని అచ్చి. అయింత ఈ పగడాల పేరును తీసుకచ్చి ఆమెకు ఏత్తరు. ఆమెకేత్తే కతం ఆమె నిద్రలేత్తది. లేసేవరకే ఇట్ల కొడుకు ఉంటే అని మంచిగ చెప్పినంక అబ్బ! అత్తమ్మ నేను గదే నా కంత ఎట్లనో అయితుంది. లేసినంక అనుకుంటున్న సరే నా ఆయుస్సు నాకచ్చింది గద. ఆసలు నా పానం పోవు ఇప్పుడు. నా కొడుకుని, భర్తని, అత్త మామలను, ఆడ బిడ్డలను, ఆరండ్ల తోటి అందరితో మంచిగుంట నేనిగ. ఇగ మంచిగుంటది. ఇగ ఈ రాజు ఆల్ల ఊర్ల పెద్దరాజు ఉంటడు గద. ఆ రాజుతోటి చెప్పినోల్లె ఇగ ఇది చేయవట్టి ఇట్ల ప్రపంచాన్ని గిట్ల నాశనం చేత్తుంది. అయింత ఆమెకు కతం గుండు కొట్టించి క(రె గాడిద మీద ఎక్కిచ్చి ఊరేగిస్తరు.

## రాణి పగడాలపేరు – కథావిశ్లేషణ

ఒక రాజుతో అక్రమసంబంధం పెట్టుకున్న వేశ్య ఆ రాజు భార్యని ఎలాగైనా రాజుకి దూరం చేయాలని ప్రయత్నం చేస్తుంది. రాజుకి భార్య మీద ఉన్న అమితమైన ప్రేమతో బతికించుకోవడానికి దాసిలతో వేశ్య చేసిన మోసాన్ని గుర్తించి తెలివిగా రాణిని బతికించుకుంటాడు. వేశ్యకి తగిన బుద్ధి చెప్పి

శిక్ష పడేలా చేసాడు. ఈ కథలో మంత్రాలు, తంత్రాలు, తాయిత్తులు, పగడాలపేరు చిలుకకొయ్యకు తగలేయ్యడం లాంటి మాటలు వినిపిస్తాయి. జానపదుల మూఢ నమ్మకాల మీద ఆధారపడి ఆ వస్తువులు ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. అద్భుత కథాంశాలు ఉన్న ఈ కథ ప్రధానోద్దేశ్యం లోకంలో చెడు చేసే వారి నుంచి జాగ్రత్తపరచడమే కాకుండా ఎలా తమని తాము రక్షించుకోవాలో సందేశాన్ని కూడా ఇస్తుంది. ఇలాంటి కథలో ఉన్న సంఘటనలు వాస్తవానికి దూరంగా ఉన్న కథను కళాత్మకంగా, వినోద భరితంగా చిత్రించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. కథపై ఆసక్తిని, కథాగమనానికి ఊపును కలిగిస్తాయి. కొన్ని కథలు విభిన్న మలుపులు కూడా తిప్పుతాయి. జానపద కథలపై మరింత ఆసక్తిని కల్గిస్తాయి.

1. పై కథలో కత్తి, కటారుకి పెళ్లి చేయడం జరుగుతుంది. కత్తి, కటారుకు పెళ్లి చేయడం రాజుల కాలంలో ఉండేది. రాజుల బహుభార్యత్వం అనేది ఆనాటి కాలంలో తప్పేమి కాదు. అందుకే రాజు యుద్ధంలో ఉన్న, వివిధ దేశాల సందర్శనంలో ఉన్న గాని రాజు లేని యెడల కత్తి, కటారుకి పెండ్లి చేసేవారు. వివాహానంతరం పెండ్లి కూతురుని అత్తగారింటికి తీసుకుని వెళతారు. పై కథలో కూడా అలాంటి పెళ్లి చేసే రాణిని తీసుకుని వస్తారు. అప్పటిదాకా వేశ్య మోజులో ఉన్న రాజు ఆమె ఛాయాచిత్రాన్ని చూడకుండానే వేశ్య మాటలు విని కాదంటాడు. పెండ్లిలో తాను లేకపోవడం వల్ల తన భార్య సౌందర్యం గురించి తెలియదు. ముందుగా వేశ్యకి చూపిస్తే తన మీద చనువు తగ్గి తనకు ఎక్కడ దూరమయితాడో అని రాజు భార్య సౌందర్యవిహీనంగా ఉన్నట్లు రాజుకి చెబుతుంది. దాంతో రాజు తన భార్య మీద అనాసక్తితో కొద్ది రోజులు ఉండి, తన ఇంట్లోనే ఉన్న అందమైన భార్యను చూస్తాడు. తన భార్య అందాన్ని చూసి సౌందర్య పిపాసుడై భార్యతోనే జీవితం గడుపుతాడు. వారి సాంగత్యం చల్లగా ఉన్నదని తెలుసుకొని వేశ్య వారి మధ్య దూరం పెంచి, రాజు భార్యని చంపించాలని ప్రయత్నం చేస్తుంది. కాని రాజు తన భార్యను తాను కాపాడుకొని వేశ్యకి బుద్ధిచెబుతాడు.

3. రాణి పగడాల పేరును వేశ్య తీసుకున్న తర్వాత రాణి మూర్ఛపోయి మరణించినట్లయింది. ఆ తర్వాత రాజు తన భార్యని మర్రిచెట్టు కింద ఊడలతో చేసిన ఊయ్యలలో పడుకో బెడతాడు. రాజు సౌందర్యవతియైన భార్యను దహనం చేయడానికి ఇష్టపడడు. గర్భవతియైన తన భార్యను మర్రిచెట్టు కింద ఉంచి ప్రసవం జరగడం, ఆత్మగా జీవించడం ఇవన్నీ అవాస్తవాలే. కాని జానపదుల్లో నమ్మకాలు, మూఢవిశ్వాసాలు భాగంగా కల్పించబడ్డాయి. మర్రిచెట్టు కింద రాత్రయ్యిందంటే దయ్యాలు

తిరుగుతాయని, ఆదివారం అటువంటి చెట్లకిందకు పోకూడదని స్థానికంగా పెద్దలు చెప్పడం గమనించాలి. ఆ నమ్మకాలే ఇలాంటి కథలో కల్పించబడ్డాయి.

4. ఈ కథలో రాణి ప్రాణం పగడాలపేరులో ఉండటం, కోయరాజుతో వేశ్య రాణి ప్రాణ రహస్యం తెలుసుకోవడం, తిరిగి ఆ పగడాలపేరుతో రాణి బతకడం ఇవన్నీ అద్భుత కథాంశాలుగా ఉన్నాయి.

5. సమాజంలో విభిన్న మనస్తత్వం కలిగిన వ్యక్తులు ఉంటారు. ఒక్కొక్కరి జీవన విధానం ఒక్కొక్కలాగా ఉంటుంది. బాగా బతుకుతున్న వారి జీవన విధానాన్ని చూసిన వారి బంధువులు వారి సుఖసౌఖ్యాలను చూడలేక వారికి ఎలాగైనా ఎదొక చెడును తలపెట్టాలని అనుకుంటారు. కాబట్టి అలాంటి వ్యక్తులు తలపెట్టే చెడును ముందే గ్రహించాలని హెచ్చరిస్తుంది ఈ కథ. అప్రమత్తతను తెలపడమే కాకుండా మంచి చేసిన వారికి కొంచెం ఆలస్యమైన చివరికి మంచే జరుగుతుందని సందేశాన్ని కూడా తెలుపుతుంది.

## 2.5.1.2 ఇరవై అయిదు రోజుల బాలుడు

ఆసం ముత్తవ్వ, దమ్మన పేట గ్రామం, ధర్మపురి మండలం.

అనగా అనగా ఒక రాజు ఆ రాజు పేరు ధర్మాంగమారాజు. ఆయన భార్య పేరు మాణిక్యాల దేవి. వీరికి సంతానం లేదు. అయితే ఒక రోజు మాణిక్యాల దేవి రాజుతో ఇలా అంటూ.. రాజా! ఈ ధన ధాన్యం మనకెందుకు రాజా మనకు సంతానం లేకపాయె ఈ బతుకు, భాగ్యం ఎందుకు ఒక పూర్వవైభోగం కలిగిన పాడువడ్డ గుడికి ఆమె వెళ్లింది. అక్కడ ఆ గుడిని ముణికొంగుతో శుద్ధి చేసింది. ఆ దేవి నిరసించి ఓ స్థంభం నందు కుప్పకూళిపోయింది. ఆ దేవునికి మాల్యమై ఒక బికారి రూపంలో వచ్చాడు. అప్పుడు ఆ బికారి ఆమెను పిలిచి తల్లి నీవు ఎందుకు ఈ పన్నెండ్ల నాటి గుడిని శుద్ధి చేసావు. నీకు ఏమి బాధ వచ్చింది. నీకు ధనమా? ధాన్యమా? సంతానమా? ఏమి కావాలో కోరుకో అని అడుగుతాడు. అయ్యా! నాకు ధనం, ధాన్యం, మణులు, మాణిక్యాలు వద్దు. మేము రాజులం నాకు సంతానం కావాలని గుడిని ఈ పాటికి తెచ్చాను. అమ్మా! నీకు ఒక్కటే సంతాన భాగ్యం ఉంది. ఆ ఒక్క ఫలం నేను నీకు ఇస్తాను. ఇదిగో అమ్మా ఈ ఫలాన్ని నీ ముణికొంగులో వేస్తాను. అయితే ఈ తల్లి ఆ ఫలాన్ని తీసుకుని కోటకు బయలుదేరింది. ఆ పండు తిన్న తొమ్మిది గడియల్లో బాలుడు పుట్టిండు. మంత్రి నాకు బాలుడు జన్మించాడు. ఆ బాలునికి బారసాల చేయాలి. అందరికీ తెలియజేయండి.

అప్పుడు ఆ బాలునికి బారసాల అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఆ బాలుని పేర బిక్షపతి. అయితే పుట్టిన ఇరవై అయిదు రోజులకు పంచాంగం చూపించుకు రమ్మని మంత్రి వర్యులకు సెలవిచ్చాడు.

సరేనయ్యా! అక్కడి వెళ్లి బ్రాహ్మణయ్య దగ్గరకు వెళ్లి పంచాంగం చూపిస్తాడు. చూపి కోటకు తిరిగి వస్తాడు మంత్రి. ఏం జరిగింది. మంత్రివర్య అంతా కుశలంగానే ఉందా ఏదైనా అటుపోటు జరిగిందా. ఏం లేదు రాజా అంత సవ్యంగానే ఉంది. అంతా సంతోషంగానే ఉంది. లేదు మంత్రివర్య మీరేదో చింతిస్తున్నారు. మీరు నాకు చెప్పడం లేదు. తల్లిగండమా? తండ్రిగండమా? మామల గండమా? ఎవరి గండనా పుట్టాడు ఈ బాలుడు. అయ్యా ఈ బాలుడు ఎవరి గండనా పుట్టలేదు. ఈ బాలునికి చిన్న ఆపద వచ్చిపడింది. ఏంటిది ఏం జరిగింది. చెప్పండి మంత్రి వర్య. ఏమని చెప్పారు బ్రాహ్మణయ్య గారు. అయ్యా! ఈ బాలునికి ఇరవై అయిదు రోజులలోపు పెళ్లి చేయకపోతే మరణిస్తాడని ఉంది. ఎలా చేద్దాం! రాజా మీరే సెలవివ్వండి. నేను పెళ్లి చేస్తాను. మంత్రి ఏ ఖండమైన, ఏ రాష్ట్రమైనా పర్లేదు పిల్లను చూసి రాపో పెళ్లి చేద్దాం, చూసి వస్తాడు. రాజా పిల్ల జాడ తెలిసింది. పేరు పద్మాలదేవి. సంతోషం రాజా! పెళ్లి పెట్టుకుందాం. ఇవ్వాళ ఆదివారం రేపు సోమవారం ఇక పెళ్లి చేయడమే అయితే అప్పుడు ధర్మాంగమారాజు మనసులో ఇలా అనుకుంటాడు. ఇరవై అయిదు రోజుల బాలునికి పెళ్లి చేస్తే ఏం మాట్లాడుతాడు నేను ఏమని చెప్పాలి. నా కోడలితో మామ నా భర్త ఏడి అని అడుగుతది. నేను ఏమి చెప్పాలి. మంత్రి వర్య నకాసి బొమ్మను చేసుకుని ఆ బాలునికి ఆ బాలికతో పెళ్లి చేద్దాం. ముచ్చట పెట్టెటప్పుడు తలను ఊపు గడియకొకసారి చేయి, కాళ్లు కదిలించు. తాళి కట్టెటప్పుడు రెండు చేతులతో వెనుకకి అందించు. పెళ్లి అయిపోతుంది. అప్పుడు పిల్లా పితక పెద్ద చిన్న పెళ్లి కూతురు పెళ్లి కొడుకును తోలుకొని వస్తుండగా పిట్ట బుర్రుమనని కాకి ఈగనీ కారడవిలో నుండి వస్తుండగా చీకటి పడింది. రాజా ఇప్పుడు పొద్దు పోయింది. మనము ఈ పూటకి ఇక్కడే విశ్రాంతి తీసుకుని రేపు తెల్లవారు జామున బయలుదేరుదాం. సరే మంత్రి వర్య ఎక్కడ నిద్రించుదాం. రాజా ఓ పెద్ద ఊడల మర్రి కిందికి వెళ్లి అక్కడ నిద్రించుదాం అందరు పడుకున్నారు. ఇప్పుడు రేపు కోటకి వెళ్లినంక పద్మాలదేవి నన్ను ప్రశ్నించుతది. నేను ఏమని జవాబు ఇయ్యాలి. నా కోడలు మామ నా భర్త ఏడి అని అడుగుతది.. అని రాజు అనుకుంటాడు. తెల్లవారు జామున అందరు కోటకు వెళ్లిపోయారు. మామా నేను వచ్చి ఒకటి రెండు దినములు గడిచినది. అయిన నా భర్తను నాకు చూపించలేదు. ముసుగు వేసి తాళికట్టించారు. ఎక్కడ ఆయన జాడ నాకు తెలియాలి. అని ఆమె అడుగుతది. అమ్మా! పద్మాలదేవి నేను నీతో ఎలా

చెప్పాలి. ఏమని చెప్పాలి. నా కొడుకు ఇరవై అయిదు రోజుల బాలుడు. నా బాలునికి 25 రోజులు నిండిన తర్వాత పెళ్లి చేయాలని జాతకంలో వెళ్ళింది. అందుకే నా బాలున్ని నీకు ఇచ్చి చేసాను. ఇదిగో నా బాలున్ని నీ చేతిలో పెడుతున్న అయితే ఆ బాలున్ని నీవు పారెస్తవో లేక సాది పెద్ద చేసి పెద్దయ్యాక సంసారం చేస్తావో నీ ఇష్టం తల్లి! అప్పుడు ఆ పద్మాలదేవి ఆ బాలున్ని తీసుకుని అక్కడి నుండి వెళ్లిపోయింది. అప్పుడు ఆమె ఒక పాడువద్ద నూతి దగ్గరికి వెళ్లి దాని చూట్టు తిరుగుతూ బాలుని వంక చూస్తుంది. దూరం నుండి దేవగణికలు గమనిస్తారు. అప్పుడు దేవగణికలు ప్రత్యక్షమై మనసుతో..

ఆ యువతి ఆ బాలున్ని ఎత్తుకుని నూతి చుట్టు తిరుగుతుంది. ఏందుకో అంగ పిండమో? దొంగ పిండమో? ఏదైతేనేమి మనం వెళదాం పదండి అక్కడికి వెళ్లి ఓ తల్లి ఏమైంది. ఈ బాలున్ని అందులో వేసి నువ్వ్ పడుదామని చూస్తున్నావా? ఏమి బాధ వచ్చింది. నీకు మాతో చెప్పమ్మా! తల్లులారా! ఈ పత్రాన్ని చూడండి అని ఆ పత్రాన్ని దేవగణికలకు ఇచ్చింది. వాళ్లు ఇరవై అయిదు రోజుల పంచాంగాన్ని చూసి ఆమెతో ఇలా అన్నారు. నీవు ఏమి చింతించకు. ఆ పిల్లానికి మేము ఏళ్లతో పాలు పడేటట్లు చేస్తం. ఆ పాలను తాగుతూ ఆ పిలగాడు ఎలానో బతుకుతాడు. సరే తల్లి కాని బాట వెంట వచ్చేవాళ్లు పోయే వాళ్లు మంచోడో చెడ్డోడో ఈ బాలునికి ఈమె తల్లి అయితదో లేక లంగ పిండమా అనుకుంటారు. నేను వాళ్లతో ఏమని జవాబు చెప్పాలి. ఒక కాకులు దూరని కారడవిల జీవనం గడపాలి. నీకే చనువాలు వచ్చేటట్లు చేస్తా. ఆ బాలునికి పాలిస్తూ పెంచుకో. నువ్వు ఈ పిల్లాన్ని హతమార్చకూడదు. ఈ పిల్లాడు నీతోని ఉన్నడని మాకు తెలియాలంటే పిల్లానికి నీకు ఓ ఉంగరం ఇస్తాను. నీవు పెట్టుకో. ఆ బాలుడిని నువ్వు ఎక్కడైనా మరచినా పడవేసినా మాకు తెలుస్తుంది అని వెళ్లిపోతారు. ఆ బాలున్ని తీసుకుని బిక్షం ఎత్తుకుని తన జీవితాన్ని కొనసాగించింది. ఆ పద్మాలదేవి. ఆ బాలుడు పెరిగి పెద్దయ్యాడు. పెద్దయ్యాక ఆమె వయసు క్షీణించిపోయింది. అప్పుడు ఆ పద్మాలదేవి కంట నీరు పెడుతూ ఉంగరాన్ని చేతిలోకి తీసుకుని దేవగణికలను తలిచింది. అప్పుడు దేవగణికలు ప్రత్యక్షమయి, అమ్మా! ఏమి ఆపద నీకు ఉన్నట్టుండి మమ్మల్ని తలుచుకున్నావు. తల్లులారా నా భర్త వయసుకు వచ్చాడు. నా వయస్సు ఇప్పుడు తన తల్లి వయసు అయింది. నేను ఎలా నా భర్తను నా నోట ఏమని పిలవాలి. అమ్మా! నీవు చింతించకు..! నీకు మళ్లీ పూర్వ వయస్సు వచ్చేటట్లు మేము చేస్తాము అని అక్కడి నుండి అదృశ్యమయిపోతరు.

ఆ పద్మాలదేవికి ఎప్పటిలాగే అందమైన వయసు వచ్చింది. ఆమెను చూసి ఆ భిక్షపతికి పెళ్లి చేసుకోవాలనే కోరిక కలిగింది. దేవి నీవు ఏ రాజ్యానికి చెందిన కుమార్తెవు ఇన్నేల్లుగా ఎక్కడ ఉన్నావు నాకు కనపడలేదు. ఎక్కడి నుండి వచ్చావు నీ మీద నాకు మనసైంది. నేను నిన్ను మనువాడాలని అనుకుంటున్నాను. పెళ్లి చేయమంటాను. రాజా! నీ తల్లి తండ్రి ఇక్కడ లేరు. నీది ఈ ఊరు కాదు. ఈ రాజ్యం కాదు. నేను మీ తల్లిదండ్రుల వద్దకు తీసుకెళతాను. వెళదాం పదండి. అప్పుడు పద్మాలదేవి బిక్షపతి కలిసి ధర్మాంగమారాజు దగ్గరికి వెళతారు. అమ్మా! నీవు ఇక్కడికి ఎలా వచ్చావు. ఈ బాలుడు ఎవరు నా కొడుకు ఏక్కడ ఏం చేసావు. మామా ఈ బాలుడు మీ కుమారుడే ఈ వయసు వచ్చేదాకా కాపాడుకున్నాను. ఈయన మా తండ్రి అయితే ఇన్నేల్లుగా ఎటు వెళ్లాడు. ఎక్కడ ఉన్నాడు. ఇక్కడ మా అమ్మా లేదు. ఇప్పుడే పరిచయమైన నీవు ఇక్కడికి తీసుకువచ్చి ఈయన మా తండ్రి ఈమె మా తల్లి అని చెపుతున్నావు. అప్పుడు ఆమె మళ్ళీ ఉంగరాన్ని చేతిలోకి తీసుకుని ఆ దేవగణికలను తలిచింది. ఆ దేవగణికలు ప్రత్యక్షమై బాల ఈమె నీ భార్య. ఈ రాజు నీ తండ్రి ధర్మాంగమారాజు ఇది సత్యం. అసత్యం కాదు. ఈ పత్రాన్ని చూడు నీకే అంతా అర్థమయితది. అప్పుడు బిక్షపతి ఆ పత్రాన్ని చూసి కంట నీరు కార్చుకుని బోరున విలపిస్తూ తండ్రిని తన గుండెలకు హత్తుకున్నాడు. అప్పుడు తన భార్యతో అయితే నీవు నన్ను ఇరవై అయిదు రోజుల బాలునిగా ఉన్నప్పటి నుండి నన్ను ఈ 20 ఏళ్లు వచ్చేంతవరకు అప్పుడు తల్లిలాగా ఇప్పుడు తాళి కట్టిన భార్యలా నన్ను చూసుకున్నావు. ఇంత బాధను నీలోనే నీవు దాచుకుని ఎంతగా కుమిలిపోయావో..! ఎంతగా కుశించిపోయావో? అని అంటాడు. అప్పుడు పద్మాలదేవితో మళ్లీ బిక్షపతిని ఇచ్చి మనువు చేస్తారు. వారి ఇద్దరి జీవితం సుఖ:మయం అవుతుంది. వారిద్దరిని చూసి తండ్రి ధర్మాంగమారాజు తల్లి మాణిక్యాలదేవి ఎంతో సంతోషించారు. అలా ఆ ఇరవై అయిదు రోజుల బాలుడి కథ సుఖమయం అవుతుంది.

## ఇరవై అయిదు రోజుల బాలుడు – కథావిశ్లేషణ

ఇరవై అయిదు రోజుల బాలుడు కథలో ఒక స్త్రీ వివాహం తరువాత భర్తకు తల్లిగా మారి, పెంచి పెద్ద చేసి అతడినే వివాహం చేసుకుంటుంది. మన నిత్యం కుటుంబాల్లో చూసే విధంగానే ఒక స్త్రీ భార్యగా, మాతృమూర్తిగా తన సంపూర్ణ జీవితాన్ని ఒక కుటుంబానికి ధారపోయడంలో సఫలీకృతమవుతుంది. సంతానంలేని దంపతులు ధర్మాంగమహారాజు, మాణిక్యాలదేవికి లేక లేక కలిగిన సంతానం భిక్షపతి. ఆ బాలునికి మరణ దోషం ఉంటుంది. ఆ దోషనివారణకై ఇరవై అయిదు

రోజుల బాలునికి పెళ్లి చేయాల్సివస్తుంది. నకాసి బొమ్మపై ముసుగు వేసి పెళ్లి కూతురు పద్మాలదేవితో ఎలాగో అలా పెళ్లి చేస్తారు. పద్మాలదేవి పెళ్లయిన తరువాత భిక్షపతి ఇరవై అయిదు రోజుల బాలుడని చెప్పి ఒక బావి దగ్గరికి పోయి చుట్టు తిరుగుతూ ఏడుస్తుంది. అదంతా గమనిస్తున్న దేవగణికలు ప్రత్యక్షమై ఆ బాలున్ని పెంచుకునేందుకు ఆమెకు వరాలిస్తారు. ఆ వరాలతో తాను ఆ బాలుని పెంచి పెద్ద చేస్తుంది. పెరిగిన బాలుడు యుక్తవయసు రాగానే దేవగణికల వరంతో ఆమె యుక్తవయస్సులో యవ్వనంగా కనిపిస్తుంది.

బిక్షపతి ఆమెను చూసి మోహించి వివాహం చేసుకుంటాడు. తల్లిదండ్రులెవరో తెలియని బిక్షపతికి పద్మాలదేవి అతని తల్లిదండ్రులను చూపించి పరిచయం చేస్తుంది. ఆ సందర్భంలో పద్మాలదేవిని బిక్షపతి తల్లిదండ్రులు తప్పుపడతారు. ఆ దంపతులు నా కుమారుడిని ఎక్కడ వదిలేసావని నిలదీస్తారు. అప్పుడు ఉంగరం సహాయంతో పద్మాలదేవి దేవగణికలను పిలుస్తుంది. దేవగణికలు వచ్చి పద్మాలదేవి బిక్షపతిని ఎలా పెంచి పెద్దచేసి మళ్లీ వివాహం చేసుకుందో వివరిస్తారు. ఆ ధర్మాంగరాజు, మాణిక్యాలదేవి పద్మాలదేవికున్న ఓర్పు, సహనానికి మెచ్చుకుని దీవెనలు అందిస్తారు.

1. ఈ కథ అంత స్త్రీ శక్తిని అలుముకుంది. మొదటగా సంతానం కోసం తపించే మాణిక్యాలదేవి, వివాహమైన భర్తకే తల్లిగా మారిన, భార్యగా ఎంతో సేవలందించిన పద్మాలదేవి మనకు ఈ కథలో కనిపిస్తారు.
2. ప్రతి సమాజంలో, ప్రతి కుటుంబాలలో స్త్రీలు తమ జీవితాలను త్యాగం చేసి ముందుకు తీసుకెళ్తా రనడంలో సందేహం లేదు. ముఖ్యంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా నడుచుకునే స్త్రీ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని ఈ కథ మనకు అందించింది. అందుకు తార్కాణమే మన ఈ కథలో పద్మాలదేవి పాత్ర. వివాహం తరువాత ఇరవై అయిదు రోజుల బాలుడని తెలిసి అధైర్యపడదు. అతడితో సంసార సౌఖ్యాలు లేవని తెలిసి కూడా అతడికి యుక్తవయసు వచ్చే దాకా సాకిందే తప్ప వదిలి వెళ్లలేదు.
3. నేటికి సమాజంలో భర్త చనిపోయిన తరువాత విధవలుగా ఉన్న స్త్రీలు మనకెంతో మంది కనిపిస్తారు. జానపద కుటుంబంలో అలాంటి వారెవరిని చూసి లేదా స్వయంగా అనుభవించిన వారో రూపొందించిన కథ అయి ఉంటుంది.

4. బిక్షపతిని పెంచి పెద్దచేసి తల్లిదండ్రుల వద్దకు తీసుకువస్తే ఆ దంపతులిద్దరు పద్మాలదేవిని అనుమానించి అపవాదం మోపుతారు. ఎన్ని ఆరోపణలు చేసిన కూడా తాను దైర్యంగా పాతివ్రత్యతను చాటుకుంటుంది. అంతేగాని ఇరవై అయిదు రోజుల బాలునిచ్చి వివాహం చేశారని అత్తమామలను నిలదీయదు. అలా ఓర్పు, సహనం, అణుకువతో తన భర్తను సాధించుకుని పద్మాలదేవి స్త్రీలకు స్ఫూర్తిదాయకమైన పాత్రగా ఈ కథలో చిత్రించబడుతుంది.
5. ఈ కథలో మరో అంశం జానపదులు మూఢ నమ్మకాలు, విశ్వాసాలను అమితంగా ఆచరిస్తారు. బాలుడు పుట్టిన తరువాత అతడి జాతకాన్ని చూపించి జాతక దోషాలను గుర్తించటం. ఆ జాతక దోష నివారణలకు చేపట్టవలసిన కార్యక్రమాలు ఇతరులకు ఇబ్బంది కలిగిస్తాయని కూడా చూడరు. ప్రస్తుతం సమాజంలో జాతక దోష నివారణలకు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రాచీన కాలం నాటి నమ్మకాలు నేటికి నాగరిక ప్రజల్లోనూ కనిపిస్తాయి. చిన్న పిల్లలకు జాతకం బాగలేదని గుడ్డు తింపివేయడం, నల్ల దారం ఎడమ కాలుకి కట్టడం, ఆదివారం రోజున పిల్లలను బయటకు పంపకపోవడం లాంటి నమ్మకాలు నేటికి విద్యావంతులు సైతం ఆచరిస్తూ ఉంటారు.

## 2.5.1.3 అక్కెమ్మ కథ

తూటికూర్ల పార్వన్న, వర్షకొండ, ఇబ్రహింపట్నం.

పెదరాసి పెద్దమ్మకు ఏడుగురు కొడుకులు. ఆ కొడుకులందరికి పెళ్లిల్లు చేస్తుంది. పెద్దమ్మకు ఆస్తులు, భూములు ఉన్నాయి. ఆ కుమారులు వ్యవసాయం చేయడానికి వ్యవసాయ భూమిలో దుక్కి దున్నడానికి వెళ్లారు. ఏడుగురు భార్యలు సద్దులు తీసుకొని వ్యవసాయ భూమికాడికి వెళ్లారు. భార్యల దగ్గర నుంచి సద్దులు తీసుకున్నారు. అందరి కంటే చిన్న కుమారుడు. కడగొట్ట రామ్మన్న సద్ది తీసుకోలేదు. తన భార్య అక్కెమ్మ అక్కడనే నిలుస్తున్నది. కింద కాళ్లు కాలుతున్నయి. మామిడాకు అచ్చింది. అయినగని అక్కెమ్మ ఓర్చుకొని అక్కడనే నిలబడింది. అయితే రామన్న తన భార్య అక్కెమ్మతో పర్గాయ బోడల్లో భూమి పట్నం పొందిన నాటికి. నల్ల చెరువుల నీరు తియ్యవడి నాటికి. కట్ట చిత్తపండు పుల్లవడ్డ నాటికి. కుక్కలు గుట్టకు కొట్టెనాటికి. ఎలుకలు ఎవుసం పెట్టెనాటికి. బిడ్డ మీద రత్నాలను పండించి నాటికి పెండ్లాం అంటా? మగడంటా? అని నువస్తే నేను ఏల్తనని నీ సద్ది అల్లా నువ్వు అల్లా అని కడగొట్ట రామన్న తన భార్య అక్కెమ్మతో చెప్పిండు. అప్పుడు అక్కెమ్మ ఆడికెల్లి ఇంటికచ్చింది. అక్కెమ్మ అత్తమ్మ గుల్లదించుదువురా అని అన్నది. కాలి గుల్లది గాదె అని అత్తమ్మ అన్నది. అంటే నీ

చిన్న కుమారుడు కడగొట్ట రామన్న సద్ది అల్లా నువ్వు అల్లా అంటడు. అని అక్కెమ్మ అన్నది సద్ది గుల్ల దించింది. మా తల్లిదండ్రుల దగ్గరికి వెళతాను అని వెళ్లిపోయింది అక్కెమ్మ. పెద్ద పెద్ద అడవుల నుంచి బాధతో వెళ్లిపోతుంది. పోంగ పోంగ పొద్దు పోయింది. రాత్రయింది.

అడవిల ఒక వృక్షం పైకి ఎక్కింది. చెట్టు పక్కన దీపాల గుడ్డి ఉన్నది. ఆ చెట్టు పక్కన అయితే గుడి ఉంది. కనుక ఆ రాజ్యంలో ప్రజలు పండుగలు చేసుకున్నప్పుడు వారి కష్టాలు వచ్చినప్పుడు ఇంటి దగ్గర ముట్టించె ఆ దీపాలు ఆ గుడి దగ్గరికి చేరుకుంటయి. అందులో కొన్ని దీపాలన్ని వచ్చాయి. ఒక రాజు ఇంటికెల్లి దీపం రాలేదు. ఆ రాజు వీపుకు రాసపుండు పుట్టింది. చాలా బాధపడుతున్నడు. చాలా కష్టాలతో ఉన్నడు. అందుకోసమే ఆ దీపం రాలేదు. ఆ దీపమే తరువాత ఆలస్యంగా వచ్చింది. ఆ గుడి దగ్గరకు చేరిన దీపాలన్ని చివరిగా వచ్చిన దీపాన్ని ఎందుకు ఆలస్యం అయింది. మీ ఇంట్లో ఏమి కష్టం అచ్చింది అని ఆ దీపాలన్ని అడిగినయి. అప్పుడు చివరగా వచ్చిన దీపం ఆ రాజు వీపుకు రాసపుండు అయ్యింది. చాలా కష్టాలతో బాధపడుతున్నడు. అందుకోసమే ఆలస్యం అయ్యింది. ఒక దీపం ఏమన్నదంటే ఆ రాజు పుండుకు మన గుడి వెనుకాలనే ఒక మందుల చెట్టు ఉన్నది. ఆ మందులు ఆకులను తీసుకొని వెళ్లి పెడితే ఆ రాజుకు రాసపుండు తగ్గుతుంది అని అన్నది దీపం. ఆ మాటను అక్కెమ్మ విన్నది. తెల్లవారింది. అక్కెమ్మ వృక్షంపై నుంచి దిగింది. గుడి వెనుకాల ఉన్న చెట్టు దగ్గరకు వెళ్లి ఆ చెట్టు ఆకులు తెంపుకున్నది. ఊరిలోకి వెళ్లి రాజు జాడ తెలుసుకుంటనని అక్కెమ్మ రాజు ఇంటికి వెళ్లింది. అంతకుముందు పెద్ద పెద్ద వైద్యులు చేసిన రాసపుండు తక్కువ కాలేదు. ఈ అక్కెమ్మ మగాడి వేషం వేసుకొని ఆ రాజు దగ్గరకు వెళ్లింది. ఆ మందును దంచి రాజుకు పెట్టింది. మంటలుగా మండిన పుండు మందు పెట్టగానే చల్లగా మారింది. వారం రోజుల నుంచి నిద్ర లేని రాజు ఆ మందుతో మంచిగా నిద్రపోయిండు. అక్కడ ఉన్న ప్రజలు అక్కెమ్మను రాజ భవనంలో ఉంచుకున్నరు. రాజు మేల్కొని ఆ వైద్యుడు ఎక్కడ ఉన్నడు. అని ఇంటి వారిని అడిగాడు. మన భవనంలోనే ఉన్నడు. అని రాజుకు సమాధానం చెప్పారు. ఆ రాజు అక్కెమ్మను పిల్చుకొని నా పుండు తక్కువ చేయి అది తగ్గినంక నీవు ఏమి కోరినగాని ఇస్తా అని రాజు అక్కెమ్మకు అభయం ఇచ్చాడు. రెండు మూడు రోజుల్లో ఆ పుండు తగ్గింది. రాజు అక్కెమ్మను పిలిచి నా పుండు తక్కువ చేసినావు నీవు ఏమి కోరుకుంటావు? అడుగు అని రాజు అక్కెమ్మతో అన్నడు. అప్పుడు అక్కెమ్మ నాకు పల్లిరిగాయలు బొడ మీద పట్నం కావాలి నల్ల చెరువు కట్టించాలి. ఆ కట్టకు చింత చెట్లు పెట్టాలి. కుక్కలు గుట్టకు కొట్టాలి. ఎలుకలు

ఏవుసం పెట్టాలి. బిడ్డ మీద రత్నాలు పండాలి. అక్కెమ్మ ఆ రాజును కోరింది. అప్పుడు రాజు అక్కెమ్మ కోరికలు తీర్చుతాడు. కడ గొట్ట రామన్న ఇంటికాడ వాళ్లకు కష్టాలు వచ్చాయి. ఉన్న ఆస్తులు వ్యవసాయ భూములను అమ్ముకున్నరు. చివరికి ఇల్లును కూడా అమ్ముకున్నారు. కడగొట్ట రామన్న తల్లిదండ్రులు, అన్నలు, వదినలందరు రోడ్డున బడ్డారు.

ఎక్కడైన పని దొరికితే చేసుకొని బతుకుతామని పనికోసం వచ్చారు. రాజు కట్టించే నల్ల చెరువు కట్ట పనికి వచ్చారు. అక్కెమ్మ పని చేయిస్తూ అక్కడ కూర్చున్నది. అప్పుడు రామన్న కుటుంబం పోయి పని చేస్తాము అని అక్కెమ్మను అడిగారు. అప్పుడు అక్కెమ్మ వారిని గుర్తుపట్టింది. అయితే రామన్న తల్లిదండ్రులను వంట చేయడానికి ఉండమన్నది. మిగత అన్నయలను, వదినలను పని చేయమన్నది. అక్కెమ్మ ఇక రామన్నను అక్కెమ్మ తన దగ్గర జీతం ఉంచుకున్నది. ఆ రామన్నకు అక్కెమ్మ ఎక్కె గుర్రంకు మేత పెట్టుడు. నీళ్లు పెట్టు ఆ గుర్రాన్ని సంరక్షించమని అక్కెమ్మ రామన్నకు గుర్రం బాధ్యత అప్పగించింది. నల్ల చెరువు కట్ట పని పూర్తి అయ్యింది. ఆ చెరువు కట్టకు చింతచెట్లు పెద్దగా పెరిగాయి. చింతకాయలు కాసినయి. అప్పుడు రామ్మన్నను అక్కెమ్మ ఏమోయి పిల్లడా? అని పిలుస్తుంది. గుర్రంను బయటకు తీసి జీన్ కట్టు అని చెప్పింది. రామన్న గుర్రానికి జీన కట్టినాడు. అప్పుడు అక్కెమ్మ వచ్చి గుర్రం ఎక్కింది. పిల్లాడ గుర్రం ముందు పరుగెత్తు అని రామన్నకు చెప్పింది. అక్కెమ్మ అప్పుడు రానున్న గుర్రం ముందు పరుగెత్తుతున్నడు. గుర్రం రామన్న వెంబడే పరిగెత్తుతున్నది. రామన్న మడిమలను అక్కెమ్మ గుర్రంతోని తొక్కిస్తుంది. రామన్న కాళ్లకు రక్తాలు కారుతున్నాయి. ఏడుస్తున్నాడు. పల్లిర్ గాయ పట్నం అంత తిప్పుతుంది. రామన్న ఆ పట్నం అంత తింపి నల్ల చెరువు కట్ట దగ్గరకు వచ్చి నిలబడింది. రామన్నను ఆ చెరువుల నీళ్లను తాగుమని చెప్పింది. అక్కెమ్మ అప్పుడు రామన్న ఆ చెరువులోకి దిగి ఆ నీటిని తాగాడు. రామన్నను ఆ నీరు తియ్యగా ఉన్నాయా లేదా అని అడిగింది. అక్కెమ్మ అప్పుడు రామన్న నీరు తియ్యాగ ఉన్నయని సమాధానం చెప్పాడు. ఆ కట్ట చింతపండు తెంపుకొని తినమన్నది. అక్కెమ్మ ఆ చింతపండు పుల్లగ ఉన్నదని రామన్నను అడిగింది. రామన్న పుల్లగ ఉన్నది అని చెప్పాడు. అక్కడి కెల్లి ఇంటికి వచ్చారు. గుర్రం పై నుంచి జిన్ తీసి దాచిపెట్టి కూర్చున్నారు. ఆ రోజు అయిపోయింది. తెల్లవారి రామన్న కుటుంబ సభ్యులను అక్కెమ్మ పిలుపిచ్చుకుంది. మీది ఏ రాజ్యం అడిగింది. అక్కెమ్మకు ఆ కుటుంబ సభ్యులు సమాధానం చెప్పారు. రామన్న తల్లిదండ్రులను అక్కెమ్మ రామన్నకు పెళ్లి అయ్యింది అని అడిగింది. మీరు అబద్ధం ఆడకండి. నిజం చెప్పండి అని రామన్న

తల్లిదండ్రులను అడిగింది. అప్పుడు వారు రామన్నకు పెళ్లి అయ్యింది అని సమాధానం చెప్పారు. మరి ఇతని భార్య ఏమైంది అని అడిగింది. అక్కెమ్మ వారు భయపడి సమాధానం చెప్పడం లేదు. చివరకు భార్య లేదు. ఎక్కడికి వెళ్లిందో తెలియదు. అని సమాధానం చెప్పారు. మరి ఎట్ల వెళ్లిపోయింది. మీరు ఏమన్న అన్నారా లేదా అని వారిని అడిగింది. చివరకు అక్కెమ్మనే రామన్నకు రామన్న తల్లిదండ్రులకు గతం గుర్తు చేసింది. ఆ రాజ్యాన్ని పరిపాలించింది.

## అక్కెమ్మ కథ – కథా విశ్లేషణ

అక్కెమ్మ, కడగొట్ట రామన్న ఇద్దరు భార్యభర్తల పంతానికి సంబంధించిన కథ. కుటుంబంలో భార్యభర్తలకు గొడవలు సహజం. సర్దుకోవడం కూడా సహజమే. కాని ఇక్కడ అక్కెమ్మ మొగుడు చెప్పిన బాధ్యతను నిర్వర్తించి మొగుడుని తన కాళ్లకిందికి తెచ్చుకుంటుంది. తన భర్త తనను స్వీకరించలేదని ఏడ్చుకుంటు కూర్చోకుండా భర్త చెప్పిన లక్ష్యాన్ని నెరవేర్చే సాధనలో ముందడుగు వేస్తుంది. ఆ ప్రయత్నంలో ఒక గుడికి చేరుతుంది. పండగ సందర్భంలో ప్రజలు దీపాలు ముట్టించి గుడి దగ్గర పెట్టడం ఆనవాయితీగా వస్తున్న సంస్కృతి. అలా గుడికచ్చిన దీపాలు ఆ ఊరిలో రాజును కొద్ది రోజుల నుంచి వేధిస్తున్న రాక్షసపుండు రోగాన్ని తగ్గించే మార్గం గురించి రహస్యంగా చెప్పుకుంటున్నాయి. ఆ రహస్యాన్ని విన్న అక్కెమ్మ రాజుకు పుట్టిన రాక్షస పుండుని నయం చేసి రాజు ముందే ప్రకటించిన నజరానా పొందుతుంది. భర్త తనను స్వీకరించడానికి ఏమయితే కోరుకున్నాడో వాటినే రాజుని నజరానా ఇవ్వమని కోరుతుంది. అప్పటికే భార్యని దూషించిన కడగొట్టె రామన్న దురదృష్టవశాత్తు ఇంకా పేదరికంలో కూరుకుపోతాడు. కుటుంబంతో సహా ఉపాధి కోసం ఊర్లు తిరుగుతాడు. ఇక అక్కెమ్మ రాజు దగ్గరి నుంచి పొందిన భూభాగాలు చెరువులను పాలించుకుంటూ ఉంటుంది. పని కోసం తిరిగి తిరిగి చివరకు అక్కెమ్మని చేరి పని ఇప్పించమ్మని బతిమిలాడుతారు. భర్తను మాత్రం తన దగ్గర బానిసలాగా పెట్టుకొని మిగతా వారందరిని వేరే వేరే పనుల్లో చేర్చుకుంటుంది. భార్య నుంచి ఏమైయితే ఆశించాడో వాటిని సాధించి తన భర్తకి చూపి గతాన్ని గుర్తు చేస్తుంది.

1. ఈ కథ సాదాసీదా కథల అనిపించిన స్త్రీ మూర్తులకు చైతన్యాన్ని కల్గించే స్ఫూర్తిదాయకమైన కథ. భర్త తనను కాదన్నడని భర్తకు ఎలాగైనా బుద్ధి చెప్పి తీరాలని అనుకుని ఒంటరి బాట పడుతుంది. చివరకు భర్త రామన్న కోరుకున్నవన్ని సాధించి భర్త రామన్ననే తన కాళ్ల కిందికి తెచ్చుకుంటుంది.

2. అక్కెమ్మకి సమాచార సహాయం చేసినవి ఆ గుడి దీపాలు. ఇంటికి దీపం ఇల్లాలు అంటుంటారు. స్త్రీని దీపానికి చిహ్నంగా చూపిస్తారు. దీపం ఏలాగైతే వెలుగు విరజిమ్మి చీకటిని పారద్రోలుతుందో అలాగే ప్రతి కుటుంబంలో స్త్రీ అత్తగారింటికి చేరి వాళ్ల జీవితాల్లో వెలుగై నిలుస్తుంది. ఈ కథలో దీపాలు కలుసుకొని రాక్షసపుండు తగ్గే రహస్యాన్ని చెప్పుకుంటాయి. ఆ మాటలు విని అక్కెమ్మ తన ఆలోచనను మార్చుకొని తనకి కావల్సినవి పొందగలుగుతుంది. అక్కెమ్మకి సహకారంగా దీపాలు మాట్లాడుకోవడం స్త్రీ మనస్తత్వానికి దగ్గరగా చిత్రించబడ్డది.

3. ప్రతి గ్రామాల్లో ముఖ్యంగా హిందువు దేవాలయాల్లో పండుగ సమయంలో దీపాలను వెలిగించడం సంప్రదాయం. మన సంస్కృతిలో భాగంగా తరతరాలుగా ఈ ఆచారం నిలిచిపోయింది. ముఖ్యంగా కార్తీక మాసంలో కార్తీక పౌర్ణమి రోజు ప్రజలందరు దీపాలు వెలిగించడం గమనించవచ్చు. ఈ కథలో కూడా ప్రతి ఇంటి దీపాలు ఒక గూటికి చేరే ప్రస్తావన ఉంది. జానపదులు పండుగ సందర్భంలో జరిపే దీపోత్సవాన్ని గురించి తెలియజేస్తుంది.

4. జానపదుల సాంఘిక దురాచారాల్లో వరకట్న సమస్య అనేది ప్రధానమైనది. అనాదిగా అన్ని సామాజిక వ్యవస్థల్లో నర్మగర్భంగా సాగుతున్న దుర్వ్యవస్థ. నేటికి అధిక వ్యాప్తిలో నిరాధికారికంగా సాగుతున్న నీచమైన సంస్కృతి. ఈ కథలో కూడా రామన్న అక్కెమ్మని 'నాకు పల్లిరిగాయలు బోడ మీద పట్నం కావాలి నల్ల చెరువు కట్టించాలి. ఆ కట్టకు చింత చెట్లు పెట్టాలి. కుక్కలు గుట్టకు కొట్టాలి. ఎలుకలు ఏవుసం పెట్టాలి. బిడ్డ మీద రత్నాలు పండాలి' అని అడుగుతాడు. అంటే వివాహానంతరం భర్తకు ఇవ్వవలసిన వరకట్నాదులు సంబంధించిన విషయాలుగా పరిగణించాలి. అవన్ని సమాకూర్చినప్పుడే నిన్ను భార్యగా స్వీకరిస్తానని నిలదీసి, అయిష్టపూర్వకంగా రామన్న అక్కెమ్మని పంపించి ఉంటాడని అనిపిస్తుంది. ఈ కథ ద్వారా సమాజంలో ఉన్న వరకట్న సమస్యను ఎత్తి చూపినట్లు అనిపిస్తుంది.

## 2.5.1.4 ఐదు మల్లె పూవ్వుల కథ

బండ్ల కనకమ్మ, తాళ్ళ ధర్మారం గ్రామం, జగిత్యాల జిల్లా.

తల్లి కృష్ణలీల, తండ్రి ధర్మరాజు, కొడుకు బాలగిరి రాజు ఆ కొడుకును కోటి కోటి మొక్కులు మొక్కంగ పుట్టిన కొడుకు. ఆ కొడుకును మొక్కి మొక్కి కోటితపసులు, పట్ట మొక్కరాని మొక్కులు, నోమరాని నోములు, పట్టరాని తపసులు బట్టిన ఆ కొడుకును కని, ఆ కొడుకు ఏమంటుండు పెరిగి

పెద్దగయి 12 ఏండ్ల అయినోల్లే ఏమంటుండు నా తల్లి తండ్రి నేను కొడుక్కి లగ్గం జేత్తని తండ్రి అంటుండు. తల్లి అంటుంది. మన కొడుక్కి పదారేళ్ల వయస్సు వచ్చిందయ్య. మన కొడుక్కి పెళ్లి జేత్తమంటే ఓనా.. తల్లి కృష్ణలీల ఓనా.. తండ్రి ధర్మరాజ నాకు లగ్గం మీరు జేత్తే నేను చేసుకోను. ఐదు మల్లె పూవ్వులకన్న అరవిసం కమ్మి ఉన్న పిల్లే నాగ్గావాలే. ఐదు మల్లెపూలని ఒక తక్కెట్ల పిల్లను ఒక తక్కెట్ల జోకితే ఏసుతాసు వోకుంట జోక్కరావాలే. ఏసు తాసు వోకుండా జోకితే అగో అప్పుడు నేను చేసుకుంట అంటుండు పిల్లగాడు. అయ్యా! నా కొడుకా నువ్ పుట్టకముందు పట్టరాని తపసులు పట్టి, మొక్కరాని మొక్కులు మొక్కి, నోమరాని నోములు నోమితే లేక లేక కలిగిన లోకపుత్రడివి. నువ్ ఒక్క కొడుకైతివి కొడుకా! పదారేళ్ల వయస్సు వచ్చేరా నా తండ్రి! నీకు లగ్గం జేత్తం అని దేశదేశాలు తిరిగి వేశ్యకాంతను జూత్త. రాజ్యరాజ్యాలు తిరిగి రాజుల పిల్లను తెత్తంటే కొడుకా నువ్వేమో అయిదు మల్లెల పూలు కోరుతున్నవ్ కొడుకా బాలగిరి. ఎందుకు రా? అయిదు పూల పిల్లను ఎక్కడనన్న ఉందారా? ఈ భూమ్మీద. ఎక్కడనన్న ఉందారా కొడుకా ఎక్కడ లేదు రా..! పుట్టలేదు రా..! ఈ భూమ్మీదనే లేదురా అయిదు పూలెత్తు ఆడది. అంటుంర్రు తల్లిదండ్రులు. అమ్మా! పుట్టకున్న మంచిదేగాని నా తల్లి నేను అసోంటి పిల్లనైతే చేసుకుంట. నాకు వేరే పిల్లైతే వద్దు. అన్నవోల్లే కొడుకు ఏంజేత్తుండు.

ఎంపల్లయేసేటి ఎనుగుల్ల పిలిసి, గుంపల్ల మేసేటి గుర్రాల్ని పిలిసి, ఎండి గుండెక్కి ఎతనమడి పైడి గుండెక్కి పైజలకమడి పోయిండు. గుర్రాల్ని తడిమి తన్ను దన్ని కొరడా దెబ్బ పెట్టి గుర్రమెక్కి ఎట్టపోత ఉన్నడు...? ఆ పిల్లగాడు బాలగిరి రాజు ఒక కొండనెక్కి ఒక కొండ దిగి ఎద్దులు దాటి మద్దులు దాటి శికరాణ్యం బ్రహ్మారాణ్యం దాటి అయ్యోయ్యో! పడరాని పుల్లెందులు పడుకుంట పోంగ పోంగ రారాజుల పిల్ల ఐదు పూలెత్తుల పిల్ల కావాలంటే ఏ ఊరికి పోయిన ఐదుపూలెత్తుల పిల్ల దొరుకుతలేదు.

అయ్యో భగవంత! ఎండ కాలం ఎండ అయ్యో! నా తల్లీ ! నువ్వద్దు రాజ్యాలు తిరిగి రాజుల పిల్లను చేత్తంటివి నా తల్లి. నేను పిల్ల జాడకు బయలెల్లితే నాకు తగిన పిల్ల ఐదు పూలెత్తుల పిల్ల నాకు దొరుకతలేదు. నా తల్లి అని ఎర్రని ఎండల్ల ఒక రాజ్యంలో కర్రెండపు అడవిలో పంగలతో వటవుక్చం ఉన్నది. ఊడలతోని ఊరెలుపుంది. ఆ చెట్టు కింద ఆ గుర్రాన్ని ఆడ కట్టేసి అప్పుడు లింగాల సల్ల బరుసుకోని, పిల్లగాడు అర్థ గంటసేపు మూర్చల వచ్చినట్టు నెరివడి పోయి పడుకున్నాడు. పడుకునే వరకు ఆ దేవుడు ఏమంటుండు. నిన్ను కోటి తపసులు పట్టింది నీ తల్లిదండ్రి. కోటితపసులు మొక్కి

నొసట కాయలు కాసినయ్ ఆల్ల గోసలు చూడలేక ఒక కొడుకునిచ్చె ఆల్లకు. ఆ ఒక్క కొడుకు పదారెల్ల వయసు వచ్చినొల్లే పిల్ల కొరకు వాళ్లు చూసిన పిల్లను మెచ్చక కొడుక నువ్ అయిదుపూలకన్నా అరవిసం ఆడబాల కావాలంటివి. నువ్ ఎక్కడికి పోయిన దొరుకలేదురా? నువ్ తిరిగి తిరిగి ఉత్తరాది తిరిగినవ్, దక్చిణాది తిరిగినవ్, తూర్పు తిరిగినవ్, పడమట తిరిగినవ్ కొడుకా.....! ఈ ఎర్రని ఎండల్ల ఆ అడవిలో కొడుకా..! ఈ అడవిలో ఈ మర్రి వృచ్చం కింద గుర్రాన్ని కట్టేసి ఆడ పన్నవ్. మరీ నీకు ఈడ దిక్కెవరు సక్కెవరు అని ఒక కట్టె పట్టుకున్నడు కొడకా! అని ఒక ముసలి వేషం కింద బాలుడా బాలగిరి రాజా అని పిలుత్తున్నడు ఆ దేవుడని తెలుసుకుంటలేడు పిల్లగాడు. అయ్యా! బాలగిరి రాజా అంటుండు. ఏ ముసలయ్య నువ్వు ఎంతనయ్యా ముక్కుబడితె పానం బోతుంది నువ్వు జీవనం పోయ్యేందుకు ఉన్నవ్. నువ్ నా ముచ్చట అంత నీకు జెప్పుతా? నువు ఆరుత్తవా తీరుత్తవా అయ్యా! నువు ఆర్చవు తీర్చవు. నీవు ఆరవవు తీరవవు. నీకు జేప్పుడు ఏస్టే అంటుండు. అబ్బా! కొడుకా నాకు జెప్పవా నీకు నేను జెప్పుతా నీ ముచ్చట ఆరుత్తా తీరుత్తా. ముక్కు పట్టితే పానం బొయ్యే ఏసం ముందున్న కొడుకా! నీ కట్టం ఆరుత్తా! తీరుత్త! నువ్వు జెప్పల్నంటుండు. ఐదు మల్లెపూలకన్నా అరవిసం ఆడపిల్ల కావల్నె అంటుండు. నా తండ్రి! దేశదేశాలు తిరిగి, రాజ్య రాజ్యాలు తిరిగి నీకు తగిన పిల్లను నేను తెత్త అంటే నాకద్దు ఐదుమల్లెపూల కన్న అరవిసం ఆడబాలె కావాలి. నాకు అని నేను పట్టు పట్టు వచ్చి తిరిగి తిరిగి నెరువడి పొయి పానాలు పొయేకాలం అచ్చింది. అయ్యా! నాకు పిల్ల దొరకతలేదయ్యా. తాతయ్య నాకు జెప్పు అంటే ఇగో గిట్ల పడిపో అగో గీ మూలకుపోతే మైబూతపట్నం ఉంటది. మైబూతరాజు భార్యపేరు మాలచ్చిందేవి. మాలచ్చి కన్న బిడ్డ మాముత్యాలదేవి. ఐదు పూలకన్న అరవిసం పిల్ల ఆడున్నది. మరి పొతున్నగాని తాతయ్య మరి నన్ను ఆదుకోమనలేదు పిలగాడు. ముందే సోకు మీద ఉన్నడు. ముందటి కట్టాలు తెల్వదు. అదే ముచ్చట చెప్పినొల్లె అటు చూడుమన్నడు ఇటు మాయం అయ్యిండు. మాయం అయ్యి ఇటు పొయ్యేవరకు మైబూతరాజు బార్య మాలచ్చిందేవి. మాలచ్చిందేవి కన్న బిడ్డ మాముత్యాలదేవి. ఏడంత్రాల కత్తులమేడ కట్టి ఆ మాలు కింద బిడ్డను ఉంచి, ఆడ దాసి పెట్టిండు. ఈ కత్తులు ఆయుధాల పొన్న ఎక్కి, ఆ పిల్ల రెట్ట పట్టినోనికి నా బిడ్డను ఇత్తనని రాసిండు. ఆ రాసిన రాత చదివిండు. చదివి లోపలకు పోయిండు. అగో పోయి ఎవ్వలను అడుగుతలేడు. పోయిండు అది చదివిండు. ఆ మైబూతపట్టణం బోయిండు. ఆ మాలచ్చిందేవి వాల్లను ఎవ్వల్లను మందలియ్యలే. ఏడ చూడలే ఆ రాతే రాసిండు చూసి పోయిండు పోయి కాశీ మీద

కాశీ అనంత కాశీ కట్టి ఆ కత్తుల పొంట ఎక్కుత ఉన్నడు పిల్ల ఏం అంటుంది. అయ్యా! ఏ తల్లి కన్నది నిన్ను. ఏ తల్లి పెంచెనో నిన్ను. అయ్యా! నువ్వు నాకొరకే వత్తున్నవ్ నా తండ్రి మైబూతరాజు అంత మంచోడు కాదు. కత్తుల మేడ కట్టిండు. మొత్తం కత్తులతోనే కత్తి మీద అడుగు కత్తిమీద అడుగు ఏసుకుంట చుట్టూ కత్తులే. కత్తి మీద అడుగేసి అచ్చి నా రెట్ట పట్టి ఒక కోట్ల మంది గూడ సచ్చిన్రు. నాకోసం వచ్చి కోట్ల మంది బంగ్లా చుట్టూ పీనుగులై పోయినయి. అద్దు నన్ను చేసుకోకు బిడ్డా! నువ్వు మర్రిపో అంటుంది. ఆ బంగ్లా మీద ఉండవద్దు నా మీద మనస్సు వద్దు వేలాది మంది సచ్చిన్రు. కోట్లాది మంది సచ్చిన్రు పో మా తండ్రి మాట ఇనకు రాసింది చదవకు అన్నది. పానం బీకిన మంచిదే అన్నడు. అది కత్తి కత్తి మీద కత్తి ఎక్కి ఇగో గొంతయితే మీదికొచ్చి అడుగెట్టెవరకు కీలుకు కీలు, ఏలుకు ఏలు అంటకుండ సర్రుమని కింద పడ్డడు. కింద పడేవరకల్లా ఏం అంటుంది. అరె! నేను జెప్పంగ కూడ వినలే కదా. నేను జెప్పంగ వినని వాడు. గట్లే పోతడని ఏం జేసింది. అబ్బా! ఇంతమంది ఏరలే గని ఈ పొలగని నేను మాత్రం ఆ ముక్కల్లన్ని గంపలో ఏరుకుంటా. ఎత్తుకుని నా తండ్రి దగ్గరికి పోతానంటది. ఆ కిందికి దిగింది బంగ్ల. ఆ కత్తుల మేడ దిగింది. మేదరింటికి పోయింది. పెద్ద గంప తెచ్చింది. ఆ గంపలో ఈ మాంసం ఆ బంగ్ల సుట్టు రాలిన ముక్కలన్ని ఏరుకోని ఆమె నెత్తిన పెట్టుకుంది. తండ్రి దగ్గరికి పోయింది. తండ్రి కచ్చీరు మీద ఉన్నడు. పాపకారి మైబూతరాజు ఆ కచ్చీరుకాడికి వోయి ఏమంటుంది. నా తండ్రి నాకును ఈ గంపకు లగ్గం జేయ్యి? ఇగ నేను భూమ్మీద బతుకద్దు. నా కొరకు నీ కడుపుకు నను దేవుడు పుట్టియకున్న మంచిగుండు. నా కొరకు వచ్చినొల్లందరు సచ్చిండ్రు. మరీ బొక్కలగంపకు నాకు పెళ్లి చేయమంటుంది. ఇంత కండకొవురమానే బిడ్డ? నీకు బొక్కలు పని చేత్తయానే నీకు. మురిగిన మాంసం ఎత్తుకొని వచ్చినవ. వాడు కూడ వేలమందిలో ఒకడు. ఈ బొక్కల గంపకు నాకే అంటుంది. తెచ్చిందు బిడ్డకు చెప్పితే వింటలేవానే నా బిడ్డ. గా బొక్కలేంజెత్తయే? మురిగిన బొక్కలు ఆఁ.. అరె! ఏమో పాపమంటున్నవ్? ఆ బొక్కల్ని అని. బిడ్డ అనరాని మాటలు, తిట్టరాని తిట్లు తిట్టి బొక్కలగంప పట్టుకుని కట్టు బట్టలు, నాపెట్టె. చంద్రవరాలు నాయి నాకిచ్చి ఎల్లి పొమ్మంటుండు. అన్నొల్లై నీ బట్టలు, నా మీద ఉన్న బట్టలు నీకయ్యల్న అని ఆ బట్టలు రైకలు మంచి మంచి ఇచ్చి పాత పేగులు కట్టుకుని ఆ బొక్కలగంపెత్తుకోని నట్టడవిలో పడి పోతుంది. ఇగ కచ్చీరుకాడికి నట్టడవిలో పడిపోయి బిడ్డ పల్లెలు దాటి పట్నాలు దాటింది. జంగలు పట్టింది. జంగల్లోకి పోయి కారడాపు జంగల్ల ఆ కారడవు జంగల్ల కూసున్నది. ఒక పెద్ద మర్రివృక్చం ఉంది. నెర్రిపడ్డది.

ఆకలైతుంది. దూపైతుంది. బొక్కలగంప దించుకున్నది. బొమ్మడంగ ఏడ్తున్నది. ఏడిసేవరకల్లా ఆ గొల్ల వేసం అయిండు శంకరుడు. ఆ గొల్ల వేశమయి గొంగడి బూజానవేసి గొర్రె మందె చేసుకున్నాడు. గొర్రె మందె చేసుకొని ట్ర...ట్ర....ట్రూ... గయిగయి అంటుండు ఆయన. అన్నోల్లే ఈ బొక్కలగంప ఏంది తల్లి! అంత వాసన వత్తుంది. గది పట్టుకున్నవ అన్నడు. అన్నవొల్లే ఆ బొక్కలగంపలు ఏంజేత్తయ్యి నీకు ఆ బొక్కలు ఆటు పారేయ్..! నిను నేను లగ్గం చేసుకుంట మాకు మందలున్నాయి. మాకు బంగ్లలున్నయి. మాకు మేడలున్నయి. నిను నేను సాదుకుంట తల్లి అంటుండు. లేదు లేదు నీతో యుద్దం అన్న చేత్తగని నువ్వెవడురా అంటుంది. ఆమెను అనరాని మాటలంటుండు. అన్నోల్లే అరె లంజకొడుకా! నువ్ నను గిట్ల అంటవ్ రా? నేను మా పతివ్రతను. నేను చేసుకుంటనన్న ఈ బొక్కలగంప. నా బొక్కలగంపను పారేసి నిను లగ్గం చేసుకోమంటున్నవ్ రా.. అని కాసి కాసి మీద కాసికట్టింది. ఎంత యుద్దమంటే అంత యుద్దం చేత్తం రా గొల్లొడ. అన్నవొల్లే నవ్వి అంటడు గదా బిడ్డ నీ బత్తిని చూద్దామని నేనన్న నువ్వు లంగవో? నువ్వ్ దొంగవో? నువ్వ్ పాపత్ముకాలివో? నువ్ ఎసొంటిదానివో? అనుకున్నా... కాని నువ్ మా పతివ్రతవు నీ బుద్ది నే మెచ్చిన నా మీద యుద్దం చేత్తవ గొల్ల ఏసం వేసుకున్న నేను దేవున్ని! తల్లి..! అని పత్యక్చం అయిండు. దేవుడు శంకరుడే ఆయన. అయినవోలే ఏమంటుండు ఇగో గా కట్టె పుల్లలు తేపో ఆ సెట్టు సాటుకోయి అంటుండు ఆమెను గంప దించుకుంది. ఆ గంప దించుకొని గాని బిడ్డా! ఆ గొల్లవేశం మాయమైనవి. గొర్లు మాయమైనవి అన్ని మాయమైనవి. నేను నీ బత్తి మెచ్చిన. నువ్ గా సెట్టు సాటుకుపో.. గా సెట్టు సాటుకోయి కట్టెపుల్లలు తేపో అన్నడు. ఆ సెట్టు సాటుకోయి గంప ఆడవెట్టి సెట్టు సాటుకో పోయేవరకు ఏ కీలుకాకీలు అంటపెడుతుండు ఆ మాంసం కీలుకు కీలు అంటుపెట్టి జీవకర్రలో పుల్ల మోపిండు అబ్బా! నీ... ! నిద్రలేత్తుండు. లేసేవరకు ఆ చెట్టుకాన్నుంచి చూసింది. అచ్చి కీలుకు కీలు ఏలుకు ఏలు చూసి నువ్వ్ మోపి జీవకర్రలో పుల్ల మోపినవ్.. నువ్వ్ దేవునివి అనచ్చి ఆ పిల్లగాడు ఆ పిల్ల ఇద్దరు వచ్చి పాదాలు పట్టుకున్రు. అయ్యా! నీకు తప్ప మాకు దేవుడు లేడు. ఇక నిన్ను నేను ఇడవ. తండ్రి నిను మరువం మేం ఇద్దరం. నీకు తప్ప మాకు ఈ భూమ్మీద దేవుడే లేడు. నువ్వే దేవుడవని చెప్పి అప్పుడు భగవంతుని తలచుకుంటా అయిన పాదాలమీద కన్నీరు కారుతుండ్రు. కారిసినోల్లే ఏమంటుండ్రు. సచ్చి సచ్చి పుట్టుకుంట ఒక పుట్టుక పుట్టినవ్.. కీలు కీలు అంటుకుంటూ ఏలు ఏలు అంటుకుంటా నువ్వ్ మరణించినవ్ నేను ముక్కకు ముక్క, కీలుకు కీలు అంటబెట్టి జీవకర్రలో పుల్ల మోపినంక నువ్వ్

లేసినవ్ బిడ్డ ఇగో! బంగారు బాటిలు ఇత్తున మీరిద్దరు భార్యభర్తలు. అవ్వగారి పట్నం పోతావ? నువ్ పుట్టిన పట్నం పోతవ? అని అడిగిండు ఈమెను. అడిగితే నేను అవ్వకారి పట్నం పోను. నేనత్తగారి పట్నం పోత అంటుంది. అన్నవోల్లే ఇగో బంగారు బాటిలు ఇచ్చి పిల్లగాని ఏలుకు బెడుతున్న. ఈ బంగారు బాటును బొర్లించి చూడుర్రి. మీకు ఆకలయిన కాడ అన్నం బుడుతది. నీకు దూప అయినకాడా నీళ్లు దొరుకుతయి అని చెప్పిండు. ఉంగరం బెట్టి మాయం అయిండు. మాయం అయినోల్లే ఇగ మాయం అయి ఉంగరం బెట్టేకద! వీల్లిద్దరు తొవ్వగలసి ఈమెను పిల్లగని తల్లిగారింటికి పోతుండ్రు. పోంగ పోంగ ఆకలైతుంది. ఆకలైనకాడ అన్నం పుడుతుంది. ఇట్ల బొర్లిత్తే, దూప అయినకాడ నీళ్లు దొరుకుతున్నయ్. దూప అయినకాడ నీళ్లు దొరికి ఆకలైన కాడ అన్నం కాడ దొరుకుతున్నయ్ కద. ఈ బంగారు బాటువును బొర్లిస్తే ఇగ ఈల్లిద్దరు కూడి ఇంటికి పోయిర్రు. ఇగ ఇంటికి పోయేవరకు తల్లిదండ్రులను కలుసుకున్నరు వాళ్లు. అబ్బ కొడుకా! నువ్వ్ సచ్చినవ్ అనుకున్నరా..!. అయిదు పూలకన్న అరవిసం ఆడబాల కావాలంటివి నువ్ సచ్చిపోయినవ్ అనుకున్నం రా. నా కొడుకా..! నువ్ సక్కటి పిల్లను తీసుకొని అచ్చినవ్ రా.. అని ఆ తండ్రి మీద కొడుకు తల్లి తండ్రి ఆల్లందరు కలుసుకొని కోడలు కల్సిందని మల్ల అర్ధజనాల మందికి పత్రిక పంచి, ఆకాసమంత అరుగులేసి, భూదేవంత పందిరేసి, ఈ ఐదు మల్లె పూల పిల్ల అని పోయినవ్ గదా.. ఈ పిల్ల అయిదు మల్లెల పూలెత్తుంటద. అని తరాజు బాటు తెచ్చి ఆడ తక్కెడ బెట్టుండ్రు. పెట్టేవరకు బిడ్డ ఈ పిల్లను ఒక తక్కెట్లో, ఈ పూలను ఒక తక్కెట్లో ఏసు తాసు పోకుండ బరాబరి అచ్చింది. అప్పుడు లగ్గమాడిండ్రు. రాజు మెచ్చిన పెళ్లి అయింది. దేవానుదేవతలు మెచ్చిండ్రు.

## ఐదు మల్లె పూవ్వుల కథ – కథావిశ్లేషణ

మల్లె పూలు అనగానే శృంగార భావానికి సంకేతంగా భావిస్తారు. ఈ కథలో ఐదు మల్లె పూలెత్తు పిల్ల అంటే సౌందర్యానికి పెట్టింది పేరుగా గల అందమైన స్త్రీ అని అర్థం. ప్రపంచంలో ఆమెకు మించిన అందమైన స్త్రీ మరీ ఎక్కడ ఉండకూడదని ఉద్దేశ్యంతో బాలాగిరిరాజు ఊహిస్తాడు. ఐదు మల్లెల పూలెత్తు అమ్మాయి కావాలంటే సాధారణంగా లభించదు. కాబట్టి ఆమెను పొందాలంటే దానికి తగిన సాధన చేయాలి. అలాగే ఈ కథలో కూడా అలాంటి అమ్మాయి కోసం బాలగిరిరాజు దేశదేశాలు తిరిగి అన్వేషించి ప్రాణాలతో పోరాడి చివరకు సాధిస్తాడు. బాలగిరిరాజు తల్లిదండ్రులు కృష్ణలీల, ధర్మరాజు. వారిద్దరికి లేకలేక కలిగినా సంతానం బాలగిరిరాజు. ఎన్నో పూజలు, వ్రతాలు, నోములు

చేస్తేగాని కలిగిన ఏకైక పుత్రుడు. ఆ పుత్రుడికి వివాహ వయస్సు వచ్చిందని ఘనంగా పెండ్లి చేద్దామని తల్లిదండ్రులు ఆశిస్తారు. కాని అతడు ఐదు మల్లెల పూలెత్తు లాంటి సౌందర్యవతిని మాత్రమే పెండ్లి చేసుకుంటానని గట్టిగా నిశ్చయించుకుంటాడు. తల్లిదండ్రుల ఎంత చెప్పినా వినకుండా అయిదు మల్లెల పూల కన్న అరవిసం తక్కువగానీ అమ్మాయి కోసం దేశదేశాలు తిరుగుతాడు.

దేశవిదేశాలు, ఎన్నో కీకరణ్యాలు తిరిగి తిరిగి అలసిపోయి ఒక పెద్ద మర్రిచెట్టు దగ్గరికి వస్తాడు. మర్రిచెట్టు దగ్గర శివుడు ముసలాయన రూపంలో వచ్చి పలుకరిస్తాడు. మీ తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కుమారుడవు. ఎన్నో పుణ్యకార్యాలు చేస్తే పుట్టినావు. తల్లిదండ్రుల పుత్రశోకం మంచిది కాదని బుద్ధి మాటలు చెబుతాడు. కాని ఆ బాలగిరిరాజు ముసలివాడివి నీకేం తెలుసు. నువ్వు నా బాధ తీర్చేవాడివా? అని ప్రశ్నిస్తాడు. వంకర సమాధానాలు చెబుతూ శివునితో వెటకారంగా మాట్లాడుతాడు. కాని బాలగిరిరాజు పట్టుదలను గమనించిన శివుడు ఆయిదు మల్లెల పూలెత్తు అమ్మాయి ఉన్న మైబూత పట్టణం జాడను అందిస్తాడు. చెప్పిందే తడవు విషయం పూర్తిగా వినకుండానే అక్కడ నుండి పరారైతాడు. మైబూత పట్టణానికి రాజు మైబూతరాజు, అతని భార్య మహాలక్ష్మీదేవి, అతని కుమార్తె మూత్యాలదేవి. ఆ మూత్యాలదేవి చాలా అందగత్తె, శృంగారవతి. ఆమెను పొందాలంటే సామాన్యమైన విషయం కాదు. ఆమె తండ్రి రాక్షసుడు. ఆమెను వివాహం చేసుకోవాలంటే కత్తులతో కట్టిన మేడను ఎక్కి ఆమెను చేరాలి. ఎందరో రాజులు, గొప్పవాళ్లు ఆమెను వివాహం చేసుకోవడానికి ప్రయత్నించి కత్తుల మేడను ఎక్కి కుప్పకూలి ప్రాణాలను కోల్పోయారు. ఆమెను ఎలాగైనా పొందడానికి బాలగిరిరాజు ప్రయత్నం చేస్తాడు. బాలగిరి రాజును చూసిన ముత్యాలదేవి పరి పరి విధాలుగా నచ్చచెప్పిన, వినక కత్తుల మేడను ఎక్కడానికి ప్రయత్నం చేస్తాడు. చివరికి కత్తులపై నుంచి పడి అతని శరీరం మాంసపు ముక్కలతో కింద పడిపోతుంది. తాను చెప్పిన వినని బాలగిరి రాజు మాంసపు ముక్కలను ఒక బుట్టిలో వేసుకోని తన తండ్రి మైబూతరాజు దగ్గరికి పోయి వివాహం చేయమంటుంది. కాని మైబూతరాజు వారి పెళ్లికి ఒప్పుకోడు. ఆ బాలగిరిరాజు మాంసపు ముక్కలున్న బుట్టిని పట్టుకొని అతన్నే తన భర్తగా భావించి తండ్రి దగ్గర నుండి వెళ్లిపోతుంది. ఒక పెద్ద మర్రిచెట్టు దగ్గరికి వచ్చింది. అక్కడ శివుడు గొర్ల కాపరిగా గొర్ల మందను కాస్తున్నట్లు ప్రత్యక్షమై మూత్యాలదేవితో తనను వివాహం చేసుకొమ్మని అడుగుతాడు. బుట్టిలో ఉన్న బాలగిరి రాజు మాంసం ముక్కలను, ఎముకలను అటు పారవేయమని అంటాడు. దాంతో కోపానికి వచ్చిన మూత్యాలదేవి, మారువేషంలో ఉన్న శివుడితో

గొడవపడుతుంది. శివుడు అసలు రూపంలో ప్రత్యక్షమై ఆమె పాతివ్రత్యాన్ని మెచ్చుకొని బాలగిరిరాజు ఎముకలను, మాంసపు ముక్కలను అతికించి బతికిస్తాడు. వారికి బంగారు బాటిలు ఇస్తాడు. ఆ బాటిలు వల్ల వారు వెళ్లే ప్రయాణంలో కావల్సిన ఆహారాన్ని, ఫలాలను పొంది తినగలరు. వారిద్దరు బాలగిరిరాజు తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లి పెండ్లి చేసుకుంటారు. అలా బాలగిరిరాజు అనుకున్న విధంగానే తరాజులో అయిదు మల్లెలు పూలను ఒకవైపు, మూత్యాలదేవిని మరోవైపు తూచి సమానం రాగానే పెళ్లి చేసుకుంటాడు.

1. ఈ కథలో కత్తుల మేడ, బంగారు బాటు, ఉంగరం, శివుడు ప్రత్యక్షమై సహాయం చేయడం ఇలా అద్భుత కల్పనలు కనిపిస్తాయి. అద్భుత కథాంశాలతో నిర్మితమైన ఈ కథ అద్భుత కధానిర్మాణాన్ని పోలి ఉంది.

2. సంతానం లేని తల్లిదండ్రులకు లేకలేక పుట్టిన కొడుకు సాహస ఘట్టాల ద్వారా తాను కోరుకున్న అరుదైన యువతిని వివాహం చేసుకుంటాడు. ఆ యువతి అయిదు మల్లె పూల బరువు ఉండాలనుకుంటాడు. యువకులకి కష్టాల్ని చేధించే సాహసకార్యాలకు కావలసిన ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుంది ఈ కథ.

3. మూత్యాలదేవి బాలగిరిరాజును తన భర్తగా భావించి విరిగిన ఎముకలను తీసుకొని వివాహానికి ఒప్పుకోని తండ్రిని ఎదిరిస్తుంది. తనను పరీక్షించడానికి మారువేషంలో వచ్చిన శివుడితో యుద్ధానికి దిగింది. ముత్యాలదేవి కేవలం ఐదు మల్లెపూలంత బరువు ఉన్న సున్నితమైనరూపమే కాక, ప్రియుడిని కాపాడుకున్న ప్రేయసి. శీలం కోసం శివుడినే ఎదిరించిన శీలవతి. తండ్రి మాటలను విని కత్తులమేడలో ఉన్న సుగుణవతి, పెళ్లి చేసుకొని అత్తగారింటికి వెళ్లడానికి సిద్ధమయిన సౌభాగ్యవతి ఇలా అన్ని విధాల పరిపూర్ణ స్త్రీ మూర్తిరాలుగా ఈ కథలో చిత్రించబడింది.

4. జానపద కథలో ఇలాంటి కథాకథనం చేసే కథకురాలు అసామాన్యురాలు. సంప్రదాయంగా కథను అందిపుచ్చుకోవడమే కాక కథాకథనంలో అందర్ని మెప్పించే విధంగా కథా కథనం చేసిందని పై ధారాళశక్తిని చూస్తే తెలుస్తుంది.

## 2.5.1.5 గారడి పిల్లవాడు

దాయాది రాములు, కొల్వాయి గ్రామం, బీర్‌పూర్ మండలం.

ఒక ఊరు ఉంటది. ఆ పల్లెటూరులో మంచి రాజు ఉంటడు. గరీబు సరీబు రైతులు అందరున్నారు. ఆ ఊరిలో ఒక ముసలమ్మ ఉంటది. ఆమెకు తినపోతే తిండిలేదు. ఆమెకు ఇద్దరు మగ పిల్లలు. భర్తలేదు. పిల్లలు చిన్న పిల్లలు, ఆళ్లను సాదుకోవడానికి ఆమెకు చాలా కష్టమైతుంది. ఈళ్లింటికి ఆళ్లింటికి ఏదో పాశిపనికి, బోల్లు తోముడు, వడ్ల దంచుడు, పిండి ఇసురుడు ఆళ్లు తిన్నంగ ఏదన్న ఉంటే మిగిలింది పిల్లలకు తీస్కచ్చుడు. ఇలా నడవంగ నడవంగ కొన్ని రోజులకు ఆళ్లకు ఒకడికి పది, ఇంకోనికి పన్నెండేళ్లు. ఆ ఊరికి ఒక గారడోడు అచ్చిండు. రాజు గారి ఇంటి ముందట ఆట పెట్టిండు. మహాద్భుతంగా ఆడుతుండు. ఎదంటే అది చేసి వినోదంగా ఆడుతుండు. అందరు మెచ్చుకుంటుర్రు. ఈ విధంగా నడవంగ రాజు చూసి నీకు ఏం కావాలని అడుగుతాడు. అతడు అయ్యా! నాకు కొడుకులు, బిడ్డలు లేరు. నాకు సచ్చేంత విద్య అచ్చు. ఏదంటే అది మాయ జేత్త. కానీ నాకు సంతానం లేదు. ఈ ఊళ్లె ఎవ్వరన్నా పొట్టకు లేకనో, కష్టంగా బతికెటోళ్లు ఉంటే ఆ పిల్లల్ని తీస్కపోత. నా విద్య నేర్పిస్తా. దాంతో ఎంతనై సంపాదించుకోవచ్చు అని చెప్తడు. అప్పుడు రాజుకు టక్కున ముసలవ్వ యాది కచ్చింది. ముసలవ్వని పిలిపిత్తడు. మరి ముసలవ్వ నీకు రెండు విధాలు లాభమైతది. ఒకటి నీ పిలగాండ్లను ఆయననే సాత్తడు. రెండోది నీ పిల్లలు మంచిగ విద్యావంతులైతరు. మరీ నీ పిల్లలకు విద్య నేర్పిత్తడట పంపిత్తవా? అని అడిగే. అడిగితే అయ్యా! నేను లేక లేక కట్టపడి సాదుకుంటున్నా. ఆడు గారడోడు ఏంజేత్తడో తెలియదు. ఏ... గవన్ని ఉండయ్!. మేం రాసుకుంటం ఒప్పందాల, పబంది రాసి పంపిత్తాం. ఆని ఫుల్ అడ్రసు తీస్కుందాం అంటే దాని మీదకెళ్లి రాజికచ్చింది. విషమేమిటంటే విద్యంత నేర్సుకున్నాంక ఒక పిల్లగాడు నీకు, ఇంకొ పిల్లగాడు నాకు అనేది ఒప్పందమన్నట్టు. సరే ఎక్కడ బతికితేంటి పెద్దొల్ల అయితే అయిపయే. పెద్ద మనుషులు అప్పజెప్పిర్రు అయిపోయింది. ఈమె ఇచ్చింది ఆడు తీస్కపోయిండు ఇగ ఆళ్లకు మొదలు పెట్టిండు విద్యనేర్పుడు. విద్య నేర్పితే చిన్నోడు బాగా హూషారు. పెద్దోడు సుబ్బన్న వానికి ఏం అత్తలేదు.

చిన్నోడు ఏ అవతారం అంటే ఆ అవతారం ఏసిండు. అప్పుడప్పుడే పిట్ట అయితుండు. అప్పడదప్పుడే ఎలుక అయితుండు. ఏదంటే అది కోట్ల కొద్ది రూపాయలు సూపిత్తండు. పామును, తేళ్లను సూపిత్తండు. ఎక్కడికి వోయినా బాగా వినోదంగా ఆటలాడుతుండు. ఈ పెద్దోడు మొద్దోడు డోలు

కొట్టుటానికి సరిపోయిండు. ఈనికి ఏం రాదు. నాలుక కొత్తే అక్షరం రాదు. మొద్దోని తీస్కపోయి ఆ ముసలమ్మకిచ్చి ఎట్లానైనా చిన్నోని నేను ఉంచుకుంటా అని అనుకుంటాడు గారడోడు సంవత్సరమూ అంతా నిర్ణయించుకున్నడు డేట్ అయిపోయింది. ఆడు ఎక్కడికి అచ్చిండటే కొల్వాయి అయితే బీర్పూర్లో ఉంటడు. ఆ డేట్ నాడు ఇక్కడికి అచ్చిండు. అయితే పెద్దోని మీద అనేకమైన కంటెలు, కడాలు సూపర్ సూపర్ తయారుజేత్తుడన్నట్టు. చిన్నోనికి ఏం రాదన్నట్టు చిత్రికరిస్తుండు. పెద్దోనికి జోరత్తయన్నట్టు అందంగా తయారుచేసిండు. ఈ విషయం చిన్నోడు బాగా సూసిండు. నేనయితే మా అమ్మ దగ్గరికి పోతే మా అమ్మని సాత్త మా అన్నని గిట్ట అమ్మ తీసుకుందనుకో తిండికి లేక సత్తరు. బాగా ఆలోచించి తెల్లారితే రాజు గారింటికి అచ్చిండు బాగా చూసి చూసి చిన్నోడు ఒక పిట్ట అయిండు పరకాయప్రవేశం చేసి పిట్ట రూపంలో అమ్మ దగ్గరికి అచ్చిండు. అచ్చి అమ్మా! నేను నీ కొడుకునే పొద్దుగాల్ల రాజు దగ్గరికి గారడోడు అత్తడు. నిన్ను పిలిపిచ్చి అన్నకు బాగా గారడి అత్తదని చెప్తడు. నాకు ఏమిరాదని చెప్తడు. అన్న మీద సుమారు లచ్చరూపాల సామాను ఉంటది. ఆ అభరణాలు చూసి అన్నని తీసుకుంటే అవి మంత్రంతో చేసినవి మాయమైపోతయి. నన్ను తీస్కో అన్నకి ఏంరాదని చెప్తడు. ఈ విషయం ముసలి దానికి అర్థమై జాగ్రత్తపడ్డది. తెల్లారింది తొమ్మిది పది గంటలకి ఆడు అచ్చిండు. రాజు బాబు విద్య ఎవలికి మంచిగ అచ్చింది అని అడుగుతడు. గారడోడు చిన్నోనికి ఏం రాదయ్యా, పెద్దోడు బ్రహ్మాండం ఆన్ని ఎక్కడ పెట్టినా బతుకుతడు అని చెప్తడు. ఇగ ముసలవ్వ అచ్చింది. నీ ఇష్టం ఉన్నోన్ని తీస్కపో అంటే అయ్యా! నా చనుబాలు అరకముందే చిన్నోన్ని పంపుడైంది. చిన్నోని మీద ప్రేమ ఉంది పెద్దోనికి విద్య బాగా అచ్చని మీరే చెపుతుండ్రు. ఇగ గారడోడు తలకాయ పట్టిండు. ఇగ అక్కడ ఏం అనరాదుగా రాసుకొన్న నిర్ణయం ప్రకారం చిన్నోన్ని తీసుకుంది. ఇంటికి పోయిండ్రు.

పెద్దోన్ని తీసుకుని ఊరి దాటకముందే కొట్టుడు స్టార్ట్ చేసిండు. నిన్ను అట్టిగ ఎద్దును మేపినట్టే మేపుడు రా... అని చెప్పి కొట్టుకుంటా తిట్టుకుంటా పోతండు. పోయి పోయి సారంగాపూర్ దుబ్బ రాజేశుడు అక్కడ రోడ్డు దగ్గర ఆ ఊళ్లే తికానా పెట్టుండు. ఇంత డోలు కొట్టుకుంటా బిచ్చ మడుక్కుంటుడు. ఆ కథ గట్లయింది. ఇక్కడ చిన్నోడు అమ్మ రేపు నేను ఒక గుర్రమైతా గుర్రమైతే అందరు అత్తరు. ఈ గుర్రం నా కొడుకు కొనకచ్చుకున్నడు అని చెప్పు. ఆ నోట ఈ నోట రాజు దగ్గరికి పోతది. అందరు అబ్బ! ఏం గుర్రమయ్య నీ కాడ ఉండాల్సిన గుర్రం అంటరు. రాజచ్చి ముసలవ్వ ఈ గుర్రం ఎక్కడిదంటే చిన్నప్పటి సుంది ఉండే ఇన్నాళ్లు ఆళ్ల ఈళ్ల సుట్టల ఇంటికి పంపించినా నా కొడుకు

అచ్చిందు. తీస్కచ్చిందు ఈ గుర్రం. కావాలంటే అమ్ముతనయ్య అన్నది. అన్నంక మరి ఇంకేంది నేను తీసుకుంటా గుర్రం మంచిగుంది నాకే కావాలి అని చెప్పి 25 వేలకు కొంటడు. ఇగ ఏడికన్న పోవాలన్న కాయిషుండి గుర్రం ఎక్కి రోడ్డు పొంట పోతండు. చూసేవాళ్ల అంతా పరేషాన్..! అయితుర్రు. అంత స్పీడుగా పెద్ద పెద్ద జంగలతో పోతుంది. గారడోడు ఇది చూసి అబ్బ కొడుకా! ఇది నీ ప్లానే తెలిసే రా....! అనుకొని ఇది కడుపుల పెట్టుకొని ఇది గుర్రం గాదు. ఇది మా వోడని గ్రిప్పుల తీసుకోవాలని అనుకుంటడు. రాజు జగిత్యాల పోయి ఇంటికచ్చిందు. గుర్రం మాయమైంది. మల్ల ముసలమ్మ ఇంటికాడ ఆవు అయిందు మల్ల అమ్మింది. రోజుకు 10 వేలు అస్తున్నయ్. ఇగ గారడోడు రైతుల వేషం మీద ఆవులు కావాలని అచ్చి 30 వేలకు ఆవు కొన్నడు. ఆవు రూపంలో ఉన్న చిన్నోడు ఎన్ని సైగలు చేసినా అర్థంకాలే గారడోనికి ఆవు ఇచ్చింది. పట్టుకొని పోయిందు. నను గిట్ల చేత్తవా? రాత్రి పిట్టయై పోయి మీ అవ్వకు చెప్పి నన్ను మోసం చేత్తవారా? నువ్వ్ నీ బతుకెంతరా? నా చేతికి రావా? నిను నాశనం చేస్తరా..? అని సూతుండు చెరువు కట్టమీద పట్టుకొని పోతుండు. ఆ చెరువు పక్కన చనిపోయి చేపల జిమ్మల సొచ్చిందు. సొచ్చి చెరువుల దునికి చెంగన పోయింది. అయ్యో! ఎంత పని అయిపయే అని చెప్పి నీరుపిల్లి అయి దీని వెంబడి పడ్డడు గారడోడు. ఆడు ఎటుపోతే ఈడు అటు ఎంబడు పడ్డడు. పాపం చెరువు సందులేకుండా ఉరుకుతుందన్నట్టు. అరె ఎట్ల చేసుదు! నా ఎంబడి పడే తండ్లాడి ఉరికి ఉరికి గుంటలో రామచిలుక చనిపోయింది. దాని శరీరంలోకి సొచ్చిందు. గాల్లోకి ఎగిరిపెయిందు. అమ్మ కొడుకా! నువ్వ్ చిలుకయితివి గదరా. వీడు ఏంచేసిందు గద్ద దేగ అయిందు. మల్లెంబడి పడ్డడు. వాడు ఉరక.. వీడు ఉరక.. జంగల్ల వాడు తన్నుడు వీడు ఉరుకుడు అదే నడుత్తుంది. ఒక ఊరి మీదికెల్లి పోంగ రాజు ఉంటడు. ఆయనకు బిడ్డ ఉంటది. ఆమెకు 16 సంవత్సరాలు ఉంటయి. ఆమె తానం చేసేటపుడు ఆమె మెడలో బంగారు పేరు హారం అయిందు. భర్ణసారం అయి మెడలో ఉన్నదట... అచ్చి గిప్పుడేం చేయాలని తిరుగుతుండు. మల్ల గారడేశం ఏసిందు. ఆ రాజ దర్బారులో గారడాట పెట్టిందు. ఎన్నో ఆటలు, అద్భుతాలు సృష్టిత్తుండు. రాజు ఇగ అరె నాయనా ఏం గావాలి రా అని అడిగిండు. నాకు ఏదద్దు. నీ బిడ్డ మెడలో భర్ణసారం గావాలని చెప్తడు. నా బిడ్డ దగ్గర లేదంటడు. మరి ఉన్నట్టయితే నీకే ఇస్త, లేకపోతే నిను కోత్తంటడు. సరే! ఆమెను తీస్కచ్చి నీ మెడల భర్ణసారం ఉన్నదా అంటే ఉన్నది అని రాకూమార్తె అంటది. ఎక్కడిది అని అడుగుతడు. నేను తానం చేసేటప్పుడు అచ్చింది. మంచి గుందని ఉంచుకున్న అది మాయోపాయంతో అచ్చింది. ఆ గారడోనికి ఇచ్చెయ్ అంటడు. నాన్న ఇది

మంచిగుంది నేను ఉంచుకుంట అంటుంది. ఎట్టకేలకు తీసిచ్చింది. ఆమె అయిష్టంగ ఇసిరింది. నేలకు కొట్టింది. కొట్టినప్పుడు కింటల్ జొన్నలు అయినయట. జొన్న రాశిలాగ అయింది. అరె! చిత్రం చిత్రం అయితుందని అవన్ని ఎత్తుకుపోరా అన్నాడు. అయ్యా! రాజా నేను ఏం జేత్త సూడుర్రని కోడిపుంజు అయిండట. అయి కింటాల్ జొన్న రాశి బుక్కిండట. ఎప్పుడయితే ఇసిరి కొట్టిందొ ఒక రాశి పూస వోయి దడిల ఇరికింది. ఆ పూస జంగ పిల్లైందట. బాగా తిని మెడలు అటు ఇటు ఇరుస్తున్న కోడిపుంజుని అమాంతం మింగిదట ఆడికి ఆ కథ అయిపోయింది. అన్నను తోలుకచ్చుకొని, తల్లిని మంచిగ సాదుకుంటడు.

## గారడి పిల్లవాడు – కథావిశ్లేషణ

అద్భుత కథాంశంతో నాటకీయతను చిత్రించిన కథ గారడివాడి కథ. గురువుని మించిన శిష్యుడు ఉండడం సహజం. కానీ ఒక శిష్యుడు గురువు చేసిన తప్పును గుర్తించి గురువుకే గుణపాఠం చెప్తాడు. ఒక పేద కుటుంబానికి చెందిన తల్లికి ఇద్దరు మగ పిల్లలు. వారి పోషణ కష్టంగా ఉంటుంది. తమ పేదరికం నుంచి బయటపడేందుకు ఒక గారడివాడితో ఒప్పందం కుదుర్చుకుంటారు. ఆ ఒప్పందంలో ఇద్దరు పిల్లలకు గారడి విద్య నేర్పిన తరువాత ఒకరిని ఆ పేద తల్లికి, ఇంకొకరిని ఆ గారడివాడికి ఇవ్వాలి. దానికిగానూ ఆ గారడి వాడు గారడి విద్యాబుద్ధులను నేర్పాలి. ఆ తల్లికి, గారడివాడికి రాజు సమక్షంలో ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారమే పిల్లలు పెద్దయ్యిన తరువాత అందులో పెద్దవాడికి గారడి విద్య వంటబట్టదు. చిన్నవాడు ఆ విద్య నేర్చుకుని అందులో అరితేరతాడు. ఇక వారి ఒప్పందం ముగిసిపోయి ఆ తల్లికి ఒక కొడుకును ఇవ్వాలని అనుకుని వస్తాడు. కాని చిన్నవాడు చాలా తెలివైనవాడు. గారడివాడు ఎత్తులకు పై ఎత్తు వేసేవాడు. వాళ్ల తల్లిని మోసం చేసి చిన్నవాడిని దక్కించుకుందామని అనుకుంటాడు. కాని చిన్నవాడు మారువేషంలో తల్లి దగ్గరికెల్లి విషయాన్ని వివరించి తాను తల్లి దగ్గర ఉండి తల్లిని పోషించాలనుకుంటాడు. పథకం ప్రకారమే తల్లి చెంత చేరతాడు. ఈ రహస్యాన్ని తెలుసుకున్న గారడివాడు ఎలాగైనా చిన్న వాడిని చేజిక్కించుకోవాలని బయలుదేరి వివిధ రూపాల్లో పరకాయ ప్రవేశం చేసి పట్టుకుందామని ప్రయత్నిస్తాడు. కాని చిన్నవాడు చురుకైనవాడు. మాయలోడు. గారడి విద్యలో నేర్పరి. గురువు ఎన్ని రూపాల్లో పట్టుకుందామని వచ్చిన తాను ఈ రూపాలకు విరుద్ధమైన రూపాలను వేసి గురువు నుంచి తప్పించుకుని తుదకు గురువునే

అంతమొందిస్తాడు. ఇలా కథంతా అద్భుత కథనంతో సాగిపోతుంది. వివిధ రూపాల్లో ఆత్మ ప్రవేశిస్తూ పాఠకులకు, శ్రోతలకు దృశ్యరూప సన్నివేశాలను తలపిస్తుంది.

1. ఈ కథ ప్రధానంగా గారడి విద్య విశేషాల ఆధారంగా రూపొందింది. మంచి చెడు పోరులో చెడుపై మంచి చేసే పోరును ఈ కథ కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. చిన్నవాడు తన తల్లి మీద మమకారంతో తాను కష్టపడి విద్య నేర్చుకుంటాడు. తన తల్లిని సాకాలని గురువును సైతం లెక్కచేయకుండా, ప్రాణాలను పణంగా పెట్టి దైర్యంగా ఎదురుతిరిగిన వాడు. తల్లిదండ్రులను భారంగా కాకుండా మన బాధ్యతగా స్వీకరించాలని మంచి సందేశాన్ని అందించిన కథ ఇది.
2. ప్రాచీన కాలంలో గారడి విద్య ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. గారడి వాళ్లు గ్రామీణ ప్రాంతాల్లోకి రావడం వారికి తెలిసిన గారడి కళానైపుణ్యాలను ప్రదర్శించి డబ్బును ఆర్జించడం నేటికి కనిపిస్తుంది.
3. కథలో నాయకుడు చిన్న పిల్లవాడు. జానపద కథా లక్షణాల ప్రకారం కథలో కుటుంబంలో చిన్న వాడు నాయకుడు ఉండటం, ప్రతినాయకుని ఎదిరించి విజయాలు సాధించడం. సహాయపాత్రగా మరొకరి సాయం అందించడం ఇవన్నీ ఈ జానపద కథలో సమృద్ధిగా ఉన్నాయి. పేద కుటుంబానికి చెందిన తల్లికి ఇద్దరి కొడుకుల్లో చిన్నవాడు తెలివైనవాడు. గారడివిద్యను తొందరగానే నేర్చుకుంటాడు. అతని అన్న సోమరివాడు. అన్నకు గారడివిద్య అబ్బక గురువుచేత నానాదెబ్బలు తింటాడు. చిన్నవాడు తల్లిని, అన్నని ఎలాగైనా తానే చూసుకోవాలని గురువుతో పోరాటం చేసి గెలుస్తాడు.
4. చిత్రవిచిత్రమైన వేషాలు మారుస్తూ అద్భుతమైన విషయాలతో నిండి ఈ కథ పాఠకుడిని ఊహాత్మకమైన ఆలోచనలకు తావిచ్చే విధంగా నిర్మించబడింది. ఈ కథలో నాయకుడు చేప, చిలుక, హారం, జొన్న, జంగ పిల్లి రూపాలు మారుస్తుంటే ప్రతినాయకుడు వాటికి విరుద్ధమైన రూపాలు నీరు పిల్లి, డేగ, మనిషి, కోడిపుంజు వేషాలు వేస్తాడు. మొత్తంగా గారడివాడు కథ అద్భుత కథాంశాలతో నిర్మితమై ఒక కొడుకు తల్లి మీద ప్రేమతో విద్య నేర్పిన గురువునే తన శక్తి సామర్థ్యాలతో ఎదుర్కుంటాడు.
5. ఈ కథలో “motif” అనగా “మూలాంశం “ ఆమె చిన్న కుమారుడు అని చెప్పవచ్చు.

## 2.5.1.6 సోమనాల బావి

జాడి రాజన్న, ఆరపల్లి గ్రామం, ధర్మపురి మండలం.

ఒకటి గంగావది పట్నం. ఆ గంగావతి పట్నంల ఒక అవుసలయిన ఉన్నడు. ఆ గంగావది పట్నంల ఒక అవుసలయిన ఉన్నడు. ఒక బ్రాహ్మణుడున్నడు. ఈ బ్రామ్మడు బీదస్థులే. అవుసలయిన న్యాయస్థుడు. అయితే వీరిద్దరు దగ్గర ఫ్రెండిషిప్ అయ్యేటి వరకు అక్కడ ఏం జరిగిదంటే పొద్దికి పొట్టగడతలేదు. మాపటికి బట్ట గడుత్తలేదు. అయ్యా! న్యాయస్థుడా, అన్యాయస్థుడా మనం ఇద్దరు చిలుకవాది పట్నం పోదం. ఆ పట్నంల రైతులకు పంచాంగం చూసి, ఏదో ఒకటి చేసి బిక్షాటన చేసుకొని మన భార్యపిల్లలను సాదుకుంటామని చెప్పి ఈ బ్రాహ్మణుడు ఆ న్యాయస్థులు దగ్గర అవుసలయిన దగ్గరికి పోయిండు. సరే ఎప్పుడు పోదాం. రేపు పొద్దుగాల్ల పోదాం. సరే అనుకున్నరు. ఈ బ్రామ్మడు ఇంటికచ్చిండు. భార్యతో చెప్పితే భార్య ఏం చేయాలే? ఇగ ఈ న్యాయస్థులు అతని దగ్గర పిండి ఉండే ఆ పిండిని 3 రొట్టెలు చేసి భర్తకు సద్ది పెట్టి పంపింది. ఇద్దరు పోతరు. నడిచి నడిచి చిలుకవాది పట్నం దగ్గరకచ్చింది. ఆ పట్నానికి తూర్పు బాజున సోమనాల బావి ఉన్నది. అక్కడికివోయి చెరొ రొట్టెన్నర తిందామని అవుసలయిన అన్నడు. సరే అని చేతులు కాళ్లు బావికాడ కడక్కచ్చుకుని చెరి రొట్టెన్నర తిన్నరు. ఈ బ్రామ్మడు రొట్టెన్నరకి సంతోష పడాలి కదా! నిలబడి బాగా సూత్తుండట. అబ్బ! రొట్టెన్నర తింటే సాలదు. ఈ అవుసలయినను సంపితే మిగత రొట్టెలు తినచ్చు అని, సోమనాలబావిల బిగ్గిత్త పట్టి పారెత్తడు. పారెసి మిగత రొట్టెలు తిని పెయిండట బ్రామ్మడు. ఈ బావిల పడ్డోని కథ ఏం గావాలె? భగవంత ఈని పెండ్లాం ముండవొాయ? గీ లంజకొడుకు నాకు ఆకలి బాగా అయితుందన్న నేను తింట అంటే ఇద్దుంటి నను నూతిల పారేసే. నా భార్య పిల్లలను ఆగం చేసే. నూతిల పడేసి కొర జీవనానికి అచ్చిండు. ఈ చిలుకవాది పట్నంల ఒకటి పుట్ట

పుట్టినాడు రావి చెట్టు పుట్టిందట.

రావి చెట్టు పుట్టినాడు పుట్ట పుట్టిందట

ఆ పుట్టకాడ ఆంజనేయుని గద్దె ఉందట

అక్కడ ఆంజనేయుడు నడి ఊళ్లె ఉన్నడు.

అక్కడనే మగ గ్రహ అక్కడున్నది. ఆ మగ గ్రహ సోమనాల బావికాడికి అచ్చిందట. పడమటి బాజున కూసుందట. అప్పటికి రాత్రయింది. ఈ ఆడ గ్రహ ఎక్కడున్నది. అక్కడ చిలుక పట్నంల రాజు

ఉన్నడు. రాజు కుమార్తె మీద ఈ ఆడ గ్రహ పూనకం అయింది. పూనకమయి రాణికి వీపుల రాచపుండు పుట్టిచ్చిందట. వీపుల రాచపుండు పుట్టిచ్చి ఆ రాచపుండు ఏ వైదికుడు అచ్చిన మగ్గుతలేదు. దానికి గొర్రె పోతులు, పందులు కోసిన, కారం పెట్టిన తీసుకుంట ఆడగ్రహ రాజకుమారి మీదనే ఉండిపోయింది. ఆ టైంల ఆడగ్రహ కూడ ఇదే సోమనాల బావి కాడికి అచ్చింది. అచ్చి తూర్పు బాజుని కూసుంది. పడమటి బాజున మగ గ్రహ కూసుంది. ఒక గుడ్డెనుగు, ఒక నక్క ఉత్తర, దక్షణ బాజున కూసున్నయి. అవి ఆడున్నయి. మగ గ్రహని ఆడ గ్రహ అడిగిందట. అయ్యా! నువ్వ్ ఎక్కడుంటున్నవ్ ఏం తింటున్నవ్ ఏం కథెంటో మగ గ్రహ చిలుకవాది పట్నం పుట్టిన పుట్ట దగ్గర ఆంజనేయునిగా ఉద్భవించినా నాకు పూజలు, పురస్కారాలు చేస్తే అది తీసుకుంట ఉన్ననని మగ గ్రహ ఆడ గ్రహకి చెప్పింది. ఆడ గ్రహని మగ గ్రహ అడిగింది. రాజు దగ్గర రాజకుమార్తె మీద ఉండి రాచపుండు పుట్టించిన దానికి ఎందరో వైదికులచ్చి మేకపోతును, కోడి పుంజులు, కల్లు తీరొక్క తీరు ఆహారం తెచ్చి పెడుతుర్రు. గని ఆమె తింటలేదు. నేనే తింటున్న. సుఖ శాంతంగా అన్నది. మరి నువ్వెట్ల మగ్గుతవ్ అని మగ గ్రహ అడిగిండు. ఇగ ఈ రెండు మ్యాటర్లు సోమనాల బావి కాడ ఉన్న ఆవుసలయిన ఇంటుండు. నను తొలగించాలంటే ఈ సిలకవాని పట్నానికి కోటశంబు గుడి ఉంది. ఆ గుడి మీద ఏడాకుల మర్రి ఉన్నది. ఆ మర్రిని ఎవ్వరన్నా తెలిసినోల్లు ఉంటే పోయి కోట శంభుని పూజ చేయాలి. కొబ్బరికాయలు కొట్టాలి. పాలు పోయాలి. కొట శివునికి దండం పెట్టి ఆ గుడెక్కి ఆ ఏడాకుల మర్రిని ఏంచకుంట సంచిల పెట్టుకొని అచ్చి రాచపుండు మీద పెట్టినట్లయితే రాజకుమార్తె మంచిగయితది. ఈ మ్యాటరంతా ఆవుసలయిన మంచిగ ఇన్నడు. మరి నువ్వ్ కూడ అక్కడ్నుంచి తొలగిపోయే అవకాశం ఉందా? అని మగ గ్రహని ఆడ గ్రహ అడిగిండు. నేను కూడ తొలగిపోయేది ఉన్నది. ఏంటిదంటే దానికి పూజలు ఆంజనేయునికి 30 బస్తాల జంగాల పచ్చి, 30 బస్తాల కొబ్బరికాయ, 30 బస్తాలు ఊదు, 30 బస్తాల బత్తిలు ఏడు తరువులు చేసుకురావాలి. అన్ని తెచ్చి పూజ చేస్తే నేను గగన మార్గన లేచిపోతా అని మగ గ్రహ చెప్పిందట. న్యాయస్థుడు ఆవుసలయిన రెండు మ్యాటర్లు ఇన్నడు. ఇగ నక్క పెద్దపులి రెండు ఎదురుగా కూసోని పెద్ద పులి బావ నువ్వ్ ఇయాళ ఏం తిన్నవ్ ఏంది అంటే ఇయాళ వర్షం పడ్డది. ఇక్కడ మాత్రం జింకను తిన్న. మరి నువ్వ్ ఏం తిన్నవ్ నక్క బావంటే అయ్యా ఈయాళ మాత్రం వర్షం పడ్డది. ఒర్రెల పొంట కప్పలు, ఎండ్రికాయలు, చేపలత్తె అవి పట్టుకుని నేను తిన్న కడుపునిండా అన్నది. నాకు ఆనందంగ ఉన్నది అనుకున్నయట. ఎక్కడోళ్ల అక్కడ పోయిర్రు. ఆ ఊరిలో గొర్లు

కాసేవాడు ఒకడు అటువైపు మంద పెట్టిండు. అందుల ఒకనికి దొడ్డికచ్చిందట. వాడు నీళ్లెక్కడ లేవని సోమనాల బావి కాడికి పోయిండు. నూతిల పడ్డ ఆవుసలయిన బుడ్ బుడ్ అని కొట్టుకుని చూసి మనిషా?, గొర్రెనా? అని బయట తీసి మంటకు కాపి మనిషి స్పృహల అచ్చి ఎప్పటొళ్లె అయింత పెయిండు. పలానా నూతిల పడ్డప్పుడు ఏదో మ్యాటరు ఇనబడ్డది. ఈ మ్యాటరు నిజమా? అబద్దామా? అని చెప్పి ఆలోచించి. ఆడగహ మగగ్రహది మనసు నిండ ఉండి పెయినయ్. పెయినొల్లె అప్పుడు ఏం జేసిండు. పోంగ పోంగ ఆ ఊరు బందూకు ఏ కులమైనగాని నా బిడ్డకు మాత్రం 12 సంవత్సరాలై వీపుల రాచపుండు పుట్టింది. మగ్గుతలేదు. దాన్ని మగ్గించి మనస్సుల కంకినోనికి నా బిడ్డనిచ్చి పెళ్లి చేత్త. నా రాజ్యాన్ని ఇస్తాను. తూర్పు బాజున బోర్డు పెట్టిండు. బోర్డు వదిలి సరే అని పాలు, పెరుగు, కొబ్బరికాయలు నైవేద్యం వండుకొని తూర్పు బాజున కోట శంబుని గుడికాడికి పోయిండు. ఆ గుడిలో ఏడాకుల మర్రి ఉంది. చుట్టూరా కోటశంబున గుడిల తిరిగి దేవుని మంచిగ కడిగి బొట్టుపెట్టి పూజ చేసి చేతులు దండం పెట్టి గుడెక్కి 7 ఆకుల మర్రి తీస్కోని సంచిల ఏసిండు. ఇగ రాజకుమారి దగ్గరికి పోయిండు. పానం పోయేటట్టు ఉంది. పెద్ద పెద్ద యోధులు, వైదికులున్నరు. ఈడు పిసోని తీరున్నడు. బారెడు బట్ట. చినికిపోయిన అంగి తువ్వాల. పోతే జరగయ్యా నేను చేత్తంటే పెద్దలు నువ్వేమో ఏం చేత్తవ్ రా అన్నరు. దొబ్బి పారెశిరు. అయితే రాజు దగ్గరికి వోయి ఒక వ్యక్తి ఎవని చేతిల ఏమున్నదో పోని, సంధి ఇచ్చినొల్లె లోపలికివోయి రాజకుమార్తె కాడ కూసున్నడు రాజకుమార్తె పెయి సల్లవడ్డది. 101 మంది అక్కడ ఉండంగ రాజకుమారి అటు ఉన్న మనిషి ఇటు తిరిగి ఆవుసలయిన ముఖం చూస్తుందట. సూసేవరకు అక్కడునోళ్లు అబ్బ! కోట్ల వైభవం మంది బిర్రివోయి సూత్తరు. ఏడాకులు తీసి పసరు నూరి రాచపుండు మీద పెట్టిండు. మొత్తం 8 రోజులు పెట్టెవరకల్లా ఆడగ్రహ పోయి రాజకుమార్తె మంచిగయింది.

అందరు ఎక్కడ్నుంచో భలే అల్లుడు దొరికండయ్యా! నీ బిడ్డా సచ్చిపోయేది. లేచింది. అని చెప్పి అయింత నీ వాగ్దానం ప్రకారం చేయి అన్నరు. ఊరూరి రాజులకు ఉత్తరాలు ఏసిండు. చిన్న చిన్న రాజులకు చిట్టిలు రాసిండు. పెద్ద పెద్ద రాజులకు పేపరు ఏసిండట. ఆకాశవాణి అంత పందిరి, బూదేవంత గద్దెలు ఏసి, మామిడి ఆకులతో వైభవంగా పెళ్లి చేసిండు రాజు. రాజ్యాన్ని ఇస్తే ఏల్తండు. ఇది ఇట్లుండగా 3 రొట్టెలకు ఆశ పడ్డ బ్రామ్మడున్నడుగ వాడు తిరిగి తిరిగి ఇందగ్గరికి అచ్చిండు. ఆన్ని చూసి వాని పానం ఎల్లిపెయింది. ఇగ బ్రామన్ని సూసి నిలువెత్తున లేసి పట్టుకుపోయి గజమెత్తు

పాన్పుపైన కూసుండ పెట్టి కాళ్లు కడిగి పూజ చేసి నెత్తి మీద పోసుకున్నడట. ఆనాడు 3 రొట్టెలకు నిన్ను నూతిల పారెత్తి. నువ్వ్ ఇంత పెద్దగ అయ్యాక అయ్యా! నువ్వు పారెత్నే నాకు గిట్ల అయింది. ఆ బ్రాహ్మణుడిని అక్కడే ఉంచుకొని మంచిగ చూసుకున్నడు. రాజ సత్కారుల చేసి పంపిచ్చిండు. ఈడు సక్కగ గంగావతి పట్నంవోయి రాజు పెట్టిన సొమ్ములు భార్యకిచ్చిండు. వారం తరువాత మల్ల చిలుకవాది పట్నం అచ్చి అతిథి మర్యాదలు చేసినంక రాజు రాజు బ్రామ్మడిని పంచాంగం చూడమంటే మీ అల్లునిది ఆవుసల కులం మీరు రాజులు అని పుసక్కని చెప్పిండు. మరి రాజు నీ బిడ్డను బతికిచ్చిండు. ఎవ్వడైతేమి అనుకోవచ్చుగ. అల్లునితో నువ్వ్ ఆవుసలోనివి నీ ముచ్చట మంచిగ లేదు. నువ్వ్ పీకు అని లొల్లి పెట్టిండు. మామకు, అల్లునికి తర్కటు పెట్టిండు. తిన్న రేవు తలవకపయే లొల్లి పెట్టిండు. సరే నేను ఆవుసొలోన్ని నా కులం దాచుకుంటలే. నువ్వ్ ఆవిధంగా బోర్డుల రాసినవ్. గనుక నీ బిడ్డనిచ్చి పెళ్లి చేసినవ్. నాది గంగావతి పట్నం నా దేశం నేను ఎల్లిపోతా నీ జాగల నువ్వ్ ఉండు. భార్య వాడు ఎవడైనా ఆయన నన్ను బతికిచింద్రు ఆయనే నా భర్త. ఆయనపోతే నేను పోతా. బిడ్డా! నువ్వ ఇద్దరి పొత్తుల ఘర్షణ పెరిగి ఇది నీ ఊరా? నా ఊరా? అని లొల్లి అచ్చింది. నీ ఊరు అంటున్నవ్ మామా మీ ఊరిలో ఒక 30 సంవత్సరాలు నువ్వ్ దాచిపెట్టిన ధనం నువ్వ్ సూపిత్తె అది నీ ఊరు, అది నేను చూపిత్తె నా ఊరు. నాకే ఇయాలని చెప్పి ఆళ్లు ప్రతిజ్ఞ చేస్తరు. దీనికి కావలసిన సొమ్ములు 30 బస్తాలు కొబ్బరికాయలు జంగాల పచ్చ ఊదుల బత్తిలు, 7 కరువాలు, 12 మంది బ్రామ్మన్లతో పూజ చేపిచ్చిండు. శనివారం ఆంజనేయు పూజ ఉంటంది. ఆంజనేయ కాడ శుద్ధి చేయించి ఆఖండ పూజ చేస్తున్నరు. బ్రామ్మన్లు కొబ్బరికాయలు కొట్టిద్రు. ఊదుపెట్టిద్రు. పూజ అయిన్నంక 7 కరువాలు తీస్కచ్చి ఆంజనేయ గద్ద కాడ విగ్రహం వెనుక పెట్టి ఒక్కటే సరి తన్నుమని ఎగిచ్చిండట. దెబ్బకు మగ గ్రహ ఎక్కడికో పోయింది. ఆనాడు ఆడగ్రహ పంపిచ్చిండు. ఈనాడు మగ గ్రహ పోయింది. ఆ హనుమాన్ల గద్దెకింత 30 నాగ బండ్ల ధనం ఉందట. వెండి బంగారం అంత విలువ కల్ల ధనం, బంగారం హనుమాన్ల గద్దె కింద ఉందట. చక్కు చక్కుమని మెరుస్తుందట. ఎర్రగా ఏర్పడుతుందట. రాజు అల్లుడి దగ్గరికి వోయి ముందు ఈ ధనం నువ్వ్ సంపాయిచ్చి పెట్టినవ్. అల్లుడు నాదే తప్పు. నన్ను మన్నించు. అని చెప్పి రెండు కాళ్లు పట్టుకున్నాడట. ఇగ మామ నీకు నాకు తర్జన మంచిగనే జరిగింది. నేను మా ఊరికి పోత. నువ్వ్ నీ బిడ్డ నా ఊరికి రమ్మన్నడు. ఇగ ఉప్పరోళ్లను పిలిపిచ్చి ధనమంతా తీసుకొని 30 బండ్లల పెట్టుకొని వీళ్లు తయారవుతుద్రు. ఈ 3 రొట్టెల ఆశపడ్డోడు

బ్రాహ్మడు. ఆన్ని నూతిల పారెత్త గంత దొరికింది. మరి నాకేం దొరుకతదో అని చెప్పి నూతిల దునికిండు. సోమనాళ్ల బావిల పడ్డవోళ్లె ఆ రోజు పులికి, నక్కకి ఆహారం ఏమి దొరకలేదు. నాలుగు అచ్చి ఆడ మల్ల మాట్లాడుతున్నయ్. అయ్యా! మరి నిన్ను తొలగిచ్చె, నను తొలగిచ్చె. అక్కడ పెద్ద పులి అటుపాయే, నక్క ఇటు పాయే ఇండ్ల కారకుడు ఎవరు అని నూతిల ఒకటే సారి నాలుగు సూసినయట. ఈడు మొద్దోడు బ్రాహ్మడు కనబడ్డడు. ఆన్ని గుంజుకొని నాలుగు బాగాలు చేసుకోని తిన్నయట ఆడు ఒడిసిపెయిండు. అతి కకృతే ఆన్ని అవి సంపినయ్. సిలుకవాది పట్నం తయారయి మామ, అల్లుడు, భార్య, 30 బండ్ల ధనం గంగావతి అచ్చి పిల్లలను, భార్యను కలుసుకొని మంచిగ 12 అంత్రల బంగ్లా కట్టి అందరు సుఖంగా బతికిర్రట.

## సోమనాల బావి – కథావిశ్లేషణ

ఇద్దరు స్నేహితులు గంగావది పట్నం నుంచి చిలుకవాది పట్నానికి పనికోసం బయలు దేరతారు. మార్గమధ్యలో ఆకలి వేసి వారు తెచ్చుకున్న జొన్నరొట్టెలు తింటారు. ఆ ఇద్దరిలో ఒక వ్యక్తి ఇంకొ వ్యక్తిని చంపడానికి పూనుకుని బావిల పడేస్తాడు. ఆ బావి పేరు సోమనాల బావి. ఈ కథంతా గొలుసుకట్టు కథన పద్ధతిలో ఆ బావి చుట్టే తిరుగుతుంది. ఆ బావిల పడ్డ తరువాత అతను కొన ఊపిరితో కొట్టుమిట్టుడతాడు. అదే సమయంలో అక్కడ నాలుగు రకాల పాత్రలు వచ్చి మాట్లాడు కుంటాయి. ఆడ గ్రహ, మగ గ్రహ, నక్క, సింహం నాలుగు రకాల పాత్రలచ్చి వాటి బాగోగులు మాట్లాడుకుంటాయి. అందులో ఆడగ్రహ మగగ్రహ అంటే జానపదుల నమ్మకాల ప్రకారం దెయ్యాల్లాంటివి అయి ఉంటాయి. ఆడ గ్రహ అనే దెయ్యం ఆ ఊరి రాజు గారి కూతురి మీద పూని సర్వభక్ష పరమాన్నాలు, రాజ బోగాలు అనుభవిస్తుంది. మగ గ్రహ ఆంజనేయ గుడి దగ్గర ఉండి భక్తులు పెట్టే నైవేద్యాలను తిని పొట్ట నింపుకుంటుంది. నక్క, సింహం పెద్దగా ఆకలితో ఉండవు. ఇగ ఆడగ్రహ, మగ గ్రహలు దెయ్యాల రూపంలో ఉన్న అవి వాటి స్థానాలను అక్కడ నుంచి వైదొలగడానికున్న రహస్యాన్ని చెప్పుకుంటాయి. ఆ రహస్యనంత విని బావిల పడ్డ విశ్వ బ్రాహ్మణుడు నీరు మింగి మునిగిపోతాడు. ఇంతలో అటువైపుగా గొర్లను కాయడానికి వచ్చిన గొల్లకాపరి సహాయంతో బావి నుంచి బయటికి వస్తాడు. అతడు విన్న విషయం ఆధారంగా రాజుగారి కూతురిని వేదిస్తున్న ఆడ గ్రహని, ఆంజనేయుని విగ్రహం దగ్గర ఉన్న మగ గ్రహని తొలగిస్తాడు. రాజు దగ్గర బహూమానంగా రాజు కూతురిని వివాహం చేసుకున్నాడు. అంత బాగుందనుకుంటే మళ్లీ ముందు

నూతిలో పడవేసిన బ్రాహ్మణుడు మళ్లీ వచ్చి రాజుకు, విశ్వబ్రాహ్మణుడికి కుల బేధముందని వైరం పెట్టిచ్చి వెళ్లిపోతాడు. రాజును అవమానపరచి విశ్వబ్రాహ్మణుడు ఒక సవాలు వేసి మరి రాజుని ఓడిస్తాడు. రాజుని, రాజు బిడ్డని తీసుకొని గంగావది పట్నం పోయి హాయిగా బతుకుతాడు. ఇగ బ్రాహ్మణుడు అత్యాశకి పోయి బావిల పడతాడు. అదే సమయంలో అక్కడకచ్చినా నాలుగు రూపాలు ఆడ మగ గ్రహలు కోపంతో, సింహ, నక్క ఆకలితో వాన్ని చంపి తింటాయి.

1. చిలుకవాది పట్నం అనే ఈ కథలో సోమనాల బావి ప్రధానంగా కనిపిస్తుంది. జానపదుల నమ్మకాల ప్రకారం ఊరి చివర పాడు బడ్డ ఇల్లులుగాని, మూసివేయబడిన బావిలో గాని, చింత మర్రి చెట్ల తోర్రల్లో గాని దయ్యాలు, భూతాలు సంచరిస్తాయని నమ్ముతారు. అటు వైపు వెళ్లినవారిని పట్టి పీడిస్తాయని, నానా ఇబ్బందులకు గురిచేసి అనారోగ్యపాలు చేస్తాయని మూఢ విశ్వాసాలతో జానపదులు జీవనం సాగిస్తారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బలంగా నాటుకున్న ఇలాంటి సంస్కృతుల జాడలు కనిపిస్తాయి. ఇలాంటి ఆరోపణలేగాని ఆధార సహితంగా నిరూపించిన ధాఖలాలు ఎన్నడూ కనిపించలేదు. మంత్రదండాలు, తాయిత్తులు, పసర్లు, రాచపుండ్లు, మంత్ర విద్య, భయంకరమైన నామాలతో మనుషులు వేషాలు వేసుకొని తాంత్రిక ప్రయోగాలు చేస్తున్నట్లు గ్రామీణ ప్రాంతంలో అక్కడక్కడ కనిపిస్తాయి. కాబట్టి ఇలాంటి ప్రచారాలున్న ప్రాంతంలో ఈ కథ ఆవిర్భవించి ఉంటుంది.
2. ఏదొక చారిత్రక ప్రాధాన్యత ప్రాంతంలో సోమనాల బావి ఉండి ఉంటుంది. కథాకల్పన చేసిన అక్కడ జరిగిన సంఘటన ఆధారంగా ఈ కథ జనించి ప్రాచుర్యంలో వ్యాప్తి చెందింది. మిత్రుడు చేత మోసపోయి బావిలో పడిన విశ్వబ్రాహ్మణుడు ఆడగ్రహ, మగ గ్రహల సంభాషణలు వింటాడు. ఆ ఊరిలో రాజు కూతురికి ఉన్న అవస్థను గమనించి, ఆమె రాక్షసపుండుతో తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతుందని తెలుసుకుంటాడు. దానికి గల కారణం ఆడ గ్రహ గ్రహించి ఆడ మగగ్రహకి చెప్పిన రహస్యాన్ని విని శంభుని గుడికి వెళ్లి పూజ చేసి ఏడాకుల మర్రి పసరు సంపాదిస్తాడు. ఆ పసరు రాణి రాక్షసపుండు పై పోసి ప్రాణాలతో బతికిస్తాడు. పేదవాడిగా ఉన్న విశ్వబ్రాహ్మణుడు రాజు దగ్గర బహుమానాలను పొంది భార్యకిచ్చి శ్రీమంతుడవుతాడు.
3. సమాజంలో ఉన్న కులవ్యవస్థ ప్రస్తావన కూడ ఇక్కడ కనిపిస్తుంది. పల్లె ప్రాంతాల్లో కులవ్యవస్థ మహావృక్షంగా పాతుకుపోయింది. ఈ కథలో రాజు కూతురుని కాపాడిన వారికి యువరాణిని ఇచ్చి వివాహం చేస్తానని రాజు ప్రకటిస్తాడు. మాట ప్రకారమే విశ్వబ్రాహ్మణుడు రాణిని కాపాడి, వివాహం

చేసుకుంటాడు. రాజ్యపాలనను కొనసాగిస్తాడు. కాని మూడు రొట్టెలకు ఆశపడిన బ్రాహ్మణుడు వచ్చి, రాజుకు మీ అల్లుడిది రాజుల కులం కాదని శూద్రుడని చెప్తాడు. అది విన్న రాజు తక్షణమే అల్లుడిని రాజ్యం విడిచి వెళ్లమని ఆదేశిస్తాడు. ఈ విధంగా అగ్రకులానికి చెందిన వారు నిమ్నవర్గాల వారిని తరతరాలుగా అణచివేతకు గురిచేయడానికి ప్రయత్నం చేస్తారని రాజు రాజ్యబహిష్కరణ చేసి నిరూపించుకున్నాడు. రాజులు అగ్ర వర్గాలకు చెందిన వారు సాంప్రదాయంగా బ్రాహ్మణ వర్గాల వారి సిద్ధాంతాలను పాటిస్తారు. వారి వాక్కు దైవ వాక్కుగా శిరసావహిస్తారు. సామాజిక పరిణామంలో బ్రాహ్మణ వర్గం వారి భావజాలానికి ప్రభావితమైన సమాజం నేటికి కనిపిస్తుంది. వారి భావజాలం వల్ల ఎందరో లాభపడ్డవారైతే మరెందరో అణచివేయబడ్డ వారు లేకపోలేదు. ఈ కథ వల్ల జానపద కథల్లో కూడా అస్థిత్వ పోరాటం కనిపిస్తుంది.

4. బ్రాహ్మణుడు నీతిగా నిజాయితీగా బతకాలనికున్న విశ్వబ్రాహ్మణుడికి నిరంతరం చెడు చేయాలని చూస్తాడు. కాని ఎంత చెడు తలపెట్టినా విశ్వబ్రాహ్మణుడికి అంత మంచి జరుగుతుంది. చివరకు సోమనాల బావికాడ ఏదో అదృష్టం వరిస్తుందని పోయి తాను తవ్విన గోతిలో తానే పడ్డట్టు ప్రాణాలను పోగొట్టుకుంటాడు. మంచిపై చెడు ఎన్నటికీ గెలవదని నిరూపించాడు విశ్వబ్రాహ్మణుడు.
5. సాంఘిక సమస్యగా కుల అణిచివేత కనిపిస్తే సాంస్కృతికాంశంగా ఊరి చివరన ఉన్న శంభుదేవుణ్ణి, ఆంజనేయుణ్ణి పూజించడం కనిపిస్తుంది. ఆ పూజ కూడ ఎన్నో విధానాలతో ఉంటుంది. 30 బస్తాలు కుంకుమ, పసుపు, ఊదు, కొబ్బరికాయలు మొదలైన పూజ సామాగ్రితో పూజ చేసే విధానాన్ని సైతం కథకుడు సరిగ్గా వివరించాడు. ప్రతి గామాల్లోనూ ఊరి చివర ఆంజనేయుడి దేవాలయాలు, మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ వంటి దేవాలయాలు కనిపిస్తాయి. ఊరి చివరన ఉండి ఊరంతటిని రక్షించే దేవుళ్లుగా ప్రజలు నమ్ముతారు. సంవత్సరానికి ఒకసారి జాతరలు, వేడుకల పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రజలందరు ఎంతో ఆనందంగా పాల్గొని విజయవంతం చేస్తారు.

## 2.5.1.7 బ్రాహ్మణుడి ఇంటి దూలం

జాడి రాజన్న, ఆరపల్లి గ్రామం, ధర్మపురి మండలం.

ఒక బ్రామ్మడు ఏం చేసిండు. గృహప్రవేశం అవి ఇవి అన్ని చేసింది బ్రామ్మడు. అన్ని చదివి పెద్దోడు అయిండు. ఒక ఇల్లు కట్టుకోవాలని కోరిక పడ్డది. 12 తులాల ఇల్లు కడుతడు. కట్టెవరకు ఆ గోడలేసినయ్. అన్ని తయారయినంక దూలాలు గావాలి. జంగల్కి వోయి దూలలు తెచ్చిండు. అన్ని

గదులు వేరే, పూజ గదికి మంచి దూలం వేసి ఇల్లు కట్టిండు. 12 సంవత్సరాలైంది. ఇల్లు కట్టి ఒక రోజు పూజ చేసుకుంటున్నపుడు ఆ దూలం సర్రుమని అంగింది. అగో! కట్టె గిట్లెందుకు అంగింది. ఇళ్లు కూలపోతంది. ఏంది అని ఊళ్లెకు పోయిండు. నలుగురిని తీస్కచ్చిండు. నలుగురిని తీస్కచ్చి సపోటు వేపించి మంచిగ చేసుకుందామనుకుంటడు. వందమంది అచ్చిర్రు. దూలాన్ని పైకేసి వొత్తుతుర్రు. వొత్తంగనే ఆ దూలం పెద్ద నాగ సర్పమయింది. నూరు మందిని కాటిచ్చింది. దూలం పెద్ద నాగ సర్పమయింది. నూరు మందిని కాటిచ్చింది. బుసలు కక్కి సనిపోవుటానికి ఉండే ఆ పాము జంగల్ల పడిపోతుంది. ఈ బ్రామ్మడు చూసిండు. అరె! నా ఇంట్ల దూలం అంగిందని పూనుకుంటే గీ పాము మాయం అయిపయే నూరు మందిని కరిసిపోతుంది. ఆ పాము ముందట ఈ బ్రామ్మడు ఎనుక పోతుండు. జంగల్ ప్రాంతంలో పోంగ పోంగ ఒక గుట్ట దడకు లంబడైన వంద గొడ్లను కాత్తుండు. కాసేటివరకు ఆడికి పోయి పడిగెత్తి, ఇట్ల చూసింది. ఆడ పాము మటుమాయం అయింది. పులైంది. పులై ఆ నూరు గొడ్ల మీద పడి కొరికేసింది. ఈ బ్రామ్మడు చూసిండు. అరె! నా ఇంట్ల దూలం అంగెన్ అని చెప్పి నేను నూరు మందిని తీస్కచ్చి నూరు మందిని, ఇక్కడ గొడ్లను సంపె. అండ్ల ఒకన్ని నేను నన్ను సంపుతేమవ్ అని దాని వెంబడె పోతుండు. అది గొడ్లను కొరికిపోతుంది. ఇది ఏంటిది కావచ్చు ఏం జేత్తది. పోంగ పోంగ అందుట్ల గొల్లోని వంద గొర్రెలు మేపుతుర్రు. ఆ గొర్రెల కాడికిపోయి ఇట్ల సూసింది. పులి అవతారం పొడమరిసి తోడెలు అవతారమై నూరు గొర్లను కొరికి సంపింది. సంపినవోల్లె ఈ బ్రామ్మడు సూసుకుంటనే ఉన్నడు. అరె నా ఇంట్ల దూలం అంగెన్ అని చెప్పి అనుకుంటే గిట్ల జరిగె. నన్నెందుకు చంపలె! అనుకుని వెంటపడి పోతుండు. పులి మల్ల జంగల్ల పడిపోతుంది. తోడెల్లు ఏమయితదో ఇది పోంగ పోంగ పోయేవరకు జన్నారం లక్షెటిపేట అసొంటి రోడ్డు మీద నిల్సుంది. తోడేలు అటు ఇటు బాగా సూసి తోడేలు అవతారం పొడమరిసి సక్కటి కన్య అవతారమై నిలుస్తుంది. ఈయన ఇప్ప చెట్టు సాటుకు దాక్కుని సూత్తుండు. అక్కడ నిల్సొని నాకు భర్త లేదు నాయ్యా! నాకు అన్నదమ్ములు లేరు నాయ్యా! నేను ఎవల నీడకు బతకాలి నాయ్యా! నను ఎందుకు పుట్టించిండే? శంకరుడు. నా అవ్వ అని అగలు ఏడుపు ఏడుత్తుంది. ఇది ఏడుసుకుంట ఉంటే ఇద్దరు అన్నదమ్ములు బొంబాయి పోయి 12 పన్నెండ్లు నపరి ఓ రెండు లచ్చలు సంపాయించుకున్నరట. నపరొక తుపాకి కొనుకున్నరట. తుపాకి కొనుకొని ఏం చేసిండు. గదంటే తమ్ముడా! మనం ఇంటికి పోయి చెరొక భార్య సూసుకుని పెళ్లి చేసుకుందాం అనుకున్నరు. బొంబాయి నుంచి లక్షెటిపెట అత్తురట. రాంగ జన్నారం

దిగి అయింత చెరొక సంచి జబ్బకు ఏసుకున్నరు. సక్కగ నడిసి అత్తరు. రాంగ ఈ అమ్మాయి ఏడుపులు ఇన్నరు. విని ఆమె దగ్గరికి వోయి అమ్మా! నిన్ను ఎవ్వడన్నా కొట్టిండా? మాన భంగం చేసిండా? ఎందుకు ఏడుతున్నవ్? అడిగి(రట. అడిగితే ఎవరు కొట్టలేదు. తిట్టలేదు గని బాపు నాకు కన్న తల్లిదండ్రుల్లేరు. అన్న దమ్ములు, వదినెలు లేరు. ఎవ్వరు లేరు. నేను ఎవరి నీడకు బతకాలని ఏడుతున్న. అయ్యా! అని చెప్పి ఇద్దరు అన్నదమ్ములకు ఈ ముచ్చట చెప్పిందట. మేం కూడా పెళ్లి చేసుకోవాలని కోరికతోనే వస్తున్నం. ముంబాయి నుంచి నేను అన్న ఉన్నడు. పెద్దోడు మా అన్న పెండ్లి చేసుకుంటడు. పెద్దోడు అంటే సరే చేసుకుంట అన్నది. ఏమయిందంటే ఆమె లగ్గం చేసుకుంట నాకు దూప బాగా అయితుంది. మీరు ఎక్కడ నీళ్లు ఉంటే అక్కడ వోయి చెంబు నీళ్లు తీస్కచ్చి ఇయ్యి(రి. ఆ నీళ్లు తాగి మీ వెంబడచ్చి పెళ్లి చేసుకుంటా అని చెప్పిందట. నువ్వ్ ఈడ ఉండు చెంబువట్టుకొని అయింత ఒ(రెకు పెయిండట. చెలిమిల నీరు తోడి పట్టుకొని అచ్చిండట. ఈమె తాగి అన్నదట. అయ్యా! నువ్వ్ నీళ్లకు వొయిన కింద పెడితే తాగుత లేకపోతే తాగ. నువ్వ్ నాకు బావవి నేను మాత్రం తాగ అని తమ్మునితో అన్నవొల్లె. ఆడు నీళ్లు కిందవెట్టినోల్లె తాగిందట. ఇద్దరు అన్నదమ్ములకి రేషం పుట్టిందట. నేను చేసుకుంట నన్ను బావని అన్నది. గాడిద కొడుకా! మోసం చేయనే చేసిండు. అరె! గాడిది కొడుకా! నిన్ను సంపెపడెత్త అని చెప్పి అంటడు. అవన్ని బ్రామ్మడు ఇంటడు. అప్పుడు అయింత ఏం చేసిండట వీని దగ్గరున్న తుపాకి తీసుకున్నడట ఆన్ని ఎద గుండెల సూటి పెట్టిండట. అరె! నేను ఏం చేత్తి నీ భార్య గిట్ట చేసుకుంటనన్ననా. ఏం తప్పిదం చేయాలె. వీడు నాకెందుకు సూటి పెట్టిండు. నేను ఊకుంటానా? నా దగ్గర లేదా తుపాకి వీడు సూటి పెట్టి ఇద్దరు ఒకేసారి పేల్చెసరికి వాని దెబ్బ వీనికి, వీని దెబ్బ వానికి తగిలి సచ్చిపోయి(రు. శవాలై పొయినొల్లె ఈ బ్రామ్మడు గిరగిర ఉరకచ్చి రెండు కాళ్లు వట్టుకుని అమ్మా! మీరెవరు అన్ని జీవులను ఎందుకు సంపి(రు. నా ఇంట్ల దూలమనుకున్న నాగుపాము, పులి, తోడెలు, కన్య అవతారాలు ఎత్తినవ్. నువ్వ్ 302 జీవనాలు తీసినవ్. అండ్ల నేను ఒకన్ని నన్ను ఎందుకు సంపలేదు. కాల్లు వట్టుకుని అడిగిండట. ఆమె చెప్పిండట బిడ్డా! నేను పూర్వం శంకరుని బిడ్డని అయితే ఒక మునీశ్వరుడు శాపం ఇచ్చిండు. నువ్వ్ జంగల్ల ఒక చెట్టు అయి పన్నెండు సంవత్సరాలు ఉండి పోదువు గాక అని శాపం ఇచ్చిండు. ఆకాన్నుంచి బ్రాహ్మణుడు కొట్టుకచ్చి ఇంట్ల దూలం పెడతడు. పెడితే 12 సంవత్సరాల అయినంత దూలం కిందికి స(రని అగాలి. నూరు జీవులను యమ పాశానికి పంపాలి. మొత్తం 302 జీవనాలు యమకచ్చీరు పంపిస్తే నీ శాపం తీరుతదని చెప్పి మునిశ్వరుడు

శాపం పెట్టిండు. అందుకొరకు ఈ జీవనాలు చంపిన. నా శాపం పోతది. నేను శంకరుని దగ్గరికి పోత నా తండ్రి దగ్గరికి పోత అని బ్రామ్మనికి చెప్పింది. వీడన్నడట గదంటే అమ్మా! నీ పాదాల యందె పూజ చేసుకుంట. నీ వెంబడత్త నేను మాత్రం అసలే వొదలని వీడన్నడు. బిడ్డా! నేను ఎక్కడ ఉంటనో నువ్వ్ మాత్రం నాతో అచ్చుటానికి రాలేవు రావు. నీతో కాదు నేను పోత బిడ్డ కాలిడు. వీని దగ్గర రెండు, వాని దగ్గర రెండు లచ్చలు పట్టుకొనిపోయి దూలం తెచ్చుకుని మంచిగ ఇల్లు కట్టుకొని బతుకు అంటే పాదాలు మొదలె ఇడత్తలేదు. ఇడకుంటే సరే అత్తివి గని ఒక ముచ్చట చెప్త విను అన్నంక కాల్లిడిపిచ్చి అయ్యో! బావనయ్య గట్ల ఒవలో అత్తరు గవెంటి అని చెప్పి చూడమన్నదట. అన్నవొల్లె ఈని మనసు ఏం చేసింది. అటు పోయింది. ఆమె అదృశ్యమై కనబడకుండా పోయింది. ఆమె జాగల ఆమె పోయింది. ఈడు నాలుగు లచ్చలు పట్టుకుని ఇంటికచ్చి ఓ దూలం కొట్టుకచ్చి మంచిగ సపోటు ఏసి, ఇల్లు కట్టుకొని అదే ఇంట్ల పూజ చేసుకుంటున్నడు.

## బ్రాహ్మణుడి ఇంటి దూలం – కథావిశ్లేషణ

ఒక బ్రాహ్మణుడు తన ఇంటి నిర్మాణానికై అడవి నుంచి కర్రని తెచ్చుకుంటాడు. ఆ కర్రతో ఇంటికి అవసరమైన తలుపులు, దూలాలు చేయించుకుంటాడు. రోజు వారి పూజ వ్యవహారాల కోసం ప్రత్యేకంగా పూజగదిని నిర్మించుకున్నాడు. ఆ పూజగదిలో దూలానికి మంచి కర్రని చేయించు కుంటాడు. సరిగ్గా 12 సంవత్సరాల తరువాత ఆ దూలం విరిగి వంగిపోతుంది. ఆ బ్రాహ్మణుడు దూలాన్ని సవరించడానికి తెచ్చిన 100 మందిని నాగసర్పమై దూలం కాటేసి చంపుతుంది. తరువాత అక్కడి నుంచి మాయమై అడవిలోకి వెళుతుంది. దాని వెంబడి బ్రాహ్మణుడు కూడా వెళతాడు. వంద మందిని చంపి నన్ను మాత్రం ఎందుకు చంపలేదని విచారిస్తాడు. మళ్లీ ఆ నాగసర్పం పులి రూపమై అడవిలో 100 పశువులను చంపి తింటుంది. అక్కడ నుంచి పయనమై తోడేలు వేషమై 100 గొర్లను తింటుంది. ఆ తరువాత కన్య రూపమెత్తి అన్నదమ్ములు ఇద్దరు ఒకర్నొకరు చంపుకునేలా చేసింది. ఇంటి దూలం పలు రూపాలుగా మారి, మొత్తం మీద 302 ప్రాణాలను తీసుకొని శాపవిముక్తిని పొందుతుంది.

1. గత జన్మలో ఒక స్త్రీ తనకు కలిగిన శాపానికి విముక్తి చేసుకోవాలని అనుకుంటుంది. తన శాపవిమోచనానికి 302 ప్రాణాలను యమలోకానికి పంపించాలని విధి ఉంటుంది. అడవిలో ఒక వృక్షం రూపంలో ఆవిర్భవించి మనిషికి కర్రగా ఉపయోగపడి తాను అనుకున్న రూపంలోకి మారి

302 ప్రాణాలను పొట్టన బెట్టుకుంటుంది. అలా శాపవిముక్తి కలిగించుకొని తిరిగి తనలోకానికి వెళుతుంది.

2. ఈ కథ పూర్వ జన్మ ఫలితాల వల్లే తదుపరి జన్మలు ఉంటాయని ప్రజల్లో పాపభీతిని కలిగించడానికి చెప్పే కథలు లాంటిది. పాపాలు చేయడం వల్ల నీచమైన జన్మ ఎత్తి నానా కష్టాలు అనుభవించాల్సి ఉంటుందని హితబోధన చేస్తుంది ఈ కథ.

3. ఈ కథలో ఇద్దరు అన్నదమ్ములు ముంబాయి వెళ్లి 12 సంవత్సరాల్లో బాగా సంపాదించుకొని వస్తారు. ఈ ప్రాంత ప్రజల వలస జీవన విధానాన్ని చిత్రించినది ఈ కథ. ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం వివిధ దేశాలకు, రాష్ట్రాలకు, ప్రాంతాలకు వలస వెళ్లడం అనివార్యమైంది. ఈ వలసలు నేటికి మనకు ఈ ప్రాంతాల్లో కనిపిస్తుంది. ముఖ్యంగా యుక్తవయస్సులో ఉన్నవారు వలసవెళ్లి వచ్చి కొంత డబ్బుని సంపాదిస్తారు. ఆ తరువాత వచ్చి వివాహ కార్యక్రమాలను చేసుకుంటారు. పెళ్లి చేసుకోవడానికే మేం ముంబాయి నుంచి వచ్చామని కథలో ప్రస్తావించడం కూడా జరుగుతుంది. ఈ ప్రాంత పరిసరాల్లో పారిశ్రామిక వ్యవస్థ అంతగా అభివృద్ధి చెందలేదు. దాంతో యువతకి ఉపాధి దొరకక వలసబాట పట్టడం వారి జీవితాల్లో అనివార్యమైంది.

## 2.5.2 మత, ఆధ్యాత్మిక కథలు

## 2.5.2.1 చిరుతొండ రాజు కథ

బండ్ల కనకమ్మ, తాళ్ళ ధర్మారం గ్రామం, జగిత్యాల జిల్లా.

అయితే రాజు పాంచాలపురం. ఆ ఊరు పేరు పాంచాలపురం. రాజు చిత్తుండరాజు. చిత్తుండ రాజు భార్య సుకులదేవి. ఆ సుకులదేవి కొడుక లేక లేక లోకపుత్రుడు. సృష్టి కిందికి సిరిపాదం మీదికి కోటొక్క పూజలు, కోటొక్క మొక్కులు. ఎదురైన బండకు, ఎదురైన గుండుకు మొక్కరాని మొక్కులు మొక్కి పట్టరాని తపసులు వట్టి ఆ కొడుకును కన్నరు. కంటే ఆ దేవుడు పత్యక్చమైందు. పన్నెండ్లకు. పత్యక్చమై ఏమన్నడు. అరెయ్.. నీకు ఏటి మీద ఎడ్లు, పాటి మీద బర్లు, అర్ద బంగలాలు, అద్దాల మేడలు నీకు సమస్తం ఇచ్చిన నేను. రాజ్యపాలన చేసినవ్ నువ్వ్..! రారాజుకు అరవై జిల్లాలు నూటొక్క కిరిటాలు, బుజకీర్తులు పెట్టుకుని నువ్వు రాజ్యం ఏలినోడివి. నీకెందుకు రా ఇంత బాధతోని కట్టపడతున్నవ్. సుష్టి కిందికి సిరిపాదం మీదికి పన్నెండ్లు తపసు పట్టినవ్. నీకేం కట్టమచ్చింది రా... చిత్తుండ అని పరమతండ్రి అడిగిండు. అడిగితే ఆ బగవంతుడు అడిగితే ఏమంటుడటా? అయ్యా! నాకు

ఏటి మీద ఎడ్లు, పాటి మీద బర్లు, అర్ధ బంగలాలు, అద్దాల మేడలు అయ్యా ఎక్కసూడ లక్కమేడలు ముసలి గొయ్యలు మున్నురు మంది. పడుసు గొయలు పదివేలమంది. కొట్లాది కోట్ల ధనం ఎన్నున్నయి గాని నాకు సంతానం లేదు అని అచ్చినయి. సంతానం లేదని నేను తవుసుకు అచ్చిన అని ఆ దేవునితో మాట్లాడితే ఆ దేవుడు అన్నడట అరె.. నీకొక కొడుకునిచ్చిన ఇంటికి పోయేవరకల్లా నీకొక కొడుకు బుడుతడు. తొమ్మిది గడియాల్ల అని చెప్పిండట. చెప్పినొల్లే ఆయన ఇంటికచ్చి ఆ తొమ్మిది గడియల్లనే కొడుకు పుట్టిండు. ఆ కొడుకు పేరు ఆ దేవుడే అచ్చి ఈయన సత్యశ్రియాల (సిరియాళ) అని దేవుడు పేరు పెట్టిండు. సత్యశ్రియల అని పేరు పెట్టేవరకు ఏం అంటుండు. అబ్బ! ఎండి కోట, బంగరు కోట. పైడి కోట అన్ని కోట్ల ధనం పంచి పెట్టాలని ఆల్ల తాతలు ముత్తాతలు చెప్పి సచ్చిపోయిరట. సచ్చిపోతే ఆయన భార్య అన్నదట. నువ్వు ఎండి బంగారు కోట రాగి, ఇత్తడి ఏడు కోటల ధనం పంచి పెడితే మనం గరీబులం ఐతం. మనం పంచిపెట్టదని భార్య మాట విని ఆయనే అట్లనే ఉన్నడు. అట్ల తల్లిదండ్రులు సచ్చి పన్నెండ్లయింది. పన్నెండ్లకు నువ్వు భార్య మాట విని నువ్వు పంచి పెడతలేవా అని చెప్పి ఒకనాడు ఆ కచ్చీరులో వోయ వచ్చి అన్నం తిని అన్న కూర్కు తీస్కుంటానని పంటే ఆ నిద్రలో తండ్రి కలలో వచ్చి గట్టిగ చెంప దెబ్బలు కొట్టిండట. నేను పంచి పెట్టమంటే నువ్వ్ పంచి పెట్టలేదా కొడుకా! నీ భార్య మాట విని బతుకుతున్నవ్ రా కొడుకా...! అన్నడట. అన్నవోల్లే అబ్బ! తెలివి వద్దది. చెంప దెబ్బ నుంచి తెలివడి భార్య దగ్గరికి వోయి నీ మాట విని నేను పన్నెండేండ్లు ధనం, దాన్యం పంచి పెట్టమంటే నేను పంచి పెట్టకుంటి పంచి పెట్టకుంటే నా తండ్రి ఆత్మ ఈనాడచ్చి నను కొట్టింది. నీ మాట ఇన ఇప్పుడు లక్కకుండ ఎక్కుత. లక్కకుండ చుక్కలకు అంటగట్టి అప్పుడు కరెంటిల్లు లేవు గద. ఆ లక్కకుండా గట్టి ఆ లక్కకుండ ఎక్కి దెబ్బ గొడుతుండు. రనం దెబ్బ కొడితే అరవై ఆరు జిల్లాల మొత్తం మందికి రనం దెబ్బ మోగింది. మోగినొల్లే మన రాజు పిలిసిండు అని చెప్పి అరవై కోట్లమంది అరవై జనుల మంది మొత్తం నడ్సుకుంట అచ్చి ఎనుగుల మీద గుర్రాల మీద వచ్చి అయ్యా! మమల్ని పిలిసిన పని ఏందని అడిగిర్రట. అడిగితే ఏం లేదు నేను ఎండికోట, ఇత్తడికోట, రాగికోట, బంగారుకోట ఏడు కోటల ధనం ఈల్లకు పంచి పెడతానని చెప్పినడట ఆళ్లకు. పంచి పెట్టి కాకి రెక్క వడ్లు కాంభోజనాలు, చిలుక ముక్కు వడ్లు చిన్నసరవడ్లు. కాకిరెక్క వడ్లు కాంబోజనాలు, చిలుకముక్కు వడ్లు చిన్న సరవడ్లు. అరవై పుట్ల వడ్లు గిర్నిల్ల సప్పుడు, గిర్నిల్లు లేక మాను కింద రోలు మానుడు అగ్గవై, ఆకిట రోల్లు అడ్డడు అగ్గువై సూరికింద రోలు తూముడు అగ్గవై కోట్లాది కోట్లు కైకిల్లు పెట్టి అడ్లు

దంచిపెట్టి పంచి అన్న సంతార్పణలు పెట్టుకుంటా అన్ని దుప్పట్లు పర్సుకోండి అని దుప్పట్లు లేక దుప్పట్లు, పంచెలు ఇచ్చుకుంట ధనం, ధాన్యం మొత్తం పంచిపెట్టిండట అరవై జనుల మందికి. అరవై జనుల మంది భోజనం తినుకుంటా అన్న సంతార్పణ పట్టుకుని ఆ ధనం, ధాన్యం వట్టుకుని పోయిండ్రట. పోతే ఆ దేవుడికి మాల్య అయిందట. అబ్బ! గీడు నేను పుట్టిత్తే పుట్టిన నరుడు ఈడింత సంపాదననుందా? ఈడికింత పంచి పెడతడ. ఈడు రేపు సచ్చిపోయేటోడు. నేను పిలిత్తే వచ్చేటోడు. నేను తోలిత్తే పోయేటోడు. గీడికెక్కడిది అంత పెద్దరికం అని దేవునికి మాల్యం అందింది. ఆయనకో జంగమేసం ఏసుకొని అచ్చిండట. జంగమేసంలో వచ్చి వీపులో రాచపుండు, ముక్కుకు సున్నారు, కాళ్లకు మట్టి పెట్టుకుని ముక్కు ఊడితే పానం పోయే వేశం మీద వచ్చి ఆ కచ్చీరు కింద ఉండి అయ్యా! దూప దూప అంటుండట. దూప దూప అనంగ ఆ కచ్చీరు మీదుండి అక్కడుండి నాకు దూప అంటేనూ అయ్యా! నీకు ఇనత్త లేదా అంటుండట కింద నుండి. ఆయనేమి అంటుండట. అబ్బ! ముక్కూడితే పానం పోయేటట్టు అంత గలిజు వేసమీదచ్చి నను ఏంది నీళ్లడుగుతుండని ఆ తంతెలు దిగుకుంట కిందికచ్చిండట. ఆ తంతెలు దిగుకుంట కిందికచ్చి ఏమంటుండు. ఏంగావాలి బిడ్డాంటే నాకు దూప అయింతుందని అన్నడట. నీళ్లు పట్టుకుని అత్తుండట. అయ్యో! నీకు నీళ్లెక్కడ లేవంటే? కాసికి పోయిన కైలాసం పోయిన, తిరుపతికి వోయిన, బద్రచలం ఇరువది నదులు తిరగబోయినగాని ఈ దూపకు నీళ్లిచ్చెటోడు ఎవల్లేరు. పలనా పాంచాలపురం చిత్తుండ రాజు మా రాజు పుణ్యమూర్తి, సత్యంతుడని అరవై జనులకు ఎండి, ఇత్తడి, ఇనుము, రాగి కోటని ఎండి బంగారం పంచి పెట్టిండట. మాం పుణ్యవంతుడు కాశీలో అయ్యలు చెప్పింద్రు. అయ్యలు చెప్పితే అయ్యల మాట విని రాత్రి, పగలు నడుసుకుంట అచ్చిన ఇంత రోగంతో.. నువ్వ్ నాకు సల్లని నీళ్లు, తెల్లని చరుకులో పోను మున్నూట అరవై ఆమడ, రాను మున్నూట అరవై ఆమడ ఆ తెల్లని చెరకులో కాల్లకు చెప్పులద్దు, నెత్తి మీద గొడుగద్దు పోవాలె. ఆ తెల్లని చెరుకులో గుట్టెక్కాలి. అవి తిరగాలి. అవి భుజం మీద పెట్టుకుని తేవాలి. తెచ్చి ఆడ వెట్టి నా చెంగులో పోయాలి. అప్పుడు నేను తాగాలి. అప్పుడే నువ్వు పుణ్యమూర్తి కొడుకా...! నాక్కు పోత్తావా అంటే అయ్యా! తప్పకుండ వోత్త. నా పానాన్ని కూడా కోసిపెట్టమన్న పెడత. గా నీళ్లదో లెక్కన? గీ తెల్లని చెరుకులోది ఓ లెక్కన..! అని ఆ పుండు బూసుల్లోని ఉన్నోన్ని భుజం మీద ఎత్తుకొనివోయి భార్య సుకులదేవిని పిలిసి ఏడేడు మేడల్ల ఉన్నదని పిలిసి ఈయనకు ఆన్నీళ్లు ఈ నీళ్లు ఉడుకునీళ్లు సల్లగా తొర్లించి ఈయనను పెసరపిండి కట్టి పొయ్యి వల్లబెట్టి నువ్వు పిండికట్టి నొసట్ల రాసి

మంచిగ శుభ్రంగా కడిగి నీళ్లు మందుల కట్టి ఆ కాళ్లకట్టుకో మెత్త, తలకో మెత్తేసి డెబ్బె గురుల దేవానందులు పెరుగు, అరవై కూరల అల్లం పచ్చడితోని భోజనం చేపిమని చెప్పి ఆ కాసి మీద కాసి హనుమంత కాసి అని దిండు మీద దిండు మీద హనుమంత దిండు పోసి ఇగ బయలెల్లుతుండు తెల్లని చెరుకులోకి. ఎవలు చిత్తోండ రాజు. చిత్తోండ రాజు తెల్లని చెరుకులోకి రసం తెత్తనని బయలెల్ల వరకు ఈడికివోయి ఒక మైలు దూరం వోయే వరకు ఇగ ఏం కాజేత్తుండు. ఇక్కడనే ఉండి భార్య అరుసుకుంటనే ఉంది. పుండుకు మందులు కట్టింది. తానం పోసింది. అన్ని చేసుకుంట ఉన్నది. ఈడిట్ల ఉన్నంట్టే ఉన్నడు. పోయేటోనికి ఏం మాయ జేసిండు. ఉత్తరాన ఉరుము పుట్టింది. పడమటి గాలి తూర్పునకు ఇసిరింది. పడమటి దిక్కున మెరిసింది. తూర్పు గాలి పడమటికి ఇసిరింది. ఇటు చెట్లు ఇటు ఇరిగినయి. అటు చెట్లు అటే ఇరిగినయి. తొవ్వకు పోరాకుంట చెట్లు ఇరిగినయి. ఇరిగి రాళ్ల వర్సం కురుస్తుంది. రెండు గంటలు రాళ్ల వర్సం కుర్సింది ఆయన మీద. ఈడు మత్రత్తడా? ఈడు నీయతిగా పోతడ? ఈడికి ఇట్ల జేత్తని మెరిసినంకనే తొవ్వ కనబడుతుంది. అరె ఎట్ల కామడి ఎత్తు కొట్టుకు బోతుండు. చెట్లల్ల తట్టుకున్నడు. ఏం అంటుండు. ఓ భగవంత ఇది నీ మహిమే తండ్రి. ఈ రాల్లు గొడుతున్నయి. ఈ చెట్లు ఇరిగినయి. ఈ గుట్టలు ఇరిగినయి. నాకేం గూడ కండ్ల బడలేదు తండ్రి. నా జీవితం నీ దగ్గరికే వత్తది. నా శరీరం బుగ్గయి పోతది. ఈ భూమ్మీద. అయ్యా! నేను నీ దగ్గరికే వత్తన అంటుండట. అప్పుడు ఆ దేవుడు అనుకుంటుండు అబ్బ రెండు గంటలు రాళ్లు కొట్టినగని అరళ్ల కామెడి పెట్టు కొట్టుకు పోయినగాని పడమటి చెట్లు తూర్పుకచ్చి ఇరిగినయి. తూర్పు చెట్లు పడమటికి వచ్చి ఇరిగినయి. ఈనికి తొవ్వ జొర్ర రాకుండు ఉన్నగని అబ్బ! వీడు నన్ను తలుత్తుండని అప్పుడు జాలి కలిగి వేయి సింహల బలాలు, వేయి ఏనుగుల బలాలిచ్చి అప్పడదప్పుడే ఇటు చెట్లు ఇటే లేసినయి. అటు చెట్లు అటే లేసినయి. నను తలుత్తుండని అప్పుడు అయిదు నిమిషాల్లో వచ్చి తెల్లని చెరుకులో గుట్టెక్కి కుడి చేత్తో ఇడిసి ఎడమ భుజం మీద ఎత్తుకుని ఆయన ఇంటికచ్చి ఆడవెట్టి ఆ శంకులో నింపిండు. ఆ శంకులో నీళ్లు తాగి ఏమంటుండు అరె చిత్తుండ నీయంత బత్తుడు లేడు, నీయంత పుణ్యవంతుడు లేడురా... నీయంత మానవుడు ఈ భూమ్మీద లేడని జైకొట్టి ఇగ పోతున్న బిడ్డ అని పోతుండు. వాళ్లు జూడ వోయినట్టే పోయిండు ఆడ మాయం అయిండు. ఎండికొండ కైలాసాన పుట్టిండు. కైలాసన పుడితే ఆ పార్వతమ్మ బోలాశంకరుడు ఎక్కడికో భూలోకం పోయి వత్తుండని కాల్లు కడుగుతనని ఆమె మంగళాహారతులు పట్టుకుని ఎదురుగా వచ్చింది. ఎదురుగా వచ్చే వరకల్లా ఏమయింది. ఎదురుగా

వచ్చినోల్లే ఎటుపోయినవయ్య నువ్వ్ అని వంగవడి పాదాలు కడుగుతంది. మరీ చిత్తుండ మహారాజు జై అంటుండు మరీ చిత్తుండ మహారాజు జై అంటుండు. అరె మానవులేమో వాళ్లు దేవుడివేమో నువ్వు నరులేమో వాళ్లు గా పాంచాల పురం వోయి జై కొడుతున్నవ్..! వాడెవడు అంత సత్యవంతుడు. అంత పుణ్యవంతుడని అడిగింది. అని అడిగినోల్లే వాడంత పుణ్యాత్ముడే అమ్మా! సత్యవంతుడే వాని మీద రాళ్లు కొట్టిన వాని మీద చెట్టు పుట్టలు ఇరిగిన వాని ఆత్మ గుండెల్లో ఉండి నా జీవనం పోతే నీ దగ్గరికే వత్తది అన్నడు. వాడే నను తలిచిండు పోంగ వాని మల్ల నేను చూసి గోసని వానికి మల్ల బలాలిచ్చిన వాడు నీళ్లు తెచ్చిండు శంకులో బోసిండు. నేను తాగిన వాడంత పుణ్యమూర్తి లేడని భార్యకు చెప్పిండు. చెప్పితే ఆ పార్వతమ్మ ఏమంటుంది. అబ్బ! నువ్వ్ గాయింత బోలా శంకరుడివి గందికే అంటరు. ఏం మనిషివయ్యా నువ్వు మరీ నేను ఒకటి అడుగుత.. వాన్ని.. చెల్లమదేవి కన్న బల్లాలరాజు కన్న, చెల్లమదేవి కన్న బల్లాలరాజు కన్న భక్తుడ వాడు చిత్తుండరాజు బోలా శంకరుడా...? చిరుతోండ మహారాజుని అన్నోల్లే

అవును.. చెల్లమదేవి కన్న, బల్లానరాజు కన్న మాఁ పుణ్యమూర్తి చిత్తుండ మాఁ రాజు. నిజంగా పార్వతమ్మ. మరీ నేనొకటి అడుగుత. వానికి కాన్పు కాకముందు మొక్కరాని మొక్కులు మొక్కిండు. ఎదురైనా బండకి మొక్కిండు. నోమరాని నోములు నోమిండు. ఎదురైనా గుండుకి దేవుడా అని మొక్కిండు. అని వాడేన్ని మొక్కిన పట్నం మీది ప్రజలకి పతాన మంత్రులకు రాజ్యం అప్పజెప్పించి సిరస్సు కిందికి సిరిపాదం మీదికి ఎండికోండ కైలాసానికి గుడి ముంగిట, గుడిలో తానం మాడి, గుడి సుట్టు తిరిగి సూట్టు బట్ట పెట్టి దాని మీదే సిరస్సు కిందికి సిరిపాదం మీదికి బార్యబర్తలు తపసు బట్టిండు. పన్నెండ్లు తపసు పట్టింద్రు. అన్నం లేదు. ఆ.. గోత్రం లేదు. ఒకనాడు గాదు, రెండొద్దులగాదు, ఈనాటి లోకం ఒక్కనాటికి ఉపాసం ఉండటానికి ఉక్మా పోసుకుంటుద్రు. పాలు తాగుతుంద్రు. ఈనాటి లోకం ఇట్ల చేత్తుంద్రు. పాపాన పది నెలలు మొత్తం పుణ్యకాలాన ఆదు సత్యవంతుడు. అన్నం, ఆ గోత్రం లేదు పాయక పన్నెండ్లు తపసు పట్టిండు. తపసు వట్టి అగో అప్పుడు కొడుకును కోరుకున్నడు. అరె కొడుకా! నీకెన్ని తీర్లు ఉన్నయనుకుంటున్నవ్. అరవై జనులకు మా రాజు. ఏటి మీద ఎడ్లు, పాటి మీద బర్లు నాకు సమస్తం ఉన్నది అన్నవ్.. నాకు కాన్పు లేదన్నవ్. నీకు కొడుకు నిచ్చిన పోరా అన్నడు. ఆ దేవుడు ఆ కొడుకు వచ్చేవరకు తొమ్మిది గడియాల్లో కొడుకు పుట్టిండు. ఆ కొడుకును అల్లారు ముద్దుగా ఆడంగ, పాడంగ పన్నెండ్ల బాలుడైయ్యిండు. పన్నెండ్ల బాలుడు బడికి పోయిండు. బడికి

పోయి రాంగ హింది, తెలుగు, ఇంగ్లీషు భూమి మీద ఎన్ని బాసలుంటే అన్ని బాసల తీరు చదువుతున్నడు ఆ బాలుడు. చదవంగ ఒకనాడు ఏం జేసిండు ఆ బోల శంకరుడే అబ్బ ఈడు మేమిచ్చిన వరమే. వాడి కొడుకు మరి తెల్లని చరుకులో రసం ఇచ్చినందుకే వాన్ని జై కొడుతున్నవ్.. మరీ ఆని కొడుకును కోసిపెడతడ. వాని కొడుకును కోసి నీకూ నాకూ కూర చేసి పెడితే వాడినీ బక్తుడంట. అంటే ఏంటి చేద్దం పార్వతమ్మ అంటే నీకు ఈపుల పెద్ద గడ్డ పుట్టాలి. ఆని పెద్ద దర్వాజలోనే పుట్టాలి. ఆ పెద్ద దర్వాజాలోనే నీ గడ్డ పగలాలి. ఒక క్వింటాళ్లు సీము పారాలి. అని వాని యిల్లంత మురుగు పట్టాలి. వాని మీద పారాలి. అబ్బ! ఊరోళ్ల అంత అబ్బ గబ్బు ఆసోనోడు మన రాజు గారి ఇంటికి పోతుండని కట్టే పట్టుకుని రావాలి. మనిషి కొక గుప్ప పట్టుకుని రావాలి. వాన్ని చంపుదామని ఆమె ఏమో పన్నెండ్ల యుమున సిరి తీరున్నది పార్వతమ్మ ఈయన ముక్కుపడితే పానం పోయేటట్టు ఉన్నడు. అటువంటి వేసంలో పెద్ద దర్వాజలో పుట్టాలి. పుట్టి నీ కొడుకును కోసి పెడితే నా భర్తకి గడ్డ మగ్గుద్దట. నా భర్త పుండు మగ్గుద్ది. నీ కొడుకును కోత్తేనే మాకు బోజనం పెడితేనే నీ పుండు మగ్గుద్ది. తిరుపతి తీరంగా, బద్రచలం ఎన్నో నీతులు తిరిగినం. ఎన్ని తిరిగిన నా బర్త పుండు మగ్గుత లేదంట. అని కొడుకును కోసి పెడితేనే మగ్గుదంట. మరీ అండిపెడతడ. అవునయ్యా శంకరుడ? పెడతడమ్మ ఏసోంటి పాపారాత్మురాలివే. ఆవుదానం అడగలే, వస్త్రదానం అడగలే, ఏది అడగక కొడుకును కోసిపెట్టంటున్నవానే పాపాత్మురాలా..! అని తిట్టిండు. కోపానికి వచ్చిండు. బోలా శంకరుడు. త్రిశూలం వట్టి కొడతా అని పెయిండు. అవ్.. గట్టయితేనే ఆడు సత్యవంతుడంటా.. లేకుంటే ఆడు సత్యవంతుడు కాడంటా. అప్పుడు గట్టెట్టయ్యిండు. గట్టెట్ట ఆకిట్లో పుట్టింద్రు. ఆకిట్లో పుట్టి ఏమంటుంద్రు. అరె చిత్తుండ మా రాజా! ఊరోళ్లంతా గునుపాలు పట్టుకుని వత్తుంద్రు. ఊరోళ్లంతా గబ్బోళ్లని వాల్లచ్చవరకే గుల్లేడు క్వింటాడు పండు పురుగులు పారుతున్నయట. అరె చిత్తుండ నను కొడుతున్నర్ రా.. నీ ఊరోళ్లు. అరె గబ్బోళ్లమని కొడుతున్నర్ రా... నీ ఊరోళ్లు. అరె చిత్తుండ... చిత్తుండ మా రాజు తలుపు తీసే వరకల్లా అబ్బ నా దేవా నా తండ్రి నేను భూమీద నరుడై పుట్టి అడిగింది లేదనని ధర్మకంకణం కట్టుకున్న అరవై ఆరు జిల్లాలుకు నూటోక్క కిరీటాలు పెట్టుకున్నోని నేను ఏది అడిగితే అది నా పానం అడిగిన కోసి పెడతానని ఆనాడు ధర్మకంకణం కట్టుకున్న. ఏది అడిగిన అది ఇత్త అంటుండు. ఏం గావాల్నో చెప్పు అంటుండు. తలపాగా నీళ్లు తడుపుకుంటా అంటున్నాడు. నీ కొడుకును కోసి నా భర్తకు కూర చేసి పెడితేనే నా భర్తది ఆ రాసపుండు మగ్గుదని

చెప్పింది. పెడతవా? పెట్టవా? ధర్మానికి దండుగ కాదను పోతం అన్నది. అవ్వ నేను కాదన.. నేను ఆనాడు అన్నమాట ఎనుకకు రాను. నా పానం కోసిపెడతా.. ఏ\.... నువ్ కోసి పెట్టుడు వద్దు రా.. నీది కోసి పెట్టుడు వద్దురా.. నీ కొడుకుది కోసి పెట్టాలని అన్నది. అన్నవోల్లే నా కొడుకునే కోసి పెడత. బడికి పోయిండు తల్లి అన్నడు. ఆ బడికి పోయిన కొడుకు అచ్చినంక నేను అండిపెడతానంటే మరి మేం గంగ తానం చేసివత్తం. మా భార్యభర్తలం. మేం గంగతానం చేసి వచ్చేవరకు నీ కొడుకు బడికి వోయి అత్తడు. నీ కొడుకును కోసి మాకు మూప్పయి మూడు కూరలు అండిపెట్టాలి అని చెప్పింది. చెప్పినోల్లే ఆన్నే మాయమయింది. ఆ గంగల్నే పుట్టింద్రు ఈ కృష్టు రోగులు. ఇగ పన్నెండో తరగతి చదివి వత్తుండు బల్లో కెల్లి పన్నెండింటికి వత్తర కద వచ్చేటోళ్లకు మల్ల ముసలేసం వేసి అడ్డం తిరిగింది ఈ సిరియాలునికి. అయ్యా! ఎప్పటి నుండో కృష్టురోగులు అచ్చింద్రు. నువ్వు ఇంటికి పోతివి అంటే ఎప్పటి నుంచో నీ తండ్రి కత్తి నూరుత్తుండు నీ తండ్రి చిత్తుండ. నిను కోసి పెడతడు బిడ్డ నువ్వ్ దాగుండు. నువ్వ్ దాగుంటే నీ గండం తప్పుద్ది బిడ్డ. అంటుంది. ఎయ్ నా తండ్రి ఎంత సత్యవంతుడో, అన్న మాట తప్పనోడు ఎంత భక్తిపరుడో ఎంత సత్యవంతుడో నా తండ్రి నను ఆలస్యం కమ్మంటున్నవా..? ముసలిదాన్ని ఆటు దొబ్బి పార్వతమ్మ మారు వేశంలో ఎదురుగా వత్తే అటు దొబ్బిండు. ఉరికచ్చి నాన్న నీ పని నువ్వు చేసుకో. నా తండ్రి మీకు లేటయ్యింది. నేను అచ్చేవరకు మీ పని మీరు చేసుకొంద్రి అన్నడు. తల్లిదండ్రులకు గప్పున నీళ్లచ్చిన్నయి. అయ్యో! నా కొడుకా నువ్ పుట్టక ముందు మొక్కరాని మొక్కులు మొక్కినం. ఎదురైన బండకి మొక్కి, ఎదురైన గుండుకు మొక్కి కొడుకా!... గిప్పుడు నను చేసుకొండి అంటున్నవా? అని కత్తి నూరి భార్యకో వాయి పెట్టింద్రు, భర్తకో వాయి పెట్టింద్రు పరమ తండ్రి. నువ్వీచ్చిన వరం నీకే ఇత్తునం. అని చెప్పి కొడుకును గోసి కీలుక్కీలు కాలుక్కాలు చెవిది చెవుకు, ముప్పది మూడు కూరలకు గంజులు తీయంద్రని పోయింద్రు కదా తలక్కాయ శాకానికి ఉప్పు, పసుపు రాసి అప్పుడు కరెంటిల్లు లేవు. ఈసోంటి పోటోవుల్లేవు. ఉప్పు, పసుపు రాసి ఆ తలక్కాయను తుక్కు తుక్కు దంచి ఆ బంగ్ల మీద ఎండబెట్టారు. ఎప్పుడన్న కొడుకు గుర్తుకస్తే చూసుకుందామని ఎండబెడతే అప్పుడు అయింత మళ్లీ అప్పుడే పుట్టిను. ఎమయిర్రా.. ముప్పయి రెండు గంజులే ఉన్నయి. ముప్పమూడు కూరలు ఏవి రా.. తలక్కాయని దాసినవ్ రా.. ? అరె నువ్వ్ మనిషివేనారా...? తలక్కాయలు దాత్తున్నవ్ రా..? అరేయ్ తలక్కాయ దాత్తవ్ రా.. ? అన్నవోల్లే ఏమన్నడు బిడ్డ తలక్కాయను దాసినవా తేపో తలక్కాయకు మల్లవోయి అది తెచ్చి ఇద్దరు తడబడ తానం చేసి

కంకణాలు కట్టుకుని నీలువెల్ల తానం చేసి ఆ రోళ్లను కడిగి ఆ కుందేను కడిగి దానికి కంకణం, వీళ్లు కంకణం కట్టుకుని ముక్కు మూడు మార్లు రాసి తప్పయిందని ఆళ్లు కీమా కీమా దంచిర్రు ఆ తలకాయను.. మల్ల అల్లం మసాలాలు వేసి గంజులో ఫ్రై చేసి దించినుర్రి. ముప్పయిమూడు గంజులైనయి. ఐదు ఇత్తర్లు కుట్టుమన్నడు. ఐదు ఇత్తర్లు కుట్టిర్రు. ఐదు ఇత్తర్లు, ఐదు చెంబుల నీళ్లు, మీది మాంసం మొత్తం ఇత్తర్లలో తోడిర్రు. ఇగ నీ కొడుకును పిలవండి. మేం తినము రా.. అవ్వ కండ్ల రా చూడంగ చేతిలార చూడంగ భార్యభర్తలం కోసుకున్నం. కొడుకును ఎట్ల పిలవమంటం. అరేయ్ నీ కొడుకు తినంది మేం తినం రా...! కొడుకా..! ఏమని పిలుత్తుండు. చెంబు పట్టుకుని కొడుక మేం ఇద్దరం. ఈళ్ల భార్యభర్తలకు రెండు కూర గద్దేకాడ ఒకటి ఆడ చెంబు పట్టుకుని ఏమని పిల్తుండు పిలు.. మూడు సార్లు పిలవాలి నీ కొడుకును.. కొడుకా! నువ్వ్ సత్యవంతుడివైతే, నేను సత్యవంతుడినైతే, కొడుకా బడికి పోయిన నా కొడుకా! సత్యసిరియాల కొడుకా సత్యవంతుడ రా రా.. నా తండ్రి అన్నం తినేవ్ కొడుకా. బడియాల్ల అయ్యిందని కంటికి నీరు లేకుండా పిలిసిండ్రు. మూడో పిలుపుకు కొడుకా సత్యసిరియాల రారా.. అన్నవరకు ఇత్తర్లన్ని మాయం అయినయ్. చెంబులు మాయం అయి పన్నెండ్ల పిల్లగాడు పుస్తకాలు వట్టుకుని భుజకీర్తులు పెట్టుకుని సూరీడా...! నువ్ పొడవకు. నేను పొడుత్తన్ అన్నంటుగై అమ్మ, నాన్న అని పిలిసిండు. అగో నువ్వ్ నీ కొడుకును కోసినవ్ రా... నీ కొడుకును కొయ్యలే..? మేం గంగతానం పోయచ్చేవరకు కుక్కని దొరకబట్టినవ్ కుక్క కోసినవ్.. కుక్క మాంసం మమల్ని తినమని పెడుతున్నవ్ అని పార్వతీ అబద్ధం ఆడుతుంది. మారు వేశం మీదుండి. అబ్బ నా కొడుకును కోసిపెట్టానంటే నమ్ముతలేవా..? ఈ కొడుకును గూడ కోత్తఁనుండు. అప్పుడే కోపం మీదనున్న చిత్తోండ మా రాజు... నేను లంగనా..? నేను అన్న మాట తప్పేవాన్ని గాదు. నేను మాహా సత్యవంతుడిని. ఆమె మాటకు కుక్కను కోసినవ్ అన్నవోల్లే మళ్లీ కత్తి తీసి మెడ మీద ఏయ్యనే ఏసిండు. అబ్బ! పార్వతీ శంకరుడు సేష్టాధిగా అయిండ్రు. శివ నంది మీద నుండి శివశంకరుడు, పార్వతమ్మ ఏమంటున్నారు. అరేయ్...! పాంచాలపురం ఏలే చిత్తోండ మాఁ రాజా! మెచ్చితి రా..! నిను మెచ్చితి...! అరేయ్ అరవై జిల్లాలు అమ్ముడుపోయింది. కన్న కొడుకును కోసి పెట్టినందుకు కొడుకా నువ్వు కోరుకున్న వరం నీ కిత్త! నువ్వ్ ఎన్ని అడుగుతవో అడుగు నీకిత్తం రా... అంటున్నారు.. నాకు అరవై అరవై నూట ఇరవై జనులకు మాఁ రాజు మా రాణి జేత్తనంటున్నవ్ గానీ, నాకు అరవై అరవై నూట ఇరవై జిల్లాలద్దు. ఆ... మా రాజుతనం వద్దు. ఎన్నటికి ఉన్న పాలరాతి బండలున్న, పట్టు వస్త్రంబున్న,

ధన సంపదలు ఎన్ని ఉన్న అయ్యా ఎన్నటికి ఉన్న సచ్చి పోకడ తప్పదు. నాకేది వద్దు. నాకొడుక్కు నాభార్యకు నాకు మేం కళ్లు మూసుకునే వరకు ఆకాసం నుంచి బంగారు పూలరతం రావాలి. అందులో అమృతం ఉండాలే ఆ దేవ భటులు రావాలి. మా ముగ్గరికి మూడు చెంబుల అమృతం తాగియ్యాలి. ఆ మూడు చెంబుల అమృతం తాగినోల్లే మమల్ని ముగ్గురు ఎత్తుకొని ఆ బంగారు పూలరతం ఆ దేవ భటులు కూకుండ పెట్టుకోని ఆ దేవుళ్లల్ల దేవుడై ఆకాసం వోవాలి. పరలోక రాజ్యం పోవాలి అని చెప్పిందు. చెప్పేవరకు మూస్కో రా.. కళ్లు అన్నడు. ముగ్గురు మూస్కున్నరు చిత్తుండ, సకులదేవి, సిరియాల. మూసుకున్నోల్లే ఆకాసం నుంచి బంగారు రతం రానే అచ్చింది. అచ్చి ఆల్లు అమృతం బాండం ఆ ముగ్గురికి అమృతం బాండం తాగిచ్చి బంగారు పూలరతంలో కూకుండబెట్టి ఆ మీదికి రాగానే ఆ దేవుళ్ల దేవుడై పోయిందు. సావు పుట్టుకలు లేని వరం. ఆ భగవంతుడు మెచ్చిందు. తప్పకుండ కోరుకున్న వరమిచ్చాడు. ఎంత ధనసంపాదలున్న ఎంబడేమి రాదు. పాలరాతి బండలు, పట్టు వత్రంబులు, ధనసంపాదలు ఎన్ని ఉన్న ఎన్నింటికి ఉన్న అక్కడోళ్లం. ఇక్కడోళ్లం గాదని అగో చిత్తోండ మాఁ రాజు నమ్మిందు..

## చిరుతొండ రాజు – కథావిశ్లేషణ

ప్రహ్లాదుడు, భక్త సిరియాల, బల్లానరాజు, చెల్లమదేవి వంటి గొప్ప భక్తుల కథలతోపాటు చిరుతొండరాజు మహాభక్తుడు. శివుణ్ణి మెప్పింప చేసిన పరమ శివభక్తుడు. పాంచాలపురం అనే రాజ్యంలో చిరుత్తుండరాజు సకులదేవి భార్యభర్తలు. వాళ్లు ఎంతో ఐశ్వర్యవంతులు. సకల భోగభాగ్యాలు అనుభవిస్తున్నారు. అద్దాల మేడలు, కిరీటాలు, భుజకీర్తులు ఇలా తీరొక్కటి ఉండి రాజ్యపాలన చేస్తున్నారు. అయినా ఏదో వెలితి పిల్లలు లేరని, పిల్లలకోసం ఎన్నో పూజలు, వ్రతాలు, నోములు చేస్తారు. చివరకు 12 సంవత్సరాలు తపస్సు చేసి శివుని అనుగ్రహంతో ఒక కుమారుణ్ణి పొందుతారు. కొడుకు పుట్టాడని ఎంతో సంతోషించి అల్లారుముద్దుగా పెంచుకుంటారు. చిత్తొండ రాజుకు ఏడు కోటలుంటాయి. వెండి కోట, బంగారు కోట, రాగి, ఇత్తడి అని ఈ కోటలను ప్రజలకు దానధర్మాలు చేయాలి. కాని ఇలా చేస్తేవారు కూడ బీదవారవుతారని సుకులదేవి చేయనీయదు. చిత్తొండ తండ్రి ఆత్మగా వచ్చి కోటలన్నింటిని పంచి పెట్టామనంటే నీ భార్య మాటలను విని దానధర్మం చెయ్యకుండా ఉంటావని కొడుకుని ప్రశ్నిస్తాడు. అప్పుడు చిత్తొండ రాజు తన తప్పును గ్రహించి లక్క కొండెక్కి చాటింపు వేసి వెండి, బంగారం, ఇత్తడి, రాగి కోటలన్నింటిని ప్రజలకు దానం చేస్తానని హామీ

ఇస్తాడు. ధనధాన్యపు రాశులు పంచిపెడతాడు. ఈవిధంగా ఊరంతా చిత్తాండ మహారాజు దాన ధర్మాలను స్వీకరించి ప్రజలందరు అతనిని ధర్మాత్ముడిగా కొలుస్తారు. శివుడి అనుగ్రహం వల్ల సిరి సంపదలు అష్టైశ్వర్యాలు వస్తే ఈ మానవుడు దానధర్మాలు చేసి కీర్తి సంపాదిస్తాడని శివుడు చిత్తాండకు ఒక పరీక్ష పెట్టాలనుకుంటాడు. శివుడు ఒక ముసలివాని వేషంలో కుష్టు వ్యాధిగ్రస్తుడిగా వచ్చి చూడటానికి అందవిహీనంగా ఉంటాడు. చిత్తాండ మహారాజు దగ్గరకు వచ్చి నాకు దాహమేస్తుందని చెప్పి నువ్వు పుణ్యాత్ముడివని, సత్యవంతుడివని నీ దగ్గరకు వచ్చానని చెప్తాడు. తెల్లని చెరకులో 360 అడుగుల దూరం ఎత్తు అక్కడ గుట్టమీదికెక్కి తెల్లని చెరకులో నీళ్లు తీసుకొచ్చి వాటిని పోస్తేనే నా దాహం తీరుతుందని అంటాడు. చిత్తాండ సరేనని చెప్పి ఆ కుష్టువాడిని శుభ్రంగా కడిగి స్నానం చేయించి అన్ని సపర్యలు చేసి ఫలహారాలు పెట్టి జాగ్రత్తగా చూసుకొమ్మని తన భార్యకు సుకులదేవికి చెప్పి చిత్తాండ రాజు బయలుదేరుతాడు. చిత్తాండ తెల్లని చెరకులో నీళ్ల కోసం బయలుదేరినప్పుడు దారిలో శివుడు అనేక కష్టాలను కలిగిస్తాడు. వాటిన్నింటిని ఎదుర్కొని చిత్తాండ ధైర్యంగా వెళ్లి నీటితో వస్తాడు. ఆ నీటిని తాగి శివుడు పరవశించి నీలాంటి భక్తుడు ఈ లోకాన లేడని స్తుతిస్తూ వెళతాడు. ఈ విషయం పార్వతీ దేవికి వివరిస్తాడు. అప్పుడు పార్వతీ దేవి చెల్లమరాజు కన్నా, బల్లాల దేవుడి కన్నా గొప్పవాడా? అంత సత్యవంతుడా? అయితే వాడి కొడుకు సత్యసిరియాలిడిని వండి పెట్టగలడా? అని ప్రశ్నిస్తుంది. శివుడు చిత్తాండ ఏది అడిగిన ఇస్తాడని పార్వతీదేవికి సవాలు విసురుతాడు. శివుడు ముసలివాడి వేషంలో వీపు మీద పెద్ద గడ్డతో వాళ్లింటికి వెళతాడు. మారువేషంలో ఉన్న శివుడి వెన్ను గడ్డ మీద చీముకారుతూ ఉంటుంది. అప్పుడు పార్వతీదేవి ఈ రాక్షస పుండు తగ్గాలంటే నీ కొడుకుని కోసి ఆ మాంసాన్ని మాకు భోజనంగా పెట్టాలని ఆదేశిస్తుంది. నువ్వు ఈ పని చేసిపెట్టగలవా లేదా అని అడుగుతారు. దానికి చిత్తాండ రాజు సరే కోసిస్తానని మాటిస్తాడు. సత్యసిరియాల బడి నుండి వచ్చేటపుడు పార్వతీ పరమేశ్వరులు సిరియాలకు ఎదురై నిన్ను మీ నాన్న ఎవరో ముష్టివారికి కోసి పెడతారని చెబుతారు. అలా చెప్పిన తర్వాత కూడా నేను వెళతాను నా వల్ల ఇప్పటికే ఆలస్యమయి ఉంటుందని విన్నవిస్తాడు. కొడుకును కోసి 33 గంజులో వండాలని ఆదేశిస్తారు. కాని 32 గంజులే వండుతారు. కొడుకు మీద ప్రేమతో తలకాయను జ్ఞాపకంగా ఉంచుకుంటారు. ఆ విషయాన్ని తమ మనోనేత్రంతోనే గమనించి ఆ దాచిన తలకాయను కూడా తమకు వడ్డించమని ఆజ్ఞాపిస్తారు. అన్ని వడ్డించిన తర్వాత నీ కొడుకును పిలిస్తే మేం తింటామని పట్టుబడుతారు. మా చేతులారా మా బిడ్డను

కోసి వడ్డించాం. ఎలా పిలువగలమని అంటారు. మూడు సార్లు నీ కొడుకును పేరును పెట్టి పిలువమని చెబుతారు. ఎంతో శోకభరితమైన హృదయంతో సత్యసిరియాళుని మూడు సార్లు పిలుస్తారు. పార్వతీ పరమేశ్వరులు మాయమై చిత్తొండ రాజును పరీక్షించడానికి నువ్వు నీ కొడుకు కోసిపెట్టకుండా మాకు కుక్కను వడ్డించావా నీ కొడుకు ఎక్కడ్నుంచి వచ్చాడని పార్వతీ అంటుంది. చిత్తొండ మహారాజు నన్ను నమ్మడం లేదా నేను ఇచ్చిన మాట తప్పేవాణ్ణి కాదని కొడుకును కత్తితో ఒక వేటు వెయ్యబోతాడు. పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమై నీ భక్తికీ, సత్య నిష్టకు మెచ్చి వారి కుటుంబానికి మోక్షం ప్రసాదిస్తారు. చిరుతొండనంబి, సిరియాళుని కథను ప్రజలు మౌఖికంగా ప్రచారం చేస్తున్నారని ఈ కథ ద్వారా వెల్లడి అవుతుంది.

## 2.5.2.2 హరిదాసు కథ

పెంట గంగరాం,బుద్దేశ్ పల్లి గ్రామం, ధర్మపురి మండలం.

బుద్దేశ్ పల్లె గ్రామం జగిత్యాల రోడ్డు ప్రక్కన ఉన్నటు వంటిది మరటు గుట్ట బోర్లకెయి ఉన్నటు వంటి నాగారాం దాన్నే రాయక్కపల్లె నాగారం అనబడతది. అక్కడిక్కడికి అక్కెపల్లి చెరువు అనేది ఉన్నది. మాకు ఆ చెరువు మీదికెల్లి ఒకసారి బిక్షాటనకు నాగారం పోతే మిట్టమధ్యాన్నం సంభావన మాకు హరిదాసుకి దొరికింది. జోలే నిండింది. పట్టుకుని ఇంటికట్టి పండుకొని తినాలని చెప్పి వస్తా అని చెప్పి ఊరివాళ్లు ఓ హరిదాస! ఓ బ్రామ్మల్ల కులంలో పుట్టి హరిదాస గీ మిట్ట మధ్యాన్నం పట్టపగటిల్ల ఇడికెల్లి పోతే మరీ నీ పరిస్థితి ఏందీ? నీళ్ల బుర్ర ఉందా? లేదు. కడతంటే వద్దన్నంటున్నవ్ కనుక మరెట్ల అంటే నేను తొందరగానే చేరుకుంట బుద్దేశ్ పల్లి ఎంత దూరం మూడె కిలోమీటర్లు నేను తొందరగానే ఇంటికివోయి భార్యపిల్లలకిచ్చి వంట చేసుకొని నేను తినాలి. భుజించాలి. మరినేనిక్కడనే ఉండి నీతోనే ఉండి బుజించుకుని చేరితే నా భార్య పిల్లలు ఉపవాసం ఉంటరు. గనుక వాళ్లెదురు చూస్తరు గనుక వాళ్లకు పెట్టనది నేను తిన. గనుక కావున సంభావన తీస్కపోయి మీరు పెట్టిన గీ... ధాన్యం, అన్నం, పప్పులు అన్ని తీస్కపోయి అక్కడ ఉడికిచ్చుకొని తింటం అని కట్టమీది నుంచి నడుసుకుంట రాంగ నట్టనడిమి చెరువు కట్టమీద మైసమ్మ మర్రి మీద ఉన్నది. ఆ మైసమ్మ దాటినంక ఎండతీవ్రత బాగా అయింది. కళ్లు దిమ్మతిరిగి కట్టమీద పడిపోవడం జరిగింది. ఆ కట్ట మీదనే పడిపోవడమే జరిగితే. నీళ్లు లేక నోరు తడవక ఆ శ్రీ మన్నారాయణ తలుసుకుంట చేరితే ఆ నారాయణుడే గొల్ల రూపంలో కట్టకింద గొర్లు మేపుకుంట మేకలను మేపుకుంట ఉండి ఏమయింది.

హరిదాసు అంటే నాకూ వినరాక పరిస్థితిని బట్టి అయ్యో! దాహం ఎవ్వళ్లన్న ఇస్తే బాగుండు అని చెప్పి అంటే ఆ గొల్ల బోయడు నా దగ్గరున్న నీళ్లు నీకు పోయన్న హరిదాసంటే ఆ నీళ్లు నీ నీళ్లు మంచి నీళ్లు కావు బిడ్డా నాకు నీళ్లు చెర్లోగాని, బావిలోగాని, ఊటలోగాని చెలిమిలో అయిన పర్లేదు గాని అని చెప్పంటే అట్లయితే పిస బ్రాహ్మణుడు పిస హరిదాస చెరువునిండా నీళ్లు పెట్టుకున్నవ్ నీళ్లు నన్ను నీళ్లు అడుగుతున్నవ్ మల్ల. పోతానంటే తాగనంటవ్. చెరువు నిండా నీళ్లున్నయట చెరువుల నీళ్లున్నాయంటే మరి నాకు కనిపిస్తలేవు గద బిడ్డంటే లేదు లేదు చెరువు మీద నాసు కమ్ముకొని ఉన్నది గనుక గిట్ల గిట్ల అంటే నాసు తొలగిపోతది. తొలగి నీకు నీళ్లు స్వచ్ఛంగా కనబడతాయి. నేను ఇక్కడనే ఉంటా కట్టమీద పో... అని చెప్పి అనంగనే మెళుకువ వచ్చి చూడంగనే గొల్ల బోయడు లేదు చెరువు చూసేవరకల్లా చెరువు మీద పచ్చ పాకురు పట్టుకొని ఉన్నది. బరాబరే.. మరి ఇదేదో భగవంతుని అనుగ్రహమే ఉన్నట్టు ఉన్నది. గొల్లబోయని రూపంలో వచ్చి చెప్పినట్టు ఉన్నది. ఆ సర్వేశ్వరుడని చెప్పి అని కట్ట దిగి ఆ మీది పసరును మలినాన్ని దొలిచేవరకు నీళ్లు స్వచ్ఛంగా ఉన్నయి గనుక తాగి జీవించి సంభావన తీస్కచ్చి భార్య ఇంటికిచ్చుకొని భార్యపిల్లలను పోషించుకోవడం జరిగింది. ఇది సత్యం ఇది నిజం దీనిని బట్టి ఆలోచించి చూస్తే ఆ రాజయోగంలో అందరు ఎవరికైనా ఉన్న ఆశ ఏమిటంటే భార్యపిల్లలను పోషించుకోవాలనే శ్రద్ధనే ఉంటది. అంతకంటే ఎక్కువ ఉండది. ఇది పాతది. ఇప్పదది గాదు. ఇప్పటి వాళ్లకు ఎక్కడ తింటే అక్కడే బొత్త నింపుకుంటరు గాని మా పాత సిద్ధాంతాలు ఎనకటివి. భార్యపిల్లలకు అప్పజెప్పినంకనే తినడం అనేది ఉండే.

## హరిదాసు కథ – కథావిశ్లేషణ

ఒక హరిదాసు అనే పూజారి ఆనాటి జీవన విధానాన్ని తెలిపే కథ. నేడు మనం విహరిస్తున్న వాహనసౌకర్యాలు లేని రోజుల్లో ఐదారు కిలోమీటర్లు కాలినడకే నడిచివెళ్ళి వాళ్ళ పనులు పూర్తయిన తరువాత తిరిగి ఇంటికి చేరేవారు. హరిదాసు పురోహిత వృత్తి చేసేవారు. కనుక ప్రజలు సమర్పించిన నైవేద్యాలు, ఫలాలను మొదట ఇంటికి తెచ్చి భార్యకి సమర్పించిన తరువాతనే ఆ రోజు భోజనాలు కార్యక్రమం పూర్తి చేసేవారు. పొద్దుటి నుండి నిష్టగా స్వామి వారిని పూజించాలి కాబట్టి నిరాహారంగా ఉదయం పూట గడిపాల్సి వచ్చేది. హరిదాసు రోజువారిలాగా ఒక రోజు ధర్మపురి సమీప గ్రామానికి వెళ్ళి పూజ చేసి వారిచ్చిన నైవేద్యాలను, కానుకలను తీసుకుంటాడు. ఇంటికి చేరే మిట్టమధ్యాహ్న సమయంలో దాహం వేసి ఒక చెరువు కట్ట మీద నీరసించిపోయి స్పృహ తప్పిపోతాడు. అనునిత్యం శ్రీ

నారాయణనామం పారాయణం చేసే ఆ హరిదాసుకి సాక్షాత్తుగా శ్రీనారాయణుడు గొల్ల రూపంలో వచ్చి నీళ్లు ఇచ్చినట్లు కల వస్తుంది. కాని హరిదాసుని పరీక్షించడానికి ఆ భగవంతుడే వచ్చాడా అన్నట్లు అనిపిస్తుంది. ఎంతో దాహంతో ఉండి కూడా కుప్పకూలిన హరిదాసుకి గొల్లరూపంలో వచ్చిన నారాయణుడు నీరు ఇస్తే తీసుకోడు. అతని భక్తిపారవశ్యానికి పరవశించి దగ్గరున్న చెరువులో నీళ్ళు తాగమని ఉపదేశిస్తాడు. అందులో ఉన్న పాకురు పాశిని చెదిపి చూస్తే నీళ్ళు కనిపిస్తాయని చెప్పి మాయం అవుతాడు. హరిదాసు ముందు చూసినప్పుడు నీళ్ళు లేని చెరువు ఇప్పుడు నిండు కుండలా నీటితో నిండిపోయింది. ఇదంతా స్వామి వారి లీలగా గ్రహించి తన్మయత్వంతో ఇంటికి వెళ్ళి, భక్తులు ఇచ్చిన ఫలాలను తిని ఆకలి తీర్చుకుంటాడు.

1. ఈ కథ చెప్పిన వ్యక్తి స్వయంగా శూద్ర కులంలో పుట్టిన పురోహితుడు. నిత్యం పూజ క్రతువులను నిర్వహించేవాడు. కాబట్టి తన అనుభవంతో చెప్పిన కథయే అయి ఉంటుంది. ఏది ఏమైనా పూర్వం పూజారుల జీవన విధానాన్ని వివరిస్తూ ప్రస్తుతం సమాజం, యువత, ప్రజల జీవన శైలిని ప్రశ్నిస్తాడు.

2. పూర్వం పురుషులు పిల్లలకి, భార్యభర్తలు బంధానికి, కుటుంబానికి ఇచ్చిన విలువల గూర్చి హరిదాసు పాత్ర చర్చిస్తుంది. ఆనాటి కుటుంబాల్లో వంట చేసిన తరువాత ఇంట్లో సభ్యులందరు కలిసి తినేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితికి భిన్నంగా మన కుటుంబాల్లో కనిపిస్తుంది.

## 2.5.2.3 రామా రామా అంటే రోమా రోమా పాపాలు పోతాయి

వోదెల నారాయణ, అయిలాపూర్ గ్రామం, కోరుట్ల మండలం.

రామా రామా అంటే రోమా రోమా పాపలు పోతాయంటే.... తండ్రి చనిపోయేముందు కొడుకులను ఇద్దరికి చెరొక రాజ్యమిచ్చి పరిపాలించుకోమ్మని చెప్పారు. అయితే అన్న పెద్దవాడు కాబట్టి అన్ననే పరిపాలిస్తున్నడు. రెండు రాజ్యాలను తమ్ముడికి ఇస్తలేదు. తమ్ముడు ఏ పని చేయమంటే ఆ పని చేస్తున్నడు. ఆ రెండు రాజ్యాలను ఈనేనే పరిపాలిస్తున్నడు. కొద్దిరోజుల తర్వాత ప్రజల్లో మరి మీ తమ్ముడికి రాజ్యం ఇయ్యావ. మరి నీ రాజ్యం నువ్వు పరిపాలించుకొని మీ తమ్ముడి రాజ్యం మీ తమ్ముడికి ఇవ్వుమంటే ఆయనకు కొంచం ఆత్యాశ కలిగింది. ఆ రాజ్యం వానికి ఇవ్వాల? అని చెప్పి మనస్సులో అది కూడా నేనే పరిపాలించుకోవాలని ఆయనకు ఉండేది. అతడి భార్య ఆయన రాజ్యం ఆయనకు ఇవ్వు... ఆయన బతుకు ఏదో ఆయన బతుకుతడు. మన రాజ్యం మనకు చాలు. ఒకటి అని అంటుంది. లేదు లేదు అది కూడా మనమే పరిపాలించాలి. వానికేంది ఇచ్చేది. అని ఆయన మనస్సులో

ఉంచుకొని తమ్ముడికి ఒక పని చెప్తాడు. తమ్మా! నువ్వు ఆ రాజ్యానికి పోయి గడిల ఒక పుస్తకం ఉన్నది. ఆ పుస్తకం తీసుకురా రా తమ్మా అని తమ్మునికి చెప్తడు. చెప్పినపుడు ఏదైనా చేస్తడు. కాబట్టి అన్న చెప్పిన పని చేయాలని చెప్పి గుర్రం పైన ఆ రాజ్యానికి బయలుదేరిండు. అంతకంటే ముందు అక్కడ ఉన్న గడిల ఉన్న భటులకు పిలిపించుకుని ఒక మనిషిని నేను పంపుతాను. ముక్కు, ముఖం తెలియకుండా ఆయన తల నరికివేయాలి అని భటులకు ఆజ్ఞాపిస్తారు. రాజు చెప్పింది చేయటమే భటుల కర్తవ్యం కదా! వాళ్లు కత్తులు నూరుకొని ఆ గడిల తలుపుల సాటుకు కత్తులు పెట్టుకొని రడిగా ఉన్నరు. ఇగ ఏ మనిషి అత్తే ఆ మనిషిని ముక్కు, మొఖం చూడకుండ తల నరికివేయాలని చూస్తున్నరు. అప్పుడు ఈన తమ్ముడు బయలుదేరిండు. మార్గమధ్యలో ఒక విశాలమైన ప్రదేశంలో భజన కార్యక్రమం నడుస్తున్నది. ఆ భజన కార్యక్రమంలో మనం పాల్గొందాం. మనం కూడా ఇక్కడ రెండు నిమిషాలు పాల్గొని పోదామని చెప్పి ఆయన అక్కడ అగాడు. గుర్రంని కట్టేసి అక్కడ భజనకువోయి. అక్కడ భజన ఏంటిది.

"హరే రామ హరే రామ రామ రామ హరే హరే
హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే"

అనే భజన కార్యక్రమం నడుస్తుంది. అదే అందులో అందరు మునిగిపోయారు. ఈయన కూడా అక్కడికివోయి "హరే రామ హరే రామ రామ రామ హరే హరే హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే" అంటూ ఒక అయిదు నిమిషాలు కార్యక్రమాన్ని అక్కడే ఉన్నడు. తమ్ముడు అక్కడికి పోయాడు. తమ్ముని పని అయిపోయింది. అని అన్న బయలుదేరాడు. అన్న బయలుదేరేసరికి అక్కడ వాళ్లు రడిగా ఉండి అన్న గడిలోకి ప్రవేశించగానే ముక్కు, ముఖం తెలియకుండా వీళ్లు కత్తి వట్టుకొని నరికేసారు. ఇగ తమ్ముడు గడిలోకి పోదామని బయలుదేరాడు. బయలుదేరేసరికి అన్న శవం అక్కడున్నది. అయ్యో! అన్న శవం ఇక్కడ ఉన్నది. ఏమైంది అని చెప్పి భటులను అడగగా మీ అన్న గారే ఆజ్ఞ వేసారు. ఒక మనిషిని పంపుతాను. ముక్కు, ముఖం తెలియకుండా చంపేయాలని చెప్పి అన్నడు. అట్లనే మేం తల నరికేసాం అని చెప్తాడు. ఆ... అట్లన అని ఆయన అశ్చర్యపోతాడు. ఆ మనిషిని నేనే కదా! మనసులో అనుకొని అన్నగారు ఇంత పని చేశారా? అంటే రామా రామా అంటే రోమా రోమా పాపాలు పోతాయి. భజన కార్యక్రమం జరుగుతుందని ఆగినందుకే భగవంతుడే ఆయనను రక్షించాడు.

**రామారామా అంటే రోమా రోమా పాపాలు పోతాయి – కథావిశ్లేషణ**

పై కథలో రెండు రకాల సంఘటనలు చిత్రించబడ్డాయి. ఒకటి వైష్ణవ మతానికి సంబంధించింది అయితే మరొకటి అన్నదమ్ముల ప్రేమకు సంబంధించినది. భార్య చెప్పిన వినకుండా తన తమ్ముని వధించాలని అనుకున్న అన్న దురాశకు తానే బలి అవ్వడం జరుగుతుంది. తాను తవ్వుకున్న గోతిలో తానేపడి మరణించాడు. కల్మషం లేని తమ్ముడు అతని అన్న మాటకు విలువనిచ్చి గుడిలో పుస్తకాన్ని తేవడానికి బయలుదేరుతాడు. అతనికి జరగబోయే దుర్ఘటన గురించి ఏమాత్రం ఆలోచించడు. కాని ఆ దేవుడు అతని పక్షాన ఉండి తమ్ముని రాజ్యం ఇవ్వకపోగా తమ్ముడిని చంపించాలన్న అన్నకు సరియైన శిక్షగా మరణాన్ని ప్రసాదించాడు. కొన్ని సందర్భాల్లో పెద్దలమాట, భార్యలమాట వినకుండానే తాను చేసేదే సరైనదనుకొని తీసుకున్న మూర్ఖపు నిర్ణయాలకు ఊహించని పరిణామాలే సంభవిస్తాయి. తమ్ముడు తన అన్నను రామునిలాగా భావిస్తే, అన్న మాత్రం రాజ్యకాంక్షకి పోయి తాను తవ్విన గోతిలో తానే పడతాడు. హరిభక్తిని ప్రచారం చేసే సందర్భంలో ఇలాంటి కథలు ఎక్కువగా వినిపిస్తుంటాయి. పితృవాక్య పరిపాలకుడిని ప్రధానంగా స్తుతిస్తూ కథలో అంతర్లీనంగా భక్తి తత్వాన్ని ప్రతిపాదిస్తాయి.

# 2.5.2.4 లచ్చిందేవి ఆచారం

కాశెట్టి భూలక్ష్మి, గుండయ్య పల్లె గ్రామం, ధర్మపురి మండలం.

అనగనగ ఒక రాజట. ఆ రాజుకు ఏడుగురు కొడుకులట. ఏడుగురు కోడల్లట అందరికి పెళ్లిల్లయ్యినయ్యట. ఇగ కోడళ్లకేమో కొయ్యపోవటానికి కలుపు పోవుటానికి అన్ని చేయించిడట. ఇగ కొడుకులేమో పనికి పోవుటానికి అన్ని పని వస్తువులని చేసిండట. ఇగ ముసలోడు ఇంటికాడ ఉంటడట. ఒక ఇల్లు జూసుకుంట. మబ్బుల లేసి పనులు చేసుకోని ఆళ్లు వోతరట. పోంగ పోంగ ఒక రోజు ఇగ తిండిమందమే బతుకుతుర్రు. అన్నట్టు. ఇప్పటికయితే ఇగ బతకగలిగినంగ ఏం జేసింది గద. ఇగ రాజుకు ఆ లక్ష్మీ దేవత అన్నది గద. మీ ఇంటికి నేనత్త నేనత్త అంటదట. అమ్మా! తల్లి నువ్వు రావద్దు. ఎందుకంటే నువ్విప్పుడు అత్తవ్. మురిపిచ్చి మూడ్రోజులకు మల్లీ ఎల్లిపోతవ్. ఇగ మూడ్రోజులకు మురిపిచ్చి పోతవు ఇగద్దు అని ఊకే అంటుండట ముసలాయన. లేదు లేదు నేనత్త మీ ఇంటికి తప్పకుండ నేనత్త మీ ఇంటికి అని దేవత ఊకే అంటుందట. నా కోడల్లు తప్పు జేయకుండ ఉండరు. అయ్యో! కాలు వట్టి ఏదన్నగని నువ్వు అనుమానం నువ్వద్దు. అనగ కూడా అత్త అత్తని

అచ్చిందట. అచ్చినసుంది ఆళ్లకు మత్తు పట్టెన్ని ఎడ్లు, పట్టెన్ని బర్లు, గొర్లు, పొలాలు, పొలాలకు మనుసులు, టాక్టర్లు అన్ని ఇగ ఇంట్లోకెల్లి పెట్టుకుంటుర్రు. ఇగ ఆళ్లే పొలం పనుల మీద పోతుర్రు. రోజు పోంగ పోంగ ఇగ మత్తున్నోల్లు అయ్యిపోయ్యిర్రు. మత్తు ఉన్నోళ్లు. అయ్యి పోయ్యినంక ఇగ పిల్లలు అందరు అయ్యిరు. ఆ రోజు ఏంజేసిందు. ఏడుగురు కోడల్లు ఈ లక్ష్మీ దేవి ఎప్పుడు వెళ్లిపోయేది తెలువదు. ఏడు కొడవల్లు అయితే దాసి పెడత. అచ్చేసరికి పని జేత్తయి కొడవల్లు అని పారేయక దాసి పెట్టిండట. పనిచేయకున్న గని ఆల్లే జీతగాళ్లు ఆల్లు, ఈల్లే జేత్తురు పని. ఈల్లు చేసుల్లేదు పని. ఇగ చేత్తురుగని గట్లనే టైం చేయించుకత్తరు. పని ఆడోళ్లు కూడ చేయించుకత్తరు. చేయించుకోంగ ఒక రోజు ఏమైంది పిలగానికి పారెత్త అని ఇంటికి అచ్చిందట పగటిల్లి పనికివోయి అచ్చినోల్లే పాలిచ్చుకుంట ఉయ్యాలల ఊగుతుందట. ఊగంగనే పిల్లగాడు ముక్కు పుడకను గిట్లన్నడట. అన్నోవోల్లే కిందవడ్డదట బంగారిది. పడ్డోల్లే ఆమె ఏం జేసింది. చెయ్యి పట్టి తీసి మొక్కి పెట్టుకుంటే అయిపోతుండే. ఈ కాలితోటి తీసి అయింత పెట్టుకుందట. పెట్టుకున్నొల్లె లచ్చిందేవికి కోపం అచ్చింది. కోపం అచ్చి ఇగ ఎల్లిపోతున్న అయింత అని ఇంటికి వోయిందట. తల్లి నువ్వు రాకువన్నంగ అచ్చిన ఇప్పుడు పోత అనవడితివి. నేను చెప్పలేదా? మా కోడల్లు తప్పు చేయకుండా ఉండరు. నువ్వు రాకు అనంగ అత్తివి పోవడితివి. అప్పటికే బర్లు ఇట్ల పుట్టును తవ్వితే బంగారం ఎల్లిందట. కొమ్ములకు ఏసుకోని అత్తున్నయట ఇంటికి. ఆ లచ్చిదేవి చేయవట్టి. కతం ఇగ ఈమె కాలు వట్టి అట్ల ముక్కు పుడక తీసినోల్లే ఆ తల్లి ఎల్లిపోయిందట. ఎల్లిపోయినోల్లే ఇగ బిడ్డల్ల ఆళ్లకు అన్నిపోయినట. మొత్తం ఏమి లేకుంట అయి పోయినరట. పోయినోల్లే ఇగ ఏంజేసిండట రాజు. కొడుకులకు పని చేసుకోమని చెప్పిండట. ఇగ ఉన్నోళ్లు గరీబోళ్లు అయ్యిపోయ్యిర్రు. కొడుకులకు చెప్పిండట. పని చేసుకోమ్మని మల్ల కోడల్లకు ఏడు కొడవల్లు తీసి ఇగ కొయ్యవోర్రి అని చెప్పిండట. ఇగ ఆల్లు గట్లనే బతుకుతుర్రు. మన ఆచారం మనకే అది.

## లచ్చిందేవి ఆచారం – కథావిశ్లేషణ

జీవితంలో సంపద, ధనం అశాశ్వతమని కేవలం శ్రమను మాత్రమే నమ్ముకోవాలని ఈ కథ సూచిస్తుంది. ఒక ముసలాయన కుటుంబానికి స్వల్పకాలంలో ప్రాప్తించిన అష్టైశ్వర్యాలు అశాశ్వతమని గ్రహించి తన కోడల్లను, కొడుకులను కష్టాన్ని మాత్రమే నమ్ముకోవాలని హితవు చెప్పి వారి జీవితాలకి మార్గనిర్ధేశనం చేస్తాడు.

1. ముసలాయన ఏడుగురు కొడుకులు, కోడళ్ళు ఉంటారు. కోడళ్ళకు పొలాల్లో కలుపు తీయడానికి, కొయ్యడానికి  కొడవళ్లు, వ్యవసాయిక పనిముట్లు చేసి పంపిస్తాడు. వారు శ్రమించగా వచ్చిన ఆదాయంతో ఆనందంగా జీవితాన్ని గడుపుతారు. వీరి పనితనం, కష్టపడేతత్వాన్ని చూసి లక్ష్మీ దేవి ఇంటిదగ్గరే ఒంటరిగా ఉన్న ముసలాయనకు తాను ఇంటికి వస్తున్నట్లు చెప్తుంది. కొద్ది రోజుల్లోనే ఐశ్వర్యం ప్రసాదించే లక్ష్మీ దేవి గురించి ముసలాయన కొంత ఆలోచించి, నడుమంత్రపు సిరి వద్దని అంటాడు. కొద్దిరోజుల్లోనే లక్ష్మీదేవి ఆ ఇంటికివచ్చి సర్వభోగాలు ప్రసాదిస్తుంది.

2. కాని లక్ష్మీదేవి ఒకచోట తటస్థంగా ఉండదు. అది స్త్రీ ఇంటి విషయంలోనైనా, కట్టుబాట్ల విషయంలోనైనా ఏమాత్రం అశ్రద్ధ చేసిన అటువంటి ఇంట్లో లక్ష్మీదేవి ఒక్క ఘడియనైనా ఉండదు. అందుకే లక్ష్మీదేవి ఆ ముసలాయన ఇంటికివచ్చి అష్టైశ్వర్యాలు ప్రసాదిస్తుంది. అతని కోడలు జారిపడిన ముక్కు పుల్లను కాలితో తీసుకుందని లక్ష్మీదేవి ఆ ఇంటి నుంచి వెళ్లిపోతుంది. కాని ముసలాయన యుక్తమైన ఆలోచన వల్ల ఈ ధనం, సంపద కొద్దికాలమని గ్రహించి తాము నమ్ముకున్న కష్టంలోనే తమకు విజయం ఉందని తన కొడుకులికి వివరిస్తాడు. అప్పుడు కష్టాన్ని నమ్ముకుని ఉన్నదాంట్లో ఆనందంగా బతుకుతారు.

3. అందుకే పెద్దల మాట చద్దన్నం మూట అంటారు. వారు అన్ని విషయాలు సక్రమంగా ఆలోచించే రాబోయే పరిణామాలను ముందుచూపుతో ఊహించి చెబుతారు. వాటిని ఆచరించడం వల్ల మన జీవితాలు సుగుమంగా ఉంటాయి. అశ్రద్ధ చేసినట్లయితే అనుభవంతో నేర్చుకుంటారు. జానపద విజ్ఞానంలో ఎన్నో విషయాలు అనుభవపూర్వకంగా వెల్లడించినవే. అవన్నీ విజ్ఞానకుసుమాలే.

## 2.5.2.5 పోశవ్వ మొక్కు కథ

రాజారపు రాధ, తాటిపల్లి గ్రామం, రాయికల్ మండలం.

ఇంగో ఒక ఊరిలో ఒకామె అయింత నాకు భర్త కండ్లు పోవాలని రోజు గుడికి పోతుంది. రోజు గుడిపోతే అయింత ఇది రోజు గుడికి పోతుంది. పోతుంది. ఏమని మొక్కుతుంది ఏం కథ. అని అయింత మొగుడు ఎనుక ఎనుక వోతడట. పోయ్యి అయింత సుత్తండట. చూసి గుడెనక ఉంటడు. గుడెనక ఉండి పోశవ్వ తల్లి నా మొగుడి కండ్లు పోడగొట్టవ. నా మొగని కండ్లు పోతే ఆరుగల్ల యాటని కోత్త, చెట్లల్ల పందిరెత్త. ఒంటిగల్ల కల్లు వోత్త అని అయింత అంటది. అన్నంక ఉ..  అన్నది. ఉ.. అన్నంక ఆ పోశవ్వ తల్లి ఒప్పుకున్నది అనే అత్తది ఇంటికి.  దాని కన్న ముందే అచ్చి అయింత

అరగంచుకు కూసుంటడు. కూసున్నంక ఇగయింత కండ్లు పెయినట్టు కట్టె పట్టుకొని ఆడ కూసుంటడు. నా మొగనికయింత కండ్లు పేయినయి. తెల్లారి మల్ల బోనం జేత్తది. బోనం చేసచ్చి మల్ల ఏంజేత్తదో అని ఎనుక ఎనుక వోతడు. వోయి చూసేవరకల్లేఏంది ఆరుగల్ల ఆటంటేనేమా ఈడ, చిట్టికాడ పందిరినెమో నాలుగు చిట్లకలు ఏత్తంది. నాలుగక్కల్ల. ఒంటిగల్ల కళ్లు అంటేనేమో మూత్రం పోత్తంది. అయింత పోసినంక ఉ.. అంటడ ఎంజేత్తది పోశవ్వ తల్లి ముక్కు మీద ఏలేసుకుంటది. ముక్కు మీద ఏలు ఏసుకున్నంక మల్ల ఎనుకు ఎనుకచ్చి దానికన్న మొదలే అచ్చి మల్ల కూసుంటడు. మల్ల కూసున్నంక అయింత సప్పుడేంక వోయి ఇగ మల్లపాలు పడిగెలు జెత్తది. పాల పడిగె చేసినంక ఒక మిండెడిని కానుగుల దొత్తది. ఈడు గుడ్డోడేమో ఏంజేత్తడు ఏం జూత్తడు అని అనుకుంటది. అనుకొని అయింత దొడ్డికత్తుందని పోతది. దొడ్డికత్తుందని పోయినంక ఏంజెత్తది. కానుగు మూత తీత్తడు. మీద పారెత్తడు. మీద పారేసున్నంక అయింత మిండెడు ఉడుకు ఉడుకు పాలు పోసినంక అటె కట్టె సరుస్తడు. కట్టెసరినంక అయింత మల్ల ఎప్పటోని లెక్క గుడ్డోని లెక్క మల్ల కూసోనే అయింత దవం దవం చ్చి పిలుత్తది. మూల కుండలో ఉన్న ఓ దేవుడా, ముత్తెమంత పాయిసం నా దేవుడా అని అది అంటది. పాల పడిగెను తిని నీ దేవుడు పండ్లి ఇగిలించు నీ దేవుడు ఈడంటడు.  దీనకర్థం కాదు. అయింత మూలకుండలో ఉన్న ఓ దేవుడా ముత్తెమంత పాయిసం నా దేవుడా అని తిందురా అని అది పిలుత్తుంది. పాల పడిగెను తిని నీ దేవుడు పండ్లిగిలించుండు నీ దేవుడు అని అయింత మూత తీసేవరకల్లా ఇంకేంది కట్ట సరిసిండు ముండకొడుకు. ఆ కానుగులకెల్లి తీసి అయింత ఇంటెనుక ఒక బొందతోడి బొందలో పాతిపెడతది. ఎవ్వరికి ఏర్పడకుంట ఇగ ఎట్ల ఇగ అందరు బోనాలు తియ్యబోతరు. బోనాలు తియ్యపోయినంక పోశవ్వ తల్లి ముక్కు మీద ఏలు వేసుకునే పోశవ్వ తల్లి ముక్కు మీద ఏలు ఏసుకునే అందరు అట్లనే అగుతరు. అయింత దాని ఇంటికచ్చి ఊరు దాటెత్తరు. దాటిచ్చినోళ్ళే ఎవ్వరైతే పోశవ్వ ముక్కు మీద ఏలు తీపిత్తరో ఆళ్లకు సగం ఊరు సగం రాజ్యం అంటరు. ఇగ మోదుగొల్లకు ఇంటదిగని మంచొల్లకు ఇంటద... ఎవ్వరు వోతరు ముందుకు ఎవలు వోరు. ఏ.. నే. తీపిత్త! తీపిత్త అనుకుంట ఎగురుకుంటపాయే. పొయినంక ఇదేట్ల తీపిత్తదో చూద్దం అని అనుకుంటడు. అయింత తీపిత్తనేవరకల్లా ఇంకేంది పోతది. పోయి అయింత గుడెనుక్కుపోయి దొడ్డికి పోయి అచ్చి పోశవ్వతల్లి నీ ముక్కు మీద ఏలు తీత్తవ. నా పీతిగుద్ద రాయన్న.. ఇగ ఇది రాసిన రాత్తదని దెబ్బకు ముక్కు మీద ఏలుతీత్తది పోశవ్వ. తీసేవరకల్లా మల్ల బోనాలు తీత్తరు. బోనాలు తీసి సగం ఊరు సగం

రాజ్యం రాశిత్తమని కసిరికల్‌కు పోతది. పోయినంక ఏమంటడో ఏంటో అన్ని కశిరికల్ వోయి గుడ్డోడు ఎవరికి తెలియకుంటవోయి ఎనుకకు కూసుంటడు. ఇని ఇని అయింత సగం ఊరు సగం రాజ్యం రాసిత్తవని మెల్లగ లేసత్తడు. లేసచ్చి చెప్తడు. పోశవ్వతల్లికి నా మొగని కండ్లు పోవాలని మొక్కింది. మొక్కితే నేను గుడ్డోని లెక్క నటించిన ఇగ గిట్ల చేసింది. ఆడగళ్ల ఆటను మోసింది. చెట్టు కాడ పందిరి ఏసింది. ఒంటిగల్ల కళ్లు పోసింది. మిండెనికి పాశం అండింది. పాశం అందుతే నే గిట్ల కానుగుల వోసిన. ఇంటెనుక బొంద తవ్వింది. మిండెనికి ఆ బొంద తోడి పెట్టింది. గివన్ని చెప్పినంక అయింత గుడ్డోన్ని మెచ్చుకుంటది. అయింత గుడ్డోనికి సగం ఊరు సగం రాజ్యం రాసిత్తరు.

## పోశవ్వ మొక్కు కథ – కథావిశ్లేషణ

జానపద కథల్లో సంభాషణలు సహజంగా, పచ్చిగా ఉంటాయి. జానపద కథలు ప్రమాణ భాషలో కాకుండా వాళ్లకు తెలిసిన యాసలో, భాషలో కథలను కథనం చేస్తారు. అందువల్ల నిత్యం వాళ్ళు మాట్లాడుకునే బూతులు, తిట్లు కూడా కథలో భాగంగా అంతర్లీనమవుతాయి. ఈ కథలో పోశమ్మకు బోనాలు తీయడానికి ప్రజలు వెళతారు. అప్పుడు పోశమ్మ దేవత అలిగి ముక్కుమీద వేలు వేసుకుంటుంది. ఆ ముక్కు మీద వేలును తీయించినవారికి బహుమతిస్తారని ప్రకటిస్తారు. ఈ కథలో ప్రధాన నాయకురాలైన ఒక పాత్ర దేవతని లెక్కచేయకుండా చెడు మాటలతో దేవతని బెదిరిస్తుంది. అప్పుడు పోశమ్మ ముక్కు మీదు నుంచి వేలు తీస్తుంది. పోశమ్మ ముక్కుమీద వేలు తీయించిన ఆమె భర్త వచ్చి ఆమె నిజస్వరూపాన్ని బయటపెట్టి తనకు శిక్ష పడేలా చేస్తాడు.

1. భర్తకు తెలియకుండా ఒక వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకొని ఇంట్లోనే గుమ్మిలో దాచిపెడుతుంది. అంతేగాకుండా గ్రామదేవత అయిన పోచమ్మకే సవాలు విసురుతుంది. అవన్నీ గమనించిన భర్త తనకు తగిన బుద్ధి చెప్తాడు.

2. కథానాయకుడుగా ఉన్న పాత్ర భార్య చేసిన తప్పులను సవరిస్తూ వస్తాడు. గుమ్మిలో వాడిని పాలు పోసి చంపుతాడు. పోశమ్మ ముక్కుమీద వేలు తీయించిన తన భార్య గురించి నలుగురికి చెప్తాడు. గుడ్డివానిలాగా నటించి తన భార్య గుట్టు రట్టు చేస్తాడు.

3. పై కథలో నాయకురాలు లాంటి మొండిపాత్రను సమాజంలో చూసిన వారు సహించుకోలేక, ఇలాంటి విభిన్న మనస్తత్వాలు వారు కూడ ఉంటారని కథలో పాత్రగా కల్పించి కథనం చేసినట్లు అనిపిస్తుంది.

## 2.5.3 చారిత్రక, పౌరాణిక కథలు

### 2.5.3.1 సత్యవతి కథ

బండ్ల కనకమ్మ, తాళ్ళ ధర్మారం గ్రామం, జగిత్యాల జిల్లా

అలనాటి కాలమందు ఆ తల్లి సత్యవతి, ఆ సత్యవతి ఏం చేసింది. ఆ ధర్మంగరాజు, ధర్మవతి అల్లకు లేక లేక పుత్ర సంతానం లేక కొన్ని వేల ఖర్చుబెట్టి, ఎదురైన గుండకు, కుదురైన బండకు కోటొక్క మొక్కులు మొక్కుతుంది. మొక్కితే గూడా సంతానం ఐతలేదు. సంతానం కాకపోతే ఏం జేసిందు. అబ్బ! ఎవ్వడు ఏ బిచ్చగానికి చెట్టు కింద బిచ్చగానికి సంతానం అయితుంది. నేను ఎన్ని జన్మలకు ఏం పాపం నాకు ఎందుకు సంతానం కావద్దు? ఆ ధర్మరాజు ధర్మంగరాజు. ధర్మంగరాజు ధర్మవతి ఏడ్వంగ ఏడ్వంగ కోటి తవుసులు కోటి పుణ్యాలు జేత్తుండు. ఎంతో దేవానుదేవతలకు పూజలు చేసుకుంట మొక్కినగాని, మొక్కంగ మొక్కంగ కానుపయింది. ఆ కానుపయి తొమ్మిది గడియల కల్ల కొడుకు ఎట్ల పుట్టిండంటే పాము పుట్టింది. ఆ పాము పుట్టినోల్లే, అదే గడియకు ఆ ఊర్లో కాపయినే కొడుక్కి రాజు పుట్టిండు. బాలుడు పుట్టిండు. ఈ రాజు కడుపులో భార్యకు ధర్మవతికి పాము బుట్టింది. పాము పుట్టిన ముచ్చట ఇదేం చిత్రమో? నేను ఎన్ని జన్మలు పాపాత్మున్నో? గీ పాము పుట్టిందని వాల్లు పుట్టేదు ఏడ్చి రాజు చిన్నవోయి చింత క్రాంతుడై కచ్చీరులోకి పోకుండా బందు చేసి నాది ఏం ప్రాప్తం అని చెప్పి అనేకమైన రంధితోని తిండి లేక, తికనాలేక. ఏది లేక ఏడ్సుకుంట ఉంటే, తన ఎంట మంత్రులు రాజులు ఏమంట్రురు మాఁ రాజా! నువ్వెందుకు రంధి పడుతున్నవయ్యా? పాము పుట్టిందయ్యా! నీ రాతకు మరేం జేద్దామంటే నాదెంత నల్లమొకం రా.. నాకెంత నల్లమొకం అని.. బొమ్మానంగ ఏడ్సుకుంట ఉంటే నారాత గిట్నే పాడైతుందని దేవుడా! అని ఆ బంగారు సందుగ చేయించి ఆ పామును సందుగలో పెట్టి గంగ గోవుల పాలు గిన్నెల్లో పోసుకుంట ఆ పామును సందుగలో పెట్టి పన్నెండెల్లు ఆ పామును సాదవట్టే. పన్నేండ్ల వరకల్లా ఏమంటుండు. పన్నెండ్లకు తల్లితో ఏమంటుండు. తండ్రి కచ్చీరులోకి పోయినొల్లే నాన్న మరి నా ఊళ్లో నా దంట పుట్టిన కాపోల్ల పిల్లగానికి లగ్గమవుతుంది. మరి నాకు పన్నెండ్లు అయింది. మరీ నాకెందుకు లగ్గం జేయ్యదు మీరు.. అని తల్లితో అంటుండు. అయ్యో! తండ్రి..కొడుకా నువ్వ్ పామువి పుడితివి నాకు. మరెంత నల్లమొకం కొడుక. మేము రారాజులెక్క నువ్వ్ పామువై పుడితివి. పాముకు ఎవల్లన్న పిల్లనిత్తర కొడుకా..? దేశాలు తిరిగినం, రాజ్యాలు తిరిగిన కొడుకా....! ఎండి బంగారు సాలు పోత్తం రాజ్యాలకు, దేశాలకు గాని

కొడుకా.. పాముకు పిల్లనిత్తర్రా..? అని తల్లి అన్నది. తల్లి అనేవరకల్లా ఆ రచ్చనేలవోయే రాజచ్చిండు. ఆ ధర్మాంగ రాజు అచ్చి ఏమంటుండు. మరీ కొడుకు లగ్గంజేయమని పామచ్చి నాతోని అంటుంది. ఆ బంగారు పెట్టెలో పెట్టితే ఆ పెట్టెలో నుండి అమ్మా అమ్మా అని పిలుసుకుంట నాకు లగ్గం జేయ్యవా? నా అంత పిలగాడు కాపోల్ల పిల్లగానికి లగ్గమయింతుందని అంటున్నవ్ తల్లి మరీ నాకు లగ్గం జేయవా అంటుండు. మరీ నీకెట్ల లగ్గం చేత్తం కొడుకా.. కాసి దాకా బంగారం, వెండి, రూపాలు సాలు పోత్తం గని ధనసంపదలెన్ని ఉన్నయిగని పాముకి పిల్లను అడిగిపోవటానికి నాకు నల్లమొకం అని చెప్పి... అని అంటే ఏం నల్లమొకంగాదు. మీరు నా పోటో తీసుకొనిపోయి నీవ్ నా పేరు పెట్టి కత్తికి కటారు లగ్గం జేయ్యిమంటుండు. ఆ పాము. అబ్బ కత్తికి కటారుకి ఎట్ల లగ్గం చేత్తం. ముత్యాలబంధరు అంటారు అప్పుడు దేశాలు బయట దేశాలు పోతలేరా ఇప్పటి జనాలు దాన్నే ముత్యాల బందరు అంటారు. ఇప్పుడట్ట కదా ఆ దినములో ముత్యాల బందరు పోయినరు. ఏడేడు సదువులెల్ల సదివిండు. పన్నెండు సదువుల పారా సదివి నాకొడుకు ముత్యాల బందరు పోయిండు. నా కొడుకు పోటువని ఆ ఊరిలో ఒక రాజు పిల్లగాని కొడుకు, ఆ కాపొల్ల పిల్లగాని పోటువ ఆ పోటో దించి ఆ పోటో పట్టుకుని రతం వేసుకొని ఆయన ఉత్తరం, దచ్చిణం, తూర్పు, పడమట ఈ నాలుగు దేశాలు తిరిగిండు. కొడుకు పిల్ల నీయమని తిరిగిండు. పిల్ల నీయమని తిరిగితే ఎన్ని దేశాలు తిరిగినగాని పిల్ల కుదురుతలేదు. పోటో పట్టుకుని వోయిండు. పట్టుకొని పోయేవరకల్లా పడమట దేశాన బల్లాన రాజు బిడ్డ బల్లాను రాజు ఏమంటుండు. పోయి వాళ్ల ఇంటి ముంగిట ఆ రతం ఆగింది. నీకేం గావాలే అంటే నా కొడుక్కి లగ్గానికి పిల్లగావాలని పోటో చూసేవరకల్లా పిల్ల మెచ్చింది. ఆమె సత్యవతి. ఆ పిల్ల చూసి నేను చేసుకుంట అన్నవోల్లే సరే నా కొడుకు ముత్యాల బందరు వోయి రాకమునిపే బామనులను అడిగిన... కటారు కత్తికి పెళ్లి జేద్దామన్నడు. కత్తికి కటారుకి పెళ్లి చేద్దామని అబద్దం ఆడుతుండు. కత్తికి కటారుకి ఎట్లా పెళ్లి జేత్తుండయ్యా.. బామనులను అడిగిచ్చి బలం చూపించి కటారు కత్తికి బిడ్డకు, నా బిడ్డకు, అల్లునికి కటారుకి లగ్గం జేసిండు. అయ్యో! భగవంతా ఒక యేడయింది. రెండేళ్లయింది. మూడేళ్లయింది. పాయక పన్నెండ్లు అయింది. పన్నెండ్లు అయినంక ఏమంటుంది పిల్ల. అయ్యా! మామా నాకు లగ్గం జేసి నువ్వ్ నీ కొడుకు ముత్యాల బందరు వోయిండని చెప్పినవ్.. ముత్యాల బందరువోయి ఎన్నేండ్లు ఉంటడు. పన్నేండ్ల దాకా ఉంటడు భార్యను జేసుకొని కటారికిచ్చి పన్నెండ్లు ఎట్లా రాడు అని అడుగుతుంది. అడిగివరకల్లా ఎడుతుండు మామా... అవ్వ తల్లి! ఒక దొంగతనం

చేసినం. ఏం దొంగతనం అంత దొంగతనం ఏంటంటే అత్త ఏం అంటుంది. ఆ ధర్మవతి ఉంటేనే ఉండు పోతేనే పోవే కోడలా.. పాముకు నిన్ను లగ్గం జేసినం మేం.. మాకు పామే పుట్టింది. బంగారు సందుగల పామును జేయించి పెడితే ఆ పాముకే నిను లగ్గం చేసింద్రు. కటారుకే లగ్గం జేసినం. ముత్యాల బందరు లేదు ఏం లేదు. అది వేరే పోటోవు అని అబద్ధమాడుతుంది. ఇట్టం అయితే ఉండు కట్టమయితే పీకు. అంటుంది. అన్న వోల్లే అప్పుడు సత్యవతి ఏం అంటుంది. ఇట్టం అయితే ఉండు కట్టమయితే పో అంటుర్రా.. ఎంతమందిని మోసం చేత్తరిట్ట. మీ బిడ్డనైతే గిట్ట మోసం చేత్తరా... నేను మంది బిడ్డనూ.. ఇట్ల తీస్కచ్చి ఆ పాముకు లగ్గం జేసి అబద్దాలాడి నను గిట్ల చేసిర్రని ఏడ్సుకుంట మాట్లాడితే ఏమంటుంది. ఆ పామునైతే ఈయంటుంది. ఆ పామును గూడి నా సత్యంతోని ఆ పాము వోయి రాజు అవుతడు కావచ్చు. ఆ పాము తెచ్చియ్యి అంటుంది ఈ బాల. అడిగినోల్లే పెట్టెల నాగన్నను తీసి పుట్టలో విడిచిపెట్టి గట్టిలో పరరాజుని పట్టుకుంటావే? నా కొడుకుని పుట్టలో ఇడిసిపెడతావే అంటుంది అత్త. అంటే అట్ట నేను జేయ్యా తప్పకుండా నాకియ్యి అని కొంగువట్టింది. కొంగువట్టినోల్లే ఆ బంగారు సందుగలో పామును తెచ్చి మామ కోడలు చేతిలో పెట్టిండు. ఆ సందుగ ఆ బంగారు గిన్నె అన్ని కోడలు కొంగులో పెట్టిండు. పెట్టినొల్లే నా కొడుకుని సత్యవంతురాలివి అయితే నువ్వ్ గీ భూమ్మీద దేవాలయాలు, గుళ్లు ఎన్నెన్ని నిధులు తిరుగుతవో అన్ని నిధులు తిరుగు.... కడుపులో అన్నం వద్దు, కంటికి నిద్ర వద్దు, నీ ఇట్టం నువ్ మాఁ పతివ్రతవైతే.. నా కొడుకు రాజైతడని బామన్లకు చూపించి ఈ పామును ఆమె చేతిలో పెట్టినంక బామన్లు ఏం అంటుర్రు. మాఁ సత్యవంతురాలు మాఁ పతివ్రత.. ఈమె కొంగులో ఈ సందుగలో పామును తీసి కొంగులో పెట్టిండు గద.... ఈ కొంగులో పెట్టిన పాము ఈ సత్యవంతురాలితో అయితుంది. ఈమె ఈ బూమ్మీద ఎన్ని దేవాలయాలైతే, గుళ్లు ఉన్నయో అని దేవాలయాలు, గుళ్లు ఉపవాసం తిరిగిద్ది. ఉపవాసంతో తిరిగి పన్నెండ్లు తిరిగింది. అట్టనే జెప్పిను. ఇట్టనే ఇచ్చిండు. పన్నెండేండ్లు ఉత్తరాదిన తిరిగింది. దక్చణాది తిరిగింది. తూర్పు తిరిగింది. పడమట తిరిగింది. ఎక్కడ దేవుళ్లు గుళ్లు ఉన్నయంటే అక్కడికివోయి ఆ తల్లి పూజ చేత్తుంది. కడుపులో అన్నం లేదు, కండ్లకు నిద్ర లేదు. తొవ్వెంట నడుచుడే రాత్రి నడుచుడే పగలు నడుచుడే నిద్ర ఆహారం లేదు. పాముకు పాలు ఏ తండ్రో పోత్తే అంతే గిన్నెలో పోత్తుంది. ఆ తల్లి అట్టనే తిరుగుతుంది. తెల్లారిందాకా తిరుగుడే. కంటికి నిద్రలేదు కడుపులో కన్నం లేదు. కంటిదారా మగ్గులేదు. అట్ట పన్నెండేండ్లు తిరిగింది. ఏమంటుండు. ధర్మపురి నరిసింహస్వామి బిడ్డ ఎక్కడికి వోయిన పాము వోయి రాజైతలేదు. ఓ మాఁ

పతివ్రత.. ఓ సత్యవంతురులా.. నువ్వ్ నా ధర్మపురి నరసింహస్వామి దగ్గరికి రా. నీకు తప్పకుండా ధర్మపురికి రమ్మని చెవిలో గొపం చెబుతుండు దేవుడు. గొపం చెప్పినోల్లే అబ్బ! ఇది

ధర్మపురి ఎటు దిక్కు ఉన్నదంటే ఆ దేవుడే తీస్కత్తుండు. ఆ తెల్లారిందాకా నడుత్తుంది. పొద్దుందాక నడుత్తుంది. ఆ ధర్మపురి నరసింహ స్వామి గుడికాడికి అచ్చి ఏమంటుంది. ఒంటి కాలి తపసు. ఒంటి కాలిమీద నడుత్తుంది. ఒక్కటే కాలిమీద నడుత్తుంది. ఆ దినములా... ఒక్కటే కాలు.. కంటికి నిద్రలేదు, కదుపుకు అన్నం లేదు, మాఁ నీతిమంతురాలు, మాఁ సత్యవంతురాలు. పొడి కట్టుకుంటే ఇగ్గుకపోతలేదు. అగో అట్ట పోక ఆడికత్తే ఏం జుత్తవే సత్యవతి. దునుకు దునుకు గుండంల దునకుంటుండట నరసింహసామి. అన్నవోల్లే సెవులో పిలుసుకుపోయి చెబుతుండు. పిలుపే ఇనబడుతుంది సెవులా. నువ్వు దునుకన్నవోల్లే ధర్మగుండంలో దునికి ఆ ధర్మగుండం కాడికి పోయిందట. ఆ కాలంలా ఆ ధర్మగుండం యుగయుగముల అందు అయింత ఇసుక తంబం కావాలె నువ్వు. నీవు సత్యవంతురాలైతే పిడికెడు ఇసుకన్న పట్టు ధర్మగుండం కాడ, ఇగో ఇట్టె పట్టి ఈ పిడికెడు ఇసుక తీసి మీదికేసిందట. మీదికి ఇసిరేవరకు ఆ ఇసుకతంబం అయిందట అప్పడదప్పడే. ఇసుక రాలుందట ఇసుక తంబమయి. అబ్బ! గీ ఉసుక తీసి మీదికనంగనే ఈ ఉసుకతంబమయ్యింది నేను. ఇండ్లనే దునుకత అని చెప్పి ఆ పాముతోని, ఆ సందుగతోని అల్లా దునికింది. ఆ ఏడు నూలుకతాడ్లు ఏత్తె అందని ఆ ధర్మగుండం, ఆ ధర్మగుండంల దునికింది. దునికెవరకల్లా పాము వోయి రాజయ్యుండు. పాము వోయి రాజు అయి సూర్యుడా నీవు పొడవకు నేను పొడుత్తనంటుండు. పొడసేటి పొద్దులే అయ్యుండు మెరిసేవరకు బ్రహ్మముల్లు ఏసింద్రు. పసుపు, కాళ్లకు బాసింగల్లు అప్పుడే పెండ్లాం పిల్లగాల్లు అయి బిడ్డ నీళ్లలో ఉన్నరు. నీళ్లలో ఉండి అత్త, మామలు అచ్చింద్రు. నీ కోడలు ధర్మపురిలో ఆ ధర్మగుండంలో దునికితే పాము వోయి రాజైండు. రాజైనోల్లే మీదికి ఒడ్డెక్కె కంటపడేవరకు నా పామును చంపినవ్. వేరే రాజును పట్టుకున్నవ్ అంటుంది అత్త, మామ. నువ్వు పెట్టలో నాగన్న తీసి పుట్టలోని విడిచిపెట్టి గట్టిగ పరరాజును పట్టుకున్నవే కులాయి. ఈ కొడుకు నా కొడుకు గాదు. నా పామును తీసి పుట్టలో విడిచిపెట్టి నువ్ వేరే రాజును చేసుకున్నవ్ అంటుంది అత్త. అన్నవొల్లే నేను మల్ల దునుకుత ఇదే నూతిలో అని మల్ల దునికింది. అట్ట దునికివరకు మల్ల పాముతోని ఏడు సార్లు దునికి ఏడు సార్లు పామును తెచ్చింది. తెత్త కూడ నమ్ముతలేదు. అబ్బ! ఇట్లగూడ అనేవరకు ఆకాసంలో భూమి మానవరూపంలో అయింది. ఆడిది మగోడు అయి సత్యవంతురాలు నీ కొడుకే తల్లి ఏడుసార్లు పామును

తెచ్చింది. ఏడు సార్లు రాజైండు. అన్నవోల్లే గప్పుడు నమ్మింగ్రు. గప్పుడు నమ్మితే ధర్మపురి పట్టణాన గా పాము రాజైండు. ఎంత సత్యవంతురాలు నా కోడలు అని అప్పుడు అత్త మామ భూమి ఆకాసం ఆకాసాన్ని ఏలే సూర్యచంద్రాదులు ఈ భూమి ఆకాసావేణి అచ్చి మా సత్యవంతురాలు నువ్వు.... పాము వోయి రాజును చేసుకున్నవ్ అని అప్పుడు ఆల్లకు దేవాని దేవతలు మెచ్చిండట. అరవై కోట్ల అయ్యలు, ముప్పకోట్ల మునులు దేవతలు మెచ్చి సత్యవంతురాలు. సత్యం సత్యం... సత్యం అని పలికింగ్రట ఆ కాలమంతా. సత్యం పలికితే అగో ఆయనకు ఆమెకు మల్ల లగ్గం జేసింగ్రట. ఆకాసమంత అరుగులు భూదేవంత గద్దెలు ఏసి దేవానుదేవతలు మల్లి తలంబ్రాలు పోసిగ్రట బిడ్డ. వాల్లకు రారాజులై మంచిగ కోటికి పడగలెత్తి కొల్లెరు పండు దొరికి రాజ్యాలకు రాజులై మాఁరాణై వాల్లు బతికిగ్రట....

## సత్యవతి కథ – కథావిశ్లేషణ

సత్యవతి కథ జానపద సాహిత్యంలో విభిన్న రూపాల్లో బాగా ప్రచారాన్ని పొందింది. సత్యవతి తన పాతివ్రత్యంతో పాము రూపంలో ఉన్న తన భర్తను మనిషిగా మార్చుకుంటుంది. సత్యవతి ఎన్నో పూజలుచేసి, ఎన్నో నోముల నోచి, పాముగా ఉన్న తన భర్తను మాములు మనిషిగా మారుస్తుంది. ఇసుకతో ధర్మగుండంలో దూకుతుంది. అదే ఇసుక స్తంభంగా ఇప్పటికి ధర్మపురి పుణ్యక్షేత్రంలో కలదు. ధర్మంగరాజు, ధర్మవతి అనే భార్యభర్తలకు అనేక నోముల ఫలితంగా లేక లేక సంతానం కలుగుతుంది. కాని ఆ సంతానం పాము రూపంలో జన్మిస్తాడు. దీంతో ఆ భార్యభర్తలు శోకసంద్రంలో మునుగుతారు. రాజు అవమానభారంతో కచ్చీరుకు, రాజ్యభవనానికి వెళ్ళకుండా ఉంటాడు. ఆ పామును ఒక సందూగులో(పెట్టె) పెట్టి అల్లారు ముద్దుగా చూసుకుంటారు. 12 సంవత్సరాలకు ఆ పాము నాకు పెళ్లి చేయమని అడుగుతాడు. ఎన్ని దేశాలు తిరిగిన ఎంత ధనమిచ్చినా పాముకు పిల్లనెవ్వరు ఇవ్వరని తల్లిదండ్రులు విలపిస్తారు. అయితే ఈ పాము వేరొక ఫోటో చూపించి నా పేరు చెప్పి కత్తి, కటారుకి పెళ్లి చేయమని అంటాడు. నేను చదువు సంధ్యల కోసం ముత్యాల బందరు పోయానని చెప్పమని చెప్తాడు. అలా చెప్పి బల్లాలరాజు కుమార్తె సత్యవతిని కత్తికి, కటారుకు పెళ్లి చేస్తారు. తన భర్త 12 సంవత్సరాలైనా ఇంకా రాలేదని సత్యవతి అత్త మామలను అడుగుతుంది. అప్పుడు ధర్మవతి మాకు పాము పుట్టింది. పామునే నీకిచ్చి వివాహం చేసామని నిజాన్ని చెప్తుంది. సత్యవతి ఎంతో ఏడ్చి తన భర్త అయిన పాము తనకు అప్పగించమని పైట చెంగు పడుతుంది. పాము రూపంలో ఉన్న భర్తని తీసుకుని ఎన్నో పుణ్యక్షేత్రాలను, యాత్రలను, నోములను, వ్రతాలను,

ఉపవాసాలను చేస్తుంది. కంటికి నిద్రలేక, కడుపుకు తిండిలేక తిరుగుతుండగా ధర్మపురి పుణ్యక్షేత్రానికి దైవ సహాయంతో వెళ్లి పామును తీసుకొని గోదావరి ధర్మగుండంలో దూకుతుంది. అలా చేయగానే తన భర్త మనిషి రూపాన్ని పొందుతాడు. సత్యవతి ఎంతో సంతోషిస్తుంది. కాని అత్త, మామలు పాము మనిషి రూపాన్ని పొందడం నమ్మక సత్యవతీని అనుమానిస్తారు. అప్పుడు సత్యవతి పాముని పట్టుకొని ఏడుసార్లు ధర్మగుండంలో దూకి ఏడు సార్లు మానవ రూపంలోకి తీసుకుస్తుంది. అప్పటికీ అత్త మామలకు కోడలి పట్ల నమ్మకం కుదురదు. చివరికి భూమి, ఆకాశం ఏకమై ఈమె సత్యవంతురాలు మహాపతివ్రత. పాము రూపంలో ఉన్న తన భర్తను మానవ రూపంలోకి తెచ్చుకుందని వాస్తవాన్ని చెబుతారు. మొదట అత్తమామలు శీల పరీక్ష పెట్టినా, అసలు నిజాన్ని తెలుసుకుని కొడుకుని మనిషి రూపంలో మార్చినందుకు సంతోషిస్తారు. సత్యవతి అత్తమామలు కోడలి గొప్పతనాన్ని ప్రశంసిస్తారు.

## 2.5.3.2 సత్యహరిశ్చంద్రుడి కథ

బండ్ల కనకమ్మ, తాళ్ళ ధర్మారం గ్రామం, జగిత్యాల జిల్లా.

సత్యహరిశ్చంద్రుడు ఏం జేసిండు. అయ్యో! దేవుడా! ఎట్టా జేత్తు. నేను సత్యంగ బతుకుతనని చెప్పి ఒకనాటి మద్యన మోకాటి ఆలోచన జేత్తుండు ఒకరోజు. ఒకరోజు గిట్ల పట్టుకొని మోకాలు మీద ఆలోచన ఏంజేత్తడు అయ్యా! నేను ఇన్నోద్దులు బతికిన గాని బతుకు వేస్ట్ ఉన్నది. ఎంత ధనసంపదలు ఉన్న, ఎంత బతుకు భాగ్యాలున్న, ఎన్ని ఏనుగులు, గుర్రాలు సంపతులు నాకు ఎన్ని ఉన్న గాని, పాలరాతులు బండలు తిరిగి, పట్టు వస్త్రంబులు కట్టి రారాజునై నేను బతికినగాని, ఎన్నటికి ఉన్న చచ్చి పుట్టుడు ఒక్కటై గాని ఒక్కటి సంపాయించుకుంట అని ఏంజేత్తడు. హృదయాన ఆలోచనలు జేత్తండు. హృదయాన ఆలోచన జేత్తుండు. నేను ఏదడిగినా లేదనకుండ నేను తప్పకుంట నేను సత్యంతో బతుకుతాను అంటుండు. ఒకరోజు ఆ ముచ్చట ఏంజేసిండు. మరీ ఏడు గజల ఏనుగా..! నువ్వ్ సత్యంతోని బతుకుత అని అంటున్నవ్. అరవై జనుల మందికి మల్ల జెప్పిండు. చెప్పితే విసమిత్రుడు నక్షత్రుడు తండ్రి కొడుకులట. తండ్రి కొడుకులైతే ఈడు ఇంత సత్తెవంతుడ? ఈడి సంగతి ఇగ నేను జూత్తనని ఏంజేసిండు. కొడుక ఈని వెంబడి ఎప్పటికి కుడి బూజాన ఎప్పటికి శనిశ్వరుడే ఉండాలి. ఈ సత్యహరిశ్చంద్రుడి కుడి భుజమందు శనిశ్వరుడే ఉండాలి. ఈడు ఏనాడు సత్యం గెలుత్తడో, ఈనే నీతి నేను జూత్తనని ఎంబడి పడ్డడట. అబ్బ నువ్వ్ అడిగింది లేదనవ్ రా..? నువ్వ్ అన్ని తీరులా సత్యవంతుడవ రా..? నీయంత సత్యం లోకం మీది ఎవ్వరిది లేదంటవ్..? నా అంత సత్యం ఎవలిది

లేదు. అన్నది అబద్ధం అసల్లే ఆడ. నా పానం బికీన నే అబద్ధమాడ అని అన్నడు. అన్నవోల్లే ఏమంటుండు. అరె ఏడు గజాల ఏనుగుని తెచ్చి నీవేయి. ఏనుగుల్లల ఒక్కేనుగు ఉన్నది. ఒక్కటేనుగు ఉన్నది. తెల్లటేనుగు ఉంది. ఆ తెల్లటేనుగును పూజించి పూలదండేసి దాన్ని నీ ఏడుగజాల కచ్చీరును ఎక్కియాలి. ఏడు గజాల కచ్చీరును ఎక్కించి ఏడు గజాల కచ్చీరు మీద, ఏడు గజాల ఏనుగు ఎన్ను మీద నిలబడి ఆకాశానికి గవ్వపెట్టి నువ్వ్ లాగున్నంత వజన్.. ఆకాసానికి విసరాలి ఆ గవ్వను. అరవై కోట్ల అయ్యలు, ముప్పైకోట్ల మునులు డెబ్బది కోట్ల దేవతలు చూడంగా విసేరే వరకు అదిపోయి సుక్కలకు ఒక మూరెడే తక్కువుంది. అగో! అక్కడ అగిందది. ఆ గూటి మీద గవ్వ ఇసిరిందు సత్య హరిశ్చంద్రుడు. ఇసిరేవరకల్లా గక్కడ సుక్కలకు ఒక మూరెడే తక్కువ ఉంది. అగో అక్కడాగింది గవ్వ. అగో అంత ధనం నాక్కియాలన్నడు. నువ్వ్ ఆడికిసిరినవ్ గద? ఆడ గవ్వ అగింది గద! ఆ గవ్వ ఈ భూమ్మీద మొదలుపెట్టి ఆ గవ్వేత్తు వెండి, బంగారం బాకీ ఉన్నవ్ రా అని అడిగిండు. అడిగే వరకు లేదనన్నడు గద? కాదనన్నడు గద? నువ్వడిగింది ఇత్తనంటివి నీ సంగతి జూద్దనంటే బంగారు కోటిల్లు, కోట్లాది కోట్ల ధనం, వేయిల వేయిల మంది పెట్టి జీతాగల్లను పెట్టి తాళాలు, తలుపులు తీసి భూమ్మీద మొదలు పెట్టి ఆకాసానికి రాసి బూసిండు. ఆకాసానికి రాసి బూసే వరకు చుక్కల కంట మూరెడంత తక్కువుంది. అబ్బ ఇంత ధనం, ధాన్యం అంత ఒడిసిందయ్య అరవై జిల్లాలు అమ్మిండు. వెండి, బంగారం, బంగారు గుమ్మాలు గుడిసేలు మొత్తం సంపాదనంత భూమ్మీద మొదలుపెట్టి ఆకాసానికి పోసిండు. పోసినగాని ఇంక సరిపోతలేదు. సరిపోకుంటే ఇంక మూడు కోట్ల బాకీ ఉన్నవ్ రా అంటుండు. ఇంక మూడు కోట్ల ఎట్ల మరీ ఎట్ల గీ బాకీ తీరాలి. అని అంటే ఏమంటుంది భార్య. ఉరికి పోయి ఒక తన్ను తన్నిండు ఈ శనిశ్వరుడు. ఈ శనిశ్వరుడు సత్యహరిశ్చంద్రుడిని ఒక తన్ను తన్నిండు. అన్ని పోయినగాని ఇంక మూడు కోట్ల బాకీ ఉన్నవ్ రా అంటుండు. అరె అన్న మాట తప్పనన్నవ్ గదరా! మూడు కోట్లు ఎక్కడ్నుంచి కడతవ్ రా! అని అడుగుతుండు. అడిగితే భార్య చంద్రవతి ఏమంటుంది. అయ్యా! నీ బంగారు పాదానికి వందనాలు. తండ్రీ మాయి అరవై జిల్లాలు పోయి నూటొక్క కిరీటాలు పోయినవ్, భూజాన భుజకీర్తులు పోయినయి.. ఏటి మీద ఎడ్లు వోయినయి. పాటి మీద బర్లు వోయినయి. అన్ని పొయినయ్. ఆకరుకు నేను, నా కొడుకు, నాభర్త మిగిలినం. నా దండ రెక్కలకు తాడు కట్టి ఆ మూసపురి అంగడివోయి నన్ను అమ్ముకొచ్చి ఆ కోటి రూపాయలు కట్టమంటుంది. అన్నవోల్లే అయ్యో! ఏ జన్మలో పాపాత్ముడనో, ఏ జన్మకు ఎన్ని పాపాలు చేసిన్నొ, నాకు

ఈ జన్మకు ఇంత అనుభవం వచ్చెనని కన్నీరు కుడికంటి శోకాలు కుంబవర్షాలు, ఎడమకంటి శోకం ఏరులై పారాగా అప్పుడు హరిశ్చంద్రుడి భార్య సత్యవతి దండ రెక్కలకు తాడు కట్టిముసాపురి అంగట్లో నను అమ్ము అయ్యా అంటే ఆ ముసాపుర్ అంగట్లో శనివరుడు తన్నినోల్లే ఈమెను కాల్లు రెక్కలు కట్టి ముసాపుర్ అంగడిలో తీస్కపోయి ఏమంటుండు. అరవై కోట్ల అయ్యలకు మొక్కిండు. ముప్ప కోట్ల మునులకు మొక్కిండు. డెబ్బకోట్ల దేవతలకు మొక్కి ఎన్ని జన్మల ఏంత పాపకారిని, ఏంత దోషాకారిని అయ్యో! ఈ జన్మకి ఉన్నందంతా పోయింది. భార్యను కూడ అమ్ముకోబడితే తండ్రి అంత పాపకారిని ఎన్ని జన్మల పాపాత్ముడనొ.. ఈ జన్మకు నాకికట్టం వచ్చెనని అయ్యా నా బార్యను కొనుండ్రి. మాఁ సత్యవంతువురాలు మాఁ పతివ్రతురాలు నా భార్య చంద్రమతిని కొనండయ్య వరకు. ఆ యేడుపు ఆమె ఏడుపు భగవంతుడికే మలినమయి అప్పుడు ఒక ముసలి బావనయ్య గొడ్డువాడు వచ్చి నాకు బిడ్డలు లేరు. సంతానం లేదు. కోటి రూపాయలిచ్చి నా బిడ్డ తీరు కొనుకుంటానని చంద్రవతిని కొన్నడు. ముసలి బావనయ్య కొని ఇంటికి తీస్కపోయిండు. భార్యని, కొడుకుని కోటి రూపాయలకే ఇచ్చిండు. సత్యహరిశ్చంద్రుడు అయి పట్టుకొని ఒక చెట్టు కింద ఈ బాకీ కట్టుదామని చెట్టుకింద కూకుంటే మల్ల శనివరుడు అచ్చిండు. అరె నిను నిల్చిన కాడ నిల్వనీయ్య. ఉన్నకాడ ఉండనీయ, పన్నకాడ పన్ననీయ, నిను అరిగోస పెట్టెతందుకు నేనున్న. అరె.. నిను తుక్కు తుక్కు వీపు పగలగొడత హరిశ్చంద్రుడిని. దేవుడా! అనేకమైనటు వంటి దెబ్బలు కొడుతుండు. దెబ్బలు కొడితే ఏమంటుండు. ఓ తల్లి నేను ఏం పాపకారిని ఈ జన్మలో ఇంత కట్టం అని చెప్పి పెళ్లాన్ని అమ్ముకుంటి. ఉన్నదంతపాయే అరవై జిల్లాలు పాయే, నూటోక్క కిరీటాలు పాయే, అయ్యా నాకేమికట్టం అచ్చిందని ఓ ఏరులై పారుతున్నయ్. కంటి శోకం ఏరులై పారుతున్నయ్. ఆ దేవునికి మూల్యమంది పెద్ద మాదిగ జాంబవంతుడు వాడు. పెద్ద కోరమీసం పెట్టుకొనచ్చి ఏడు గజాలు ఏత్తుతోటి అచ్చి ఏమంటుండు. నేను కోటి రూపాయలకు నిను కోంటానని ఓ హరిశ్చంద్ర! నిను కొంటానని అన్నడు. కోటి రూపాలిచ్చి ఆయనే కొన్నడు. ఆ విస మిత్రుడు ఏమంటుండు ఇంకా బాకీ ఉన్నడు. అగో కోటి రూపాలు బాకీ ఉన్నడు. మరీ కోటిరూపాలు నీకిత్తున్న గద! టక టక కోటిరూపాలిచ్చిండు. ఎవలకు సత్యహరిశ్చంద్రుడు చేతిలో పెట్టిండు. ఆ సత్యహరిశ్చంద్రుడు ఎవలి చేతిలో బెడుతుండు విసమిత్రుడు చేతిలో పెడుతుండు. శనివరుడు చేతిలో బెడుతుండు. ఇగో బాకీ తీరింద హరిశ్చంద్ర మహరాజా బాకీ తీరిందా! బాకీ తీరింది. తీరింది అన్నవోల్లే నువ్వు నాకు జీతం ఉండాలె. నీకు కోటి రూపాల అప్పు నేను కట్టినా...! నీ బాకీ తీరింది. నువ్ నా

కాట్నాల గడ్డ దగ్గర కావలుండు అని అప్పుడు ఆ మాదిగవాడు సత్యహరిశ్చందుడికి చెప్పిండు. కిరిటాలు పోయినయ్ భుజాన భుజకీర్తులు బోయినయ్. జానెడు గడ్డం మూరెడు మీసం అయి సాదువేసమయి అయ్యో! ఒక బిచ్చగాడి వేసమయి ఒక బుడ్డ గోసి పెట్టుకొని ఆ మాదిగవాని వెంట బోయిండు. పన్నెండెకరాల పెట్టు ఆ కాట్నాల గడ్డ. ఆ కాట్నాల గడ్డలో అడవి. ఆ అడవిలో కట్టెలన్ని తెచ్చి ఆ కట్నాల గడ్డలో ఏసుడు. అయితే ఆ కాట్నల గడ్డలో ఏసిండంటే ఆ కాట్నం ఎప్పుడు కాలుడే. ఆ గుట్ట కింద ఉండే పల్లెలు, పట్నాలు మొత్తం పీనుగులన్ని ఈ కాట్నంలోకి ఆచ్చుడే. రూపాయి పావులా సోదు బియ్యం. అగో ఇటు దిక్కు రూపాయి పావలా ఇటు దిక్కు సోదు బియ్యం. అగో అన్ని తీర్ల అట్లా పెట్టి ఉంచే వరకు ఈ సత్యహరిచంద్రుడు ఏం అంటుండు అయ్యా! నేను కట్టెలల్లా మోసి, కాట్నంలో కట్టెలు ఏసుడు మరీ నేను ఏం తినాలె, అయ్యా! నేను ఏం తినాలో నాకు తూటు తీగల తీరు పేగులు గుంజుతున్నయి. నేను ఏం తినలి ఏం జేయ్యాలి అంటుండు. అంటే పిండా కూడు అన్నం పెడతురు గదా హరిచ్చంద్ర నీకు. మూడు రోజులకు చచ్చిపోంగనే  పిట్టలకు పెట్టుడే. ఆ పిట్టలకు పెట్టుకుంటే నువ్వు భోజనం తిను. పిట్టలు తినంగ ఉన్నదే నీకు భోజనం అని చెప్పిపోయిండు జాంబవంతుడు. ఆ మాదిగోడు వోయినోలే పిట్టలు కొట్టుకుంటుండు. కట్టెలు మెత్తండు పన్నెండెల్లు అయ్యింది అట్ట గడవబట్టి హరిగొసపడ్తాండు. కుడి కంటి శోకాలు కుంబ వర్సాలు, ఎడమ కంటి శోకాలు ఏరులై పారి, అయ్యో! తండ్రి నాతల్లి దండ్రులు నాకెంతో ధనం దాన్యం సంపాయించిరి. అయ్యా! నాకెంత కట్టం వచ్చెనో తండ్రి. ఎన్ని జన్మ జన్మల పాపినో? ఆ పాపం నన్ను సుట్టుకున్నది ఇప్పుడు అని ఏడ్తుండు. పిట్టలు కొట్టుకుంటా తింటుండు. అనేకమైనట్టు ఏడుసుకుంటా అలసేరుకుంటా ఆ సత్య హరిస్చంద్రుడు ఏడుసుకుంటుండగ, ఇక్కడి ముచ్చట ఇక్కడే ఉండంగా, ఈయన గోస ఇట్లే ఉండంగ. ఆ బావనయ్య దగ్గర చంద్రవతిని భార్యని అమ్మిండు గదా. ఆ అమ్మిన కాడ కొడుకుకు భార్యకు ఆడ ఏం గోసత్తుంది. ఆవునే ఓ చంద్రి నువ్వు నిన్ను కోటి రూపాలు పెట్టి కొన్నదు మా ముసలోడు. మా బావనయ్య నువ్ మా బిడ్డ తీరని మేం అనుకున్నం నువ్వు దంచుతున్నవ్ ఇసురుతున్నవ్.. బువ్వ అండిపెడుతున్నవ్ మాకు. అన్ని బర్ల పెంట తీత్తున్నవ్ ఏడు దొడ్లపెండ తీత్తునవ్. ఏడు ఆకిల్లు ఊడుతున్నవ్. కారం నూరుతున్నవ్, భోజనం పెడుతున్నవ్. గానీ నీ కొడుకు తట్టెడు తింటుండు. నువ్ తట్టెడు తింటున్నవ్. మీకు బువ్వ ఎక్కడ్నుంచి వత్తదే. అగో! నీ కొడుకు అగో బావన్ల పిలగాల్లందరు ఆకులకు పోతుండ్రు ఇత్తరాకులకు. అగో! నీ కొడుకుని ఆకులకు తోలని ఒక గుడ్డ పేగు ఇచ్చి ఆ పిలగాడిని ఆ లోహితుడిని ఆకులకు

తోలింద్రు. ఆకులకు తోలినోల్లే ఆకులకు పోయిన కాడ అప్పుడు ఏమైందంటే రోజు పోయేటోల్లేమో కడ కడకు పోయి ఆకులు తెంపుతున్నర్.. గీ పిల్లగాడు ఎంటనే పోయిండు. ఆ పుట్ట మీద మోదుగుసెట్టుంది. ఆ మోదుగు సెట్టు ఎక్కిండు. పుట్టలోకెల్లి పాము ఎల్లింది. పట్టి నరానికి సరిసింది. నరానికి సరిసినోల్లే బురుసుల బురుసులు కక్కి కింద పడి మరణం అయిపోయిండు పిలగాడు. ఆ బావోనోల్ల పిల్లగాళ్లు ఉరికి ఓ తల్లి చంద్రవతి1 నీ కొడుకు సచ్చిపోయిండమ్మ పాము కుట్టి అనంగానే అయ్యో! నా కొడుకా అంటే ఆం...! గింత టైంకు పోతనానే బొడ్డి నువ్ గిప్పుడు పోతావానే నువ్వ్ బర్లకు పెండ తియ్యాలే. వొడ్లు దంచాలి. నువ్వ్ అన్ని పనులు తీరినంక దీపాలు అంటపెట్టి కోళ్లు కమ్మి, గొడ్లు, బర్లు కట్టేసినంక నువ్ వోవాలి అన్నడు. అన్నవోల్లే అన్ని పనులు జేసి జంగల్ల మీద ఉన్నోల్లేమో ఊరి దిక్కు అత్తుర్రు. ఊరి దిక్కున్న తల్లేమో జంగల్లకత్తుంది. ఓ దేవుడా! అయ్యో! దయ్యాలనక, భూతాలనక నా కొడుకు సచ్చిపోయిండు. నా కొడుకు దంటకు అయ్యో తండ్రి! దేవా! ఎక్కడున్నవయ్యా? నను పుట్టించిన నా తండ్రి కనేగంట పుట్టేడు ఏడుసుకుంట తల్లి... ఆ వనవాసంలో పడిపోతే కొడుకు ఎక్కడ సచ్చి పోయిండేమో చూడకపాయే ఎలుగుండంగ.. గీ రాత్రి గామెక్కడ దొరికించుకుంటంది. ఎక్కడ దొరికిద్ది గా పీనుగూ. ఆ దేవుడు పత్యక్చంగా పీనుగ్గాడికే పోయింది. పీనుగ్గాడికి వోయి కొడుకు పట్టుకొని. కుడికంటి శోకాలు కుంభ వర్షాలు, ఎడమకంటి శోకాలు ఏరులైపారి. ఓనా తండ్రి! నాదేం కట్టం. నా భర్త ఒక ఎంబడి వాయే. నా భర్త ఎక్కడికి పోయిండో. నేను ఎక్కడికి పోతినో. నా కొడుకా నువ్వోతివి. అని ఆ తల్లి దబ దబ బొచ్చెల సరుసుకొని కొడుకా కొడుకా అని అర్ధమరాత్రి ఆ నట్టనడవిలో అయ్యో! దేవుడా ఎన్నో ఉన్నాయి. ఎన్నో ఉన్నాయి. ఎన్నో భయం పెట్టించేటివి. పెద్ద పులులున్నయి, పాములున్నయి, దయ్యాలున్నయి, భూతాలున్నయి అసోంటి అడవిల కొడుకును వట్టుకోని అంగలార్చుతుంది. శనివరుడు ప్రత్యక్చమై ఏమంటుండు మనిషి రూపంగా తెల్లని అంగీ తొడుక్కుని తెల్లని దోతి కట్టుకుని ఏమంటుండు. ఓ చంద్రవతి! నువ్ ఏడుసుకుంట ఉంటే నీ పీనుగుకు రూపాయి పావులా ఎలుగైతే సోడు వోయి రూపాయి పావలా ఎక్కడి నుంచి దొరుకుతయ్. నువ్వ్ నీ కొడుకును ఎత్తుకొమ్మన్నడు. ఎత్తుకుంది భూజాన పెట్టుకొని ఆ శనివరుడు ముంగట ఈమె ఎనుక. ఆ కాట్నాలా గడ్డ కాడికి పోయింది. ఆ కాట్నాలా గడ్డ కాడికి వోయి దొంగతనన ఎత్తనని పోయేవరకు ఆ సత్యహరిశ్చంద్రుడు ఓ దొంగ! ఎవలమ్మ మీరు ఓ ఆడ దొంగ నువ్వ్ పీనుగుని ఎత్తుకుని వచ్చినవా? దొంగతనాన ఆండ్ల ఎత్తవా...? పీనుగును. ఆగు ఆడ దొంగ. అయ్యా! నేను దొంగ కాదు. నేను మాం

పతివ్రతను. మాం సత్యవంతురాలునూ, నను నా భర్త బావనయ్యకు అమ్మిండు. నా భర్త ఎక్కడికి వోయిందు నాకు దెల్వదు. నాది అరవై జిల్లాలు, నూటోక్క కిరీటాలు అయ్యా! రారాజులం. నాకచ్చింది గీ కట్టం. అని చెప్పంగనే నీ మెడలో తాలి అండ్లెయ్యి. ఆ కాట్నంలేయ్యమ్మ.. అబ్బ! నేను  పతివ్రతని అయినప్పటికీ నా మెడలో తాలి నా భర్తకి కండ్ల పడుతది. ఏరేటోల్లకి కండ్ల బడది. ఈ సత్య హరిశ్చంద్రుడికి కనబడ్డది. అప్పుడు కొడుకును కింద పడేసి వోయింది. భర్త కాల్ల మీద పడ్డది. భర్త కాళ్ల మీద పడి అయ్యా! నువో తెరువు... నేను తెరువు.. అంగడిచ్చుల్ల బతుకై పొయింది మనది. మనకి గింత కట్టం దేవుడు బెట్టిండని భర్త మీద పడి ఆమె ఏడ్చింది. భార్య మీద భర్త, భర్త మీద భార్య పడి ఏడిసి కొడుకు మీద పడి ఏడిసినారు. అప్పుడు పరమ తండ్రి ప్రత్యక్ష్యమైండు. పొద్దుపొడిసేవరకల్లా తెల్లారిందాకా ఈళ్లు ఏడిసి కరకర పొద్దు పొడవంగనే ఆ దేవునికి మాల్యం అందింది. అరె హరిశ్చంద్ర! నువ్వు పడరాని పుల్లెందులు పడ్డవురా...! పెట్ట రాని కట్టలు పెట్టాను రా,,,! అరవై జిల్లాలు వోయినయ్..! నూటోక్క కిరీటాలు పోయినయ్..! రాజ్యం పోయింది. దేశం వోయింది. పెండ్లాం అమ్మినవ్. పెండ్లాన్ని అమ్మి, కొడుకును అమ్మి, కొడుకా..! నువ్వు గూడా అమ్ముడుపోయినవ్ గదరా..! నువ్వ్ ఈ దొంగతనాన పీనుగును కాట్నంలో వెయ్యరాదు. మేడలో తాలి ఏయ్యాలి అన్నవ్ రా సత్యవంతుడా...! నీ బత్తి మెచ్చినని అప్పుడు భగవంతుడు ప్రత్యక్ష్యమైండు. అరె కొడుకా కోరితే కోరినంత ఇత్త.. అడిగితే అడిగనంత ఇత్త... అరె హరిశ్చంద్ర చెప్పురా అంటే.. అయ్యా! మాకేమద్దని, హరిశ్చంద్ర మారాజు ఏం కోరుతుండు.. అయ్యా! ఎన్నోద్దులకు బతికిన. ఎన్ని రాజ్యాలేలిన, ఎన్ని దేశాలున్న, సచ్చుడు తప్పదు. అయ్యా నాకు ఏది అద్దు. బొందెతో నా కొడుకు, నా భార్య మేము బంగారు పూలరథం రావాలి. బొందెతోనే దేవలోకం రావాలని కోరుకున్నాడు. కళ్లు మూసుకో రా అని అనే వరకు కళ్లు మూసుకున్నడు కొడుకును, భార్యను, ఆయనను ఆళ్లకై ఆ బంగారు పూలరథం అచ్చింది. అమృత బాండం ఈళ్లకు ముగ్గురుకు తాగిచ్చి, ఆల్లను బంగారు పూల రతంలోని పెట్టుకొని దేవుళ్లల్ల దేవుడై దేవలోకం పోయిండ్రు.....

## సత్యహరిశ్చంద్ర కథ – కథావిశ్లేషణ

సత్యహరిశ్చంద్ర కథ శిష్టసాహిత్యంలో కూడా చాలా ప్రాముఖ్యతను పొందింది. జానపద, శిష్ట సాహిత్యంలో బాగా ప్రచారంలో ఉన్న కథ సత్యం యొక్క గొప్పతనాన్ని వివరిస్తుంది. సత్యమేవ జయతే

అన్న శ్లోకానికి సరిగ్గా పోసిగిన కథ. ఎన్ని కష్టాలువచ్చినా, ఎన్ని ప్రలోభాలు ఎదురైనా, ఎంత దీనస్థితికి దిగజారిన సత్యాన్ని వీడని సత్యహరిశ్చంద్రుని కథ నాడు, నేడు స్ఫూర్తిదాయకమే.

హరిశ్చంద్రుడు అనే రాజు చాలా సంపన్నుడు. ముప్పాయారు జిల్లాలకు రాజు. సర్వభోగాలు కలిగినవాడు. ఆ రాజుకు ఎంత సంపద ఉన్నా, ఎన్ని భోగాలు అనుభవించిన జీవితంలో సంతృప్తి కలుగదు. మోక్షం కోసం సత్యాన్ని వీడనాడనని శపథం చేసుకున్నాడు. ఆ శపథం సంగతిని రాజ్యంలో ప్రకటిస్తాడు. ఆ విషయాన్ని విన్న తల్లికొడుకులు విశ్వామిత్రుడు, నక్షత్రకుడు హరిశ్చంద్రుడు సత్యాన్ని వీడకుండ ఎలా ఉంటాడో చూద్దాం అనుకొని అతన్ని నానా విధాలుగా పరిక్షీస్తారు. విశ్వామిత్రుడు హరిశ్చంద్ర మహరాజు దగ్గరికచ్చి అడిగింది లేదనకుంటా ఇస్తావని విన్నాను. నిజంగా అడిగింది లేదనుకుండ ఇవ్వగలవని అడుగుతాడు. ముందుగానే దుర్బుద్ధితో వచ్చిన విశ్వామిత్రుడు హరిశ్చంద్ర రాజు నీకున్న వెయ్యి ఏనుగులల్లో తెల్లటి ఏనుగును కచ్చీరు ఎక్కించి దాని వెన్ను నిలబెడి ఆకాశంలో గవ్వను విసరమని చెప్తాడు. ఆ గవ్వ విసరగానే నక్షత్రానికి మూడు అడుగుల దూరం వరకు గవ్వ ప్రయాణిస్తుంది. నేల నుండి అక్కడి వరకు ధనధాన్యాలను కొలిచి ఇవ్వమని విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడిని అడుగుతాడు. ఇచ్చిన మాటను వెనక్కు తీసుకొకుండా రాజు దగ్గర ఉన్న సంపదనంత, ముప్పాయారు జిల్లాలను అమ్మి తెచ్చిన ధనాన్ని నేల నుంచి కొలిచి ఇస్తాడు. ఇంకా మూడు కోట్ల రూపాయలు తక్కువ అవుతాయి. రాజ్యం, సంపద, ఆస్తులు సర్వం పోగొట్టుకొన్నాగని రాజు విశ్వామిత్రుడికి ఇచ్చిన మాటను నెరవేర్చలేకపోతాడు. ఎలాగైనా తాను ఇచ్చిన మాట తీర్చడానికి అతని భార్య తనను అమ్ముకొనచ్చి ఆ డబ్బును విశ్వామిత్రుడుకి ఇమ్మని చెప్తుంది. అలాగే భార్యను, కుమారుడు లోహితుడిని ముసాపూర్ మార్కెట్లో ముసలి బ్రాహ్మణుడికి అమ్మితే, కోటి రూపాయలు ధర పలుకుతారు. ఆ కోటి రూపాయలు తీసుకచ్చి ఇస్తాడు. ఏ జన్మలో ఏం పాపాలు చేసానో నా భార్య, పిల్లలను అమ్ముకోవాల్సి వచ్చిందని బాధపడతాడు. శనీశ్వరుడు అతని కుడిభుజం మీదనే ఉంటూ అతన్ని తీవ్రంగా బాధిస్తాడు. అతన్ని అప్పు తీర్చమని చాలా కొడతాడు. ఎక్కడికి పోతే అక్కడికి వస్తాడు. అప్పు తీర్చమని బాధిస్తాడు. మిగతా బాకీ ఉన్న అప్పును తానేలా తీర్చాలో అర్థంగాని సమయంలో మాదిగ కులానికి చెందిన జాంబవంతుడు వచ్చి హరిశ్చంద్ర నీ అప్పు తీరే మార్గాన్ని నేను తీరుస్తాను. నా దగ్గర పాలేరు పని చేయమని అడుగుతాడు. దానికి ఒప్పుకున్న హరిశ్చంద్రుడు కోటి రూపాయలకు జాంబవంతుడి దగ్గర అమ్ముడు పోయి విశ్వామిత్రుడి అప్పును తీర్చుతాడు.

ఆ తర్వాత అమ్ముడు పోయిన భార్య పిల్లోడు ముసలి బ్రాహ్మణుడి దగ్గర నానాచాకిరి చేస్తారు. పడరాని పాట్లు పడతారు. వంట చేయడం, పేడ తీయడం, పాలు పితకడం, దొడ్డి ఊడువడం, పాత్రలు తోమడం ఇలా ఆ బ్రాహ్మణుడి ఇంట్లో వెట్టి చాకిరి చేస్తుంది. అయిన కనుకరించని ఆ బ్రాహ్మణుడు తన కొడుకును కూడా విస్తారాకులను కోయడానికి పంపించమని ఒత్తిడి తెస్తాడు. తెల్లని సంచిని వేసి విస్తరాకు పంపిస్తే అక్కడ పాము కుట్టి కుమారుడు లోహితుడు మరణిస్తాడు. మరణించిన కుమారుడు కాటికి తీసుకెళ్లడానికి ఎవ్వరు కూడ సహాయం చేసేవారు లేరు. తల్లి తన కొడుకును కాటికి తీసుకెళుతుంది. జాంబవంతుడికి అమ్ముడుపోయిన హరిశ్చంద్రుడు కటిక పేదవాడిగా జీవితాన్ని వెల్లతీస్తూ స్మశానంలో పని చేస్తున్నాడు. స్మశానంలో వచ్చిన శవాలను కాల్చుకుంటూ శవాలకు పెట్టిన ఆహారాన్ని పిట్టలు తిన్న తర్వాత మిగిలినది తినుకుంటూ బతుకుతాడు. మరణించిన కొడుకుని తీసుకొని వచ్చి సత్యహరిశ్చంద్రుడి భార్య కాడులో కొడుకు శవాన్ని వేస్తుండగా హరిశ్చంద్రుడచ్చి ఎవరమ్మా! మీరు డబ్బులు చెల్లించకుండా కాడులో శవాన్ని కాల్చడానికి వేస్తున్నారు అని అడుగుతాడు. నేను మహా పతివ్రతనూ, సత్యవంతుడి భార్యను అని చెప్తు తన కొడుకు మరణించాడని తాను కాటిలో వేయడానికి వచ్చానని చెప్తుంది. దానికి అనుమతివ్వకుండా ఆ హరిశ్చంద్రుడు తప్పక డబ్బును చెల్లించవల్సిందిగా అడుగుతాడు. డబ్బు చెల్లించలేనందుకు గానూ నీ మెడలో మంగళ సూత్రం తీసివ్వమని అడుగుతాడు. అప్పుడు చంద్రమతి నా భర్తకు మాత్రమే కనిపించే నా మంగళసూత్రం తనకు కనిపించిందంటే తానే భర్త అని తెలుసుకొని బోరుమని ఏడుస్తుంది. భార్యభర్తలు ఇద్దరూ ఒకరి బాధను ఒకరు పంచుకోగా ఆ దేవుడు ప్రత్యక్షమైతాడు. కొడుకు శవాన్ని కాటిలో కాల్చడానికి కూడా తన భార్య మంగళసూత్రాన్ని డబ్బుకు బదులుగా అడిగిన నువ్వు నిజంగా సత్యవంతుడవి అని చెప్పి వారిద్దరూ కోరుకున్నట్లుగానే పూలరథాన్ని (పుష్పక విమానం) తెప్పిస్తాడు. హరిశ్చంద్రుడికి, అతని భార్య చందుమతికి, కొడుకు లోహితుడికి ముగ్గురి ఆత్మలకు మోక్షం కలిగించి స్వర్గలోకానికి పంపిస్తాడు. హరిశ్చంద్రుడు తాను పొందాలనుకున్న దాని కోసం సత్యాన్ని వీడకుండా ఎన్నో కష్టాలను అనుభవించి చివరికి తాను అనుకున్నది సాధించుకుంటాడు.

1. సత్యహరిశ్చందుడి లాంటి వారు మన ప్రస్తుత సమాజంలో చాలా అరుదుగా కనిపిస్తుంటారు. సత్యం కోసం, తాను ఇచ్చిన మాట కోసం రాజ్యం, అధికారం, సంపద, ఆస్తులు సర్వం కోల్పోయాడు. చివరికి తన భార్యను, కుమారుడిని దూరం చేసుకున్నాడు. ఎన్ని భోగభాగ్యాలున్న సంతృప్తి చెందని

హరిశ్చంద్రుడు మోక్షం కోసం సత్యాన్ని నమ్ముకొని ఎన్నో పరీక్షలను ఎదుర్కొని అనుకున్నది సాధిస్తాడు. ఎన్నో కష్టాలు వచ్చిన మనం అనుకున్న లక్ష్యాన్ని చేదించడం మరువకూడదనే విషయాన్ని నేర్పుతుంది ఈ కథ.

2. "తల్లి! నేను ఏం పాపకారిని? ఈ జన్మలో ఇంత కట్టం అని చెప్పి పెళ్లాన్ని అమ్ముకుంటి. ఉన్నదంత పాయే అరవై జిల్లాలు పాయే, నూటోక్క కిరీటాలు పాయే, అయ్యా నాకేమికట్టం? అచ్చిందని ఓ ఏరులై పారుతున్నయ్! కంటి శోకం ఏరులై పారుతున్నయ్!" పై కథలో ఈ వాక్యాలను బట్టి సత్యహరిశ్చందుడి మనోవేదనను కథకురాలు ఎంతో విషాదభరితంగా వ్యక్తపరిచింది.

3. ఈ కథలో కథకురాలు చేసిన కథాకథనం గుక్క తీయకుండా అనర్గళంగా, మంచి ధారణ శక్తితో, అలవోకగా చెప్పడం విశేషం. కథకురాలి కథనం ఏకదాటిగా చెప్తూ శ్రోతలను కట్టిపడవేసేలా ఉంటుంది.

4. భర్త మాటను నిలబెట్టడానికి హరిశ్చంద్రుడి భార్య చంద్రమతి బ్రాహ్మణుడికి అమ్ముడుపోయి నానా వెట్టిచాకిరీ చేస్తూ అనేక ఇబ్బందులు పడుతుంది. ఆస్తిపాస్తులు అన్ని పోయిన తనను కూడ ముసాపూర్లో అమ్మి భర్త బాకీ తీర్చమని చెప్పిన త్యాగశీలురాలు చంద్రమతి. భర్త మనసుని అర్థం చేసుకుని భర్త సుఖాల్లోనే కాదు భర్త కష్టాల్లో కూడా పాలుపంచుకున్న చంద్రమతి ప్రతి వివాహిత స్త్రీకి ఆదర్శమైన పాత్రగా చెప్పవచ్చు.

## 2.5.3.3 రామదాసు కథ

ఇమ్మిడి మల్లయ్య, కమునూరు గ్రామం, జగిత్యాల జిల్లా.

రామా దాసుడవయ్య...! రామచంద్రా! ఆ మన రామదాసు మన దాసుడయ్యా. గోలుకుండ దాసిలు పైకం వసూలు చేసి రామలక్ష్మణులకు గుళ్లు, గోపురాలు కట్టించినారు. సీత దేవికి సింతాకు పతకం చేయించాడు. లక్చన్నకు జేయిత్తి లచ్చవరాల పేరు రామచంద్ర, సీత దేవికి సింతాకు పతకం రామచంద్ర. రాఘవ రామచంద్రా! అమ్మా దేవి! జానెడు గడ్డం, మూరెడు మీసం దోమలు కుట్టినయి. నేను ఎన్నాళ్లు ఉందును ఈ కైదులోన. మన యొక్క దాసుడయ్య. ఆ యొక్క రామాదాసును తోలుకు రావాలి. అమ్మా! వినవమ్మా! జానకీ దేవి. నీవు తన మందిరము చెలియు. పతి రామ చిలుకను తెచ్చి పన్నెండ్లు తానుంచే లలనా... గనకీర్తి నెదము నీతి సీతమ్మ, ఆ యొక్క రామదాసు పన్నెండ్లు రామ చిలుకను పంజరంలో పెట్టి బంధించి సాధిండు. కాబట్టి మళ్లీ ఆయనకు పన్నెండేళ్లు విడుదల లేదమ్మా.!

పన్నెండ్లు నిండ లేదమ్మా. నిండేసరికి మేం రామాదాసును తీస్కత్తం. ఆయన రామాదాసు అక్కడ శరణు అనని పోతాం. కాని ఇప్పుడు టైం గాలేదు. తెల్లావారాలె రేపు పొద్దున ఆహార మోరీలు ఎన్ని ఉన్న కొలతేయడం లేకుండ పట్టుకపోయి తానీషా వద్ద కట్టి రామాదాసుని తీస్కరావాలి. సరేమ్మా పోతున్నం. వెళ్లిన్రు ఇద్దరు రాముడు, లక్ష్మణుడు. వరహాలు, మోరీలు వరద మాటీంకిలు, లచ్చనర వరహాలు, మోరీలు హరినామ టంకీలు కొలత ఏదు లేకుండ తీస్కపోయి ఆ తానీషా వద్ద కట్టి రామదాసు బందీఖానా నుండి తీస్కరావాలి. సరే వెలుతున్నామమ్మా..! రామాదాసు జమాన్లు వోయి రాముల వారు, లక్ష్మణ ఇద్దరు పోయిన్రు. అక్కడ తానీషా మంత్రి పడుకున్నడు. ఇక్కడ అక్కన్న పడుకున్నడు. అక్కడ మాదన్న పడుకున్నడు. వీలిద్దరూ పోయేసరికి వాల్లు ఏమన్నరు. ఎవరు యజమానులు లేరు. ఇందు ఎవ్వరు తోలితే వచ్చినారు. ఎవరు జమానులు మీరు. ఇందు ఎవ్వరు తోలితే వచ్చినారు. మేం రామాదాసు జమానులం. రామాదాసు తోలితే వచ్చినాం. అగో! వీళ్లు రామాదాసు జమానులట. వాళిద్దరున్నారు. వీరు రామాదాసు జమానులమని చెప్పారు. వాడు తానీషా పాషా నిలువుటద్దం పెట్టుకోని పన్నడు. గొల్కోండ తాశీలు పైకం మొత్తం కట్టి వారి దగ్గర రశీదు తీస్కోని రామలక్ష్మణులు వెళ్లిపోయారు. వాడు లేచే సరికి అద్దం బొచ్చెమీదికెల్లి ఇక్కడకు జారింది. చూసిందు అరె అక్కన్న, అరె మాదన్న ఎవ్వర్రా.. రూపాలు కట్టినోల్లు. ఏమో ఎవరంటే మేం రామాదాసు జమానులం అన్నారు. రామాదాసును విడుసుకచ్చి కైదీలో వేసినం. అయిన జమానులట ఏంపేరట రామన్న, లక్ష్మన్న అన్నారు. అరే మీరెక్కడున్నరు. ఈ రశీదు కట్టెటప్పుడు మీరు జాడలేద? అక్కడేనా నేనుంటినయ్యా మాదన్న. నేనుంటినయ్యా రూపాలు కట్టేటప్పుడు నను పిలువలేదా? నను మన్నించి పిలువలేదయ్యా? అరే నాకేం తెలువదు. మిమ్మల్ని నేను పిలువలే... సరే ఖైదులో ఉన్నదు రామాదాసు. తీస్కచ్చి ఆయన గడ్డం మీసం సాబు చేయించి తోలుంర్డి. సరే రామాదాసు అయ్యా! మీ యొక్క జమాన్లు వచ్చి తాశీలు పైకం కట్టిపోయారు. నువ్వు బందీఖానా నుండి ఎల్లిపోవాలి. అని సాపు చేపించి ఎల్లగొడతం. నాకు జమాన్లు ఉన్నారు. నాకు జమాన్లు లేరు. నేను ఆ గొల్కోండ తాశీలు పైకమంత వసూలు చేసి రామలక్ష్మణులకు గుళ్లు, గోపురాలు కట్టించాను. లక్ష్మణునికి లక్ష్యల పేరు చేపించిన, సీతకు సింతాకు పతకం చేయించిన దాని గురించే గద! నన్ను తెచ్చి బందీఖానాలో ఏసింర్డు. నాకు జమాన్లు ఎక్కడున్నర్.. అరె రామాదాసు జమాన్లట. నీ జమాన్లు రామోజీ, లక్ష్మోజీ అట. వచ్చి వేయి రూపాయలు కట్టింర్డు. చలో ఎల్లు బందీఖానా నుంచి ఎల్లు. ఇద్దరు తీస్కచ్చి బయటకు ఎల్లగొట్టిర్రు. రామాదాసుకు

బాగా ఖైదు. ఆయన చిలకను తీస్కచ్చి సాధినంత మాత్రన అయినను బందీఖానాలో వేసిస్రు. ఈ తహశీలు పైకం తానీషా పాషా గొల్కోండ పైకం మొత్తం వసూలు చేసి ఈళ్లకు ఇవన్ని చేసే వరకు రూపాయి లేదు. నాదగ్గర ఏమిల్లేవు. ఏక చక్రములు లోకములు. అన్ని ఆయనకే అన్నాడు రామాదాసు.

## రామదాసు కథ – కథావిశ్లేషణ

రామ, లక్ష్మణులు వచ్చి గొల్కొండ బంధీఖానాలో ఉన్న రామాదాసును విడిపించిన సంఘటనే ఈ కథ. గోల్కొండ తానీషా రాజు పరిపాలన కాలంలో కంచర్లగోపన్న భద్రాచలంలో తహశీల్దారుగా పని చేశారు. సీతారామ, లక్ష్మణులకు భద్రాచలంలో భక్తరామదాసు బిరుదున్న కంచర్లగోపన్న దేవాలయం కట్టిస్తాడు. ఆ విషయాన్ని తెలుసుకున్న తానీషా ప్రభువు వసూలు చేసిన పన్నులను చెల్లించమని అడుగుతాడు. చెల్లించనందుకు గోల్కొండ కోటలో బంధిఖానాలో 12 సంవత్సరాలు బంధిస్తారు. 12 సంవత్సరాల బంధిఖానాలో ఉన్న కంచర్ల గోపన్నను, సీతమ్మ వినతివల్ల సాక్ష్యాత్తు ఆ రామలక్ష్మణులు గోల్కొండకు వచ్చి అక్కన్న మాదన్న సమక్షంలో తానీషాకు రామదాసు చెల్లించవలసిన పన్నులను చెల్లిస్తారు. తానీషా ప్రభువు దగ్గర పనిచేసిన అక్కన్న, మాదన్న వారికి చెల్లించి వెళ్లిన రామలక్ష్మణులు రామాదాసును విడిపించి రామదాసు జమానులమని చెప్పి వెళ్లిపోతారు. అక్కన, మాదన్నలను రామలక్ష్మణులు వచ్చినప్పుడు ఎందుకు తనకి చెప్పలేదని రామదాసు అడుగుతాడు. పన్నులు కట్టిన తర్వాత రామదాసు చెరసాల నుంచి విడుదల చేస్తారు. అప్పుడు రామదాసు నా దగ్గర చిల్లిగవ్వ కూడా లేదని, నాకు జమానులు కూడా ఎవ్వరూ లేరని తానీషాకు చెబుతాడు. చారిత్రాత్మకంగా జరిగిన సంఘటన కొద్ది మార్పులతో జానపద కథగా రూపొందింది.

1. శిష్టసాహిత్యంలో ఈ కథ విస్తృత ప్రచారంలో ఉంది. చరిత్రలో జరిగిన సంఘటన కథగా చిత్రితమై, శిష్ట సాహిత్యంలో వివిధ రూపాల్లో, మౌఖిక సాహిత్యంలో వివిధ రూపాల్లో ఉండడం వల్ల ఈ కథకున్న బహూళ ప్రచార ప్రాముఖ్యతను తెలియజేస్తుంది.

2. కొన్ని సాహిత్య ప్రక్రియల్లో ఈ కథల్లో స్వల్ప మార్పుల చోటు చేసుకున్నాయి. కావ్యాల్లో గాని, నాటకాల్లో గాని, దృశ్యరూపాల్లో గాని ఈ కథలో రామ లక్ష్మణులు తానీషా మంత్రి నిద్రించే సమయంలో కలలో వచ్చి రామదాసు చెల్లించాల్సిన సుంకాలను, పన్నులను చెల్లించారని ఉంది. కాని ఈ కథలో మాత్రం రామలక్ష్మణులు అక్కన్న, మాదన్నల సమక్షంలో తానీషాకు సుంకాలను చెల్లించి నట్లుగా ఉంది.

3. గోల్కొండను రాజధానిగా చేసుకొని పరిపాలించిన కుతుబ్‌షాహిలు కాలంలో జరిగిన చారిత్రత్మాక సంఘటన. ఆనాటి కాలంలో వ్యాప్తిలోకి వచ్చి జానపదుల్లో చేరి వారి మౌఖిక సాహిత్యంలో వివిధ రూపాల్లో కథలు, కథలుగా చెప్పబడి ఉంటుంది. భక్త రామదాసు సీతమ్మ మొరపెట్టుకున్నప్పుడు సంఘటనతో ఈ కథ ప్రారంభమైంది. కేవలం తానీషా ప్రభువు నుంచి రామదాసును రక్షించే సంఘటన మాత్రమే ఈ కథలో చెప్పబడింది. ఇంకా వివిధ జానపద సాహిత్య రూపాల్లో గేయంగాని, గేయకథగాని, వచన కథగాని, ఐతిహ్యంగా గాని స్థిరపడి ఉంటుంది.

4. ఈ కథలో 12 సంవత్సరాలు రామచిలుకను పంజరంలో బంధించడం వల్లనే రామదాసుకు 12 సంవత్సారాలు జైలుశిక్ష పడిందని సీతమ్మకు రాముడు తెలియజేస్తాడు. ఆ కాలం పూర్తవగానే స్వయంగా తామే పోయి రామదాసును విడిపిస్తానని సీతమ్మకి మాట యిస్తాడు. గడువు ముగియగానే రామలక్ష్మణులు వెళ్ళి బంధిఖానాలో బంధిగా ఉన్న రామదాసును విడిపిస్తారు. రామదాసు గొప్పతనం గూర్చి జానపదులు చెప్పుకున్న కథ. ఆధ్మాత్మిక స్ఫూర్తిని నింపే కథగా మలచారు. దేవుడిని నమ్మకున్న వారికి ఆ దేవుడు కష్టాల్లో అదుకుంటాడని ఈ కథ భక్తితత్త్వాన్ని ప్రచారం చేస్తుంది.

## 2.5.3.4 కనకతార కథ

ఇమ్మిడి మల్లయ్య, కమునూరు గ్రామం, జగిత్యాల జిల్లా.

అన్న గారి తలకాయ కోసి చెవులు కోసిండు. తాను మాత్రం చేపట్టిండు కనకతారను. ఆమెను చేపట్టెసరికి ఆమె ఏం అంటుంది. నా పెనిమిటిని చంపినవ్. కాని నేను నీకొక తల్లిలాగా అని చెప్పాను నేను. అంటే వాడు ఏం అంటుండంటే. వావి వరుసలు విడిచి తరుణిలో తక్క అని మోహనాంగి నాతో మరికేళి కూడి మది సంతసించవే మోహనాంగి? తగదు తగదు నీకు దండం అర్పించేద కూరసేన. సోదరుడి భార్యను నేను తల్లితో సమానం అవ్..! కూరసేన. అవన్ని నడువయ్యి వావివరుసలు వీడి తరుణిలో తక్క అన్ని మోహనాంగి నాతో మరికేళితో గూడి మరీ సంతసించవే మోహనాంగి? శివ శివ. నీ మాట చెవులతో వినను కూరసేన. నా భర్తను సంపి, నను విదవను చేసి కూరసేన అని చెప్పి ఇబ్బంది పడ్డది. ఆయన మరిది ఎంబడి పడ్డడు కూరసేనుడు. ఎంబడి పడేసరికి ఆమె పరుగెత్తాలి. నా కొడుకు నా బిడ్డ లేకపోవు అని చెప్పి ఆమె ఏడ్సింది. ఏమని నా అక్క చెల్లెలు లేకపాయో నాకండగా ఎవ్వరు లేకపాయే. అని అని ఏడ్సి ఏడ్సి పోయింది. బాయిలో పడ్డది. బాయిలో పడ్డ తరువాత ఈ తల్లి వీళ్లు కనకసేనుడు, కనకతార మనమ్మేది మనమ్మేది అంటే తమ్ముడు కనుకసేన మన కోరకై తల్లి

మదిలో దుక్కించేను కనకసేన. కూరసేనుడి బాధతో ఓర్వక మన తల్లి కనక సేన ఎక్కడ్నో ఎల్లిపోయింది ఆ తల్లి. మన కొరకై ఎడ్సి ఎడ్సి పోయింది. మనకొరకై తల్లి మదిలో దుక్కించెను కనకసేన. అమ్మ ఎక్కడికి పోయింది. మన యొక్క చిన్న బాపు చేసిన ఆ బాధ మన బాపును చంపే. మన అమ్మను ఇబ్బంది పెట్టే తరువాత అమ్మ ఎల్లిపాయే ఎక్కడికి పారిపోయిందో, ఎక్కడ బాయిలో పడ్డదో గుడిసేలోల్లు వల ఏసింద్రు. వల ఏసేసరికి వల చోచ్చింది. చాలా మంది వాళ్లు నలుగురు గురులు ఆ వల్లోని తట్టుకుంది. ఏందిరా ఇది ఏందిరా నా వల్లో చిక్కిందేంది రా..? అరె ఇది పెద్ద దయ్యమల్లే ఉంది. అరె ఎల్లన్న బయ్య. అరె మల్లన్న బయ్య. అరే ఇదేందిరా? అరె ఇగో నా వలలో బడ్డదిరా... సగం నాకు, సగం నీకు.. తీయనయితే తీయి బయటకు గుంజుదాం. తీయి తీయి.. చారుమతి. అమ్మా! ఈమె ఎవరనుకున్నవ్ రా? ఎల్లన్న ఆ యొక్క ఉదయసేను రాజు భార్య. కూరసేనుడు ఉదయసేనుడి తలకాయ కోసేసరికి ఆయనను చంపిన తరువాత ఈమెను చేపడితే ఆ బాధకు ఓర్వలేక బాయిలో పడ్డది రా... మనకు తల్లి.. ఈమె చారుమతి. మరీ ఆ పిల్లగాండ్లకు ఈమెను కలుపాలే. కలుపాలంటే మనం ఏమన్న ఆలోచించాలి. పిల్లగాల్లకు చెప్పాలి. మీ తల్లి గిక్కడుందని వాడు మల్ల కూరసేనుడు గిక్కడుందని చెప్పి మల్ల ఉరుకత్తడు. సరె తల్లి బిడ్డలు కలిపి ఒక జాగలో ఉంచి ఇట్టే చెప్పేసరికి తెల్లవారుజామున అయిపోయింది. నేను చేసిన పాపం ఈమానం చేయ్యి.... అని రెండు కాళ్ల మీద పడ్డడు కూరసేనుడు. తెల్లావారు జామున వానికి ప్రాప్తం అయింది.

## కనకతార కథ – కథావిశ్లేషణ

కనకతార కథ శిష్టసాహిత్యంలో, నాటక సాహిత్యంలో, లిఖిత సాహిత్యంలో బాగా ప్రచారంలో ఉంది. అదేవిధంగా జానపద కథ కూడా చిత్రితమయింది. కూరసేనుడు తన అన్న భార్య చారుమతిని మోహించినప్పుడు చారుమతి కొడుకు కనక సేనుడు, కూతురు కనకతార తమ తల్లి కోసం బాధపడతారు. ఒక బావిలో చారుమతి పడి బోయవాళ్ల వలకి చిక్కుతుంది. చారుమతిని, వాళ్ల పిల్లల దగ్గరికి తీసుకెళ్లి బోయవాళ్లు కలుపుతారు. తల్లి సమానురాలైన వదినెను చెరపట్టే ప్రయత్నం చేసిన కూరసేనుడు తప్పు తెలుసుకొని చారుమతిని క్షమాపణ కోరతాడు. ఈ కథ చెప్పిన కథకుడు కథను మరిచిపోవడం కథాంతరంలో కొన్ని సంఘటనలను విస్మరించాడు.

1. తల్లిదండ్రులతో సమానమైన అన్నను చంపి, వదిన మీద మోహంతో తన మరిది ఆమెను ఎన్ని కష్టాల పాలు చేశాడో ఈ కథ చెబుతుంది. ఉదయసేనుడు, చారుమతి భార్యభర్తలు. ఉదయసేనుని

తమ్ముడు కూరసేనుడు. పేరుకు తగ్గట్టుగానే క్రూరమైన మనస్తత్వం కలవాడు. ఉదయసేనుడు, చారుమతి పిల్లలు కనకతార, కనకసేనుడు.

2. రాజ్యం మీద కాంక్షతో, రాజ్యాధికారం చేజిక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో తన అన్న ఉదయసేనుని అతికిరాతకంగా చంపేస్తాడు. భర్త పోయి విధవగా ఉన్న ఒంటరియైన చారుమతిని దక్కించుకోవాలని దురుద్దేశ్యంతో చారుమతి దగ్గరికి వస్తాడు. చారుమతి తల్లితో సమానమైన నన్ను ఇలా మాట్లాడటం సరికాదు అని విన్నవిస్తుంది. అపుడతడు వావివరుసలు నాకు ఉండవు అని నీతో గడుపడమే ముఖ్యమని అంటాడు.

3. ఏమి చేయాలో, ఎలా చేయాలో ఈ విషమ పరిస్థితి నుంచి ఎలా తప్పించుకోవాలో తెలియని చారుమతి కూరసేనుడు వెంటపడేసరికి పరుగెత్తుకుంటూ వెళ్లి బావిలో పడుతుంది. తన పిల్లల గురించి కూడా ఆలోచించకుండ తన శీలానికి ప్రాధాన్యతని ఇచ్చింది. చారుమతి లాంటి పతివ్రత స్త్రీ మూర్తులు నేటికి ఎంతో మంది ఉన్నారు.

4. తమ తల్లి జాడ తెలియక క్రూరసేనుడు ఏమి చేసి ఉంటాడో అని సందేహపడి, కనక తార కనకసేనుడు తమ తల్లిని వెతుకుతారు. చారుమతి బావిలో ఉండి జాలరులకు దొరుకుతుంది. ఈ సమాచారం జాలర్ల నుండి కనిపెట్టి పిల్లలు తమ తల్లి క్షేమంగా ఉందని కలుసుకొని సంతోషపడతారు.

5. ఈ కథ చెప్పిన జానపద కథకుడు ఈ కథను మరిచిపోవడం వల్ల, ఈ కథను పూర్తిగా చెప్పలేకపోయాడు. క్రూరసేనుడు ఎలా మార్పుచెందాడో అన్న విషయంలో పై కథలో సరిగ్గా వివరించలేదు. కథకుడు పూర్తి కథను మరిచిపోయాడు.

## 2.5.4 మానవ సంబంధాల కథలు

### 2.5.4.1 మునుపటి సంబంధం

జాడి రాజన్న, ఆరపల్లి గ్రామం, ధర్మపురి మండలం.

అయితే భార్యభర్తలు ఇద్దరు. పస్ట్ భార్య పెళ్లి చేసుకుంది. చనిపోయింది. ఈమె రెండో భార్య. ఆమె అడ్లు దంచంగా పోయి భర్త ఏం చేసిండు. అక్కడ కూసుండి తవుదు నూకలు నాకే పెట్టురా? మునుపటి సంబంధం ఆమె భలే పెట్టింది అన్నడు. అన్నవొల్లె రెండో భార్య పస్ట్ భార్య గిట్ల పెట్టవచ్చు అని చెప్పి తౌడు, నూకలు అండి భర్తకు పెట్టినొల్లె భర్త బుక్కుతుండు. బుక్కి మంచిగ ఉండునట. మల్ల ఇంటికి పోయినంక బియ్యం పెట్టె గద బియ్యం మంచిగ అయింత పెట్టి మంచిగ కూర చేసి, కూర

దించినంక అయింత బువ్వ నీ అవ్వ ఉన్నదంతా ఉడ్సి నాకే పెట్టురా? భలే మునపటి సంబంధం అనుడట. అనేవరకు ఇది అయితే పస్ట్ భార్య పెట్టింది కావచ్చని ఈ బువ్వ ఉన్నదంతా ఊడ్సి ఆనికి పెట్టె, ఉపాసం పండంది. అట్ల ఒక రోజు ఆమె, రెండు రోజులు అయ్యో! అదే మాట మీదికెల్లి దిగుతలేదు. దీనికి బుక్కెడు బువ్వ దొరుకుడు లేదు. అట్ల కడుపు కట్టుకుని ఏం చేసిన గద. వీని కడుపుల మన్నువడ అంత వీడే తినవట్టే నేను ఎప్పుడు తినుడు? ఎప్పుడు బతుకుడు? అని చెప్పి ఏం చేసిందట. ఈ లంజకొడుకు ఈనితో కాపురం ఏగుడు కాదని చెప్పి తల్లిగారింటికి దెంకపెయినొల్లె అన్న మీద పడి అవ్వ మీద పడి భలే సంబంధం దొరికింది చేసిరు. ఆ లంజకొడుకు తౌడు, నూకలు నాకే పెట్టు అంటుండు. నేను పెడితే అంత తింటుండు. ఉన్నదంతా ఉడ్సి నాకే పెట్టు? భలే రా మునుపటి సంబంధం అంటుండు. అన్నం కూడా ఆనికి పెడుతున్న రొట్టెలు తింటడు. సప్పుడేంక పంటుండు. నాకు పలుకు బువ్వలేదని చెప్పి అయింత అన్నతో చెప్పుకున్నరు. అన్నేమి చేసిండట. సరె! నే చెల్లె బావ అట్ల చేసిండు గద! నువ్వ్ ఎప్పటోల్లే ఇంటికి పో అడ్లు దంచు. నూకలు, తౌడు దంచు ఆనికే పెట్టు. ఒకనాడు మాత్రం మన ఇంటికి మాత్రం చెప్త పలానా శుక్రవారం నాడు మాత్రం దేవునికి పెట్టుకుంట మని చెప్పి రండ్రి మీరే ఏం జెత్తరు? మార్గమధ్యల మీ ఊరికి, మా ఊరికి మధ్యల వటవృక్షం ఉంది. మర్రిచెట్టు ఆ మర్రి చెట్టు మీద దయ్యపు వేశం వేసుకొని ఒక చీపిరి, ఒక చెప్పు పట్టుకుని ఉంట. ఉంటే ఆడికి తీస్కచ్చి నీడకు ఆగు. ఇగ బావ సంగతి గప్పుడు బయటపడతది చెల్లె. చెప్పినొల్లె చెల్లె మల్లెప్పటొల్లె అచ్చింది. అత్తగారింటి కాడున్నది. తెల్లారు తీసింది అయింత అడ్లు పట్టుకొని పోయి అయింత దంచుతుంది. గీ భర్త ఏం చేసిండు. పోయిండు ఆడ కూసుండు. నీయవ్వ తౌడు, నూకలు నాకే పెట్టురా? భలే మునపటి సంభందమనే అన్నవొల్లె నూకలు ఆనికి పెట్టింది. మంచిగ బుక్కుతుండు. ఉన్నదంత ఆనికే పెట్టి ఉపాసం ఉంటుంది. బాగా తిన్నంక రెండు మూడు రోజులకు మా ఇంటికాడ మాత్రం శుక్రవారం దేవునికి చెత్తరట పోదామని మెల్లగ మింటిచ్చింది. ఆశపడి వెంబడి పోతుండు. పొయి పొయి ఏం జేసిండు గదంటే ఆగినవొల్లె ఈడు కూకున్నడు అయింత మీదికెల్లి సూత్తుండు. బామ్మర్ది దయ్యపు వేశం ఏసిండు. ముఖానికి మసి, చీర కట్టిండు. చీపురు పట్టుకున్నడు. గప్పనే పోయి బావ మీద దునికి ఏం జెత్తుండు? అవురా..! లంజకొడుకా! నను నాడు చేసుకున్ననాడు నీకు దేవుడు, నూకలు పెట్టిన్నో? నేను ఉపాసం పన్ననో? నీకు అన్నం అన్ని పెట్టిన ఆవుర్రా! లంజకొడుకా? గిప్పుడచ్చిందానికి బుక్కెడు బువ్వ కూర దొరకకుండా తింటున్నవ్ అని చీపురు వట్టి

వీపుల పట్ట పట్ట కొడుతుండు. గిట్లెందుకు చేత్తున్నవ్ దాన్ని గొస ఎందుకు పుచ్చుకుంటున్నవ్? అది మానానికి ఉపాసం ఉండి నీకు పెడతంది. నేను నాడు నీకు తౌడు, నుకలు పెట్టిన ఎల్లిపెయిన. దాన్ని అడిగితే పెడతదిరా? నీ నోట్లె మన్నువడ అని కొడుతుండు. అది అడ్లు దంచినా, తౌడు దంచినా నా పేరు తీయద్దు. ఉన్నదంతా నాకే ఊడ్సి పెట్టు భలే రా మునుపటి సంబంధం అని మాది ఏది ఎల్లద్దు. అబ్బ కొడుకా! అట్లయితేనే దీన్ని తోల్కపొయి బతుకు. లేకపోతే నీ జీవనం తీత్త అని చెప్పి కొడతండు. ఇగ వాడు నీ బాంచెన్! నీ కాళ్లు మొక్కుతానే నీ పేరు తీయనే. నీ జోలికి రానే అన్నగని ఇడిసిపెడతలేదు. దంచి దంచి లంజకొడుకా! ఇగ పొంగ్రడి అని అత్త గారింటికివోయి శుక్రవారం దేవుడి కాడ బాగా తింటనని పోతున్నవా అటత్తె సంపే పారెత్త? అని ఇద్దరిని సముదాయించి సమాధానం పెట్టి ఇంటికి పంపిండు. అడ్లు దంచినా, నూకలు దంచినా పెట్టమనేదిలేదు. ఇది పెడితేనే బుక్కాలి. లేకపోతే ఊకుండాలి. ఇంటి లోపల అన్నం అండి ఏత్తేనె తినాలి. లేకపోతే అడిగేది లేదు. ఆ నుంచి అన్న చేయవట్టి అయింత ఈ అన్న చెల్లె సంసారం మంచిగ నిలబడ్డది. ఆకాన్నుంచి మంచిగ బతికిర్రు.

## మునుపటి సంబంధం – కథావిశ్లేషణ

ఒక వ్యక్తి తన చెల్లెలు తన భర్త ద్వారా పడుతున్న ఇబ్బందిని చూసి దాన్ని పరిష్కరిస్తాడు. ఈ కథలో రెండవ పెళ్లి చేసుకున్న ఒక వ్యక్తి తన భార్య బాగోగులు పట్టించుకోడు. ఇంట్లో ఏ వంటకం వండినా అవి మొత్తం నాకే కావాలని కోరుకుంటాడు. ముందు పెళ్లి చేసుకున్న భార్య తనని అన్ని విధాల చూసుకుందని సాకు చెప్పి ఇప్పుడున్న రెండవ భార్యకు ఏమి దక్కనివ్వడు. మొదటి భార్య పేరు వాడుకొని మునుపటి సంబంధం భలే ఉందని వ్యంగ్యమైన మాటలతో తన మనసులో విషయాన్ని రెండవ భార్యకు స్ఫురించేలా చేస్తాడు.

ప్రతి స్త్రీకి వివాహం చేసుకున్న తరువాత తన భర్తను అన్ని విధాల బాగా చూసుకోవాలని తపన పడుతుంది. అలాగే ఈ కథలో కూడా పెళ్లి చేసుకున్న భార్య రెండవ వివాహం చేసుకున్న భర్తయైన తాను తినకుండా అడిగిందల్లా భర్తకు ధారదత్తం చేస్తుంది. కొద్ది రోజుల తనని అర్థం చేసుకోలేని భర్త గురించి, తన అన్నకి చెప్పి మందలించమని ప్రార్థిస్తుంది. చెల్లి జీవితాన్ని ఎలాగైనా సరిదిద్దాలని అనుకున్న అన్న ఏ విషయం మీదైతే తన చెల్లెను బాగా చూసుకోవడం లేదో అదే విషయాన్ని అనుసరించి బావకి సరిగ్గా బుద్ది చెప్తాడు. ఒక రోజు అన్న వేసుకున్న పథకం ప్రకారం భర్తను అత్త గారింటికి తీసుకెళుతూ మర్రి చెట్టు దగ్గర భార్యభర్తలు కూర్చుంటారు. అంతలోగా దెయ్యం రూపంలో

ముందు వెళ్లి కూర్చున్న బావమరిది బావ మీద పడి పాత విషయాలను బయటకు తీసి, మొదటి భార్య చూసుకున్న విధానాన్ని గుర్తు చేస్తూ తీవ్రంగా చితకబాదుతాడు. ఇంకోసారి తన పేరు గాని, అడ్రసుగాని వాడి రెండో భార్యను హింసించకూడదని అనేంతవరకు కొడతాడు. మొదట వివాహం చేసుకున్న భార్య దెయ్యం రూపంలో నిజంగా వచ్చి కొడతుందేమోనని భయపడతాడు. తన తప్పును తెలుసుకొని భార్యని తీసుకెళ్లి బాగా చూసుకుంటాడు.

1. ప్రతి అన్న తన చెల్లె కష్టసుఖాలను పాలుపంచుకుని అనునిత్యం రక్షిస్తాడు. ఈ కథలో కూడా అన్న తన చెల్లె సంసారాన్ని చక్కదిద్దే బాధ్యతని తన భుజాల మీద వేసుకుంటాడు. తన చెల్లెలు ఇబ్బంది పడుతుందని తెలిసాక మరుక్షణం ఒక పథకం వేసుకుంటాడు.

2. ఒక పథకం ప్రకారం మర్రి చెట్టు దగ్గరకి వచ్చిన బావని బామ్మర్ది దయ్యం రూపంలో ఉండి చితకబాదుతాడు. అతని బావలో ఆశించిన మార్పును తీసుకురావడానికి, మునుపటి సంబంధం భలే అంటే చంపేస్తానని భయాన్ని కల్గిస్తాడు. ఆ దెబ్బతో బావ మారిపోయి తన చెల్లెని తీసుకెళ్లి బాగా చూసుకుంటాడు.

3. ఈ కథలో శుక్రవారం దేవుడికి పెట్టుకోవడమనే సాంస్కృతికాంశం ఉంటుంది. ముఖ్యంగా కరీంనగర్, జగిత్యాల గ్రామీణ ప్రాంతంలో కుటుంబసమేతంగా ఇంట్లోనే దీపం పెట్టి నిర్వహించుకునే కార్యక్రమం. శుక్రవారం రోజున లక్ష్మీదేవిని పూజిస్తూ, తప్పెట తాళాలతో భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం రెండు విధాలుగా జరుపుతారు. అవి పాలపూజ, యాటపూజ. పాలపూజ విధానంలో శాకాహారాలతో భోజనం పెడతారు. యాట పూజ విధానంలో గొర్రె, మేక లాంటి జంతు బలులతో పూజ విధానాన్ని నిర్వహించి భోజనాలు పెడతారు. ఈ వేడుకల్లో మద్యం సేవించడం సాధారణంగా కనిపిస్తుంది. ముఖ్యంగా కార్యక్రమం నిర్వహించే ఏ కుటుంబం అయినా ఆయా కులానికి సంబంధించినవారిని మాత్రమే ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తారు.

## 2.5.4.2 కొడుకులున్న తండ్రికి వచ్చిన గతి

మాదాసు పద్మ, అయిలాపూర్ గ్రామం, కోరుట్ల.

నారాయణ అనే వ్యక్తి ఉండేవాడు. అయితే ఆయనకు ఆళ్లు నలుగురు కొడుకులుంటుండే. నలుగురు కొడుకులకు ఆయన మంచి బట్టల దుకాన్లు పెట్టిచ్చి ఇచ్చాడు. ఆ నాలుగు బంగ్లాలు కట్టించిండు. మనిషికి యాభై తులాల బంగారం ఇచ్చాడు. మనిషికి యాభై లక్షల రూపాయాలు

ఇచ్చిండు. మనిషికి ఒక ఎనిమిది లక్షల కారు ఇచ్చిండు. అట్టహాసంగా ఉండాలె నా కొడుకులు, కొడల్లు, మనవరాల్లు అందరు మంచిగ బతకాలని ఏ తండ్రికైనా ఉంటది. గట్ల నలుగురు కొడుకులకు మంచిగ సమానంగా పంచి ఇచ్చిండు. ఇచ్చి ఇగ ముసలమ్మ, ఈనే, చిన్న కొడుకు ఇంట్లనే జీవించేవారు అయితే దురదృష్టవశాత్తు ఆమె సచ్చిపోతది. ఆమె సచ్చిపోయినోల్లె నారాయణ ఒక్కడెయ్యిండు. నారాయణ ఒక్కడైనంక ఒక నెల తినే నాన్న అని చెప్పి నలుగురు అంటరు. నలుగురు కొడుకులు హే సరే మంచిది తింట బిడ్డ అని చెప్పి అట్లనే తింటండు. ఈనే దక్షిణ ఒక అయిదు వేల రూపాలు ఇస్తుండేవాడు. అయిదు వేలు తీసుకో అని చెప్పి ఆ గురువుకి ఇస్తే ప్రతి సంవత్సరం అయిన వచ్చి అయిదు వేల రూపాయిలు తీసుకుని పోతుండే. అయితే గిట్ల కార్యక్రమం మంచిగ నడుస్తుంది. ఇగ మంచిగ నలుగురు కొడుకులు, కోడల్లు, మనమరాల్లతోని మంచిగ జీవిస్తుండు. అయితే నపరినెల తింటుండు. నపరినెల తినంగ ఒక రోజు ఏమయితది. పాలిష్ రాయి ఇల్లాయే. ఆ ఇంట్లో ఈనే నడిచేటప్పుడు జారిపడతడు. పడంగనే కాలు ఇరుగుతది. ఆసుపత్రికి తీసుకెల్తరు. పట్టీల్లు కట్టెస్తరు. కట్టేసి మల్లి ఇంటికి తీస్కత్తరు. మంచంలో పండవెడతరు. అయితే ఇట్ల కాలం నడువంగ నడువంగ ఒక రోజుల వరకల్ల కొంచెం వాసన అత్తది. కొంచం కొంచం కాలు విరిగిన వాల్ల దగ్గర వాసన అత్తది గద. ఆ పరంగా ఈ పెద్ద కోడలు నీయవ్వ! ఈ ముసలోడు ఎప్పుడు పోతే మంచిగుండు. ఈ ఇట్లకెల్లి అని చెప్పి ఆమె అనుకుంటది. అయితే అటు గిటు గడిసేవరకల్లా నడిపి కోడలుకత్తది. నడిపి కోడలు అయ్యేవరకల్ల నడిపి కోడలు కూడా అరె..! ఈ ముసలోడు బట్టల్లనే ఓసారి మూత్రం వోత్తుండు. ఓసారి దొడ్డికి పోతుండు. ఈడి బాధ ఎప్పుడు పోతది, ఇంకా పదిరోజులు కావాలె అని జెప్పి నడిపి కోడలు అటెనుక ఇంకొ నడిపి కోడలు, అటెనుక ఇంకో చిన్న కోడల్లు. ఇట్లనే అయితుంది. కార్యక్రమం అయితే ఈ నలుగురు కోడలు మంచిగ గార్డెన్ ఉన్నది. ఇంటి ముందర గార్డెన్ కచ్చి ముచ్చట వెట్టుకుంటున్నరు. నీయవ్వ! ఈ ముసలోని బాధ ఎప్పుడు పోతది? నపరినెల రాబట్టె ఇట్లా సంగతి అన బట్టె ఏం లేదు మనం మన భర్తలకు చెప్పుకుందాం. బయట మనకు జాగ ఉంది కద. ఆ ప్లేస్‌లో మంచిగ సిమెంట్ ఇటుకలు తెప్పించి, రేకులు వేసి ఉంచుదాం అని చెప్పి చిన్న కోడలు అంటది. ఏ మంచి పనే..? అబ్బ! నువ్వు మంచి ఐడియా ఇచ్చినవే? అని చెప్పి ఇల్లు నలుగురు కోడల్లు మంచిగ అనుకుంటరు. ఏ మనం భర్తలకు జెప్పకుందాం. ఇవ్వాల కైకిలు బెట్టించి అయింత అక్కడ సిమెంట్ రేకులు తెప్పిద్దాం. సిమెంట్ ఇటుకలు తెప్పించి షెడ్డు లెక్క ఏత్త అందులోని ఉంటడు. మనకు కూడా ఈ ఆసన రాదు. పోరగాల్లు

ఊకే తాత తాత అని చెప్పి మీదికి ఎక్కుడు, ఇటు ఎక్కుడు, అటు ఎక్కుడు అదే చేతులతో అన్నం తినుడు. ఇదంత వద్దే? మనకు బాధ అన్నంక ఏం మంచిదే. అట్లనే సెద్దం అన్నంక అందరి భర్తలకు అవ్‌ల్ల.. అవ్‌ల్ల.. ఇట్ల సంగతి మరి మేము అనుకున్నాం. మరీ మీరు ఏం అంటరు అని అంటే ఏ కాని నీయవ్వ! ఏమున్నదే తెప్పిద్దాం? అని జెప్పి అరె! గిట్లా వాళ్లు షెడ్డు ఏద్దాం? అన్నరు ౹రా. నడిపోడా అంటే ఏ అన్న నువ్వు ఎట్లంటే అట్లనే అన్న నాదేముంది? అనని జెప్పి అన్నంక మనిషికి జెప్పి ఆ కైకిలు తెప్పిత్తరు. కైకిల్లోని తెప్పించి అయింత షెడ్డు ఏత్తరు. ఆ ముసలోన్ని అండ్ల ఉంచుతరు. ఉంచిన తర్వాత ఆల్లు ముసలోనికి సాయ్ తెచ్చుడు లేదు. సాయె సాయె సాయె అంటే సాయె అచ్చుడు లేదు. ఉప్మా ఉప్మా అంటే ఉప్మా అచ్చుడు లేదు. ఒకటి పదిసార్లు వొర్రిన గని ఇనబడతలేదు సక్కగ ఆళ్లకు. ఇబ్బంది కరంగ అయిపోయింది. అయ్యేసరికి ఆకలితోని అలమటిస్తుండు. మందుల బాధయే. మందులతో గోలిలు వేసుకోనే వరకల్ల కడుపంత మంట. అట్ల జెసుడని జెప్పి. ఒకసారి గురువు వచ్చె. గురువచ్చి నారాయణ ఏడమ్మని చెప్పి అంటడు. అగో ఆ షెడులో ఉన్నడు. పో.. అన్నంక నారాయణ దగ్గరకు అచ్చి. అయ్యో! నారాయణ గిట్ల ఎందుకు అయినవ్? అంటే ఇగో దురదృష్టవశాత్తు కాలు విరిగింది. మరీ ఏం జెద్దు? గురు గిట్ల సంగతి అని జెప్తే అయ్యో! అట్లనా? నీ బాధ నేను ఏసుకుంటా. నీకు ఎందుకు బాధ. మరీ దక్షిణ ఇవ్వాలి కద నీకు. మరి నువ్వు పెద్ద కొడుకు అడుగుపో అంటే పెద్ద కొడుకు దగ్గరికి వోయి మరీ దక్షిణ నాన్న జెప్పిండంటే ఏ.. నా దగ్గర ఏమున్నయి నడిపోన్ని అడుగుపో. నా దగ్గర ఏమున్నయి చిన్నోన్ని అడుగుపో. మా దగ్గరలేవు లేకపోతే ముసలోన్ని అడుక్కపో అని చెప్పి ఈల్లంటరు. అన్నంక అరెయి అట్లన నారాయణ దగ్గరకు అచ్చి లేవన్నరు గని ఆళ్లు ఇచ్చిన గని దక్షిణ అద్దే? నువ్వు మంచిగ ఉండాలె! నీగ్గావాలంటే నాకు ఐదు వేలు ఇచ్చినవ్ కద. నేను నీకు పదివేలు అయిన ఇస్త కని నీకు ఆహారం సక్కగ అందుతలేదు. అంటున్నవ్ గద. అన్ని ఆహార పదార్థాలు యిడికే అచ్చేటట్టు నేను చేస్త అని చెప్పి గురువుకి చెప్తడు. సరే మంచిది అని అయిన అంటడు. అయితే గురువు మార్కెటుకి పోతడు. పోయి మంచిగ ఇటుకలను, ఒక సందూకను తీసుకచ్చి కలర్ పూత్తడు. కలర్ పూసి మంచిగ బంగారం కలర్ పూసి ఆ సూట్‌కేసుల పెడతడు. పెట్టి తాళం వేసి తాళం దగ్గర వెట్టుకో నారాయణ. మీ పెద్ద కోడలు అచ్చినప్పుడు అగుపించేటట్టు చెయి. నడిపి కోడలు అచ్చేటప్పుడు అగుపించేటట్టు చెయు. అందరు కోడల్లకు అగుపించినట్టుగ చేసి తాళం వేసుకో అని చెప్పి ఆ..! చెప్తడు. సరె మంచిదని చెప్పి వాళ్లు వచ్చినపుడు నటించినట్టు చేసి తాళం వేస్తాడు సూటికేసుకు. వేసేవరకల్ల

ఆల్ల కంట్లో కనబడింది. అబ్బో! ముసలోడు యాభై తులాల బంగారం ఇచ్చిండు. యాభై లక్షల రూపాయలు ఇచ్చిండు. ఇంకా ముసలోని దగ్గర బారెడు బంగారం ఉన్నది. అబ్బో! ఆ సందుగల లావడితే మాత్రం సందు గూడ లెత్తలేదు. గంత బంగారం ఉన్నది. అని చెప్పి పెద్దకోడలు అవుళ్ల అవుళ్ల మీ నాన్న దగ్గర భలే బంగారమున్నది. లావడితే లేత్తలేదు నా కండ్ల నిండా చూసిన. నేను వోయి వరకల్లా తలుపు వేసుకున్నడు. తాళం వేసుకున్నడు. అబ్బో! అట్లనాయే? అని చెప్పి అట్లనే నడిపి కోడలు చెప్పే అందురు చెప్తుల్లు. చెప్పెసరికి ఆ... హ...! ఒళ్ల మనసుల ఆళ్లే అనుకుంటుర్రు. అరె ఆ బంగారాన్ని నేనే కొట్టేయాలని చెప్పి పెద్దోడు అనుకుంటుండు. ఇట్ల అనుకుంటురు నిగ ఉంచుతుర్రు ఇగ. ముసలోనికి చాయి. కూర, పప్పు, అన్నం అన్ని పంపిత్తున్నరు. మెల్లగ ఏది అంటే అది పొరగాండ్లు గూడవోయి తాత అని చెప్పి మంచాల ఎగురుతుర్రు. ఈల్లు గూడ అన్నం గిన్నం అండి ఇక్కడకి అత్తుల్లు. ఇల్ల దాన్ల బంగారం వున్నది ఏవరన్న ఎత్తక పోతరని. ఇగ మంచిగ ప్రేమగ చూసిరి. చూసేసరికి దూరదృష్టవశావత్తు ముసలాయన పానం ఒడిసింది. పెద్ద కోడలొచ్చి తాళం ఎత్తది. పెద్ద కోడలు అత్తే, నడిపి కోడలు నేను ఏత్తా అని చెప్పి అదో తాళం ఏత్తది. ఇంకొకతి అదో తాళం పట్టుకత్తది. అందరు తాళాలు పట్టుకత్తుర్రు. మీరు అని చెప్పి పక్క పోన్న పెద్దమనిషి అంటే ఏం.. లేదు. అండ్ల ఏమన్న ఉంటే ఎత్తుకపోతరు గద. నా తాళం ఏత్త? ఈ తాళమేసి ఏది గిలాసచ్చిన, చెంబచ్చిన, చెంచచ్చిన మీ అందరికి సమానం పంచుత అని చెప్పి కని మీ తాళాలు అన్ని తీయ్యుర్రి. అని ఆ తాళాలు అన్ని తీపించి ఒక తాళం వేసి దగ్గర వెట్టుకుంటడు. దగ్గర పెట్టుకొన్నంక సరే మంచిది. ఏదచ్చినగని అందరు సమానం పంచుకుందామని చెప్పి నలుగురు కోడల్లు అనుకుంటరు. అదే అనుకున్న ప్రకారం ఇగ కార్యక్రమం చేయాలని చెప్పి ఇగ తీస్కపోతరు. ముసలాయనను తీస్కపయే? అన్ని చేసిన తరువాత మరి దినకర్మ చేయాలే? మరెట్ల అని చెప్పి పెద్ద కొడుకు అంటడు. నడిపోడు ఏమంటడు. నువ్వు ఎట్ల చెబితే గట్ల. అరె ఎట్లముందిరా మన అందరిని పిలుద్దాం. గిల్ల మనసులో ఏముందంటే అండ్ల ఒక బంగారమిటుక సగం ఇటుక పోతది కావచ్చు. అందరు భోజనం తినిపోతరు. మనమింట్లకెల్లి ఏమన్న పెట్టేది ఏమన్న ఉంద. అండ్లకెల్లి పెడదాం అని చెప్పి అందరు మనసుల అనుకుంటరు. ఏ నువ్వు ఏట్లంటే అట్లే ఏ పెద్దగ జేత్తం రా. ఓ మందను తీస్కత్తరు. ఓ మేకల మందను తీస్కత్తరు. మేకల మందను కోసి మంచిగ ఊరోళ్లందరిని పిలిచి మంచిగ భోజనాల కార్యక్రమం ఏర్పటు చేత్తరు. అయిన తరువాత ఇగ పంచుకుందం చెప్పి ఆ సూట్‌కేసును పలగొట్టేసరికి అండ్ల

ఏముంటయి. బంగారంతో పూతపూసిన ఇటుకలు అబ్బ! ఇది ఏవోలు చేసి్రు. అంటే గురువే అబ్బ..! గురువే అచ్చి ఆ రోజు ఒక రోజు ముచ్చట పెట్టి్రు. అని చెప్పి చినకోడలు అంటది. ఆహా..! ఇది ఏదో ఉన్నది. మనమే మోసపోయినమే అని చెప్పి అంటే భగవంతుడు గురువు రూపంలో అచ్చి ముసలాయనకు అన్నం పెట్టి పోయిండు..

## కొడుకులున్న తండ్రికి వచ్చిన గతి – కథావిశ్లేషణ

ఈ కథ శీర్షిక వినగానే మనకు ఒక కుటుంబంలో ఒక తండ్రికి వృద్ధాప్యంలో వచ్చిన దుర్భర పరిస్థితులేవో వివరిస్తున్నట్లు అనిపిస్తుంది. పూర్వం ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా ఉండేవి. ప్రస్తుతం ఆ కుటుంబాలన్ని వేరుపడి చిన్న చిన్న కుటుంబాలుగా విడిపోయాయి. ఆ కుటుంబాల్లో మానవీయ విలువలు కొరవడినవి. బంధుత్వాలు, బాంధవ్యాలకు దూరంగా ఉండి వ్యక్తిగత ఆదాయవృద్ధినే ప్రధానంగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెలు మధ్య సహజమైన ప్రేమను కోల్పోయారు. ఈ కథలో కూడా కన్న తండ్రికి సమయానికి తిండి పెట్టేవారు లేక అనారోగ్యంతో చితికిపోతాడు. ఒకప్పుడు తాను కష్టపడి సంపాదించిన మొత్తం ధనం, ఆస్తిని తన పిల్లలకు దారాధత్తం చేస్తాడు. కొద్దిరోజుల తర్వాత తన భార్య చనిపోయి ఒంటరివాడైపోతాడు. ఆరోగ్యం క్షీణించిన సమయంలో కొద్దిరోజులు నలుగురు కొడుకులు నెలకొకరింట్లో ఉంటూ తాను కాలం గడుపుతాడు. కాలుజారి కాలు విరిగిన తర్వాత అనారోగ్యంతో మంచానపడి అస్వస్థతకు గురవుతాడు. ఆ సమయంలో తన తండ్రిలాగా భావించుకొని బాగా చూసుకోవల్సిన కోడళ్ళు చిరాకు పడి నానా మాటలు అంటారు. సమయానికి భోజనం కూడా పెట్టకుండా పస్తులు ఉంచుతారు. అలా కొద్ది రోజులకు నారాయణ బాగా ఉన్న పాత రోజుల్లో నిరంతరం గురువుకు దానం చేసేవాడు. అతడు వచ్చి నారాయణ పరిస్థితి చూసి చాలా బాధపడుతాడు. నారాయణ బాధను చూసి అర్థం చేసుకొని తెలివిగా బంగారు ఇటుకలను పెట్టిన సూటికేసు (బాక్సు) తన దగ్గర పెట్టుకోమని సలహా ఇస్తాడు. దాంతో అప్పటిదాకా తనను బాగా చూసుకోలేని కొడుకులు, కోడల్లు నారాయణ దగ్గర ఇంకా బంగారం చాలా ఉందని భ్రమపడి రోజు బాగా చూసుకోవడం మొదలుపెడతారు. నారాయణ చనిపోయిన తరువాత కూడా వారికి ఆ సూట్కేసులోని బంగారం మీదే ధ్యాస ఉంటుంది. గురువుగారి పుణ్యమా అని నారాయణ దహన సంస్కారాలు, దిన కర్మలు పూర్తయ్యాక ఆ సూట్కేసుని తెరుస్తారు. అందులో

బంగారు పూత ఇటుకలు మాత్రమే ఉంటాయి. చివరికి తాము మోసపోయామని తెలుసుకొని కొడుకు, కోడళ్లు గురువుగారే ఇదంతా చేశారని గ్రహిస్తారు.

1. ప్రస్తుతం సమాజంలో నారాయణ లాంటి వాళ్లు అనేక మంది కనిపిస్తుంటారు. కనిపించిన తల్లిదండ్రులు మరచి తామేమో సాధించినట్లు భావించుకుంటున్న నేటి యువకులకు కనువిప్పుకలిగించే కథ. రోజు రోజుకు ఇలాంటి వార్తకథనాలు చాలానే వినిపిస్తూ ఉంటాయి. ఇలాంటి వాటి మీద చర్యలు తీసుకోవడానికి సుప్రీంకోర్టు తల్లిదండ్రులను పరిరక్షించే విధంగా చట్టాన్ని కూడా తీసుకొచ్చింది.

2. నారాయణ నలుగురు పిల్లలు ఉన్న ఏ ఒక్క కొడుకు కూడా పోషించడానికి ముందుకు రాలేదు. అందుకే శీర్షిక కూడా కొడుకులున్న తండ్రికి వచ్చిన గతి అని సరిగ్గా సరిపోతుంది. చెప్పుకోవడానికి నలుగురు ఉన్నా, చూసుకోవడానికి ఒక్కరు కూడా లేని నారాయణ లాంటి వయోవృద్ధుల పరిస్థితి దురదృష్టకరం.

3. నారాయణ వారి నలుగురు పిల్లల భవిష్యత్తుని ఉద్దేశించి నలుగురికి సమానమైన ఆస్తులు పంపకాలు చేశారు. చిల్లిగవ్వ కూడా ఉంచుకోకుండా ఉన్నదంతా తన పిల్లలకిచ్చి తాను నిస్వార్థ పరుడిగా, తండ్రిగా తన బాధ్యతను నెరవేర్చాడు. కాని తన పిల్లలు మాత్రం తన తండ్రిని అవసాన దశలో చూసుకోవడం మాని, వారి భార్యల మాట వింటారు. వారు మాత్రం మంచి భవంతుల్లో ఉండి నారాయణకు మాత్రం రేకుల షెడ్డులో ఉంచుతారు. అదే ఆస్తిపాస్తులను తన కొడుకులకు ఇవ్వకుంటే నారాయణ పరిస్థితి చాలా మెరుగ్గా ఉండేది కదా! బెల్లం మున్నచోటే ఈగలు వాలినట్లు మరణించేంత వరకు కూడా తండ్రి మీద ప్రేమ కన్న అతని దగ్గరున్న బంగారు ఇటుకల సూట్‌కేసు మీదనే ఆశ ఉంటుంది.

4. ప్రపంచీకరణ ప్రభావం వల్ల మానవ సంబంధాలు, సంస్కృతి సంప్రదాయాలపై తీవ్రమైన వేటు పడింది. భారతీయ హైందవ సంస్కృతి సంప్రదాయాలపైనే కాకుండా ప్రతి పల్లెలోని గ్రామీణ సంస్కృతి, ఆచారాలు తుడిచిపెట్టుకుపోయాయి. మన జీవనశైలికి భిన్నంగా పాశ్చాత్య సంస్కృతిని అమిత ఇష్టంగా ప్రేమిస్తున్నారు. పాశ్చాత్య సంస్కృతుల ప్రభావం వల్ల మన సమాజంలో ఉమ్మడి కుటుంబాలు పోయి చిన్న చిన్న కుటుంబాలుగా విడిపోవడం, ఇతర దేశాలకు వలసలు వెళ్లి బతకడం లాంటి మార్పులు చోటు చేసుకున్నాయి. భావితరాలకు బంధుత్వాల విలువ తెలియకుండా చేస్తున్నాయి.

5. కాలానికి తగినట్లు సమాజం మార్పులు చెందుతుంది. ఆ మార్పులను మౌఖిక సాహిత్యంగాని, లిఖిత సాహిత్యంగాని పరిశీలించి తనలో చిత్రీకరిస్తుంది. జానపద కథాసాహిత్యం అద్భుత కథలనే కాకుండా ఇలాంటి వాస్తవికత అంశాలను కూడా కథల్లో చిత్రిస్తున్నది అని చెప్పడానికి మంచి ఉదాహరణ ఈ కథ.

## 2.5.4.3 అత్త కాలవిషం

కాశెట్టి భూలక్ష్మి, గుండయ్య పల్లె, ధర్మపురి

ఒక రైతు. రైతుకు ముగ్గురు పిలగండ్లు అయితే ఆల్ల పిలగండ్లకు పెండ్లి చూపులకత్తరు. ఇగ పెండ్లిజెత్తరు. ఇగ లక్ష్మీపురంలో పెండ్లి జెత్తరు. బిడ్డనిచ్చి ఇగ బాగా రోజులయ్యే నా బిడ్డ రాక అని ఆల్ల నాన్న తోలుకచ్చుకోని వోతడు. తోలుకచ్చుకోని పోతే ఇగ ఇయ్యంకుడు అచ్చిండని కోన్ని కోత్తది. కల్లు తెత్తది. గుడాలు ఏత్తది అన్నం పెడతది. ఇగ తింటడు. పోతడు ఆల్ల నాన్న ఆల్లు ఎవుసాయం చేసుకుంటరు. ఎవుసాయ పనికి పోతడు. ఒక నెల రెండు నెలల వరకల్లా బిడ్డ నీళ్లు పోసుకుందని చెప్ప పంపుతరు. చెప్పంప్పినంక ఆల్ల అత్త ఏంజేత్తది. ఉండాలె ఒక నెల మూన్నేళ్లు కత్తది. అన్నయ్య మున్నేళ్లకు నీ బిడ్డను తోలిత్త అని చెప్పంపంపుతది. చెప్పంపినంక ఆయనేం రాడు. ఈల్ల అత్త ఏంజేత్తది? మా కోడలుకి బాగా యిట్టమని చాపల కూర అండిపెడిత అని అంటది. అన్నంక ఆల్ల ఇంటెనుక పాము అత్తది. అయింత పామును కోసి వండి పెడతది. పెట్టినోల్లే ఆమె ఎవుసాయ పనికి వోతది. పొద్దుదాంక నాటేయ్య పోతది. పొలంలో నాటేసి ఇంటి కచ్చినంక కోడల అక్కడ ఉట్టి మీద చాపల కూరున్నది. పోసుకొని తిను అంటే అత్తయ్య ఇదంతా నాకేనంటది. నాలుగు ముద్రలు ఏసుకొని తింటది. తెల్లారెవరకల్ల సనిపోతది. చనిపోయినోల్లే అడ్ల ఆయిన దగ్గరకు పోతది. కుంత పట్టుకుని అడ్లయిన దగ్గర పెట్టె చేయిస్తది. పెట్టె చేయించి చెక్కల పెడితే శవాన్ని ఎక్కడ పెడదామని పెరట్ల పెడదమా? పొలంల పెడదామని అంతట చూత్తరు. చూసి పొలంల పెట్టిన, పెరట్ల పెట్టిన ఏర్పాటు చేత్తరు. అని నడిచే తొవ్వల పెడతరు. గొయ్యి తోడి అయింత ఆ పెట్టెను పెడతరు. పెట్టి ఇగ ఆ పెట్టెను పెట్టినంక తెల్లారే. కతం దాన్ని మీద పెద్ద మల్లె చెట్టు మొలుత్తది. ఈల్ల నాన్న, అక్క, తమ్ముడు, చెల్లెను ఆల్ల అమ్మ తోలుకపోవుటానికి బండి ఏసుకొని అత్తరు. ఎడ్లబండి అయింత ఈల్లు రాంగనే అబ్బ పూలు మంచిగున్నయ్ నాన్న. పువ్వులు తెంపు పువ్వులు తెంపుదం. పూవ్వులు తెంపుకోని పోదం అక్కయ్యకు అని తమ్ముడు దిగి పోతడు. ఇగ పూవ్వులు తెంపుకోంగనే ఇగ ఆమె ఆత్మ పాట పాడుతది.

"అ ముట్టకు ముట్టకు ఓ తమ్ముడా! ముట్టిన చేతులు ముత్యాలు,

పట్టిన చేతులు పగడాలు, పాపకారి మాయత్త పాము అయి అండిపెట్టే" అని అంటది.

అయ్యో! గిట్ల అంటుంది. అయింత చెల్లి పోతది. చెల్లె పోయినంక గూడ

"అ ముట్టకు ముట్టకు ఓ చెల్లె ! ముట్టిన చేతులు ముత్యాలు,

పట్టిన చేతులు పగడాలు, పాపకారి మాయత్త పామును అండిపెట్టే" అని మల్ల అంటది.

అన్నంక ఇదంతా ఏమో ఉంది అన్నంక డైరక్ట్‌గా

ఆల్లు ఇంటికివోతరు. ఇంటికివోయి నా బిడ్డ ఏదంటే అగో మీ ఇంటికే అచ్చింది. నేను బస్సు చార్జిలు ఇచ్చిన. మీ ఇంటికే తోలేసిన, నేనత్త అంటే నువ్వేమత్తవ్ నేనే పోతా. నువ్వు పొలం పనులకి వోతవ్ గద. పో..! అన్నది అని చెప్పింది. అన్నంక అది గాదు. అది గాదు. అని ఆల్ల ఊళ్ళే సర్పంచ్‌కు చెప్తడు. మరిగిట్ల నా బిడ్డను తోలుకపోత గర్భవతి తోటి ఉంది. మొదటి కాన్పు మేమే జేయ్యాలే గద. నేను నా బిడ్డను తోలుకపోత అని అచ్చిన. మరి నా బిడ్డ జాడ లేదు. పత్త లేదు. అని సర్పంచ్‌తోని చెప్పిండు. చెప్పినోల్లే ఇగ మొగడిని అడుగుతరు. మరి ఎక్కడ పెయిందిర? నీ భార్య ఏడ ఉందిర? అని అడిగితే మావయ్య మరి.. పొద్దుదాంక పని జేసింది. రాత్రి చాపల కూర అండితే తిన్నది. తెల్లారవరకల్లా లేదు అని అయింత మొగుడు అంటడు. మొగుడువోయి కూడ ముడుతడు. ముట్టినోళ్లే అట్లనే అంటది.

"అ ముట్టకు ముట్టకు ఓ మొగుడా! ముట్టిన చేతులు ముత్యాలు,

పట్టిన చేతులు పగడాలు, పాపకారి మాయత్త పామునే అండిపెట్టే" అన్నంక ఇదంత ఏదో ఉన్నది. గిట్ల జేత్తుందిర మీరు అయింత గొయ్యి తవ్విపిచ్చేవరకల్లా ఆడ శవం ఎల్తది. ఎల్లినంక మీరు గిట్ల జెత్తే ఎట్లుంటది. అసలు ఈ విషయం మంచిగలేదని అత్త, మామకు అయింత గుండు కొట్టిత్తరు. సున్నం బొట్లు పెడతరు. కచ్రంబండి మీద ఊరేగింపుతరు. ఇగ తప్పు గిట్ల ఏ మనిషి కూడ చేయద్దని ఇది తప్పు బాగా...! అని అయింత అందరంటరు. గట్ల కత అయిపోయింది.

## అత్త కాలవిషం – కథావిశ్లేషణ

ఈ కథలో అత్త గర్భవతి అయిన తన కోడలికి పాము కూరని వండించి, ఆహారంగా పెట్టి చంపేస్తుంది. కోడలి శవాన్ని అనుమానం రాకుండా కూడలి దగ్గర పెడుతుంది. అటువైపు మల్లెపూలు తెంపడానికి వెళ్లిన తల్లిదండ్రులు మల్లె చెట్టులో ఉన్న బిడ్డ ఆత్మఘోషను గుర్తించి, అత్త దుర్మార్గాన్ని

కనుక్కుంటారు. సమాజంలో అలాంటి అత్తలు మళ్లీ పుట్టుకురాకుండా ఉండాలని గుండు కొట్టించి ఊరంతా తిప్పుతారు.

1. కోడల్ని సహించుకోలేని అత్త తన దుశ్చర్యలను వ్యక్తపరిచిన కథ. అందరు అత్తలు ఇలా చంపక పోయిన ఏదోక విధంగా రాసి రంపాన పెట్టే అత్తలు ఎక్కువగా కనిపిస్తారు. తన కొడుకు ముందు మంచిగా ఉన్నట్లు నటించి కొడుకు వెళ్లగా కోడలిని ఇబ్బందులు పెడుతుంటారు. పై కథలో రైతు కుటుంబంలో పెరిగిన కోడలిని నానాచాకిరి చేయించి, ఇంటికి వస్తే చేపలు కూర అని చెప్పి పామును చంపి కూరగా వండుతుంది. అది చేపలు కూరనే అనుకొని ఆ కోడలు భ్రమిస్తుంది. అత్త తన మీద ప్రేమతో చేసిందని అనుకుంటుంది. కాని ఆ విషపూరిత కూర తిని కోడలు మరణిస్తుంది. అందుకే ఈ కథ శీర్షిక అత్త కాల విషం సరిగ్గా సరిపోయింది.

2. గర్భం దాల్చినా తన బిడ్డను సంప్రదాయబద్ధంగా తన ఇంటికి తీసుకెళ్లి తాను కోరుకున్నవి, ఇష్టమైనవి చేసిపెట్టాలని పుట్టింటివారు అనుకుంటారు. అది మన ఆచారం కూడా. కాని ఈ కథలో గర్భవతితో ఉన్న తన బిడ్డను తీసుకెళ్లడానికి వచ్చిన తల్లిదండ్రులకు చేదు అనుభవం ఎదురవుతుంది. శాశ్వతంగా తన బిడ్డ ఈ లోకాన్ని విడిచిపెట్టిందనే విషయం తెలుసుకొని బాధపడతారు. పై కథంతా గేయరూపంలో పాటగా కోడలి ఆత్మ చేత పాడబడుతుంది. ఆ పాట కథమొత్తాన్ని తనలో నింపుకొని కథాంశాన్ని వ్యక్తపరుస్తుంది.

3. జానపద కథల్లో అత్త, కోడలు కథలే ప్రధానాంశం. ఆయా కథలు కథాకథనానికి, కథాసృష్టికి కారణం ఆ అత్త, కోడల్లే కాబట్టి. వారు సృష్టించుకున్న కథల్లో వారి పాత్రలే విభిన్న ప్రాంతాల్లో విభిన్న కథలుగా రూపొందుతాయి. ఈ కథలో లక్ష్మీపురం ప్రాంతం ఉన్నది కాబట్టి గోదావరి పరివాహక ప్రాంతంలో ఈ కథాసృష్టికి పునాది పడిందని భావించాలి. కాలక్షేపానికి, ఆనందానికి, హితవుకి ఇలాంటి కథలు చెప్పబడి ఆనాటి సమాజాన్ని, కుటుంబాన్ని సంస్కరించాయని చెప్పవచ్చు.

## 2.5.4.4 తల్లి కూతుళ్ల అనుబంధం

తాటికాయల పుష్ప, డొంకెశ్వర్, ధర్మపురి

ఒక ఇద్దరు అన్నదమ్ములు. ఇద్దరు అన్నదమ్ములు మక్కపెరడు వేసుకున్నరు. అయింత వాళ్లకు పెద్దోల్ల మక్క పెరడు మంచిగ ఉంది. చిన్నోని మక్క పెరడు పురుగు పట్టింది నా మక్క పోయినట్టే నా మక్క గిట్ల అవవట్టే ఆ పెరట్ల మైసమ్మతల్లి ఉంటది. మైసవ్వ తల్లి అందరి పెరట్ల పురుగు పట్టిపోవాలి.

నా పెరడు మంచిగ గావాలి. అని నా భార్యను నా పెరంట్ల ఆహార్యం ఇత్తని మొక్కండిట. ఇగ మక్క ఇట్ల నయనయలాడుకుంటా ఇంత ఇంత పెద్దగా కాసింది. ఆయనకు ఇద్దరు బిడ్డలు భార్యను మైసమ్మ కాడ చేసుకోవాలి. ఏ.. పోదం పా అని పోయి ఆడికెయిర్రు. ఇగ అన్ని పెట్టిర్రు. పాశం, పరమాన్నం అవన్ని పెట్టి మొక్కిర్రట. ఆయన మొక్కి.. నువ్వు మొక్కె..! అని చెప్పి ఆమె మొక్కంగ నరికిండు. ఆహార్యం ఇత్తని బొందవెట్టిండు. ఇంటికచ్చెసరికి బిడ్డలు అమ్మ ఎదని అడిగితే మీ అమ్మ గారింటికి పోయిందని చెప్తడు. పిలగాల్లు పెరట్ల కావాలి ఉంచి అచ్చుడు పోవుడు. ఒక కుమ్మరామె అగ్గి కోసం వస్తె చిన్నామె అగ్గిలేదు ఏంలేదు అంటది. పెద్ద బిడ్డ కొంత అమాయకురాలు. తీస్కపోని చెల్లె అంటది. అగ్గి తీసుకొని ఇగ తండ్రి రోజు అన్నంలో ఉసుకత్తదంటడు. మేం మంచిగ అందుతున్నం బాపు అంటరు. గా కుమ్మరొల్లామె అగ్నికి అత్తుందని చెప్తరు. ఒకనాడు అటుకు మీద పడుకొని పడుకున్నోల్లే కుమ్మరిది అగ్గికనచ్చి అండ్ల ఉసుకపోత్తుందట. అది ఏంది గట్లజేస్తుందని అడిగితే? నన్ను పెళ్లి చేసుకుంటదని అడుగుతది. ఆమెకు బిడ్డ ఉంటది. సరే మంచిదని పెళ్లి చేసుకుంటరు. ఇగ ఈనే బిడ్డలను సంపాలి. ఈనే ఆస్తి నా బిడ్డకైతదని ఇద్దరు బిడ్డలను పెరండ్ల కావాలి పంపుతది. ఈగలు, దోమలు పడ్డ గంజి దాని బిడ్డతో పంపుతది. అది సరిపోకా ఆళ్లు రోజుకొక మక్క కంకి కాల్చుకుని తింటరు. ఈ బిడ్డచ్చి తల్లికి చెప్తది. ఇగ తండ్రచ్చి మీరు పెరడంత కతం చేస్తున్నర అని వీళ్లచ్చి తిట్టుడూ కొట్టుడూ. ఆళ్లు ఏడుసుకుంట కూసుంటే అయింత తల్లి గౌడు బర్రె అవతారమై సర్వల పాలు ఇస్తే అవి తాకుంట బతికిర్రట. ఆ బర్రెను కూడ సంపెస్తడట. ఇగ మక్క పెరడుకని పోతడు. ఇగ బిడ్డలను అమ్మ గారింటికి తోల్కపోయి అడవిల వదలిపెట్టి అత్తడు. అడవిల వీళ్లు ఏడుసుకుంట ఉండేసరికి ఆడవిలనే ఇల్లు కట్టుకుని ఊరు తయారయితది. తల్లి సహకారంతో చేయవట్టి పట్టెన్ని ఆవులు, బర్లులు అన్ని తయారైనయి. చిన్నామె మస్తు గడుసుది. చిన్నామె బర్లు కాయపోతది. పెద్దామె ఇంట్లనే ఉంటది. అడవిల ఒకటి ఇల్లు తయారయిందే అని రాజు ఈమె ఇంటికి అగ్గి వేయమని చెప్తడు. అగ్గె వేయిమనోల్లె రాజు, పతాని వీళ్లు గిట్ల ఎట్ల అచ్చిర్రు అని అడిగితే జరిగినదంతా చెప్తరు. నాక్కూడ పెళ్లి కాలేదమ్మా నన్ను పెళ్లి చేసుకొమంటే మా చెల్లె బర్లకు పోయింది. మా చెల్లె లేదు నేను నిన్ను చేసుకొని నీ ఎంబడి అత్తె. మా చెల్లె ఎటువోవాలని నేను రాను అంటది. మీ చెల్లెని కూడ చేసుకుంట నేనే సాత్త అంటే చిట్టి రాసి పెట్టు అంటే చిట్టి రాసి పెడతది. ఇక్కడికెళ్లి వాళ్ల ఊరి సందుదాక ఒక తాడు కట్టి తాడు వెంబడి పోతరు. చిన్నామె వచ్చి చిట్టి చదివి మా అక్క గింత మోసం చేత్తద? ఈమె తాడు ఎంబడి వోయి ఊరు

బందు కాడ కూసుంటది. ఈమెకు కొడుకు పుట్టిండు. పన్నెండెళ్ల అయిన ముఖం చూసుకుంటలేరు. అక్క చెల్లెలిద్దరు ముఖం చూసుకోకపోతే ఇద్దరు కొడుకులు ఒకసారి ఒక దుకాణం కాడికి వోయి కొనుక్క తింటరు. ఇద్దరు ఒకలు చేతి ఒకలు గుంజుకొని కొట్లాడుకుంటర్రు. అన్నయ్య కాదురా ఇయి ఇయి అని చెల్లె అనుకుంట అస్తది. అక్క తమ్ముడు గాదురా ఇయి ఇయి అని అత్తది. ఇగ అక్క చెల్లెలు కలుసుకొని ఒకరి మీద ఒకరు పడి ఏడ్సి ఏడ్సి కల్సిపోతరు. తండ్రి, కుమ్మరిది మళ్ల వచ్చి కట్టెల మోపు ఎత్తుకొని అచ్చి వీళ్లకు తిందామంటే తిండికి లేకుంట అయిపోయింది. గరీబొళ్లు అయి కట్టెలమోపు అమ్ముకుంటుర్రు. వీళ్లు చూసి తండ్రిని ఏర్పాటు చేసి ఏడిసిర్రు. అయింత తండ్రికి మంచిగ శౌరం, గడ్డం తీపిచ్చి ముకం కడిగి స్నానం చేపిత్తరు. తండ్రిని ఉంచుకున్న కుమ్మరి దాన్ని బొందవెట్టి అత్తరు. తండ్రి మంచిగ ఉంటడు.

## తల్లి కూతుళ్ల అనుబంధం – కథావిశ్లేషణ.

ఒక వ్యక్తి తన మొక్క జొన్న పంట సరిగ్గా పండలేదని పక్క వారి పంటలు కూడా నాశనం కావాలని మైసమ్మ తల్లి అనే గ్రామ దేవతను ప్రార్థిస్తాడు. తాను అనుకున్నదైతే తన భార్యను మైసమ్మకు బలి ఇస్తానని మొక్కుతాడు. తన మొక్కుబడి తీరగానే అనుకున్న విధంగానే భార్యకి మాయమాటలు చెప్పి బలిస్తాడు. అప్పటికే ఆ దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు. ఆ వ్యక్తి భార్యను చంపి రెండవ వివాహం చేసుకున్నాడు. సవతి తల్లి పోరుతో ఆ పిల్లలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కుంటారు. కన్న తండ్రే స్వయంగా ఇద్దరు ఆడపిల్లలను అడవిలో వదిలిపెట్టి వస్తాడు. ఆ పిల్లలు ఇద్దరిని చనిపోయిన తల్లి ఆత్మగా వచ్చి వారి బాగోగులను చూసుకుంటుంది. ఆ రాజ్యానికి చెందిన రాజు వీరిరువురిని చూసి వివాహం చేసుకుంటాడు. కొద్దిరోజులు తర్వాత తండ్రి, సవతి తల్లి బీదరికంతో బతుకుతూ ఉండటం చూసి కన్న తండ్రి తెచ్చుకుని సాదుకుంటారు. సవతి తల్లిని చేసిన దుర్మార్గపు పనుల గురించి రాజుకు చెప్పి శిక్ష పడేలా చేస్తారు.

1. ఈ కథలోఒక వ్యక్తి తన మొక్క జొన్న పంట పాడయ్యిందని తెలిసి, ఆ ఊరి వాళ్ల పంటలన్ని పాడవ్వాలని మైసమ్మను కోరుకుంటాడు. పంట పొలాల గట్ల మీద చెరువు, చేను చెలక చెట్ల మీద మైసమ్మ తల్లి దేవి ఉండి తమ పొలాలను రక్షిస్తుందని పల్లె వాసుల నమ్మకం. గ్రామ రైతులు ప్రతి సంవత్సరం మైసమ్మ తల్లికి పూజలు చేసి కోడిని గాని, మేకను గాని బలి చేసుకోవడం సర్వసాధారణం.

2. ఆప్యాయత అనురాగాలకు చిరకాల చిరునామా భార్యాభర్తల అనుబంధం. అలాంటి సంబంధాన్ని ఇతరుల మీద ఉన్న ద్వేషంతో చంపి పిల్లలకు తల్లిని దూరం చేసిన ఒక దుర్మార్గుడికి కూతుళ్లే తిరిగి అతనికి తగిన సమాధానం చెప్పిన కథ తల్లి కూతుళ్ల అనుబంధం.

3. ఇద్దరు పసిపిల్లలు చిన్నతనంలోనే తల్లి ప్రేమకు దూరమైపోతారు. సవతితల్లి పోరులో పెరుగుతారు. కన్న తండ్రి చేసిన ద్రోహాన్ని గుర్తెరిగి కూడా అవసాన దశలో ఉన్న తండ్రిని ఆదరిస్తారు. తండ్రి మీద ప్రేమతో గతంలో జరిగిన విషయాన్ని మరిచారు .

4. తల్లిదండ్రుల నడుమ పెరగాల్సిన ఆ ఇద్దరు పిల్లలు చెట్టుచేమల కింద పెరుగుతారు. అటువంటి దుర్భర జీవితాన్ని గడపడానికి కారణమైన కుమ్మరామెకు శిక్ష పడేలా చేస్తారు. వాళ్లు అనుభవించిన కష్టాలను తమ పిల్లలు అనుభవించకూడదని, వారికి జరిగిన బంధవియోగం తమ పిల్లలకు జరుగకూడదని హిత బోధ చేసి వాళ్ల పిల్లలను కలుపుకుంటారు.

5. సమాజంలో కొంతమంది వ్యక్తులు తమ పూజలను, ఎదుటివారి వినాశనానికి కూడా ఉపయోగిస్తారని ఈ కథ ద్వారా వెల్లడి అవుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చేతబడి, నరబలులు, మాంత్రిక, తాంత్రిక శక్తులు ఉన్నాయని ఎక్కువగా నమ్ముతారు.

## 2.5.4.5 బూడిదగిరి పట్నం

కైరం రమణ, బతికెనపల్లి గ్రామం, రాయికల్ మండలం

ఒక ముసలాయన, ముసలమ్మ ఉంటరు. ఆళ్లకు చాలా రోజులకు సంతానమయితది. సంతానమయినందుకు ఒకటే బిడ్డ పుడుతది. ఒకతే బిడ్డ పుట్టిన తరువాత గీ బిడ్డకు పెండ్లి చేయాలే వయసు అచ్చింది కదా. అని చెప్పి పిలగన్ని చూసి జేత్తము అని చెప్పి పిలగన్ని చూసి చేసుడు ఏంది? మనము ఇల్లరికమే తీసుకచ్చుకుందాం! ఆ ఎందుకంటే బిడ్డను బయటికిత్తే మనకు అరుసుకునేటోళ్లు ఉండరు కద! అని చెప్పి ఆ ఇల్లరికం తీసుకచ్చుకుంటరు. అల్లున్ని. తీసుకచ్చుకున్న తరువాత ఇండ్ల వెట్టుకున్న తరువాత కొద్ది సంవత్సరాల తరువాత ఆళ్లకు కలహాలు ఏర్పడతయి. కలహాలు ఏర్పడి ఏ మా అందల్ల మేము బతుకతం! అని చెప్పి బిడ్డ అల్లుడు ఎల్లిపోయి వేరే పక్కపొన్న ఓ ఇల్లు కట్టుకోని ఆ ఇంట్లనే ఉండరు. ఏది గుడిసెల్లాంటి ఇల్లు కట్టుకొని అండ్ల ఉంటరు. ఉన్న తరువాత ఇగ ఈనేకు అంత కల్మషం అత్తది. నేను ఇంట్లకు తీసుకచ్చుకుంటే నన్ను ఇడిసిపెట్టిపోయి అండ్ల అజ్జేసుకుంటరా మీరు?. బిడ్డ అగుర్రి! మీ సంగతి జెబుత! అని జెప్పి ఈ ముసలోడు ఏంజేత్తడు. ఈల్లు కలపుకుపోతరు. కలపు

వోవుడు జూసి పండ్లకు ఎవుసాయం పండ్లకు వోవడం చూసి ఇంత గడ్డి తీస్కత్తడు. అరిగడ్డి తీస్కచ్చి మంచిగ గడ్డేసి అండ్ల కలవెడతడు. ఆ ఇల్లు కాలవెట్టిన తరువాత ఈళ్లు ఇంటికచ్చేవరకల్లా ఈళ్లు కాలిపాయే. ఏంజేసుడు అని చెప్పి బాధపడి మల్ల ఓ సాయిమాను ఏసుకోని మంచిగ సాయిమాన్ల ఉంటరు. ఈ బూడిదంత జమజేత్తడు ఈడు. ఈ బూడిద జమచేసి తీస్కపోదమని జెప్పి సాకలోల్ల అక్కడ గొన్ని గాడిదలు ఉంటయి. సాకల్లోల్లను గాడిదలు ఇమ్మంటే సాకలోల్లు గాడిదలు యిస్తరు. గాడిదలు ఇచ్చిన తరువాత ఈ బూడిద మంచిగ సంచుల్లల ఎత్తుకుంటడు. ఎత్తుకోని ఓ నాలుగు గాడిదల మీద ఏసుకోని ఇగ అమ్ముకత్త అని చెప్పి బూడిదగిరి పట్నం పోతడు. పోంగ పోంగ ఒక పెద్ద అడివి అత్తది. ఆ అడివిల నడిచి నడిచి యాష్టకత్తుండు. యాష్టికచ్చినంక ఈ భార్య కట్టిన రొట్టెలుంటయి. ఆ రొట్టెలు తింటడు. ఆడ కొన్ని నీళ్లు తాగుతడు. అట్లనే పడిపోతడు ఇగ. ఆ మంచిగ నిద్ర బాగా అత్తది. ఇగ పడిపోయిన తరువాత సెరిసగం రాత్రి ఒకటిన్నర లేదా రెండున్నర ప్రాంతంలో గజ దొంగలు ఒక నలుగురు గజదొంగలు ఆళ్లు దోసుకుని గాడిదల మీద తీసుకొని ఆళ్లత్తరు. ఆళ్ళచ్చి చూసేవరకల్లా అగో మేము దొంగలమంటే మా కంటే ఎక్కువ దొంగోడున్నట్టున్నడురో ఈడు సామాను మంచిగ ముల్లెలు కట్టుకున్నడు. ముల్లెలు పెట్టిండు. మంచిగ ఇక్కడ పడిపెయిండు. అరెరె మన ముళ్లలు ఈడ పెడతం రా..! ముల్లెలు పెద్దగ ఉన్నయి. అవి ఎత్తుకుపోదం రా.. అని చెప్పి ఆ ముల్లెలు ఇడ పారెత్తడు. ఆ ముల్లెలు తీసుకొని ఇగ ఎల్లిపోతరు. ఎల్లిపోయేవరకల్లా ఈనికి తెలివి అయితది. తెలివి అయి చూసేవరకల్లా అగో ఇవేమో నగలున్నట్టున్నయి. నేనేమో బూడిద తీస్కత్తె గివి నగలు ఐనై అని చెప్పి  ఆ నగలను తీసుకోని అయింత గాదుదలు కొట్టుకోని ఇదు ఇగ  బూడిద గిరి పట్నం పోదు ఇగ. సప్పుడేంక ఇట్టికత్తడు. ఇట్టికచ్చి పెళ్ళంతో ఎం జెప్తడు. అవునే గిట్ల గిట్ల సంగతే నేను వోయిన అడివి ప్రాంతంల గీ బూడిద అమ్ముదం అని పోతే మల్ల బూడిదపోయింది. బూడిదవోయి ఈ బంగారం అయింది. అన్నంక అట్లన అని చెప్పి కొలుసుకుందం! మీవోళ్ల దగ్గరికి పోయే ఆ.. మీ వోళ్ల దగ్గర మాన్క తీస్కరాపో, అడ్డె తీస్కరాపో అని అన్నంక మంచిది. తీస్కత్త అని చెప్పి అవ్వ అవ్వ గా అడ్డె ఇయ్యే కొద్దిగ పని ఉన్నది. అంటే ఎందుకే బిడ్డ అంటే ఏ కొద్దిగ పని ఉన్నది. ఇయ్యంటే ఆ ఇత్త అని చెప్పి అదేం జేత్తది. ఆ...హా... ఈల్లు ఏం కొలుత్తరో చూదాం అని చెప్పి ఆ అడుక్కు మైదం పుత్తది. మైదం పూసి అడ్డె యిత్తది. అడ్డె ఇచ్చిన తరువాత ఆ అడ్డె తీసుకోని ఇగ మంచిగ కొలుత్తరు. కంటెలు, నానులు, మెంతులు, పడిగెలు అన్ని వజ్రాలు ఇగ అన్ని కొలిచిరి. కొలిచి మల్ల ఇగ అడ్డె ఇద్దమని చెప్పి ఇగ అడ్డె

దానికి ఇచ్చి రానుపోతే అది చూసుకుంటది. చూసేవరకల్లా అందులో ఓ నాణేం, ఈ పడిదెలు, ఈ కంటెలు తరిగి మంచిగ తట్టుకొని ఉంటయి. అబ్బో బంగారమే దొరికిందిల్ల. ఇల్లకు ఎక్కడిదో? ముల్లె అని జెప్పి. ఆ మొగనికి చెప్తది. గిట్ల గిట్ల సంగతి నేను అడ్డె ఇచ్చిన ఇత్తే దాన్ల మొత్తం అవే ఉన్నయి. అడుగు మైదం పూసిన ఆ మైదంకు అంటుకొన్నయి. అన్నంక అట్లన అని చెప్పి ఈడు మెల్లగ ఇగ సుట్ట ఎసుకుంట పోతడు. పోయి కూసుండి బిడ్డ. అగో నాన్న అచ్చినవానే కూసో అని చెప్పి పాలువోత్త అని జెప్పి పాలువోసే పాలు వోసినంక తొక్కుంట ఆ...! బిడ్డ అట్టిగ ఇల్లు గాలిపాయే అంటే ఇల్లు కాలిపోతే ఏందే నాన్న ఇల్లు కాలిపోయిందే నయమయ్యిందే. ఈ ఇల్లు కాలిపోతేనే మాకు ఇంత బంగారం దొరికింది. ఇంత వజ్రాలు దొరికినయి. ఇంత రూపాలు దొరికినయి. నాన్న అని చెప్పి చెప్తది. ఎట్ల దొరికినయే? అంటే అల్లుడు చెప్తడు. ఇంగో మామ ఇల్లు కాలిపోయిందని గీ బూడిదంత తీసుకొని పోయిన బూడిద తీసుకొనిపోయి గా బూడిద గిరి పట్నంకు పోతే అక్కడ అరబ్బుల జాతర సాగుతుంది. అయిదు రోజులు సాగుతదట. ఆ జాతరల ఈ బూడిదంత పారవోసిన ఆళ్లమీది. ఆళ్ల మీద పారెత్తే ఆళ్ల ఏం జేసిర్రి. అరె పారవోయకర అని జెప్పి ఆళ్ల దగ్గర ఉన్న నాణేలు, కంటెలు, అవి ఇవి మనిషి కొన్ని పంచెలేసిర్రి. అవి గట్టుకొని నేను ఇటచ్చిన మామ అంటడు. అట్లన అని చెప్పి మంచిది అని చెప్పి ఈడు పోతడు. ఈనికి మనసున పట్టదు. ఆనిల్లు ఎట్ల కాలిపేయిందో నా యిల్లు గట్లనే కాల పెట్టుకుంట అని చెప్పి ఈ ఇల్లు కాలపెట్టుకుంటడు. ఇల్లు కాలపెట్టుకొని బూడిదంత జమ చేసుకోని ఈడు వోతడు అక్కడికే. ఈడు బూడిదగిరి పట్నం వోయి అక్కడ జాతరల అరబ్బుల జాతరల యింత పారవోత్తడు. ఆళ్లు మెత్తగ గుద్దుతరు. గాడిది కొడుకా! నీవ్వు బూడిద మా మీద పారెత్తవ మంచిగ మెత్తగ గుద్ది పంపిత్తరు. పంపిచ్చినంక ఆ దెబ్బలకు తాళలేక ఇంటికచ్చి పడుకుంటడు. అబ్బ గాడిది కొడుక నువ్వు బూడిదగిరి పట్నం వోయిన అని చెప్పి నా ఇపంత పగలగొట్టినవ్ కదరా! అబ్బ! అగు నీ సంగతి చెప్తర అని చెప్పి ఆనికి మనసున పట్టక రాత్రి ఇగ అడివిలకు పోతడు. నల్ల ఉసిరి, తెల్ల ఉసిరి ఆకులను తీస్కత్తడు. తీస్కచ్చి మంచిగ నూరుతడు. నూరి మంచిగ భార్యభర్తలు ఇద్దరు ఒక మంచల పడుకొని ఉంటరు. పడుకొని ఉండంగ మంచిగ ముక్కుకాడ అటు ఇటు దాని ముక్కుకి బిడ్డకు మన అల్లుని ముక్కుకు పెడుతరు. పెట్టిన తరువాత ఆల్లు స్పృహ తప్పిపోతరు. స్పృహ తప్పిపోయినంక మెల్లగ ఇగ కాళ్ల కిందికెల్లి ఒక చేతు, తలకాయ మీది కెల్లి ఒక సేతు బిడ్డను తీసి మంచిగ కింద పండ పెడతడు. కింద పండవెట్టి అల్లునికి మంచిగ తాళ్లవట్టి బిగ్గిత్త మంచిగ కడతారు. బిగ్గిత్త మంచిగ కట్టి ఇగ

ఎత్తుకుంటడు. ఎత్తుకొని పెద్ద కోనేట్ల పారెత్త అని చెప్పి. కోనేట్లకు తీస్కపోయి పోయేటప్పుడు పోయి పోయి కోనేట్ల ఎత్తేత్తడు. ఎత్తేసేవరకల్లా దేవత ప్రత్యచ్చమై ఆ తాళ్లు తీసేసి నీవు కిందికి మీదికి మునిగినవు. మునిగితే మూడు, తేలుతే నాలుగు గొర్లల ఇస్తున్న అంటే అవి ఒక మంద అయితది. ఆ మందను ఆడు మంచిగ కాసుకుంట రోజు మందను కాసుకుంట బతుకతడు. బతుకుతే వీనికి కడుపు మండే యిగ మామకు అబ్బ! ఈ లంజకొడుకును తీస్కపోయి కోనేట్ల ఏత్తే మందచ్చింది. ఎక్కడెకెళ్లి అచ్చింది. మంద అని చెప్పి మల్ల సుట్టు చేసుకుంట మంచిగ తంబాకు పెట్టుకుంట సుట్ట వేసుకుంటవోయి కూసుండి అల్లుడు నాకంత రాత్రి కలెట్లో అచ్చింది. నువ్వు చనిపోయినట్టు కలచ్చింది. అవును మావ నన్ను తీస్కపోయి ఎవలో కోనేట్ల ఎత్తేసిరు. ఆ దేవత ప్రత్యచ్చమై నా కన్ని గొర్లమంద ఇచ్చింది. ఆ గొర్లమంద కాసుకుంటున్న అన్నంక అట్లన నన్ను గూడ తీస్కపోయి నన్ను ఎత్తెయి. అని జెప్పి మంచిది ఇగ ఆయన రాత్రి పడుకోని కట్టి ఎత్తెయి అల్లుడు నాగూడ మందత్తది అని చెప్పి అన్నంక అల్లుడు తీస్కపోయి అండ్ల ఎత్తేత్తడు. కతం ఆడు సత్తడు కథ అయిపోద్ది.

## బూడిదగిరిపట్నం – కథావిశ్లేషణ

ఒక్క కన్ను కన్నే గాదు ఒక్క కొడుకు కొడుకే గాదు అన్నట్టు లేకలేక పుట్టిన అమ్మాయిని గారాబంగా పెంచి పెద్ద చేశారు. యుక్త వయస్సురాగానే పెళ్లి చేసి అల్లుడిని ఇల్లరికం తెచ్చుకున్నారు. కొద్ది రోజులకే భేదాభిప్రాయాలు వచ్చి తల్లిదండ్రుల నుంచి విడిపోతారు. అదే ఊరులో హాయిగా బతుకుతున్న బిడ్డ, అల్లుడిని చూసి ఓర్వలేని తండ్రి వాళ్లకి కీడుని కలిగించే పనులు చేస్తాడు. కాని మంచివాడి వెన్నంటే అదృష్టం ఉన్నట్టు మామ ఎన్ని ఇబ్బందులు పెట్టిన అల్లుడికి మేలు కలుగుతుంది. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు ఆ మేలుని కూడా జీర్ణించుకోలేని మామ తాను అత్యాశకు పోయి అల్లునికి దక్కినవన్నీ తనకు దక్కుతాయని ఆశపడి చివరకు ప్రాణాలు కోల్పోతాడు.

1. మామ వేరుపడి సంతోషంగా జీవిస్తున్న బిడ్డను, అల్లుడిని దీవించడం మాని వారికి ఎలాగైనా కీడు కల్గించాలని తలచి వారి గుడిసెని కాలపెడతాడు. అల్లుడిని చంపడానికి ప్రయత్నిస్తాడు. కాని తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు అల్లుడి మీద ప్రతీకారం తీర్చుకుందామని అనుకున్నప్పుడల్లా తాను తవ్వుకున్న గోతిలో తానే పడతాడు.

2. మంచి వాళ్లకి మంచే జరుగుతుంది అన్నట్టు. మామ తలపెట్టే కీడుని గమనించిన కూడా తాను నిత్యం నెరవేర్చాల్సిన బాధ్యతలను గురించి ఆలోచిస్తాడు. అందుకే అల్లుడికి ఒకసారి గజదొంగల వదిలిపోయిన ధనరాశులు లభిస్తాయి. మరొకసారి దేవత ప్రత్యక్షమై గొర్రెల మందను ఇస్తుంది.

3. కుటుంబంలో గాని, బంధువులల్లో గాని తమ కన్న ఇతరులు ఉన్నతమైన స్థాయిలో జీవిస్తున్నారని తెలిసి ఓర్వలేని జనం చాలా మందే ఉంటారు. ప్రతి ఇంటిలోనూ, కుటుంబంలోనూ, సమాజంలో ఇలాంటి గుణం ఉన్న వారు నాటికీ, నేటికీ కనిపిస్తుంటారు. కథాకల్పన చేసిన వారికెదురైన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని కథ రూపొందుతుంది. కాబట్టి ఈ కథ కల్పించిన ప్రధాన ఉద్దేశ్యం. ప్రక్కవారిని చూసి నిత్యం ఈర్ష్య, ద్వేష, కుళ్లు భావాలతో జీవించకూడదని తమ జీవితాల్లో అశాంతి నింపుకోవద్దని వక్కాణించి చెబుతున్నది కథ.

4. ఈ కథలో బూడిదగిరి పట్నంలో అరబ్బుల జాతర అనే ప్రస్తావన వస్తుంది. అరబ్బు రాజులు పాలించిన సందర్భంలో ఈ కథ ప్రచారంలో ఉందని వెల్లడి అవుతుంది.

5. కంటెలు, నానులు, మెంతులు, పడిగెలు మొదలైన బంగారు నాణేలు ఆ కాలంలో స్త్రీల వేషధారణను గూర్చి తెలియజేస్తుంది. తన తల్లి బంగారాన్ని కొలవడానికి ఇచ్చిన పాత్రకు మైదాపిండి పెట్టి ఇవ్వడం వల్ల ఆ పిండికి కొన్ని నాణేలు, పడిగెలు అతుక్కొని ఉంటాయి. దాన్ని బట్టి బిడ్డ, అల్లుడు బంగారాన్ని కొలిచారని అత్తకు తెలుస్తుంది. ఇది జానపదుల తెలివితేటలను వ్యక్తపరిచే చిట్కా అని చెప్పవచ్చు.

## 2.5.4.6 అన్న చెల్లెలి కథ

కైరం రమణ, రాయికల్ మండలం.

తల్లిదండ్రులు చనిపోతరు. అన్న చెల్లెలు ఉంటర్రు. చెల్లెల్ని ఒక ఇంటికిస్తడు. ఇంటికిచ్చినప్పుడు ఆళ్లకు ఆళ్లు, ఈళ్లకు ఈళ్లు బతుకుతుండ్రు. అన్న కొద్దిగ ఐశ్చర్యంగ బతుకుతుండు. చెల్లె కొంచెం పేదరికం. అయితే చెల్లి ఏమంటంది. మరి మా అన్న ఇంటికోత ఏమన్న ఉంటే ఇంత నూకలు, ఇంత జొన్నలు, మక్కాలుంటే తీసుకత్త ఎప్పుడు ఈ కైకిలు చేసుకుంట బతుకుడైతుంది గద. గీ కైకిలు సరిపోతలే అని చెప్పి అనంగ భర్త ఇగ ఏమంటుండు. కొడుకును తోలుకొని పొయిరా పో అంటే ఓ ఎనిమిది సంవత్సరాల పిలగాడు ఉంటడు. ఆ...! కొడుకును తోలుకొని పొయిరా పో.. మరి ఉంటే ఏమన్న మీ అన్న ఏమన్న ఉంటే కడతే తీస్కరాపో అంటే అని చెప్తే ఇది తోలెత్తడు. ఏది ఆళ్ల భార్యను తోలుతడు. తోలినంక ఆమె అచ్చి వదిన. వదిన.. అన్న ఏడికి పోయిండు అంటది. అంటే ఏమోపో..

ఎలుక పోయి ఎత్తుకు పోయి ఏడు రోజులయ్యే మీ అన్న జాడ లేదు పత్తలేదు. ఎడ్రోజులు అయితుందని చెప్పి ఈమె వదినె అంటది. అనే సరికి పక్కపోన్న పెద్దవ్వ ఉంటది. పెద్దవ్వ పెద్దవ్వ మాయన్న ఎటువయే మా అదినె గిట్ల అనవట్టే ఏ... గట్లనే అంటది పో. మీ జొన్న సేను లేద. మీ జొన్న సేన్ల ఉంటడు పో.... అని చెప్పి ఆ...! పెద్దవ్వ అంటది. అయ్యో! మా జొన్న సేను నాకయితే ఎరుకనే ఉంది. అనుకొని ఆ జొన్న సేన్లకు సోత్తది. ఆ జొన్నసేన్లలకు కొడుకు తోలుకొని పొయేవరకల్లా ఆయన మంచెం మీద చిలుకల కావలి ఉంటడు. చిలుకుల కావలిని ఉండే సరికి అరె. గట్ల అత్తంది. మా సెల్లె లెక్కనే కొడుతుంది. మా చెల్లెనే గద అనుకోంగనే మా చెల్లెనే అయ్యో చెల్లె అత్తనవ్ దా..! అని చెల్లెని దగ్గరగా తీసుకోని చెల్లెని, అల్లుడిని మంచమెక్కి ఇగ మాట్లాడుకుంటది. అన్న నేనచ్చి ఇగో అదినె అన్న ఎటువోయిండు. అంటే ఎలుకువోయ్యి ఎత్తుకొని ఏడు రోజులై అని జాడలేదు. పత్తలేదు. మీ అన్న అన్నది. అన్నంక నా కంత భయమనిపిచ్చింది. అన్నంక అట్లన అది గట్ల అన్నదాయే సరే మంచిది చెల్లె అనేవరకల్లా అటు చూడంగనే అంబలి ఎత్తుకొని అత్తుంది భార్య. అది అంబలి ఎత్తుకొని అత్తుంది. మరి నువ్వు గడ జొన్న కర్రలెత్తున్నయ్.. ఆ ఎత్తుగర్రలల్ల జాక్కొ అల్లుదునువ్వుపోయి అడ జాక్కొర్రి. అది పొయినంక మల్ల నేను పిలుత్తనే అన్నంక మంచిదని ఆమె మంచె తీగే జొన్నకర్రలల్లకు వోయి జాక్కుంటంది. ఇగ ఈ భార్య అచ్చే ఇంగో తాగు అంబలి తీస్కచ్చిన అంటే ఏమో పోయే నీ కండ్లకు కగ్గిదలగ కదుపంత నొచ్చిపాడయే. నువ్వంబలి తీస్కచ్చినవ్ కదుపంత నొత్తుంది. ఆడ పెట్టిపో నేనత్తపో కొద్దిగ అయినంక తాగుతపో అని చెప్పినంక మరీ మంచిది. అది అడ అంబలి పెడతది. ఇంటికోతది. ఇంటికోయిన తరువాత ఇగ పోయింది. జూసి ఇగ చెల్లె దాయే అని చెప్పి అల్లుణ్ణి దగ్గరికి తీసుకోని చెల్లెకు అంబలి తాగిపిత్తడు. జొన్నంబలి తాగిపిచ్చినంక ఇగ మనం ఇంటికి వోదంప అని చెప్పి యింటికి తీసుకపోతడు. ఇంటికి తీస్కపోయేసరికి రాత్రి అయిపయ్యే ఇగ పడుకున్నరు. తెల్లారింది. తెల్లారిన తర్వాత మరీ భార్యకు చెప్తడు. ఇంగో మా చెల్లి అచ్చింది. మంచిగ కోన్ని కొయ్యి గారెలు జెయ్యి. తాల్పన్నం అండు అని చెప్పి చెప్తడు. చెప్పి చెల్లె అచ్చింది. చెయ్యే అంటే ఈల్ల భార్య ఏమంటది. సరే ఆడోళ్ల సక్కి ఆడోళ్లకు ఎరక. నీకెందుకు అవన్ని నాకు దెలువదా నువ్వు జెప్పాల్సిన అవసరము ఉన్నదా? అని చెప్పి ఆమె అంటది. ఆడోళ్ల సక్కి ఆడోళ్లకే తెలుసు గవన్ని నీకెందుకు పో... కావలి పోమని చెప్పి జొన్న కావలి పొమ్మంటది. పోమ్మనంక ఈమె ఏంజెత్తది. జూసి ఇగ చెర్లకు వోతది. జనగలు పట్టుకత్తది. కప్పలు పట్టుకత్తది. మంచిగ జనగలు, కప్పలు మంచిగ అందుతది. ఇగ కొట్టలకు

వోయి ఆవుది రొచ్చు తీసుకత్తది. ఆ రొచ్చు తీస్కచ్చి మంచిగ ఆవు రొచ్చు ఏమో కల్లు అన్నట్టు, ఇవేమో కూర ఇగ మన ఈమెకు తయారు చేసి పెడతది. రెండోది ఈల్లకు మంచిగ గారెలు చేసుకున్నరు. కోన్ని కోసుకున్నరు. తాల్పన్నం అందుకున్నరు. అయిన తరువాత అన్ని అచ్చిండు. అన్న అచ్చినంక చెల్లె అన్న మాట్లాడుకున్నరు. ఇంక తిన్లేదే? అన్నంక ఇగ తిందురా. ఆమె ఏమంటది ఏ ఆడ నువ్వు కూసున్నవ్. లోపల కూసో ఆళ్లు కూసుంటరు. మెసల రాదు అని చెప్పి అంటే సరె పోని అడకూసోలే. నేనిడ కూసుంటని చెప్పి ఆయన లోపల కూసుంటడు. చెల్లెనేమో బయట కూసుంటది. బయట కూసున్నంక ఇగ ఈయనకు మంచి తాల్పన్నము గారెలు అన్ని వెట్టి మొగనికీ, ఆడు తింటుండు. ఈమెకు కప్పల కూర, కల్లోమో ఈ రోచ్చు జనిగలుండి తౌడు రొట్టెలు చేసి ఇవి తినుమని చెప్పి తినుపిల్ల అని చెప్పి ఇక్కడ పెట్టింది. ఈ పిలగానికి వెట్టింది. ఆ మొగనికెమో మంచిగ గారెలు కూర అన్ని అక్కడ ఆయన తింటుండు. ఈనే ఏమనుకుంటుండు మా చెల్లె గూడ ఇవే కావచ్చు అని ఆయన అనుకుంటుండు. గట్లంటి ఆలోచన ఎన్నడూ రాలే. అయితే ఈ చిన్నపిల్ల గాడేం జెత్తడు. మామ దగ్గరికి వోత అని మామ దగ్గరికి పోయిన తర్వాత దారా దారా.. అని చెప్పి తోడ మీద కూసుండవెట్టుకోని ఒక రవ్వ తీనిపిత్తడు. ఇంత రవ్వ తినిపోయినంగనే అక్కడ తిని ఇక్కడికి అత్తడు. అమ్మా మనయి ఏమో రొచ్చు రొచ్చు అత్తున్నయి. మనకూర కౌసుకౌసు అత్తంది. మామ సియలు కమ్మగ, మామ బువ్వ కమ్మగా మనదేమో అంత మంచిగ ఉంటలేవు. అమ్మా అంత కౌసు కౌసు రొచ్చు రొచ్చు.. మనయి అంటడు. అన్నంక ఆమె కొంచెం ఏడ్తది. దు:ఖపడి చేతులు కడుక్కొని ఈగో అన్న ఏమన్నంటే మల్ల ఇగ ఈల్లు కొట్లాడుకుంటరని అన్న నేను పోతనే అని బాధపడుకుంటా కడుపు నింద దు:ఖపెట్టుకొని చెప్తది. పోదువు... చెల్లె. నువ్వు అదినే బట్టలు తీస్కత్తది. అవునే నువ్వు బట్టలు తీస్కరా...! ఆ పిల్లగానికి ఆమె చెల్లెకు బట్టలు తేపో..! పోవుడు గంగ ఉంది కద. గంగదాటి పోవలానయే ఇంత అన్నం కట్టు, ఇంత సద్ది గట్టు అని చెప్పి చెప్తడు. చెప్పిన తరువాత సరే మంచిది కడత. ఆడోళ్లు సక్కి ఆడోళ్లకు తెలుత్తది నీకేం తెలుసు. అన్ని నేను కడత నువ్వుపో.. అని చెప్పి మొగోన్ని తోలుతది.

ఏసి ఇగ ఇది మంచిగ వోతది. కొట్టంలకు వోయి బర్రె పెండ కడతది, ముల్లె కట్టి పిల్ల ఇంగో మీరు గా గక్కడికే పోయినంక తోలకపోర్రి. మీ ఊరికి పోయినంకెనే ఇంగో ఆకలయితే ఇది తినుల్లి. సద్ది గట్టిన అని చెప్పి చెత్తది. ఇక్కడేమి కట్టుకోకుర్రి. అక్కడే కట్టుకోని అని చెప్పి మంచిది అని చెప్పి అంగడి పోలేదు ఏమి చేయాలె అట్ల పోయింది. కొట్టలలకు వోయిగ మసిపేలకలు గవి ఇవి అన్న తెచ్చి,

గొంగలి బొంత తీస్కచ్చి గివన్ని ఇగ కట్టి, గీ పెండ కట్టి ఇంగో తీస్కపో పిల్ల అని ఆ ముల్లె ఇచ్చింది. ఆ ముల్లె ఇత్తే ఇ ముల్లె తీస్కోని ఆమె బయలుదేరింది. మార్గ మధ్యల పోయేసరికి గీ గంగచ్చే గంగ రాంగనే గీ పిలగానికి అంగి నానింది. అమ్మా అంగీ నానింది. చెడ్డి నానిందే అని అంటే అగు బిడ్డ కొద్దిగ ఆగని పాయో అయిపాయే తరువాత మార్చుత బిడ్డంటే అమ్మా నాకు ఆకలి అయితుందే అన్నంక ఇక్కడే నీళ్లున్నయి. అన్నం తిందామే అంటే అమ్మా... ఆ జొన్నంబలి తాగుదామే ఏది వుంటే అది తిందామే అంటే మరి తిందాం. కొడుక అగు అని ఆ ముల్లె ఇప్పుతుంది. ఇప్పంగనే పెండ ఉంటది. పెండ ఉండేవరకల్లా ఏడ్తది. కొడుకు ఆకలి అయితుందని ఏడిత్తే ఈ ముల్లెలేమో పెండుండే పెండ పారెత్తది. ఈ బట్టలు తొడుగుదాం అనుకుంటే మసికంత పేలకలు, గొంగలి బొంతలుండే ఇగ మసిపేలకలు పారెత్తది. ఏడుసుకుంట గంగ ఒడ్డుకెక్కింది. ఎక్కేవరకల్లా అక్కడ ఒక పెద్ద రేగి చెట్టుంది. ఆ చెట్టుకాడ మంచిగ పండ్లు ఉన్నాయి. గంగరేగు పండ్లు రాలినయి. గవి కడుపు నిండ పిలగాడు తింటడు. ఈమె తింటది. కొన్ని ముల్లె కట్టుకుంటరు. ముల్లె కట్టుకునే వరకల్లా ఒక పెద్ద నాగ సర్పం అత్తంది. ఆ నాగ సర్పాన్ని ఎంటపడి ఈమె సంపుతది. మంచిగ అదే గంగల రౌతువట్టి ఘటికలు ఘటికలు జేత్తది. చేసి ఈ పామును ఉడుకపెట్టుకోని చచ్చిపోవాలి. గీ బతుకు బతుకద్దు. గీంత పేదరికం బతుకు మనకెందుకు అని చెప్పి ఆ ముల్లె గట్టుకుంటది. ఇగ ఇంటికి పోతది. భర్త ఎమనుకుంటడు. ఏమి తెచ్చిందో నా భార్య పోయింది. ఇంత ముల్లె గట్ట కచ్చిందని ఆయన అనుకుంటుండు. ఇగ మంచిగ ఉడకబెట్టింది. తిందామని మూత తీసేటల్లకు మొత్తం బంగారు కడ్డీలు అయితయి. అంత బంగారమే అయితది. బంగారం అయింది అగో దేవుడు ఇచ్చిండు. వరం అని చెప్పి మంచిగ బంగ్ల కట్టుకుంటది. అయిదు బ్రామ్మన్లతోని బంగ్ల ఇంట్లకు పోదమని అన్ని కార్యక్రమాలు జెద్దామని అనుకుని అంగట్లకుపోయి సామాను కొనుకచ్చింది. ఇంత అంత పెద్ద కార్యక్రమాలు జేత్తుంది. చేసి మరి మా అన్నకు మా వదినకు చెప్పత్త పోయి చెపుదామని ఈమె మంచిగ నగలు చెప్పించుకున్నది. ఆవుసల వాని దగ్గర నగలు చేపించుకున్నది. ఇగ బంగ్ల కట్టుకొనే పోయి అన్న ఇంటికి పోయే సరికి అన్నం జొన్న కావల పోయిండు. అదినె చెప్పేవరకల్లా అదినే చూసింది. అదినె కళ్లు చెమ్మగిల్లపోయి కింద పడిపోయింది. అగో గిదేంది కొద్దిసేపు తెలివి అచ్చిన తరువాత ఏంది గిట్ల తయారయినవ్. ఏంది అంటే? ఏం లేదు దేవుడు ఇచ్చిండు. గిట్ల అయినం. మరి రాన్లి మా అన్నను తోలుకొని రా...! అని చెప్పి ఇంట్లకు పోతున్నము బంగ్ల కట్టుకున్నం. సరే మంచిది అత్త పోవో పిల్లా

అని చెప్పింది. చెప్పినంక అన్న అచ్చే ఈమెనేమో ఇంటికి వయే ఇగ ఈల్ల అన్న అచ్చిండు. అచ్చినోల్లే ఈమె చెప్తుంది. ఏమని ఇంగో మీ చెల్లె అచ్చింది. బంగారు నగలన్ని ఏసుకోంది. ఎవ్వల్నో మంచిగ గట్టిగనే వట్టింది. ధనవంతున్ని వట్టింది. మా... మొత్తం నగలేసుకోని అచ్చింది. పట్టుచీర ఆమెను చూత్తే అదిరిపోతవ్ ఏమనుకున్నవ్ గంత తయారయ్యి అచ్చింది. అట్లన అగో ఎవ్వన్ని వట్టిందే మా సెల్లె... ఏమన్న అడుగుతే నేను ఇయ్యక పోదునా? అని చెప్పి దాన్ని చంపే పారేత్త అని మంచిగ కత్తి ఉప్పుల మంచిగ కత్తి నూరుకుంటడు. నూరుకొని దాన్ని చంపేసి అత్తనంక బయలుదేరతడు. బయలుదేరి ఇంటికివోయే వరకల్లా ఇగ కార్యక్రమాలు అయితున్నయి. అందరు తినిపేయిండ్లు. ఎవ్వలు అందరు తినిపాయే ఎవ్వరులేరు. ఇంట్ల కూసుంటది. మసక పడుతుంది. దీపం ముట్టించింది. ముట్టినంక దీపానికి చెప్పుకుంటుంది.

దీపమా! దీపమా!
మా పొట్టకు లేకపోతే మా అన్న ఇంటికి వోయినం దీపమా! దీపమా!
మా అన్న ఎటువేయిండంటే దీపమా! దీపమా!
ఎలుక పొయ్యి ఎత్తుకపోయి ఏడు రోజులై అన్నది దీపమా! దీపమా!
పెద్దవ్వను అడిగితే జొన్న సేన్లలకు పోయిండన్నది దీపమా! దీపమా!
జొన్నసేన్ల మా అన్న అంబలి తాగించుండు దీపమా! దీపమా!
ఇగ
తరువాత కప్పల కూర, జెనిగల కూర మా అదినె అండింది దీపమా! దీపమా!
వాల్లేమో గారెలు, కోడికూర ఏసుకుర్రు దీపమా! దీపమా!
అంత చరిత్రంత చెప్తుంది.
పేలుకలు, మసిపేలుకలు గొంగలి బొంత కట్టింది దీపమా! దీపమా!
సద్ది పెండ గట్టింది దీపమా! దీపమా!
ఇగ నాగ సర్పం అడ్డమైంది దీపమా! దీపమా!
నాగ సర్పాన్ని చంపేసి ఇది ఉడుకబెడుతే బంగారం అయ్యింది దీపమా! దీపమా!
ఆకలి మద్యలయితే మేం గంగ నేరేడు పండ్లు తిన్నం దీపమా! దీపమా!

అని చెప్పి దీపానికి మొత్తం జరిగిన కథంతా చెప్పుకుంటుంది. అప్పుడు అన్న ఆ తలుపుల సాటుకుండి మొత్తం ఇంటుండు. అబ్బ! చెల్లె నువ్వు గింత కష్టపడ్డవా? అబ్బ అబ్బ ఇంత కట్టం పడ్డవ్ గద! దీన్ని మాత్రం నేను అజ్జేయాలే అని చెప్పి ఏంటనే చెల్లె మీద పడ్డడు. ఏడ్సి గిట్ల గిట్ల జరిగింద. ఇంటి వోయ అత్తనే చెల్లె ఆగని చెప్పి ఇంటికి వోతడు. పోయి ఏమని చెప్తడు. భార్యకు. నేను వోయినగని మీ ఊరంతా కాలిపోయిందే. మీ వోల్లకు ఊరంతా కాలిపేయిందే. మీవోళ్ల పరిస్థితి గోరంగున్నది. అక్కడ ఏమిలేవు. ఏమన్న ఉంటే కట్టే అని చెప్పినంక అట్లన అని మక్కలు, జొన్నలు, పెసరపప్పు అన్ని కడతది. ఇగో కచ్రంల మెలుపుకోని పో..! మా వోల్లకు గింత ఆపతి అచ్చింద. ఆ ఊరంతా కాలి పోయిందని చెప్పి ఈమె మొత్తం తీసుకుపో... అని చెప్పి అన్ని ముల్లె కడుతది. ముల్లె కట్టినంక కచ్రంల కొట్టుకుంటడు. కొట్టుకొని అచ్చి చెల్లె ఇంటికాడ పెడతడు. ఇగో చెల్లె ఇవన్ని ఉండనే అని చెప్పి మల్ల ఇంటికత్తడు. ఇంటికచ్చేసరికి ఏమైంది అని  చెప్పి భార్య అడుగుతది. ఏం జేయ్యాలే కచ్రం పోయింది. ఎడ్లు పెయినయి. ఆ సామానంత పెయింది. నాకు గంగల తుంగ అనేది తట్టి నా జుట్టుకు తాకి నేనొకని ఆగినగని నేగూడ పోదును. ఆ జుట్టకు తట్టింది తుంగ. నేను ఆగిపోయిన అన్ని పెయినయి. అవన్ని గంగల కల్సిపోయినయి. నువ్వుపో మీ వోళ్లకు పితిల్ల పంపనేది అచ్చింది. అక్కడ పితిళ్లు అనేది ఏరుతుర్రు. అవింట్లనే జోకి తీసుకోని పోతుంద్రు. ఎంత జోకుతే అంత పైసలు ఇత్తుళ్లు. మరి మీ వోళ్లకు ఏమన్న వుంటే ఎదుర్కొని పోయే అటువంటి పరిస్థితి అచ్చింది. అన్నంక నా వోల్లకు గంత గనం ఘోర పరిస్థితి అచ్చింద. అది గుల్లవట్టుకి ఆడ ఈడ పితిళ్లు గొద్దెలు అన్ని ఎరుకొని పోతదన్నట్టు. పోయి ఆళ్ల ఇంటికిపోయేసరికి పెద్ద వర్షం పడుతది. పెద్ద వర్షం పడి ఆ గొద్దెల ఆసనంత మీద పడుతది. మీద పడేవరకల్లా అయ్యో దీనికి ఏమయిందిల్ల గుల్ల ఎత్తుకొని అత్తుంది. అని ఆ ఇంటోళ్లకు, దీని యింటోల్లు, అదినెలు, ఆళ్లు, ఈళ్లు అందరు చూత్తరు. చూసి ఏమయిందే గిట్ల ఎత్తుకత్తునవ్ అంటే ఏ ఊరు కాలిపోయిందట. గిట్ల మీకు పితిళ్ల పంపు అచ్చిందట. ఇవన్ని జోకి పోతుర్రట గద! మీకు కైకిల్లు ఇత్తురట గత. అని అంటే ఏ..! మన్ను కైకిలు లేదు. ఏం లేదు. మేమందరం మంచిగనే ఉన్నాం. మా వూరెందుకు కాలిపోయింది. నీకెవ్వట్ల చెప్పిర్రు. అన్నంక దాని దగ్గరకవోతే అంత ఆసన, కంపు అత్తంది. ఆ గొద్దెలన్ని మీద పడ్డయి కద. కాబట్టి ఆళ్లు చీపిరి వట్టి ఓ చెప్పులు వట్టి నీళ్లు వోసుకుంట కడిగిల్లు....

## అన్న చెల్లెలి కథ – కథావిశ్లేషణ

ఒకే రక్తం పంచుకొని పుట్టిన అన్నచెల్లెలు ప్రేమ, ఆప్యాయతల బంధాన్ని విడదీసిన వదిన లాంటి పాత్రల వ్యక్తిత్వాన్ని తెలియజేసే కథ అన్నచెల్లెలు కథ. ఈ కథలో ఆర్థికంగా చితికిపోయిన చెల్లెలు కాపురాన్ని దిద్దడానికి ఒక అన్న చేసే సహాయాన్ని వదిన అడ్డుకొని తన చెల్లెలను నానారకాలుగా అవమానిస్తుంది. ఆపదలో ఆదుకుంటాడని అన్న ఆశ్రయం కోరిన చెల్లిని తనకు తెలియకుండా వట్టి చేతులతో పంపిస్తుంది. ఆకలితో అలమటించిన పిల్లలకు పేడ, చినిగిపోయిన గుడ్డలను కట్టి పంపిస్తుంది. తల్లిదండ్రులు చిన్నప్పుడు చనిపోతే అప్పటి నుండి అల్లారుముద్దుగా పెంచుకున్న తన చెల్లెలని చూడకుండా కప్ప, జలగల మాంసం, పశువుల మూత్రం పోసి వడ్డిస్తుంది. తన చెల్లెల్ని బాగా చూసుకుంటుంది అనుకుని భార్య మీద నమ్మకం ఉంచుతాడు. కాని ఆమె ఆ నమ్మకాన్ని వమ్ము చేయడమే కాకుండా, ఆడపడుచు ఎప్పుడూ తన ఇంటి గడప తొక్కనివ్వకుండా చేయాలని పన్నాగం పన్నుతుంది. పేదరికాన్ని తాళలేక తల్లిదండ్రి తానే అనుకుని అన్న మీద నమ్మకంతో వచ్చిన ఆడపడుచుకు అవమానం జరుగుతుంది. ఆమె భర్త ముందు తనదేం తప్పులేనట్టు నటిస్తుంది.

ఆ ఆడపడుచు తనకు, తన పిల్లలకు జరిగిన అవమానాలను అన్నకు చెబితే అన్న, వదినల మధ్య తగవు పెట్టిన దానిని అవుతానని తనలో తానే కుమిలిపోతుంది. బాధలను దింగమింగుకోవడమే కాదు. బాధ్యతగా తాను ఆనందంగా ఉన్న రోజులలో ఇంటికి రమ్మని ఆహ్వానిస్తుంది. గతంలో వదిన చేసిన అవమానాలను గుర్తించుకొని గర్వంగా, అహంతో ప్రతీకారం తీర్చుకోకుండా ఓర్పుతో వదినను సాదరంగా తన ఇంటికి రమ్మని పంపిస్తుంది. వదిన వల్ల చెల్లె పడ్డ కష్టాలను అన్నకు, భర్తకు చెప్పుకోలేక ఇంట్లో వెలిగిన దీపానికి చెప్పుకొని బాధపడుతుంది. మంచివారికి మంచే జరుగుతుంది అన్నట్టు దేవుని అదృష్టంగా ప్రసాదించిన బంగారం, పట్టుచీర, నగలు పెట్టుకొని అన్న ఇంటికి వస్తే తన చెల్లెలు ఏదో తప్పు చేసి అవన్నీ అక్రమంగా సంపాదించిందని బూటకపు మాటలు చెప్పి అన్నను రెచ్చగొడుతుంది. తలుపు చాటుండి దీపానికి చెప్పుకుంటున్న చెల్లెలు మాటలు విని చాలా బాధపడి తన భార్యకు ఎలాగైనా బుద్ధి చెప్పాలని అనుకుంటాడు అన్న. పుట్టింటివైపు వారు చల్లగా ఉంటే చాలు మెట్టింటి వారెలా ఉంటే నాకేం అనుకునే స్త్రీల కోవకి చెందిన వదిన పాత్ర. అందుకే బండెడు సామాను పట్టుకోని తన పుట్టింటికి వెళ్ళి ఇచ్చిరమ్మని భర్తను పూరమాయిస్తుంది. చెల్లెల మీద ఉన్న ప్రేమకు నిదర్శనంగా వాటిని ఆ అన్న చెల్లెలు ఇంటికి వెళ్ళి ఇచ్చి వస్తాడు. తనవైపు నుంచి జరిగిన తప్పును

సరిదిద్దుకున్నాడు. అంతేగాకుండా తన చెల్లెలను అవమానించి తన భార్యను ఎలాగైనా అలాంటి అవమానాన్ని తెలియపరచాలని వారి పుట్టిళ్ళు ఊరు అన్ని తగలబడి పోయినట్లు అబద్ధం చెబుతాడు. రోడ్ల మీద ఉన్న జంతువుల మలమూత్రాలను అమ్ముకొనే చెత్తబండి వచ్చింది. అవి అమ్ముకుంటే గాని వాళ్ళకు తినటానికి తిండిలేదని చెప్తాడు. పుట్టింటి వాళ్ళ కష్టాన్ని తన కష్టంగా భావించుకొని నానా తంటాలు పడి రోడ్ల మీద ఉన్న చెత్త చెదారాలను జమచేసి వాళ్ల ఊరికి తీసుకెళ్ళి ఇస్తుంది. ఆమె వేషధారణ చూసి వాళ్ళు ఆమెకు(వదిన) పిచ్చి పట్టిందని అనుకుంటారు. అన్న తన చెల్లెలకు ఎలాంటి చెత్తచెదారపు వస్తువులైతే తీసుకెళ్ళమని ఇచ్చిందో అవే వస్తువులను తనతో ఊరంతా తిరిగించి జమచేసేలా చేస్తాడు. అన్న తన చెల్లెలను అవమానించినందుకు, వదినకు తగిన గుణపాఠం చెబుతాడు.

1. ఈ కథలో వదిన అన్న, చెల్లెలి మధ్య వివాదం పెట్టి, ఆడపడుచు తన ఇంటికి రాకుండా చేయాలని ప్రయత్నిస్తుంది. సమాజంలో ఇటువంటి దుష్ట స్వభావం గల స్త్రీలు కూడా ఉంటారని ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది

2. అన్న, చెల్లెళ్ళ అనుబంధం ఎంత గొప్పదో ఈ కథ ద్వారా వెల్లడి అవుతుంది. సోదరికి కష్టనష్టాలు పాలుపంచుకొని సోదరులు అండగా నిలవాలని సోదరిసోదరుల ఐక్యతను ఈ కథ తెలియజేస్తుంది. అందువల్లే రాఖీ పండుగ, దీపావళి మొదలైన పండుగలకు, పెళ్లిళ్లకు, పేరంటాలకు ఆడపడచులకు ప్రత్యేకంగా కానుకలు ఇస్తారు.

3. జానపదుల్లో ఒక చెల్లెకి జరిగిన ఘోర అవమానం ఈ కథాసృజనకు బీజం పోసిందని భావించాలి. తల్లిదండ్రులు, తన బిడ్డ తనకు ఎప్పుడు భారం కాదనుకుంటారు. చిన్నప్పటి నుంచి తనతో పెరిగిన చెల్లెలు, అక్కలను ఏ అన్నదమ్ములు భారంగా భావించరు. వదినె మాత్రమే తన పిల్లలు, తన భవిష్యత్తుని గురించి కొంత ఆలోచించి విచారిస్తుంది. ఈ కథలో కూడా మరదలు పేదరికంలో ఉండి అన్నయ్య దగ్గరకు సహాయం కోసం వస్తే వదినె ఏది దక్కనివ్వదు. అంతేగాకుండా శాశ్వతంగా తన ఇంటిగడప తొక్కకూడదని భావించి తీవ్రంగా అవమానిస్తుంది.

4. తన ఆడపడుచు అనుకొని కొద్దిగా మానవత్వంతో ఆలోచించి ఉంటే తన భర్తకు ప్రీతిపాత్రురాలుగా ఉండి బంధుత్వాన్ని, బాంధవ్యాలను నిలుపుకునే స్త్రీగా ఉండేది. ఈ విధంగా జానపద కథల్లో చూపినట్లుగా కొన్ని కుటుంబాల్లో పై వదిన పాత్ర లాంటి వారు అరకొరగా కనిపిస్తుంటారు. సహజంగా

స్త్రీకి తన భర్త సంపాదన తనకే చెందాలనే కోరిక ఉంటుంది. ఈ కథలో కూడా అదే కోవకు చెందిన వదిన పాత్ర మనకు కనబడుతుంది.

4. ఏ దిక్కు లేనివారికి దేవుడే దిక్కు అన్నతీరు తన అన్న వదినెలు ఆడపడుచును చూసుకోలేక పోయినా ఆ భగవంతుడు ఆ అమాయకురాలని గ్రహించి ఆమెకు ఐశ్వర్యం ప్రసాదిస్తాడు.

5. పై కథలో గోదావరి చెల్లెలికి అడ్డు రావడం, పిల్లల బట్టలు తడవడం, గోదావరి దాటితేనే తన అత్తగారిల్లు రావడం ఇవన్ని గమనించినట్లయితే ఇది ఉత్తర తెలంగాణ జిల్లాలో ఆదిలాబాదు, జగిత్యాల జిల్లాల్లో మాత్రమే ప్రచారంలో ఉన్నట్టు అనిపిస్తుంది.

## 2.5.4.7 అన్నదమ్ముల కథ

దీకొండ పర్వతాలు, ఆత్మకూరు గ్రామం, గొల్లపల్లి మండలం.

ఒక ఊరి లోపల ఐదుగురు అన్నదమ్ములు. ఆళ్లు రెడ్డిలు. అయితే ఏం చేసిర్రు. ఆల్లు ప్రతి సంవత్సరం లచ్చిదేవుడు సత్యనారాయణ స్వామి గాని పూజ చేసుకోవాలి. ఆ ఐదుగురు అన్నదమ్ములు ఆళ్లు ప్రతి సంవత్సరం పూజ చేసుకోనేది ఈ ఐదుగురు ఇక్కడ ఉండని. ఒక బ్రహ్మపురి పట్నంల వాళ్లు నలుగురు అన్నదమ్ములు అయితే పెద్దొనికి సదువు అత్తది. నడిపోనికి సదువత్తది. నడిపాడు ఒకెల్లి పోతుండు పెద్దొడు ఒకెల్లి పోతుండు. చిన్నోనికి ఏం రాదు. అయ్యా! మీ అన్నగాళ్లు మంచిగ బతికిర్రు. నువ్వు ఏం పని చేయకపోతే ఎట్లా ఏదన్న పని చేసి మమ్మల్ని సాదాలి మనం బ్రాహ్మణ కులం లోపల ఉన్నం. మనం వేరే వృత్తి మనకి రాదు. ఆళ్ల భార్య అంటది. సరే అమ్మా నాకు ఏం రాదు గదమ్మ నేను ఏం చేయాలి? నేను ఏం చేయలేను. మనకు ఇద్దరు పిల్లలు సరే ఎట్లైనా మంచిది సద్దిబాక్స్ తయారుచేయి. అంటే చేస్తది కట్టింది. పోంగ పోంగ బ్రాహ్మనైనా ఈ ఐదుగురు అన్నదమ్ములు ఇంటికే ఈనే అచ్చిండు. తిర్కుంట తిర్కుంట అత్తండు. మరి బ్రాహ్మణయ్య మాకు ఫలానా డేట్‌కు నోముకునేది ఉంది. అంటే సరేనయ్య మీరు టైం ఇయ్యిర్రి. మల్ల అత్తనని చెప్పి ఐదు వందల పది ఇత్తె ఎల్లి పోతడు. ఆ డేట్ నాడు ఈ ఐదుగురు అన్నదమ్ములు పోన్ చేత్తరు. నోము కార్యక్రమాన్ని అచ్చి చేత్తడు. కార్యక్రమం అయిపోయినంక పెద్దోనికి చెప్తడు. అయ్యా నువ్వు అన్న గని తమ్ముడు గని ఎవ్వరు నమ్మకు. నన్ను నమ్ము. ఒక బర్రెను సాదుకో అంత సుఖమే జరుగుతుంది. పశువుల దాణాల పదివేల బర్రె కొంటడు. అయ్యా! ఒక సమయానికి ఒవలన్న కొట్లాటకీ గాని, యుద్ధానికీ గాని అచ్చినప్పుడు నాకు పోన్ చెయ్యని చెప్పి పోతడు. ఆ రాజు బర్రె దొంగ బర్రె పోతుంది. చేనుల మేత్తది. పోంగ బర్రె

కావాలి మనిషి ఏమంటుండు. ఆ పోతున్నవా ఆ.. నీ పోకట నాకు మా తెలిసే పోతున్నవా! నీ పోకట నాకు మా ఎర్కె అంటడు. బర్రె మర్మం తెలిసినోడు అన్నట్టు బర్రె ఎనకకు మర్రత్తది. ఈ మాట విని బర్రె అచ్చి మల్ల చెట్టుకు రాకుతుంది. రాకుత్తన్నవ రాకు రాకు నీ రాకుడు నాకు మా తెలుసు రాకు రాకు నీ రాకుడు నాకు మా ఎరుకె! బర్ల కావాలి మనిషి అంటుండు బర్రెను. ఇగ ఏం చేసింది. బర్రె కావాలి మాటలు బ్రామ్మనయినా ఇన్నడు. ఈ బర్లు ఇంట్లకి పోయినయ్ ఈ రోజు బ్రామ్మనైనకు పోన్ చేసి నాకు మా అన్నదమ్ములకు పడ్తలేదు. మాకు ఎదన్న చెప్పు. అన్నంక రాజు దగ్గరికి అచ్చి పోయిండు. ఆళ్లు ఐదుగురు అన్నదమ్ములు ఆళ్లల నలుగురు అన్నదమ్ములు మన అన్నని చంపితే ఊర్ల అందరికి ఏర్పాటు. మనకన్న బాగా సంపాయిత్తుండు. మనకున్న భూములను కొన్నడు. నలుగురు ప్లాన్ ఏసి అప్పుడు పిస్తోలు లేకుండే ఒక మంగళోన్ని పిలిపిచ్చి అరె మంగలి వేరేటోన్ని మా అన్న నమ్మడు నేను పెయిన నమ్మడు. పరాయొల్లను నమ్మడు. నువ్వు గడ్డం తీసినట్టు తీసి మా అన్నను సంపెయి అని ఆనికి నలుగురు తమ్ముల్లు నాలుగు లచ్చలు ఇత్తరు. నాలుగు లచ్చలు ఇచ్చినంక మంగలోన్ని సంపుటానికి తయారు చేసిర్రు. రాజు మాకు అన్నదమ్ములకు పడ్తలేదు. నాకు ఆపద ఉంది. నువ్వు రావాలని అన్నంక బ్రామ్మడు అచ్చిండు. కొబ్బరికాయలు, తమలపాకులు, ఊదిబస్తులు, కుడకలు, కర్జూరపు పండ్లు తెప్పించు. ఆయనకు ఏమాత్రం రాదుగని అయింత కనుము పరిసిండు. ఆ కనుములన్ని పెట్టిండు అయ్యా! రాజు నీకు ఏంలేదు. నేను చెప్పినా మూడు ముచ్చట్లు మరువకు, నీకు ఎల్లకాలం సావులేదు. నీ ఇంటికి ఎవరచ్చిన ఎవరు పోయిన రా నీ రాకట నాకు మా ఎరుకె!వాడు ఏం పని చేసినా నీ రాకు రాకు నీ రాకుడు నాకు మా ఎరుకె! దబ్బన పోతడ పో పో నీ పోకట నాకు మా ఎరుకె! అను నీకు సావలేదు. ఆ బ్రామ్మనైనా పూజ చేసి ఎల్లి పోయిండు. వారం రోజుల కిందట అన్నని చంపుతా అని పథకం ఏసుకొని ఇచ్చిరు గద. గేటు తీస్కొని గేట్లకెల్లి అత్తురు. కుర్సీల కూర్చోన్న రాజు అరె అత్తన్నవా? రా నీ రాకట నాకు మా ఎరుకె! అయిన మంగలోడు అప్పుడే కనుగున్నడు. అబ్బో! ఈనేకు తెలిసినట్టు ఉందని అనుకున్నడు. అచ్చి కూసున్నడు. ఎట్ల చేసి ఈనేను సంపాలని కత్తిని నూరుత్తుండు. అరె మంగలి నీకు రాకు రాకు నీ రాకుడు నాకు మాకు తెలువదరా? అని అంటడు. భగవంత! నీ లచ్చల రూపాలద్దు. ఈన్ని సంపుడు తెలిసినట్టు ఉంది ఇగ నేను బతక అని ఎగవడి ఉరుకుతుంది. అరె పోతున్నవా? నీ పోకడ నాకు మా ఎరుకె! అన్నడు. అన్నంక మొత్తం తెల్సినట్టుందని ఎనుకకు మర్రచ్చి మంగలోడు కాళ్ల మీద పడ్డడు. మీకు ఎట్ల తెలుసో? నాకు తెలువదు గని మీ తమ్ముళ్లు తోడ పుట్టినొల్లు

చంపుమని నాకు నాలుగు లచ్చలు ఇచ్చిర్రు. అందుకే నిను సంపుదామని అచ్చిన మన్నించు అని కాళ్ల మీద పడ్డడు. తమ్ముళ్లని పిలిపిచ్చి తమ్ముళ్ల రా! నీకు నేను ఏం ద్రోహం చేసిన? అన్న. మంది కూడా తప్పైందని చెప్పి ఇగ బ్రామ్మన్ని పిలిపిచ్చి మంగళోనికి ఇచ్చిన నాలుగు లచ్చల రూపాలు ఈ బ్రామ్మనైనకు ఇచ్చి బ్రామనయ్య నువ్వ్ చేయవట్టి నేను బతికిన. నువ్వు చెప్పిన మూడు ముచ్చట్లు ఈ మాత్రం ఏదో నాకు చెప్పకపోతే మంగళోడు నను చంపు. ఇగో! పటు నాలుగు లచ్చలు బ్రామ్మనికి ఇచ్చిండు. అప్పడు సుంది జాతకాలు, పంచాంగాలు సూసుదు. ఆయన చెప్పిందే జరుగుతుంది. ఆకాన్నుంచి ఏం తెలియని బ్రామ్మనొల్లు పుట్టు పుట్టు పండితుడు అయిపోయిండు.

## అన్నదమ్ముల కథ – కథావిశ్లేషణ

పంచపాండవుల్లాంటి ఐదుగురు అన్నదమ్ములు. ఆ అన్నదమ్ములు మధ్య ఏర్పడిన బేధాభిప్రాయాలను ఒక బ్రాహ్మణుడు తన లోకజ్ఞానంతో తొలగిపోయేలా చేయడమే ఈ కథలో ప్రధాన వస్తువు. లోకం తీరుని గమనించి తన నిశిత పరిశీలనాశక్తితో కొంత జ్ఞానాన్ని సంపాదిస్తాడు. ఆ జ్ఞానాన్ని తన పురోహిత్యపు వృత్తికి అన్వయించి ఒక కుటుంబంలో చెలరేగిన విబేధాలను తొలగిస్తాడు. ఆ కుటుంబంలో ఐదుగురు అన్నదమ్ములు. వారు ఎంతో ఆప్యాయత అనుబంధాల మధ్య పెరుగుతారు. అలాంటి అన్నదమ్ములు పెళ్లిళ్లు అయిన తరువాత పేగు బంధాన్ని మరిచి అన్ననే హతమార్చాలని అనుకుంటారు. తమ్ములు అందరు వారికన్న అన్నకు సంపాదన, కీర్తి ప్రతిష్ఠలు రోజుకు రోజుకు పెరుగుతున్నాయని ఈర్ష్య బుద్ధితో చంపించాలని అనుకుంటారు. కానీ తాము ఒకటి తలిస్తే దైవం ఒకటి తలచిందన్నట్టు, పెద్ద అన్నను బ్రాహ్మణుడి మాటలు రామరక్షలాగా కాపాడతాయి. బ్రాహ్మణుడు ఆ అన్నదమ్ములు సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకున్నప్పుడు వారి మధ్య సఖ్యతను గమనిస్తాడు. ఒక ఎద్దును కొనుక్కోవాలని పెద్ద రాజుకు సలహా ఇస్తాడు. ఆ ఎద్దు చేలో మేయడానికి వెళ్లినప్పుడు గొర్లకాపరి మాటలను విని ఆశ్చర్యపోతాడు. ఒక ఎద్దుని నిలువరించాడానికి గొర్ల కాపరి వాడిన మాటలను ఉపయోగించి రాజు జీవితాన్ని రక్షిస్తాడు. ఒక మనిషి మనసులో భావాలను ముందుగా పసిగట్టడానికి, అతని కార్యాచరణని నియంత్రించడానికి, కొన్ని సందర్భాలలో వారిమాటలు ఉపయోగ పడతాయి. అవే రా రా.. నీ రాకట నాకు మా తెలుసు, పో పో నీ పోకట నాకు మా తెలుసు.. ఈ మాటలను విన్నా బ్రాహ్మణుడు రాజు కున్న ప్రమాదాన్ని అంచన వేసి ముందస్తు జాగ్రత్తకు వాడుకుంటాడు. నలుగురు అన్నదమ్ములు తలా లక్షరూపాయలు ఇచ్చి మంగలివాని చేత వాళ్ల అన్నని

చంపించాలని అనుకుంటారు. రాజుపై దాడిచేయడానికి వచ్చే అనుమానితులను ఉద్దేశించి పై మాటలు చెప్పమని బ్రాహ్మణుడు ఆదేశిస్తాడు. పథకం ప్రకారం వచ్చిన మంగలివాని చేష్టలను గమనించిన రాజు పై మాటలను మంగలితో అంటాడు. రాజుకు ఎక్కడ నిజం తెలిసిందోనని మంగలివాడు భయపడి అసలు నిజాన్ని చెప్తాడు. తన తప్పులేదని తమ అన్నదమ్ముల ఈ కార్యానికి ఒడిగట్టారని చెప్పి పరుగెత్తుతాడు. పెద్ద రాజు అన్న తన తమ్ములను పిలిపించి మందలించి బాధపడతాడు. ఇలా అన్నదమ్ముల మధ్య ఈర్ష్య, అసూయలకు తావుఇవ్వకూడదని ఆ అనుబంధానికున్న గొప్పతనాన్ని తెలియజేయడమే ఈ కథకున్న ఉద్దేశ్యం.

1. భారతీయులది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. ఎంతో విశిష్టమైనది, విలువైనది. అలాంటి వ్యవస్థలో పెద్దలు పిల్లలను, యువకులను, దంపతులను నిత్యం పర్యవేక్షిస్తూ మంచి నడతను నేర్పేవారు. అందరికి అండగా నిలబడి సహాయం చేసేవారు. కాని నేడు కొన్ని కారణాల వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమై, చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. దాని వల్ల తల్లిదండ్రులను చంపే కొడుకులు, ఒకరినొకరు హత్య చేసుకునే అన్నదమ్ములు, పెద్దల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తూ పెరిగే పిల్లలు, బాధ్యతను మరచిన యువకులు కొన్ని కుటుంబాలలో తారసపడుతూ ఉంటారు.

2. ఈ కథలో బ్రాహ్మణుడు పూజలు చేసే పురోహితుడు మాత్రమే కాదు. ఒక సలహాదారుడిగా, ప్రాణ రక్షకుడిగా కనిపిస్తాడు. ఆ రాజుకున్న ప్రమాదాన్ని అంచనా వేసి, రాజుని తన తమ్ముళ్ల నుండి రక్షిస్తాడు. తమ శ్రేయోభిలాషులకు పొంచి ఉన్న ప్రమాదాన్ని ముందే అంచన వేసి దానికి తగిన పరిష్కార మార్గాలను చూపే పాత్రగా బ్రాహ్మణుడు చిత్రించబడతాడు. సమాజంలో ఎదుటివారి మంచిని కోరి, వారి శ్రేయస్సుకోసం పనిచేసే వ్యక్తులు కొంతమంది ఉంటారని ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది.

3. నాటి కుటుంబం సామాజిక పరిణామక్రమంలో కొన్ని మార్పులకు గురైందని చెప్పవచ్చు. ఆధునికతను సంచరించుకుంటున్న సమాజంలో వచ్చిన సాంకేతిక మార్పుని తనలో కలుపుకుంది. నేడు మనం నిరంతరం ఉపయోగిస్తున్న వస్తువు మొబైల్ ఫోన్(చరవాణి). రాజుకు తమ్ముళ్లు నుండి ప్రమాదం ఉందని గ్రహించి బ్రాహ్మణుడికి ఫోన్ చేసి పిలిపిస్తాడు. పూర్వపు కాలంలో సమాచారాన్ని బంట్రోతు ద్వారా గాని, భటుడి ద్వారా గాని పంపించి ఉంటారు. కాని తక్షణమే సమాచారాన్ని అందించే చరవాణి వినియోగం దీనిలో ప్రస్తావించడం జరిగింది. జానపదులు ఆధునికతకు తగ్గట్టుగా తమ కథల్లో మార్పులు చోటు చేసుకున్నాయని పై కథ ద్వారా అర్థమవుతుంది.

# 2.5.4.8 సవతి తల్లి తీరు

తాటికాయల పుష్ప, డొంకేశ్వర్, ధర్మపురి

ఇద్దరు భార్యభర్తలు. కాపొళ్లె. ఇద్దరికి పెండ్లయింది. పిల్లలు అయిర్రు. అయింత ఒకామె కొంచెం పానం మంచిగ లేక పండుకుంది. చిన్నాయన భార్య. ఆమె ఏమి చేసింది గద. తూర్పున పిట్ట గూడు పెట్టింది. ఆమె మంచంల ఉండి చూస్తుంది. ఆ గూడులో గుడ్లు పెట్టి అయింత మొదట గుడ్డు పెట్టిన పిల్ల కింద పడ్డది. ఆ పిట్ట చనిపోయింది. మగ పిట్ట ఇంకో పిట్ట తీస్కచ్చింది. గుడ్లు రాగానే పిల్లలు బయటకు పోతయి గద. పిల్లలన్ని తీసుకుంట కింద పడేసింది. అబ్బ మంచిగ లేదు. ఇది అనక రేపు నేను చచ్చిపోయినంక నా బిడ్డను, కొడుకును ఇడిసిపెట్టి ఇంకొదాన్ని చేసుకుంటడు. నా గతి ఇంతే అయితది గావచ్చు. ఆమె ఎప్పుడు మంచలా పడుకొని పిట్ట గూడుని చూసుకుంటా ఎడ్తదట. నువ్వు మాత్రం నేను చనిపోతే నా పిల్లలను ఇంకొ తల్లిని తేవద్దు. నా పిల్లలని నువ్వ్ తల్లి లెక్క చూసుకోవాలి అని భర్తని చేతిలో చేయి తీసుకుందట. మాట ఇచ్చి చనిపోయింది. ఇగ భర్త పిల్లలకు మంచిగ అన్నం పెట్టుకుంట మంచిగ చూసుకుంటుండు. ఇగ కుమ్మరి గుడ్డిది ఎప్పుడు ఈల్ల ఇంటికి అచ్చుదు అగ్గికి. ఈనే మీద ప్రేమ పడ్డది. ఈనే మల్ల ఇంకోదాన్ని చేసుకుంటుండు. ఆమెకు ఒక పొల్ల పుట్టింది. ఈ పొల్లగండ్లను ఆళ్ల అమ్మగారింటి కాడ ఉంచి రాపో నేను ఉంచుకోను అని అన్న వోల్లే ఆమె పుట్టకాడికి పోయి పిల్లల కోసం పూజ చేత్తుంది. అక్కడ చిన్న పాము పిల్లను చెంబులో తెచ్చి ఈ పిల్లకు పాలల్లేసి తాగి పిచ్చిందంట. ఇగ ఆ పాము పిల్ల కడుపులోనే పెద్ద పెరిగింది. కడుపు పెద్దదై నీ బిడ్డది. నీ బిడ్డ ఎవ్వల్తోనొ పోయింది. నీ బిడ్డ తప్పు చేసింది. నీ బిడ్డని ఇంట్లకెల్లి ఎల్లగోట్టు! అంటే వీరి అమ్మగారింటికని కొడుకు, బిడ్డని తోలుకోపోయి అడవిల వాళ్లిద్దరి పక్కన అంత చీమల మధ్య వదిలిపెట్టి రాత్రి ఆయన లేచి అత్తడు. పోరగాండ్లు పాములు, తేళ్లు అన్ని కుడుతయి. తెల్లారు లేసేవరకు పొరగాండ్లకు దద్దులు అత్తయి ఎడుసుకుంట పోతరు. తల్లి కాకి రూపంలో అచ్చి పోలగాండ్లకు పసరిత్తది. ఆ పసరు పోరగాండ్లు రాసుకొని చల్లబడతరు. మల్ల ఒక బాయికాడికి పిల్లల దగ్గరికి నడత్తరు. అక్కడ తానం చేత్తరు. అక్కడనే పెద్ద బంగ్ల తయారయితది. అయినోల్లే దాండ్ల మంచిగ ఉంటరు. చెల్లె నువ్వ్ రా అని 21 దొప్పలు కుట్టి దొప్పల్ల పాలు వోసి పడుకుంటరు. అప్పుడు పాము కడుపులకెల్లి ఎల్లి పాములు బయటకు అత్తది. అంటే మా చెల్లె కడుపుల పాము ఏసి గిట్ల నిండల పాలు చేసే అని అయింత పాముని చంపుతాడు. చంపి తండ్రి దగ్గరికి వోయి చెప్తడు. తండ్రి లంజబొడ్డి!

పిల్లగాండ్లను మంచిగ చూసుకుంటది అనుకుంటే గిట్ల చేత్తవని చెప్పి అయింత దాన్ని తన్ని ఇంటికి పంపిత్తడు. అప్పుడు పిల్లగాల్లతో మంచిగ కలిసి ఉంటరు.

## సవతి తల్లి తీరు కథ – కథా విశ్లేషణ

మన సంస్కృతిలో భార్యభర్తల బంధానికున్న విలువ చెప్పనలవికానిది. ఆ బంధాన్ని మించిన బంధం మరొకటి లేదు. పిల్లలున్న దంపతుల్లో భార్యగాని, భర్తగాని ఏ ఒక్కరికి దూరమైన వారి పిల్లల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. ముఖ్యంగా భార్య చనిపోయిన తరువాత భర్త మరొక వివాహం చేసుకోవడం సాధారణమే. భర్తను పెళ్లి చేసుకున్న మరొక స్త్రీ తన పిల్లలతో పాటు ముందు భార్యకు కల్గిన పిల్లలను సమాన దృష్టితో చూడటం విఫలం అవుతుంది. అది ఎంతలా ప్రభావం చూపుతుందంటే ఆ పిల్లల మానసిక ఎదుగుదల, వికాసం కుంటుపడటానికి కారణం కావచ్చు. సమాజంలో ధైర్యంగా, ఆత్మసైర్యంగా బతకలేకపోవచ్చు. సినిమాల్లో, సీరియల్లో చూపించినట్టుగానే ఈ కథలో కూడా సవతి తల్లి భర్త పిల్లలను నానా ఇబ్బందులు పెడుతుంది. ఇంట్లో నుంచి బయటకు వెళ్ళగొట్టిస్తుంది. చిన్న పాము పిల్లను పాలలో వేసి తాగిపిస్తుంది. అది పెరిగి పెద్దయ్యి కడుపు కొద్దిగా పెరిగిపోతుంది. అప్పుడు ఎవ్వరివల్లో గర్భవతి అయిందని బుకాయించి, నా ఇంటి పరువు తీస్తుందని నిందలు వేస్తుంది. భర్తను మార్చుకుని ఆ పిల్లలిద్దర్ని అడవిలో వదిలిపెట్టేదాకా పేచి చేస్తుంది. ఇవన్నీ గమనించిన తల్లి తాను పిట్ట కథ ద్వారా గ్రహించిన విషయమే పునరావృత్తం అయిందని గమనించి తల్లి ఆత్మగా వివిధ రూపాల్లో వచ్చి ఆ పిల్లలను రక్షిస్తుంది. తల్లి ప్రేమకి అవధుల్లేవని చనిపోయిన తరువాత కూడా తల్లి ఆశీస్సులు బిడ్డలకు ఉంటాయని ఈ కథ ద్వారా కథకుడు చక్కగా వ్యక్తపరచాడు. ఇద్దరు పిల్లలు పెరిగి పెద్దయ్యాక సవతి తల్లి చేసిన తప్పును గ్రహిస్తారు. పాలల్లో పాము వేసి తన చెల్లి కడుపులో పంపించిన విషయం అక్క తండ్రికి విన్నవిస్తుంది. మొదటి భార్య దగ్గర వాగ్ధానం తీసుకున్న గాని తన పిల్లలను చూసుకోవడానికి తోడుగా ఉంటుందని కుమ్మరామెను వివాహం చేసుకుంటాడు తండ్రి. తాను చేసిన తప్పును మన్నించమని ప్రార్థించి తన రెండో భార్యకు తగిన శిక్ష వేయిస్తాడు.

1. ఈ కథలో ప్రధాన కథ జరగడానికి ముందు చిన్న ఉప కథగా పిట్టకథ ఉంటుంది. ఆ చిన్న కథ ప్రధాన కథ మొత్తాన్ని ప్రతిబింబింపజేస్తుంది. గూటికి చేరిన పిట్టల్లో ఆడపిట్ట కింద పడి చనిపోతుంది. మగ పిట్ట ఇంకో పిట్టను తెచ్చుకుని ఉంటుంది. ఆడ మగ సాంగత్యం అనేది ప్రకృతి ధర్మం. కాని మన సామాజిక వ్యవస్థ కొన్ని కట్టుబాట్లతో సంస్కృతి, నాగరికతలతో ఉంది. కాబట్టి రెండు మనసులు కలిసి

ఏర్పడే భార్యాభర్తల బంధంలో మరొకరు చేరితే, ఆ బంధం చెల్లాచెదరవుతుంది. ఆ కుటుంబం అస్తవ్యస్తం అవుతుంది. ఈ కథలో కూడా అదే జరిగింది.

2. ఈ కథలో కుమ్మరామె అగ్గి కోసం వస్తుంది. గ్రామీణ ప్రాంతంలో ఏదైనా వస్తువు లేకపోతే పక్కింటికి వెళ్ళి అరవుగా తీసుకోవడం అనవాయితీగా వస్తుంది. ప్రాచీన పద్ధతులెన్నింటినో సంప్రదాయ బద్ధంగా పదిలంగా కాపాడుకున్నవి గ్రామీణ జీవన వ్యవస్థలు అనడంలో సందేహం లేదు. అలాంటి పద్ధతులు జానపద సాహిత్యం ద్వారా వెలికితీయ వచ్చునని చెప్పడానికి ఇలాంటి కథల అధ్యయనమే ఒక ఉదాహరణ.

3. నాటి సమాజంలో భార్యాభర్తల గొప్పతనాన్ని ఇలాంటి కథల ద్వారా తెలియజేశారని చెప్పవచ్చు. అంతేగాక ఒక్కసారి ఆ బంధం విచ్ఛన్నమయితే, ఆ ప్రభావం పిల్లల భవిష్యత్తు మీద పడుతుందని తెలియజేస్తూ, ఆ బంధాన్ని పదిలపరుచుకోవల్సిన అవసరాన్ని సూచించే కథ ఇది.

## 2.5.4.9 మూడు వస్తువుల ఆస్తి

దీకొండ పర్వతాలు, ఆత్మకూరు గ్రామం, గొల్లపల్లి మండలం

అమ్మా నాన్న గర్భన ఇద్దరు అన్నదమ్ములు. ఆళ్లు ఆనారోగ్యంతో చనిపోయే ముందు ఒక్కరోజు ముందు ఇట్ల కొడుక! నేను చనిపోతున్న మనుకు భూమి జాగ వెండి బంగారం ఏం లేదు. మనకు మూడు వస్తువులున్నయ్. మనకు ఒక ఆవు, ఒక మామిడి చెట్టు, ఒక దుప్పటి ఈ మూడు వస్తువులు ఉన్నయి. మీరిద్దరు సమానం పంచుకొని కలిసిమెలిసి నూరేళ్లు బతకండని చెప్పి సనిపోతరు. వాళ్లు చనిపోయినంక అన్నదమ్ములిద్దరు లగ్గం చేసుకుంటరు. రోజు పని చేసుకుంట తిరుగుకుంట ఉన్నరు. కొన్ని రోజులకు పెద్దవాని భార్య ఏమండి! ఇంత కాలం కలిసి ఎన్ని రోజులు ఉందాం? మన సంసారం మనకయితే బాగుండు పొత్తులంటే పోరు, వేరు వడితే మేలని వాని భార్య అతనితో మాట్లాడతది. తన భార్య మాట అర్థం చేసుకొని సరె తమ్ముని అడుగతనని తమ్ముడి వద్దకు వస్తడు. తమ్ముని దగ్గరకచ్చి తమ్ముడా! మనం ఇట్ల రోజు ఎల్లకాలం పొత్తుల ఉండద్దు తమ్మి. మరి ఇద్దరం వేరుపడితే నీ సంపాదన నీకు ఉంటది. నా సంపాదన నాకు ఉంటది. ఎవరి ఇష్టమైనట్టుగ వారు బతకచ్చు అని చెప్తడు. చెప్పినప్పుడు సరె అన్న నీ మాట నేను కాదనన్న. నువ్వు చెప్పినప్పుడు సరె నువ్వు ఏరుపడదామంటే నేను కాదనన్న సరె అన్నడు. పెద్దోడు తమ్ముడు నీకు తెలిసినొళ్లను నువ్వు తోల్కచ్చుకో నాకు తెలిసినొల్లను నేను తోల్కచ్చుకుంట అన్నంక తమ్మునికి ఏం తెలియదు అన్న నువ్వే నాకు నను సాది పెంచినవ్. నీ

కన్న ఎక్కువ తెలిసిన వాళ్లు ఎవ్వరు లేరు. నువ్వే నాకు పెద్ద మనిషి. నువ్వే పంచాలన్నడు. సరె తమ్ముడు. రేపు పొద్దున తొమ్మిదికి చెట్టు వద్దకి రావాలని ఇంటికి పోయిండ్రు. తెల్లారింది చెట్టు దగ్గరకి అచ్చిండ్రు. అవును తీస్కచ్చి చెట్టు కింద కూర్చున్నరు. అన్నయ వేరు నువ్వే పోయాలి అని తమ్ముడు అన్నడు. సరె తమ్ముడు ఏరుపోత్తని పెద్ద వాడు కపటబుద్ధితో ఎలా అంటే చెట్టుకింది సగభాగం నువ్వే ఉంచుకో, పై సగభాగం నేను ఉంచుకుంట చెప్పినంక చిన్నోడు ఏం తెలియదు. మా అన్న నాకు ఏం చేసిన చిన్నప్పుడు నుంచి సాధిండు. కాబట్టి సరె అన్నడు. అవును తెచ్చి తమ్ముళ్లు అవును సెరిసగం చేసుకుందాం. ఆవు ముందు భాగం నాకు, ఎనుక భాగం నీకు తమ్ముడంటే సరె అన్నడు. ఇగ దుప్పటి తీస్కోని దుప్పటిని పొద్దుదాంక నువ్వు ఉంచుకో. రాత్రి సమయానికి నాకు ఇయ్యి. సరె అన్నడు తమ్ముడు ఇద్దరు ఏరు పోసుకున్నరు. ఒక రోజు మంచి పూత పూసి కాత కాసి కాయ పండైంది. ఆ పండ్లను తమ్ముడికి ఇయ్యన్న పెద్దోడు తింటుండు. ఈ ఆవు దగ్గరకత్తె కుడిది, గడ్డి, తౌడు అన్ని పెట్టిండు తమ్ముడు. ఇగ మంచిగ పాలు ఇస్తే మంచిగ పెద్దోడు చాయి చేసుకుంటడు. చిన్నోడికి మాత్రం పెద్దోడు ఏం ఇవ్వట్లలేదు. దుప్పటి కాడైతే బాగా విచిత్రం ఉంది. దుప్పటి పొద్దుదాంక ఎవ్వరు ఏం చేసుకోలేరు. ఓనాడు దుప్పటి మంచిగ పిండితే సాయంత్రం ఆరుగంటలకు అన్నకి ఇస్తుండు. అన్న మంచిగ రాత్రి సమయాన మంచిగ కప్పుకొని భార్య పిల్లలతో పడుకుంటే చిన్నోడు మాత్రం చలికి వణుకుతుండు. ఒక రోజు చిన్నోడి భార్య బాగా ఆలోచించి. మా ఆయనకు ఏం తెల్వకుంటే మా బావ మోసం చేసిండని ఏమండి ఏమండి..! ఎన్ని రోజులు ఇలా మోసపోతరు. మన పొయ్యిల కట్టెలు అయి పెయినయి. మామిడి చెట్టు కింది భాగమనేది. మనది కాబట్టి కింది భాగం కొట్టుకురా మొగుడా అని భార్య అన్నది. ఇలా అన్నంక గొడ్డలి పట్టుకుని చెట్టు దగ్గరికచ్చి రెండు దెబ్బలు ఏసిండు. పెద్దోడు చూసి తమ్ముడా గట్లెందుకు చేస్తున్నవ్ రా? చిన్నోడు అన్న మనం ఏరుపోసుకున్నం. కింది భాగం నాదే మీది భాగం ముట్టన్న అన్న నా భాగం నాకే కొట్టుకుంట ఏమన్న చేసుకుంట పెద్దోనికి అర్థం అయింది. మా తమ్మునికి అన్ని తెల్సినయి. పెద్దోడు అట్ల అనకు తమ్ముడు. ఆడికెల్లి ఈ చెట్టును మనకు చెరొక సంవత్సరం చూసుకుందాం. ఇది ఎండిపోతే ఇద్దరికి పని చేయదు. అని అప్పుడు చెరిసగం పంచుకున్నరు. మల్ల దుప్పటి ఏం చేసిండు ఒక రోజు చలికెట్ల పండుకోవాలని సాయంత్రం తమ్ముడు దుప్పటిని నీళ్లల కుచ్చి తీసి అన్న చేతుల పెట్టిండు. అయ్యో తమ్ముడా! ఇట్లెందుకు ముంచినవ్ అంటే మేం కప్పుకుంటే చలి ఎక్కువ పెట్టదా? అని అంటే అన్న పొద్దుదాంక నాది కాబట్టి నేను చింపుకుంట

పారేసుకుంట నా ఇష్టమచ్చినట్లు నేను చేసుకుంట. సాయంత్రం ఆరు గంటలకి షద్దరు నేను ఇత్త కద అన్నంక ఇంగ ఆవు దగ్గర రోజు పొద్దున ఆవు పాలు పిండతడు. మన అన్న రోజు పాలు పిండుతుండు. నాలుగింటికని మావోడు ఇత్తలేడని నాలుగింటికి తమ్ముడు లేసి అన్న పాలు పిండంగా ఆవు మూతి మీదికెల్లి ఒక దెబ్బ కొట్టిండు. ఆవు కాలుతో అన్నని తన్నింది. అన్న ఎల్లెలుకల పడి నడుము ఇరిగింది. అన్న తమ్ముడు గిట్లెందుకు చేసినవ్ రా? నా నడుం ఇరిగె. అన్న ముంగట సగభాగం నాది ఆవు మేత పెడితే తింటలేదు. అందుకే దాన్ని కొట్టిన. తింటదని అని తమ్ముడు మెల్లగ జారుకున్నడు. అప్పుడు బుద్దచ్చిన అన్న. సరే తమ్మి ఈ కాడికెల్లి పొద్దున ఒకలు నీళ్లు పెడతరు. సాయంత్రం ఒకలు నీళ్లు పెడతరు. అన్ని సెరిసగం పంచుకుందాం అని చెప్పిండు. షద్దరెమో ఈ కాడికెల్లి చెరొక రోజు కప్పుకుందామని చెప్పిండు. అప్పడ్నుంచి ఇద్దరు అన్నదమ్ములు సమానంగా బతుకుతుర్రు మంచిగ.

## మూడు వస్తువుల ఆస్తి – కథావిశ్లేషణ

తల్లిదండ్రులు తమ వారసత్వానికి ఇచ్చిన ఆస్తిపాస్తులను సమానంగా పంచుకోకుండా వాటి ఫలాలను ఒకరు మాత్రమే అనుభవిస్తూ మరొకరిని మోసం చేయదలచినప్పుడు ఏర్పడిన బేధాభిప్రాయాలను చిత్రించిన కథ. ఒక దంపతులకు ఇద్దరు కొడుకులు పుడతారు. కొద్ది రోజుల తరువాత ఆ దంపతులు చనిపోతారు. వారు చనిపోతున్న సమయంలో వాళ్లకున్న ఆస్తిపాస్తులు ఒక ఆవు, ఒక చెట్టు, ఒక దుప్పటి అని వాటిని సమానంగా ఉపయోగించుకోవాలని చెప్తారు. తల్లిదండ్రుల పిల్లల ఇద్దరు కలసిమెలిసి సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. పెళ్లికానంతవరకు వాళ్ల సంతానం సంతోషంగానే ఉంటారు. ఎప్పుడైతే వాళ్లిద్దరు వివాహం చేసుకుంటారో అప్పటి నుంచి స్వార్థపు ఆలోచనలు పెరుగుతాయి. పెద్ద కొడుకు తెలివైనవాడు. స్వార్థపు మనిషి. చిన్న కొడుకు పెద్దల పట్ల గౌరవంగా ఉండి నిస్వార్థంగా ఆలోచించేవాడు. అయితే ఇద్దరు అన్నదమ్ములు పెళ్లి చేసుకున్న తరువాత పెద్దవాడు తమ్ముడు మనమిద్దరం కలిసి ఉండటం కంటే విడిగా వేరు కాపురం పెడితే బాగుంటుందని సలహా ఇచ్చాడు. దానికి తమ్ముడు సరేనని సమాధానం చెప్తాడు. సాధారణంగా అన్నదమ్ములతో పెద్దవాడు కొంత బాధ్యతాయుతంగా ఉంటూ మంచి ఆలోచనాపరుడై ఉంటాడు. దానికి అతని భార్య స్వార్థపు ఆలోచనలతో తెలివి మీరి మరిదిని మోసం చేయాలని అనుకుంటుంది. తల్లిదండ్రులిచ్చిన ఆస్తిపాస్తులను పంచుకుందామని తమ్ముడిని పిలిపించి, మూడు వస్తువులను పెద్దవాడు తనకి లాభం చేకూరే విధంగా తీసుకుని పంచుతాడు. ఆవు ముందు భాగాన్ని తమ్మునికిచ్చి పాలిచ్చే వెనుక భాగం

తాను తీసుకుంటాడు. అలాగే చెట్టు పై భాగాన్ని తాను తీసుకుని కింది భాగాన్ని తమ్మునికి ఇచ్చి, దుప్పటిని రాత్రి సమయంలో తన దగ్గర ఉదయాన తమ్ముడి దగ్గర పెడతాడు. కొద్ది రోజులు ఆ మూడు వస్తువుల ఫలితాలని పెద్దవాడు బాగా అనుభవిస్తున్నాడు. చిన్నవాడి భార్య పెద్దవాడి ఆలోచనను పసిగట్టి తన భర్తను మార్చుకుంటుంది. తన అన్న చేసే మోసాన్ని వివరించి ఏదో ఒక ఆలోచన చేయాలని చెప్పి ఒక రోజు ఆవు మూతి మీద కర్రతో కొట్టిస్తుంది. తరువాత తమ్ముడి చెట్టు మొదలు భాగాన్ని నరికేలాగా చేస్తుంది. అన్న తమ్ముడి చేష్టలను అర్థం చేసుకుంటాడు. మరునాటి నుండి తల్లిదండ్రులు ఇచ్చిన మూడు వస్తువులను సమానంగా వాడుకుంటారు.

1. ఏ తల్లిదండ్రులైనా తమ బిడ్డలను సమానంగా చూడాలని అనుకుంటారు. కాని పిల్లలు ఎదిగే క్రమంలో తమ స్వార్థపు ఆలోచనలతో బంధువులను దూరం చేసుకుంటారని ఈ కథ ద్వారా తెలుస్తుంది. పేగు బంధం తెంచుకుని పుట్టిన అన్నదమ్ములు పెళ్ళైన తరువాత మారిన వైనాన్ని ఈ కథ చిత్రిస్తుంది.

2. అన్న తమ్ముడి మౌనాన్ని చేతకాని తనంగా భావించి స్వార్థపు ఆలోచనలతో సొమ్ము చేసుకోవాలని అనుకుంటాడు. అందుకే ఆవును తమ్ముడు మేత పెడితే పాలు అన్న పిండుకుంటాడు. చెట్లకు తమ్ముడు నీరు పడితే పండ్లు అన్న తీసుకుంటాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఆస్తిపాస్తులను సమాన భాగాలు పంచకుండా స్వార్థబుద్ధితో పాలు, పండ్లు, దుప్పటి అన్ని తానే అనుభవిస్తాడు. ఇంటికి పెద్దకొడుకై తల్లిదండ్రులు ఇచ్చిన బాధ్యతలను మరిచి తమ్ముడినే మోసం చేయదలచాడు. అన్న మనస్తత్వాన్ని అర్థం చేసుకుని అతనిలో మార్పు రావాలని తమ్ముడు చూపిన నేర్పు సందేశాత్మకమైనది.

## 2.5.4.10 బూరెప్ప కథ

దీకొండ పర్వతాలు, ఆత్మకూరు గ్రామం, గొల్లపల్లి మండలం

అయితే ఆత్మకూరు లాంటి ఊళ్లే దినయ్య, దినమ్మ అనే ఇద్దరు ఉంటరు. వాళ్లు ప్రతిరోజు ఆవులను ఒకలు బర్లను కాత్తరు. ఒకలు ఆవులను కాత్తరు. ప్రతిరోజు దినయ్య ఆవులను కాత్తడు. ఓనాడు ఉగాది పండుగ అచ్చింది. పండుగనాడు దినమ్మ ఆకిలి ఊడిసి అలుకు చల్లి ఇంటికాడ ఉంది. ఈ దినుకొండ ఏం చేసిందు గద! అన్ని అలుకుతలు చేసి ఆమె ఇంటికాడ ఉంది. ఈ దినుకొండ ఏం చేసిందు గదంటే ఈ ఆవులను కొట్టుకపెయిందు మందొడ్డ మీదికి. ఆయనచ్చెసరికి తొమ్మిదయ్యింది. అవునయ్యా నువ్వ్ దుకాళ్లకొయి మనకు పిల్లగాల్లు ఎక్కువ లేరు గద. కిల బెల్లం కిల గోధుమ పిండి

పప్పు తీస్కరా. బూరెలు చేత్తనని దినమ్మ అంది. దినుకొండ పొయి కిల పప్పు, కిల బెల్లం తీసోని అచ్చి ఇచ్చిండు. పిల్లగాల్లు ఎక్కువుంటే ఎక్కువ బూరెలు చేత్తుండె? ఈమె మూడె బూరెలు చేసింది. దినుకొండకు ఒక బూరె పెట్టింది. దినమ్మ రెండు బూరెలు పెట్టుకుంది. ఆళిద్దరు ఆడ కూసోని తింటరు. ఇగ కాలు చేతులు కడుక్కొని మంచిగ కూసుంటరు. ఆడు సుత్తండు. దినమ్మ అమ్మా నేను అరవకష్టం చేస్తన్న పొద్దుందాక ఆవుల వెంబడి పోవాలి గీ ఒక్క బూరె తింటే పొద్దుందాక పోతన్న. మరి అన్నం లేకపయే. నాకు రెండు బూరెలు ఏయి. నువ్వ్ ఒక బూరె తిను లేదు లేదు పొద్దాగూకినంక ఆకిలి ఊడ్సి అలుకు సల్లి ముగ్గులు ఏసిన సర్వసాకిరి చేసిన నువ్వ్ దుకాన్లకి పోయి పిండి తెచ్చినవ్. నేను బారానా మందం పని చేత్తన్న. నువ్వు ఆవుల కొయి పొద్దికి అత్తున్నవ్ నీకెమంత అలిస్ట అయితంది. దినమ్మ మరి ఇట్లయితే కలువదు. ఇండ్లకెల్లి సగం నాకు సుంచియి సగం అట్ల ఉండని నేను ఏం చేత్తన గద. అట్ల గాదు గని ఇద్దరం మంచం వేసుకుందా ఒక పల్లెంల మూడు బూరెలు పెడదం. నల్లుల మంచ్ వేసుకొని పన్దం. పంటే ఆ నల్లులు కుట్టి ఉ.. అంటే ఒకటి. ఊకునొల్లకు రెండు. అనుకొని ఇద్దరు తలుపులు కుల్లపెట్టిరు. అప్పుడు గుడిసె తలుపులు కుళ్ల పెట్టి ఆళ్లు పడుకున్నరు. ఈళ్లిదరు పండుకున్నంక నల్లులు కుడతయి కద. ఎనుకట ఒక నల్లి పొద్దాటిల్లి ఏడు ఈతలు మాపటిల్లి ఏడు ఈతలు ఈన్తయి. నల్లి దినమ్మను చిట్కన కుట్టింది. పానం ఎల్కపోతుంది. సత్తిముండ కొడుకా! అంటినా నాకు ఒక బూరె అయిద్ది అని అట్లనే పంటంది. అట్లనే పండి ఇంకో అఫనవర్ వరకల్లా అట్లనే ఉంటుర్రు ఇద్దరు. ఎన్ని కుట్టినగని సప్పుడు చేత్తలేరు. ఒక కర్రె కుక్కచ్చి మూడు బూరెలు తినిపోతది. దినమ్మ చూసి ఇద్దరు పొత్తుల బూరెలు కుక్క తింటంది. నేను అంటిన నాకు ఒక్క బూరె అయిద్ది. దినుకొండ కూడా సప్పుడు చేత్తలేడు. ఇద్దరి మధ్యల కుక్క తినిపోయింది. తెల్లారి ఆరైంది పదైంది. పశువులు కొట్టేది ఎవరు? దినుకొండ అరె సుంకరి యజమాని అచ్చిండరా. దినుకొండను రమ్మను తోవ్వంటి ఆవులన్ని పోతన్నయి అని చెప్పి శంకరయ్య తోలిండు. ఈ సుంకరయిన దినమ్మ ఇంటికచ్చి ఈల్లు పన్న సంగతి కుళ్ల ఉన్న తలుపులకెల్లి సూసిండు. వాళ్లు కండ్లతోని సూత్తుర్రు. దినుకొండ చూసి ఇంటడు. మరి దినమ్మ సుంకరోడు అచ్చిండు గద అని నేనంటే ఒకటే బూరె అయితది. దినమ్మ కూడా చూసింది. మరి దినుకొండ లేసిపోవయ్య ఆవుల మేపలి అయితే నాకొకటే బూర అయితది అని సప్పుడేక. లేత్తలేదు. ఈళ్లిద్దరు కండ్లతో చూసుకుంట మొస తీత్తలేరు. ఈ సుంకరైన అనుకుండు గద దినమ్మ దినయ్య సచ్చిపోయిర్రు. కండ్లల్ల జీవనం పోయింది. ఈ ముచ్చట కొండపోయి రాజుకు చెప్పిండు. రాజా!

దినమ్మ దినుకొండ ఇద్దరు సచ్చిపెయిర్రు అని చెప్తడు. మరెట్ల అని చెప్పి పెద్దలకు కాపులకు కర్నాలకు వెలమలు గొల్ల కురుమ తురుకొల్ల పెరుకొల్లు మాదిగొల్లు మాలొల్లు అందరు జమ అయిర్రు. మంచోడు చనిపోతే అందరు అత్తరు. చెడ్డోడు సనిపోతే పని బందు పెట్టుకుని రారు. ఈడు మంచోడు కాబట్టి ఊరందరు అచ్చిర్రు. దినమ్మను గుంజి కడుతర్రు. అమ్మో! నాకు నొత్తుందనుకుంటే ఒకటే బూరె అయితది. ఇద్దర్ని కట్టి తీస్కపోయి కాట్నంల పెట్టిర్రు. అగ్గి అంటుపెట్ట ఎక్కడోళ్ల అక్కడ పెయిర్రు. ఇగ ఆడోళ్లకు కురులు ఉంటయి గద ఈ కురులకు పాడె అంటుకొని ఎంటుకలకు అంటుకునే సరికి అబ్బ సత్తిరా! ముండకొడుకా..! అని కాట్నలకెల్లి దునికింది. ఆమె దునకంగనే దినుకొండ దినమ్మ నీకు ఒకటి నాకు రెండు కింద దునికుండు. ఈళ్లందరు తానం చేసి ఎల్లిపోతరు. అక్కడ సాకలోల్లు ఉన్నరు. సాకలొల్లు చూసి దినమ్మని దినయ్యని ఇప్పుడే కాలేత్తిమి. సచ్చినొల్లు దయ్యమై అచ్చిర్రు. నీకు ఒకటి నాకు రెండు అనుకుంటరు. అంటే మనం ముగ్గురం మనల్ని తినటానికే అత్తుర్రు. పాలు పంచుకున్నరు ఈళ్లు కూడా ఊళ్లె పడ్డారు. సరాసరి పొద్దుగూకింది. ఊళ్లె దినయ్య దినుకొండ దయ్యాలైర్రని అందరు బయటకెల్లద్దని చాటింపు చేసిరి. రెండు మూడు రోజుల జరిగే వీళ్లు ఏం చేసిర్రు అమ్మో కట్టుకుందా మంటే పుట్టు బట్టలేదు కాట్నంల బట్టలన్ని ఇప్పిరి. ఇట్లయితే మనల్ని బతికనియ్యరని ఊరి బందుకు ఒక శాలొల్ల ఇల్లు ఉంది. శాలె పొలిశెట్టి ఏం చేసిండు. అమ్మో! నాకు ఒంటెలుకి అత్తది. నేను ఒంటెలుకి పోసత్తని అంటే ముండ కొడుకు ఒంటెలు పోతవ్ గని దినయ్య దినమ్మ దయ్యాలైయ్యిరు. మరి దబ్బన నిన్ను మింగుతరు. ఎట్లంటే అమ్మో ఏం లేదు. ఓ పనిచేయి నడుంకు మోగుతాటు కట్టు, నేను ఒంటెల్కి పోత దబ్బన అల్లు అత్తనేమో అచ్చిర్రే..! నను తింటుర్రే అని చెప్త నను గుంజు. ఆళ్ల నోటికెల్లి ఊసత్త నేను. ముసలమ్మ కట్టింది. కాకర చెట్టు కాడ ఒంటెలు పోయ్యంగ పొలిశెట్టి అని పిలిసేవరకల్లా ఆ.. అన్నడు. సత్తి రా.. అనేవరకల్లా ఇది పట్కుని గుంజె ముసలోడు దర్వాజ అడ్డం రాను సచ్చె. ఇదేదొ కట్ట ముందటనే ఇప్ప చెట్టుంది. ఆ చెట్టు ఎక్కిరన్న విషయం ముసలోడు సచ్చింది పోలీస్ స్టేషన్‌కి తెలిసి యస్. ఐ అచ్చె. దినయ్య దినుకొండ కిదర్ సె అయ్ రే. దయ్యం కిదర్ సే అయ్ రే శక్తి సైతాన్… ఎక్కడుంది సాకలిరేవు కట్టెక్కిండు. ఈడు అటు సూత్తె ఎక్కడ ఎవరు కనిపిత్తలేరు. పోలీసుకి బాగా గడ్డం పెరిగింది. అరె ఎవరు లేరు ఇక్కడ మంగళొన్ని తెప్పియిర్రు. నేను గడ్డం తీసుకుంట. ఇక్కడ కుర్చి మీద కూసోని మంగళయిన గడ్డం తీత్తుండు. మీదికి సూసేవరకల్లా ఇప్పచెట్టు మీదున్నరు దినయ్య దినుకొండ. అరెరె దినుకొండ దినమ్మ ఈడనే ఉన్నరు దయ్యాలయ్యే. గుర్రాలెక్కి ఉరుకుర్రి.

గుర్రాలు ఎక్కంగ గూటకొయ్య కొట్టిర్రు గద. అది ఎన్నుల తాకుతూ రాసిన కొద్ది దినమ్మ దినయ్య నన్ను సంపకుర్రి అని ఆయన మొత్తుకుంటడు. దూరాన కట్ట మీద నిలబెట్టి అయ్యా! యస్. ఐ గారు మేం దయ్యాలం గాదు. మేం భూతలం గాదు. మా పరిస్థితి గిది. మీరందరు ఆగుర్రి అని రంగస్థలానికి పిలిపిచ్చి. సాకలొల్ల బండకాడ పాత బట్టలు సెరొకటి కట్టుకొని చెప్పిండు. మా ఇద్దరికి సెర్తు పడ్డది ఊ అంటే ఒక బూరె ఊకునొల్లకు రెండు బూరెలు అని చెప్పి మేం బూరెలు చేసుకుని సెరో దిక్కు మంచం ఏసుకుని పన్నం. ఆ బూరెల కోసం పండుకున్నం ఇద్దరి పొత్తుల కుక్క అబ్బ తిన్నదిగని మేం ఒవలం నా మాట గెలువాలని చెప్పి నా భార్య దినమ్మ ఊ అనలె. నా మాట గెలువాలని నేను ఊ అనలె మేం దయ్యాలం గాదని చెప్పి అయ్యా అందరికి సెనార్తె చేత్తున్న మేం మంచిగనే ఉన్నమని చెప్పి పశువులను కాసుకుంట ఉన్నరు.

## బూరెప్ప కథ – కథావిశ్లేషణ

దినమ్మ, దినయ్య అనే ఇద్దరు పశువులను కాసే దంపతులు. ఉదయం నుండి సాయంత్రం దాకా నానాకష్టం చేసి పశువులను మేపుకొని వచ్చేవాళ్లు. ఉగాది పండుగ రోజు వాళ్లకు సంతానం లేదని వాళ్ళిద్దరికి మూడె బూరెలు చేసుకుంటారు. అందులో నాకు రెండు బూరెలని దినయ్యంటే, నువ్వు తెచ్చిన పిండి పదార్థాలతో నేను బూరెప్పలు చేశాను కాబట్టి నాది కూడా కష్టమే. నేనే రెండు తింటానని దినమ్మ అంటుంది. ఇద్దరి మధ్య పందెం కుదురుతుంది. ఎవ్వరు ముందు మాట్లాడితే వాళ్లకు రెండు బూరెలని, మాట్లాడకుండా ఉన్న వాళ్లకు ఒక బూరెని పందెం కుదిరింది. వీరి పంతం ఎంత వరకు సాగిందంటే ఇంట్లోకి వచ్చిన కుక్కని చూసిన కూడా భార్యతో పందెంలో ఓడిపోవద్దని భర్త, భర్తతో పందెంలో ఓడిపోవద్దని భార్యకు తగ్గ పోరు నడుస్తుంది. ఒక రోజు మొత్తం గడిచినా ఇద్దరిలో ఎవరు మాట్లాడకుండ మౌనంగా నిద్ర పోతున్నట్టు నటిస్తారు. ఇది చూసిన ఇతరులంతా చనిపోయారని అనుకుని శవాలను మోసుకెళ్ళి పాడె కట్టెకి నిప్పంటిస్తారు. నిప్పు అంటించగానే భార్య తలవెంట్రుకలకు అంటుకొని వామ్మో నేను చనిపోతాన్నని భయంతో లేసి అరుస్తుంది. భార్య మొదట మాట్లాడింది చూసి భర్త తానే గెలిచానని ఆనందపడతాడు. ఆ ఊరి గట్ల వెంబడి నగ్నంగా తిరుగుతూ చెట్ల మీద దాక్కుంటారు. ఒక రోజు దయ్యాలు ఉన్నాయని ఒక వ్యక్తి ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్న సబ్ ఇన్స్పెక్టరుకి వీళ్లు కనబడి జరిగిన తతంగం అంతా చెప్పి క్షమించమని కోరతారు. భార్యాభర్తలు వేసుకున్న పందెన్ని వారి మౌనదీక్షని మెచ్చుకుని ప్రజలు ప్రశంసిస్తారు.

1. భార్యభర్తల మధ్య బూరె కోసం ఏర్పడ్డ పందెం ఎలాగుంటుందంటే వారి ఓర్పు, సహనాలని పరీక్షించే విధంగా ఉంటుంది. ఇద్దరు చివరి వరకు ఎన్ని అవాంతారాలు వచ్చిన పందెంలో నెగ్గడానికి ప్రయత్నిస్తారు. ఒక బూరె కోసం అంత పోటీనా? అని అనుకుంటాం గాని అది వాళ్ల వ్యక్తిగత పరువు, మర్యాదలను తేల్చే పందెం లాంటిది.

2. ఒక విషయం మీద పట్టు సాధించడానికి ఉండవల్సిన ఏకాగ్రతను బోధిస్తుంది. భార్యాభర్తలు ఒకరికొకరు వేసుకున్న మాట కోసం కాట్నలగడ్డ సావురేవు దాకా వెళతారు. చిన్న చిన్న సంతోషాలు ఉంటేనే భార్యాభర్తల మధ్య బంధం మరింత పటిష్ట పడుతుందని ఈ కథ ద్వారా తెలుస్తుంది.

3. ఈ కథలో పోలిసు స్టేషన్, యస్. ఐ ల ప్రస్తావన ఉంటుంది. కాబట్టి జానపద కథయే అయినా నేటి రక్షణ వ్యవస్థలను కలుపుకొని కథలో మార్పులు జరిగి, రూపాంతరం చెందింది. దానికి నిదర్శనమే ఇలాంటి కథే మరొకటి రాయికల్లో దొరికింది. ఆ కథ వస్తు సారూప్యతతో సమానంగా ఉన్నా, దీనిలో ప్రదర్శించిన కథ మధ్యంతర మలుపులు, ముగింపులు దానితో విబేధిస్తాయి.

4. జానపదులు గ్రామీణ ప్రాంత ప్రజలు ఊరి చివరన గట్ల మీద, చెరువు కట్ట మీద, మర్రి చెట్టు తొర్రలల్ల, సాకలిరేవు గట్ల మీద, కాట్నల గడ్డ సమీప ప్రాంతంలో రాత్రివేళలో దయ్యాలు తిరుగుతాయని అటువైపు వెళ్లకూడదని హెచ్చరిస్తుంటారు. సహజంగానే మూఢ విశ్వాసాలకు, నమ్మకాలకు తావిచ్చే జానపదులు మంత్ర, తాంత్రిక, చేతబడులు ఉన్నాయని అమితంగా విశ్వసిస్తారు. నేటికి ఇలాంటి విషయాలు పల్లెల్లో అధిక వ్యాప్తిలో ఉన్నాయి. వాటిని ఆసరా చేసుకుని ప్రజల నుంచి దొంగ బాబాలు, స్వాములు డబ్బును సొమ్ము చేసుకుంటున్నారు.

## 2.5.5 స్త్రీల కథలు

## 2.5.5.1 అత్తని నమ్మని కోడలు కోడల్ని నమ్మని అత్త

దీకొండ పర్వతాలు, ఆత్మకూరు గ్రామం, గొల్లపల్లి మండలం

అత్తని నమ్మని కోడలు కోడల్ని నమ్మని అత్త వాళ్లిద్దరు ఏం జేత్తరు. పదిమంది కొడుకులు లేరు పది మంది బిడ్డలు లేరు. ఒక కొడుకు ఉంటే ఆ కొడుక్కి లగ్గం జెత్తే. ఈ కోడలు డెలివరికి ఉన్నది. ఇగ అత్త కోడల్ని నమ్ముత లేదు. కోడలు డెలివరికి ఉన్నది. ఇగ అత్త కోడల్ని ఎక్కువ పని చెప్పద్దు గద? అని చెప్పి ఈళ్లు ఏం జేసిరంటే అప్పట్లో బావి లేకుండే. నల్లలు లేకుండే. ఒక హాఫ్ కిలోమీటర్ పోయి నీళ్లు తెచ్చుకోవాలి. ఈ అత్త ఏం చేసింది ఆ రోజు మా కోడలు మొయద్దు గద అని చెప్పి కుండ పట్టుకొని

అప్పుడు నీల్లకు పోయ్యింది. ముసలోని దోతి పిండుకుంది. కుండ నిండ ముంచుకుంది. పంచె పిండి ఉల్లారేసి కుండ పట్టుకొని అత్తుంది. ఈమె రానప్పుడే డెలివరికి ఉన్నోల్లకు, తిన బుద్దయ్యే తిండి పెట్టాలన్నట్టు ఆడ పిల్లలకు. ఉన్నోల్లయితే అవ్వగారు తోల్కపోతరు. అన్ని తీర్ల పెడతరు. అమ్మా గని నాన్న గని ఎవ్వరు లేరు ఈమెకు. ఈ పిల్ల మా అత్త ఇప్పుడు లేదు గద. మా అత్త ముంగట ఏమన్న తింటే తిననియదు గద అప్పుడు ఉండి లేని సంసారమే అని చెప్పి. ఈ అత్త లేకుంట చూసి కోడలు పక్కింటోల్ల ఇంటికి వోయి నిచ్చెన తెచ్చి అటుక్కు ఏసింది. అప్పుడు మూడు కుండలు కనిపిచ్చినయి. ఒక కుండల బెల్లం, ఒక కుండల కుడకలు, ఒక కుండల అర్సోదు నువ్వులు దొరికినయి. ఆ మూడు వస్తువులు తెచ్చి రోట్లేసి దంచుతుంది. దంచి ఇంత ముద్ద కట్టుకొని తింటనని చెప్పి రోజంత తింటగని రోట్లే ఏసి దంచంగా ఆ సమయానికి ఆ ఊరు తిరిగిటోల్లు బిచ్చగాళ్లు అత్తరు. ఒక మిత్తిలేయరు టిం టిం కొట్టుకుంట పాట పాడుతుండు. తాన తందాన తాన తందాన రాజు వందాన... అనే పాట పాడుతుండు. ఆ పాట పాడంగ దంచుకుంట ఉండంగ కోడలు అరె! ఇప్పుడు ఈనెకు ఐదు నిమిషాలు టైం తీస్కొని అరసోడు బియ్యం ఇద్దమంటే ఐదు పది నిమిషాలు పోద్ది. మా అత్త వత్తది. ఎట్ల అని చెప్పి ఇంటి ముందర పందిట్ల పాట పాడుతుండు అత్త కుండ పట్టుకుని పందిట్లకు అచ్చింది. మిత్తిలేయరు కథ చెప్తండు. రోటి పొంట కోడలు కూసింది. ఏమేయ్ కోడలా మిత్తిలేయరుకు ఐదు ఇత్తనన్నవా? పది ఇత్తనన్నవా? నూరు ఇత్తనన్నవా? నీకు కొడుకు పూట్టాలని కథ చెప్పితున్నవా నీయి ఆవుల బర్లు తప్పిపోతే ఇంటికత్తే మల్ల దేవుని పేరు మీద కథ చెప్పితున్నవా? నువ్వేందుకు ఈ పాట పాడిత్తన్నవ్ చెప్పు. కుండ ఇడిసి పెట్టెవరకల్లా కుండ పదహారు వక్కలైంది. ఏం లేదత్తమ్మా! ఇగ ఈ సొమ్ము మనదంటే నేను దొంగనైత అని చెప్పి సాటుకు అట్ల ఏం అంటది. అత్తమ్మా మిత్తిలేయరు కోమటోల్ల ఇంటికిపోతే బెల్లం ఇచ్చిర్రు. ఒక కోమట్లు కుడకలు ఇచ్చిరట. ఒక కోమట్లు కొన్ని నువ్వులు పెట్టిర్రట ఈ మూడు దంచుతున్న అయినది సోమ్ము నాది రెక్కల కట్టం అత్తమ్మా కోడలన్నది. ఈ కోడలు అన్నంక మిత్తిలాయరు బాగానే సదురుకున్నడు. అమ్మా! నీ అత్త నిన్ను తిట్టుడేంది? నాది సోమ్ము నీది రెక్కల కట్టం గద! ఆ దంచకున్న సరే నాది నాకు పెట్టు జోలె సాపిండు. ఇద్దరి మధ్యల ఆ దంచింది సత్తు అయింది. ఓ తాటికాయంత ముద్ద తయారయింది. ఈ సత్తు నేను పెట్టకపోతే నేను దొంగనైత బలిమిటికి నరాలు బిగపట్టి అయిన సంక జోలెల ఏసింది. ఈ మిత్తిలేయరు టింగ్ టింగ్ కొట్టెటోడు. అరె ఆత్మకూరు తిరుగుతే ఏంది తిరగక పోతే ఏందన్నడు. దన దన ఊరికి ఉత్తరం బాదున కొర్ల

కోటబాయి ఉంది. ఆ బావికాడికి వోయి బావిల నీళ్లు లేవు. మల్ల సెలముల ఆగు కాడికివోయి సెలమల నీళ్లు జల్లి పొలం కాడ కూసోని కాళ్ల మధ్యల పెట్టుకొని తింటుండు. తినంగ కోడలు సత్తు ముద్ద చేయంగ చేసిందిగని పానం అంత సత్తు ముద్దలనే ఉంది. డెలివరికి ఉంది కాబట్టి. మరి అత్తమ్మ మామ దోతి పిందుకొని అచ్చినవొలే కుండ పలిగింది. నేను బిందె పట్టుకొని పోత మీ కొడుకు ప్యాంటు ఉంది. ఆ ప్యాంటు పిందుకొని ఈ బిందె పట్టుకొని అత్తనని చెప్పి ఈమె తయారైంది. సరె బిడ్డ పో అని పంపింది. ఈమె సక్కగ అదే బాయికాడికి పోయింది. మిత్తిలాయరు తింటుండు. సెలమల కూసోని. మిత్తిలేయరు మా అత్త ముందు నేను దొంగనైతనని చెప్పి 'నీది సొమ్ము నాది రెక్కల కట్టం' అన్న నువ్వు రెండు పాలు తిను నాకొక పాలు పెట్టవయ్యా? అని ఈమె అన్నది. అనేవరకల్లా ఈ మిత్తిలేయరు ఏమంటుండు తినుకుంటనే పిల్ల నాదేమో సొమ్ము అన్నవ్ నీది రెక్కల కట్టం అన్నవ్ నా పంచాది నీ పంచాది మీ అత్త చెప్పుద్ది ప.. అని మిత్తి లాయరు అనే. కండ్లకు నీరచ్చినయి. నా సొమ్మంతా నాకు బాకి లేకుంట అయిపాయే. ఏ.. అత్త ఏం చేసింది. మా కోడలు లేదు గద రేపొ.. మాపొ ఇంకో ఆర్నెల్లకు సచ్చేదాన్ని. ఏం అన్న చేసుకొని తింట అని చెప్పి అరసోదు బియ్యం పెట్టింది. ఇంత బెల్లం ఏసి పాశం రుద్దింది. ఇక్కడ కూసోని తింటే దొంగనైతనని చెప్పి రికాబుల అన్నం పెట్టుకుంది. దేవుని ఇంట్ల కూసోని తింటుంది. ఈ కోడలు ప్యాంటు పిందుకుంది. బిందె నిండా నీళ్లు నింపుకుని ఇంటికచ్చింది. అచ్చేవరకల్లా కమ్మటి ఆసన అత్తుంది. పాశం అండింది గద ఆ బిందె ఆడ పెట్టింది. ఆ పల్లెం కాడికివోయి మన బగోన్ల కాడికివోయి సూసే వరకు పాశం అండింది. మా అత్త నా కొరకే ప్రేమతో పాశం అండింది కావచ్చు. అతురత రాణి ఏం చేసింది. పల్లెంల అన్నం వేసుకుంది. మా అత్త సేతుల నశం పోసుకొని పోయి ఒవల్లింటికాడ నన్న నశం పెర్సుకుంట మాట్లాడితే తెల్లారింది. పొద్దు గూకింది ఏర్పడది? ఏడ మాట్లాడుతుందో? మా అత్త. ఇంత నేనింత తింట అని రికాబుల అన్నం పెట్టుకుని సక్కగ ఈమె కూడ ఆ దేవుని కాడికి పోయింది. అత్త కాలు కోడలు కాలికి చిట్కన తగిలింది. ఇగ పొంగ ముసల్ది నీళ్లు కొండపోలే అన్నం తినంగ గొంతుల తట్టుకుంది. తట్టుకుని కెక్.. కెక్.. కెక్.. అంటంది. అయ్యో! భగవంత మా అత్త ఈన్నె ఉందని చెప్పి మంచినీళ్లు, మారన్నం అత్త దగ్గర పెట్టి బయటకచ్చింది.

## అత్త నమ్మని కోడలు, కోడల్ని నమ్మని అత్త – కథా విశ్లేషణ

ఈ కథాశీర్షికను గమనిస్తేనే మనకు కథలో ఉన్న వస్తువు అత్త కోడలు మధ్య జరిగిన సంఘటనని అర్థమవుతుంది. గర్భవతిగా ఉన్న కోడలికి తనకు ఇష్టమైనవి చేసుకొని తినాలని ఆశ పుడుతుంది. కానీ అత్త ఏమంటుందోనని కోడలు భయపడుతుంది. ఒకరోజు పొద్దునే అత్త బట్టలు పిండుకోవడానికి గోదావరికి వెళుతుంది. అదే అదునుగా భావించిన కోడలు అత్త బయటకు పోగానే ఇంట్లో ఉన్న సరుకులతో వంట చేసుకొని తిందామని అనుకుంటుంది. ఈలోగా ఒక మిత్తిలేయరనే బిచ్చగాడు వీళ్లింటికి వచ్చి కథ చెప్తూ బిక్షాటన చేస్తాడు. గోదావరికి వెళ్లిన అత్త తిరిగి ఇంటికి వస్తుంది. మిత్తిలేయరుని చూసి కోడల్ని కొడుకు పుట్టాలని కథ చెప్పించుకుంటున్నవా అని ప్రశ్నిస్తుంది. ఇంట్లో ఉన్న సరుకులతో నువ్వుల ముద్ద చేస్తున్న కోడలు భయపడి ఆ సరుకులు మిత్తిలేయరిచ్చాడని అబద్ధం చెప్తుంది. అత్త కోడళ్ళ సంభాషణ అర్థం చేసుకున్న మిత్తిలేయరు తెలివిని ఉపయోగించి ఇదే సందు అనుకొని నా సరుకులతో నువ్వుల ముద్ద చేశావని, దానిని తీసుకెళతాడు. అత్త ముందు పిండివంటకి కావలసిన ఆ సామాన్లు ఇంటివే అని తెలిస్తే ఏమంటుందోనని కోడలు మౌనంగా ఉంటుంది. మిత్తిలేయరు నువ్వుల ముద్ద తీసుకెళ్లి పొలంలో కూర్చొని తింటాడు. పొలం దగ్గరికెళ్లి కోడలు ఎంత అడిగినా చిన్న నువ్వుల ముద్ద కూడా ఇవ్వడు. ఇక అత్త కోడలు పోయిన సమయాన్ని చూసి మంచిగ పాయసం చేసుకుంటుంది. కోడలికి అనుమానం రాకుండా ఉండటానికి దేవుని గదిలోకి వెళ్లి తింటుంది. మిత్తిలేయరుతో వాదించి లాభం లేదని సీదా ఇంటికి వచ్చిన కోడలికి పాయసం వాసన వస్తుంది. నా కోసమే మా అత్త చేసిందనుకుని కోడలు ప్లేటులో పెట్టుకుని నేరుగా వంటగదికే పోతుంది. ఇద్దరు ఒకేసారి ఎదురుపడేసరికి అత్తకు పాయసం గొంతులో అడ్డుపడి వెక్కిళ్ళు వస్తాయి. కోడలు మంచినీళ్లు తీసుకుని వచ్చి ఇస్తుంది. కోడలు కన్న అత్త గడుసరితనం బయటపడుతుంది. ఒక ఇంట్లోనే ఉంటున్న అత్త, కోడళ్లమధ్య సరైన అవగహనలేక ఇబ్బంది పడతారు. కొన్ని కుటుంబాలలో ఇలాంటి సంఘటనలు జరుగుతుంటాయి.

1. అత్త కోడల్ల మధ్య పరస్పర సహకారం లేక వారి అహంభావాలకు ప్రాధాన్యం ఇస్తూ ఉంటారు. అత్త ఏమంటుందనని కోడలు, కోడలు ఏమనుకుంటుందోనని అత్త ఇరువురు వారికి తినాలని అనిపించిన వంటకాలను స్వేచ్ఛగా చేసుకొని తినలేక పోతారు.

2. మూడు సిగలైన కలిసి ఉంటాయి గాని రెండు కొప్పులు కలిసి ఉండవు అని ఒక సామెత . ఈ కథకు ఆ సామెత చక్కగా సరిపోతుంది. స్త్రీలకు స్త్రీలే శత్రువు అన్న సామెత కూడా వ్యవహరించవచ్చు. ఇంకో స్త్రీ ముందు తక్కువ కాకూడదని మరొ స్త్రీ భావించడం సహజం. కాని అత్తే కదా అని కోడలు అనుకోదు. కోడలే కదా అని అత్త అనుకోకుండా ఒకరికి దొరక్కుండా ఇంకొకరు వంట చేసుకొని తినాలని అనుకుంటారు. చివరికి ఇద్దరు ఒకరికొకరు దొరికిపోతారు.

3. ఈ కథలో మరో పాత్ర మిత్తిలేయరు పాత్ర. బిక్షాటనకు వచ్చి సందర్భానుసారంగా సమయస్ఫూర్తితో వ్యవహరించి కోడలి దగ్గర నుంచి నువ్వుల ముద్దని తీసుకెళతాడు. కోడలు అత్తతో అన్న మాటలు విన్న మిత్తిలేయరు కోడల్ని మనోభావాలను, ముక కవళికలను పసిగట్టి నువ్వుల ముద్దని తీసుకుని చాకచక్యంగా పరారవుతాడు. గ్రామీణ ప్రాంతంలో బిక్ష కోసం వచ్చి బిక్షం వేస్తే వారి పేర్లతో కథలు చెప్పడం అనవాయితీగా వస్తుంది. ఈ కథలో కూడా మిత్తిలేయరు కోడలికి పుట్టే బిడ్డ గురించి కథలు చెప్పిస్తుందేమో అని అత్త నిలదీస్తుంది. కుటుంబంలో వ్యక్తుల మధ్య ఐక్యత లేకపోవడం వల్ల ఏ విధంగా నష్టపోతారో ఈ కథ వల్ల వెల్లడి అవుతుంది.

## 2.5.5.2 తోడి కోడల్ల 'అత్యాశ'

బోగ లక్ష్మీ, దమ్మనపేట గ్రామం, ధర్మపురి మండలం

ఇద్దరు అన్నదమ్ములు. ఇద్దరు కోమట్లు. అయితే ఇద్దరు అన్నదమ్ములయితే వేపారం జేత్తరు. వేపారం చేసోటల్లయితే ఆల్లు ఏం జేత్తరు గద! ఆల్లు వేపారంకు పోంగ రెండు గుమ్ములల్ల నీళ్లు నింపి మేం వేపారానికి పోతున్నాం. మేం అచ్చేసరికి ఇవి యిట్లనే ఉంచుర్రి. నువ్వులు ఏం ముట్టకర్రి. పని చేయకుండ్రి అని ఇద్దరు భార్యలకు చెప్పి పోతరు. పోయినోళ్లే ఏంజెత్తరు గదంటే చిన్నది ఆ.. ! చితికి కొర్రలయింటయి సూదు పొయ్యిల పెట్టుకుంట వంట చేస్తది. వంట చేసినోల్లే ఈ పెద్దామె అడుగుతది. పెద్దామె అడిగినోల్లే ఏం జెత్తది గద. నువ్వులు ఏంచుకుంటున్న అని చెప్పి చిన్నామె అంటది. నువ్వులు ఏంచుకుంటున్న అంటే ఎప్పుడు నువ్వులు ఏంచుకునే బుక్కుతవ? అంటే బుక్కుత అంటది. ఇది రోజు ఇట్లనే వంట చితి మీద కొర్రయి పెట్టుకుంటనే వంట చేసుకుంటది. వంట చేసుకున్నంక మా యారాలే బుక్కుతుంది. నేను సూతం బుక్కుత అని చెప్పి నేను గూడ ఏంచుకుంట అనుకుంది పెద్దది. అదేమో కొర్రయి పెట్టుకొని చిటచిట అంటే ఇది నిజమే అని నమ్మి రోజిన్ని రోజిన్ని నువ్వులు ఏంచుకుంట బుక్కుడు పెట్టింది. ఇగ అన్నదమ్ములు అత్తరు. అటు ఇటు అనేవరకల్లా పెద్దదాని నువ్వులు మొత్తం

అయిన్ని ఒడుత్తయి. గుమ్మిలై నువ్వులు ఒడిసేవరకల్లా అయ్యో! ఎట్ల మరి అచ్చినోల్లే నా భర్త నన్నెజెత్తడో ఏందో భయానికి పిడకలు, కట్టెలు తీస్కచ్చి గుమ్మి నింపుతది. అయింత మెత్తుతది. మెత్తేసి సప్పుడేక కూసుంటది. కతం అటు ఇటనేవరకల్లా అయింత వీళ్లిద్దరు అత్తరు. అచ్చేసరికి ఏందిగ రెండు మూడ్రోజులకు వేపారానికి అత్తరు. నువ్వులు తీసుకపోను వేపారానికి. అచ్చినోల్లే అయింత చిన్నయిన ఏంజేత్తడు. నువ్వులు ఇద్దం ఆల్లకు అని చెప్పి చిన్న ఆయన గుమ్ములకెల్లి మెత్త తీసేవరకల్లా నువ్వులన్ని కొలుసుకుంట పోత్తరు జోకేటయాన. అయింత పెద్దోన్ని తీసేవరకల్లా అన్ని కట్టెలు, పిడకలు, ఇవే ఉన్నాయి. ఉన్నవోల్లే అయ్యో! ఇదేంది? గిట్ల జేసినవ్ ఏమయినయే నువ్వులన్ని అంటే మా చెల్లె బుక్కింది గద ఏంచుకొని. నేను సుతం ఎంచుకొని బుక్కిన అని చెప్పి ఇది అంటది. అన్నవోల్లే ఎక్కడ ఎంచుకొని బుక్కిందే. అగో! ఆయనది సావుకారికి జోకనేవట్టే. నువ్వేమో బుక్కిందని బుక్కి కట్టెలు, పిడకలు వెట్టి అట్టిగ మునిగితిమి గదనే అని చెప్పి అయింత పొల్లు పొల్లు కొడతడు. పొల్లుమని కొట్టినొల్లే ఎల్లి పో.. నా యింట్లనే ఉండకు. ఎల్లగొట్టేసరికి ఎమయితది. పోయి ఎక్కడనో కాళిక దేవి గుడి కల్తది. ఆ కాళిక గుడిలో ఉంటది. ఎవరున్నరని ఎక్కడికి పోవాలి అని చెప్పి ఆ గుళ్లోనే ఉంటది. ఏడుసుకుంట ఏడుసుకుంట అక్కడనే ఉంటది. ఉండేవరకల్లా ఏందిగ ఇటూ దొంగలత్తరు. ఎవ్వలచ్చిన మాట ఇనత్తంది. నను కొడతరో, సంపుతరో, ఏంజేత్తరో అని చెప్పి ఇది దాని సాటుకు విగ్రహం సాటుకు జాగుంటది. విగ్రహం సాటుకు జాక్కుంటే ఆళ్లు దేవి! మాకు బంగారం, వెండి అన్ని మస్తు దొరకనై నేను మీకు సగం వోత్త, సగం తీస్కపోతం అని చెప్పి మొక్కుతరు. అయింత ఇది ఉ.. అన్నది దీనిది ఏడుసుడే ఆళ్లకు ఊ.... అన్నట్టు అనిపించి దేవి పలుకుతుందిర అని అనుకొని ఆళ్లు మొక్కుతరు. పోతరు పోయినోల్లే మస్తు దొరుకుతది. బంగారం, వెండి మస్తు దొరికినోల్లే అయింత పట్టుకచ్చి అచ్చి ఈ గుళ్లనే ఆ నలుగురు పంచుకుంటరు. ఒక కుప్ప ఈడనే పోత్తరు. పోసినోల్లే దేవుని దగ్గర మేం బొతున్నం తల్లి అని చెప్పి పోతరు. పోయినోల్లే ఇదేమి జేత్తది. ఈల్లు పోయిర్రు ఇగ. ఈల్లు పోయినోల్లే ఇదేమి జేత్తది. అయింత లేసత్తది. లేసచ్చి దాని దగ్గర ఏమున్నది. కొంగున్లే పెద్ద కొంగుతీసి కొంగున్లే కట్టుకుంటది. పోతది పోయి భర్తని పిలుత్తది. పిలిసినోల్లే తలుపు తీయండి! ఏవండీ! అని చెప్పంటే ఇంక మల్లెందుకచ్చినవ్ ఇంకా మల్లచ్చినవ, బుద్దిలేక మల్లెందుకచ్చినవ్ అని లోల్లి పెడుతడు. లొల్లి పెట్టినొల్లే ఏవండీ! తలుపు తీయండి! అయ్యా! దండం అని చెప్పి అన్నవోల్లే తీత్తడు. తీసినోల్లే మల్ల ఏంది బంగారం, ఎండి తెచ్చినవ్ అంటే ఇగో కాళికదేవి గుళ్లో గిట్ల బంగారం, ఎండి దొంగలచ్చి

పంచుకు పోయింద్రు. నేను పట్టుకని అచ్చిన అని చెప్పి అంటది. బంగారం, ఎండి అంటే దాసుకోని ఇగ పైసలు గద కొలుద్దాం. ఎన్నయితై అన్నట్టు. ఏంజేత్తది గద. చిన్న యారాల్ని మాన్క ఇయ్యమని పోతది. మాన్క యియ్యమని పోతే ఇదేం జేత్తది గద. మాన్క అడుక్కు ఇంత పేండ మెత్తుతది. యిత్తది. యిచ్చేవరకల్లా మానుకతో కొలువంగనే కొలుత్తరు. కొలుసినంక ఆ బత్తల్ల నింపుకుంటడు. అటే ఉంచుకుంటడు. అయింత మాన్క దాన్ది దానికి యిత్త అని చెప్పి పోయేవరకల్లా అడుక్కు రూపాయి ఉంటది మాన్కకు. అక్క ఎక్కడికి పోయినవ్ ఏం తెచ్చినవ్ ఏంది. పైసలు తెచ్చినవ్ పైసలున్నయి అని అంటది. ఇది చిన్న యారాలు గిట్ల నువ్వులన్ని ఏయించుకోని బుక్కినోల్లే బావ అన్నడు. ఇంట్లకెల్లి ఎల్లగొడితే పోంగ పోంగ ఒక కాలికదేవి గుడి అచ్చింది. గుడి అచ్చినోల్లే ఏంజేయ్యాలే ఏమున్నది. ఏం లేక ఏడ్సుకుంటనే ఉన్న, ఉన్నోల్లే అయింత గిట్ల దొంగలచ్చిరు. అచ్చి దేవికి మొక్కిర్రు. మొక్కి అయింత బంగారం, ఎండి చారణా మందం ఆడ ఇచ్చి పోతం మొక్కిపోయింద్రు. మొక్కిపోయినోల్లే ఆల్లు వెళ్లి పోయినోల్లే అయింత నేను తీసుకొని అచ్చిన. ఇదేం జెత్తది గద చిన్న యారాలు నన్ను గొట్టు నేను వొయ్యి తీస్కత్త అని చిన్నది అంటది. ఎందుకే నిన్ను కొట్టుడెందుకే? నువ్వు ఏం జేసినవ్ అని కొట్టనే? అంటే మొగడంటే ఊకుండది. కొట్టు కొట్టు అంటే గిట్ల ఒక్క దెబ్బ ఎత్తడు. ఒక్క దెబ్బ ఏసినోల్లే అది సప్పుడేంక పోతది. సప్పుడేంక యిదే గుళ్లోకి వోయి అయింత గుడెనుక ఉంటది. ఉన్నవోల్లే మల్ల యిల్లే దొంగలత్తరు. అచ్చి మల్ల మొక్కి పోతరు. మల్ల పోయినోల్లే ఉ... అంటే పోతరు. పోయినోల్లే దొరుకుతది. ధనం మల్ల ధనం దొరికినట్లే మల్ల యింత కుప్పవోత్తరు. నాలుగు కుప్పలు నలుగురు పట్టుకొని పోతరు. పెయినోల్లే మల్ల ఏంజేత్తరు. పెయింద్రు గద! వీళ్లు పోయింద్రు పోయినోళ్లే ఒకడు ఏంజేసిండు. అయ్యో! కత్తి అన్నే మర్సిన కత్తి గుళ్లే మర్సి అచ్చిన. నేను కత్తి తెత్త మీరిక్కడ ఉండుర్రి అని చెప్పి ఈ ముగ్గురిని ఇక్కడనే ఉంచి అయింత ఈడు గుడికి పోతడు. పోయేవరకల్లా ఇది అక్కడ ఎత్తుకుంటది. పేగువట్టుకొని పెయింది. ఓ లుంగీ వట్టుకుంటా ఎత్తుకుంట ఉంటది. ఆహా..! మేము కాళికదేవి అనుకున్నం అని చెప్పి అనుకొని అదే చాకుతో ముక్కు కోత్తడు. దీన్ని ముక్కు కోసినొల్లే దిని నగలు తీసుకొని పోతడు. అయింత ఉన్నకాడికి గుంజుకుంటడు. సప్పుడేంక దీని ముక్కు కోత్తడు. ఎల్ల గొడతడు. అయింతవోయి భర్తను పిలుత్తది. ఏమండీ! తలుపు తీయండీ! అని నత్తి నత్తి మాట్లాడుతది. ఏమైందే యిట్ల మాట్లాడుతున్నవ్..? నత్తి నత్తి అని అంటడు. అయింత తలుపు తీత్తడు. తీసేవరకల్లా ఏందీ. పెయ్యంత రక్తమేనాయే. ముక్కు కోసి ఎల్లగొట్టిరి. నేనంటే ముందే యిన్నవ అని చెప్పి ఎందుకు

నువ్వు తప్పు చేయనిది అట్టిగ ఇది చేత్తివి. అని చెప్పి భర్త అంటడు. అన్నవోల్లే నువ్వు చెప్తే ఇనక పోతి నేను బోతి అనని చెప్పి అప్పుడు మల్ల తీస్కపోయి ముక్కు మంచిగ చేయించుకుంటడు. మల్ల మంచిగ చేయించుకుంటే ముక్కు అత్తద? ఇగ మంచిగ ఉంటరు.

## తోడి కోడల్ల 'అత్యాశ' – కథా విశ్లేషణ

ఇద్దరు తోడికోడళ్ల మధ్య జరిగిన సంఘటననే ఈ కథ. తోటి కోడళ్లకు వారి ఎదుగుదల్లో, అభివృద్ధిలో, ఉన్నతంగా బతకాలని అనుకోవడంలో పోటి తత్వం ఉంటుంది. ఆ పోటి తత్వమే ఇద్దరి మధ్య ద్వేషం, ఈర్ష్య, అసూయలకు దారి తీసి ఒకరంటే ఒకరికి గిట్టకుండా అవుతుంది. ఒకరు మరొకరిని నమ్మించి మోసం చేయాలని, ఏదొక చెడుని చేసి వారి ఎదుగుదలకు కళ్లెం వేయాలని ప్రయత్నం చేస్తుంటారు. ఆ ప్రయత్నంలో చెడ్డవారు ముందు గెలిచినట్లు అనిపించినా తరువాత ఓటమి పాలైతారు. మంచి వ్యక్తిత్వం కలిగిన వారికి మంచే జరుగుతుందని ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చు.

1. జానపదులు తమ చుట్టూ జరిగేవాటిని కథలుగా అల్లుతారు. వీరు అల్లే కథల్లో ఎక్కువగా స్త్రీలు, పిల్లల కథలు గురించినవే ఉంటాయి. మానవ సంబంధ కథల్లో అత్తకోడళ్లు, తోటికోడళ్లు, అక్క చెల్లెలు మొదలైన వారి కథలు బాగా ప్రచారంలో ఉన్నాయి. ఈ కథలో కూడా ఓర్వలేని తోటి కోడళ్లకు సంబంధించిన అంశమే కథావస్తువుగా ఉంటుంది.

2. ఈ కథలో తోటికోడళ్ళు బయటికి అనుబంధంగా కనిపించిన ఒకరికొకరికి పడదు. పెద్దామెతో పోలిస్తే చిన్నామె ఈర్ష్య, అసూయలు మరీ ఎక్కువే. అందుకే తమ భర్తలు గుమ్మిలో ఉంచిన నువ్వులను ముట్టకని చెప్పిన కూడా చిన్నామె రోజు పెనం మీద వేయించుకుని తింటున్నట్లు పెద్దామె ముందు నాటకాలు ఆడుతుంది. అది నిజమే అనుకున్న పెద్దామె తాను మాత్రం ఎందుకు తినకూడదని తాను కూడా వేయించుకొని తింటుంది. పట్టణానికి వ్యాపారం పోయి వచ్చిన వారి భర్తలు నువ్వుల గురించి ఆరా తీయగానే చిన్నామె నువ్వులు అలాగే ఉంచుతుంది. పెద్దామె నువ్వులన్ని వేయించుకోని గుమ్మి కాలిచేస్తుంది. ఈ విషయం తెలిసిన భర్త పెద్దామెను కొట్టి ఇంటి నుంచి వెళ్లగొడతాడు. కాళికమాత గుడికి వచ్చిన దొంగల పుణ్యమా అని పెద్దామెకు బంగారం దక్కుతుంది.

3. పెద్దామెకు దొరికిన బంగారం గురించి తెలుసుకున్న చిన్నామె తన భర్తకు చెప్పిన వినకుండా తనను కూడా కొట్టి ఇంటి నుంచి వెళ్లగొట్టమని అంటుంది. స్వార్థంతో వెళ్లిన చిన్నామెను గమనించిన దొంగలు

నిత్యం కాళికమాతకి వదిలేసిన ధనాన్ని, బంగారాన్ని తానే తీసుకుందని భావించి ముక్కు కోసి పంపిస్తారు. ఆ విధంగా మొదట్లో కుట్రతో పన్నాగం పన్నిన ఆమెకు దేవుడు సరిగ్గా బుద్ధి చెప్పాడు.
5. తన తోటి కోడలు ఎక్కడ తనను మించి బాగా బతుకుతుందోనని చిన్నామె అసూయపడి నువ్వులు వేయించుకొని తిన్నట్లు అబద్ధం చెప్పి పెద్దామె భర్తతో దెబ్బలు పడటానికి కారణమవుతుంది. కాని చివరకు తగిన శాస్తి జరుగుతుంది. ఒకరికి కీడు చేయాలనుకుంటే మనకే కీడు జరుగుతుందనే హితాన్ని ఈ కథ బోధిస్తుంది. యితరులకు ఉపకారం చేయకున్న ఫర్వాలేదు అపకారం చేస్తే, దాని వల్ల మనకే అపాయాలు కల్గవచ్చన్న విషయం చిన్నామె పాత్ర ద్వారా వ్యక్తమవుతుంది.

## 2.5.5.3 అత్త కోడలు వంకాయ

కైరం రమణ, బతికెన పల్లి గ్రామం, రాయికల్ మండలం.

అత్త, కొడుకు, కోడలు ఉంటారు. అయితే ముసలమ్మ ముసలితనం అచ్చింది. ముసలితనం అచ్చేసరికి ఆమెకు ఈ ముసల్ది ఎప్పుడు పోతే మంచిగుండు. ఏమైనగని వంటిపెట్టుడు గోసయితుంది. అని జెప్పి ఆమెకు గంజి మెతుకులనే పోసేది. అయితే ఆ మెతుకులు కూడా అండ్లపడకుండే చూసేది. గంజి ఆరవెట్టని అన్నం గంజి ఆంపి మాత్రమే పోసేది. ఆ సిబ్బిపెట్టి అంపుతుండే అండ్ల ఏమన్న మెతుకులు పోతున్నాయా అని చెప్పి అట్ల చేసి ఒక గంజి మాత్రమే ఇస్తే ముసల్దాని ప్రాణం దగ్గరకు వత్తుంది. ఇగ ముసల్దాన్ని ప్రాణం దగ్గరకు రాంగ అయ్యో! ఎట్లని చెప్పి ఆమె అంత విల విల లాడుతుంది. అంత నోరు సప్ప పడుతుంది. ఈ... ఏంది ఈ గంజి అని చెప్పి కొడుకు చెబుదామంటే కొడుకు పెండ్లాన్ని కొడుతడు. ఎట్ల ఆల్లకు పాపం లోల్లులు పుట్టించినట్లు అయితది. అద్దు అని చెప్పి అట్లనే ఒర్సుకుంటూ అయినగాని ఉన్నది. ఇగ ఒక రోజు ఏమైతది వంకాయలు కోత్తుంది. ముసలమ్మకు బుద్ధి పుడుతది. ఏం కూర అండుతున్నవే కోడలా..? అంటే వంకాయ కూర అని చెప్తది. అబ్బ! అంకాయ కూర అండితే అంకాయ యేసి కొద్దిగా అన్నం పెడతవానే? అని అంటది. అంటే లంజ ముసలిదానవ్! నీకు అంకాయేసి నీకు అన్నం బెట్టుమంటవానే? అని ఆ అంకాయను తీస్కచ్చి నోట్ల కుచ్చుతది. నోట్ల కుచ్చేవరకల్ల ముసలమ్మకు నడుమ గుండిగల తట్టుకుంటది. అటువోక ఇటువోక మొసల్లేక పడిపోతది. పడిపోయినంక అయ్యో! మా అత్త చచ్చిపోయింది. మా అత్త సచ్చిపోయింది. అంత వాడకట్టుకు అందరిని పిలుసుకత్తది. పిలుసుకచ్చిన తరువాత ఇగ కొడుకు అచ్చే. అయ్యో! ఎట్ల సచ్చిపోయిందంటే దానిచ్చి అదే సచ్చిపోయింది. అన్నంక ఇగ ఆమెకు ప్రాణమున్నదిగని చెప్ప తరము

అయితలేదు. పడిపోయింది. ఇగ తీస్కపోదాం అని చెప్పి కొంతమంది కులాల్ల ఆడవారు కాటికాడికి పోరు. ఆడవాళ్లు అందరు ఇక్కడనే ఉంటరు. మగవాళ్లంతా తీస్కోని పోతుర్రు. పోంగ పోంగ మార్గ మధ్యంలో పోయేసరికి అక్కడ గుండిలోని అంకాయ లోపలికి జారుతది. గుండి లోపలికి అంకాయ జారి ముసలమ్మ కూసుంటది. అంకాయల మన్నువడ అబ్బ! అంకాల మన్నువడ అంకాయలు ఇంత పసిజేసింది. అరె ముసలమ్మ లేసిందిరా అన్నంక ఏమయ్యిందే అవ్వ అన్నంక గిట్ల సంగతిరా.. నీ పెండ్లాం ఏమయ్యినగని గంజినీళ్లు పోస్తుంది. ఎనిమిది రోజుల నుంచి ఇగ అంకాయ కూర ఎయ్యిమని అడిగినందుకు అంకాయ తీసుకోని నోట్లో కుచ్చింది రా కొడుక! అన్నవోల్లే అట్లనా ఇగ నీవ్వ బంచోతు! నువ్వు మనం తోటలనే ఉందాం అగు ఆ తోటలో మంచిగ గుడిసే ఏత్తరు. అవ్వ! నువ్వు ఇక్కడనే ఉండూ అక్కడికి రాకే.. అని చెప్పి ఇళ్లందరికి చెప్తడు. దాని సంగతి నేను చెప్తగని కాలేసినం అని చెపుదాం. ఇంటికాడ అంటే మంచిదని చెప్పి ఇగ ఆళ్లందరు అత్తరు. ఆడకట్టోళ్లు అందరు అచ్చినంక ఆమెకు ముసలమ్మకు ఇక్కడ గుడిసే ఏత్తడు. మంచిగ అరుసుకుంటడు. కాలేసిర్రా? కాలేసినం అయి పోయిందే మరీ దినాలు ఎప్పుడట? చేద్దాముల్ల ఇగ దినాలు రేపే చేద్దాం అని. అంటే మరి మావోళ్లకు చెప్పు. గంగవుతల మావోళ్లు ఉన్నరు. మా వోల్లకు మా అక్కకు, మా బావకు, మా చెల్లె, మా మరిదికి, మా నాన్నకు, మా అవ్వకు మావోళ్లందరికి చెప్పు మా వోళ్లందరిని రమ్మను. ఏ మంచిది చెప్తనే. పోతున్న అటే పోతున్న అన్నంక, పో పోయినంక అందరిని తోలుకొని రా.. అని చెప్పి పోతడు. గిట్ల మా అవ్వ సచ్చిపెయింది. దినకర్మ ఉంది రాల్లి అంటే మరీ గంగ బాగా పారుతుంది. గంగల మాకు రారాదు గదా అని చెప్పి ఆళ్లు అంటరు. ఏ నువ్వు రాల్లి అట్లంటి పది గంగళ్లు ఉన్నగని నేను ఉన్న గద! మిమ్మల్ని తీస్కపోత రండ్రి అన్నంక అందరు అత్తరు. అందరు అచ్చినోల్లె నడి గంగలకు అచ్చిన తరువాత నీళ్లు బాగా అత్తయి. నీళ్లు బాగా అచ్చేసరికి ఇగో మొలదారం పట్టుకోన్రి అని చెప్పి మొలదారని మనిషికోళ్లు, మనిషికోళ్లు అందరు లైను ఎనుక పడుతరు. పడ్డంక నడి గంగలకు అచ్చాక మొలదారాన్ని పుట్టుక్కని తెంపేత్తడు. అందరు తెప్పకు తెప్ప పోతరు. తెప్ప తెప్పకు పోయినంక ఇగ ఇంటికి అత్తడు. ఇంటికి అచ్చినంక అత్తుళ్లు మా వోళ్లు. అంటే ఏ! మీ వోళ్ళు అత్తుర్రే! అన్నంక మరీ అయ్యో! ఆడకట్టోళ్లు అందరిని పిలిచి జల్ది ఎల్లగొడదామని ఎందుకంటే మా వోళ్లు అందరిని మంచిగ అరుసుకోవాలని ఆ ఆడకట్టోళ్ళందరిని పిలుత్తది. పిలిచి ఇగ "అంకాయ అంకాయ అసుక్కు అత్త పానం గుసుక్కు..... అంకాయ అంకాయ అసుక్కు అత్తపానం గుసుక్కు" అని చెప్పుకుంట అంకాయ

కూర వేసుకుంటా ఉత్సహంగా మంచిగ ఏస్తుంది. అయితే వీడు ఏంజేత్తడు. "నూనె బుడ్డి గుసుక్కు మీ వోళ్ళంతా గసుక్కు, నూనె బుడ్డి గుసుక్కు మీ వోళ్లంతా గుసుక్కు" ఏందిల్లా గట్ల అంటున్నవ్. నా వోళ్లంతా గుసుక్కు అంటునవ్ అంటే మరీ ఏం జేసుడు. అక్కడ పెద్ద ఆగు అచ్చింది. మన గంగచ్చింది. అండ్ల కొట్టుకొని పోయింద్రు. మీ వోళ్లు అందరు. నేను ఏం జేయ్యాలి. అన్నంక లబ్బ లబ్బమని మొత్తుకుంట అటు పోతది.

## అత్త కోడలు వంకాయ – కథావిశ్లేషణ

ఒక కుటుంబంలో అత్త, కొడుకు, కోడలు ఉంటారు. అత్త వయస్సు మీద పడి రోజు రోజుకు సత్తువలేకుండా కోడలు పెట్టే ముద్ద తినుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ కథలో ముసలితనానికి వచ్చిన అత్తను కోడలు బాగా చూసుకోదు. తన భర్తకు తెలియకుండా ఉంచుతూ అత్తకు సరిగ్గా అన్నం పెట్టదు. అత్త పోషణకు గంజిని మాత్రమే పోసి అన్నం పెడుతున్నట్లు భర్త ముందు ఏమార్చుతుంది. కోడలు తనను బాగా చూసుకోలేదని కొడుక్కు చెబుదామని అనుకున్న తల్లిగా కొడుక్కు, కోడలుకు మధ్య తగాదాలు ఎందుకని తన గుండెలో బాధను దాచుకుంటుంది. కోడలు పోసిన ఆ కాస్త గంజిని తాగి కాలం వెల్లదీస్తుంది. అలా కొద్ది రోజుల తర్వాత వంట చేస్తున్న కోడలిని ఏమి వంట చేస్తున్నావని అడుగుతుంది. దానికి కోడలు వంకాయ కూర చేస్తున్న అని చెపుతుంది. రోజు మెతుకులు లేని గంజి తాగి నిరసించి పోయిన అత్త కొద్దిగా వంకాయకూరను వేయమని అడుగుతుంది. దానికి కోడలు కోపంగా వచ్చి ముసలిదానివి నీకు వంకాయకూర కావాలా? అని ఆగ్రహంతో ఒక వంకాయను తెచ్చి అత్త నోట్లో కుక్కింది. ఆ వంకాయ అత్త నోటిలోకి పోకుండా, బయటకు రాకుండా గొంతులో చిక్కుకొని ఊపిరి ఆడకుండ అయి స్పృహ కోల్పోతుంది. దాంతో అత్త చచ్చిందనుకొని ఆ వీధి వాళ్లందరిని పిలిచి తన అత్తకు సహజ మరణం సంభవించినట్లు తెలియజేస్తుంది. తర్వాత పాడిని సిద్ధం చేసి స్మశానానికి తీసుకుపోతుండగా గొంతులో చిక్కుకున్న వంకాయ నోట్లోకి జారి అత్త ప్రాణంతో లేచి కూర్చుంటుంది ఆడవారు స్మశానానికి రాకూడదనే నియమం వల్ల కోడలు ఇంటి దగ్గరనే ఉండి అత్త పని పూర్తయింది అనుకుంటుంది. మార్గం మధ్యలో లేసిన అత్త జరిగినదంతా కొడుక్కి వివరిస్తుంది. కొడుకు భార్య మీద కోపంతో ఊగిపోతాడు. వారి తోటలోనే తన తల్లిని ఉంచి బాగా చూసుకుంటాడు. తరువాత తన వెంట వచ్చినవారికి ఈ విషయం చెప్పవద్దని, ఇంటికెళ్లి తన భార్యతో తన తల్లి దహనకార్యాలను ముగించినట్టు చెబుతాడు. ఆ విషయానికి సంతోషించి దినకర్మని చేయాలని, తన పుట్టింటివాళ్లను

పిలిచి అన్ని రకాల పిండివంటలను పెట్టాలని భార్య భర్తతో చెబుతుంది. దానికి భర్త అందరిని పిలుస్తానని చెప్పి అత్తగారింటికి వెళ్లి బంధువులందరిని గోదావరి దాటించే క్రమంలో నీటి పారుదల వైపు వదిలేసి ఇంటికి వస్తాడు. ఇంటికి రాగానే వీధిలో వారందరికి భోజనం, పిండివంటలు వడ్డిస్తున్న భార్య "అంకాయ అంకాయ అసుక్కు అత్త పానం గుసుక్కు" అంటూ వడ్డిస్తుంది. అది విని భర్త "నూనె బుడ్డి గుసుక్కు మీ వోళ్ళంతా గుసుక్కు" బదులుగా సమాధానం ఇస్తాడు. తన భర్త అలా ఎందుకు అంటున్నాడని అడుగుతుంది. అప్పుడు తన భర్త మీ ఇంటివారందరిని గోదావరి దాటిస్తున్నప్పుడు అందరు గోదావరిలోనే కొట్టుకుపోయారని చెబుతాడు. తన తల్లిని చంపాలనుకున్న భార్యకు తన వాళ్లను దూరం చేసి బుద్ధి చెప్తాడు.

1. ఈ కథ సహజంగా అత్త, కోడళ్ల మధ్య వివాదాన్ని తెలియజేస్తుంది. ప్రాచీన కాలంలో కుటుంబంలో అత్త పెత్తనం ఉండేది. అత్త చెప్పినట్లే కోడలు నడుచుకోవాలి. ఈ పద్ధతి ఉమ్మడి కుటుంబాలు ఉన్నంత వరకు కొనసాగేవి. ఎప్పుడైతే చిన్న చిన్న కుటుంబాలుగా వీడిపోయయో కోడళ్ళకు అధికారం వచ్చింది. దానితో పాటు అత్తలను నిర్లక్ష్యం చేయడం అలవడింది. ఉమ్మడి కుటుంబాలకు, వేరుపడ్డ కుటుంబా లకు మధ్య ఈ వ్యత్యాసం స్పష్టంగా మనకు అగుపిస్తుంది.

2. తల్లిదండ్రులను, అత్త మామలను భారంగా చూసే కుటుంబాలను హెచ్చరిస్తున్నట్లు అనిపిస్తుంది. స్త్రీ తన తల్లిదండ్రుల దగ్గర పెరిగి పెళ్ళి చేసుకున్న తరువాత అత్తగారిని తల్లిదండ్రులతో సమానంగా చూసుకోవాలి. కాని ఈ కథలో అత్తగారికి అన్నం పెట్టడానికి గంజిని మాత్రమే పోసి తల్లిలాంటి అత్తను పస్తులు ఉంచుతుంది. సమాజంలో మెట్టినింట బంధువులను ద్వేషిస్తూ, పుట్టింటి బంధువులను మాత్రమే తన బంధువులుగా చూసే అలవాటు చాలా మంది స్త్రీ మూర్తులలో తారసపడుతుంది. ఈ కథలో కోడలు కూడా అదే కోవకు చెందింది. కాబట్టి తనవాళ్లను అందరిని పిలిచి బాగా చూసుకోవాలని అనుకుంటుంది.

3. ఈ కథలో "అంకాయ అంకాయ అసుక్కు అత్త పానం గుసుక్కు" అని కోడలు చెబుతూ వంకాయ కూరను అందరికి వడ్డిస్తూ సంతోషాన్ని వ్యక్తం చేస్తుంది. ఆ సంతోషంలో ఇప్పటి నుంచి అత్తను చూసుకోవాల్సిన భారం తనకు తప్పిందని సంతోషపడుతుంది. ఆ విషయాన్ని గమనించిన భర్త తాను కూడా తనకు ఎలా బుద్ధి చెప్పాడో తెలియడానికి "నూనె బుడ్డి గుసుక్కు మీ వోళ్ళంతా గుసుక్కు, అంటూ వాక్యాన్ని పూరిస్తాడు. ఆ వాక్యం అంతరార్థాన్ని గమనించి అడిగి తన వాళ్లందరు గోదావరిలో

కొట్టుకుపోయిన విషయాన్ని తెలుసుకొని బాధ పడుతుంది. ఈ విధంగా తన వాళ్లమీద తనకెంత మమకారం ఉందో తన భర్తకు కూడా తన తల్లి మీద మమకారం ఉంటుందనే విషయాన్ని ఈ కథ ధ్వనింపజేస్తుంది.

## 2.5.5.4 అక్కెమ్మల కథ

తాటికాయల పుష్ప, దొంకెశ్వర్ గ్రామం, ధర్మపురి మండలం

ఒక కాపోల్ల అక్కెమ్మ, ఒక కోమటోళ్ల అక్కెమ్మ, బావనోళ్ల అక్కెమ్మ. వీళ్లు ముగ్గురు అడ్లు దంచుకుంట ఉంటరు. ఆ ఊరిని ఏలే రాజు. రాజు వెంబడి పతాని అట్ల పోతరు. పోయినోల్లే అయింత ఒక బావనోల్ల అక్కమ్మ ఏమంటది గదా? అట్ల పోయే రాజు నన్ను పెళ్లాడితే నేను అరవై ఆరు దేవుళ్లకు ముగ్గ గోడలకు కొట్టి అండ్ల గింత మిగిలిత్త అంటది. కోమటోళ్లక్కమ్మ అట్ల పోయే రాజు నన్ను పెళ్లాడితే అరచేయి గుంటెడు అరసోడు అవపిండి ఆరవై ఆరు కూరలు అండ్ల గొంతంత మిగిలిత్తనని ఆమె అంటది. ఇగ కాపోళ్లక్కమ్మ ఏమంటందంటే అట్ల పోయే రాజు నన్ను పెళ్లాడితే మూప్పయారు బాలలను ముందు కంట అటెనుక ఒక్క ఆడపిల్లను కంట నేను అని అంటది. ఈ ముగ్గురు మాటలు రాజు ఇంటుండు. ఇంటికి పోయి పతానితో మాట్లాడి ఈ ముగ్గురిని పిలిపిచ్చి పెండ్లి చేసుకుంటడు. మంచిగ ఆకాశమంత పందిరి బూదేవంత గద్దెత్తడు. జాములు కొట్టిత్తడు. మల్లెలు కట్టిత్తడు. గద్దెలేసి పెండ్లి ఆడుతాడు. కోమటోళ్లక్కమ్మ పిలిపిత్తడు. నువ్వు ఆరవై ఆరు గోడలకు ముగ్గేసి అండ్ల కొంత మిగిలిత్తన్నవ్? అరచేయి గుంటడు నువ్వు అండ్ల ఏం మిగిలిత్తవ్? అని అంటడు. ఆమె మిగిలిత్తది. బావనక్కమ్మ పిలిసి ఆరవై కూరలు అండి అండ్ల మిగిలియి అంటడు. ఆమెను అన్నవోల్లె ఆమె మిగిలిత్తది. ఇగ ఈమెను 36 బాలలను ముందుకని అటెనుక చక్కని ఆడపిల్లను కంట అన్నవ్. ముగ్గురిని చేసుకోని ఎవరి మహల ఆళ్లకుంచుతడు. ఎక్కడొళ్లక్కడ ఉంచుతడు. అయితే ముగ్గురు భార్యలు రాణిలు రాజు పతాని వేరే రాజ్యానికి పోతడు. బావనోళ్లక్కమ్మ, కోమటోళ్లక్కమ్మ ఇద్దరు పిల్ల తల్లియైన కాపోళ్లక్కమ్మను చూసుకుంట ఉండాలి. ఆళ్లు ఏం చేత్తరు గదంటే 36 పిల్లలను తొక్కుడు బండ కింద పెడతారు. ఈ ఆడపిల్లని కూడ పెడతరు. మన మగడు ఆమెను మెచ్చుకోవద్దని పిల్లలను కన్నదని మనకి ప్రేమ ఉండదని కుట్ర చేస్తరు. ఈ పిల్లలు గడుసు పిల్లలు ఎక్కడ పెట్టిన చస్తలేరు. చెట్టు కింద, బొంద పెట్టిన బయటకచ్చి ఆడుకుంటుర్రు. పిల్లలను ఎక్కడ వెట్టినా చావరు. మల్లె చెట్లల్ల బొంద పెడతరు. అక్కడికి తమ్మళ్ల ముసలోడు అత్తడు. రాణిలకు దండల్లల అల్లి కాపోళ్లక్కమ్మ కాడికి తెత్తరు.

కాపోళక్కమ్మకు ఈ పిల్లలు పుట్టిన విషయం తెల్వదు. ముందు ముప్పయారు బాలలు పుడితే మూత్యాల వాన కొడతది. అటెంక ఆడపిల్ల పుడితే పగడాల వాన కొడతది. ముందే చెప్తది రాజుకి. ఈ పిల్లలు ఎట్లట్ల పుడితే అట్లట్ల రాజు దగ్గర వాన కొడతదని చెప్తది రాణి. నాకు భార్య పిల్లలు అయితరని తెలుస్తది. ఈ పిల్లలను సవుతులు ఇట్ల చేస్తరు. ఈ పిల్లలను తమ్మళ్ల ముసలోడు పెంచుతడు. పతాని రాజుకి ఇంటికి వెళదామని చెప్తడు. ఇంటికే వెళ్లేసరికి కోమటోళ్లక్కమ్మ, బావనోళ్లక్కమ్మ ఏం చేత్తరు గద! కాపోళ్కక్కమ్మకు పిల్లలు కాలేరని చెప్తరు. సరే మీరిద్దరు ఇలా నిర్ణయించారు. ఆమెను అంతం చేసుడే అని అంటడు. ఈయన వేటకు పోయినకాడే కండ్ల పడతరు పిల్లగాలు. ఈ పిల్లలు నా పిల్లలు అని తెలుసుకొని దగ్గరకు తీసుకుంటడు. కోమటోళ్లామెను, బావనోళ్లామెను సున్నబోట్లు, గుండు కొరిగించి మూడు బజార్ల కాడ బొందవెట్టి బుద్ధి చెప్తరు. పిల్లలను దగ్గరకు తీసుకుంటడు.

## అక్కెమ్మల కథ – కథావిశ్లేషణ

మూడు కులాలకి చెందిన ముగ్గురు స్త్రీలు ఒక రాజు మీద వ్యామోహంతో వారికున్న పనితనాన్ని, ప్రతిభని చూపించాలని అనుకుంటారు. వాళ్లు కోరుకున్న ప్రకారమే రాజు వారిని వివాహం చేసుకుంటాడు. వివాహానంతరం వారికున్న పనితనాన్ని, ప్రతిభని రాజుకు చూపించి వారి నిజాయితీని నిరూపించుకుంటారు. మొదటి స్త్రీని రాజు వివాహం చేసుకుంటే దేవుని గుళ్లకు ముగ్గు వేస్తానని నిరూపించుకుంటుంది. రెండో స్త్రీ ఆరవై ఆరు కూరలు వండి తన పనితనాన్ని నిరూపించుకుంటుంది. ముడో స్త్రీ కూడా 36 బాలలను ముందు కని తరువాత ఒక బాలికను కని నిరూపించుకుంటుంది. కాని ముగ్గురిలో మొదట వివాహం చేసుకున్న ఇద్దరు స్త్రీలు మూడో స్త్రీ పై కక్ష్య కడతారు. రాజు ముందు ఆమెను ఎలాగైనా ఓడించాలని భావిస్తారు. మంచివారికి దైవం వెన్నంటే ఉన్నట్టు మూడో స్త్రీ పిల్లలు రాజు కంటపడి రాజుకు పుట్టిన పిల్లలుగా గుర్తించబడతారు. అసలు నిజం తెలుసుకున్న రాజు మిగతా ఇద్దరిని శిక్షిస్తాడు.

1. పూర్వం రాజుల కాలంలో బహు భార్యత్వం సహజంగా ఉండేది. అందుకే ఈ కథలో ముగ్గురు స్త్రీలు కూడా రాజుని కోరుకోవడం కనిపిస్తుంది. స్త్రీలు రాజు ముందు తమకున్న ప్రతిభని చూపించుకునేనారు. రాజుని ఆకట్టుకుని వివాహం చేసుకోవడంలో పోటిపడేవారు. రాజుకు భార్యగా ఉంటే సర్వ భోగ విలాసాలను అనుభవించ వచ్చునని వారికి చాలా ఆశగా ఉంటుంది.

2. స్త్రీకి మరో స్త్రీయే శత్రువు అనే నానుడి ఈ కథకు సరిగ్గా సరిపోతుంది. రాజు మొదటి ఇద్దరు భార్యలు కలిసి మూడో భార్యను రాజు నుండి దూరం చేయాలనుకుంటారు. సవతుల మధ్య ఉన్న ఈర్ష్య అసూయలే కథావస్తువుగా చిత్రించబడింది.

3. రాజు మూడో భార్య ఇంటికి దగ్గర ఎట్లేట్ల 36 బాలల ప్రసవం జరుగుతుందో వేటకు వెళ్లిన రాజు దగ్గర వర్షం పడుతుందని ఆకాశవాణి రూపంలో తెలుస్తుందని కథకురాలు కథని అల్లింది. వాస్తవానికి అతీతంగా ఉన్న ఈ కథ జానపదుల ఊహాత్మకతకు అద్దం పడుతుంది.

4. బావనొళ్లక్కమ్మ ముగ్గులేయడం, కోమటోళ్లక్కమ్మ అరవై కూరలు వండి పెట్టడం, కాపొళ్లక్కమ్మ పిల్లలను కనడం మొదలైన అంశాలు నాటి సామాజిక వ్యవస్థలో ఆయా వర్గాల వారికున్న వృత్తి ప్రాధాన్యతను వివరిస్తుంది. ఈ కథ నాటి నుంచి నేటికి బ్రాహ్మణులకు పూజల మీద, వైశ్యులకు వ్యాపారం మీద, కాపులకు వ్యవసాయం మీద గల మక్కువని వివరిస్తుంది.

## 2.5.6 మహాభారతానికి సంబంధించిన కథలు

## 2.5.6.1 పంచపాండవుల కథ

తూటికూర్ల పార్వన్న, వర్షకొండ గ్రామం, ఇబ్రహింపట్నం మండలం.

పంచపాండవులందరు అడవిలోకి వెళ్లినప్పుడు ఆ అడవిలో ఒక జింక అరణ్యమంత కొమ్ములను పెట్టుకొని పోతుందట. అడవిల ఉన్న ఒక మహర్షి పాండవులను ఆ కొమ్ములు ఉన్న జింకను పట్టి ఇవ్వండని ఆ మహర్షి పాండవులను అడిగిండు. అడిగితే అప్పుడు పాండవులు అందరు ఆ జింక వెంబడి పరుగెత్తారు. ఎంత పరిగెత్తిన గాని ఆ జింక పాండవులకు దొరక్కుండా వెళ్లిపోయింది. అప్పుడు పాండవులందరు దమ్ముకచ్చి ఒక వృక్షం కింద కూర్చున్నరు. ధర్మరాజు తన తమ్ముడైన నకుల్లున్ని ఈ వృక్షం ఎక్కి ఎక్కడ సరోవరం నీటి బావి ఉన్నది అని చూడమన్నడు. ధర్మరాజు అప్పుడు నకులుడు ఆ వృక్షం పైకి ఎక్కి సరోవరం ఎక్కడ ఉన్నదని చూస్తుండగ. ఒక ప్రాంతం దగ్గర సరోవరం కనిపిచ్చిందని నకులుడు ధర్మరాజుకు చెప్పాడు. పాండవులలో అందరి కంటే చిన్నవాడు సహదేవుడు నీళ్లను తీసుకోని వస్తాను అని వెళ్లాడు. సహదేవుడు సరోవరం దగ్గరకు వెళ్లాడు. నేను కొన్ని నీటిని తాగి మా అన్నయ్యలకు తీసుకొని వెళతాను అని అనుకొని సహదేవుడు సరోవరంలోకి దిగి నీటిని తాగబోయాడు అప్పుడు ఆ నీటి దేవత ఓ సహదేవుడా! నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పి నీటిని తాగు అని చెప్పింది. సరే కొన్ని నీల్లు తాగి తర్వాత చెప్త. అని సరోవరంలో ఉన్న నీల్లను తాగాడు. సహదేవుడు తాగి

సరోవరం ఒడ్డుకు పడిపోయాడు. ఇంతవరకు సహదేవుడు రాకపయే అని ధర్మరాజు నకులున్ని చూసి రమ్మని పంపుతాడు. అప్పుడు నకులుడు సరోవరం దగ్గరకు వెళ్లాడు. ఆ సరోవరం ఓడ్డున ఉన్న తమ్ముని చూసి ఆశ్చర్యపోయాడు. నకులుడు సరె అని నీళ్లను తాగుతా అని సరోవరంలో నీటిని తాగబోయాడు. అప్పుడు కూడా సరోవరంలో ఉన్న నీల్లు నకులుడు దేవసేన అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వలేకపోతే నీవు కూడా నీ తమ్ముని బాగా పడిపోతావు అని అన్నది. దేవత సరోవరంలో ఉన్న నీళ్లు. సరె కొన్ని నీల్లు తాగినంక నీకు ప్రశ్నకు సమాధానం చెప్పుతాను అని నకులుడు సరోవరంలో ఉన్న నీళ్లను తాగాడు నకులుడు కూడా సరోవరం ఒడ్డున పడిపోయాడు. ఎంత సమయం అయినగాని నకుల సహదేవులు ఇద్దరు రాలేదు. అన్నయ్య ధర్మరాజా! నేను వెళ్లి నీటిని తీసుకోస్తానని అర్జునుడు ధర్మరాజు దగ్గర సెలవు తీసుకొని సరోవరం దగ్గరికి వెళ్లాడు. అర్జునుడు వెళ్లి సరోవరం ఓడ్డున పడిన నకుల సహదేవులను చూసి అర్జునుడు ఆశ్చర్యపడ్డాడు. ఓరి! అర్జునుడా! నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పి నా నీటిని ముట్టు అని అర్జునికి నీటి దేవత ప్రశ్న వేసింది. అర్జునుడు సరె మంచిది అని కొన్ని నీటిని తాగినంక నేను నీవు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పుతానని అర్జునుడు కూడా సరోవరం ఓడ్డున పడిపోతాడు. భీముడు అన్నయ్య ధర్మరాజా ఉన్న ముగ్గురు తమ్ముల్లు అటే వెళ్లారు. నాకు నీవు సెలవిస్తే నేను వెళ్లి నీటిని తీసుకొని తెస్తాను అని ధర్మరాజు దగ్గర సెలవు తీసుకొని భీముడు సరోవరం దగ్గరకు వెళ్లాడు. సరోవరం ఒడ్డున ఉన్న ముగ్గురు తమ్ములను చూసి భీముడు కూడా ఆశ్చర్యపోయాడు. అరె ఎవరు వచ్చిరి నా తమ్ములను ఎవరు చంపిల్లు? అని భీముడు అగ్రకాంతుడు లాగా మండిపోతాడు. సరె కొన్ని నీళ్లు తాగినంక వారి సంగతి చూస్తాను అని సరోవరంలోకి దిగుతాడు. ఓరి భీమసేన నా ప్రశ్నకు సమాధానం చెప్పి నా నీటిని ముట్టు త్రాగు అని నీటి దేవత అన్నది. నీటి దేవత మాటలు వినిపించుకోక సరోవరం నీళ్లను ముట్టబోయి పడిపోతాడు. చివరకు నాలుగురు తమ్ముళ్లు వెళ్లి ఇంతవరకు రాలేదు. నేను వెళతాను అని సరోవరం దగ్గరికి వెళతాడు. ధర్మరాజు సరోవరం ఒడ్డున నలుగురు తమ్ములను చూసి ధర్మరాజు కూడా ఆశ్చర్యపోతాడు. సరె నా తమ్ములకు శరీరం పైన గాయాలు కూడా లేవు ఏమైనది ఏమిటి? ఈ మయా అని ధర్మరాజు అనుకున్నడు నీటి దేవత వచ్చి ఓరి ధర్మరాజా! నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండానే సరోవరంలో ఉన్న నీటిని త్రాగాబోయి సరోవరం ఒడ్డున పడిపోయారు. ఓ నీటి దేవత నీవు నన్ను అడుగు ప్రశ్నలు నేను సమాధానం చెప్పుతాను అన్నడు. ధర్మరాజా! నీటి దేవతతో అప్పుడు నీటిదేవతా ధర్మరాజును రెండు ప్రశ్నలు అడిగింది. ఒకటి ఆకాశం

కన్నా గొప్ప ఎవరు అని నీటి దేవతా అడిగింది. అప్పుడు ధర్మరాజు కన్నతండ్రి అని నీటి దేవతకు సమాధానం చెప్పాడు. భూదేవి కన్న గొప్ప ఎవరు అని నీటి దేవత అడిగింది. అప్పుడు ధర్మరాజు భూదేవి కన్న గొప్ప కన్న తల్లి అని సమాధానం చెప్పాడు. నీటి దేవతా ఓ ధర్మరాజా నీ ధర్మాన్ని మెచ్చిన నీ సమాధానానికి మెచ్చిన తమ్ముల్లను లేపి బతికిస్తాడు. నీవు ఎవరు నాకు తెలియాలని ధర్మరాజు నీటి దేవతను అడిగాడు. అప్పుడు నీటి దేవత ధర్మరాజా నీ ధర్మాన్ని పరిక్షించడానికి నేను సరోవరంలో నీటి దేవతయై అత్తే నువ్వ్ నీ ధర్మాన్ని పరిక్షించాను. నేను యమ ధర్మరాజుని! నీవు నా అంశతో జన్మించావు అని చెప్పి తన తమ్ముళ్లను బతికిస్తాడు యమధర్మరాజు. ధర్మరాజును నీవు ఏమి కోరుకుంటావో కోరుకో అని అడిగాడు యమధర్మరాజు. అప్పుడు ధర్మరాజు నాకు ఏమద్దు ఓ యమ ధర్మరాజా! ఒక మహర్షి కొమ్ములున్న జింకను చూపించి నాకు ఆ జింకను తీసుకొని రమ్మని చెప్పాడు. మహర్షి ఆ మహర్షి చెప్పిన మాటను విని మేము తీసుకోస్తాము అని ఆ మహర్షికి మాట ఇచ్చాము దాని మేము తీసుకరాలేక పోయినము. నాకు ఆ కొమ్ములన్న జింకను అందజేయాలి. యమధర్మరాజా! అని ధర్మరాజు అడిగిండు. అప్పుడు యమధర్మరాజు ఓ ధర్మరాజా! ఆ జింకను నేనే సరోవరాన్ని నేనే నీవు మహర్షి మాట నిలబెట్టుకుంటావో? లేదో? అని పరీక్షించడానికి వచ్చాను అని యమధర్మరాజు ధర్మరాజుకు చెప్పాడు.

## పంచపాండవుల కథ – కథావిశ్లేషణ

పాండవుల ధర్మపరిరక్షణను పర్యవేక్షించడానికి యమధర్మరాజు నీటి దేవత రూపంలో వచ్చి పంచపాండవులను ప్రశ్నలు అడగటం ఈ కథలో ప్రధానాంశం. ముఖ్యంగా తల్లిదండ్రుల గొప్పతనాన్ని వర్ణించడానికి ఆకాశం, భూమిల పోల్చి చూపడం ఈ కథలో ప్రత్యేకంగా కనిపిస్తుంది. వనవాసంలో ఉన్న పంచపాండవులకి ఒక రోజు అరణ్యంలో ఉంటూ మహర్షి ఎదురుపడతాడు. ఆ అడవిలో ఉన్న పెద్ద కొమ్ముల జింకను పట్టించమని పంచపాండవులను కోరతాడు. ఆ మహర్షి కోరిక మేరకు ఆ అడవి అంతా తిరిగి దాహం వేసి అలసిపోతారు. నీటి గుంట కోసం చెట్టు ఎక్కి చూసిన నకులుడికి నీటితో నిండి ఉన్న ఒక సరోవరం కనిపిస్తుంది. మొదట నీటిని తీసుకురావటానికి వెళ్లిన సహదేవుడు నీటి దేవుని రూపంలో ఉన్న యమధర్మరాజు మాట వినకుండానే నీటిని తాకి స్పృహ తప్పిపోతాడు. ఆ తరువాత నలుగురు తమ్ములు నీటి గుంటకి వెళ్లిన తిరికి రాకుండానే దప్పికతో నీటిని తాకుతారు. అప్పుడు యమ ధర్మరాజు మాయతో స్పృహ తప్పి సొమ్మసిల్లిపోతారు. చివరగా నలుగురు తమ్ముళ్లకు

ఏదో జరిగిందని నీటి గుంట దగ్గరకు వెళ్లి ధర్మరాజు ఇదంతా ఏదో మాయ అని గ్రహిస్తాడు. అప్పుడు నీటి దేవత రూపంలో ఉన్న యమ ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పి తన తమ్ముళ్లను విడిపించుకుంటాడు. ఈ ప్రపంచంలో భూమాక్యాశాల కన్న గొప్పదేదని యమధర్మరాజు ధర్మరాజుని అడుగుతాడు. లోకంలో తల్లిదండ్రులే భూమి, ఆకాశాల కన్న గొప్పవారని సమాధానం చెప్పి యమధర్మరాజుని ఆశ్చర్యపరుస్తాడు. ధర్మరాజు ధర్మత్వానికి మెచ్చి తన తమ్ముళ్లకు స్పృహ తెప్పించి ఆ జింకని నేనే, ఈ మాయ నీటి గుంట నా మాయే అని చెప్పి వెళ్లి పోతాడు. మహాభారతంలో యక్ష ప్రశ్నల్లో రెండు ప్రశ్నలు గ్రహించి ఈ జానపద కథ కల్పించబడిందని చెప్పవచ్చు.

1. యమధర్మరాజు అజాత శత్రువైన ధర్మరాజుని పరీక్షించడానికి వచ్చి తల్లిదండ్రుల గొప్పతనాన్ని వర్ణింపజేసిన కథ. విశ్వమంతా వ్యాపించిన ఆకాశం మనల్ని నిత్యం రక్షిస్తూ నీడలా తోడు ఉంటుంది. అలాగే మన నిండు జీవితాన్ని తీర్చిదిద్దడంలో నిత్యం తోడుగా నిలబడే తండ్రిని ఆకాశంతో పోల్చడం విశేషం. ఓపిక, త్యాగానికి పెట్టింది పేరైనా తల్లిని భూమితో పోల్చడం కూడా మరో విశేషం. ఈ కథలో తల్లిదండ్రుల మనస్తత్వాన్నీ, గొప్పతనాన్నీ, ప్రత్యేకతను చాటడానికి ముఖ్యంగా పిల్లల దగ్గర నుంచి పెద్దల దాకా పునఃస్మరించుకోవడానికి ఈ కథ ఎంతో దోహదపడుతుంది.

2. తల్లిదండ్రులను విస్మరించే నేటి సమాజానికి ఇలాంటి కథల ఆవశ్యకతను గుర్తు చేసే కథ. మన అమ్మమ్మలు, తాతయ్యలు నాడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో ఇలాంటి కథలు చెప్పి పిల్లలకు పెద్దల పట్ల గౌరవాన్ని, అభిమానాన్ని నింపేవారు. కాని ప్రపంచీకరణ, అత్యాధునిక పాశ్చాత్య నాగరికత, సంస్కృతిలో కొట్టూమిట్టాడుతున్న నేటి సమాజానికి, కుటుంబాలకు, పిల్లలకు ఇలాంటి నైతిక, మానవీయ విలువలు తెలిపే కథలు కథనం చేసేవారు లేరని చెప్పాలి.

## 2.5.6.2 పాండవుల కథ

సల్కం గంగారం, వర్షకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం.

పంచపాండవులందరు వననాసం చేసినప్పుడు నకుల సహదేవులు ఇద్దరు అడవిలోకి నడుచుకుంటు వెలుతుండగా వారికి ఒక అందమైన గుర్రం కనిపించిందట. దాని చూసి వారు అరె మనం ఇంతవరకు ఎక్కడ ఇంచ అందమైన గుర్రాన్ని మనం విద్యను అభ్యసించినప్పుడు కూడా చూడలేదు. ఖచ్చితంగా ఇది మనం తీసుకొని వెళ్లాలని దగ్గరికి వెళ్లారు. దాని యజమాని అంత అందంగా లేడు. వట్టి అమాయకుడి లెక్క ఉన్నడంట. ఈ గుర్రాన్ని తీసుకోవడానికి వీలు లేదన్నడు.

అప్పుడు వీరు ఇద్దరు మేం ఎవరమో తెలుసా? పంచపాండవులలో ఇద్దరం నకుల సహదేవులం చెప్తారు. అయిన కాని వీలు లేదు అని యజమాని చెప్పిండు. మీకు ఇది కావాలంటే నేను అడిగేటి ప్రశ్నలకు సమాధానం చెప్పాలి అన్నడు. యజమాని సరె మేం చాలా జ్ఞానాన్ని సంపాదించాం అడగండి అని నకుల సహదేవులు అన్నరు. ఒక పెద్ద చెరువు ఉంది ఆ చెరువు చుట్టు ఐదారు పిల్ల చెరువులు ఉన్నాయి. ఆ చెరువులో నీరు తీస్తే ఐదారు పిల్ల చెరువులను నింపవచ్చు కాని ఐదారు చెరువుల నీరు తీసుకస్తే ఈ పెద్ద చెరువు నింపలేదు ఎందుకు అన్నడంట యజమాని. వాళ్ల జ్ఞానానికి వచ్చినంతవరకు చెప్పారు. కాని అయన అన్నడు. ఇదంత తప్పు ఈ గుర్రాన్ని తీసుకెళడానికి వీలు లేదు అన్నడు. యజమాని ఏం చేయాలో తెలియడం లేదు. వారికి కాని ఎల్ల అయిన సరే ఈ గుర్రాన్ని తీసుకెళడానికి వారు చిన్న బోయి నారు అంత లోపే అర్జునుడు వచ్చాదు. సర్వం తెలిసిన అర్జునుడు కచ్చితంగా సమాధానం చెప్తడు అంటారు. ఆయనకు వచ్చిన తెలిసిన తోచిన సమాధానం చెప్పాడు. అది కూడా తప్పు అని తేలిపోయింది. అయన కన్న పెద్ద అయిన భీముడు వచ్చాడు. భీముడికి కూడా ఇదే ప్రశ్న వేశారు. కాని భీముడు కూడా చెప్పలేదు. తరువాత భీముడు కన్న పెద్ద అయిన ధర్మరాజు వచ్చాడు. ధర్మరాజుకు కూడా ఇదే ప్రశ్న వేశాడు గుర్రం యజమాని. ధర్మరాజు కూడా సమాధానం చెప్పలేదు. చివరికి ఆ గుర్రం యజమాని సమాధానం ఆ పెద్ద చెరువు తల్లిదండ్రుల ప్రేమ అభిమానం మన మీద పెట్టుకున్నటువంటి నమ్మకం మనం ఎదగాలని వారు చూపిస్తున్నట్టు వంటి ఆకాంక్ష ఆ పెద్ద చెరువు. చెరువులో ఉన్నటువంటి నీళ్లు అంటూ. ఆ చుట్టూ ఉన్నటు వంటి చిన్న చిన్న పిల్ల చెరువులు ఎంటంటే మనం మీరందరు. మనం ఎంత కష్టపడిన ఆ ప్రేమకు పతిఫలం ఇవ్వలేం. ఆ చెరువులో ఎన్ని నీళ్లు ఉన్న ఆ నీళ్లలన్నింటిని కలిపితే మల్లి ఈ చెరువులు సమానంగా కాలేవు అంటాడు యజమాని.

**పాండవుల కథ – కథావిశ్లేషణ**

వనవాసం చేస్తున్న పాండవులు ఒకసారి నడుచుకుంటూ అడవిలోకి వెళతారు. మార్గం మధ్యలో వారికి ఒక అందమైన గుర్రం కనిపిస్తే ఎలాగైనా దాన్ని సొంతం చేసుకోవాలని అనుకుంటారు. కాని అక్కడ గుర్రం యజమాని వారి గుర్రాన్ని తీసుకుపోవటానికి ససేమీరా అంటూ ఒప్పుకోడు. మేము పాండవులు అని చెప్పిన వినిపించుకొక, వాడు ఒక చిక్కు ప్రశ్న వేస్తానని చెప్పాడు. దానికి సమాధానం చెప్తే అంగీకరిస్తానని చెప్పాడు. ఒక పెద్ద చెరువు ప్రక్కన ఐదారు చెరువులుంటాయి. అయితే పెద్ద చెరువులో నీళ్లు తీస్తే ఐదారు పిల్ల చెరువులు నింపలేం. ఎందుకని అంటాడు. అప్పుడు

ఎన్నో వేదవిద్యలు నేర్చుకున్న పంచపాండవులు సమాధానం చెప్పలేక సతమతవుతారు. కాని గుర్రం యజమాని ఇలా సమాధానం చెప్తాడు. పెద్ద చెరువు అనేది తల్లిదండ్రులతో సమానం. వారు మన మీద చూపిస్తున్న ఆపేక్ష. ప్రేమ ఎవరు చూపలేరు. పిల్ల చెరువులు వాటి పిల్లలు ఎప్పటికి అంత ఎత్తుకు ఎదగలేరని జ్ఞానోదయం కలిగిస్తాడు.

1. పంచపాండవులు అనగానే వేద ధర్మ శాస్త్రాలు, విలువిద్య, యుద్ద విద్యలు ఎరిగిన పరమ వీరశౌర్యులు, కాని అలాంటి మహోన్నతులు కూడా ఒక్కొక్కసారి తమ శక్తియుక్తులను కోల్పోయి అవివేకులుగా ఆలోచించిన తీరుని చిత్రించిన కథ.

2. ప్రకృతిలో ప్రతి వస్తువు, ఆకృతులు అందమైనవే. వాటికి ఆకర్షితులై మంత్ర ముగ్దులవుతారు మానవులు. అందుకే అందమైన గుర్రాన్ని చూసి దానికి ఆకర్షితులై మచ్చిక చేసుకోవటానికి ప్రయత్నిస్తారు పాండవులు. దాని యజమాని చిక్కు ప్రశ్నలతో అడ్డుపడతాడు. ఆ చిక్కు ప్రశ్నను చేధించలేని పాండవులు యజమాని చేతిలో ఓడిపాయి వట్టి చేతులతో వెను తిరుగారు. ఆ చిక్కుల ప్రశ్నలో తల్లిదండ్రుల గొప్పతనాన్ని వర్ణించి పాండవులను, శ్రోతలను మేల్కొల్పుతుంది. ఈ కథ పిల్లలకు పెద్దల పట్ల చూపించవలసిన గౌరవాన్ని పెంచుతుంది.

# 3. జగిత్యాల జిల్లా జానపద కథలు – స్త్రీ, కుటుంబ జీవనచిత్రణ

## 3. 0 పరిచయం

మనందరికి తొలి పాఠశాల కుటుంబం. అలాగే తొలి ప్రపంచం కూడా కుటుంబమే. ఒక వ్యక్తి ఎవరితో ఎలా మాట్లాడాలి? ఎవరితో ఎలా మెలగాలి? ఎలాంటి పరిస్థితులు ఎదురైతే ఎలా నడుచుకోవాలి? మొదలైన అంశాలు దాదాపు కుటుంబంలోనే నేర్చుకుంటాడు. కాబట్టి ఒక సంపూర్ణ మానవుణ్ణి తయారు చేసే కార్ఖానాగా కుటుంబాన్ని అభివర్ణించాలి. అసంఖ్యాక మానవ సముదాయాన్ని సమాజం అనుకుంటే, పరిమితంగా గల మానవ సముదాయం కుటుంబం అవుతుంది. ఏ సమాజంలోనైనా కుటుంబం ప్రధాన పాత్ర పోషిస్తుంది. సమాజాన్ని సక్రమంగా అర్థం చేసుకోవాలంటే ముందుగా కుటుంబ వ్యవస్థని అర్థం చేసుకోవాలి. కుటుంబం సరిగ్గా ప్రగతి సాధించకపోతే సామాజికాభివృద్ధి సన్నగిల్లుతుంది. వ్యక్తి క్షేమం, సమాజ క్షేమం కూడా కుటుంబ పనితీరుపై ఆధారపడి ఉంటుంది. మానవ సమాజంలో కుటుంబ వ్యవస్థ ఎంతో ఆవశ్యకతతో కూడుకున్నది. ప్రతి వ్యక్తి కుటుంబంలో ఒక సభ్యుడిగా ఉండి సమాజంలో బాధ్యత గల వ్యక్తిగా మెలగడానికి కావలసిన శిక్షణ కుటుంబం నుండే లభిస్తుంది.

ప్రాచీన కాలంలో పెద్ద పెద్ద ఉమ్మడి కుటుంబాలు విరివిగా ఉండేవి. మారుతున్న సమాజాన్ని బట్టి చిన్న చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. జానపద కథల్లో కుటుంబాల్లో మనుషుల మధ్య నెలకొన్న సంబంధాలు, వివాదాలు, ప్రేమానుబంధాలు, ఆప్యాయతలు మొదలైన తదితర అంశాలను కల్పించి పెద్దలు పిల్లలకు చెప్పేవారు. దాని వల్ల పిల్లలో నైతిక విలువలు పెరిగి మానవీయ బంధాలు దృఢంగా మారేవి. కానీ చిన్న కుటుంబాల్లో నేడు ఆ పరిస్థితి కనిపించదు. పెద్ద వారి పట్ల అగౌరవం, అతి స్వేచ్ఛ, విచ్చలవిడి తనం, అశాంతి పిల్లల్లో పెరిగి వారి జీవితాలు ఆగమ్యగోచరంగా తయారవుతున్నాయి. ఆనాడు జానపద కథలు కుటుంబాల్లో మనుషులకు ధైర్యాన్ని నింపి వారి కష్టసుఖాల్లో పాలు పంచుకోనేలా ఉండి వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడ్డాయి. మనుషుల మనసులను అర్థం చేసుకోవడానికే కాకుండా తమ తప్పులను సవరించుకోవడానికి కూడా జానపద కథల్లో పాత్రల నుంచి

స్ఫూర్తిని పొందవచ్చు. వ్యక్తి వికాసంలో, ఎదుగుదలలో కుటుంబం ఎంతో ముఖ్యమైంది. ఏకత్వ భావనకు, సమైక్యతకు కుటుంబం ఒక చిహ్నం.

## 3.1 కుటుంబం పదం – నిర్వచనం

కుటుంబం అనే పదాన్ని ఇంగ్లీషులో 'ఫ్యామిలీ' అనే పదంతో సూచిస్తారు. ఇది రోమన్ పదమైన ఫేములస్ (Femulus) అనే పదం నుంచి వచ్చింది. దీనికి అర్థం సేవకుడు. రోమన్ చట్టంలో ఫేములస్ అనే పదాన్ని సేవకులు, బానిసలు, ఉత్పత్తి దారుల సమూహం, వివాహంతో సంబంధం ఉన్న వ్యక్తులను సూచించేందుకు ఉపయోగిస్తారు.

"కుటుంబం కొందరు వ్యక్తుల సమూహం. ఇది వివాహ బంధం, రక్త సంబంధం లేదా దత్తతతో ఏర్పడుతుంది. ఇందులో వ్యక్తులు ఒక గృహాన్ని ఏర్పాటు చేసుకొని, వారు పరస్పరం తమ సాంఘిక పాత్రల ద్వారా పరస్పర అంతర్గత క్రియలు, పరస్పర భావ ప్రకటనల ద్వారా భార్య, భర్త, తల్లి, కొడుకు, కుమార్తె, అన్నా చెల్లెలుగా ఏర్పడి ఒక ఉమ్మడి సంస్కృతిని నిర్మించుకుంటారు. – ఈ డబ్ల్యూ బర్గెస్, హెచ్‌జే లాక్."[39]

"వివాహం చట్టబద్ధమైన పితృత్వ, మాతృత్వాలు దంపతులు పరస్పరం ఒకరిపై ఒకరు లైంగిక పరంగా, శ్రమ సేవల పరంగా హక్కును కలిగి ఉండటం. సంతాన సంరక్షణ కోసం సమిష్టి నిధిని, సమిష్టి బాధ్యతను కలిగి ఉన్న సామాజిక సంస్థ కుటుంబం. — ఎడ్మండ్ లీచ్"[40]

పై నిర్వచనాలన్ని కూడా పాశ్చాత్య సామాజిక శాస్త్రవేత్తలు వారి అభిప్రాయాలును వెల్లడించారు. వాళ్ల దృష్టిలో కుటుంబం అంటే సింగిల్ పెరంట్ విధానమే కనిపిస్తుంది. అంటే తల్లిదండ్రులు, పిల్లలు వరకు మాత్రమే కుటుంబంగా నిర్వచించారు. వారి కుటుంబ విధానమదే. కానీ మన భారతీయ సంస్కృతి దీనికి పూర్తి భిన్నంగా ఉంటుంది. మనది వసుధైక కుటుంబ సిద్ధాంతం. ప్రపంచమంతా మన కుటుంబంగా భావించే ఉదార స్వభావులం. తాత, అమ్మమ్మ, నాన్నమ్మ, అమ్మ,

---

[39] కుటుంబమే సమాజానికి పునాది – నమస్తే తెలంగాణ 15 నవంబరు 2015

[40]కుటుంబమే సమాజానికి పునాది – నమస్తే తెలంగాణ 15 నవంబరు 2015

E source: https://www.ntnews.com/Nipuna-Education/కుటుంబమే.477225-2-15-పునాది-సమాజానికి-aspx

నాన్న, పిల్లలు, కుమారులు, కుమార్తెలు, అల్లుళ్లు, కోడలు, మనవడు, మనవరాలు, ముని మనువడు, ముని మనమరాలు ఇలా ఒక కుటుంబమంటే ఎన్నో బంధాలను కలుపుకొని ఆత్మీయతానుబంధాల మధ్య జీవితాన్ని సుఖప్రదం చేసుకొవడం. ఇరుకు ఇళ్లు ఇరుకు మనస్తత్వాలకు దూరంగా అందరు మనవాళ్ల అనే భావనతో సజీవ సంస్కృతిని బలంగా రూపొందించారు మన పూర్వీకులు.

"తల్లిదండ్రులు, అవివాహితుడైన ఆడ మగ బిడ్డలు, వివాహితులైన కుమారులు, వారి భార్య బిడ్డలు కలిసి ఒక ఇంటనే నివసించుచూ, ఒక వంటనె భుజించుచూ, ఒక్కటిగా జీవించుటయే అవిభక్త కుటుంబ పద్ధతి''[41]

"సామాజిక వాస్తవికతను దృష్టిలో పెట్టుకొని ఆలోచిస్తే భార్యభర్తలు, వారి పిల్లలు ఆత్మీయతానుబంధంతో కలిసి జీవించే ఒక విభాగాన్ని కుటుంబం అని వ్యవహరించవచ్చు. రక్త సంబంధంతో కూడుకున్న ఇలాంటి విభాగాలు కొన్ని సమైక్యంగా, సమిష్టిగా జీవించడాన్ని ఉమ్మడి కుటుంబం అని వ్యవహరించవచ్చు. సనాతన కాలం నుంచి కూడా భారతీయ కుటుంబాలు సమిష్టిగానే జీవిస్తూ రావడం గమనార్హం''[42]

మన సమాజంలో రక్తసంబంధం, శారీరకమైన దగ్గర సంబంధం, నిరంతర సంబంధాలు, సమానత్వాలు మొదలైనవి కుటుంబ జీవనంలో ప్రధానంగా కనిపిస్తాయి. సంప్రదాయాలను పాటిస్తూ, సభ్యులందరిని గౌరవిస్తూ, వారికి భద్రతను అందిస్తూ, అవసరాలను తీరుస్తూ కలిసికట్టుగా జీవించే కొంత మంది వ్యక్తుల సమూహాలు కుటుంబంగా మనం వ్యవహరిస్తున్నాం.

## 3.2 కుటుంబ వ్యవస్థలో ప్రధాన లక్షణాలు

ప్రపంచంలో అన్ని కాలాల్లో, అన్ని సమాజాల్లో, మానవ సామాజిక ఆవిర్భావం నుంచి నేటి వరకు కుటుంబ వ్యవస్థ కొనసాగుతుండటంతో భవిష్యత్తులో కూడా కుటుంబం తప్పక ఉంటుంది.

---


[41]రఘూమారెడ్డి, యెల్దండ. పల్లెపదాలలో ప్రజాజీవనం పుట: 72

[42]మునస్వామి ఆచారి. ఎ. 1995. చిత్తూరు జిల్లా జానపద కథలు పరిశీలనం. తిరుపతి: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం. పుట 154

కుటుంబ వ్యవస్థలేని సమాజమూ, సంసార జీవనం లేని కుటుంబాలు ఉండవు. అలాంటి కుటుంబాలకు ప్రధాన లక్షణాలతో సంబంధం ఏర్పడుతుంది.

1. రక్త సంబంధం
2. సహచరత్వం
3. నివాసం
4. వివాహం – జాతిని పునరుత్పత్తి చేయడం
5. ఆర్థిక కార్యకలాపాలు
6. దాంపత్య సంబంధాలు
7. మాతృ–పితృ సంబంధాలు
8. దాంపత్య–సంతాన సంబంధాలు

ఒక వ్యక్తి సమాజానికి పరిచయమయ్యాడంటే ఆ వ్యక్తి వెనుక పూర్వ తరాల నుండి పుట్టుకతోనే కొన్ని లక్షణాలను సంతరించుకుంటాడు. దాన్నే జన్యు అనువంశికత అంటాం. పెద్ద కుటుంబం నుండి వచ్చిన లేదా చిన్న కుటుంబ నుంచి వచ్చిన ఆ వ్యక్తి తమ కుటుంబంలోని లక్షణాలను ఎంత శాతాన్ని సంగ్రహించుకుంటాడో క్రింది చార్టు తెలుపుతుంది.



పై చార్టు కుటుంబంలో ఉన్న ప్రతి వ్యక్తికి గల జన్యు సంబంధిత క్రమాన్ని చూపిస్తుంది. "ఎరుపు రంగు జన్యు సంబంధించిన అనువంశికతను తెలియచేయగా, నారింజ రంగు వ్యక్తుల మధ్య సంబంధాన్ని తెలుపుతుంది."[43]

మాలినో వెస్కీ చెప్పినట్లు కుటుంబం కొన్ని మానవ అవసరాలను తీర్చడానికి సంస్కృతి పరంగా అభివృద్ధి చెందింది. కుటుంబ వ్యవస్థ అభివృద్ధికి ప్రధానకారణాలైన మానవ అవసరాలు మూడు అవి 1. మిధున వాంఛ 2. సంతాన వాంఛ 3. ఆర్థిక అవసరాలు దీనినే మనవారు ఈషణత్రయం అన్నారు. మానవుడు మిధున వాంఛను సంతృప్తి పరచుకొని సందర్భంలో ఒక విధమైన అనుభవాన్ని ఎదుర్కొంటాడు. ఆ అనుభవాన్ని తమ జీవితమంతా స్థిరపరచుకోవడానికి కొన్ని పరిమితులను నిర్ధేశించుకొనే వ్యవస్థను రూపొందించాడు. ఆ విధానమే సంసారంలో భాగమై కుటుంబంగా రూపొందింది. ఆ తరువాత తమ భవిష్యత్ తరాన్ని నిర్మించుకోవడానికి సంతాన వాంఛకై తపిస్తాడు. ఆ సంతానం తమ వంశాభివృద్ధిని చేస్తూ ఒక సమిష్టి కుటుంబంగా నిర్మితమైతుంది. కుటుంబ పోషణకు, జీవనోపాధికి నిరంతరం కృషి చేస్తాడు. కాలానుక్రమంలో తమ ఆర్థిక అవసరాలను తీర్చుకుంటూ కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసుకున్నారు. ఏ కాలంలోనైనా కుటుంబ పోషణకు ఆర్థిక అవసరాలకై ఒక పనిని, వృత్తిని ఏర్పరచుకొని అదే తరువాత తరాల వారికి జీవనోపాధిగా మారింది.

## 3.3 భారతీయ కుటుంబ వ్యవస్థ – జానపదుల కుటుంబాలు నేటి పరిస్థితి

స్వదేశీ రాజ్యాలు, నాగరికత, సంస్కృతులు విలసిల్లినప్పుడు ఉన్న కుటుంబ వ్యవస్థకి, నేటి కుటుంబ వ్యవస్థకి ఎన్నో బేధాలున్నాయి. నవనాగరికత, ఆధునికత, విదేశీ పాలనలు ఇలా ఎన్నో వచ్చి పూర్వం ఉమ్మడి కుటుంబ వ్యవస్థని, బంధుత్వాల విలువలను చిన్నాభిన్నం చేసాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు, నాగరికత పురోగతికి మూలం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. కానీ నేడు చెప్పుకుంటున్న నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచీకరణ, ఆధునికత భావం

[43]https://te.wikipedia.org/wiki/కుటుంబము#/media/దస్త్రం:CousinTree_kinship.svg

మితిమీరి పెరగడం మొదలైన అంశాలు మన సంప్రదాయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేశాయి.

"భారతీయ సమాజంలో కుటుంబం తనకు తానుగా ఒక సంస్థ. ప్రాచీన కాలం నుంచి ఇప్పటి వరకూ మన సమిష్టి సంస్కృతికి ఒక విశిష్ట ప్రతీక మన కుటుంబం. పట్టణీకరణ, పాశ్చాత్య సంస్కృతి మన కుటుంబాన్నీ, మన ఆచారాల్నీ ప్రభావితం చేసేంతవరకూ ఈ పరిస్థితి కొనసాగింది. మన పట్టణ ప్రాంతాల్లో ఇప్పుడు చిన్న కుటుంబాలే కనిపిస్తున్నాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలహీనపడేందుకు సామాజిక ఆర్థికాంశాలు కూడా ప్రభావితం చేయలేదని చెప్పలేం. మన ఉమ్మడి లేదా విస్తరించిన కుటుంబ వ్యవస్థ తరతరాలుగా కాపాడుతున్న సాంస్కృతిక విలువలు దెబ్బతినడానికి ప్రస్తుత జీవన శైలే కారణమని చెప్పేందుకు నాకు కొంత బాధ కలుగుతున్నది"[44]

ఉమ్మడి కుటుంబాల్లో కలిసి మెలిసి ఉండే మనస్తత్వాలు కరువై వివాహం జరిగిన మరుసటి రోజునే వేరే కాపురాలు పెడుతున్నారు. తల్లిదండ్రులు, అత్త మామలు పెద్దల పట్ల గౌరవం, బాధ్యత తగ్గిపోయి వారిని నిరాశ్రయులని చేస్తున్నారు. డబ్బు వ్యామోహంలో పడి భార్యభర్తలు దూరమవడమే కాకుండా పిల్లలతో కూడా ప్రేమగా సమయాన్ని గడపలేకపోతున్నారు. చిన్నప్పుడే ప్లే స్కూల్‌లో వేయడం, పెద్దవగానే చదువుల కోసం హాస్టల్ వంటి వసతి గృహలకు పంపించి వారి బాంధవ్యాల గొప్పతనాన్ని, ప్రేమ మాధుర్యాలని, ఆత్మీయతలకు దూరం చేస్తున్నారు. అదే పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో పిల్లలు పెద్దల మధ్య పెరిగి నైతిక విలువలను, మానవత్వం, దయ, కరుణ, విశాల హృదయం, సహనం, సామాజిక స్పృహ వంటి విషయాలు తెలుసుకునేవారు. పిల్లలకు పెద్దలు చెప్పే కథలు వాటిలో పాత్ర ద్వారా మంచితనం, దయాగుణం, సానుభూతి మొదలైన విషయాలను గ్రహించేవారు. ఉమ్మడి కుటుంబాల్లో పిల్లలకు చిన్నతనంలోనే సమైక్యత అనే బలమైన భావన మనసులో నాటుకునేలా చేస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పెద్దలు పిల్లల దగ్గర లేకపోవడం వల్ల పిల్లల మానసిక వికాసం, శారీరక ఎదుగుదల సరిగ్గా ఉండకపోవడమే కాక చురుకుగా పెరగలేకపోతున్నారు.

[44]వెంకయ్య నాయుడు, ముప్పవరపు. వసుధైక కుటుంబం. సంపాదకీయ వ్యాసం. ఆంధ్రజ్యోతి పేజి – 5, 15/05/018
https://www.andhrajyothy.com/artical?SID=578487

సలహాలిచ్చే పెద్ద దిక్కు లేక మంచి ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపలేకపోతున్నారు. కనీసం మనసులోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం దాంతో ఆత్మహత్యలకు పాల్పడడం నేటి సమాజంలో నిత్యం కనిపించే దృశ్యం.

“నేడు సమాజంలో చోటు చేసుకుంటున్న అనేక మార్పులు, పెరిగిపోతున్న విడాకులు, గృహహింసల కారణంగా సింగిల్ పేరెంట్ కుటుంబాలు ఎక్కువయ్యాయి. ఉమ్మడి కుటుంబాలు చీలిపోవడానికి ముఖ్యకారణం మానవ సంబంధాలన్నీ వ్యాపార సంబంధాలుగా మారిపోవడం అంటారు. సామాజిక భాషావేత్తలు. వివాహం ద్వారా స్త్రీ, పురుషులిద్దరూ కుటుంబాన్ని ఏర్పరచుకుని సామాజిక ఆమోద యోగ్యమైన వైవాహిక సంబంధం ద్వారా సంతానోత్పత్తి చేసి సమాజం నిరంతరం కొనసాగేలా చేయడం మన వ్యవస్థ ప్రత్యేకత. పాశ్చాత్య కుటుంబాల్లో వైయుక్తిక వాదం ఎక్కువ. ఒక వ్యక్తి తన గురించి మాత్రమే ఆలోచించే వ్యవస్థ పాశ్చాత్య కుటుంబ వ్యవస్థలో కనిపిస్తున్నది. అందుకే పాశ్చాత్య కుటుంబాలు విఘటితమైనంత వేగంగా భారతీయ కుటుంబాలు విఘటితం కావు. సంఘర్షణలు ఉన్నా భారతీయ కుటుంబాలు అలాగే కొనసాగుతాయి”[45]

ప్రపంచంలో భారతీయ కుటుంబ వ్యవస్థ అత్యంత విశిష్టమైందని పై వాక్యాలను దృఢపరుస్తున్నాయి. కుటుంబంలోని వ్యక్తుల మధ్య విడదీయరాని అనుబంధం ఈ వ్యవస్థ ప్రత్యేకత. పూర్వం భారతీయ కుటుంబం సమిష్టిగా ఉండేది. మన ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు తరతరాలుగా కొనసాగుతున్నాయంటే అందుకు కారణం సమిష్టి కుటుంబ వ్యవస్థే. భారతీయ కుటుంబం సమిష్టి విలువలపై ఆధార పడింది. భారతీయ కుటుంబంలోని ఆచార సంప్రదాయాలు వ్యక్తుల హక్కులను, బాధ్యతలను, విధులను సూచిస్తాయి. పాశ్చాత్య కుటుంబాల్లో వైయుక్తిక వాదానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. వేగంగా కుటుంబాలు విడిపోయి సహజీవన విధానాలను ప్రోత్సహిస్తారు. మన కుటుంబాల్లో అలాంటి వ్యవస్థ చాలా అరుదు. మన సమాజం వాటిని జీర్ణించుకోదు కూడా. భారతదేశంలో ఇప్పటికీ వివాహాన్ని కుటుంబానికి మూలంగా భావిస్తారు. మన

---

[45]రామ్మోహన్ రావు, కె. కుటుంబమే సమాజానికి పునాది. (ఆంధ్రభూమి దిన పత్రిక వ్యాసం) 14 మే 2019.

E source -http://www.andhrabhoomi.net/content/main-feature-2004

కుటుంబ వ్యవస్థ బలంగా ఉంది. పాశ్చాత్య దేశాల్లో కుటుంబ వ్యవస్థ బలహీనమవడం, వృద్ధులు దిక్కులేని వారై వృద్ధాశ్రమంలో చివరి క్షణాలు గడుపుతున్నారు. స్వీయ నిర్ణయాంశమైన కారుణ్య మరణానికి వెనుకాడని పరిస్థితి వచ్చింది. మన వారికి వాటి అవసరం రాకపోవచ్చనే భావిద్దాం. ఎంత ఆధునికతను సంతరించుకున్న మన సమాజానికి అలాంటి దుర్మార్గపు స్థితి రాకుండా మన పూర్వీకులు భవిష్యదర్శనంతో మన వివాహ వ్యవస్థనూ, కుటుంబ వ్యవస్థనూ బలమైన పునాదులతో నిర్మించారు.

జగిత్యాల జిల్లా జానపద కథల ఆధారంగా కుటుంబంలోని వివిధ వ్యక్తుల మధ్య నెలకొన్న సంబంధ బాంధవ్యాల్ని, ప్రేమ, ఆప్యాయతలను, ఈర్ష్య అసూయ ద్వేషాలను, కలహాలనూ పరిశీలించడం ఈ అధ్యాయ ఉద్దేశం.

## 3.4 జగిత్యాల జిల్లా జానపద కథలు – కుటుంబ జీవనం

## 3.4.1 తల్లి

కంటికి కనిపించే దైవం తల్లి. తన ప్రాణాన్ని పణంగా పెట్టి, బిడ్డకు జన్మనిస్తుంది. కుటుంబానికి తల్లి మూలాధారం. ఎన్నో కష్టాలు, దు:ఖాలు, వ్యథలు, బాధలు తాను భరిస్తూ కుటుంబ యోగక్షేమాలను నిరంతరం పర్యవేక్షిస్తుంది. ఎంతటి గొప్ప వ్యక్తి అయినా అతని తొలి అడుగు, తొలి పలుకు అమ్మతోనే. అందుకే కాబోలు 'మాతృదేవోభవ' అంటారు. తల్లిని గౌరవించే సంస్కృతి మనకు అనాదిగా వస్తుంది. తల్లి తన బిడ్డల శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతగానో దోహదం చేస్తుంది.

### 3.4.1.1 తల్లి – కొడుకు

'పిస కొడుకు' కథలో అమాయకపు కొడుకుని తల్లి ఎన్నో విధాలుగా బుద్ధులు చెప్పి అత్తగారింటికి పంపిస్తుంది. అత్తగారింట్లో ఎలా నడుచుకోవాలి, సందర్భాన్ని బట్టి ఏవిధంగా మలుచుకోవాలన్న విషయాలు చెప్తుంది. "ఇగ అవ్వ అవ్వ అత్తగారింటికి పోత అంటే వోయిరా కొడుకా. పోతే పోగాని అంగ్యాలు తిరుగు కొడుకా అని చెప్తది తల్లి. అంగ్యాలు తిరుగు కలోగంజో తాగిరా అత్తగారింటికాడ బాగా బిర్రువోకు అంటే ఏ మంచిది అని చెప్పి వీడు పోత ఉన్నడు." అత్త గారింటికి వెళ్లిన కొడుకుతో వాళ్ల ఆర్థిక స్తోమతను బట్టి నడుచుకో అంతేగాని గొంతెమ్మ కోరికలు కోరవద్దని తల్లి

చెప్పి పంపుతుంది. అదే కథలో మరో సంఘటన "నువ్వు గిట్ల చేత్తవ్ రా..! నువ్వు మంచిగ గారెలు, కోన్ని మంచిగ కమ్మగ తినాలిగని, గ మన కలోగంజి తాగుతవురా..? ఎది వోత్తే అది తాగుమన్న గంత మంచిగ జేస్రి. చేసినప్పుడు తినద్ద పిసోడా?" అల్లుడు వచ్చిన సందర్భంగా అత్తగారు మంచి పిండి వంటలు చేస్తే, వాటిని తినకుండా వస్తాడు. అప్పుడు తల్లి తన కొడుకుకి అత్తగారింటి అతిథి మర్యాదలను కాదనకూడదని బావమరదులతో సరసంగా మెలగాలని నచ్చచెప్తుంది.

'అత్త కోడలు వంకాయ' కథలో వృద్ధాప్యంతో బాధపడుతున్న ఒక తల్లికి తన కోడలు సరిగ్గా భోజనం పెట్టదు. ఆకలితో పస్తులు ఉంచుతుంది. రోజు గంజి మెతుకులతోనే కడుపు నింపుకునేది. ఒకవేళ కోడలుని తినడానికి ఏదైనా పెట్టమని అడిగితే చావ బాదుతుంది. తన కొడుక్కి చెబితే ఎక్కడ వాళ్ల మధ్య బేధాభిప్రాయలు వచ్చి సంసారం నాశనం చేసుకుంటారో? అనుకుని తన మనసులో దిగులు చెందుతుంది తప్ప తన కొడుక్కి చెప్పుకోదు. "ముసల్దాన్ని ప్రాణం దగ్గరకు రాంగ అయ్యో! ఎట్లని చెప్పి ఆమె అంత విలవిల లాడుతుంది. అంత నోరు సప్ప పడుతుంది. ఏంది? ఈ గంజి అని చెప్పి కొడుకు చెప్తమంటే కొడుకు పెండ్లాన్ని కొడుతడు. ఎట్ల ఆల్లకు పాపం లోల్లులు పుట్టించినట్లు అయితది. అద్దు అని చెప్పి అట్లనే ఒర్సుకుంటా''

చిన్నప్పటి నుండి ఎదిగేవరకు తమ సంతానానికి ఏది కావాలో ముందే గ్రహించి వాటిని సమీకరించడం ప్రతి తల్లిదండ్రులు చేసే పని. 'ఐదు మల్లె పూవ్వుల కథ'లో తల్లి కృష్ణ లీల తన కొడుకు బాలగిరి రాజుకి యుక్త వయస్సు రాగనే వివాహాన్ని చేయాలని ఆశపడుతుంది. "నేను కొడుక్కి లగ్గం జేత్తని తండ్రి అంటుండు. తల్లి అంటుంది. మన కొడుక్కి పదారేళ్ల వయస్సు వచ్చిందయ్యా?

తల్లి తనకు పిల్లలు పుట్టక ముందు సంతానప్రాప్తికై ఎంతో తపిస్తుంది. దైవ ప్రసాదమయినా సంతానం కొరకు ఎన్నో పూజలు, వ్రతాలు, మొక్కుతుంది. అసలు ఆడవారు వివాహం చేసుకున్న తరువాత సంతానం కల్గకపోతే ఆ ఆడజన్మకే అర్థం లేదన్నంతగా బాధతో దు:ఖిస్తారు. 'సత్యవతి కథ'లో ధర్మాంగ రాజు, ధర్మావతి ఇరువురు దంపతులకు సంతానం లేక బాధ పడ్డ తీరు కథకురాలు ఆర్థతతో వర్ణిస్తుంది. "ఆ ధర్మంగరాజు, ధర్మవతి ఆల్లకు లేక లేక పుత్ర సంతానం లేక కొన్ని వేల

ఖర్చుబెట్టి, ఎదురైన గుండకు, కుదురైన బండకు కోటక్క మొక్కులు మొక్కుతుంది. మొక్కితేగూడా సంతానం ఐతలేదు. సంతానం కాకపోతే ఏం జేసిండు. అబ్బా! ఎవ్వడు ఏ బిచ్చగానికి చెట్టుకింద బిచ్చగానికి సంతానం అయితుంది. ఎన్ని జన్మల పాపం నాకు ఎందుకు సంతానం కావద్దు అని. ఆ ధర్మరాజు ధర్మంగరాజు. ధర్మంగరాజు ధర్మవతి ఏడ్వంగ ఏడ్వంగ కోటి తవుసులు కోటి పుణ్యాలు జేత్తుండు." పై సంఘటనల్లో తల్లి పిల్లల కోసం పడే తపన కనిపిస్తుంది. పెంపకంలో పిల్లల సుఖమే తన పరమావధిగా భావించడం, వారి జీవితాలకు కావలసినవన్నీ సమాకూర్చడం, సమాజంలో ఒక ఆదర్శ వ్యక్తిగా నడుచుకునే విధానం మొదలైన అంశాలను సమాజంలో ప్రతి తల్లి తన సంతానానికి బుద్ధి మాటలు చెప్పి సన్మార్గ దిశగా పయనింపచేస్తుంది. అందుకే తల్లి ఆది గురువుగా, ఆది దైవంగా భావించమని పెద్దలు హితవు చెప్తారు.

'గారడి పిల్లవాడు' కథలో ఒక గ్రామంలో ఒక పేదతల్లి తన ఇరువురు కొడుకులను పోషించుకోలేక అవస్థ పడుతుంది. అదే ఊరికి వచ్చిన ఒక గారడివాడికి అనాథ పిల్లలు లేదా పేద పిల్లలను పోషించి గారడి విద్య నేర్పిస్తానని రాజుతో చెప్తాడు. ఆ ఊరి రాజుకి ఆ పేద తల్లి గుర్తుకు వస్తుంది. ఆ తల్లి రాజు మీద నమ్మకంతో కొడుకులిద్దర్ని గారడివాడితో ఇచ్చి పంపిస్తుంది. గారడి విద్య నేర్చుకున్న తరువాత ఒకరు గారడివాడి వద్ద ఇంకో కొడుకు ఆ తల్లి దగ్గర ఉండాలని ముందుగానే ఒప్పందం చేసుకుని గారడివానికిచ్చి పంపించింది. ఆ ఒప్పందం ముగిసేనాటికి ఆ తల్లి కొడుకులు పెద్ద పెరిగి ప్రయోజకులైతారు. కానీ వారిద్దరిలో చిన్నవాడు చాలా తెలివైనవాడు. కొద్ది రోజుల్లోనే గారడి విద్య నేర్చుకుని గురువుని మించిన శిష్యుడైతాడు. గురువు వేసిన పన్నాగాన్ని ముందే పసిగట్టి తాను తల్లి దగ్గరికి పోతే తాను నేర్చుకున్న గారడివిద్యతో పోషించవచ్చునని ఉపాయం వేసుకుంటాడు. గురువు ఎన్ని విధాలుగా ప్రయత్నించినా గురువు తప్పించుకోని తన తల్లి పాదాలను చేరతాడు. తన తల్లిని మోసం చేయదల్చిన గురువును ఎదిరించి తానేంటో నిరూపించుకుంటాడు. తల్లి ప్రేమని శాశ్వతంగా పొందాలని ఆశిస్తాడు. అంతేగాదు చివరి వరకు తన తల్లికి ఏ కష్టం రాకుండా చూసుకోవాలనే తపించేవాడు చిన్న కొడుకు ఇందులో కథానాయకుడు. తల్లి కూడా తన దగ్గర ఉంటే పేదరికంతో దుర్భర జీవితాన్ని అనుభవించడం కన్నా కూడా గారడివాడితో వెళ్లిపోయి సుఖంగా జీవిస్తే చాలని అనుకుంటుంది. రెండు కన్నుల ఏ కన్ను కావాలో కోరుకో అన్నట్టు ఇద్దరు కొడుకుల్లో ఏ కొడుకు

కావాలో చెప్పమని గారడివాడు, రాజు తల్లిని ప్రశ్నిస్తే తల్లాడిల్లిపోతుంది. తల్లికి కొడుకు మీద ఉన్న ప్రేమ, కొడుకుకి తల్లి మీద ప్రేమని చిత్రించిన కథ గారడివాడు.

'పైసకు గుడిసెన్నర పెళ్లాం' కథలో ఒక కుర్రవాడు తన తల్లి అనుభవిస్తున్న పేదరికాన్ని చూసి బాధపడతాడు. ఏలాగైనా అతని తల్లికున్న కష్టాలు తీర్చాలని అనుకుంటాడు. యుక్తవయసులో ఉన్న నేను ఏదైనా సాధించగలనని భావించి తల్లికి ధైర్యం చెప్తాడు. అతని ఇంటి గతినే మార్చాలని సంపాదనకై దేశ విహారానికి వెళతాడు. వివిధ గ్రామాలు తిరిగి తిరిగి ఇతరులకు మాయ మాటలు చెప్పి తల్లి కోరుకున్న కోడల్ని, సంపాదనను తీసుకచ్చి పెడతాడు. అతని ఆర్థిక పరిస్థితికి పిల్లను ఇవ్వరని భావించిన తల్లికి కోడల్ని, కట్టుకోవడానికి బట్టల్ని, షికారు చేయడానికి గుర్రాన్ని తీసుకచ్చి పెడతాడు. తల్లి కోరికలను తీర్చి తల్లి మీద ప్రేమను వ్యక్తం చేయడానికి ఎదుటివారు చివాట్లను సైతం లెక్కచేయడు.

సాధారణంగా భార్య మాటలు విని తల్లిదండ్రులను పట్టించుకోని వారు ఉంటారు. కొందరు తన భార్య చేసిన తప్పును గ్రహించి భార్యకే శిక్ష పడేలా చేసినవారు లేకపోలేదు. అలాంటి కోవకు చెందిన కథ 'ఒక గుండుకు రెండు గుండ్లు' కథ. ఒక కోడలు అత్త తల్లో పేన్లు చూడమని అడిగినందుకు మంగళి వాడిని పిలిపించి అత్తకు తలగొరిగిచ్చి గుండు చేయిస్తుంది. అది చూసిన కొడుకు తన తల్లిని గుండు చేయించునందుకు అదే బాధను తన భార్య కూడా అనుభవించాలని ఉపాయంతో భార్య తల్లికి కూడా గుండు చేయించాలని అత్తగారింటికి వెళతాడు. అత్త నీ బిడ్డ ఆరోగ్యం బాగా లేదని నువ్వు గుండు తీయించుకొని, మేళతాళలతో ఊరేగింపుకి వస్తేనే నీ బిడ్డ ఆరోగ్యం బాగు అవుతుందని అబద్ధం చెప్తాడు. అలాగే అతను భార్య దగ్గరికి వచ్చి అక్కడ చెప్పిందే భార్యకు చెప్పి నీ తల్లి ఆరోగ్యం బాగాలేదని చెప్పి, తాను గుండు తీయించుకోవాలని చెప్తాడు. ఇద్దరు తల్లి బిడ్డలు అతని మాటలు నమ్మి గుండు తీయించుకోని చప్పుడు మేళాల చప్పుడు ఊరేగింపు చేసుకుని రచ్చబండ కాడికి వస్తారు. అప్పుడు అతను నలుగురు పెద్ద మనుషులను పిలిపించి వారు తన తల్లికి చేసిన దానికి ప్రతిఫలంగా ఒకరికి తెలియకుండా ఇంకొకరికి అబద్ధం చెప్పి గుండ్లు తీయించుకునేలా చేస్తాడు. అప్పుడు ఆ గ్రామ పెద్దలు తీర్పు చెప్పి అతనికి న్యాయం చేస్తారు. ఆ విధంగా తన తల్లికి జరిగిన అవమానాని తట్టుకోలేక దానికి బదులుగా అంతకన్న రెట్టింపు అవమానాన్ని భార్య, అత్త ఇద్దరు చవిచూసేలా నేర్పుతో వ్యవహరిస్తాడు.

### 3.4.1.2 తల్లి – కూతురు

తల్లి కూతుళ్లు ఇద్దరు ఆడవారే కాబట్టి వాళ్ల మధ్య దాపరికాలు ఉండవు. కూతురికి తండ్రి మీద ఎంతో ఇష్టం ఉన్నా తల్లితో అన్ని విషయాలు పంచుకుంటూ తల్లి దగ్గర చనువుగా మసులుకుంటుంది. తల్లి కూడా తన కూతురుని అత్తగారింటికి పంపించేంత వరకు జాగరుకతతో కాపాడుకుంటుంది. తల్లి సమాజంలో, అత్తగారింట్లో, ఇతరులతో ఏవిధంగా వ్యవహించాలో బిడ్డకి చెప్తూ నిత్యం పర్యవేక్షిస్తూ ఉంటుంది.

'తల్లి కూతుళ్ల అనుబంధం' అనే కథలో ఒక భర్త భార్యని పొలంలో నరికి చంపివేస్తాడు. ఆ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలుంటారు. భర్త చేత మోసపోయినా ఆ భార్య తన పిల్లల దయనీయమైన పరిస్థితి తలచుకోని వారి పొలంలో దయ్యం రూపంలో తిరుగుతూ ఉంటుంది. కొద్ది రోజుల తరువాత ఆమె భర్త మరొ వివాహం చేసుకుని తన ఇద్దరు ఆడపిల్లలను ఇంటి నుంచి బయటకు గెంటేస్తాడు. ఆ పిల్లలిద్దరు ఎక్కడ తలదాచుకోవాలో తెలియక వాళ్ల పొలం దగ్గరికి వెళతారు. అక్కడ దయ్యం రూపంలో తల్లి వారిద్దరిని చేరదీసి సంరక్షిస్తూ ఉంటుంది. ఆవిధంగా చనిపోయిన తరువాత కూడా దయ్యం రూపంలో తల్లి వారిని రక్షిస్తూ వారికి కావల్సినవన్నీ తన మాయతో తెచ్చి పెంచి పెద్ద చేస్తుంది. తండ్రి ప్రేమకు నొచుకోని పిల్లలను చనిపోయిన తల్లి దయ్యంగా మారి నిత్యం వారిని కంటికి రెప్పలా కాపాడుతుంది. బహూశా తల్లిలేని పిల్లలు గాలి పిల్లలన్న సామెత కూడా జానపదుల వ్యవహారంలో వినిపిస్తుంటుంది.

'ఒక గుండుకు రెండు గుండ్లు' అనే కథలో తల్లి అల్లుడు చెప్పిన మాయ మాటల నమ్మి తన కూతురు క్షేమం కోసం గుండు తీయించి సన్నాయి మేళాలతో ఊరేగింపుకు సిద్ధమవుతుంది. అలాగే కూతురు కూడా తల్లి ఆరోగ్యం కుదుటపడాలని భర్త చెప్పిన మాటల నమ్మి వెంటనే మంగలి వాన్ని పిలిపించి గుండు తీయించుకుంటుంది. అలాగే తల్లి అంటే కూతురికి, కూతురంటే తల్లికి అమితమైన గుడ్డి ప్రేమే వారిని క్షణం కూడా ఆలోచించుకోనివ్వకుండా చేసింది.

మరొ కథ 'సవతి తల్లి తీరు' అనే కథలో ఒకామె అనారోగ్యంతో బాధపడుతూ తాను చనిపోతే తన పిల్లల దు:స్థితిని ఊహించుకొని బాధపడుతుంది. గూడు నుంచి కింద పడి చనిపోయిన ఆడ పక్షి పిల్లలను చూసి ముందే గ్రహిస్తుంది. ఏలాగైనా తన పిల్లలకు అన్యాయం జరగకూడదని ముందుగానే తాను అనారోగ్యంతో చనిపోతే భర్త మరొక వివాహం చేసుకోవద్దని ప్రతిజ్ఞ చేయించుకుంటుంది. కానీ

కొద్ది రోజుల తరువాత అతని భార్య చనిపోతుంది. ఇంటి ప్రక్కన ఉన్న కుమ్మరామెని పెళ్లి చేసుకుంటాడు. 'తల్లి లేని పిల్ల ఉల్లి లేని కూర' అన్నట్లు సవతి తల్లి వచ్చి ఆ పిల్లలిద్దరి మీద నిందలు మోపి ఇంటి నుండి బయటకు పంపిస్తుంది. తల్లి ప్రేమ వెలకట్టలేనిది నిత్యం పిల్లల సుఖమే వారి పరమావధిగా భావిస్తారు.

## 3.4.2 తండ్రి

పితృస్వామ్య కుటుంబ వ్యవస్థలో తండ్రి ప్రాధాన్యత ఎక్కువ. తండ్రి అంటే నడిచే దైవంతో సమానంగా భావిస్తారు. ఏ వ్యక్తి అయినా పరిపూర్ణ శక్తి యుక్తులు పొందాడు అంటే అది తండ్రి వల్లే సాధ్యం. అమ్మ ఆప్యాయతలనూ అందిస్తే, నాన్న నడవడికనూ, కష్టపడేతత్వాన్ని నేర్పిస్తాడు. తాను అనుభవించిన కష్టాలు తన పిల్లలు అనుభవించకూడదని నిరంతరం శ్రమించే కుటుంబ శ్రామికుడు. మన ఆనందాలను తన ఆనందంగా భావించే నిత్య కృషివలుడు నాన్న.

### 3.4.2.1 తండ్రి – కొడుకు

తండ్రి తన బాధ్యతగా జీవితాంతం వెచ్చిచ్చి సంపాందించి పిల్లలకు ఇస్తాడు. పిల్లలు పెరిగి పెద్దై ప్రయోజకులు అయిన తరువాత వృద్ధాప్యంలో ఉన్న తండ్రిని పట్టించుకోవడం మానేస్తారు. తండ్రి త్యాగాన్ని మరచి తామే అంత సాధించామనే భ్రమలో జీవిస్తారు.

'కొడుకులున్న తండ్రికి వచ్చిన గతి' అనే కథలో నారాయణ అనే వ్యక్తి తనకున్న నలుగురు కుమారులకు తాను కష్టించి సంపాందించిన ఆస్తినంత సమానంగా పంచి పెడతాడు. "నలుగురు కొడుకులకు ఆయన మంచి బట్టల దుకాణాలు పెట్టించి ఇచ్చాదు. నాలుగు బంగ్లాలు కట్టించిండు. మనిషికి యాభై తులాల బంగారం ఇచ్చాదు. మనిషికి యాభై లక్షరూపాయలు ఇచ్చిండు. మనిషికి ఒక ఎనిమిది లక్షల కారు ఇచ్చిండు. అట్టహాసంగా, హుందాగా ఉండాలె నా కొడుకులు, కోడల్లు, మనవరాల్లు అందరు మంచిగ బతకాలని ఏ తండ్రికైనా ఉంటది" కొద్ది రోజుల తరువాత తన భార్య చనిపోతే తనని చూసుకునే నాధులే కరువైపోతారు. ఎంతో విలువైన ఆస్తిని, బంగారాన్ని, పెద్ద భవనాలు, మంచి వ్యాపారం ఇవన్నీ కొడుకులకు పంచి పెడితే చివరకు భార్యల మాట విని తండ్రిని ఒక

రేకుల షెడ్డులో ఉంచి దిక్కు లేనివాన్ని చేస్తారు. ఏ వ్యాధి లేని తండ్రిని ఒక అంటరానివాడిగా చేసి చివరకు తన మనవళ్లను, మనవరాళ్లను కూడా దగ్గరకు రాకుండా చేస్తారు. నారాయణ తన కొడుకులు, కోడళ్లకు ఎంతో సంపాందించి ఇచ్చినా చివరి దశలో తనని చూసుకోవడానికి అయిష్టత చూపారు. అదే ఆస్తి పంపకాలు చేయకుండా తన దగ్గరే ఆస్తిని ఉంచుకుంటే ఈ కథ మరో విధంగా మలుపు తిరిగేది. పిల్లల జీవితాలే తమ జీవిత ఆశయాలుగా మార్చుకునే తల్లిదండ్రులకు కొంచమైనా కనువిప్పు కల్గించే కథ.

'ఇరవై అయిదు రోజుల బాలుడు' కథలో ధర్మాంగరాజు మాణిక్యాలదేవికి లేక లేక కలిగిన సంతానం బిక్షపతి. అతని పుట్టుకలో దోషం ఉందని పండితుడు చెప్తాడు. ఆ దోషం పోవడానికి బాలుడు పుట్టిన ఇరవై అయిదు రోజుల్లో వివాహం జరిపించాలని తల్లిదండ్రులకు చెప్తాడు. తల్లిదండ్రులు జాతక దోష నివారణకు ఇరవై అయిదు రోజుల బాలున్ని, పదహారేళ్ల పడుచు అమ్మాయితో వివాహం చేస్తారు. దీని బట్టి తల్లిదండ్రులు తమ పిల్లలు కోసం తప్పులు చేయడానికి సైతం వెనుకాడారని తెలుస్తుంది. ఇరవై అయిదు రోజుల బాలునికి వధువుని అడగలేక తండ్రి అబద్ధం చెప్పి కత్తికి, కటారు పెళ్లి చేసి కోడలుని తీసుకువస్తాడు. ఎన్నో నోములు, వ్రతాలు చేస్తేగాని పుట్టిన ఏకైక సంతానానికి ఎంతో జాగరుకతతో బతికించుకుంటారు. ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలకు కావల్సినది ఇచ్చి, వారికి ఏ కష్టం తెలియకుండా చూసుకోవాలని అనుకుంటారు.

### 3.4.2.2 తండ్రి – కూతురు

మన కుటుంబాల్లో తండ్రికి కొడుకు మీద కన్న కూతురు మీద అమితమైన ప్రేమ ఉంటుంది. కూతురుకి కూడా తండ్రి దగ్గర చనువు ఎక్కువే. కొంత మంది తండ్రులు తన కూతురు తన తల్లిని ఊహించుకొని వారిని ఎంతో ఆదరనీయంగా చూసుకుంటారు. కొడుకులు లేని తండ్రులకైతే కూతురే కొడుకుగా భావించి ఎంతో ప్రేమతో చూసుకుంటారు. ఆ ప్రేమ కొన్ని సందర్భాల్లో విరోధంగా కూడ మారవచ్చు.

'బూడిద గిరి పట్నం' అనే కథలో తండ్రికి గల మితిమీరిన ప్రేమనే తనని విరోధిగా మారుస్తుంది. ఒక ముసలాయనకు చాలా రోజుల తరువాత ఆడపిల్ల పుడుతుంది. ఆ ఆడపిల్ల పెరిగి పెద్దదయినా తరువాత వివాహం చేయాలని అనుకున్నాడు. అనుకున్నట్టుగానే వివాహం చేసి తనకున్న ఒక్కగానొక్క కూతురి ఇల్లరికం తెచ్చుకుంటాడు. కొద్ది రోజుల కలిసి ఉన్న తరువాత విబేధాలు వచ్చి విడిపోయి వేరు కాపురం పెడతారు. అప్పటి నుండి తన కూతురు తనని కాదని ఇంట్లో నుంచి బయటకెల్లి బతుకుతుందని తండ్రికి కోపం వస్తుంది. దాంతో కూతురికి, అల్లునికి ఏదో కీడు చేసి తమ విలువ తెలియజేయాలని ప్రయత్నిస్తాడు. కాని ఫలితం దక్కదు. "నేను ఇంట్లకు తీసుకచ్చుకుంటే నన్ను ఇడిసిపెట్టిపోయి అండ్ల అజ్జేసుకుంటరా మీరు. బిడ్డ అగు(ది! మీ సంగతి జెబుత!" తన కూతురి మీద ప్రేమ క్రమంగా పగగా మారి చివరకు తన చావును కోరి తెచ్చుకున్నాడు. తమ సంతానం తాము చెప్పిందే వినాలి అనుకునే తల్లిదండ్రుల మనసును మార్చే కథ ఇది. మూర్ఖత్వంతో వ్యవహరించి పిల్లల ఇష్టాయిష్టాలకు విలువ ఇవ్వని తల్లిదండ్రుల మనస్తత్వాన్ని ఉదాహరించిన కథ.

ప్రతి తండ్రికి ఆడబిడ్డల, ఆడ పడచుల పట్ల అమితమైన ప్రేమ ఉంటుంది. వారివురికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు పరిష్కారించాల్సిన బాధ్యతని తన మీద వేసుకుంటాడు. సహజంగా కుమారునికి అమ్మ దగ్గర చనువు ఎక్కువ. కూతురికి తండ్రి దగ్గర చనువు ఎక్కువ. ఎంత బాధ్యతగా పెంచి పెద్ద చేస్తాడో అంతే బాధ్యతగా ఒక మంచి వ్యక్తికి ఇచ్చి వివాహం చేయాలనుకుంటాడు. వరకట్న భారాన్ని మోస్తూ తనకన్న మంచి హోదాలో ఉండాలని చూస్తాడు. కూతురి భవిష్యత్తుకై అన్ని విధాలా తెలుసుకోవడం తండ్రి కూతుళ్ళ బంధాన్ని తెలుపుతుంది.

'దైవానుగ్రహం' అనే కథలో ఒక తండ్రికి నలుగురు కుమార్తెలుంటారు. నలుగురికి ఘనంగా వివాహం జరిపించాలనుకుంటాడు. నలుగురిలో చిన్న కుమార్తె తాను దైవ సంకల్పంతో పుట్టాను. నువ్వు పుణ్యం చేసుకోవడం వల్ల కాదని తండ్రితో వాదిస్తుంది. దాంతో తండ్రి ఒక మూర్ఖపు ఆలోచనతో ముగ్గురి కుమార్తెలను మంచి ధనవంతులకిచ్చి వివాహం చేస్తాడు. చిన్న కుమార్తెను మాత్రం కుష్ఠరోగం ఉన్న వాడికిచ్చి పెళ్లి చేస్తాడు. అతనితో ఎన్నో ఇబ్బందులు ఉన్న చేసుకున్న భర్తను, తండ్రి

మాటను జవదాటకుండా జీవనం కొనసాగిస్తుంది. దైవ సంకల్పంతోనే నేను ఈ భూలోకానికి వచ్చానని తండ్రికి తెలియజేయడమే కాకుండా అవసాన దశలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులను తన దగ్గరికి తెచ్చుకుని పోషిస్తుంది. ఈ కథలో తండ్రి మాట విని ఎలాంటి వ్యక్తినైనా పెళ్ళి చేసుకోవడానికి వెనుకడాని కుమార్తెగా నిలిచింది. తండ్రితో కక్ష్య సాధింపుకై సిద్ధపడింది కాని ఎలాంటి తప్పుడు పనులకు తావు ఇవ్వలేదు. తండ్రి మాత్రం మూర్ఖపు ఆలోచనలతో ముగ్గురు కుమార్తెల జీవితాన్ని ఒక విధంగా, నాల్గవ కుమార్తె జీవితాన్ని మరొ విధంగా చేసి పాపపు తండ్రిగా చిత్రించబడ్డాడు. తన కూతురి మీద అమితమైన నమ్మకం, ప్రేమయే దానికి కారణం తప్ప కూతురంటే ఇష్టం లేక కాదని చెప్పవచ్చు.

మరొకథ 'ఐదు మల్లె పూవ్వుల కథ' అనే కథలో మైభూతరాజు అనే రాక్షసుడు తన కూతురిని వివాహం చేసుకునేవాడు గొప్ప సాహసవీరుడై ఉండాలని అనుకుంటాడు. ఒక పెద్ద కత్తుల మేడ కట్టించి ఆ మేడ ఎక్కి తన కూతురిని పట్టుకున్న వాడికిచ్చి వివాహం చేయాలని నిశ్చయించుకుంటాడు. 'మైబూతరాజు భార్య మాలచ్చిందేవి. మాలచ్చిందేవి కన్న బిడ్డ మాముత్యాలదేవి. ఏడంత్రాల కత్తుల మేడ కట్టి ఆ మాలు కింద బిడ్డను ఉంచి, ఆడ దాసి పెట్టిండు. ఈ కత్తులు ఆయుధాల పొన్న ఎక్కి, ఆ పిల్ల రెట్ట పట్టినోనికి నా బిడ్డను ఇత్తనని రాసిండు" ఈ కథలో కత్తుల మేడకట్టి తన కూతురిని దాంట్లో ఉంచడం, అది చేధించిన వారికే తన కూతురినిచ్చి వివాహం చేస్తానని అనడం వెనుక తన కూతురిని చేసుకోబోయేవాడు తన కంటే పరాక్రమవంతుడిగా, అసాధ్యుడిగా ఉండాలని ప్రతి తండ్రి ఆశించే తీరు కనిపిస్తుంది. సమాజంలో ప్రతి తండ్రి తన కూతుళ్లను మంచి హోదా, అధికారం, ఉద్యోగం, సంపద ఉన్నవారికి ఇచ్చి వివాహం జరిపించాలని ఆశించడం సహజమే. అలాని మైబూతరాజు లాంటి రాక్షస స్వభావం ఉండాలని అర్థం కాదు. కత్తుల మేడ దాటి వచ్చినవాడు ఎంతో ధైర్యవంతుడు, సాహస వంతుడు, శౌర్య గుణాలు కలిగినవాడు, సహనశీలి, ప్రేమ దయా గుణాలను కల్గిన వ్యక్తి అయి ఉండాలని కోరుకుంటాడు. అప్పుడే ఎన్ని కష్టాలు వచ్చిన తన కూతురిని వదలక బాగా చూసుకోగలడని తండ్రుల నమ్మకాన్ని తేటపరుస్తుంది. ఇదే కథలో మైభూతరాజు కుమార్తె తండ్రి మీద ఆప్యాయత, అభిమానంతో తన స్వయం వరానికి వచ్చి కత్తుల మేడ ఎక్కే ప్రతివారిని ఓపికగా భరించింది. తండ్రి

మాట విని కత్తుల మేడలో బంధిగా ఉందంటే ఎన్ని పరిమితులలో, కట్టుదిట్టల్లో మెలుగుతూ తనను తాను నియంత్రణలకు గురి చేసుకుంది. చివరికి తండ్రి చేస్తున్న తప్పు నిలదీసి తనకిష్టమైన యువకుడు బాలగిరిరాజుని వివాహం చేసుకుంటానని తెలిపి తండ్రిచేత నిరాకరించబడుతుంది.

మరో కథ 'అత్త కాల విషం' కథలో అత్త కోడల్ని చంపి ఊరి చివర బజారులో పాతిపెడుతుంది. గర్భిణితో ఉన్న కూతురుని తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు వస్తారు. తన సమాధిపైన మొలచిన మొక్కలో ఆత్మగా ఉండి తల్లిదండ్రులకు తనకు జరిగిన అన్యాయాన్ని చెబుతుంది. ఓర్చుకోలేని అత్త చేసిన దుశ్చర్యకు తల్లిదండ్రి కుమిలిపోయి ఆ ఊరి పెద్ద మనషులకి చెప్పి అత్తకు శిక్ష పడేలా చేస్తారు. పండుగలకు, పబ్బాలకు పుట్టింటికి తీసుకోని వెళ్లి 'సారె' పంపకాలు పెట్టే ఆనవాయితీ అనాదిగా వస్తున్న సంప్రదాయం. గర్భిణితో ఉన్న తన కూతురిని తీసుకొని పోవడానికి ఎంతో ఆశతో వస్తే తన కూతురే లేదన్న నిరాశ తండ్రికి మిగులుతుంది.

జానపదుల్లో మగవారు రెండు మూడు వివాహాలు చేసుకోవడం సర్వసాధారణంగా కనిపిస్తుంది. మొదటి భార్యకి పుట్టిన పిల్లలుండగానే రెండో వివాహం చేసుకుని సవతి తల్లి పోరుని తెచ్చి పెడుతుంటారు. అది చాలదన్నట్టు పిల్లల కోసం పెళ్లి చేసుకున్నామని చెప్పడం కూడా సహజమే. తండ్రి ఎన్ని తప్పులు చేసినా కూతుర్లు మాత్రం తండ్రిని క్షమిస్తూనే ఉంటారు. 'సవతి తల్లి తీరు', 'తల్లి కూతుళ్ల అనుబంధం' అనే కథల్లో తండ్రి సవతి తల్లి మాటలు విని ఇంటి నుండి బయటకు పంపినా, తండ్రిని అవసాన దశలో మాత్రం కూతుర్లే చేరదీస్తారు.

### 3.4.3 సోదరసోదరిమణుల అనుబంధం.

ప్రతి కుటుంబంలో ఆడపడచులకు తల్లిదండ్రుల తర్వాత తల్లిదండ్రులంతటి వారు అన్న లేదా తమ్ముడు. చెల్లెలి జీవితం 'మూడు పువ్వులు ఆరు కాయలుగా' ఉండాలని తపించేవారు. పుట్టింటికి చేరినప్పుడు ఏదొక కానుక గాని లేదా సారెలుగాని ఇచ్చి సంతోషంగా అత్తగారింటికి సాగనంపడం మన సంస్కృతి. ఇంటికి వచ్చిన సోదరిల భర్తకు అతిథి మర్యాదలు చేయడం తప్పనిసరి. తన చెల్లెలు అత్తవారింట్లో ఆనందంగా ఉండాలనే ఉద్దేశ్యంతో బావను మర్యాదతో బాధ్యతగా చూసుకుంటారు.

అతనిని సంతోషపరుస్తారు. తన అన్న ఆయురారోగ్యాలతో బాగుండాలని, తాను వచ్చినప్పుడు మంచిగా చూసుకోవాలని ప్రతి చెల్లెలు ఆశ పడుతుంది.

అన్న చెల్లెలి అనురాగ బంధాల్ని ఎంతో వాస్తవికంగా చిత్రించిన కథ 'అన్న చెల్లెలు కథ'. ఈ కథలో అన్న ఆర్థిక ఇబ్బందులు లేకుండా కొంత ఐశ్వర్యంతో బతుకుతాడు. చెల్లెలు మాత్రం కడు పేదరికాన్ని ఎదుర్కొంటుంది. అన్నని సహాయం కోరడానికి పుట్టింటికి వెళ్లి ఆశ్రయిస్తుంది. అన్న నిర్మలమైన మనస్సుతో చెల్లె అడగకముందే అన్ని సమాకూరుస్తాడు. తన చెల్లెలికి ఎంతో సహాయం చేయాలని తపించేవాడు. కాని వీరిద్దరి మధ్య వాళ్ల వదినె ఒక భూతంలాగా ప్రవర్తిస్తుంది. అన్న తన చెల్లెల్ని మంచిగా చూసుకోమని చెబుతాడు. "ఇంగో మా చెల్లి అచ్చింది. మంచిగ కోన్ని కొయ్యి గారెలు జెయ్యి. తాల్పన్నం అండు అని చెప్పి చెప్తడు." కాని అతని భార్య పుట్టింటికి వచ్చిన ఆడపడుచుని అనేక రకాలుగా ఇబ్బంది పెడుతుంది. ఇవేమి తెలియకుండా ఉన్న అన్న తన చెల్లెలికి తన భార్య అన్ని సమాకూర్చుతుందని భ్రమలో ఉంటాడు. ఆయన ఊహించినదానికి భిన్నంగా అతని భార్య వ్యవహరిస్తుంది. పైగా చెల్లెలు ఏదో తప్పు చేసినట్టు బుకాయించి చెబుతుంది. తన చెల్లెలు తప్పు చేసిందనుకొని చెల్లెలి ఇంటికి వెళతాడు. అక్కడ దీపానికి తాను వదినె వల్ల పడ్డ ఇబ్బందులను చెప్పుకుంటుంది. అది విన్న అన్న చెల్లెలు కష్టాలకు బాధపడి తనకున్నదంత చెల్లెలికి ధారపోసి వస్తాడు. తన చెల్లెల్ని ఇబ్బంది పెట్టిన వదినెను పిచ్చిదాన్ని చేస్తారు. జానపదుల్లో ఆడబిడ్డ ఉసురు పోసుకోవద్దు, ఆడబిడ్డ కలఖల తగులుతుందనే అనే సామెతలు వాడుతుంటారు. ఆమె పుట్టింటి నుంచి అత్తారింటికి వెళ్లినప్పుడు ఏదోకటి ఇచ్చి పంపించడం ఆనవాయితి. తాను కోరింది ఇవ్వకపోతే అది పుట్టింటికే నష్టం చేకూరుస్తుందని ప్రజలు నమ్ముతారు. అందుకే ఈ సామెతలు ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్నాయి.

'చెల్లెలు దిద్దిన కాపురం' అనే కథలో ఒక చెల్లె అన్నకు జరుగుతున్న అన్యాయాన్ని గురించి తెలుసుకొని వదినె అడిగిన పొడుపు కథను విప్పి అన్న ప్రాణాలను కాపాడుతుంది. అక్రమ సంబంధం పెట్టుకున్న వదినె ఏనాటికైనా ఆ విషయం భర్తకి తెలిస్తే చంపేస్తాడని ముందే గ్రహిస్తుంది. అందుకు బదులుగా తానే ఒక పొడుపుకథ అల్లి అది చెప్పకపోతే భర్తను చనిపోవాలని పందెం కాస్తుంది. భార్య అక్రమ సంబంధ గురించి తెలియని భర్త భార్య వేసిన పొడుపుకథని విప్పలేక సతమతమై చావే

శరణ్యమని విచారిస్తాడు. కానీ ఆ ఊరి గుడి దీపాలు రహస్యంగా మాట్లాడుకుంటున్న విషయాలను విన్న తన చెల్లె అసలు నిజాన్ని తెలుసుకుంటుంది. అన్న సహాయంతో పంచాయితి పెట్టించి వదినని పిలిపిస్తుంది. వదిన వేసిన పొడుపుకథను విప్పడమే కాకుండా, ఆమె అక్రమ సంబంధాన్ని కూడా పెద్ద మనుషులకు తెలియజేసి తగిన శిక్ష పడేలా చేస్తుంది. జానపదులు వాస్తవ సంఘటనలనే కొన్ని కథలో చిత్రించినట్లు కనిపిస్తుంది. మానవ సంబంధాల్లో ముఖ్యంగా కుటుంబాల్లో నెలకొన్న సంఘర్షణలను తరచి చూసుకోవడానికి, ఎవ్వరిని వారు నిరంతరం సంస్కరించుకోవడానికి ఉపయోగ పడే కుటుంబ జీవన చిత్రణలే కనిపిస్తాయి.

మరొక కథ 'మూడు వస్తువుల ఆస్తి' ఒక కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు. వారిద్దరికి వాళ్ల తల్లిదండ్రులు చనిపోయే ముందు ఆవు, దుప్పటి, చెట్టు ఈ మూడు వస్తువులే మనకున్న ఆస్తి. వాటిని సమానంగా ఉపయోగించుకోవాలని చెప్పి చనిపోతారు. అయితే ఇద్దరిలో పెద్దవాడైన అన్న స్వార్థబుద్ధితో తాను వాటిని సరిగా వాడుకొని తమ్ముడికి ఎలాంటి ప్రతిఫలం దక్కనివ్వకుండా చేస్తాడు. ఆ మూడు వస్తువుల నుంచి వచ్చే లాభాలు అన్న తీసుకుని తమ్ముడి శ్రమను మాత్రమే ఉపయోగించు కుంటాడు. తల్లిదండ్రుల తర్వాత అంతటి బాధ్యతను చూపడం మరిచి తాను మాత్రమే ఎదగాలని ఆశిస్తాడు. కాని తమ్ముడి భార్య ఉపాయంతో అన్నకు సరైన బుద్ధి చెప్తాడు. ఇలా అన్నదమ్ములు ఐక్యత మాని స్వార్థబుద్ధితో ఆలోచిస్తే జరిగే పరిణామాలను సరిగ్గా చిత్రించిన కథ 'మూడు వస్తువుల అస్తి కథ'.

ఒక తల్లి పేగు బంధం తెంచుకొని పుట్టిన అన్నదమ్ముల మధ్య ప్రేమల కన్నా ద్వేషాలే ఎక్కువగా కనిపిస్తాయి. అవి ఒక్కొక్కసారి చంపడానికి కూడా దారి తీసే ప్రమాదం ఉంటుంది. 'అన్నదమ్ముల కథ' అనే కథలో ఐదుగురు అన్నదమ్ములు. పెద్ద అన్నయ్య తమ కన్న అన్ని రంగాల్లో రాణించి మంచి పేరు, డబ్బు సంపాదించాడని చెప్పి మిగిలిన నలుగురు అన్నదమ్ములు కలిసి చంపాలనుకుంటారు. నలుగురు అన్నదమ్ములు కలిసి చంపితే నలుగురు ఏమనుకుంటారని చెప్పి కర్ర పట్టుకోకుండా పాము చావాలన్న తీరు, చేతులకి మట్టి అంటకుండా పని అయిపోవాలన్నట్టు ఎక్కడ అనుమానం రాకుండా మంగలి వాడికి డబ్బు ఆశ చూపి పెద్ద అన్నను చంపించే ప్రయత్నం చేశారు. కానీ వారు అనుకున్న ప్రయత్నం ఒక బ్రాహ్మణుడి వల్ల విఫలమవుతుంది. ఆ బ్రాహ్మణుడు పెద్ద అన్నకి చెప్పిన హితమైన వాక్యాలు సందర్భానుసారంగా పని చేసి అతని ప్రాణాలకున్న ముప్పును తప్పిస్తాయి. ఆ విధంగా తండ్రి తరువాత

తండ్రి అంతంటివాడైన  అన్నను చంపించడానికి కూడా వెనుకడాని తమ్ముళ్లు కుటుంబాల్లో ఉంటారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

## 3.4.4 వదిన

ఉమ్మడి కుటుంబాల్లో అన్న తరువాత వదినకే అత్యున్నతమైన స్థానం ఉంటుంది. వదిన ఇంటికి మరో పెద్దగా ఉండి కార్యక్రమాలన్ని తన మీదుగానే నడిపిస్తుంది. జానపదుల్లో వదిన, ఆడపడుచుల మధ్య జరిగిన సంఘటనలే కథలుగా ఎక్కువగా కనిపిస్తాయి. వదిన, ఆడపడచుల మధ్య అసూయ ద్వేషాలు, అభిమానాలు రెండు కనిపిస్తాయి.

'అన్న చెల్లెలు' కథలో వదిన అసూయ, స్వార్థబుద్ధితో సహాయం చేయకుండా చెల్లెల మీద నింద మోపుతుంది. ఇంటికి ఆడపడుచు వస్తే తనకు పిండివంటలు చేయకుండా పామును వండి దుర్మార్గపు బుద్ధిని చూపుతుంది. "ఇగ ఈయనకు మంచి తాల్పన్నము గారెలు అన్ని వెట్టి మొగనికీ, ఆడు తింటుండు. ఈమెకు కప్పల కూర, కల్లోమో ఈ రొచ్చు జనిగలుండి తౌడు రొట్టెలు చేసి ఇవి తినుమని చెప్పి తినుపిల్ల అని చెప్పి ఇక్కడ పెట్టింది." తాను ఒక ఇంటికి ఆడపడుచునని మరచి వట్టి చేతులతో తన భర్త చెల్లెలిని పంపిస్తుంది. అన్న చెల్లెలికి ఏదైనా సహాయం చేస్తాడేమోనని వారిద్దరూ కలవకుండా అన్న జాడ చెప్పకుండా పంపిస్తుంది. మరదలుపై లేని పోని నిందలు మోపి అన్నచేత చెల్లెలిని దండించేలా చేయాలని అనుకుంటుంది. కాని తాను ఒకటి తలిస్తే దైవం ఒకటి తలచాడన్నట్లు ఎంత నాశనం చేయాలనుకుందో అంతకుమించి చెల్లెలు ఉన్నత స్థానానికి చేరుకుంటుంది. వదినగా తన మరదలు కొంత ధనం, సంపదతో ఐశ్వర్యంగా కనిపించేసరికి ఓర్చుకోని మనస్తత్వం గలది. పుట్టింటికి వచ్చిన ఆడపడుచుని వట్టి చేతులతో పంపిస్తుంది. కాని తన పుట్టింటివారికి ఏదైనా ప్రమాదం జరిగితే మాత్రం ఉన్నదంతా దోచి పంపిస్తుంది. ప్రతి ఉమ్మడి కుటుంబాల్లో ఇలాంటి వదినలుండే ఉంటారు. వారి వల్ల ఉమ్మడి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయనడంలో సందేహం లేదు. అన్న మీద ప్రేమతో చెల్లెలు అన్న సంసారాన్ని నాశనం చేయడం ఇష్టంలేక తన బాధనంతా దీపానికి చెప్పుకుంటుంది. అది విన్న అన్న చెల్లెలి బాధని అర్థం చేసుకుంటాడు. వదినె చేసిన అవమానాలు

ఎంతో ఓపికతో భరిస్తుంది. దేవుడి దయ వల్ల కష్టాల కడలి నుండి ఉన్నత స్థాయికి చేరుకుంటుంది. అన్న వదినెలా సుఖాన్ని మాత్రమే కోరుకునే చెల్లెలుగా మిగిలిపోతుంది.

'కనకతార' కథలో తల్లిదండ్రులతో సమానమైన అన్నను చంపి, వదిన మీద మోహంతో తన మరిది ఆమెను ఎన్ని కష్టాల పాలు చేశాడో ఈ కథ చెబుతుంది. ఉదయసేనుడు, చారుమతి భార్యభర్తలు. ఉదయసేనుని తమ్ముడు కూరసేనుడు. పేరుకు తగ్గట్టుగానే క్రూరమైన మనస్తత్వం కలవాడు. రాజ్యం మీద కాంక్షతో, రాజ్యాధికారం చేజిక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో తన అన్న ఉదయసేనుని అతికిరాతకంగా చంపేస్తాడు. భర్త పోయి విధవగా ఉన్న ఒంటరియైన చారుమతిని దక్కించుకోవాలని దురుద్దేశ్యంతో చారుమతి దగ్గరికి వస్తాడు. చారుమతి తల్లితో సమానమైన నన్ను ఇలా మాట్లాడటం సరికాదు అని అంటుంది. చారుమతి తన మీద దురుద్దేశ భావాలతో ఉన్న మరిది మనసుని మార్చగలుగుతుంది.

## 3.4.5 అత్త – కోడలు

జానపద కథల్లో ఎక్కువగా కనిపించే పాత్రలు అత్త కోడలు. వీరికి సంబంధించిన కథలు కోకొల్లలు. ఉమ్మడి కుటుంబాల్లో వీరి సఖ్యత చాలా అవసరం. వీరిద్ధరూ మధ్య కలహాలు లేకపోతే ఆ కుటుంబాలు ప్రశాంతంగా ఉన్నట్టే. తన ఇంటికి వచ్చిన కోడల్ని అత్త బాగా చూసుకోవాలి. అలాగే కోడలు అత్తను కూడా తల్లితో సమానంగా భావించాలి. అప్పుడే ఉమ్మడి కుటుంబాలు నిలబడతాయి.

'కాటి మీదికెక్కిన కోడలు' కథలో అత్త, కోడల్ని చంపివేయాలని చూస్తుంది. ఆమె అత్త, భర్త పిసినారులు. వారి పిసినారి తనం వల్ల ఆ ఇంటికి అడుక్కునే వారు కూడా రారు. ఆ కుటుంబాన్ని పరీక్షించడానికి శివుడు ముసలి రూపంలో మారువేషంలో రాగా అత్త, భర్త దానం చేయడానికి ఏమిలేదని తిప్పి పంపిస్తారు. కోడలు మాత్రం మానవత్వంతో ఆ ముసలివాడికి రొట్టె ముక్కని దానం చేస్తుంది. "'అబ్బో! నా ఇల్లు మునిగింది. పోయి అగో రోట్టెలు దానం చేత్తుంది. దీన్ని ఎం లేదు. ఇగ కాల పెట్టుడే మన ఇల్లు ఆగదిరా? కొడుకా... అగో! ఇగ దానానికి ఎగబడ్డది. సగం తిన్న రొట్టె ముసలోనికి వేసింది" దానం చేసిన కోడల్ని ఎలాగైనా చంపేయాలని పాడి పేరుస్తారు. కాని శివుడు

వచ్చి ఆమెను రక్షిస్తాడు. ఆమె కోరిన వరాలను అందించి సంతాన ప్రాప్తిని కలిగిస్తాడు. దానం చేస్తే కలిగే ఫలితం వివరిస్తుంది ఈ కథ. అత్త, భర్తకు ఉన్న పిసినారి గుణాన్ని మార్చి వారికి దానం గొప్పతనాన్ని తెలియజేస్తుంది.

'అత్తిచ్చిన అప్ప' అనే కథలో అమాయకురాలైన కోడలు మనస్తత్వాన్ని అర్థం చేసుకొని తన భర్త రక్షిస్తాడు. బాల్యవివాహం ద్వారా తెచ్చుకున్న కోడల్ని పెరిగి పెద్దదయ్యాక తన కొడుక్కి వేరే పెళ్లి చేయాలని అనుకుంటుంది. కాని ఆమె భర్త మంచివాడు. కాబట్టి తల్లి మూర్ఖత్వాన్ని కాదని తన భార్యకి ప్రేమతో తనకిష్టమైన గారెలను చేసి పెడతాడు.

'అత్తకాల విషం' అనే కథలో కోడల్ని సహించుకోలేని అత్త గర్భిణితో ఉన్న కోడల్ని చంపేస్తుంది. ఎవ్వరైన కోడలి శవాన్ని గుర్తుపట్టకుండా నడి బజారు కూడలిలో పాతి పెడుతుంది. ఆత్మగా మారిన కోడలు అత్త చేసిన దుష్కార్యాలను చెట్టుగా వెలిసి, తన బాధను తల్లిదండ్రులకు విన్నవిస్తుంది. కోడల్ని నమ్మించి మోసం చేసిన అత్త గురించి ఈ కథలో చిత్రించడం జరిగింది.

'అత్తని నమ్మని కోడలు కోడల్ని నమ్మని అత్త' అనే కథలో అత్త, కోడళ్ల మధ్య సంభాషణలు చమత్కారంగా, వ్యంగ్యాత్మకంగా ఉంటాయి. ఒక ఇంట్లోనే ఉంటూ తమ కోరికలు తీర్చుకోవడానికి ఒకరిని చూసి మరొకరు భయపడుతూ ఉంటారు. వీరిద్దరి మనస్తత్వాలను అర్థం చేసుకున్న బిచ్చగాడు కోడలు నూరిన పిండి ముద్దని తీసుకెళ్లి హాయిగా తింటాడు. గర్భిణితో ఉన్న కోడలు కోరికలు అర్థం చేసుకోకుండా కోడలు లేనప్పుడు ఇంట్లో సరుకులతో పిండివంటలు చేసుకుని తింటుంది. అత్త తప్పు చేసిన కోడలికి భయపడితె, కోడలు ఏ తప్పు చేయకున్న అత్త పెత్తనంతోనే భయపడుతూ తన కోరికలను చంపుకుంటుంది. చివరికి అత్త దొంగ బాగోతం దేవుని గదిలో చూసి  నివ్వెర పోతుంది. ఇలా ప్రతి ఇంట్లో అత్తకోడల్ల మధ్య గల చిన్న చిన్న సంఘర్షణలు, అర్థావగాహనలోపాల వల్ల జరిగే సంఘటనలు ఈ కథ బాగా చిత్రించింది.

పై విధంగా కథల్లోనే కాదు ప్రతి కుటుంబాల్లో కోడలు చేసిన చిన్న తప్పునైనా సరే భూతద్దాల్లో పెట్టి చూసి అదొక నేరంగా భావించే అత్తలు, అత్తని సరిగా చూసుకోకుండా కొడుకుని తల్లికి దూరం చేసిన కోడళ్ళు లేకపోలేదు. పరాయి స్త్రీలను ఓర్వలేని భావజాలంతో అత్త, కోడళ్ళ మధ్య సంఘర్షణలు అనేకం మన కుటుంబాల్లో నిత్యం గొడవల రూపంలో కనిపిస్తూనే ఉంటాయి.

## 3.4.6 అత్త – అల్లుడు

జానపద విజ్ఞానంలో అత్త అల్లుళ్లకు సంబంధించిన కథలు, గేయాలు, సామెతలు హాస్య పూరితంగా, శృంగారభరితంగా ఉంటాయి. అత్తకు అల్లుని మీద ఉండే ఆప్యాయత అనురాగాలు, భయం భక్తిని తెలుపుతాయి. కొన్ని గేయాల్లో అత్త పేరు మీద శృంగార గేయాలు కనిపిస్తాయి. నా కథా సేకరణలో అలాంటివి తక్కువ. అల్లుడు అత్తగారింటికి చేరినప్పుడు అతనిని ఏ విధంగా మర్యాదలు చేస్తారనే కథలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అల్లుడు ధనవంతుడైనా, పేదవాడైనా అత్తగారింటికి వస్తే కొంత ఠీవిని, డాబుని ప్రదర్శిస్తాడు. ఏ విషయంలో తక్కువ కాదనే భావనతో మెలుగుతాడు. అత్త తన కూతురిని ఇచ్చి పెళ్లి చేస్తుంది. కాబట్టి తన కూతురిని బాగా చూసుకోవాలని కూతురి సుఖం కోసం అల్లుడికి అతి మర్యాదలు చేసి పంపిస్తారు. అల్లుడు రాగానే అతనికి ఇష్టమైన వంటకాలు చేసి వండిపెడుతుంది. పేద వారైనా సరే మర్యాద విషయంలో అత్త ఏమాత్రం తగ్గదు. అత్త అల్లుడికి కట్న కానుకలతో, రుచికరమైన వంటకాలతో తృప్తిపరచడానికి ప్రయత్నిస్తుంది. అతన్ని చూడగానే వినయంతో, మర్యాదగా లేచి నిలబడి అతి జాగ్రత్తతో మసులుకుంటుంది. కూతురుని కూడా అల్లుని బాగోగులు విషయంలో జాగ్రత్త వహించమని పురమాయిస్తుంది. మన కుటుంబాల్లో అల్లుడిని ముఖ్య అతిథిగా భావిస్తారు. వారు వచ్చినప్పుడు ఏ లోటు లేకుండా చూసుకుంటారు.

'రేచీకటి అల్లుడు' కథలో అల్లుడు, అత్త మధ్య హాస్యపూరితమైన సంఘటనలు ఉంటాయి. అత్తగారింటికి బయలుదేరిన అల్లుడికి రేచీకటి ఉంటుంది. అతనికున్న లోకజ్ఞానంతో అత్తగారింటికి వెళ్లినప్పుడు తనకున్న రేచీకటి వ్యాధి తెలియకుండా కప్పిపుచ్చి అత్తదే తప్పు అన్నట్లు వ్యవహరించి తప్పించుకొని వస్తాడు. కొన్ని సందర్భాల్లో అత్తగారింట్లో డాబును ప్రదర్శించి నవ్వులపాలైతాడు. తన బిడ్డను తీసుకుపోవడానికి వచ్చిన అల్లుడిని అన్ని విధాలా మంచిగా చూసుకోవాలని అనుకుంటుంది అత్త. అల్లుని వింత చేష్టలను అర్థం చేసుకోలేని అత్త తిప్పలు పడుతుంది. అల్లుని కోసం రకరకాల పిండి వంటలు, మాంసం కూరలను తెచ్చి వండుతుంది.

అలాగే 'పిసకొొడుకు' కథలో అమాయకుడైన అల్లుడు అత్తగారింటికి పదే పదే వచ్చి నవ్వుల పాలైతాడు. అత్త తన కోసం చేసిన వంటలను కాదని వెళ్లిపోతాడు. తన తల్లి మాటలను సరిగ్గా అర్థం చేసుకోలేని కొడుకు, అత్తగారింటికి పడే పాట్లు తెలుస్తాయి. అల్లుడి మితిమీరిన మూర్ఖపు చేష్టలకు ఓపిక నశించి నాలుగు దెబ్బలు కూడా అంటిస్తారు.

'అరిసెప్ప' కథలో అత్తగారింటికి వచ్చిన అల్లుడిని చూసుకునే విధానమే కనిపిస్తుంది. అల్లుడికి అత్త చేసే అరిసెప్పలంటే చాలా ఇష్టం. ఆ అరిసెప్పల కోసం భార్యతో పందెం కుదుర్చుకుంటాడు. అరిసెప్పల దక్కించుకోవడానికి చివరికి కొ్రాయి నిప్పు రవ్వ కట్టే వాతలను సైతం తట్టుకుంటాడు. తమ బిడ్డలను పెళ్లి చేసుకునే అల్లునికి ఉండవల్సిన ఓపికను పరీక్షించే విధంగా ఉంటుంది ఈ కథ.

'ఒక గుండుకు రెండు గుండ్లు' అనే కథలో ఒక వ్యక్తి తన తల్లికి భార్య వల్ల జరిగిన అవమానానికి తట్టుకోలేక అలాంటి అవమానమే తన భార్యకు కూడా జరగాలని భావిస్తాడు. అత్త దగ్గరకి వెళ్లి అత్తతో జరిగిన విషయాన్ని చెప్పకుండా మీ బిడ్డకి ఆరోగ్యం బాగాలేదని అబద్ధం చెప్పి నమ్మించి వస్తాడు. అల్లుడి మాటలు నమ్మి బిడ్డ క్షేమం కోసం అత్త గుండు తీయించుకొని సన్నాయి మేళాలతో ఊరేగింపుకి సిద్ధమవుతుంది. జానపద కథల్లో గడుసరి కోడలు మాత్రమే కాదు గడుసరి అల్లునికి సంబంధించిన కథలు కూడా అక్కడక్కడ కనిపిస్తాయని తెలుస్తుంది.

### 3.4.7 భార్యాభర్తల ప్రేమ

ఒక కుటుంబం మంచి కుటుంబంగా ఎదగాలంటే భార్యాభర్తల మధ్య ప్రేమానుబంధం బలంగా ఉండాలి. వారి మధ్య సఖ్యత ఉండి ఒకరినొకరు బాగా అర్థం చేసుకోవాలి. కుటుంబంలో పిల్లల భవిష్యత్తు, పెద్దల ఆరోగ్యం వారి అవసరాలు అన్ని కూడా భార్యాభర్తల మీదనే ఆధారపడతాయి. కాబట్టి భార్యాభర్తలు సత్సంబంధాలు కలిగి ఉండటం చాలా అవసరం. వారి మధ్య బేధాభిప్రాయాలు వస్తే వెంటనే వాటిని పరిష్కరించుకోవాలి. లేకపోతే అవి వారి సంసారాన్ని సర్వనాశనం చేస్తాయి.

'రాణి పగడాల హారం' అనే కథలో భార్యభర్తల అనుబంధం కనిపిస్తుంది. భార్య వల్ల భర్త ప్రవర్తనలో మార్పు వస్తుంది. రాజులకు బహుభార్యత్వం అనేది సహజం. భోగలాలసుడిగా, వేశ్యలోలుడుగా సర్వసుఖాలను అనుభవిస్తాడు. కాని కొంత మంది రాజులు తమకు నచ్చిన భార్యతో జీవితం గడుపుతారు. ఈ కథలో కూడా మంచి మనస్సు ఉన్న అందమైన భార్య దొరుకుతుంది. ఆ

తరువాత రాజు పర స్త్రీకి ఆకర్షితుడవ్వడు. తన భార్యతో హాయిగా సంసారాన్ని కొనసాగిస్తాడు. కాని అంతకుముందు ఈ రాజుతో సాంగత్యం చేసిన ఒక వేశ్య  రాజు భార్య మీద పగ పెంచుకుంటుంది. ఆమె వల్ల రాజు తన దగ్గరకు రావడం లేదని రాజు భార్యని ఎలాగైనా చంపించాలని అనుకుంటుంది. ఆ వేశ్య ఒక మంత్రగత్తెను ఆశ్రయించి రాజు భార్య ప్రాణాలు తీసి ఆత్మగా మారుస్తుంది.  ఆ ఆత్మను మెడలో వేసుకునే ఒక హారంలో పెట్టి ఒక గుహలో బంధిస్తుంది. ప్రాణాలు పోయిన రాజు భార్య శవాన్ని తన మందిరం వెనుక ఒక మర్రి చెట్టు దగ్గర పెట్టుకుని కంటికి రెప్పలా చూసుకుంటాడు. రాత్రి దయ్యం రూపంలో వచ్చి అతనితో మాట్లాడుతుంది. ఆ చిలుక కొయ్యలో ఉన్న హారాన్ని తీసుకువస్తే తన ప్రాణాలు రక్షించవచ్చు అని దెయ్యం రూపంలో ఉన్న భార్య చెపుతుంది. రాజు ఆ గుహలో ఉన్న పగడాల హారాన్ని ఎలాగైనా తెప్పించాలని దాసిలను పంపిస్తాడు. దాసిలు ఆ గుహలో కావలి ఉన్న ముసలమ్మకి తెల్లకళ్లు, గారెలు అమ్మినట్టు నటించి ఆ రాణి పగడాల హారం తెస్తారు. అది రాజు భార్య మెడలో వెయగనే ఆమె తిరిగి బతుకుతుంది. మన సమాజంలో ఆదర్శ దాంపత్య జీవితాన్ని గడుపుతున్న దంపతులను చూసి అసూయపడటం సహజమే. ఈర్ష్య అసూయలతో దంపతుల మధ్య ఎలాంటి చిక్కులైనా పెట్టగలరు. కాబట్టి దంపతుల మధ్య దాపరికాలు లేకుండా ఒకరి మీద ఒకరు ప్రగాఢ నమ్మకంతో జీవించాలని కథకుడు ఆశించాడు. మన చుట్టూ ఉన్న సమాజం నుంచి గాని, కుటుంబాల నుంచి గాని మిత్రులు, శత్రువులు పుట్టుకొస్తారు. వారి వల్ల భార్యాభర్తలు విబేధాలు తెచ్చుకుని జీవితాలు నాశనం చేసుకోకూడదని ఈ కథ తెలుపుతుంది. భర్త తన భార్యకు జరిగిన అన్యాయాన్ని గ్రహించి వారి నుండి భార్యను రక్షించుకోవడమే కాదు శత్రువులకు తగిన శిక్ష పడేలా చేస్తాడు.

మరో రెండు కథలు 'పోశమ్మ మొక్కు కథ'లో భర్తను మోసం చేసే భార్య పాత్ర దర్శనమిస్తుంది. భర్త గొర్రెలు కాసేవాడు. అతడు గొర్రెలు కాయడానికి పోతే భార్య మరొకరితో సంబంధం పెట్టుకుంటుంది. ఇది ఇతరుల ద్వారా విని తెలుసుకుంటాడు. తెలిసి వెంటనే ఇంటికి వెళ్లి చూస్తే నిజంగా తన భార్యతో మరొకరు కనిపిస్తారు. వాళ్లు అతనిని చంపాలన్న పన్నాగాన్ని రహస్యంగా వింటాడు. మరుసటి రోజున తన భార్య పోశమ్మ గుడికి పోయి అమ్మవారికి అన్ని సమకూరుస్తూ నా భర్త కళ్లు పోవాలని వేడుకుంటుంది. భార్య మాట విన్న భర్త నిజంగానే కళ్లు పోయినట్లు నటిస్తాడు. ఇక మొక్కిన వరం పోశమ్మ తల్లి తీర్చిందనుకొని మొక్కులు తీర్చగా అదే రోజున ఇంటికి వచ్చిన అక్రమ

సంబంధం ఉన్న వ్యక్తిని భర్త చంపేస్తాడు. ఊరి పెద్దలకు చెప్పి భార్య చేసిన తప్పులకు శిక్ష అనుభవించేలా చేస్తాడు.

'సత్యహరిశ్చంద్రుడి' కథ జానపద సాహిత్యంలోనూ, శిష్టసాహిత్యంలోనూ బాగా ప్రాచుర్యం పొందిన కథ. అనేక ప్రక్రియల్లో వైవిధ్యంతో అందరికి సుపరిచితమైన కథ ఇది. ఇందులో సత్యహరిశ్చంద్రుడు శనీశ్వరునికి ఇచ్చిన వాగ్దానం ప్రకారం కోటి రూపాయాలు తక్కువ పడితే చాలా బాధతో విచారిస్తాడు. అప్పుడు సత్యహరిశ్చంద్రుని భార్య చంద్రమతి తనను అమ్మి భర్తను బాకీ తీర్చమని ప్రార్థిస్తుంది. భర్త మాటను నిలబెట్టడానికి తాను ఒక వృద్ధ బ్రాహ్మణుడికి అమ్ముడు పోయి నానా చాకిరి చేస్తుంది. ఎన్నో బాధలను అనుభవిస్తుంది. కొడుకుని పోగొట్టుకుని శవాన్ని తన భుజాల మీద వేసుకుని కాటికి తీసుకెళుతుంది. అక్కడ భర్తతో తాను పడ్డ కష్టాలను చెప్పుకొని రోధిస్తుంది. ఆదర్శ దంపతులకు నిదర్శనం సత్యహరిశ్చంద్రుడు, చంద్రమతి. ఈ కాలంలో భర్త మాటను వినకపోగా భర్తలకే ఎదురు చెప్పే భార్యలందరకి చంద్రమతి మార్గదర్శకురాలు. ఆ సమాజం కోరుకున్న ఆదర్శ దాంపత్య జీవితాన్ని పొందటానికి కథకులు కల్పించిన కథల్లో సత్యహరిశ్చంద్ర కథ అద్వితీయం. పుట్టింటి నుండి అత్తగారింటికి వెళ్లిన తర్వాత భర్తయే శాశ్వతం. అన్ని తానై భార్యను చూసుకోవాల్సిన బాధ్యత భర్తది. ఇరువురి పరస్పర సహకారమే వారి కుటుంబానికి, వారికి శ్రీరామరక్ష.

'బూరెప్ప కథ' అనే కథలో భార్యాభర్తలు ఇద్దరు బూరెప్పల కోసం పందెం పెట్టుకొని ఒకరికొకరు మాట్లాడకోకుండ ఉండే విధంగా పోటీకి దిగుతారు. చిన్న చిన్న సరసాలు, సరదాలు, ఆనందాలు పొందడం కోసం ఇలాంటి పందెలు పెట్టుకుంటారు. భార్యాభర్తలు ప్రేమానురాగాలను, ఆప్యాయతలను ఇవి రెట్టింపు చేస్తాయని తెలుస్తుంది.

'కానుగ పట్నం' అనే కథ ఒక అమాయకపు భర్తతో భార్య పడే తిప్పలను వివరించే కథ. కొంతమంది మగవారు తన భార్య కన్న అందంగా ఉన్న పరాయి వారి భార్యను అనుభవించాలి అనుకోవడానికి ప్రయత్నం చేస్తు ఉంటారు. అలాంటి ఒక వ్యక్తి ఈ కథలో అమాయకపు భర్తకు వస్తు ఆశను చూపి తన భార్య మీద చేయి వేసి తీసుకెళ్లాలని పన్నాగం పన్నుతాడు. కాని అప్పటికే అతని భార్య ముందుగానే పరాయివాడి ఆలోచనలను పసిగట్టి భర్తతో చెప్పి కానుగపట్నం రాజు దగ్గరికి న్యాయం కోసం పోతుంది. కానుగ పట్నంలో కూడా తన భర్త తెలియనితనంతో ఇర్కాటంలో పడితే రాజుతో చెప్పి భర్తను ఇంటికి పంపించమని ప్రార్థిస్తుంది. ఇలా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోనైనా

అమాయకపు భర్తను భరిస్తుంది తప్ప భర్తను వదిలివెళ్లిపోదు. ఈ కథ భార్యభర్తల మధ్య ఉండవల్సిన సఖ్యతను గూర్చి వివరించడమే కాకుండా భర్తను నిత్యం సమాయత్తం చేయడం ఎలాగో నేర్పిస్తుంది.

'మునుపటి సంబంధం' అనే కథలో ఒక భర్త భార్యను అర్థం చేసుకోకుండా తన కడుపును మాత్రమే నింపుకుంటాడు. ఇంట్లో చేసిన వంటకాలన్ని భర్త తిని భార్యకు ఏమి మిగలకుండా చేస్తాడు. అదేంటని అడిగే ప్రశ్న కూడా వేయలేని విధంగా ముందే సమాధానం చెప్తాడు. ముందు సంబంధమే భలే సంబంధం అంటూ ఆ రోజు భార్య చేసిన ఆహారాన్ని అంత తింటాడు. ఇక భార్య తిన్నదా లేదా అన్న ప్రశ్న కూడా అడగడు. అలా భర్త తన అవసరాల కోసం మాత్రమే భార్యను చేసుకున్నడన్న నిజాన్ని తాను ఆలస్యంగా అర్థం చేసుకుంటుంది. పుట్టింటికి వెళ్లి తన అన్నతో విషయాన్ని చెప్పి అన్న సహాయంతో భర్తలో మార్పును తెస్తుంది. ఎంతో కష్టపడి భర్తను అన్ని విధాలా చూసుకునే భార్యకు తన అభిప్రాయాలకు విలువ ఇవ్వని భర్త దొరకడం ఎంతో బాధకరమైన విషయమో ఈ కథ తెలియ చేస్తుంది.

'చాకలి పుల్లక్క పాతివ్రత్యం' అనే కథలో ఒక ఊరిలో అందమైన వివాహిత స్త్రీని, తన భర్తలేని సమయం చూసి ఆ ఊరి అధికారులు లొంగదీసుకోవడానికి ప్రయత్నిస్తారు. కానీ ఆ స్త్రీ చాలా తెలివిగా వారందరి నుంచి తప్పించుకుని తన పాతివ్రత్యాన్ని నిరూపించుకుంటుంది. అమె తన మాన, ప్రాణాలు తన  భర్తకే దక్కాలని ఎంతో ధైర్యంతో పోలీసు, పటేలు, సైకుదారు, అమీను లాంటి అధికారులందరిని ఎదుర్కొంటుంది. భార్యాభర్తల బంధానికి ఆమె ఇచ్చిన విలువ ఈ కథలో చిత్రించబడింది. పరాయి మగవాడు నీడని కూడ తన మీద పడకుండా తనని తాను కాపాడుకున్న సాహస కృత్యం భర్తతో చెప్పి భర్త ప్రశంసలు అందుకుంటుంది. ఈ కథ భార్యభర్తల మధ్య నమ్మకం ఉంటే ఎవ్వరు తమని విడదీయబోలేరని సత్యాన్ని సూచిస్తుంది. అంతేగాకుండా అలాంటి అన్యోన్య సంసారం ఎల్లవేళలా సుఖవంతంగా సాగుతుందని స్ఫూర్తినిచ్చే కథ చాకలిపుల్లక్క పాతివ్రత్యం కథ.

భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలు, కోపాలు, తాపాలు, ద్వేషాలు, కొట్లాటలు ఉండటం సహజం. కొన్ని విషయాల్లో ఒకరికి ఒకరు పోటి పడటం కూడా చూస్తుంటాం. 'అరిసెప్ప కథ'లో ఇలాంటి విచిత్రమే కనిపిస్తుంది. అత్త చేసిన అరిసెప్పల కోసం భర్త, భార్య ఇద్దరు ఒక పందెం వేసుకుంటారు. ఎవ్వరైతే ఒక రోజు మాట్లాడకుండా ఉంటారో వారికే అరిసెప్పలని పందెం కడతారు. మరుసటి రోజు వరకు భర్త ఓపికతో మాట్లాడకుండా ఉంటాడు. భార్య ఓడిపోతుంది. అత్తగారింటి వద్ద

అల్లునికి ఉండవల్సిన ఓపికను ఈ కథ సూచిస్తుంది. అలాగే భార్యతో పోటి పడి గెలిచి తన మీద ఉన్న గౌరవాన్ని పెంచుకుంటాడు. ఈ విధంగా ఆదర్శదంపతులకు ప్రేమలు, ఆప్యాయతలు, కొట్లాటలు, పోటీలు, పంతాలు, సరసాలు, విరసాలు, ఆటలు, పాటలు సమస్తం ఉంటే వారి జీవితం సుఖప్రదంగా ఉంటుందనడంలో సందేహం లేదు.

ఆదర్శ దాంపత్య జీవితం అన్ని వేళలా సాధ్యం కాదు. భార్యగాని, భర్తగాని ఒకరికి ఒకరు నమ్మకంతో జీవితాన్ని కొనసాగించాలి. ఇద్దరిలో ఎవరు సాంఘీక నియమాలను అతిక్రమించిన బంధుత్వాలు, బాంధవ్యాలు కూలిపోతాయి. 'పోశమ్మ మొక్కు' కథలో అక్రమ సంబంధం పెట్టుకున్న భార్యకి ఎలాగైనా బుద్ధి చెప్పాలని ఎంతో ఓపికతో పరీక్షిస్తాడు. అలాగే చెల్లె దిద్దిన కాపురం కథలో భార్య వేరే వాడితో అక్రమ సంబంధం పెట్టుకుని భర్తనే చంపాలని అనుకుంటుంది. ఈ విధంగా భర్త మంచివాడైతే, భార్య మంచిది కాకపోయినా, భార్య మంచిదై, భర్త చెడ్డవాడైనా ఆ కాపురం నిలబడటం కష్టమే.

## 3.4.8 తోడి కోడల్లు

ఒకే దంపతులకు పుట్టిన మగ పిల్లల్ని అన్నదమ్ములని అంటారు. వారి భార్యలనే తోడి కోడళ్లు అంటాం. తెలంగాణలో యారాలు, ఏరాలు అనే పదాలు వ్యవహారంలో ఉన్నాయి. అన్నదమ్ములు ఒకే ఇంటివారైనా వారి భార్యలు వేరు వేరు ప్రదేశాల నుంచి వచ్చి ఉంటారు. వారు పుట్టి పెరిగిన వాతావరణం ప్రభావం వల్ల రెండు మనస్తత్వాలు విభిన్నంగా ఉంటాయి. తద్వారా వారి మధ్య అన్యోన్యత ఉంటే మంచిది. లేకపోతే పాలిపగ మొదలైనట్టే. తోడికోడల్ల వల్లే అన్నదమ్ములు ఎక్కువగా గొడవలు పడుతుంటారు. ఒకరంటే ఒకరు ప్రతి దానిలో పోటితత్త్వాన్ని పెంచుకుంటారు.

'తోడి కోడల్ల అత్యాశ' అనే కథలో షావుకారి కుటుంబానికి చెందిన అన్నదమ్ముల కుటుంబాలు రెండు ఉంటాయి. వారి భర్తలు వివిధ ప్రాంతాలు తిరిగి వ్యాపారం చేస్తారు. భార్యలు ఇంటి దగ్గరనే ఉంటారు. ఒకరోజు అన్నదమ్ములు వ్యాపారానికి వెళుతూ వ్యాపారానికి తీసుకెళ్లే నువ్వులను గుమ్మిలో దాచిపెడతారు. చిన్న కోడలు పెద్దామెతో నేను నువ్వులు వేయించుకొని తింటున్నాను నువ్వు కూడా వేయించుకోమని చెబుతుంది. చిన్నకోడలు నిజమే చెబుతుందనుకొని పెద్దామె వాళ్ల గుమ్మిలో నువ్వులన్ని వేయించుకొని తింటుంది. వ్యాపారం అయిపోయి వాళ్ల భర్తలు తిరిగి వస్తారు. పెద్ద కోడలు

భర్త వచ్చి గుమ్మిలో నువ్వులన్ని వేయించుకుని తిన్నందుకు వాళ్ల భార్యను ఇంట్లో నుంచి పంపిస్తాడు. ఆమె అదృష్టం బాగుండి గుడిలో దొంగలు వదిలిన ధనంతో ఇంటికి చేరుతుంది. పెద్దకోడలుని భర్త చేత కొట్టించాలని, వాళ్ల వ్యాపారం సాఫీగా సాగకూడదనే నువ్వుల వేయించుకోకుండానే రోజు తింటున్నా అని చిన్నకోడలు అబద్ధం చెబుతుంది. చిన్న కోడలు పెద్దకోడల్ని ఎంత అసూయతో బయటకి పంపించిందో ఆ దేవుడు ఆమెకు రెట్టింపు ధనాన్ని, సంతోషాన్ని కల్గిస్తాడు. పెద్ద కోడలుపై చిన్న కోడలి ఈర్ష్య అసూయ భావాలు వ్యక్తమవుతాయి. దురాశ, స్వార్థబుద్ధితో చిన్నామె చేసిన పనికి చివరికి తాను తవ్వుకున్న గోతిలో తానే పడుతుంది.

'మూడు వస్తువుల ఆస్తి' కథలో ఇద్దరు తోడి కోడళ్ల వల్ల స్వంత అన్నదమ్ముల మధ్య వైరం పెరుగుతుంది. అన్న భార్య చెప్పిన మాట విని తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిని తమ్ముడికి సమానంగా పంచుతాడు. లాభాలు తెచ్చే వస్తువులని తాను ఉంచుకొని తమ్మున్ని మోసం చేస్తాడు. చిన్నవాడి భార్య తెలివైనది. కాబట్టి అక్క బావల ఆలోచనలను పసిగట్టి తన భర్తకు సలహాలు ఇస్తుంది. ఆ మూడు వస్తువుల వల్ల వచ్చే ఆదాయాన్ని రాకుండా చేస్తుంది. చిన్నవాడి భార్య తన భర్త మంచితనాన్ని చేతకానితనంగా భావించే అన్నకు తమ్ముని చేష్టల వల్ల బుద్ధి వచ్చేలా చేస్తుంది.

'కొడుకులున్న తండ్రికి వచ్చిన గతి' కథలో నలుగురు తోడికోడళ్లు కలిసి తమ భర్తలకి తండ్రిని దూరం చేస్తారు. ఎంతో ధనం సంపాదించి తన కొడుకులు, కోడళ్లు బాగా ఉండాలనుకున్న మామ అనారోగ్య పరిస్థితి పట్టించుకోకుండా భర్తలకి నచ్చజెప్పి రేకుల షెడ్డుని వేయిస్తారు. మంచి హోదాలో బతకడానికి కారణమైన తమ భర్త తండ్రిని తాము తండ్రిగా భావించి, అతని బాగోగులు చూసుకోవాల్సింది పోయి తినడానికి తిండి పెట్టక పస్తులుంచుతారు. నలుగురు తోడికోడళ్లలో ఒక్క కోడలైనా బాధ్యతగా వ్యవహరించి ఉంటే తమ భర్తల తండ్రి (మామ గారు) ఇంకొన్నాళ్లు బతికి ఉండేవాడు. ముఖ్యంగా ఉమ్మడి కుటుంబాల్లో తోడి కోడళ్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది.

## 3.4.9 సవతులు

ఒక వ్యక్తి రెండో భార్యని సవతి అంటాం. సహపత్ని, సపత్ని, సవత్ని, సవతి అనే శబ్ద పరిణామ క్రమం జరిగింది. మగవారు ఒకటి కంటే ఎక్కువ వివాహాలు చేసుకోవడం కనిపిస్తుంది. రాజుల విషయానికస్తే బహూభార్యత్వం సహజంగానే ఉండేది. కాని సామాన్యుల్లో మాత్రం భార్య హఠాత్తుగా చనిపోయి భర్త యుక్త వయస్సులో ఉన్నప్పుడు గాని, భార్యకు తెలియకుండా భర్త ఇతరులతో అక్రమ సంబంధం పెట్టుకున్నప్పుడు గాని భార్యకు సవతులు వచ్చి చేరతారు. ఏ సవతులు మధ్య సఖ్యత కుదిరి కలిసిమెలిసి ఉన్న దాఖలాలు ఉండవు. కాబట్టి సవతి పోరు అన్న మాట కూడా ఎక్కువగా రూఢిలో ఉంది. జగిత్యాల జానపద కథలో సవతి పోరు, సవతి తల్లి పోరుకి సంబంధించిన కథలు కనిపిస్తాయి.

'అక్కెమ్మలు' కథలో ఒక రాజుకి ముగ్గురు భార్యలు. కాపు స్త్రీ, బ్రాహ్మణ స్త్రీ, వైశ్య స్త్రీ మొదలైన కులాలకి చెందిన వారు కాబట్టి వాళ్లకు అవే పేర్లను కథలో కథకురాలు ఉపయోగించింది. అయితే కాపు స్త్రీ రాజుకి మూడవ భార్య. మిగిలిన ఇద్దరు భార్యలు కలిసి కాపు స్త్రీని మోసం చేసి రాజు దగ్గరి నుంచి పంపించాలని ప్రయత్నాలు చేస్తారు. రాజుతో పందెం కుదుర్చుకొని ఆ ముగ్గురు స్త్రీలు వివాహం చేసుకుంటారు. ఇక కాపు స్త్రీ దగ్గరకచ్చేసరికి రాజుకి తానిచ్చిన మాటని నిలబెట్టుకోవడానికి ప్రయత్నించే క్రమంలో మిగిలిన రాణులు కలిసి మూడవ భార్య తాను చేసిన ప్రతిజ్ఞను నేరవేర్చలేదని రాజుకి అబద్ధం చెప్పి రాజు చేత రాజ్య బహిష్కరణ చేయించాలని చూస్తారు.

'సవతి తల్లి తీరు' అన్న కథలో ఒక కుమ్మరామె ఇద్దరు పిల్లలు ఉన్న తండ్రిని మోహించి వివాహం చేసుకుంటుంది. ఆ ఇద్దరి ఆడపిల్లలను తిండి పెట్టక సరిగా చూసుకోదు. అంతేగాదు తనకి కూతురు పుట్టిన తరువాత ఆ ఇద్దరి ఆడపిల్లలను ఇంటి నుంచి భర్త చేత బయటకు పంపించేదాకా పట్టు పడుతుంది. ఈ కథలో సవతి తల్లి దురాఘతాలు ఏవిధంగా ఉంటాయో చిత్రించబడింది.

మరొక కథ 'తల్లి కూతుళ్ల అనుబంధం'' కథలో కూడా సవతి తల్లి దుచ్చేష్టలు వ్యక్తం అవుతాయి. ఒకామె భార్య చనిపోయిన వ్యక్తిని పెళ్లి చేసుకుంటుంది. ఆ వ్యక్తికి ఇద్దరు పిల్లలు. ఒక ఆడపిల్లకు పాలల్లో పాము పిల్లను వేసి తాగిపిస్తుంది. అది ఆ పాప కడుపులో పెరిగిన తరువాత ఆ పాప

కడుపు ఉబ్బి నానా ఇబ్బందులు పడుతుంది. అదే అదునుగా భావించి తన భర్తతో నీ కూతురు తప్పు చేసిందని నిందమోపి ఇంటి నుంచి తరిమివేయిస్తుంది. ఇలా సవతుల మధ్య గొడవల కన్నా కూడా సవతులుగా వచ్చిన వారు మొదటి భార్య సంతానాన్ని ఏవిధంగా తిప్పలు పెడతారో చిత్రించిన కథలే లభించాయి.

## 3.4.10 మామ – అల్లుడు

జానపద కథలో మామ అల్లుడికి సంబంధించిన కథలు కూడా ఉన్నాయి. 'సోమనాల భావి' అనే కథలో ఒక విశ్వబ్రాహ్మణుడికి చెందిన వ్యక్తి అదృష్టవశాత్తు ప్రాణాపాయ స్థితిలో ఉన్న రాజు కూతురుని కాపాడి రాజుకి అల్లుడు అవుతాడు. కొద్ది రోజుల తరువాత ఆ విశ్వబ్రాహ్మణుడి స్నేహితుడి వల్ల విశ్వబ్రాహ్మణుడు తక్కువ కులానికి చెందిన వాడని తెలుస్తుంది. నువ్వు నా అల్లుడిగా ఉండడానికి అర్హత లేదని వెళ్లిపొమ్మని ఆదేశిస్తాడు. కాని అల్లుడు మాత్రం రాజుకి నీ రాజ్యంలో విలువైన నిధి ఎక్కడ ఉందో చెప్పమని అడుగుతాడు. రాజు చెప్పలేకపోతే చివరికి విశ్వబ్రాహ్మణుడు ఆ నిధి వివరాలు చెప్పి, రాజుకు ఉండవల్సింది కులం కాదని రాజ్యం మీద పట్టు అని చెప్పి, తన సొంత గ్రామానికి వెళతాడు. ఆ విధంగా మామకి అల్లుడు కనువిప్పు కలిగించి, మళ్లీ అతని కూతురుని తీసుకెళతాడు.

మరొక కథ 'బూడిదగిరి పట్నం' కథలో ఒక తండ్రి తన ఏకైక కూతురికి వివాహం చేసి అల్లుడిని ఇల్లరికం తెచ్చుకుంటాడు. కొద్ది రోజుల తరువాత అల్లుడి, మామ మధ్య చిన్న చిన్న తగాదాలు మొదలవుతాయి. అల్లుడుకి విసుగు చెంది తన భార్యను తీసుకోని అదే ఊరిలో వ్యాపారం చేస్తూ హాయిగా జీవిస్తున్నారు. అది చూసిన మామ సహించుకోలేక అల్లుడికి ఏదొక రూపంలో సమస్యలు ఎదుర్కనేలా చేస్తాడు. కానీ మామ తలపెట్టిన ఇరకాటంలో అల్లుడికి అదృష్టమే కలుగుతుంది. అల్లుడి ఎదుగుదల చూసి ఓర్వలేని మామ చివరికి అల్లుడిని చంపే ప్రయత్నం చేస్తాడు. అల్లుడిని అనుసరించే మామ చనిపోతాడు. పరుల ఎదుగుదలను చూసి ఓర్చుకోలేని వారికి ఏదోక రూపంలో చెడు జరుగుతుందని ఈ కథలో మామ అల్లుడు సంఘటనల వల్ల తెలుస్తుంది.

## 3.4.11 బావ – మరిదులు

జానపద కథలో బావమరుదులు అనగానే సరదా సంతోషాల గురించి, విందు వినోదాలు విలాసాల గురించే ఎక్కువగా కనిపిస్తాయి. కొన్ని కథల్లో బావమరిది బావ దుర్బుద్ధిని మార్చి, ఆడపడచు సంసారాన్ని సరిదిద్దిన వారు లేకపోలేదు.

'మునుపటి సంబంధం' అనే కథలో బావమరిది బావ మనసు మార్చి చెల్లెలు సంసారాన్ని చక్కదిద్దుతాడు. రోజు తన చెల్లెల్ని తిండి పేరుతో కాల్చుకు తింటున్న విషయాన్ని చెల్లెలి ద్వారా గ్రహించి బావ మనసు మార్చే ప్రయత్నం చేస్తాడు. పండుగ పేరుతో బావను పుట్టింటికి తీసుకురమ్మని చెప్పి చింత చెట్టు దగ్గర బావమరిది కావలి ఉంటాడు. మునుపటి సంబంధం అని మొదటి భార్య ప్రస్తావనతో ఆమె బాగా వండి పెడతదని సాకు చెప్పి రోజు చెల్లెలికి ఒక ముద్ద అన్నం ఉంచకుండా బావే మొత్తం తింటాడు. అమాయకపు చెల్లెలికి బావకి నచ్చచెప్పడం తెలియదని చెప్పి బావమరిది చెట్టు పైన దయ్యం రూపంలో కావలి ఉంటాడు. సరిగ్గా బావ అత్తగారింటికి వచ్చే సమయంలో చెట్టు మీది నుంచి దయ్యంలాగా దిగి బావను చితకబాది ఇంకోసారి మునుపటి సంబంధం జోలి తీయకుండా పెట్టింది తినాలని బెదిరించి వెళతాడు. ఆ రోజు భయం సొచ్చిన బావ చెల్లెల్ని ఒక్క మాట కూడా అనకుండా మంచిగా చూసుకుంటాడు. చెల్లెకి ధైర్యంగా ఉంటూ బావకి బలాన్ని చేకూర్చే బావ మరుదులు ప్రతి ఇంట మనకు కనిపిస్తూనే ఉంటారు.

మరొ కథ 'అమరికా రాజు కథ' ఒక రాజు తన భార్యతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లాలని అనుకుంటాడు. రాజు తాను రాజ్యం నుంచి వెళితే రాజ్యం శత్రువుల పాలైతుందని బాగా ఆలోచించి తనకు నమ్మకమైన వ్యక్తిగా, చెల్లెలి భర్త నిమ్మళ్ల మంత్రిని తాత్కాలిక రాజుగా నియమించి వెళతాడు. చెల్లెలి భర్త బావ మీద నమ్మకంతో తీర్థయాత్రలకు వెళ్లి, తిరిగి రాజ్యానికి వస్తాడు. రాజు పరిపాలనా కాలంలో సుభిక్షంగా ఉన్న రాజ్యం తన బావకి అప్పగించిన తరువాత భ్రష్టు పట్టిపోతుంది. రాజ్యాన్ని నియంతగా పరిపాలించడమే కాకుండా తన రాజ్యాన్ని తనకు ఇవ్వమని అడిగినప్పుడు బావనే హత మార్చాలని చెల్లె, బావమరిది ఇద్దరు కలిసి పథకం వేస్తారు. బావమరిది ఆలోచనలను ముందే గ్రహించినా ఆమరికా రాజు నిమ్మళ్ల మంత్రిని రాజ్య పరిరక్షణ కోసం చంపివేస్తాడు. జానపద కథల్లోనే

కాకుండా ప్రతి కుటుంబాల్లో ఆస్తిపాస్తుల విషయాల్లో గాని, అహంభావాలకు సంబంధించిన విషయాల్లో గాని బావ, బావ మరుదులకు విబేధాలు వచ్చి తగాదాలు పెట్టుకోవడం సహజమే.

## 3.5 జానపద కథల్లో – స్త్రీ చిత్రణ

జానపద కథల్లో, కథాకథనంలో స్త్రీ పాత్ర చాలా ముఖ్యమైనది. జానపద స్త్రీల కథలు వారి జీవితానుభవాలను, వారి మనస్తత్వాలను వ్యక్తం చేయటంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి. స్త్రీల కథలు వినోదం కొరకు మాత్రమే కాకుండా నీతిని, సందేశాన్ని, సంస్కృతులను, ఆచార సంప్రదాయాలను భావితరాల వారికి అందించడం కోసం చెప్తారు. ఒక స్త్రీ తల్లిగా, చెల్లిగా, భార్యగా, కోడలిగా జీవితంలో ఎదుర్కొనే సంఘటనలపై కథలు అల్లి పరులకు చెప్తారు. వారి నిత్య జీవితంలో వాస్తవ జీవిత సంఘటనలను కథలుగా అల్లే నైపుణ్యం స్త్రీలకే ఎక్కువ అనడంలో అతిశయోక్తి లేదు. ఆ కథల్లో వారి జీవితాలు, ఆలోచనావిధానాలు, ఆనందానుభూతులు సాక్షాత్కరిస్తాయని చెప్పవచ్చు.

జానపద కథల్లో ముఖ్యంగా స్త్రీల కథలు వారి సంసారాలు, జీవితాలు, కుటుంబాల్లో జరిగే సంఘటనలే ఎక్కువగా చిత్రించే విధంగా కథలని మలుస్తారు. అందుకే స్త్రీలు చెప్పే కథల్లో స్త్రీల జీవితానుభవాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చే కథలే ఎక్కువగా కనిపిస్తాయి. సాధారణంగా స్త్రీల కథల్లో అత్త కోడల్ల మధ్య జరిగే తగాదాలు, సవతి తల్లులు, కూతుర్ల మధ్య సవతితల్లి పోరు, ఆడపడుచును హింసించే వదిన మరదలు, పుట్టింటికి అధిక ప్రాధాన్యత ఇస్తూ చెప్పే కథలు, భర్తతో పందెనికి తెగించిన భార్యలు, ఒక్కొక్కసారి స్త్రీలకు స్త్రీలే శత్రువులగా మారే కథలు ఇలా ప్రతీది సంసారం చుట్టే సాగే కథలు మోస్తరుగా కనిపిస్తాయి. అయితే స్త్రీల కథల్లో కొన్ని విశిష్టమైన కథలు లేకపోలేదు. రాజులను ఎదురించిన స్త్రీలుగా, తన శీలాన్ని దోచుకోవడానికి వచ్చిన అధికారులకు బుద్ధి చెప్పిన స్త్రీగా, కాబోయే వాడిని పొందడానికి తండ్రినే ఎదురించిన ధైర్యశాలిగా, కార్యసాధనలో ధృఢచిత్తురాలిగా, దుర్మార్గపు అత్తకు, భర్త గుణపాఠం చెప్పిన గుణవంతురాలిగా బహుముఖ పాత్ర వైవిధ్యంతో స్త్రీ జీవిత చిత్రణకు తావిచ్చిన కథలు నా సేకరణలో లభించాయి. ప్రస్తుతం జగిత్యాల జిల్లా జానపద కథల్లో స్త్రీ జీవిత చిత్రణ ఏవిధంగా ఉందో చూద్దాం.

'సావుకారి కోడలి చతురత' అనే కథలో ఒక స్త్రీ తనను ఎలాగైనా లోంగదీసుకోవాలనుకున్న దొరని ధైర్యంగా ఎదిరించిన తీరుని చిత్రిస్తూ స్త్రీ చైతన్యాన్ని స్ఫురింపజేసే కథ. ఉదయాన్నే గోదావరి స్నానానికి వెళ్లి వస్తున్న షావుకారి కోడలిని పొడవాటి కురులను చూసి ఎగతాళి చేస్తాడు. షావుకారి కోడలు అతని మాటల్లో ద్వంద్వర్థాన్ని గ్రహించి వెంటనే సమాధానం ఇస్తుంది. దొరకే ఎదురు సమాధానం చెప్పిన షావుకారి కోడల్ని ఎలాగైనా అనుభవించాలని కక్ష్యతో ఇంట్లో కార్యక్రమం ఏర్పాటు చేస్తాడు. దానికి ఊరి వారందరు తప్పక రావాలని చెప్పి పంపుతాడు. ఆ కార్యక్రమానికి వచ్చిన షావుకారి కోడల్ని తల్లి సహాయంతో గదిలో బంధిస్తాడు. ఆ రాత్రి అక్కడ ఉంచగా షావుకారి కోడలు తెలివిగా తన ఒంటి మీద దొర చెయ్యి పడకుండా జాగ్రత్తపడి తెల్లవారి జామున ఇంటికి చేరుతుంది. మరల షావుకారి పంచాయితీ పెట్టించి అవమానించాలని అనుకుంటాడు. కానీ షావుకారి కోడలు తెలివైనా పొడుపు కథ విసిరి 'పండి పండని మామిడి పండు పండక పోవడమేంటి' అని పంచాయితీలో దొరని అవమాన పరుస్తుంది. జానపద కథల్లో స్త్రీ ధిక్కరణ కనిపించే కథల్లో ముఖ్యమైన కథగా చెప్పవచ్చు. పురుషస్వామిక ప్రపంచంలో స్త్రీ అబలగా భావించే వారికి స్త్రీ పట్టుదల ధైర్యసాహసాలను ప్రదర్శించిన కథ. నాటి సామాజిక అవసరతను అనుసరించిన అల్లిన ఈ కథ విని ఎంతో మంది స్త్రీలు చైతన్యం పొంది ఉంటారు. ఈ కథలో షావుకారి కోడలు ప్రదర్శించిన వాక్చాతుర్యం, మనోధైర్యం, చతురత నేటి స్త్రీలకు కూడా స్ఫూర్తిదాయకం.

'చాకలి పుల్లక్క పాతివ్రత్యం' అనే కథలో ఒక నిమ్న వర్గానికి చెందిన వివాహిత స్త్రీని భర్త లేని సమయంలో లోబరుచుకోవాలని ఆ ఊరి అధికారులు ఒక్కొక్కరిగా మాటు వేస్తారు. కాని ఆ విషయాన్ని ముందే గ్రహించిన ఆ చాకలి పుల్లక్క వారి నుంచి తప్పించుకొని తన పాతివ్రత్యతను ప్రదర్శిస్తుంది. భర్తలేని సమయం చూసి వచ్చినా పోలీసు, పటేలు, సైకుదారు, అమీనులను ఒక్కొక్కరిని గుడ్డలు తీయించి సున్నపు బొట్లు పెట్టించి రాత్రి పరుగులు తీసే విధంగా చేస్తుంది. అధికార బలంచేత మదం ఎక్కిన మగవారిని నేరుగా ఎదుర్కోలేని స్త్రీ తన చాకచక్యతతో వారికి బుద్ధి చెప్తుంది. భర్త తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి అధికారులను ఎదిరించింది. ఈ కథ స్త్రీలు తన మానప్రాణాలను కాపాడుకోవడంలో సందర్భ సమయోచితంగా వ్యవహరించాల్సిన తీరుని చిత్రించింది. పై రెండు కథల్లో స్త్రీలు సమయోచితంగా తమ తెలివినీ, ధైర్యాన్నీ ఉపయోగించి ఆపద నుంచి తప్పించుకున్నారు. వారి ఆత్మాభిమానాన్ని చాటారు.

‘శివసత్తె అవతారమెత్తిన భార్య’ అనే కథలో గడుసరి గయ్యాళి భార్యయైన ఒక స్త్రీ తన తెలివితో కోపంగా ఉన్న భర్తను శాంతపరుస్తుంది. ప్రతి కుటుంబంలో భార్యాభర్తల మధ్య చిన్న చిన్న గొడవలు సహజం. అలాంటి గొడవలు వచ్చినప్పుడు సరదాగా చమత్కారమైన మాటలతో భర్త మనసు మార్చివేస్తూ తనకి అనుకూలంగా మార్చుకున్న భార్య చిత్రణ కనిపిస్తుంది. సాధారణంగా పురుషులకు కోపం, ఆవేశం ఎక్కువ. వాటిని అర్థం చేసుకుని భర్తతో భార్య మసులుకునే విధానం ఎలా ఉండాలో ఈ కథలో భార్య పాత్ర చెబుతుంది. ‘ఆయన కొడితే దెబ్బలు పడ్డననుకో ఆయనకు కొట్టుడు అలవాటైతది. నాకు పడుడు అలవాటైతది. ఆడోళ్లకు ఇగురమన్న గట్టిగ ఉండాలి ఈపన్న గట్టిగ ఉండాలట’ ఇగురమంటే తెలివి అని అర్థం. భర్తకు కోపం కలిగినప్పుడు తెలివైన మాటలతో సర్ది చెప్పుకుంటే ఆ గొడవ అక్కడతో ముగుస్తుందని ఆ సామెత అర్థం.

జానపద కథల్లో ఉద్దేశ్య పూర్వక కథలు, సందర్భోచిత కథలు, ఒక విషయాన్ని వక్కాణించి చెప్పడానికి ఉపయోగించుకునే కథలు కల్పించబడతాయి. తరతరాల నుంచి పురుష సమాజంలో స్త్రీలను మగవాడికి బానిసలా మార్చే కథలు లేకపోలేదు. భార్యకు భర్త పరమేశ్వరుడు, పిల్లలే దైవ స్వరూపులు, ఇల్లే స్వర్గధామం వైకుంఠం అంటూ ప్రతిపాదించే కథలు జానపద కథల్లో వ్యవహారంలో ఉన్నాయి. అందుకు నిదర్శనమైన కథలు ‘సత్యవతి కథ’, ‘ఇరవై అయిదు రోజుల బాలుడు’

సామాజిక, చారిత్రకత సంతరించుకొని ఆవిర్భవించిన కథగా నిలిచే కథ ‘సత్యవతి కథ’. ధర్మంగరాజు, ధర్మవతిలకు కోడలు సత్యవతి. ఆ దంపతులకు లేక లేక సంతానం కలిగితే కొడుకు పాము రూపంలో జన్మిస్తాడు. యుక్త వయస్సు రాగానే వివాహం చేయమని తల్లిదండ్రులకు చెబితే కత్తికి, కటారుకి పెళ్లి చేసి సత్యవతిని భార్యగా తీసుకువస్తారు. తన భర్త పాము అని తెలిసి ఎంతో బాధపడుతుంది. దైవనిర్ణయాన్ని నిందించకుండా ధైర్యంగా తన భర్తయైన పాముని తీసుకుని ఎన్నో పుణ్యక్షేత్రాలను సందర్శిస్తుంది. ధర్మపురి గోదావరిలో పుణ్యస్నానమాచరించి పామును మనిషి రూపంగా మారుస్తుంది. ఆ విషయం ఎరగని తల్లిదండ్రులు వచ్చి తన కొడుకును చంపేసావని నిందాపనిందలు వేస్తారు. అన్నింటికి సహించుకుని మళ్లీ గోదావరమ్మ ఒడిలో స్నానం చేసి, గోదావరి తల్లితో నిజాలు చెప్పించి తన పాతివ్రత్యాన్ని నిరూపించుకుంటుంది. ఒక స్త్రీ తన భర్తే సర్వస్వంగా భావించే విధంగా ఈ కథ రూపుదిద్దుకుంటుంది. ఒక స్త్రీ సహనాన్ని, ఆత్మాభిమానాన్ని, ఆత్మబలాన్ని,

పట్టుదలని, దృఢసంకల్పాన్ని ప్రదర్శించిన పాత్ర సత్యవతి పాత్ర. ఈ కథ వింటున్నప్పుడు ఏ తరం స్త్రీలలోనైనా ఆత్మస్థైరాన్ని నింపి తమ జీవిత త్యాగఫలాన్ని గుర్తు చేస్తుంది.

సత్యవతి లాంటి మరొక కథ 'ఇరవై అయిదు రోజుల బాలుడు'. ఒక దంపతులకు పుట్టిన ఇరవై అయిదు రోజుల బాలునికి జాతక దోషం ఉంటుంది. ఆ దోష నివారణకు ఇరవై అయిదు రోజుల బాలునికి ఒక అమ్మాయికి వివాహం జరిపించాలి. అందుకు ఆ దంపతులు ఒక నకిలి బొమ్మను పెట్టి పద్మావతి అనే అమ్మాయితో పెళ్లి చేస్తారు. కొద్ది రోజుల తరువాత అసలు విషయం తెలుసుకున్న పద్మావతి ముందు దు:ఖించి తన భర్త ఇరవై అయిదు రోజుల బాలున్ని తీసుకుని విహరయాత్రలకు బయలుదేరుతుంది. ఒక ప్రదేశంలో దేవగణికలు ప్రత్యక్షమై ఇరవై అయిదు రోజుల బాలున్ని పెంచమని కావల్సిన వరాలను ప్రసాదిస్తారు. ఇరవై అయిదు రోజుల బాలుడి భార్య పెంపకంలో పెరిగి పెద్దవాడైతాడు. అప్పుడు భార్య వయస్సు రెట్టింపు అవుతుంది. మళ్లీ దేవగణికల సహాయంతో యవ్వన రూపం పొంది సంసారం చేసుకుని హాయిగా ఉంటుంది. కాని తల్లిదండ్రులచ్చినప్పుడు తమ బిడ్డ అని చెప్తే ఆ దంపతులు నమ్మరు. మళ్లీ దేవగణికల సహాయంతో అసలు నిజాన్ని భర్త తల్లిదండ్రులకు తెలియజేస్తుంది. ఈ కథలో స్త్రీకి మరో స్త్రీలు దేవగణిక రూపంలో సహాయం చేయడం కనిపిస్తుంది. ఇరవై అయిదు రోజుల బాలునికి వివాహం చేయడం, పామును వివాహం చేసుకోవడం వాస్తవ సంఘటనలకు అతీతంగా ఉంది. అలా జరగడం అవాస్తవం. భర్తకు మించిన దైవం లేదని, భర్తను కాపాడుకోవడానికి స్త్రీలు ఎంతటి త్యాగాలు చేయడానికైనా వెనుకాడబోరని ఈ కథ మనకు తెలియజేస్తుంది. స్త్రీ ఔన్నత్యాన్ని చెప్పడమే కాకుండా నేటి స్త్రీలకు మార్గనిర్దేశనం చేయడానికి కల్పించిన కథలు అనడంలో అతిశయోక్తిలేదు. 'దైవానుగ్రహం' అనే కథలో కూడా కుష్టు రోగి వివాహం చేసుకున్న స్త్రీ తన భక్తితో మొగుడిని మంచి వాడిగా మార్చుకుంటుంది. భర్త కష్టాన్ని పంచుకుని తోడు నీడగా నిలిచిన కథలు జానపదాల్లో ఎన్నో ఉన్నాయి.

కొన్ని కథల్లో స్త్రీకి స్త్రీయే శత్రువులుగా మారే కథలు లేకపోలేదు. ముఖ్యంగా స్త్రీకి స్త్రీగా శత్రువుగా చిత్రించిన కథలు కుటుంబం నేపథ్యంలో సాగేవి  ఎక్కువగా ఉంటాయి. అన్నచెల్లెల్ల కథలు, అత్త కోడళ్ల వంకాయ, అత్తకాల విషం, అత్తిచ్చిన అప్ప మొదలైన కథలు వాటికి చక్కటి ఉదాహరణలు. అక్కెమ్మల కథలో ముగ్గురు అక్కెమ్మలుంటారు. ముగ్గురు సవతులు. వారి పంతాన్ని నెగ్గించుకోవడానికి ఇద్దరు అక్కెమ్మలు కలిసి మూడవ అక్కెమ్మను నిందలపాలు చేస్తారు. భర్తకు దూరం చేయాలని

అబద్ధాలు చెప్తారు. అలాగే ఒక మగవాడిని దక్కించుకోవడానికి కూడా స్త్రీకి స్త్రీయే శత్రువుగా మారే సందర్భాలు కథలు చలామణిలో ఉన్నాయి 'రాణి పగడాల పేరు' అనే కథలో కూడా ఒక వేశ్య యువరాజు తన ఇంటికి రావాట్లేదని రాణికి దూరం చేయాలని అనుకుంటుంది. ఒక మాంత్రికుడి సహాయంతో యువరాజు భార్యను చంపించి దెయ్యం రూపంలో చెట్టు కొయ్యలో ఉంచుతుంది. 'తోటి కోడల్లు' అత్యాశ కథలో కూడా ఈర్ష్య, అసూయలతో నిండిన ఇద్దరు తోడి కోడళ్ల మధ్య జరిగిన సంఘటన చిత్రించిన కథ.

స్త్రీలలో అందరు మంచివారే కాదు. కొందరు చెడ్డవారు కూడా కనిపిస్తారు. అలాంటి కోవకు చెందిన కథే 'భోగసాని లంగతనం'. ఒక పేద వాడికి అదృష్టవశాత్తు లభించిన ఆవు వల్ల సిరిసంపదలతో హాయిగా జీవిస్తాడు. అది చూసి తట్టుకోలేని ఒక భోగసాని అతను ఇంటి వద్ద లేని సమయాన్ని చూసి ఆ ఆవుని దొంగిలించి తన ఇంటికి తెచ్చుకుంటుంది. భోగసానితో నేరుగా అడగలేని ఆ వ్యాపారి న్యాయవాదికి పిటిషన్ పెట్టుకుంటాడు. న్యాయవాది ఆమెను ప్రశ్నించినప్పుడు నా బక్కెద్దు పికిలిచ్చి పిల్లను పెట్టిందని బుకాయిస్తూ గుండాలు, రౌడీలతో బెదిరిస్తుంది. జానపద కథల్లో దుష్ట స్వభావం కలిగి స్త్రీల చిత్రణ కూడా కనిపిస్తుంది.

కొందరు స్త్రీలు చెడు నడత కలిగి విచ్చల విడి స్వభావంతో ఉంటారు. అలాంటి వారి జీవితాలను చూసిన కథకులు కూడా వారి జీవితాన్ని కథల్లో కల్పించి చెబుతారు. 'పోశవ్వ మొక్కు కథ' అనే కథలో ఒక స్త్రీ భర్తకు తెలియకుండా వేరొకవాడితో అక్రమసంబంధం పెట్టుకుని భర్త కళ్లు పోవాలని పోశమ్మ తల్లికి మొక్కుతుంది. 'చెల్లెలు దిద్దిన కాపురం' కథలో ఇంటి పక్కన ఉన్న పరాయి వ్యక్తితో సంబంధం పెట్టుకున్న భార్య భర్తకు పొడుపు కథ వేసి అది విప్పకపోతే చావమని ఆదేశిస్తుంది. అన్న మీద మమకారంతో చెల్లెలు వదిన గుట్టురట్టు చేసి చెడు నడత కలిగిన స్త్రీకి శిక్ష వేయించడమే సరియైందని మరొ స్త్రీ ఆలోచిస్తుంది.

స్త్రీలు సున్నితమైనవారు, చంచల స్వభావులనే అభిప్రాయం సహజంగా ఉంది. కానీ జానపద కథల్లో మాత్రం పంతానికి, పట్టుదలకి దిగిన స్త్రీలు వారు అనుకునేది నెగ్గే వరకు వెనుతిరుగరు. 'పోశవ్వ మొక్కు కథ'లోఒక స్త్రీ మొండితనానికి, మూర్ఖత్వానికి ప్రతీకగా నిలిచే పాత్ర. పోశవ్వ ముక్కు మీద వేలువేసుకుందని అది తీయించినవారికి గ్రామ పెద్దల బహుమానం ఇస్తారని వెల్లడిస్తారు. ఆ

కథలో పోశవ్వ గ్రామ దేవత దగ్గరకెల్లి గ్రామ దేవతని భూతులతో తిడుతుంది. సంస్కార హీనంగా ప్రవర్తిస్తుంది. ఆమెకు భయపడి పోశవ్వ అమ్మవారే ముక్కు మీది నుంచి వేలు తీసివేస్తుంది.

పై విధంగా జానపద కథల్లో స్త్రీ చిత్రణ గమనించినట్లయితే పురుష ప్రధానమైన మన సమాజంలోని స్త్రీ జీవితానికి, జానపద కథల్లోని స్త్రీ చిత్రణకూ మధ్య వైరుధ్యం కనిపిస్తుంది. మన సమాజంలో మగవాడు బలవంతుడు, తెలివైనవాడు, కార్యసాధకుడు, పంతం కలవాడని అనుకుంటాం. కానీ ఆడది అబల, అమాయకురాలు, భీరువు, మాట తీరు తెలియనిది అనే అభిప్రాయాలను పటాపంచలు చేసే స్త్రీ చిత్రణ మనకు జానపద కథల్లో కనిపిస్తుంది. జగిత్యాల జిల్లా జానపద కథల్లో స్త్రీ మగవానికి అండగా, ఆపదలో భర్తను ఆదుకునే ధైర్యవంతురాలిగా, కార్యసాధకురాలిగా, ప్రేమను పంచె ఆలిగా, బిడ్డల ఆలనపాలన చూసే తల్లిగా, మంచి గృహిణిగా, మంచి చెల్లిగా, వాక్చాతుర్యంతో రాజులను ఎదుర్కునే తెలివైనదానిగా చిత్రించబడింది.

# 4. జగిత్యాల జిల్లా జానపద కథలు – సాంఘిక, సాంస్కృతికాంశాలు

## 4.1 సాంఘిక అంశాలు

మానవులు తమ స్వంత ప్రయోజనాల కోసం సంఘాన్ని ఏర్పరచుకున్నారు. కొంత మంది మానవులు కొన్ని కట్టుబాట్లకు లోబడి ఒకే రకమైన జీవన విధానాన్ని అనుసరించడమే సంఘం అవుతుంది. సంఘంలో ఒకరికొకరు సహాయం చేసుకుంటూ సన్నిహితమైన భావజాలంతో కలిసి మెలిసి జీవిస్తారు. ఒక గుంపుగా నివసిస్తూ ఒక సక్రమమైన పద్ధతి, ఆలోచన ధోరణితో ప్రగతి పథం వైపు సాగడమే సంఘం ఉద్దేశం. సంఘంలో ప్రజలు సామూహికంగా కలిసి ఉన్నప్పటికి వ్యక్తిగత విషయాలపై స్వేచ్ఛని కలిగి ఉంటారు.

"పరస్పర సహకారాపేక్షతో ఒకటిగా కూడినా, మళ్ళీ తమలో తాము వ్యక్తిత్వ నిర్మాణంతో, విషయాలను చర్చించి, ఆమోదించే మనుష్య సమాహారమే సంఘం. అంటే సంఘమనేది స్వయం వ్యక్తిత్వం చేత నిర్ణయించుకున్న సంస్కృతిని బట్టి వ్యవహరించే మనుష్య సమూహం"[46]

సంఘంలో ఒకరికి ఒకరు పరస్పరం సహకరించుకుంటారు. వారి వ్యక్తిత్వ నిర్మాణ విషయాల్లో తమదైన దృక్పథాన్ని కలిగి ఉంటారని తెలుస్తుంది. సమాజంలో వ్యక్తులు, వారి వృత్తులు, జీవన విధానం, పరిపాలనా వ్యవస్థలు, శిక్ష, న్యాయం మొదలైన సాంఘికాంశాలు జానపద కథల్లో ఏ విధంగా చిత్రించబడ్డాయో చూడటమే ఈ అధ్యాయ ముఖ్యోద్దేశం.

### 4.1.1 ఆర్థికవ్యవస్థ

ఏ సంఘానికైనా, ఏ దేశానికైనా ఆర్థిక వ్యవస్థ అనేది ముఖ్యమైనది. సంఘంలో నివసించే వ్యక్తుల మధ్య ఆర్థిక కార్యకలాపాలు ముమ్మరంగా సాగినప్పుడు వారి ఆదాయం పెరుగుతుంది. ఆ సంఘం ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. వారి జీవన ప్రమాణ స్థాయి కూడా గణనీయమైన మార్పులు

---

[46] కృష్ణకుమారి, నాయిని (సం.పా). 2000. సమాజం–సంస్కృతి, సాహిత్యం. పే – 6.

చెందుతుంది. జానపదుల్లో ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయం, పశుపోషణ, వర్తక వ్యాపారాలు, కులవృత్తుల మీద ఆధారపడి ఉంటుంది.

## 4.1.2 వ్యవసాయం

భారతదేశం యావత్తు వ్యవసాయిక దేశం. మన దేశంలో అధిక శాతం ప్రజలు వ్యవసాయాన్ని ఆధారంగా చేసుకొని జీవనాన్ని సాగిస్తున్న వారే. జానపద కథకులు కూడా కథల్లో వ్యవసాయానికి సముచిత స్థానాన్ని కల్పించారు.

'అక్కెమ్మ' అనే కథలో పేదరాసి పెద్దమ్మకు ఏడుగురు కొడుకులు. ఆ కొడుకులందరికి పెళ్లిల్లు చేసింది. పెద్దమ్మకు ఆస్తులు, భూములు చాలా ఉన్నాయి. ఆ కుమారులు వ్యవసాయం చేయడానికి భూమిలో దుక్కి దున్నడానికి వెళతారు. వాళ్ల భార్యలు ఏడుగురు భర్తలకి ఆహారం తీసుకొని పొలం కాడికి వెళతారు. ఒక కుటుంబం మొత్తం వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలుస్తుంది. వ్యవసాయానికి వారిచ్చిన ప్రాధాన్యతను బట్టి వ్యవసాయమే వారి జీవనోపాధి అని అర్థమవుతుంది.

'శివసత్తె అవతారమెత్తిన భార్య' అనే కథలో ఒక తండ్రి తన కూతురికి పెళ్లి చేసి అత్తగారింటికి పంపుతాడు. తన వ్యవసాయ భూమిలో కొంత భూభాగాన్ని అల్లుడికి ఇచ్చి వ్యవసాయం చేసుకొమ్మని చెబుతాడు. "అబ్బాయి మంచోడు ఆనికి భూమి, జాగ ఏం లేకుండె మా నాన్న ఏం చేసిండు అల్లుడా! భూమి జాగలేదు గద. నాకు భూమి ఎక్కువ ఉంది. భూమిలో నుంచి కొంత భాగం రెండు ఎకరాలు నీకు ఇస్తున్న ఎడ్లు, నాగలి ఇత్తన్న వ్యవసాయం చేసుకొని బతుకు అల్లుడా అని చెప్పిండు మావయ్య". ఒక పేదవాడికి తన కూతురిని ఇవ్వడమే కష్టం. అలాంటిది వ్యవసాయ భూమిని కూడా ఇచ్చి తన అల్లుడికి జీవనోపాధిని కల్గించాడు మామ. సమాజంలో తల్లిదండ్రులు తమ  కూతురిని డబ్బున్న వారికే ఇవ్వాలని అనుకుంటారు. ఈ కథలో అల్లుడి ఆస్తులకంటే, అతని గుణగణాలకే ఎక్కువ ప్రాధాన్యతని ఇచ్చినట్లుగా తెలుస్తుంది. పై కథలో తండ్రి కూడ అల్లుడి గుణగణాలను మాత్రమే చూస్తాడు. తన

ఆస్తిలో కొంతభాగాన్ని అతనికిచ్చి, వ్యవసాయం చేసుకుని బ్రతకమని చెబుతాడు. ఈ కథ వల్ల వ్యక్తుల మనస్తత్వాలు, వారి సామాజిక జీవనవిధానం వ్యక్తమవుతుంది.

'అత్త కాలవిషం' అనే కథలో కూడా ఒక రైతు తన కూతురిని మరో రైతు కుటుంబానికి ఇచ్చాడు. ఆ కుటుంబంలో గయ్యాళి అత్త ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలం పనికి వెళుతుంది. ఆ కూతురు తండ్రి కూడా రైతే. కూతురు గర్భంతో ఉన్న విషయం తెలిసి కూడా పుట్టింటికి తీసుకెళ్లే సమయం ఉండని రైతుగా చిత్రించబడతాడు. ఒక రైతు నిరంతర శ్రమ, కష్టపడే తత్త్వం తెలుస్తుంది

## 4.1.3 పశుపోషణ – పాడి సంపద

వ్యవసాయానికి పాడి సంపద అనుబంధంగా ఉంటుంది. సాధారణంగా మన పల్లెలలో పశువులను ఎక్కువగా గొల్లవారు మేపుతారు. రైతు కుటుంబ నేపథ్యం ఉన్న వారింట్లోనే పాడి సంపద అనేది ఎక్కువగా కనిపిస్తుంది. ఆర్థిక లాభాలు అధికంగా ఉండటం వల్ల నేడు పశువులను మిగతా కులాల వారు కూడా పోషిస్తున్నారు. పశువుల పెంపకం వల్ల పాలు, పెరుగు, వెన్న, నెయ్యి లాంటి పాల ఉత్పత్తులు లభిస్తాయి. వాటిలో ఉండే పోషకాలు మనకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతాయి. పశువుల పేడ కూడా వ్యవసాయంలో ఎరువుగా ఉపయోగిస్తారు. రైతు సాధించే హరిత విప్లవంలో పశువుల పాత్ర ముఖ్యమైంది. కాబట్టి రైతులు పశువులను తమ ఆరాధ్యదైవంగా కూడా భావిస్తారు. గ్రామాల్లో పశుసంపద కల్గిన వాళ్లను ఆర్థికంగా బలపడినవారిగా కూడా పరిగణిస్తారు.

'లచ్చిందేవి ఆచారం' అనే కథలో ఒక కుటుంబంలో లక్ష్మీ దేవి కటాక్షంతో వారికి పశు సంపద కలిగి ఆర్థికంగా ఎదుగుతారు. అప్పటి దాకా పేదరికంతో కూలీ పని చేసుకునేవారు, లక్ష్మీదేవి రాకతో పాడిసంపద పెరిగి లాభాలతో ఉన్నతంగా బతుకుతారు. "లచ్చిందేవి! అచ్చినసుంది ఆళ్లకు మత్తు పట్టెన్ని ఎడ్లు, పట్టెన్ని బర్లు, గొర్లు, పొలాలు, పొలాలకు మనుసులు, టాక్టర్లు అన్ని ఇగ ఇంట్లోకెల్లి పెట్టుకుంటుర్రు. ఇగ ఆళ్లే పొలం పనుల మీద పోతుర్రు. రోజు పోంగ పోంగ ఇగ మత్తునోల్లు

అయ్యిపోయ్యిరు." వ్యవసాయం చేసేవారు ఇంటింటికి ఆవు, గేదెలను పెంచుకోవడమనేది పల్లెల్లో సహజంగా కనిపిస్తుంది. వాటి నుంచి వచ్చే పాలు, పెరుగుతో వ్యాపారం చేసి డబ్బు సంపాదిస్తారు.

'బూరెప్ప కథ' అనే కథలో దినయ్య, దినమ్మ అనే ఇద్దరు భార్యాభర్తలు ఉంటారు. వాళ్లు ప్రతిరోజు ఆవులను ఒకరు, గేదెలను ఒకరు మేపుతారు. ఆ దంపతులు పశువులను మేపడమే వారి జీవనోపాధిగా చేసుకుని జీవిస్తారు. ఉగాది పండుగ సందర్భంలో కూడా దినయ్య పశువులను మేపుకొని ఇంటికి వస్తాడు. దీన్ని బట్టి జానపదులు పండుగ రోజు కూడ తమ దైనందిన కార్య క్రమాలపట్ల ఎంత శ్రద్ధ కలిగి ఉంటారో వ్యక్తమవుతుంది. సమాజంలో శ్రామిక వర్గాల వారు ఏవిధమైన జీవితాన్ని గడుపుతున్నారో ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది.

'బంగారెంటుక' బాలుడు అనే కథలో పశువులను మేపుకునే బాలుడు ఎలుగుబంటికి, పెద్దపులికి దోసకాయ విషయంలో జరిగిన తగాదాలో పెద్దపులి వైపు తీర్పు చెప్పి ఇరకాటంలో పడతాడు. ఎలుగుబంటి పగతో బాలుడిని పెద్ద నూతిలో పడవేస్తుంది. నూతి పక్కన ఉన్న చెట్లను పట్టుకుని ఆ బాలుడు ఎలుగుబంటి నుంచి తప్పించుకుంటాడు. కాని చెట్టుకింద అడవి ఆవులను, దున్న పోతులను చూసి భయపడతాడు. మానవులకు మచ్చిక కాని అడవి ఆవులను, గేదెలను వాటి పిల్లల సహాయంతో మచ్చిక చేసుకుంటాడు. అడవి ఆవుల పిల్లలకు ఆడుకనే స్థలాన్ని ఏర్పాటు చేసి తల్లి ఆవుల నుంచి ప్రాణాలను రక్షించుకుంటాడు. అంతేగాకుండా అడవిలో తప్పిపోయిన ఆ బాలుడు అడవి ఆవుల పాలు తాగి బంగారు ఛాయతో ప్రకాశవంతంగా మెరుస్తూ సుందరమైన రూపాన్ని పొందుతాడు. దీన్ని బట్టి పశువులను మచ్చిక చేసుకుని మనిషి ఎన్ని విధాలుగా లాభపడుతున్నాడో తెలుస్తుంది.

## 4.1.4 కులాలు – కులవృత్తులు

సమాజంలో ప్రతి వ్యక్తి తమ కుటుంబ జీవనోపాధి కోసం ఏదో ఒక వృత్తిని తమ జీవనాధారంగా చేసుకుంటారు. అదే కాలక్రమంలో కులవృత్తిగా మారింది. అయితే కొందరికి వంశపారపర్యంగా చేసే పని కులవృత్తిగా వస్తే, మరికొందరికి ఐచ్ఛికంగా వచ్చింది. వంశపారం పర్యంగా చేసేవి ప్రధానంగా కులవృత్తులవుతాయి. ప్రస్తుత సమాజంలో విభిన్న వర్గాలు విభిన్న

వృత్తులను ఆధారం చేసుకుని జీవిస్తున్నారు. గ్రామంలో ఎక్కువగా కులాల ఆధారంగా కులవృత్తులను స్వీకరించడం కనిపిస్తుంది. కొన్ని వృత్తులను మాత్రం కొన్ని కులాలే చేపట్టాలనే నియమాలున్న వృత్తులు లేకపోలేదు. ఉదాహరణకు పురోహితం – బ్రాహ్మణులు, చేపలు పట్టడం – బెస్తవారు, ముదిరాజులు, క్షౌరం – మంగలివారు, గొర్లను కాయడం – కుర్మలు

మన సమాజంలో కొన్ని కులాల వారు వ్యవసాయ భూమి ఎక్కువగా ఉండి ఆర్థికంగా బలపడి సమాజంలో మంచి పేరొందిన వారుగా స్థిరపడతారు. మరికొందరు కూలీలు, కులవృత్తులు చేసుకుంటూ మధ్యతరగతికి చెందిన వారుంటారు. అణగారిన నిమ్న వర్గాలకు చెందిన వారు తక్కువ ఆదాయం గల వృత్తిని కొనసాగిస్తూ ఎప్పటికీ పేదవారుగానే మిగిలిపోతున్నారు. ఇలాంటి వారిలో ఆర్థిక, శారీరక, మానసిక ఎదుగుదల తక్కువ స్థాయిలో కనిపిస్తుంది. జానపదుల్లో వివిధ కులవృత్తుల వారున్నారు. సమాజంలో ఒకరి వృత్తిని మరొకరు గౌరవించుకుంటూ, పరస్పరం సహకరించుకొని సంఘీభావంతో మెలగడం మనం గమనిస్తూనే ఉంటాం.

## 4.1.4.1 బ్రాహ్మణులు

మన హైందవ సమాజంలో బ్రాహ్మణులు ఉన్నత వర్గానికి చెందినవారిగా ప్రజలచేత ఆరాధించ బడుతున్నారు. బ్రహ్మ ముఖం నుండి పుట్టిన వారు బ్రాహ్మణులని అంటారు. వీరు ప్రధానంగా పురోహితం, పాండిత్యం, ఉపాధ్యాయ వృత్తిని చేపడతారు. రాజుల కాలంలో రాజు దగ్గర సలహాలు, సూచనలిచ్చే మంత్రిగా, సాహిత్యచర్చలు జరుపుతూ పాండిత్య ప్రకర్షణ ప్రదర్శించేవారు. బ్రాహ్మణులు ఉన్నతమైన విలువలతో ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతారు. సమాజోన్నతికి పాటుపడుతూ ప్రజల్లో భక్తిభావనలు నింపడం, దైవ విశ్వాసాలను బలపరచడం వల్ల వీరికి సమాజంలో మంచి గౌరవం ఉంది. జానపద కథల్లో కూడా వీరి జీవన విధానం గురించి చిత్రించిన కథలు ఉన్నాయి.

'హరిదాసు' అనే కథలో ఒక బ్రాహ్మణుడు పాటించే నిష్టనియమాల గురించి వివరించబడింది. ఉదయాన సంధ్యావందనం మొదలుకొని పూజా క్రతువులు ముగిసేదాక ఉపవాసం ఉంటారు. వాహనాలు లేని కాలంలో సుదూరాలు ప్రయాణించి పురోహితం చేసి ఇంటికి చేరేవారు. అప్పటి వరకు

ఇతరులిచ్చిన అల్పహారాలుగాని, మంచినీళ్లుగాని స్వీకరించకపోవడం వారికి సంప్రదాయంగా వస్తున్న క్లిష్టతర నియమాలను తెలుపుతాయి. ఈ కథలో బ్రాహ్మణుడు వివిధ గ్రామాలకు వెళ్లి గుళ్లో పూజలు చేసి నిష్టగా ఉపవాసంతో ఉండి ఇంటికి వచ్చిన తరువాత ఉపవాసం విడిచేవాడు. భక్తులిచ్చిన వస్తు సంభావన భార్యకిచ్చి తమ కుటుంబ పోషణ, బాధ్యతల గురించి వివరిస్తాడు. "ఇప్పటి వాళ్లకు ఎక్కడ తింటే అక్కడే బొత్త నింపుకుంటరు గాని మా పాత సిద్ధాంతాలు ఎనకటివి. భార్యపిల్లలకు అప్ప జెప్పినంకనే తినడం అనేది ఉండే?". నేడు పురోహితం చేస్తున్న బ్రాహ్మణులు నిష్టనియమాలను పాటించకపోవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నను లేవనెత్తాడు.

'బ్రామ్మడి వరాలు' అనే కథలో ఒక రాజుకు, బ్రాహ్మణుడుకు మధ్య నెలకొన్న సమస్యను ప్రధాని తీరుస్తాడు. ఒక బ్రాహ్మణుడు విహారయాత్రలకు వెళ్లేటప్పుడు అతని దగ్గరున్న విలువైన వరాలను (వజ్రాలను) నమ్మకంతో రాజుకి ఇస్తాడు. బ్రాహ్మణుడు విహారయాత్రలకు వెళ్లి వచ్చిన తరువాత ఆ వరాలను తీసుకుంటానని అనుకుంటాడు. కాని రాజుకు ఆ వరాల మీద ఆశ కలుగుతుంది. రాజు దుర్బుద్ధితో వరాలను నాకు ఇవ్వలేదని అబద్ధం చెప్తాడు. బ్రాహ్మణుడు దగ్గరున్న మాయ కత్తెర అనేది అబద్ధమాడిన వారి చేతివేలు తెంపుతుంది. ఆ కత్తెర నుంచి తప్పించుకోవడానికి రాజు ఒక కంకబొంగులో వరాలను దాచి నాకు బ్రాహ్మణుడు వరాలు ఇయ్యలేదని వజ్రాలతో పొదిగిన కంకబొంగుని రాజు బ్రాహ్మణుడి చేతిలో పెడతాడు. బ్రాహ్మణుడు రాజు నాకు నా వరాలివ్వలేదని చెప్తాడు. ఇద్దరు నిజాలు చెప్పడం వల్ల కత్తెర వారివురి చేతివ్రేళ్లను తెంపివేయదు. ప్రధాని బాగా ఆలోచించి ఆ న్యాయాన్ని నిర్ణయించే కంకబొంగుని రెండుగా చీల్చి రాజు రహస్యాన్ని పటాపంచలు చేస్తాడు. ఆ విధంగా రాజు బ్రాహ్మణుడ్ని మోసం చేయాలన్న కోరిక తీరదు. ఇలాంటి కథ వల్ల బ్రాహ్మణుడు తెలివితేటలు గలవాడని అతని మోసం చేయడం కష్టతరమైందని కథకుడు భావించారు.

'బ్రామ్మడి దూలం' అనే కథలో బ్రాహ్మణుడికి పునర్జన్మ కర్మఫలాల గురించి ఒక స్త్రీ చెబుతుంది. బ్రాహ్మణుడు తన ఇంటి పూజగదికి చేయించిన దూలం 12 సంవత్సరాల తరువాత విరిగిపోయి పాము రూపంగా మారుతుంది. బ్రాహ్మణుడు దూలం సరిచేయించడానికి తెచ్చిన వంద మందిని చంపుతుంది. ఆ తరువాత అక్కడ నుంచి వెళ్లి పెద్ద పులిగా మారి 100 పశువులను, నక్కగా మారి100 గొర్లను చంపి

తింటుంది. దూలం మాయమై వివిధ రూపాలు ధరించడానికి కారణమేంటని మనిషి రూపంగా మారిన స్త్రీని అడిగితే గత జన్మ పాపమే మునీశ్వరుడి శాపమని చెప్పి వెళ్లిపోతుంది. మనుషుల్లో పాపభీతిని కలిగించడానికి ఈ కథను అల్లినట్లు తెలుస్తుంది. బ్రాహ్మణుడు ఉన్నతమైనవాడిగా, పూజలు చేసే పుణ్యాత్ముడిగా భావించారు. కాబట్టి బ్రాహ్మణుడిని ఆ పాముగాని, పెద్దపులిగాని, స్త్రీ గాని చంపకుండా వదిలేస్తుంది. పంచమహపాతకాల్లో బ్రాహ్మణ హత్య అనేది పెద్ద పాపంగా కూడా పరిగణిస్తారు. పై కథ ద్వారా జానపదుల్లో కూడా బ్రాహ్మణ కులానికి విశిష్టమైన గౌరవం ఉందని మనం గ్రహించవచ్చు.

బ్రాహ్మణుల్లో ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపేవాళ్లే కాకుండా ఇతరులకు కీడు చేసేవాళ్లు కూడా ఉంటారని 'సోమనాల భావి' అనే కథ ద్వారా తెలుస్తుంది. ఒక బ్రాహ్మణుడు, ఒక విశ్వ బ్రాహ్మణుడు (కంసాలి) బతుకుదెరువు కోసం చిలుకవాది పట్నం అనే పట్టణానికి బయలుదేరతారు. కాలినడకతో నడిచి నడిచి అలసి పోతారు, ఒక బావి దగ్గర కూర్చొని వారి వెంబడి తెచ్చుకున్న రొట్టెలను తింటారు. బ్రాహ్మణుడు తెచ్చుకున్న రొట్టెలు అతని ఆకలిని తీర్చవు. బ్రాహ్మణుడు మిత్రుని రొట్టెల కోసం బావి దగ్గర కాలు కడుక్కుంటున్న కంసాలిని బావిలో పడవేసి వెళ్లిపోతాడు.

అదే కథలో మరొక చోట అదృష్టవశాత్తు రాజుకి అల్లుడైన కంసాలివాడిని ఎలాగైనా రాజ్యాధికారం నుంచి దూరం చేయాలని కీడు తలపెడతాడు. రాజు దగ్గరికి వెళ్లి కంసాలి వాడి కులం పేరు చెప్తాడు. బ్రాహ్మణుడు రాజుగా చలామణి అవ్వాలంటే క్షత్రియులే సరైనవారని రాజుకి చెప్పి మామ, అల్లుల్ల మధ్య గొడవ పెడతాడు. ఆనాటి సమాజంలో బ్రాహ్మణులు వర్ణవ్యవస్థను బాగా నమ్మి ప్రజలపై రుద్దిన వైనం పై కథలో బ్రాహ్మణుడి పాత్ర ద్వారా తెలుస్తుంది. రాజుల కాలంలో పై స్థాయి ఉద్యోగాల్లో బ్రాహ్మణులే ఉండేవారు. దానికి కారణం వేదశాస్త్రాలు నేర్చినవారై ఉండటం. వారిలో ఎంత విజ్ఞానాన్ని అభ్యసించినవారున్నారో అంత అజ్ఞానాన్ని ప్రజలపై రుద్దినవారు లేకపోలేదు.

## 4.1.4.2 వైశ్యులు

కోమట్లనే వైశ్యులు అని అంటారు. వీరు వర్తక వ్యాపార రంగాల్లో ఆరితేరినవారు. జానపద కథల్లో కోమట్ల కులానికి సంబంధించిన కథలు చాలా ఉన్నాయి.

'కానుగ పట్నం' అనే కథలో వైశ్య సామాజిక వర్గానికి చెందిన భార్యాభర్తలు ఉంటారు. భర్త అమాయకుడు. భార్య అందగత్తె. వాళ్ల ఇంటి ప్రక్కన వెలమ రాజు ఉంటాడు. ఆ వెలమరాజు ఈ కోమటి భార్యను అనుభవించాలని ఆశగా ఎదురుచూస్తాడు. అమాయకుడైన కోమటివాడికి నువ్వు నా ఇంట్లో ఏ వస్తువు మీద చేయి వేస్తే అది నీ సొంతమని ఆశ చూపిస్తాడు. మరుసటి రోజు నీ ఇంట్లో నేను దేనిపై చేయి వేస్తే అది నా స్వంతమని చెప్పి కోమటివాడి భార్యను పొందాలనే దురాశతో ఉంటాడు. ఆ కథ చివర్లో కానుగు పట్నం రాజు వచ్చి కోమటివాని భార్య వెలమరాజుకు దక్కకుండా పథకం వేస్తాడు. ఈ కథలో కోమటి వ్యక్తికి ఉండే ధనాశ, వస్తువ్యామోహం వల్ల ఉచితంగా ఎందుకు చేయి వేయమన్నడో అని ఇంచుక కూడా ఆలోచించకుండా వెలమరాజు ఆశచూపగానే లొంగిపోతాడు. సమాజంలో స్త్రీ వ్యామోహం గల వ్యక్తులు ఏ విధంగా ప్రవర్తిస్తారో ఈ కథ ద్వారా తెలుస్తుంది.

'భోగసాని లంగతనం' అనే కథలో అదృష్టవశాత్తు లభించిన గోవు వల్ల ఒక కోమటి ఆర్థికంగా ఎదుగుతాడు. అతని ఎదుగుదల చూసి ఓర్వలేని ఒక భోగపు స్త్రీ అవకాశం కోసం ఎదురుచూస్తుంది. ఉగాది పండుగ సందర్భంగా కొత్తగా వివాహం చేసుకున్న కోమటి అత్తగారింటికి వెళతాడు. అదే అదునుగా భావించి భోగపు స్త్రీ కోమటి దగ్గర ఉన్న ఆవును దొంగిలించి తీసుకొచ్చుకుంటుంది. అత్తగారింటికి వెళుతున్న కోమటికి అనుమానం వచ్చి ఇంటికివచ్చి చూసేసరికి ఆవును భోగపు స్త్రీ తన ఇంట్లో కట్టేసుకుంటుంది. కోమటి న్యాయం కోసం కోర్టును, న్యాయవాదిని సంప్రదిస్తాడు. ఇలా ఈ కథలో కోమటివాడు అమాయకుడిగా, చంచలస్వభావుడిగా, సున్నితమైన వాడిగా చిత్రించబడతాడు. మనకు చెడు చేసేవారు మన చుట్టూ పక్కలే ఉంటారు. అదును దొరకినప్పుడు వెన్నుపోటు పొడుస్తారని, వారిని గమనిస్తూ మన జాగ్రత్తలో మనం ఉండటం ఉత్తమమన్న నీతిని బోధిస్తుంది.

పై రెండు కథల్లో కోమటివాడు అమాయకంగా చిత్రించబడితే మరొక కథలో కోమటి స్త్రీ మాత్రం గడుసరిగా, తెలివైనదానిగా, ధైర్యవంతురాలిగా తన ప్రతిభను చూపి తనని మోహించిన వెలమరాజుకు తగిన బుద్ధి చెబుతుంది. ఆ కథ పేరు 'సావుకారి కోడలి చతురత' కథ. మొదట వెలమరాజు కచ్చీరకాడ కూర్చుని గోదావరి స్నానానికి వెళ్లి వస్తున్న షావుకారి కోడలి పొడగాటి

వెంట్రుకలను చూసి తమాషాగా ప్రశ్నిస్తాడు. కోమటి స్త్రీ కూడా అదే స్థాయిలో సమాధానమిస్తుంది. ఒక దొరనైనా నన్ను ఆడది అవమానించడమేంటి? అని దురహంకారంతో విర్రవీగి కోమటి స్త్రీని ఏలాగైనా లోబరుచుకోవాలని తెగిస్తాడు. కోమటి స్త్రీ వెలమరాజు ఎత్తులకు పైఎత్తు వేసి అతని అంచనాలను తారుమారు చేసి తప్పించుకన్న తీరు కోమటి స్త్రీకే కాక ప్రతి స్త్రీని చైతన్యపరుస్తుంది. ఒక స్త్రీ కామాంధుల నుంచి ఎలా తనను తాను రక్షించుకుంటూ నిత్యం అప్రమత్తంగా ఉండాలో ఈ కథ తెలుపుతుంది.

## 4.1.4.3 వెలమలు

తెలంగాణ ప్రాంతంలో వెలమలు ఎక్కువగా ఉండేవారు. వీరిని గ్రామాల్లో దొర అని పిలిచేవారు. తెలంగాణ ప్రజల సాయుధ పోరాటాల వల్ల ఆనాటి వెలమ దొరలు పట్టణాలకు పారిపోయి స్థిరపడ్డారు. వెలమలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినవారై ఉండటం వల్ల రాజ్యాధికారం వాళ్ల చెప్పు చేతుల్లో ఉండేది. నిజాం పరిపాలన కాలంలో వారు చూపించిన ప్యూడలిజానికి ఎందరో బలైపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో వెలమలు సామంతరాజులుగా ఉండి వెనుకబడిన, నిమ్న వర్గాల వారిచేత వెట్టి చాకిరి చేయించుకునేవారు. వారి పరిపాలన కాలంలో దొరికిన ఆడవారిని చెరబట్టేవారు. అడ్డు చెప్పినవారిని హింసాత్మకంగా చిత్రవద చేసేవారు. అందుకే జానపద కథల్లో వెలమలు పాత్రలు దురంహకారాన్ని, దౌర్జన్యాన్ని పురిగొల్పే విధంగానే కల్పించబడ్డాయి. సమాజంలో ప్రాచీనకాలం నుండి నేటి వరకు స్త్రీలపై హింసాత్మక సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని తెలుస్తుంది.

'సావుకారి కోడలు చతురత' అనే కథలో ఒక వెలమ రాజు గ్రామపెద్ద. కచ్చేరులో కూర్చొని వచ్చి పోయే ఆడవారిని హేళన చేసేవాడు. ఒక రోజు వివాహిత స్త్రీని పిలిచి ఆమె వెంట్రుకలను ఉద్దేశించి నువ్వు వెంట్రుకలు కూర్చోని ముడుచుకుంటావా లేకుంటే నిల్చొని ముడుచుకుంటావా అని అడుగుతాడు. ఆ స్త్రీని పిలిచి ఆమెను గేలి చేయడానికి తనను ఎవ్వరు ఏమని ప్రశ్నించారనే అధికార మధంతోనే అడుగుతాడు. ఆ స్త్రీ వెలమ రాజుని ఎదురిస్తుంది. ఆడది తనని ఎదిరించినందుకు ఏలాగైనా ఆమెను బలత్కారం చేయాలని తన ఇంట్లో కార్యక్రమాలు చేసి ఊరి వారినంతా ఆహ్వానిస్తాడు. ఒక వేళ

ఊళ్లో వారిలో ఎవరైనా తన ఇంటికి భోజనానికి రాకపోతే అధికమైన పన్నులు వసూలు చేసి శిక్షిస్తాడు. అతని నిరంకుశత్వానికి వివాహిత స్త్రీ వెలమరాజు ఇంటి గడప తొక్కక తప్పలేదు. అదే మంచి అవకాశంగా భావించి ఆ స్త్రీని తల్లితో చెప్పి తన ఇంట్లోనే నిర్బంధించేలా చేస్తాడు. వెలమ దొర ఎన్ని ప్రయత్నాలు చేసినా విఫలమవ్వడంతో ఆ స్త్రీ తప్పు చేసినట్లు కచ్చేరుకి పిలుపిస్తాడు. కచ్చేరులో అయితే తాను చెప్పితే న్యాయంగా నిలుస్తుందని భావించి షావుకారి కోడలుని కచ్చేరులో పెద్దల ముందు తప్పు చేసినట్లు నిలబెడతాడు. పై కథలో పురుషాహంకార స్వభావం మనకు వెల్లడి అవుతుంది.

మరొ కథ 'కానుగ పట్నం' లో వెలమరాజు పరాయి స్త్రీ వాంఛనే చిత్రించింది. దీనిని బట్టి నాటి సామాజిక వ్యవస్థలో వెలమల దౌర్జన్యానికి బలైన స్త్రీలు ఎక్కువగానే ఉంటారని అనిపిస్తుంది. ఇద్దరు భార్యభర్తలు ఉంటారు. వాళ్లింటి ప్రక్కన ఒక వెలమ వ్యక్తి ఉంటాడు. అతని భార్య కొద్దిగా అందవిహీనంగా ఉంటుందని చెప్పి పరాయివాడు భార్యను లొంగదీసుకోవాలని చూస్తాడు. అందుకే పరాయి వ్యక్తికి వస్తువును ఆశ చూపి తాను అతని భార్యను తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. కానీ కానుగపట్నం రాజు దయవల్ల ఆ దంపతులు వెలమరాజు వ్యూహం నుంచి తప్పించుకుని బయట పడతారు. సమాజంలో పరస్త్రీ వ్యామోహం గల వ్యక్తులుంటారని, వారి నుండి స్త్రీలు తమని తాము ఏవిధంగా రక్షించుకోవాలో ఈకథ ద్వారా వెల్లడి అవుతుంది.

## 4.1.4.4 కంసాలి

విశ్వబ్రాహ్మణుల్లో కంసాలి వారు ఒక భాగం. కంసాలివారినే స్వర్ణకారులు అని కూడా అంటారు. ఉత్తర తెలంగాణా ప్రాంతంలో కంసాలివారిని అవుసులయిన అని కూడా వ్యవహరిస్తారు. అందుకే జానపద కథలో ఎక్కువగా కంసాలి కులానికి అవుసులోల్లు అనే పదం కనిపిస్తుంది. గ్రామాల్లో, పట్టణాల్లో బంగారం, వెండి వంటి వాటితో విలువైన ఆభరణాలను చేయడం వీరి ప్రధాన వృత్తి.

'తల్లి కోతి కోడలు' అనే కథ స్వర్ణకారుడి వృత్తిని తెలుపుతుంది. ఒక కోతి దొంగల్లో నాయకుడికి తన కూతురునిచ్చి వివాహం చేస్తానని మాట ఇస్తుంది. అందుకు ప్రతిఫలంగా నాకు బంగారాన్ని ఇస్తే,

నా కూతురుకి బంగారు ఆభరణాలను చేయించి మేడలో వేస్తానని అబద్ధాలు చెబుతుంది. “నాకు యింత బంగారమియ్యి. అవుసలాయిన దగ్గర మంచిగ బంగారం చేయించుకుని నా బిడ్డ మీద ఏసుకొని తీసుకోని అత్త అని చెప్పి అంటది” కంసాలి వాడి పేరు చెప్పి కోతి దొంగల బారి నుంచి తప్పించుకుంటుంది.

‘సోమనాల భావి’ అనే కథలో ఒక కంసాలి వాడు చాలా పేదరికంతో బాధపడతాడు. భార్య పిల్లలు పోషించుకోవడం భారంగా మారి చిలుకవాది పట్నం అనే పట్టణానికి తన స్నేహితుడితో కలిసి వలస వెళతాడు. మార్గమధ్యలో తన స్నేహితుడైన బ్రాహ్మణుడి మోసం వల్ల బావిలో పడతాడు. చావు బతుకుల మధ్య ఉన్న బ్రాహ్మణుడు రాచపుండు రహస్యాన్ని తెలుసుకొని రాణికి పసరు వైద్యం చేసి రాణిని బతికిస్తాడు. రాజు మన్ననతో రాజ్యాలను ఏలే రాజుగా మారతాడు. తనకు చెడు చేయడానికి వచ్చిన స్నేహితుడిని క్షమించి తన ఎదుగుదలకి నువ్వే కారణమంటూ ప్రశంసిస్తాడు. రాజు చేత కుల వివక్షకు గురై రాజ్య బహిష్కరణ చేసినా, ఆ ఊరి రహస్యనిధి వెలికితీసి తన అస్థిత్వాన్ని, ఉనికిని రాజుకి తెలియజేసేలా చేస్తాడు. ఆ విధంగా కంసాలి వాడు ముందు కష్టాలు ఎదుర్కొని తరువాత తన లక్ష్యాలకు చేరువయ్యే పాత్రగా తీర్చిదిద్దబడతాడు. మనం స్నేహితులను గుడ్డిగా నమ్మి మోసపోవద్దని ఈ కథలో బ్రాహ్మణుడి పాత్ర ద్వారా తెలుస్తుంది.

## 4.1.4.5 కుమ్మరి

గ్రామాల్లో కుండలు, కడవలు, రంజన్లు, ముంతలు, మూకుళ్లు, ప్రమీదలు, తొట్టెలు, బానలు, కాగులు సట్లు మొదలైన వస్తువులు తయారు చేయడంలో నైపుణ్యం కల్గినవారు కుమ్మరివారు. వివాహ సమయంలో అయిరేణి కుండల్ని కూడా చేసి ఇస్తారు. అందుకు బదులుగా ధాన్యంగాని, డబ్బులను గాని కానుకగా స్వీకరిస్తారు. పట్టణాల్లో కన్న గ్రామీణ ప్రాంతాల్లో వీరి అవసరం ఎక్కువగా ఉంటుంది.

‘కోతి కథ’ అనే కథలో ఒక కోతి కుమ్మరివాడి దగ్గరకి పోయి కత్తి ఇచ్చి సహాయం చేస్తుంది. “ఒక కుమ్మరి కుండల కోసం చేతి ద్వారా మట్టి తవ్వుతుండు మట్టి తవ్వితే తాత చేతితోటి మట్టి తవ్వితే

మట్టి అత్తద ఇగో నా కత్తి ఇత్త తీసుకో" మట్టినే నమ్ముకొని అతని చేతి నైపుణ్యాన్ని పదునుగా పెట్టి అద్భుతమైన కళాకృతులను తీర్చిదిద్దే కుమ్మరివాడి కష్టం కనిపిస్తుంది.

'సవతి తల్లి', 'తల్లి కూతుళ్లు' ఈ రెండు కథల్లో కుమ్మరి కులానికి చెందిన ఒక స్త్రీ ఇద్దరు పిల్లలున్న తండ్రిని వివాహం చేసుకుంటుంది. ఆ ఇద్దరు తల్లి లేని పిల్లలకు సవతి తల్లి పోరుని చూపిస్తుంది. ఒక కథలో పాలల్లో పాము కలిపి పెద్ద కూతురుకి తాగిపించి గర్భం చేసుకుందని నింద మోపి ఇంట్లో నుంచి వెళ్లగొడుతుంది. మరొకథలో సవతి తల్లిగా ఉండి తనకు పుట్టిన పిల్లను హాయిగా చూసుకుంటూ సవతి పిల్లలను మాత్రం చిత్రహింసలు పెట్టి చంపించడానికి ప్రయత్నిస్తుంది. సమాజంలో ఇటువంటి స్త్రీలు ఉంటారని పైకథ ద్వారా వ్యక్తమవుతుంది.

## 4.1.4.6 చాకలి

చాకలివారి ప్రధానవృత్తి బట్టలు ఉతకడం. గ్రామాల్లో జరిగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో వీరు ప్రధాన పాత్ర వహిస్తారు. పెళ్లిళ్లు, దేవుని ఉరేగింపులకు, ఉత్సవాలకు దివిటీలు పట్టుకుంటారు. జాతరలలోగాని, ప్రజల మొక్కులు చెల్లించేటప్పుడు జంతు బలి చేసి ఆ జంతు తలను తీసుకోవడం లేదా కొంత డబ్బును తీసుకుంటారు. కొన్ని కుటుంబాలకు కలిపి ఒక చాకలి కుటుంబం ప్రత్యేకంగా వంశపారంపర్యంగా కూడా సేవలందిస్తారు. చాకలివారు గ్రామాల్లో కొన్ని నిర్ణయించిన హక్కులను కలిగి గ్రామ ప్రజలకు అనేక సేవలందిస్తారు. వీరి వృత్తి వల్ల వీరికి సమాజంలో కొంత చిన్న చూపు కూడా కనిపిస్తుంది. జానపద కథల్లో కూడా అలాంటి సంఘటనలు చిత్రించబడ్డాయి.

'సాకలి పుల్లక్క' అనే కథలో ఇద్దరు భార్యాభర్తలు ఉంటారు. వారు చాకలి వృత్తి నమ్ముకుని బతికేవాళ్లు. రోజు గోదావరికి వెళ్లి గుడ్డలు ఉతికి తీసుకురావడమే వారి పని. "ఈ ఆరపెల్లి అసొంటి ఊళ్లే ఒక సాకలి పుల్లక్క. సాకలి రామన్న ఇద్దరు ఉండేది. వాళ్లు పోతే బట్టలు పట్టుకుని గంగకే పోవాలి. ఉతుక్కొని ఇంటికే రావాలి. మంచిగ మర్యాద కల మనుషులు" అలాంటి మంచి దంపతుల సంసారాన్ని ఆ ఊరు గ్రామాధికారులు పాడు చేయాలనుకుంటారు. పోలీసు, పటేలు, సైకుదారు, సర్దారు ఇలా అధికారులంతా చాకలి పుల్లక్క ఎప్పుడు ఒంటరిగా దొరుకుతుందని కావలి కాస్తారు.

అధికారులంతా అధికార మదంతో తనను చెరబట్టాలని చూసినా తాను మాత్రం వారి నుంచి తప్పించుకొని ధైర్యంగా తలారి రామన్న సహాయంతో వారిని ఎదుర్కుంటుంది. మన సమాజంలో కొన్ని వృత్తుల వారిని నీచమైన దృష్టితో చూడటమనే దురాచారాలను నేటికీ గ్రామాల్లో, పట్టణాల్లో కనిపిస్తూనే ఉంటాయి. మొన్నమొన్నటి వరకు కూడా నిమ్న వర్గాల స్త్రీలను నీచమైన బుద్ధితో చూడటమనేది జరిగింది. అలాంటి సంఘటననే ఈ కథాకల్పనకు దారితీసినట్లు అనిపిస్తుంది. అందుకే ఈ కథలో అధికారులు నేను ఫలానా అధికారిని అంటూ చాకలి పుల్లక్క మీద అధికారం చలాయిస్తారు. భర్తను అమాయకుడిని చేసి హైదరాబాదుకు పంపించారు. సమాజంలో ప్రజలకు ఎన్నో విధాలుగా సేవ చేస్తున్న చాకలి లాంటి కులవృత్తులను తక్కువగా చూడటమనే నీచమైన సంస్కృతిని చిత్రించి, స్త్రీ చైతన్యాన్ని పురిగొల్పే కథ.

'పైసకు గుడిసెన్నర పెండ్లాం' అనే కథలో ఒక కుమారుడు తన పేదరికాన్ని జయించడానికి వివిధ ప్రాంతాలు తిరిగి అందరికి అబద్ధాలు చెప్పి మోసం చేస్తాడు. అయితే అతను దొంగతనం చేసిన చకినాలను చాకలిరేవు గట్టు మీద నుంచి తినుకుంటూ వెళతాడు. చాకలి రేవు గట్టు మీద ఉన్న పిల్లలతో బట్టలు ఉతకడానికి వెళ్లిన తల్లిదండ్రులను, ఆ కులాన్ని దూషిస్తూ క్రింది మాటలను అంటాడు. "ఏయ్ నీ అవ్వ! సాకలి కులం సత్తెనాశం కాను. ఎప్పుడు మంది కొంపలకు ఏడ్తరు? మీరేమన్న పండుగత్తే కంచులు పెట్టి కాల్తరు మీరు ఊరూరా పడి బతికెటొల్లనాయే కంచులు నేనేమన్న కాల్సిన్న నేను ఇయ్య అంటడు" ఆ విధంగా చాకలి కులానికి చెందిన గ్రామాల్లో ప్రజలకు సాంస్కృతిక కార్యక్రమాల్లో, ఉత్సవాల్లో, వివాహది కార్యక్రమాల్లో పాల్గొని సేవలందించి తరువాత ఏదొక రూపంలో వారిచ్చిన కానుకలు, వస్త్రాలు, పిండి వంటలను తీసుకెళతారు. ఆ విషయాన్ని ఉద్దేశించి పై కథలో అతను చాకలి కులాన్ని తిడుతూ, ఊరి మీద ఆధారపడి జీవించే వాళ్లని అంటాడు. వారి సామాజిక వెనుకబాటుతనాన్ని, జీవన విధానాన్ని జానపద కథల్లో స్పష్టంగా తరచి చూడవచ్చు.

## 4.1.4.7 కాపు

కాపు కులం ప్రధాన వృత్తి వ్యవసాయం. పంట పొలాలకు కాపు కాయడం వల్ల వీరికి కాపు అనే పేరు స్థిరపడింది. కాపు అనగా రక్షించు, కాపాడు, కాపు చేయి అని అర్థాలున్నాయి. మన దేశంలో వీరి జనాభా అత్యధికంగా ఉంటుంది.

'దారి మరిచిన ద్వారక' అనే కథలో "ఒక కాపు రైతు. రైతు కొడుక్కి చిన్నప్పుడే పెండ్లి చేసిండు. చేసినంక ఏమయ్యిందిగ ఆ పొల్లగాడు దుడ్డెలు కాసుడు. పోతండు అత్తండు" అని కాపు కుల ప్రస్తావన ఉంటుంది. కాపు రైతు అనగానే కొద్దో గొప్పో భూమిని కలిగి ఉండి వ్యవసాయం చేస్తారు. కాపు రైతుల్లో చాలా మందికి భూమితో పాటు పాడి, పశు సంపద కూడా ఉంటుంది. ఈ కథలో కూడా రైతు కొడుకుకి బాల్యవివాహం చేసినట్లు తెలుస్తుంది. యువకులు సరిగా స్థిరపడక ముందే, ఎదిగి ఎదిగని వయసులోనే వివాహాలు చేసేవారని పై కథలో వాక్యాలు తెలుపుతున్నాయి.

'సవతి తల్లి పోరు' అనే కథలో కాపు కులానికి చెందిన ఇద్దరు భార్యభర్తలు ఉంటారు. వారికి ఇద్దరు పిల్లలు కూడా ఉంటారు. ఆ కాపు రైతు భార్య అనారోగ్యంతో చనిపోతుంది. కాపు రైతు కుమ్మరామెతో వివాహం చేసుకుని తమ ఇద్దరు పిల్లలను సవతి తల్లి చెప్పిన మాటలు విని బయటకు పంపిస్తాడు. ఆ పిల్లలకు ఎక్కడికి పోవాలో తెలియక పొలం దగ్గరకి వెళ్లి ఏడుస్తారు. ఆ పొలం దగ్గర ఉన్న మొక్కజొన్న కంకులను కాల్చుకుని ఆకలిని తీర్చుకుంటారు. కాపులకు వ్యవసాయం మీద, పంటల మీద పట్టు ఎక్కువగా ఉంటుంది. కాపు స్త్రీలు కూడా వ్యవసాయ పనుల్లో భర్తతో పాటు పనిచేస్తారు.

## 4.1.4.8 రెడ్డి

కాపుకులంలో అనేక ఉపకులాల విభాగాలున్నాయి వాటిలో ఒకటి రెడ్డి. రెడ్డి అంటే గ్రామ పెద్ద, సర్పంచ్ అనే అర్థాలు ఉన్నాయి. రాష్ట్రకూటుల కాలంలో గ్రామ పరిపాలకులను రట్టడి అని వ్యవహరించేవారు. రట్టడి అనే పదం కాలక్రమంలో రెడ్డిగా స్థిరపడింది.

'అన్నదమ్ములు' అనే కథలో రెడ్డి కులానికి చెందిన ఐదుగురు అన్నదమ్ములు ఉంటారు. వారిలో పెద్దవాడు బాగా ఎదిగి ఆర్థికంగా స్థిరపడతాడు. మిగిలిన తమ్ముళ్లు అన్న ఎదుగుదలను సహించుకోలేక మంగలి వానితో అన్నను చంపించడానికి ఎత్తుగడ వేస్తారు. కాని ఒక బ్రాహ్మణుడి మాటల వల్ల అన్న తన ప్రాణాలను కాపాడుకుంటాడు. అలా రాజ్యాధికారం కోసం, ఇంటి ఆస్తి పంపకాల కోసం అన్నదమ్ములు చంపుకోవడం రాజుల కాలంలో ఎక్కువగా ఉండేవి. ఈ కథలో అన్నని చంపితే తమ్ముళ్లు రాజ్యమేల వచ్చునన్న భావనతో అన్న ప్రాణాలను తీయాలనుకుంటారు. సమాజంలో ఆస్థిపాస్తుల కోసం సొంత అన్నదమ్ములను కూడ చంపడానికి ప్రయత్నించే వ్యక్తులు కూడ ఉంటారని మనకు తెలుస్తుంది.

## 4.1.4.9 యాదవులు

వృషిణి అనే తెగకు చెందిన యదు వంశీయులు యాదవులు. భారతదేశంలో వీరి జనాభా 25 కోట్ల దాకా ఉంటుంది. దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా యాదవులు అధిక సంఖ్యలో ఉన్నారు. యాదవుల్లో ఎర్ర గొల్ల, తెల్ల గొల్ల, కురుమ, కురుబ ఇలా ఉప విభాగాలున్నాయి. యాదవుల ప్రధాన వృత్తులు వ్యవసాయం, పశుపోషణ. యాదవులు పశువులు పెంచడం వల్ల వాటి ద్వారా వచ్చే పాలు, మాంసం, చర్మం మార్కెటులో అమ్మి మంచి లాభాలు ఘడిస్తున్నారు. గ్రామీణ ఆదాయాన్ని పెంచే వృత్తుల్లో గొర్రెల పెంపకం ఒకటి. గొర్రెలవాడు, గొర్లవాడు, గొల్లవాడు అనే శబ్దాల నుంచి గొల్ల అనే పేరు స్థిరపడి ఉండవచ్చు. జానపద కథల్లో గొల్ల వారి ప్రస్తావన ఎక్కువగానే ఉంది. దానికి కారణం జానపద కథకులు, కళాకారులు ఎక్కువగా గొల్లవారై ఉండటం.

'గొల్ల బోయుడు' అనే కథలో గొల్ల బోయుని పాత్ర అద్భుతంగా చిత్రించబడింది. ఒక రాజుకు బ్రాహ్మణుడు రాజనీతిని చెప్తాడు. అది సరైన రాజనీతి కాదని పశువులను కాసే గొల్లబోయడు తన అనుభవంలో కలిగిన జ్ఞానాన్ని రాజుకు చెప్పి ప్రశంసలందుకుంటాడు. బ్రాహ్మణుడు రాజుతో ప్రపంచంలో నీరు, బంధువులు ముఖ్యమని అవి లేకుంటే ప్రపంచమంతా అంధకారమని చెప్తాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడి సహాయంతో సభకు వెళ్లి, రాజాజ్ఞతో నీరు, బంధువులతో రాజ్యం సుభిక్షంగా

ఉండదని చెప్తాడు. రాజ్యం సంక్షేమంగా ఉండాలంటే నీరుని సృష్టించిన మేఘం సహకరించాలి. బంధువులను నమ్మితే మోసం చేసే అవకాశం ఉంటుంది. తనని తాను నమ్మినవాడే శత్రువులను జయించగలడని ఆత్మవిశ్వాసం ముఖ్యమని చెప్తాడు. బంధుబలం కన్న భుజబలాన్ని నమ్ముకుంటే చాలని రాజుకు హితవు చెప్తాడు. రాజు గొల్ల బోయుడు చెప్పిన సత్యాన్ని గ్రహించి, బ్రాహ్మణుడి మెడలో మొదట వేసిన బంగారు హారాన్ని తీసి గొల్ల బోయనికి బహుకరిస్తాడు. ఈ కథలో ఒక గొల్లవాడి ప్రదర్శించిన తెలివితేటలను చూసి రాజు, బ్రాహ్మణుడు, సభికులు ఆశ్చర్యపోతారు. చదువు సంధ్యల్లేని గొల్లబోయడి లాంటి వారిలో కూడా అపారమైన జ్ఞానం ఉంటుందని ఈ కథ వల్ల తెలుస్తుంది.

'రాజి' అనే కథలో పశువుల కాసే గొల్లవాని జీవన విధానం తెలుస్తుంది. "ఆమె ఆళ్ల భర్త గొర్లు కాస్తాడు. రోజు పోద్దున పది గంటలకు వోయి సాయంత్రం ఏడు గంటలకు అస్తడు. అయితే ఈ గొర్లు రోజు పొద్దున పది గంటలకు వోయి రాత్రి ఏడు గంటలకు అచ్చేసరికి" ఎండ, వాన, చలి తేడా లేకుండా పశువులను కాసే గొల్లవారి కష్టమేంటో పై వాక్యాల ద్వారా తెలుస్తుంది.

కొన్ని జానపద కథల్లో దేవుడు పశువులు కాసే వ్యక్తి రూపంలో ప్రత్యక్షమవడం అనేది కనిపిస్తుంది. అలాంటి కోవకు చెందిన కథలు 'హరిదాసు కథ', 'ఐదు మల్లె పూవుల కథ'. 'హరిదాసు కథ'లో ఒక బ్రాహ్మణుడు ఆకలితో అలమటించి మూర్ఛపోయినప్పుడు శ్రీమన్నారాయణుడు గొల్లవాని రూపంలో ప్రత్యక్షమై నీటి జాడ తెలిపి మాయమైపోతాడు. అలాగే 'ఐదు మల్లెల పూవ్వుల కథ'లో కూడా నాయకుడు బాలగిరిరాజుకు, నాయిక ముత్యాలదేవికి శివుడు గొల్ల రూపంలో వచ్చి సహాయం చేస్తాడు. కథను మలుపు తిప్పడంలో ఆ పాత్రలు కీలకంగా వ్యవహరిస్తాయి. కష్టాల్లో ఉన్న వారిని దేవుడు ఏదోక రూపంలో వచ్చి ఆదుకుంటాడని ప్రజలు నమ్ముతారు. అందుకే కథల్లో నాయకుడు క్లిష్టతర సమస్యల్లో ఉన్నప్పుడు దేవుడు మారు రూపంలో రక్షించే సంఘటనలు కల్పించబడతాయి.

## 4.1.4.10 మాదిగ

మాదిగ వారిని చర్మకారులని కూడా అంటారు. వీరు చర్మంతో వస్తువులను తయారు చేస్తారు. సమాజంలో వీరు తరతరాలుగా అణచివేయబడ్డారు. వీరు పారిశుధ్ధ్య కార్మికులుగా, శవాలను

తీసుకెళ్లేటప్పుడు డప్పుకొట్టేవాళ్లుగా, కాట్నాల గడ్డ కాటికాపరులుగా, చాటింపు వేయడం ఇలా తక్కువ ప్రాధాన్యత కలిగిన పనులు చేయడం వల్ల తక్కువ జాతిగా చూడబడ్డారు.

'చెల్లెలు దిద్దిన కాపురం' అనే కథలో భార్యాభర్తలు ఉంటారు. భార్య భర్తకు పొడుపు కథ వేసి విప్పమని చెబుతుంది. ఆ పొడుపు కథ విడుపు చేయకపోతే చావాలని ముందే ప్రతిజ్ఞ తీసుకుంటుంది. భర్త ముందు సరేనని మాట ఇచ్చి పొడుపు కథ విప్పలేకపోతాడు. అతని చెల్లె వదిన వేసిన పొడుపు కథలో ఉన్న రహస్యాన్ని తెలుసుకొని అన్నని రక్షించాలని అనుకుంటుంది. అన్న దగ్గరికి వెళ్లి నలుగురు పెద్ద మనుషులను పిలిపించి మాదిగ వ్యక్తితో చాటింపు వేయించమని చెప్తుంది. "అన్న పెద్ద మాదిగను పిలు" నీ భార్య సంగతి, సాత్రం నేను చెప్తే ప్రజలు ఇంటరు. అయింత చాటింపు విని కచ్చీరు కాడికి అందరు అచ్చిరు". పూర్వం అధికారిక సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో చాటింపు ప్రక్రియ కీలకపాత్ర పోషించిందని తెలుస్తుంది.

'సత్యహరిశ్చంద్రుడు' అనే కథ చాలా ప్రసిద్ధమైన కథ. ఈ కథలో సత్యహరిశ్చంద్రుడిని కోటి రూపాయల అప్పు కోసం శనీశ్వరుడు వెంటాడుతూ ఉంటాడు. అప్పుడు మాదిగ కులానికి చెందిన జాంబవంతుడు వచ్చి హరిశ్చంద్రుడా! నీ అప్పు తీరే మార్గాన్ని నేను చూపిస్తాను. నా దగ్గర కాట్నాల గడ్డలో పాలేరుగా పని చేయమని అడుగుతాడు. "పెద్ద మాదిగ జాంబవంతుడు వాడు. పెద్ద కోరమీసం పెట్టుకోనచ్చి ఏడు గజాలు ఏత్తు తోటి అచ్చి ఏమంటుండు. నేను కోటి రూపాయలకు నిను కొంటనని ఓ హరిశ్చంద్ర!" ఈ విధంగా మాదిగలు ఆరాధించే జాంబవంతుడి రూపాన్ని ఈ కథలో జానపద కథకురాలు వర్ణించారు. శవాలను కాల్చే కాట్నాల గడ్డలో పని చేయడమంటే అంత సులభం కాదు. అందుకే జాంబవంతుడు హరిశ్చంద్రునికి కోటి రూపాయలు అయినా ఇవ్వడానికి వెనుకాడలేదంటే ఆ పని ఎంతో కష్టతరమో అర్థం చేసుకోవచ్చు. సమాజంలో మంచివారికి ఎప్పుడు కష్టాలు ఉంటూనే ఉంటాయని దయనీయుడైన హరిశ్చంద్రుని పాత్ర ద్వారా బోధపడుతుంది.

## 4.1.4.11 మంగలి

కేశఖండన, కేశాలంకరణ చేసే వ్యక్తిని క్షురకుడు లేదా మంగళి అంటారు. మంగళ వాయిద్యాలు వాయించేవారు కనుక మంగళి అని పేరు. వీరికి నాయి బ్రాహ్మణులు అని కూడా మరొక పేరు ఉంది. గ్రామీణ ప్రాంతంలో వీరికి కొన్ని హక్కులు ఉన్నాయి. వివాహాది కార్యక్రమాల్లో కాలగోర్లు, కాలగొల్లు తీయడం అనే కార్యక్రమాన్ని వీరి చేతుల మీదనే జరిపిస్తారు. పెళ్లి కొడుక్కి వివాహానికి ముందు పట్టుకారు లేదా కత్తెరను ఇచ్చే సంప్రదాయం కూడా ఉంది. దేవాలయాల్లో తలనీలాలు సమర్పించేవారికి వెంట్రుకలను కత్తెరించడానికి వీరు హక్కులు పొంది ఉంటారు.

'అన్నదమ్ములు' అనే కథలో మంగలి పాత్ర దుష్టుడిగా చిత్రించబడింది. ఐదుగురు అన్నదమ్ములు ఉంటారు. వారిలో నలుగురు అన్నదమ్ములు కలిసి మంగలివానికి తన అన్నని చంపమని చెప్తారు. దానికి ప్రతిఫలంగా నలుగురు అన్నదమ్ములు తలా లక్షరూపాయల చొప్పున నాలుగు లక్షలు మంగలికి ఇస్తారు. మంగలి అయితే అన్నని మెడ మీద కత్తి పెట్టి చంపడం తేలిక అవుతుందని భావిస్తారు. "నలుగురు ప్లాన్ ఏసి అప్పుడు పిస్తోలు లేకుండే ఒక మంగలోణ్ణి పిలిపిచ్చి అరె మంగలి వేరోటోన్ని మా అన్న నమ్మడు నేను పెయిన నమ్మడు. పరాయొల్లను నమ్మడు. నువ్వు గడ్డం తీసినట్టు తీసి మా అన్నను సంపెయి" రాజు గారి మాటలు విని నీ రాకట నీ పోకట నాకు తెలుసు అనే సరికి మంగలి భయపడి అసలు నిజాన్ని చెప్తాడు. నలుగురు తమ్ముళ్ళు బలవంతం పెట్టి చంపమన్నారని చెప్తాడు. మంగలికి ఈ కారణం తప్ప రాజుతో అతనికి ఎలాంటి వైరుధ్యం ఉండదు. సంపద ఉన్న వారి దగ్గర పనిచేసే సామాన్యుడు మెలగడం కష్టమేనని మంగలి పాత్ర ద్వారా తెలుస్తుంది. ఎందుకంటే అన్నదమ్ముల్లో అన్నను మంగలి చంపకపోతే డబ్బులు ఇచ్చిన తమ్ముళ్లు మంగలిని చంపుతారు. ఒకవేళ అన్నను చంపి డబ్బు తీసుకుందామనుకుంటే చంపే ప్రయత్నంలో అన్నకు తెలిస్తే అన్న ప్రాణాలతో వదిలిపెట్టడు. ఈ కథలో మంగలి పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్లు అగుపిస్తుంది.

'సాకలి పుల్లక్క' అనే కథలో మంగలి, ఒక స్త్రీకి సహాయం చేసిన పాత్రగా చిత్రించబడుతాడు. ఆ ఊరి గ్రామ పెద్దలు, అధికారులు కలిసి చాకలి పుల్లక్కను పొందడానికి పుల్లక్క భర్త లేని సమయం

చూసి వస్తారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన అధికారులనుంచి తప్పించుకోవడానికి పుల్లక్క వారిని గుండు గీసుకోవాలని చెప్పి మంగళి కొండన్నని పిలిపిస్తుంది. "మంగలి కొండన్నని అమ్మా! మరి రమ్మనే నేను ఎంటుకలు తీసుకుంటా అని అన్నడు. మంగళొడు అచ్చి పీట ఏసిండు. అన్ని బట్టలు ఇప్పించుకొని రాజు 3 రేవులు పెట్టి కొరిమిండట." ఈ కథలో ఒక చాకలి స్త్రీని అధికారులను నుంచి కాపాడటానికి మంగలి పరోక్షంగా సహాయం చేస్తాడు. ఆ అధికారులకు మంట పుట్టేలా మొండి కత్తితో గుండు తీసి, గాట్లు పెడతాడు. ఆ మంటతో అధికారులకు పుల్లక్క మీద ఆలోచన పోయి గందర గోళానికి లోనవుతారు. వారి నుంచి తప్పించు కోవాలన్న చాకలి పుల్లక్క ఉపాయానికి సహకరించిన వాడవుతాడు. సమాజంలో మోసం చేసే పురుషులతోపాటు, సహాయం చేసేవారు కూడ ఉంటారని తెలుస్తుంది. వారి వల్ల స్త్రీలు రక్షింపబడతారని పై కథ ద్వారా వ్యక్తమవుతుంది.

## 4.1.4.12 పెరక

పెరక కులం వారు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవించేవారు. వీరికి వ్యవసాయ భూమి ఎక్కువగానే ఉంటుంది.

'లక్ష్మీదేవి కటాక్షం' అనే కథలో పెరక కులానికి చెందిన ప్రస్తావన ఉంటుంది. "ఒక ఊరి లోపల పెరుకొల్లు వాళ్లు ఇద్దరు అన్నదమ్ములు గాని బాగా గరీబులు చేరి నాలుగు ఎకరాలంత బూమిచ్చింది గాని ఈనెకు అనుకోకుండా ఆస్తి మొత్తం అమ్ముడు పోయింది" ఈ కథలో దురదృష్టావశాత్తు ఆస్తినంత కోల్పోయిన పెరక కులానికి చెందిన వ్యక్తిని లక్ష్మీ దేవి నిత్యం పరీక్షిస్తుంది. అతని కష్టాన్ని నమ్ముకున్నవ్యక్తి. అతడు కష్టపడే విధానాన్ని చూసి చివరకు కనికరించి మూడు కిలోల బంగారాన్ని ఒకేసారి అందిస్తుంది. ధర్మబద్ధంగా జీవిస్తూ, నిరంతరం తన కష్టాన్ని నమ్ముకుని బతికే వ్యక్తులకు ఎటువంటి అన్యాయం జరగదని, వారి మీద దైవానుగ్రహం కూడ ఉంటుందని ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది.

## 4.1.4.13 కటికలు

కటికలని ఆరె కటికలని కూడా పిలుస్తారు. మాంసం ముక్కలుగా చేసి అమ్మడం కటికల కులవృత్తి. ప్రాణం తీసిన జీవి చర్మాన్ని వలిచి ఆ కళేబరాన్ని శుభ్రపరిచి, ముక్కలుగా కొట్టి అమ్ముతారు.

'కానుగ పట్నం' కథ ఒక కటికవాడు కోమటిని మోసం చేసే వైనాన్ని చిత్రించింది. ఒక అమాయకుడైన కోమటి తన భార్యతో బతుకుదెరువు కోసం కానుగుపట్నం అనే పట్టణానికి గుర్రాన్ని వేసుకోని వస్తాడు. కోమటి వ్యాపారం కోసం డబ్బు అవసరం పడుతుందని చెప్పి గుర్రాన్ని అమ్మకానికి పెడతాడు. తాను అమ్మకానికి పెట్టినప్పుడు గుర్రం మీద తన భార్య ఉంటుంది. కటికవాడు గుర్రాన్ని మూడు వేలకు కొని గుర్రంతో పాటు కోమటి భార్యను కూడా తీసుకెళతాడు. కోమటి కటికవాడు చేసిన దౌర్జన్యాన్ని కానుగపట్నం రాజుకు చెప్తాడు. రాజు వచ్చి కటికివాడికి బుద్ధి రావాలని ఆలోచించి నాకు ఉదయానికి నీ తల కావాలని అడుగుతాడు. కటికవాడు రాజు తల అడిగితే ఏ మేకపోతు, గొర్రెపోతు తలనో అనుకుని సరే అంటూ సమాధానమిస్తాడు. ఉదయం రాజు వచ్చి తల అడిగితే మేక తలకాయ ఇస్తాడు. రాజు నేను అడిగింది మేక తలకాదని నీ తలకాయ అని బెదిరిస్తాడు. అప్పుడు నా భార్య పిల్లలు అని అంటే మరి పరాయివాడి భార్యను తీసుకురావడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నిస్తాడు. "లంజకొడుకా! ఎవడో గరీబోడు అచ్చి గుర్రాన్ని భార్యని అమ్మతాంటే గుర్రానికి భార్యకి ఒకే ధర పెడతావా అప్పుడు. అసోంటి తెలివి ఎవ్వలికి లేదా లంజకొడుకా నీ తలకాయ పట్టుకపోతా లేకపోతే ఆయినా భార్యని విడిచిపెట్టు" అప్పుడు కటికవాడికి బుద్ధి వచ్చి కోమటి భార్యని కోమటి దగ్గరికి పంపిస్తాడు. సమాజంలో మోసగాళ్లు, దౌర్జన్యం చేసే వారు కూడా ఉంటారు. వారిని ముందే గుర్తించి అప్రమత్తంగా ఉండాలి. ఒకవేళ మనం అజాగ్రత్త వహించినట్లయితే ఈ కథలో కోమటిపై దౌర్జన్యం చేసినట్లే మనల్ని కూడా మోసం చేస్తారనే సామాజిక నీతిని ఈ కథ అందించింది.

మరొ కథ 'చంద్రహాసుడు' అనే కథలో కేరళరాజు కుమారుడు చంద్రహాసుడు. మూలనక్షత్రాన జన్మించాడని చెప్పి బాధపడతాడు. దుష్టమంత్రికి చంద్రహాసుడు రాజు అవ్వడం ఇష్టంలేక కటికవాడిని పిలిపించి చంపమని ఆదేశిస్తాడు. కటికలకు చంపడం ఇష్టం లేక చంద్రహాసుడిని వదిలేస్తారు.

చంద్రహాసుడు వేరే రాజ్యానికి పోయి చంద్రాలవతిని వివాహం చేసుకుని హాయిగా ఉంటాడు. ఈ కథలో కఠిన హృదయుడైన కటికవాడు చంద్రహాసుడిని చంపకుండా దయతో వదిలేస్తాడు. రాజాజ్ఞను ధిక్కరించిన కటికవాడి కరుణామయ సున్నిత హృదయం ఇక్కడ వ్యక్తమవుతుంది. ఇది ఒక చారిత్రక కథతో ముడిపడి ఉంది.

## 4.1.4.14 భోగపు స్త్రీ (వేశ్య)

పూర్వం వేశ్యలని భోగం వారని, వాడ వదినలని, కళావంతులని పలు పేర్లతో పిలిచేవారు. సాధారణంగా భోగపు స్త్రీలు వివాహం చేసుకోరు. రాజులకు, డబ్బులున్న వారికి ఉంపుడుగత్తెలుగా ఉంటారు. రాజుల కాలంలో భోగపు స్త్రీల వైభోగం ఉన్నతంగా ఉండటం వల్ల భోగం అని పేరు వచ్చి ఉండవచ్చు. పురుషుల కోరిక తీర్చి దానికి బదులుగా ధనాన్ని గాని లేదా భూములనుగాని సొమ్ము చేసుకోవడమే వీరి పని. రాజుల విలాసం కొరకు నాట్యగత్తెలుగా మారి సంగీత సాహిత్య కళా రూపాలను అభ్యసించేవారు.

'రాణి పగడాల పేరు' అనే కథలో ఒక రాజుకి ఉంపుడు గత్తెగా భోగపు స్త్రీ ఉంటుంది. ఆ యన తల్లిదండ్రులు యుక్త వయస్సుకు వచ్చిన రాజుకి వేరే అమ్మాయితో వివాహం చేయాలని అనుకుంటారు. రాజుకి భోగపు స్త్రీతో అక్రమ సంబంధం ఉండటం వల్ల వధువును చూడకుండానే అయిష్టత వ్యక్తం చేస్తాడు. యువరాజు వధువు ఫోటో తీసుకుని భోగపు స్త్రీకి చూపిస్తే రాజు ఎక్కడ తనకు దూరమైపోతాడోనని ఫోటోలో వధువు బొమ్మకి కంట్లో మచ్చ పెట్టి యువరాజు మెచ్చకుండా చేస్తుంది. కొద్దిరోజుల తరువాత తల్లిదండ్రులు ఆ ఫోటోలోని వధువుకు, కత్తికి కటారుతో వివాహం చేసి ఇంటికి తీసుకువస్తారు. ఆమెను చూసి రాజు తన భార్య అందానికి ముగ్ధుడై భోగం స్త్రీ దగ్గరికి వెళ్లడం మానేస్తాడు. అప్పటి నుంచి భోగపు స్త్రీ రాజు తన భార్యతో సుఖంగా ఉండకూడదని చెప్పి మంత్రగాడితో రాజు భార్య మూర్ఛపోయేలా చేస్తుంది. రాజు ఆదరణ తన మీద ఎక్కడ తగ్గిపోతుందోనని వేశ్య రాజు భార్యకి చెడు చేస్తుంది. రాజులపై భోగపు స్త్రీలు ఆధారపడి జీవించేవారు. రాజు తనను చేరదీయలేదనే

కారణంతో, రాజుభార్యకి చెడు తలపెట్టిన భోగపు స్త్రీ వ్యక్తిత్వం బయటపడుతుంది. పై కథలో రాజుల జీవన విధానం ఏ విధంగా ఉండేదో తెలుస్తుంది.

భోగపు స్త్రీల కథల్లో భోగం రంగసాని పేరుతో కథలు ఎక్కువగా ప్రాచుర్యంలో ఉన్నాయి. 'భోగసాని లంగతనం' అనే కథలో ఒక కోమటివారి ఇంట్లో భోగం రంగసాని ఆవును దొంగతనం చేస్తుంది. కోమటి ఉగాది పండుగకి అత్తగారింటికి పోతాడు. అది గమనించిన రంగసాని కోమటి వ్యాపారానికి, ఆర్థిక ఎదుగుదలకి కారణమైన ఆవుని తెచ్చి తన ఇంట్లో కట్టేసుకుంటుంది. కోమటి వచ్చి తన ఆవు అని అడిగితే గూండాలతో, రౌడీలతో బెదిరిస్తుంది. తన బక్కెద్దు పికిలిచ్చి పిల్లను చేసిందని అబద్ధం చెప్తుంది. కోమటి రంగసానిని నేరుగా ఎదుర్కోలేనని తెలిసి న్యాయవాదిని సంప్రదిస్తాడు. ఆ ఊరి న్యాయవాది వల్ల భోగసాని గుట్టు రట్టు చేసి తన ఆవును తాను పొందుతాడు. ఈ కథలో భోగం రంగసాని దగ్గర రౌడీలు, గుండాలు ఉండటం, ఆర్థిక ఎదుగుదలకు కారణమైన ఆవుని తెచ్చుకోవడం బట్టి చూస్తే భోగపు స్త్రీలకు ధనధాన్యాల మీద గల అత్యాశ వ్యక్తమౌతుంది.

## 4.1.4.15 పూటకూళ్లు

కొందరు ప్రజలు ఉపాధి కోసం పల్లెల నుంచి పట్టణాలకు వలస వెళ్లేవారు. అక్కడికి వెళ్లిన తరువాత తినడానికి తిండిలేక ఇబ్బంది పడేవారు. ఇప్పటిలాగా అప్పుడు హోటల్స్ గాని, మెస్సులుగాని ఉండేవికావు. పొరుగూరి నుంచి వచ్చిన వారికి తిండి పెట్టెందుకు పూర్వం పూటకూళ్లు అనే ఇండ్లు ఉండేవి. పట్టణాలకు వచ్చినవారు ఉండటానికి బస ఏర్పాటు చేసి, తిండి పెట్టి దానికి బదులుగా డబ్బును తీసుకునేవారు. ఆ పూటకు తిండి పెట్టేవాళ్లు కాబట్టి పూటకూళ్లు అనే పేరు వచ్చి ఉండవచ్చు. జానపద కథల్లో పూటకూళ్ల ఇండ్ల గురించి కూడ ప్రస్తావన ఉంది.

'పైసకు గుడిసెన్నర పెండ్లాం' కథలో ఒక వ్యక్తి బతుకుదెరువు కోసం వేరే ప్రాంతానికి వెళతాడు. అక్కడ అతనికి ఆకలి వేస్తుంది. వాళ్ల అమ్మ ఇచ్చిన ముద్ద పైస తప్ప చిల్లి గవ్వ కూడ జేబులో ఉండవు. ఎలాగైనా ఆకలిని తీర్చుకోవాలని చెప్పి ఒక కొత్తకు అన్నం పెట్టే కోమట్ల పూటకూళ్ల ఇంటికి చేరుకుంటాడు. అక్కడ నేను కొత్త ఇస్తా నాకు అన్నం పెట్టు అని చెప్తాడు. అన్నం తిన్న తరువాత

డబ్బులు ఇవ్వకుండానే తప్పించుకుని పారిపోతాడు. ఆ పూటకూళ్లామె డబ్బులిచ్చి అక్కడ నుంచి కదలమని బెదిరిస్తుంది. పూర్వం వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు పూటకూళ్ల ఇళ్లు అనేవి ఉండేవి. వారు డబ్బులకు భోజన కార్యక్రమాలు, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసేవారని తెలుస్తుంది.

'ముసలమ్మ' అనే కథలో ఒక ముసలమ్మ ఉండేది. ఆ ముసలమ్మ వండి పెట్టడానికి  పూటకూళ్ల వారి ఇంట్లో పనికి కుదిరింది. ప్రతి రోజు రొట్టెలు చేయడం ఆమె పని. అలా పూటకూళ్ల ఇంట్లో పనిచేస్తూ ఒక ముసలివాడికి రొట్టెలు పంపేది. అలా తన ఆకలిని తీర్చుకుంటూ ముసలివాడి ఆకలిని తీర్చేది. దీన్ని బట్టి పూటకూళ్ల ఇంట్లో పని చేయడానికి పనివారు కూడ ఉండేవారని ముసలమ్మ పాత్రని బట్టి తెలుస్తుంది. పూర్వం పూటకూళ్లు అనే ఇళ్లు ఉండి, అదొక వ్యాపారంలా సాగేదని పై కథ ద్వారా అర్థమవుతుంది.

## 4.1.5 వర్తక వ్యాపారం

ఏ సమాజమైనా పురోగమించాలన్న, నాగరికతను వృద్ధి చేసుకోవాలన్న వర్తక వ్యాపారాలనేవి సజావుగా సాగాలి. వస్తువు పంపిణీలతో పాటు క్రయవిక్రయాలు జరిగితేనే డబ్బు కూడా చలామణీ అవుతుంది. ఆ డబ్బు ఆదాయంగా మారి ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచుతుంది. జానపదులు కూడా వర్తక వ్యాపారాలు చేసి ఆర్థిక లావాదేవీలను జరుపుతారు.

'కొడుకులున్న తండ్రికి వచ్చిన గతి' అనే కథలో నారాయణ అనే వ్యక్తి ఉంటాడు. ఆయనకు నలుగురు కొడుకులు ఉంటారు. వారికి తలా ఒక బట్టల దుకాణం పెట్టిస్తాడు. అంతేగాకుండా నాలుగు ఇండ్లు కట్టించి, నాలుగు తులాల బంగారం సమానంగా పంచుతాడు. ఆయనకు బట్టల వ్యాపారం వల్ల వచ్చిన ఆదాయంతోనే నలుగురు కొడుకులను పెద్ద చేసి, పెళ్లిళ్లూ చేసి, ఆస్తి పంపకాలు చేయగలిగాడు. అతని కొడుకులు స్వయం ఉపాధి పొందడానికి నాలుగు దుకాణాలు పెట్టించి వాళ్ల ఆర్థిక ఎదుగుదలకి కారకుడైతడు.

'తోడి కోడల్ల అత్యాశ' అనే కథలో ఇద్దరు కోమటి కులానికి చెందిన అన్నదమ్ములు వ్యాపారం చేస్తారు. వ్యాపార రంగంలో కోమట్లది అందే వేసిన చేయని చెప్పవచ్చు. వారిద్దరు అన్నదమ్ములు వేరే

ఊరికి వెళ్లి నువ్వులను అమ్మే వ్యాపారం చేస్తారు. రైతుల దగ్గర కొని తెచ్చిన నువ్వులను మంచి ధర వచ్చినప్పుడు అమ్మితే లాభాలు వస్తాయని ఆలోచించి, తమ ఇంట్లో ఉన్న గుమ్మిలో పోసి నిల్వ ఉంచుతారు. ఆ వ్యాపారులు భవిష్యత్తు అవసరాలను ముందుగానే గుర్తించి, లాభాపేక్షతో ఆ నువ్వులను గుమ్మిలో దాచిపెడతారు. దీని బట్టి వ్యాపార రంగంలో లాభాలు అర్జించడానికి కావలసిన మెళకువలను ఈ కథ సూచిస్తుంది.

## 4.1.6 పరిపాలనా వ్యవస్థ

ఒక రాజ్యంలో గ్రామాలు, పట్టణాలు, నగరాలు కలిసి ఉంటాయి. వాటన్నింటిలో నివసించే ప్రజలు సుఖశాంతులతో జీవించాలన్న, అన్ని విధాలా అభివృద్ధి చెందాలన్న ఆ ప్రజల ఆచార వ్యవహారాలను, సంస్కృతి, నాగరికతలను, ఆర్థిక కార్యకలాపాలను క్రమబద్ధం చేయడానికి పాలనా వ్యవస్థ అనేది అవసరం. దేశ ప్రజలందరికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించడానికి ఒక క్రమబద్ధీకృత విధానాన్ని అమలు చేయడానికి పరిపాలన యంత్రాంగాన్ని తయారుచేసి పాలించడం అనేది ముఖ్యం. ఈ పరిపాలనా యంత్రాంగం పలు స్థాయిల్లో పనిచేస్తుంది. ప్రజాస్వామిక దేశంలో పరిపాలన ప్రజల చేత ఎన్నుకున్న వారి చేతిలో ఉంటే, రాజరిక వ్యవస్థలో వారసత్వం ద్వారా అధికారం చేపట్టిన రాజు నియంతగా ఉండి పరిపాలిస్తాడు.

### 4.1.6.1 రాజు

రాజు రాజ్యానికి సర్వాధికారి. న్యాయ నిర్ణేత. రాజాజ్ఞ తిరస్కరించే ధైర్యం ఎవరికి ఉండదు. మన దేశం ప్రజాస్వామిక దేశంగా మార్పు చెందేంత వరకు రాజరిక పాలనలో మగ్గింది. కాబట్టి జానపద కథల్లో కూడా రాజరిక వ్యవస్థకు సంబంధించిన పరిపాలన ఛాయాలే స్పష్టంగా కనిపిస్తాయి. జానపద కథల్లో సామంత రాజుల ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది. కొన్ని కథల్లో సామాన్య ప్రజలను కూడా రాజులుగా చిత్రించినట్లు కథాకథనం చేస్తారు.

'చిత్తోండ రాజు' అనే కథలో రాజుల రాజ్య పరిపాలన సామర్థ్యాన్ని వివరిస్తుంది కథకురాలు "నీకు ఏటి మీద ఎడ్లు, పాటి మీద బర్లు, అర్ద బంగలాలు, అద్దాల మేడలు నీకు సమస్తం ఇచ్చిన నేను.

రాజ్యపాలన చేసినవ్ నువ్వ్? రాజుకు అరవై జిల్లాలు నూటొక్క కిరిటాలు, భుజకీర్తులు పెట్టుకుని నువ్వు రాజ్యం ఏలినోడివి” రాజుకు అద్దాలమేడలు, సైన్యం, కిరీటాలు, భుజ కీర్తులు, విశాలమైన సామ్రాజ్యం ఉన్నాయి. ఎన్నో యుద్ధాలు చేసి సామ్రాజ్య విస్తరణ గావించిన రాజు యొక్క వైభవం, స్తోమత, గొప్పతనాన్ని తెలుపుతున్నాయి. ఆనాటి కాల పరిస్థితులను, రాజుల ఔన్నత్యాన్ని ఇలా జానపద కథల్లో కళ్లకు కట్టినట్లు కథకురాలు వర్ణించారు.

‘సత్యహరిశ్చంద్రుడు’ కథలో జానపద కథకురాలు రాజ వైభోగం గురించి కింది విధంగా వర్ణిస్తుంది. “బంగారు కోటీర్లు, కోట్లాది కోట్ల ధనం, వేయిల వేయిల మంది జీతాగల్లను పెట్టి తాళాలు, తలుపులు తీసి బూమీ్మద మొదలు పెట్టి ఆకాసానికి రాసి బూసిండు. ఎంత ధనసంపదలు ఉన్న, ఎంత బతుకు భాగ్యాలున్న, ఎన్ని ఏనుగులు, గుర్రాలు సంపతులు నాకు ఎన్ని ఉన్నగాని, పాలరాతులు బండలు తిరిగి, పట్టు వస్త్రంబులు కట్టి రారాజునై నేను బతికినగాని” కోటలు, ధనం, వేల మంది కూలీలు, గుర్రాలు, ఏనుగులు, సైన్యం ఇలా రాజు ఆస్తి, హోదా వర్ణిస్తూంటే రాజుల రాజసం ఎలాంటిదో తెలుస్తుంది. అంతటి రాజ వైభోగాన్ని సత్యహరిశ్చంద్రుడు వదిలి మోక్షం కోసం తన ఆస్తినంత దానం చేస్తాడు. దానధర్మాల వల్ల మనకు మోక్షం సిద్ధిస్తుందని సత్యహరిశ్చంద్రుడు కథ ద్వారా బోధపడుతుంది.

‘గారడివాడు’ అనే కథలో ఒక పేద కుటుంబానికి సహాయం చేసిన రాజు పాత్ర ఉంటుంది. తినడానికి తిండి లేని ఇద్దరు పిల్లలు గల కుటుంబాన్ని రాజు మాట సహాయంతో ఆదుకుంటాడు. ఒక గ్రామానికి గారడివాడు వచ్చి గారడి ఆట ఆడి, నా గారడి విద్య నేర్చుకోవడానికి పిల్లలు కావాలి రాజా! అని రాజుని గారడివాడు అడుగుతాడు. అప్పుడు రాజు బాగా ఆలోచించి పేద కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలున్న తల్లికి ఆ అవకాశం కల్పిస్తాడు. ఆమె పిల్లల వైపుగా నిలబడి ఒప్పంద పత్రాన్ని కూడ రాసిపెడతాడు. ఇలా చిన్న రాజైనా, పెద్ద రాజైనా ప్రజలకు మేలు చేసే రాజుల పాత్రలు కూడా కథల్లో చిత్రించబడ్డాయి. పూర్వం పేద ప్రజల యోగక్షేమాలు చూసే రాజులు కూడ ఉన్నారని ఈ కథ ద్వారా తెలుస్తుంది.

## 4.1.6.2 మంత్రి

రాజుకు సలహాదారుడిగా, ఆప్తమిత్రుడిగా మంత్రి వ్యవహరిస్తాడు. రాచరిక వ్యవస్థలో మంత్రులకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. మంత్రి లేని రాజ్యం మనుగడ లేదు అన్న నానుడి కూడ ఉంది. రాజును వ్యక్తిగతంగానూ, పరిపాలన విధానంలోనూ, ఆపత్కాల సమయంలోనూ రక్షిస్తూ కంటికి రెప్పలా చూసుకునేవాడు మంత్రి. రాచకార్యంలో అన్ని విధాలా తోడ్పడుతూ మంత్రి రాజు ప్రశంసలందుకుంటూ ఉంటాడు. జానపద కథల్లో రాజు–మంత్రికి సంబంధించిన కథలు కోకొల్లలు. వాటిలో అక్బరు – బీర్బల్ కథలు, శ్రీ కృష్ణదేవరాయల – తెనాలి రామకృష్ణుని కథలు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన విషయం మనకు సుపరిచితమే. జానపద కథల్లో మంత్రిని ప్రధాని, పతాని అనే పదంతో కూడా సూచిస్తారు. సమాజంలో పరిస్తితులను పర్యవేక్షిస్తూ రాజుకు, ప్రజలకు మధ్యవర్తిగా మంత్రి వ్యవహరిస్తాడు.

'గొల్ల బోయడు' అనే కథలో ఒక రాజ్యంలో దొంగల బెడద ఎక్కువగా ఉంటుంది. ప్రజలు అప్రమత్తవడానికి మంత్రి దండోరా వేయిస్తాడు. "పూర్వ కాలంలో ఒక పట్టణ రాజు. రోజు మన ఊరిలోకి దొంగలు ఎవరు వస్తురు. జాగ్రత్త! దండోరా వేయాలని చెప్పుకుంటనే చెప్పినోల్లే మంత్రి వర్యులు వోయి హరిజన కులానికి మన ఊరికి దొంగలు రాకుంటా మెలుకవతో ఉండి కాపాడుకోవాలని మేం అందరం సహకరిస్తం" అని మంత్రి స్వయంగా హరిజన వాడల ప్రజలందరికి దొంగలు వస్తున్న విషయం తెలిసేలా దండోరా వేయమని చెప్తాడు. రాజ్య సంరక్షణ కొరకు మంత్రి సందర్భోచితమైన ఆలోచనలు తీసుకోవడం ఎంత కీలకమో అర్థమవుతుంది.

'రాజు ప్రతాని లగ్గం సోకు' అనే కథలో ప్రధాని రాజుకి మంచి స్నేహితుడిగా కనిపిస్తాడు. రాజుకు వివాహం జరిగి భార్యతో సంతోషంగా ఉంటాడు. మంత్రి రాజును పదే పదే తనకు కూడా వివాహం చేయమని బ్రతిమిలాడతాడు. కానీ రాజు మంత్రి వివాహ విషయం మీద శ్రద్ధ పెట్టక అనాసక్తితో తన పనిని తాను చేసుకుంటాడు. ఏలాగైనా రాజుకు తన బాధను తెలియజేయాలని చెప్పి అత్తగారింటికి వెళ్లిన రాజును ఆటపట్టిస్తాడు. వారి మధ్య తమాషా సంభాషణలు గేళి చేష్టలు ఉంటాయి.

మంత్రి ఎంతటి తెలివైన వాడయినా అతని స్వేచ్ఛ స్వతంత్రత రాజు గుప్పిట్లో ఉంటుందని ఈ హాస్య కథలో మంత్రి పాత్ర ద్వారా తెలుస్తుంది.

'బ్రామ్మడి వరాలు' అనే కథలో ఒక బ్రాహ్మణుడు తన దగ్గరున్న విలువైన వరాలను రాజు నమ్మకమైన వ్యక్తిగా భావించి రాజు దగ్గర పెట్టి దేశాటనకు బయలుదేరతాడు. కొద్ది రోజుల తరువాత రాజ్యానికి వచ్చి రాజుని వరాలు అడిగితే రాజు నాకు ఇవ్వలేదని సమాధానమిస్తాడు. రాజు వెదురు బొంగులో వరాలను పెట్టి బ్రాహ్మణుడు చేతిలో పెట్టి నా దగ్గర లేవని చెప్తాడు. న్యాయనిర్ణేతగా ఉన్న వ్రేలు తెంపే కత్తెర ఇరువురు నిజాలు చెప్తునందున ఎవ్వరిని శిక్షించదు. అదే సమయంలో ఆ రాజ్యంలో ఉన్న మంత్రి బాగా ఆలోచించి వెదురు బొంగును రెండుగా చీల్చి అందులో వరాలను బ్రాహ్మణుడికి ఇచ్చి వేస్తాడు. రాజు మోసాన్ని బట్టబయలు చేసి, బ్రాహ్మణుడికి న్యాయం చేస్తాడు. రాజు అంతటి వాడు తప్పు చేసినా, న్యాయ నిర్ణేయించేటప్పుడు అందరు సమానమనే భావనతో తీర్పు చెప్పాలని మంత్రి భావిస్తాడు. దీన్ని బట్టి తప్పు చేసిన వారు ఎంతటివారైనా నిలదీయడం తప్పు కాదన్న నీతి మనకు బోధపడుతుంది.

## 4.1.6.3 దొంగతనం

కష్టపడి డబ్బు సంపాదించేవారు కొందరైతే అక్రమ దారుల్లో డబ్బు సంపాదించేవారు మరి కొందరు. ఇలాంటివి ఇంట, బయట ఎక్కడైనా కావచ్చు. అవకాశం దొరకగానే రహస్యంగా వెళ్లి విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు తీసుకువస్తూ ఉంటారు. నేడు మనల్ని రక్షిస్తున్న పోలీసుల్లాంటి రక్షణ వ్యవస్థ నాడు గ్రామాల్లో ఉండేది కాదు. కాబట్టి పూర్వం దొంగతనాలు విరివిగా జరిగి ప్రజలు చాలా నష్టపోయేవాళ్లు. దారిదోపిడి దొంగలు, బందిపోటు దొంగల వల్ల కూడా ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు.

'బూడిద గిరి పట్నం' అనే కథలో ఒక తండ్రి కూతురికి వివాహం చేసి అల్లుడిని ఇల్లరికం తెచ్చుకుంటాడు. కొద్ది రోజుల తరువాత ఆ దంపతులు వేరు కాపురం పెట్టి బతుకుతారు. వాళ్లను చూసి ఓర్వలేని తండ్రి అల్లుడికి ఏదోక ఆపదను తెచ్చిపెడితే నా విలువ తెలుస్తుందని చెప్పి అల్లుడు, కూతురు

ఉంటున్న ఇంటిని తగలబెడతాడు. అల్లుడు ఇల్లు కాలిన తరువాత మిగిలిన బూడిదను తీసుకుని బూడిద గిరిపట్నం బయలుదేరతాడు. అక్కడ దొంగలు అల్లునికి ఎదురైతారు. ఒక చెట్టు దగ్గర అలసటతో పడుకున్న అల్లుడి బూడిద సంచిని చూసి దొంగలు వీడు మా కన్న పెద్ద దొంగోడు అనుకొని ఆ సంచి తీసుకెళతారు. ఒంటరిగా ఉన్న అల్లుడి సంచిని దొంగిలించిన దొంగలను బట్టి చూస్తే నాడు దారిదోపిడి దొంగలు రహదారి వైపు మాటు వేసి దొంగతనాలు చేసేవారని తెలుస్తుంది.

'తోడి కోడల్ల అత్యాశ' అనే కథలో ఇద్దరు తోడి కోడల్లు ఉంటారు. పెద్ద కోడలు అమాయకురాలు. చిన్న కోడలు అసూయపడే వ్యక్తి. పెద్ద కోడలు చిన్న కోడలు మాటలు నమ్మి గుమ్మిలో ఉన్న నువ్వులని రోజు కాల్చుకుని తింటుంది. వ్యాపారానికి వెళ్లిన భర్తలు వచ్చి నువ్వులను చూస్తే పెద్దకోడలు దగ్గరి నువ్వులన్ని అయిపోతాయి. పెద్ద కోడలు భర్త కొట్టి ఇంట్లో నుంచి బయటకు వెళ్ళగొడతాడు. అప్పుడు పెద్ద కోడలు ఒక కాళికా మాత గుడిలో కూర్చొని బాధపడుతుంది. అక్కడికి దొంగలు వచ్చి దేవతకి మొక్కి ఎవరికి మేము పట్టుబడకపోతే మేం చేసిన దొంగతనంలో సగం దేవతకు ఇస్తామని చెప్పి వెళతారు. నిజంగా దొంగతనాన్ని చేసిన తరువాత దొంగలు తిరిగి వచ్చి సగభాగాన్ని కాళికా మాత గుడిలో వదిలేసి వెళతారు. దొంగల్లో కూడా నిజాయితీ గల మనుషులు ఉంటారని ఈ కథ ద్వారా తెలుస్తుంది.

## 4.1.6.4 న్యాయస్థానం – శిక్ష

ప్రతి సమాజంలో తప్పు చేసిన వారికి శిక్ష వేయడం సహజం. ఒక వేళ తప్పు చేసినవారికి శిక్ష పడకపోతే అలాంటి తప్పులు మళ్లీ పునరావృత్తం అవుతాయని సంఘంలోని సభ్యులు తప్పుకు తగిన శిక్షలు వేస్తారు. జానపద కథల్లో నేరానికి తగిన శిక్ష వేయడం, అన్యాయం జరిగిన వారికి న్యాయం చేకూర్చడమనేది ప్రధానంగా కనిపిస్తుంది. పూర్వం ప్రభుత్వ న్యాయవ్యవస్థలు, కోర్టులు అనేవి ఉండేవి కావు. కాబట్టి సంఘం, సంఘ పెద్దలు, కుల సంఘాలు, పంచాయితీ సభలు మొదలైనవి అన్యాయం జరిగిన వారికి న్యాయపరమైన తీర్పులు ఇచ్చేవారు.

'అత్తకాల విషం' అనే కథలో ఒక అత్త గర్భవతిగా ఉన్న కోడల్ని పాము కూర వండి పెట్టి చంపుతుంది. తాను చేసినా తప్పిదం ఎవ్వరికి తెలియకూడదని కూడలి వద్ద తన కోడలి శవాన్ని పూడ్చివేస్తుంది. కొద్ది రోజుల తరువాత పూడ్చిన కూడలి వద్ద ఒక మల్లె చెట్టు కాస్తుంది. గర్భవతితో ఉన్న తన కూతురిని తల్లిదండ్రులు పుట్టింటికి తీసుకురావడానికి వస్తారు. కూడలి వద్ద మల్లెపూలు తెంపుతున్న తన కుటుంబ సభ్యులకు ఆత్మ గొంతుతో 'ముట్టకు ముట్టకు ముట్టిన చేతులు ముత్యాలు పట్టిన చేతులు పగడాలు మాయత్త పాపకారి' అంటూ పాడుతూ తనకు జరిగిన అన్యాయాన్ని తన కుటుంబ సభ్యులకు చెప్పుకుని బాధపడుతుంది. ఆమె తల్లిదండ్రులు అసలు నిజాన్ని తెలుసుకుని అత్తకు మూడు రేవుల దగ్గర గుండు తీయించి, గాడిద మీద ఊరేగింపు చేస్తారు. దీన్ని బట్టి నాటి సమాజంలో తప్పు చేసిన వారికి గుండు తీయించి, గాడిదపై ఊరేగింపు చేసేవారని తెలుస్తుంది. ఇలా నిందితులను శిక్షించడం వల్ల అలాంటి తప్పు మరొకరు చేయరని భావించి ఆనాటి పెద్దలు ఈ శిక్షను నిర్ణయించి ఉంటారు.

'చెల్లెలు దిద్దిన కాపురం' అనే కథలో అన్న చెల్లెలు ఉంటారు. అన్నను మోసం చేసిన వదినకు బుద్ధి చెప్పి, వదిన అహంకారాన్ని అణచివేస్తుంది. ప్రాణపాయ స్థితిలో ఉన్న అన్నను వదినె బారి నుంచి రక్షిస్తుంది. వదినె వేరేవాడితో అక్రమసంబంధం పెట్టుకున్న విషయాన్ని రహస్యంగా తెలుసుకుంటుంది. ఆ విషయాన్ని పంచాయితీలో చెప్పి అన్నకు వేసిన పొడుపుకథ చెల్లెలు విడుపు చేస్తుంది. వదినె చేసిన తప్పును సహించుకోలేని అన్న నలుగురు పెద్ద మనుషుల సహాయంతో శిక్ష పడేలా చేస్తాడు. "బొడ్డి గిట్ల చేత్తవ? నన్ను. కోపానికచ్చి మంగళొన్ని పిలిపించి మూడు రేవులు తల గొరిగించి బోడినామాలు పెట్టి తీస్కపోయి మూడు బజారుల కాడ పాతర పెట్టి గొర్లను, బర్లను దాటిచ్చిండు". సమాజంలో తప్పు చేసిన నిందితులను శిక్షించే పద్ధతులు ఒక్కో సమాజానికి ఒక్కో విధంగా ఉండొచ్చు. తప్పు చేసిన దోషులకు గుండు తీయించి ఊరంతా తిప్పడం ఒక పద్ధతయితే, అదే గుండు తీయించి సజీవ సమాధి చేసి ఆ సమాధిపై నుంచి పశువులను దాటించడం మరొక పద్ధతి. ఈ కథలో రెండవ పద్ధతిని అనుసరించినట్లు మనకు అర్థమవుతుంది. ఏ సమాజంలోనైనా తప్పుకు తగ్గ శిక్ష ఉంటుందని, పై కథలో వదినె పాత్రకు వేసిన శిక్షను బట్టి చెప్పవచ్చు.

'ఒక గుండుకు రెండు గుండ్లు' అనే కథలో ఒక వ్యక్తి భార్య తన తల్లికి గుండు తీయిస్తుంది. ఆ వ్యక్తి నేరుగా భార్యను ప్రశ్నించకుండా తన తల్లికి జరిగిన అవమానాన్ని భార్యకి, భార్య తల్లికి జరిగేలా ఉపాయం చేస్తాడు. అతని భార్య, అత్తలకు ఒకరికి  తెలియకుండా మరొకరు అనారోగ్యం పాలైనట్లు కల్పించి అబద్ధాలు చెప్పి గుండు తీసుకునేలా చేస్తాడు. గాడిద మీద ఊరేగింపుగా తీసుకువచ్చి కచ్చీరులో గ్రామ పెద్దల సహాయాన్ని కోరతాడు. తన తల్లికి గుండు తీయించిన భార్యను ఏమనలేక, సంఘంలో తీర్పు కోసం ఖర్చు అయ్యే డబ్బులు పెట్టలేక ఈ పని చేశానని చెప్పి వాపోతాడు. అప్పుడు గ్రామ పెద్దలు తల్లి కోసం అతను చేసింది న్యాయంగా అనిపిస్తుంది. అందుకే అతనికి శిక్ష వేయరు. ఈ కథలో అన్యాయానికి గురైనవారు న్యాయం కోసం సంఘాల చుట్టూ, పెద్ద మనుషుల చుట్టూ తిరగడం వారికి మద్యం అందిస్తేనే తీర్పు అనుకూలంగా వస్తుందని చెప్తాడు. "పెద్ద మనుషులు ఏమంటర్రు? పంచాయితీ చెప్పుమంటే ఓ రోజు బీరు అంటు ఓ రోజు కోటర్లు అంటరు. ఈయాళ చెప్తమంటరు. రేపంటరు. ఇంటికాడ ఏమి తాగనోడు కూడా ఆడపెయినంక బీరంటడు." దీనిని బట్టి పేదవారికి గ్రామీణ సంఘాల్లో కూడా న్యాయం అందని ద్రాక్షగానే మిగిలిపోయిందని తెలుస్తుంది. డబ్బున్నవాడి చెప్పుచేతల్లో నాయకులు ఉండి, అన్యాయమే రాజ్యమేలుతుందన్న నీతిని పై కథలో వ్యక్తి తెలిపే మాటలను బట్టి  అర్థం చేసుకోవచ్చు.

## 4.1.6.5 పన్నులు

ఆర్థిక వ్యవస్థలో పన్నులు అనేవి ఒక భాగం. పూర్వం రాజుల కాలంలో ప్రజలపై పన్నులు వేసేవారు. వ్యవసాయపు పన్ను, వ్యాపారపు పన్ను, ఆదాయపు పన్ను, సేవ పన్నులు ఇలా రకరకాలుగా పన్నులు వసూలు చేసేవారు.

'అమరికా రాజు' అనే కథలో కమరసుల రాజు తపస్సుకు పోయినప్పుడు రాజ్యాన్ని పాలించమని నిమ్మళ్ల మంత్రికి ఇస్తాడు. ఆ నిమ్మళ్ల మంత్రి ప్రజలపై తనకు ఇష్టం వచ్చినట్లు పన్నులు విధిస్తాడు. 'అమరికా రాజు' కథలో అతను విధించిన పన్నుల గురించి ఈవిధంగా ప్రస్తావన ఉంటుంది. "పది ఉన్న కాడా 20 తీత్తుండు తాశీలు. 20 ఉన్న కాడ నూరు తిత్తండు తాశీలు. పంట

అది పండని, పండకపోనీ. ఆ తర్రలు, బుర్రలు తాశీలు కట్టమంటుండు. తాశీలు దంచి వసూలు జేత్తుండు!". ఆడవారికి వెంట్రుకలు ఎక్కువ ఉన్నా, మగవారికి పొట్ట ఎక్కువ ఉన్న, పంటలు పండిన పండకపోయిన ప్రజలు రాజుకు పన్నులు చెల్లించాల్సిందే. ఆవిధంగా నిమ్మళ్ళమంత్రి పన్నులను అన్నింటిని రెట్టింపు చేసి ప్రజల మీద అధిక పన్నులు మోపినట్లు పై వాక్యాల వల్ల తెలుస్తుంది.

## 4.1.7 సాంఘిక దురాచారాలు

మానవ సంస్కృతి, నాగరికతలకు సంబంధించిన అపూర్వ జ్ఞానం ఉన్న జానపద కథల్లో దురాచారాలు చిత్రించిన సంఘటనలు లేకపోలేదు. సంఘానికి వ్యతిరేకమైన కార్యకలాపాలే సాంఘిక దురాచారాలు. అలాంటి వాటిలో కుల వివక్ష చూపడం, అక్రమ సంబంధాలు పెట్టుకోవడం, నిమ్న వర్గాల స్త్రీలపై చిన్న చూపు, పురుషులు స్త్రీలను లైంగికంగా వేధించడం మొదలైన దురాచారాలు కూడా కొన్ని కథల్లో చిత్రించినట్లు కనిపిస్తాయి.

'సోమనాల భావి' అనే కథలో ఒక బ్రాహ్మణుడు కంసాలి వాడిని రెండు సార్లు మోసం చేస్తాడు. అతడి దౌర్జన్యం వల్ల ఒకసారి బావిలోకి నెట్టి వేయబడుతాడు. మరో సారి రాజు చేత రాజ్య బహిష్కరణకు గురైతాడు. రాజు కూతురు రాక్షసపుండుతో బాధపడితే ఎవ్వరికి సాధ్యం కాని ఆకు పసరుని కంసాలివాడు తీసుకువస్తాడు. ఆ ఆకుపసరుతోనే రాకుమార్తెని రాక్షసపుండు నుండి విముక్తి చేసి వివాహం చేసుకుంటాడు. ఆ విధంగా అతడి సహాయాన్ని పొందిన రాజు బ్రాహ్మణుడు చెప్పిన మాటలు విని కంసాలివాడిని కులం పేరుతో అవమానిస్తాడు. కంసాలివాడు కులవిహీనుడని భావించి రాజ్యానికి క్షత్రియులే రాజులని ప్రలోభాలు పలుకుతాడు. రాజు అల్లుడుగా చేసుకున్న కంసాలివాడిని నువ్వు రాజుగా పనికిరావని అవమానించి రాజ్యం నుండి బహిష్కరిస్తాడు. దీనిని బట్టి కంసాలివాడిపై రాజు, బ్రాహ్మణుడు ఇద్దరు కులవివక్ష చూపారని తెలుస్తుంది. రాజుల కాలంలో కులవ్యవస్థ ఏవిధంగా ఉందో పై కథ ద్వారా అర్థం చేసుకోవచ్చు.

'గొల్ల మల్లయ్య' అనే కథలో కూడా గొల్లవాడు రాజు దగ్గరికి వెళ్లి కలవాలంటే భటులు లోపలికి అనుమతించరు. అదే బ్రాహ్మణుడి సహాయం తీసుకొని గొల్లవాడు రాజు దగ్గరికి చేరుకుంటాడు. దీన్ని బట్టి సామాన్యులకు రాజ్య సభాప్రవేశం లేదని కేవలం పండిత వర్గానికి మాత్రమే ఆ అవకాశం ఉందని తెలుస్తుంది.

'సాకలి పుల్లక్క' అనే కథలో చాకలి పుల్లక్కని అధికారులంతా నిమ్న వర్గానికి చెందిన స్త్రీగా చూసి తాము చెబితే కాదనదనే అహంకార ధోరణితోనే చాకలి పుల్లక్కని అనుభవించడానికి వెళతారు. ఆ చాకలి పుల్లక్క ఆ గ్రామాధికారుల నుంచి తప్పించుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడుతుంది. నాటి సమాజంలో తక్కువ జాతి స్త్రీలతో వ్యవహరించిన తీరు ఇందులో కథకులు చిత్రించారు. ఇదే కథలో పోలీసు అధికారి కూతురు పెళ్లిసారె పంపకాల కోసం చాకలి మల్లన్నను హైదరాబాదుకు పంపిస్తాడు. నిమ్న వర్గాల పజలు అధికారులకు సేవ చేయడానికే ఉన్నారన్నట్లుగా అధికారుల చూపించిన దర్పం వ్యక్తమవుతుంది.

స్త్రీల పై దొరలు, అధికారులు చూపిన దాష్టికాన్ని చిత్రించిన కథ 'షావుకారి కోడలు చతురత'. ఈ కథలో ఒక దొర గోదావరి స్నానానికి వెళ్లి వస్తున్న స్త్రీని హేళన మాటలతో సంభోధిస్తాడు. మరొక సందర్భంలో తనకు ఎదురు తిరిగిన షావుకారి కోడల్ని అనుభవించడానికి భోజన కార్యక్రమాలు పెట్టి ఊరిలో ఎవ్వరు వంట చేసుకోకుండా చేస్తాడు. ఆ రాత్రి షావుకారి కోడల్ని తన ఇంట్లోనే నిర్భందిస్తాడు. స్త్రీలపై పురుషుడు చేసిన అఘాయిత్యాలని చిత్రించబడిన కథ ఇది.

స్త్రీలల్లో మరొక కోణానికి సంబంధించిన స్త్రీలు లేకపోలేదు. వివాహం చేసుకున్న భర్తను కాదని పర పురషుడితో అక్రమసంబంధం పెట్టుకున్న స్త్రీల పాత్రలు చిత్రించిన కథలు ఉన్నాయి. 'చెల్లెలు దిద్దిన కాపురం' అనే కథలో ఇంటి పక్కన వాడితో సంబంధం పెట్టుకున్న ఒక స్త్రీ తన భర్తకు ఈ విషయం తెలియకుండా దాచిపెడుతుంది. ఏలాగైనా తన భర్తను చంపి తన చేతులకు మట్టి అంటకుండా చూడాలనుకుంటుంది. అందుకే తాను చేసిన చెడు పనులను ఒక పొడుపు కథలో పెట్టి భర్తకు వేస్తుంది.

భర్త అది విడుపు చేయకపోతే చనిపోవాలని ముందే మాట తీసుకుంటుంది. ఇలా చెడు భావనలతో నిండి ఉన్న స్త్రీల వ్యక్తిత్వాన్ని చిత్రించిన కథలు కూడా ఉన్నాయి.

'పోశవ్వ మొక్కు కథ' అనే కథలో కూడా స్త్రీ దుష్కార్యాలు తెలుస్తాయి. ఒక స్త్రీ తన భర్తకు తెలియకుండా వేరే వాడితో సంబంధం పెట్టుకొని ఇంటికి తెచ్చుకుంటుంది. అంతేగాకుండా భర్తకు ఎప్పటికైనా తెలుస్తుందని భర్తకు కళ్లు పోవాలని పోశమ్మకి మొక్కుతుంది. గ్రామీణ దేవతను చెడు మాటలతో తిట్టి, నోటి మీద వేలు తీయిస్తుంది. పై రెండు కథలను బట్టి భర్తనే చంపాలనుకునే స్త్రీలు కూడ ఉన్నారని తెలుస్తుంది. ఇలా వైవిధ్యంతో కూడిన పాత్రల చిత్రణ కూడ కథల్లో కనిపిస్తుంది.

## 4.1.7.1 బహు భార్యత్వం

అనాదిగా ఒక వ్యక్తికి ఒక భార్య అనేది సంప్రదాయంగా వస్తుంది. కాని జానపదుల్లో బహుభార్యత్వానికి చోటు లేకపోలేదు. కొన్ని కథల్లో అలాంటి చిత్రణ కూడా కనిపిస్తుంది.

'అక్కెమ్మలు కథ'లో ఒక రాజు ముగ్గురు భార్యలను చేసుకుంటాడు. ఆనాటి కాలంలో రాజులు వారి వంశాభివృద్ధి మీద కాంక్షతో బహుభార్యత్వాన్ని స్వీకరించేవారు. కొంత మంది రాజులు స్త్రీల మీద వ్యామోహంతో ఎక్కువ మంది స్త్రీలను వివాహం చేసుకునేవారు. ఈ కథలో రాజు సంతానం కోసం మాత్రమే కాపోళ్లక్కమ్మను వివాహం చేసుకొని మూడవ భార్యగా స్వీకరిస్తాడు.

'సవతి తల్లి పోరు' అనే కథలో ఒక వ్యక్తి అతని భార్య ఇద్దరు పిల్లలు ఉంటారు. కొద్ది రోజుల తరువాత మొదటి భార్య అనారోగ్యంతో చనిపోతుంది. మరొక స్త్రీని వివాహం చేసుకుంటాడు. కన్న తల్లి దూరమైన ఆ ఇద్దరు పిల్లలు సవతి తల్లితో చాలా ఇబ్బందులు పడతారు. వాళ్ల తండ్రి తన బాధ్యతని మరచి మొదటి భార్య చెప్పినట్లు విని ఆ ఇద్దరు పిల్లలను అడవిలో వదిలివేసి వస్తాడు. దాంతో మొదటి భార్యకు పుట్టిన పిల్లలు దిక్కులేని వారైపోతారు.

'తల్లి కూతుళ్ల అనుబంధం' అనే మరొక కథలో ఒక వ్యక్తి పరాయి వాళ్ల మీద ఈర్ష్యతో తన భార్యను గ్రామదేవతకు బలి ఇచ్చి మొక్కు తీర్చుకుంటాడు. అంతేగాకుండా మరొక స్త్రీని వివాహం

చేసుకుని మొదటి భార్య పిల్లలకు అన్యాయం చేస్తాడు. ఈ విధంగా ఒక వ్యక్తి ఒకరికి మించి వివాహాలు చేసుకుంటే వారికి పుట్టిన పిల్లలు ఏదోక విధంగా ఇబ్బంది పడే చిత్రణ జానపద కథల్లో కనిపిస్తుంది.

## 4.1.7.2 బాల్యవివాహాలు

యువతికి 18 సంవత్సరాలు, యువకుడికి 21 సంవత్సరాలు దాటిన తరువాత వివాహం చేయదగిన వయస్సు. కాని పూర్వం బాల్యవివాహాలు అనేకం జరిగేవని జానపద కథల్లో చిత్రించిన సంఘటనలు బట్టి చెప్పవచ్చు.

'పెద్దపులి గిద్దపులి', 'సత్యవతి కథ', 'ఐదు మల్లె పూవ్వుల కథ', 'దారి మరచిన ద్వారక', 'రాజు పతాని లగ్గం సోకు' మొదలైన కథల్లో చిన్నప్పుడే పిల్లలకు వివాహం చేయాలని సంబంధాల కోసం వెతుకుతారు. పిల్లలు తల్లిదండ్రులను పెళ్లి చేయమని అడిగితే నీకు చిన్నప్పుడే పెళ్లి అయిందని తల్లిదండ్రుల చెబుతారు. 'పెద్దపులి గిద్దపులి' అనే కథలో ఇలాంటి సంభాషణనే ఉంటుంది. "మరి నాకు పెళ్లి చేయవానంటే అమ్మ. కొడుకా! నీకు పెళ్లి ఎప్పుడో అయ్యింది. నీకు పెళ్లై సూమారు 15 సంవత్సరాలైతుంది. నీకు ఐదారేండ్ల వయసులోనే చేసినాం పెళ్లి" అని రాజు అంటాడు. ఇలాంటి సంఘటనలే చాలా కథా ప్రారంభంలో కనిపిస్తాయి. దీనిని బట్టి నాటి సామాజిక వ్యవస్థలో ప్రజలు బాల్య వివాహాలను విరివిగా ప్రోత్సహించేవారని తెలుస్తుంది.

## 4.1.8 రవాణా సౌకర్యాలు

పూర్వం రవాణా సౌకర్యాలు అంతగా అభివృద్ధి చెందలేదు. సామాన్య ప్రజలు సుదూర ప్రాంతాలకు కాలినడకనే వెళ్ళేవారు. ఆర్థికంగా ఉన్న వారు, రాజులు, అధికారులు, ధనవంతులు గుర్రాల మీద, గుర్రపు బండ్ల మీద, ఎడ్లబండ్ల మీద, పల్లకీల మీద వేరే ప్రాంతానికి చేరేవారు.

'అన్న చెల్లెలు' కథలో తన చెల్లెలిని ఎన్నో ఇబ్బందులకు గురి చేసిన తన భార్య గురించి తెలుసుకుని ఒక అన్నగా బాధపడతాడు. ఆ తరువాత చెల్లెలికి పుట్టింటి తరుపున ఇచ్చే సారె పంపకాలు పంపించాలని ఆశిస్తాడు. వరి, జొన్న, మొక్కజొన్న, పెసర, వస్త్రాలు భార్య తన పుట్టింటివారి కోసం కట్టించిన సామానంతా ఎడ్లబండి మీదనే వేసుకుని చెల్లెలి ఇంటికి చేరవేస్తాడు. దీన్ని బట్టి

వ్యవసాయదారులు వాళ్ల సామానులు తీసుకెళ్లడానికి ఎడ్లబండినే ప్రధాన వాహనంగా ఉపయోగించేవారు. కేవలం వ్యవసాయ పనులకు మాత్రమే కాకుండా ఎడ్లబండి మరెన్నో విధాలుగా ఉపయోగపడేది. ఉత్తర తెలంగాణ ప్రాంత ప్రజలు ఎడ్లబండిని 'కచ్రం బండి' అనే పదంతో వ్యవహరిస్తారు.

'పెద్ద పులి గిద్దపులి' అనే కథలో ఒక వ్యక్తి అత్తగారింటికి వెళ్లాలని అనుకుంటాడు. కొంచెం ఆడంబరంగా తయారయి వెళ్లాలని, హుందాగా కనిపించాలని ఆశపడతాడు. అందుకు గుర్రాల శాలకి వెళ్లి గుర్రాన్ని అద్దెకు తీసుకోవడానికి బేరాలాడుతాడు. ఆ సందర్భంలో గుర్రాల శాల వ్యక్తి గుర్రాల్లో రకాలను క్రింది విధంగా చెబుతాడు. "పుల్లది కావాన్నో పయ్యది గావాన్నో కర్రెది గావాన్నో బొర్రది గావాన్నో తీస్కపో రకరకాలుగా ఉంటయి" ఆ కాలంలో రవాణా సౌకర్యాలు ఉండేవి కావు. కాబట్టి గుర్రాలను రవాణాకు ఎంతగా ఉపయోగించారో తెలుస్తుంది. గుర్రపు స్వారీ మీద వెళ్లిన వారికి ఎదుటి వ్యక్తుల నుంచి హూందాతనం, హోదా లభిస్తుందని పై కథలో అల్లుని పాత్ర ద్వారా వ్యక్తమవుతుంది.

'బూడిద గిరి పట్నం'అనే కథలో ఇల్లరికం తెచ్చుకున్న అల్లుడు తన మాట వినలేదని మామ అల్లుడు గుడిసెకు నిప్పు అంటిస్తాడు. ఆ గుడిసె కాలి బూడిదయితే, అల్లుడు ఆ బూడిదంతా ఎత్తుకొని గుర్రం మీద బూడిద గిరి పట్నం అనే పట్టణానికి వెళ్లి అమ్ముకుని రావాలనుకుంటాడు. దీనిని బట్టి గుర్రాలు సరుకుల రవాణాకు ఎంతగా ఉపయోగపడేవో అర్థమవుతుంది.

## 4.1.9 పేదరికం

సమాజంలో ఒక వ్యక్తికి గాని, కుటుంబానికి గాని కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితియే పేదరికం అవుతుంది.

'తల్లి కొడుకు కోతి కోడలు' అనే కథలో తల్లి, కొడుకు చాలా పేదరికంతో జీవితాన్ని గడుపుతారు. ఆమె భర్త చనిపోవడం వల్ల కూలీ పని చేసుకుంటూ కొడుకును సాకుతుంది. "అళ్లకు, ఇళ్లకు కైకిలు చేస్తే వాళ్లు ఇన్త నూకలు, ఇన్త తౌడు బెడితే ఆ తౌడు అంబాలి కాసుకుంట బతుకుతుండ్రు. ఏంగూడ లేదు చిన్న పూరీ గుడిసే ఉండే. ఆమె ఆడ, ఈడ కైకిలు చేసుకుని చేసుకుని

ఒక రూపాయి జమచేత్తది" తన కొడుకును సాదడానికి పొద్దంతా కూలీపని చేసి రూపాయి జమ చేసిందంటే ఆ కాలంలో రూపాయికి ఉన్న విలువ తెలుస్తుంది.

'గారడివాడు' అనే కథలో ఒక తల్లికి ఇద్దరు కొడుకులు ఉంటారు. ఆమె భర్త చనిపోవడం వల్ల ఆ పిల్లల్ని పోషించడం చాలా కష్టమవుతుంది. రాజు సహాయంతో గారడి విద్యను నేర్చుకోవడానికి పిల్లల్ని గారడివాడితో పంపిస్తుంది. ఆ కుటుంబ పేదరికం వల్ల ఎన్నో అవస్థలు పడుతుంది. దానికి తోడు తండ్రి లేకపోవడం వల్ల  ఆ కుటుంబం ఒంటరిదైపోతుంది. ఇంట్లో సంపాదించేవారు లేక ఒక తల్లి తన ఇద్దరు పిల్లలను తన నుండి ఎలా దూరం చేసుకుందో ఈ కథ ద్వారా తెలుస్తుంది.

## 4.1.10 వలస

ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి జీవనోపాధి కోసం వెళ్లడం వలస అవుతుంది. జగిత్యాల జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో నేటికి ప్రజలు అధిక సంఖ్యలో వలస వెళతారు.

'బ్రామ్మడి దూలం' అనే కథలో బ్రాహ్మణుడి ఇంటి దూలం వివిధ రూపాలు మార్చుకుని జీవులను చంపుతుంది. అదే సమయంలో ఇద్దరు అన్నదమ్ములు బొంబాయి నుంచి లక్షెట్టిపేటకు వస్తున్నారు. వాళ్లు బొంబాయిలో రెండు లక్షలు సంపాదించి, స్వంత ఊరుకు వచ్చి వివాహం చేసుకోవాలని ఆశపడతారు. ఈవిధంగా యువకులకు స్వంత ఊరులో ఉపాధి లేక వివిధ ప్రాంతాలకు వలస వెళ్లేవారని తెలుస్తుంది.

'సోమనాల భావి' అనే కథలో బ్రాహ్మణుడు, కంసాలి ఇద్దరు స్నేహితులు ఉంటారు. వాళ్ల ఊరు గంగావది పట్నం. ఆ ఊరిలో వారికి సరైన ఉపాధి దొరకదు. అందుకే వారు చిలుకవాది పట్నం అనే ఊరికి వెళ్లి రైతులకు పంచాంగం చెప్పుకుంటూ బతుకుదామని బయలుదేరతారు. ఈ విధంగా కుటుంబ పోషణ భారమై వేరే ప్రాంతాలకు వలస వెళ్లి డబ్బు సంపాదించేవారని పై కథలో రెండు పాత్రల ద్వారా  తెలుస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాంత ప్రజలు స్వంత ఊరులో ఉపాధి లేక వివిధ దేశాలకు వెళ్లి, డబ్బు సంపాదించే ప్రయత్నంలో అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారు.

## 4.2 సాంస్కృతికాంశాలు

ఒక జాతి సామాజిక ఎదుగుదల ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వైపుకి వెళ్లే క్రమంలో ఎన్నో మార్పులను తనలో లీనం చేసుకుంటుంది. ఆ మార్పులు మిగతా వాటి కన్న విభిన్నంగా ఉన్నట్లయితే అవి ఆ జాతి వారసత్వ సంపదగా, సంస్కృతిగా స్థిరపడిపోతాయి. ఇందులో మతం, దేవతారాధన, ఆచారాలు, నమ్మకాలు, విందులు, వినోదాలు, ఆహారపు అలవాట్లు. పండుగలు, జాతరలు, ఉత్సవాలు మొదలైన అంశాలు ఆ జాతి ప్రత్యేకతను తెలియజేస్తాయి.

"జాతి జీవన స్రవంతిలో కనిపించే మతం, ఆచార వ్యవహారాలు, అలంకరణ, వినోదాలు, విలాసాలు, విద్య, వైద్య, కళలు, నమ్మకాల సమన్వయ రూపాన్ని ఒక జాతి సంస్కృతిగా మనం చెప్పుకోవచ్చు"[47].

"మానవుడు సమాజంలో సభ్యుడిగా ఉంటూ ఉపార్థించే జ్ఞానం, నమ్మకం, కళ, నీతి, చట్టం, ఆచారం ఇంకా ఇతర సామర్థ్యాలు, నిపుణతలు ఇవి అన్నీ కలిసి సంస్కృతి అవుతాయి."[48]

ప్రతి మానవ సమాజానికి విశిష్టమైన సంస్కృతి ఉంటుంది. మానవుడు పుట్టిన నాటి నుండి చచ్చేంత వరకు పాటించే జీవన విధానాలన్ని సంస్కృతిలో భాగమైతాయి. సమాజం రూపొందే క్రమంలో ప్రజల భాష యాస, మతం, పండుగలు పబ్బాలు, విద్యా వైద్యం, ఆచారాలు, సంప్రదాయాలు, నమ్మకాలు, కళలు, కట్టుబాట్లు మొదలైన అంశాలు ఒకే రకంగా ఉంటాయి. ఆ అంశాలు ఆయా సమాజపు సమైక్యతను చాటుతూ అస్థిత్వాన్ని ప్రదర్శించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

### 4.2.1 మతం దేవతారాధన

జగిత్యాల జిల్లాలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవ మతాల ప్రజలు ఉన్నారు. ఆయా ప్రజల అభిరుచిని బట్టి ఆయా దేవతలను పూజిస్తారు. జగిత్యాల జిల్లా పరిసర ప్రాంతాల్లో గ్రామీణ దేవతారాధన ఎక్కువగా కనిపిస్తుంది. జానపదుల మనసులో దేవుడనేవాడు ఉంటాడని కష్టం

---

[47] సుబ్బిరామిరెడ్డి, ఎ. 1999. కడపజిల్లా జానపద గేయగాథలు, సంస్కృతి, సమాజం. పుట. 369

[48] సుమతి, కె. 2000. తెలుగు జానపద విజ్ఞానం సమాజం, సంస్కృతి, సాహిత్యం. పుట: 8

వచ్చినప్పుడు తమను ఏదొక రూపంలో వచ్చి ఆదుకుంటారని నమ్ముతారు. అందుకే చాలా కథల్లో శివుడు పశువులు కాసే గొల్లవాని రూపంలో, బిచ్చగాడి రూపంలో వచ్చి ఆదుకున్నట్లు కనిపిస్తుంది. కొన్ని కథల్లో లక్ష్మీదేవి, వన దేవతలు వచ్చి వరాలు ఇచ్చిన చిత్రణలు కూడా కనిపిస్తాయి. వీటిని బట్టి జానపదులకు దైవం మీద నమ్మకం ఎక్కువగా ఉంటుందని చెప్పవచ్చు.

'ఐదు మల్లె పూవ్వుల కథ'లో ఐదు మల్లె పూవ్వుల కన్న అరవిసం తక్కువ ఉన్న ఆడబాల కోసం బయలుదేరిన బాలగిరి రాజుకు శివుడు పశువుల కాపరి రూపంలో వచ్చి సంభాషించినట్లు తెలుస్తుంది. బాలగిరిరాజును కనడానికి వాళ్ల తల్లిదండ్రులు ఎంత కష్టపడ్డారో చెప్పి బాలగిరిరాజును మార్చాలని అనుకుంటాడు. తరువాత మైబూతపట్నం జాడ గురించి చెబుతాడు. బాలగిరిరాజు మాంస ముద్దలను గంపలో వేసుకుని వస్తున్న ముత్యాలదేవిని కూడా పరీక్షిస్తాడు. శివుడు పెట్టిన పరీక్షలో నెగ్గినందుకు వారికి వరాలను ఇచ్చి మాయమైపోతాడు.

శైవమత ప్రచార కథ అయిన 'సిరియాళుని' కథను జానపదులు చిరుతోండ రాజు కథగా చెప్పుకుంటారు. ఆ కథలో శివపార్వతులు మారువేషంలో వచ్చి చాలా సార్లు చిరుతోండ దంపతులను పరీక్షిస్తారు. 'తల్లి, కొడుకు, కోతి, కోడలు' అనే కథలో కూడ శివపార్వతులు విహారానికి భూమి మీదకి వచ్చిన సంఘటనలు కనిపిస్తాయి.

'లింగం కట్టుకున్న నక్క' అనే కథలో శైవదీక్ష కఠినత్వాన్ని తెలియజేయడానికి జానపద కథకులు కథను అల్లినట్లు అనిపిస్తుంది. నిత్యం మాంసాన్ని భుజించకుండా ఉండలేని ఒక నక్క శివుడు వద్దని చెప్పిన శైవదీక్షను తీసుకుంటుంది. ఆ తరువాత శివుడు ఏమన్న వచ్చి చూస్తాడా? అని కొద్ది సేపటికే చెరువులో ఉన్న పీతలను తింటుంది. ఆ విషయం తెలిసిన శివుడు ప్రశ్నించడానికి నక్క దగ్గరికి వచ్చేలోపు నక్క కన్ను దెబ్బ తాకించుకుని నేను గుడ్డి నక్కను నీకు మాట ఇచ్చింది నేను కాదని తప్పించుకుంటుంది. నక్క సహజ స్వభావాన్ని చెబుతూ, శైవ దీక్ష తీసుకున్నపుడు ఎంతో కఠినంగా ఉండాలని తెలియజేసే కథ.

'భోగసాని లంగతనం' అనే కథలో గోదానం గొప్పతనాన్ని, గోవు పోషణ వల్ల కలిగే లాభాలను తెలియజేసే కథ. ఒక కోతి కోమటికి గోవుని దానం చేస్తాయి. ఆ గోవుని సరిగ్గా పోషించుకుంటూ వ్యాపారం మొదలుపెడతాడు. గోవు పుణ్యఫలం చేత కొద్దిరోజుల్లోనే కోమటికి అదృష్టం కలిసి వచ్చి తొందరగా ధనవంతుడు అవుతాడు. హైందవ మతంలో గోదానం, గో పూజ, గో పోషణకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. గో సంరక్షణ ప్రాధాన్యతను వివరించడానికి కల్పించిన కథగా చెప్పవచ్చు.

## 4.2.3 గ్రామీణ దేవతలు

జానపదులు గ్రామీణ దేవతలను విశేషంగా ఆరాధిస్తారు. పోశమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ మొదలైన గ్రామీణ దేవతలను ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ప్రతి సంవత్సరానికి ఒకసారి సామూహికంగా పూజించడం, నైవేద్యాలను సమర్పించి తమ కోరికలను తీర్చమని దేవతలకు ఉత్సావాలు నిర్వహిస్తూ ఉంటారు. నేను సేకరించిన జానపద కథల్లో కూడా శైవరాధన, శైవ మతానికి సంబంధించిన గ్రామీణ దేవతల ఆరాధన ఎక్కువగా చిత్రించబడింది. గ్రామీణ దేవతల పూజ విధానం శిష్టుల పూజ విధానానికి భిన్నంగా ఉంటుంది. కులదైవ ఆరాధనలు, జంతు బలులు, మద్యం నైవేద్యంగా పెట్టడం, కులపురాణాలు చెప్పడం, ఏ కులానికి సంబంధించినవి ఆ కులపూజారులు పూజలు చేయడం, ప్రకృతి ఆరాధన, గోదావరి నదిని పూజించడం ఇలాంటి విషయాలతో వీరికి ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నట్లు తెలుస్తుంది.

'పోశవ్వ మొక్కు' కథలో ఇద్దరు భార్యాభర్తలు ఉంటారు. భార్య భర్త కళ్లు పోవాలని పోశవ్వని ప్రార్థించిన తీరులో జానపదులు గ్రామీణ దేవతలకు పెట్టే నైవేద్యం గురించి తెలుస్తుంది. "నా మొగని కండ్లు పోతే ఆరుగల్ల యాటని కోత్త, చెట్లల్ల పందిరెత్త. కల్లు వోత్త అని అయింత అంటది." ఆమె కొరుకున్నట్లే భర్త కళ్లు పోయినట్టు నటిస్తాడు. అప్పుడు పోశమ్మ దేవతనే ఆమె భర్త కళ్లు పోగొట్టిందనుకుని మరుసటి రోజున బోనం వండి పెడుతుంది. బోనం అంటే పరమాన్నం అని అర్థం. పై కథలో ఒక  దుష్ట స్వభావం గల స్త్రీ గురించి కథ అయినప్పటికీ గ్రామీణ దేవతను కొలిచే విధానం వెల్లడవుతుంది. యాటని కోయడమంటే జంతువును బలివ్వడం, బోనం నైవేద్యంగా పెట్టడమంటే

పరమాన్న పాయసంగా చేసి పెట్టడం ఇలా గ్రామీణ దేవతను పూజించే విధానం తెలుస్తుంది. శిష్టుల పూజ విధానానికి, జానపదుల పూజ విధానానికి ఉన్న వ్యత్యాసాన్ని మనం ఇక్కడ గమనించవచ్చు.

గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ దేవతలు ఊరి శివారులో ఉండి ఊరిని రక్షిస్తారు. జానపదులు నమ్ముతారు. మైసమ్మ దేవత చెరువు కట్టమీద, బావుల వద్ద, పొలాల గట్ల దగ్గర, నీరు పారే తూముల వద్ద ఉండి పంట పొలాలను రక్షిస్తుందని నమ్ముతారు. గ్రామీణ రైతులు ప్రతి సంవత్సరం మైసమ్మతల్లికి పూజలు చేసి యాటనుగాని, కోడినిగాని, మేకను గాని బలి ఇస్తారు. 'సవతి తల్లి పోరు' అనే కథలో వ్యవసాయ కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు ఉంటారు. ఇద్దరు అన్నదమ్ములు వారు మొక్కజొన్న పంట పండిస్తారు. అన్న పెరడులో మొక్క జొన్న బాగా పండుతుంది. అది చూసి సహించుకోలేక తమ్ముడు మైసమ్మ తల్లిని ప్రార్థిస్తాడు. ఏలాగైనా అన్నతో పాటు ఊరి జనాల మొక్క జొన్న పంట అంతా నాశనం కావాలని కోరుకుంటాడు. నా పంటనే బాగుండాలని, అలా చేస్తే మైసమ్మ తల్లి నీకు యాటగా నా భార్య తల నరికిస్తానని మొక్కుతాడు. అతను కోరినట్లుగానే మొక్కజొన్న పెరడు బాగా పండుతుంది. మైసమ్మతల్లికి తన భార్య తలని నైవేద్యంగా సమర్పిస్తాడు. జానపదులు తాము కోరిన కోరికలు మంచివైనా, చెడ్డవైనా గ్రామీణ దేవతలు తీరుస్తారనే నమ్మకం వారిలో ఉంటుందని పై రెండు కథల ద్వారా అర్థమవుతుంది.

'శివసత్తి అవతారం' అనే కథలో ఇద్దరు భార్యాభర్తలు ఉంటారు. ఒక రోజు భార్య ఆలస్యంగా నిద్రలేస్తుంది. అప్పటికే అతని భర్త పొలానికి చేరుకుంటాడు. మధ్యాహ్న సమయానికి కూడా భోజనాన్ని తీసుకురాలేదని చెప్పి భర్త భార్య మీద చాలా కోపంగా ఉంటాడు. ఇక భార్య వెంటనే పొలం దగ్గర వంట చేస్తానని పచ్చి కూరగాయలనే తీసుకుని హడావిడిగా బయలుదేరింది. పంట పొలానికి చేరుకున్న భార్య ఎదురుగా భర్త కట్టే తీసుకుని వస్తాడు. అది చూసి భార్య తన భర్త కోపం నుంచి తప్పించుకోవడానికి వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి తన మీద పూనినట్లుగా నటిస్తుంది. అది నిజమే అనుకోని కోపంగా ఉన్న భర్త భార్యను ఏమనకుండా శాంతిస్తాడు. శిష్టదేవుడు శైవరూప స్వరూపదైన శ్రీ రాజ రాజేశ్వర స్వామి అక్కడ స్థానిక ప్రజలకు దేవుడి రూపంలో వస్తాడని నమ్ముతారు.

స్త్రీ, పురుష బేధం లేకుండా కొంత మందికి పూని, రంగం తొక్కి భవిష్యతు గురించి చెప్పడం, ఆపదలో ఉన్న వారిని సలహాలిచ్చి ఆదుకుంటాడని కూడ నమ్ముతారు. ఇలా శిష్టదేవుడైన శంకరుడు జానపద దేవుడిగా కూడా కొలువుదీరి పూజలు అందుకుంటున్నాడు. అందుకు నిదర్శనమే ప్రతి గ్రామంలో ప్రజలందరు శ్రీ రాజరాజేశ్వర స్వామిని కులదైవంగా భావిస్తారు. ప్రతి సంవత్సరాని కొకసారి ముఖ్యంగా మహాశివరాత్రి పండుగ పర్వదినానికి నెల రోజల ముందు నుంచే భక్తుల తాకిడి అధికంగా కనిపిస్తుంది.

## 4.2.4 పండుగలు

ఏ మతాన్ని అనుసరించే వారికైనా సాధారణంగా విశేషమైన రోజులు కొన్ని ఉంటాయి అవే పండుగ రోజులు. హిందు సంస్కృతిలో పండుగలకిచ్చే ప్రాధాన్యత ఎక్కువ. నిత్యం కష్టపడే వారు శ్రామిక సేవకులు జానపదులు. అలాంటి జానపదులు ఉల్లాసంగా, ఉత్సహంగా జరుపుకోవడానికి ఈ పండుగలనేవి కల్పించబడి ఉంటాయి. ఎంతటి కష్టజీవైనా పండుగ రోజున పని మానేసి, కుటుంబ సభ్యులతో హాయిగా ఉంటాడు. తమ స్తోమతకు తగిన విధంగా పిండి వంటలు చేసుకుని తింటారు. నిరంతరం కష్టించే శ్రామిక ప్రజలకు పండుగలు కాస్త ఊరటనిస్తాయి.

'సావుకారి కోడలు చతురుత' అనే కథలో ఒక షావుకారికి ముగ్గురు కోడల్లు ఉంటారు. ఆ ముగ్గురు దీపావళి పండుగ రోజున గోదావరికి వెళతారు. అందులో స్నానం చేసి చెంబులో నీళ్లు తీసుకుని ఇంటికి వస్తారు. షావుకార్లు (వైశ్యులకు) దీపావళి పండుగ రోజుని ప్రత్యేకంగా జరుపుకుంటారు. ఆ రోజున కన్యకాపరమేశ్వరి దేవిని పూజిస్తారు. వ్యాపార లావాదేవీలు బాగా జరిగి అధిక లాభాలు రావాలని దుకాణాల్లో లక్ష్మీ దేవి పూజని చేయిస్తారు. ఒక్క దీపావళి అనే కాకుండా ఏ పండుగైనా పవిత్రమైన గోదావరిలో స్నానం ఆచరించి కొన్ని నీళ్లు ఇంటికి తెచ్చుకోవడమనే సంప్రదాయం నేటికి ధర్మపురి పరిసర ప్రాంతాల్లో కనిపిస్తుంది.

'బూరెప్ప' అనే కథలో దినయ్య దినమ్మ అనే దంపతులు ఉంటారు. వారు ఉగాది పండుగ రోజున బూరెప్పలు చేసుకుని తింటారు. పండుగ రోజున మాత్రమే చేసుకునే బూరెప్ప అంటే ఎంత ప్రీతియో ఈ కథలో భార్యాభర్తలు బూరెప్ప కోసం వేసుకున్న పందెం చెప్తుంది.

'పైసకు గుడిసెన్నర పెండ్లాం' అనే కథలో సంక్రాంతి పండుగ నాడు సకినాలు చేసుకోవడం గురించి ప్రస్తావన ఉంటుంది. బియ్యపు పిండి, నువ్వులు, ఉప్పుతో కలిపి చేసిన మిశ్రమాన్ని పిండి గిర్నిలో పట్టించి నానబెడతారు. మరుసటి రోజున ఆ పిండిని స్త్రీలు చేతితో తీసుకుని గుండ్రంగా సుట్టలు చుట్టి ఆరబెడతారు. ఆరిన వాటిని నూనెలో వేసి కాల్చుతారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో సంక్రాంతి పండుగ నాడు మాత్రమే చేసుకునే పిండి వంటకం చకినాలు. మిగతా ప్రాంతాల్లో లాగ కాకుండా సంక్రాంతి పండుగ రోజున రంగు రంగుల ముగ్గులు వేయడంతో పాటు చకినాలను చేసుకోవడం ఈ ప్రాంత ప్రత్యేకత అని తెలుస్తుంది.

## 4.2.5 వివాహం

ప్రతి వారి జీవితంలో వివాహనికి ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. పేద, ధనిక బేధం లేకుండా అన్ని రకాల స్థాయిల వారికి పెళ్లి అనేది ముఖ్యమైన ఘట్టం. చిరకాలం గుర్తుంచుకునే అనుభూతి. రాజుల కాలంలో రాజు రాజ్య విస్తరణకు యుద్దాలు చేయడానికి కొన్ని సంవత్సరాలు పోయేవారు. అలాంటి సందర్భంలో యువరాజులకు కత్తి కటారుకు పెళ్లి చేసే సందర్భాలు కథలో చిత్రించబడ్డాయి. పూర్వం బాల్యవివాహలు కూడా ఎక్కువగా జరిగేవి. జానపద కథల్లో యవకులు వివాహం చేయమని తల్లిదండ్రులను అడిగితే వారు నీకు చిన్నప్పుడే వివాహం జరిగిందని చెప్తారు. ఊహ తెలియని వయస్సులోనే వివాహాలు జరిపించేవారు. యుక్త వయసు వచ్చాక అత్తగారింటికి వెళ్లి తన భార్యను తెచ్చుకోనే సంఘటనలు చాలా కథల్లో కనిపిస్తాయి.

వివాహం అనేది రెండు మనసుల కలయికతో సాధ్యమవుతుంది. ఇద్దరికి ఒకరుపై ఒకరికి ఇష్టం కలగాలి. వరుడు తనకు నచ్చిన స్త్రీ కోసం అన్వేషిస్తూ ఉంటాడు. 'ఐదు మల్లె పూవ్వుల కథ'లో బాలగిరిరాజు తనకు నచ్చిన వధువు ఏలా ఉండాలో తల్లిదండ్రులతో ఈ విధంగా చెబుతాడు. "ఓనా

తల్లి కృష్ణలీల ఓనా తల్లి ధర్మరాజ నాకు లగ్గం మీరుజేత్తే నేను చేసుకోను. ఐదు మల్లె పూవ్వుల కన్న అరవిసం కమ్మి ఉన్న పిల్లే నాగ్గావాలే. ఐదు మల్లెపూలని ఒక తక్కెట్ల పిల్లను ఒక తక్కెట్ల జోకితే ఏసుతాసు వోకుంట జోక్కరావాలే." అంటే మల్లె పూవ్వుల కన్నా సుకుమారంగా, మనోహరమైన రూపంతో ఉన్న సౌందర్యవతి కోసం అతను వెతుకుతున్నట్టు తెలుస్తుంది.

సమాజంలో ధనిక కుటుంబాలు వివాహాలను ఘనంగా, వైభవోపేతంగా జరుపుకోవడం పరిపాటి. జానపద కథలో కూడా రాజులు, ధనవంతులు వివాహాలు ఘనంగా చేసుకునేవారని చెప్పడానికి కథకులు వివాహ ఘట్టాన్ని అద్భుతంగా వర్ణించారు. ఐదు మల్లె పూవ్వుల కథలో బాలగిరి రాజు అరవిసం ఆడబాలను సాధించుకుని తీసుకువస్తాడు. "తల్లి తండ్రి ఆల్లందరు కలుసుకోని కోడలు కల్సిందని మల్ల అర్ధజనాల మందికి పత్రిక పంచి, ఆకాసమంత అరుగులేసి, బూదేవంత పందిరేసి, ఈ ఐదు మల్లె పూల పిల్ల అని పోయినవ్ గదా" తాను కోరుకున్న పిల్లను తెచ్చుకోని బాలగిరి రాజు మూత్యాల దేవితో ఘనంగా వివాహం చేసుకుంటాడని పెళ్లి మంటపాన్ని వర్ణించిన తీరు కనిపిస్తుంది.

'సత్యవతి' అనే కథలో ధర్మాంగ రాజు, ధర్మవతి దంపతులకు పుట్టిన పాముకి, సత్యవతికి పెళ్లి చేస్తారు. పాము అని చెబితే ఎవ్వరు పెళ్లి చేసుకోరని చెప్పి ఆ దంపతులు రహస్యంగా తన కొడుకు విద్యను అభ్యసించడానికి ముత్యాల బందరు పోయాడని కోడలికి అబద్ధం చెప్తారు. ముహూర్తం దాటి పోకూడదని చెప్పి సత్యవతితో, యువరాజు కత్తిని పెట్టి కత్తి కటారుకి పెళ్లి చేసి కోడల్ని అత్తగారింటికి తీసుకొని వస్తారు. 'రాణి పగడాల పేరు' అనే కథలో కూడా రాజు తల్లిదండ్రుల మాట వినడం లేదని, కత్తికి కటారుకి పెళ్లి చేసి యువరాణిని ఇంటికి తెచ్చుకుంటారు. కొద్ది రోజుల తరువాత యవరాజుకి ఆమె నా భార్య అన్న సంగతి తెలుస్తుంది. దీన్ని బట్టి రాజుల కాలంలో కత్తికి, కటారుకి పెళ్లి చేసి కోడల్ని చేసుకునే సాంప్రదాయం ఉందని తెలుస్తుంది.

'ఇరవై అయిదు రోజుల బాలుడు' అనే కథలో కూడా బిక్షపతి అనే ఇరవై అయిదు రోజుల బాలుడికి జాతక దోషం ఉంటుంది. ఆ జాతక దోష నివారణకు 25 రోజుల్లోనే యువతితో వివాహం చేయాలి. అందుకు నకాసి బొమ్మను పెట్టి పద్మాదేవితో బిక్షపతికి వివాహం చేస్తారు. ఒక రకంగా ఈ

పద్ధతి కూడా కత్తికి, కటారుకి పెళ్లి చేయడం లాంటిదే. ఒక తల్లిదండ్రులు వారి స్వార్థం కోసం ఇంకొ ఇంటి స్త్రీకి అన్యాయం చేసారని తెలుస్తుంది.

సామాన్యులకు ఎంతో అదృష్టం ఉంటేగాని యువరాణులను వివాహం చేసుకోనే అవకాశం రాదు. 'బంగారెంటుక బాలుడు', 'సోమనాల బావి' అనే కథల్లో రాజు కున్న ఏదో ఒక సమస్యను పరిష్కరించి రాజుల మెప్పు పొందుతారు. రాజు ముందే ప్రకటించిన విధంగా యువరాణులను వారికిచ్చి వివాహం చేస్తాడు. వివాహం తర్వాత వారి జీవితాలు మారిపోయి అదృష్టవంతులు అవుతారని ఈ కథలు చిత్రించబడ్డాయి.

'రేచీకటి అల్లుడు' అనే కథలో రేచీకటి వ్యాధితో ఉన్న వ్యక్తి తన భార్యను తీసుకురావడానికి అత్తగారింటికి వెళతాడు. అతను వెళ్లే మార్గంలో సాయంత్రం 6 దాటితే రేచీకటి వల్ల కళ్లు మసకబారి పోతాయి. అత్తగారికి తనకు రేచీకటి ఉన్నట్టు తెలియకుండ ఉండాలని చెప్పి అత్తగారి ఇల్లు చేరడానికి ప్రయత్నం చేస్తాడు. సమాజంలో కొంత మంది వ్యక్తులు తమ లోపాలను తెలియనీయకుండ ఆడపిల్లలను  వివాహం చేసుకుంటున్నారని తెలుస్తుంది. ఈ కథలోని వ్యక్తి వివాహమైన తరువాత కూడ నిజాన్ని తెలియజెప్పకుండ, దాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేస్తాడు. సమాజంలో ఇటువంటి వ్యక్తులు అక్కడక్కడ తారసపడుతూ ఉంటారు.

## 4.2.6 సంతానం

వివాహం చేసుకున్న దంపతులకు సంతానలేమి సమస్య తీవ్రమైన చింతను కలిగించే విషయం. మన సమాజంలో వివాహం చేసుకున్న తరువాత పిల్లలు లేకపోవడమనేది ఒక లోపంగా కూడా చూస్తారు. సంతానం లేకపోవడమనేది సమాజంలో తమని కింది స్థాయిగా చూసే చులకన భావన దంపతులను కుంగదీస్తుంది. సంతానం కోసం ఎన్నో తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాలు సందర్శించిన వారు లేకపోలేదు. ఆ బాధ ఏంతటిదో వివరించిన జానపద కథలు ఉన్నాయి

'సత్యవతి' అనే కథలో సంతానం లేని రాజు, ఈ రాజ వైభోగం మనకెందుకని చెప్పిన దంపతుల బాధను కథకురాలు క్రింది విధంగా వర్ణించింది. "ఆ ధర్మంగరాజు, ధర్మవతి అల్లకు లేక లేక

పుత్ర సంతానం లేక కొన్ని వేలు ఖర్చుబెట్టి, ఎదురైన గుండకు, కుదురైన బండకు కొటొక్క మొక్కులు మొక్కుతుంది. మొక్కితే గూడా సంతానం ఐతలేదు. సంతానం కాకపోతే ఏం జేసిందు. అబ్బా! ఎవ్వడు ఏ బిచ్చగానికి చెట్టుకింద బిచ్చగానికి సంతానం అయితుంది. నేను ఎన్నిజన్మలకు ఏం పాపం నాకు ఎందుకు సంతానం కావద్దు" ఈవిధంగా తాము పూర్వజన్మలో చేసిన ఏ పాపం వల్లనో ఆ దంపతులకు ఇప్పుడు సంతానం కలగలేదని భాధపడతారు. సమాజంలో పిల్లలు లేని చాలా మంది దంపతులు ఏవిధంగా కుంగిపోతారో పై వాక్యాల ద్వారా అర్థం చేసుకోవచ్చు.

'ఇరవై అయిదు రోజుల బాలుడు' అనే కథలో కూడా మాణిక్యాల దేవికి సంతానం కలగకపోతే దైవమే దిక్కని భావించి ఒక పాత గుడికి వెళుతుంది. "రాజా! ఈ ధనం ధాన్యం మనకెందుకు రాజా మనకు సంతానం లేకపాయె ఈ బతుకు, భాగ్యం ఎందుకు? ఒక పూర్వవైభోగం కలిగిన పాడువడ్డ గుడికి ఆమె వెళ్లింది. అక్కడ ఆ గుడిని పైట కొంగుతో శుద్ధి చేసింది. ఆ దేవి నిరసించి ఓ స్థంభం నందు కుప్పకూలిపోయింది." ప్రతి స్త్రీకి పిల్లలు కనడమనే ప్రక్రియ ఒక వరంగా భావిస్తారు. ఆ వరాన్ని పొందడానికి ఎన్నో పూజలు, వ్రతాలు, నోములు చేస్తారు. ఈ కథలో కూడా మాణిక్యాల దేవి తన భర్తతో ఇలా చెప్పి బాధపడుతుంది. ఎన్ని సిరిసంపదలు, ఇంత రాజ్యాభోగాలు ఉండి ఏం లాభం? మనకు సంతాన ప్రాప్తి లేదని దు:ఖిస్తుంది. ఒక ప్రసిద్ధ దేవాలయానికి వెళ్లి, ఆ దేవాలయమంత శుభ్రపరిచి సంతానం కోసం దైవాన్ని నమ్ముకుంటుంది. ఈ విధంగా ఒక స్త్రీ సంతానం కోసం ఎంతగా తాపత్రయ పడిందో అర్థమవుతుంది. మన సమాజంలో కూడా స్త్రీలు పిల్లలతోనే పరిపూర్ణమైన జీవితాన్ని పొందినట్లు భావిస్తారు.

## 4.2.7 ఆహారపు అలవాట్లు

మానవులు మనుగడ సాగించాలంటే ఆహారం తప్పనిసరి. ఎన్ని విద్యలు నేర్చినా పొట్ట కూటి కోసం అనే నానుడి కూడా ఉంది. ఆహారపు అలవాట్లనేవి ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్కలాగా ఉంటాయి. సాధారణంగా ప్రజలు వరి పంటను పండించి అన్నం తినడం నేడు కనిపిస్తున్న పరిస్థితి. కాని నేను సేకరించిన జానపద కథల్లో మాత్రం రొట్టెల ప్రస్తావన ఎక్కువగా ఉంది. దీన్ని బట్టి పూర్వం

ప్రజలు రొట్టెలనే ఆహారంగా స్వీకరించినట్లు తెలుస్తుంది. రొట్టెలు రెండు రకాలుగా తయారుచేస్తారు. ఒక రకం గోధుమ పిండితో చేసేవి. మరొకటి జొన్న పిండితో చేసేవి. నాటి సమాజంలో రైతులు జొన్న, గోధుమ పంట ఎక్కువ వేసేవారని తెలుస్తుంది.

'ముసలమ్మ' అనే కథలో ఒక పూటకూళ్ల ఇంట్లో వంట మనిషిగా చేస్తూ రోజు ఎనిమిది జొన్న రొట్టెలు తయారు చేసేది. జొన్న రొట్టెలు ఆరోగ్యానికి మంచిది. కాకపోతే గోధుమ రొట్టెలు తిన్నన్ని జొన్న రొట్టెలు తినలేం. సగటు మనిషి ఒకటి లేదా రెండు కన్నా ఎక్కువగా తినలేరు. అందుకే ఈ కథలో రోజుకు ఎనిమిది రొట్టెలు చేసేదని కథకుడు చెప్పాడు.

'కాటిమీదికెక్కిన కోడలు' అనే కథలో "ఒక గ్రామంలో తల్లి, కొడుకు, కోడలు ఉంటరు. ఆళ్లు ఎవ్వరికి దానం చేసేవారు కాదు. ఆమె పొద్దున మూడు రొట్టెలు, రాత్రి మూడు రొట్టెలు చేసేది. ఆ పొద్దున మూడు జొన్న రొట్టెలు, పొద్దికి మూడు జొన్న రొట్టెలు తిని వీళ్లు పడుకునేవారు" ఒక కుటుంబం మొత్తం రోజంతా జొన్న రొట్టెలనే ఆహారంగా తీసుకున్నట్టు తెలుస్తుంది.

ఇంటికి అతిథులు వచ్చినప్పుడు రోజువారి వంటకాల్లో మార్పు వస్తుంది. అతిథిని బాగా చూసుకోవాలని చెప్పి తీరొక్క వంటలు చేయడం మన వారికి సరదా కూడా. 'అన్న చెల్లెలి కథ'లో పుట్టింటికి వచ్చిన చెల్లెలిని బాగా చూసుకోవాలని భార్యకు చెప్తాడు. "మరీ భార్యకు చెప్తడు. ఇంగో మా చెల్లి అచ్చింది. మంచిగ కోన్ని కొయ్యి, గారెలు జెయ్యి. తాల్పన్నం అండు అని చెప్పి చెప్తడు." కొన్ని కులాల వారు తప్ప మనలో అందరు మాంసహారులే. కాబట్టి పుట్టింటికి వచ్చిన చెల్లెలికి కోడిని కోసి, అందులోకి అంచుకు గారెలు కూడ చేయమని చెప్పడం, తాళింపు అన్నం కూడా పెట్టమని భర్త భార్యకి ఆదేశిస్తాడు. ఎండలో పొలం వద్దకు వచ్చిన చెల్లెకి అన్న అంబలి తాగిపిస్తాడు. అంబలి అంటే రాగి సంకటి లాగా ఉండే ద్రవ పదార్థం. బీదవారికి, శ్రామికులకు అంబలి మంచి జీవన ఆహారంగా భావిస్తారు. వేసవి కాలంలో ఈ ప్రాంత ప్రజలు అంబలిని ఎక్కువగా తాగుతారు. మన శరీరంలో నీటి శాతం డీ హైడ్రేషన్ కాకుండా ఉండాలని అంబలి అనే ఆహార పదార్థాన్ని తాగుతారు.

'తల్లి కోతి కోడలు' అనే కథలో దొంగలు దొంగతనానికి పోయి వచ్చిన తరువాత గొర్రెని చంపి వండుకుని తింటారు. మాంసాన్ని చాలా ఇష్టంగా తినేవారు ఉంటారు. 'బంగారెంటుక బాలుడు', 'లక్ష్మీదేవి కటాక్షం' అనే కథల్లో జాలర్లు, చేపల ప్రస్తావన కనిపిస్తుంది. ఈ కథలో ఒక వ్యక్తి డబ్బులు లేకున్న చేపలు కొనడానికి వెళతాడు. జాలరిని ఒప్పించి డబ్బులు తరువాత ఇస్తానని చెప్పి, చేపలు తెచ్చుకున్నడంటే చేప మాంసం రుచిని తెలియజేస్తుంది. ఈ జిల్లా గోదావరి తీరం వెంబడి ఉంటుంది. గోదావరిని అనుకుని ఉన్న వాగులు, వంకలు, మిగతా చెరువులు వల్ల మత్స్య సంపద ఎక్కువగానే ఉంటుంది. ఈ జిల్లా వాసులకు ఆదివారం నాడు ఎంత పేదవారైనా మాంసం తినందే ముద్ద దిగదు అంటే అతిశయోక్తి కాదు. 'శివసత్తె అవతారమెత్తిన స్త్రీ' అనే కథలో భార్యాభర్తలు ఇద్దరు మాంసం తిని, మద్యం సేవిస్తారు. ఈ ప్రాంతంలో కొంత మంది స్త్రీలు మద్యన్ని కూడా సేవిస్తారు.

'అత్తను నమ్మని కోడలు' అనే కథలో సత్తుపిండి ప్రస్తావన ఉంటుంది. గర్భవతితో ఉన్న ఒక స్త్రీ అత్తకు తెలియకుండా నువ్వులు, కొబ్బరి ముక్క, బెల్లం కలిపి బాగా దంచి ముద్దగా చేసి తినాలని అనుకుంటుంది. సాధారణంగా గ్రామీణ దేవతలను పూజించిన తరువాత ఈ మూడింటి మిశ్రమాన్ని ప్రసాదంగా ప్రజలకు పెడతారు. గ్రామీణ దేవతలకు బెల్లం, కొబ్బరి, నువ్వుల మిశ్రమాన్ని ఇష్టమైన పదార్థాలుగా చెబుతారు. ఈ ప్రాంత ప్రజలు సంక్రాంతి పండుగనాడు చకినాలను (బియ్యపు పిండి, నువ్వులు, ఉప్పు), బతుకమ్మ పండుగ నాడు సత్తుపిండిని ఎక్కువగా చేస్తారు. సత్తు పిండిని బియ్యం, నువ్వులు, వేరుశనగ, పెసర మొదలైన పదార్థాలతో రకరకాలుగా చేసుకుంటారు. బతుకమ్మ పండుగ రోజున ఆట పాట తరువాత సత్తుపిండిని స్త్రీలు ఒకరికి ఒకరు పంచుకుంటారు.

## 4.2.8 విద్యా – వైద్యం

సమాజంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఉంది. పూర్వం డబ్బు ఉన్న వారు మాత్రమే విద్యను అభ్యసించేవారు. నేడు ధనిక, పేద బేధం లేకుండా అందరు తమ పిల్లలను చదివిస్తున్నారు. జానపద కథల్లో అక్కడక్కడ విద్య గురించి ప్రస్తావించారు.

'సత్యవతి' కథలో ధర్మంగ రాజు, ధర్మవతికి పుట్టిన పాముకి పెళ్లి చేయాలని అనుకుంటారు. పాముతో పెళ్లి చేయడమంటే వధువుని ఇవ్వరని చెప్పి, ముత్యాల బంధరు పోయిండని అబద్ధం చెప్తారు. ముత్యాల బంధరు అంటే చదువుకోవడానికి వేరే ప్రాంతానికి వెళ్లడాన్ని చెప్తూ "ఏడేడు సదువులెల్ల సదివిండు. పన్నెండు సదువుల పారా సదివి నా కొడుకు ముత్యాల బందరు పోయిండు" రాజ వంశీయుడైన ఆ దంపతుల కొడుకు చదువుకోవడానికి వేరే ప్రాంతానికి పంపించినట్లు తెలుస్తుంది.

'పైసకు గుడిసెన్నర పెండ్లాం' అనే కథలో తల్లి కొడుకులు ఉంటారు. కొడుకు తల్లిని తనకు పెళ్లి చేయమని అడుగుతాడు. ఆ సందర్భంలో కొడుకు చదువుకుంటున్నట్టు ప్రస్తావన ఉంటుంది. "అమ్మా! కొడుకు పెరిగిండు. ఇంత సదువు సాత్రం నేర్చుకుంటుండు. అమ్మ నాకు లగ్గం చెయ్యంటే?" ఈ విధంగా చదువు పూర్తయిన ఒక వ్యక్తి తన తల్లితో తనకు పెళ్లి చేయమని అడుగుతాడు.

'గారడివాడు' అనే కథలో గారడి విద్య గురించి ప్రస్తావన ఉంటుంది. గారడి వానికి పిల్లలు ఉండరు. గారడివాడు అద్భుతమైన గారడి ఆటతో ప్రజలను అలరింపజేస్తాడు. తనకు వచ్చిన గారడి విద్యను ఇతరులకు నేర్పాలని ఆశపడతాడు. అలాంటి సందర్భంలో ఇద్దరు పేద పిల్లలు తీసుకువచ్చి వారికి గారడి విద్యను నేర్పిస్తాడు. ప్రాచీన కాలంలో ప్రజలను అలరించడంలో గారడి విద్య ప్రముఖ పాత్ర పోషించిందని ఈ కథలో సంఘటనల ద్వారా తెలుస్తుంది

జానపదుల్లో నాటు వైద్యం గురించి ఎక్కువగా ఉంటుంది. మంత్ర తంత్రాలతో నయమవడం, ఆకుపసరు పూసి రాక్షసపుండుని తగ్గించడం లాంటి సంఘటనలు జానపద కథల్లో కనిపించాయి.

'అక్కెమ్మ' కథలో కడగొట్ట రామన్న, అక్కెమ్మ ఇద్దరు భార్యాభర్తలు ఉంటారు. రామన్న తన భార్య అక్కెమ్మను కొన్ని ఆంక్షలు పెట్టి బయటకు పంపిస్తాడు. అదే సమయంలో ఒక రాజు వీపుల రాక్షసపుండుతో బాధపడతున్నాడన్న విషయం తెలుసుకుంటుంది. ఆ రాక్షసపుండు తగ్గాలంటే ఆ ఊరి గుడివెనుకాల మందుల చెట్టు ఉంటుంది. ఆ చెట్టు ఆకు పసరు పెడితే తగ్గుతుందని దీపాల ద్వారా తెలుసుకుంటుంది. ఆ మందు చెట్టు ఆకులను తెంపి రసం తీసి రాజు వీపుకు పెట్టి రాచపుండు నుండి రాజుకు విముక్తి కలిగిస్తుంది. అలా రాజుకు ఆకు పసరు వైద్యం చేసి రాజు చేత సత్కరించబడుతుంది.

'సోమనాల భావి' అనే కథలో కూడా రాజు కూతురు రాచపుండుతో బాధపడుతుంది. ఒక కంసాలి బావిలో మునిగినప్పుడు రాచపుండు తగ్గే మందు గురించి ఆడ గ్రహ, మగ గ్రహ మాట్లాడుకుంటే వింటాడు. ఈ కథలో రాచపుండు పుట్టిందంటే దయ్యం పట్టి రాక్షసి పుండుగా పీడిస్తుందన్న అర్థంలో ఉంది. రాజకూమారికి దయ్యం పట్టి తాను కోరిన వంటకాలను తెచ్చిపెడితే తిని హాయిగా ఉంటుంది. దాన్ని తొలగించడానకి ఎన్నో జంతువులను బలిచేసి మాంసాన్ని వండిపెడతారు. "రాజకుమార్తె మీద ఉండి రాచపుండు పుట్టించిన దానికి ఎందరో వైదికులచ్చి మేకపోతును, కోడి పుంజులు, కల్లు తీరొక్క తీరు ఆహరం తెచ్చి పెడుతుర్రు. గని ఆమె తింటలేదు. నేనే తింటున్న" ఈ విధంగా రాజ కుమార్తెను బాధిస్తున్న రాచపుండు నయం చేయడానికి కంసాలి వాడు కోట శంభుని గుడి దగ్గరకి వెళతాడు. ఆ గుడి వెనుక ఉన్న ఏడాకుల మర్రిని లెక్కపెట్టకుండా తెచ్చి రాజకుమార్తెకు పెట్టి వైద్యం చేస్తాడు. యువరాణిని చాలా రోజుల నుంచి వేధిస్తున్న రాక్షస పుండు మాయైపోతుంది.

## 4.2.9 ఆచారాలు నమ్మకాలు

జానపదులు వారి జీవన విధానంలో అనేక ఆచారాలు పాటిస్తారు. సంఘంలో ఒక తరం నుంచి మరొ తరం వరకు పాటింపబడి పద్ధతులే ఆచారాలు. ఇవి తరతరాలుగా పూర్వీకుల నుంచి సంతరించడమే కాకుండా మన చేత ఆచరించి భావితరాలకు అందచేస్తున్నాం. ఎవరో చెప్పారని, మా తాతలు పాటించేవారని, మా ఆచారంలో ఇలా ఉండేవని, ఇలా చేస్తే మంచి అవుతుందని రకరకాలుగా చెబుతూ మనం ఆచారాలను పాటిస్తూ ఉంటాం. మానవులు పుట్టుక నుండి మరణించే వరకు తన జీవనంలో భాగంగా చేసుకున్న ఆచారాలను పాటించడం తప్పనిసరి అవుతుంది. పండుగ రోజు కొత్త బట్టలు వేసుకోవడం, మామిడి ఆకులు గుమ్మానికి కట్టడం, వేరేవాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు కాళ్లు కడుక్కోవడం, బల్లి మీద పడితే స్నానం చేయడం, ఉత్తరం దిక్కున తల పెట్టి పడుకోవద్దనడం, ఈశాన్యంలో బరువు ఉంచకూడదని అనడం ఇవన్నీ నిత్యం మనం పాటిస్తున్న ఆచారాలు. మనకు తెలిసో తెలియకనో వాటిలో శాస్త్రీయత గమనించకుండానే ఆచరిస్తూ ఉంటాం. మన పెద్దలు మనల్ని నిత్యం సంస్కారించడానికన్నట్టు మన ఆచారాలను రూపొందించారు. ఇవి మనకు తెలియకుండానే

మనల్ని నియంత్రించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. జానపదులు సంస్కృతిలో భాగమైన ఆచారాలు వారి కథల్లో ప్రతిబింబించాయి.

'చెప్పుకున్న విలువ రాజుకు లేదు' అనే కథలో ఒక రాజు రాజ్యాన్ని సుభిక్షంగా పరిపాలిస్తాడు. కొద్ది రోజుల తరువాత రాజు హఠాత్తుగా చనిపోతాడు. అతని శవాన్ని శ్మశానవాటికకు తీసుకు వెళ్లే సందర్భంలో బాగా వర్షం పడుతుంది. అందరు పక్కనే ఉన్న ఒక ఇంట్లో తలదాచుకోవడానికి వెళతారు. అప్పుడు ఆ ఇంటి వాళ్లు డప్పులు కొట్టెవారి చెప్పులను పెట్టుకుంటే ఏమి అనరు. కాని రాజు శవాన్ని మాత్రం ఇంట్లో పెట్టడానికి నిరాకరిస్తారు. దీన్ని బట్టి మనం శవాలను ఇంట్లో పెట్టుకునే ఆచారం లేదని తెలుస్తుంది.

'అత్త కోడలు' అనే కథలో ఒక కోడలు వంకాయ కూర అత్తకు వండి నోట్లో కుచ్చి పెడుతుంది. అత్తకు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండి మూర్ఛ పోతుంది. అందరు చనిపోయిందనుకుని శవాన్ని తీసుకెళతారు. ఆ సందర్భంలో మగవారు మాత్రమే శవాలను కాల్చే చోటికి వెళతారని, ఆడ వాళ్లు వెళ్ళకూడదనే నియమం ఉంటుంది. మన సమాజంలో ఈ ఆచారం నేటికి కనిపిస్తుంది.

. 'కాటిమీది కెక్కిన కోడలు', 'మునుపటి సంబంధం' అనే కథల్లో శుక్రవారం దేవుడికి పెట్టుకోవడం అనే ఆచారం ఉంటుంది. జానపదులు శిష్టదేవతలను గ్రామీణ దేవతలుగా కూడా భావించి పూజిస్తారు. శుక్రవారం దేవుడికి పెట్టుకోవడం, శుక్రవార దేవుడు, శుక్రార దేవుడు అనే పేర్లతో కూడా వ్యవహరిస్తుంటారు. కొంత మంది లక్ష్మి దేవి తామరపువ్వు మీద కూర్చున్న బొమ్మ పెడితే, మరికొందరు దుర్గమ్మ బొమ్మ పెట్టి పూజిస్తారు. శుక్రవారం పూజ విధానం పాల పూజ, మాంసపు పూజ అని రెండు రకాలుగా ఉంటుంది. పాల పూజలో కూరగాయలతో, మాంసపు పూజలో జంతు బలి చేసి వండిన వంటకాలతో భోజనాలను పెడతారు. కొన్ని కులాలు మాత్రమే ఈ దేవతకి పెట్టుకోవడమనే ఆచారం ఉంటుంది. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఈ దేవతని పూజిస్తారు

'కొడుకులున్న తండ్రికి వచ్చిన గతి' అనే కథలో ఒక ముసలాయనకు నలుగురు కొడుకులు కోడల్లు ఉంటారు. అతను వృద్ధాప్య దశలో దీనమైన స్థితిలో జీవితాన్ని కొనసాగిస్తాడు. అతని ఆరోగ్య

పరిస్థితి బాగా లేక చనిపోతాడు. అతని కొడుకులు ముసలాయన డబ్బుకు ఆశపడి దినకర్మ ఘనంగా చేస్తారు. "ఓ మందను తీస్కత్తరు. ఓ మేకల మందను తీస్కత్తరు. మేకల మందను కోసి మంచిగ వూరోళ్లందరిని పిలిచి మంచిగ భోజనాల కార్యక్రమం ఏర్పాటు చేత్తరు" అతడు చనిపోయిన తేది నాడు నుంచి తొమ్మిది రోజుల నాడు దినం, పదకొండు రోజుల తరువాత దినకర్మ, ప్రతి మాసంలో అతడు చనిపోయిన తేదినాడు భోజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ విధంగా పెద్దలు చనిపోతే వారి ఆత్మ శాంతించాలని ఒక సంవత్సరం మొత్తం ఏదొక కార్యక్రమాలు నిర్వహించి, సంవత్సరం చివరన సంవత్సరికం పెట్టుకుంటారు. మనం నిత్యం పాటించే ఆచారాలు జానపద కథల్లో చాలా కనిపిస్తూ ఉంటాయి.

'అత్త కాల విషం' అనే కథలో ఒక రైతు కూతురుకి వివాహం చేసి, అత్తగారింటికి పంపిస్తాడు. కొద్దిరోజుల తరువాత ఆమె గర్భవతి అవుతుంది. మూడు నెలల తరువాత ఆమెను పుట్టింటికి తీసుకుపోవడానికి తండ్రి వస్తాడు. గర్భం దాల్చిన కూతురుని పుట్టింటికి తీసుకెళ్లి శ్రీమంతం చేయడమనేది మన ఆచారం. ఇంకా సారె పంపకాలు పెట్టి అత్తగారింటికి పంపిస్తారు.

'అక్కెమ్మ కథ' లో ప్రతి ఇంటి నుండి గుడి దగ్గర దీపాలు వచ్చి ముచ్చటించుకోవడం జరుగుతుంది. హిందు సంస్కృతిలో గుడి దగ్గర దీపాలను వెలిగించడం మన ఆచారం. మన సంస్కృతిలో భాగంగా తరతరాలుగా ఈ ఆచారం నిలిచిపోయింది. కార్తీక మాసంలో కార్తీక పౌర్ణమి రోజున ప్రజలందరు దీపాలు వెలిగించడం గమనించవచ్చు.

మన ఆచారాలు, సంప్రదాయలు పాటించడంలో స్త్రీల పాత్ర ముఖ్యమైనది. స్త్రీలు కొన్ని సందర్భాల్లో క్లిష్టమైన నియమ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఏదైనా ఆచారాన్ని పాటించకపోయినా, తప్పుగా ఆచరించిన ఏదొక ఆపద జరుగుతుందని నమ్ముతారు. 'లచ్చిందేవి ఆచారం' కథలో ఒక ముసలాయన చిన్న కోడలు ముక్కు పుల్ల కింద పడితే కాలు తొక్కి తీసుకుంటుంది. అప్పుడు లక్ష్మీదేవికి కోపం వచ్చి ఉన్నపలంగా వాళ్ల ఇంటి నుంచి వెళ్లి పోతుంది. అప్పటి దాకా లక్ష్మీ ఆశీస్సులతో శ్రీమంతులుగా ఉన్న ఆ కుటుంబం లక్ష్మీదేవి వెళ్లిపోయి పేదవాళ్లుగా

మారిపోతారు. ప్రతి ఇంట్లో స్త్రీలు సత్ప్రవర్తనతో, వినయ విధేతలతో, సత్కార్యాలు చేస్తూ వ్యవహరించాలనే నియమాన్ని తెలియజేస్తుంది. స్త్రీలకు గల ప్రత్యేక నియమాలను పాటించకపోతే ఆ ఇంట్లో ఏదొక కీడు జరిగే అవకాశం ఉందన్న అపనమ్మకాలు కూడా ఉన్నాయి.

నమ్మకాలు కూడా ఆచారాలు లాగానే మన పూర్వీకులు పాటించి మనకు అందించినవి. జానపదుల నమ్మకాల్లో మంచిచెడులు రెండు కనిపిస్తాయి. మన సమాజంలో దైవ భక్తి భావన, పాపభీతి కల్గించే క్రమంలోనే మూఢనమ్మకాలు కూడ వచ్చి చేరాయి. అవి ప్రజల అభివృద్ధికి ఆటంకాలుగా మారుతాయి.

'కాటిమీదికెక్కిన కోడలు' అనే కథలో ఒక అత్త కోడలు దానధర్మాలు ఎక్కువగా చేస్తుందని భావించి చంపడానికి ప్రయత్నిస్తుంది. కానీ శ్మశాన వాటిక నుంచి తప్పించుకుని వచ్చిన కోడల్ని చూసి దెయ్యంగా వచ్చిందని అత్తను, భర్తను చంపుతుందని భయభ్రాంతికి గుర్రైతారు. జానపదులు దయ్యాలు ఉంటాయని నమ్ముతారు. దేవుడు అనే భావన ఎంత నిజమో? దెయ్యాలు కూడా అంతే వాస్తవమని వారి నమ్మకం.

గ్రామీణ ప్రాంతంలో జానపదులు చేతబడి అనే విద్య ఉందని నమ్ముతారు. శత్రువులకు హాని చేయడానికి, వారికి కావల్సింది దక్కించుకోవడానికి చేతబడిని ఆశ్రయిస్తారని తెలుస్తుంది. నేటికి పల్లెల్లో ఇలాంటి నమ్మకాలు ఉండి, కథలుగా కూడా చెప్పబడుతున్నాయి. 'రాణి పగడాల పేరు' అనే కథలో కూడా ఒక భోగిని స్త్రీ యువరాజును దక్కించుకోవడానికి ప్రయత్నం చేస్తుంది. అతని భార్యను రాజుకు దూరం చేయాలని మంత్రాలు చేసే వ్యక్తుల్ని కలుస్తుంది. రాజు భార్య ప్రాణాలను ఒక హారంలో బంధించేలా చేసి కొయ్యకు తగిలిస్తుంది. రాజును దక్కించుకునే ప్రయత్నంలో వాళ్ల కుటుంబానికి మాంత్రికుల చేత హాని కలిగిస్తుంది.

'అమరికా రాజు' కథలో కమరసుల రాజు తపస్సుకు పోయేటప్పుడు రాజ్యాన్ని తన బావమరిదైన నిమ్మళ్ల మంత్రికి ఇస్తాడు. కొద్ది రోజుల తరువాత కమరసుల రాజు వచ్చి రాజ్యాన్ని

అడుగుతాడు. అప్పుడు కమరసుల రాజు చెల్లెలు మంత్రగత్తె అని పెద్ద మాంత్రికురాలుగా చిత్రించబడుతుంది. అందుకే నిమ్మళ్ల రాజు నియంత పరిపాలనకు ప్రజలు ఎదురు చెప్పలేకపోతారు.

జానపదుల్లో కొన్ని నమ్మకాలు తాత్వికతను బోధిస్తాయి. దేవుడనేవాడు నిత్యం మనల్ని పరీక్షిసాడని, ఎవ్వరికి ఎంత ఇవ్వాలో ఆ దేవునికి బాగా తెలుసనే అభిప్రాయాలు జానపదుల్లో వీపరితంగా కనిపిస్తాయి. 'గాండ్ల బుచ్చమ్మ' అనే కథలో బుచ్చమ్మ పాము కాటు చేత చనిపోతుందని ఒక ఫకీరుకి కల వస్తుంది. ఆ ఫకీరు రాత్రంతా బుచ్చమ్మ దగ్గర కావలి ఉండి పాము నుంచి తప్పించానని అనుకుంటాడు. కానీ మరుసటి రోజున బావికాడికి వెళ్ళిన గాండ్ల బుచ్చమ్మపై గద్ద ఎత్తుకు పోతున్న పాము విషపు నురుగు పడి చనిపోతుంది. భగవంతుడు రాసిన విధి రాత తప్పదని, తలరాతని మార్చడం ఎవ్వరి తరం కాదని బలంగా నమ్ముతారు. ఇలాంటి కథలు వింటున్నప్పుడు పిల్లల్లో, పెద్దల్లో కూడా పై అభిప్రాయాలే స్థిరంగా నాటుకుపోతాయి.

జానపద కథల్లో స్త్రీలపై శీల పరీక్షలు జరిగినప్పుడు దేవుడు ఏదొక రూపంలో వచ్చి రక్షిస్తాడని నమ్ముతారు. 'ఇరవై అయిదు రోజుల బాలుడు' అనే కథలో దేవగణికలు, 'దైవానుగ్రహం' అనే కథలో భూమి, ఆకాశం, 'సత్యవతి' అనే కథలో గోదావరి నది ఇలా ప్రకృతి శక్తులు ప్రత్యక్షమయి స్త్రీ శీలత్వాన్ని నిరూపిస్తాయి. రామాయణంలో సీత అగ్ని పరీక్షలో నెగ్గిన తీరు ఈ జానపద కథల్లో కనిపిస్తుంది.

## 4.2.10 వినోదాలు

జానపదులు నిరంతర శ్రామికులు. వారు కష్టాన్ని మరిచిపోయి ఆనందంగా గడపడానికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో బుర్రకథ, హరికథ, ఒగ్గుకథ, వీధి భాగోతాలు, భజనకార్యక్రమాలు, కథలు చెప్పించుకోవడం మొదలైన కళలను వారి వినోదం కోసం ఉపయోగపడేవి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో కచ్చేరు దగ్గర ప్రదర్శన కళారూపాలు ప్రదర్శింపజేసేవారు.

'శివసత్తెవతారమెత్తిన భార్య' కథలో భర్త మద్యం సేవించి హాయిగా నిద్రిస్తుంటాడు. భార్య భర్త పడుకున్నది చూసి ఊరి మధ్యలో పర్వతాలు వేసే ఒగ్గు ప్రదర్శనను చూడటానికి వెళుతుంది. ఆమెకు ఒగ్గు కథంటే ఎంతో ఇష్టమని చెబుతుంది. దీని బట్టి జానపదులు కళల పట్ల చూపే అభిమానం వ్యక్తం అవుతుంది.

నేను సేకరించిన జానపద కథల్లో గారడాట గురించి పలుమార్లు ప్రస్తావన ఉంది. కాబట్టి గారడాటకు నాడు ఎంత ఆదరణ ఉందో గమనించవచ్చు. 'గారడివాడు' అనే కథలో ఒక గారడివాడు ఒక ఊరికి వచ్చి కచ్చీరులో గారడి ప్రదర్శన చేసి అందరి అలరింపజేస్తాడు. గారడాట అనే మాయజాల ప్రదర్శన పూర్వం అధిక ప్రాధాన్యత ఉన్న కళ. 'తల్లి కొడుకు, కోతి కోడలు' అనే కథలో కూడా ఒక పిల్లవాడు గారడివాడి దగ్గరకెల్లి కోతిని ఇవ్వమని మొండి పట్టు పడతాడు. గారడాటలో గారడివాడికి, కోతికి ఉన్న నైపుణ్యం వల్లనే గారడాట ప్రజలను వినోదపరుస్తుంది.

'గుడ్డి పిల్లవాడు' అనే కథలో ఒక గుడ్డి వానికి నీటిలో జలకాడుతున్న పిల్లలను చూసి తనకు ఆ కోరిక కలుగుతుంది. కాని కాళ్లు లేకపోవడంతో బాధపడతాడు. పల్లెల్లో, పంట పొలాల్లో బావుల దగ్గర, చెరువుల దగ్గర చిన్న పెద్ద తేడా లేకుండా పల్లెవాసులు నీటిలో ఈత కొడతారు. అది కూడా చిన్నపాటి వినోదాంశమే అవుతుంది. ఈవిధంగా జగిత్యాల జిల్లా జానపద కథల్లో సాంఘిక, సాంస్కృతికాంశాలు ఏవిధంగా చిత్రించబడ్డాయో పరిశీలించాను.

# 5. జగిత్యాల జిల్లా జానపద కథలు – కథానిర్మాణం

## 5. 0 జానపద కథానిర్మాణం – పరిచయం

జానపద కథకులు మౌఖికంగా అనేక కథలు చెప్పగలరు. ఒక తరం నుంచి ఇంకొ తరానికి ఎన్నో కథలు చెప్పబడి సంప్రదాయంగా నిలదొక్కుకున్నాయి. అలాంటి కథల్లో అంతర్లీనంగా ఏదొక కథానిర్మాణం ఉంటుందన్న విషయం కథ చెప్పే జానపదులకు కూడా తెలియదు. వారి నుండి వెలువడిన మౌఖిక జానపద కథలను కథానిర్మాణంలో భాగంగా పరిశీలిస్తే ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఒక్కొక్క జానపద కథ మనకు విభిన్న రీతిలో కనిపిస్తుంది. సాధారణంగా ఏ కథైనా కథా ప్రారంభం సామాన్యంగా ఉంటుంది. కథ కొనసాగింపులో కథానాయకుడు తన వ్యక్తిగతంగా గాని లేదా కుటుంబంలోగాని ఏదో ఒక సమస్య వస్తుంది. ఆ సమస్యను పరిష్కరించడానికి కథానాయకుడు బయలుదేరతాడు. కొన్ని కథల్లో ఆ సమస్యను సాధించడానికి సహయ పాత్ర సహకారం అందుతుంది. మరికొన్ని కథల్లో మలుపు తిప్పే సంఘటనలు ఎదురు కావచ్చు. కథలో సమస్యను పరిష్కరించే సందర్భంలో అనేక ఆటంకాలు వస్తాయి. వాటన్నింటిని అధిగమించి నాయకుడు లక్ష్యాన్ని చేరుకుంటాడు. చివరికి కథ సుఖాంతంగా ముగుస్తుంది. కథ ఆరంభం నుంచి ముగింపు వరకు కథ ఏయే దశల్లో ఎన్ని మలుపులు తిరిగింది, వాటి పర్యవసానం ఎలా ఉందనేది కథానిర్మాణానికి సంబంధించింది. అయితే అన్ని జానపద కథల్లో పై కథానిర్మాణం ఉండాలని నియమం ఏమి లేదు. ఆయా సామాజిక, సంస్కృతుల ఆధారంగా ఏర్పడే కథలు ప్రత్యేక కథానిర్మాణ పద్ధతులతో నిర్మించబడతాయి. నేను సేకరించిన జానపద కథల్లో స్త్రీలు నాయకురాలిగా ఉండి విజయం సాధించారు. కొన్ని కథల్లో ప్రతినాయకుడు లేకుండానే కథలు కొనసాగాయి. వాస్తవ సంఘటనల ఆధారంగా కల్పించబడ్డ కథల్లో కథాంశాలు తక్కువగా కనిపించాయి. ఏదిఏమైనా ప్రతి జానపద కథ ఒక కథానిర్మాణం ఉండి, అది అనేక మార్పులతో వివిధ ప్రాంతాల్లోకి వ్యాప్తి చెందుతుంది.

"కథ ఎలా ప్రారంభమవుతుంది? ఎలా కొనసాగుతుంది? చివరికి ఏవిధంగా ముగుస్తుంది? కథలో వివిధాంశాలు ఎలా అమరి ఉన్నాయి? వాటి మధ్య అంతర్గత సంబంధాలు ఎలా ఉన్నాయి? కథానిర్మాణమనేది కథకుడు నిర్మిస్తాడా? శ్రోత నిర్మిస్తాడా? మొదలైన వాటికి సంబంధించిన కూలంకషమైన వివరణే కథానిర్మాణమని చెప్పవచ్చు"[49]

ఒక కథలోని వివిధాంశాలు, వాటి పరస్పర సంబంధాలు, వాటికి మూల కథతో ఉన్న మొత్తం సంబంధాన్నే 'కథానిర్మాణం' అని అంటారు. జానపద కథ చిన్నదైనా, పెద్దదైనా అందులో ఏదో ఒక నిర్మాణం ఉంటుంది. ఆ నిర్మాణం ఒక క్రమపద్ధతిలో ఉంటుంది.

జానపద కథల మీద పరిశోధన చేసిన పాశ్చాత్య పరిశోధకులు కొన్ని కథానిర్మాణ సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ఆ సిద్ధాంతాలను తెలుగు జానపద పరిశోధకులు జానపద కథలకు అన్వయించి విశ్లేషణ చేసారు. నేను నా పరిశోధనలో భాగంగా సేకరించిన జానపద కథలకు ఆ సిద్ధాంతాలను అన్వయించి విశ్లేషించాను.

## 5.1 జానపద కథానిర్మాణం – ప్రయోజనాలు

ప్రతి జానపద కథ కథానిర్మాణాన్ని కల్గి ఉంటుంది. కథానిర్మాణం వల్ల కథను మరింత సులభంగా అర్థం చేసుకోవడానికి వీలౌతుంది. కథానిర్మాణం వల్ల కథల్లో ఉండే వివిధ పాత్రల అంతర్గత సంబంధ బాంధవ్యాలు తెలుస్తాయి. కథకుడి ఆలోచన సరళిని తెలుసుకోవడానికి, జానపదుడి ఊహాశక్తిని అంచనా వేయడానికి కథానిర్మాణ అధ్యయనం దోహదపడుతుంది. కథానిర్మాణాన్ని బట్టి కథ ఏ శ్రోతని ఉద్దేశించినది అన్నది కూడా తెలుస్తుంది. ఈ నిర్మాణ అధ్యయనం వల్ల పిల్లలు లేదా శ్రోతల మనస్తత్వం తెలుసుకోవడం సాధ్యమౌతుంది. .

"పిల్లలు కథ వినేటప్పుడు ఏ ఏ వయస్సులున్న పిల్లలు ఏ ఏ కథాప్రకార్యాలపై మక్కువ చూపుతున్నారు. ఏ ప్రకార్యాల వద్ద నిరుత్సాహం చూపుతున్నారో తెలుసుకోవచ్చు. కథలో కథా

[49]సత్యనారాయణ, కె. వి. నెల్లూరు జిల్లా జానపద కథలు. పేజి నెం – 150

నాయకునికి ఒక మగ Donor సహాయం చేసేటప్పుడు ఆడ పిల్లలలో ఉత్సాహం ఉంది. స్త్రీ Donor సహాయం చేసేటప్పుడు మగ పిల్లల ఉత్సాహం ఎట్లా ఉంది. ఆయా సందర్భాలలో మిగతా పిల్లలు ఎలా ప్రతిస్పందిస్తున్నారు అన్న విషయాలను తెలుసుకొని పిల్లల మనస్తత్వాలను విశ్లేషించ వచ్చునని, ఇవి అన్ని క్షేత్ర పరిశోధనలో, ప్రయోగశాలలో జరగవలసినవి అని అలన్ డండస్ సూచించాడు"[50]

అనాగరికమైన మేధస్సు నుండి ఉద్భవించిన జానపద కథానిర్మాణ మందు ఒక క్రమవిధానం కలదని తెలుపుతూ రావి ప్రేమలత క్రింది ప్రయోజనాలను తెలిపారు.

1. "జానపద కథానిర్మాణ విశ్లేషణము, సాహిత్య స్వరూపమును గూర్చి నిర్దిష్టమైన ఉపపాదములను చేయుటకు దోహదమొనర్చును. అంతియే గాక ఈ పద్ధతి వలన కథాశాఖను విభజించుటకు వర్గీకరించుటకు సులభమగును.

2. వివిధ సంస్కృతులలోని కథానిర్మాణముల మధ్య గల సామ్య, విభేదములను నిర్మాణ విశ్లేషణ వలన కనుగొనవచ్చును.

3. ఒక జాతి జానపద విజ్ఞానములోని వివిధ శాఖల మధ్య గల సారూప్యములు, వైషమ్యములు స్పష్టమగును.

4. సాంస్కృతిక విషయములను, పరిణామములను అవగతం చేసుకొనుటకు విశ్లేషణా విధానము తోడ్పడును.

5. జానపదుని మనస్తత్వము, ఆలోచనాసరళి కథావిశ్లేషణ వలన ప్రస్ఫుటమగును"[51]

పై అభిప్రాయాల వల్ల జానపద కథా వస్తువు కంటే కథానిర్మాణాధ్యయనం ఎంతో ఉపయోగకరమైందని తెలుస్తుంది. నీతి కథలు, అద్భుత కథలు, సందేశాత్మక కథలు, హాస్యకథలు మొదలైన విభాగాలకు చెందిన కథలు ఆయా పాఠకులపై ఎంత ప్రభావితం చేశాయన్నది కథలో అంతర్గతంగా ఉన్న కథానిర్మాణం మీద ఆధారపడి ఉంటుంది.

---

[50]సుబ్బాచారి, పులికొండ. 1992. అద్భుత కథానిర్మాణం. హైదరాబాదు: ఆంధ్ర జానపద సాహిత్య పరిషత్. పే: 83

[51] ప్రేమలత, రావి. 1983. తెలుగు జానపద సాహిత్యం – పురాగాథలు. హైదరాబాదు: అవేర్స్ ప్రింటర్స్. పే - 66

## 5.2. జానపద కథానిర్మాణ పద్ధతులు

19 వ శతాబ్ది ప్రారంభంలోనే కథానిర్మాణ సిద్ధాంతాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. జానపద కథాసాహిత్య నిర్మాణ విశ్లేషణ రెండు విధాలుగా కొనసాగింది. అవి.

### 5.2.1 భిన్నకాలిక అధ్యయనం:

ఒక కథ కాలానుగుణంగా పొందిన క్రమ వికాసాలనూ, రూపాంతరాలనూ పరిశీలించే పద్ధతి. ఈ అధ్యయన విధానంలో రెండు విశ్లేషణ పద్ధతులు ప్రధానపాత్ర వహిస్తాయి.

అవి 1. కథారూపం (TYPE) 2. కథాంశం (MOTIF)

1. **కథారూపం:**

సంప్రదాయకత్వాన్ని పొందిన స్వయం సమర్థకమైన కథయే కథారూపం అని అంటారు. కథారూపం సరళంగా లేదా సంక్లిష్టంగా ఉండవచ్చు. ఈ పద్ధతి వల్ల ప్రపంచ కథలలోని పోలికలు చూడవచ్చు. కథారూపం పాఠాంతరాలు ఎట్లా ఉంటాయో సులభంగా అర్థం చేసుకోవడానికి దోహదపడుతుంది. ఒకే కథ వివిధ భాషల్లో, వివిధ సంస్కృతుల్లో ఏవిధంగా ఉందని అధ్యయనం చేయడానికి ఉపయోగపడే పద్ధతి. ఇది తులనాత్మక అధ్యయనానికి చెందింది. 1910లో ఆంటీఆర్నె 'INDEX OF TALE TYPES' అనే గ్రంథంలో కథారూప సూచి అనే గ్రంథాన్ని ప్రచురించాడు.

2. **కథాంశం:**

కథలో కనిష్ఠాంశమే కథాంశం అవుతుంది. ఇది కథాగమనానికి తోడ్పడే సాధనం. ప్రతి కథకు మూలాంశమే ప్రాణం. కథలో ముఖ్యంగా అసాధారణ సంఘటనలు, అతిమానుష శక్తి కలిగిన వ్యక్తులు, అద్భుతశక్తి కలిగిన వస్తువులు మూలాంశాలు అవుతాయి. సహజమైన అంశాలకు భిన్నంగా వ్యవహరించే అంశాలే కథలో కథాంశాలు అవుతాయి. ఈ రంగంలో స్టిత్ థాంప్సన్ విశేషమైన కృషి చేసాడు. ప్రపంచ కథల్లోని మూలాంశాల్ని సేకరించి 'MOTIFS OF FOLK LITERATURE' అనే గ్రంథాన్ని 1977లో ప్రచురించారు.

### 5.2.2 ఏకకాలిక అధ్యయనం:

నిర్దిష్ట కాలానికి సంబంధించిన జానపద కథలను కథానిర్మాణ దృష్టితో పరిశీలించడమే ఏకకాలిక అధ్యయనం. కథను వివరణాత్మక దృష్టితో పరిశీలించిన వారిలో ప్రథముడు పి. జె ప్రాప్. ఆ తరువాత లెవిస్ట్రాస్, అలన్ డెండస్, బ్రూమండ్, ప్రేటెగ్ ముఖ్యమైనవారు. పై పరిశోధకుల కథానిర్మాణ సిద్ధాంతాలను నాకు లభించిన కథలకు అన్వయించి వివరణాత్మక దృష్టితో విశ్లేషించాను.

## 5.3. జగిత్యాల జిల్లా జానపద కథలు – కథానిర్మాణ విశ్లేషణ

ఏ జానపద కథకైనా నిర్మాణం ఉంటుందనుకున్నాం. జానపద కథ చిన్నదైనా, పెద్దదైనా కథానిర్మాణం వల్ల అనేక విషయాలు తెలుస్తాయి. ఒక కథను ఆసాంతం అర్థం చేసుకోవడానికి కథానిర్మాణం ఎంతో దోహదపడుతుంది. జానపదుల మనస్తత్వము, ఆలోచనా సరళి, ఊహాశక్తి, కథాకథనం, కథ అల్లిక విధానం లాంటి అనేకానేక విషయాలు కథానిర్మాణ పద్ధతి వల్ల తెలుస్తాయి. అంతే కాకుండా ఒక కథ తాలుకు భావాలు మన మనసులో చిరకాలం నిలిచిపోవడానికి కూడా కథానిర్మాణం ప్రధానపాత్ర వహిస్తుంది.

పాశ్చాత్య సిద్ధాంతాలైన ప్రాప్, బ్రూమండ్, ఫేట్రేగ్, డెండస్ మొదలైన వారి సిద్ధాంతాలతో పాటు నాకున్న విశ్లేషణ సామర్థ్యంతో కొన్ని కథలకు అన్వయించి విశ్లేషించాను. జానపద కథానిర్మాణ సిద్ధాంత కర్తల్లో లెవిస్ట్రాస్ సిద్ధాంతాలను నా కథలకు ఎక్కువగా అన్వయించలేదు. దానికి గల కారణం లెవిస్ట్రాస్ నిర్మాణ సిద్ధాంతం పురాగాథలకు, జానపద గేయకథలకు, పొడుపుకథలకు అన్వయించేవి. పాశ్చాత్య కథానిర్మాణ సిద్ధాంతాలకు లొంగని తెలుగు జానపద కథలు చాలా కనిపించాయి. తెలుగు సంస్కృతుల ఆధారంగా నిర్మింపబడిన మన జానపద కథలకు తెలుగు కథానిర్మాణ విశ్లేషణ పద్ధతుల అవసరం ఎంతో ఉందని తెలుస్తుంది.

### 5.3.1 ప్రాప్ ప్రతిపాదించిన నిర్మాణ విశ్లేషణా పద్ధతి

ఆధునిక యుగంలో జానపద కథను నిర్మాణపరంగా విశ్లేషించిన వారిలో రష్యా దేశస్థుడైన వ్లాదిమిర్ ప్రాప్ మొదటివాడు. ఈయన జానపద కథపై విస్తృతమైన పరిశోధన చేసి "Morphology of the Folk tale" అనే పుస్తకాన్ని 1928లో ప్రచురించాడు. ఇతడు జానపద కథలలో ప్రవృత్తులే ప్రధానమని తెలిపాడు. ప్రాప్ రష్యాలో సేకరించిన 100 అద్భుత కథలను విశ్లేషించి, వాటి ఆధారంగా ఆ కథలో ఉన్న 32 ప్రవృత్తుల్ని గురించి వివరించారు. జానపద కథానిర్మాణానికి సంబంధించి ప్రాప్‌ను "Father of the Structuralism" అని అంటారు.

ప్రవృత్తి అంటే కథలో పాత్ర యొక్క చర్య అని అర్థం. కథలో పాత్రలు, వస్తువులు మారిన వాటి నిర్వహణ ప్రవృత్తులు మాత్రం మారవని ప్రాప్ అభిప్రాయం. ఆ ప్రవృత్తులే సమ్మేళనమే కథను సమర్థవంతంగా నిర్మిస్తుందని ప్రాప్ కథానిర్మాణ సిద్ధాంతం. ప్రతి ప్రవృత్తికి ఒక సంఖ్యను, అక్షరాన్ని సాంకేతిక గుర్తుగా నియమించాడు. కొన్ని కథల్లో కొన్ని ప్రవృత్తులుంటే మరికొన్ని కథల్లో మరికొన్ని ప్రవృత్తులు ఉంటాయని చెప్పాడు. ప్రాప్ చెప్పిన ప్రవృత్తులు ఒకే కథలో కనిపించాలన్న నియమం లేదు.

"ఈ పద్ధతిలో వ్యవహర్త చెప్పిన కథను యధాతథంగా తీసుకొని అందులో కథాంశాలను కథకు చెందిన వరుసను అదే క్రమానుగత శ్రేణిలో అడ్డుగీతలాగ తీసుకొని కథానిర్మాణాన్ని వర్ణిస్తారు. అంటే ఒక కథ మొత్తాన్ని ఒకే వాక్యంలాగ భావించి ఒక వాక్యంలోని సంశ్లిష్టాత్మక నిర్మాణాన్ని ఎలా వర్ణిస్తారో దీన్ని అలా వర్ణిస్తారు. కాబట్టి దీనిని 'Synatagmatic structure' అని అంటారు. ఈ పద్ధతిని భాషాశాస్త్రంలోని వాక్యాలను అధ్యయనం చేసే పద్ధతి నుండి గ్రహించారు"[52] ప్రాప్ చెప్పిన ప్రవృత్తులను కె.సుమతి తన పరిశోధన గ్రంథం 'తెలుగు జానపద కథలు'లో అనువదించారు. ఆ అనువాద పట్టిక ఆధారంగా చేసుకుని నేను సేకరించిన అద్భుత కథలకు అన్వయించాను.

ప్రాప్ కథానిర్మాణ విశ్లేషణ పద్ధతిని 'ఐదు మల్లెల పూల' కథకి అన్వయిస్తే క్రింది విధంగా ఉంటుంది.

1. ధర్మరాజు, కృష్ణలీల దంపతులకు ప్రారంభస్థితి x

[52] సుబ్బాచారి , పులికొండ పు 86..అద్భుత కథానిర్మాణం

బాలగిరి రాజు  పుట్టాడు.

2. ఆ కొడుక్కి వివాహం చేయాలని తల్లిదండ్రులు ఆశిస్తారు.    ఏదేని కావలయునను కాంక్ష a

3. తల్లిదండ్రులు నిర్ణయించిన
పెళ్లిని నిరాకరించి తానే వివాహం చేసుకుంటానని    ఒక్కొక్క మారు యువతరము వారు వారంతట
అందమైన ఆడబాల కోసం బయలుదేరుట    వారే ఇంటి నుండి దూరముగా పోయెదరు. $b^3$

4. అయిదు మల్లెల పూల
కన్న అరవిసం తక్కువ లేని వధువు కోసం బయలుదేరుట    & బయలుదేరుట

5. నాయకుడు ఒక చెట్టు కిందకు చేరుకొని విశ్రాంతి    దాత నాయకుని పరీక్షించుట $D^1$
తీసుకుంటే ముసలి వేషంలో శివుడు వచ్చి పరీక్షించడం.

6. మారువేషంలో వచ్చిన శివుని సహాయం పొంది    సహాయార్థియైన నాయకుడు కార్యోన్ముకుడు
చెట్టు నుండి బయలుదేరుట    అగును. $B^2$

7. ఏడంతస్తుల మేడలో మైబూతరాజు తన    ప్రతి నాయకుడు ఒకరిని చెరసాలలో బంధించడం$A^{15}$
కూతురు ముత్యాలదేవిని దాచి పెట్టడం.

8. కత్తుల మేడను దాటి, ముత్యాలదేవిని చేరిన వాళ్లకు ఆమెను ఇచ్చి
వివాహం చేస్తానని మైబూతరాజు పరీక్ష .    దురదృష్ట సంఘటనలు తెలుపబడును $B^4$

9. వధువును చేరడానికి కత్తుల మేడను    నిషేధింపబడిన విషయము నాయకునకు
ఎక్కుట    తెలుపబడును$Y^1$

10. నాయిక ఎంత చెప్పిన నాయకుడు వినకుండా    నిషేధాజ్ఞనుల్లఘించుట d

కత్తుల మేడను ఎక్కడం

11. కత్తులమేడ పై నుండి పడి నాయకుడు గాయపడి శారీరకముగ గాయపరచును A[6]
మరణించెను.

12. నాయకుని శరీర మాంసముద్దలను మూత్యాలదేవి
గంపలో వేసుకొని అడవికి తిరిగి వెళ్లి బయలుదేరుట &
మర్రి వృక్షం దగ్గరికి చేరుకుంటుంది.

13. అప్పుడు శివుడు మళ్లీ గొల్ల వేశంలో నాయకుని నాయకుడు విధించిన పరీక్షలలో నెగ్గను. E[1]
నాయకురాలిని పరిక్షీంచడం.

14. ముత్యాలదేవి నిజాయితీని మెచ్చి తన వధించిన వ్యక్తి తిరిగి బ్రతుకును K[9]
భర్త బాలగిరిరాజు మాంసముద్దలకు ప్రాణం పోయడం.


15. గొల్ల వేశంలో ఉన్న శివుడు ప్రత్యక్షమై నాయకుడు సాహస ఔదార్యములకు ప్రతిఫలముగా
బంగారు పాత్రను ప్రసాదించడం మంత్రశక్తి గల వస్తువు ఇవ్వబడును. D[10]

16. తిరిగి అత్తగారింటికి పయనమగుట @ తిరిగి బయలుదేరుట

17. తరాజులో వధువును జోకితే అయిదు మల్లె పూల ప్రాథమిక కొరత తీరుట K
కన్న అరవిసం తక్కువ లేకుండా సమానంగా
ఉంటుంది.

18. నాయకుడికి తల్లిదండ్రులు నుండి గుర్తింపు లభిస్తుంది. నాయకునకు గుర్తింపు Qనాయకుడు
19. బాలగిరిరాజు, ముత్యాలదేవిల వివాహం. వాగ్ధానము ప్రకారముగ వివాహము W[1]

1. ఐదు మల్లె పూవ్వుల కథ ఆధారంగా ప్రాప్ నిర్ధేశించిన ప్రవృత్తుల విశ్లేషణ




$$X\ a\ b^3\ \&\ D^1\ B^2\ A^{15}\ B^4\ y^1\ d\ A^6\ \&\ E^1\ k^9\ D^{10}\ @\ K\ Q\ W^1$$

2. ప్రాప్ సిద్ధాంత ప్రవృత్తులను ‘రాణి పగడాల పేరు’ కథకు అన్వయించినట్లయితే

1. రాజుకు ఏడుగురు కొడుకులు. ఆరుగురికి పెళ్లి అయింది.


చిన్నకొడుక్కి కాలేదు. ప్రారంభ స్థితి x

2. చిన్నవాడికి అతను కోరుకున్న వధువు దొరకదు. వధువు కొరత $a^1$

3. చిన్న కొడుక్కి వేశ్యతో సంబంధం ఉంటుంది. నాయకుడు చేయకూడని పనిని తెలుపును. Y

| | |
|---|---|
| 4. తల్లిదండ్రులు తెచ్చిన వధువు ఫోటో చూడకుండానే వేశ్య దగ్గరికి బయలుదేరడం | బయలుదేరుట & |
| 5. వధువు ఫోటో చూడకుండానే వేశ్య చెప్పింది విని పెళ్లికి నిరాకరించడం | ప్రతి నాయకుడు చెప్పిన మాట విని అతను చెప్పినదానికి ఒప్పుకొనుట $z^1$ |
| 6. తల్లిదండ్రులు కొడుక్కి తెలియకుండా కత్తికి, కటారుకి పెళ్లి చేసి కోడల్ని ఇంటికి తెచ్చుకుంటారు. నాయకుడు తిరిగి ఇంటికి వస్తాడు. | తిరిగి వచ్చుట@ |
| 7. చిన్న రాజు తన భార్య అందాన్ని చూసి ఆశ్చర్యపోతాడు. ఇక వేశ్య దగ్గరికి వెళ్ళకుండా భార్యతో సుఖంగా ఉంటాడు. | ప్రాథమిక కొరత తీర్చుటK |
| 8. ఆ వేశ్య కోయ మాంత్రికుడిని సంప్రదించి రాజు భార్యను చంపాలనుకుంటుంది. | మంత్రశక్తుల ద్వారా నేరుగా కార్యసాధనకు ప్రయత్నము చేయును $n^2$ |
| 9. మాంత్రికుడి సహాయంతో రాజు భార్య ఆత్మను ఒక హారంలో బంధించి తన ఇంట్లో కొయ్యకు తగిలిస్తుంది. | ప్రతినాయకుడు ఒకరిని చెరసాలలో బంధితునిగా చేయును$A^{15}$ |
| 10. చిన్నరాజు అందమైన తన భార్యను దహనం చేయకుండా ఊడల మర్రి ఊయ్యలలో పెట్టి సేవ చేస్తాడు. | నాయకుడు ఇతరములైన సేవలు చేయును$E^7$ |

| | |
|---|---|
| 11. రాజు భార్యను బతికించుకునే మార్గాన్ని దాసిల సహాయంతో తెలుసుకుంటాడు. | మంత్రశక్తి గల వస్తువు పొందడానికి కావలసిన ప్రయత్నము చేయునుF3 |
| 12. పగడాల హారం కోసం దాసిలను పంపించడం | బయలుదేరుట& |
| 13. కొయ్యకు తగిలేసిన హారానికి ఒకామె కావలి ఉంటుంది. ఆమెకు ఇష్టమైన పదార్థాన్ని అమ్మినట్లు చేసి కొయ్యకున్న హారాన్ని దాసిలు తీసుకువస్తారు. | ఆశించిన వస్తువును ఆశ చూపి సాధించెదరు K3 |
| 14. ఆ హారం మెడలో వేయగానే చిన్న రాజు భార్య మళ్లీ మాములు మనిషిగా అవుతుంది. | వధింపబడిన వ్యక్తి తిరిగి బ్రతుకునుK9 |
| 15. ఆ వేశ్య చిన్న రాజు భార్యకు తలపెట్టిన మోసాన్ని పెద్దరాజుకి చెప్పి శిక్ష పడేలా చేస్తారు. | ప్రతినాయకుడు శిక్షింపబడును U |




$$X\ a^1\ Y^1\ \&\ z^1\ @\ k\ n^2\ A^{15}\ E^7\ F^3\ \&\ K^3\ K^9\ U$$

## 5.3.2 లెవిస్ట్రాస్ కథానిర్మాణ సూత్రం

ప్రాప్ తర్వాత లెవిస్ట్రాస్ జానపద కథానిర్మాణ విశ్లేషణా విధానంలో కొత్త ప్రక్రియను ప్రవేశపెట్టినాడు. ఇతడు కథానిర్మాణ విధానాన్ని వివరణాత్మక దృష్టితో పరిశీలించాడు. కథారూపం, కథాంశం, కథలో ప్రవృత్తులు కథ ఏ విధంగా నిర్మితం అవుతుందో అవగతం అవుతుంది. కాని కథాకల్పనకు కారణం ఏమిటి? కథలోని అంతరార్థం ఏమిటి? అనే ప్రశ్నలకు లెవిస్ట్రాస్ ప్రతిపాదించిన నిర్మాణ విశ్లేషణా విధానం, సూత్రం సమాధానమిస్తాయి. ఈయన 1955లో "The structural study of myth" అనే పరిశోధన పత్రాన్ని రాసి జానపద పాశ్చాత్య మేధావుల్ని ఆలోచనలో పడవేశాడు. ప్రాప్ అద్భుత కథలను విశ్లేషిస్తే లెవిస్ట్రాస్ మానవ మనఃప్రవృత్తికి ఉదాహరణలైన పురాగాథల్ని విశ్లేషించారు. సమాజంలోనూ, మానవుని ఆలోచనలలోనూ రూపొందిన వ్యతిరేక శక్తుల మధ్య గల సంఘర్షణయే కథారచనకు ప్రేరణ అవుతుందని తెలిపాడు. కథలో ముఖ్యాంశాలను గుర్తించి,

వాటిలో వైరుధ్యాల ఆధారంగా ఒక సూత్రాన్ని నిర్మించాడు. అతని సూత్రం కష్టంగా ఉందని తరువాత వచ్చిన మరండస్ దాన్ని సులభంగా మార్చారు.

A : B : : C : D

ఈ సూత్రంలో ఒక్కొక్క అక్షరం కథలోని ఒక్కొక్క ముఖ్యాంశాన్ని సూచిస్తుంది. వాటినే 'మిథిమ్స్' (Mythems) అని పేర్కొన్నాడు. ఈ పద్ధతిలో కథను సాధ్యమైనంత వరకు చిన్న వాక్యాల్లో కుదించి రాయాలి. వీటిని క్రమపద్ధతిలో ఏక దిశలో అమర్చుకోవాలి. తర్వాత వీటిని ఎడమ నుంచి కుడికి చదవాలి. విశ్లేషణ మాత్రం పై నుండి కిందికి జరుగుతుంది. అనగా పరస్పర విరోధాంశాలు వ్యతిరేకాలు. అనుకూలాలుగా మారడం దీని ముఖ్య లక్షణం. ఈ పద్ధతి భాషాశాస్త్రంలో 'Paradigim' లను అధ్యయనం చేసే పద్ధతి నుండి గ్రహించారు. కనుక దీనిని 'ప్రాతిపదికాత్మక విశ్లేషణ' (Paradigmatic structure) అని అంటారు.

ప్రాప్ పద్ధతిలో విశ్లేషించే కథాంశాలను అడ్డువరుసలో పేర్చుకుంటూపోతే, లెవిస్ట్రాస్ పద్ధతిలో కథాంశాలను నిలువువరుసలో పేరుస్తారు. ప్రాప్ పద్ధతి కథా నిర్మాణానికి ప్రధానంగా పరిమితమైతే, లెవిస్ట్రాస్ పద్ధతి కథ అర్థాన్ని, తత్వాన్ని కనుగొనడానికి ప్రయత్నిస్తుంది. లెవిస్ట్రాస్ ప్రతిపాదించిన కథానిర్మాణ విశ్లేషణ పురగాథలు, గ్రామీణ దేవతలు, కులదేవతలకు సంబంధించిన కథలకు అన్వయించడానికి ఉపకరిస్తుంది. కాబట్టి లెవిస్ట్రాస్ కథా నిర్మాణ విశ్లేషణ పద్ధతిని జగిత్యాల జిల్లా జానపద కథలకు అన్వయించే ప్రయత్నం చేశాను.

చాకలి పుల్లక్క పాతివ్రత్యం కథకి అన్వయిస్తే ఎంత వరకు సరిపోతుందో చూద్దాం.

1. ఒక ఊరిలో చాకలి కులానికి చెందిన పుల్లక్కను ఆ ఊరి అధికారులు అనుభవించాలని చూస్తారు. ఒకరోజు రాత్రి పోలీసు అధికారి పుల్లక్క భర్త రామన్నను కావాలని పని మీద హైదరాబాదుకు పంపిస్తాడు. అదే అదునుగా భావించి అధికారులంతా ఆ రాత్రి చాకలి పుల్లక్క ఇంటికి వస్తారు.

2. చాకలి పుల్లక్క ఆ అధికారుల మనస్సులోని చెడు భావాలను ముందే గ్రహిస్తుంది. ఆ అధికారులను ఎదుర్కొని తప్పించుకోవడానికి వ్యూహం సిద్ధం చేసుకుంటుంది. తలారి రామన్నను, మంగళి కొండన్నను ఇద్దరి సహాయాన్ని తీసుకుని ఆ అధికారులను ఇంటి వెనుకలా బంధిస్తుంది.
3. పుల్లక్క భర్తలేనిది చూసి ఆ ఊరి అధికారులంతా ఒకరి తరువాత ఒకరు పుల్లక్క ఇంటికి చేరతారు. నిమ్న కులానికి చెందిన స్త్రీ అయిన పుల్లక్క తనను కాదన్నదన్న అహంకారంతో విర్రవీగుతారు.
4. పుల్లక్క పథకం ప్రకారం తన కోసం వచ్చిన ఆ అధికారులతో చాకచక్యంగా ప్రవర్తిస్తుంది. మంగళి సహాయంతో గుండు తీయించి, సున్నపు బొట్లు పెట్టిస్తుంది. తలారి రామన్నకు వేశం వేసి దేవర అన్న పేరు చెప్పి దయ్యం లాగా భయపడేటట్లు చేస్తుంది.

| 1 | : | 2 | :: | 3 | : | 4 |
|---|---|---|---|---|---|---|
| పురుష శక్తి, | | స్త్రీ శక్తి, | | అపజయం, | | విజయం |
| అధికార వర్గం | | నిమ్న వర్గం (వృత్తి పరంగా) | | అపహాస్యం | | పాతివ్రత్య నిరూపణ |

పై కథ లెవిస్ట్రాస్ నిర్మాణ ప్రకారం చూసినట్లయితే స్త్రీ, పురుష శక్తుల మధ్య వైరుధ్యం, అధికార వర్గం, అణిచివేయబడిన వర్గాల మధ్య సంఘర్షణనే ఆ కథా రచనకు కారణమని అనిపిస్తుంది. 1,3 సంఖ్యల్లో అధికారులు పురుషాంకారంతో పుల్లక్కని బలత్కరించాలని పన్నాగం పన్నుతారు. 2,4 లో చాకలి పుల్లక్క ఆ అధికారులను ఎదుర్కొని చాకచక్యంగా తప్పించుకోవడమే కాకుండా తన పాతివ్రత్యాన్ని నిరూపించుకుని భర్త రామన్న చేత ప్రశసించబడుతుంది.

### 5.3.3 అలన్ డెండస్ వివరించిన కథానిర్మాణ పద్ధతి

అలన్ డెండస్ ప్రాప్ విశ్లేషణనే కొనసాగిస్తూ 31 ప్రవృత్తులను 10 గా కుదించి వేశాడు. ఈయన తన గ్రంథమైన 'The Morphology of North American Indian Folktales' 1964లో ప్రచురించారు. డెండస్ నాలుగు మూలాంశాలను తెలిపాడు అవి:

1. లోటు (Lack)

2. మోసాన్ని ఉపయోగించడం (Deceit)

3. ప్రయోగం ఫలించడం (Deception)

4. లోటు తీరడం (Lack Liquidated) గా చెప్పాడు.

L –> LL, లోటు –> లోటు తీరుట

పై రెండు మూలాంశాలను ప్రధానంగా చెపుతూ నాలుగు సహమూలాంశాలను కూడ అలన్ డెండస్ తెలిపారు. ఆంక్ష (Lack), ఆంక్ష అతి క్రమణ (Violation), పర్యవసానము (Consequence), అవరోధములను తప్పించుకొను ప్రయత్నము (Attempted escape).

**'అన్న చెల్లె ప్రేమ' కథ చూసినట్లయితే**

1. ఒక అన్న, చెల్లి ఇద్దరుంటారు. వారికి పెళ్లిల్లు అయి అన్న కొంచెం ఉన్నతంగా, చెల్లెలు దీనంగా జీవనం సాగిస్తున్నారు. చెల్లెలు ఆపదలో ఉన్న తనని అన్న ఆదుకుంటాడని పుట్టింటికి వస్తుంది.

2. అన్న భార్య మాత్రం చెల్లె వచ్చినప్పుడు అన్న లేదని చెపుతుంది. పొలం దగ్గర అన్న ఉంటాడని తెలుసుకొని కొడుకును పట్టుకొని వెళ్లి కలుసుకుంటుంది. తన బాధంతా వివరిస్తుంది.

3. మరుసటి రోజు వదినె తన భర్తకేమో అన్ని రకాలు వంటలు చేసి పెడితే, మరదలకి రొచ్చు వాసనచ్చే మాంసాన్ని వండిపెడుతుంది. తన చెల్లెలికి అన్ని రకాల వంటలు మూట కట్టి పంపించమనంటే సంచిలో పెండ, గుడ్డపేగులు పెట్టి మూట కట్టి పంపిస్తుంది.

4. ఇవన్నీ అన్నకు తెలియవు. తెలిస్తే వాళ్ల సంసారం మధ్య చిచ్చులు పెట్టిందాన్నవుతనని తాను బాధతో తన ఇంటికి వెలుతుంది. గోదావరి నది దాటి వెళుతూ ఆకలైతుందని మూట విప్పితే అందులో తినడానికి ఏమి లేవు. కొడుకు ఆకలేస్తుంటే నేరేడు పండ్లు తినిపిస్తుంది. అదే చెట్టు క్రింద ఉన్న పాము పుట్ట నుంచి వెళుతుంది. ఆ పామును చంపి వండుకొని, తిని చస్తానని నిర్ణయించుకుంటుంది.

5. ఇంటికి వెళ్లేసరికి ఆ పాము బంగారు ముద్దలాగా తయారవుతుంది. వాళ్ల పేదరికం పోయి ఉన్నతంగా బతుకుతారు.

6. కొత్త ఇల్లు కట్టుకొని అన్న, వదినెలను గృహప్రవేశానికి పిలవడానికి వెలుతుంది. తన మరదలు ఉన్నతంగా బతకడం చూడలేని వదినె అన్న మరదలు గురించి తప్పు చెప్పి నిందలు మోపుతుంది.

7. అన్న కోపంతో చెల్లె ఇంటికి వెళ్లేసరికి అక్కడ దీపంతో తాను అన్న ఇంటికి పోయినది మొదలు తన శ్రీమంతురాలుగా ఏలా అయ్యిందో చెప్పుకుంటుంది. చెల్లె ఇల్లు చేరిన అన్న అదంతా విని తన భార్య చేసిన తప్పును గ్రహిస్తాడు. (దీపమా.. దీపమా.. మా అన్న ఇంటికివోయిన)

8. అన్న తన ఇంటికి వెళ్లి భార్యకు వాళ్ల పుట్టింటి వారంతా ఇబ్బంది పడతున్నారని, కరువు కాటకాలతో బాధపడుతున్నారని అబద్ధం చెబుతాడు. ఎడ్ల బండెడు సామానులు కట్టించి చెల్లెకు ఇచ్చి వస్తాడు.

9. తన భార్యకు ఎలాగైనా బుద్ధి చెప్పాలని వాళ్ల పుట్టింటి వారంతా జంతువుల మల మూత్రాలమ్ముకొని బ్రతుకుతున్నారని చెప్తాడు. తన వాళ్లకు సహాయం చేయడానికి పోయిన ఈమెను చూసి నవ్వుతారు. అబద్ధం చెప్పిన భార్యకు భర్త తగిన బుద్ధి చెపుతాడు.

| | | |
|---|---|---|
| 1. **లోటు** (Lack) | చెల్లె పేదరికంతో బాధ పడలేక ఆర్థిక సహాయం కోసం అన్నయ్య దగ్గరికి వస్తుంది. | చెల్లెలి ఆర్థిక ఎదుగుదలకు ఓర్చుకోలేని వదిన ఈర్ష్యతో మరదలుపై నిందలు మోపుతుంది. |
| 2. **మోసాన్ని ప్రయోగించడం** (Deceit) | మరదలకు ఆర్థికసహాయం చేయడం ఇష్టం లేని వదిన చెల్లెలికి వ్యర్థ పదార్థాలను సద్ది మూటగా కట్టి అన్న చెప్పిన మాట వినకుండా మోసం చేస్తుంది. | అన్నకి తన చెల్లెలు తప్పు చేసిందని నిందలు మోపి మందలించడానికి తన భర్తను ఉసిగొల్పుతుంది. అన్న అపార్థం చేసుకొని చెల్లెల్ని దండించడానికి బయలుదేరతాడు. |
| 3. **ప్రయోగం ఫలించడం** (Deception) | చెల్లెలు బాధపడి ఆత్మహత్య ప్రయత్నం చేసుకుంటుంది. కాని ఆమె చనిపోవడానికి తెచ్చిన పాముల కూర బంగారు కడ్డీలుగా మారతాయి. | చెల్లె తన బాధలను ఇంట్లోని దీపానికి చెప్పుకుంటుంది. అదే సమయంలో చెల్లెలి ఇంటికి చేరిన అన్న తన భార్య చేసిన తప్పులను గ్రహించి బాధపడతాడు. |
| 4. **లోటు తీరడం** (Lack Liquidated) | చెల్లెలు ఆ బంగారు కడ్డీలను అమ్ముకొని తన కష్టాలను తీర్చు కుంటుంది. ఆర్థికంగా బలపడుతుంది. ఆ విషయం అన్నవదినెలకు తెలియజేస్తుంది. | అన్న తన భార్య దగ్గరికి వెళ్లి తన పుట్టింటివారికి బాగాలేదని చెప్పి ధనధాన్యాలు మూట కట్టి చెల్లెలికి కానుకగా ఇచ్చి రావడం. వదినను శిక్షిస్తాడు. |

## కానుగపట్నం కథను చూసినట్లయితే

1. ఒక కోమటి దంపతులు ఉంటారు. కోమటి భార్య అందంగా ఉంటుంది. కోమటి వాడు అమాయకుడు, తెలివి తక్కువవాడు. కోమటి ఇంటి ప్రక్కన ఉన్న వెలమయినా కోమటి భార్యపై కన్నేసి ఉంచుతాడు. అతనికి డబ్బు మీద పిచ్చి ఉందని తెలుసుకుని నా ఇంట్లో దేని మీద చేయి వేస్తే అది నీది అంటాడు. తరువాత నేను నీ ఇంట్లో దేని మీద చేయి వేస్తే అది నాది అంటాడు. కోమటికి డబ్బు మీద ఉన్న పిచ్చి వల్ల డబ్బులున్న సంచి మీద చేయి వేసి తెచ్చుకుంటాడు. మరుసటి రోజున వెలమయినా అవకాశం కోసం చూస్తాడు.
2. ఈలోగా భార్య వెలమ దొర మనస్సులో చెడు భావనను అర్థం చేసుకుని దంపతులు ఇద్దరు కలిసి కానుగ పట్నం ఊరికి బతకడానికి వెళతారు. ఆ ఊరి రాజు మంచి పరిపాలన చేస్తూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునే స్వభావం కలవాడని తెలిసి అతని దగ్గరికి బయలుదేరతారు.
3. కానుగపట్నం చేరిన కోమటి ఏదైనా వ్యాపారం చేయాలనుకుని గుర్రాన్ని అమ్ముదామని చెప్పి ఒక కటిక వ్యక్తితో బ్యారం చేస్తాడు. కటికవాడు బలవంతంగా డబ్బులు ఇచ్చి గుర్రం మీద ఉన్న తన భార్యను కూడా తీసుకెళతాడు. ఆ సందర్భంలో కానుగ పట్నం రాజు వచ్చి కాపాడుతాడు.
4. కానుగ పట్నంలో దొంగ లెక్కలు రాసే ఒక వ్యాపారి దగ్గరికి పోయి అక్కడ వారి చేతుల్లో ఇరుక్కుని పోతాడు. అప్పుడు మళ్లీ కానుగపట్నం రాజు వచ్చి కాపాడుతాడు.
5. కోమటి తెలివి తక్కువ తనాన్ని అర్థం చేసుకుని కోమటికి వెలమయినతో ఉన్న గొడవ గురించి తెలుస్తుంది. ఆ విషయంలో కూడా కానుగ పట్నం రాజు సహాయం చేసి వెలమ దొరకు బుద్ధి వచ్చేలా చేస్తాడు.
6. కోమటికి ఏదొక సమస్య వచ్చిపడటం దాన్ని తీర్చడానికి కానుగ పట్నం రాజు వచ్చి రక్షించడం. ఇలా కానుగ పట్నం రాజు కోమటిని మూడు సందర్భాల్లో రక్షిస్తాడు. కోమటి కుటుంబానికి ఏదొక లోటు ఏర్పడటం దాన్ని కానుగ పట్నం తీర్చడం ఈ కథంతా ఇలానే సాగుతుంది.

| | | | |
|---|---|---|---|
| 1. లోటు (Lack) | వెలమ దొర కోమటికి డబ్బు ఆశ చూపి కోమటి భార్యను పొందాలనుకుంటాడు. కోమటిని డబ్బు సంచి మీద చేయి వేసేలా | అమాయకుడైన కోమటి భార్యకు, గుర్రానికి ఒకే ధర పెట్టి గుర్రం మీద కూర్చున్న కోమటి భార్యను కటికవాడు బలవంతంగా తీసుకెళతాడు. | కోమటి వాడు కానుగ పట్నంలో ఒక దొంగలెక్కల వ్యాపారి దగ్గరికి పోయి మాట్లాడితే వాళ్లు కోమటి పేరు మీద దొంగ లెక్కలు రాసి మోసం చేస్తారు. |
| 2. మోసాన్ని ప్రయోగించడం (Deceit) | వెలమ దొర దురాశను గ్రహించని కోమటి వెలమ దొర ఇంటికి వెళ్లి డబ్బులు ఉన్న సంచిని తెచ్చుకుంటాడు. | కానుగపట్నం రాజు వచ్చి కటిక వాడిని నాకు నీ తలకాయ కావాలని అడుగుతాడు. కటికవాడు గొర్రె తలకాయ అనుకుంటాడు | మళ్లీ కానుగ పట్నం రాజు వచ్చి కోమటి మీకు ఇచ్చే డబ్బులిస్తాడు గని అతనికి పోయవల్సిన నూనె అతనికి పోయండని చెప్తాడు. |
| 3.ప్రయోగం ఫలించడం (Deception) | కానుగ పట్నం రాజు కోమటి ఇంటి మెట్లు తీయించి దానికి నిచ్చెన వేసి కోమటి భార్యను అందంగా తయారు చేసి మిద్దె మీద నిల్చో బెడతాడు. | కానుగ పట్నం రాజు మరుసటి రోజున వచ్చి నీ తలకాయ కావాలి. గొర్రె తలకాయ కాదని వాదిస్తాడు. అప్పుడు కటిక వాడు తప్పు అయిందని రాజుని క్షమించమని అంటాడు. | ఆ దొంగ లెక్కల వ్యాపారి కోమటికి పోసే నూనెను కానుగ పట్నం రాజు తెచ్చిన గానుగులో పోస్తే ఆ పాత్ర ఎంతకు నిండదు. కానుగ పట్నం రాజును తమ తప్పు క్షమించమని ఆ వ్యాపారి అడుగుతాడు. |

| | | | |
|---|---|---|---|
| **4. లోటు తీరడం (Lack Liquidated)** | వెలమ దొరని నిచ్చెన మీద చేయి వేసేలా చేసి కోమటి భార్యను వెలమ దొర నుంచి కాపాడాడు | కానుగ పట్నం రాజు కటికవాడికి బుద్ధి చెప్పి కోమటి భార్యను కోమటి దగ్గరకు చేర్చుతాడు. | కోమటిని మోసం చేయాలనుకున్న దొంగ లెక్కల వ్యాపారి నుంచి రాజు కాపాడి ఇంటికి తీసుకువస్తాడు. |

## 5.3.4 క్లాడ్ బ్రూమండ్ నైతిక నమూనా

Claude Bremond బ్రూమండ్ ఫ్రెంచి దేశస్థుడు. ప్రాప్, డండస్‌లు కథానిర్మాణంపై చేసిన పరిశోధనలను జోడించి ఈయన ఒక విశిష్టమైన పద్ధతిని తయారుచేశాడు. ప్రాప్ చెప్పిన 31 ప్రవృత్తులను డండస్ 10కి తగ్గించగా, బ్రూమండ్ 3 జంటలుగా చేసి ఆరింటికి తగ్గించాడు. అవి:

1. క్షీణ దశ (Deterioration) – పెంపుదల (Improvement)
2. యోగ్యత (Merit) – బహుమతి(reward)
3. అయోగ్యత (Unwothiness) – శిక్ష (Punishment)

దీనిని 'Ethical Model' అని అంటారు.

'అక్కెమ్మ కథ' అన్వయించినట్లయితే

1. కడగొట్ట రామన్న అక్కెమ్మను భార్యగా స్వీకరించకుండా కొన్ని ఆంక్షలు పెట్టడం – క్షీణ దశ
2. అక్కెమ్మ తన కాళ్ల మీద తాను నిలబడి నిరూపించుకోవడానికి పుట్టింటికి వెళ్లడం – పెంపుదల
3. అక్కెమ్మ పోయే దారిలో దీపాల గుడి ఉంటుంది. ఆ దీపాలు చెప్పుకుంటున్న విషయం వింటుంది. ఆ ఊరి రాజుకి రాచపుండు తగ్గించడానికి కావలిసిన మందుని సంపాదిస్తుంది. – యోగ్యత
4. రాజు వీపు మీద ఉన్న రాచపుండుకు మందు పెట్టి రాజుకు ఉపశమనాన్ని కల్గిస్తుంది. అక్కెమ్మ చేసిన సహాయానికి రాజు అక్కెమ్మ కొరుకున్న రాజ్యాన్ని, ప్రాంతాన్ని – బహుమానంగా ఇస్తాడు.

5. అక్కెమ్మ భర్త దురదృష్టవశాత్తు తన ఆస్తిపాస్తులని అమ్ముకొని ఇంటిల్లిపాది రోడ్డున పడతారు. – అయోగ్యత

6. అక్కెమ్మ తన భర్త రామన్న పెట్టిన ఆంక్షలన్నింటిని భర్తకు రుచి చూపించి, గతాన్ని గుర్తుచేస్తుంది. – శిక్ష

'దైవానుగ్రహం' అనే కథను చూసినట్లయితే

1. ఒక రాజు తన మాటను కాదన్నదని చెప్పి నలుగురు కూతుళ్లలో చిన్న కూతురుని కుష్టు వ్యాధి ఉన్న వ్యక్తితో వివాహం చేస్తాడు. – క్షీణత
2. ఆ రాకుమార్తె ఆ కుష్టు వ్యాధిగ్రస్తుడితో సంసారం చేయడానికి అంగీకరిస్తుంది. అదే దైవానుగ్రహంగా భావించి బాధపడుతుంది. – పెరుగుదల
3. రాకుమార్తె తన భర్త కుష్టు రోగంతో సంసారం చేయడం నలుగురిలో చిన్నతనంగా భావిస్తుంది. ఒక రోజు భర్తతో కలిసి గోదావరిలో పడి ఆత్మహత్య చేసుకుంటుంది. అప్పుడు కుష్టు రోగి భర్త మామూలు మనిషిగా మారతాడు. – యోగ్యత
4. అప్పుడు రాకుమార్తె భర్త గోదావరిలో దూకగానే కుష్టు వ్యాధి పోయి సుందరమైన రూపాన్ని పొందుతాడు. అది దైవానుగ్రహంగా భావించి శివపార్వతులు దగ్గరికి వెళ్లి నలుగురు నిలదీసినప్పుడు వచ్చి కాపాడమని వేడుకుంటుంది. – బహుమానం
5. రాకుమార్తె మంచిగా మారిన తన భర్తను తీస్కోని ఒక పెళ్లికి వెళుతుంది. అక్కడ తన ముగ్గురు అక్కలు కలిసి కుష్టు వ్యాధిగ్రస్తుడైన భర్తను వదిలి ఇంకొకడిని తెచ్చుకుందని హేళన చేస్తారు. – అయోగ్యత
6. రాకుమార్తె బాధపడి మళ్లీ గోదావరిలో దూకడానికి వెళుతుండగా శివపార్వతులు, ఆకాశం, భూమి ఏకమై రాకుమార్తె ఎలాంటి తప్పు చేయలేదని చెప్తారు. రాకుమార్తెను హేళన చేసిన అక్కయ్యలందరికి పేదరికం వచ్చి దుర్భలమైన జీవితాలను గడుపుతారు. – శిక్ష

'దైవానుగ్రహం' అనే కథ బ్రూమాండ్ నైతిక నమునాకు పూర్తిగా కాకపోయినా కొంతవరకైనా అన్వయించగలిగే విధంగా ఉందని అనిపిస్తుంది.

### 5.3.5 ఫ్రేటెగ్ ఇతివృత్త ఆధార నమూనా

ఆధునిక శాస్త్రవేత్త ఫ్రేటెగ్ (Freytag) ఫ్రెంచి దేశస్థుడు. నాటకాల్లో ఇతివృత్తంపై పరిశోధన చేశాడు. ప్లాట్‌లుగా వర్గీకరించి కథల్ని Tragedy, Romantic, Comedy, Tragic లుగా విభజించాడు. ఈయన కథను ప్రారంభస్థితి, వృద్ధి, ఉచ్ఛస్థితి, చరమస్థితి, సమాప్తస్థితి అని 5 దశలుగా పేర్కొన్నాడు.

'అత్త కాల విషం' కథకి అన్వయించినట్లయితే

1. ఒక రైతు తన కూతురికి పెళ్లి చేసి అత్తగారింటికి పంపిస్తాడు. కొద్ది రోజుల తర్వాత కూతురు గర్భం దాలుస్తుంది. పుట్టింటికి తీసుకురావడానికి వెళతాడు.


2. కూతురి అత్త ఏడవ నెలలో తీసుకెళ్లమని చెప్తుంది. అత్త కోడలికి చేపల మాంసం ఇష్టమని చెప్పి చచ్చిన పామును వండి పెడుతుంది. అది తిని కోడలు చనిపోతుంది.

3. కోడలు శవాన్ని ఎవ్వరికి అనుమానం రాకుండా ఉండేందుకు నడి బజారు సర్కిల్‌లో పాతి పెడుతుంది. కొద్ది రోజుల తర్వాత అక్కడ ఒక మల్లె చెట్టు పెరుగుతుంది.

4. ఇక ఏడవ నెల గర్భవతిగా ఉన్న తన కూతురిని తీసుకురావాలని తన పుట్టింటి వారంతా వస్తారు. వచ్చే దారిలో నడిబజారులో పూల చెట్టుకు పూలు తెంపుదామని వెళ్లిన కుటుంబ సభ్యులందరికి కోడలు పాత్ర తన గోడుని గేయరూపంలో వినిపిస్తుంది. (ముట్టకు ముట్టకు ఓ తమ్ముడా.. ముట్టిన చేతులు ముత్యాలు పట్టిన చేతులు పగడాలు)

5. రైతు తన కూతురికి జరిగిన అన్యాయం గురించి తెలిసి సర్పంచ్‌తో పంచాయితీ పెట్టిస్తాడు. మల్లె పూల చెట్టు కింద తవ్విస్తే తన కూతురి శవం బయట పడుతుంది.

6. ఇంతటి పాపానికి ఒడి కట్టిన అత్తకు గుండు కొట్టించి ఊరంతా తిప్పుతారు. అత్త చేసిన తప్పుకు పెద్ద మనుషులు తగిన శిక్ష వేస్తారు.




కథానిర్మాణం – రేఖాచిత్రం (Interest Curve)

1,2 . ప్రారంభ స్థితి (1వ నిమిషం)

3,4 . వృద్ధి స్థితి (3-4ల నిమిషాల మధ్య)

5,6 . ఉచ్ఛస్థితి (6వ నిమిషం)

7. చరమ స్థితి (8వ నిమిషం)

8. సమాప్త స్థితి(9వ నిమిషం)

**సావుకారి కోడలు చతురత కథని చూసినట్లయితే**

1. ఒక సావుకారికి ముగ్గురు కోడల్లు. కోడలు గోదావరి స్నానం చేసుకొని దొర కచ్చేరు ముందు నుంచే వెళ్లాలి. చిన్న కోడలు కొంత ఆలస్యంగా వెళుతుంది. సరదాగా సావుకారి కోడల్ని ఆట పట్టించాలని దొర అనుకున్నాడు. కాని సావుకారి గడుసరి కోడలే దొరనే నవ్వులపాలు చేస్తుంది.

2. (వెంట్రుకలు కూర్చుండి ముడిసుకుంటవ, నిలుసోని ముడుసుకుంటవ) దొరంటే, కోడలు సమాధానంగా (నిన్ను కట్టేసేరా, నువ్వే కట్టెసుకున్నవ! ఎవ్వరైన కట్టెసి(ర!) అని అంటుంది.

3. రాజుకి జరిగిన అవమానానికి తాళలేక నాకే సమాధానం చెప్తుందా? అని ఎలాగైనా దాన్ని చెరపట్టాలని అనుకుంటాడు. సావుకారి కోడల్ని ఎలాగైనా తన ఇంటికి రప్పించాలని మరుసటి రోజన ఊరంతా భోజనం పెట్టిస్తాడు. కాని ఆమె రాకుండా ఇంటి దగ్గరే ఉంటుంది. మరుసటి రోజున ఊరు వాళ్లందరు రావాలని అంటాడు రాజు. ఒకవేళ రాజు ఇంటికి భోజనానికి రాకపోతే దండుగ వేస్తానని బెదిరిస్తాడు.

4. ఇక రాజు (దొర) ఇంటికి వెళ్లేది తప్పేలా లేదని, దొరకి ఎలాగైనా బుద్ధి చెప్పాలని అనుకొని షావుకారి కోడలు బయలుదేరుతుంది. భోజనం చేసిన ఇంటికి వెళ్లే సమయంలో దొర తల్లి సావుకారి కోడలి చేతి పట్టుకొని చీకటి అయ్యేవరకు ఏడుస్తూ, ఆ రాత్రి అక్కడే ఉండేలా చేస్తుంది. ఒక గదిలోకి పంపించి ఉంచుతుంది.


5. దొర సావుకారి కోడలిని లోబరుచుకోవడానికి సరైన సమయం అని గదికి వెళ్తే, సావుకారి కోడలు తన మెడలో పుస్తేలు మంగళసూత్రానికున్న నల్ల పూసల తాడుని తెంపి కుచ్చుతుంది. దొరకి నిష వచ్చే విధంగా తమలాపాకు కలిపిస్తుంది. అది తిని రాజుకు మత్తు వచ్చి ఆ రాత్రి పడుకుంటాడు.

6. తెల్లవారుజామున సావుకారి కోడలు తన ఇంటికి చేరుతుంది. దొర తల్లి వచ్చి చూసేవరకల్లా రాజు చాతీలో గంధము, పసుపు రాసి ఉంటుంది. (సావుకారి కోడలు ఎడమ కాలితో తన్నితే ఆమె కాలుకున్న గంధం రాజు ఛాతీకి అంటుకొని ఉంటుంది. సావుకారి కోడలితో దొర తన్నించుకునేంత పనైంది)

7. దొర తనకు జరిగిన అవమానానికి అందరిని కచ్చీరుకి పిలిచి సావుకారి కోడలుకు శిక్ష వేయించాలనుకుంటాడు. కాని సావుకారి కోడలు తన సమయస్ఫూర్తితో పొడుపు కథని చెప్పి తన తప్పేమి లేదని రాజు చేతకానితనాన్ని బట్టబయలు చేస్తుంది.

8. (గడ్క తినే నీ గాడిది, గది తినకపోవడం కారణం ఏంది) అని రాజు అడిగితే, దానికి మరొ పొడుపు కథ వేసి (పండి పండని మామిడి పండు వుండి, పండకపోవడం కారణమేమిటి) సమాధానం

చెప్పమంటుంది. సమాధానం ఎవ్వరు చెప్పలేక తానే పొడుపు కథ అర్థం విప్పి వివరిస్తూ, దొర ప్రకటించిన బహూమానాన్ని తీసుకుంటుంది. అలా తన తెలివితేటలతో తనను దొర నుండి రక్షించుకోవడమే కాకుండా, సావుకారి కోడలి చేతిలో దొర మూడు సార్లు ఘోర అవమానాన్ని చవిచూస్తాడు.




కథానిర్మాణం – రేఖాచిత్రం (Interest Curve)

1,2 . ప్రారంభ స్థితి (1:30)

3,4 . వృద్ధి స్థితి (2:50 – 3:25)

5,6 . ఉచ్ఛస్థితి (6:30 – 7:18)

7. చరమ స్థితి (10:00 – 10:30)

8. సమాప్త స్థితి (11:41)

తోటి కోడళ్ల అత్యాశ అనే కథ చూసినట్లయితే క్రింది విధంగా కనిపిస్తుంది.

1. ఇద్దరు అన్నదమ్ములు. వాళ్లకు భార్యలు. వారు వ్యాపారం చేస్తుంటారు. ముందుగా కొనుక్కచ్చిన నువ్వులను భవిష్యత్తులో అమ్మడానికి గుమ్మిలో పోసి పోతారు.


2. చిన్నామె నువ్వులన్ని వేయించుకొని తిన్నానని చెప్పేసరికి పెద్దామె కూడా తానెందుకు తినకూడదని చెప్పి నువ్వులన్ని రోజు పెనం మీద వేయించుకొని తింటుంది.

3. చిన్నామె తనతో అబద్ధమాడిందని గ్రహించుకోదు. కొద్ది రోజుల తర్వాత వ్యాపారం చేయడానికి వాళ్ల భర్తలు వచ్చి, నువ్వులు తీసుకెళ్లి అమ్ముకోవాలని అనుకుంటారు. చిన్నామె ఇంట్లో గుమ్మినిండా నువ్వులు అలాగే ఉంటాయి. పెద్దామె ఇంట్లో గుమ్మిలో నువ్వులు ఉండవు. పెద్దామెను భర్త బాగా కొట్టి ఇంట్లో నుంచి పంపిస్తాడు.

4. పెద్దామె ఇంట్లో నుంచి వెళ్లి కాళికమాత ఆలయంలో ఉంటుంది. అదే సమయంలో అక్కడికి గజ దొంగలు ఎక్కడి నుంచో దోచుకొని వచ్చిన ధనాన్ని అమ్మవారికి సగం కానుకగా ఇచ్చి వెళతారు. ఆ ధనాన్ని తీసుకొని వచ్చి భర్తకు ఇస్తుంది. బంగారం ఎంత ఉందో కొలవడానికి చిన్నామె దగ్గరికి వెళ్లి కొలతకు మానిక తీసుకొస్తుంది.

5. కొలత మానికకు అంటుకున్న బంగారు నాణేన్ని చూసి చిన్నామె విషయం తెలుసుకొని తాను కూడా తన భర్తచేత దెబ్బలు తిని, ఆ రాత్రి కాళికమాత ఆలయానికి చేరుకుంటుంది.

6. ఆ దేవాలయానికి వచ్చిన దొంగలు దేవతకిచ్చిన మా ధనాన్ని ప్రతిసారి చిన్నకోడలే తీసి ఉంటుందని, ముక్కు కోసి పంపిస్తారు. భర్త దగ్గరకచ్చి ఏడిస్తే, భర్త ముక్కు మంచిగ చేయిస్తాడు.




కథానిర్మాణం – రేఖాచిత్రం (Interest Curve)

1,2 . ప్రారంభ స్థితి (1:30 - 2:30)

3. వృద్ధి స్థితి (3:00)

4. ఉచ్ఛస్థితి (6:20 – 6:50)

5. చరమ స్థితి (7:00 – 8:40)

6. సమాప్త స్థితి (9:35)

## 5. 4 జానపద కథలు – కథాప్రారంభం

జానపద కథా ప్రారంభమనేది సాధారణంగా 'అనగ అనగ ఒక రాజు' 'రాజుకు కొడుకులు', 'రాజుకు కూతురులు' అనే వాక్యంతో మొదలవుతాయి. జగిత్యాల జిల్లా జానపద కథల్లో కూడా చాలా వరకు పై వాక్యాలతోనే కథలు ప్రారంభమవుతాయి. కొన్ని కథల్లో కథాఎత్తుగడ భిన్నంగా ఉంటుంది. అవి కింది విధంగా ఉంటాయి.

1. కొన్ని కథల్లో కులాలు, ఆయా కుల వృత్తి పనుల గురించి ప్రస్తావిస్తూ కథ ఆరంభించడం కనిపిస్తుంది.

'చాకలి పుల్లక్క పాతివ్రత్యం' అనే కథలో "ఈ ఆరపెల్లి అసొంటి ఊళ్లే ఒక సాకలి పుల్లక్క. సాకలి రామన్న ఇద్దరు ఉండేది. వాళ్లు పోతే బట్టలు పట్టుకుని గంగకే పోవాలి. ఉతుక్కొని ఇంటికే రావాలి." ఈవిధంగా చాకలి వృతి పని గురించి చెబుతూ కథా ప్రారంభం అవుతుంది.

'అక్కెమ్మల' కథలో "ఒక కాపోల్ల అక్కెమ్మ, ఒక కోమటోళ్ల అక్కెమ్మ, బావనోళ్ల అక్కెమ్మ. వీళ్లు ముగ్గురు అడ్లు దంచుకుంట ఉంటరు" మూడు విభిన్న సామాజిక వర్గాల స్త్రీలు కలిసి చేసే పనితో ప్రారంభమవుతుంది.

'అత్తకాల విషం' కథలో 'ఒక రైతు. రైతుకు ముగ్గురు పిలగండ్లు అయితే ఆల్ల పిల్లగండ్లకు పెండ్లి చూపులకత్తరు. ఇగ పెండ్లి జేత్తరు' ఈ కథలో రైతుల సంతానంతో కథా ప్రారంభం అవుతుంది.

'రాజి కథ'లో "ఆమె భర్త గొర్లు కాస్తాడు. రోజు పోద్దున పదిగంటలకు వోయి సాయంత్రం ఏడు గంటలకు అస్తడు. అట్ల అచ్చేసరికి ఈమె ఎంది మంచిగ' అని గొల్లవారి కుల వృత్తితో కథ ప్రారంభమవుతుంది.

'తోడి కోడలు అత్యాశ' కథలో 'ఇద్దరు అన్నదమ్ములు. ఇద్దరు కోమట్లు, అయితే అన్నదమ్ములు వేపారం జేత్తరు. వేపారం చేసోటల్లయితే ఆల్లు ఏ జేత్తరు గద?' ఇలా కథలో ఎత్తుగడ ప్రశ్నార్థకంతో ప్రారంభమైనప్పుడు కథ పట్ల శ్రోతలకు కొంత ఆసక్తిని, కుతుహలాన్ని రేకెత్తిస్తాయి.

2. కొన్ని కథల్లో జానపద కుటుంబాల్లోని లోటును చూపిస్తూ కథ ఎత్తుగడ ప్రారంభమవుతుంది. సంతానం లేని దంపతులు పడే పాట్లు, వారు సంతానం కోసం చేసే పూజలను వర్ణిస్తూ కథ ఆరంభం ఉంటుంది.

'సత్యవతి' అనే కథలో "అలనాటి కాలమందు ఆ తల్లి సత్యవతి, ఆ సత్యవతి ఏం చేసింది. ఆ ధర్మంగరాజు, ధర్మవతి ఆల్లకు లేకలేక పుత్ర సంతానం లేక కొన్ని వేలు ఖర్చుబెట్టి, ఎదురైన గుండకు, కుదురైన బండకు కొటొక్క మొక్కులు మొక్కుతుంది"

'బూడిదగిరి పట్నం' అనే కథలో "ఒక ముసలమ్మ, ముసలాయన ఉంటరు. 'ఆళ్లకు చాలా రోజులకు సంతానమయితది. సంతానమయి ఒకటే బిడ్డ పుడతది"

'ఐదు మల్లె పూల కథలో "తల్లి కృష్ణ లీల, తండ్రి ధర్మరాజు, కొడుకు బాలగిరి రాజు ఆ కొడుకుకు కోటి కోటి మొక్కులు మొక్కంగ పుట్టిన కొడుకును మొక్కి మొక్కి కొటి తపసులు పట్టి మొక్కరాని మొక్కులు, నోమరాని నోములు పట్ట రాని తపసులు పట్టి"

పై వాక్యాల్లో సంతానలేమి కొరతను తప్పించుకోవడానికి వాళ్లు పడ్డ తిప్పలను కథకురాలు బాగా వర్ణించారు. ఆ ఒక్క కొడుకు ఏం చేసాడో? అన్న సందేహమచ్చి శ్రోతకి కథ ఆసాంతం తెలుసుకోవాలనే కోరిక పుడుతుంది.

3. కొన్ని కథల్లో సామాజిక హోదా, ఆర్థిక పరిస్థితులను తెలుపుతూ కథ అనేది ప్రారంభమవుతుంది.

'అక్కెమ్మ' కథలో "పేదరాసి పెద్దమ్మకు ఏడుగురు కొడుకులు. ఆ కొడుకులందరికి పెళ్లిల్లు చేస్తుంది. పెద్దమ్మకు ఆస్తులు, భూములు ఉన్నాయి." అని పేదరాసి పెద్దమ్మ ఆర్థిక స్థితిగతుల గురించి కథకులు చెప్తారు. అంటే తరువాత ఆ కథలో వారి ఆస్తి అంతా పొగోట్టుకోవడమో లేదా ఆకస్మికంగా ఏదో లోటు ఏర్పడటమో జరుగుతుందని పరోక్షంగా శ్రోత అంచనా వేసుకుంటాడు.

'తల్లి, కొడుకు, కోడలు' అనే కథలో "ఒక ఊరిలో తల్లి, కొడుకులు ఇద్దరుంటరు. చాలా పేదవాళ్లు. వాళ్లకు పేదరికంతో జీవిస్తరు. కొడుకు చిన్నగ ఉన్నపుడే భర్త సనిపోతడు." ఒక స్త్రీ తన భర్త చనిపోయిన తరువాత ఆర్థికంగా కుంగిపోయి కుటుంబ భారమంతా తనమీద పడ్డ విషయం తెలుస్తుంది.

4. జానపద కథకులు తమ చుట్టు ఉన్న పరిసరాలను కూడా కథలో కల్పించి కథను ఆరంభిస్తూ ఉంటారు.

'హరిదాసు' అనే కథలో "ఉమ్మడి ధర్మపురిలో గల బుద్దేశ్ పల్లె గ్రామం జగిత్యాల రోడ్డు ప్రక్కన ఉన్నటు వంటిది మరటు గుట్ట బోర్లకెయి ఉన్నటు వంటి నాగారాం దాన్నే రాయక్కపల్లె నాగారం అనబడతది." ఒక రహదారి వైపు ఉన్న గ్రామాల పేర్లు ప్రస్తావిస్తూ కథను కథకులు ప్రారంభించారు.

'శివసత్తెవతారమెత్తిన భార్య' అనే కథలో "ఒక ఊరు జగిత్యాల పక్కన లక్ష్మీపూర్. ఆ ఊర్లో కూతురు అయితే ఇంత ఇంత అక్కడిక్కడి పెద్ద వాళ్ల చేతుల పెట్టి పదహారేళ్ల బాలిక చేసిందు."

5. కొన్ని కథల్లో పాత్రల దుష్ట స్వభావాన్ని ముందే ఊహించే విధంగా కథ ప్రారంభమవుతుంది.

'పోశవ్వ మొక్కు' అనే కథలో "ఇంగో ఒక ఊరిలో ఒకామె ఆయింత నా భర్త కండ్లు పోవాలని రోజు గుడికి పోతుంది." భర్త కండ్లు పోవాలనే దేవతని కోరుకునే దుష్టురాలి పాత్రను పరిచయం చేస్తూ కథ ప్రారంభమైంది.

'అత్త కోడలు వంకాయ' అనే కథలో "అత్త, కొడుకు, కోడలు ఉంటారు. ముసలమ్మకి ముసలితనం అచ్చింది. ముసలితనం అచ్చేసరికి ఆమెకు ఈ ముసల్ది ఎప్పుడుపోతే మంచిగుండు ఏమైనగని వండిపెట్టుడు గోసయితుంది." దుర్మార్గురాలైన కోడలు అత్త చావును చూడాలనుకుంటుంది. కథకురాలు కోడలు పాత్ర దురాగతాన్ని ముందే అంచనా వేసేలా కథను ప్రారంభించింది.

## 5. 5 జానపద కథలు – కథాముగింపు

తెలుగు జానపద కథలు ఎక్కువగా సుఖాంతంగా ముగుస్తాయి. శిష్ట రక్షణ దుష్టశిక్షణ అనే లోకోక్తి అనుసరించి రాక్షసుడు చావడం, శత్రువు అంతమవడం, కథాఎత్తుగడ తర్వాత మొదలైన సమస్యకు పరిష్కారం దొరకడం, నాయకుడు అనుకున్న లక్ష్యాన్ని ఛేధించడం, నాయకుడు నాయక కోసం బయలుదేరి ఎన్నో ఘట్టాలు దాటి నాయికను చేరి వివాహమాడటం, దేవతలు దీవించడం, పాపులను శిక్షపడటం, మంచి వారికి న్యాయం జరగడం ఇలా అనేక రకాలు కథాలక్ష్యం నేరవేరే దిశగా ముగింపు సాగుతుంది. అలా అని దు:ఖాంతంగా సాగే కథలు కూడ లేకపోలేదు. ఎక్కువగా కథలు సుఖాంతంగా మాత్రమే ముగుస్తాయి. నేను సేకరించిన కథల్లో కూడా పై అంశాలే ఎక్కువగా ముగింపుతో కనిపించాయి.

నాకు లభించిన కథల్లో సమస్య విడుపుతో ముగించే కథలు, నేరుగా కథముగించడం, నాయకుడు అనుకున్నది సాధించాక ముగించడం, అత్త కోడలు మధ్య తగువు తీరి అత్తకు లేదా కోడల్కి న్యాయం జరగడం, తప్పు చేసిన వారికి శిక్ష పడటం, వివాహం చేసుకుని సుఖంగా జీవించడం ఇలా రకరకాలుగా కథలు ముగింపులు కనిపిస్తాయి.

"ఆ పిల్ల అయిదు మల్లె పూల పిల్ల తరాజు బాటు తెచ్చి ఆడ తక్కెడ బెట్టుండు. బెడితే ఏసుతాసు పోకుండ బరాబరి అచ్చింది" 'ఐదు మల్లె పూల' కథలో నాయకుడు కోరుకున్న వధువును తీసుకువచ్చి వివాహం చేసుకుంటాడు.

'ఇరవై అయిదు రోజుల బాలుడు' అనే కథలో "అప్పుడు పద్మాలదేవితో మళ్లీ బిక్షపతిని ఇచ్చి మనువు చేస్తారు. వారి ఇద్దరి జీవితం సుఖమయం అవుతుంది. వారిద్దరిని చూసి తండ్రి ధర్మాంగమారాజు తల్లి మాణిక్యాలదేవి ఎంతో సంతోషించారు." అలా ఆ ఇరవై అయిదు రోజుల బాలుడు పెరిగి పెద్దవాడై, తల్లిదండ్రులను చేరడంతో కథ సుఖమయంగా ముగుస్తుంది.

'సోమనాలు భావి' ఒక కంసాలి ధనాన్ని సంపాదించి కుటుంబంతో సంతోషం ఉన్నట్లు కథా ముగింపు కనిపిస్తుంది. "సిలుకవాది పట్నం తయారయి మామ, అల్లుడు, భార్య, 30 బండ్ల ధనం గంగావతి అచ్చి పిల్లలను, భార్యను కలుసుకొని మంచిగ 12 అంత్రాల బంగ్లా కట్టి అందరు సుఖంగా బతికిన్రట." ఒక సామాన్యుడు బతుకుదేరువుకు వేరే ప్రాంతానికి వెళ్ళి, ధనంతో తన ఇంటికి చేరతాడు.

'సావుకారి కోడలి చతురత' అనే కథలో ఒక తెలివైన స్త్రీ ఒక దొరకి తన చాతుర్యంతో బుద్ధి చెప్తూ'పండి పండని మామిడి పండు పండి పండక కారణం ఏంటో' అని పొడుపు కథ వేసి కథాముగింపులో దుష్టుల నుండి తన మానాన్ని, ప్రాణాన్ని రక్షించుకోవడమే కాక దొరని నలుగురులో నవ్వులపాలు చేసి స్త్రీ శక్తిని చాటుతుంది.

మరొ కథ 'అత్త కోడలు వంకాయ' లో 'అంకాయ అంకాయ అసుక్కు అత్త పానం గుసుక్కు' అని కోడలు అత్త బాధ తప్పిందని సంతోషిస్తే తన తల్లిని రక్షించుకొని భర్త 'నూనె బుడ్డి గుసుక్కు మీ వోళ్లంతా గుసుక్కు' అని సమాధానం ఇస్తాడు.

'ఒక గుండుకు రెండు గుండ్లు' అనే కథలో కూడా భర్త భార్యకు బుద్ధి చెప్పి తన తల్లిని బాగా చూసుకునేలా చేస్తాడు. "ఆ పొల్లది తప్పు ఆనాటి నుంచి అత్త మంచిళ్లు ఇచ్చి, కూకున్న కాడ తానం పోత్తంది. ఒక గుండుకు రెండు గుండ్లు చేసిందు." తన తల్లిని అమానించిన భార్యకు ఆ బాధెంటో తెలిసేలా చేస్తాడు.

అత్త తప్పు చేసి దొరికిపోయిన కథాముగింపు ఉన్న కథలు కూడా లేకపోలేదు. 'అత్త నమ్మని కోడలు కోడల్ని నమ్మని అత్త' అనే కథలో "అయ్యో భగవంత మా అత్త ఈన్నె ఉందని చెప్పి మంచినీళ్లు మారన్నం అత్త దగ్గర పెట్టి బయటకచ్చింది. ఇండ్ల అత్త దొంగనా కోడలు దొంగనా అంటే అత్త దొంగ పస్ట్ అత్త అనేది మంచిగుంటే కోడలు మంచిగుంటది." ఇలా కథలో న్యాయాన్ని కథకులే నిర్ణయించి కథను ముగిస్తారు.

'రాణి పగడాల హారం' అనే కథలో ఒక రాజు తన భార్యను దూరం చేసినా వేశ్య దుశ్చర్యలకుగాను ఆ కాలంలో వేసి శిక్ష విధానం తెలుస్తుంది. "ఇగ ఈ రాజు ఆల్ల ఊర్ల పెద్దరాజు ఉంటడు గద. ఆ రాజుతోటి చెప్పినోల్లె ఇగ ఇది చేయవట్టి ఇట్ల ప్రపంచాన్ని గిట్ల నాశనం చేత్తుంది. ఆయింత ఆమెకు కతం గుండు కొట్టించి కర్రె గాడిద మీద ఎక్కిచ్చి ఊరేగిస్తరు." ఈ కథలో వేశ్య చేసిన పాడు పనికి తగిన శిక్ష వేసి, వేరే వాళ్లు అలాంటి పని చేయకుండా ఉండేలా చూస్తారు.

'చెల్లెలు దిద్దిన కాపురం' అనే కథలో ఒక భర్తను మోసం చేసిన భార్యకు పడిన శిక్ష గురించి కథాముగింపులో ఉంటుంది. "బొడ్డి గిట్ల చేత్తవ నన్ను. కోపానికచ్చి మంగళోన్ని పిలిపించి 3 రేవులు తల గొరిగిచ్చి బోడినామాలు పెట్టి తీస్కపోయి ఆయింత 3 బజారుల కాడ పాతర పెట్టి గొర్లను, బర్లను దాటిచ్చిండు" పూర్వం తప్పులు చేసినా వారికి ఎలాంటి శిక్షలు వేస్తారో చెబుతూ కథ ముగించ బడుతుంది.

'హరిదాసు' కథలో ఒక వ్యక్తికి గల కుటుంబ బాధ్యతను తెలియజేస్తూ కథను ముగించడం కనిపిస్తుంది. "ఇది పాతది. ఇప్పటిది గాదు. ఇప్పటి వాళ్లకు ఎక్కడ తింటే అక్కడే బొత్త నింపుకుంటరు గాని మా పాత సిద్ధాంతాలు ఎనకటివి. భార్యపిల్లలకు అప్పజెప్పినంకనే తినడం అనేది ఉండే. నాటి కాలంలో మగవారి కుటుంబ బాధ్యతలను తెలుపుతూ, ప్రస్తుత కుటుంబాల్లో ఆ పరిస్థితులు కనిపించడం లేదని కథకుడు కథను ముగిస్తాడు.

పై విధంగా కథాలక్ష్యం సాధించడంలో ముగింపు కీలక పాత్ర వహించాయి. కథకుడి కథాకథన కౌశల్యం ముగింపులో సమర్థవంతంగా బయటపడుతుంది. అంతేగాకుండా శ్రోతకి కథాప్రయోజనం అందిందా లేదా అనేది కూడా కథాముగింపులోనే ఉంటుంది.

## 5. 6 జానపద కథ – మూలాంశాలు

జానపద కథ అధ్యయనంలో ప్రధానమైన అంశం మూలాంశాల విశ్లేషణ. జానపద కథల్లో మూలాంశాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. మూలాంశాలనే కథన ఘటకాలని, కథన చోదకమని, వక్రాంశాలని పలు పేర్లతో వ్యవహరిస్తారు. ఇంగ్లీషులో మూలాంశాలను 'Motifs' అని అంటారు. కథలో అంతర్భాగమై కథాగమనానికి, కథానిర్మాణానికి దోహదపడే కనిష్ఠాంశమే కథాంశం లేదా మూలాంశం అంటారు. వాస్తవిక జీవితాల్లో కనిపించే సామాన్య విషయాలకు అసామాన్యతను కల్పించి కథలో చిత్రించబడ్డ అంశాలే మూలాంశాలని అనవచ్చు. అతిమానుష పాత్రలు, అసాధారణమైన సంఘటనలు, అద్భుతమైన వస్తువులు కథలో మూలాంశాలుగా చిత్రించబడతాయి. ఇవి కథను మలుపు తిప్పడంలోనూ, కథ వస్తువును విస్తృత పరచడంలోనూ ప్రధాన పాత్ర వహిస్తాయి. అంతేగాకుండా కథ వింటున్న శ్రోతలకు అమితమైన ఆసక్తిని, కుతుహలాన్ని రేకెత్తించి, కథ మదిలో చిరకాలం నిలిచిపోయేలా చేస్తాయి. మూలాంశాలను చిన్న పిల్లలను బాగా ఆకట్టుకుని వారిలో ఊహాశక్తి, సృజనశక్తులను పెంపొందిస్తాయి. జానపద కథాసాహిత్యంలోని మూలాంశాల వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. జానపద కథకుడి కథాకథన కౌశల్యాన్ని తెలుపుతాయి. జానపదుల సమాజ వాతావరణాన్ని, మనస్తత్వాన్ని, జీవన విధానాల్ని తెలుసుకోవడానికి సహకరిస్తాయి. ప్రపంచ దేశాల చరిత్ర, సంస్కృతిని అధ్యయనం చేయడానికి, ఆయా దేశాల జానపద కథల మధ్య గల సంబంధాన్ని పరిశీలించడానికి తులనాత్మక అధ్యయనంలో మూలాంశాలు ఉపయోగపడతాయి.

జానపద కథపై విస్తృతంగా కృషి చేసిన అమెరికా జానపద విద్వాంసుడు స్టిత్ థాంప్సన్ ప్రపంచ వ్యాప్తంగా జానపద కథాంశాలను కూర్చి 'Motif Index of Folk Literature' అనే గ్రంథంలో పొందుపరిచారు. ఇది జానపద కథలను అధ్యయనం చేసే వారికి ఎంతో ఉపయోగపడే

గ్రంథం. జానపద కథాంశాల సూచికను తయారుచేసి ఒక్కొ విభాగాన్ని ఇంగ్లీషు అక్షరాలతో సూచించాడు. వాటిలో ఉప విభాగాలున్నాయి. ఒక్కొ కథాంశానికి ఒక్కొ సంఖ్యను నియమించాడు. జానపద కథా సాహిత్య చారిత్రక అధ్యయనానికి స్థిత్ థాంప్సన్ మూలాంశాల పట్టిక చాలా ఉపయోగపడుతుంది. జానపద కథలో మూలాంశం గురించి 'The Folktale' అనే గ్రంథంలో స్థిత్ థాంప్సన్ కింది విధంగా నిర్వచించారు.

"A motif is the small element in a tale having power to persist in tradition. In order to have this power it must have something unusual and striking about it."[53] సంప్రదాయంగా కొనసాగుతున్న జానపద కథలో కనిష్టాంశమే మూలాంశం అవుతుందని, ఆ మూలాంశాలు కూడా అసాధారణంగా లేదా ఆశ్చర్యకరంగా ఉండాలని థాంప్సన్ అభిప్రాయం.

"కథలో కనిపించే కనిష్టాంశాలే మూలాంశాలనవచ్చు. ఇవి సామాన్యమైనవి కాదు. అసామాన్యమైనవి. అంటే కథ వినగానే ఈ చెవిలోంచి ఆ చెవిలోకి వెళ్లిపోయేవి గాక మనసుకు హత్తుకునే కొన్ని విషయాలని చెప్పవచ్చు."[54]

"ఆకర్షణీయమైన సంఘటనగానీ, చమత్కారమైన మాటగానీ, అపురూపమైన అనుభూతి కానీ హృదయ స్పందన కలిగించి, ఆలోచన రేకెత్తించి, ఊహకు కలిగే ప్రేరణే కథాంశముగా నాటుకొనును. కథాంశము చిన్న మూలాంశ విశేషమై సంప్రదాయ బద్ధముగా అసాధారణమైన, ఆశ్చర్యకరమైన సంఘటనలు వీడనాడకుండా కథలో ఉండును."[55].

అద్భుతమైన కల్పనలతో శ్రోత మనసులో బలమైన ముద్రవేయగలిగి కథలో ఉండే కనిష్టాంశాన్ని మూలాంశం అని అనవచ్చు. అది సంప్రదాయబద్దంగా కథలో స్థిరంగా ఊంటూ కథ

---

[53] Thompson Stith. The Folktale. Dryden press: New York. 1946. P-415.

[54] సుందరం .ఆంధ్రుల జానద విజ్ఞానం .ఆర్వీస్ , పుట:148

[55] సుమతిపుట .తెలుగు జానపద కథలు .కె ,:85

గమనానికి ఉపకరించాలి. ఒక కథలో ఎన్ని మూలాంశాలైనా ఉండోచ్చు. ఒక విషయం మూలాంశంగా రూపుదిద్దాలంటే అది అసాధారణంగా ఉండాలి.

ఉదాహరణకు కన్న తల్లి సామాన్యమైన విషయం. అదే సవతి తల్లి అసాధారణ విషయం. ఎందుకుంటే సవతి తల్లి ఉన్న పిల్లలు ఏదొక రకంగా సవతి తల్లి పోరు అనుభవిస్తూ ఉంటారు. ఒక దంపతులుకు ఇద్దరు ముగ్గురు నలుగురు బిడ్డలు కలిగి ఉండటం సహజమే. కానీ వంద మంది పుట్టడం అసాధారణం అది మూలాంశం. నవ మాసాలు మోసి పిల్లలు కనడం సాధారణం. అద్భుత శక్తి గల పండు తిని, తొమ్మిది గడియల్లోనే సంతానం కలగడం అసాధారణం. ఈ విధంగా సాధారణమైన విషయాలకు భిన్నంగా ఉండి కథకుల ఊహాశక్తితో జరగలేనివి కథలో జరిగేటట్లు చెప్పబడేవి మూలాంశాలు. నీతి, వినోద జానపద కథల్లో మూలాంశాలు తక్కువగా ఉండి అద్భుత కథల్లో మూలాంశాలు ఎక్కువగా కనిపిస్తాయి. వాస్తవిక సంఘటనల ఆధారంగా రూపొందిన కథల్లో మూలాంశాలు అడపదడపగా ఒకటి లేదా రెండు కనిపిస్తాయి.

నేను సేకరించిన కథల్లో అనేక కథాంశాలు ఉన్నాయి. అలాంటి కథాంశాలకు థాంప్సన్ రూపొందించిన మూలాంశాల పట్టికలోని సూచించే సంఖ్యను ఇచ్చి విశ్లేషించాను.[56] కింది పాద సూచిక యొక్క లంకెలో స్టిత్ థాంప్సన్ మూలాంశాల పట్టిక మొత్తాన్ని సిద్ధం చేసి, అంతర్జాలంలో పొందుపరిచారు. థాంప్సన్ సూచించిన జానపద కథాంశాలను ఆ లంకె ద్వారా వెతకడం చాలా సులభమైన పని. నేను సేకరించిన కథల్లో మూలాంశాలకు సూచి సంఖ్యని ఇవ్వడానికి క్రింది లంకెను ప్రధాన ఆధారంగా తీసుకున్నాను.

థాంప్సన్ ప్రకారం నేను సేకరించిన కథల్లో కనిపించిన మూలాంశాలను మూడు భాగాలుగా చేసాను.

1. పాత్రకు సంబంధించిన మూలాంశాలు
2. వస్తువుకు సంబంధించిన మూలాంశాలు
3. సంఘటనకు సంబంధించిన మూలాంశాలు

---

[56] http://www.ruthenia.ru/folklore/thompson/

### 5.6.1 పాత్రకు సంబంధించిన మూలాంశాలు

**a. క్రూరురాలైన సవతి తల్లి (S31 Cruel stepmother)**

'సవతి తల్లి పోరు', 'తల్లి కూతుళ్ల అనుబంధం' అనే కథల్లో సవతి తల్లి పోరు గురించి చిత్రించబడింది. సవతి తల్లి మొదటి భార్య పిల్లలను ఇంట్లో నుంచి బయటకు వెళ్లగొడుతుంది. 'సవతి తల్లి పోరు' అనే కథలో సవతి తల్లి ఇద్దరు పిల్లల్ని చంపాలని భర్తను ఉసిగొల్పుతుంది. 'తల్లి కూతుళ్ల అనుబంధం' అనే కథలో కూతురు కడుపులోకి పామును ప్రవేశపెట్టి కడుపుతో ఉందని నిందలు మోపుతుంది.

**b. వంచకురాలైన సోదరి (K2212 Treacherous sister)**

'అమరికా రాజు' అనే కథలో వంచకురాలైన సోదరి పాత్ర కనిపిస్తుంది. కమరసుల రాజు విహారయాత్రలకు వెళ్లినప్పుడు, తన రాజ్యాన్ని బావమరిది నిమ్మళ్ల మంత్రికి ఇస్తాడు. రాజు విహారయాత్రను ముగించుకుని రాజ్యానికి వచ్చి తన రాజ్యాన్ని తనకు ఇవ్వమంటే రాజు చెల్లెలు కమరసుల రాజుని తన భర్త చేత చంపించడానికి ప్రయత్నిస్తుంది.

c. **వంచకురాలైన భార్య (K2213 Treacherous wife)**

'చెల్లెలు దిద్దిన కాపురం' అనే కథలో ఒకామె తన ఇంటి ప్రక్కన వాడితో అక్రమ సంబంధం పెట్టుకుని ఆ విషయం భర్తకు తెలియకుండా చేయాలనుకుంటుంది. భర్తకు ఒక పొడుపు కథ వేసి అది విప్పకపోతే చనిపోవాలని పందెం కాస్తుంది.

'పోశమ్మ మొక్కు కథ' అనే కథలో ఒక గొర్రెల కాపరి భార్య రాజి. ఆమె భర్తకు తెలియకుండా వేరే వాడితో అక్రమ సంబంధం పెట్టుకుంటుంది. ఆ విషయం భర్తకు తెలియకుండా ఉండాలని భర్తకు కండ్లు పోవాలని గ్రామీణ దేవతకి మొక్కుతుంది.

**d. దుష్టురాలైన సవతులు (K2222 Treacherous co–wife (concubine))**

'అక్కెమ్మ'లు కథలో ఒక రాజుకు ముగ్గురు భార్యలు ఉంటారు. వాళ్లు ముగ్గురు వాళ్లకు తెలిసిన విద్యను చూపించి రాజును వివాహం చేసుకుంటారు. మొదటి ఇద్దరు భార్యలు ముందు వాళ్లకు తెలిసిన విద్యను ప్రదర్శించి, మూడవ భార్యను రాజుకు దూరం చేయాలని ప్రయత్నిస్తారు. ఇద్దరు సవతులు కలిసి రాజు మూడవ భార్య పిల్లలను పాతిపెడతారు.

**e. దుష్టురాలైన అత్త** (K2218.1. **Treacherous mother-in-law accuses innocent wife)**

'అత్త కాల విషం' అనే కథలో క్రూరమైన అత్త పాత్ర కనిపిస్తుంది. గర్భవతితో ఉన్న కోడలికి పామును వండి పెట్టి చేపల కూర అంటూ అబద్ధం చెబుతుంది. ఆ చాపల కూర తిని కోడలు చనిపోతుంది. చనిపోయిన కోడలు శవాన్ని ఎవ్వరికి అనుమానం రాకూడదని కూడలి కాడ పాతిపెడుతుంది.

**f. మూర్ఖురాలైన భార్య (J1701 Stupid wife)**

'పైసకు గుడిసెన్నర పెండ్లాం' అనే కథలో ఒక అత్తకు గుండు కొట్టించిన భార్య ఉంటుంది. ఆమె తన భర్త ఎత్తుగడను అర్థం చేసుకోలేదు. ఆమె తన తల్లి అనారోగ్యపాలైందని భర్త చెప్పిన మాటలు నమ్ముతుంది. మంగలి వాడిని పిలిపించి గుండు తీయించుకుని గాడిద మీద ఊరేగింపు చేస్తే తన తల్లి ఆరోగ్యం బాగు అవుందని నమ్మి భర్త చెప్పినట్లు చేస్తుంది.

**g. మూర్ఖుడైన భర్త (J1702. Stupid husband)**

'కానుగ పట్నం' అనే కథలో ఒక తెలివి తక్కువ భర్తతో అతని భార్య అనేక ఇబ్బందులు పడుతుంది. వెలమ దొర, దొంగ లెక్కల వ్యాపారి, కటికవాడు ఇలా ముగ్గురి చేతిలో మోసపోతాడు. వాళ్ల మోసపూరిత ఆలోచనలు పసిగట్టలేడు. ఏదోక సందర్భంలో వాళ్ల చేతిలో ఇరుక్కుపోయి, కానుగ పట్నం రాజు సహాయాన్ని కోరతాడు.

**h. మూర్ఖుడైన బ్రాహ్మణుడు (J1705.2. Stupid (ignorant) Brahmin)**

'సోమనాల బావి' అనే కథలో బ్రాహ్మణుడు తన స్నేహితుడు బావిలో పడితే అదృష్టం కలిసి వచ్చిందని తాను కూడా పోయి బావిలో దునికి చనిపోతాడు.

**i. తెలివైన కోడలు (J1111.3. Clever daughter-in-law)**

'కాటి మీది కెక్కిన కోడలు' అనే కథలో అపాయ పరిస్థితుల్లో ఉన్న ఒక కోడలు అత్త నుంచి తప్పించుకుని బయట పడుతుంది. ఒక రోజు కోడలు ఒక బిచ్చగాడికి బిక్షం వేస్తుంది. ఆమె అత్త, భర్త ఇద్దరు పిసినారి వాళ్లు. కోడలు బిచ్చగాడికి వేసిన దానం చూసి అత్తకు కోపం వస్తుంది. కోడల్ని చంపాలని శ్మశానానికి తీసుకెళతారు. ఆ సందర్భంలో కోడల్ని కాలపెట్టడానికి అగ్గి పెట్టెని మరిచిపోతారు. అగ్గి పెట్టె తీసుకురావడానికి అత్త కొడుకును పంపుతుంది. అదే మంచి సమయం అనుకుని కోడలు కాటి మీది మనిషి రూపంగా గడ్డిని పేర్చి తప్పించుకుంటుంది.

'సత్యవతి' అనే కథలో ధర్మంగరాజు, ధర్మవతిల కోడలు సత్యవతి. ఒక పాముతో వివాహం జరిగిన సత్యవతి అధైర్యపడకుండా వివిధ పుణ్యక్షేత్రాలు తిరుగుతుంది. ఆమె పుణ్యఫలం వలన పాము మనిషిగా మారతాడు. మళ్లీ వివాహం చేసుకుంటారు. ఇరవై అయిదు రోజుల బాలుడు అనే కథలో కూడా తెలివైన కోడలు చిత్రణ కనిపిస్తుంది.

'అత్తని నమ్మని కోడలు, కోడల్ని నమ్మని అత్త' అనే కథలో గర్భవతితో ఉన్న కోడలు అత్త ఇంట్లో లేని సమయం చూసి సత్తుపిండిని తయారుచేసుకుంటుంది. ఆమె సత్తుపిండి చేసేలోపు అత్త ఇంటికి వస్తుంది. అదే సమయంలో వచ్చిన బిచ్చగాడి పేరును చెప్పి సమయస్ఫూర్తితో అత్తకు తెలియకుండా తప్పించుకుంటుంది.

**j. తెలివైన మంత్రి (**J1115.10.2. **Clever minister)**

'బ్రామ్మడి వరాలు' అనే కథలో రాజుకు, బ్రాహ్మణుడు మధ్య ఏర్పడిన వివాదాన్ని పరిష్కరిస్తాడు. ఒక రోజు బ్రాహ్మణుడు రాజుకు వరాలిచ్చి దేశాటనకు బయలుదేరతాడు. కొద్ది రోజుల తరువాత బ్రాహ్మణుడు తిరిగి వచ్చి రాజుతో తన వరాలను అడుగుతాడు. కానీ రాజు దురాశతో ఒక

వెదురు బొంగులో వరాలు పెట్టి బ్రాహ్మణుడికి ఇస్తూ నీ వరాలు నీకు ఇచ్చానని నా దగ్గర లేవని సభలో చెప్తాడు. ఆ వెదురు బొంగులో వరాలున్న విషయం తెలియని బ్రాహ్మణుడు నా వరాలు ఇవ్వలేదని వాదిస్తాడు. ఆ సభలో న్యాయాన్ని నిర్ధారించే కత్తెర ఎవ్వరి వ్రేలును తెంపకుండా ఉంటుంది. అప్పుడు మంత్రి ఆ వెదురు బొంగును చీల్చి, అందులోని వరాలను బ్రాహ్మణుడికి ఇస్తాడు. రాజు దురాశను బయటపెడతాడు.

'రాజు పతాని లగ్గం సోకు' కథలో ఒక రాజు వివాహం చేసుకుని పిల్ల పాపలతో హాయిగా ఉంటాడు. ఆ రాజు చెంత వున్న మంత్రికి ఇంకా వివాహం జరుగలేదు. రాజుతో ఉన్న సాన్నిహిత్యం వల్ల రాజునే తనకు ఒక పిల్లను చూసి పెళ్లి చేయమని అడుగుతాడు. రాజుకు ఎన్ని సార్లు చెప్పినా మంత్రి వివాహ విషయం గురించి రాజు ఆలోచించాడు. ఇక మంత్రి ఒక రోజు అత్తగారింటికి పోయినా రాజును ఆటపట్టించి రాజుతో తనకు వివాహం జరిపించేలా మాట తీసుకుంటాడు.

**k. అదృష్ట దేవత (A482.2. Goddess of good luck (Lakshmi))**

'లక్ష్మీదేవి కటాక్షం' అనే కథలో ఒక పెరక కులానికి చెందిన వ్యక్తిని లక్ష్మీదేవి పలు విధాలుగా పరీక్షిస్తుంది. పెరక కులానికి చెందిన వ్యక్తి వ్యవసాయ భూమి అంత పోయి పేదవాడుగా మారతాడు. అడవికి వెళ్లి కట్టెలు కొట్టి రోజు వారీ డబ్బులతో బతుకుతాడు. అతని కష్టాన్ని చూసి లక్ష్మీదేవి ప్రత్యక్షమై మూడు సార్లు బంగారం ఇస్తుంది. ఆ బంగారం అతను ఆపుకోలేక ఏదొక విధంగా పోగొట్టుకుంటాడు. అతను బంగారాన్ని ఎన్ని సార్లు పోగొట్టుకున్న, దిగులు చెందకుండా కష్టాన్ని నమ్ముకుని తిరిగి పనికి వెళ్లేవాడు. అతని కష్టాన్ని చూసినా లక్ష్మీదేవి మూడు సార్లు పోగొట్టుకున్న బంగారాన్ని తిరిగి ఆయనకు చెందేలా చేస్తుంది.

'లచ్చిందేవి ఆచారం' అనే కథలో ఒక రైతు తన పిల్లలతో పొలం పనులు చేసుకుంటూ జీవిస్తారు. ఒక రోజు ఆ రైతుకు కల వస్తుంది. లక్ష్మీదేవి వచ్చి నేను మీ ఇంటికి వస్తాను మీరు శ్రీమంతలు అవుతారు అంటుంది. అప్పుడు రైతు వద్దు అమ్మా మళ్లీ మేము ఏదైనా తప్పు చేస్తే నువ్వు వెళ్లి పోతావని లక్ష్మీదేవితో అంటాడు. లక్ష్మీదేవి చెప్పినట్టుగానే రైతు ఇంటికి వచ్చి ఉండగా వాళ్లు

ఆర్థికంగా ఎదిగిపోయి శ్రీమంతులౌతారు. కానీ కొద్ది రోజుల తరువాత కోడలు చేసిన చిన్న తప్పిదం వల్ల లక్ష్మీదేవి అలిగి వెళ్లిపోతుంది. వాళ్లు మళ్లీ పేదవాళ్లుగా మారి పొలం పనులు చేసుకుంటూ బతుకుతారు.

**l. అత్యాశకు పోయిన మంగలి (P446.2. Barbers cunning and greedy)**

'అన్నదమ్ముల కథ' అనే కథలో ఐదుగురు అన్నదమ్ములు ఉంటారు. అందులో పెద్ద వాడిని చంపాలని మిగతా తమ్ముళ్లు ప్రయత్నిస్తారు. పెద్దవాడిని చంపాడానికి మంగళివాడికి డబ్బు ఇచ్చి పంపిస్తారు. ఆ మంగలి పెద్ద వాడికి గడ్డం తీసినట్లు చేసి కత్తితో చంపాలని అనుకొని దానికి బదులుగా నలుగురు తమ్ముళ్ల దగ్గరి నుంచి నాలుగు లక్షలు తీసుకుంటాడు. మంగళివాడు డబ్బు మీద అత్యాశతోనే పెద్ద అన్నయ్యను చంపడానికి వెళతాడు.

**m. తెలివైన గొర్రెల కాపరి (J1115.9. Clever shepherd)**

'గొల్లబోయని రాజనీతి' అనే కథలో ఒక పశువుల కాపరి రాజుకు కవిత్వం చెప్తాడు. ఆ కవిత్వంలో రాజనీతికి సంబంధించిన సందేశం ఉంటుంది.

భలే భలే మేఘూ భలే..  భలే భలే భుజ భలే.... అన్న వాక్యాలు రాజుకు చెప్పి రాజు చేత ప్రశంసించబడతాడు. రాజు ఎల్లప్పుడూ తనని తాను నమ్ముకోని ఆత్మవిశ్వాసంతో రాజ్యపాలన చేయాలని హితబోధ చేస్తాడు.

**n. తెలివైన వేశ్య (J1115.8. Clever prostitute)**

'భోగసాని లంగతనం' అనే కథలో ఒక కోమటి ఆవును పెంచుకోవడం వల్ల ఆ కోమటి ధనవంతుడిగా మారతాడు. అది గమనించిన ఒక వేశ్య ఆ ఆవుని దొంగిలించి తన ఇంట్లో కట్టేసు కుంటుంది. ఆ కోమటి వెళ్లి వేశ్యను అడిగితే 'నా బక్కెద్దు పికిలించి పిల్లను కంటే పుట్టింది' ఈ ఆవు అని సమాధానం చెబుతుంది. ఇన్ని రోజులు ఈ ఆవు వేరే దగ్గర పెరిగి పెద్దదై ఇక్కడకి వచ్చినట్లు అబద్ధం చెబుతుంది.

**o. మాట్లాడే జంతువులు (B210. Speaking animals)**

'పెద్దపులి గిద్దపులి' అనే కథలో ఒక పిరికివాడు ఒక గుర్రం చేసిన అవమానికి దాని మీద పగ తీర్చుకోవాలనుకుంటాడు. ఒక రోజు సాయంత్రం గుర్రపు శాలకి వెళతాడు. అదే సమయంలో గుర్రాల శాలకి పెద్దపులి వస్తుంది. చీకట్లో గుర్రం అనుకొని పెద్దపులి ఎక్కి తాను గిద్దపులినని చెప్పి అడవి అంతా పరుగెత్తిస్తాడు. పెద్దపులి పరుగెత్తి ఊరి చివరన గుడిని చేరుతుంది. ఆ గుడి దగ్గరకి నక్క బావ వచ్చి పెద్ద పులితో తోకపీకుడుగాడిని గిద్దపులి అనుకున్నవా? అని సంభాషించుకుంటాయి.

'బంగారెంటుక బాలుడు' అనే కథలో కూడా పులి, ఎలుగుబంటి, అడవి ఆవులు ఒక బాలుడితో మాట్లాడే సంభాషణలు ఉంటాయి.

**p. తెలివైన బాలుడు (J1113. Clever boy)**

'గారడివాడు' అనే కథలో ఒక తల్లికి ఇద్దరు మగపిల్లలు ఉంటారు. అందులో చిన్నవాడు చాలా తెలివైనవాడు. గారడి ఆటను స్వల్పకాలంలోనే నేర్చుకుని, గారడాటలో గురువుని మించిన శిష్యుడు అవుతాడు. తన తల్లి కోసం గురువుతో పోరాడి విజయం సాధిస్తాడు.

## 5.6.2 వస్తువుకు సంబంధించిన మూలాంశాలు

**a. హారంలో ప్రాణం (E711.4. Soul in necklace)**

'రాణి పగడాల హరం' అనే కథలో ఒక వేశ్య యువరాజు తనకు ఎక్కడ దూరమవుతాడోనని చెప్పి యువరాజు భార్యకి ఆపదను తలపెడుతుంది. ఒక కోయ మంత్రగాళ్ల దగ్గరికి వెళ్లి, యువరాణి ఆత్మను ఒక హారంలో బంధించి వేస్తుంది. ఆ హారాన్ని తన మెడలో ధరించి యువరాజుని తన దగ్గరికి రప్పించుకోవాలని ప్రయత్నిస్తుంది.

**b. మాంత్రిక పాత్ర (D1171.8. Magic bottle)**

'ఐదుమల్లె పూల కథ'లో బాలగిరిరాజు, మూత్యాలదేవిలను పరీక్షించిన శంకరుడు వాళ్లకు బంగారు బాటిల్ని ఇస్తాడు. ఆ బాటిల్తో వాళ్లు కోరుకున్న చోట కోరుకున్న ఆహారం లభిస్తుందని శంకరుడు చెప్తాడు.

**c. మాంత్రిక ఉంగరం (D1223.1. Magic flute)**

'బంగారెంటుక బాలుడు' అనే కథలో ఒక బాలుడు అడవి ఆవుల దగ్గర పెరుగుతాడు. ఒక రోజు మత్స్యకారుల వల్ల, ఆ బాలుడిని జాడ తెలుసుకున్న యువరాణి అతనిని పెళ్లి చేసుకుంటానని చెప్పి రాజుకు చెబుతుంది. రాజు ఆ బాలుడిని వెంట పెట్టుకురమ్మని అడవికి భటులను పంపిస్తాడు. ఆ సందర్భంలో ఆ బాలుడికి ఆవులన్ని కలిసి ఒక పిల్లన గ్రోవిని ఇస్తాయి. రాజు దగ్గర నీకేదైనా హాని జరిగితే నువ్వు ఈ పిల్లనగ్రోవి ఊదు మాకు తెలుస్తుంది. మేము వచ్చి నిన్ను రక్షిస్తామని పిల్లన గ్రోవిని ఇస్తాయి.

**d. మాంత్రిక ఫలం (D981. Magic fruit)**

జానపద కథల్లో పిల్లలు లేని వారికి ఏదొక మాంత్రిక ఫలంతో సంతానం అవుతుంది. 'సత్యవతి' అనే కథలో సంతానం లేని దంపతులకు ఒక స్వామిజి ఇచ్చిన ఫలం వల్ల పుత్ర సంతానం కలుగుతుంది.

**e. అసాధారణ పుష్పం (814. Extraordinary flower)**

'ఐదు మల్లె పూల కథ' అనే కథలో ఒక యువరాజు తనకు కావల్సిన వధువు కోసం వివిధ ప్రాంతాలు తిరుగుతాడు. అతను వివాహం చేసుకోవాల్సిన వధువు ఐదు మల్లె పూల కన్న తక్కువ బరువు ఉండాలన్న నిబంధన పెట్టుకుని అలాంటి సౌందర్యవతి కోసం వెతుకుతాడు. వివిధ ప్రాంతాలు తిరిగి తాను ఇష్టపడ్డ అమ్మాయిని తీసుకువస్తాడు. ఒక తరాజులో ఆమెను, ఐదు మల్లె పూలు వేసి సమానంగా ఉందో లేదో తూకం వేస్తారు.

## 5.6.3 సంఘటనకు సంబంధించిన మూలాంశాలు

**a. పాముతో మనిషి వివాహం (B604.1. Marriage to snake)**

'సత్యవతి' అనే కథలో సత్యవతికి పాముతో వివాహం జరుగుతుంది. ఆ పామును తీసుకుని సత్యవతి మనిషిగా మారేలా వివిధ పుణ్యక్షేత్రాలు తిరుగుతుంది.

**b. మనిషి కడుపులో జీవించే జంతువులు (B784.2.1.1. Snake (frog) in human body enticed out by milk (water)**

'సవతి తల్లి కథ'లో ఒకామెకు ఇద్దరు పిల్లలున్న ఒక వ్యక్తిని వివాహం చేసుకుంటుంది. కొద్ది రోజులు తరువాత మొదటి భార్య పిల్లలను ఇంట్లో నుంచి బయటకు పంపించాలని పన్నాగం వేస్తుంది. పెద్ద కూతురుకి పాలల్లో పాము పిల్లను వేసి ఆ పాలు తాగిపిస్తుంది. ఆ పాము పెద్దగా అవగానే కడుపు కూడా పెద్దగా అవుతుంది. అది కారణంగా చూపించి పెద్ద కూతురు ఏదో తప్పు చేసినట్లు చిత్రించి, భర్తకు చెప్పి పిల్లలను ఇంట్లో నుంచి బయటికి పంపిస్తుంది.

**c. జంతువుల మధ్య స్నేహం (A2493. Friendships between the animals)**

'బంగారెంటుక బాలుడు' కథలో పెద్దపులి, గుడ్డెనుగు (ఎలుగుబంటి) అనే రెండు జంతువుల కలిసి వ్యవసాయం చేస్తాయి. కొద్ది రోజుల తరువాత ఒక తోటలో దోసకాయ కాస్తుంది. ఆ దోసకాయను ఎవ్వరు ముందు తినాలనే సందేహంలో పడతారు.

**d. చనిపోయిన పాము బంగారంగా మారడం (D425.1.2.1. Transformation: snake to gold)**

'అన్న చెల్లెలు కథ'లో చెల్లెలు పేదరికం తాలలేక అన్న సహాయం కోసం పుట్టింటికి వెలుతుంది. అక్కడ వదినె ఆహంకారానికి గురై ఎన్నో అవమానాలు ఎదుర్కుంటుంది. అన్న వదినల మధ్య చిచ్చు పెట్టడం ఇష్టంలేక ఎంత ఇబ్బందైనా పడి భర్త ఇంటికి దారిపడుతుంది. మార్గంమధ్యలో తన కొడుక్కి ఆకలైతే తినడానికి ఏమి ఉండవు. ఇక బతికి లాభంలేదని చెప్పి, ఆత్మహత్య ప్రయత్నం చేసుకోగా తాను చంపిన పాము బంగారు కడ్డీలుగా మారి వాళ్లు ధనవంతులైతారు.

**e. శాపం వల్ల పరివర్తన చెందడం (D525. Transformation through curse)**

'బ్రాహ్మణుడు దూలం' అనే కథలో ఒక దేవత ముని శాపం వల్ల వివిధ రూపాలు ధరిస్తుంది. తన పూర్వ జన్మ కర్మ ఫలం వల్ల వివిధ జన్మలు ఎత్తి చివరికి శాప విముక్తి చేసుకుంటుంది. 302 ప్రాణాలను తీసుకుంటే తన శాపవిముక్తి అయితుందని చెప్పి కర్ర దూలంగా, దూలం పాముగా,

పాము పులిగా, పులి తోడేలుగా, తోడేలు కన్యగా ఇలా 302 ప్రాణాలను తీయడానికి కావల్సిన రూపాలను ధరించి మునిశాపం నుంచి విముక్తి పొందుతుంది.

**f. కర్ర పుల్లతో జీవం పోయడం (E64. Resuscitation by magic object)**

'ఐదు మల్లె పూల కథ'లో బాలగిరిరాజు మూత్యాలదేవి కోసం కత్తుల మేడని ఎక్కి చనిపోతాడు. మూత్యాల దేవి అతని మాంసపు ముద్దలను తీసుకుని అడవిలోకి వెళుతుంది. అప్పుడు శంకరుడు ముసలివాని రూపంలో ఎదురై ఆ మాంసపు ముద్దలకు కర్ర పుల్లతో జీవం పోస్తాడు. శంకరుడి దయ వల్ల బాలగిరి రాజు తిరిగి బతుకుతాడు.

**g. రాత్రి దెయ్యంగా మారడం (E155.3. Nightly resuscitation of man with external soul)**

'రాణి పగడాల హారం' అనే కథలో యువ రాజు భార్యను ఒక వేశ్య చంపి ఆమె ఆత్మను ఒక హారంలో బంధిస్తుంది. యువరాజు తన అందమైన భార్య శవాన్ని దహనం చేయకుండా మర్రి చెట్టు తొర్రలో ఉంచుతాడు. చనిపోయిన యువరాణి ఆత్మ రాత్రి అక్కడికి వచ్చి యువరాజును కలుసు కుంటుంది.

**h. హింస బడుతున్న పిల్లలకు తల్లి సహాయం (E323. Dead mother's friendly return)**

'తల్లి కూతుళ్ల అనుబంధం' అనే కథలో సవతి తల్లి తో బాధపడుతున్న ఇద్దరు ఆడపిల్లలు ఉంటారు. సవతి తల్లి ఆ ఇద్దరు ఆడ పిల్లలను ఇంట్లో నుంచి వెళ్లగొడుతుంది. అప్పుడు ఆ పిల్లలు పొలంకాడికి వెళ్లి తలదాచుకుంటారు. అక్కడనే ఆ పిల్లల తల్లి  తన భర్త చేత చంపబడుతుంది. ఆ తల్లి తమ పొలంలో ఉన్న పిల్లల్ని రక్షిస్తూ వారి ఆకలి తీర్చడానికి కావల్సిన పదార్థాలను సమకూర్చుతుంది.

**i. విగ్రహం వెనుక వ్యక్తి దేవునిగా నటించడం (K1971. Man behind statue (tree) speaks and pretends to be God (spirit))**

'తోడి కోడల్ల అత్యాశ' అనే కథలో ఇద్దరు తోడి కోడల్లు ఉంటారు. ఒక కోడలు భర్త చేత దండించబడి కాళీకా మాత గుడి వెనుకాల కూర్చుని ఏడుస్తుంది. అదే సమయంలో గజ దొంగలు ఆ గుడికి వచ్చి కాళీకా మాతకి మొక్కి దొంగతనానికి బయలుదేరతారు. ఆ దొంగలు బాగా ధనం దొరికితే

కాళీకా దేవికి సగం మాకు, సగం నీకు అని మొక్కితే విగ్రహం వెనుక ఉన్న పెద్ద కోడలు ఊ.. అని అంటుంది. దేవియే మమల్ని పలుకరించిందని ఆ దొంగలు భ్రమ పడతారు.

**j. భార్య తనను ఎలా మోసం చేయాలో తెలుసుకోవాలని భర్త విగ్రహం వెనుక ఉండి సమాధానం ఇస్తాడు (K1971.1. Husband answers behind the statue when wife wants to know how to fool him)**

'పోశమ్మ మొక్కు కథ' అనే కథలో ఒకామె తన భర్త కళ్లు పోవాలని పోశమ్మకి మొక్కుతుంది. అతడి భార్య మనసులో విషయాలను ముందే పసిగడతాడు. భార్య కన్న ముందే పోశమ్మ గుడికి వెళ్లి, చెట్టు తొర్రలో దాక్కుంటాడు. పోశమ్మకి తన భార్య ఏమని మొక్కుతుందో తెలుసుకుంటాడు.

**k. బూడిద మంచి ఖరీదుకు అమ్ముడు పోవడం (K941.2. Dupe burns house because trickster reports high price paid for ashes)**

'బూడిద గిరిపట్నం' అనే కథలో ఒక ముసలాయన తన కూతురికి పెండ్లి చేసి అల్లుడిని ఇల్లరికం తెచ్చుకుంటాడు. కొద్ది రోజుల తరువాత వాళ్ల మధ్య విబేధాలు ఏర్పడుతాయి. అల్లుడి మీద కక్ష్య కట్టిన మామ అల్లుడి గుడిసెని తగలబెడతాడు. అల్లుడు గుడిసె కాలిపోయిన తరువాత మిగిలిన బూడిదను తీసుకుని పోయి, అమ్ముకోవడానికి బూడిదగిరి పట్నం బయలుదేరతాడు.

**l. బావిలో పడవేయడం (K832.1.1. Victim persuaded to look into well or pond: pushed in)**

'సోమనాల బావి' అనే కథలో ఒక బ్రాహ్మణుడు, ఒక విశ్వ బ్రాహ్మణుడు ఉంటారు. ఒక బ్రాహ్మణుడు స్వార్థపరుడు. విశ్వ బ్రాహ్మణుడి రొట్టెలకి ఆశపడి అతన్ని బావిలో పడవేస్తాడు.

**m. మౌనంగా ఉండాలని పందెం వేసుకుంటే భార్యాభర్తల్ని చనిపోయారని అనుకోవడం (J2511.1.2. Silence wager: man and wife taken for dead)**

'బూరెప్ప' అనే కథలో దినమ్మ, దినయ్య ఇద్దరు బూరెప్పల కోసం పందెం వేసుకుంటారు. ఎవ్వరైతే ముందు మాట్లాడకుండా ఉంటారో, వారికే బూరెప్పలని ఆ దంపతులు ఒకరికొకరు అసలు

మాట్లాడకుండా నటిస్తారు. ఒక సుంకరివాడు వీళ్ల ఇంటికి వచ్చి పిలవగా, భార్యాభర్తలు ఎంత పిలిచిన పలకడం లేదని చనిపోయి ఉంటారని గ్రామ పెద్దలకు చెప్తాడు.

**n. యువతికి కత్తితో వివాహం జరిపించడం (T117.2. Marriage of girl to a sword)**

'రాణి పగడాల పేరు', 'ఇరవై అయిదు రోజుల బాలుడు' అనే కథల్లో కత్తికి, కటారుకి పెండ్లి చేయడం అనే సన్నివేశాలు ఉంటాయి. ఒక వేశ్యకు అలవాటైన తన కొడుకు పెండ్లి చేయాలనుకుంటే కొడుకు నిరాకరిస్తాడు. ఆ సందర్భంలో తల్లిదండ్రులు కొడుక్కి తెలియకుండానే కత్తితో, వధువుకి వివాహం జరిపించి కోడలిని ఇంటికి తెచ్చుకుంటారు.

**o. అడవిలో విడిచిపెట్టడం (S143. Abandonment in forest)**

'సవతి తల్లి' అనే కథలో ఇద్దరు పిల్లలు ఉన్న ఒక వ్యక్తి భార్య చనిపోయాక మరో వివాహం చేసుకుంటాడు. రెండవ భార్య చెప్పిన మాటలు విని తన ఇద్దరు పిల్లలను అడవిలో వదిలిపెట్టి వస్తాడు.

నేను సేకరించిన జానపద కథల్లో పై మూలాంశాలు ప్రధానంగా కనిపించాయి. ఇవే కాకుండా విగ్రహం ముక్కు మీద వ్రేలు వేసుకోవడం, భగవంతుడు ముసలి అవతారంలో రావడం, తప్పు చేసిన వారికి గుండు తీయించి సున్నపు బొట్లు పెట్టడం, విధిరాతని నమ్మడం, దేవుడు వచ్చి సహాయం చేస్తాడని అనుకోవడం, చనిపోయిన వాళ్లు ఏదోక రూపంలో వచ్చి నిజం చెప్పడం లాంటి మూలాంశాలు అనేకం కనిపిస్తాయి.

# 6. జగిత్యాల జిల్లా జానపద కథలు – భాషావిశేషాలు

## 6.0 పరిచయం

జానపదులు తమ అనుభవాలను, అభిప్రాయాలను తమ సమూహంతోనూ, ఇతర సమూహాలతోనూ పంచుకోవడానికి భాష అనే సాధనాన్ని కల్పించుకున్నారు. ఏ ప్రాంతీయ జానపద సాహిత్యమైనా ఆ ప్రాంత భాషను ప్రతిబింబిస్తూ కల్పించబడుతుంది. దానికి గల కారణం మానవులు సృష్టించుకున్న అద్భుత సృష్టి భాష. "పరస్పర భావ వ్యక్తీకరణకు సామాజికులు వాగ్రూపంలో వెలువరించే సంకేతాల నియత నిర్మాణమే భాష. సమాజం దీన్ని సమిష్టిగా సృష్టించుకొన్నది. సమిష్టి సాధనంగా వాడుకొంటున్నది. కాలగతిలో కొన్ని శతాబ్దాలు, సహస్రాబ్దాలు గడవగా వాగ్రూపానికి లిఖిత రూపం ఏర్పడింది. వాగ్రూపం మౌలికం శ్రవణ మాత్ర బోధకం. రెండోది దానికి విధేయం. పఠన మాత్ర బోధకం."[57] అలా తరతరాలుగా సంతరించుకున్న మౌఖిక రూపంలో భాష లిఖిత రూపంగా రావడానికి ఎన్నో పరిణామాలు జరిగాయి. చివరకు వాళ్ల భాషా సామాజిక అవసరాలను తీర్చుకోవడానికి ప్రమాణ భాషను ఏర్పరచుకున్నారు.

ప్రస్తుతం మనం వ్యవహరిస్తున్న భాషకు మూలాధారం జానపద భాష. ఆ భాషలో పదాలు ప్రాచీనం నుండి ఆధునికత వరకు ఎన్నో మార్పులతో పరిపూర్ణత సంతరించుకున్న భాషగా స్థిరపడింది. కానీ ప్రాచీన లేదా జానపద భాషకు దక్కాల్సిన గౌరవం దక్కలేదనే చెప్పాలి. ఇప్పటికీ జానపదులు లేదా గ్రామీణులు వ్యవహరించే భాషపై చదువుకొన్నవారు, పట్టణ వాసులకు చులకన భావం ఉంటుంది. నాగరికులుగా మారిన మన భాషకు ప్రాణ ప్రతిష్ట చేసిన మూల భాష జానపద భాష.

"రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దుల జిల్లాల భాష యాసలను పరిశీలించినట్లయితే మన జానపద భాష సంపద గొప్పతనం తెలుస్తుంది. నిఘంటువులో చోటుచేసుకొని ఎన్నో పదాలు మనకు కానవస్తాయి. తెలంగాణ భాషేనని, అది మాండలికం కాదని చెప్పడానికి కావలసినన్ని

[57]దక్షిణామూర్తి, పొరంకి. 1992 భాష-ఆధునిక దృక్పథం. సికింద్రాబాదు: శివాణి ప్రెస్. పే - 2

ఆధారాలున్నాయి. అంతేగాదు రెండున్నర జిల్లాల ఆంధ్ర భాష అసలు భాషే కాదని, అది కేవలం మాండలికంగా నిరూపించడానికి అనుస్వారం, మూల ద్రావిడ భాషకు తెలంగాణ భాషకు గల దగ్గరి సంబంధం, అచ్చ తెలుగు పదాలు, తెలంగాణ భాషలోని పదాల మూలరూపాల్లో, భాషకు, బతుక్కీ సంబంధం మొదలైన చాలినన్ని సాక్ష్యాలున్నాయి"[58] రెండు జిల్లాల భాషను ప్రమాణ భాషగా వ్యవహరించడం వల్ల మాండలికాలపై తీవ్ర ప్రభావం పడింది. సజీవ భాషగా తరాల నుండి వస్తున్న మాండలిక భాష సొగసులు అంతరించిపోతున్నాయి. వాటి పరిరక్షణకు జానపద భాషాసాహిత్య పరిశోధననే తిరుగులేని మార్గం అవుతుంది. ప్రాచీన భాషా సౌందర్యాన్ని ఇంకా తన గుప్పిట్లో పెట్టుకున్న జానపదుల భాషను పరిశీలించాలి. అమూల్యమైన తెలుగు భాష పదజాలాన్ని సుసంపన్నం చేయడానికి మాండలిక నిఘంటు నిర్మాణం జరగాలి.

ఉత్తర తెలంగాణ జిల్లాలో ఒకటైన జగిత్యాల జిల్లాకు ఎటువంటి అన్యభాషల సరిహద్దు ప్రాంతాలు లేకపోవడం వల్ల ప్రాచీనత సంతరించుకున్న అనేక భాష పదాలు మనకు కనిపిస్తాయి. బృహత్ జానపద భాషా నిఘంటు నిర్మాణానికి ఉపయోగపడే పదజాలం దొరుకుతుంది. ఆ పరిశీలన క్షేత్ర పర్యటన ఆధారంగా, ప్రత్యేకంగా చేయవలిసిన పని. ప్రస్తుతం నాకు దొరికిన జానపద కథల్లో భాషా విశేషాలను పరిశీలించడం ఈ అధ్యాయ ముఖ్యోద్దేశం..

## 6.1 మాండలిక పదాలు

"ఒకే భాషకు ప్రజల వ్యవహారంలోనూ, పదాలలోనూ వాటి ఉచ్చారణలోనూ, ప్రత్యయాలలోనూ, పదాల అర్థాలలోనూ బేధాలు ఉండి ఆ భాషలో రకాలు ఉంటాయి. ఒకే భాషకు ఉన్న ఇటువంటి రకాలను మాండలికాలు అని అంటారు."[59] ఒక ప్రాంతంలో వ్యవహరించే ఒక భాషకు అంతర్విబేధాలు ఉండటం సహజం. అంతమాత్రాన అదే భాషకు చెందనది అనడానికి వీలులేదు. ఆ అంతర్విబేధాలు ఏర్పడటానికి అనేక కారణాలు ఉంటాయి. అందులో ప్రజల జీవన

---

[58]సుమాలినీ రెడ్డి, కె. 2013. జై కిషన్ అభఇనందన సంచిక. హైదరాబాదు: దక్కన్ ఆర్కియలాజికల్. పే - 107

[59]సుబ్రహ్మణ్యం, పి. యస్. 1997. ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం. పే - 174

విధానం గాని, సామాజిక పరిస్థితులు గాని అయి ఉంటాయి. ఉదాహరణ 'పోపు' అనే పదానికి 'తాళింపు' అని ఒక ప్రాంతంలో, 'పోని' అని మరో ప్రాంతంలో వ్యవహరిస్తారు. ఇలా ఒకే భాషలో ఎన్నో పదాలు అర్థబేధాలతో, ఉచ్చారణలో, ప్రత్యయాల మార్పులతో వ్యవహరించడం కనిపిస్తుంది.

గుండిగల – గొంతులో

బలిమార్తం – ఆత్మహత్య

కైకిలి – కూలీ

పొద్దులు – నవమాసాలు

పేరు – హారం

యారండ్లు– తోటి కోడల్లు

ఆకిట్ల– వాకిలి

సందూగ– సూటికేసు

రవ్వ– మాంసపు ముక్క, చేపలో ఒక రకం

కౌసు– మాంసంతో చేసిన వంటకం

సియ్యలు– మాంసపు ముక్కలు

రౌతు – విసుర్రాయి

మసికంత పేలక – మసిగుడ్డ

ఆపతి – ఆపద

కమ్మగ – రుచిగా

వానెలిసే– వాన తగ్గడం

సూరుపొన్న– చూరు వెంబడి

సత్తెంగ– నిజంగా, సత్యముతో

లెంకిన – వెదకడం

బొడ్డి – భర్త లేని స్త్రీ, తిట్టు

బొచ్చె – చాతీ

అంగట్ల– అంగడి, సంత

రూపాలు – రూపాయాలు

తరకలు – విధానాలు, విధాలు

కచ్రం – ఎడ్ల బండి

అలుకు చల్లడం– కలాపి చల్లడం

జమాన్లు – అధికారులు

మాల్యం – మూల్యం

బుడ్డగొసి – పంచె కట్టు విధానం

సాత్రం – శాస్త్రం, పొడుపుకథ, కథ

కొయ్యపోవడం – వరి, మొక్కజొన్న కొయ్యడానికి వెళ్లడం

మత్తు – బాగా

కంచం – పళ్లెం

పట్టెన్ని – బాగా, చాలా

మత్తునొల్లు– డబ్బు ఉన్న వాళ్లు

ఇన్నొద్దులు– ఇన్ని రోజులు

సంపతులు– సంపదలు, భోగభాగ్యాలు

గవ్వెత్తు – కొంచమైనా

కూకుంటే – కూర్చుంటే

కాట్నల గడ్డ– స్మశాన వాటిక

అన్నితీర్ల– అన్ని విధాలు

గుంజడం – లాగడం, బలత్కరించడం

అప్పజెప్పుడు– ఇచ్చి రావడం

నీళ్లుపొసుకుంటది – గర్భిణిగా ఉండటం

పత్త – స్థానం

జాడ – ఆచూకి

బోగపామె– వేశ్య స్త్రీ

సిలుక కొయ్య– వేలాడదీయడానికి ఉపయోగించేది

దండుగు – జరిమానా

పుస్తెలు – మంగళసూత్రం

బాజు – ప్రక్కన

కచ్చీరు–గ్రామ సభ గద్దె, గ్రామ పంచాయితీ దగ్గర

అరుసుకోడం – మంచిగా చూసుకోవడం

గడ్క, గట్క – జొన్న, రవ్వ తో వండిన ఆహారం

పతాని – ప్రధాని

కలపోవడం – కలుపుకు పోవడం

ఎవుసాయం – వ్యవసాయం

యాష్ట – అలసిపోవడం

ఇమానం – ఒట్టు, ప్రమాణం

జాగ – స్థలం

పెండ్లాం – భార్య

తవుసులు – తపస్సు

రంధి– చింత, విచారం

సాలు – పోలిక

తొవ్వ– దారి, మార్గం

మగ్గడం – ఉపశమనం

అరగంచుకు–ఇంటి ముందు గద్దె చివరి భాగం

ఒంటేల్ – మూత్రం

ముత్తెమంత – కొంచెమంత

అడగళ్లు – తాటి కల్లులో ఒక రకం

పాశం – పాయసం

ఒంటిగళ్ల కల్లు– చెట్ల కల్లులో ఒక రకం

నెరివడి – అలసిపోయి

పంగ— రెండు కర్రల మధ్య

మందలియ్యాలే – పలుకరించాలి

గాయింత— ఆ కొంచెం

పట్నాలు – పట్టణాలు

వేపారం – వ్యాపారం

తక్కెట్ల – తరాజు

పుల్లెందులు – కష్టాలు

బింకి — కల్లు కుండ

ఎనుకట – పూర్వం

ఆవుసలయిన— విశ్వబ్రాహ్మణ, కంసాలి

కుడకలు— కొబ్బరి చిప్ప, కొబ్బరికాయలో తెల్లని ముక్క భాగం

అంబలి — రాగి జావ

బుకా — కుంకుమ, పసుపు కలసిన పదార్థం

కరాబు – చెడిపోవడం

చారాన— 25 పైసలు

పొలగడు – పిల్లవాడు

దూప – దాహం

బజారు – మార్కెట్

వజన్— బరువు, భారం

బుక్కుతవ – తింటవ

పడుసోడు – యువకుడు

జంగల్ — అడవి

దండిది — బాగా, ఎక్కువ

కంచం — పళ్లెం

ఇవరిదాక – ఇప్పటివరకు

అంగట్ల – సంత

గరీబు – పేద

పాబంది– ఒప్పందం

తికానా – స్థలం

పరేషాన్ – ఆశ్చర్యం

కాయిసు– ఇష్టం, మనసు పడటం

కతం – పూర్తిగా

సౌరం– క్షౌరం

మంకుపట్టు – మొండి పట్టు

కర్సు – ఖర్చు

ఆర్యం – ఆహార్యం

బిగ్గిత – గట్టిగా

లడాయి – గొడవ

ఎర్కె – తెలుసు

పోకట– గర్వం

సత్తనాశం – సర్వ నాశనం

బాడిగ –అద్దెకు

ఒకెల్లి – ఇంకోవైపు

దావత్ – జల్సా, విందు

ఎండ్రికాయ – పీతలు

నపరొక – మనిషికొక

దావర – దేవర

ఇజ్జత్తు – మానం, పరువు

రేషం – రోషం

తర్కాటు – చిక్కు ముడి

వజన్ – బరువు

పికర్ – చింత

శెర్తు – పోటి, పందెం

బలిమిటికి – బలవంతంగా

నడిబజారు – కూడలి, కమాను

మాపటికి – మధ్యాహ్నంకు

అవుసలయిన – కంసాలివాడు

పిడాత – వెంటనే, త్వరతిగతిన

పొక్కలు – రంధ్రాలు, గుంటలు

బొచ్చెంత – చాతీపై భాగం అంత

దొరింపు – కుదుర్చు

ఇగురం – తెలివి, బతుకుదెరువు

ఒర్రె – వాగు

బారానా – 75 పైసలు

దవ్వన – వెంటనే, దబ్బున

సెనార్తులు – కృతజ్ఞతలు, వందనాలు

రెక్కల కష్టం – కాయకష్టం, స్వీయకృషి

రికాబు – సిబ్బిరేకు, మూత

బగోని – పెద్ద గిన్నె

అంబలి – జొన్న జావ

సకినాలు – బియ్యంతో చేసే పిండి వంటకం

ఒల్లెకం – తమాషా పలుకు

పొద్దుందాక – పొద్దు నుంచి సాయంత్రం దాకా

ఏరుపోత్త – వేరు కాపురం పెట్టిస్త

మందొొడ్డు – ఎదురు ఒడ్డు వైపు

కర్సు – ఖర్చు

అవ్వగారిల్లు – పుట్టినిల్లు

సత్తు ముద్ద – బియ్యపు పిండితో పిసికిన ముద్ద

సర్వసాకిరి – అన్ని పనులు

కొొంటపోతె – తీసుకెళితే

రికాబు – మూత

పీనుగు – శవం

నడిగంగల – గంగ మధ్యలో

సందుగు – పెట్టె

ఏంచడం – లెక్క పెట్టడం

ఒర్రె – వాగు

పుసక్కన – వెంటనే, నోరుజారి, ఉన్నట్టుండి

పూలుబిడ్జి – వంతెన

## 6.2 అన్యదేశ్యాలు

ఏ భాషలోనైనా పదాలు దేశ్యాలు, అన్యదేశ్యాలు అని రెండు రకాలుగా ఉంటాయి. మూలభాష నుండి సంక్రమించినవి దేశ్యాలు, మిగితావి అన్యదేశ్యాలు. భాషలో కొత్త పదాలు చేరడానికి కారణం ఆదానం. సాధారణంగా ఒక భాషను మాట్లాడే ప్రజలు భౌగోళికంగా సమీపవర్తి భాషల నుండి గానీ, సాంఘిక, రాజకీయ, మత, సాంస్కృతిక, వాణిజ్య సంబంధాల వల్ల దూరవర్తి భాషల నుండి కొత్త పదజాలాన్ని గ్రహిస్తారు. ఒక భాష వ్యవహర్త ఒక వస్తువుని గానీ, ఒక భావాన్ని గానీ సూచించడానికి తగిన పదం తన భాషలో లేనప్పుడు ఆ సందర్భాన్ని బట్టి వేరొక భాష నుండి స్వీకరిస్తాడు. అవి మాతృ భాషలో యదాతథంగా గానీ, కొద్ది మార్పులతో గానీ చేరతాయి.

భారతదేశంలో సుల్తానుల పాలన వల్ల క్రీ.శ.1206లో కుతుబుద్దిక్ ఐబక్ స్వతంత్ర సామ్రాజ్యాన్ని స్థాపించినప్పటి నుండి భారతదేశంలో స్థానిక భాషలపైన మహ్మదీయ, ఇస్లామిక్ భాషల ప్రభావం కనిపిస్తుంది. తెలంగాణ 1724 నుండి 1948 వరకు నిజాం పాలనలో మగ్గింది. పాలన

భాష, బోధన భాష ఉర్దూ చేయడంతో తెలంగాణ భాష సమాజ, సంస్కృతులపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఆనాటి నుంచి నేటి వరకు తెలంగాణ ప్రజల భాషలో ఎక్కువగా ఉర్దూ భాషా పదాలు విరివిరిగా వచ్చి పడ్డాయి. అలాగే నేడు ఇంగ్లీషు మీదున్న వ్యామోహం వల్ల ప్రజల్లో ఇంగ్లీషు భాష పదాలు ఎక్కువగా వచ్చిచేరాయి. పత్రికలు, టీవీలు, మీడియా తదితర మాధ్యమిక రంగాల ప్రభావంతో జానపదుల్లో ఇంగ్లీషు పదాలు, ప్రమాణ భాష పదాలు ఉపయోగం పెరిగి, దేశ్య పదాల వాడకం తగ్గిపోతుంది.

కతం – ముగింపు

తువ్వాల – కండువా

బజారు – మార్కెట్

జమాన్ – పూర్వం

రశీదు — చీటి, చిట్టి, డబ్బు చెల్లించి తీసుకునే కాగితం

తాశీలు— భూమి పన్ను

పైకం – పన్ను

బందిఖానా – జైలు

వజన్— భారం, బరువు

జంగల్ – అడవి

జల్ది – తొందరగా

పత్త – స్థానం

జాడ – స్థితి

దోస్త్ – స్నేహితుడు

పకీరు – బిచ్చగాడు

దూప – దాహం

బరాబరి – సమానంగా

దుకాన్లు— కొట్టు, షాపులు

బంచోతు — బహెన్ చోతు – తిట్టు

చారాన– 25 పైసల బిళ్ల

రికాబు – మూత

సెర్తు – షరతు, పోటి

ఇజ్జత్తు – గౌరవం

దావత్ – విందు వినోదాలు

తికానా – నివాస స్థలం

### 6.2.1 ఆంగ్లపదాలు

లాస్ట్ – చివరకు LAST

పంక్షన్ – కార్యక్రమం FUNCTION

రడిగ – సిద్ధంగా READY

కరక్టే – నిజమే CORRECT

టైం – సమయం TIME

వేస్ట్ – వృథా WASTE

డైరక్ట్‌గా – నేరుగా DIRECT

డౌట్ – సందేహం DOUBT

రీవర్స్– వెనుకకుREVERSE

కింటాల్ – 100 కిలోలు QUINTAL

సిగ్నల్ – సంకేతం SIGNAL

స్పీడు – వేగం SPPED

సౌండు – ధ్వని SOUND

క్లీయర్ – చెల్లుబాటు CLEAR

### 6.2.2 ఆంగ్ల పదాలు అజంతాలుగా మారడం

టాక్టర్లు - TRACTOR

బాటిలు – ప్లాస్టిక్ డబ్బా BOTTLE

మ్యాటరు – విషయం MATTER

పిస్తోలు – రివల్వర్ PISTOL

డెలివరి – ప్రసవం DELIVARY

ఏరియా – ప్రదేశం AREA

చాన్సు – అవకాశం CHANCE

సపోర్టు – సహాయం SUPPORT

చార్జీలు – చెల్లింపు CHARGES

షటరు – ఉన్ని చొక్కా SHUTTER

ప్రెగ్నెంటు – గర్భిణి PREGNANT

నైటు – రాత్రి NIGHT

ఫులు అడ్రసు FULL ADDRESS

హాఫ్ కిలోమీటరు HALF KILOMETER

## 6.3 మిశ్రమ పదాలు

రెండు వేర్వేరు భాషలకు సంబంధించిన పదాలను కలపడం లేదా సంధి చేయడం వల్ల మిశ్రమ పదాలు ఏర్పడతాయి.

ఫస్ట్ భార్య

పూలుబిడ్జి

సద్దిబాక్స్

పలానారేట్

## 6.4 కాలానికి, కొలతలకు సంబంధించిన పదాలు

మూన్నేళ్లు – మూడు నేలలు

మాన్క – 5 కిలోల పాత్ర

అడ్డె/అడ్డెడు – 10 కిలోల పాత్ర

పావుల, చారాణా – 25 పైసల బిళ్ళ

నూటొక్క బుజాకీర్తులు – 101 గౌరవపూర్వక నామాలు

సోడు బియ్యం – 2 కిలోల బియ్యం

నాలుగక్కల్ల – నాలుగు చోట్ల

అరవిసం – అర్ధ భాగం

జానెడు – చేతి ఐదు వేళ్ల భాగం

మూరెడు – మూర

అరుసోడు – కిలో

బారానా – 75 పైసలు

ఆఠానా – 50 పైసలు

చారానా – 25 పైసలు

## 6.5 ధ్వని మార్పులు

ఒక భాషలో ఒక కాలంలో ఉన్న ధ్వని తరువాతి కాలంలో ఒకటిగా లేదా అంతకన్న ఎక్కువ ధ్వనులుగా మారడాన్ని ధ్వని పరిణామం అంటారు.

## 6.5.0 వర్ణ సమీకరణం

వేరు వేరు వర్ణాలు ఇతర వర్ణాల ప్రభావం వల్ల మార్పు చెందడాన్ని వర్ణ సమీకరణం అంటారు.

బత్తి – భక్తి

బావన్లు – బ్రాహ్మణులు

ఏడంత్రాలు – ఏడు అంతస్థులు

## 6.5.1 పర వర్ణ సమీకరణం

పరవర్ణ ప్రభావం వల్ల పూర్వ వర్ణం చివరి అచ్చు లోపించడాన్ని పరవర్ణ సమీకరణం అంటారు.

దండుగెత్తడు – దండుగ + ఎత్తడు

బూదేవంత – భూదేవి + అంత

భుజకీర్తులు – భుజకీర్తి + లు

## 6.5.2 పూర్వ వర్ణ సమీకరణం

పూర్వ వర్ణ ప్రభావం వల్ల పర వర్ణం మొదటి అచ్చు లోపిస్తుంది.

కన్ను + లు – కండ్లు

కోడి + ని – కోన్ని

మంచి + నీళ్లు – మంచీళ్లు

మూడు+ నెలలు – మూన్నేళ్లు

### 6.5.3 వర్ణాగమం/వర్ణాధిక్యం

కఠిన పదాల ఉచ్చారణను తొలగించడానికి ఒక వర్ణం వచ్చి అధికంగా చేరడాన్ని 'వర్ణాగమం' అంటారు.

రాకువనంగ – రాకు అనంగ, రావద్దని అంటే

గావాల్న – కావాలా

నీయంత – నీవు అంత

ముత్తెమంత – ముత్యం + అంత

ఇయ్యాళ – ఈ + వేళ

చీకటియాళ్ల – చీకటి + వేళ

బోగపామె – బోగపు + ఆమె

ఇసొంటి – ఇటువంటి

పగటీలి – పగటి వేళ

ఆవుష్షు – ఆయుషు

అడక్కు – అడుగు

వేపారం – వ్యాపారం

తెల్లారిందాక – తెల్లారి దాక

### 6.5.4 వర్ణలోపం/వర్ణనాశనం

ఒక పదంలోని వర్ణం లోపించడాన్ని 'వర్ణనాశనం' అంటారు.

ఆరండ్లు – యారండ్లు

రూపాలు – రూపాయలు

కోన్ని – కోడిని

ఎవుసాయం – వ్యవసాయం

ఆడోకటి – అక్కడోకటి

ఇయ్యపుడు – వియ్యపుడు

పాయిసం – పాయసం

పానం – ప్రాణం

కట్టకాలం – కష్టకాలం

సాయకారం – సహకారం

### 6.5.5 లోపదీర్ఘత

ఒక పదంలో ఒక వర్ణం లోపించి ముందున్న స్వరాన్ని దీర్ఘం చెయ్యడాన్ని 'లోపదీర్ఘం' అంటారు

గుర్రాలు – గుర్రము + లు

ఏడ – ఎక్కడ

ఆడ – అక్కడ

అక్కన్నుంచి – అక్కడ + నుంచి

ఇంకోనికి – ఇంక + ఒకనికి

### 6.5.6 స్వరలోపం

ఒక పదంలో ఒక అచ్చు మాత్రమే లోపించడాన్ని 'స్వరలోపం' అంటారు.

మాల్యం – మూల్యం

రేషం – రోషం

పట్నాలు – పట్టణాలు

దాన్ల – దానిలో

తోల్కపొయి – తోలుకుని పొయి

ఎర్కె – ఎరుక, తెలుసు

ఇగో – ఇదిగో

రోటి – రోకలు

కొట్కచ్చి – కొట్టుకుని వచ్చి

బామ్మర్ది – బావమరిది

### 6.5.7 స్వర భక్తి

భిన్న హల్లుల మధ్య అచ్చు చేరడాన్ని 'స్వరభక్తి' అంటారు. ఉచ్చారణ సౌలభ్యం కోసం పదాలను విడమరచి వాడుకుంటారు.

నకిలేసు – నెక్లెసు

బుదరకిచ్చిన – బుద్రకిచ్చిన

ఆర్నెల్లకు – ఆరు నెలలకు

### 6.5.8 వర్ణవ్యత్యయం

పదాల్లో వర్ణాలు తారుమారు అయి పలకడాన్ని వర్ణవ్యత్యయం అంటారు.

అవిటికి – వాటికి

ఇవరిదాంక – ఇదివరిదాక

అగ్గిదలగ – అగ్గిదగల

## 6.6 వర్ణ మార్పులు

ఒకే భాష వ్యవహరిస్తున్న ప్రాంతంలోనే ఒక ప్రాంతానికి మరో ప్రాంతానికి మధ్య భాషా వ్యవహార తారతమ్యాలు కనిపిస్తుంటాయి. అవి కుల, మత, ఆర్థిక, అక్షరాస్యత మొదలైన విషయాలపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా జానపదులు పల్లెవాసులు కాబట్టి వారి భాషాయాసలో తేడాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఒకే భాషా వ్యవహరిస్తున్న స్వల్ప ఉచ్చారణ బేధాలతో వర్ణాల్లో మార్పులు జరగడం సహజం.

### 6.6.1 చ>స, చ>జ గా మారడం

సూరు – చూరు

సిలుక – చిలుక

సాకలోల్లు – చాకలివారు

సక్కదనం – చక్కదనం

ఓర్సుకుంట – ఓర్చుకుంట

సూడు – చూడు

జెప్పల్నంటుండు – చెప్పలంటుండు

లగ్గం జేత్తని – పెళ్లి చేస్తానని

సర్వసాకిరి – సర్వ చాకిరి

### 6.6.2 క>గ, గ>క లుగా మారడం,

గొంత – కొంత

గావాల్న – కావాలా

నాగ్గూడ – నాకు కూడ

ఇగిలించు – ఇకిలించు

అడెగళ్లు – అడెకళ్లు

అడుక్కు – అడుగు

ఇస్తగని – ఇస్తా కాని

పొద్దుగాల్ల – పొద్దు కల్ల, ఉదయానే

### 6.6.3 చ>శ, శ>స, ష>స గా మారడం

శానాసేపు – చాలాసేపు

ఆకాసం – ఆకాశం

సావుకారి – షావుకారి

శెర్తు – చెర్తు, మొండివైఖరి

పాశిపని – పాచిపని

### 6.6.4 ద>గ మారిన రూపాలు

ముంగట – ముందట

### 6.6.5 ప>బ గా మారడం

పానం బీకిన – ప్రాణం పీకిన

ఆడికి బోయిన – అక్కడికి పోయిన

## 6.7 పదాది 'వ' లోపించడం

తెలంగాణ భాషా వాడుకలోనే పదాది వ లోపించడం సహజంగా కనిపిస్తుంది.

ఆకిల్లు – వాకిల్లు

ఇయ్యంకుడు – వియ్యంకుడు

అమ్ముకచ్చి – అమ్ముక వచ్చి

ఈడు – వీడు

ఎంబడి వడుతరు – వెంబడి పడుతారు

ఏసుతాసు వోకుంట – ఏసుతాసు పోకుండా

ఎంబడి – వెంబడి

ఎవుసాయం – వ్యవసాయం

ఎండి – వెండి

ఎనుక – వెనుక

ఏరుపోత్త, ఏరువోత్త – వేరు పోస్తాను

అంకాయ – వంకాయ

## 6.7.1 పద మధ్య 'వ' లోపించిన రూపాలు

గంగకొయి – గంగకి వెళ్లి

రాజచ్చిండు – రాజు వచ్చిండు

మంచోడు – మంచివాడు

## 6.7.2 కొన్ని సందర్భాలలో 'ప' స్థానంలో 'వ' చేరడం

కింద వడి – కింద పడి

లావడితే – లేపడం

ఎటు వోతుంది – ఎటు పోతుంది

గంగలవడి – గంగలపడి

తవుసులు – తపసులు

నెరివడి – నెరిపడి

గోడలకగ్గివెట్ట – గోడలకు అగ్గిపెట్ట

## 6.8 క, ష ల సంయుక్త రూపమైన క్ష స్థానంలో క, చలు కలిసిన 'క్చ' అని రావడం

దక్చిణాది – దక్షిణాది

వట వుక్చం – వట వృక్షం

మఱ్రి వుక్చం – మఱ్రి వృక్చం

పత్యక్చం – ప్రత్యక్షం

లచ్చిందేవుడు – లక్ష్మీదేవుడు

## 6.9 మహప్రాణాలు – అల్పప్రాణాలుగా మారడం

అచ్చ తెలుగు భాష పదాల్లో మహప్రాణాలతో కూడిన పదాల వాడుక చాలా అరుదు. అలాగే జానపద సాహిత్యంలో కూడ మహప్రాణాల వాడకం తక్కువే. ఎందుకంటే దేశ్యపదాలతో నిర్మితమై సాహిత్యానికి మహప్రాణాల అవసరం తక్కువ. నాగరికుల భాషకు మూలం గ్రామీణ జానపద భాష అని అనుకున్నాం. దానర్థం ప్రాకృత, పామర, గ్రామీణ, దేశ్య, జానపద భాషను సంస్కృతీకరించే సృష్టించబడ్డది శిష్ట భాష, సంస్కృత భాష, ప్రమాణ భాష. సామాన్య వ్యవహారంలో కన్పించే భాషలో కూడ మహప్రాణాలతో ఉన్న పదాలను అల్ప ప్రాణాలతో పలుకుతారు. కాని లిఖిత, లేఖన సంప్రదాయంలో మాత్రం మహప్రాణాలను రాయడం తప్పనిసరి.

బోజనం – భోజనం

నిగ – నిఘా

చారాన – చారాణ

గోరంగ – ఘోరంగా

దర్మాంగరాజు – ధర్మాంగరాజు

బార్య – భార్య

రతం – రథం

కతం – ఖతం

బూమ్మీద – భూమ్మీద

బూదేవంత – భూదేవి అంత

పట్నాలు – పట్టణాలు

శికారణ్యం – శిఖారణ్యం

కరాబు – ఖరాబు

బగవంత – భగవంత

కర్సు – ఖర్చు

ముకం – ముఖం

పతాని – ప్రధాని

## 6. 10 రేఫ లోపించిన పదాలు

కొన్ని పదాల్లో పదాది 'ర' వర్ణం లోపిస్తే మరికొన్ని పదాల్లో పద మధ్యలో కూడా రేఫ లోపించింది

పత్యక్చం – ప్రత్యక్షం

పతాని – ప్రధాని

పానం – ప్రాణం

ఎంటుకలు, ఎంటికెలు – వెంట్రుకలు

పోడ – పోరడు

పొలగాండ్లు – పోరగాండ్లు

## 6.11 పదాది 'అ' స్థానంలో 'గ' వచ్చి చేరే రూపాలు

ఉత్తర తెలంగాణలో ముఖ్యంగా కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో పదాది 'అ' తో పలికే పదాలు అ స్థానంలో 'గ' వచ్చి చేరుతుంది.

గంత – అంత

గీయింత – అయింత

గివి – ఇవి

గిట్నె – అటులనే, అలాగే

గటు – అటు

గాడికి – అక్కడికి

గీడికి – ఇక్కడికి

## 6.12 శబ్ద పల్లవం

ఒక ధాతువుకి వేరొక ధాతువు గాని, నామవాచకం గాని చేరి పూర్వ పర పదాలకు చెందని ఒక విలక్షణ అర్థాన్ని స్ఫురింపచేసేది 'శబ్ద పల్లవం' అంటారు.

మంచోడు – మంచి + వాడు

పక్కూరు – పక్క+ ఊరు

భుజకీర్తులు – భుజ + కీర్తులు

పాలరాతులు – పాలు + రాతులు

## 6.13 హ లోపించిన రూపాలు

బ్రమ్మన్లు – బ్రాహ్మణులు

తాశీలు – తహశీలు

అరిగోస – హరిగోస

ఆర్యం – ఆహార్యం

సాయిబ్ – సాహెబ్

## 6.14 పూర్ణానుస్వరం రావడం

పట్నంల – పట్టణంలో

లచ్చిందేవి – లక్ష్మీదేవి

సంతంగా – స్వంతగా

గుర్రంకగ్గిదలగ –గుర్రముకు అగ్గిదగల

## 6.15 రెండర్థాలు కలిగిన పదాలు

పోకట – పోవడం, గర్వం

రాకట – రావడం, రాకుట

ముండబొడ్డి – స్త్రీ, తిట్టు, అక్రమ సంబంధాల పెట్టుకున్న స్త్రీ

లంజబొడ్డి – స్త్రీ, తిట్టు

బందు – మూసివేయడం, పక్కకు, తాడు

భూమి జాగ – స్థలం, ప్రదేశం

## 6.16 నిందార్థ ప్రయోగాలు

పెద్దపులి గిద్దపులి

గరీబు సరీబు

అసొంటి గీసొంటి

## 6.17 సంయుక్త పదాలకు ద్విత్వాన్ని చేర్చడం

ఎట్టా – ఎట్లా

దచ్చిణం – దక్షిణం

బామ్మర్ది – బావమరిది

తీపిత్త – తీపిస్తాను

కట్టకాలం – కష్టకాలం

బత్తి – భక్తి

దోత్తది – తోస్తుంది

ఇత్త – ఇస్తా

వత్త – వస్తా

ఆన్నే – వాడినే

## 6.18 సంఖ్యా వాచకాలు

కోటొక్క మొక్కులు

కోటి తపసులు

కోటి పుణ్యాలు

తొమ్మిది గడియలు

ముద్రోజులకు మురిపిచ్చె

అరవై జనులు

డెబ్బై కోట్ల దేవతలు

## 6.19 కాడ, పొన్న, పొంటి, సుంది, కాంగ పదాలను దగ్గర, వద్ద, నుండి, తర్వాత అనే అర్థంలో వాడటం

నీకాడ – నీ దగ్గర

బాయికాడ – బావి దగ్గర

ఉన్న కాడ – ఉన్న దగ్గర

పన్న కాడ – పడుకునే దగ్గర

ముక్కుకాడ – ముక్కు దగ్గర

కత్తుల పొంట – కత్తుల వద్ద

అచ్చిన సుంది – వచ్చిన నుంచి

అప్పటి సుంది – అప్పటి నుంచి

దారిపొన్న – దారి అంచు వెంబడి, దారి మార్గంలో

రోజులు కాంగ – కొన్ని రోజుల తర్వాత

రోటిపొంట – రోకలు పక్కన

ఒర్రెలపొంట – వాగు పక్కన

## 6.20 సర్వనామాలు

అండ్ల – అందులో

దాన్ల – దానిలో

ఇంగో – ఇదిగో

ఆడ – అక్కడ

నీయంత – నీవు అంత

అసొంటి – అటువంటి

ఇసొంటి – ఇటువంటి

ఏడ – ఎక్కడ

ఇగో – ఇదిగో

(అగో అదిగోలు, ఇగో ఇదిగో అనే పదాల మధ్య స్వల్ప తేడాలుంటాయి. అది ఉచ్ఛారణ స్వర తీవ్రత ఆధారంగా అర్థం మారుతుంది.)

## 6.21 'ఒల్లు'తో ఏర్పడిన పదాలు

గరిబొల్లు – గరిబు వాళ్లు, పేదవాళ్లు

సాకలొల్లు – చాకలివారు

అన్నవొల్లే – అన్న తరువాత

ఏరేటొల్లు – వేరే వాళ్లు

ఉన్నోల్లు – ఉన్నవాళ్లు (డబ్బు ఉన్న వారు)

ఆడకట్టొళ్లు – ఒకే వీధిలో ఉండేవారు

సంవత్సరాలొల్లు – ఎంత వయస్సు

## 6.22 సంధులు

జానపదుల వ్యవహారంలో తెలుగు పదాల పొందిక ఎక్కువ కనిపిస్తుంది. కాబట్టి సంస్కృత సంధులకు, సమాసాలకు భిన్నంగా తెలుగు పదాలతో సంధులు, సమాసాలు ఏర్పడతాయి. అందుకే ఈ జానపద కథల్లో తెలుగు సంధులే ఎక్కువగా కనిపిస్తాయి.

ఇంకొకతి – ఇంక + ఒకతి (అత్వ సంధి)

కడుపంత – కడుపు + అంత (ఉత్వ సంధి)

ఇగద్దు - ఇక + అద్దు (అత్వ సంధి)

నాకియ్యాలన్నడు – నాకు + ఇయ్యాలన్నడు (ఉత్వ సంధి)

తౌడంబలి – తౌడు + అంబలి (ఉత్వ సంధి)

దండుగెత్తడు – దండుగు + ఎత్తడు (ఉత్వ సంధి)

నాగ్గూడ – నాకు + కూడ (గసడదవాదేశ సంధి)

ఏడేడు – ఏడు + ఏడు (ఆమ్రేడిత సంధి)

ఎన్నేన్ని – ఎన్ని + ఎన్ని (ఆమ్రేడిత సంధి)

బూమీ్మద – భూమి + మీద (ఇత్వ సంధి)

తొవ్వెంట – తొవ్వ + ఎంట (అత్వ సంధి)

బూదేవంత – భూదేవి + అంత (ఇత్వ సంధి)

ఇంటెనుక – ఇంటి + ఎనుక (ఇత్వ సంధి)

గుడెనుక – గుడి + ఎనుక (ఇత్వ సంధి)

నీకియ్యల – నీకు + ఇయ్యల (ఉత్వ సంధి)

పూలెత్తు – పూలు + ఎత్తు (ఉత్వ సంధి)

బోగపామె – భోగము + ఆమె (పుంప్వాదేశ సంధి)

వాతపురోగం – వాతము + రోగం (పుంప్వాదేశ సంధి)

పెయ్యంత – పెయ్యి + అంత (ఇత్వ సంధి)

ఇవెక్కడియి – ఇవి + ఎక్కడియి (ఇత్వ సంధి)

పక్కూరు – పక్క + ఊరు (అత్వ సంధి)

మల్లెంబడి – మల్ల + ఎంబడి (అత్వ సంధి)

బొచ్చంత – బొచ్చ + అంత (అత్వ సంధి)

## 6.23 జంట పదాలు, ఊత పదాలు

వెనువెంటనే వచ్చే పదాలను జంట పదాలని, సంభాషణ సమయంలో ఎక్కువగా పునరుక్తి చేస్తూ ఉపయోగించే పదాలను ఊత పదాలు అంటారు.

అవుళ్ల అవుళ్ల...!

గోస గోసోలే

దవ్వదవ్వ

అగో అగో

బరాబరి

పాత్రిపాత్రి

## 6.24 ధ్వన్యనుకరణ పదాలు

ధ్వనిని అనుకరించి ఉపయోగించే పదాలను ధ్వన్యనుకరణ పదాలని అంటారు.

సర్రు మని

బగ బగ

గజ గజ

టక టక

దడ దడ

## 6.25 తెలంగాణ బహువచన క్రియరూపాలు

నమ్ముర్ర!– నమ్మండి

బతుకుండ్రి– బతుకండి

అమ్ముకరార్రి – అమ్ముకొండి

ఒర్రుతున్నవ్ – అరుస్తున్నావు

ఉండుల్లి – ఉండండి

ఉంటుర్రు – నివసిస్తారు

చూడమంటుర్రు – చూడమని చెపుతారు

అమ్ముకరాపొండ్రి –అమ్మకానికి తీసుకెళ్లండి

ఆగుర్రి – ఆగండి

లగ్గమాడిండ్రు – పెళ్లి చేసుకున్నారు

బతకచ్చిండ్రు – వలస వచ్చారు.

బుక్కుతుండ్రు – తింటున్నారు

మర్రచ్చిర్రు – మరల తిరిగి వచ్చారు.

ఒడిసిపెయిండ్రు – చనిపోయారు.

## 6.26 పునరుక్తులు

ఒక విషయాన్ని దీర్ఘంగా, క్షుణ్ణంగా వత్తి చెప్పడానికి జానపదులు పునరుక్తులను ఉపయోగిస్తారు.

మొక్కంగ మొక్కంగ

పొల్లు పొల్లు

రాంగ రాంగ

ఉండుల్లి ఉండుల్లి

పోంగ పోంగ

## 6.27 పద బంధాలు, నూతన పద కల్పనలు చేయడం

జానపదుల ఒక భాషను వ్యవహరించేటప్పుడు ఆయా అవసరాలను బట్టి కొన్ని కొత్త పదాలను కల్పించుకుంటారు. ఇది సహజమైన కూర్పు కాని పనిగట్టుకొని చేసే చేర్పులు కావు. కొందరు లేదా ఎవరొకరు కల్పించిన నూతన పదం మౌఖికంగానే ఒకరి నుంచి మరొకరికి అలా సమాజానికి ప్రచారమవుతుంది. జానపదులు వారి వారి అవసరాలకు కొన్ని పదాలను కల్పించి కొత్త పద కల్పనలు చేయడమే నూతన పద కల్పనలు.

వాతపు రోగం (పక్షవాతం)

సర్వ అబద్ధాలు

సర్వ లంగతనాలు

బాల గర్భం

పక్కపొంటోడు

మోకాటి ఆలోచన

ఎన్ని తరకలు

లవ్ గడుసు

పొద్దుగాళ్ల

నల్లమొకం

కత్తుల మేడ

బొక్కల గంప

కోటి తపసులు

పట్టరాని తపసులు

శికారణ్యం

పొద్దులు పడుతయి

అరవకష్టం

వాడకట్టోళ్లు

పుట్టు పుట్టు పండితుడు

నడిజామ్ రాత్రి

సర్వసాకిరి

రెక్కల కష్టం

బగ్గభయం

ముట్టినయ్

లచ్చల కట్నం

సిర్రు చీకట్లు

మర్రు మబ్బులు

అవుసలయినే (కంసాలి)

బిర్రివోయి సూత్తరు

పొడమరసి

సత్తెనాశనం

శీతకుండోలె

మొత్తుకుంటరు

గుర్రంకగ్గిదలక

## 6.28 జాతీయాలు, నానుడులు, పలుకుబళ్లు

కట్టెసరుత్తడు

పట్టరాని తపసులు

అంగ్యాలు తిరుగు

ముఖం కొట్టింది

కండ్లకగ్గిదలగ

మొక్కరాని మొక్కలు

నోమరాని నోములు

ఏసుతాసు పోకుంట

అరవిసం ఆడబాల

నల్లమొకం రా కొడుకా

కోటికి పడగలెత్తడం

దొంగ బ్రె

సదువు సాత్రం

నడిగంగల

బలిమీటికి

తర్కు పట్కం

నడి బజారు

తాటికాయంత ముద్ద

నీకేమన్న తలకాయ ఉందా

సచ్చేంత విద్య

తలకాయ పట్టిండు

తిండితికానా

వాదాలు మోపనయ్

జొన్న రాశిలాగ అయింది

ఆకాశమంత పందిరి బూదేవంత గద్దేత్తడు

కండ్ల వడతరు

ముఖం చూసుకుంటలేరు

నోటి నిండారాగా

పనికగ్గిదలగ

తోకపీకుడుగాడు

పత్త జాడ

నీ కడుపుగాల

పానం జల్లుమన్నది

అగలు ఏడుపు

బారాన మందం పని
పానం ఏల్కపోతుంది
మొస తీత్తలేరు
కండ్లల్ల జీవునం పోయింది
రోటిపొంట కోడలు కూసింది
రెక్కల కష్టం
ఒక గుండుకు రెండు గుండ్లు
ఎండికొండ కైలాసుడు
బొమ్మడంగ రోగం
జరం జార్లే
మూడు తొవ్వల కాడ
గరీబు సరీబు
తలగొరిగిచ్చింది
పడగొట్టిండు
కొండపోయిండు
ఆడబిడ్డల కలఖల
బుద్ధి పుట్టించిండు
రాకట పోకట
అన్నం అంత సున్నమయ్యే
మునుపటి సంబంధం
కడుపు కట్టుకొని
నీ కడుపుల మన్నువడ
నీ జీవనం జీత్త
నీ నోట్లె మన్నువడ
గడతమన్ను గద్ద

## 6.29 సామెతలు

సరుకు బురుకు సంధులురుకు మా వోళ్లత్తే మందిల ఉరుకు

ఇగురమన్న గట్టిగ ఉండాలి ఈపన్న గట్టిగ ఉండాలట

కయ్యం పెట్టించిందన్నట్టు

పైసకు గుడిసెన్నర పెండ్లాం

ఎక్కడ తింటే అక్కడే బొత్త నింపుకుంటరు

నాలుక కోత్తె అక్షరం రాదు

అప్పు పచ్చల కన్న అవ్వగారిల్లు మేలట

తౌడు మంచిల్ల కన్న తల్లిగారిల్లు మేలట

పుట్టికూర కన్న పుట్టినిల్లు మేలు

బక్కెద్దు పికిలిచ్చి పిల్లను పెట్టిందట

పొద్దికి పొట్ట గడ్డ లేదు మాపటికి బట్ట గడ్డ లేదు

కట్టుకున్న ఇల్లు మనకు నీడ, పెట్టుకున్న గోడ మనకు సాటుగాని శివునికి ఏం సాటు

అన్నం ఎక్కువయితే ఆసరా ఎక్కువైతది

పొత్తులుంటే పోరు, వేరు వడితే మేలని

## 6.30 జానపదుల తిట్లు

మిండెడు

ముండకొడుకు

పీయి, పీతులు

లంజకొడుకా!

పిస ముండకొడుకా!

లంజ ముసలిదానవ్

ముండ బొడ్డి, లంజ బొడ్డి

నీ ఇంట్ల పీనుగెల్ల

# ముగింపు

తెలంగాణ ప్రాంతం జానపద సాహిత్యానికి నిలయం. జానపద సాహిత్యానికి సంబంధించిన ఎన్నో కళారూపాలు, గేయకథలు, కథలు, గేయాలు, జాతరలు, ఉత్సవాలు కనిపిస్తుంటాయి. అలాగే జానపద కథలు కూడా ప్రతి గ్రామాల్లో లభ్యమైవుతాయి. వాటిని సేకరించి పరిశోధించడం వల్ల నాటి పూర్వీకులకు సంబంధించిన అనేక విషయాలు వెల్లడవుతాయి. జానపద సాహిత్యంలో కథలకున్న ప్రత్యేకతే వేరు. వచనరూపంలో ఉన్న ఈ ప్రక్రియ చిన్న, పెద్ద తేడా లేక అందరిని అలరింపజేస్తుంది. వినోదాన్ని, నీతిని, సందేశాన్ని, ధర్మప్రభోదనను అందచేయడమే కాకుండా మన పూర్వీకుల సంస్కృతి, సంప్రదాయాలను, ఆచారాలను, విశ్వాసాలను, వారి జీవితాలను సైతం నింపుకొని మనకు కావల్సినపుడు తరచి చూసుకొనే విజ్ఞానగని. ఆ గనిని పెకిలించాలన్న, విజ్ఞానాన్ని తోడుకోవాలన్న మనకు మార్గాలు నేటి పల్లెలు, గ్రామాలు. ఇప్పటికీ గ్రామాల్లో జానపద కథకులు గుక్క తిప్పకుండా కథలు అలవోకగా చెప్పగలరు. ఎన్నో అద్భుతాలు, వింతలు, విశేషాలు, కల్పనలు, ఊహలతో కథలను అల్లగలరు. వీటిన్నింటిలో ఆంతర్యంగా మనకేదో ప్రభోదిస్తూ విజ్ఞాన వ్యాప్తిని తరతరాలుగా మనకందిస్తున్నవి జానపద కథలు. అద్భుతమైన కల్పనశక్తితో నేటికి నిలదొక్కుకొని ఉన్నాయంటే వాటి విశిష్టత మనం అర్థం చేసుకోవచ్చు. సామూహిక ఐక్యమత్యం, సంఘ పరిరక్షణలో తన అమూల్యమైన పాత్ర పోషించిన ప్రక్రియ జానపద కథ.

జానపద కథల్లో ఆ ప్రాంత ప్రజల జీవన విధానం, సంఘాన్ని సక్రమ మార్గంలో నిర్దేశించినందుకు నీతి బోధ కథలు, పిల్లల్లో ధైర్యాన్ని నింపే సాహస కథలు, కుటుంబాల్లో, సమాజంలో నైతికత, మానవీయ విలువలు పెంపొందించే కథలు ఇలా అనేకం కనిపిస్తాయి. జన వ్యవహారంలో వాడుకలో ఉన్న నానుడులు, పలుకుబళ్లు, సామెతలు, జాతీయాలు కూడా ఆయా కథల్లో ప్రతిఫలిస్తాయి. సమస్త మానవాళిని అలరించే జానపద కథల్లో వినోదానికి వినోదం, ఉపదేశానికి ఉపదేశం, లోకజ్ఞతకు లోకజ్ఞత మొదలయినవన్నీ సమపాళ్లలో రంగరించబడి సంప్రదాయంగా మన పూర్వీకుల నుంచి అందించబడ్డాయి.

జగిత్యాల జిల్లా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి విడివడి నూతన జిల్లాగా అవిర్భవించింది. కాబట్టి మొదటి అధ్యాయంలో జగిత్యాల జిల్లాకు చెందిన ప్రత్యేకాంశాలను తెలుసుకోవల్సిన అవసరం ఉందని భావించి జగిత్యాల చారిత్రకాంశాలను సంగ్రహంగా తెలిపాను. రెండవ అధ్యాయంలో జానపద కథ లక్షణాలను తెలుపుతూ జగిత్యాల జానపద కథల్లో కనిపించిన లక్షణాలను పరిశీలించాను. జగిత్యాల జిల్లాలో లభించిన జానపద కథల సమాచారాన్ని వస్తువు ఆధారంగా వర్గీకరణ చేసి, వర్గీకరణ పటాన్ని అందించి, విశేషాంశాలను వివరించాను. జానపదులు చెప్పిన జానపద కథలను వారి యాసలోనే అక్షరం పొల్లుపోకుండా సంగ్రహీకరించాను. ఆ జానపద కథల్లో విశేషాంశాలను వివరిస్తూ విశ్లేషణ చేసాను. జగిత్యాల జిల్లా జానపద కథల్లో ప్రధానంగా నీతిని బోధించిన కథలు, జంతు, మనుష్యులకు సంబంధించిన కథలు, హాస్య కథలు, యుక్తి కథలు, రాజనీతి కథలు, అదృష్ట, దురదృష్ట కథలు, సమస్యాత్మక, తట్టు కథలు మొదలైన కథలకు సంబంధించిన జానపద కథలను సరళ విభాగంలో చేర్చాను. అద్భుత కథలు, మత, ఆధ్యాత్మిక కథలు, చారిత్రక, పౌరాణిక కథలు, మానవ సంబంధాల కథలు, స్త్రీల కథలు, మహాభారత కథలు మొదలైన జానపద కథలను సంక్లిష్ట విభాగంలో చేర్చి వివరించాను.

నాకు లభించిన జానపద కథల్లో ఎక్కువగా మానవీయ, కుటుంబ సంబంధాలకు సంబంధించిన కథలు లభించాయి. కాబట్టి మూడవ అధ్యాయంలో కుటుంబ వ్యవస్థ గురించి తెలుపుతూ, జగిత్యాల జిల్లా జానపద కథల్లో చిత్రించబడిన కుటుంబ జీవన చిత్రణను చర్చించాను. జానపద కథల్లో ఎక్కువగా అత్త కోడళ్ల మధ్య కలిగిన తగాదాలతో చిత్రించిన కథలే ఎక్కువగా కనిపించాయి. తల్లిదండ్రులు పిల్లల పట్ల చూపించే ప్రేమ, ఆప్యాయతానురాగాలు చిత్రించబడ్డాయి. జానపద కథల్లో స్త్రీ పాత్ర చాలా ముఖ్యమైంది. తల్లిగా, చెల్లిగా, భార్యగా ఇలా అనేక పాత్రల్లో నిత్యం పడే సంఘర్షణలు, స్త్రీ చిత్రణ జానపద కథల్లో ఏవిధంగా చిత్రించబడిందో చూసాను.

నాల్గవ అధ్యాయంలో జగిత్యాల జిల్లా జానపద కథల్లో సాంఘిక, సాంస్కృతికాంశాలనే రెండు ఉప విభాగాలు చేసాను. ఆయా విభాగాల్లో మళ్లీ ఉపశీర్షికలతో కథల్లో కనిపించిన అంశాలను

ఉదాహరణలతో విశ్లేషించాను. సాంఘికాంశాల్లో  వ్యవసాయం, పశుసంపద, ఆర్థిక వ్యవస్థ, వర్తక వ్యాపారం, పరిపాలనా వ్యవస్థ, పేదరికం, వలస, కులాలు, కులవృత్తులైన కోమటి, చాకలి, మంగలి, రెడ్డి, కాపు, యాదవులు, కుమ్మరి, కంసాలి మొదలైన కులవృత్తుల పాత్రలు కథల్లో ఏవిధంగా చిత్రించబడ్డాయో ఉదాహరించాను. మరొక ఉపవిభాగమైన సాంస్కృతికాంశాలను మతం, దేవత ఆరాధన, పండుగలు, వివాహం, ఆచారాలు, నమ్మకాలు, విందులు, వినోదాలు తదితర అంశాల చిత్రణ కథల్లో కనిపించిన తీరును పరిశీలించాను. జగిత్యాల జిల్లా జానపద కథలు జానపదులు సామాజిక జీవన విధానాన్ని ప్రతిబింబించే విధంగా ఉన్నాయి. ఈ కథాధ్యయనం వల్ల సాంస్కృతిక విషయాల్లో మిగతా ప్రాంతాల కన్న కొంత విభిన్నత అనేది మనకు కనిపిస్తుంది. ఈ ప్రాంత ప్రజలు పాటించే ఆచారాలు, నమ్మకాలను బట్టి నేటికి మూఢ నమ్మకాలను ప్రబలంగా నమ్ముతున్నారనే విషయం తెలుస్తుంది. మంత్రాలు వస్తాయనడం, చేతబడులు చేయించడం, తాయిత్తులు కట్టించుకోవడం, దేవుడిలాగా పూనకం వచ్చిన వారిని నిజంగా దేవుడిగా భావించడం ఇలాంటి విషయాలు నేటికీ ఈ ప్రాంత ప్రజల్లో కనిపిస్తున్నాయి.

ఐదవ అధ్యాయంలో జానపద కథానిర్మాణాన్ని పరిచయం చేస్తూ, కథానిర్మాణ పద్ధతులను, కథానిర్మాణ ప్రయోజనాలను తెలిపాను. జగిత్యాల జానపద కథలకు పాశ్చాత్య కథానిర్మాణ పద్ధతులను అన్వయించి విశ్లేషణ చేసాను. ఈ ప్రాంత జానపద కథలు కొన్ని కథానిర్మాణ సిద్ధాంతాలకు సమన్వయం కుదురకపోవడానికి గల కారణం ఆయా సంస్కృతుల్లో గల బేధమేనని చెప్పవచ్చు. వ్లాదిమిర్ ప్రాప్, అలన్ డెండస్, లెవిస్ట్రాస్, క్లాడ్ నమునా మొదలైన జానపద పరిశోధకులు ప్రతిపాదించిన కథానిర్మాణ సిద్ధాంతాలను నాకు లభించిన జానపద కథలకు అన్వయించే ప్రయత్నం చేసాను. కథానిర్మాణ అధ్యయనంలో భాగమైన మూలాంశాలను కూడా పరిశీలించాను. స్టిత్ థాంప్సన్ మూలాంశాల సూచి ఆధారంగా జగిత్యాల జిల్లా జానపద కథల్లో గల మూలాంశాలను పేర్కొని సూచి సంఖ్యను ఇచ్చాను. వీటి వల్ల జానపద కథల్లో గల మలుపుతిరిగే సంఘటనలకు, కథాగమనంలో మూలాంశాల పాత్ర ఎంతో విశిష్టమైందని అంచనా వేయవచ్చు. అలాగే జానపద కథల్లో

కథాప్రారంభం, ముగింపులు ఏవిధంగా ఉన్నాయో పరిశీలించాను. కథాప్రారంభాలు సాధారణంగా కొన్ని కనిపిస్తే, కులాల ప్రస్థావనతో, సంతాన సంఖ్యతో, ఆర్థిక స్తోమతలు తెలుపుతూ మరికొన్ని కనిపిస్తాయి. ఈ జానపద కథల్లో కథాముగింపులు మాత్రం దాదాపు సుఖాంతంగానే కనిపిస్తాయి.

ఆరవ అధ్యాయంలో జగిత్యాల జిల్లా జానపద కథల్లో కనిపించిన భాషావిశేషాలను పొందుపరచడం జరిగింది. జానపదులు చెప్పే కథలు వారి ప్రాంతీయ యాసలో ఉంటాయి. కాబట్టి వారు నిత్యం వ్యవహరించే మాండలిక పదాలతో, సజీవమైన భాషలో కథను కథాకథనం చేస్తూ ఉంటారు. జగిత్యాల జిల్లా జానపద కథల్లో కథకులు వాడిన మాండలిక పదాలు, అన్యదేశ్యాలు, ధ్వనుల్లో గల మార్పులు, వర్ణాలు లోపించిన పదాలు, ఊత పదాలు, సామెతలు, జాతీయాలు, పలుకుబడులు, నూతన పదబంధాలు, తిట్లు మొదలైన తదితర భాషాంశాలను వివరించాను.

నాకు లభించిన జానపద కథలే కాకుండా ఇంకా అనేక జానపద కథలు ప్రజల వ్యవహారంలో నేటికి ప్రచారంలో ఉంటాయి. నేను సేకరించిన జానపద కథల ఆధారంగా మాత్రమే ఈ పరిశోధన గ్రంథ రచన జరిగింది. నానాటికీ పెరుగుతున్న అత్యాధునిక నాగరికత వల్ల అపూర్వమైన జానపద కళా సంపద అంతరించిపోతుంది. ప్రపంచీకరణ, ఆధునిక సాంకేతిక పరికరాలు, వినోద సాధనాలు, టెలివిజన్, మొబైల్స్ మొదలయిన వాటి వల్ల శ్రోతలు జానపద కథకుల కథలు వినడం లేదు. శ్రోతల ఆదరణ లేని జానపద కథకులు రోజురోజుకి చాలా అరుదుగా కనిపిస్తున్నారు. జానపద కథలు కూడా అంతరించిపోతు కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నాయి. నా క్షేత్రపర్యటనలో జానపద కథకుల అన్వేషణ కోసం ఎంతో శ్రమించాల్సి వచ్చింది. స్నేహితులు, బంధుమిత్రల సహాకారంతోనే ఈ పాటి జానపద కథలను సేకరించగలిగాను. అదృష్టవశాత్తు ఆర్థికంగా వెనుకబడినవారు, నిమ్న వర్గాల వారు, శ్రామికులు, వృత్తిరీత్యా కథనం చేసే కళాకారులు ఈ జానపద కథ సంపదను ఇంకా కాపాడుతూ వస్తున్నారు. నా జానపద కథాసేకరణలో ఆడవారి కంటే మగవారే ఎక్కువగా కథలు చెప్పిన వారున్నారు. అంతేగాకుండా చాలా మంది జానపద కథకులు కథాకథనం చేసే సందర్భంలో జానపద

కథలను మరిచిపోతున్నమనే విషయాన్ని చెప్పారు. నా కథాసేకరణలో ఒక కథకుడికే అనేక కథలు వచ్చి, ఆ కథలను కథాకథనం చేసిన వారు ఎక్కువగా ఉన్నారు. చాలా గ్రామాల్లో జానపద కథలు చెప్పేవారు ఉన్నప్పటికీ కథలు చెప్పడానికి ముందుకు రాలేదు.

ఈ పరిశోధన గ్రంథం కేవలం జగిత్యాల జిల్లాకు మాత్రమే పరిమితం. పరిశోధనా పరిధి దృష్ట్యా జగిత్యాల జిల్లాలో నాకు లభించిన జానపద కథల ఆధారంగా రూపొందించిన పరిశోధన గ్రంథం. విస్తృతి పరిధి గల జానపద కథాసాహిత్యాన్ని పరిశీలించాలంటే జిల్లాల వారిగా జానపద కథాసాహిత్యాన్ని సేకరించడం ఉత్తమైన పద్ధతిగా భావించవచ్చు. తెలుగు జానపద కథ బృహత్ గ్రంథ రూపకల్పనకు ఇలాంటి పరిశోధనలు ఎంతో ఉపకరిస్తాయని ఆశిస్తున్నాను. పై పరిశోధన గ్రంథంలో వెలువడిన పరిశోధన ఫలితాలను చూసినట్లయితే కింది విధంగా ఉంటాయి.

## పరిశోధన ఫలితాలు

జగిత్యాల జిల్లాలో నేను సేకరించిన జానపద మౌఖిక కథల ఆధారంగా మాత్రమే ఈ పరిశోధన కొనసాగింది. ఇది గ్రంథ పరిమితి. నా పరిశోధనలో పరిశీలించిన ప్రధానమైన ఫలితాలను క్రింద పేర్కొన్నాను.

1. జగిత్యాల జిల్లా ఆవిర్భవించిన తీరు, చారిత్రకాంశాలతో పాటు జిల్లా భౌగోళిక స్వరూపం గురించి పేర్కొనబడ్డాయి. జగిత్యాల జిల్లాను క్రీ. శ 1110లో పొలాస రాజధానిగా చేసుకొని జగ్గదేవుడు అనే రాజు పరిపాలించాడని అతని పేరు మీదుగా జగిత్యాల వచ్చిందని తెలుస్తుంది. మరొక కథనం ప్రకారం ఒక కోటను నిర్మించడానికి వచ్చిన జక్, తాల్ అనే ఇద్దరు ఫ్రెంచ్ ఇంజనీర్ల పేరు మీదుగా జగిత్యాల అనే పేరు స్థిరపడిందని తెలుస్తుంది.
2. స్వాతంత్ర్య సమరంలో ఈ జిల్లావాసుల పాత్రను, జగిత్యాల జైత్రయాత్రలో రైతులు పాల్గొన్న తీరును ప్రస్తావించాను. ధర్మపురి, కోరుట్ల, పొలాస, కోటిలింగాల, రాయికల్ మొదలైన చారిత్రక, సాంస్కృతిక, పర్యాటక ప్రదేశాల ప్రాముఖ్యతను గూర్చి వివరించాను.

3. కాకుత్సం శేషప్ప కవి, అలిశెట్టి ప్రభాకర్, బి.యస్ రాములు, కె. వి. నరేందర్, సంగవేని రవీంద్ర లాంటి సాహిత్యకారులు జగిత్యాల జిల్లా నుంచి వచ్చినవారే. చరిత్ర సంపదకై లోతైన పరిశోధన చేసిన చరిత్రకారుడు డా. జైశెట్టి రమణయ్య కూడా ఈ జిల్లా వాసులేనని తెలుస్తుంది.
4. పూర్వం జగిత్యాల జిల్లాలో గల సామాజిక వెనుకబాటుతనం, వెట్టిచాకిరి, దొరల దాష్టికం గురించి నాటి సాంఘిక పరిస్థితుల్లో వివరించాను. ఈ జిల్లాలో కొత్త పరిశ్రమలు లేకపోవడం వల్ల యువత నిరుద్యోగంతో బాధ పడుతున్నారు. వాళ్లకు సరైన ఉపాధి లభించక వివిధ దేశాలకు వలస పోయి నానా ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తుంది. 80000లకు పైగా స్త్రీలు కుటీర పరిశ్రమైన బీడి పరిశ్రమనే ఆధారంగా చేసుకొని బతుకుతున్నారని తెలుస్తుంది.
5. జానపద కథాసాహిత్యాన్ని పరిచయం చేస్తూ, జానపద కథకు పలువురు పరిశోధకులు ఇచ్చిన నిర్వచనాలను పేర్కొన్నాను. జానపద కథ లక్షణాలు తెలుపుతూ, జగిత్యాల జిల్లా జానపద కథల్లో కనిపించిన ప్రధాన లక్షణాలను తెలిపాను. జానపద కథల వర్గీకరణను ఉదహరిస్తూ, జగిత్యాల జిల్లా జానపద కథలను వస్తు ఆధారంగా చేసిన వర్గీకరణ పటాన్ని తెలిపాను.
6. నేను సేకరించిన జగిత్యాల జిల్లా జానపద కథలను సరళ కథలు, సంక్లిష్ట కథలు అని రెండు భాగాలుగా విభజించి, మరల జానపద కథలను వస్తువు ఆధారంగా ఉపవిభాగాలు చేసాను. ఈ అధ్యాయంలో ప్రతి జానపద కథాసారాన్ని క్లుప్తంగా చెప్పి, ఆ కథలో గల విశేషాంశాల గురించి చర్చించాను.
7. జానపదుల్లో మంచివారు, చెడ్డవారు, తెలివైనవారు, అమాయకులు, మూర్ఖులు, స్వార్థపరులు ఇలా వివిధ గుణాలతో మనుషులు కనిపిస్తూనే ఉంటారు. అమాయకులను, తెలివి తక్కువవారిని మోసం చేయడానికి చాలా మంది ప్రయత్నిస్తారు. అలాంటి మోసపూరితమైన వారి ఆలోచనలను ముందే పసిగట్టి, తప్పించుకోవాలన్న నీతి బోధించే జానపద కథలు కనిపిస్తాయి. కానుగపట్నం అనే కథలో కోమటి భార్య మీద ఆశపడిన వెలమరాజు బారి నుండి కోమటి భార్యను కానుగ పట్నం రాజు చాకచక్యంగా కాపాడతాడు.

8. జానపదులు దైవాన్ని ఎక్కువగా ఆరాధిస్తారు. వారు ఏ పని చేసినా దానికి ఆ దైవమే కారణమని భావిస్తారు. తమ పనిని తాము చేసుకుంటూ పోతే దైవం తమ వెన్నంటే ఉండి రక్షిస్తుందనే దైవభావనను కలిగి ఉంటారు. దైవానుగ్రహం అనే కథలో ఒక స్త్రీ సత్యాన్ని నమ్ముకొని కన్న తండ్రినే ఎదిరిస్తుంది. అందుకు ఫలితంగా పేదరికంతో బతుకు ఈడుస్తున్న కుష్టురోగితో తండ్రి వివాహం జరిపిస్తాడు. అయినగాని ఆమె కుష్టురోగితోనే సంసారం చేస్తుంది. ఆమె నిజాయితినీ, సత్యాన్ని పరిక్షించిన దేవుడు అన్ని విధాలా అష్టైశ్వరాలను కలుగజేస్తాడు. కొద్ది రోజుల్లోనే మంచి ధనవంతురాలిగా జీవిస్తుంది. నిజాయితీగా, సత్యాన్ని వీడకుండా ఉండేవారికి ఆ దైవం ఎల్లప్పుడు తోడు ఉంటాడనే విషయం బోధపడుతుంది. కాటిమీదికెక్కిన కోడలు కథలో ఒక ముష్టివాడికి దానం చేసినందుకు అత్త కోడలిని చంపాలని ప్రయత్నిస్తుంది. కానీ శంకరుడు మారువేషంలో వచ్చి ఆ కోడలిని రక్షిస్తాడు. ఇలా కష్టాల్లో ఉన్న వారిని దేవుడు ఏదో ఒక రూపంలో వచ్చి కాపాడుతాడని జానపదులు నమ్ముతారు. సమస్తలోకాన్ని సృష్టించిన దేవుడికి లోకంలో ఏది ఎంతవరకూ ఉండాలో అది అంతవరకే పెడతాడని జానపదులు ప్రగాఢంగా నమ్ముతారు. అలాంటి సంఘటనలు చిత్రించిన జానపద కథలు చాలా కనిపిస్తాయి. గుమ్మడిమర్రి అనే కథలో ఒక వ్యక్తి ఒక గుమ్మడి తీగకు బరువుగా వేలాడుతున్న గుమ్మడి కాయని చూసి, ఆ తరువాత కనిపించిన మర్రి కాయలని చూసి ఆశ్చర్యపోతాడు. చిన్న తీగకు అంత పెద్ద కాయలేంది? పెద్ద చెట్టుకు చిన్న కాయలేంటని? దేవుడికి తెలివిలేదని వేదాంతం పలుకుతాడు. కాని మర్రి చెట్టు కింద ఉన్న ఆ వ్యక్తి మీద మర్రి కాయ పడ్డక అసలు విషయం అర్థమవుతుంది. దేవుడి సృష్టిలో లోపం లేదని తానే సరిగ్గా ఆలోచించలేదని భావించి నిజాన్ని గ్రహిస్తాడు. అలా సృష్టిలో జరిగే ప్రతి కార్యానికి మూలం దేవుడేనన్న బలమైన భావన జానపదుల్లో నాటుకుందని తెలుస్తుంది. దేవుడు రాసిన రాత ప్రకారమే అంత జరుగుతుందని, దైవ నిర్ణయమే తుది నిర్ణయమని, విధిరాత తప్పించేవారెవ్వరు లేరని ఇలా దేవుడిపై జానపదులు అపారమైన నమ్మకాన్ని పెట్టుకుంటారు.

9. జానపదులు ఎక్కువగా కులదేవతలను నమ్ముతారనే విషయం నేను మల్లన్నను పోతున్న, శివసత్తె అవతారమెత్తిన భార్య అనే కథల్లో కనిపిస్తుంది. నేను మల్లన్నను పోతున్న అనే కథలో దున్నపోతు శరీరంలో ఇరుక్కున్న నక్క కురుమలకు మల్లన్న పేరు చెప్పి తప్పించుకుంటుంది. తెలంగాణలో గొల్ల, కురుమల వారు మల్లన్న దేవున్ని ఎక్కువగా పూజిస్తారు. వరంగల్ జిల్లాలోని కోమురెల్లి మల్లన్న, అయిలోని మల్లన్నగా ప్రసిద్ధి. శివసత్తె అవతారమెత్తిన భార్య కథలో ఒక రైతు భార్య పొలం వద్దకు సద్ది అన్నం పట్టుకుని ఆలస్యంగా వస్తుంది. తన భర్త ఏమంటాడోనని భయపడి, భార్య మల్లన్న తన మీద పూనినట్లు నటిస్తుంది. తమ కులదైవమయిన వేములవాడ రాజేశ్వరుని పేరు చెప్పగానే భర్త కోపం చల్లారుతుంది. దీన్ని బట్టి కులదేవత ఆరాధన ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది.

10. జానపదులు, గ్రామీణులు, అటవీకులు సాధు జంతువులను వారి జీవనాన్ని సాగించడానికి పెంచుకుంటారు. వ్యవసాయానికి ఎద్దులనూ, సంచార జాతులవారూ గాడిదలనూ, గుర్రాలనూ, మాంసం కోసం కోళ్లు, గొర్రెలనూ, రక్షణ కోసం కుక్కలనూ పెంచుకుంటారు. గారడివారు కోతులను మచ్చిక చేసుకుంటూ ఉంటారు. కోతి అనే కథలో పేదరికంతో జీవనం సాగిస్తున్న తల్లి, కొడుకులను చూసి కోతి అడవికి వెళ్లి పండ్లు ఫలాలను తీసుకువస్తుంది. బంగారెంటుక బాలుడు అనే జానపద కథలో అడవి ఆవులు ఒక బాలునికి పాలిచ్చి పెంచి పెద్ద చేస్తాయి. ఆ విధంగా మానవుడు మచ్చిక చేసుకున్న జంతువులు మానవుడికి ఎన్నో విధాలుగా ఉపయోగపడతాయని తెలుస్తుంది.

11. కాలక్షేపానికి, సరదా కోసం చెప్పే కథలు జగిత్యాల జానపద కథల్లో కనిపిస్తాయి. పిసకొడుకు అనే కథలో ఒక తల్లి తన కొడుక్కి బుద్ధి మాటలు చెబుతుంది. కాని తన తల్లి మాటలను సరిగ్గా అర్థం చేసుకోకుండా అత్తగారింటిలో నవ్వులపాలవుతాడు. తల్లి చెప్పిన మాటలకి, కొడుకు చేసిన చేష్టలకు మధ్య సంభాషణలు హాస్యస్ఫోరకంగా ఉంటాయి. దారి మరిచిన ద్వారక అనే కథలో ఒక అమాయకుడు అత్తగారింటికి బయలుదేరతాడు. కొద్ది దూరం ప్రయాణించాక అత్తగారు ఊరి

పేరు మరిచిపోతాడు. అత్తగారి ఊరు పేరు తెలుసుకోనే క్రమంలో దారినపోయే వాళ్ల చేత దెబ్బలు తింటాడు. రేచీకటి అల్లుడు అనే జానపద కథలో రేచీకటి వ్యాధి ఉన్న ఒక వ్యక్తి చేసి పనులు నవ్వు తెప్పించే విధంగా ఉంటాయి.

12. సమాజంలో నిత్యం స్త్రీలపై జరుగుతున్న అణచివేతలు, దాడులు, హత్యలు, మానభంగాలు, హింసలు గమనిస్తూనే ఉంటాము. నాటి నుండి నేటి వరకు స్త్రీలను తక్కువ చేసి చూస్తునే ఉన్నారు. కానీ అందరు స్త్రీల ఒకే రీతిలో ఉండరు. స్త్రీలల్లో కూడా వీరవనీతలు, ధీరురాల్లు ఉంటారని నిరూపించే కథలు జానపద కథల్లో ఉన్నాయి. చాకలి పుల్లక్క పాతివ్రత్యం, సావుకారి కోడలి చతురత అనే కథల్లో స్త్రీల తమకు ఎదురైన వీపత్కర పరిస్థితుల్లో దైర్యంగా ఉండి పురుషులను ఎదుర్కుంటారు. చాకలి పుల్లక్క పాతివ్రత్యం అనే కథలో నలుగురు ఉన్నతాధికారులు ఒక నిమ్నవర్గానికి చెందిన వివాహితని లోంగదీసుకోవడానికి ప్రయత్నిస్తారు. అప్పుడు ఆమె ఆ నలుగురు అధికారుల నుండి చాలా చాకచక్యంగా తప్పించుకోని తన మాన, ప్రాణాలను కాపాడుకుంటుంది. తన భర్తలేని సమయంలో తనను అనుభవించడానికి వచ్చిన అధికారులకు సున్నం బోట్లు పొడిపించి తగిన బుద్ధి చెప్తుంది. అలాగే సావుకారి కోడలి చతురత అనే కథలో కూడా ఇలాంటి సంఘటననే ఎదురవుతుంది. ఒక వెలమరాజు సావుకారి కోడలిని పొందడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తాడు. ఆ వెలమరాజు ప్రయత్నాలను అన్నింటిని ఒక పొడుపు కథతో తిప్పి కొట్టి, తెలివిగా తప్పించుకుంటుంది. నేటికి స్త్రీలపై అనేక దాడులు జరుగుతున్నట్లు నిత్యం వార్తల్లో కనిపిస్తాయి. స్త్రీలు అపత్కాల పరిస్థితుల్లో తమని తాము రక్షించుకునేందుకు ఉపాయాన్ని ఆలోచింపజేసే కథలు ఉన్నాయి. ఇలాంటి జానపద కథలు వారిలో మనోధైర్యాన్ని నింపి, చైతన్యపరచగలవని తెలుస్తుంది.

13. సమాజంలో పేద, ధనిక వర్గబేధాలు ఉంటాయి. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల నిరుపేదలు తరతరాలుగా అనేక దౌర్జన్యాలు, దోపిడీ, అణచివేతలకు గురవుతూనే ఉన్నారు. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో భూస్వాములు, అగ్రవర్ణాలు వారి చేతిలో ధన, మాన,

ప్రాణాలను పోగొట్టుకున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. ఇలాంటి విషయాలు జానపద కథల్లో చిత్రించడం గమనించాను. పైసకు గుడిసెన్నర పెండ్లాం అనే కథలో ఒక యువకుడు చాకలిరేవు దగ్గర ఉన్న చాకలివారిని దూషిస్తాడు. చాకలి సామాజిక వర్గాన్ని, వారి గుణం గురించి తెలుపుతూ తిడతాడు. చాకలి పుల్లక్క పాతివ్రత్యం అనే కథలో నలుగురు గ్రామ ఉన్నతాధికారులు నిమ్న వర్గ వివాహితను పొందాలని అనుకుంటారు. ఆమె భర్త లేని సమయం చూసి ఆ అధికారులు వచ్చి లోంగదీసుకోవాలని అనుకుంటారు. తక్కువ సామాజిక వర్గానికి చెందినదిగా భావించి వారినెదురించలేదనే చిన్న చూపు ఆ నలుగురు ఉన్నతాధికారుల్లో కనిపిస్తుంది. సోమనాల బావి అనే కథలో ఒక రాజు తన కూతురి వీపు మీద ఉన్న రాచపుండుని తగ్గిస్తే ఆ రాజ్యానికి రాజుని చేస్తానని చెప్తాడు. అది గమనించిన ఒక వ్యక్తి రాజకుమార్తె వీపు మీద ఉన్న పుండుకి నాటు వైద్యం చేసి నయం చేస్తాడు. రాజు ఇచ్చిన మాట ప్రకారం ఆ వ్యక్తిని రాజుగా ప్రకటిస్తాడు. కొద్ది రోజుల తరువాత ఆ వ్యక్తి కులం పేరు తెలుస్తుంది. అప్పట్నుంటి నువ్వు రాజుగా పనికిరావని చెప్తాడు. క్షత్రియులే రాజ్య అర్హత గలవారని రాజ్యం నుంచి వెళ్లిపోమ్మంటాడు. గొల్లబోయని రాజనీతి అనే కథలో పండితులకు తప్ప పామరులుకు, విద్యావిహీనులకు రాజ్య ప్రవేశం లేదని తెలుస్తుంది.

14. జానపద కథల్లో రాజు, మంత్రులకు సంబంధించిన కథలు విరివిగా కనిపిస్తాయి. జానపదులు ఏ కథ చెప్పినా సాధారణంగా అనగనగ ఒక రాజు, వాళ్లు రాజులట, అనగనగ ఓ రాజ్యంలో అనే పదాలతో కథాకథనం ప్రారంభిస్తారు. జగిత్యాల జిల్లా జానపద కథల్లో సామాన్యులను సైతం రాజులని సంబోధిస్తూ కథను ప్రారంభించడం పరిశీలించాను. రాజుకు మంత్రి సలహాదారుడుగా ఉంటూ, రాజులకు సంబంధించిన అన్ని విషయాలను తెలుసుకొని ఉంటారు. రాజుని ఆనందపరచడమే కాకుండా చిత్రవిచిత్ర విషయాలతో వినోదపరుస్తారు. గొల్లబోయడు అనే కథలో కూడా రాజు రాజ్య క్షేమాన్ని కోరుతూ మంత్రి తనకు తెలిసి జ్ఞానాన్ని పంచుకుంటాడు. దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రజలను అప్రమత్తం చేయడానికి చాటింపు

వేయిస్తాడు. రాజుకు మంత్రి సన్నిహితుడుగా ఉండటమేగాక రాజు తప్పు చేసినపుడు ఆ తప్పును బయటపెట్టడంలో కూడా మంత్రి వెనుకాడలేదని బ్రాహ్మణుడి వరాలు కథ ద్వారా తెలుస్తుంది. ఒక రాజు పండితుని వరాలను వెదురు బొంగు కర్రలో దాచి పెట్టి, ఆ పండితుడు నాకు వరాలు ఇవ్వలేదని సభలో అబద్ధం చెప్తాడు. అదే సమయంలో అక్కడ ఉన్న మంత్రి రాజు చేసిన తప్పును బయటపెడతాడు. అలాగే రాజుకు, మంత్రికి మధ్య సరదా సంఘటనలు చిత్రించిన కథలు లేకపోలేదు. రాజు పతాని లగ్గం సోకు అనే కథలో తన పెళ్లి చేయడం లేదని మంత్రి రాజుని అత్తగారింట్లో నవ్వులపాలు చేస్తాడు. ఇలా జానపద కథల్లో రాజుకు మంత్రి మిత్రుడిగా, హితుడిగా, సన్నిహితుడిగా, సలహాదారుడిగా వివిధ పాత్రలను పోషించాడని చెప్పవచ్చు.

15. ఏ సమాజంలోనైనా తప్పు చేసిన వారికి శిక్ష వేయడం సహజం. గ్రామాల్లో పంచాయితీలు, గ్రామసభలు న్యాయస్థానాలుగా పనిచేస్తాయి. పూర్వం ప్రభుత్వ న్యాయవ్యవస్థలు, కోర్టులు అనేవి ఉండేవికావు. కాబట్టి సంఘం, సంఘ పెద్దలు, కుల సంఘాలు, పంచాయితీ సభలు మొదలైనవారు న్యాయపరమైన తీర్పులు ఇచ్చేవారు. ఒక గుండుకు రెండు గుండ్లు అనే కథలో ఒక వ్యక్తి భార్య తన తల్లికి గుండు తీయిస్తుంది. తన తల్లికి గుండు తీయించిన భార్యను ఏమనలేక, సంఘంలో తీర్పు కోసం అయ్యే ఖర్చు భరించలేక ఆ వ్యక్తి వాపోతాడు. దీన్ని బట్టి సంఘాల్లో , కుల సంఘాల్లో, గ్రామ సభల్లో న్యాయం జరగాలంటే డబ్బుతో కూడికున్న విషయం అని తెలుస్తుంది. అత్త కాల విషం అనే కథలో ఒక గర్భవతితో ఉన్న కోడలిని అత్త చంపుతుంది. ఆ విషయం తెలుసుకున్న కోడలు తల్లిదండ్రులు అత్తకు మూడు రేవులు గుండు తీయించి, గాడిద మీద ఊరేగింపు చేస్తారు. ఆ విధంగా తప్పు చేసిన వారిని నలుగురిలో అవమానిస్తే ఆ తప్పు ఇంకొకరు చేయరనే భావనతో శిక్షిస్తారు.

16. పూర్వం రాజులు ప్రజలదగ్గర ఇష్టం వచ్చినట్లు పన్నులు వసూలు చేసేవారని అమరికా రాజు కథలో తెలుస్తుంది. నిమ్మళ్లమంత్రి తన బావమరిదిని రాజుగా చేస్తాడు. నిమ్మళ్లమంత్రి రాజ్యానికి రాజు అయినప్పటి నుండి అధిక మొత్తంలో ప్రజల నుంచి పన్నులు వసూలు చేసేవాడు. ఆడవారికి

పొడవైన జడ ఉన్న, మగవారి పొట్ట ఎక్కువ ఉన్న, పంట ధాన్యాన్ని సమానంగా పంచడం లాంటి చర్యలు చేపట్టి ప్రజలను నానా ఇబ్బందికి గురిచేసేవాడని తెలుస్తుంది. నాడు పన్నుల పేరిట దోచుకున్న రాజులు ఉండేవారని గ్రహించవచ్చు.

17. పల్లె ప్రజలు కాయకష్టం చేసుకొని తమ జీవితాన్ని కొనసాగిస్తారు. అదృష్ట, దురదృష్టాలపై పెద్దగా ఆశ ఉండదు. కష్టం పడటం మాత్రమే వారి తెలిసిన విద్య. ఇలాంటి సంఘటనలతో చిత్రించబడిన కథ లక్ష్మీదేవి కటాక్షం. ఒక రైతు దురదృష్టావశాత్తు తన భూమిని అంతా కోల్పోతాడు. తన కుటుంబాన్ని పోషించడం భారంగా తయారవుతుంది. అప్పటి నుంచి రోజు అడవి వెళ్లి కట్టెలు కొట్టి జీవనం సాగించేవాడు. అతని కష్టాన్ని చూసి లక్ష్మీదేవి మూడు సార్లు కిలో బంగారాన్నంతా ప్రసాదిస్తుంది. కానీ లక్ష్మీదేవి ఇచ్చిన బంగారాన్ని నిలుపుకోలేక ప్రతిసారి ఎక్కడో పడవేసుకుంటాడు. ఆ రైతుకు ఏం చేయాలో అర్థంకాక తిరిగి తన పనిని తాను చేసుకుంటూ వెళతాడు. అతడి కష్టపడే మనస్తత్వాన్ని చూసి లక్ష్మీదేవి అతను పోగొట్టుకున్న బంగారాన్ని తిరిగి ఇస్తుంది. అదృష్టాన్ని మాత్రమే నమ్ముకుంటే లాభం లేదని శ్రమని నమ్ముకోవాలన్న నీతిని బోధిస్తుంది ఈ కథ. భోగసాని లంగతనం అనే కథలో గో పూజ వల్ల సకల సంపదల సిద్ధించి, సత్వర అభివృద్ధి కలుగుతుందని నమ్ముతారు. నేటికి మన ఇంటి ముందుకు ఆవుకు వచ్చి నిలుచుని ఉంటే మంచి సంకేతంగా, అదృష్టంగా భావిస్తారు.

18. మన హైందవ సమాజంలో స్త్రీలకు కట్టుబాట్లు, సంప్రదాయాలు, ఆచారాలు ఎక్కువగా ఉంటాయి. యుక్త వయస్సు వచ్చినప్పటి నుంచే తల్లి తన కూతురికి ఎలా నడుచుకోవాలో చెబుతుంది. ఆడపిల్లలు ఇంటి గుమ్మం మీద కూర్చోవద్దని, ఊడ్చే చీపిరికి కాలు తాకకూడదని, పెద్దల ముందు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించకూడదని, మంచి నడవడిక కలిగి ఉండాలంటూ కొన్ని కట్టుబాట్లను నిర్దేశించారు. అవి నేటికి మన ఇళ్లలో కనిపిస్తూ ఉంటాయి. లచ్చిందేవి ఆచారం అనే కథలో కూడా ఒక సామాన్య రైతు ఇంటికి లక్ష్మీదేవి వస్తుంది. ఇక్కడ లక్ష్మీదేవి వచ్చిదంటే ఆ ఇంట్లో సిరిసంపదలతో ఎంతో వైభవంగా, ఆనందంగా జీవిస్తున్నారని అర్థం. ఒక రోజు ఆ రైతు

చిన్న కోడలు తన ముక్కు పుడక కిందపడితే కాలుతో తొక్కి తీస్తుంది. అది గమనించిన లక్ష్మీదేవి కోపంతో ఇంటి నుండి వెళ్లిపోతుంది. అప్పటి నుంచి ఆ రైతు కుటుంబం మరల సామాన్య కుటుంబంగా మారిపోతారు. ఈ కథ ఆడవారు చేయకూడని కొన్ని పనులు ఉన్నాయని అవి చేస్తే ఆ ఇంటికే అరిష్టం జరుగుతుందని జానపదులు భావిస్తారు. కాబట్టి ఆడపిల్లలకు గల కట్టుబాట్లను బోధిస్తుంది. చెప్పుకున్న విలువ రాజుకు లేదు అనే కథలో ఒక రాజు చనిపోతే అతని శవాన్ని ఇంటి ముందు ఉంచుకొవడానికి ఆ ఇంటి వారు  నిరాకరిస్తారు. చెప్పులను మాత్రం ఉంచుకుంటారు. మనిషికి బతికి ఉన్నప్పుడే విలువ. చనిపోతే రాజైన సరే అతనికి విలువలేదని తెలుస్తుంది. అత్త కోడలు వంకాయ అనే కథలో అత్త చనిపోతే అత్త శవాన్ని కాటికి తీసుకెళతారు. కోడలు ఇంటి దగ్గర అత్త శవాన్ని కాల్చవేశారని అనుకుంటుంది. శవానికి ఎదురుగా వెళ్లడం, ఆడవారు శవం వెంట కాటి దాకా రావడమనేది మన ఆచారాల్లో తప్పుగా భావిస్తారు. కొన్ని కులాల్లో నేటికి ఈ ఆచారం పాటిస్తున్నారు.

19. పూర్వం రాజుల వేశ్యావ్యవస్థను పోషించేవారని రాణి పగడాల పేరు, భోగసాని లంగతనం అనే కథల ద్వారా తెలుస్తుంది. రాణి పగడాల అన్న కథలో యువరాజుకి వేశ్యతో సంబంధం ఉంటుంది.  యువరాజు తల్లిదండ్రులు అతనిని వివాహం చేసుకోమ్మని పలుమార్లు అడుగుతారు. వేశ్యతో సంబంధం ఉండటం వల్ల ఆ యువరాజు వివాహం చేసుకోవడానికి అయిష్టత చూపిస్తాడు. దీనిని బట్టి రాజులకు వేశ్యలతో సంబంధం ఉండేదని చెప్పవచ్చు. భోగసాని లంగతనం అనే కథలో ఒక వేశ్య ఆవుని దొంగతనం చేసి తాను ఏ తప్పు చేయనట్లు బుకాయిస్తుంది.

20. జగిత్యాల జిల్లాలో ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ పుణ్యక్షేతం ఉంది. అక్కడ గోదావరి ఉత్తరం నుంచి దక్షిణ దిశగా పారుతుంది. జానపద కథల్లో ధర్మపురి నందు ఉన్న గోదావరి నది ప్రస్తావన కనిపిస్తుంది. సావుకారి కోడలి చతురత కథలో సావుకారి కోడలితో పాటు తన తోడికోడల్లు గోదావరి స్నానమాచరించి, చెంబులో పవిత్రమైన గోదావరి జలాన్ని ఇంటికి తీసుకెళతారు.

సత్యవతి కథలో సత్యవతి పాముగా ఉన్నటు వంటి తన భర్తను మనిషిగా మార్చడానికి ధర్మపురి గోదావరిలో స్నానమాచరిస్తుంది. ఆ పవిత్రమైన గోదావరి సత్యవతి గుండంలో పాముగా ఉన్న సత్యవతి భర్త మనిషి రూపాన్ని పొందుతాడు. ఇప్పటికి ఆ సత్యవతి పేరుతో సత్యవతి గుండంగా పిలువబడుతుంది. అక్కడ ప్రజలు ఇది యదార్థ సంఘటనగా భావిస్తారు.

21. తెలంగాణలో ఆడపడుచును ఆడబిడ్డగా పిలుస్తారు. భర్త యొక్క చెల్లెలు ఆడపడుచు అవుతుంది. ఆ ఆడపడచును వదినలు ఇబ్బందులకు గురి చేసే సంఘటనలు జానపద కథల్లో చిత్రించబడ్డాయి. అన్న చెల్లెల ప్రేమ కథలో ఒక చెల్లె వదిన చేత అనేక అవమానాలను ఎదుర్కుంటుంది. ఏ స్త్రీకి ఐనా పుట్టింటి మీద హక్కు ఉంటుంది. ఈ కథలో కూడా కష్టాల్లో ఉన్న చెల్లెలు అన్న సహాయం కోసం పుట్టింటికి వస్తుంది. కాని అన్నకు తెలియకుండా వదిన ఆడపడుచును సరిగ్గా చూసుకోకుండా వట్టి చేతులతో పంపిస్తుంది. వదిన గుణాన్ని పసిగట్టని అన్న చెల్లెలిని బాగానే చూసుకుంటుందని భావిస్తాడు. కాని కథ చివరలో వదిన పెట్టిన బాధలను చెల్లెలు దీపానికి చెప్పుకుంటుంది. అది విన్న అన్న గుండె కరిగిపోయి చెల్లెలికి ఎడ్లబండి మీద ధనధాన్యాలు తీసుకెళ్లి ఇచ్చి వస్తాడు. అన్న చెల్లెల అనుబంధాన్ని ఎంతో వాస్తవికంగా చిత్రించినట్లు అనిపిస్తుంది. మరొ కథ చెల్లెలు దిద్దిన కాపురం ఒక చెల్లి తన అన్నను వదిన బారి నుండి కాపాడుకుంటుంది. భర్తకు పొడుపు కథ చెప్పి, అది విప్పకపోతే చావమని వదినె చెబుతుంది. ఆ పొడుపు కథ చెప్ప లేక అన్న తీవ్రమైన బాధలో ఉంటాడు. అలాంటి సమయంలో చెల్లె వదినె తప్పుడు పనులను బహిర్గతం చేసి, ఆ పొడుపు కథను విప్పి అన్న ప్రాణాలను రక్షిస్తుంది. మునుపటి సంబంధం అనే కథలో ఒక వ్యక్తి తన చెల్లెలు భర్త ద్వారా పడుతున్న ఇబ్బందిని చూసి దాన్ని పరిష్కరిస్తాడు. అన్న తన చెల్లెలి సంసారాన్ని చక్కదిద్ది, కష్టాల్లో తాను వెన్నంటే ఉన్నానని నిరూపించుకుంటాడు.

22. జానపద కథల్లో, కథాకథనంలో స్త్రీ పాత్ర చాలా ముఖ్యమైనది. జానపద కథల్లో స్త్రీల కథలు వారి జీవితానుభవాలను, వారి మనస్తత్వాలను వ్యక్తం చేయటంలో ప్రముఖపాత్ర వహిస్తాయి. స్త్రీల

కథలు వినోదం కొరకు మాత్రమే కాకుండా నీతిని, సందేశాన్ని, సంస్కృతులను, ఆచార సంప్రదాయాలను భావితరాల వారికి అందించడం కోసం చెప్తారు. ఒక స్త్రీ తల్లిగా, చెల్లిగా, భార్యగా, కోడలిగా జీవితంలో ఎదుర్కొనే సంఘటనలపై కథలు అల్లి పరులకు చెప్తారు. ఆ కథల్లో వారి జీవితానుభవాలు, ఆనందానుభూతులు, ఆలోచనావిధానాలు సాక్షాత్కరిస్తాయని చెప్పవచ్చు. అత్త కోడల్ల మధ్య జరిగే తగాదాలు చిత్రించిన కథలు, సవతి తల్లుల పోరు, ఆడపడచును హింసించే వదినలు, పుట్టింటికి అధిక ప్రాధాన్యత ఇచ్చే కోడల్లు మొదలైన కుటుంబాల్లో స్త్రీల గురించే తెలిపేవి. స్త్రీల కథల్లో కొన్ని విశిష్టమైన కథలు లేకపోలేదు. రాజులను ఎదిరించిన స్త్రీలు, తమ శీలాన్ని కాపాడుకోవడానికి అధికారులకు బుద్ధి చెప్పిన స్త్రీలు, తన ప్రియుడిని చేసుకోవడానికి తండ్రినే ఎదిరించిన స్త్రీ, భర్తకు గుణపాఠం చెప్పిన స్త్రీగా ఇలా బహుముఖ పాత్ర వైవిధ్యంతో స్త్రీ జీవిత చిత్రణకు తావిచ్చిన జానపద కథలు జగిత్యాల జిల్లా జానపద కథల్లో కనిపిస్తాయి. స్త్రీ జానపద కథలను గమనించినట్లయితే సమాజంలో స్త్రీ జీవితానికి, జానపద కథల్లోని స్త్రీ చిత్రణకూ మధ్య కొంత వైరుధ్యం కనిపిస్తుంది. ఆడది అబల, అమాయకురాలు, మాట తీరు తెలియనిది, భీరువు గలది అనే అభిప్రాయాలను పటాపంచలు చేసిన స్త్రీ చిత్రణ మనకు ఈ కథల్లో కనిపిస్తుంది. ఐదు మల్లె పూవ్వుల, సత్యవతి కథ, ఇరువది అయిదు రోజుల బాలుడు కథల్లో మగవానికి అండగా ఉండి ఆపదలో భర్తను ఆదుకునే ధైర్యవంతురాలిగా, కార్యసాధకురాలిగా స్త్రీ కనిపించినట్లు పరిశీలించాను. తనను కాదన్న భర్తను తన కాళ్ల దగ్గరకు తెచ్చుకున్న స్త్రీగా అక్కెమ్మ కథలో గమనించాను.

23. జగిత్యాల జిల్లా జానపద కథల్లో గారడి ఆట గురించి పలుమార్లు ప్రస్తావించబడింది. గారడి పిల్లవాడు అనే కథల్లో ఒక తల్లికి ఇద్దరు కుమారులు ఉంటారు. అందులో చిన్నవాడు గారడివిద్యను తొందరగా నేర్చుకుంటాడు. తన తల్లిని పోషించుకోవడానికి గారడి విద్య నేర్పిన గురువుతోనే యుద్ధం చేసి గెలుస్తాడు. తల్లి కొడుకు, కోతి కోడలు అనే కథలో గారడి ఆట

ఆడుతున్న కోతిని ఒక బాలుడు తెచ్చుకుంటాడు. ప్రాచీన కాలంలో గారడి విద్యకు, గారడి ఆటకు ప్రాముఖ్యత ఉన్నట్లు తెలుస్తుంది.

24. వివాహం చేసుకున్న దంపతులకు సంతానలేమి సమస్య తీవ్రమైన చింతను కలిగించే విషయం. మన సమాజంలో వివాహం చేసుకున్న తరువాత పిల్లలు లేకపోతే అది ఒక లోపంగా గుర్తించి హేళనగా చూస్తారు. సత్యవతి అనే కథలో సంతానం లేని రాజు, ఈ రాజ వైభోగం నాకెందుకని చెప్పి దంపతులు ఇద్దరు కుమిలిపోతారు. ఐదు మల్లె పూవ్వుల కథలో కూడా సంతానం కోసం ధర్మరాజు, కృష్ణలీల దంపతులు ఎన్నో మొక్కులు మొక్కితే సంతానం కలుగుతుంది. నేటికి మన సమాజంలో సంతానం లేని దంపతులు ఎన్నో తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాలు సందర్శిస్తూ ఉంటారు. స్త్రీల అయితే పూజలు, నోములు, వ్రతాలు చేస్తూ ఉంటారు.

25. జానపదులు చెట్ల మూలికలతో చేసే నాటు వైద్యాన్ని నమ్ముతారు. మంత్ర తంత్రాలతో నయమవడం, ఆకు పసరు పూసి రాక్షసపుండుని తగ్గించడం లాంటి సంఘటనలు జానపద కథల్లో చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా జానపద కథల్లో రాజులకు, రాజ కుమార్తెలకు రాక్షసపుండు పుట్టి బాధిస్తుంది. దాన్ని నయం చేయడానకి సామాన్యులెవరో వచ్చి ఆకు పసరుతో వైద్యం చేసి తగ్గిస్తారు. సోమనాల బావి అనే కథలో  రాజు కూతురికి రాక్షసపుండు పుడుతుంది. ఒక కంసాలివాడు ఆ పుండు తగ్గే రహస్యాన్ని తెలుసుకుంటాడు. ఊరి చివరన ఉన్న కోట శంభుని గుడి వెనుకాల ఏడాకుల మర్రిని లెక్కపెట్టకుండా తెచ్చి ఆ రాజ కుమార్తెకు రాక్షస పుండుపై ఆకు పసరుని రాస్తాడు. యువరాణికి చాలా రోజుల నుండి ఉన్న ఆ రాక్షసపుండు తగ్గిపోతుంది. అలాగే అక్కెమ్మ కథలో కథలో కడగొట్ట రామన్న, అక్కెమ్మ ఇద్దరు భార్యభర్తలు ఉంటారు. రామన్న తన భార్యను సంపద తెమ్మని బయటికి పంపిస్తాడు. అప్పుడు అక్కెమ్మ ఆ రాజ్యంలో రాక్షసపుండుతో బాధపడుతున్న రాజుకు నాటు వైద్యం చేస్తుంది. రాజు ఆక్కెమ్మ వైద్యానికి మెచ్చి తన కోరిన సంపదనిచ్చి పంపుతాడు. ఈ విధంగా ఆకుపసరు, చెట్ల మూలికలతో చేసే ఆయుర్వేద వైద్యాన్ని పూర్వం విరివిరిగా ఉపయోగించేవారని తెలుస్తుంది.

26. జానపదులు గ్రామీణ దేవతలను విశేషంగా ఆరాధిస్తారు. పోశమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ మొదలైన గ్రామీణ దేవతలను పల్లె ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. సంవత్సరానికి ఒకసారైన సామూహిక పండుగగా నిర్వహించుకుని గ్రామీణ దేవతలకు జంతుబలులు, నైవేద్యాలను సమర్పిస్తారు. నాకు లభించిన జానపద కథల్లో గ్రామీణ దేవతలను చెడ్డ పనులు తీరాలని కోరుతూ అరాధించినట్లు గమనించాను. పోశవ్వ మొక్కు కథలో భర్త కళ్లు పోవాలని భార్య ప్రార్థిస్తుంది. తాను కోరుకున్నట్లు జరిగితే యాటని కోసి మాంసాన్ని వండిపెడతానని, కల్లు పోస్తానని మొక్కుతుంది. తల్లి కూతుళ్ల అనుబంధం అనే కథలో ఇతరుల మొక్క జొన్న పంట నాశనం అవ్వాలని ఒక వ్యక్తి కోరుకుంటాడు. అలా జరిగితే తన భార్యను బలిస్తానని మైసమ్మ తల్లికి మొక్కుతాడు. ఈ విధంగా జానపదులు తాము కోరిన కోరికలు మంచివైనా, చెడ్డవైనా గ్రామీణ దేవత తీరుస్తుందని నమ్ముతారు.

27. పూర్వకాలంలో రాజు అంటే నియంత, నిరంకుశ పరిపాలకుడు అనే భావన ఉంటుంది. కాని ఆనాటి రోజుల్లో కూడా రాజు ప్రజల సమస్యలను అర్థం చేసుకొని, ఆ సమస్యలను పరిష్కరించడానికి ముందుకు వచ్చేవాడని కానుగ పట్నం రాజు కథలో కనిపిస్తుంది. కష్టాల్లో ఉన్న కోమటి దంపతులను ప్రతిసారి వచ్చి కానుగపట్నం రాజు ఆదుకుంటాడు. కోమటి భార్యపైనా ఆశపడ్డ వెలమరాజుకు బుద్ధి చెప్పేలా పథకం వేసి, వెలమరాజు బారి నుండి కాపాడతాడు. జానపదుల దృష్టిలో అగ్రవర్ణాల వారు చెడ్డ వ్యక్తులుగా చూపిన సంఘటనలు జానపద కథల్లో కనిపిస్తున్నాయి. కొన్ని దశాబ్ధాల ముందు కాలంలో తెలంగాణ ప్రాంతంలో దొరల దాష్టికం ఎలా ఉండేదో కానుగపట్నం, సావుకారి కోడలి చతురత, చాకలి పుల్లక్క పాతివ్రత్యం అనే కథల ద్వారా ఊహించవచ్చు. ఈ మూడు కథల్లో వెలమరాజులు, అధికారులు, పటేల్లు స్త్రీలను చెరపట్టడానికే ప్రయత్నిస్తుంటారు. నాడు స్త్రీలపై అగ్రవర్గాల వారు చూపిన వ్యామోహం, అహంకార భావం ఎలాంటిదో తెలుస్తుంది.

28. చారిత్రకంగా ప్రసిద్ధి చెందిన కథలను జానపదులు కథలుగా మలిచిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలాంటి కోవకు చెందిందే రామదాసు కథ. రామ, లక్ష్మణులు వచ్చి గొల్కోండ బందీఖానాలో ఉన్న రామదాసును విడిపించిన సంఘటననే ఈ కథ. చరిత్రలో జరిగిన కథనానికి, ఈ జానపద కథలో జరిగిన కథకి స్వల్పమార్పులు కనిపిస్తాయి. నాటకాల్లో గాని, దృశ్యరూపాల్లో గాని రామ లక్ష్మణులు తానీషా ప్రభువు నిద్రించే సమయంలో వచ్చి, రామదాసు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించారని ఉంది. కానీ ఈ జానపద కథలో రామలక్ష్మణులు అక్కన్న, మాదన్నల సమక్షంలో తానీషా ప్రభువుకి డబ్బులు చెల్లించినట్లు ఉంది.

29. భారతీయ సమాజంలో బాంధవ్యాలకు ఎంతో విలువని ఇస్తారు. అది అన్నదమ్ములైనా, అక్క చెల్లెలైనా, అన్నచెల్లెలైనా ఎంతో ఆప్యాయతానురాగాల మధ్య పెరుగుతారు. ఒక తల్లిపేగు బంధం తెంచుకొని పుట్టిన అన్నదమ్ముల మధ్య ప్రేమల కన్నా, నేడు ద్వేషాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మూడు వస్తువుల ఆస్తి అనే కథలో ఇద్దరు అన్నదమ్ములు ఉంటారు. వారికి తల్లిదండ్రులు ఇచ్చిన ఆస్తిని సమానంగా పంచుకోకుండా అన్ననే అనుభవించాలని చూస్తాడు. పెద్దవాడైన అన్న చెప్పిన మాట తమ్ముడు జవదాటడు. అన్న స్వార్థబుద్ధితో ప్రవరిస్తే, తమ్ముడు అన్నకి తగిన బుద్ధి చెప్తాడు. రాజ్యధికారం కోసం అన్ననే చంపాలని చూసే తమ్ములు కూడ జానపద కథల్లో కనిపిస్తారు. అన్నదమ్ముల కథలో నలుగురు తమ్ముళ్లు అన్నని చంపాలని ప్రయత్నిస్తారు. కాని అన్న బ్రాహ్మణుడు చెప్పిన మాటలతో తమ్ముళ్ల పథకం నుంచి తన ప్రాణాలను కాపాడుకుంటాడు.

30. సమకాలీన సమస్యలను కూడా జానపదులు కథలుగా మలిచినట్లు తెలుస్తుంది. మారుతున్న సమాజాన్ని బట్టి ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమయి చిన్న చిన్న కుటుంబాలుగా మారాయి. ఎవరికి వారు స్వార్థబుద్ధితో బంధాలనూ, బంధుత్వాలను దూరం చేసుకుంటున్నారు. తాతయ్య, నానమ్మ, అమ్మమ్మల ప్రేమ, ఆప్యాయతలు ఇప్పటి తరం పిల్లలకు అందకుండా పోతున్నాయి. కొడుకులున్న తండ్రికి వచ్చిన గతి అనే కథలో ప్రధానంగా పై సమస్యలు కనిపిస్తాయి. ఒక పెద్దాయన తన పిల్లల బాగు కోసం తన యావద్ ఆస్తిని సమానంగా పంచిపెడతాడు. కొద్ది రోజుల

తరువాత ఆ పెద్దాయన అనారోగ్యంతో మంచాన పడతాడు. నలుగురు కొడుకులు ఉన్న ఎవ్వరు కూడ ఆ పెద్దాయనను చేరదీసి పట్టెడన్నం పెట్టరు. మనమళ్లను, మనుమరాళ్లను కూడా దూరం చేస్తారు. కానీ ఒక స్వామి పుణ్యం వల్ల తన తండ్రి దగ్గర డబ్బు ఉందన్న విషయం తెలుసుకొని డబ్బు కోసం మంచిగా చూసుకోవడం మొదలుపెడతారు. మానవ సంబంధాలన్ని డబ్బుతో ముడిపడి ఉన్నాయన్న సందేశాన్ని ఈ జానపద కథ అందిస్తుంది.

31. ఒక వ్యక్తికి ఒక భార్య ఉండటం అనేది సహజం. కాని జానపదుల్లో పూర్వం బహుభార్యత్వాన్ని కల్గి ఉండేవారు. నేడు బహుభార్యత్వం అనేది చట్టరీత్యా నేరం. అక్కెమ్మల కథ, సవతి తల్లి పోరు, తల్లి కూతుళ్ల అనుబంధం అనే కథల్లో బహుభార్యత్వం చిత్రించబడ్డది. అక్కెమ్మ కథలో రాజు ముగ్గురు భార్యలను చేసుకుంటాడు. దీనిని బట్టి రాజులు తమ వంశాభివృద్ధికి బహుభార్యత్వాన్ని కల్గి ఉండేవారని గ్రహించవచ్చు. సవతి తల్లి పోరు అనే కథలో ఒక వ్యక్తి ఇద్దరు భార్యలను చేసుకుంటాడు. మొదటి భార్య చనిపోయాక ఆమె పిల్లలను రెండవ భార్య సరిగ్గా చూసుకోదు. తమ పిల్లలను బాగా చూసుకుని, మొదటి భార్య పిల్లలను చంపించాలని ప్రయత్నిస్తుంది.

32. శైమ మత ప్రచారానికి సంబంధించిన కథలు జానపద కథల్లో ఒకటి నేను సేకరించిన కథల్లో కనిపించింది. సిరియాళుని కథను జానపదులు చిరుతొండరాజు కథగా చెప్పుకుంటున్నారు. ఈ కథలో శివపర్వతులు మారువేషంలో వచ్చి చిరుతొండ రాజు దంపతులను పరీక్షిస్తారు. పాల్కురికి సోమనాథుడు రచించిన బసవపురాణంలోని చతుర్థాశ్వాసములో సిరియాళుని కథ కనిపిస్తుంది. సిరియాళుని కథలో లేని విషయాలు జానపదులు చిరుతొండ రాజు కథలో కల్పించినట్లు గమనించాను. జానపద కథకులు సమకాలీన విషయాన్ని జానపద కథల్లో చేర్చి కథాకథనం చేస్తూ ఉంటారు. చిరుతొండ రాజు కథలో కూడా సిరియాళుడు స్కూల్‌కి వెళ్లినట్లు, ఆలస్యం అవుతుందని, 36 పాత్రల్లోనే సిరియాళుని మాంసాన్ని వండి పెట్టాలని నియమాన్ని కథకురాలు చెబుతుంది. మూలకథలో మారువేషంలో వచ్చిన శంకరుడు భోజనం చేయడానికి ముందు పిల్లలు లేని ఇంట్లో నేను భోజనం చేయనని కారణం చెప్పి, నీ కొడుకును పిలువమని

చిరుతోండను ఆదేశిస్తాడు. జానపద కథల్లో చిరుతొండ రాజు కొడుకుని చంపి కూర వండి పెట్టలేదని, కుక్కని వండి పెట్టవని చెప్పి మారువేషంలో వచ్చిన పార్వతీశంకరుల కోపానికి వస్తారు. మూలకథలో చిరుతొండ రాజు సిరియాళున్ని ఒక్కసారి మాత్రమే చంపుతాడు. అదే జానపద కథలో రెండు సార్లు చంపుతాడు. ఈ జానపద కథాకథనం కథకురాలు అనేక వర్ణనలు చేసి, చిరుతోండ రాజు కథను కళ్లకు కట్టినట్లు హృద్యంగా శోకభరితంగా చెబుతుంది.

33. శివసత్తెవతారమెత్తిన భార్య, తల్లి కొడుకు, కోతి కోడలు, కాటిమీదికెక్కిన కోడలు, ఐదు మల్లె పూవ్వుల కథ మొదలైన జానపద కథల్లో శివుడు మారువేషంలో వచ్చి సహాయ పడినట్లు పరిశీలించాను. దీన్ని బట్టి జానపదులకు దైవం మీద నమ్మకం, భక్తిభావన, పాపభీతి ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది.

34. జానపద కథ ప్రారంభం, ముగింపు, కథలో వివిధాంశాలు, వాటి మధ్య అంతర్గత సంబంధాల చర్చనే కథానిర్మాణం అని అంటారు. పూర్వ పరిశోధకుల ద్వారా తెలుసుకున్న పాశ్చాత్య జానపద కథానిర్మాణ పద్ధతులను నేను సేకరించిన జగిత్యాల జిల్లా జానపద కథలకు అన్వయించే ప్రయత్నం చేసాను. తెలుగు జానపద సాహిత్య పరిశోధనలో ఈ రకమైన కథానిర్మాణ విశ్లేషణల కృషి తక్కువగానే జరిగిందని తెలుస్తుంది.

35. జానపద కథానిర్మాణం, కథానిర్మాణ పద్ధతులు, కథానిర్మాణ ప్రయోజనాలను తెలిపాను. కథానిర్మాణ పద్ధతుల్లో ఏకకాలిక అధ్యయానానికి అధిక ప్రాధాన్యతని విశ్లేషణ చేసాను. నిర్దిష్ట కాలంలో లభించిన జానపద కథలను కథానిర్మాణ దృష్టితో పరిశీలించడమే ఏకకాలిక అధ్యయనం. కథను వివరణాత్మక దృష్టితో పరిశీలించిన వారిలో ప్రథముడు పి. జె ప్రాప్. ఆ తరువాత లెవిస్ట్రాస్, అలన్ డెండస్, బ్రూమండ్, ప్రేటెగ్ ముఖ్యమైనవారు. పై పరిశోధకుల కథానిర్మాణ సిద్ధాంతాలను నాకు లభించిన కథలకు అన్వయించి వివరణాత్మక దృష్టితో విశ్లేషించాను.

36. ప్రాప్ ప్రతిపాదించిన కథా నిర్మాణ విశ్లేషణకు ఐదు మల్లె పూవ్వుల కథ, రాణి పగడాల పేరు కథలను అన్వయించాను. లెవిస్ట్రాస్ ప్రాతిపదికాత్మక విశ్లేషణకు చాకలి పుల్లక్క పాతివ్రత్యం కథని, అలన్ డెండస్ కథానిర్మాణ పద్ధతికి కానుగ పట్నం కథని, క్లాడ్ బ్రూమండ్ నైతిక నమూనాకి దైవానుగ్రహం కథని అన్వయించి పట్టికల రూపంలో విశ్లేషించాను.

37. జగిత్యాల జిల్లా జానపద కథల్లో కథా ప్రారంభాలు కులప్రస్తావన, సంతానలేమి సమస్య, కుటుంబాల్లో లోటు, సామాజిక హోదా, తమ చుట్టు ఉన్న పరిసరాల గురించి చెబుతూ కథలను చెప్పినట్లు పరిశీలించాను. అన్ని కథా ముగింపులు సుఖాంతంగానే ఉన్నాయి. కథాప్రారంభంలో అవిర్భవించిన సమస్య లేదా లోటును తీర్చే విధంగా కథా ముగింపులు ఉన్నట్లు గుర్తించాను.

38. జానపద కథ అధ్యయనంలో ప్రధానమైన కథాంశం లేదా మూలాంశం (motif). కథలో కనిష్ఠాంశాన్ని మూలాంశం అంటాం. అతిమానుష పాత్రలు, అసాధారణ సంఘటనలు, అవాస్తవికాంశాలు, అద్భుతమైన వస్తువులు కథలో కథాంశాలుగా ఏర్పడతాయి. కథను నడిపించడంలో, మలుపు తిప్పడంలో కథాంశాలు కీలక పాత్ర వహిస్తాయి. స్థిత్ థాంప్సన్ కథాంశాల సూచి సంఖ్యను జగిత్యాల జిల్లా జానపద కథల్లోని కథాంశాలను గుర్చించి ఇచ్చాను.

ఉదా: అదృష్టదేవత (A 482.2. Goddess of good luck (Lakshmi))

మాట్లాడే జంతువులు (B 210. Speaking Animals)

హారంలో ప్రాణం (E 711.4. Soul in necklace)

39. జానపద కథలు ఏ ఏ ప్రాంతాల్లో దొరుకుతాయో, ఆ ప్రాంత మాండలిక పదాలే ఆ జానపద కథల్లోనూ ఉంటాయి. జగిత్యాల జిల్లా జానపద కథల్లో జగిత్యాల, కరీంనగర్ పరిసర ప్రాంతాల ప్రజల మాట్లాడే మాండలిక పదాలు ఎక్కువగా కన్పిస్తాయి. ఉదా: గుండిగ – గొంతు, పొద్దులు – పురిటి నొప్పులు, కచ్రం – ఎడ్లబండి, ముత్తెమంత – కొంచెం, పడుసోడు – యువకుడు, రికాబు – మూత, ఒల్లెకం – వట్టి మాట, కొంద పోతే – పట్టుకొని పోతే, ఏంచడం – లెక్కపెట్టడం, ఒర్రె – వాగు మొదలైనవి.

40. తెలంగాణను మహమ్మదీయ, నిజాంలు పరిపాలించారు. వారి కాలంలో ఉర్దూ రాజ భాషగా చలామణిలో ఉండేది. కాబట్టి ఈ ప్రాంతంలో ఉర్దూ, పారశీక భాషా పదాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఉదా: వజన్ – భారం, జంగల్ – అడవి, దుకాన్లు – కొట్టు, షాపులు, చారానా, దావత్, ఇజ్జత్తు, ఫికర్ మొదలైనవి.

41. జానపదులు నిజజీవితంలో సందర్భానుసారంగా తిట్లను సహజంగా వాడుతుంటారు. జానపద కథలలో కూడా తిట్లు వచ్చాయి. ఉదా: ముండ బొడ్డి, నీ ఇంట్ల పీనుగెల్ల, మిండెడు, పిస ముండకొడుకా! మొదలైనవి.

42. జానపద కథల్లో ప్రజలు వ్యవహరించే సామెతలు, జాతీయాలు కూడా కనిపించాయి.

ఇగురమన్న గట్టిగ ఉండాలి, ఈపన్న గట్టిగ ఉండాలట, పుట్టికూర కన్న పుట్టినిల్లు మేలు

పొద్దికి పొట్ట గడ్తలేదు మాపటికి బట్ట గడ్తలేదు

ముఖం కొట్టింది, నల్లమొకం రా కొడుకా, సచ్చేంత విద్య, బారాన మందం పని మొ.నవి

43. పదాల్లో వర్ణాలు తారుమారు అయి పలకడాన్ని వర్ణవ్యత్యయం అంటాం. కొన్ని వర్ణవ్యత్యయం జరిగిన పదాలు గమనించాను. ఉదా: అగ్గిదలగ – అగ్గిదగల, ఇవరిదాంక – ఇదివరిదాక, అవిటికి – వాటికి.

44. జానపదులు ఒక భాషను వ్యవహరించేటప్పుడు వారి అవసరాలను బట్టి కొన్ని కొత్త పదాలను కల్పించుకుంటారు. ఇది సహజమైన కూర్పు కాని పనిగట్టుకొని చేసే చేర్పులు కావని గమనించాలి. ఉదా: వాతపు రోగం (పక్ష వాతం), సర్వ అబద్దాలు, సర్వసాకిరి, పక్కపొంటోడు, మోకాటి ఆలోచన, సత్తెనాశనం, మర్రు మబ్బులు మొదలైనవి నూతన పదాల కల్పనలు కనిపిస్తాయి.

# ఉపయుక్త గ్రంథాలు


1. ఇనాక్, కొలుకలూరి. 2010. ***జానపద సాహిత్య విమర్శ.*** హైదరాబాదు: జ్యోతి గ్రంథమాల.
2. కృష్ణకుమారి, నాయిని. (సం.పా) 2000. ***తెలుగు జానపద విజ్ఞానం, సమాజం, సంస్కృతి, సాహిత్యం***. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
3. కృష్ణకుమారి, నాయిని. 2007. ***తెలుగు జానపద గేయ గాథలు***. హైదరాబాదు: తెలుగు అకాడమి.
4. కృష్ణమూర్తి, భద్రిరాజు (సం.పా). 2004. ***తెలుగు భాషా చరిత్ర***. హైదరాబాదు: విద్య ఆఫ్ సెట్ ప్రింటర్స్.
5. కృష్ణకుమారి, నాయని (సం.పా) 1996. ***జానపద సరస్వతి.*** హైదరాబాదు: జానపద సాహిత్య పరిషత్
6. గంగప్ప. యస్. 1984. ***జాతికి ప్రతిబింబం జానపద సాహిత్యం*** (వ్యాస సంపుటి) గుంటూరు: వైష్ణవి ప్రింటర్స్
7. జయదేవ్, ఎన్. 2017. ***మహాభారతంలో జానపద కథాంశ కథలు***. విశాఖపట్నం: వినయ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
8. దక్షిణామూర్తి, పోరంకి. 2009. ***కథానిక స్వరూప స్వభావాలు***. హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్.
9. దక్షిణామూర్తి, పోరంకి. 1992. ***భాష ఆధునిక దృక్పథం***. సికిందరాబాదు: శివాణి ప్రెస్.
10. నరసయ్య, సంగనభట్ల. 2007. ***శ్రీ ధర్మపురి క్షేత్ర చరిత్ర.*** కరీంనగర్: సత్యనారాయణ ఆఫ్ సెట్ ప్రింటర్స్.
11. నరసమాంబ, కె.వి.ఎస్.ఎల్. 1989. ***తూర్పు గోదావరి జిల్లా జానపద కథలు.*** హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం
12. నటరాజ్.డి. 2014. ***బహుజనహిత బుద్ధ జాతక కథలు.*** విజయవాడ: జనతా ప్రచురణాలయం.
13. ప్రతాపరెడ్డి, గుజ్జం. 2007. ***మన జానపద విజ్ఞానం.*** సికింద్రాబాదు: తెలుగు భారతి.
14. పద్మారావు. టి. 1992. ***పట్టణ జనపద కథలు – అధ్యయనం.*** ఉస్మానియా విశ్వవిద్యాలయం: పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం.

15. పెద్దిరెడ్డి, సి. 1988. ***అనంతరపురం జిల్లా జానపద కథలు***. మైసూరు విశ్వవిద్యాలయం: పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం

16. ప్రేమలత, రావి. 1990. ***జానపద విజ్ఞాన పరిశీలనం*** (వ్యాస సంకలనం). హైదరాబాదు: వరలక్ష్మీ ప్రింటింగ్ ప్రెస్

17. ప్రేమలత, రావి. 1996. ***జానపద విజ్ఞానంలో స్త్రీ***. (వ్యాస సంకలనం). హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్

18. ప్రేమలత, రావి. 1983. ***తెలుగు జానపద సాహిత్యం–పురాగాథలు***. సికింద్రాబాద్: అవేర్ ప్రింటింగ్ ప్రెస్

19. బాలస్వామి, బుక్కా. 1987. ***మహబూబ్‌నగర్ జిల్లా జానపద కథలు.*** హైదరాబాదు: మాస్టర్ ఆర్ట్ ప్రింటర్స్

20. బిరుదురాజు, రామరాజు. 1990. ***జానపద గేయ సాహిత్యం***. హైదరాబాదు: జానపద విజ్ఞాన ప్రచురణలు.

21. భక్తవత్సలరెడ్డి, యస్. 1995. ***జానపద విజ్ఞాన సమాలోచన.*** హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం.

22. భోజన్న. తాటికాయల. 2015. ***ధర్మపురి మండల జానపద కథలు***. హైదరాబాదు: కర్షక్ ప్రింటర్స్

23. మలయశ్రీ. 1997. కరీంనగర్ జిల్లా సాహిత్య చరిత్ర. కరీంనగర్: సత్యార్థి పబ్లికేషన్స్.

24. ముత్యం, కె. (సం.పా). 2016. ***ఉత్తర తెలంగాణ సంస్కృతి చరిత్ర.*** హైదరాబాదు: శ్రీలక్ష్మీ ఆర్ట్ ప్రింటర్.

25. మునస్వామి ఆచారి, ఎ. 1995. ***చిత్తూరు జిల్లా జానపద కథల పరిశీలనం***. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం: (పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం)

26. మునిరాజు కె.ఎం. గౌనోళ్ల సురేష్‌రెడ్డి (సం.పా). 2012. ***జతగాళ్లు కతగాళ్లు.*** విజయవాడ: శ్రీ శ్రీ ప్రింటర్స్

27. మోహన్, జి. యస్. 2001. ***జానపద విజ్ఞానాధ్యయనం.*** విజయనగరం: శ్రీ లక్ష్మీ ఆర్ట్ ప్రింటర్స్.

28. మోహన్, జి. యస్. 2000. ***తెలుగులో ధార్మిక సాంస్కృతిక జానపద కథలు***. బెంగుళూరు: శ్రీనివాస పబ్లికేషన్స్.

29. మోహన్, జి. యస్. 1984. ***తెలుగు జానపద కథలు.*** సికింద్రాబాదు: యువభారతి సాహితి సాంస్కృతిక సంస్థ.

30. రమణయ్య, జైశెట్టి. 2003. ***కరీంనగర్ జిల్లా చరిత్ర–సంస్కృతి.*** జగిత్యాల: నాగజ్యోతి గ్రాఫిక్స్

31. రమేష్, కాటం. 2000. ***కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమర చరిత్ర***. కరీంనగర్: కాటం ప్రచురణలు

32. రామరాజు, బిరుదురాజు. 1990. ***తెలుగు జానపద గేయ సాహిత్యం***. హైద్రాబాదు: జానపద విజ్ఞాన ప్రచురణలు.

33. రాధాకృష్ణ శర్మ, చల్లా. 1999. ***తమిళదేశ జానపద కథలు.*** న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ

34. రాధాకృష్ణ, బూదరాజు. (సం.పా). 2004***. తెలుగు మాండలికాలు – కరీంనగర్ జిల్లా***. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

35. లింగారెడ్డి. గోపు. 1982***. జానపద విజ్ఞానం సేకరణ–అనుభవాలు***. కరీంనగర్: సుషమా పబ్లికేషన్.

36.వాసంతి, ఎం. (సం.పా). 2004. ***తెలంగాణ సాంఘిక సంస్కరణ ఉద్యమాలు మహిళల పాత్ర*** (1901–2001). హైదరాబాదు: డైనమిక్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్

37.విజయకుమారి, డి. 2004. ***జానపద సాహిత్యం – స్త్రీ (గేయ సాహిత్యం).*** హైదరాబాదు: కేంద్రీయ విశ్వవిద్యాలయం (పిహెచ్.డి. పరిశోధన వ్యాసం.)

38.విజయకుమారి, డి. 2019. ***జానపద సాహిత్య వ్యాసతోరణం (వ్యాస సంపుటి)***. హైదరాబాదు: సూర్య పబ్లికేషన్స్

39.శ్రీనివాసులు, టి. 1998. ***తెలంగాణ జానపద కథలు – సామాజిక ప్రతిఫలనం***. హైదరాబాదు: కేంద్రీయ విశ్వవిద్యాలయం. (అముద్రిత పరిశోధన వ్యాసం)

40. శ్రీదేవి, వి. 1991. ***వరంగల్ జిల్లా జానపద కథలు – సాంఘిక జీవనం***. కాకతీయ విశ్వవిద్యాలయం: (యం. ఫిల్ పరిశోధన వ్యాసం)

41. సంతోష్, ధారవత్, 2014. ***తొర్రూరు మండల జానపద కథలు–పరిశీలన***. హైదరాబాదు: కేంద్రీయ విశ్వవిద్యాలయం. (అముద్రిత పరిశోధన వ్యాసం)

42. సంతోష్, ధారవత్, 2018. ***వరంగల్ జిల్లా జానపద గేయకథ అధ్యయనం***. హైదరాబాదు: కేంద్రీయ విశ్వవిద్యాలయం. (పిహెచ్.డి. పరిశోధన వ్యాసం.)

43. సత్యనారాయణ, కె.వి. 1998. ***నెల్లూరు జిల్లా జానపద కథలు – ఒక పరిశీలన.*** తిరుపతి: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం)

44. సుందరం. ఆర్వీ.యస్. 2015. ***ఆంధ్రుల జానపద విజ్ఞానం.*** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం.

45.సుమతి, కె. 1991. ***తెలుగు జానపద కథలు***. హైదరాబాదు: డా. బి. ఆర్. ఆంబేద్కర్ కళాశాల ఉస్మానియా విశ్వవిద్యాలయం: పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం

46. సుమతి, కె. 1984. ***తెలుగు జానపద కథాస్రవంతి***. మైసూరు: జానపద విజ్ఞాన భారతి.

47. సుబ్బరామిరెడ్డి, ఎ.1991. ***కడప జిల్లా జానపద గేయ నిర్మాణం – సమాజం, సంస్కృతి.*** కడప: శ్రీ లక్ష్మీ పబ్లికేషన్స్.

48. సుబ్బచారి, పులికొండ. 1992. ***అద్భుత కథానిర్మాణం (బాల నాగమ్మ).*** హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్య పరిషత్

49. సుబ్రహ్మణ్యం, పి.యస్. 1997. ***ఆధునిక భాషా సిద్ధాంతాలు***. హైదరాబాదు: పొట్టి శ్రీ రాములు విశ్వవిద్యాలయం

50. సుమాలినీ రెడ్డి, కె. 2013. ***జై కిషన్ అభినందన సంచిక***. నంద్యాల: దక్కన్ ఆర్కియాలాజికల్ సంస్థ

51. సురేష్, కె (తెలుగు అనువాదం). 2000. ***సందిగ్ధ రాజస్థానీ కథలు***. హైదరాబాదు: లిఖిత ప్రెస్.

### ఆంగ్ల గ్రంథాలు

1. Dorson, Richard M. (Edited by) 1972. Folklore and Folklife an Introduction The University of Chicago Press, Chicago and London.
2. Dorson, Richard M. 1959 American Folklore, The University of Chicago Press.
3. Dundes, Alan. 1965. The study of Folklore, Presntice – Hall, Inc Englewood cliffs, N.J.
4. Propp, V. 1958. Morphology of the Folktale, Indiana University.
5. Ramakrishna Reddy, B. 2001. Dravidian Folk and Tribal Lore. Kuppam: Dravidian University
6. Ramaraju, B. 1991. Glimpses Into Telugu Folklore. Jaanapada Vijnana Prachranalu, Hyderabad
7. Ramanujan.A.k, 2009. Folktales from India. Haryana (Gurgaon): Penguan Random House Private Limited
8. Thompson, stith. 1946. The folktale. The Dryden press. New work.

### వెబ్‌సైట్లు

1. http://www.ruthenia.ru/folklore/thompson/
2. www.cencus of india.com
3. www.wikipedia.com/jagtialjilla
4. www.jagitial.ts.nic.in.com
5. www.ts.tourism.com
6. www.teluguthesis.com

## వార్తాపత్రికలు

నమస్తే తెలంగాణ

చరిత్ర (వారపత్రిక)

జనం సాక్షి

ఆంధ్రజ్యోతి

ఈనాడు

## ఇతరములు

జగిత్యాల జిల్లా సమాచారం, మన జిల్లా – మన ప్రణాళిక, ప్రణాళిక సంఘం, తెలంగాణ శాఖ–2017

Socio economic outlook 2017, Planning Department, Govt. of Telangana.

Statistical Year Book – 2017, Govt. of Telangana, Hyderabad.

# అనుబంధం – 1

## (ఛాయాచిత్రాలు)



జానపద కథాసేకరణలో దీకొండ పర్వతాలుతో




జానపద కథకురాలు – బండ్ల కనకమ్మతో




జానపద కథకురాలు – తాటికాయల పుష్పతో




జానపద కథకుడు – జాడి రాజన్నతో



జానపద కథకుడు కైరం రమణ గారు – కథాసేకరణలో సహాయపడిన వ్యక్తి



జానపద కథకురాలు చిట్టన్నోజు అమ్మాయక్క

# అనుబంధం – 2

| జానపద కథల సమాచార సేకరణ వివరాలు | | | | | |
|---|---|---|---|---|---|
| క్ర.సం. | కథ | కథ చెప్పినవారు | వయస్సు | గ్రామం | మండలం |
| 1. | సోమనాళ్ల బావి | జాడి రాజన్న | 70 సం. | ఆరపల్లి | ధర్మపురి |
| 2. | బ్రాహ్మణుడి ఇంటి దూలం | జాడి రాజన్న | 70 సం. | ఆరపల్లి | ధర్మపురి |
| 3. | అన్నదమ్ముల సాత్రం | జాడి రాజన్న | 70 సం. | ఆరపల్లి | ధర్మపురి |
| 4. | కాపు కథ | జాడి రాజన్న | 70 సం. | ఆరపల్లి | ధర్మపురి |
| 5. | చాకలి పుల్లక్క పాతివ్రత్యం | జాడి రాజన్న | 70 సం. | ఆరపల్లి | ధర్మపురి |
| 6. | బ్రాహ్మణుడి వరాలు | జాడి రాజన్న | 70 సం. | ఆరపల్లి | ధర్మపురి |
| 7. | చెల్లెలు దిద్దిన కాపురం | జాడి రాజన్న | 70 సం. | ఆరపల్లి | ధర్మపురి |
| 8. | దారి మరిచిన దారక | జాడి రాజన్న | 70 సం. | ఆరపల్లి | ధర్మపురి |
| 9 | లక్ష్మీదేవి కటాక్షం | జాడి రాజన్న | 70 సం. | ఆరపల్లి | ధర్మపురి |
| 10. | కానుగ పట్నం | జాడి రాజన్న | 70 సం. | ఆరపల్లి | ధర్మపురి |
| 11. | మునుపటి సంబంధం | జాడి రాజన్న | 70 సం. | ఆరపల్లి | ధర్మపురి |
| 12. | అత్త కాలవిషం | కాశెట్టి భూలక్ష్మీ | 42 సం. | గుండయ్య పల్లె | ధర్మపురి |
| 13. | లచ్చిందేవి ఆచారం | కాశెట్టి భూలక్ష్మీ | 42 సం. | గుండయ్య పల్లె | ధర్మపురి |
| 14. | అక్కెమ్మల కథ | తాటికాయల పుష్ప | 52 సం. | దొంకెశ్వర్ | ధర్మపురి |
| 15. | సవతి తల్లి తీరు | తాటికాయల పుష్ప | 52 సం. | దొంకెశ్వర్ | ధర్మపురి |


| | | | | | |
|---|---|---|---|---|---|
| 16. | తల్లి కూతుళ్ల అనుబంధం | తాటికాయల పుష్ప | 52 సం. | డొంకెశ్వర్ | ధర్మపురి |
| 17. | హరిదాసు కథ | పెంట గంగరాం | 55 సం. | బుద్దేశ్ పల్లి | ధర్మపురి |
| 18. | గొల్లబోయని రాజనీతి | పెంట గంగరాం | 55 సం. | బుద్దేశ్ పల్లి | ధర్మపురి |
| 19. | ఇరవై అయిదు రోజుల బాలుడు | ఆసం ముత్తన్న | 65 సం. | దమ్మనపేట | ధర్మపురి |
| 20. | సావుకారి కోడలి 'చతురత' | చిట్టన్నోజు అమ్మాయక్క | 65 సం. | గణేష్ పల్లి | ధర్మపురి |
| 21. | దైవానుగ్రహం | చిట్టన్నోజు అమ్మాయక్క | 65 సం. | గణేష్ పల్లె | ధర్మపురి |
| 22. | అమరిక రాజు కథ | చిట్టన్నోజు కళావతి | 51 సం. | తుమ్మనాల | ధర్మపురి |
| 23. | తోడి కోడల్ల అత్యాశ | బోగ లక్ష్మి | 48 సం. | దమ్మన్నపేట | ధర్మపురి |
| 24. | రాణి పగడాల పేరు | సోంసెట్టి పోసాని | 68 సం. | నంబాల | ధర్మపురి |
| 25. | నిరుడు బుచ్చపతి నేడు లచ్చపతి | దీకొండ పర్వతాలు | 45 సం. | ఆత్మకూరు | గొల్లపల్లి |
| 26. | పైసకు గుడిసెన్నర పెండ్లాం | దీకొండ పర్వతాలు | 45 సం. | ఆత్మకూరు | గొల్లపల్లి |
| 27. | ఒక గుండుకు రెండు గుండ్లు | దీకొండ పర్వతాలు | 45 సం. | ఆత్మకూరు | గొల్లపల్లి |
| 28. | మూడు వస్తువుల ఆస్తి | దీకొండ పర్వతాలు | 45 సం. | ఆత్మకూరు | గొల్లపల్లి |
| 29. | అత్తని నమ్మని కోడలు కోడల్ని నమ్మని అత్త | దీకొండ పర్వతాలు | 45 సం. | ఆత్మకూరు | గొల్లపల్లి |
| 30. | బూరెప్ప కథ | దీకొండ పర్వతాలు | 45 సం. | ఆత్మకూరు | గొల్లపల్లి |
| 31. | లింగం కట్టుకున్న నక్క | దీకొండ పర్వతాలు | 45 సం. | ఆత్మకూరు | గొల్లపల్లి |
| 32. | అన్నదమ్ముల కథ | దీకొండ పర్వతాలు | 45 సం. | ఆత్మకూరు | గొల్లపల్లి |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 33. | గొల్ల మల్లమ్మ | అనుగుల రాజు | 25 సం. | ఆత్మకూరు | గొల్లపల్లి |
| 34. | శివసత్తె అవతారమెత్తిన భార్య | అనుగుల రాజు | 45 సం. | లక్ష్మీపూరు | గొల్లపల్లి |
| 35. | కొమురెల్లి మల్లన్న | అనుగుల రాజు | 45 సం. | ఆత్మకూరు | గొల్లపల్లి |
| 36. | రేచీకటి అల్లుడు | కైరం రమణ | 44 సం. | బతికెనపల్లి | రాయికల్ |
| 37. | అత్తిచ్చిన 'అప్ప' | కైరం రమణ | 44 సం. | బతికెనపల్లి | రాయికల్ |
| 38. | మనిషి ఆయుష్షు | కైరం రమణ | 44 సం. | బతికెనపల్లి | రాయికల్ |
| 39. | గాండ్ల బుచ్చమ్మ | కైరం రమణ | 44 సం. | బతికెనపల్లి | రాయికల్ |
| 40. | చెప్పుకున్న విలువ రాజుకు లేదు | కైరం రమణ | 44 సం. | బతికెనపల్లి | రాయికల్ |
| 41. | తల్లి కొడుకు కోడలు | కైరం రమణ | 44 సం. | బతికెనపల్లి | రాయికల్ |
| 42. | బూడిదగిరి పట్నం | కైరం రమణ | 44 సం.. | బతికెనపల్లి | రాయికల్ |
| 43. | గుమ్మడి మర్రి కథ | కైరం రమణ | 44 సం.. | బతికెనపల్లి | రాయికల్ |
| 44. | నేను మల్లన్నను వెళుతున్నను | కైరం రమణ | 44 సం. | బతికెనపల్లి | రాయికల్ |
| 45. | అత్త కోడలు వంకాయ | కైరం రమణ | 44 సం. | బతికెనపల్లి | రాయికల్ |
| 46. | రాజి కథ | కైరం రమణ | 44 సం. | బతికెనపల్లి | రాయికల్ |
| 47. | గుడ్డి కుంటివాడి కథ | కైరం రమణ | 44 సం. | బతికెనపల్లి | రాయికల్ |
| 48. | అన్న చెల్లెలి కథ | కైరం రమణ | 44 సం. | బతికెనపల్లి | రాయికల్ |
| 49. | పిసకొడుకు | కైరం లక్ష్మీ | 66 సం. | బతికెనపల్లి | రాయికల్ |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 50. | రాజు పతాని ‘లగ్గం’ | రాజారపు రాధ | 43 సం | తాటిపల్లి | రాయికల్ |
| 51. | పోశవ్వ మొక్కు కథ | రాజారపు రాధ | 43 సం | తాటిపల్లి | రాయికల్ |
| 52. | కాటిమీదికెక్కిన కోడలు | చంగళి సుగుణ | 55 సం. | రాయికల్ | రాయికల్ |
| 53. | తల్లి, కోతి, కోడలు | గుర్రం చుక్కయ్య | 64 సం. | ఇటిక్యాల | రాయికల్ |
| 54. | గాండ్ల బుచ్చమ్మ | గుర్రం పెద్దిరాజు | 70 సం. | రాయికల్ | రాయికల్ |
| 55. | రంకు బొంకు కథ | మామిడాల భీమయ్య | 60 సం. | అల్లీపూర్ | రాయికల్ |
| 56. | ముసలమ్మ కథ | బత్తిని ఎల్లక్క | 60 సం. | క్రిష్టంపేట | రాయికల్ |
| 57. | కొతి కథ | ఆకుల విష్ణుమూర్తి | 55 సం. | రాయికల్ | రాయికల్ |
| 58. | గుడ్డి పిల్లవాడు | కుమ్మరపెల్లి శ్రీనివాస్ | 44 సం. | అయిలాపూర్ | కోరుట్ల |
| 59. | కొడుకులున్న తండ్రికి వచ్చిన గతి | మాదాసు పద్మ | 45 సం. | అయిలాపూర్ | కోరుట్ల |
| 60. | పంచపాండవుల కథ | తూటికూర్లపార్వన్న | 85 సం. | వర్షకొండ | ఇబ్రహీంపట్నం |
| 61. | అక్కెమ్మ కథ | తూటికూర్లపార్వన్న | 85 సం. | వర్షకొండ | ఇబ్రహీంపట్నం |
| 62. | పాండవుల కథ | సల్కం గంగరాం | 50 సం. | వర్షకొండ | ఇబ్రహీంపట్నం |
| 63. | ఐదు మల్లె పూవ్వుల కథ | బండ్ల కనకమ్మ | 65 సం. | తాళ్ల ధర్మారం | బీర్‌పూర్ |
| 64. | చిరుతొండ రాజు కథ | బండ్ల కనకమ్మ | 65 సం. | తాళ్ల ధర్మారం | బీర్‌పూర్ |
| 65. | సత్యవతి కథ | బండ్ల కనకమ్మ | 65 సం. | తాళ్ల ధర్మారం | బీర్‌పూర్ |
| 66. | సత్యహరిశ్చంద్రుడి కథ | బండ్ల కనకమ్మ | 65 సం. | తాళ్ల ధర్మారం | బీర్‌పూర్ |
| 67. | గారడి పిల్లవాడు | దాయాది రాములు | 45 సం. | కొల్వాయి | బీర్‌పూర్ |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 68. | బంగారెంటుక బాలుడు | దాయాది రాములు | 45 సం. | కొల్వాయి | బీర్‌పూర్ |
| 69. | పెద్దపులి – గిద్దపులి | దాయాది రాములు | 45 సం. | కొల్వాయి | బీర్‌పూర్ |
| 70. | పోశవ్వ కథ | సెరెల్ల సత్తవ్వ | 48 సం. | స్తంభంపల్లి | వెల్గటూర్ |
| 71. | రామదాసు కథ | ఇమ్మిడి మల్లయ్య | 70 సం. | కమునూర్ | సారంగాపూర్ |
| 72. | చంద్రహాసుడు కథ | ఇమ్మిడి మల్లయ్య | 70 సం. | కమునూర్ | సారంగాపూర్ |
| 73. | కనకతార కథ | ఇమ్మిడి మల్లయ్య | 70 సం. | కమునూర్ | సారంగాపూర్ |
| 74. | భోగసాని లంగతనం | లక్కాకుల రాజన్న | 65 సం. | తుమ్మనాల్లె గ్రామం | సారంగాపూర్ |
| 75. | రామా రామా అంటే రోమా రోమా పాపలు పోతాయి | వోదెల నారాయణ | 63 సం. | అయిలాపూర్ | కోరుట్ల |

# పుస్తకాల్లో ముద్రితమైన పరిశోధన పత్రాల నకళ్లు



# VYASA DEEPIKA(Essays)

First Edition : @ 2018

Copy Right : Chief Editor

Copies : 500

Price : 350/-

**Books Available at :**
All Leading Book Shops,
*www. vyasasudha2017.org,*
*www. kinige.org*

**ISBN : 978-93-87540-42-2**

**For Communications :**
P. Usha Rani, Principal,
S.G.V.Oriental College, Thimmasamudram,
Prakasam (D.t).
Dr. B.Vijay Kumar - 9866703130.

Published by : **ROSHAN PUBLICATIONS,**
Visakhapatanam.

Cover Design : Narasimha, Navya Sai Graphics, Chirala.

Printed at : Sri Sri Printers. vja@ gmail.com
9490634849.

ISBN:978-93-87540-42-2



27. ఆధునిక కవిత్వంలో అమ్మ - డా॥ మోకా ప్రతాప్ 206
28. స్త్రీవాద సాహిత్యం - విమర్శక వ్యాసాలు - డా॥ లింగాల మంగమ్మ 213
29. తెలంగాణ కవిత్వం-గిరిజన జీవితం - డా॥ నూనావత్ రాంబాబు 220
30. స్త్రీ ఉనికిని స్త్రీకి పరిచయం చేసిన సాహిత్య ప్రక్రియ "స్త్రీవాదం" - డా॥ ఈతకోట ఈశ్వరరావు 228
31. వెంగమాంబ బాలభాష - భానుపావని వట్టెం 233
32. కరీంనగర్ జిల్లా జానపద కథలలో ప్రతిఫలించిన భక్తిభావన - తాటికాయల భోజన్న 237
33. ప్రపంచ తెలుగు మహాసభలు - చేబ్రోలు జఖరయ్య 244
34. 'సావుకారి కోదలు' జానపద కథలో స్త్రీ చాతుర్యం - మాడిశెట్టి అభిషేక్ 251
35. 'చెంచు' గిరిజనుల సామాజిక సాంస్కృతిక జీవన విధానం - ముదావత్ వెంకటేష్ 260
36. సలీం 'కాలుతున్న పూల తోట' ఇతివృత్తం - పాత్ర చిత్రణ - బానోత్ మోహన్ 267
37. గురుస్సాక్షాత్ పరబ్రహ్మ - అచంట మారుతీ శ్రీహరిరావు 272
38. శ్రీనాథ యుగ సాహిత్యం - ద్విపద కావ్యాలు - రాంభట్ల వేంకటరాయశర్మ 279
39. తెలంగాణ నవలలు - గౌడ వృత్తి జీవన చిత్రణ - గౌడిచర్ల జనార్ధన్ 288
40. దళిత రచయితల కథల్లో దళిత స్త్రీ - డా॥ వారాది చిన్నారావు 294
41. కాంచనమాల "మాయామహితరూప రామచంద్ర " శతకంలో నవవిధ భక్తి మార్గాలు - డా॥ లక్ష్మణ రావు ఆదిమూలం (అరసి శ్రీ) 300
42. తెలుగు సాహిత్యం - పశ్చిమగోదావరి జిల్లా కథారచయిత్రుల సేవ 20 వ శతాబ్ది ఆధారంగా - ఉషారాణి బత్రాజు 308

ప్రచురణలు: తెలుగు భాషా సాహిత్యం - చరిత్ర సంస్కృతి మొదలగు అంశాలపై ప్రత్యేక దృష్టితో తెలుగు ఇంగ్లీషు భాషలలో పుస్తకాల ముద్రణ జరిగింది.

ప్రత్యేక సంచికలు: తెలుగు సమగ్ర జాతి చరిత్రను సంక్షిప్తంగా వివరించే వివిధ అంశాలపై ప్రముఖులు వ్రాసిన వ్యాసాలలో తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో సావనీర్లు వెలువరించారు.

చలనచిత్ర ప్రదర్శన: ఈ సందర్భంగా నగరంలో కొన్ని ఎంపికచేసిన సినిమా థియేటర్లలో ప్రతినిధుల కోసం ఉత్తమ తెలుగు చిత్రాలను ఉచితంగా ప్రదర్శించారు. మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు జరిగిన పన్నెండేళ్ళకు ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు జరిగిన 37 ఏళ్ళకు ఉమ్మడి తెలుగురాష్ట్రాలలో జరిగాయి. ఆ తదుపరి 7 సం॥ లకు తిరిగి తెలుగు రాష్ట్రమైన తెలంగాణాలో జరగటం మనందరికి ఆనందదాయమైన విషయం. ఒక నిర్దీత కాల వ్యవధిలో ఎంతోఘనంగా యావత్తు తెలుగు జాతి గర్వించే విధంగా నిర్వహించుకోవలసిన ప్రపంచ తెలుగు మహాసభలు ప్రభుత్వాల అలసత్వం మూలంగా నిర్లక్ష్యం చేయబడ్డాయి.

తెలుగు జాతిని మరొకసారి మేల్కొల్పడానికి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహకులకు పూనుకొన్నందుకుగాను తెలంగాణా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌గారు అభినందనీయులు.

**ఆధార గ్రంథాలు:**

ప్రథమాంధ్ర శతాబ్దికి వందనం - శతాబ్ది ప్రత్యేక సంచిక -2013

తెలుగు వెలుగు-

తెలుగు మహాసభల చరిత్ర - తెలుగు అకాడమీ ప్రచురణ.

**చేబ్రోలు జఖరయ్య,**

**యం.ఎ (తెలుగు.,యం.ఎ (ఎకనామిక్స్)., యం.యి.డి**

**పరిశోధకులు , అచార్య నాగార్జున యూనివర్సిటీ.**



# 'సావుకారి కోడలు' జానపద కథలో స్త్రీ చాతుర్యం

**- మాడిశెట్టి అభిషేక్,**

కథ చెప్పినవారు: చిట్టన్నోజు అమ్మాయక్క, వయస్సు: 63సం.

ధర్మపురి మండలం, జగిత్యాల జిల్లా. తెలంగాణ రాష్ట్రం.

**ఉపోద్ఘాతం:**

జానపదులు చెప్పుకునే కథలు రెండు రకాలు. అవి వచనరూపంలో ఉన్నటువంటివి, గేయరూపంలో ఉన్నటువంటివి. వాటిని కథాగేయాలు అని కూడా అంటారు. మానవుడు తనను గురించి తాను ఆలోచిస్తూ లోకం గురించి అర్థం చేసుకునే క్రమం నుండే కథలు ఆవిర్భవించి ఉంటాయి. ప్రాచీన మానవుని నుండి గత కొన్ని దశాబ్దాల కాలం వరకు మన సంస్కృతిని, సామాజిక జీవనాన్ని అర్థం చేసుకోవాలంటే మనకు ప్రధాన ఆధారాలు జానపద సాహిత్యం, జానపద కళలు. మౌఖిక రూపంలో ఉన్న జానపద విజ్ఞానం. అలాంటి జానపద విజ్ఞానంలో ఒక భాగమైన జానపద కథలు చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతివారికి ఆసక్తిభరితంగా ఉండి నీతిని, సందేశాన్ని, హితవులను, ధార్మికాంశాలను, కాలక్షేపాన్ని అందిస్తాయి. జానపద కథలు పూర్వీకులు వాళ్ల వాళ్ల పనులు పూర్తయ్యాక సాయం సమయంలో ఇంటి అరుగుల ముందు కూర్చోని పసిపిల్లలకు కల్పించి చెప్పేవారు. ఆ కథలో పిల్లలు మానసిక ఎదుగుదలకు కావల్సిన నీతి, నైతిక, ధార్మికాంశాలు పోది చేసి ఉండేవి. కాలక్షేపం, ఉల్లాసం కోసం కూడా కల్పించిన కథలు లేకపోలేదు. కథలు చెప్పడం ఓ కళ. ఆ కళను అలవరచుకోని మంచి కథనం చేసేవారు అరుదుగా

ఉంటారు. అలాంటి వారు చెప్పిన కథలను శ్రోతలు ఆసక్తితో వింటారు. "ప్రాచీన కాలం నుంచే ప్రపంచమంతటా రకరకాల కథలు పుట్టి చెవులలో చేరి, నాలుక ద్వారా వ్యాపించి, మనస్సులో తిష్ట వేసుకొని స్థలకాలావధుల్ని దాటి ప్రపంచ నలుమూలలా వ్యాపించి ఉన్నాయి" (వల్లా రాధాకృష్ణ శర్మ, 1999 పు:8).

ఎవరో ఒకరి మనసులో తోచి తరతరాలుగా చెప్పబడుతూ జానపదులను అలరిస్తున్న జానపద కథలు. వినికిడి ద్వారా పరంపరానుగతంగా వస్తున్న కథలివి. అందుకే వీటిని 'కర్ణపరంపర కథలు' అని కూడా అంటారు. వీటిని లిఖిత పూర్వకంగా ఎవరూ రాయలేదు. జానపద కథల కర్తలు అజ్ఞాతం. కాలక్రమంలో కొద్ది మార్పులను పొంది వాడుకలో ఉన్నాయి. స్థలబేధాలు, కథాకథనం చేసే వారివల్ల కూడా స్వల్ప మార్పులు పొందవచ్చు. నేడు ప్రతివారు యాంత్రిక జీవనానికి యాదృచ్ఛికంగా అనుభవిస్తున్న వారి జీవితానికి మానసిక స్థైర్యాన్ని, దృఢసంకల్పాన్ని, సరళమైన జీవిత గమనానికీ కావలసిన ఎన్నో అంశాలు మన పూర్వీకులు వారి అనుభవాలతో రంగరించి జానపద సాహిత్యంలో పదిలంగా భద్రపరచారు. వాటిని గుర్తెరిగి పలుగురికి తెలుగు సాహిత్యకారులుగా తెలియజేయడం ఆవశ్యకం. ఇకపోతే జానపద సాహిత్య విభాగంలో ఒకటైన జానపద కథలు ప్రాచీన సంప్రదాయాలను నిలబెట్టుకొని తరతరాల నుంచి మౌఖిక రూపంలో వ్యాప్తిలో ఉన్నాయి గ్రామాల్లో ఉన్న ముసలివారి చెంత చేరితే కథలగనిని వెలికితీయగలం. ఆ కథలగనిలో ఒక కథ సావుకారి కోడలు. ఈ కథలో సావుకారి కోడలు వేసే ఎత్తుగడ, పన్నగం. ఆమె దొర నుంచి తనను తాను రక్షించుకోవడమే కాకుండా స్త్రీల బుద్ధిబలాన్ని, చాతుర్యాన్ని ప్రదర్శించి స్త్రీలకుండవల్సిన ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని తెలుపుతాయి.

కథ:

ఒక సావుకారి. సావుకారికి ముగ్గురు కొడుకులు. ముగ్గురు కొడుకులైతే ఉండంగ ఉండంగ యాల్లిలకు దీపావళి పండుగ అచ్చింది. దీపాళి పండుగ్తే అయింత గంగకోయి నీళ్లు తెచ్చుకోవాలి. గంగకు నీళ్లు తెచ్చుకొటానికి ముగ్గురు యారాలు పోతరు. ముగ్గురు యారాలు వోతే అక్క నేనత్త అగు౹రి అని చిన్న కోడలంటది. చిన్నకోడలంటే నువురా తర్వాత నేనచ్చేదాకా అగు౹రి అంటే ఈ పెద్దోళ్లు ఏం జేత్త౹రు. మేం నదుత్తం మీరు రా౹రి అని చెప్పి ఇద్దరు బిందెలు పట్టుకొని పోతరు. పోయేవరకల్లా ఈ చిన్న కోడలు ఎనకయితది. కొంచెం ఎనుకయ్యేవరకల్లా ఏంది గద! దొర కచ్చీరుముందటకేంచి పోవుడు. దొర



దగ్గరకెళ్లి దొర ఆడ కూసుంటడు. కచ్చీరు ముందటికెళ్లి ఇట్ల గంగకుపోవుడు. అయితే ఆ దొర ఏం జేత్తడు గద..?

చిన్న పిల్ల ఇగర అని పిలుత్తడు పోతది. పోయినోల్లే ఆమెకు ఎంటుకలు, మడిమలు తట్టి ఉంటాయి. ఎంటుకలు మడిమలకు తట్టి ఉంటే కొసకు ముడి ఎసుకుంటది. అట్లే పోతది. పోంగ పిల్ల ఇగ రారి అని పిలుత్తరు. అస్తది. అచ్చినోల్లే ఏంది? రాజంటది. అంటే నువ్వు నీ కురులు కూసుండి ముడుసుకుంటవ. నిలుసుకుంట ముడుసుకుంటవ అని అడుగుతడు. అడిగినోల్లే ఆ రాజు గిట్ల కట్టేసుకోని కూసుంటడు కచ్చీర్ల. రాజా! రాజా! ఆ నువ్వు కట్టేసుడు నువ్వే కట్టేసుకున్నవ! ఎవ్వరైన్న కట్టేసి౹ర అని ఈమె అంటది. సప్పుండేంక వోతది. అయింత నీళ్లు ముంచుకుంటది. ఇంటికత్తది. ఇంటికి వొయినెల్లే ఆ రాజు ఏం జేత్తడు గద! పతాని...! సావుకారి కోడలు నన్ను గిట్ల అన్నది. రాజా రాజా నువ్వే కట్టేసుకున్నవ? ఎవరన్న కట్టేసి౹ర? అని చెప్పి అన్నది.

నువ్వు పొద్దుగల్ల లేసి ఊరు సాటింపెయ్యి. అందరు ఊళ్లే ఎవ్వరిండ్ల పొగ సూరద్దు. భోజనాలు ఇక్కడికే రావాలని చెప్పి. ఊరు సాటించ్చవరకల్లా అయింత అందరు వీళ్లింటికి భోజనాలకి అత్తరు. (రాజు వాల్లింటికి) రాజు వాళ్లంటికి అందరు అత్తరుగాని సావుకారు చిన్నకోడలు పోదు. సావుకారిట్ల అందరు అత్త, మామ, కోడల్లు పోతరు. ఈ చిన్న కోడలోక్కత్తి పోకా ఇంటికద ఉంటది. మరీ అత్త మామ అంటరు గద. మరి మేం అందరం ఊరు ఊరోల్లందరు పోయినమే. నువ్వు రాకపోతివేమే. మరి మనకు దండుగెత్తడు? అంటే ఎందుకెత్తుడు? దండుగ(జరిమానా) మన ఇంట్ల పొగ ఏలుతుంద? పొగ ఏల్లద్దని చెప్పని అన్నడు.అంటే నేను తినకుంటే అయిపోయే అని చెప్పి ఈమె అంటది. ఆ రోజు ఏం తినదు. ఏం తినక ఉపవాసమే పంటది. ఉపవాసమే ఉన్నోళ్లే అట్ల అది అట్లనే వుండే. మల్ల తెల్లారే ఏం జేత్తడు గద. మల్ల రాజు కొమటమనే చిన్నకోడలు రాలేదు. మల్ల రమ్మని చెప్పి మల్ల భోజనం పెట్టాలి అని చెప్పి అచ్చేతట్టు(ఎలాగైనా రావాలని) చెయ్యాలని చెప్పి పతానికి మల్ల చెప్పడు. మల్ల మొత్తం మంది ఒక ఇంటికి ఒక మనిషి తప్పకుండ రావాలని చెప్పి మల్ల చెప్తడు. మల్లందరు అత్తరు. అందరు అచ్చినోల్లే ఈమె అచ్చి ఎనుకకత్తది ఈ పిల్ల. ఎనుకచ్చి కూసుండి ఏంజేత్తది గద. అమ్మ! అమ్మ! నువ్వు ఆమెకు అన్నం పెట్టు. పెట్టి చెంబు నిండు చెంబు ఆడపెట్టు అని ఆమెను పట్టుకొని ఈడు తల్లికి చెప్తడు. ఈ రాజు తల్లికి చెప్పినోల్లే అందరు మొత్తం తింద్రి,

పాయిగ్రి. ఈమెకు చీకటైతది. చీకటియ్యేదాక పట్టుకొని ఏడ్చినోల్లే నన్ను పట్టుకొని ఏడ్తున్నవేంది? శంబు అక్కడపెట్టి నన్ను పట్టుకొని ఏడుతున్నవ్ ఏంది? అని ఈమె అంటది. అంటే నా బిడ్డ గట్లనే ఉంది. నా బిడ్డ గట్లనే ఉండే నా బిడ్డ లాగున్నవ్ అని నేను ఏడ్చిన అని చెప్పి ఈమె అంటది. అన్నంక రాత్రయితది. రాత్రయి ఏంజేత్తది గద. ఈ రాత్రి వోకు... ఈ రాత్రి ఇక్కనే ఉండు. పొద్దుగాల్లవోయేవు అని అంటది. అన్నవోల్లే సరే గీ రాత్రి అని సప్పుదేంక ఉకుంటది. రాత్రి ఎక్కడోలక్కడ (ఎవరి స్థలాల్లో వారు) పంటరు. పన్నవోల్లే రాజు పంటడు. ఈ ముసల్ది ఏంజేత్తది గద! అమ్మాయి... అమ్మాయి... రాజుకు మంచీల్లు(మంచి నీళ్లు) పెట్టవ? నీళ్లు పెట్టిరాపో బిడ్డ అని అంటది. అన్నవోల్లే నీళ్లు పట్టుకుంటా ఇంట్ల పెడతది. ఇట్ల పట్టి పెట్టేవరకల్లా కొంచెం లోపలికివోయి అటు పక్కబాజు పెట్టు అని అంటది. అన్నవోల్లే లోపలికి పోతది. లోపలికి పాయినోల్లే తలుపు పెడతది.

ఇవతలకు పెట్టినోల్లే కతం..! ఏట్ల?

ఏంజెయ్యాలి అని అనంగ రాజు చేయి పడతడు. చేయి పట్టేవరకల్లా ఏంజేత్తది గద. ఆగు నువ్వు కొంచెం ఆగు అయిదు నిమిషాల ఆగు అని చెప్పి ఆగువనోల్లే పుస్తేలు తెంపుకుంటది. పుస్తేలు దెంపుకొని ఇగ పూసలు కుచ్చుతది. ఇటు కుచ్చిన కొద్ది ఇటు పోయేటట్టు ఇటు కుచ్చుతది. ఇగ ఈ రాజుకు నిద్ర బాగాత్తది. నిద్ర బాగా రాంగనే ఏంజేత్తడు. నాకు నిద్ర బాగాత్తంది. ఒక ఆకు గట్టియే అంటడు ఈ పిల్లను. ఆకు గట్టితది. మంచిగ ఎక్కతక్క (కొంచెం ఎక్కువగానే) జర్ద వోత్తది. ఆకు గట్టితది. ఆకు గట్టెసినోల్లే అయింత తింటడు తింటడు అటే నిద్ర వోతడు. అటే నిద్రవోయినోల్లే అయింత ఇదేం జేత్తది. ఎనుకట పుంజు కూయంగ లేత్తరు గద. పుంజు కూయింగనే లేసి పని చేసుకుంటరు గద. పుంజు కూసింది. కూసినోల్లే అయింత ఈ ముసల్ది తలుపుతీత్తది. తలుపు తీసినంక అయింత ఏంజేత్తది. ఈ రాజుకు ఏంజేత్తది గద గంధం ఉంటది. గంధం తీసి ఎడమకాలుకు, బోటనవేలుకు యిక్కడ బొచ్చె మీద, ముఖానికి పెడతది. ఇగ ముసల్ది తలుపు తీయంగనే ఇగ ఇది ఈ ఇంటికి పోతది. ఇంటికి ఎప్పటిలెక్క పోతది. మంచిగ ఉంటది.

ఉన్నవోల్లే ఇగ రాజు అయ్యో! ఇంక రాజులేత్తలేదు. అరెయి ఏదయ్యే ఇంత టైం అయ్యే రాజు లేత్తలేదు. అని చెప్పి నిద్ర లేదో ఏమో శానాసేపు పంటడు కావచ్చు. పండని ఏంది అని ఈమె అంటది. ఎనిమిదయితది కావచ్చు. అయింత



లేత్తడు. లేసి చూసేవరకల్లా ఏంది అద్దంల చూసే వరకల్లా అక్కడక్కడ బొట్లు ఉంటయి. బొచ్చెల ఉంటది.

అబ్బ! ఇది కోమటి పోల్ల! ఇంత పని చేసిందని అని చెప్పి చూసుకోని చెప్తడు.

పతాని.. పతాని.. కోమటి సావుకారి కోడలు చూసినవ? గింత పని చేసిందామె? గంధం బొచ్చెల పెట్టింది. నేను దానితోటి తన్నించుకునే కాలం అచ్చిందని చెప్పి పతానికి చెప్తడు. పతానికి చెప్పినోల్లే పతాని ఏంజేత్తడు గద. మరి ఏంజేత్తం అని చెప్పి పతాని అంటడు. ఏంచేసుడు ఏంది కచ్చీరు కాడికి పిలిపిత్తం దాన్ని. కచ్చీరు కాడికి పిలిపిచ్చి మాట్లాడుదాం. కచ్చీరు కాడికి పిలిపిత్తరు. కచ్చీరు కాడికి పిలిపిచ్చినోల్లే ఈ రాజంటడు. 'గద్మ తినే నీ గాడిద, గద్మ తినకపోవడం కారణం ఏంది' అని చెప్పి రాజు సాత్రం (పొడుపుకథ) ఏత్తడు. ఏసినోల్లే అది చెప్తది గద!

ఇదంటది 'పండి పండని మామిడి పండు వుండి పండకపోవడం కారణమేంది' అని ఇదంటది. ఏసినోల్లే నాది నువ్వు చెప్పు నీదీ నేను చెప్త. అప్పుడు అన్నవోల్లే ఇది అంటది కదా.

'గద్మ తినే గాడిది ఉండి తినకపోవుడు కారణమేంది' గద్మ తినేటోన్నివి గద! నేను ఉన్న గద తెల్లాందాక ఉన్న నువ్వు గద్మ తినలే. నాది తప్పు లేదు అని ఇదంటది. అన్నవోల్లే నాదానికి అర్థం చెప్పు అని ఇదంటది. అన్నవోల్లే పతానికి చెప్తడు. పతాని సాత్రం ఏంది నాకత్త లేదు. చెప్పు అని చెప్పి పతానికి రాజు చెప్తడు. చెప్పినోల్లే ఇది నాగ్గాద రాదయ్యే అంటడు. మరి ఇది ఎవ్వరు చెప్తే ఆల్లకు మాలు (బంగారం, నగలు). కచ్చీరు కాడికి అందరిని పిలిపిత్తము. అందరిని పిలిపిత్తే నేను ఆల్లకు (వారికి) అయిదు ఏకరాల పొలం యిత్త ఎవ్వరు చెప్తే ఆల్లకు. ఎంతమంది అచ్చిన.. రాని దీనికర్థం ఏవ్వలు చెప్తలేరు. ఎవ్వరు చెప్తే లేకపోయిన మరి ఏవ్వలు చెప్పరు ఈ అర్థం. ఆమెకు ఏసిన ఆమెకే అత్తది. ఇంకోలు ఏవ్వరు చెప్పరు ఇగ. అందరు ఎవలు నాకు రాదంటే నాకు రాదు అని అన్నవోల్లే మరి నువ్వే చెప్పు. మరి నేనే ఏసి నేనే చెప్తే మల్ల రాజు ఏమంటడో? అనని చెప్పి ఏమనడు చెప్పుమనంటడు గద! అని చెప్పి ఈల్లంటరు. అన్నవోల్లే చెప్తది గద 'పండి పండని మామిడి పండు పండి పండక కారణం ఏంటంటే నను బలిమార్తం(బలత్కారం) చేసుకొని ఉంచుకున్నడు. ఉంచుకున్నగని నన్నేమి సుఖ పెట్టిండు. బిడ్డలాగా సూసుకునేటోన్ని, నన్నేమి సుఖ పెట్టలేదు.

నన్నే ఎట్లయితే కరాబు చేయాలని చూసిందో నాయందు దేవుడున్నడు గనుక నేను బతికిన! అందుకొరకే యీ అర్థం చెప్పింది. ఈమెనే చెప్పింది. మళ్ల ఏసిన ఆమెనే చెప్పినోల్లే దీనికి అయిదు ఏకరాల పొలం ఇచ్చిండు. దాని ఎదమకాలుతోటే తన్నించుకున్నడు. మల్ల దీనికే అయిదెకరాల పొలం యిచ్చిండు.

**మాండలిక భాషా పదాలు:**

బొచ్చెల - చాటీల
కచ్చీరు - గ్రామీణుల సమావేశస్థలం
గంగకోయి - గంగకి పోయి
ఆగుర్రి - ఆగండి
గర - ఇటు వైపు రా..
ఎంటుకలు - వెంట్రుకలు
అన్నవోల్లే - అని తరువాత
పొయినోల్లే - పొయిన తరువాత
ఎక్కుతక్క - బాగా ఎక్కువగా
బలిమార్తం - బలత్కారంగా, బలవంతంగా
మాలు - విలువైన వస్తువులు (బంగారం, నగలు)
అచ్చేతట్టు - ఎలాగైనా వచ్చే విధంగా
దండుగ - జరిమానా, పన్ను
గద్క - రాగులు, బియ్యంతో వండిన అన్నం
పతాని - దొర బానిస, రాజు దగ్గర మంత్రి
మంచీల్లు - మంచి నీళ్లు
తన్నించుకున్నడు - బుద్ధి వచ్చేలా చేసిందని ఈ కథలో అర్థం
సాత్రం - పొడుపుకథ, సామెత
పక్కబాజు - పక్కవైపు (బాజు, బాదు - ఉర్దూపదం)

**కథా విశ్లేషణ:**

ఈ కథలో షావుకారి కుటుంబానికి చెందిన ఒక స్త్రీ తనను అవమానించి, ఎలాగైనా లోబరచుకోవాలని చూసిన రాజు(దొర)కి ఎలాగైనా బుద్ధి చెప్పాలని అనుకుంటుంది. చాలా తెలివిగా రాజు వేసిన పన్నాగానికి దీటుగా ఎదుర్కొని తప్పించుకుంటుంది. ఈ కథలో సావుకారి కోడలైన ఆమెను తన మీద తనకున్న మనోధైర్యాన్ని, చతురతను ప్రదర్శించడంలో స్త్రీ అబల,



ఆశక్తత అన్న మాటలను అసత్యం చేసింది. తెలంగాణలో రెండున్నర దశాబ్దాల క్రితం సమాజంలో స్త్రీలను దొరలు తమకు ఇష్టం వచ్చినట్లు వశపరుచుకోవడం, మానభంగాలను చేసేవారు. అలాంటి సందర్భంలో స్త్రీలు తమను తాము రక్షించుకోవడానికి సందర్భోచితంగా, సమయస్ఫూర్తితో ఎలా రక్షించుకోవాలో ఉపదేశించే విధంగా ఈ కథ మనకు కనిపిస్తుంది. ఒక విధంగా జానపద కథైనప్పటికి ఆనాటి సామాజిక అవసరాన్ని తీర్చుతూ సామాజిక జీవనంలో, అసమానతలతో కొట్టుమిట్టాడుతున్న ఆడవారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపే కథ. సమాజంలో స్త్రీ అంటే సెక్స్ అబ్జెక్టు కాదని అలా అనుకున్న దొరలాంటి కీచకులకు బాగా బుద్ధిచెప్పిన కథ. తెలంగాణలో దొరల అరాచాకం, పెత్తనం ఎంతటి స్థాయిలో ఉండేదో ఈ కథలో ఆ పాత్రను బట్టి తెలుస్తుంది. ఆనాటి కాలావసరానికి ఉద్భవించిన ఈ కథ నేటి స్త్రీలకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని అందిస్తుంది. అప్పుడే ఎదిగిన వయస్సులో ఉన్న ఆడపిల్లలు బిడియాన్ని, భయాన్ని వదలి పురుషస్వామిక ప్రజాప్రపంచంలో ఎలా జీవించాలో ఈ కథ మార్గనిర్దేశనం చేస్తుంది. ఈ కథ ముగింపులో సమస్యాత్మక ప్రశ్నతో, పొడుపుకథతో, చమత్కార వ్యంగ్య మాటలతో సావుకారి కోడలు చూపించిన నేర్పు ఈ కథ అద్యాంతాన్ని కట్టిపడేస్తుంది. సంభాషణ చాతుర్యాన్ని చూపించి తప్పించుకోవడమే కాక, తన కుటుంబానికి ఎలాంటి మచ్చ రానివ్వకుండా పట్టుదలతో తనకన్న అన్ని విధాల బలవంతుడైన దొరను ఎదుర్కొన్న సావుకారికోడలు నేటికి ఎందరో యువతులకు స్ఫూర్తిదాయకం. "అనుభవాల సాగరమథనం నుండి ఉద్భవించిందే ఉత్తమ సాహిత్యమనుకుంటె పల్లె స్త్రీల జీవితానుభవాల చుట్టూరా అల్లుకున్న కథాసాహిత్యం కూడా ఉత్తమసాహిత్యమే అవుతుంది. కావ్యాల్లో ప్రబంధాల్లో స్త్రీ అంగాంగ వర్ణననే కానీ వారి జీవితానుభవాల వివరణగానీ అంతరంగిక ప్రదర్శన కానీ ఉండదు. జానపద సాహిత్యంలో మాత్రం స్త్రీల జీవితాలు, స్త్రీల ఆలోచనలు, అనుభూతులు, స్త్రీల సమస్యలు సాక్షాత్కరిస్తాయి. జానపద స్త్రీ తల్లిగా, ఆలిగా, చెల్లిగా, కోడలిగా, ఆడపడచుగా, గడిపే జీవితం, ఎదుర్కొనే సమస్యలు, వాటి పర్యవసానాలు, పరిష్కారాలు కథలుగా రూపుదిద్దుకుంటాయి" (ప్రేమలత, రావి. 1996:01) అన్న మాటలు ఈ కథకు బాగా వర్తిస్తాయి. సమాజంలో నాటికి, నేటికి స్త్రీలు తల్లిగా, భార్యగా, చెల్లిగా, కోడలిగా తన జీవితాన్ని పూర్తిగా మగవాడికే అంకితం చేస్తూ ఎన్నో రకాలుగా

అణచివేయబడుతుంది. వాటినన్నింటి నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత వారిదే అని ఈ 'సావుకారి కోడలు కథ' ప్రస్ఫుటంగా ధ్వనింపజేస్తుంది.

సావుకారి కోడలు మొదట తన ప్రశ్నకు సమాధానం 'గద్య తినే గాడిద ఉండి తినకపోవుడు కారణమేంది' అని చెప్పి తాను రాత్రంతా దొరతోనే ఉన్నానని కాని తనను అనుభవించలేని దొర అశక్తికి కారణాన్ని ప్రశ్నించి పై పొడుపు కథ వేస్తుంది. పండి పండని మామిడిపండు అనగా దొర మామిడి పండువలే దొర యవ్వనంలో ఉండి తనని స్వీకరించపోయిన అసమర్థతకు కారణేమిటి? అని ప్రశ్నించి దొర మగతనం ఉన్నవాడు కాదనే సమాధానం స్ఫురించే విధంగా ఆ కచ్చీరు సమావేశంలో పై పొడుపుకథతో చెప్పిపోడిచింది. ఆవిధంగా కచ్చీరులో తాను వేసిన ప్రశ్నకు సమాధానం ఎవ్వరికి తెలియక చివరకు తానే సమాధానం చెప్పి రాజు ముందే ప్రకటించిన అయిదు ఎకరాల పొలాన్ని బహుమానంగా గెలుచుకుంది. ఆమె వేసిన పొడుపుకథలో చమత్కారాన్ని పసిగట్టలేని రాజు చివరకి ఆడదాన్ని నవ్వులపాలు చేద్దామనుకుని తానే నలుగురిలో నవ్వులపాలైనాడు.

**ముగింపు:**

జానపద కథలో సత్యం, అసత్యం రెండు అంశాలుంటాయి. వారికి తెలిసినదానికి మరికొంత కల్పనలు చేసి చెప్పడం సహజం. అలా అధనంగా చేర్చిన సమాచారంతో అద్భుత కథనాన్ని నిర్వహించే పని శ్రోతలను ఆసాంతం కట్టిపడేయడానికి వాడుకునే సాధనం. అయితే పై కథలో వాస్తవానికి దగ్గరగా, జరిగిన సంఘటన ఆధారంగా కల్పించబడిన కథే. నిజాం పరిపాలనలో తెలంగాణ ప్రతి గ్రామాల్లో స్త్రీల దయనీయమైన దీనస్థితిని ఎదుర్కొనేందుకు చేసే ప్రయత్నంలో ఉద్భవించిన కథ అని చెప్పవచ్చు. నిజాం కాలంలో గ్రామాల్లో దొరలే సర్వాధికారి. నిరంకుశులు. ఈ కథలో దొరపెత్తనం, అధికారబలం వల్ల సావుకారి కోడల్ని ఎలాగైనా లోబరచుకోవాలనుకోవడం ఇదంతా గత కొన్ని దశాబ్దాల నాటి కాలానికి సంబంధించిన కథే అని అర్థం చేసుకోవచ్చు. నాటి కాలానికి సంబంధించినది అయినా పురపస్వామిక సమాజం నుండి స్త్రీ విముక్తి అయ్యేంతవరకు ఈ కథ దాని ప్రయోజనాన్ని తెలియజేస్తుంది. అణచివేతలు, అసమానతలు పోయి ప్రతి స్త్రీ ఏనాడైతే స్వేచ్ఛాయుత ప్రపంచానికి చేరువౌతుందో ఆనాడు ఈ కథకు, కథలో ఉన్న సావుకారి కొడలికి, సృష్టిలో ఉన్న ప్రతి స్త్రీ జీవితానికి సార్థకత లభిస్తుంది.



**ఉపయుక్తగ్రంథాలు:**

1. రాధాకృష్ణశర్మ, చల్లా.(తెలుగు సేత) తమిళదేశ కథలు. న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ -- 1999.
2. రావి ప్రేమలత, కురుగంటి శ్రీలక్ష్మి. జానపద విజ్ఞాన పరిశీలనం (వ్యాస సంకలనం). హైదరాబాదు: వరలక్ష్మి ప్రింటింగ్ ప్రెస్-- నవంబరు, 1990.
3. ప్రతాపరెడ్డి, గుజ్జం. మన జానపద విజ్ఞానం. సికింద్రాబాదు: తెలుగుభారతి ఫిబ్రవరి, 2007.
4. ప్రేమలత, రావి. జానపద విజ్ఞానంలో స్త్రీ (వ్యాస సంకలనం). హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్. ఏప్రిల్, 1996.
5. సుమతి, కె. తెలుగు జానపద కథలు. పి.హెచ్‌డి సిద్ధాంత వ్యాసం. హైదరాబాదు: డా. బి. ఆర్. అంబేద్కర్ కళాశాల. సెప్టెంబర్, 1991.

మాడిశెట్టి అభిషేక్,
పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం,
హైదరాబాదు.


Dr. P.Sivaraji
HOD of Tamil
Islamiah College (A) Vaniyambadi
Dr. Avvai R.Nirmala
Dr.G.Sujatha
Dr. P.Anna Purna
Dr.Merugu Giri Babu
Dr.M.Gomathi
Dr.M.Ravi Kumar
Captain Dr. P.Velammal
Dr. T.Satya Narayana
Smt. S. Jyothi
Dr. M.Prasad
திராவிட மொழிகளில் சிறுகதைகள்
பன்னாட்டுக் கருத்தரங்கம்
Short Stories in Dravidian Languages
(Internationl Seminar)
Parithipt@gmail.com

ii

# நூல் விவரம்


நூல் பெயர் : திராவிட மொழிகளில் சிறுகதைகள்
(Short Stories in Dravidian Languages)
உரிமை © : முனைவர் ப.சிவராஜி
வெளியீடு : 22-12-2017 தி.பி.2048 மார்கழி 7
மொழி : தமிழ், தெலுங்கு, கன்னடம், மலையாளம், ஆங்கிலம்


: பதிப்பாசிரியர்கள் :


**Dr. P.Sivaraji**
HOD of Tamil
Islamiah College (A)
Vaniyambadi - 635 752.

**Dr.G.Sujatha**
HOD of Tamil
DKM Women's College (A),
Vellore.

**Dr.Merugu Giri Babu**
Bangalore University,

**Dr.M.Ravi Kumar**
Dept. of Linguistics
Sri Venkateswara University
Tirupatti. A.P.

**Dr. T.Satya Narayana**
Telugu Department
Aadikavi, Nanniya University
Rajmandrah. A.P.

**Dr. M. Prasad**
S.A. Telugu
Nellore A.P.

**Dr. Avvai R.Nirmala**
HOD & Tamil
Kanchi Maa-munivar
Tamil Post Graduate Study Centre
Puducherry - 8

**Dr. P.Anna Purna**
HOD of Telugu
St.Josepshs College for Women
Visak-4.

**Dr.M.Gomathi**
HOD & Tamil
C. Kandaswamy Naidu
Women's College (A)
Cuddlore

Tamil Chemmal Captain
**Dr. P.Velammal,** Principal
Sri Parasakthi Arts College,
Kuttralam

**Smt. S. Jyothi**
Asst. Professor
Department of Kannada.
Govt. Degree College, Bangarupet.



விலை : ரூ.800/-
பக்கங்கள் : 818+16 = 834
ஒளியச்சு : க.ஜெகவீரன், சரவணா கிராபிக்ஸ், வேலூர்.
செல்: 98658 20640.
பதிப்பகம் : பரிதி பதிப்பகம்
ஜோலார்பேட்டை தமிழ்நாடு.
ISBN : 978-82-930-476-5-1
நூல்கிடைக்குமிடம் : முனைவர் ப.சிவராஜி
தலைவர், ஏலகிரி பாரதி தமிழ் சங்கம்
புதூர்நகர், வாணியம்பாடி - 635 751. வேலூர்.
தமிழ்நாடு. செல்: 90958 31291.


ஆய்வுக் கட்டுரை கருத்துக்கள் கட்டுரையாளர்களைச் சாரும்.
கருத்துக்களுக்கு பதிப்பகமோ தொகுப்பாசிரியரோ பொறுப்பல்ல.

xii


86. కొన్ని జానపద కథలు - విశ్లేషణ
[illegible] ... 408
87. జాజుల గౌరి 'మన్నుబువ్వ' - కథా విశ్లేషణ
-డా॥ చింతమూరి కృష్ణమూర్తి ... 412
88. చలం కథానికలు – విశ్లేషణ
డా॥ ఎ. రవీంద్ర నాయక్ ... 416
89. తెలంగాణ బి.సి. కథలు - ఒక విశ్లేషణ (2000-2010)
డా॥ చిర్ర రాజు ... 420
90. అమెరికా [illegible] కథ సాహిత్యం - కుటుంబ జీవన చిత్రణ
GOWTHAMI RACHARLA ... 425
91. అగరం వసంత్ కథలు - విశ్లేషణ
కె.సతీష్ కుమార్ ... 429
92. బి.ఎస్. రాములు కథలు - మానవ సంబంధాలు
Dr. KARRE SADASHIV ... 434
93. నెల్లూరు కేశవస్వామి యుగాంతం -సామాజిక పరిస్థితుల విశ్లేషణ
[illegible] ... 438
94. కథకుడిగా నాయుని కృష్ణమూర్తి
యం. దీనదయాళం ... 442
95. వేంపల్లి గంగాధర్ పాపాఘ్ని కథలు - రాయలసీమ చిత్రణ
[illegible] ... 445
96. కలికి గాంధారి కథ - విశ్లేషణ
పెద్దపల్లి తేజస్వి ... 449
97. కొండ..కోనల్లో ఆదివాసీ కథల్లో చిత్రితమైన కోయల జీవనం-సంస్కృతి
డా॥ [illegible] ... 453
98. 'గోరంత దీపాలు' కథలో మానవ సంబంధాలు
కె. మహేష్ ... 459
99. [illegible] కథానికల్లో ప్రేమతత్వం - ఒక విశ్లేషణ
ఎస్. శైలజ ... 462
100. "ಮಾಸ್ತಿಯವರ ಕಥಾ ನಿರೂಪಣಾ ತಂತ್ರ"
ಡಾ॥ ವಾಣಿ ಎನ್. ... 465
101. జి. కృష్ణ 'సకల నీతి సారం' కథలు : పరిశీలన
[illegible] ... 469
102. [illegible]
[illegible] ... 473
103. [illegible]
– డా॥ [illegible] ... 477

# కొన్ని జానపద కథలు - విశ్లేషణ

86

మాడిశెట్టి అభిషేక్
పి.హెచ్‌డి (తెలుగు)
చరవాణి: 8519945598
ఇ-మెయిల్: bharuabhi4@gmail.com
హైదరాబాదు విశ్వవిద్యాలయం
తెలంగాణ రాష్ట్రం

**జానపద కథలు - విశిష్టత:**

జానపద సాహిత్యంలో కథలకున్న ప్రత్యేకతే వేరు. వచన రూపంలో ఉన్న ఈ ప్రక్రియ చిన్న, పెద్ద తేడా లేక అందరిని అలరింపజేస్తుంది. వినోదాన్ని, నీతిని, సందేశాన్ని, ధర్మప్రభోదనను అందచేయడమే కాకుండా మన పూర్వీకుల సంస్కృతి సంప్రదాయాలను, ఆచారాలను, విశ్వాసాలను, వారి జీవితాలను సైతం నింపుకొని మనకు కావలసినప్పుడు తరచిచూచుకొనే విజ్ఞానగని. ఆ గనిని పెకిలించాలన్న, విజ్ఞానాన్ని తోడుకోవాలన్న మనకు మార్గాలు నేటి పల్లెలు, గ్రామాలు. గ్రామంలో ఇప్పటికి గ్రామీణ కథకులు గుక్కతిప్పకొకుండా కథలు చెప్పగలరు. ఆ గనిలో ఎన్నో అద్భుతాలు, వింతలు, విశేషాలు, కల్పనలు, ఊహాతిరేగింపులు. వీటిన్నంటిలో అంతర్యంగా మనకేదో ప్రభోదిస్తూ విజ్ఞానవ్యాప్తిని తరతరాలుగా మనకందిస్తున్నవి జానపద కథలు. అద్భుతమైన ప్రజల కల్పనశక్తితో నేటికి నిలదొక్కుకొని ఉన్నాయంటే వాటి విశిష్టతను మనం అర్థం చేసుకోవచ్చు. అసత్యాంశాలతో కల్పించి చెప్పడం వల్ల కథకు, కథను వింటున్న శ్రోతకు ఆసక్తి రెట్టింపు చేయు సాధనం. ప్రతి జానపద కథ ఆయా కాలానికి అవసరాన్ని కొద్ది మార్పులు చేర్చుకొని నిలదొక్కుకుంటుంది. సామూహిక ఐక్యమత్యం, సంఘ పరిరక్షణలో తన అమూల్యమైన పాత్ర పోషించిన ప్రక్రియ జానపద కథ. నేను 'జగిత్యాల జానపద కథలు - పరిశీలన' అనే అంశాన్ని నా పి.హెచ్‌డి పరిశోధనాంశంగా ఎన్నుకున్నాను. నా క్షేత్ర పర్యటనలో సేకరించి కొన్ని కథలను ఈ వ్యాసంలో విశ్లేషించి అందరికి ఆ చిన్న కథలను పరిచయం చేయడం ఈ వ్యాసోద్దేశ్యం. ఆ కథలను యధాతథంగా రాసాను.

## చెప్పుకున్న విలువ రాజుకు లేదు

కథ చెప్పినవారు: మాదాసు పద్మ
గ్రామం: రాయికల్, జగిత్యాల జిల్లా

చెప్పుకున్న విలువ రాజుకు లేదంటే రాజు రాజ్యంలో ప్రజలను పరిపాలిస్తున్నాడు. ఎవరికైన గాని పెండ్లి అయితే మంగళసూత్రాలు, మట్టెలు అన్ని ఉచితంగా ఇస్తున్నడు. అందరిని మంచిగా అరుసుకుంటున్నడు. అందరు మంచి బాగోగులు చూసుకుంటున్నాడు. ఎవరింట్ల ఫంక్షన్ అయిన పోతుండు. మంచిగ అందర్ని పిల్లల లాగ అరుసుకుంటున్నడు. ఒక రోజు ఎమైతది రాజు దురదృష్టవశాత్తు చనిపోతడు. ఎంతో మంది రాజ్యంలోని రాజులు, అందరి ఊరివాళ్లు ఎంతో ఘనంగా దహన కార్యక్రమాలు చేసుటానికి వెళుతారు. మార్గ మధ్యంలో పెద్ద వర్షం వస్తది. వర్షం పడేసరికి రాజు యొక్క శవం మీద నీళ్ళు పడ్డాయి నీళ్ళ పడుతున్నయి బాగా నీళ్ళ పడుతున్నయి. వర్షమొట్ల అని చెప్పి వాళ్లు ఏం జేత్తరు. ఇగ ఈయన రాజు వెంబడి పోయే వాళ్లు అందరు సూరుపోన్న అక్కడ ఇక్కడ చెట్ల కింద సూరుపోన్న ఉన్నరు. అంతపెద్ద బాగా వర్షం పడుతుంది. ఆ వర్షానికి ఈ ముసలోళ్లు ఏం జేస్తరు అరె అరె ఇక్కడ ఒక ఇల్లు ఉంది కదా! లాస్ట్ ఈ ఊరుకాడ ఇల్లు ఉంది కదా! అక్కడ ఆగుదాం అని చెప్పి ఆ ఇంటి దగ్గర రాజు శవాన్ని వాన ఎలిసే వరకు ఇక్కడ ఉంచుతం అమ్మా అని అంటారు. లే...లే...లేదు ఇక్కడ శవాన్ని ఉంచదు బిడే. శవాన్ని ఎందుకు ఉంచుతరు. ఓ...! ఇంటి కాడ అని చెప్పి. అన్నంక అట్ల అన్నంక రాజు కార్యక్రమంలో పాల్గొన్నంక దప్పు కొట్టే వాళ్ళు తోలు చెప్పులున్నాయి. కాలట్ల ఇవి బొరదకు తల తల రాకుతున్నాయని చెప్పి అమ్మాయి చెప్పులు ఇక్కడ ఇడిసి మల్ల వస్తమమ్మా అని అంటే సరే అక్కడ ఇడుల్లి అని చెప్తది. అంటే చెప్పులని ఉంచుకున్నరు. రాజు శవాన్ని ఉంచుకోలేదు. చెప్పుకున్న విలువ రాజుకు లేదు. అంటే మనిషి బతుకున్నప్పుడే అన్ని నడుస్తయి. చనిపోయిన తరువాత ఏమి కూడా నడువది అని దీనర్థం.

**కథాసంగ్రహం-విశ్లేషణ**

ప్రాణం ఉన్న మనిషికి, ప్రాణం లేని మనిషి శరీరానికి (శవానికి) విలువను తెలుపుతున్న కథ. రాజ్యాన్ని బాగా పరిపాలిస్తున్న ఒక రాజు ప్రాణం పోయి దహన సంస్కారానికి తీసుకోపోయే సందర్భంలో బీభత్సమైన వర్షం కురుస్తుంది. ఆ వర్షంలో శవం మీద వానచినుకులు పడుతున్నాయని ఆ మార్గంలో చివరన ఉన్న ఒక ఇంట్లో శవాన్ని పెట్టి వర్షం తగ్గిన తర్వత కార్యక్రమానికి తీసుకెళదామని అనుకుంటారు. కాని ఆ ఇంట్లో వారు దానికభ్యంతరం తెలపడం వల్ల శవాన్ని తీసుకుపోవడానికి సిద్ధం అయితారు. వాన నీటికి బురదగా మారిన నేలలో చెప్పులతో శవాన్ని మోస్తూ తీసుకెళ్ళడం వారికి ఇబ్బందిగా ఉంటే వారి చెప్పులను ఆమె ఇంట్లో పెట్టి వెళ్లతారు. శవాన్ని తన ఇంట్లో పెట్టుకొని ఆ ఇంటి వారు ఛటుల చెప్పులను మాత్రం వారి ఇంట్లో పెట్టుకోవడానికి ఎలాంటి నిరాకరణను తెలియజేయలేదు. ఆ విధంగా రాజు శవాన్ని వారి పెట్టుకోలేదు కాని శవాన్ని మోస్తున్న వారి చెప్పులను మాత్రం పెట్టుకోనిచ్చారు. ఈ కథలోనే కాదు మన హిందు సంస్కృతిలో శవాన్ని ఎవరి ఇంటి ముందుగాని కాసేపుకూడా పెట్టనివ్వరు. ప్రాణం ఉన్నంతవరకే ఆ దేహనికి విలువ. ఎంతటి గొప్పవాడైనా, మహనీయుడైనా అతని ప్రాణం ఉన్నప్పుడు ఇచ్చిన విలువ దేహం చాలించక ఇవ్వరు. ఈ కథలో మరొక అంశం చెప్పుతో పోల్చడం. కాలికింద నలిగే చెప్పు ఎవ్వరైనా చాలా తక్కువ ప్రాధాన్యం ఇచ్చే వస్తువుగా చూస్తారు. అలాంటి చెప్పుకు ఇచ్చిన విలువను చనిపోయిన రాజు శరీరానికి ఇవ్వకపోవడం గమనించాలి. దేహంలో ప్రాణమున్నంతవరకే ఆ దేహనికి, ఆ దేహంలో ఉన్న ప్రాణానికి విలువ అనేది ఈ కథ మనకు తెలియజేస్తుంది.

## మనిషి ఆయుస్సు

కథ చెప్పినవారు: క్షైరం రమణ
గ్రామం: రాయికల్, జగిత్యాల జిల్లా

ఒక ముసలాయన ముఖం కడుక్కొని తానం చేసిండు. తానం చేసి ఇంట్లో కూర్చున్నడు. కుర్చున్న తరువాత కోడలు చాయి తాగు మామ అని చెప్పి కోడలు చాయి తీస్కచ్చి అచ్చి యిత్తది. ఇచ్చినోల్లె చాయి తాగిండు గిలాస పెట్టలోయి అట్లనే పడి చనిపోయిండు. చనిపోయిన తరువాత కొడుకచ్చిండు. అయ్యో మా నాన్న చనిపోయిండని...

జగ చనిపోయినంక చేసే కార్యక్రమాలు చేయాలి గద చనిపోయినప్పుడు అని చెప్పకుండ చిప్పకోసం బయలుదేరిండు. బయలుదేరితే భగవంతుడు ఒక రుషి అవతారంలో ఎక్కడికి పోతున్నవ్ కొడుకా! అన్నడు. ఇంగో నేను కుండకు పోతున్న ఆ కుండకు, చిప్పకు పోతున్న. దేనికి అగ్గిపెట్ట దేవుడు పుత్తిగనే మానాన్నను తీస్కపోయే ముఖం కడుక్కున్నడు వాయి తాగిండు దేవుడికగ్గిపెట్ట దేవుడు గిల్ల చేసిండు. అని తిర్గి పోతడు. పోంగ అగు బాబు అగు.. నువ్వ్ ఏ ఇంటికి పో ఏ నాన్న బతికే ఉంటడు. చనిపోడు. మాట్లాడుతడు నువ్వ్ పో... ఆ రుషి అన్న తరువాత చద్దాం ఆ రుషి అన్నడు గద. ఇంటికత్తడు. ఇంటికచ్చేసరికి మాట్లాడుకుంటా మంచిగనే ఉన్నడు అల్ల అయ్యా.. అవునా.. ఆ రుషి చెప్పింది నిజమే అని చెప్పి అనుకున్నడు. అనుకుంటే భగవంతుడు మల్లి కొద్ది రోజులకు ఈ ముసలైన ముసలి ముఖం కడుక్కుంటు ఉంటే పాత గోడం మధ్య ముఖం కడుకుంటే పాత గోడలయింత కూలినయి. ముసలోడు అక్కడిక్కడే సచ్చిపోయిండు. కొడుకు మళ్ళీ కుండ కోసం, చిప్పకోసం బయలుదేరిండు. మధ్యలో ఒక ముసలి అవతారంలో భగవంతుడు ఎటు పోతున్నవ్ బాబు అంటే గిల్ల మా నాన్న చనిపోయిండు. ఆ పాత గోడలక్కగ్గిపెట్ట గోడలు వానినయి వాని వాని... కూలినయి. కూలి చనిపోయిండు. అని చెప్పి అట్లన అని చెప్పి

అప్పుడేమో దేవునికి అగ్గిపెట్ట అన్నవ్...

ఇప్పుడేమో గోడలక్కగ్గిపెట్ట అన్నవ్.

కథాసంగ్రహం - విశ్లేషణ

ఒక వయస్సు మీదపడ్డిన ముసలాయన మరణిస్తాడు. అతని కొడుకు తన తండ్రి మరణానికి ఫలాన కారణం అంటూ చూపిస్తాడు. మరి ఏ కారణం లేకుండా దేవుడు మరణాన్ని కలిగిస్తే, ఆ దేవుడెదురైనప్పుడు ఏ ప్రాణి ఊరుకోదు కదా! అందుకే కాలం నిండిన వారిని ఏదో రకంగా తీసుకెళ్లడానికి ఏదొక కారణాన్ని సిద్ధం చేస్తాడు. అలాగే ఈ కథలో మొదట తన తండ్రిని మామూలు చావును ప్రసాదిస్తాడు ఆ దేవుడు. కాని దానికి అతని కొడుకు ఏ కారణం లేకుండా తన తండ్రిని తీసుకెళ్లిన దేవుడిని తిడతాడు. మారు వేషంలో వచ్చిన ఎదురైనా దేవుడికి ఈ విషయం అర్థమైతుంది. అంటే ఏదొక కారణం పెట్టి కాలం నిండిన తన తండ్రి చావును తీసుకెళ్ళడానికి శిథిలావస్థలో ఉన్న పాత గోడలు కూలి వాటి మధ్య పడి చనిపోయే విధంగా చేసాడు. దేవుడు రెండుసార్లు అవతారంలో వచ్చి, ముసలాయన కొడుకు మనస్సును అర్థం చేసుకొని తన మీద ఎలాంటి నిందల్లేకుండా చేసుకుంటాడు. మానవుని మనస్తత్వాన్ని బాగా చూపించిన కథ. దేవునికి అగ్గి పెట్ట, గోడలకు అగ్గి పెట్ట అనే పదంలో "అగ్గి పెట్ట" కథలో పాత్రలేకాకుండా జనవ్యవహారంలో కూడా ఈ జాతీయాన్ని కోపంగా తిట్టే సందర్భంలో వాడతారు. తెలంగాణ ప్రాంతంలో ఈ పదాన్ని ఎక్కువగా వాడతారు.

### గుడ్డి, కుంటి వాడి కథ

కథ చెప్పినవారు: ఏనుకంటి ఉదయశ్రీ

గ్రామం: రాయికల్, జగిత్యాల జిల్లా

ఒక గ్రుడ్డి వాడు ఒక ఊరి నుండి ఇంకో ఊరికి సంచారం చేస్తూ ఉన్నడు. సంచారం చేసే వరకు పొద్దు పోవుచున్నది. ఇగో పలాన ఊరికి పోయే దారి ఇదేనా అని చెప్పి ఒక కుంటి వాన్ని అడిగాడు. కుంటివాడు ఏమని



చెబుతుండు అవును ఇదే దారి... మరీ సాయంత్రం అవుతుంది. మరి నేను అదే ఊరికి పోవాలి అని అంటే మరిగా అంటే మరి నాకు కాళ్ళు లేవు కదా నడవలేను దేక్కుంటా రావాలి. నీకేమో కాళ్ళున్నాయి. నాకు కాళ్ళు లేవు. అనుకుంటే మరి నేను భుజాలమీదకి ఎక్కించుకుంటా. నూపెడతావా ? తొందరగా... అంటే ఆ వస్తా అని చెప్పి కుంటివాడు గ్రుడ్డివాని భుజాల మీద ఎత్తుకొని వెళుతున్నాడు. దారిలో పోతుండగా ప్రక్కన ఒక దోసకాయల చెట్టుకు విస్తృతంగా దోసకాయలు కాసి ఉన్నాయి. దోసకాయలను ఈ కుంటివాడు చూస్తడు. చూసి గ్రుడ్డివానికి అగు అగు ఇక్కడ దోసకాయలున్నాయి. మనం తీసుకొచ్చుకుందాం. పట్టుకచ్చుకుందాం నీగ్గన్ని నాకు గొన్ని, నేను తెంపుకొస్త నను అక్కడకు తీసుకెళతావా అంటే... లేదు లేదు వద్దు వద్దు... మనం సక్కగ పెళ్లిపోదాము అని చెప్పి గ్రుడ్డివాడు అంటాడు. లేదు లేదు నీకేమన్నా పిసవచ్చిందా. అడికి పోదామా దోసకాయలు మస్తు (ఎక్కువగా) ఉన్నాయి. తీస్కొచ్చుకుందాం వ...! అక్కడికి. తీసుకెళ్లు నేను చూపిస్తాన అంటే. వద్దు వద్దు అవి చేదు దోసకాయలు మంచి దోసకాయలైతే ఎవరైన ఉంచుతర.. ఇంత మంది దారిపొన్న నడుస్తున్నరు. యేవోళ్ళో వాకరు తెంపుకు పోతరు కదా! ఇవి చేదు దోసకాయలున్నట్లున్నాయి అని గ్రుడ్డి వాడు అంటాడు. అది నాకు తెల్వదు. తీసుకు పో నడు.. అన్నంక అక్కడికి తీసుకుపోతడు. అక్కడికెళ్లిన తర్వాత దోసకాయలన్ని మూట్లేగట్టుకుంటడు. తిను అని అయనకు ఒకటిచ్చి ఈయనొకటి తింటడు. తింటే అవి చెద(దాలా) చేదు. అంటే గ్రుడ్డివాడికి కళ్ళు లేకున్న గాని అంత జ్ఞానాన్ని దేవుడు ప్రసాదించాడు. వీనికి కళ్ళు ఉన్నప్పటికి కూడా ఈయనకు జ్ఞానం లేదు. అంటే ఎవరికి ఎంత జ్ఞానముండాలో వారికి అంత జ్ఞానం భగవంతుడు ప్రసాదిస్తాడు.

కథావిశ్లేషణ

ఒక గుడ్డివాడు ఒక ఊరి నుండి మరొక ఊరు వెళతాడు. గుడ్డివాడు కనుక దారి తెలియక మార్గం మధ్యలో తనకెదురైనా కుంటివాడి ద్వారా దారి తెలుసుకుంటాడు. కుంటివాడు కూడా అదే మార్గంలో వెళ్లాలి కనుక ఈ గుడ్డివాన్ని సహాయం కోరతాడు. అందుకు ఈ గుడ్డివాడు ఒప్పుకొని కుంటివాడిని తన భుజాంమీద ఎక్కించుకొని ఇద్దరు వెళుతున్నారు. ఒకరికేమో కళ్ళు కనిపించవు మరొకరికి నడవడానికి కాళ్ళు లేవు. కాబట్టి వారు వారి గమ్యాన్ని చేరుకోవటానికి పరస్పర సహాయం అవసరం. అందుకే ఒకరికొకరు సహాయం చేసుకోవటానికి ఒప్పుకొని ఇద్దరు బయలుదేరారు. వారు వెళుతున్న రహదారి ప్రక్కన బాగా కాసిన ఒక దోసకాయల చెట్టు ఉంటుంది. దోసకాయ చెట్టునిండా దోసకాయలే. అది గమనించిన కుంటివాడు ఆ దోసకాయల దగ్గరకి గుడ్డివాడిని తీసుకెళ్లమంటాడు. దానికి మొదట నిరాకరించి ఈ దారిన చాలా మంది వెళుతుంటారు. వారు ఆ కాసిన దోసకాయలను కోయకుండా ఎందుకు వదిలేస్తారు.వాటిని అలా వదిలేసారు అంటే అక్కడ ఏదో కారణం ఉందని గుడ్డివాడు గ్రహిస్తాడు.కళ్ళు కనిపించకపోయిన తన బుద్ధి బలంతో ఆ చిన్న లాజిక్ పట్టుకుంటాడు. రెండు కళ్ళు ఉండి కూడా కుంటివాడు ఆ విషయాన్ని గ్రహించక దోసకాయలను కోసుకుని మూట కట్టుకుని తీసుకువెళతాడు. తీరా వాటిని చూస్తే కాయలన్ని చేదుగానైన చేదు. అలా తినడానికి పనికి రాని కాయలను తెంపుకొని వాటి బరువుని మోసి సమయాన్ని, బలాన్ని వృథా చేసుకుంటాడు. కుంటి వాడు కంటి చూపు బాగా ఉండి కూడా దోసకాయలు చేదనే విషయాన్ని గ్రహించడు. గుడ్డి వాడు మాత్రం కళ్ళు లేకున్నా బుద్ధితో ఆ విషయాన్ని గ్రహిస్తాడు. కొన్ని సందర్భాలలో బుద్ధిబలం, లౌక్యం ఎంత అవసరం అని ఈ కథ మనకు తెలియజేస్తుంది.

ముగింపు

పై విధంగా ప్రతి జానపద కథలు అంతర్యంగా ఏదొక మంచి విషయాన్ని బోధిస్తూ వాటి సమాజాన్ని సక్రమంగా ఉంచే ప్రయత్నం చేసాయి. ముఖ్యంగా ఈనాటి చిన్న పిల్లలు ఎదిగే క్రమంలో ఇలాంటి జానపద కథలను వారికి వినిపించి,వివరిస్తే వారిమానోవికాసాన్ని,బుద్ధిబలాన్ని వృద్ధి చేయడానికి ఎంతోగానో ఉపయోగపడతాయి. ప్రాచీన తరం నుండి నేటి తరానికి విజ్ఞానాన్ని సంప్రదాయంగా మోసుకొస్తున్న జానపదుల సాహిత్యాన్ని, కథలను రికార్డు చేయావల్సిన బాధ్యత మనందరి మీదెంతో ఉంది.

# జాతీయ సదస్సులో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువపత్రాల నకళ్లు



fossils

NATIONAL SEMINAR

On

ENGLISH: IRONY AND HUMOUR IN INDIAN WRITING

తెలుగు: జానపద సాహిత్యంలో హాస్యం, చమత్కారం

In collaboration with Adikavi Nannaya University, Rajamahendravaram,
Folklore Society of South Indian languages(Fossils) - Tiruvanantapuram.,Kerala

Organised by
Dept.of English and Telugu
MVN,JS & RVR College of Arts & Science
Malikipuram, East.Godavari District,A.P.

- *Certificate* -

*This is to certify that Prof/Dr/Ms/Mr* . M. అభిషేక్ . . . . .
. . . . . . . . . . . . . . . . . *of* . . HCU, Hyd . . . . . . . .
. . . . . . . . . . . . *participated in the National Seminar on*
*English : IRONY AND HUMOUR IN INDIAN WRITING,* తెలుగు: జానపద
సాహిత్యంలో హాస్యం, చమత్కారం *conducted during 12th & 13th August, 2017*
*at MVN, JS & RVR College, Malikipuram. He/She has presented a paper*
*entitled* . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

Chairman:
Dr. K.V.Anandam
Principal
MVN,JS & RVR College.

Director:
S.Prabhakar
HOD- Dept of English
MVN, JS & RVR College.

Convenor:
Dr.Talari Vasu
HOD, Dept of Telugu
Adikavi Nannaya University

తెలుగు జానపద సాహిత్య పరిషత్తు, హైదరాబాద్

రాజ రాజేశ్వరి ఆర్ట్స్ అకాడమి

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

## జాతీయ సదస్సు

# జానపద విజ్ఞానం - భావితరాలకు ప్రయోజనం





17–18 డిసెంబర్ 2018

## ధ్రువీకరణ పత్రం

శ్రీ/శ్రీమతి/ఆచార్య/డా॥ మొండి శెట్టి, అభిషేక్

జాతీయ సదస్సుకు హాజరై జానపద కథలు– సామాజిక ప్రయోజనం.

అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు.

ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి
సదస్సు సంచాలకులు
తెలుగు అధ్యయన శాఖ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.